C

శ్రీ

తులసీరామాయణము

[ఆంధ్రవచనానువాదము]

శ్రీమతి దేవులపాటి లక్ష్మీసరస్వతి

294.5922
LAK

పరిష్కర్త

శ్రీ యేబూరుపాటి రామభద్రచయనులు

cI

9

శ్రీ

తులసీ రామాయణము

[ఆంధ్రవచనానువాదము]

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10,091

శ్రీమతి యేలూరుపాటి లక్ష్మీ సరస్వతి

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10091

పరిష్కర్త

శ్రీ యేలూరుపాటి రామభద్రచయనులు

6

సర్వస్వామ్యములు
రచయిత్రివి

ప్రథమముద్రణము
1958



294.5922
LAK

వెల: రు. 12/-

రాజమహేంద్రవరమున
శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారిచే సరస్వతీ పవర్ ప్రెస్సునందు
ముద్రించబడినది. ఆర్డరు నెం 708/57

C



గ్రంథప్రకాశకులు

శ్రీ యేలూరుపాటి నృసింహసర్వతోముఖయాజులుగారు

సౌమ్యసంవత్సరం కార్తిక పూర్ణిమ (27-11-1909)

Q

AOUA10UBI42

గ్రంథ ప్రకాశకుల మనవి

మహాశయులారా! శ్రీమద్రామాయణము మావంశమువారికి మూల ధనము. నాపినతాతగారగు జగన్నాథశ్రౌతిగారు నలుబది సంవత్సరములు శ్రీమద్వాల్మీకిరామాయణము నర్థసహితముగా చదివి వినువారల తరింపచేసి పట్టాభిషేకమహోత్సవములు జరిగించెడివారలు. వీరిపుత్రులు రామభద్ర చయనులుగారుకూడా, తండ్రిగారివలెనే రామాయణ పారాయణలు జరిగించు చున్నారు. నేను తాళ్ళపూడిలోనుండు సమయములందు వినుచుండువాడ నగు టచే, ఆగ్రంథమందాస్థహెచ్చైనది. నేనును వారివలెనే రామాయణ పారాయ ణలు చేయుచుందును. ఈనాపినతండ్రిగారు కృతిభర్తలై బహుపండిత పరిచితి నార్జించినవారు. శ్రీ సత్యదుర్గేశకవులు వీరికి భావలహరికృతి నొసంగినమాట అందరికి తెలిసిన విషయమే. మా పినతండ్రిగారు మాయందుండెడి ఆదరాభి మానములచే, ఈగ్రంథముద్రణవిషయమై ఎంతోశ్రమపడి పీఠికలు వ్రాయించి, పండితులచే సదభిప్రాయములుగ్రహించి దీనికి వన్నె తెచ్చిన మహానుభావులు. వారిమేలు మరువరానిది. మామామగారైన చావలి యజ్ఞేశ్వరసోమయాజి శర్మగారు, బియే. బియల్., ప్లీడరై, పట్టభద్రులై, వకీలుగా యుండేవారు. వారు సంస్కృతాంధ్ర హిందీ భాషలలో ఆరితేరిన పండితులు. నాభార్య తండ్రిగారివద్ద, సంస్కృతాంధ్ర హిందీభాషలు చక్కగా నభ్యసించుటచే, ఇట్టి గ్రంథములు వ్రాయుటకు సమర్థురాలాయెను. నేను శ్రీ కొంపెల్ల నర సింహశాస్త్రిగారివద్ద కావ్యములను, వేదుల రామశాస్త్రిగారివద్ద నాటకా లంకార గ్రంథములను నభ్యసించియుంటిని. నాభార్య వ్రజభాష లోని హిందీరామాయణము, తెలుగుగద్యరూపమున ననువదించుచుండగా, లిపి సాదృ శ్యముచే గ్రహించి, అవసరమైన తావులయందు, నేనును సహాయపడుచుండెడి వాడను. ఈగ్రంథరచనమున నాభార్య మధ్యమధ్యవచ్చు విఘ్నముల ద్రోసి పుచ్చుచు, ఎనిమిదిసంవత్సరములకు పూర్తినొనరించెను. తులసీదాసు ఉత్తర కాండములో వాల్మీకమునకు వ్యతిరేకముగా కొంతభాగము వదలుకొనునట్లుండు మూలములను కొన్నిటిని చూచితిమి. మావద్దనున్న "శ్రీకృష్ణలాల్ జీగారి

టీకతో, శ్రీ జ్వాలా ప్రసాద్‌జీగారు ముద్రించిన ప్రతిలోను, బెనారసులో శ్రీ కృష్ణలాల్ ద్వారకా ప్రసాద్ భారతీయగారి వ్యాఖ్యతో, శ్రీ ఠాకూరు ప్రసాద్‌గారు ముద్రించిన ప్రతిలోనుగూడా లవకుశకాండమనుపేరున ఎనిమిదవ కాండ ముండుట చూచి వాని ననుసరించగలిగితిమి. ఒక్కొక్కప్పుడు నిద్ర మానివై చి కూడా, నాభార్య వ్రాయుచునే యుండెడిది. ఈవిధముగా గ్రంథము పూర్తియైనపిదప, పండితులైన బ్రహ్మశ్రీ కొల్లూరి సోమశేఖరశాస్త్రిగారి నాహ్వానించి, ఈగ్రంథము చదివి వినిపించగా, వారు బ్రహ్మానందము నొంది ముద్రణకు వీలగునట్లు వ్రాసియిచ్చిరి కాన, వారికి ధన్యవాదము లర్పించు చుంటిని. ముద్రణవిషయమై మా పినతండ్రిగారు సర్వభారములనువహించి యున్నారు. ఈ సరస్వతీ ప్రెస్సువారు మాయందలి ఆదరాభిమానములచే గ్రంథము చక్కగా ముద్రించి యిచ్చినారు. భారత భాగవత రామాయణాది సద్గ్రంథములు సదాముద్రించుచుందురుగాతయని వారినాశీర్వదించుచున్నాను. వంశగురుతయేకాక కార్యగురుతగూడ నందికొనిన మాపినతండ్రిగారికి మా దంపతులము పౌనఃపున్యముగ వందనశతము లర్పించుచున్నాము.

కొత్తపేట
2-2-58

యేలూరిపాటి నృసింహసర్వతోముఖయాజులు

గ్రంథ కర్త్రీ విన్నపము

శ్రీ తులసీరామాయణము భాషలన్నిటను బరివర్తితమగుచున్నదగుట స్తుత్యము. ఉత్తరహిందూదేశస్థుడగు తానన్ని ప్రాంతములను, అందున, తెలుగువారి కనేకరూపముల నిత్యగోచరుడగుచున్నాడను సత్యవచనమును తులసీదాసు మఱుగు పరచుకొనలేదు. పద్యములో రెండు, ద్విపదలో ఒకటి, వచనములో రెండు, నావర్జితములై నవికదా, ఈతులసీపూర్వక రామాయణములు! శ్రీఆస్థానకవి, కవిసార్వభౌములాంధ్రాభ్యుదయమున,

శ్లో. ధరణ్యాం సృష్టి ర్యావదిహ నిపుణో వర్తత ఇతి
ప్రతిస్పర్ధీ జేతుం నహి, హి, నహి. మామ్మైవసవనే
వదన్ సింహోవిద్వన్మదగజఘటానా మనుపదం
నృసింహాఖ్యో యాజీయదభవతు తస్మై నతిరియమ్.

ఉ. ఏలురిపాటివంశమున నేననిచెప్పుచు నొమ్మ్మగొట్టు కొం
చాలరిశ్రోతులందఱను, నట్టిఁడనై వివిధాధ్వరంబులన్
జాలఁగజేసి యజ్ఞపురుష ప్రతిభంగని తాళ్ళపూడిలో
వేలకువేల్గలాఁడగుచు విశ్రుతికెక్కె నృసింహయాజితాన్.

తే. నేను, నాతండ్రి, నాతాత, గాని పెరలు
శ్రోతులమటంచుఁ జెప్పుకోఁజాల రిట్టి
తాళ్ళపూడిగడ్డ పయి నేఁడనరుచుండ
బాత్రమును బట్టజాలి యెవ్వాఁడెసంగు.

మ. అని వాక్రుచ్చుచు యజ్ఞకర్మములయందానాడు వీరుండనై
ఘనయజ్ఞంబులు పౌండరీకములకుం గాణాచినై యాజకుం
డును యాజ్యుండయి యజ్ఞభోక్తలకు నెప్పుం దండినిం బెట్టుచున్
బనిత ప్రక్రియుఁడై మహాప్రతిభకుం బాత్రంబనై భాసిలెన్.

తే. అతఁడు సర్వతోముఖమను నధ్వరంబు
సలిపె నొకమాఱు నాల్గుయజ్ఞములు నడచు
నలుగడం దానికి ముఖంబులలరుచుండు
"స్వాహా" యనఁగ బహువచన త్యాగమగును.

శా. ప్రాగ్వంశంబది యొక్కఁడేయగు హవిర్ధానంబు నాస్థానమున్
ఋగ్వాక్యస్థలము త్తరంబగుచుఁ గీర్తింగాంచనౌ వేదియున్
వాగ్వాదంబులకై నచోటులు చతుర్భాగంబులం గల్గియున్
దృగ్వారంబగు సర్వతోముఖముఖం బెన్నంగవచ్చున్ ధరన్.

కం. ఏనయ్యాజి మఖంబున
మానుగఁ బ్రాగ్ద్వారమందు మహితాగ్నీధ్ర
స్థానముఁ గైకొని యాజకు
డై నుతులకు బాత్రమైతి నని వచియింతున్.

అని పొగడిన మహామహుడు నాపెదతండ్రి నరసింహ సర్వతోముఖ యాజులుగారి మనుమని భార్య, ఈ తులసీరామాయణ కావ్యానువాదిని. ఉత్తరరామచరితమున జెప్పబడినట్లు నా కులవధువు. తెలుగు లోకమున గొప్పహోతగ నుతికెక్కిన చావలి మహాదేవశాస్త్రిగారి పౌత్రి. అభినవ కాళిదాసుగ స్తుతింపబడిన కొంపెల్ల సుబ్బారాయుడుశాస్త్రిగారి దాహిత్రి. ఈదంపతులచే శ్రీమారుతి కులదైవముగ సేవింపబడుచున్నాడు. ఆంజనేయోపాసకులలో ఘనులగు శ్రీ భాగవతుల అన్నపూర్ణయ్యశాస్త్రిగారు వీరల కుపదేశికులు – ఈమె ఈరచనమును సాగించుటకు రెండు హిందీవ్యాఖ్యాయుత గ్రంథము లాధారములు. ఈరచనమున కెనిమిది సంవత్సరములు పట్టినది.

తండ్రిగారగు కీ. శే. చావలి యజ్ఞేశ్వర సోమయాజిగారినుండి నేర్చిన గీర్వాణభాషాపరిచయ మిూపొత్తమునందంతటను గోచరించుచున్నది. సంతాన యుతులు కాని ఈ దంపతుల హృదయసంభవయగునీ నా వంశజనిత కృతి రత్న మందు అసలుకన్న వడ్డిముద్దనురీతి ననుసరించిన వాత్సల్యమున జేయెత్తి యూడించుచు నాటపాటలకు దోడుగ నింకొకబిడ్డనీ నాకులవధువు ప్రసవింప

నాశీస్సులు నిడుచు నీబిడ్డ (తులసీరామాయణము) జాతకమున దృతీయ స్థాన మున సహాజనియోగ మున్న దేమో చూడుడని పెద్దలకుజూపుచు పలుచోట్ల ద్రిప్పితిని. చూచిన మహనీయులెల్లరు నీ జాతకమున భారతీలక్షణములే కన్పిం చుచుండుటచే దోడును సంపాదించు యోగమే ద్యోతితమగుచున్నదని యాశీర్వదించిరి. —

ఈ తులసీరామాయణమున పలువిషయములు విమర్శనీయములు కలవు. గర్గసంహితలో కాకభశుండి చరితము చాలకలదు. తులసీరామాయణమున నట్లే యున్నది. గర్గసంహితకు మూలము బ్రహ్మవైవర్త మనుట స్పష్టము. మకారపంచకవ్యాప్తి కారకుడగు గోకులవల్లభాచార్యునికి బూర్వ మీ గర్గ సంహిత యున్నట్లు నిదర్శనములు లేవు. వల్లభార్య తులసీదాసుల కాలముల కలయికను పరిశోధించవలసి యున్నది. ఇట్టి చాలావిషయములు విమర్శించుపని నాది కాక పీఠికాకర్తలదగుటచే నేనందు బ్రవేశమును గల్పించుకొనుటలేదు.

ఈపొత్తమును లిఖించుటలో ఎడముంచుట (space out) శీర్షికలనిడుట పేరాలను విభజించుట, మొదలయినవి జరిగించకుండుటచే మధ్యకాలమున జరిగించవలసి శ్రమాధిక్యము కలిగినది. ముద్రాపకులు నేనునుగూడా మామూలు కన్న హెచ్చు పనిని గలిగించుకొనినను గొన్ని ప్రమాదములు కలిగినవి. ర-ఱ స్తం-స్థం॥ మొదలయినవి కూడ మార్పు నందినవి. తప్పొప్పులపట్టికను పెద్దదానినిగ దయారుచేయవలసిన పనిచేత కాక ముద్రాపకులు మార్కులను సంపాదించుకొనలేకపోవుటచే నిత్యస్మరణీయులు కాలేదనుకొందును. ఈ గ్రంథ ముద్రణమునకు నాలుగుమాసములు పట్టినవి. మా లక్ష్మీసరస్వతిని వివేకానంద యుతను జేసితిని. శ్రీమతి అద్దేపల్లి వివేకానందాదేవిగా రీపొత్తమును బ్రకా శింపజేయుట కంగీకరించిరి. నే నడిగినంతలో ఈ పొత్తమును దీసికొని చదివి తమ అమూల్యాభిప్రాయముల నొసంగిన మహనీయులందరు రచయిత్రితోబాటు నాకును స్తుతిపాత్రు లైరి. పీఠికను వ్రాసి యివ్వవలసినదిగ శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రి (త్రితయ) గారిని గోరగ బహువిమర్శముగ బీఠికను దయ చేసినందులకు కృతజ్ఞులము. నరస్వతీ పవర్ ప్రెస్సు ప్రొప్రయిటరుగా రగు శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారు తులసీదాస విగ్రహమును దయారుచేయించి

తెప్పించుటలో జాల శ్రమతీసికొనిరి. తమ ప్రెస్సులోనున్న బొమ్మలను దయతో నొసంగి ఈ పొత్తమున కంచమును జేకూర్చిరి. నాకు మంచి సలహాల నొసంగుచు గ్రంథమును సౌష్ఠవముగ నాకర్షణీయముగ దయారుచేయించి మాకందించిన శ్రీ నాగేశ్వరరావుగారికి కృతజ్ఞతతో నాశీస్సుల నిడుచున్నాను. ముద్రాలయపుటుద్యోగులకును ముద్రాపకులకును కృతజ్ఞులము.

యేలూరుపాటి రామభద్రచయనులు

పరిష్కర్త

గ్రంథప్రకాశన సభాసందర్భమున అభివందనములు

శ్రీమత్యా ధీమత్యా గుణమత్యా విద్యావత్యా లక్ష్మీసరస్వత్యా, యేలూరుపాటి నామక పవిత్రాన్వవాయస్య వధూమణినా సుమధుర మాంధ్రీ కృతస్య తులసీరామాయణ కావ్యరత్నస్య సమర్పణావిష్కరణావసరే కృష్ణకవి మూర్ధన్యేన సపరితోష మాశాస్య బహూకృతామరాంధ్ర గద్య పద్యాత్మకా నర్ఘోపడా.

మ. నితరాంమైత్రి సమేతలై సదయలై నిర్జేర లక్ష్మీసర
స్వతు, లెంతేని సమీక్ష్య కారులయి యాశాసించి లక్ష్మీసర
స్వతినాసార్థక నామధేయ మిడి రుచ్చెర్లీల నిన్గన్నదం
పతు ; లాహేతువుచేత నీకమరె నీ భాగ్యోన్నతుల్ కైతలుస్.

అయి సోదరి!

అస్తు తే స్వస్తి లక్ష్మీసరస్వతి! ధన్యతమాసి మానవతీలోకే తరణికుల ప్రదీప సీతా మనోహర మనోహరచరితాంత్రీకరణేనతావత్. మాన్యాసి కవయిత్రీణాం కవయిత్రీణాంచ సమంతరే హృద్యాన వద్యగద్య ప్రబంధరచనా చాతురీధౌరంధర్యేణ.

మ. పడికొంప ల్గలపల్లెలం దయిననే భవ్యం బ్రతిష్ఠించి కొ
ల్చెదరో జానపదుల్, వతారతతి వాసిం జెప్పుచో నాదినే
సదయున్, వ్రేలుమడంచి వాకొనెదరో, సద్ధర్మ సంపూర్తి, కా
స్పద మేదేవుడొ, యట్టిరాము బొగడన్ జన్మంబు ధన్యంబగున్.

రసవత్కవయిత్రి!

సంతిఖలు బహుళానీతఃపూర్వస్మిన్నేవ కాలే భాషావిశేషహేవాక నిగుంఫితాని, పండిత మండలాఖండలాఖండ నిశాతధిషణా మాత్రనిషేవణీయాని కావ్యరత్నాని భరతఖండే. విశేషతస్త్వాంధ్రావనీతలే. అద్యతనాః కవయఃకేచన నిబధ్నంతి గద్యానువాద ప్రబంధా నాంధ్రభారత్యామ్. సంతు నామకావ్యాని. కానిచిత్తేష్వన్వయక్లిష్టాని కేవలశబ్దాడంబరమయాని. దుష్టాని కానిచిద్యతో గ్రామ్యభాషోపబృంహణతయా. సామాన్య భాషాజ్ఞానవతా హ్యనాస్వాదిత రసభావవిశేషాని శేషాణి. రసదరిద్రాణా నిద్రాణా భవంతు తాదృక్ప్రబంధాభాసా యతోదుర్గ్రాహ్యాహ్యగ్రాహ్యాశ్చ.

మ. తులసీదాస తదాత్తరాహకవి యెంతో భక్తిసంయుక్తిని
శ్చలదీక్షామతి కోసలేశతనయా సంతానచారిత్రమున్
బలికెన్ నైజకవిత్వముల్ గమగమింపన్ "హింది" యన్ బాసలో
తెలుగుంజేతల దిద్దితీర్చితివి గాదే దాని నోసోదరీ!

అంబ!

పితామహస్తవ నిధి శ్శ్రోతే. హోత్యాణా మాదా గణనీయః,—మాతామహస్తవాభినవ కాళిదాస బిరుద విరాజమానో జ్యోతిష విద్యాపారంగతః. వధూర్భవతీ యేలూరుపాటి పరమోదారధరాసురాన్వవాయస్య. పితామహో భర్తుస్తవ మహామహిమాన్వీతోఒప్యప్తుర్యామ సర్వతోముఖ ప్రముఖ మఖాచరణ ప్రవీణః — ధవస్తవ వైదికధర్మ కర్మనిర్వహణచణో గైర్వాణసాహితీ సమభ్యసన వికసిత మతిప్రాభవో, రామచంద్ర పదారవింద భజనానుదః, పితృవ్యః పతేర్భవత్యాః నిరవధిక సారస్వతసేవానిమగ్న జీవిత న్నక్రమసశాస్త్రీయ సునిశిత విమర్శనపటుః. ఏవంవిధ స్తవనీయ పరిపూతతమ

వంశయుగళీ సంబంధినీ భవతీ. శాంతశీలాసి – సునిశితమతి ప్రతిభాభాసురాసి. అస్తి విస్తృతా చతురతా కావ్యకథాసంవిధానే తవ – పూర్వకవీశ్వరవాక్ప్ర యోగ దక్షతా శిక్షితా తవాబాల్యాది. దయాహృదయాసి. ఏతాదృశ శాస్త్ర చోదిత సుకవిలక్షణ లక్షితా. త్వాం కోవానాభినందతి. కోవానో సమ్మానయతి.

చ. అలరులు గుప్పినట్లు, మలయానిలముల్ చెలరేగినట్లు, తే
నెలనొలి కించినట్లు, పురణించుచుఁ బున్నమచందమామ వె
న్నెల లను బుక్కిలించినటు నెక్కొను నీదు జగాతెనుంగుచే
తల కిడు జోత లాంధ్రకవితారసికాఖిల శ్రోతృపాఠకుల్.


నత్కవయిత్రి!

అశ్లోషం కావ్యం భవదాంధ్రీకృతం తులసీరామాయణం. అతసీకు సుమాదపి మృదులమృదులాని – సుధాధారాంతస్సారాదపి మధుర మధురాని పదాని సమాహృత్య యథోచితం ప్రయుజ్య ద్రాక్షాపాకే విరచితమ్ నోజానే కథ మాంధ్రజనతా భవిష్యత్యపర్ణా.

చ. అరయ విరోధముల్ సహజమైతగు నత్తయుఁగోడ లౌటచే
సిరికిని వాణికిన్, పగ నశింపఁగ పేరు లొసంగి వారె నిన్
నిరతము బ్రోచుచుండి; రిక నేను మహామహిమాఢ్యు డైన మా
హరిహర దేవు బాసటగ నంపుదు వారికి సోదరీమణీ!

మనస్విని!

గుణగ్రాహిణీ పరిషదియం. అవగీతం పవిత్రం రఘురామచరితమ్. యాపాస్మాకీనధి సముత్థితమ్. జాత మానంద సందోహ బృందిష్ఠం పారిషద మానవమానసం పాయంపాయం కవితామృత మాకంఠమ్. కిమిత్యాశాస్మహే భవతీ మన్వర్థనామధారిణీమ్.



శ్రీ గోస్వామి తులసీదాసు

(918

శ్లో. సౌభాగ్యవతి! సత్పుత్ర, ప్రసవా భవతీ భవ
సాకం కావ్యసంతాన్తై, ర్లభస్వాయుర్యశో ఽధికమ్.
శుభంభూయాత్ – ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శుభాకాంక్షి, సోదరకల్పా

కొకరవర్తి కృష్ణశాస్త్రి

మారుతీ!

తులసీదాసుఁడు రామచంద్ర పద భక్తుండై స్వయంతీర్ణుఁడ
న్యుల నెల్లన్ దరియింపఁజేయుటకుఁగాదో! పాడె రామాయణో
జ్జ్వలగాథాకృతి; మారుతీ! యతని విజ్ఞానామృతాపూరమాం
ధ్రులు చూఱాడ 'సరస్వతమ్మ' కిటువిందుల్ వోసితే వాక్కులన్.

అవినాభావములైన డెందములు నీయారాధనంబందుఁ బే
రువడన్ నిల్పిన భక్తిరక్తిరసమూర్తుల్ దంపతుల్వీరు భా
గవతాచార్యకటాక్షపూర్ణకరుణాకల్యాణవర్తుల్ - మహో
త్సవతన్ వీరలకోర్కి తీర్చెదవుకాదా! ఆంజనేయప్రభూ!

కుతుకంబార భవత్పదాబ్జముల రేకుల్ పట్టి సేవించి, యు
న్నతి దీపించి మధువ్రతంబులయి విజ్ఞానంబు నార్జించి దం
పతు లీయిర్వురు నీకునై యిడిన సేవల్ పండగా, గోప్పదీ
కృత పాథోనిధి! మారుతీ! తమి గటాక్షింపంగదే నిచ్చలుస్.

ఏలురిపాటివంగడము నేలెడికోడలియందు నీదయా
శ్రీలిటు లెంత వింత చిగురించెను! నేఁటికి; సంస్కృతాంధ్రవా
గ్జాలము సర్వతోముఖ మఖంబుగ సాగగ, సోమిదమ్మగాఁ
దేలిచి రామయాగ సుకృతిన్ నెఱవేర్చితి వీమె ధన్యగన్.

అతిభ క్తిస్థితి రామమానస సరోహంసమ్మ లక్ష్మీ సర
స్వతి బ్రహ్మకృతియూ నృసింహామఖితాత్పర్యంబుతో బూర్ణజీ
వితపుం బాటలు – క్రొత్తపేటలుగ నుర్విన్ రామసాహిత్య పూ
జితమై యుండఁగ నంజనాతనయ! ఆశ్వీర్వాద మిమ్మియ్యెడన్.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

జమ్ములమడక మాధవరామశర్మ

A. C. కాలేజి

గుంటూరు

సహృదయా!

ఇదం మదీయం వచనం, శ్రీవాల్మీకి చ్ఛాయాసుఖ మనుభూయభార తే భారతీయాఃభారతీయా స్సంజాతాఃఅద్యతులసీతీర్థ మావశ్యకం సంజాతం వ్రజభాషామయీ తులసీవాణీ మార్దవంలాలిత్యం మాధుర్య మనుభావయతి అద్య శ్రీమతీ సరస్వతీ, సరస్వతీ శ్రీమతీ భూయో భూయస్సంభూయ ప్రీతిం వ్యుత్పత్తిం ప్రదదాస్యతీత్యహ మహమివ భావయితుం స్వావసరఃసంపద్యతాం శ్రీమతీ అభిజ్ఞా వివేకానందా స్వానందముద్రా ముద్రితాం సరస్వతీ, సరస్వతీం ద్యోతయితుం, విద్యోతయితుం ప్రభవిష్యతి. మయా ప్యాగత్య సంభావ్య కృతిసమర్పణ సమసమయసత్కారసత్క్రియా సంభావనమాసాద్యం యద్యపి కింక్రియతాం అన్యత్రాహామామంత్రితఃఅదృష్ట్వా శ్రీ సరస్వతీ వాచం కి మహం కథయిష్యామిసాతులసీ పద్యమయీ ఆంధ్రలోకే దృష్ట శ్రుతా, గద్యమయీ అద్యభవద్భి రాస్వాద్యతాం. సేయం తులసీ సంస్కృత భాషామయీ కదాభవిష్యతి? తత్ర భవంతఃయదిచ ప్రతిజానీయుఃతదా భవిష్యతి అస్తు సమస్తు

భద్రంతే. మా, శర్మ

ఓంకారంబను స్వర్ణపీఠిని మహాయోగంబునన్ రాణియౌ।
పంకేజాక్షి ! సరస్వతీ ! భగవతీ ! పద్మాసనాస్యప్రభా !
ఇంకన్ గావ్యసుకన్యకాచయము నర్పింపంగ సౌభాగ్యమీ।
పంకేజాస్యసరస్వతమ్మకిడుమా ! ప్రార్థింతు నశ్రాంతమున్॥

శ్రీ సీతారమణీ హృదయరాజీవార్కుఁడై వెల్గుచున్।
గౌసల్యాజనయిత్రికిన్ ముదమునందానించుచున్ సత్యధ।
ర్మాసక్తుండయి సర్వజీవులను సంరక్షించు శ్రీరాముఁడ।
త్యాసక్తిన్ గృతిభర్తయై మనుచునేతత్ గ్రంథకర్తిన్ రహిన్॥

యువతీమండలియూహ్య, నవిధానముఁగాంచి నామనస్సునయందుం।
దవిలినభాషార క్తిన్, కవితామణి హారమొకటికాన్క యొసఁగెదన్॥

పండితపోషణథిషణయుఁ, బండినహనుమత్పదాబ్జ భక్తియునెదలో।
నిండుసరస్వతినేడున్, బండువుగాజేసె సుకవిపండితసభలో॥

తులసీరామాయణమున, వెలసినయాంధ్రీగృహము పవిత్రముభక్త్యా।
జ్వలదీపకళాకలితసు, లలితంబానందలక్ష్మిలాస్య స్థలమౌ॥

తులసీరామాయణమున్, తెనిగించె సరస్వతమ్మ తియ్యగనీమెన్।
లలిఁబెండ్లాడెనుసుగుణ నుతులు శ్రీసరసింహసర్వతోముఖ యాజుల్।

పొడమినచావలికులమున్ బడిమెట్టిన యాయెలూరిపాటికులంబున్।
కడుఁగీర్తిమంతమయ్యెను, పుడమి సరస్వతివి నిన్నుఁ బోలిరెపడఁతుల్॥

వేదుల వెంకట్రావు

సీ. వేదవేదాంగాది విహితవిద్యలనేర్చి చావలి మహాదేవశాస్త్రివెలసె
నాతని కర్ధాంగియయ్యెఁ బులుసువంశ సంజాతయైన లక్ష్మమ్మగారు
సోమయాజులుపేర శోభిల్లుసుకుమారు మంత్రశాస్త్రజ్ఞనామహిళగనియె
హూణ భాషనునేర్చి రాణకెక్కినవాఁడు న్యాయవాదిత్వంబునం దతండు

అతని సహధర్మచారిణియన్న పూర్ణ, అన్న పూర్ణకునాసోమయాజులకును
వినుతలక్ష్మీసరస్వతి యనెడు తనయ, గలిగె మహాదేవప్రభువును ఘన
గుణుండు.

ఉ. పాలసముద్రమున్ మిగులఁబట్టుదలన్ గొని దేవదానవుల్
చాలశ్రమంబుతో మథనసల్పఁగఁ బుట్టినయట్టి లక్ష్మియున్
బాలసుధాకరాభయయు భాసిలుచున్న సరస్వతమ్మయున్
లాలన చేయుచుండెదరు లక్ష్మి సరస్వతి నీమి నెప్పుడున్.

మ. అవనీచక్రమునందెసంగు మహనీయాత్యుత్తమాలంకృతుల్
కవయన్ భక్తియు రక్తికల్గెఁ గద యీగ్రంథంబునందెల్లెడన్
సువివేకంబును హర్షమున్ గలిగి సంశోభింతు రీపుస్తక
శ్రవణాసక్తినిగల్గు నాంధ్రజనముల్ శ్లాఘింపనాశక్యమా!

తే. సకలకల్యాణగుణ మనోజ్ఞస్వరూపుఁ
డైన శ్రీరామచంద్రుఁడీ యతివవరుని
సర్వతోముఖయాజులన్ సాకుఁగాత
మాయురారోగ్య పుత్రభాగ్యంబులొసఁగి.

బులుసు పెదలక్ష్మీనారాయణశాస్త్రి
జ్యోతిష వేదాంతవిశారద

శ్రీరామజయమ్

పీఠిక

'సాహిత్యరత్న' అయాచితుల హనుమచ్ఛాస్త్రి ఎం. ఏ. (త్రితయ
కేంద్రప్రభుత్వ హిందీ భాషోపన్యాసకులు, మదరాసు.

ఏసుముహూర్తమున క్రౌంచదంద్వవియోగోద్భవై [1] వాల్మీకిమహర్షుల శోకము శ్లోకముగ [2] మాఱెనోకాని, 'తద్వదనారవిందగళిత' మగు 'రామాయణాఖ్యమధువు' [3] జన్మవ్యాధి జరావిపత్తి మరణాది సంకులిత్నమైన సంసారమును తరించి శాశ్వతవిష్ణుపదవిని ప్రాప్తింపఁజేయ సమర్థమై యొప్పుచున్నది. రామాయణ కథామరవాహిని కాలక్రమమునఁ బ్రవాహవిధానమున బరివర్తనమందుచువచ్చెను. సంస్కృతభాషానిబద్ధమగు నీమహాకావ్యమును భారతదేశమునందలి విభిన్న భాషాకవులు స్వీయభక్తి ప్రతిభాప్రభావిత మొనరించి యాయాదేశభాషలయందు మనోహరముగా నిబంధించిరి. శ్రీరామచంద్రుని యితివృత్త మనన్యగుణోపేతము. ఇతరములగు నితివృత్తముల స్వీకరించినపుడు కవి తన ప్రతిభా వ్యుత్పత్తులను ఇనుమిక్కిలిగా జూపవలసి యుండును. రామాయణకథా స్వీకారమున రచయిత యప్రయత్నముగా మహాకవియై రాణించును. ఆకథయందలి మహత్త్వ మట్టిది. దానియందలి సుకుమారసన్నివేశములు, దానినలువైపుల నావరించి గుబాళించు ధార్మికపరిమళము, సమగ్ర జీవనస్పర్శ మొనరించి, యేవ్యక్తి జీవితమునైనను ఉన్నయన మొనరింపగల యద్భుతశక్తి దానికామహత్త్వమును జేకూర్చిపెట్టినవి. ఆధ్యాత్మికజగత్తున

---

1. కావ్యస్యాత్మాస ఏవార్థస్తథాచాదికవేఃపురా
క్రౌఞ్చద్వంద్వవియోగోత్థః శోకఃశ్లోకత్వమాగతః
ధ్వన్యాలోకము. ప్రథమోద్యోతః

2. ఆదికవి వాల్మీకుల శోకము శ్లోకముగా నిట్లుమాఱెను.
"మానిషాద ప్రతిష్ఠాంత్వమగమః శాశ్వతీఃసమాః
యత్క్రౌంచ మిథునాదేకమవధీఃకామమోహితమ్"

3. 'యఃకర్ణాంజలిసంపుటై రహరహస్సమ్యక్పిబత్యాదరా
ద్వాల్మీకేర్వదనారవిందగళితం, రామాయణాఖ్యంమధు"

దానికిగల స్థానమద్వితీయము. కేవలసాహితీమర్యాదల ననుసరించి చూచినను రామాయణమున సకలకల్యాణగుణాభిరాముడై, ధీరోదాత్తుడై, 'శక్తిశీల సౌందర్య' శోభితుడై, 'మర్యాదాపురుషోత్తముడై వెలుగొందు శ్రీరామ చంద్రుడు నాయకుడు. రామకథాప్రవాహము ఆసేతుశీతనగపర్యంతము శతాబ్దములుగ భారతీయమానసక్షేత్రముల గేదారఖండములుగ నొనరించుటచే నేటికి నేనాటికిని రామనామ శ్రవణమాత్రమున భారతీయుని మనోనయనములు భక్తిభావార్ద్రములగును. అట్టిరామాయణకథను హిందీసాహిత్యమున నవతరింపజేసిన మహనీయుడు **తులసిదాస మహాకవి.**

తులసిదాసుని జీవితమునందనేకవిషయములు వివాదాస్పదములు. విక్రమ శకము 1589 సంవత్సరమున రాజాపురమను[1] గ్రామమున తులసిదాసుజన్మించెను. జననిపేరు హులసి. జనకునిపేరు ఆత్మారామ్‌దూబే. అభుక్తిమూలమున జన్మించుటచే తల్లిదండ్రు లీతనిని విడిచివై చిరట. అంతట నీతని మునియా యను స్త్రీ పెంచెనట!

నరహరిదాసు[2] అనునత డీతనికి గురువు. శేషసనాతను డీతని విద్యాగురువని కొందఅందురు. తులసీదాసునకు దీనబంధుపాఠకుడను నతడు తన కూతురైన రత్నావళినిచ్చి వివాహము చేసెను. తారాపతియను కుమారుడు కలిగి కొలదిదినములకే గతించెనని చెప్పుదురు. తులసీదాసునకు కలిగిన వైరాగ్యమునకు కారణముగా నీక్రిందికథను చెప్పుచుందురు.

తులసిదాసు ఇంటలేనిసమయమున రత్నావళి పుట్టినింటికిఁ బోయెను. ఇంటికితిరిగివచ్చి, యిల్లాలినిగానక, తులసీదాసు, ఉల్లమున తల్లడిల్లెను. వెంటనే యత్తవారింటికిబోవ సమకట్టెను. దారిలో నేటిపైఁదేలు శవమును దెప్పగా భావించెను. అత్తవారింటికి వెళ్ళునప్పటికి నచ్చటనెల్లరు గాఢనిద్రామగ్నులై

---

1. జన్మస్థలము సూకరక్షేత్రమనబడు సోరోగ్రామమని కొందరిపండితుల యభిప్రాయము. "తులారామ్" "రామ్‌బోలా" అనుపేళ్లుకూడ నీతనికి గలవు.

2. "వందౌఁ గురుపదకంజ కృపాసింధు నరరూపహరి (హరఅని కొందరు) మహా మోహతమపుంజజాసువచన రవికరనికర" ఈ ఛందము ననుసరించి 'నరహరిదాసు' ఈత్య గురువనుట సరికాదని కొందరు. భగవంతునే గురువుగా స్వీకరించెనని యందురు

యుండిరి. చూరునుండి ప్రవేలాడు పామునుజూచి ప్రాటిగాబ్రమసి, పట్టుకొని లోపల ప్రవేశించెను. తన కూరిమియిల్లాలిని నిద్దురనుండి లేపెను. ఆమె కండ్లనులుముచు, చూచునప్పటికి పతి కానవచ్చెను. అంతటి యర్ధరాత్రమున మోహపాశముచే నీడ్వబడివచ్చిన తనభర్తయందు నిందాభావ మేర్పడ నామె యిట్లనెను.

లాజ్ నలాగత్ ఆవ్ కోదారే ఆయహుసాథ్
థిక్,థిక్ ఐసే ప్రేమ్కో కహా కహూ మైనాథ్
అస్థిచర్మమయ దేహమమ, తామేఁజై సీప్రీతి
ైతెసీజే శ్రీరామమహఁహోతి నతేభవభీతి.

లజ్జలేదొకో ! పర్వాత్తిపజ్జజేర
నిట్టిప్రేమమ్మునాథ గర్వింపరాదో !
తోలునెమ్మోలగూటిపైఁ దొడరు ప్రీతి
అల్లశ్రీరాముపైనున్న జెల్లుభవము.

(హిందీసాహిత్యము)

అదనుకు బడిన చినుకుచే పదనుకు వచ్చినభూమి యందు బీజము మొల కెత్తినట్లు, ఒక్క-సారి తులసిదాసుని హృదయమున వైరాగ్యభావము ముమ్మ రముగా మొలకెత్తెను. తక్షణమచటువాసి కాశీఁ జేరెను. నాటినుండి తులసీ దాసుని హృదయతులసీదళముల పవిత్రపరీమళములు నలుదెసల ముసర జొచ్చెను. అతడు తీర్థయాత్రల గావించెను. రామభక్తిపారమ్యము ననుభ వించిన తులసీదాసు వి. శ. 1631 సంవత్సరమున రామచరిత మానసమనెడు శ్రీమద్రామాయణ రచనము నారంభించెను. తొలుదొల్త నీమహాగ్రంథము నకు అయోధ్యాక్షేత్రమున శ్రీకారము చుట్టెను. రామామృతరసాయనమును జనన మరణచక్రపరి భ్రమణ మూఢచిత్తులగు మానవులకు పుష్కలముగాఁ బంచియిచ్చెను. ఆర్యావర్తమున తులసీరామాయణమునకుగల ప్రశస్తి యింతింతనరానిది. భక్తిమాలయను గ్రంథమున నాభాదాసుడను భక్తుడీతని కలియుగమునందు కుటిలజీవుల నిస్తరింపజేయుట కవతరించిన వాల్మీకిమహర్షిగా

తన నభివర్ణింపుచు అధునాపాశ్చాత్య విద్వాంసుడగు గ్రియర్సన్ అను నాతడు తులసీదాసు నిట్లు భూషించెను.

"The importance of Tulasidas in the History of India cannot be over rated. Putting the literary merits of his Ramayana out of question, the facts, of its Universal acceptance by all classes is duly worthy of note".

"భారతదేశ చరిత్రయందు తులసీదాసునకుగల ప్రాధాన్యము గూర్చి యెంత జెప్పినను అత్యుక్తికాజాలదు. అతని రామాయణము నందలి సాహిత్య సుషమతోబాటు, దానికి లభించిన విశ్వజనీనామోదము నిశ్చయముగా గమనింపదగినది" తులసీదాసు తనరామాయణ రచన మెట్లుసాగినది, ఏలసాగినది క్రింది శ్లోకమున స్పష్టము చేసెను.

నానాపురాణ నిగమాగమ సమ్మతంయత్
రామాయణేనిగదితంక్వచిదన్య తోపి
స్వాంతఃసుఖాయ తులసీ రఘునాథగాథా
భాషానిబంధమతిమంజులమాతనోతి

స్వాంతస్సుఖమునకై తాను రచించెనట. వాల్మీకమునుండియే గాక అన్యస్థలములనుండికూడ రామాయణ కథను తాను సేకరించి తనకనుగుణముగ మలచి నాడట. ఇతర గ్రంథములందు అధ్యాత్మ రామాయణము మొదలగునవి ముఖ్యములు.[1] తులసీరామాయణమునందు కథాపృచ్ఛకులు మువ్వురు 1. పార్వతి 2. భరద్వాజుడు 3. గరుత్మంతుడు. కథకులు మువ్వురు. 1. శంకరుడు 2. యాజ్ఞవల్క్యుడు 3. కాకభుశుండి. వీరుమువ్వురును రామభక్తి మహత్వమును చక్కగా పౌనఃపున్యముగా పొగడుచుందురు. కావున తులసీదాసునకు రామతత్వనిరూపణమునందెక్కువ తాత్పర్యమని గ్రహింపవలెను. నామమాహాత్మ్యమును గూడ నాతడుద్ఘాటించును. రామాయణమునకుఁ

1. కంబర్ జౌర్ తులసీ, అనుగ్రంథములో శ్రీశంకరరాజునాయుడుగారు కంబ రామాయణము తులసీరామాయణము నందలి కొన్ని సామ్యములఁ బురస్కరించికొని 'క్వచిదన్యతోపి' అను నుక్తిక్రింద కంబరామాయణమును కూడ జేర్చుటకు ప్రయత్నించినారు.

బరమప్రయోజనము శ్రుతిసమ్మతమైన హరిభక్తి పథము నిర్దేశించుట. చిల్లర పథముల నవలంబించి సంఘమున నల్లరి రేపుచున్న సామాన్యజనములయొక్క దృష్టిని, సకలమర్యాదాభిశోభితమైన శ్రీరామచరితమువైపు ద్రిప్పి వారి జీవన మార్గముల ప్రశస్త మొనరించుట. తులసీదాసు తనరచనమునూల మున నీప్రయోజనము సాధించెననుటలో సందియము లేదు. కావుననే జగత్ప్ర సిద్ధులగు శ్రీమధుసూదన సరస్వతులు తులసీదాసునిట్లు భూషించిరి.

"ఆనందకాననే కశ్చిజ్జంగమస్తులసీతరుః
కవితామంజరీ యస్య రామభ్రమరభూషితా"

తులసీరామాయణము తులసిదాసుని కృతులయందేకాక సమగ్రహిందీ సాహిత్యమునందును దలమానికముగా భావింపఁబడుచున్నది. ఈమహాకవి యితరరచనములందు గణనీయములు. 1. వినయపత్రిక 2. కవితావలి 3. గీతావలి 4. పార్వతీమంగల్ 5. కృష్ణగీతావళి 6. దోహావలి అనునవి. రామాయణము తరువాత భక్తజన చాతకములకు శ్రవఃపేయమైన గేయరచనము వినయపత్రిక. ఇందు తులసిదాసు స్వామివైభవమును, తనదైన్యమును, స్వామిని తాను శరణుఁజొచ్చి రక్షింపుమని వేడుకొనుటయు మొదలైనతావుల భక్తి విహ్వలుడై వర్ణించిన గేయములుకలవు. భక్తిమార్గానుయాయులకిది కల్ప ద్రుమము. వినయ పత్రికను రచనావిధము ననుసరించి స్థూలముగా మూడు భాగములుగా, విభజింపవచ్చును. 1. స్తోత్రఖండము 2. వైభవఖండము 3. ఆత్మనివేదనఖండము. ఇతరదేవతా వైముఖ్యములేని యాతనిభక్తి స్తోత్ర ఖండమున శివుడు, గణపతి, జాహ్నవి, సూర్యుడు మొదలగు ననేక దేవతా నమస్కారములు గావించును. సంస్కృతపదభూయిష్ఠములై, సమాస ఘటిత ములై ఈస్తోత్రములు, తనభావములనెడు చిత్రవిచిత్ర మాలాజాలముచేఁ దుల సిదాసు సర్వదేవతాలంకారము గావించెనాయనునట్లు వాసించుచున్నవి.

వైభవఖండమున స్వామివైభవముతోబాటు తనలఘుత్వము నాత డనుభవించి వ్యక్తపఱచును.

తూదయాలు, దీనహౌ, తూఁదానిఁ బిఖారీ
హౌఁ ప్రసిద్ధపాతకీ, తూపాపపుంజహారీ

నాథతూ అనాథకో, అనాథకౌన్ మోసో
మోసమాన్ ఆర్త్ నహి, ఆరతిహరతోసో
బ్రహ్మతూఁ హౌఁజీవ, తూ ఠాకుర్, హౌఁచేలో
తాతమాత గురుసఖా తూ సబ్ విధి హితుమేరో.

* * *

(వినయ పత్రిక)

'ఈవుదయార్ద్రుఁడవేను దీనుండ
ఈవుమహాదాతవేను భిక్షుకుడ
నీవనాథపతి నేననాథుడను
నేమహాపాపినై నెగడొందువాఁడ
నీవొనర్తువు పాపనిర్మూలనమ్మ్మ
నాయంత యార్తుడు నాతండ్రి! లేడు
న్యాయమ్మ్మగా నార్తిహరుడు నీయంత
నీవుపరబ్రహ్మ నేను జీవుండ
స్వామివి నీవేను పరిచారకుండ
తల్లి, తండ్రి, హితుడు తగగురుండీవు' ...

(హిందీసాహిత్యము పు. 160)

ఆత్మనివేదనఖండములో తులసీదాసు తనకు రామునికంటె అన్యమెవ డును లేడని అనేకపర్యాయములు వాక్రుచ్చును. శ్రీరామచంద్ర చరణ శర ణముజొచ్చి తనునుద్ధరింపవలసినదిగావేడికొనెను. ఇట్లు వేడుకొనుటలో శ్రీ సీతా, హనుమ ల్లక్ష్మణ భరత శత్రుఘ్నుల సాయము నర్థించును. వారిని తనకుగా శ్రీరామచంద్రునికి నివేదింప వేడికొనును. తుదకు తారచించిన వినయపత్రి కపై, నిండు పేరోలగమునన్నున్న శ్రీరామచంద్రుడు చేవ్రాలు చేసినట్లుగా భావించి యానందపారవశ్యమునందును. వినయపత్రికను లక్ష్మణుడు ముందిడగా కరుణాసింధువైన శ్రీరామచంద్రమూర్తిచేవ్రాలిడెనట. మహాభక్తుడైన తులసీదాసుని భక్తిపారమ్యమట్టిది!

'కవితావలి' యందు రామకథయే తిరిగి వర్ణింపఁబడినది. శ్రీరామ చరితమానసము అవధీ భాషయందు వ్రాయబడినది. కవితావలి యట్లుగాక వ్రజభాషయందు వృత్తములలో రచింపబడినది. ఆపేక్షికముగా కవితావలి యందు రామ చరిత్రమును అతి సంగ్రహముగా తులసిదాసు వర్ణించెను. కవిత్వ మత్యంత మృదుమధురమై జాలువారినది. తులసిదాసుని యితర కృతులుకూడ తగినంత ప్రసిద్ధిని సంపాదించుకొన్నవి.

తులసిదాసునిభక్తిపద్ధతి

పరాంకోటికిఁ జెందిన మహాభక్తుఁడు తులసిదాసు, అని చెప్పుటలో నెట్టి విప్రతిపత్తియులేదుకాని ఆతని దద్వైతపరమగు భక్తియా? విశిష్టాద్వైత పరమగు భక్తియా! అని చర్చించి సారాంశమును దేల్చిచెప్పుట మివులగడ్డు పనికాక మానదు. ఆతడు ప్రపంచించి పంచియిచ్చిన శ్రీరామ కథామృత రసాయనమును జుబ్బన జూఱగా గ్రోలుటయే సహృదయుల కర్తవ్యమగునుగాని యుద్వేగకరములు, శుష్కములునగు వాదములకు దిగుట కానిపని.[1] నా యుద్దేశమున వైష్ణవదర్శన ప్రభావితుడయ్యును, భిన్నదేవతా వైముఖ్యములేని మహాత్ముఁడతడు. శుక్ల పండితులు ప్రయోగించిన 'స్మార్తవైష్ణవ' శబ్దమునకు గూడ నిదియే యర్థ మనుకొందును.

శ్రీరామచంద్రుని చరణారవిందములందాతని కనన్యమైన భక్తికలదు. అట్టి ఏకనిష్ఠమైన భక్తికాతడు చాతకమును ఆదర్శముగా గ్రహించెను. ఈ క్రిందికొన్ని పద్యముల ద్వారమున నీవిషయము తేటపడును.

"ఏక్ భరోసో, ఏకబల్, ఏక్ ఆస విస్వాస్
ఏక్ రామ్ ఘనస్యామ్ హిత, చాతకతులసీదాస్"

"ఆస, బలము తులసిదాసునకొక్కండె
చాతకమ్మతండు, సరసరామ

---

1. 'తులసీదర్శన' అనుగ్రంథములో డా. బలదేవప్రసాద్ మిశ్రగారు తులసిదాసు పైగలయద్వైత ప్రభావమును నిరూపించిరి. శ్రీవియోగిహరి ప్రభృతులాతనిని విశిష్టాద్వైతిగా తీర్మానించిరి. శ్రీరామచంద్రశుక్ల యాతనిని స్మార్తవైష్ణవునిగా వేరొక్కనిరి.

నీలనీరదమ్మునిలిచి గురియు, దృష
దీఱునంతకలక దేఱుమనము ”

“ ఉపలవరషి గరజత్, తరజిటారత్ కులిసకతోర్
చితవతి చాతక మేఘుతజి కబహుఁదూసరిఓర్ ”

కడుకఠోర భయదగర్జారవమ్మునఁ
గురియనిమ్మి మేఘుఁ గులిశవృష్టి
వానిఁగాదటంచు, బరునిపైవీక్షాప్ర
సారమెట్లొనర్చుఁజాతకమ్ము.

“ తులసీచాతక దేత్, సిఖసుతహి, బారహిబార్
తాత్ తర్ప న కీ జియే, వినావారిథరధార్ ”

చాతకమ్మి, సుతునిచేతమ్మిహత్తగా
శిక్షనొసఁగు నిటుచేరఁ దీసి
జలధరమ్మి కురియుఁ జలముచేఁగాని
తర్పణమ్మినిడకు ! దండ్రి నాకు.

(హిందీసాహిత్యము పు. 164–165)

సాధారణముగాఁ బండితలోక మిూక్రింది శ్రీమద్భాగవతశ్లోకాంశమును భక్తియొక్క నవవిధానములను దెల్పుట కుదాహరించుచుండును.

‘శ్రవణంకీర్తనం విష్ణోః స్మరణమ్ పాదసేవనమ్
అర్చనం వందనం, దాస్యం సఖ్యమాత్మనివేదనమ్
ఇతిపుంసార్పితా విష్ణోభక్తిశ్చేన్నవలక్షణా ॥

పై శ్లోకమును మహాకవి పోతనయిట్లనువదించెను.

“ తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం
బనునీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్, హరిన్ నమ్మి, స
జ్జనుఁడైయుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైతోయ్యత్తమా ॥ ”

తెలుగునందలి యనువాదము క్రమము తప్పినదని వేఱుగా చెప్పనక్కఱ లేదు. అంతియే కాదు. 'ఆత్మనివేదనము' 'ఆత్మలో నెఱుకయు' నొకటి కాఁజాలవని నాయల్పబుద్ధికిఁ దోఁచును. మహాభక్తుడగు పోతనామాత్యుని మాహాత్మ్యమును శంకించుట నా తాత్పర్యము గాదు. భక్తి తొమ్మిది విధములు అనునొక పరంపరానుగతమగు వాదము కాలముఁబడి వచ్చుచున్నను విభిన్న కాలముల విభిన్న భక్తకవులు స్వీయానుభూతిని పురస్కరించుకొని తత్ప్రకమము నూహించి వ్యక్తపఱచిరి. ఇందధిక్షేపింపవలసిన దేదియులేదు. తులసీదాసుకూడ నిట్లే తన యనుభవమునకుఁ దోఁచినట్లు భక్తిమార్గముల నిర్దేశించెను.

प्रथमभगति संतन्हकरसंगा । दूसरिरतिमम कथाप्रसंगा
गुरुपदपंकजसेवा तीसरि भगतिअमान्
चौथिभगति ममगुनगन करइ कपटतजिगान्
मंत्रजापममदृढविश्वासा पंचम भज नसो वेदप्रकासा
छठदमसीलविरति बहुकरमा ! निरतनिरंतरसज्जनधरमा
सातवं सममोहिमय जग देखा मो तेंसंतअधिककरिलेखा
आठवं जथालाभसंतोषा । सपनेहुंनहिं देखइपर दोषा
नवम सरलसबसन् छलहीना ! ममभरोसहियहरषदीना
नवमहं एकउजिन्हा केहोयी ! नारिपुरुषसचराचरकोयी
सोयि अतिसयप्रियभामिनिमोरे सकलप्रकारभगतिदृढतोरे॥

1. సత్సంగతి 2. నాకథలయం దనురాగము 3. సద్గురూపాసనము 4. నిష్కపటముగ ననున్ను గీర్తించుట 5. దృఢవిశ్వాసముతో నామంత్రమును జపించుట 6. శమదమములతో సత్కర్మలనాచరించుట 7. నన్నిప్రపంచము నందంతటను జూచుట 8. పరుల నిందింపక యదృచ్ఛాలాభసంతుష్టి 9. సర్వ భూతములందును, సమదృష్టితో నిష్కపటిమై సర్వమును మదర్పణముసేయుట యను నీనవవిధ (భక్తిపద్ధతులలో) నే యొకభక్తిగలిగినవా రెవ్వరైనను నన్ననా యాసముగ బొందగలుగుదురు." (ఆంధ్రతులసీరామాయణము P. 245)

పై సందర్భము శబరీ ఘట్టములోనిది. శ్రీరాముఁడు తానుగా శబరి కుపదేశించిన భక్తిపద్ధతులు అధ్యాత్మరామాయణమునందుఁగూడఁ బై సంద ర్భమున నించుమించుగా నిట్లేకలదు.

"తస్మాద్భామిని సంక్షేపాద్వక్ష్యేహం భక్తిసాధనమ్।
సతాం సజ్గతిరేవాత్ర సాధనం ప్రథమం స్మృతమ్॥

ద్వితీయం మత్కథాలాప స్తృతీయంమద్గుణేరణమ్
వ్యాఖ్యాతృత్వం మద్వచసాం చతుర్థం సాధనం భవేత్॥

ఆచార్యోపాసనం భద్రేమద్బుద్ధ్యామాయయాసదా
పఞ్చమంపుణ్యశీలత్వం యమాదినియమాదిచ॥

నిష్ఠామత్పూజనేనిత్యం షష్ఠంసాధన మీరితమ్
మమమంత్రోపాసకత్వం సాంగం సప్తమముచ్యతే॥

మద్భక్తేష్వధికాపూజా సర్వభూతేషు మన్మతిః
బాహ్యేష్వ విరాగిత్వం శమాదిసహితం తథా॥

అష్టమం నవమం తత్త్వవిచారో మమభామిని।
ఏవం నవవిధా భక్తిః సాధనం యస్యకస్యవా॥

పై శ్లోకములయం దుదాహరింపఁబడిన నవవిధ భక్తి మార్గములు 1. సత్సాంగత్యము 2. భగవత్కథాలాపము 3. గుణకీర్తనము 4. భగ వద్వచోవ్యాఖ్యాతృత్వము 5. ఆచార్యోపాసనము 6. భగవత్పూజయందలి నిష్ఠ. 7. సాంగమంత్రోపాసనము 8. భగవద్భక్తులయం దాదరభావము, అన్ని భూతములయందు భగవద్భావము, బాహ్యపదార్థములయందు వైముఖ్యము. 9. భగవత్తత్వవిచారము.

తులసీదాసు దాదాపు 'అధ్యాత్మరామాయణకర్త'ను అనుసరించియు, భక్తిమార్గనిర్దేశమునఁ గొంతస్వాతంత్ర్యముఁగూడఁ జూపకపోలేదు. 1. యథా లాభ సంతుష్టి 2. సర్వమును భగవదర్పణముసేయుట యనునవి తులసీదాసు తానుగాఁ జేర్చిన విషయములు. వీనికితోడు సాధుజన సాంగత్యమునందాతనిక

గలశ్రద్ధ యింతింతనరానిది. తన రామాయణ రచనమునందు ఈభావములచేఁ బ్రేరితుఁడై యతఁడు గొన్నివిపర్యయములనుగూడ భక్తజన సమ్మతముగా గావించెను. 'యథాలాభ సంతుష్టి' యనునది యాతని జీవితమునకే యొక పరమధ్యేయముగా, నాతనియుపదేశములకొక పునాదిరాయిగాఁ గానవచ్చును.

'వ్యాప్తింజెందక వగవక
ప్రాప్తంబగు లేశమైనఁ బరమంబనుచున్
దృప్తింజెందని మనుజుఁడు
సప్తద్వీపములనైనఁ జక్కంబడునే'

యను శ్రీమద్భాగవతోక్తమగు భావమాతని మనమునకు వచ్చెనని నుడువ వచ్చును.

'కబ్ హూఁక్ హూఁ యహి రహని రహూఁగో
శ్రీరఘునాథ కృపాలు కృపా తేఁ సంతసుభావ్ గహూఁగో
జథాలాభ సంతోషసదా, కాహూసోక ఛునచహూఁగో'

(వినయపత్రిక)

* * *

'నేనెన్నఁడైన నిట్టి జీవితమును బడయుదునా? కృపాళువైన శ్రీరఘు నాథుని కృపచే సాధుస్వభావము గ్రహింతునా? యథాలాభ సంతుష్టినంది యెవని నుండియు నేమియు యాచింపకుందునా?

అధ్యాత్మరామాయణమునందు పేర్కొనఁబడిన 'భగవత్తత్త్వ విచార మును' వీడి 'భగవదర్పణము' నకు, ప్రాధాన్యమిచ్చెను. ఇయ్యది విశిష్టా ద్వైతమునకు సన్నిహిత తరమని వేఱు చెప్పనక్కఱలేదు. ముఖ్యముగా గమ నింపవలసిన విషయము వేఱొక్కటికలదు. తులసిదాసు ననుసరించి యీ తొమ్మిది పద్ధతులలో, నేయొక్కపద్ధతి నాశ్రయించి యాచరించినను భక్తుడు గమ్యస్థానమును జేరునట. మహా భక్తుడగు తులసీదాసు నవవిధభక్తి మార్గములను జక్కగా నాశ్రయించి కృతకృత్యుడయ్యెనని నుడువుట పున రుక్తియేకదా!

శ్రీరామ చంద్ర చరణారవిందముల యందాతనికిఁగల యనన్యభక్తికి నిదర్శనముగా నొక యైతిహ్యము కలదు. కృష్ణభక్తుడైన నందదాసునితోఁ గలిసి యాతడొక తూరి గోపాలమందిరమునకేఁగెనట. కాని యాతడు స్వామిని దర్శించియు, తన కరకమలముల ముకుళింపలేదు! నతశిరస్కుఁడు కాలేదు! మీదు మిక్కిలి యీ పద్యమును వినిపించెనట!

కహా కహూఁ ఛవిఆజ్‌కీ, భలే బనేహౌనాథ్ ।
తులసీ మస్తక్ తబ్ నవై, ధనుష్‌బాణలోహాథ్ ॥

"నేటి నీరూపసౌందర్యమునేమని వర్ణింతును. ఓ స్వామి! నీయది దివ్యమంగళవిగ్రహము! అయినను తులసీదాసు మాత్రము నీవు ధనుర్బాణములు పూనినపుడే (మురళీవీడి) తలయొగ్గి నమస్కరించును." భక్తుని విన్నపమాలించి స్వామి యట్లే యనుగ్రహించెననియుఁ బిమ్మటఁ దులసీదాసు నమస్కారముఁ జెల్లించెననియు నందురు! ఈకథ యందలి సత్యాసత్యము లెట్లున్నను, తులసీదాసుని యచంచలము, ననన్యము నగు శ్రీరామభక్తిని మాత్రము లెస్సగాఁ బ్రతిపాదింప సమర్థమై యున్నది.

తులసీరామాయణమునందలి కొన్ని విపర్యయములు

తులసీదాసు తన బృహద్రచనమగు రామాయణమున తాఁజేయదలచి కొనిన విపర్యయములను సూచించుటకుఁ గూడ ప్రసిద్ధమగు నీ శ్లోకమును రచించె ననవచ్చును.

" నానాపురాణనిగమాగమ సమ్మతంయత్
రామాయణే నిగదితం క్వచి దన్యతోఽపి
స్వాంతఃసుఖాయ రఘునాథగాథా
భాషానిబంధ మతిమంజులమాతనోతి "

ముఖ్యముగా నతడు 1. అధ్యాత్మరామాయణము 2. వాల్మీకి రామాయణము 3. హనుమన్నాటకము 4. శ్రీమద్భాగవతము అను సంస్కృతమహా

గ్రంథములనుండి సహాయమునందెను. అటనట తన ప్రవృత్తి కనుకూలములగు మార్పులనుగూడ స్వోపజ్ఞికముగా వెలయించెను. కావున నాతడే వచించినట్లు తులసీరామాయణ మేయొక్కగ్రంథమునకు, యథాతథాత్మకమగుననువాదము కాక సకలపురాణ నిగమాగమ సమ్మతమై, యాయాయితావుల గానవచ్చు శ్రీమద్రామా యణకథా ప్రపంచమునందలి విశిష్టవిషయములకాకరమై, స్వీయ కల్పనోద్భావనా చమత్కృతమై సొంపులుమీరుచున్నది. తులసీదాసు తన గ్రంథమునకిడిన నామధేయము "శ్రీరామచరితమానసము" బాలాదికాండ ములకు 'సోపానము' లనిపేరు. కైలాసపర్వతమందలి మానససరోవరమునకు తులసీదాసు 'తీర్థయాత్రాచణశీలియై' వెళ్లెనట! దుర్గమమార్గమును తరించినగాని 'మానసము' ను జేరుటకు వీలుపడదు. భగవత్కృపాపాత్రులుగాని యటజేర నొల్లరట! మానవదర్శనముచే దివ్యానుభవమునుబొందిన తులసీదాసు తా రచియింపబూనినకావ్యమునకు రామచరితమానసమని పేరిడుట యౌచితీశోభితమై యున్నది. తదవగాహన సౌఖ్యమునకు సప్తసోపానములు నిర్మింపఁబడినవి. ఈవిధముగా రూపకాలంకారవ్యాజమున శ్రీతులసీదాసు కైలాసపర్వతమందలి మానససరోవరమునే వర్ణించెనని విమర్శకు లందురు. (చూ. ఆం. తు. రామాయణము పు. 17–20) సాధుసాంగత్యమనిన తులసీదాసునకుఁ గడుప్రీతియని ముందే చెప్పియుంటిని. తదనుగుణముగా ప్రథమ సోపాన ప్రారంభముననే తులసిదాసు సాధుజన మాహాత్మ్యమును కీర్తించుట గాంచకలరు. (చూ. ఆం. తు. రా. పు. 4–6) సాధుసమాగమాభిలాష మాతనియందు మెండు. ఈయభిలాషము మానసమున కొన్నివిపర్యయములు కల్పించినది. ఉదాహరణమున కొకటి. లంకాప్రవేశమొనరించి హనుమంతుడు సీతాగవేషణతత్పరుడై తిరుగాడుచుండును. నిద్రాపరవశమగు స్త్రీసమూహమునుజూచి సీతనటగానక మఱియొక భవనమును జూచెను. అందొకభగవన్మందిరమును, దానిముంగిట తులసీవనమునుజూచి సంతసించుచు దుష్టరాక్షసమయమగు నీలంకలో నిట్టి భగవన్మందిరమెట్లున్నదాయని తలంచుచుండునంతలో విభీషణుఁడు మేల్గాంచి భగవత్స్మరణమును జేయఁగా విని యాతనిభక్తికి హనుమ విస్మయమందుచు, సజ్జనసహవాసమువలన కార్యహాని కలుగదనితలంచి, అతనికి తనరాకనెఱిగింపనెంచి, విప్రరూపమున నాతని

సమీపించెను. అంత విభీషణుడా విప్రపుంగవునిజూచి నమస్కరించి కుశల మడిగి స్వామీ ! మీరు హరిదాసులవలె నున్నారు. మీయందు నాకపరిమిత మగు ప్రేమకలుగుచున్నది. నీవా దీనదయాళుడగు రామచంద్రుడవుకావుగద. అట్లైన నాభాగ్యమేమనవలయును ? అని విని హనుమంతుడు తనపేరునుజెప్పి తానువచ్చినపని వినిపించెను. అంతవారిరువురును రామకథాప్రసంగముచే పుల కితగాత్రులైరి. పిమ్మట విభీషణుడు రామునిస్మరించి, హనుమా ! యీరాక్ష సులనడుమ దంతముల నడుమ నాలుకవలె నే నుంటిని. ఇట్టి నన్ను రామచం ద్రుడు కటాక్షించకపోవునా ? తామసుడగు నాకు రామభక్తి దుర్లభము. అయినను నాయందు రామున కనుగ్రహము కలదనియే నానమ్మకము. లేనిచో నాకు నీదర్శనభాగ్యమెట్లు లభించును ? అను నావిభీషణునితో హనుమ యిట్ల నియె. విభీషణా ! రఘునాథుఁ డెప్పుడును సేవకులను ప్రేమించును. నన్ను జూడుము. నే నకులీనుఁడను. చపలుడను. వానరుడను. ఇట్లన్ని విధముల హీను డనగు నాయందతనికిగల యనుగ్రహము వర్ణనాతీతము. అనుచు రామచం ద్రుని గుణగణంబుల నుగ్గడించుచు నానందబాష్పములొలుక బులకిత గాత్రు డగు నాహనుమనుజూచి విభీషణుడు విస్మయమందుచు నిట్టి రామభక్తులెందును లేరని సంతసించుచు సీతావృత్తాంతమునంతను వివరించెను" (ఆం. తు. రా. పు. 269). పై ఘట్టమునుబట్టి తులసీదాసుని మనఃపథమున సాధుసమాగమ సాంగత్యసేవలకెట్టి ప్రాధాన్య మీయఁబడినది యూహింపవచ్చును. హను మంతుఁడు మహోక్తుఁడగు సాధువు. విభీషణుఁడట్టిడ. హనుమంతుడు లంకకు వచ్చియు విభీషణుని దర్శింపకుండుట, లేక విభీషణునికి హనుమంతునితోడి సమావేశము చాలదూరమునగాని కల్గింపకుండుట తులసిదాసోర్వలేకపోయెను. ఇరువురు సాధుహృదయుల యెడబాటు సహింపలేక యీసన్నివేశమును కల్పిం చెను. ఇయ్యది అధ్యాత్మమునఁగాని వాల్మీకమునఁగాని లేదు. అయినను తులసీదాసుని మనోభావముల కనుకూలమైన సన్నివేశము.

ఉత్తరకాండమంతయు నొక్కపెద్ద విపర్యయమే (deviation) కదా ! "సాధారణముగా శ్రీరామపట్టాభిషేకము యుద్ధకాండమునందే వర్ణింపఁ బడును. తులసీదాసు పట్టాభిషేకవర్ణనము 'ఉత్తరకాండమునందు గావించెను. ఇందు సీతా నిర్వాసకథ లేనేలేదు. కుశలవులయోధ్యయందే జన్మించిరి. ఈ

విధముగా కథను తారుమారుచేయుటలో తులసిదాసు మహత్తరమైన ప్రయో జనమేదేని యూహించియుండును. ఉత్తరరామాయణకథ, తులసిదాసునకు దెలియదనుట చొప్పడదుకదా! మహాభక్తుడైన తులసిదాసు హృదయ మున లోకమునెడుట శక్తిశీలసౌందర్యముల కధిష్ఠాన దైవతముగఁ దాను నెలకొల్పఁదలఁచిన శ్రీరామచంద్రుని 'ఉత్తరకాండ' కథ నచ్చియుండకపోవ చ్చును. తిరిగి సీతానిర్వాసము సమర్థనీయముగఁ గనఁబడకపోవచ్చును. జన సామాన్యమునందు సగుణభక్తికిఁ బ్రాధాన్యము నెలకొల్పవలెననిన, రామ భక్తిని ప్రచారముగావింపవలెననిన, లోకులదృష్టి నకలంకముగ నశంకితముగ, శ్రీరామచంద్రునిపై మరల్పవలె ననిన నీకథ విడిచిపుచ్చుట మేలని భావించి యుండును. లేక తన 'స్వాంతస్సుఖమున కీకథ బాధకలిగించెనేమో! ఇది కేవలము నాయూహము. ఇందలి యూచిత్యా నౌచిత్యములు విపశ్చిద్వ రేణ్యులు తర్కింతురుగాక!"[1]

స్త్రీలయెడ తులసీదాసు సమాదరణ బుద్ధికలవాడు. తత్ఫలితముగాఁ గూడ కొన్నిమార్పులాతని రామాయణమున వచ్చినవి. ఒండు రెండిట నుదా హరింతును. కైకేయీ వృత్తమును గాంచుఁడు, ఈఘట్టమునందు తులసీ దాసు అధ్యాత్మరామాయణమును పూర్తిగా ననుసరించెను. 'అధ్యాత్మమును బరికింపుడు.

"ఏతస్మిన్నంతరే దేవా దేవీం వాణీమచోదయన్
గచ్ఛదేవి భువోలోక మయోధ్యాయాం ప్రయత్నతః
రామాభిషేక విఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః
మంథరాం ప్రవిశస్వాదౌ కైకేయీంచ తతఃపరమ్
తత్రోవిఘ్నే సముత్పన్నే పునరేహిదివం శుభే"

"దేవతలు సరస్వతీదేవిని ప్రేరేపించిరి. ఓ దేవీ! యత్నపూర్వక ముగా నీవు భూలోకమునందలి అయోధ్యకు వెడలుము. రామాభిషేకమును బహ్మవాక్యాను సారము విఘ్ను మొనరింపుము. మొదట మంథర నావేశించి

---

1. శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారిచే ననూదిత మైన ఆంధ్రతులసీరామా యణము - ఉత్తరకాండమునందలి నా పీఠికనుండి పై యంశము గ్రహింపఁబడినది.

పిమ్మట కైకేయియందు బ్రవేశింపుము. విఘ్నమును కల్పించి తిరిగి స్వర్గమునకు రమ్ము" అధ్యాత్మమున సరస్వతి కిమ్మనకుండ, సరియని దేవతల యిష్టానుసారము వెంటనే యయోధ్యకేగి మంథరయందు బ్రవేశించివైచును.

'తథేత్యుక్త్వా తథా చక్రే ప్రవివేశాథమంథరామ్' తులసిదాసు అధ్యాత్మముననుసరించియు సరస్వతిచే గొంత వితర్కింపఁజేయును. అంత దేవతలాసందర్భమును గ్రహించి సరస్వతియొద్దకేగి ఇట్లనిరి. అమ్మా! రామచంద్రునికి బట్టాభిషేకమట. అట్లయిన రామునికి వనవాసము రాక్షస సంహారము ఎట్లు జరుగును? మా ఇక్కట్టులెట్లు తొలగును? కాన నీవు రామునికి బట్టాభిషేకమునుమాన్చి వనవాసమున కేగునట్లనుగ్రహింపవలయు నన విని భారతి యేమో యాలోచింపు చుండెను. రామచంద్రుని పట్టాభిషేకమునకు విఘ్నమును గల్పించుట ఏమిన్యాయము! దేవతలు స్వార్థపరులై యిట్లనుచున్నారు. వీరిబుద్ధి యెంతనీచము? అనుకొనుచు మఱలనిట్లు దల పోయసాగెను. ఖేదమోద రహితుడు, నిత్యపరిపూర్ణుడునగు రామచంద్రున కరణ్యవాసము, రాజ్యాభిషేకమును సమానములు. మరియు నాతడు దుష్ట నిగ్రహమునకును, శిష్టపరిపాలనమునకు నవతరించియుండెను. కాన భవితవ్య మిట్టిది. ఇందు నాకేమియు దోషములేదని నిశ్చయించి, చంద్రిక కమల వనమునందునలె తానయోధ్యలోఁ బ్రవేశించెను"[1] (చూ. పు. 146-147). ఇందలి సరస్వతీదేవి తలఁపులు, తులసీదాసుని మనసునందా సమయమున నుద్బుద్ధములైన భావములకుఁ బ్రతిధ్వనులే! ఈ ప్రకారము కైకేయీ మంథరల శీలము నాతడు పోషించిన వాఁడయ్యెను. వాస్తవమునకు శ్రీమద్రామాయణమునఁ గైకేయీ వృత్తము మిగుల విచిత్రమైనది, ఆయాయి కవులు తమతమ ప్రతిభాబలమున కనుకూలములగు మార్పులతో నీఘట్టమును జిత్రించుచుందురు. కైకేయీ శిరమునుండి కలంకభారమును దగ్గింప, బ్రయత్నింతురు. వాల్మీకమునందలి యీపాత్రము మనోవిజ్ఞానము మీదనే యాధారపడి యున్నది. నేటి తెలుగు కవులలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు మనోవైజ్ఞానికమగు దృష్టితో (Psychologically) కైకేయీ వృత్తమును జక్కగాఁ బోషించియున్నారు.

---

1. గ్రంథవిస్తర భీతిచే మూలమునందలి పంక్తులుదాహరింపఁ బడలేదు.

స్త్రీలయెడఁ దనకుగల గౌరవమర్యాదలఁ బురస్కరించుకొనియే తులసీదాసు రావణాంతఃపుర స్త్రీవర్ణనము జాఱవిడిచెను. కేవలము ఒకటిరెండు వాక్యములతో విషయము తేలఁగొట్టెను.

గయ ఉ దసాననమందిర్ మాహీఁ, అతివిచిత్రకహిజాత్ సో నాహీఁ
సయనకియేఁ దేఖాకపి తేహీ మందిర్ మహుఁ నదీఖి వై దేహీ॥

"దశాననుని మందిరములోనికి వెళ్ళెను. అది అతివిచిత్రమై వర్ణనాతీతమై యుండెను. నిద్రించుచున్న రావణుని హనుమంతుడు చూచెను. మందిరమునందు సీత కనఁబడలేదు." ఇంతమాత్రమే రచించెను. పై వాక్యములు స్థూలముగా దోచు నర్థముఁ దెలియఁ జేయును. 'అతివిచిత్రకహిజాత్ సోనాహీ' అనుటలో నచ్చటి విషయమునంతటిని ధ్వనింపఁజేసెను. 'కహిజాత్ సోనాహీ' అనగాఁ జెప్పుటకు వీలుకానిది (వర్ణనాతీతమని యొక యర్థము. తనకు జెప్పుటకు నిష్టముకానిది అని రెండవయర్థము) అనగా తన సంకోచస్వభావము అచ్చటి విచిత్రవిషయము లన్నిటిని జెప్పనివ్వదని తాత్పర్యము. ఈపట్టున వాల్మీకి మహర్షి అనేక శ్లోకములు రచించెను. ఉదాహరణమునకు.

ఊరుపార్శ్వకటీ పృష్ఠమన్యోన్యస్యసమాశ్రితాః
పరస్పర నివిష్టాంగ్యో మదస్నేహవశానుగాః
అన్యోన్యస్యాంగసంస్పర్శాత్ప్రీయమాణాస్సుమధ్యమాః
ఏకీకృతభుజాస్సర్వాస్సుషుపుస్తత్ర యోషితః।

(సుందరకాండే నవమస్సర్గః)

స్త్రీలయందలి మర్యాదాభావముచేతనే మఱికొన్ని సూక్ష్మములైన మార్పులనుగూడఁ దులసీదాసు గావించెను. ఉదాహరణమునకుఁ గాకాసుర వృత్తమును బరిశీలింపవచ్చును. వాల్మీకిరామాయణమున సుందరకాండాంతర్గత మగు ముప్పది యెనిమిదవ సర్గమందు సీతచే హనుమంతున కీ వృత్తాంతము వివరముగాఁ జెప్పఁబడెను.

"వాయసస్సహసాగమ్య విదదార స్తనాన్తరే
పునఃపునరధోత్పత్య విదదార స మాం భృశమ్"

తులసీదాసు ఈకథను అధ్యాత్మరామాయణానుసారము కొంతమలచెను. అధ్యాత్మమున నీవృత్తాంతము సుందరకాండ యందలి తృతీయసర్గమున నతి సంక్షేపముగ వర్ణింపబడెను. అందు కాకము వక్షస్థలమును జీలినట్లు కాక చరణాంగుష్ఠమును జంచువుతో నామిషబుద్ధిఁ బొడిచినట్లున్నది.

ఐంద్రః కాక స్తదాగత్య నఖై స్తుండేనచాసకృత్
మత్వాదాంగుష్ఠమార క్తం విదదారామిషాశయా॥

తులసీదాసు తన రామాయణమునగూడఁ జరణమును చంచువుతోఁ విదారించినట్లు వర్ణించెను. కాని యాతడీ వృత్తమును సుందరకాండమునందు నిబంధింపక యరణ్యకాండారంభమున వర్ణించెను. (చూ. పు. 224-25) అట్లు కథాసన్నివేశమును మార్చుటలో తులసీదాసు పరమప్రయోజన మూహించె ననవచ్చును. దంపతుల యనురాగకథను హనుమంతునితో సీత తానుగా వచించుట తులసీదాసున కిష్టముకాలేదు. ఆతనికి స్తనవిదారమొనర్చెననుట కంటె రక్తపల్లవమును బోలిన సీత చరణాంగుష్ఠమును ఆమిషబుద్ధిచే వాయ సము బొడిచెననుటలో నౌచిత్యమెక్కువగా భాసించెను. ఈవృత్తము తిరిగి హనుమంతునితో చెప్పకయే సుందరకాండమున హనుమంతుఁడు సీతనుండి సెలవుగైకొను సందర్భములో నిట్లు వ్రాసెను.

'తాత సక్రసుత కథాసునాఎహు!
భాన ప్రతాపప్రభుహి సముఝాఎహు!

'నాయనా! జయంతునికథ (కాకాసుర వృత్తాంతము) జ్ఞప్తి కెల యింపుము. "ఇచ్చట 'సునాఎహు' అనిన కథవినిపింపు మనికాదు. కారణము హనుమంతున కీకథ సీతచెప్పియుండలేదు. కావున స్మరణకుఁదెమ్మని మాత్రమే యామె వేడినది. ఆమాత్రము చాలును. దంపతుల కథలు పూసగ్రుచ్చినట్లుగా మూడవవాఁడు చెప్పవలసిన పనిలేదు. అనుభూతపూర్వములగు విషయములు నామస్మరణమాత్రమునఁనే బుద్ధియందు జాగృతములై పునర్నవీకృతములగును. మర్యాదాభిశోభితమైన తన శీలమునకు సీత శీలమునకు ననుకూలముగ తులసీ దాసు ఈవృత్తమిట్లు నిర్వహించెను. ఇది యెంతయు రమణీయము!

యుద్ధకాండము (లంకాకాండము) నందలి సులోచన చరిత్రము గూడ స్త్రీలయెడ నాతనికి గల గౌరవభావమే వ్యక్తపఱచును. సులోచన మేఘనాదుని (ఇంద్రజిత్తు) భార్య. పతిమరణానంతరము మహాపతివ్రతకావున నాయమ యాతనితో సహగమించును. సహగమించుటకు శత్రుమధ్యమునఁ బడియున్న తనభర్తశిరఃకాయములనుదెచ్చి కొనవలయును. ఆమె తన పాతివ్రత్యమహిమను జూపి తెచ్చికొనును. పిమ్మట సహగమించును. ఈ యుదంతము వాల్మీకమునగాని యధ్యాత్మమునఁగాని పొడకట్టను. తెలుగు సాహిత్యము నందలి రంగనాథ రామాయణమునం దీ వృత్తాంతము కలదు. తులసీ రామాయణము నందలి సులోచనా చరిత్రమునకు రంగనాథ రామాయణము నందలి యుదంతమునకు సన్నిహితమైన సంబంధము కలదు. ఒక్కటిమాత్రము నిశ్చయము. గోనబుద్ధారెడ్డియనుడు, రంగనాథుడనుఁడు. తులసిదాసుకంటె ప్రాచీనులుగనే భావింపఁబడుచున్నారు. కనుక తెలుగు సాహిత్యమునందీకథ తులసీరామాయణమునుఁబట్టి రాలేదనుట స్పష్టము. ఇఁక తెలుగునుండి హిందీలోనికి వ్యాపించినదేమో జాగరూకతతోఁ బరిశీలింప వలసియున్నది. (చూ. పు. 320-328) ఈ విధముగా రాక్షసుని భార్యయగు సులోచన యొక్క సౌశీల్యమును జిత్రించి తులసిదాసు తన యుదారమనఃప్రవృత్తికి, స్త్రీలయెడ తనకుఁగల యత్యాదర భావమునకు, వేఱొక యుజ్జ్వలోదాహరణము నిచ్చిన వాఁడయ్యెను. [1] విభీషణ శరణాగతి మొదలగు కొన్ని విషయములను తులసీదాసు సుందరకాండమునందే వర్ణించెను. ఇదికూడ విపర్యయమే. దీనికిఁగారణము నిట్లూహింపవచ్చును. తులసీదాసు 'యుద్ధకాండము' అని పేరిడక 'లంకాకాండము' అని పేరిడెను. కావున లంక కావలఁ జరిగిన విషయములకు లంకాకాండమునఁ జోటిచ్చుటెట్లు పొసఁగును? ఆతఁడు తనమనఃప్రవృత్తి కనుకూలముగనే విషయమెట్లుమార్చెనో దిఙ్మాత్రముగా సూచించియున్నాను. అన్ని విషయములను చర్చించుట కిది సమయముకాదు. స్థలమును జాలదు.

---

1. తులసీదాసు 'నారీనింద' చేసెనను నొక యపప్రథగలదు. సముద్రుడాడిన యీ పల్కులే యందుల కాధారము. 'ఢోల్ గవార్ శూద్రపసునారీ। సకల్ తాడన అధికారీ। కాని సద్విమర్శకుల దృష్టిలో నీ యపప్రథనిలువలేదు. నిలువఁజాలదు.

తులసీదాసుని రచనా యోజనమున (Plan) రామభక్తితత్వనిరూపణమునకుఁ బ్రథమస్థానము. కథాప్రస్తారమునకు ద్వితీయస్థానము. మొదటి యుద్దేశము నెఱవేరుట కాతఁడధ్యాత్మము నెక్కువ యనుగమించెను. రెండవదానికి వాల్మీకము నెక్కువగా ననుసరించెను. కథాప్రస్తారమున నాతఁడు సుకుమార సన్నివేశముల గమనించి తదనుకూలమగు రచనా విన్యాస మెనర్పక పోలేదు. మిథిలానగరము ప్రవేశించి విశ్వామిత్రుని యాజ్ఞఁబడసి పూజాపుష్పములను గోసిదెచ్చుటకై రామలక్ష్మణులు ఉద్యానమున కేగెదరు. ఆసమయమునసే సీతయు గౌరీపూజార్థమట కేగుదెంచును. ఇచ్చటనే సీతారాములకు పూర్వరాగ ముదయించును. ఈ సందర్భమున తులసీదాసు చక్కగా సీతారాముల మనఃప్రవృత్తులను జిత్రించెను. అనువాదమున నాంధ్రీకర్త్రియు మల్లెపూవాసనలఁ జిమ్మినది.

"సీత కంకణకింకిణీనూపుర ధ్వనులెసగ గజగామినియై వచ్చుచుండెను. ఆధ్వనులను విని రాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. సోదరా! కందర్పజైత్ర యాత్రారంభమున విజృంభించెడి విజయదుందుభి ధ్వనివలె శ్రోత్రపేయమగు నాధ్వనిని వింటివా! యనుచు నీశబ్ద మెటనుండి వచ్చుచున్నదోయని నలుదిక్కుల దిలకింపుచు సీతాముఖ చంద్రకాంతిని, తననేత్ర చకోరములచే బానముచేయుచు నాముఖకాంతిచే మిరిమిట్లు గొలుపు కన్నుల మూయుచు, విప్పుచు, నెట్టకేలకు ధైర్యమూని, లజ్జితుడై యానందపరవశుఁడై ఇట్లు తలపోయసాగెను.....సీతయు రాకుమారులెటనుండిరా! యని నలుదెసల, దెల్లకలువకేకుల జిమ్మునైవడి తన చూడ్కులనిగిడించి చూడసాగెను. అంతలో పొదలచాటుననున్న రాకుమారులజూచి, నిధినికోరిన నిరుపేదనైవడి యానందాశ్రుపూరిత నేత్రయై, పులకితగాత్రయై, నిర్నిమేషముగ జూచుచు, శరచ్చంద్రునిగాంచు చకోరమువలె పరవశయై, తననేర్పుచే రాముని, నేత్ర మార్గమున హృదయపీఠమున జేర్చి, కనురెప్పలచే నా మార్గమును మూసి, బ్రహ్మానందము నందుచున్న సీతనుజూచి, సఖులేమియు బలుకక సంతసించుచుండిరి. ఆసమయమున మేఘముక్తశశాంకునివలె సోదరు లిరువురు పొదలచాటునుండి బయటకు వచ్చిరి. రాముడు నీలమేఘశ్యాముడు. లక్ష్మణుడు శంపానిభచ్ఛవి. వారి ముంగురులు పరిమళపుష్పాలంకృతములు. శ్రమ

సలిలబిందు విలులితములగు తిలకములు వారిమోముల కెంతేని సొబగునొసగు చున్నవి....." (చూ. పు. 102-104)

కావ్యకళ కనుకూలమైన యీ ప్రసంగమును తులసీదాసు చక్కగాఁ బ్రవేశ బెట్టినాఁడు. దీనిని హనుమన్నాటకముననుసరించి వ్రాసెనని విమర్శకుల తలంపు. పూర్వరాగము పరస్పరదర్శన గుణశ్రవణాదులచే కలుగుననికదా యాలంకారికులమతము. ఇచ్చట దర్శనముచే కలిగినది. నైషధాదులయందు గుణశ్రవణముచే కలిగినది.

మహాకవియైనవాఁడు తనరచనములందచ్చటచ్చట తొంగిచూచుచుం డుట కావ్యానుభవరసికులకు తెలియని విషయముకాదు. సందర్భముఁజూచి తనయభినివేశమ·ను జాటుకొనును. తనయభిరుచులను వ్యక్తపఱచును. తన మనోభావములను సమ్యక్ప్రసారముగావించును. శ్రీవిశ్వనాథ సత్యనారాయణ గారు కొండొకచోఁ, గృష్ణభక్తిపారవశ్యమున

'స్త్రీవోలెసిగ్గువొందెదననేను' అని వ్రాసినారు. ఇది యత్యంతము అనుభూతమైన భావమని చెప్పనక్కఱలేదు. మహాభక్తుడైన శ్రీతులసిదాసు ప్రతియొకభక్తునియందు లీనమై తనభక్తిభావములను గుప్పించివైచెను. అంత టితో నాతనికిఁ దృప్తికలుగలేదు. సీతారామవనవాస సందర్భమున తానే యొక తాపసిరూపమున శ్రీసీతారామలక్ష్మణులకు ఆతిథ్యమిచ్చి గారవించి నట్లు భావించి యానందపరవశుఁడైనాఁడు. దీనిని హిందీవిమర్శకులు "తాపస ప్రసంగ" మందురు. ఇది యేరామాయణమునకు అనుకరణకాదు. తులసీ దాసు స్వీయచరిత్రమునకు సంబంధించిన, భక్తిప్రవణమైన సుకుమారసన్ని వేశము. ఆతాపసికిఁ బేరుపెట్టలేదు. భరద్వాజాశ్రమమువీడి సీతారామలక్ష్మ ణులు చనునప్పు డీప్రసంగము అనుసంధింపఁబడినది.

తేహిఅవసర ఏకతాపస ఆవా
తేజపుంజలఘు వయససుహావా
కవి అలఖిత గతవేషువిరాగీ
మనక్రమ వచనరామ అనురాగీ

" ఆసమయమున పుంజీభూత తేజస్కుడు, లఘువయస్కుఁడు విరాగి, వేషముకలవాఁడునగు తాపసివచ్చెను. అతడు మనోవాక్కాయకర్మలచే రామునియం దనురక్తుడు "[1] (హిందీసాహిత్యము Vol I పు. 149)

రామాయణము వ్రాయునప్పటికి తులసీదాసునకు దాదాపు నలువది వత్సరములు. అందుచే లఘువయస్కుడనుట యుక్తము.

భక్తి భావమును పుష్కలముగా వర్ణించు మఱియొక్క సన్నివేశము గురునికిఁ జెందినది. గురుడు తర్కవితర్కములులేని, యమాయికమైనభక్తి కలవాడు. అతఁడు పాషాణము పడతి యగుట వినియున్నాడు. ఎంతటి భక్తియు జీవికకడ్డురాఁగూడదుకదా ! అందుచే రామునే సూటిగా ప్రశ్నించినాఁడు.

" ప్రభూ ! ఆగుము. నీపాదముల గడిగెదను. నీపాదములందు రాళ్ళను, కట్టిలను మనుష్యులుగ జేయుశక్తిగల పరాగముండి యుండును. కాన నీపాద రజమువలన నా నావయు మానుషి యగునేని నావృత్తికి భంగము వాటిల్లునని నగుచు బలికిన, భక్తవరదుడగు రామచంద్రుడు నవ్వుచు నట్లేకానిమ్మని గురుడుతనపాదముల కడుగుటకు నమ్మతించెను " (చూ. పు. 170)

ఈసందర్భమునసే, ప్రఖ్యాతాంధ్రకవయిత్రియగు మొల్ల సంభాషణము లేకుండ, సదృశభావప్రేరితుఁడగు గురునిచే రామపాద ప్రక్షాళనము గావించెను.

" సుడిగొని రాముపాదములుసోకిన ధూళివహించి రాయి యే
ర్పడ నొకకాంత యయ్యెనట ! పన్నుగనీతని పాదరేణువి
య్యెడవడి నోడసోకనిది యేమగునోయని సంశయాత్ముఁడై
కడిగె గురుండు రాముపదకంజయుగంబు భయంబు పెంపునన్ "

ఇట్టి సుకుమార సన్నివేశములు రామచరితమానసము నందనేకములు జూపవచ్చును.

---

1. ఈతాపసప్రసంగము సీయాంధ్రీకర్త్రి యొలవదలెనో తెలియరాదు.(చూ. పు. 172)

సామాజిక దృష్టితో నతఁడు వర్ణవ్యవస్థను బాటించెనను భక్తిక్షేత్రమున జాతిమతభేదములు పాటించలేదని చెప్పవచ్చును. అందులకనేక నిదర్శనములు 'రామచరిత మానసము' నందే కలవు. ఉదాహరణమున కొకటి.

"ఇట్లు పరస్పరాలింగితులగు గుహభరతులపై పూలవానను గురియించు దేవతలిట్లనుచుండిరి. భగవద్భక్తుల కెందును జాతిభేదము గాని నీచోత్తమ భావముగానిలేదు. గంగా ప్రవాహము తనతో గలిసిన ముతికినీటిని వేఱు చేయక దనలో గలిపికొని పవిత్రింపఁ జేసినట్లు భగవద్భక్తి ఏజాతివానినైన నుత్తముని జేయును. భగవద్భక్తిలేని యుత్తమజాతి సంభవునికన్నను, భగవద్భక్తుడగు నధమ జాతివాడె ఘనుఁడు, వంద్యుడుననువారి సల్లాపమును విని యచటివారు మిగుల సంతసింపుచుండిరి" (చూ.పు. 193) శివకేశవ భేదమును గూడ తులసిదాసు సహింపలేదు. దానికి గూడ ననేకోదాహరణము లాతని రచనమునందుఁ గనఁబడును. శ్రీరాముడు సముద్ర తరణసందర్భమున రామలింగేశ్వర ప్రతిష్ఠఁజేసి స్పష్టముగా నిట్లు వాక్రుచ్చెను.

"నాకును శివునకును భేదమేమియునులేదు. శివభక్తులై నన్ను ద్వేషించినను, నా భక్తులై శివుని ద్వేషించినను వారికి నిరయము తప్పదు. ఈ లింగమునాచేఁ బ్రతిష్ఠితముగాన దీనిని రామేశ్వరుడనియు, రామలింగేశ్వరుడనియు వ్యవహరింతురు. దీనిని దర్శించినవారు నా కృపాపాత్రులగుదురు." (చూ. ప. 292) ఈ విధముగా శివకేశవభేదము, నితర విధములగు భేదభావములను బాటింపని చక్కని రామభక్తి సుధాప్రవాహమును తులసీదాసు ఆర్యావర్తమునఁ బ్రవహింపఁజేసెను. ఈమహాప్రవాహమున సామరస్యము ననుభవించియే కాఁబోలు. హిందీసాహిత్యక్షేత్రమున నాటికి, నేటికిఁ గూడ దక్షిణాపథము నందువలెకాక, యే యొక్క భక్తుడును శివుని సగుణరూపముగ నారాధించి కేవల శివభక్తి పరములగు గ్రంథముల వెలార్చిన వాడు కానరాడు!

విశ్వసాహితీవీథుల తులసీరామాయణమునకు నానాటికి ప్రచార ప్రాశస్త్యములు హెచ్చుచున్నవి. ఆంగ్లమునందు ననేకులు అనువదించియున్నారు. అత్యాధునికముగ ఎట్‌కిన్సను మహాశయుఁడు పద్యానువాదము గావించియున్నాడు. రష్యాభాషయందు వారాన్నికోవ్ అను

పండితుడు భాషాంతరీకరించి యున్నాడు. ఆతఁడు రష్యన్ దృక్పథముతో నొక బృహత్ప్రీతికగూడ రచించెను. రామాయణకథకు నేడు విపరీతమైన ప్రాచుర్యము లభించుచున్నది. వాల్మీకి ననుసరించి ఆంగ్లమునను, తమిళము ననుగూడ శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచార్యులు వారు రచించి యున్నారు. ఇట్టి సందర్భములో తెలుగునకూడ రామాయణ వాఙ్మయసృష్టి వివిధముగాఁ బ్రవర్తిల్లుటయం దాశ్చర్యము లేదు.

అనువాదపద్ధతి

మూలభూతమైన తులసీదాసు రామాయణమునకుఁ దొలుతొల్త హృదయనీరాజనమర్పించి తెలుగుసాహితీ మందిరమున స్వాగతోక్తి పచరించినవాఁడు శ్రీశిష్టు కృష్ణమూర్తికవి (చూ. పరిశోధనయందు వ్యాసము) ఇది తెలుగునకు తేఁగలిగినచో తెలుగులపంట, ముత్తెపు జిలుగులు గ్రుమ్మరించినట్లగును. పిమ్మట నాధునికులు వచనముగను, పద్యకృతులుగను అనువదించి ప్రకటించి యున్నారు. పద్యానువాదములందు శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారిచే బాలకాండము, ఉత్తరకాండము వెలుగుచూచినవి. శ్రీ కేశవతీర్థస్వామివారి బాలకాండము తెలుగుల కందినది. ఈరెండు రచనములు హృదయంగమములై యొప్పుచున్నవి. మొదటిది మార్గకవితానుసారి. రెండవది మంజరీద్విపద గా సంయతవచోని గుంఫితమై సొంపులు వోవుచున్నది. [1]

వచనానువాదముల యందు శ్రీ వావిళ్ళవారిచే ప్రచురింపబడినది, శ్రీ పసుమర్తి శ్రీనివాసరావుగారు రచించినది కలదు. ఇప్పుడు ఆంధ్రి యంఘ్రితలములందు నూత్నముగా సమర్పింపబడుచున్న యీవచనానువాదము రెండవది. ఏమైననేమి తెలుగువారి కిప్పుడు అయిదారు తులసీరామాయణములు కలవు. హిందీవారికికలది యొక్క తులసీరామాయణము మాత్రమే. ఇది యాంధ్రుల విశిష్టత. సత్కార్యమును పలువురు తాదాత్మ్యముతో.

---

1. ఇవిగాక శ్రీ భాగవతుల నృసింహశర్మగారిచే రచింపబడిన సంగ్రహ కావ్య మొండు కలదు. అయ్యది మూలానుసారి కాని స్వేచ్ఛానువాదము.

భావపౌష్కల్యముతో నొనరింతును. అట్లొనర్చినఁగాని వారికి తృప్తి లేదు. ఏయొకరో చేసిరికదా యని వాఁకారకుండ నొల్లరు. అందును రామకథకట్టి 'పునఃపాక' దోషము లేనేలేదు. "రాఘవేశ్వరు చారిత్రము నెవ్వరెన్ని విధముల్ వర్ణించినన్ గాలదే." ప్రస్తుతమీ వచనానువాదము నొనర్చి యాంధ్రుల కందించిన రచయిత్రి శ్రీ ఏలూరుపాటి లక్ష్మీసరస్వతమ్మగారు. సంపన్నకుటుంబమునకుఁ జెంది సత్కులీనయై, భక్తిసంస్కారము గలిగినయైదు వరాలు. తులసీరామయణానువాదముచే జన్మమును తరింపఁ జేసికొనిన సాధ్వీలలామ! ఈయమ యొనర్చిన యీయనువాదము ప్రసన్నగంగావాహిని వోలె పరువులిడుచున్నది. నిమ్మోన్నతములులేక సమతలమునందు జాలు వాఱుచున్నది. ఆబాలగోపాలము నిందు మునకలిడి రామభక్తి సుధా పానము జేయవచ్చును. కాఠిన్యమనునది యీ పొత్తమున నెచ్చటను గాన రాదు. శిరీషకుసుమపేశలమైన శయ్య. ప్రసాదగుణ భూయిష్టమగు రచ చనము. ఇందలి పొరలన్నియు తేనెపెరలు. ఏపెరను కొంచెము స్పృశించి నను మధుకుల్యలు పొరలివచ్చును. స్త్రీహృదయమున కనువైన నుడికారపు సొంపుతో రచించిన యీయాంధ్ర సోదరి లేఖిని కన్నులకద్దుకొనఁదగినది.

అనువాదమున స్తోత్ర సందర్భములందు మూలచ్ఛందములకూడ శ్రీ లక్ష్మీసరస్వతమ్మగా రందించియున్నారు. కొన్నిచోట్ల వాని ననువదించి మరికొన్నిచోట్ల అనువదింపకయు విడిచినారు. అ యీయు విశేషముల కీపె పాటించిన యౌచితీ భావనమే కారణము కాని యన్యముకాదు. ప్రసిద్ధము లగు నన్నిగ్రంథముల వలెనే రామచరిత మానసము కూడ ననేక ప్రక్షేప విక్షేపములకు గుఱియయ్యెను. ఉత్తరకాండమునకు తరువాతఁగొందఱు రామాశ్వమేధ – లవకుశ కాండము అనుపేరుతో గ్రంథము పూరించి ఉత్తర రామాయణవృత్తము నభివర్ణించియున్నారు. తులసీదాస రచితమైన 'ఉత్తర కాండము' నందు ఉత్తరరామాయణకథ లేకుండుట సర్వవిదితము. కాగా కథ పూర్తిచేయు తలంపుతో ఇది పూరించిన భక్తులు కలరు. శ్రీ లక్ష్మీసరస్వతమ్మ గారు ఆకథనుకూడ తమ యనువాదమున తెలుగువారి యభిరుచి కనుగుణ

ముగ మనకందించియున్నారు. ఇట్లొనరించుటలో దోసమేమియు గానరాదు రామాయణకథా జిజ్ఞాసువులకు పూర్తికథ యవగతమగును.

వీరి యనువాద మచ్చటచ్చట వృత్తగంధి లక్షణమున కతిసమీపముగ నడచినది. వృత్తగంధియందు పద్యపాద మిమిడియుండును. పద్యపాదములుగ లేకపోయినను అతి సన్నిహితముగా నడచి వచనమును Lyric Prose వలె నడిపించినది. ఉదాహరణమున కీక్రింద పంక్తులు కనుగొనుఁడు.

" తాటకనుమర్ది౦చి తపసిజన్నముగాచి, రాతినాతిగజేసిన రాకుమారుడు శివచాపమును మాత్రమేల ఎక్కుఁబెట్టజాలడు ! " (చూ.పు. 99) " తాటక మర్ది౦చి తపసిజన్నముగాచి రాతినాతిగ జేయురాఘవుండు " అనిన పద్యపాద మగును. మరియొక యుదాహరణము.

" సాంధ్యకృత్యములదీర్చి, సావిత్రిని జపించి సూర్యునకు నమస్కరించి ... మాతృదేవతకు నమస్కరించి యనుజులతో గలిసి భుజించును. (చూ.పు. 402) ' సాంధ్యకృత్యముదీర్చి, సావిత్రిజపియించి ' యనునది పద్యాంశమేగదా ! ప్రత్యూషపవనాంకురములు పైకొనువేళ ' వామనస్తుతిపరత్వమునలేచి ' అను మనుచరిత్రమునందలి పద్యము స్మరణకు రాకమానదు.

ఈమెగారికి ఆంజనేయస్వామి యందధిక భక్తియనెడు విషయము

' తరుణార్కబళనోద్ధతి జూపెనెవ్వాడు

రుచులచే ఫలమోహా రుచులచేత ' అను వసుచరిత్రము నందలి పద్యమును జొప్పించుటచే విదిత మగుచున్నది. (చూ.పు. 12) కొన్నిచోట్ల నీమె మూలమునకు మెఱుగులుకూడ పెట్టినది. ఒక్క యుదాహరణము చూపెదను. సీత హనుమంతుని బలము శంకింపగా నాతడామెకు మేరుపర్వతాకారుడై కని పించెను. ఆమెకు విశ్వాసము కుదిరెను. " అప్పుడు మఱల తన తొంటిరూపము . నూని తల్లీ ! శాఖామృగములమగు మాకు బుద్ధిబలవిశేషములులేవు. శివునాజ్ఞ యించిన సర్పము గరుడుని గుశలమడిగినట్లు నీ నాథుని ప్రభావముచే మేమెంత

పని నైనను జేయగలము." (చూ.పు. 273) ఇచ్చటమూలములో నీ పంక్తులు కలవు.

"సును మాతా సాఖామృగ నహిఁబల్ బుద్ధిబిసాల్
ప్రభుప్రతాప్—తేఁ గరుడహి ఖాఇ పరమలఘువ్యాల్"

మూలమున కర్థము:- తల్లీ వినుము, శాఖామృగములకు బుద్ధిబలము విశేషములు లేవు. శ్రీరామచంద్రుని ప్రతాపముచే గరుత్మంతుని కూడ నొక చిన్న సర్పము తినివేయును." ఇపుడు పాఠకులు ఆంధ్రీకర్త్రి యొనర్చిన మెఱుగును స్వయముగా నూహింపఁగలరు.

ప్రస్తుత మాంధ్రదేశమున ననేక వచన రామాయణములు కూడ వెలసినవి. వెలయుచున్నవి. నాకు వీని యన్నిట నచ్చినది 'దొడ్డ రామాయణము! దీనిరచయిత శ్రీ దొడ్డ వెంకటరామారెడ్డిగారు. ఆర్జవమగుశైలిలో ఉత్తమ రచనము నుదాత్తముగావెలార్చిన మహానీయులు. అనేక తెలుగు ప్రబంధముల నుండి సమయానుకూలముగ పద్యములఁ జొప్పించి తమ వచనమును శోభిల్లఁ జేసినారు. నాకు నచ్చిన రెండవరచనము ఈయమగారిది. స్త్రీ సహజమైన మధురపద విన్యాసముతో, సరళమగుశైలితో నుదాత్తతచెడకుండ స్త్రీ జనము నందు సంస్కృతిని ప్రబోధించునదిగ భాసించుచున్న యీ యనువాదము మిగుల నభినందనీయము. ఒకొక్కచో తెలుగునాటభక్తకవులు వెలయింపజేసిన వచనములు, విన్నపములవంటి రచనముకూడ నీ యనువాదమున లభ్యమగుచున్నది. వచనములందు సింహగిరి వచనములు, వేంకటేశ్వర వచనములు ప్రసిద్ధములుకదా! తత్సదృశమైన రచనమున నీమె కృతకృత్యురాలై తన భక్తి ప్రవణము, నత్యంత భావుకమునైన హృదయమును వ్యక్తపరచుచున్నది. ఒక్క యుదాహరణమును గైకొనుడు.

"రామచంద్రా! దయాసాంద్ర! అనుజసహితులగు మీయొక్కచరణ సరోజములకు నానమస్కృతులు. నేను త్రిశుద్ధిగ మీచరణానురక్తను. స్వామీ! నన్ను క్లేల వీడియుంటిరి. మీవియోగము ననుభవించుచు ప్రాణములధరించుటయే నాయపరాధము. ఏమి చేయుదును? ఈ నేత్రములనుండి వెలువడుచున్న యశ్రుధారా వృష్టిచే జల్లారకుండిన నీవిరహాగ్నిజ్వాలలు తూలతూల్య

మగునీ నా దేహమును క్షణములో భస్మముచేయకుండునా? కానిమ్ము! అని దీనవదనయై పలికెను". (చూ. పు. 279)

దోషజ్ఞులగువారికి పొత్తమున నటనటనెరసులు కనఁబడకపోవు. దోష ప్రదర్శనము నాపనికాదు. ఈబృహద్గ్రంథమునకు నన్ను బీఠిక వ్రాయ నాదేశించినపెద్దలు. సుప్రసిద్ధులు, పండితులునైన శ్రీ ఏలూరుపాటి రామభద్ర చయనులుగారు. వారి యాదేశమును గాదనజాలక యీభారమును వహించి తిని. వారికి నే కృతజ్ఞుడను. తెలుగు పాఠకులు తులసీదాసుని సాహితీ వ్యక్తిత్వమును కొంతకు గొంతగురుతింపగలిగినచో నా యీరచనము సార్థకము. పెద్దలిండలి గుణములను మాత్రమే గ్రహింతురుగాక! శ్రీరామ చంద్రుడు శ్రీమతి ఏలూరుపాటి లక్ష్మీసరస్వతమ్మగారి కితోధిక సాహితీ సేవావకాశము కలిగించి, సకలసౌభాగ్యములు చేకూర్చుఁగాక.

మదరాసు
6–2–58

పండిత పాదరేణువు
అయాచితుల హనుమచ్ఛాస్త్రి

ఆస్థానకవి, కవిసార్వభౌమ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు

ఆంధ్రీవచన తులసీరామాయణము

ఇది జగత్ప్రసిద్ధిగాంచిన తులసీదాసు రచించిన హిందీరామాయణ మున కనువాదము. దీనిని శ్రీమతి యేలూరిపాటి లక్ష్మీసరస్వతి యను విదుషీ మణి రచించినది. తులసీరామాయణ ముత్తరహిందూస్థానమునఁ బ్రతిగృహ మందున పూజింపఁబడుచుండును. ఆదేశములో నాదానిం జదువనివారుండరు. పవిత్రగ్రంథమని శిరసావహింపనివారు నుండరు. అందు ముఖ్యముగా సాధు వులు గోసాయీలు దానిని దేవునిగానే పూజించుచుందురు. హిందీభాష తెలియనివాఁడనై నను దానిగొప్పతనము తెలిసినవారుచెప్పుటచే దానియందు నాకు భక్తితాత్పర్యములు మిక్కిలియైనవి. కొందరాపవిత్రగ్రంథమును దెలుఁ గులో గద్యపద్యరూపమున ననువదించియున్నారు. వేదశాస్త్రపారంగతుల యింటఁబుట్టి అట్టివారియింట మెట్టుచున్న మన కవయిత్రీమణి ఇట్లు మంచి శైలిలో దాని ననువదించుట ముదావహము.

మన కవయిత్రి భర్తగారి పితామహులు శ్రీ యేలూరిపాటి నరసింహ యాజులుగారు వేదశ్రౌతములను సమగ్రముగా నధ్యయనము చేసినవారు. అగ్నిష్టోమాప్తూర్యామ సర్వతోముఖాది మహాక్రతువు లొనర్చినవారు. అట్టి వారి యింటికోడ లీ కవయిత్రి. వైదిక సంప్రదాయములోఁ బుట్టిపెఱిగిన యీయమ ప్రసిద్ధిఁజెందిన హిందీగ్రంథ మనువదించుట సంస్తమనీయమని మువ్వ్నాటికిం జెప్పుచున్నాను.

తులసీదాసు తనరామాయణమున పెక్కుస్థలముల స్వతంత్రించి వ్రాసి యున్నాఁడు. కొన్ని స్థలముల వాల్మీకిరామాయణమున కిది భిన్నముగానే యున్నది. ఆయామార్పులు కొన్ని మనోహరములుగానేయున్నవి. కైక రాము నరణ్యమునకుఁ బంపుమని రాజుంగోరువిషయములో నామె తప్పును జెప్పుచుఁ గొన్ని రామాయణము లామెం దిరస్కరింపఁ జేయుచున్నవి. ఈ రామాయణములో నట్లుగాక మందరనుగూడ మంచిదానింజేసి ఆమెకుగూడ సరస్వతి ఆవేశించినట్లు చెప్పి రెండుమూడుతడవలు కైకకు బోధించునట్లున్నది.

ఆకైక సరస్వత్యావేశంబున రాము నరణ్యమునకుం బంపఁగోరినట్లుండి స్తోత్ర పాత్రురాలగునట్లు చేయుట పరమోత్తమము.

మఱియు నహల్య తప్పుచేసినదనియు నందుచేఁ దిరస్కరింపఁబడెననియు మన తెలుఁగుపుస్తకములు చెప్పుచున్నవి. ఆమె తప్పుచేసెననుటయే తప్పు. అట్టి స్థలమున మనతులసి తూష్ణీభావమువహించి దాటిపోయినాఁడు. అట్లు తప్పించుకొనుట సమంజసము కాదు. మఱియు ననేకస్థలముల యథేచ్ఛముగా తన రామాయణమున మార్పులు చేసియున్నాఁడు. కాని, లోకాదరపాత్రమైన తులసీరామాయణముంగూర్చి చర్చించుట సమంజసము కాఁజాలదు.

ఈ తెలుఁగువచన రామాయణము చిన్న చిన్న వాక్యములతోఁ జక్కని శైలితో మృదుమధురమై మనోహరమగుచున్నది. భాష నిర్దుష్టము. పండిత పామరైకవేద్యము. ఈగ్రంథము తులసీరామాయణగ్రంథముకన్న కొంచెము పెఱిఁగినట్లుతోచుచున్నది. ఇవి 60 రాయల్ ఫారముల పెద్దగ్రంథమైనది. దీనికిఁ గవయిత్రి భర్తగారి పినతండ్రియు, విమర్శకాగ్రగణ్యుడు నగు శ్రీ యేలూరిపాటి రామభద్రచయనులుగారు పరిష్కర్తయై శ్రమపడి పూఁపులు దిద్ది గ్రంథము మనోహరము గావించినారు. చక్కని ముద్రాక్షరశాలయందు ముద్రితమై వన్నెగాంచుచున్నది. దీని నెల్లవారు చదివి యానందింతురుగాక యని కోరుచున్నాను.

రాజమండ్రి
22–1–58

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
ప్రభుత్వస్థానకవి

ఆర్ష విద్యాభూషణ
జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.,
విజయవాడ

నేడు తెలుగునాట పుస్తకములను పత్రికలను చదువు అలవాటు బాలుర లోను, స్త్రీలలోను, జనసామాన్యములోను కూడ విపరీతముగా పెరిగిపోవుచున్నది. విజ్ఞాన వికాసములను గల్గించునట్టి పుస్తకములు సకలజన సుబోధమగు శైలిలో లేనందున అపరాధ పరిశోధకనవలలు, చవుకబారుగా ఉద్రే

కమును గల్గించు ఇతర కథలు విరివిగా ముద్రితమై అందరి అందుబాటులోనికిని వచ్చుటచేతను, ఉదాత్తోన్నత భావబంధురములై ప్రజల ధార్మికాధ్యాత్మిక ప్రవృత్తికి దోహదమిచ్చు సరళవాఙ్మయము విరళముగానుండుటచేతను నేటి ప్రజల పఠనాభిలాష అపమార్గమును బట్టుటయు అభిరుచులు చెడుటయు సంభవించుచున్నది. ఇట్టిసమయములో ఆ ఉద్రేకకరములైన కథలకు తీసిపోని ఆకర్షణశక్తి గలిగినవానివలె పఠనమునకు దారితీయుటకు బదులు మానవులను దివ్యత్వములోనికి తీసికొనిపోవుశక్తిగల తులసీరామాయణమును రచించి శ్రీమతి ఏలూరిపాటి లక్ష్మీసరస్వతమ్మగారు ఆంధ్రభాషకు, ఆంధ్రప్రజలకు మహోపకారము చేసినారు. హృద్యమును ఉద్ధారకమును అగు ఇట్టిసాహిత్యమునకు సంఘహితైషులును, సారస్వతోపాసకులును ఏకగ్రీవముగా స్వాగతమీయగలరు.

మధురాతి మధురమైన శైలిలో స్వచ్ఛసరళప్రసన్న భాషలో అమృతోపమానమైన విషయము నందజేయు నీగ్రంథము ప్రతి ఆంధ్రగృహమును ప్రదీపమువలె ఉద్దీపింపచేయగలదని నా విశ్వాసము. తులసీదాసువంటి లోకోత్తర పురుషులు క్వాచిత్కముగను కాదాచిత్కముగను మాత్రమే ఉత్పన్నమగుదురు. ఆ కొలదిమంది గావించిన దివ్యరచనలను ఇతర ప్రాంతములలోని వారి కందించు కృషిజరుపు భాషాన్తరీకర్తలెల్లరు తమప్రాంతములో ఆ మహాపురుషులు అవతరించని లోటును తీర్చినవారగుదురని నా యభిప్రాయము. ఈగ్రంథమును రచించి శ్రీమతి లక్ష్మీసరస్వతమ్మగారు ఆంధ్రుల శాశ్వత కృతజ్ఞతను పొందినారు.

ఈగ్రంథమును పరిష్కరించిన శ్రీ ఏలూరిపాటి రామభద్రచయనులు గారు విమర్శకులు, విజ్ఞాననిధులు, సారస్వతోపాసకులుగా ప్రసిద్ధి నొందియున్నారు. వీరి పరిష్కరణము గ్రంథమునకు నిశ్చయముగా పరికర మనుటలో నతిశయోక్తిలేదు.

జటావల్లభుల పురుషోత్తము

సౌభాగ్యవతి శ్రీమతి యేలూరుపాటి లక్ష్మీసరస్వతమ్మగారు రచించిన తులసీరామాయణమును స్థాలీపులాకముగా నే నచ్చటచ్చటఁ జదివితిని. అమందానందము నందితిని. రీతిరమ్యమైన రచనమని నిశ్చయించుకొంటిని. తులసీదాస మహాకవి హిందీభాషలో రచించిన రామచరిత మానసమును అర్థముగావించుకొనుటయే కష్టమనియు, ఆభాషతో సాధారణపరిచయముగల వారందఱు నాగ్రంథమునందలి స్వారస్యముల గ్రహింప లేరనియు కొందఱు విజ్ఞులు చెప్పఁగా వింటిని. ఆమాట యథార్థమగునేని ఆంధ్రభాషలో నీవిధముగా నీయనువాదము పొసఁగించుట అద్భుతకార్యమని ఘంటాఘోషముగాఁ జెప్పవచ్చును. ఈ రామాయణము రమణీయమైన శైలిలో స్వతంత్ర కృతివలె సాగినది. పవిత్రమైన శ్రీరామచరిత్రము నిట్లు సరళమైన మధురవచన గ్రంథముగా సంతరించిన లక్ష్మీసరస్వతమ్మగారు నిజముగా ధన్యురాలు. ఈమెకు లక్ష్మీసరస్వతుల యనుగ్రహమనవరతము కొఱత వడకుండును గాక యనియు శ్రీమన్నారాయణుఁడు చిరాయురభ్యుదయ పుత్రపౌత్రాభివృద్ధు లతోధికముగా దయచేయుంగాత మనియు ఆశించుచు విరమించుచున్నాను.

'కవితానికేతనము'
అత్తిలోటి అగ్రహారము
నెల్లూరు 2-1-1958

సరసకవి - కవిశేఖర, సాహిత్యరత్న
మోచర్ల రామకృష్ణయ్య

ఆంధ్ర విశ్వవిద్యాలయమున నాంధ్రముఖ్యోపన్యాసకులుగ నుండి విశ్రాంతిని తీసికొనుచు రేడియో అసిస్టెంటు డైరెక్టరు (తెలుగుశాఖ) గ నున్న శ్రీ పింగళి లక్ష్మీకాంతము ఎం. ఏ. గారొసంగినది.

శ్రీమతి ఏలూరుపాటి లక్ష్మీసరస్వతి తెలుగు వచనములో అనువదించిన శ్రీ తులసీదాసు రామాయణమును అక్కడక్కడ కొన్నిపుటలు చదివి చూచుట తటస్థించెను. భాష సరళమై, ధారాళమై, గ్రాంథికముగా, అపేలవముగా నున్నది. రామాయణ కథాకుతూహలము, అందును, తులసీ రామాయణ పఠనాపేక్షయు గల సహృదయులకు ఈ వచన రామాయణము చాల నుపయోగింపగలదని నా నమ్మకము.

పింగళి లక్ష్మీకాంతం
27—1—58

'ఋతుసంహార' 'మేఘసందేశ' 'కనకధారాస్తవ' 'భజగోవిందా' ద్యనేక గ్రంథకర్తలగు శ్రీ కొలకుల నారాయణరావు, బి. ఏ., బి. యల్., యఫ్,ఆర్, ఈ, యస్ (లండను.)

శ్రీమతి యేలూరుపాటి లక్ష్మీసరస్వతమ్మగారిచే నాంధ్రీకరింపఁబడిన ఆంధ్ర తులసీ రామాయణమును జూచుభాగ్యము నాకుఁ 'దలవనితలంపుగా' లభించినది. పేరునుబట్టి చూడ నీ గ్రంథకర్త్రిణి లక్ష్మీకటాక్షపాత్రురాలే గాక సరస్వతీ ప్రసన్నయై యుండునని స్ఫురించుచున్నది. ఈమె సిరింగూర్చిన విచారణ నా కనవసరము. కాని తద్రచితమగు "ఆంధ్రతులసీ రామాయణమును" స్థాలీపులాకన్యాయముగాఁ బఠించిన వెంటనే ఈమె యస్వర్థ (సరస్వతి) నామయని చెప్పకయే చెప్పుచున్నది. కాదని చెప్పఁగల సాహసికులు లేరనియే నా గట్టి నమ్మిక.

వావిళ్ళవారు ప్రచురించిన "తులస్యుపాఖ్యానమును ఈమధ్య నేను జదువుట తటస్థించినది. నాకాభాష యర్థముకాలేదు. కించిజ్ఞుడను గావున నందలి వస్తువు కొంచెమేని అవగాహము కాలేదు. "కళ్యాణకల్పతరువు" లోఁ బ్రకటింపఁబడిన యాంగ్లేయానువాదమును దిలకించితిని. ఇటీవల ATKIN అను మహాకవి పద్యరూపమున లిఖించిన 'మానసరామాయణము' లోని భాగములసైతము పొడఁగాంచితిని. ఇందు సహజాంగ్లేయభాషా గాంభీర్యము ఉట్టిపడుచున్నదిగాని ఆంధ్ర సంప్రదాయమునకు విరుద్ధములైన ప్రయోగములచే నపార్థము లనేకములు దొరలినవి. అందుచేఁ గథాసందర్భశుద్ధి మొక్కవోయినది. నేఁడు పూర్వజన్మ సుకృతమున శ్రీమతి లక్ష్మీసరస్వతమ్మగారి తెలుంగుసేఁతను జూచితిని. ఆమె వచన రచన ముద్దులుమూటగట్టుచున్నది. క్లిష్టములగు నన్వయము లెక్కడను గానరావు. వర్ణనాంశములు బహుసరళముగను, కథాగమనము చమత్కారముగను, శైలి మృదుమధురముగను సాగుటచే ఆబాల గోపాలము చదివి యర్థము చేసికొనఁగల ఫక్కిలో నీ గ్రంథరాజము నడచుచున్నది. చదువ నారంభించినఁ దుదిదాఁక వేఱొక పనియందాసక్తి కల్పింపక లాగుకొనిపోవు మహత్తరశక్తి యీగ్రంథమున నిమిడియున్నదనుట యతిశయోక్తి కానేరదు.

బాలకాండములోని శ్రీరామచంద్రుని (89. వ పుట) వర్ణన బహుళ సంస్కృతపద భూయిష్ఠమయ్యుఁ గరము మనోహరముగ నున్నది. అయోధ్యా కాండములో గుహునియితివృత్తము ప్రభుభక్తిపరాయణత సూచించుచు హృదయంగమముగా నున్నది. అరణ్యకాండములో సీతనుగానక రామచంద్రుఁడు ప్రాకృతజనునివలె విలపింపఁదొడంగిన భాగము పాషాణములనేనిఁ గరఁగించుచున్నది. సుందరకాండములోని రామ విభీషణ సమాగమము సకలరాజకీయ నీతిసుబోధకముగా నున్నది. లంకాకాండములోని సులోచనాహిరావణ చరిత్రములు అశ్రుతపూర్వకథా ఘటితములుగా నున్నవి. ఉత్తరకాండములోఁ గాకభశుండుఁడు రామ మహిమను గూర్చి, చెప్పిన యంశములు బుధజనాహ్లాదకరములు. లవకుశకాండములోని లవకుశయుద్ధవిధానములు అత్యంత భీభత్సభయజన్యములుగా నున్నవి. ఇట్లు గ్రంథమంతయుఁ బఠితలకు వివిధ రసానుభూతి, నూతనోత్తేజమును గల్పించుచున్నది.

గ్రంథకర్త భావికాలమున నిట్టి యుద్గ్రంథములఁ బెక్కింటిని వ్రాసి యాంధ్రభాషామోషను అలంకరించుఁగావుత మని యాశించుచున్నాఁడను.

నెల్లూరు
1–1–1958

విద్వజ్జన విధేయుఁడు,
కె. నారాయణరావు

శ్రీరామకృష్ణమిషన్ శారదావిద్యాలయ బాలికోన్నతపాఠశాలా
ప్రధానోపాధ్యాయిని – చెన్నపురి

శ్రీ తులసీదాస రామాయణము

అనువాదకులు: శ్రీమతి యేలూరుపాటి లక్ష్మీసరస్వతమ్మగారు.

పరిష్కర్త: శ్రీ యేలూరుపాటి రామభద్రచయనులుగారు.

ఆంధ్ర తులసీరామాయణము భారత దేశమున ఇంటింటను ఉండవలసిన అమూల్య గ్రంథరాజము. బాలబాలికలు, భారతనారీమణులు చదివితీర వలసిన రసభావభరిత, భక్తిపూరిత గ్రంథము. జీవితాంధకారమును తొలగింప

జేయు దివ్యజ్యోతి. భక్తి, కర్మము, బ్రహ్మజ్ఞానము మొదలగు అంశము లన్నియు అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు ఇం దమరియున్నవి. ఉత్త మోత్తమ గ్రంథములలో ఇది యొకటి యని నిస్సందేహముగా శిరస్సొగ్గి చెప్పవలసియున్నది.

రచయిత్రి ఈకవితాధార గంగాప్రవాహమువలె నిరర్గళము. అమృత మధురము. గుణాలంకార సహితము. అతిమనోహరము. సకలజనరంజకము. శైలి బహుసరళము. ముచ్చటైన అచ్చు. సర్వవిధముల ఈ ఆంధ్రానువాదము అభినందనార్హము. పండితాదర పాత్రము.

సి. సుబ్బలక్ష్మి.
7—1—58

శ్రీమతి యేలూరిపాటి లక్ష్మీసరస్వతీదేవిచేఁ దెలుగువచనమునఁ బచన మొనర్పఁబడిన శ్రీతులసీరామాయణమును దత్పరిష్కర్తలగు శ్రీ యే. రామభద్రయచయనులుగా రీయఁగా స్థాలీపులాకన్యాయమునఁ జూచునవకాశము కల్గినది. తులసీదాసు రామభక్తాగ్రగణ్యుఁడు. దక్షిణ భారతమునఁ నున్న పోతన్న, త్యాగయ్యలతో ఆయనను బోల్చవచ్చును. తెలుగు నాఁట భారతభాగవతముల కెంతటిప్రచారము కలదో ఉత్తరభారతమునఁ దులసీరామాయణమున కంతకంటే ఎక్కువప్రచారముకలదు. తులసీరామాయణములేని గృహమే ఉండదనిన అతిశయోక్తి కాఁజాలదు. దీనికి హేతువు తులసీదాసుని కవితాశక్తియే. అట్టి యుద్గంథమును సుబోధమగు తెలుఁగు భాషలో అనువదించి యిచ్చిన యీరచయిత్రి ఆంధ్రభాష కమూల్యసేవ యొనర్చెసనుట నిస్సంశయము. ఇంతకు మునుపే కొన్ని యనువాదము లీగ్రంథ ముకుఁ దెలుఁగులో నున్నను దేనివిశిష్టత దానిదే. అందును బద్యానువాదము కంటె గద్యానువాదములో నొప్పించుట కష్టతరము. ఈ విదుషీమణి అనువాదము సరళము, సలక్షణము, జాతీయపదశోభితము. నాతిదీర్ఘవాక్యసంఘటి తమునై పాఠకుల కెంతసేపు చదివినను విసుగు జనింపని శైలిలో నడచినది. ఆంధ్రదేశమున గ్రంథరచనాపాటవముగల నారీమతల్లులే తక్కువ. అందును ఇంతటి యుద్గ్రంథము నింతచక్కగ అనువదించి ముద్రింప గలవారు లేరనియే

చెప్పవచ్చును. ఈవిధముగా దననామధేయమును సార్థక మొనర్చుకొన్న ఈ రచయిత్రి ఇంకను ఇట్టి అమూల్యాలంకారములచే ఆంధ్ర సరస్వతి నలంకరించుఁ గాకయని అస్మదాదుల ఆశంస.

కే. వేం. న. అప్పారావు
ప్రిన్సిపాల్, ఆంధ్ర గీర్వాణవిద్యాపీఠము
కొవ్వూరు.

అభిప్రాయము

శ్రీమతి ఏలూరిపాటి లక్ష్మీసరస్వతమ్మగారు సరసమధురమైన వచనములో తెనుగుపఱచిన 'తులసీరామాయణము' సాంతముచదివిన అదృష్టము నాకొదవినది. దీనికంతకు కారణము పూజ్యులు విమర్శకాలంకారులు నగు ఏలూరిపాటి రామభద్రచయనులుగారికి నాయెడగల కరుణ. ఏతత్ కృతికర్త్రి శ్రీ చయనులుగారి అన్నగారి కోడలు. "ఏడవ పడి" వయస్సులోనుండి చయనులుగారు ఈ రామాయణగ్రంథమునకు తీరుతీయములు దిద్దుటలో, ముద్రింపించుటలో పడిన పరిశ్రమ రాజమహేంద్రవరమున నేను కన్నార కనుగొన్న వాడను.

వస్తుతః, హిందీభాషతో పరిచయము పట్టనివాడను. నాకుగల ఈ "అజ్ఞత" ఏతద్గ్రంథమును కుతూహలముతో పఠించుటకు ఎంతో సహకరించినది. ఈరచన స్వతంత్ర మనిపించుచున్నదికాని, కృతకముగా—ఏదో మాతృక ముందుపెట్టుకొని దింపిన ప్రతిబింబమువలెలేదు. ప్రవాహములో—సమాసాదులలో కొన్ని నెరసులు ఉన్నవికాని, చక్కని చిక్కని శైలిలో అవి లెక్కసేయుటకు వీలుఉండదుకదా! వ్యాసపీఠములపై నిలుపుకొని పారాయణము చేసి, దేవతార్చన పేటికలలో భద్రపఱుచుకొని అర్చించదగిన యిట్టి పవిత్ర గ్రంథమును తెనుగువారి కందిచ్చిన పూజ్యురాలు శ్రీమతి లక్ష్మీసరస్వతమ్మ గారి అమృతసంకల్పము. ఆమె అవికల్ప దీక్ష ఆంధ్ర యువతీమండలికి మేలు బంతి కాదగినది. ఈ "తులసీరామాయణ" గ్రంథమునకు నా హార్దమైన అభివాదములు.

హేమళంబ మాఘము
మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

భగవన్నుతి

1. దీనబంధు దయాల రఘురామా
దేవకిన్హా దేవన్హా పరదాయా
విశ్వద్రోహరతయహ్ఖలకామీ
నిజఅఘుగదువు కుమారగగామీ

2. తుమ్హా సమరూప బ్రహ్మఅవినాసీ
సదాఏకరస సహజఉదాసీ
అకలఅగునఅజ అనఘుఅనామయ
అజితఅమోఘుశక్తి కరునామయ

3. మీనకమఠ సూకర నరహరీ
వామన పరసురామ వపుధరీ
జబజబనాధ సురన్హాదుఖపావా
నానాతనుధరి తుమహి నశావా

4. రావణ పాపమూల సురద్రోహీ
కామలోభ మదరత అతికోహీ
సోవుకృపాల తవధావశిధావా
యహ్హామరే మన విశమయ ఆవా

5. హం దేవతా పరమఅధికారీ
స్వారథరత తవ భగతి విసారీ
భవప్రవాహ సంతతహం పరే
అబప్రభుపాహి శరణఅనుసరే.

గురుస్మరణము

నమామి దేవం పరమాత్మరూపం
సచ్చిత్సుఖానంద ఘనం ప్రసన్నమ్ ।
స్వాత్మాభిరమ్యం బహుజీవగమ్యం
సర్వం మదీయం గురురూప మీడే ।

శ్రీ శాండిల్య పవిత్ర గోత్ర మహితం వేదాంత సారార్ణవం
శ్రీమద్భాగవతాన్వవాయజనితం విజ్ఞానవిద్వద్ధనమ్ ।
ఆచార్యం సుచరిత్ర బోధన కళాధుర్యం మహోన్నతం సదా
నౌమి శ్రీచరణాన్న పూర్ణ కరుణాపాధోనిధిం ముదా ॥

శంకరాభరణం – ఆదితాళం

ప॥ శ్రీ గురుమహారాజ, గురుమహారాజ, భాగవతాన్నయ, గురుమహారాజ, పూర్ణయనామా ॥ గురుమహారాజ ॥ గురు ॥


అ॥ చిన్మాత్రదాంచిత । సంశయచ్ఛేత్తఃసాంబ, శ్రీకర, దక్షిణముఖ, శివ ॥ గురుమహారాజ, గురుమహారాజ, శ్రీ శివసుందర సద్గురుమహారాజ ॥

చె॥ దేహోనాహం, జీవోనాహం, ప్రత్యగ భిన్నం బ్రహ్మైవాహం, జ్ఞానం, జ్ఞాతం, జ్ఞానీ, జ్ఞేయం, ధ్యేయం, ధ్యానం, దేశికఏవ ॥ గు ॥

2. హంసస్సోహం, సోహం హంసః, బ్రహ్మసోహం, సోహం రుద్రః విష్ణుస్సోహం, సోహంసాక్షాత్, బ్రహ్మైవాహందేశిక చరణం ॥ గురు ॥

3. బ్రహ్మజ్ఞానం బ్రహ్మైవాహం అస్మీతితత్వం అసిపదవాచ్యం ఆత్మా బ్రహ్మ అయ మేవాహం చిద్ఘనరూపం దేశికచరణం ॥ గు ॥

4. రక్తంశుద్ధం మిశ్రంతుర్యం మానవ్యాప్తం సర్వం బేదం భాసం, భానం, పరమస్థానం, శరణంమే శ్రీ దేశికచరణం.



సమర్పణము

ఇదిగో! పుట్టు కృతార్థతం బొరయ నా
కీ కోర్కి పుట్టించి, నా
రద చేయించిన తెల్లుసేత - తులసీ
రామాయణ గ్రంథ సం
పద, గద్యాకృతిమత్ప్రబంధమును దీ
వ్యద్భక్తిమై జానకీ
మదిరాక్షీ హృదయాబ్జ సౌరభము - రా
మస్వామి కర్పించెదన్.

అంజలి

శ్లో. సువర్చలాధిష్ఠిత వామభాగం
నిరస్త కందర్ప సురూపదర్పమ్।
భానుప్రభం రాఘవకార్యదక్షం॥
అస్మత్కులేశం హనుమంత మీడే॥

* * *

గీ. తమి సువర్చల వామపార్శ్వమున మెఱయ
మదన సౌందర్య దర్పసంపద నడంచు
సుందరుని, రామభక్తుని, సూర్యనిభుని
మత్కులస్వామి హనుమంతు మదిఁ దలంతు.

* * *

సీ. ఓగణాధిప! నీకు నొనరింతు జోతలు
ఆదరింపఁ గదయ్యా! అంబ తనయ!
నేచేయు రచనకు నేయడ్డు లేకుండఁ
గాపాడరావయా కాళితనయ!
నీసేవ నేనెంతో నెఱినమ్మికొనియుంటి
పార్వతీసూనుఁడా! పరమపురుష!
ఏవిఘ్నములు లేక యెలమి రక్షింపవా
పరులచే నిందలు పడయకుండ
నిరతంబు నీనామ నిశ్చలస్మరణంబు
చేయుచుంటిని దయాక్షీరజలధి!

గీ. ఏల కానరావు! ఈదాసురాలిపై
కినుకపూన నీకు మనసుకలదె!
పంత మింక విడిచి సంతోషమున నన్ను
పలుకరింపు రామభక్తమౌళి!

సీ. రామముద్రికఁదెచ్చి రాకుమారికి నిచ్చి
జానకి వగఁబాప జాలినావు
గడియలో లంకను గాల్చి భస్మముచేసి
మించి సాగరము లంఘించినావు
మధువనంబునుజొచ్చి మకరందమునుగ్రోలి
అనివార్యుడగుచు నీ వలరినావు
చూడామణినిదెచ్చి వేడుక రామున
కర్పించినావు మహాత్మ: నీవు

ఆ. వె. జానకీ విరహముతో నలంగిన యట్టి
రామచంద్రు మనసు రమ్యభంగి
తేర్చినట్టి నీదు ధీశక్తి భుజశక్తి
నభినుతింతు దేవ! అంజనేయ!

సీ. ఏవాసనలులేక యేకాంతవాసుఁడౌ
ఘనునకు పూలవాసన లివేల!
వాసనారహితుఁడౌ వానికి నేనెట్లు
వసనంబు లివ్వి యర్పణమొనర్తు!
బంధంబు లెలను బరుగుగా భావించు
భావితాత్మ్మనకు నాభరణ మేల!
రామనామమ్మునే రత్నమాలగఁదాల్చు
మహనీయునకు పుష్పమాలలేల!

ఆ. వె. మంచిపరిమళంబు మించు నీమేన
గంద మేల పూయగాదలంతు!
వట్టి పిచ్చికాని పరమాత్మ్మనకు నీకు
సేవచేయఁగలనె! చిన్మయాత్మ్మ!

సీ. శ్రీరామచరితంబు చేరి పఠించిన
యింటింట నీవుందువంట దేవ!
శ్రీరాముసేవలు సేయుభక్తులనోట
నలరారుదువుగాదె యాంజనేయ!
నినువీడి క్షణమేని నిలువజాలడు గదా!
రాముండు భక్తాళిరక్షకుండు
నినుగొల్వ శాస్త్రములు నిఖిలముల్ కరతలా
మలకంబులై మాకుఁ జెలగుగాదె!

గీ. లేదు నీకంటెదైవంబు లేఁడు మాకు!
నిన్ను గొల్చుట రామసన్నిధిని మనుట!
నీ పదాబ్జము నాకు పెన్నిధి కదయ్య!
ఆంజనేయ! కవిత్వ మహత్వగేయ!

సీ. కనులార! నినుజూడ గాంక్షించియుంటిని
నీదర్శనం బీయరాదె! హనుమ!
నీబిడ్డ ననుమాట నిమిషమైనను నీవు
మఱవకుండుము తండ్రి మారుతీశ!
ఆదరింతువటంచు నఘము బాపుదు వంచు
వినుతిచేసెద నిన్ను వేడ్క-తోడ
గతి నీవె యనినమ్మి కనికరింపు మటంచు
గంపెడాస వహించి కడపుచుంటి

గీ. తులసిదాసుని కావ్యంబు తెలుగు సేయ
కడగి ధన్యత నేనొంద గనుట యెల్ల
ఆంజనేయవిభూ! నీకటాక్షఫలము
కాక మఱియొండుకాదు! నిక్కముగదయ్య.

సీ. కపికులంబునఁ బుట్టి కవులచే సతతంబు
కొనియాడఁ బడలేదె కోతివయ్యు
మానుషరూపుఁడై మహితుడౌ రాముని
యాత్మనఖుండవై యులర లేదె!
పసితనంబున నీవు బాల సూర్యునిజూచి
ఫలమంచు మదిలోన భ్రమయ లేదె!
బాల్యమ్మునం దీవు బాగుగా శాస్త్రాళి
పఠియింప గల్గిన పండితుడవు

ఆ. వె. జ్ఞానులందు మిగుల జ్ఞానివై వెలుగొంది
బుధులయందుఁ బరమ బుధుడవగుచు
చెలగినట్టి నీకు చేదోయి మోడ్చెద!
నాంజనేయ! భక్తి నహారహంబు.

సీ. పరమాత్మ! నేచేయుపరిచర్య లింతేని
పనిచేయకుండెనా, పరమపురుష!
పరుషవాక్కులెవేని పలికితినా! దేవ!
పగబూననేల నాపైని నీవు
ఉదయాస్తమయముల నుపచారములఁజేసి
వాపోవుచుంటి నోవాయుతనయ!
నీదర్శనంబును నెమ్మనంబునఁ గోరి
ధ్యానించుచుంటి నిత్యమ్ము హానుమ!

గీ. మంచి కవిత కలిగి మధురవాక్కులు కల్గు
నటులుచేసి నాదు నాశలన్ని
వేగఁ దీరునటులు సాగఁజేయు మటంచు
నాశ్రయింతు నీదు నంఘ్రియుగము.

సీ. శారదా! నాపైని చల్లనిచూపులు
చూపుచు రావమ్మ సురుచిరాంగి!
పంకజాసనురాణి! పాపసంహారిణీ!
యాశీర్వదింపవే యజునిరాణి!
గంగాజటాజూట! గౌరీశ్వరా! నీవు
కావంగరావయా! దేవదేవ!
రావయా! రఘువీర! రక్షింపరావయా!
శీఘ్రమే రావయ్య సీతతోడ

ఆ. వె. అందుకొనుము నాదు వందనమ్మిది నీవు
ఆదరింపవయ్య! అఘవిదూర!
నాదు సేవగొనుచు నా కభయం బిచ్చి
నా కవిత్వరీతి సాకవయ్య!

రచయిత్రి విజ్ఞాపనము

శ్రీ గురుపరంపర చరణారవిందములకు నమస్కరించి గణపతికి మొక్కి కులదైవమగు నంజనా తనయునకు నంజలిఘటించి త్రిమూర్తులకు వందనమొన రించిముగురమ్మలకు నమస్కరించి తులసీదాసులకెరగి ఆనందమయమగు శ్రీరామమానస చరితము నాంధ్రమున వచనరూపమున వెలువరించితిని. సంద ర్భానుసారముగ సంస్కృతశ్లోకముల గొన్ని చేర్చబడినవి. రచనము మూలాను సారమే. దేవునిపెండ్లి కందరు పెద్దలే యనురీతిని "మందః కవి యశః ప్రార్థీ, యను నాసమెయి నసమర్థనై నను. భగవద్గాధ గావున లోకమాదరింప కుండ దను విశ్వాసముతో హిందీభాషనున్న ఈరామాయణమును వ్యాఖ్యానము లతో పరిశీలించి వచన రచనము లోకమభిలషించు చున్నదను మూహ నొంది నా నేర్చిన కొలది జ్ఞానములో వచనరూపముగ నీ మహాకావ్యమును రచించుటకు బూనుకొని మున్ముందు మహాకవి తులసీదాసు చరిత్రమును రామాయణ మహత్వమును నితర గ్రంథ సహాయమున నాడెలిసినంతలో వ్రాయుచున్నాను.

తులసీదాస చరిత్రము

ప్రకృతిసామ్రాజ్యమందు కార్యములేకుండ కారణము జరుగదుకదా! ఈమాట ప్రబలసిద్ధాంతమై యుండెను. ప్రజలనేక మతములుగలిగి అనేక సిద్ధాంతములనమ్మిదురు. ధార్మికజగడములతో అనేకభ్రమలుగలిగి వాదోప వాదములు చేయుచు శైవ, వైష్ణవ, శాక్తేయ మతంబులని బలుకుచు ఒకరి మతముల నొకరు ఖండించి దూషించుచు, మొత్తముమీద శివకేశవుల నిం దింపసాగిరి. తమయిష్టదైవముల మాత్రము ఉపాసనలు చేయుచు, ఇతరోపాస కుల పరోక్షముగను, ప్రత్యక్షముగను నిందింప సాగిరి. ఇది భగవంతుడు సహింపనేరక హరిహర భేధములేని గ్రంథము రచించినచో ఇట్టిభావము లుండ నేరవనియు, అట్టిగ్రంథమును జదివి విన్న వారలకు యేదోషము లంటవనియు, ప్రపంచశాంతి కలుగుననియు ఆధ్యాత్మానుసారముగ రామాయణమును రచిం చిన బాగుండుననియు, రామాయణముతో తులతూగుగ్రంథము మరియొకటి

లేదనియు నాలోచించి, ఇట్టిగ్రంథము రచించుటకు వాల్మీకియె తగినవాడని యెంచి ఆతనిని భూలోకమం దుద్భవింపజేయుటకు ఆలోచింపుచుండెను.

ఇతడు ధర్మజిజ్ఞాసనుగూర్చియు, భూత భవిష్యద్వర్తమానములగూర్చియు ప్రజలకు బోధించి, ప్రజాకలహాములను మాన్పి, ధర్మమార్గమున నడిపించుచు, అనుభవమువలన ప్రజలందరను భక్తిమార్గమవలంబింప జేయునని తలచి, భగవంతుడాదికవియగు వాల్మీకిని ప్రజోద్ధరణకై నరలోకమునకు పంపదలచెను. ఈకథ యసత్యముకాదు. వాల్మీకియే తులసీదాసై జన్మించెను. గానవీరిరువురకు భేదము గాన్పింపదు. సమిష్టిసృష్టికి బ్రహ్మవలె వ్యష్టి సృష్టికి వాల్మీకితో సమానులెవరులేరు. ప్రపంచసృష్టికి విరించిని, కవితా సృష్టికి వాల్మీకిని బోలినవారు లేరు. శతకోటి ప్రవిస్తరమైన రామాయణమును వాల్మీకి అతిసూక్ష్మముగ వర్ణించియుండెను. వర్ణనమంతయు వేదములననుసరించి యుండెను. వేదమందు పరమతత్వము వర్ణించినటుల రామాయణమునం దామాటలే విస్తరించి యున్నవి. దశరథమహారాజు శశాంకపూర్ణదేహుడై వేదరూపుడై యుండెను. అకార, ఉకార, మకార సహితమైన ఓంకారమువలె పరమాత్మయగు రామచంద్రుడు భరతలక్ష్మణ శత్రుఘ్నులతో కలసియుండెను. ఈయభిప్రాయమును విశదముచేయుచు వాల్మీకి రామాయణమును రచించెను. రామాయణమునందు భగవంతునియవతారమును తెలిపి వాని యనేకలీలలు విస్తరింపజేసెను. శతకోటిప్రవిస్తరమైన రామాయణము ముందుగా శివుము గ్రహించి యుండెను. రామనామమే జీవనాధారముగ గల శివస్వరూపుడైన హనుమంతుడుకూడ దీనిసారము గ్రహించియుండెను. ప్రణవమునకు ప్రాణస్వరూపుడైన రామపరతత్వమును ప్రతిపాదనచేయుటకు హనుమంతు డొకసారి వాల్మీకివద్దకు వచ్చి గుప్తమగు రామచరిత్ర మధ్యాత్మతత్వానుసారముగ వర్ణింప అధ్యాత్మవర్ణనను జూచి అతడు బ్రహ్మానందపరవశు డైపోయెను. అతని యానందమును జూచి హనుమంతుడు సంతసించి యింకను ఏదైనకోరుకొనుము. ఇచ్చెదనన, నాయనా! హనుమా! అధ్యాత్మతత్వము బాగుగా వర్ణించితివికాని ఇది గుప్తముగానుంచి వెల్లడి చేయవలదని ప్రార్థించుచుంటిని. ఏమన! నేనురాముని మాయామానుషునిగా వర్ణించితిని. పరబ్రహ్మయగు రామచంద్రుడు సామాన్యునివలె దుఃఖించె

ననుట భావ్యముకాదని, దుఃఖింపనిచో కథాసారస్య ముండదని, రాముడు దుఃఖించినగాని కథవినువారలు దుఃఖింపరని, భగవంతునివిషయమై దుఃఖించుట మనుజులకు శ్రేయస్కరమనియెంచి పరబ్రహ్మ మాయామానుషుడై ప్రవర్తించునటుల వ్రాసితిని. నీవు రామతత్వమును బైటబెట్టితివేని నేరచించిన రామాయణమునకు విలువయుండదని వాల్మీకిబలుక నీవుచెప్పునది కాదనను కాని భగవంతుని అంత అజ్ఞానునిగా వర్ణించుటచే భక్తికి ఆటంకముకలుగును. గాననీవు భూలోకములో తులసీదాసుడవై జన్మించి అధ్యాత్మతత్వవిధానముగ నవరసము లొలుకజేయు రామాయణమును రచింపుము. ఆ గ్రంథరాజము జదివి, విని ప్రజలు తరించెదరు. ఇది శాపమనితలపక భగవత్ప్రేరేపణ మని తలపుము. నీవు త్వరలో తులసీదాసువై జన్మించి హిందీభాషతో రామాయణమును రచించుము. సంస్కృతభాషతో ఇదివరలోనే రచించితివి గాన ఈమారు హిందీదగువులతో రచింపుము. ఇదివరకు రచించిన రామాయణము నెంతపవిత్రతతో జనులు చూచుచున్నారో ముందు రచింపబోయెడి హిందీరామాయణమును కూడ అట్లే ప్రేమింతురు. దానిఫలమే దీనికిని యుండును. దానితో రాముడు పరబ్రహ్మస్వరూపుడనియు సామాన్యుడు కాడనియు వెల్లడియగును. నీవు కలియుగప్రపంచమం దుద్భవించిన తరువాత నీకు తగుసహాయములు తప్పక సేసెదనని హనుమంతుడు బలుక వాల్మీకి తులసీదాసై పుట్టియుండెను. కలికలుష తిమిరపుంజముల నశింపజేయుటకు సత్పుష్పకమలముల వికసింపజేయుటకు సూర్యరూపమైన రామాయణము అత్యద్భుతముగ రచించియుండెను. ఆ అక్షరముల నుచ్చరించి మనుజులు బ్రహ్మహత్యాది దోషముల పోగొట్టుకొనుచుండిరి. భక్తులు పారాయణచేసి దుఃఖముల నణచుకొనుచుండిరి. ఇది సంసారార్ణవమునకు ఓడవంటిది. ఇట్టి గ్రంథము రచించి తులసీదాసుగారు రామచరితామృతమును ప్రపంచమంతట వర్షమువలె కురియించిరి. ఈ గ్రంథము భక్తియను ఏకసూత్రమున ప్రజలను బంధించెను. కలిమలముల హరించెడి గ్రంథరాజము తులసీదాసుర చించునని మున్ను వేదవ్యాసుడు చెప్పియుండెనట. మహాత్ములమాట లన్యములు కాజాలవుకదా!

తులసీదాసు జననము

సరయూతీరమున రాజానగరమనే యొకపట్టణము కలదు అందువర్ణాశ్ర మధర్మంబులతో సమస్తజాతులు గలవు మనుజులు సకలైశ్వర్యంబులతో తుల దూగుచుండిరి. విప్రులు వేదాధ్యయనంబుల చేయుచు సకలకర్మలజేయుచుండిరి. క్షత్రియులు రాచరికము, వైశ్యులు వర్తకముకృషి సకలసంభారములు సమ కూర్చుట, శూద్రులు వ్యవసాయముచేసి అన్ని దినుసులు సమృద్ధిగా పండించుచుం డుట, జరిగించుచుండిరి. అందరు ఐకమత్యముతో మెలగుచుండిరి. ఆయూరిలో ఆత్మారాముడనుపేర పరాశరగోత్రోద్భవుడైన విప్రశ్రేష్ఠుడొకడుండెను. అతడు ప్రతిష్ఠావంతు లందరిచేతను సన్మానింపబడుచుండెను అతనిభార్య పేరు హుళసి. ఆమెసర్వాంగసుందరి. మహాపతివ్రత. భార్యాభర్తలిరువురు హరిహర భక్తిపరాయణులై యొప్పుచుండిరి. వారుతమకున్న దానిలో అతిథిఅభ్యాగకుల సత్కరింపుచు భగవత్కథల వినుచు ఆనందముతో కాలముగడుపుచుండిరి వారికిచాలాకాలమువరకు సంతానములేకుండెను. వారిభక్తికి మెచ్చి భగవంతు డొకసుతు నీయదలంచెను. భగవంతునికి సంకల్పముకలిగినంతనె హుళసి గర్భ వతియై నవమాసములునిండిన తదనాత శంకరునిబోలు నొకసుతునికనెను. పూర్ణచంద్రునిబోలు సుతునిజూచి తలితండ్రులు బ్రహ్మానంద మొందిరి. ఈతడే తులసీదాసు. ఇతడు 1552 వ సంవత్సరమున జన్మించెను. తలితండ్రు లితనిని రాముడని పిలుచుచుండిరి. ఇతనితలితండ్రులు ముదుసలివారై ఇంకెంతకాలమో జీవించ మనుకొని సూకరక్షేత్రమందున్న వృసింహదాసుని బిలిపించి ఈ బిడ్డకు సకలవిద్యలు గరపుమని యతనికప్పగించి వారు దివమలంకరించిరి. అప్పటినుండియు నృసింహదాసు ఈబాలునిబెంచి సకలవిద్యల నేర్పుచుండెను. నృసింహదాసు గొప్పపండితుడు, జ్ఞాని, సాధువునై, యుండెను. ఇతడుతనగురు వని తులసీదాసు రామాయణబాలకాండలో జెప్పియుండెను. తులసీదాసు చిన్నప్పటినుండి రామభక్తిపరాయణుడు నృసింహదా సీతని ముఖ్యశిష్యునిగ జేసుకొని అనాథుడని జాలిగాజూచుచుండెను. చెప్పాటతడవుగ నాతడు సకల విద్యలు నేర్చియుండెను. గురువు వానికి ఉత్తమవిషయములన్నియు బోధించు చుండెను. గురుముఖతః వాల్మీకరామాయణమునంతయు శ్రద్ధాభక్తులతో విను చుండెను సీడవలె సంచరించు తనశిష్యునకు ఎప్పటికప్పుడు క్రొత్తవిషయముల

బోధింపుచుండెను. 1561 వ సంవత్సరమున మాఘశుద్ధపంచమి శుక్రవారంబున అయోధ్యలో సరయూతటంబున ఉపనయనము చేసియుండెను. ఆదినమందే ఆచార్యునిచే గాయత్రీమంత్ర ముపదేశింపజేసి తాను శ్రీరామమంత్రమును తులసీదాసున కుపదేశించెను. ఆచార్యుడు, గురువు, యితరపండితులు యితనికి గాయత్రీమంత్రోచ్చారణగురించియు మంత్రప్రభావమునుగురించియు చెప్పియుండిరి. శ్రద్ధాభక్తులతోవిని తులసీదాసుచ్చరించుచుండ నందరు నాశ్చర్యమొందుచుండిరి. ఏమిఆశ్చర్యము! చూచుటకు పసివానివలె కనబడుచున్నాడు. పరిపూర్ణ సంస్కారదివ్యపండితునివలె శబ్దోచ్చారణకలిగి క్షణములోనంతయు గ్రహించుచున్నాడని ఆచార్యుడు భావింపజొచ్చెను. ఈవిధముగ ఉపనయనమైన పిమ్మట ఈబాలుని తీసికొని నృసింహదాసు కాశీకి పోదలచి ప్రయాణము సాగించుచు ఇతనికి భగవద్భక్తిని గురించి విశదముగ బోధించుచు కొన్నిదినములకు కాశీజేరుకొనెను. కాశీయందు పంచఘాటు అతిమనోహరముగనుండెను. అది పుణ్యసలిలయగు భాగీరథీగంగయొక్క విలాసపుశేవై యుండెను. ఆతీరమందు శేషసనాతుడనే మహాత్ముడు నివసించుచుండెను. శిష్యసహితముగా నృసింహదాసతని కలుసుకొనెను. గురుశిష్యుల జూచి శేషసనాతనుడు సంతసించి వారలతో సంభాషించి తులసీదాసుయొక్కపరిజ్ఞానమును కొనియాడుచు, ఓమహాశయా! యీపిల్లవానిని నాకు వప్పగించిన మిక్కిలి పరిజ్ఞానవంతుని జేసెదను. ఇట్టివాడు నాశిష్యుడు కావలయునని కోరుచుంటిని. వీనికి సంపూర్ణ విద్యలు నేర్పి వేదవేదాంగముల బోధించి శాస్త్రపురాణంబుల చక్కగ బోధించెదను. ఇతడు చాలబుద్ధిమంతునివలెనున్నాడు. ఇతనికీర్తి ప్రజ్వలింపజేసెదనన వీని పూర్వపుణ్యముకొలది ఇట్టిగురువు లభించెనని సంతసించి ఈపిల్లవానిని వాని కర్పించి నృసింహదాసిట్లనెను. ప్రభూ! మీవంటి పండితోత్తములు వీనికి గురువులగు భాగ్యముకన్న ఏమికావలయును? ఇతని తలితండ్రులు చనిపోవుచు నాకప్పగించిరి. ఉపనయనము చేసితిని. కొంతవరకు విద్యనభ్యసింపజేసితిని. ఇక వీనిభారము తమదేనని జెప్పి తాను చిత్రకూటంబున తపమాచరించుటకు జనెను. శేషసనాతనుడితనికి బ్రహ్మచర్య విధానమంతయు జెప్పియుండెను. తులసీదాసు పదునైదు సంవత్సరములవరకు విద్యాభ్యాసము చేయుచు అక్కడనే యుండిపోయెను. ఈలోపున వేదశాస్త్ర పురాణేతిహాసం

బులన్నియు నేర్చియుండెను. త్రికరణశుద్ధిగ గురువుల సేవించుచుండెను. ఇట్లు సకలవిద్యలునేర్చి గురువు పరమపద మొంద వారికంత్యక్రియలుచేసి తులసీదాసు గురుఋణవిముక్తుడై తన జన్మస్థలమునకు వెళ్ళిపోయెను. రాజానగరమందు తన బంధువులందరు ఒకమునిశాపముచే నశించిరని విని వారందరికి పిండశ్రాద్ధములు చేసియుండెను. ఆగ్రామవాసులందరు అభిమానమునజూచి అటనుండుమని కోరుచుండ ఆయూరునందే తనయింటనుండి ప్రజలకు రామాయణ సద్గ్రంథమును వినిపించుచు కాలక్షేపము చేయుచుండెను. తారపితియను గ్రామంబు సరయూతీరంబునగలదు అందొక బ్రాహ్మణుడుండెను. అతనికొక కుమార్తెగలదు. ఒకనాడతనికి దేవి స్వప్నమందు గనబడి ఓభూసురోత్తమా! రాజానగరవాసియగు తులసీదాసునకు నీకుమార్తెనిచ్చి తరింపుమని చెప్పి యాదేవి అదృశ్యయయ్యెను. పదునైదువందల యెనుబదిమూడవ సంవత్సరమున జ్యేష్ఠశుద్ధ త్రయోదశీ గురువారము అర్ధరాత్రి శుభముహూర్తమున ఆకన్యను తులసీదాసునకిచ్చి వివాహముచేసెను. తులసీదాసు మిక్కిలి సరళస్వభావుడు పరస్త్రీలనెన్నడు మోమెత్తిజూడడు. అట్టివాడు వివాహముచేసికొని సర్వాంగసుందరియైన తన భార్యను తన యింటికి తీసుకొనివచ్చి సుఖంబుననుండ గ్రామస్థులు మిక్కిలి సంతోషించిరి. భార్యవచ్చినది మొదలు తులసీదాసు వేరు కాలక్షేపములు మాని సతీముఖారవిందమునుజూచి ఆనందించుచు కాలక్షేపము చేయుచుండెను. ఒక్కక్షణమైన యామెయెడబాటును సహింపలేకుండెను.

శ్లో॥ విశ్వామిత్ర పరాశర ప్రభృతయో వాతాంబుపర్ణాశనాః
తేపిస్త్రీముఖపంకజం సులలితం దృష్ట్వైవ మోహంగతాః
శాల్యన్నం ఘృతసంయుతం సుమధురం భుంజంతి యే మానవాః
తేషా మింద్రియనిగ్రహో యది భవే ద్వింధ్యః ప్లవే త్సాగరే॥

అని భర్తృహరి చెప్పినట్లు వాయు, నీర, పత్రంబుల భక్షించి తపము చేయు విశ్వామిత్ర పరాశరప్రభృతులే స్త్రీముఖపద్మములజూచి మోహింప ఘృతసంయుక్తశాల్యన్న మధురపదార్థముల భుజించినవారిట్లుండుటలో నాశ్చర్యమేమి?

శ్లో॥ శబ్దాదిభిః పంచభిరేవ పంచ పంచత్వ మాపుః స్వగుణేనబద్ధాః
భుజంగ మాతంగ పతంగ మీన భృంగా నరః పంచభిరంచితఃకిం ॥

శబ్దేంద్రియముచే సర్పము (నాగస్వరముచే), స్పర్శేంద్రియముచే మాతంగము, (అనగా కరిణి జూచి కరము కదులజాలదు.) రసనేంద్రియముచే మీనము, (తీపిపదార్థము దొరకిన మీనము వెంటాడును.) రూపముచే భక్ష్యము (భక్ష్య పదార్థము కనపడిన పక్షి వడలదు.) గంధముచే తుమ్మెద (తుమ్మెద సంపంగిపరిమళము సోకి మృతినందునట్లు) ఒక్కొక్క ఇంద్రియమునకు లోబడి ఒక్కొక్కప్రాణి నశించుచున్నది. పంచేంద్రియములతో గూడిన మనుజుని సంగతి జెప్పనేల ? యని వివేకచూడామణియందు చెప్పినటుల ఈదాసుగారు ఇంద్రియములకు లోబడి సౌందర్యరాశియగు తన భార్యతో అయిదుసంవత్సరములు అయిదు క్షణములవలె గడిపెను. ఆప్రేమకు అంతులేకుండెను. ఇంతలో అత్తగారికి జబ్బుచేసి భార్యను తీసుకొనివెళ్లుటకు భావమరది వచ్చి, బావా! మాతల్లిగారికి జబ్బుచేసినదనియు ఆమె మాచెల్లెలను చూడవలయునని కోరుచున్నదనియు ఇదివరకు మూడుసార్లు కబురుచేసితిమి. ఎప్పటికిని మా సోదరి రాకుండుటచే నేనే స్వయముగా వచ్చి తీసుకొనివెళ్ళెదమని వచ్చితిని. దయయుంచి పంపమన తులసీదాసు మారుమాట బల్కక బయటకు పోయెను. తల్లి ప్రమాదస్థితిలో నున్నదనివిని, భర్తప్రేమను గ్రహించుకొనియు చేయునది లేక అన్నగారితో బయలుదేరి మాతృగృహమునకేగ నీమెను జూచినంతనే తల్లి రుజ కొంచెము తగ్గెనా! యన్నట్లుండెను. ఇంటికివచ్చి చూచుసరికి భార్య కనబడకపోవుటచే తులసీదాసు తోట్రు బడుచు యున్మత్తునివలె సంచరించుచు సర్వదా సుఖభోగములందుచు విలాసానురాగుడై యుండువాడగుటచే ఒంటరిగా నుండుట సహింపనేరక, తన సుఖమును మరచి నిదానమైన యాలోచన లేక అర్ధరాత్రియని యాలోచింపక భయమును వీడి సతియందుండెడి ప్రేమచే యమునానదిని దాటుటకు సిద్ధపడి ఈదుకొనుచు నావలియొడ్డును చేరి చలిచే వణుకుచు తడిబట్టలతో శ్వశురగృహమేగియుండ నది నిశీధమగుటచే కవాటంబులు బంధించి అందరు గాఢనిద్రలోనుండ తలుపులు గొట్టి చప్పుడు చేసి పెద్దగా నరచి కేకలుబెట్ట నాతనిభార్య తనభర్తమాటలు వీనులబడ తొందరగ వచ్చి భర్త అవివేచిత ప్రేమకు నివ్వెరబడుచు తడిబట్టలు వీడుమని పొడిబట్టల

నిచ్చి ఆదరించి మాటవరుస కిట్లనెను. ఓనాథా! ఇట్లు పయనమైవచ్చుట సిగ్గు గాదా! ప్రొద్దుపొడుచులోపుగ నేమితొందరవచ్చినది? లోకులు పరిహసింప రనుకొంటిరా? అస్థిచర్మంబులతో కూడియున్న స్త్రీపై యింతమమకార మేల? మహామహులందరు స్త్రీలనుండియేకద చెడిపోయిరి! మీపరిజ్ఞాన మంతయునే మూలబడెను? ఈఏకాగ్రత శ్రీరామచంద్రునెడ నుండిన నెంత బాగుండును! జన్మ తరించిపోవదా? బుడ్బుదప్రాయములగల దేహముల ప్రేమించిన నేమి లాభము? ఈప్రేమనంతయు భగవంతునికై జూపించిన మీరతిసునాయాసముగ సరయూనది దాటినట్లుగ అతనిచే భవసాగరము దాటించగల్లుదురని మంద హాసముతో బల్కు భార్యమాటలు ముల్కులువలె దోచి వైరాగ్యవిషయ ములు తలపోయుచు నింతకాలము వృథాకాలక్షేపము చేసినందుకు ఖేద మొందుచు, ప్రియా! నీమాటలు నిక్కము. చదువుకున్నవానికన్న చాకలి మేలనినట్లు నాకన్న నీకేపరిజ్ఞానమున్నది. భగవంతుడు నన్నుద్ధరింప దలచి నీచేనీమాటలనాడించెను. నీవేనాగురువవు. నీబోధనచే సంసారార్ణవము దాట గల్లుదును. ఇకనాకు సెలవిమ్ము అన నాభార్య విలపించుచు యెటకుపోయెదరు? ఎవరున్నారన, నాకు శ్రీరామచంద్రుడే కలడు,

శ్లో॥ భోగే రోగభయం, కులే చ్యుతిభయం, విత్తే నృపాలాద్భయం
మానే ద్రైన్యభయం, బలే రిపుభయం, రూపే జరాయాభయం
శాస్త్రేవాదిభయం, గుణేఖలభయం కాయేకృతాంతాద్భయం
సర్వం, వస్తు, భయాన్వితం భువినృణాం వైరాగ్యమేవాభయం॥

భర్తృహరి

అనునట్లు దేనికైనను భయమున్నది కాని వైరాగ్యమునకు భయము లేదు. పోయెవచ్చెదనని పలికి తులసీదాసు వెంటనే బయలుదేరి పాదచారియై బోవుచు కొన్నిరోజులు ప్రయాణముచేసి కాశీపురి చేరుకొనెను. మాణిక్యము మసియున్నను తుడిచినంతనే దానిస్వప్రకాశము వచ్చును. అట్లే ఇతడు స్వల్ప పుమాటలకే విజ్ఞానవంతుడై పోయెను. భర్త వెళ్ళుటజూచి సహింపనేరక మూర్ఛితురాలై కొంతసేపటికి తెలివిజెంది, ఆమె అంత్యకాలమువరకు నిట్లు శోధపడజొచ్చెను. అయ్యో! దైవమా! భర్తకు మంచినుపదేశించిన ఫలము

నాకు భర్తవియోగము కాబోలునని చేయునదిలేక భర్తృనామము నుజపించుచు ఆపతివ్రతచివరకు పరమపద మొందెను. తులసీదాసు కొన్నిరోజులు కాశీలోనుండి విరక్తుడై ప్రయాగ, అయోధ్య, చిత్రకూటము, మొదలగు పుణ్యతీర్థముల సేవించుచు, మధుర, కురుక్షేత్రము, జగన్నాథము, సూకరక్షేత్రము, మొదలగు వానిని సేవించి చాలాదినములు మాత్రము కాశీలోను అయోధ్యలోను గడపుచుండెను. కాశీలో నివసించునప్పుడు తులసీదాసుగారు శౌచముకొరకు గంగయొడ్డునకుబోయి తిరిగివచ్చుసపుడు చెంబులో మిగిలినగంగాజలము ఒకచూతవృక్షమూలమున బోయుచుండెను. ఆవృక్షమూలమున యొకబ్రహ్మరాక్షసి నివసించుచుండెను. పవిత్రహృదయుడగు తులసీదాసు పవిత్రగంగను పోయుటచే ఆబ్రహ్మరాక్షసికి కొంతపూర్వస్మృతి కలిగి క్రూరత్వముపోయి ఆదాసుతోనిట్లుబలికెను. ఓవిప్రుడా! నీవుపోసినగంగాజలముచే శాంతమానసుడనైతిని. నాపాపములు తొలగి కొంతకాలమునకు మంచిజన్మ కలుగునుగాన నేదేని ఉపకారము చేయవలయుననియున్నది కోరుకొనుమన, రాక్షసీ! నాకుహనుమంతునిదర్శన మిప్పించుమని యతడుకోరగ నారాక్షసి యిట్లుపలికెను ఆపనినేనెట్లు చేయగలను? హనుమంతునిపేరు విన్నంతనే మాజాతి బెదరిపోవునుకదా నీకుదర్శన మెట్లిప్పింతును? కానిఒకఉపాయంబు చెప్పెద వినుము. రేపటినుండి యొకదేవళంబున రామాయణముచదువనారంభింపుము. అచటికనేకులు వినుటకు వచ్చెదరు. రామాయణము చదువుచోటికి హనుమంతుడు రాకమానడు. కావున మేమెన్నడునచటికి పోజాలము. అందరితోబాటు పేదముదుసలిరూపమున తానును వినుటకువచ్చును. అందరికన్న ముందువచ్చి అందరికన్న ఆఖరున బోవును. అతడే హనుమంతు డనితెలుసుకొనుము. అతనిపాదంబులబడిన రామదర్శనముకూడ నీకులభింపగలదు. అట్లుచేయుమని చెప్పియారాక్షసి వెడలిపోయెను. పిమ్మట దాసుగారు విశ్వనాథాలయమున నారామాయణముచదువ హనుమంతుడటకు వచ్చుటజూచి గుర్తెరింగి అందరువెళ్లినతరువాత యతనిపదంబులబడి స్వామీ! మీదర్శనభాగ్యము నేటికిలభించెను. దయయుంచి రామదర్శనము చేయింపుమని ప్రార్థింప హనుమంతుడంగీకరించి విప్రోత్తమా! నీవుచిత్రకూటమువచ్చిన రామదర్శనము చేయించెదనన నతడచటకుపోయి రామునిధ్యానింప రామలక్ష్మణులు అశ్వముల

నధిష్ఠించి వేటాడుచున్నట్లును వారొకలేడిని వెంటాడుచున్నట్లును కనబడెను. మరొకమారు కాలినడకతో లేడినిధనుర్ధరులై వెంటాడినట్లు గనపడెను. ఒకడు నీలమేఘశరీరుడు. మరొకడుగౌరాంగుడు. హనుమా! వారెవరని తులసీదాసు బలుక వారేరామలక్ష్మణులు. వారి చిన్నప్పటిదృశ్యముచూపించిరి. అనిబలుక తులసీదాసు బ్రహ్మానందభరితుడై ఆదివ్యమూర్తుల హృదయంబుననిల్పుకొని ధ్యానించెను. ఆప్రకారముగా ఆరోజంతయు ఒకప్రసదర్శనమువలె హనుమంతుడు తనచరిత్రకనబర్చుచుండెను. రామజననము మొదలు రాముని పట్టాభిషేక మువరకును అరణ్యవాసము, రావణవధ, తిరిగి వానరులతో పుష్పకమునై నయోధ్యవచ్చుట, మున్నగునవిచూపెను. అంతయు నొకనాటకమువలె దాసు చూచుచుండెను. పూర్తిఅయినతరువాత నటనేదియు గాన్పింపకుండుటచే తులసీ దాసు ఆశ్చర్యచకితుడై అయ్యో! ఇంతవరకు రామచంద్రుడు కనబడుచునే యుండెనుగాని వానితో నేమియు మాటాడజాలకుంటిని. నావాక్కుస్తంభించెను. ఇంద్రజాలమువలె అంతయుకన్పించెను. స్వప్నమువలెజరిగెనని విలపింప నారం భించెను. ఇంతలో నిద్రవచ్చి పరుండ స్వప్నమందు హనుమంతుడు కనబడి ఓవిప్రుడా! దుఃఖింపకుము కలియుగంబున భగవంతుడు స్వప్నమందేకాని ప్రత్యక్షముగా కనుబడిమాట్లాడడు. నీపూర్వపుణ్యమున తనచరిత్రనంతయు నీకు గనబరచెను. నీవుచూచినదంతయు స్వప్ననిషయములేగాని వేరుకాదు స్వప్నదృశ్యము ప్రత్యక్షమని భావింపుము నీవుతదేకధ్యానములో నుండగ తనచరిత్ర అంతయు సంక్షేపముగ జూపియుండెను. నీవు మహాభాగ్యశాలివి. నీవు వాల్మీకియంతటివాడవు గాన నీవునొక రామాయణము రచించి ప్రజల తరింపజేయుమనిపలికి యదృశ్యు డాయెను. పిమ్మట నయోధ్యకువచ్చి పది నూరువందలముప్ప దొకటవ సంవత్సరమున చైత్రశుద్ధనవమీ భౌమవార మున రామాయణ కథను వ్రాయమొదలిడెనని కొందరందురు కాని అయోధ్యలో ఈకథ వాయప్రారభించితినని దాసుగారే వ్రాసినారుకదా! అక్కడ వైష్ణవులతో బాధలుపడలేక దాసుగారు కథ పూర్తిచేయక కాశీచేరు కొనిరి. అక్కడ వ్రాయుచుండ కొంద రాకతాయు లక్కడను అల్లరిచేసి రాళ్ళురువ్వుట మొదలగునవిచేయుటచే అటనిలువలేక ఆయూరియండే మరొక చోటునకు బోయి వ్రాయుచుండెను. సత్పురుషులచే గౌరవింపబడుచున్నను

దుష్టుల బాధ వారికితప్పకుండెను. కనుకనే దాసుగారు దుష్టులకు సత్పురుషులకు పదేపదే వందనములు చేసియుండిరి. కాశీయందు దాసుగారికి ముఖ్య నివాసస్థానములు నాలుగు. ఒకటి అరసిఘాటు. దానినిప్పుడు తులసీఘాటని బిలుచుచుండిరి. రెండవది గోపాలమందిరము. మూడవది ప్రహ్లాదమందిరము. సంకటమోచన హనుమాన్ మహల్ అని చెప్పుచుందురు. హనుమాన్ మంది రముకడ కొందర యవనుల బాధపడలేక గోపాలమందిరమునకు వచ్చెను. అక్కడ కొంతకాలముండి దుష్టుల బాధపడజాలక అరసీమందిరంబున జన్మాంత రమువరకు నుండెను. అందుచేతనే అదితులసీఘాటని పిలువబడుచుండెను, దుష్టుల బాధలుసహించి గ్రంథమును పూర్తిచేసెను. ఇంకను ఇతరగ్రంథములు చేసియుండిరి కాని రామాయణము చాలా ప్రసిద్ధికెక్కియుండెను. దీని రచనా సమయములో హనుమంతుడు మిక్కిలిసహాయపడి అందములైన పదములు జ్ఞాపకముచేయుచుండెడివాడట. ఇతనికవిత్వము చదివిన శాంతము, సమభావము, గల్గించి, క్రోధముజనింపనీయకుండును. ఇతని జీవితచరిత్ర వర్ణింపనలవికాదు అతిసూక్ష్మముగ చెప్పితిని. వారిగుణగణంబులు వేనోళ్ళపొగడినను తనివితీరదు. ఇతడు హిందీభాషాప్రవీణుడే కాక, సంస్కృతభాషలో మిక్కిలిపండితుడు. హిందీలో ఇతనినిమించిన కవి మరియొకడు లేడు. అతికఠినములైన మాటలను గూడసరళములగునట్లుపయోగించెను. ఇతనిభాష వ్యాఖ్యానములేనిదే సామాన్యుల కర్థముకాదు. గంభీరమైనపదము లతిసులువుగా దరువులయందు ప్రయోగింపబడి మృదుమధురంబుగ నుండెను. వేదవేదాంతసారమంతయు నీగ్రంథమందిమిడ్చెను. అందుచే ఈగ్రంథమునకు మరింతవన్నెవచ్చెను. అంతరార్థములు పూర్తిగ నందరకు దెలియవని చెప్పవచ్చును. ఉత్తరకాండమం దీశ్వరతత్వనిరూపణముచక్కగ వర్ణించెను. ఇతనికవిత్వము పండితప్రశంసనీయమైయుండెను. ఇతనికవితలో మధ్యమధ్య సంస్కృతపదములు మణులవలె ప్రకాశించుచుండెను. ఇతనికవితనుగూర్చి మధుసూదన సరస్వతి యిట్లనిరి.

శ్లో॥ ఆనందకాననే కశ్చిజ్జంగమ స్తులసీతరుః
కవితామంజరీయస్య రామభ్రమరభూషితా ॥

ఆనందకానన మనే కాశీపురియందు తులసీదాసనే యొక చలనవృక్ష మున్నది. దానికి శ్రేష్ఠకవితారూపమనే పూగుత్తి కలదు. దానిపై శ్రీరామ

భ్రమరము విహరించుచు భూషితమై యుండెను. దాసుగారు తమ చరిత్ర నేమియు వ్రాసుకొనలేదు. వినికిడి మాటలచేతను ఇతరులువ్రాసినదాని ననుస రించియు చేతనైనట్లు వ్రాయగలిగితిని. ఈగ్రంథమునుబట్టి మహాకవి యనియు పండితుడనియు భక్తిపరుడనియు, వేదాంతవక్తయనియు తెలియగలము. ఇతడు తనదీనత్వమును హీనత్వమును వర్ణించెను. కాని గొప్పతనమేమియు వర్ణించు కొనలేదు. డాంబికమన్నది యతనికిలేదు. ఇతనిచరిత్ర మాచంద్రార్కము వర్ధిల్లుకాక యని భగవంతుని ప్రార్థించుచుందము.

ఈగ్రంథప్రకాశనమును ప్రోత్సహించిన నా జీవితసర్వస్వపు పాదా రవిందముల హృదయమున హత్తించికొనియే వ్రాయగలిగితిని. ఈగ్రంథమును వ్రాయుటలో సాయపడిన పండితవర్యులు బ్రహ్మశ్రీ కొల్లూరి సోమశేఖర శాస్త్రిగారికి నామనఃపూర్వక వందనములు. ఈప్రచురణమందు సర్వవిధముల దోడ్పడి పరస్థలనివాసాదులకోర్చి శ్రమించిన నాపినమామగారగు శ్రీ యేలూరు పాటి రామభద్రచయనులుగారికి నా నమోవాకములు - వీరి కన్ని సలహాల నొసంగుచు పద్యరచనాదుల దోడ్పడిన శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారికి వందనశతములు. గ్రంథప్రకటనమున గావలసిన యన్ని సౌకర్య ముల దమవిగ భావించి సాయపడి ముద్రించి చక్కని రూపమమర్చిన మా సోదరులు, శ్రీ అద్దేపల్లి ముద్రణాలయాధిపతి శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరాయల వంశోదర్కము నాశించుచు నాశీశ్శతము లొసగుచున్నాను. అడిగినవెంటనే పీఠికను, అభిప్రాయములను దయచేసిన మహనీయులకు వందనశతములు.

ఓం తత్సత్.

రామాయణమహత్వము

తులసీరామాయణములో దోహరలనియు సోరఠలనియు, చౌపాయిలనియు కలవు. రామాయణమంతయు నొకకల్పవృక్షసదృశమై యుండెను. దీని నాశ్రయించినవారి సర్వదుఃఖములు తొలగిపోవును. ఈరామాయణము యొక్క కాండలు స్తంభములై విలసిల్లియుండెను. దీనిలోనున్న దోహరలు సోరఠలు ఆవృక్షరాజమునకు శాఖోపశాఖలై యుండెను. దీనియందున్న అనేక చౌపాయీలే పత్రములై యున్నవి. చ్ఛందస్సుల శోభ చెప్పతరము గాదు. ఈకల్పతరు వెప్పటికప్పుడు నవీనదళములచే ప్రకాశింపుచుండెను. దీని యందు అసంఖ్యాకములైన పుష్పములు అక్షరరూపమున నుండెను. ఈపుష్ప ములయందు కవితారూపమైన అలౌకికసుగంధము వ్యాపించియుండెను. ఇందలి అర్థసమూహాములే ఫలములై యుండెను. అమృతోపమానమైన ఈఫలముల రుచిని సాధుజనులు శ్రోత్రపానము చేయుచున్నారు. భక్తిజ్ఞానవైరాగ్యములే పండ్లరసమై యుండెను. నిర్గుణసగుణములే దాని బీజములు. రామాయణము పఠించినవారి ఫలితములు చెప్పశక్యముగాకుండెను. రామాయణమును తొలుత కాకభసుండుడును పరమేశ్వరుడును కీర్తించియుండిరి. ఆప్రకారము ఆదికవియగు వాల్మీకమహర్షి రచించెను. పిమ్మట నీకథ తులసీదాసుగారు హిందీభాషలో రచించిరి.

" నానాపురాణ నిగమాగమసమ్మతం య
ద్రామాయణే నిగదితం క్వచిదన్యతోపి
స్వాంతస్సుఖాయ తులసీ .రఘునాథగాధా
భాషానిబంధ మతిమంజుల మాతనోతి "

" యత్పూర్వం ప్రభునాకృతం సుకవినా శ్రీశంభునా దుర్గమం
శ్రీమద్రామపదాబ్జ భక్తిమనిశం ప్రాప్తుర్రామాయణం
మత్వాతద్రఘునాథ నామనిరతం స్వాంత స్తమఃశాంతయే
భాషాబద్ధ మిదం చకార తులసీదాస స్తథా మానసం "

ఆమహనీయులీ రామాయణమే రచించకపోయిన కలియుగప్రజలు తరించు మార్గమే లేకుండెను. ఈరామాయణము కామధేనువువలె మనో వాంఛితము లీడేరును. దీని ప్రభావము చింతామణితో సమానము. దీని గుణము లేకవివర్ణించినను అంతు తెలిసికోనలేడు. రాముని స్థానముగాన రామా యణమని చెప్పబడుచుండెను. ఈగ్రంథరాజ ముత్తమమైన పూదోటగా పోల్చ బడియుండెను. ఈతోటయందు రామచంద్రుడు సుందరభ్రమరమై సంచరించు చుండును. రామాయణమనెడి గృహమందు హనుమంతు డెప్పుడు విహరించు చుండును. ఈగృహమందెన్నడు బొరబాటునైనను భూత ప్రేతపిశాచములు చేరరావు. దరిద్రమనునది వీరికిరాదు. దీనియందనేకమంత్రములు తంత్రములు శకునములు కలవు. దీనితో తులతూగుగ్రంథమేదియు లేదు, దీనియందనేక యుపమానోపమేయములుకలవు. త్రేతాయుగమందుండెడి వాల్మీకి మహర్షియె కలియుగమందు తులసీదాసై జన్మించెను. శతకోటి ప్రవిస్తరమైన రామాయ ణము వాల్మీకి రచించియుండెను. దానిని మథించి దానిసారమును గ్రహించి తులసీదాసుగారు సూక్ష్మముగ హిందీభాషలో రచించియున్నాడు. దీనియందు ముందుగా బాలకాండ యుండెను. దానియందు రామజన్మము లీలలు, వివా హము వర్ణింపబడియుండెను. రెండవదైన అయోధ్యకాండలో పితృవాక్యపరిపాల నార్థమై రామవనవాసము వర్ణింపబడియుండెను. తరువాత అరణ్యకాండలో ఖరదూషణవధ సీతాపహరణము వర్ణించబడెను. పిమ్మట కిష్కింధలో హనుమ దాగమనము సుగ్రీవమైత్రి చెప్పబడెను. అటుపైన సుందరమైన సుందరకాం డలో వాయుసూనుడుచేయు యమోఘకార్యములుండెను. రామాయణమున కంతయు అదియే ముఖ్యఘట్టము. సీతారాముల విమోగదుఃఖములబాపి ముద్రి కను సీతకిచ్చి చూడామణిని రామునకిచ్చి వారలశాంతిబరచి వాయుసూను డెన్నియో అమోఘచర్యలు చేసియుండెను. అనేక చిత్రకథలతో లంకాకాండ వర్ణితము. ఉత్తరకాండలోచిత్రవిచిత్ర గాథలతో కాకభుసుండునికథ భక్తిజ్ఞా నవైరాగ్యములు వర్ణించియున్నవి. ఇక్కడికిసప్తకాండలైనవి. ఎనిమిదవది లవకుశ కాండయున్నది. అదియెంతోచక్కగనుండెను. ఇన్నిటితోగూడిన రామాయణ ము సంసారార్ణవమునకు నౌకాదృశ్యము, స్వర్గమునకు సోపానతుల్యము, భక్తుల కానందదాయకము. దీనియందు తెలుసుకొనదగిన వనేకసద్గుణములున్నవి.

ఈగ్రంథము పాపమనే తూలరాశికి వీతిహోత్రనిత్తో సమానము. మోహాంధ కారముల నశింపజేయుటకు రవికిరణసదృశము. కామాగ్నికి శీతలజలము. సత్పురుష చకోరములకిది ఇందుకిరణమువలె సుఖదాయకము. ఇది పఠించిన వారికి సకలాభీష్టములు చేకూరి మనోవిశ్రాంతి కలిగించును. నిర్ధనులు ధనవంతులు, సంతానహీనులు, సంతానవంతులును నగుదురు. ఇది అదియననేల? ఏదికోరిన నదిసిద్ధించును. ఎట్టిరణమునైన నవలీలగ గెల్చి విజయమును సాధింతురు. వేదమను బ్రహ్మాండమండలమునందు రామాయణమనే గంగా జలము నిండియుండెను. తులసీదాసనే భగీరథుడు గంగారూపమైన రామాయణమును భూలోకమందు విస్తరింపజేసెను. ఈగ్రంథములో ద్వైతాద్వైతభేదము లిసుమంతయైనను లేవు. హరిహరభేదము లెంతమాత్రము లేవు.

శ్లో॥ శివాయవిష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయంవిష్ణుః విష్ణోశ్చహృదయం శివః ॥

అను శ్లోకభావ మిందిమిడియున్నది.

శ్లో॥ రకారం రుద్రబీజంచ మకారం శక్తిరుచ్యతే
శివశక్తిసమాయుక్తో రామ ఇత్యక్షరద్వయమ్ ॥

అనునట్లు రామః అను అక్షరద్వయము శివశక్తులతో కూడియున్నది. గాన శివకేశవుల కెంతమాత్రము భేదములేదు. ఈకథలో శివకేశవు లొకరి నొకరు కొనియాడుకొనిరి. రాముడు శివుని జపించెను. శివుడు రాముని జపించెను. ఇందు తులసీదాసుగారు కేవలము రామభక్తులగుటచే రామున కెక్కుడు ప్రాధాన్యమిచ్చి శివకేశవులకు భేదములేదనిమాత్రము చెప్పుచుండెను.

"సంకరప్రియ మమద్రోహి సివద్రోహి మమదాస్
తే నరకరహిం కలపభరి ఘోరనరకమహుం వాస్"

భగవత్స్వరూప మొక్కటియే యైనను వారివారి అభిరుచులబట్టి తాము కొల్చుదైవముల ప్రధానముగ నెంచుచుందురు. ఏనామముతో గొలిచినను భగవంతునికి సంతోషమే. రామాయణము మహార్ణవమును పోలియుండెను. ఈఅర్ణవములో సాధువులు, అసాధువులు, దుష్టులు, సత్పురుషులు, సుమతులు,

కుమతులు, అనునట్టిమూ క్తికములు, రత్నంబులు, ప్రకాళంబు, లునత్తగుల్లలు అనేకములైన క్రూరసాధుజలచరంబు లుండెను. రామాయణ మాహాత్మ్యమును గుర్చించి యొకవిచిత్రకథ కలదు. అదేదన ఒకనొక సమయంబున కొందరు సాధులు రామాయణ ముపన్యసింపుచుండ నటనుండి యొకమహాపాపుడు పోవు చుండగ నామాటలు దైవవశమున వానిచెవులకు సోకియుండెను. పిమ్మట కొంత కాలబున కతడు కాలధర్మమునొంద వాని యసువుల.నపహరింప యమభటులు వచ్చి వానిని కాలపాశముతో బంధించియుండిరి. ఇంతలో విష్ణుదూత లటకు వచ్చిరి. అప్పుడు వారిరువురకు ఇట్లు సంభాషణము జరిగెను. ఓవిష్ణుదూత లారా! వీడు మహాపాపి కావున వీనింగొంపోవ మేమిచట కరుదెంచితిమి, మీరిటు వచ్చుటకు కారణమేమియని యమకింకరులు బలుక, వీడు మహాపాపి యైనను రామాయణకథాభాగము దైవవశమున యీతనివీనుల సోకియుం డెను. అందుచే నితడు విగతకల్మషుడై విష్ణుసాయుజ్యమొంద నర్హుడయ్యెను. గాన ఇతనిని మావిమానంబుపై నిడుకొని మాలోకంబునకు గొంపోయెదమని విష్ణుదూతలు బలుక, యమదూతలు కృద్ధులై సామ, దాన, భేద, దండోపా యము లెన్నిజూపించినను లాభములేక విష్ణుదూతలచే నవమానితులై చేయు నదిలేక వెంటనే వారిలోకమునకు లజ్జావనతవదనులై వెళ్ళిరి. శమనుడు దూతలు రిక్తహస్తులై, దుఃఖితులై, సిగ్గుచే నమ్రవదనులై వచ్చుటజూచి దూత లారా! మీరిట్లుంటిరేల! ఎన్నడు దీనవదనులై యుండగ మిమ్ముల జూడ లేదన దూతలు అంజలిఘటించి ప్రభూ! తమతో ఏమిచెప్పుదుము! చెప్పుట కెంతయో సిగ్గగుచున్నది. విష్ణుదూతలు మమ్మవమానించి మాచేజిక్కిన మహాపాపిని వారివశముచేసుకొని వారిలోకమునకు గొంపోయిరి. ఆసంగతు లన్నియు విశదముగ జేప్పెద మాలకింపుడు. మర్త్యలోకంబున తులసీదాసనే పేరుగల మహనీయుడైన సాధువొకడుండెను. అతడు రామాయణ మతివిచి త్రకథలతో రచించియుండెను. అచట రామాయణము లేని గృహమే కాన రాదు. అందరు విని చదివి వ్రాసి తరించుచున్నారు. మా మాటలు సత్యము. మాకీపాశములతో ప్రయోజనములేదనుచు ఆభటులాపాశములను యమునివద్దనేయుంచిరి. ఇదియంతయుజూచి శమనుడు వికలత జెందుచుండ ఇంతలో మరికొందరు దూతలువచ్చి దుఃఖించుచు ఓ ప్రభూ! మేముపడిన

యవమానము చెప్పతరముకాదు. కారణమేమన తులసీ రామాయణము చక్కని వాఖ్యానములతో నుండుటచే హిందీ తెలిసినవారు అయిన నది చదివి అర్థముచేసుకొన గలుగుచుండిరి. ఏమాత్రము హిందీభాషాజ్ఞానము లేనివారు కొందరు భక్తిశ్రద్ధలతో తెలిసించిన ఆంధ్ర తులసీరామాయణముచదివి కృతకృత్యులు కాజూచుచున్నారు. కొందరు వాల్మీకరామాయణము చదివి తరించుచుండిరి. ఏవిధముగనైనను భూలోకమంతట రామాయణము వ్యాప్తమైయుండుటచే మహాపాపులందరు పవిత్రులగుచున్నారు. అదియుగాక రామాయణమున్న గృహమందొక కపివర్యుడు గానవచ్చుచుండెను. వానివలన మేముపడిన దుఃఖములకు మేరలేదు. ఆ మహాకవి హనుమంతుడై యుండవచ్చును. ఉగ్రరూపముగల్గి మాప్రాణముల తీయనెంచెను. అప్పుడు మేము చేయునదిలేక వానినిశరణువేడి బహువిధముల స్తుతింపసాగితిమి. అప్పుడొక కవివర్యుడు ప్రసన్నుడై మాచే నొకశపథము చేయించెను. చెప్పెదము వినుడు. "రామాయణపుస్తకమున్న గృహమున కెన్నడును పొరబాటునైనను మీరుపోవలదు" అని యతడుబలుక విధిలేక మేమందుల కంగీకరించితిమి. ప్రభూ! మేముమాత్ర మట్టిగృహములకు పోజాలము అని పలికెడు దూతలవాక్యములువిని శమనుడు విస్మితుడై ఓదూతలారా! రామాయణములో భగవానుడైన శ్రీరామచంద్రుని గుణగణంబులు వర్ణింపబడియున్నవి. అంజనీతనూభవుడు దానికిరక్షకుడైయుండెను కాన అట్టిచోటులకు మీరెన్నడును పోవలదు. మీరు అజామీళునికథ నెన్నడును వినియుండలేదా! అతడు భగవంతునిపేరు పుత్రునకు బెట్టుకొని పుత్రవాత్సల్యముచే పలుమాఱు బిలుచుచు చివరకు ముక్తినొందెను. అని వానికథ సాంతముగ వారికిదెలుప వారందరు ఆశ్చర్యచకితులైపోయిరి. ఈమాటలు యమలోకమంతయు వ్యాపించిపోయెను. తులసీదాసు గొప్పతనమును వారందరు కొనియాడసాగిరి. ఇట్టికథలు రామాయణమును గురించి అనేకములున్నవి. రామాయణ పారాయణవలన చతుర్విధఫల పురుషార్థములు లభించుటయేకాక సకలకిల్బిషములు శీతకాలమున నశించు దోమలవలె నశించును. కలియుగమున తరించుటకు రామాయణపఠనము రామనామము కీర్తించుట, జపించుటకన్న మరియొకయుపాయములేదు. రామాయణమున్న గృహము తీర్థరాజముతో తుల్యము. అట్టిగృహము

త్రొక్కినచో పాపజాలములు అగ్నినిబడిన సమిధవలె నశించును. పూర్వపు ణ్యము కొంతకలిగినగాని రామాయణము వినజాలరు. ఈగ్రంథరాజము సత్పు రుషుల మూలధనము. కమలములను భ్రమరములు ప్రేమించునట్లు దీనిని సత్పురుషులు ప్రేమింతురు. రామాయణము భక్తులకు భక్తిరూపము, రసికు లకు రసరూపము, జ్ఞానులకు జ్ఞానప్రదమై యొప్పుచున్నది. తులసీదాసుగారు తాముతరించి యితరుల తరింపజేసినారు. అది షడ్వర్గరోగముల కిది దివ్యౌ షధమువంటిది. దీనిని ప్రేమింపనివారు జీవన్మృతులు. రామాయణ పారా యణవిధానము నారదుడు సనత్కుమారులకు జెప్పియుండెను. విధివిధానమున దీనిని పారాయణ చేసినచో వారికి నిశ్చయముగ ముక్తిలభించుటయె కాక సమస్తకోరికలు సిద్ధించును. రామాయణము, కార్తీకశుక్లపక్షమునను గాని, చైత్రశుక్లపక్షమందు గాని అశ్వయుజ శుక్లపక్షమందుగాని పాడ్యమిమొదలు తొమ్మిదిరోజులు విధిపూర్వకముగ పఠించినచో, ఎట్టి కార్యములనైనను నిర్విఘ్నసమాప్తి నొందించుటకు సందేహములేదు. పారాయణవిధాన మెట్టి దన బ్రాహ్మముహూర్తమునలేచి శౌచాదికర్మల నిర్వర్తించి ధీరత్వముకల వాడై స్నానమాచరించి శ్వేతవస్త్రంబుల ధరించి సంధ్యావందనాది కృత్య ముల నెరవేర్చుకొని ఇష్టదైవమును పూజించి రామాయణగ్రంథము నొక ఉన్నతాసన మలంకరింపజేసి షోడశోపచారవిధిని పూజించి ఈగ్రంథమును పారాయణజేయుచు తొమ్మిదిరోజులలోపున పూర్తిజేసి పిమ్మట 'ఓం నమో నారాయణ' యను విష్ణ్వష్టాక్షరమంత్రంబుచే అష్టోత్తర శతపర్యాయంబులు గోఘృతంబుచే హోమంబుజేసి ద్విజులకు యథాశక్తిగ అన్నదాన మొనరింపవల యును. ఇట్లుచేసిన త్రికరణములచే జేయుసమస్తదోషంబుల హరించి తాము కోరిన సర్వమనోవాంఛాఫలసిద్ధి కలవారగుదురు. అట్టివారు యమసదన మెన్నడు చూడకుండుటయే కాక రామసాయుజ్యము నొందగలరు. దుష్ట వనమునకు రామాయణ మగ్నినంటిది. రామజనన, కళ్యాణ, పట్టాభిషేక ములుచేయు గృహమానంద దాయకమై వర్ధిల్లుచుండును. రామజననమహో త్సవము చేయుటచే సకలసంపత్సౌభాగ్యములతో తులదూగెదరు. రామకళ్యా ణముచేయుటచే ధనకనకవస్తు వాహనంబులతో తులదూగుచుందురు. పట్టాభి

షేకమహోత్సవంబులు జరుపుటచే అష్టైశ్వర్యంబులుకల్గి మంచికీర్తికల్గి చిరాయువులై యిహమందు ఖ్యాతిజెంది తుదకు పరమపదము నొందెదరు.

శేషుడు, శారద, శివవిరించులు, రామాయణ మహత్వమును వర్ణించి తృప్తినొందజాలకుండిరి. నేనుమాత్రమింతకన్న నేమి వర్ణించగలను? దీనిని గురించి మరియొక విచిత్రమైన కథగలదు. పూర్వము తులసీదాసుగారి కాలమున ఈకథ జరిగియుండెను. ద్రవిడభూపాలునకు సమస్తసంపదలుండెను గాని సంతానమే కొరతగనుండెను. అతడు విష్ణుభక్తుడై యుండెను. అతడు మిక్కిలిధనవంతుడై యుండుటచేత, ఇతనిధనమునకు రాజ్యమునకు దాయాదులాశించి రాజు సంతానవిహీనుడై యుండుటకు వారు మురియుచు, రాజుయందసూయాభావమును జూపుచు సంపద తమకెప్పుడు వచ్చునాయని కనిపెట్టుకొని యుండిరి. పాపమారాజుభార్య అనేక వ్రతములు దానములు తీర్థయాత్రలు, సాధుసత్కారంబులు, చేయుచు యెప్పుడు సంతానభాగ్యము కలుగునా! యని యెదురుచూచుచు అనేకధర్మకార్యములు చేయుచుండెను. భార్యా భర్త లిరువురు సద్ధర్మపరాయణులై పుణ్యతీర్థముల సేవించుచు, విశ్వనాథ నిలయమైన కాశీక్షేత్రమును చేరి ఆనందముతో గంగాస్నానము చేసి విశ్వనాథుని దర్శించి అర్చించి అన్నపూర్ణను సేవించి ఆపురిని నివసించు తులసీదాసుయొక్క ఘనత తెలుసుకొని వారిసన్నిధికేగి ఓ ప్రభూ! దయామయాయనుచు నమస్కరించి, మాకు సకలసంపత్తులు కలవుగాని సంతానభాగ్యము నోచుకొనమైతిమి. మాయందు దయయుంచి, మాకు పుత్రుడుగాని, పుత్రిక గాని కలుగునట్లాశీర్వదింపుడు. తమరు సిద్ధపురుషులు, మీ యాశీర్వచన ఫలమమోఘము. మా శత్రురాజులు సంతానవిహీనుడనని నన్ను హేళనచేయుచుండిరి. దాయాదులమాట చెప్పనేల? సంతానములేని దుఃఖముకన్న వాగుచేసెడి యవమానము భరింపలేకుంటిమి. ఓ తండ్రీ? మావంశమునిలిపి పుణ్యము గట్టుకొండని ప్రార్థింప, కరుణానిధియైన ఆ తులసీదాసుగారు జాలిజెంది, ఓ ద్రవిడభూపాలా! నీవు శ్రద్ధాభక్తులతో రామాయణము విన్నచో, నీయన్నికోర్కెలు సిద్ధించును. తప్పక సంతానము కలుగును. యారాజు కొన్ని దివసము లటనుండి తులసీదాసుగారు రచించిన రామాయణము వారి వలననే ప్రారంభమునుండి తుదివఱకును శ్రద్ధాభక్తులతో విని పిమ్మట తన

దేశమునకు వచ్చియుండెను. వెంటనే యారాణి గర్భవతియై నవమాసములు నిండిన తరువాతసుఖప్రసవమై పుత్రికను కనెను. కుమార్తెను జూచిభార్యాభర్త లిరువురు మహదానందమునొందిరి. కాని కుమారుడుదయించలేదని దిగులుపడ జొచ్చిరి. దాయాదులనుదుఃఖింపజేయుటకై పురోహితునకుకబురుబంపి అటనున్న దాసీపరివారంబుల వశపరచుకొని పుత్రుడు కలిగెనని ప్రకటింపజేసి పుత్రోత్స వముజేసి జాతక కర్మాదిసంస్కారముల జేయించియుండెను. అందరు పుత్రుడ నియే భావించుచుండిరి. రాజు శత్రుసముదాయము దుఃఖించుచును మిత్రులు సంతసింపుచును నుండిరి. ఇట్లుపురుషాకృతితో దినదినవర్ధమానయై బెరుగు చుండ పన్నెండేండ్ల వయసురాగనే గొప్పగొప్ప శ్రీమంతులైన రాజులు తమ కన్యకల నీయవచ్చిరి. వారల జూచి రాజు కంగారుపడుచుండెను. ఈ యాపద యెట్లుతప్పునోయని దంపతులు ఖేదమందుచు తులసీదాసును ప్రార్థింప జొచ్చిరి. ఇటులనే కాశీరాజుకు చాలకాలము సంతానములేక రామాయణము వినుటచే ఒకపుత్రుడు నొకపుత్రికయుజన్మించిరి. వారలనతిగారాబంబున బెంచుచు పుత్రికను ద్రవిడభూపాల పుత్రునకీయదలచి ఒకశుభముహూర్తంబున బయలు దేగి యిటకువచ్చియుండెను ఇతడు వివాహప్రయత్నమునకై వచ్చియుండెనని విని ద్రవిడరాజు గడగడ వణకసాగెను. ఈమర్మము తెలియక కాశీరాజు పెద్ద లను గురువులను రావించి వివాహముహూర్తము పెట్టించి యొప్పించి ఇంటి కేగెను. అతడు వివాహప్రయత్నములు చేయించి ముహూర్తము పెట్టించి కబురు పంపినను ద్రవిడరాజు వివాహమునకు రాకబోవుట జూచి కాశీరాజు కోపగించి చివఱకిట్లు కబురు చేసెను. ఓ ద్రవిడ భూపాలా! నాయాజ్ఞ మీరు చుంటివి. యోగ్యుడవని నీకుమారునకు పిల్లనీయదలచితిని నీవు తిరస్కరించు చుంటివి. కారణము తెలియుటలేదు. నీకొకమాసము గడువిచ్చితిని. ఈలోపున నీకుమారుని తీసికొని వివాహమునకు రాకుంటివేని, నిన్ను నీపుత్రుని నీసంపదను క్షణములో నశింపజేసెదను. నాబలమెరుగకుంటివికాబోలు నని వార్తనంప నతడు దుఃఖించుచు చేయునదిలేక కాశీరాజు బలవంతుడని తెలుసు కొని, రహస్యముగ తులసీదాసుగారి కడకేగి సర్వము విన్నవించుకొన ఆమహా నీయుడు జాలినొంది రాజా! దిగులుజెందకుము నీకు పుత్రిక నొసగినవాడే యీయాపదనుండి రక్షింపవలయును. కాన నీవింటికేగి రామనామమున్మరింపుచు

రామాయణమొక యున్న తాసనంబున నిడి ఆచారపరుడవై త్రికరణంబుల భగవంతుని నమ్మి ముందుగ గణపతికి మ్రొక్కి పిమ్మట తొమ్మిదిరోజులు యథావిధిగ నర్చించి రామాయణము శ్రద్ధాభక్తులతో చదువుము. అన్ని రోగములకు నదియేమందని పలుక రాజింటికివచ్చి అట్లుచేయ పుత్రిక పుత్రుడుగా మారిపోయెను. దానితో రాజు ఆనందమునకు మేరలేకుండెను.

పిమ్మట కాశీరాజుకుమార్తెను తనకోడలిగా జేసికొని ఆనందముతో కాలము గడుపుచు తనకు వార్ధక్యము రాగానే పుత్రునకు పట్టాభిషేకముజేసి సర్వనీతులుగఱపి సర్వవిద్యాధురంధరుడై నీతితో రాజ్యముచేయు పుత్రునిజూచి యానందించి ఆముదుసలిదంపతులు తుదకు రామదివ్యధామమునొందిరి. రామాయణమునందింతమహత్తుకలదు. ప్రపంచమును తలక్రిందులు చేయు శక్తి యందున్నది. బ్రహ్మచారి వినిన వివాహమగును. వంధ్యలు పుత్రవంతులగుదురు. సర్వవిజయములు చేకూరును. కోరినవెల్ల చేకూరును. భక్తితో నీగ్రంథము రచించినవారికి అద్భుతశక్తుల గలుగజేయును. దీనిలో భగవత్కథ లున్నవి గాన దీనికింత మహత్తుకలదు. ఆనందవనంబున తులసీదాసనే మహావృక్షమున అతనికవిత్వమనే పూగుచ్ఛమునందు శ్రీరామచంద్రభ్రమర మలంకరింపబడియుండెను. అందుచే ఈకావ్యము వ్రాసినతులసీదాసుగారు ధన్యులు. విన్నవారలు ధన్యులు. ఈగ్రంథరాజ మాచంద్రార్కము ఇంటింట వెలయుగాక. ఈరామాయణమహత్వమువిన్నను, చదివినను, వ్రాసినను చతుర్విధపురుషార్థములు కల్గిఇహపరసౌఖ్యము లందగలరు.

కొత్తపేట,
తూర్పుగోదావరిజిల్లా
31—12—57

యేలూరుపాటి లక్ష్మీసరస్వతి
అనువాదిని

ఇ కం


విషయసూచిక

		పుట
బాల కాండము	... ...	1
అయోధ్య కాండము	... ...	143
అరణ్య కాండము	... ...	223
కిష్కింధా కాండము	... ...	250
సుందర కాండము	... ...	369
లంకా కాండము	... ...	291
ఉత్తర కాండము	... ...	389
లవకుశ కాండము	... ...	443

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
224	1	ద్వి	ర్వి
,,	2	బు	జ
,,	8	సు	ను
225	22	మదరం	మందరం
246	8	న	ను
380	7	భోగ	బోధ
381	2	శ్రీరమ	శ్రీరమణం
,,	18	జహితి	జహితే
394	1	చాడు	చుట
413	18	డుడు	డున
415	20	ధలిచి	దలచి
418	2	ళీయక	ళ
,,	7	రి	రా

శ - స, ర - ఱ లు స్తం - స్థం పొరబడి యుండనోపును.



రచయిత్రి

శ్రీమతి యేలూరుపాటి లక్ష్మీసరస్వతిగారు

విరోధికృత్ సంవత్సర కార్తీక బ. పంచమి (11-11-1911)

శ్రీ గురుభ్యోనమః

శ్రీహరిహరమూర్తయేనమః

శ్రీ రామమానస సరోవరమనెడి
ఆంధ్ర తులసీ రామాయణము నందలి బాలకాండము

శ్లో॥ వర్ణానామర్థసంఘానాం రసానాం ఛందసామపి
మంగళానాం చ కర్తారౌ వందే వాణీవినాయకౌ॥

స్వస్తి. శ్రీజగదభ్యుదయహేతుభూతసమష్టివ్యష్టివిద్యాధిష్ఠాత్రియగు సరస్వతిని, ఆమెశక్తిచే విజృంభించినవిద్యలయొక్క- విఘ్నములను నివారించెడి గణపతిని, వర్ణపదవాక్యఛందోమయము, గద్యపద్యాత్మకము, లలితార్థగుంభితము, శాంత్యాదినవరసభరితమును, సర్వమంగళకరము, శ్రుతిస్మృతీతిహాసావిరుద్ధమును అగు, నాచే నారంభింపబోయెడి యీగ్రంథముయొక్క- నిర్విఘ్నపరిసమాప్తికొఅకు నమస్కరించుచున్నాను.

శ్లో॥ భవానీశంకరౌ వందే శ్రద్ధావిశ్వాసరూపిణౌ
యాభ్యాం వినా నపశ్యంతి సిద్ధాః స్వాంతస్థ మీశ్వరమ్॥ 2

శ్రద్ధావిశ్వాసములు లేనినాడు, సిద్ధులు సయితము తమలో నుండెడి పరమాత్మను జూడజాలరో అట్టి శ్రద్ధావిశ్వాసరూపులగు, భవానీశంకరులకు నమస్కారము.

శ్లో॥ వందే బోధమయం నిత్యం గురుం శంకరరూపిణమ్
య మాశ్రితోహి వక్రోపి చంద్రఃసర్వత్ర వంద్యతె॥ 3

కుటిలుడగు చంద్రుడు ఎవని నాశ్రయించుటవలన సకలజగద్వ్యంద్యుడగుచున్నాడో, అట్టి బోధరూపుడును, సుఖకరుడును అగు గురువునకు నా నమస్కారము.

శ్లో॥ సీతారామగుణగ్రామ పుణ్యారణ్యవిహారిణౌ
వందే విశుద్ధవిజ్ఞానౌ కవీశ్వరకపీశ్వరౌ॥

శ్రీ సీతారాములయొక్క సద్గుణపుంజమనెడి పవిత్రారణ్యమున విహరించునట్టియు, శుద్ధమయిన విజ్ఞానముకలట్టియువాల్మీకివాయుపుత్రులను నమస్కరించుచున్నాను.

శ్లో॥ ఉద్భవస్థితిసంహార కారిణీం క్లేశహారిణీమ్
సర్వశ్రేయస్కరీం సీతాం నతోహం రామవల్లభామ్॥ 5

ఏతల్లి సృష్టిస్థితి లయములజేయుచు, సమస్తక్లేశములను హరించుచు, నుత్తమ శ్రేయస్సుల నొసంగునో అట్టి రామవల్లభయగు సీతాదేవికి నమస్కారములు.

శ్లో॥ యన్మాయావశవర్తి విశ్వమఖిలం బ్రహ్మాదిదేవాసురాః
యత్సత్వాదమృషేవభాతి సకలంరజ్జ్వాయధాహోర్భ్రమః
యత్పాదప్లవమేకమేవహి భవాంభోధె స్తితీర్షావతాం
వందేహం తమశేషకారణపరం రామాఖ్యమీశం హరిమ్॥ 6

బ్రహ్మాదిదేవతలు, అసురులు, సకలప్రపంచము ఎవనిమాయకు లోబడి యుండునో రజ్జువునందలి సర్పమువలె నెవనియందు కలితమయిమృషా భూతమగు నీజగత్తు మనకు సత్యమయినదివలె భాసించుచున్నదో సంసార సముద్రమును దాటదలచినవారికి ఎవనిపాదపద్మమొక్కటియే తెప్ప యగు చున్నదో అట్టి సకలజగత్కారణమును సర్వోత్కృష్టమునునగు రామనామము కల హరిహరాత్మకమగు దేవుని నమస్కరించుచున్నాను.

శ్లో॥ నానాపురాణనిగమాగమసమ్మతం యద్రామాయణేనిగదితంక్వచిదన్యతోపి
స్వాంతస్సుఖాయ తులసీరఘునాథగాథా భాషానిబంధమతిమంజులమాత
నోతి. 7

సమస్త నిగమాగమ పురాణసమ్మతమును వాల్మీకిరామాయణసార రూపమును శ్రీరామచరితమును ఇతరగ్రంథములయందు చెప్పబడినట్టియు తులసీదాసు తనమానసికానందము కొఱకు, మనోహరమైన భాషాప్రబంధ రూపముగ రచించుచున్నాడు.

1. ఏమహాత్మని స్మరణమాత్రముచే సమస్తమనోరథములు సిద్ధించు చున్నవో ఏమహామహుడు బుద్ధిసమూహమనెడి శుభగుణములకు నిధియో, ఏమహనీయుడు ప్రమథగణములకు నాయకుడో, ఎవడు గజరాజువదనుడై విలసిల్లుచుండునో, అట్టిగణపతి నన్ననుగ్రహించుగాత.

2. ఎవనికృపచే మూగవారు వాచాలురగుదురో, పంగువువెత్తైన పర్వతము నధిష్టించుచున్నాడో, ఎవనికృపచే కలికలుషములు నశించుచున్నవో, అట్టిభగవానుడు నాయందు ప్రసన్ను డగుగాక.

3. నల్లకలువలతో సమానమగు దేహచ్ఛాయ కలిగినట్టియు, ఎఱ్ఱతామరతేకులమీరు కన్నులు కలిగినట్టియు, క్షీరసాగరశాయియగుపరమేశుడు నాహృదయమందు నివసించుగాక.

4. కుందేందు సమదేహకాంతి కలిగినట్టియు, కరుణానిధానమును, మన్మధవైరియును, దీనబాంధవుడు, నగునుమారమణుడు నన్ను నుగహించుగాత.

5. మహామోహాంధకారమునుదొలగించుటకు సూర్యకిరణసదృశములగు విష్ణుసమానరూపులును, కృపాసింధువులునగు గురువులయొక్క పాదపద్మములకు నమస్కరించుచున్నాను.

6. ఏపరాగము, కాంతి సారభరసరాగ భరితమో, దేనివలన సకల సంసారదుఃఖములు పరిహృతములగుచున్నవో, అట్టిగురుపాదకమలపరాగమునకు వందనము.

7. మఱియు నీపరాగము పుణ్యమూర్తియగు శివునిచే ధరింపబడిన విభూతివలె ప్రకాశించుచున్నది. మనోహరమును, మంగళకరమును, ఆనందప్రదమును, అగుచున్నది. భక్తజనమనోరూపమగు దర్పణమాలిన్యమును హరించుచున్నది. దీనిని తిలకముగ ధరియించినచో సకల సద్గుణములు సిద్ధించును.

శ్రీ గురుపద, నఖకాంతులు హృదయమునందు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నవి. మఱియు హృదయమునందలి మోహాంధకారమును నశింపచేయుచున్నవి. దోషబహుళము, దుఃఖమయమునగు సంసారమనెడి చీకటిని నశింపజేయుచున్నవి. మఱియు గనిలో మరుగుపడియున్న రామచరితమను మాణిక్యమును ప్రకటించుచున్నది.

చతురుడగుసాధకుడు నేత్రములందు సిద్ధాంజనమును ధరించి పర్వతవన భూభాగములందు సంచరించుచు, ఆయానిధులను చూచునట్లు, గురుచరణ కమల రజస్సును ధరించిన సుమతికి, వేదపురాణప్రసిద్ధమగు రామచరితము గోచరమగుచున్నది.

గురుచరణపరాగము నేత్రరోగములను నశింపజేయు సిద్ధాంజనము. అద్దానిచే నేను నాజ్ఞాననేత్రమును నిర్మలముచేసికొని భవభంజకమగు రామ చరితమును వర్ణించెదను.

ఏవి మోహమూలములగు సర్వసంశయములను తొలగించుచున్నవో, అట్టి బ్రాహ్మణచరణములకు నావందనములు. మఱియు సకలగుణసంపన్న మగుసుజనసమాజమును ప్రీతిపూర్వకముగ సాదరవాక్కులతో నమస్కరించు చున్నాను.

సాధుచరితము వస్త్రాదిరూపమునొందిన దూదివలె స్వార్థరహితమయిన ఫలముల నిచ్చుచున్నది. మఱియు తాను పరోపకారముకొఱకు క్లేశములను సహించును. కాన నమస్కారార్హులు సజ్జనులు.

ఈశుభప్రదమగు సజ్జనసమాజమును, జంగమమగు తీర్థరాజమనవచ్చును. ఇందు రామభక్తియను గంగ, బ్రహ్మవిచారమనెడి సరస్వతి, కలికలుష హారిణియు, విధినిషేధాత్మకములగు కర్మలనెడి యమునయు కలవు. మఱియు నానందమంగళప్రదమయిన హరిహరకథారూపమగు త్రివేణియు నిందు విరా జిల్లుచున్నది. మఱియు నిట నిశ్చలమగు స్వధర్మవిశ్వాసమే, అక్షయ వటము. ఈసజ్జనసమాజము తీర్థరాజమువలె శుభకర్మకలితము. ఈసమాజ మునకు ఎల్లపుడు నన్ని దేశములు స్వాధీనములు. ఇది తన నాశ్రయించినవారి క్లేశములను దొలగించుచున్నది. కాన నీయలౌకిక తీర్థరాజము, తత్కాల ఫలంబుల నిచ్చుచు, తనప్రభావమును ప్రకటించుచున్నది.

ఎవరీ సజ్జనతీర్థరాజమును, ఆదరాను రాగములతో, భక్తినమ్మిలై, సేవింతురో, వారిశరీరముతోడనే చతుర్విధపురుషార్థముల నందగలరు ఈసజ్జన తీర్థమందు స్నానమాచరించిన, ఫలము, తోడనే సిద్ధించును. ఇందు కాకి కోకిలగను, బకము మరాళముగను మారును. ఈమాటను విని ఎవరును ఆశ్చర్యమును జెందబనిలేదు. సత్సంగమహిమ దాగునదికాదుగదా. ఈమహి మను వాల్మీకినారదాగస్త్యులు కొనియాడిరి.

ప్రపంచమునందలి నభశ్చర, జలచరములగు జడచేతనముల సము దాయము, యీసత్సంగమువలననే మతి, కీర్తి, సద్గతి, బుద్ధుల నందుచున్నది. వీనినందుటకు మఱియొక యుపాయములేదని లోక వేదములు చాటుచున్నవి.

సత్సాంగత్యములేనిచో వివేకముదయించదు. భగవదనుగ్రహములేనిదే సత్సాంగత్యము లభింపదు. ఈ సత్సంగతి మంగళానంద ప్రదమగు వృక్ష మూలము. ఇందుసాధనములు, పుష్పములు. వారిసిద్ధాంతోపదేశములు ఫలములు.

పరశువేది సంబంధమువలన లోహము, సువర్ణమగునట్లు, సత్సంగతిచే మూర్ఖుడుగూడ సుజనుడగుచున్నాడు. దైవవశమున సుజనునకు, కుజన సాంగత్యము కలిగినను, విషహరమగు సర్పమణి శిరమునందున్నను, నిజ గుణమును వీడనట్లే, సజ్జనుడు తననిజగుణములను విడువజాలడు.

దోసిలియందలి పూవులెట్లు కుడిఎడమలనుభేదములేకుండ రెండుచేతులను పరిమళింపజేయునో, అట్లేహితాహితభేదములేక సర్వులననుగ్రహించెడి సజ్జనులకు నానమస్కారము.

సజ్జనులు సరళచిత్తులు, జగద్ధితాభిలాషులునని యెరింగి, అజ్ఞానినగు నాప్రణతులగైకొని, రామపదభక్తిని నాకు ప్రసాదింపుడని నేను వారిని ప్రార్థించుచున్నాను.

ఎవరు తమలాభనష్టములను గణింపక, పరాపకారమునే ప్రధానముగ దీసికొనుచుండెదరో, ఎవరు రాహువు చంద్రునివలె, సత్కీర్తిని గ్రహింతురో, మఱియు పరహితమును నశింపజేయునప్పుడు సహస్రబాహువులను, పరదోషాన్వేషణమందు సహస్రాక్షులుగ నుందురో, ఎవరు పరహితమనెడి ఘృతమును గ్రోలుటకు మక్షికములగుచుందురో, వీరు తేజమునందగ్నిని, రోషమునందు యమునిని, పాపముదుర్గుణములనెడి ధనమునందు, కుబేరుని పోలియుందురు. ఎవరిహృదయము కేతు గ్రహతుల్యమో, ఎవరుకుంభకర్ణునివలె సతతనిద్రావశులగుటయే యుక్తమో, ఎవరు పరులకోరికలను నశింపజేయుటకు తమదేహపాతమును గూడ గణింపరో ఎపరుపంటచేలను నశింపజేయు వడగండ్లవలె, ఎవరు పరదోషములను శేషునివలె సహస్రముఖముల వల్లింతురో, ఎవరు పరదూషణములను పదివేలచెవులతో వినుచుందురో, ఎవరు ఇంద్రునివలె సురాసక్తమానసులో, ఎవరు వజ్రమువలె నిష్ఠురోక్తులు కలవారో ఎవరు పరదోషములను జూచునప్పుడు వేయికన్నులు ధరింతురో, ఎవరికి శత్రుమిత్రోదాసీన భేదములేక వృశ్చికవృత్తికలదో, ఎవరు ప్రమాదమునన్నైనను, హితమును

స్వీకరింపరో, ఎవరు యెంతప్రేమించిపెంచినను కాకి మాంసమునువలె తమ దౌష్ట్యమును విడువరో, అట్టిఖలులకు నా నమస్కారములు. వందనంబున వశముకానిదిలేదు. కాన ఖలులుగూడ నన్ననుగ్రహింతురుగాత.

సుజనులు వియోగకాలమున దుఃఖప్రదులగుచున్నారు. ఖలులు సంయోగకాలమున దుఃఖప్రదులు. కాన వారిరువురు సములే. అట్టి వారిరువురి పాదములకును నా నమస్కారము.

కమలములకు జలగలకు, మదిరామృతములకును ఉత్పత్తిస్థానము ఒక్కటియే అయినను గుణభేదమున్నట్లు, ఖలసుజనులకుత్పత్తిస్థాన మొక్కటియైనను గుణభేదము తప్పదు. మంచిచెడ్డలు, కీర్త్యపకీర్తులు వారివారికర్మను సారముగ సిద్ధించుచుండును. సాధువులు చంద్రామృత గంగాసమానులు. అసాధువులు విషాగ్ని నాశవ్యాధసములు. సురాసములు ఖలులు. వీని కన్నిటికిని ఉత్పత్తిస్థానము సముద్రమొక్కటియే. ఇట్లు వారిగుణాగుణములను దెలిసి సద్భావముతో మెలగినవారందఱును మనకనుకూలురగుదురు.

సుధ అమరత్వమును, గరళము మరణమును గల్పించి పేరుపొందినట్లు, సత్కర్మలచే సాధువులు, దుష్కర్మలచే నసాధువులును పేరును పొందుచున్నారు. ఖలులదుర్గుణములు, సుజనసద్గుణములును అగాధములు, అనంతములును అగుచున్నవి. కాన నేనీ రెంటిని స్వల్పముగానే, వర్ణింపగలిగితిని. మంచిచెడ్డలను విధాతసృజించెను. వీనివిభాగము వేదములందు ప్రసిద్ధము.

సుఖదుఃఖములు, పుణ్యపాపములు, దివారాత్రంబులు, కుజనసజ్జనులు, దేవదానవులు, ఉచ్చనీచంబులు, విషామృతంబులు, సంజీవినీమృత్యువులు, మాయాబ్రహ్మలు, జీవేశ్వరులు, లక్ష్యాలక్ష్యంబులు, ధనికనిర్ధనులు, కాశీమగధలు, గంగాకర్మనాశములు, మాళవమరుదేశంబులు, బ్రాహ్మణ చండాలురు, స్వర్గనరకంబులు, అనురాగవిరాగంబులు, గుణదోషములు, అనెడి విభాగము, నిగమాగములందు ప్రసిద్ధముగ నున్నది.

ఇట్లు బ్రహ్మచే సృజింపబడిన గుణదోషములలో, హంస పాలను వలె సజ్జనుడు గుణములను మాత్రమె గ్రహించు చున్నాడు. బ్రహ్మయొసగిన వివేకమువలన గుణదోషముల నెఱింగి గుణములందు లీనమగువారు సుజనులు.

---

* సురా + ఆసక్తి — సుర + ఆసక్తి

కాలకర్మలను బట్టి ఒకప్పుడు సుజనుడు గూడ ప్రకృతికిలోనగుచుండును. కాని భక్తజనులు మాత్రమెన్నడు నట్లుపొరబడరు. దుఃఖదూరులై నిర్మలయశమును పొందగలరు. ఖిలులు మంచికర్మలజేసియు తమస్వభావమును మాత్రము వీడ జాలరు. కొందఱు వంచకులు సాధువేషముల ధరించి జగత్తును వంచించు చున్నారు. అయినను వారివేషము పూజ్యమే యగుచున్నది. కాలనేమి మున్నగువారి కపటమెట్లు అంతమందుప్రకటమయినదో, అట్లే ఖలస్వభావము చివరకు వ్యక్తము కాకతప్పదు. సాధువులు, కువేషధారులయినను హనుమ జ్జాంబవదాదులవలె పూజ్యులే యగుచున్నారు. సత్సంగము శ్రేయస్కరము. అసత్సంగమువలన హాని కలుగుననువిషయము లోకవేదవిదితమే గదా. భూమి యందలి ధూళి, పవనసంబంధమువలన నంతరిక్షమున కేగుచున్నది. అదియే జలసబంధమువలన అడుసుగా తయారగుచున్నది. సాధువుల ఇండ్లయందలి చిలుకలు మున్నగునవి రామనామమును బలుకుచుండును. అసాధువుల ఇండ్ల యందలి చిలుకలు అసభ్యములగుతిట్లను బలుకుచుండును.

శుక్లకృష్ణపక్షములందు చంద్రుడు సమముగనే ప్రకాశించుచున్నాడు. కాని ఆతని యుపయోగమునుబట్టి పక్షములకు నామభేదము కలుగుచున్నది. ఏపక్షము నందలి వెన్నెల ప్రజలకు సంతసమును కలుగున్నదో అదిశుక్లపక్షము. అట్లు సంతోషముకానిపక్షము కృష్ణపక్షము. ఇట్లే సత్పురుష కాపురుష భేదమును, గుణదోషభేదమును, తమయుపయోగమును బట్టి లోకులు నిర్ణయింతురు. జడచేతనరూపమగు ప్రపంచమంతయు సీతారామమయమగుటచే నేనీప్రపంచమునందుగల చేతనాచేతనవర్గమును నమస్కరించుచున్నాను. కాన మీరందరు నన్ను మీకింకరునిగ ననుగ్రహించ ప్రార్థించు చున్నాను. మీరనుగ్రహింపనిచో నాబుద్ధిబలమేమియు నుండదు. నేను శ్రీరామచరితను వర్ణింపబూనితిని. కాని నా బుద్ధి చాలస్వల్పము. నా కోరికమాత్రము చాల పెద్దది. మజ్జగత్తైనను గతిలేనివాడు అమృతము నభిలషించు నట్లున్నది. నాస్థితిబహ్వంగములుకల కావ్యమునందొకయంగమునుగూడ నే నెఱుగను. కాన నామనసాందోళనపడుచున్నది. నాయీమాత్సర్యమును క్షమించి సజ్జనులు నాపలుకులనాలకింతురుగాక. బాలురతొలిపలుకులను విని తల్లిదండ్రులానందింతురుగదా. కుటిలమతులు నావాక్కులను పరిహసించినను, పరదూషణను

గూడ భూషణముగ గ్రహించెడి సుమతులు పరిహసింపరు. అట్టివారు స్వల్ప సంఖ్యాకులయినను చాలును. కాకులు కోకిలను భేకములు చాతకమును పరిహసించునట్లు నన్నును కొందఱు పరిహసింపవచ్చును. మతియు నాకు రామపదభక్తియే కలదు కాని కవితాచాతురి లేదు. భగవద్భక్తిలేనివారికి విష్ణుకథలు నీరసములుగ గన్పట్టును. వారికి వాదమునందున్నప్రీతి దీనియం దుండదు. నేను కవిని గాని, సకలకలాప్రవీణుడను గాని, కాను. అయినను రామభక్తిభరితమగు నాకవితకు సత్పురుషులు సంతసింతురు. కవిత్వము రసభావభరితము, గుణాలంకారసహితము. నాకువీనిలోనొకటియు దెలియదు. కాన నాకవిత్వము సర్వగుణరహితము. అయినను రామప్రభుని చరిత్రమను విశ్వవిఖ్యాతమయినగుణమొకటి కలదు. నిర్మలవిజ్ఞానముకలవారు దీనిని తప్పక వినగలరు. ఈకవితలో నత్యుదారము నతిపవిత్రమును సకలవిద్యాసారమును నగు రామనామము కలదు. ఈనామము మంగళములకు మూలము. అమంగళ ములకు నాశకము నగుచున్నది. దీనినే శివపార్వతులు భజించుచుందురు. రామకథాసుధారహితమగు కవిత ఎన్ని అలంకారములతో గూడినను, సర్వా భరణసంపన్నయగు చంద్రముఖి, కర్ణతాటంకరహితయగుచో, శోభిల్లనేరదు. కవిత గుణరహితయైనను ఇది రామనామాంకితమగుటచే సత్పురుషులు మధు కరములవలె నిందలి మాధుర్యమును గ్రహింతురు. కవితయం దేగుణమును లేకున్నను అందలి రామనామప్రభావము సర్వప్రత్యక్షసిద్ధము. అగరుధూమము కటువైనను అందలి సుగంధమెట్లు సర్వజనాదరణీయమో అట్లే నాకవితయు కావచ్చును.

గంగాయమునలు ఎంత కుటిలములయినను, అందలిజలము పవిత్రమే యగుచున్నది. శ్మశానభస్మమపవిత్రమయినను శివశరీరసంగతిచే నది పవిత్ర మగుచున్నది. అట్లే నాకవిత్వమెంతవంకరదైనను, జగన్మంగళకారియగు, రామనామమిందుండుటచే సజ్జనాదరణీయము అగుచున్నది.

మలయసంబంధమువలన చందనమెట్లు సర్వజనాదరణీయమగుచున్నదో, అట్లే నాకవిత్వము రామనామాంకిత మగుటవలన సర్వజనాదరణీయమగుచున్నది.

గోవులందు వర్ణభేదమున్నను, క్షీరములు మాత్రము శుద్ధములై ఏకా కారముగనుండి సర్వజనాదరణీయము లగుచున్నవి. అట్లే నాకవిత్వమెట్లున్నను

అందలి సీతారామకథామృతము మధురము. సర్వజనాదరణీయమును. కాన వినుము, కీర్తింపుడు.

మణులు మాణిక్యములు, ముత్యములు, సర్పములయొక్క శిరస్సులందును, పర్వతములందును, గజకుంభములందును ఉద్భవించిననువానికి శోభావహములుకాక, రాజకిరీటములకును, తరుణీశరీరమునకును శోభను కలిగించుచున్నవి. అట్లే సుకవికవిత్వమును వానియందు శోభిల్లక దూరమునందున్న సహృదయులందు శోభించుచుండును. సుకవులు స్మరించినంతనే వాగ్దేవి బ్రహ్మలోకమును విడిచి పరుగుపరుగున వారిని సమీపించుచుండును.

శ్లో॥ ఋుడితి జగతీ మాగచ్ఛలతాః పితామహవిష్ట సాస్మరతి పధియోదేవ్యా వాచః
శ్రమస్సఃుజాయత । అపికథమసౌముంచే దేనంచేనదవగాహతె రఘుపతి గుణగ్రామ
శ్లాఘాసుధామయ దీర్ఘి కామ్॥ — ప్రసన్న రాఘవమ్

బ్రహ్మలోకమునుండిభూలోకమున కరుగుదెంచిన వాగ్దేవికి కలిగిన మార్గాయాసము, రామచరితమనెడి సుధాసరస్సున స్నానమాడనిచో ఎట్లు తొలగును. ఈవిషయమును గుర్తెరిగినకవులు కవికలుషహరములగు భగవద్గుణములను గానము చేయుదురు. అట్లుగాక ప్రాకృతగుణవర్ణనమును జేసిన-చో, శారద తలపంకించుచు పశ్చాత్తాపము నొందును. హృదయమనెడి సముద్రమునందు బుద్ధియను, శుక్తిలో, శారదయను స్వాతీనక్షత్రము, విచారరూపమగు జలమును వర్షించిన-చో, సరసకవితారూపములగు మౌక్తికము లుద్భవించుచున్నవి. ఈకవితామౌక్తికములును, యుక్తిచే భజించిరామచరితమను ముక్తాహారమును గూర్చిన నది సజ్జనహృదయములందు మిక్కిలి ప్రకాశించును. శ్రీరామునిమహిమ అపారమని తెలిసియు, రామచరితను వర్ణింపబూనిన నామనస్సు భయపడుచున్నది.

శారద, శేషుడు, మహేశుడు, బ్రహ్మ, శ్రుతిస్మృతులును ఎవనిని కొనియాడబూలమని "నేతినేతి" వాక్యములచే చెప్పుచుండెనో, నేనా రాముని వర్ణింపబూనుట, పవనవేగమునకు మేరుపర్వతమెగిరిపోవుచుండ దానికడ్డపడు దూదిని బోలియున్నది.

ఎవడు అద్వితీయుడై, నామరూపరహితుడై, జన్మాదిభావవికారములు లేక సచ్చిదానందరూపుడై, సర్వవ్యాపకుడై యుండెనో, అట్టిభగవా

నుడు మానుషాదిదేహాముల ధరియించి పెక్కు-లీలల జూపియున్నాడు. పరమ దయాళుడు గాన భక్తానుగ్రహమున కే యీలీలల జూపుచుండెను. ప్రభువు ఇట్టివాడని తెలిసికొని పండితులు ఆతని కీర్తిని వర్ణించుచు తమవాక్కు-లను పవిత్రములుగ జేసికొనుచుండిరి. నేనును ఆరామప్రభుని అనుగ్రహముచే, నాతనిపదముల శిరమునధరించి, ఆతనిగుణముల వర్ణింపబూనితిని.

వాల్మీకిముని తొలుత నీచరితను రచించియుండెను. కాన నోసోదరు లారా? నాకామార్గమునందు నడుచుట చాల తేలికగ నున్నది. ఒకమహా నదికి ఏరాజైనను వంతెనను నిర్మించినచో బానిమీదుగల చిన్నచిన్నచీమలు సయితము తేలికగ ప్రయాణము చేయుచున్నవి. అట్లే ఆమహర్షి బలముచే నామనస్సును దృఢపఱచుకొని రఘుపతికథ నుపక్రమించుచున్నాను. వ్యాసాదు లును యీచరితను రచించియున్నారు. వారందఱికిను నానమస్కృతులు. వారు నాకోరికలను పూరింతురుగాక. ఎవరురఘుపతిగుణగానమొనరించిరో, అట్టికలియుగకవులకు నమస్కా-రము. ఓప్రభులారా, నాకవిత పండితాదర పాత్రము కాకున్నను, సాధుజనాదరమును బడయునట్లు మీరు నన్ననుగ్ర హింపుడు. ఓమహాత్ములారా? మీకృపవలన నాకోరిక లీడేరును. నాకవి త్వము పట్టుతోనేయబడినచీరవలె ప్రకాశించును.

శ్రీరామచరితమే మానససరోవరము. విద్వాంసులగుకవులాసరోవర మున హంసలవలె సంచరించుచు మహదానందము నొందుచుందురు. ఓవిద్వ త్క-వులారా? నా అజ్ఞానబాలవినతులగ్రహించి నాయందుకృపనుజూపుదురు గాక. ఏమహనీయుడు రామాయణమును రచించి, ఖరునికథను మృదుమధు రముగను, దూషణునికథను దోషరహితముగను వర్ణించెనో, అట్టివాల్మీకి మహాముని పదములకు నమస్కా-రము. సంసారసముద్రమును దాటించుటకు ఓడలవలెనున్న నాలుగువేదములకు నమస్కా-రము. ఏరఘునాథుని వర్ణించు వారికి స్వప్నమందైనను భేదములేదో, అట్టిరఘునాథునియశమునే వేదములు వర్ణించినవి.

ఎవడు భవసాగరమును నిర్మించి, అందు సత్పురుషులను చంద్రామృత కల్పవృక్షాదులను, ఖలులను కాలకూటమదిరలను, గూడనిర్మించెనో, అట్టి విధాతయొక్క-చరణకమలములకు నమస్కా-రము.

ఎవరు ప్రసన్నులై నసకలమనోరథములీడేరునో, అట్టి దేవతాబ్రాహ్మణ గురుచరణకమలములకు అంజలి ఘటించుచున్నాను.

గంగాశారదలకు నమస్కారము, వారిచరిత్ర లతిమనోహరములు. గంగాస్నానమువలన నెట్టిపాతకములైనను నశించును. శారదనామమును విని యుచ్చరించిన నెట్టియజ్ఞానమైనను నశించును.

జగన్మాతాపితరులగు పార్వతీపరమేశులకు నమస్కారము. వాము దీన బంధువులు. సేవకులకు సఖులగు ప్రభువులు. రామచంద్రునిసఖులు, తులసీ దాసునం దవ్యాజవాత్సల్యము కలవారు. వీరు కలిని జూచిలోకోపకారము కొఱకు కొన్ని శాబరమంత్రములను రచించిరి. ఆమంత్రముల కర్థములేకున్నను శివప్రభావముచేనవి యమోఘములగుచున్నవి. కాన వారికి నమస్కరించి వారి యనుగ్రహమును బడసి సమర్థుడనై మంగళాలయమగు రామకథను వర్ణింపబూనితిని. వారియనుగ్రహమువలన చంద్రునితోగూడిన రాత్రివలె నాకవిత నిక్కిలి ప్రకాశించును.

ఏది సరయూతీరమందతిమనోహరముగ నుండెనో, ఏదికలికలుషభంజకమో, అట్టి అయోధ్యాపురికిని, శ్రీరామునియందమితభక్తికల, అందలినర నారీమణులకును, నానమస్కారము. చాకలి, సీతను నిందించియు నాపురవాస మహిమచే నిర్ధూతసకలకిల్బిషుడై, శోకరహితమైన వైకుంఠమును జేరెను. ఎవతెకీర్తి సకలజగత్తునందును వ్యాపించినదో, అట్టిపూర్వదిశారూపయగు కౌసల్యకు నమస్కారము. ఖలులను పద్మములకు మంచు వలెశ్రీరామచంద్రు డామెయం దుద్భవించెను. సుకృతసుమంగళమూర్తియగు దశరథునకు, నాతని రాణులకును నమస్కారము. వారు తమసుతునిసేవకుడనగు నన్ననుగ్ర హింతురుగాత. ఎవడు నిజమగు రామభక్తుడో, ఎవడు శ్రీరామవియోగమును సహింపనోపక, ప్రాణములను తృణప్రాయముగ విడిచిపెట్టెనో, అట్టి దశరథు నకు వందనము. ఎవడు శ్రీరామునందు నిగూఢమగు ప్రేమకలవాడో; ఎవడు రామదర్శనానంతర మాప్రేమనుప్రకటించెనో, అట్టిసపరివారుడగు జనకునకు వందనము. ఎవనిమనస్సు, తుమ్మెదవలె రామపాదకమలమును వీడకుండెనో, ఎవని, నియమవ్రతములు వర్ణనాతీతములో, అట్టిభరతునకు వందనము. ఎవని పేరువినినంతనే సాంసారికతాపములు శాంతించునో, ఎవడు నిర్వికారుడై

భక్తులకు శుభదాయకుడో, ఎవడు రామప్రతాపపతాకమునకాధారుడో, ఎవడు భూభారము నుద్ధరించుట కవతరించిన శ్రీరామసహాయార్థముద్భవించిన ఆదిశేషుడో, ఎవడు ఖలారణ్యమునకు దవాగ్నిసదృశుడో, అట్టిసుమిత్రానందనుడగు;లక్ష్మణునికి నమస్కారము.

ఎవడు శూరుడు, సుశీలుడు, భరతానుగామి భక్తశిరోమణియో, అట్టి రిపుసూదనుడగు శత్రుఘ్ననకు వందనము.

ఎవనియశమును శ్రీరాముడు స్వయముగ వర్ణించి పొగడెనో, అట్టి మహావీరుడగు హనుమంతునికి నమస్కారము.

శ్లో. తరుణార్కకబలనోద్ధతిజూపె నెవ్వాడురుచులచే ఫలమోహరుచులచేత
నకలంకరామముద్రికబూనె నెవ్వాడుశయముచే హృత్కశేశయముచేత
మున్నీరుపల్వలంబుగదాటె నెవ్వాడు జవముచేగుణగణాబున్నవముచేత
నక్షశిక్షాప్రౌఢినలరించెనెవ్వాడు రణముచే నియమధారణముచేత
ధరణినెవ్వాడు దానవద్విరదదళవిహృతి తనకేసరికి శౌర్యవృత్తిదెలిపె,
నతనిమత్కవ్యనాగవ్యమృతఘటనమంజుల స్వాంతుహనుమంతు మదిదలంతు.
వసుచరిత్ర.

ఈతడు ఖలవనమునకు పావకుడు, జ్ఞాననిధి, ఈతనిహృదయమునందు కోదండపాణియగు రాముడెప్పుడు నివసించుచుండును. ఎవరు నీచశరీరధారులయినను, శ్రీరామచంద్రుల యనుగ్రహమువలన, శివుడుమున్నగు మహాయోగి దుర్లభమగు రామసాయుజ్యము నందిరో, అట్టి సుగ్రీవజాంబవదాది కపివీరులకును, విభీషణాది రాక్షసులకును, ఖగమృగనరాసురులకు నమస్కారము. విజ్ఞాననిధులగు సనకాదులకు, శుకనారదులకును నమస్కారము. ఏతల్లికృపచే నాకు నిర్మలజ్ఞానము సిద్ధించినదో, అట్టి కరుణామయయు, జగన్మాతయు, రామప్రేయసియు నగు జానకికి వందనము.

ఎవడు భక్తార్తిభంజనుడో, కోదండపాణియో, రాజీవాక్షుడో, అట్టి శ్రీరామచంద్రునకు నామనోవాక్కాయాభి వందనములు. దీన నాయభీష్టము సిద్ధించుగాత. శబ్దార్థముల వలె, జలతరంగములమాడ్కి, యవి నాభావ సంబంధముకలిగి, చంద్రచంద్రికలవలె భిన్నాభిన్న స్వరూపులగు సీతారాముల చరణకమలములకు నామనఃపూర్వకవందనము. ధనయౌవనాది సాంసారిక సుఖదుఃఖాసక్తమానసులగు వారికి రామభక్తియలవడదు.

నామమాహాత్మ్యము

త్రిమూర్త్యాత్మకమయిన రామనామమునకు వందనము. ఈనామము చంద్రసూర్యాగ్నులకు కారణమగుటచే, అగ్నివలె పాపములను భస్మము చేయుచు, సూర్యునివలె నజ్ఞానాంధకారమును నశింపజేయుచు, చంద్రునివలె సకలతాపములనుపశమింపజేసి, చిత్తనైర్మల్యము నొసంగుచున్నది. అగ్నిబీజమగురకారము, సూర్యబీజమగు, ఆకారము, చంద్రబీజమగుమకారమునుకలియుటచే నీనామము ఏర్పడినది. ఈవర్ణసముదాయమే, బ్రహ్మవిష్ణుశివాత్మకమై, జగదుత్పత్తిస్థితిలయములకు కారణమగుచున్నది. నిరుపమమగు నీనామము సగుణము నిర్గుణమును స్థితిభేదమునుబట్టి అగుచున్నది. ఈమంత్రరాజమును శివుడు వారణాసి యందు జపించుచు నట మృతులగువారి కుపదేశించుచు వారలనుగూడ తరింపజేయుచున్నాడు. గణేశుడీ నామమహాత్మ్యమును దెలిసి కొనుటచేతనే అందఱిలో ప్రథమ పూజ్యుడగుచున్నాడు. వాల్మీకిమహర్షియు నీనామమును వ్యత్యస్తముగా జపించి కృతార్థుడై ఆదికవియాయెను. ఒకప్పుడు శివుడు పార్వతిని తన సహపఙ్క్తికి పిలువగా నామె విష్ణుసహస్రనామ పారాయణము పూర్తికావలెనని బదులు చెప్పెను. అపుడు శివుడు ఒక రామనామము, సహస్రనామతుల్యమని పార్వతికి ఉపదేశించెను. అప్పుడామె రామనామ మహత్వమును దెలిసికొని సంతసించెను. పార్వతి హృదయమందు రామనామముండుట నెరింగి శివుడామెకు తన యర్ధాంగమిచ్చి యర్ధనారీశ్వరుడాయెను. మఱియు నీనామప్రభావముచే శివుడు కాలకూటమును గూడ నమృతమువలె నారగించెను. రామనామము వర్ణోత్తమము. తులసీదాసు సస్యసమము. ఈరెండువర్ణములు నక్షరసమామ్నాయమునకు నేత్రములు. అతిమధురములు. ఐహికమందు సుఖమును, ఆముష్మికమునందు మోక్షమును యిచ్చుచున్నవి. ఈరెండక్షరములు, జీవబ్రహ్మలవలె సహజసంబంధముకలిగి, నరనారాయణరూపమున, స్త్రీలకర్ణాభరణములవలె ప్రకాశించుచున్నవి. మఱియుసూర్యచంద్రులవలె జగత్తును ప్రకాశింపజేయుచు, భక్తజనమానస పద్మములందు భ్రమరములవలె భాసిల్లుచున్నవి. మఱియు నీయక్షరములు, రామకృష్ణులు యశోదనువలె, జిహ్వాను ప్రసన్నతజేయుచున్నవి. అక్షరసము దాయమునకు వీనిలోనొకటి మకుటముగను, రెండవదిచ్ఛత్రముగను నుండి

ప్రపంచరక్షణము నొనరించుచున్నవి. మఱియు నివిరామలక్ష్మణరూపముగ భక్తమానసముల నలరారుచున్నవి. బాగుగ విచారించిన-చోనామరూపములు సేవ్యసేవకులవలె పరస్పరసంబంధముకలవై, పరాత్పరునికి ఉపాధులై, వర్ణనాతీతములగుచున్నవి. ఈనామరూపమాహాత్మ్యము, సాధనవలన గాని గోచరింపదు. ఈనామరూపములు పరస్పరసాపేక్షములు కాన వీనిలో హెచ్చుతగ్గులు లేవు. రామనామమణిదీపము, జిహ్వారూపమగు దేహాళి యండెల్లప్పుడు నుండుగాత యని తులసీదాసుడనగునేను కోరుకొనుచున్నాను. చతుర్విధయోగులును విరక్తులై యీనామమును జపించి ముక్తులగుచున్నారు. ఈ నామముచే విరించిబ్రహ్మానందసుఖము ననుభవించుచున్నాడు. ఈ కలియుగమున తరించుటకు దీనికన్నను సూక్ష్మోపాయము వేరొండులేదు. చతుర్విధయోగులలోను జ్ఞానులనిన, రఘునాథునకు మిక్కిలిప్రేమ. వారునిష్కాములై, ఏకాంతభక్తిరసనిమగ్నులై, రామనామామృతసరోవరమునందు మీనముల వలె నోలలాడుచుందురు. నామరూపములు, సగుణనిర్గుణములవలె, నగ్ని దారువులవలె, పరస్పరసంబద్ధములై, బ్రహ్మస్వరూపమువలె, నిరుపమమై, యనాదియై, యగాధమైయుండును. దారువునందలి యగ్నివలె సగుణమందు లీనమగునిర్గుణము, నామమందిమిడియున్నరూపము, సాధనవలనగాని గోచరింపదు. నిర్గుణబ్రహ్మమే, భక్తులహితముకొఱకు, సగుణరూపుడగు రామదేవుడై యవతరించెను. ఈనామమాహాత్మ్యమువలన శతకోటిప్రవిస్తరమగు రామాయణమును శివుడు తెలిసికొన గలిగెను. దీనిచేతనే త్రిమూర్తులు వారి వారిపనులను నిర్వర్తించుచున్నాడు. శివుడు అమంగళద్రవ్యములను ధరించినను, అమంగళప్రదేశముల సంచరించినను, దీనిచేతనేమంగళకరుడగుచున్నాడు. శుకసనకాదియోగులీ నామప్రభావముచే బ్రహ్మసుఖముననుభవించువారైరి. దీనిచేనారదుడు భక్తాగ్రగణ్యుడాయెను. ధృవుడు మహామహులకందరాని దివ్యపదము నందగలిగెను. హనుమంతు డీ నామప్రభావముచేతనేకదా, రాముని తనహృదయకమలమున నిలుపుకొనెను. మఱియు ప్రహ్లాదుడు దీని చేతనేభక్తశిరోమణి యాయెను. అజామిళగజరాజులుకృతార్థులగుట కిదియె మూలము. నేనును దీనిప్రభావముచేతనే శ్రీరామచరితను వ్రాయబూనితిని. రాముడైనను నామప్రభావమును దెలుపజాలడు. కపటముగల కలియుగకాల

నేముల కీనామము హానుమంతు డగుచున్నది. కలికాలహిరణ్యకశిపులకు నృసింహామూర్తిని పోలియున్నది. కృతయుగమందు, ధ్యానముచేతను, త్రేత యందు యజ్ఞములచేతను, ద్వాపరమునందర్చనలచేతను, కలియందు నామ స్మరణముచేతను మనుజులు తరించుచున్నారు. ప్రపంచమందు ఇతరరాజులను సేవించిన ఐహికసుఖము మాత్రము సిద్ధించును. కోసలరాజగు శ్రీరామ చంద్రుని సేవించిన నిహపరసుఖముల రెంటిని సులభముగ పొందవచ్చును. రాముడు భక్తివిశ్వాసములనే జూచునుగాని, ఎక్కువతక్కువలను జూడడు. రాముడు చెట్టుక్రింద కూర్చుని యుండగా వానరులాచెట్లశాఖల నధిష్టించిరి. అందువలన వారిపై కోపగించక వారికి దివ్యపదవి నొసగెను. ఋక్షవానరు లతో స్నేహముచేసి వారిసహాయమున వారిధిని నిర్మించి రాక్షససంహార మునుచేసినరాముడు నన్ను మాత్రమెందులకు ప్రేమింపడని తలచుచు ఆరామా నకు శిరమువంచి మాటిమాటికిని ప్రొక్కుచు నీకథనుప్రాయమొదలిడితిని. యాజ్ఞవల్క్యలీ కథను భరద్వాజునకు వినిపించియుండెను. వారిప్రసంగమునే నేను నిరూపించుచున్నాను. మొదట నీచరిత్రను శివుడు పార్వతికి వినిపించి, పిమ్మట రామభక్తివశుడైనకాకభశుండునకు వినిపించి యుండెను. అతడు యాజ్ఞవల్క్యునకు, నాతడు భరద్వాజునకు వినిపించి యుండెను. వారీచరితను విని సుశీలసమదర్శులై భూతభవిష్యద్వర్తమానముల కరతలామలకములవలె జూచుచు వర్తింపుచుండిరి. నేనీకథను సూకరక్షేత్రమందు గురువులవలన విని యుంటిని. కాని అప్పుడు నేనుబాలుడనగుటచే సరిగా గ్రహించలేకపోతిని. నేను అజ్ఞుడనయినను శ్రీరామచంద్రుని గూఢమయిన కథల వినుచుండుటచే కొంత జ్ఞానమేర్పడినది. నాకీకథను మాగురువులు మాటిమాటికి వినిపించుటచే యీమాత్రపుసామర్థ్యము కలిగినది. ఈకథ సకలజనరంజకమగుటచే పండితు లకు విశ్రాంతిని కలిగించుచున్నది. ఈకథ కలియుగసర్పములకు గారుడ మంత్రము, జ్ఞానాగ్నికి యరణియు నగుచున్నది. ఈకథ కలియుగమునందు కామధేనుసంజీవినులతో సదృశమై జననమరణదూరులగుటకు యమృతతుల్య మగుచున్నది. మోహాభ్రమలను భేకముల కిదిసర్పరూపము. అసురసేనారూప మగు నరకమును నశింపజేయుచు, సాధుజన, దేవతాకులములకు హితమును జేయుటకును దుర్గారూపిణి. ఇదిసత్పురుషసమాజమందు లక్ష్మివలె, విశ్వ

పోషణకు విశ్వంభరవలె, శమనునిముఖమునకు మసిపూయుటకు, యమున వలెను, జీవులకు ముక్తినిచ్చుటకు గంగతోడను సరియగుచున్నది. ఈతులసి దాసుడు తులసివలె రామునకెంతేనిప్రీతిపాత్రుడు. ఈకథను శివుడు శైల సుతతో సమానముగ ప్రేమించుచుండును. ఈకథ సర్వసిద్ధులకును దాతయై, సర్వసంపదలకు నిధియై, సద్గుణములనెడి దేవతలకు తల్లియై, రామునిభక్తి ప్రేమలకు సీమయై యలరారుచున్నది. సత్పురుషహృదయమను చిత్రకూటము నందు, రామకథామందాకిని ప్రవహించుచున్నది. అట్టితావులందు శ్రీరాముడు విహరించుచుండును. ఈకథ చింతామణితో సమానము. కాన సత్పురుష బుద్ధికాంతకు ముఖ్యాభరణమగుచున్నది. ఇది జ్ఞానవైరాగ్యయోగములకు గురువు. సాంసారికభయంకరరోగనిర్మూలనమున కశ్వినీదేవతాసదృశము రామభక్తిని కలిగించుటకు పితృతుల్యము. సకలధర్మనియమములకు బీజము. మఱియు నార్తుడగురాజునకు, రక్షకభటమంత్రిరూపము. లోభసముద్రమున కగస్త్యరూపము. భక్తమనోవనమందు విహరించుచు, కామక్రోధకవిమల రూపమైన మాతంగములకు సింహకిశోరము. దారిద్ర్యదావాగ్నికి మేఘ మాల. విషయసర్పహరణమునకు మహామంత్రము, మోహాంధకారమునకు అభినవభానుకిరణము, భక్తసస్యములకు మేఘుము, ధాత్రీలిపిని గూడ మార్చి, భక్తాభీష్టముల నొసగూర్చును. ముఱియు నీకథ కవిగగనాంగణము నకు తారామండలమువలె, పుణ్యకర్మలకు ఫలమును, ప్రపంచకల్యాణమునకు, నిష్కలంకసాధువువలె, భక్తజనమానసంబులకు రాజహంససదృశమై, మానవు లను పవిత్రులజేయుటకు గంగాసమమై, కవిసంభవములగు కుతర్కదంభ కపటాదిపాషండరూపములగు నింధనముల కగ్నిసమమై, సత్పురుషకుముద చకోరములకు పూర్ణిమాచంద్రికవలెను ఒప్పారుచున్నది. ఇట్లీమాహాత్మ్య మును ముగించుచు, శివుడు పార్వతి కీకథ నుపదేశించెనో అట్టిపవిత్రమగు నీకథను వర్ణించుచున్నాను. యుగభేదమునను సరించి అనేకమును లీభగవచ్చరి తము ననేకరీతుల వర్ణించియున్నారు. భగవద్గుణములవలె నాతనిచరితము ననంతమే. అట్టియగాధమగు చరిత్రను గురుకటాక్షముచే నేనును వర్ణింప బూనితిని.

చైత్రశుద్ధనవమీ భౌమవారమున నయోధ్యాపురియందీ చరితమును వ్రాయనారంభించితిని. ఆరోజుననే రామోపనిషత్తని యుల్లేఖింప బడినది. ఆనాడు సర్వతీర్థరాజములును సరయువు నాశ్రయించియుండును. నాటినుండియు సురాసుర యక్ష నాగ, కిన్నర కింపురుషులు, మనుష్యులు, పశుపక్ష్యాదులును అనేకవిధముల శ్రీరామచంద్రుని సేవించుచున్నారు. అక్కడ భక్తజనులు నేటికి రామజన్మోత్సవముల జేయుచు, రామసంకీర్తనల బాడుచుందురు. అట రామసంకీర్తనములేని గృహమే లేదు, అచటి భక్తులు సరయువునందు స్నానమాడి హృదయమునందు శ్రీరామమూర్తిని నిలిపి రామ మంత్రమును జపించుచుందురు. సరయూదర్శనస్పర్శనస్నానపానాదులచే సమస్త పాపములు నశించునని పురాణములందును కలదు. రామనివాసమగు నీరమ్యపురియందు, అండజాది చతుర్విధదేహులును మృతినొంది రామసాయుజ్యము నందు చున్నవి. నాకు-ఈపట్టణము సంపూర్ణసిద్ధులకు నిలయమై, సమస్తమంగళములకు నిధియై యున్నదని నిర్మల బుద్ధితో నేనీకథ నిచటనే వ్రాయబూనితిని. అయోధ్యపేరును వినినంతనే, కామమదదంభములు నశించిపోవును. నేరచించెడి యీచరితకు, రామచరితమానస మనిపేరిడుచున్నాను. మానసమను మత్త గజము, విషయభోగమనెడి దావాగ్నిని చిక్కుకొని, దహింపబడుచు, రామ చరితమను మానససరోవరమున బ్రవేశించి తన శ్రమను తీర్చికొనగలదు. ఈమానససరోవరమును ప్రపంచమున విస్తరింపజేసి మాటిమాటికి శివపార్వతుల స్మరించినచో వారునాకు సుబుద్ధిని యుత్సాహమును గలిగించి, నాకవితను రసవంతముగానుండునటుల జేయుదురని నమ్మి, వారి కథలను ముందుగ వ్రాసి పిమ్మట రామచరితమును వ్రాయుదును. శివపార్వతులు నన్ననుగ్రహింపనిచో నల్పబుద్ధినగు నేనీ మహనీయచరిత్రను వర్ణింపనలవి యగునెట్లు? సాధువులను మేఘములు, వేదపురాణాది సముద్రములనుండి, రామయశోరూపమగు దివ్య జలమును స్వీకరించి, సుమతి మానసక్షేత్రములందు వర్షించు చున్నవి. ఈయుత్తమ జలముల బానముజేసినవారికి సర్వమంగళములు చేకూరుచున్నవి. ఈమానసమున వర్ణనాతీతమగు మధురప్రేమ భరితమగు భక్తియను శీతలసలిల మున్నది. ఈజలము సుకృతతసస్యముల పండించుచు, హరిభక్తులకు జీవనాధార మగుచున్నది. ఈరామచరిత మానసమునందు, 1 శివపార్వతీ సంవాదము,

2 కాకభశుండి గరుడసంవాదము, 3 యాజ్ఞవల్క్యభరద్వాజ సంవాదము, 4 తులసీగురుసంవాదము, నను నాలుగు ఘట్టములుకలవు ఇందు సప్త కాండములు సప్తసోపానములై విలసిల్లుచున్నవి. వానిని జ్ఞానదృష్టితో నధిష్టించినయెడల మనస్సు వికసించి బ్రహ్మానందమును కలుగజేయును. ఈరఘునాథగాథ నిర్వికారము, నగాధమగు సరస్సు. ఇది సీతారాముల యశోజలభరితము. ఇందలి యుపమానములే తరంగములు. చౌపాయిలే, దట్టమైన కమలనాళములు. నానావిధసుందరచ్ఛందసోరగలే, విచిత్రకమలములు. కవియుక్తులే, శుక్తిశకలములు. నిరుపమానార్థములే, కమలపరాగములు. మనోహరభావములే, మకరందము. భాషయే కమలసుంగంధము. సుకృతి జనులే, సుందరభ్రమరములు, జ్ఞానవైరాగ్య, విచారములే, మరాళములు. జ్ఞానము, అవరోధము, గుణము, గతి, యను చతుర్విధకవితయే, ఇందు మీనములు. ధర్మార్థకామమోక్షములు. జ్ఞానవిజ్ఞానవైరాగ్యములు, శృంగారాది నవరసములు, జపతపోయోగములు నిందు నివసించుచుండు జలచరములు. రామనామగుణగానము చేయు పుణ్యపురుషులే, చిత్రవిచిత్రములగు జలపక్షులు. దీనికినాలుగుదిక్కులందున్న సజ్జనసమాజములే జామితోటలు. వారిశ్రద్ధయే వసంతకాలము. సత్పురుషులచే బహువిధములనిరూపింపబడిన భక్తిప్రస్థానములే పలువిధములగు మామిడితోటలు. క్షమాదయాదులే, లతావితానములు. సంయమ నియమములే, పుష్పములు, జ్ఞానమఫలము, భగవత్సేవామే రసము. రామచరితగానమే, నానావర్ణములగు శుకశారికలు. కథాశ్రవణ కాలమున పులకాంకితులగువారు పూలతోటలు. అప్రమాదం దించెడివారు, పుష్పవాటికలందు విహరించెడి కోకిలలు. మనసనుతోటమాలి, నేత్రరూపము లగు మనోహరఘటములందు, భక్తిశ్రద్ధలనెడు జలమును నింపుకొని ఆతోటను నిత్యము తడుపుచుండును. ఈచరితమును శ్రద్ధాభక్తులతో గానముచేయువా రీసరోవరోద్యానములకు కావలివారు. ఎవరు దీనిని గానముచేయునప్పుడు వినియెదరో, వారీప్రాంతమునకురా నధికారులు. దుష్టవిషయాసక్తములగు బకవాయసములకిందు తావులేదు. విషయవాంఛలను, భేక, కర్కటము లిందు గానరావు. విషయములను కాకబకముల కిట నాహారము శూన్యము. అట్టికాకబకము లిటకువచ్చినను నిరాహారములగుటచే నిటనుండజాలవు, శ్రీరామ

కృపాపాత్రులు గానివారిటకు రాజాలరు. ఒకవేళ వచ్చినను ఇటనుండజాలరు. అట్టివారిటకురా బయినమయినను, మార్గమధ్యమునందు దుష్టులను కంటకముల చేతను, విషయములను ఘోరమృగముల చేతను నివారింపబడుదురు. ఎట్లనో వాటిని తప్పించుకొనినను, మోహాము, కుతర్కములను మహానది భయంకర ముగ ప్రవహించుచుండును. అతికష్టముచే దానిని దాటినను గృహకార్య నిర్వహణరూపమగు పర్వతశ్రేణిలో బడిపోవును. ఒకవేళ వీటినన్నిటిని దాటి వచ్చినను యీసరోవరమందు స్నానముచేయలేడు సరిగదా, ఆచమనమునైనను చేయజాలడు. ఎవరైన నీసరోవరవృత్తాంతము నడిగిన-చో, నట నేవిశేషములు లేవనియు అటకేగుట చాలకష్టమనియు, అది తనకేమియు నచ్చలేదనియు చెప్పుచు నిందింతురు. ఈవిఘ్నములన్నియు తొలగుటకు శ్రీరామకటాక్షమొక్కటియె కారణము. ఈసరోవరమున జలకమాడినభక్తులకు వెంటనే తాపత్రయము నశించును. అతడు మోక్షమున కధికారియగును. ఒకసారి స్నానమాచరించిన, దానినెన్నడును విడువజాలడు. ఈసరోవరస్నానమును కోరువారు మున్నందు సత్సాంగత్యము నలవరచుకొనవలయును. దీనిని జ్ఞాన చక్షుస్సుచేజూచి ఇందుస్నానమాచరించినకవికి బుద్ధి నిర్మలమగును. వారిహృద యమునందు ప్రేమాసందోత్సాహములు నిరంతరము ప్రవహించు చుండును. రామయశోరూప జలభరితమగు కవితాస్రవంతి వారినుండి బయలువెడలును. సర్వమంగళాసేతమగు నీనదియే సరయువు. దీనికి వైదికలౌకికములనెడు రెండుతటములు కలవు. ఈతటములందుండెడి కవిమల విషయరూపములగు వృక్షము లీనదీప్రవాహవేగముచే సమూలముగ పెకలింపబడి నశించును. ఆనదీతట సమీపమున, త్రివిధశ్రోతృసమాజరూపములగు పురగ్రామనగర ములు కలవు. సర్వమంగళమూలమగు సత్పురుష సమాజ రూపకమగు నయోధ్యయు నీనదీతటమందు కలదు. రామభక్తిరూపమైనగంగ, నిర్మల కీర్తితోకూడిన యీసరయువునందు కలియుచున్నది. రామలక్ష్మణులయుద్ధము నందలి మహాయశ మనెడి శోణనదమును ఇందు కలియుచున్నది. వైష్ణవ కీర్తి, విచారరూప, సరయూశోణలమధ్య భక్తిరూపమగు గంగ ప్రవహించు చున్నది. ఈమూడును తాపత్రయమును దొలగించి, భక్తిజ్ఞాన వైరాగ్యముల నొసంగుచు, రామరూపసారమున కలియుచున్నవి. ఈరామ చరితమందు

మధ్యమధ్యను కొన్నికథలు కలవు. అవియె తటాంచల గతవనోపవనములు. శివకళ్యాణమహోత్సవములె ఇందలి జలజంతువులు. రామజన్మోత్సవములె, ఇందు తరగలు, సుడులును. రామలక్ష్మణభరతశత్రుఘ్నుల బాల్యచరిత్ర ములె, విచిత్రములగు కమలములు. దశరథుడు, అతనిరాణులును, భ్రమర ములు, వారికుటుంబప్రజలు జలపక్షులు, సీతాస్వయంవర మహోత్సవమె, వీనియొక్కశోభ. ఉత్తమప్రశ్నలు, నౌకలు, ప్రతివచనములు, సాంయాత్రి కులు. దీసికిచెందిన సంభాషణలె, యాత్రికులు. పరశురాముని తీవ్ర క్రోధమె, భయంకరతరంగము. శ్రీరాముని శాంతసంభాషణమె, స్నాన ఘట్టము. రాఘవుల వివాహచరిత్ర, సౌమ్యతరంగము. శ్రీరామపట్టాభి షేకాలంకారవర్ణనలు, పార్శ్వకయాత్రికులు. కైకబుద్ధియె, విపత్కరమగు నాచు. భరతశుభచరిత్ర, విపన్నాశకమగు జపము. కలిపాప వర్ణనము, నురగలు. దుష్టపురుషవర్ణనలు, బకవాయసములును నగుచున్నవి. మఱియు నిట షడృతుసంపత్తియు కలదు. పార్వతీకల్యాణము, హేమంతము. శ్రీరామకల్యాణము, వసంతము. రామవనవాసము దుస్సహమగు గ్రీష్మము. రావణాదిరాక్షస సంహారము వర్షర్తువు. అయోధ్యా గమనము శరదృతువు. రామజన్మోత్సవము శిశిరఋతువును అగుచున్నవి. మఱియు నిందుపతివ్రతా తిలకమగు సీతావర్ణనము, మంగళకరమగు నిర్మలోదకము. భరతస్వభావము, దేవతానందకరమగు సౌశీల్యాదిరూపమగు సస్యవర్ధకమగు శీతలోదకము. ఈనది సర్వానందకరమై ఎల్లప్పుడును చల్లగానుండును. దశరథాత్మజుల పరస్పర సంభాషణములు, బాల్యచేష్టితములును దీని మాధుర్యమును, సౌగంధ్యమును ప్రకటించుచున్నవి. ఆర్తతావినతి దీనతలు, దీనియందు తేలిక యగు లలితోదకమగుచున్నవి. ఈఅద్భుతమైన సరోవర కథాశ్రవణముచే, ఆశాదాహమును, మనోవికారమును, శాంతించును. ఈజలము రాముని ప్రేమచే పోషింపబడుచు, కలిపాపములను దూరము చేయుచు, సంసారభ్రమ లను తొలగించుచు, సంతుష్టిని కలిగించుచు, ఘోర దారిద్ర్యదోషములను హరించును. మఱి కామక్రోధమదముల నశింపజేయుచు, నిర్మలజ్ఞానవై రాగ్య ములను పెంపొందించుచు తాపత్రయమును హరించును. ఈజలముచే మనస్సును క్షాలనము చేయనియెడల పరిశుద్ధుడు కాజాలడు. ఎండమావులజూచి నీరని

భ్రమపడిన లేడిపిల్ల అటనీటిని కానక అరణ్యమునంతయు దిరుగుకైవడి, ఈనదిని చేరక మఱియొక చోటునకు పోయినచో తత్వజ్ఞానము దుర్లభము. వాడు జీవన్మృతతుల్యుడు. తులసీదాసుడనగునేను నాశక్త్యను సారముగ దీనిలో స్నానముచేసి శివపార్వతులను ధ్యానించి, రామపదకమలములను హృదయమున నిలిపి, యాజ్ఞవల్క్యభరద్వాజసంవాదమును జెప్పుచున్నాను.

యాజ్ఞవల్క్య భరద్వాజ సంవాదము

భరద్వాజముని, రఘువరచరణకమలములందు మిక్కిలి ప్రేమకలవాడై, ఆంతరతపోధనుడై, జితేంద్రియుడును, దయామయుడును, పరమార్థలగ్న మనస్కుడునై, ప్రయాగక్షేత్రమందు నివసించుచుండెను. సూర్యుడు మకర రాసికి వచ్చినపుడు మకరసంక్రాంతి. ఇది మాఘమాసములోవచ్చును. అపుడు యాత్రచేయుటకు పెక్కండ్రుప్రజలు, దేవరాక్షసకిన్నరకింపురుషయక్షులు మున్నగువా రాదరపూర్వకముగ ప్రయాగకువచ్చి, త్రివేణియందు స్నానము చేసి, వేణీమాధవునిదర్శించి, అక్షయవటదర్శనస్పర్శనాదులచే ప్రసన్నులై, సమీపముననున్న భరద్వాజాశ్రమమునకు వచ్చి వారిని దర్శించి కృతార్థులై పోవుచుందురు. మునులు నాతీర్థరాజమునందు స్నానముచేసి, పరస్పరము భగవదాశ్యములు జెప్పుకొనుచు, భరద్వాజాశ్రమమునకు వచ్చి, సత్పురుష సమాజములగలిసి, బ్రహ్మప్రధానములై నయుపనిషత్తులను, ధర్మవిధులను, జ్ఞాన వైరాగ్యసహితములై నభగవత్కథలను ముచ్చటించుకొనుచుకొంతకాల మట నివసించి, పిమ్మట తమతమనిలయములకుబోవుచుందురు. ప్రతివత్సరము నిట్లేజరుగుచుండును. ఒకవత్సరమున మునులందఱితోబాటుం మకరస్నాన మాచరించి యాజ్ఞవల్క్యమహాముని, భరద్వాజుని జూడవచ్చెను. ఆముని రాజును జూచి భరద్వాజుడు భక్తిపూర్వకముగ నమస్కరించి తనయాశ్రమమున కు దోడితెచ్చి, తచ్చరణకమలములగడిగి, ఆజలమును శిరమున జల్లుకొని, ఆయనను పవిత్రాసనోపవిష్టుంజేసి, అర్చించి, ప్రశంసించి, పరిశుద్ధమనస్కుడై, మధురవాక్కులతో నిట్లనియె. స్వామీ, తమకు సమస్తవేదార్థము కరత లామలకము. నేనొకసంశయముచే బాధపడుచుంటిని. ఈసంశయము తమసమ్ముఖమునగాని తీరదు. నాకీసంశయమును దెలుపుటకు భయమగు

చున్నది. చెప్పనిచో ననర్థము తప్పదు. గురువునొద్ద సంశయముదీరనివాని కెన్నడును తత్త్వజ్ఞాన ముదయింపదు. అని వేదవచనము. నాకు మీరు గురువులు. కాన నాయజ్ఞానము తమకు నివేదించుకొనుచున్నాను. దయయుంచి నాసంశయముల దీర్పుడు. రామనామప్రభావము అద్భుతమని వేదపురాణములు, సత్పురుషులును చెప్పుచున్నారు. అట్టిరామనామమును, సుగుణజ్ఞానరాశియు, కల్యాణస్వరూపుడు, శాశ్వతుడు, అష్టసిద్ధులుగలపరమశివుడు నిరంతరము జపించుచుండునట. అతడుసామాన్యుడనుటకు వీలులేదుగదా. కాశియందుమృతినొందెడి చతుర్విధజీవులకు మోక్షమునీతడె ఇచ్చుచుండునుగద. రామనామమింత మహిమాసంపన్నము కానినాడీత డానామము నేలవిడువక జపించును? కాశియందుమృతినొందువారల నీనామోపదేశమువలననే శివుడు కృతార్థులజేయు ననివినుచుంటిమి. ఎవనినామ మిట్టిమహిమకలదియో, అట్టి రాముడెవడు? ఓకృపాసింధూ, నాకినంతయు సవిస్తరముగ దెలుపవలయు. నేనొకరాము నెరుగుదును. ఆతండ యోధ్యాపతియగుదశరథనందనుడు. అతని చరిత్రము జగద్విఖ్యాతము. ఆతడు భార్యావియోగముచే మిక్కిలిదుఃఖితుడై, బహుకష్టములకుగురియై, కృద్ధుడైరణరంగమందు రావణాదిరాక్షససంహార మొనర్చి తనకార్యమును సాధించుకొనెను. ఈరాముడెవరు? పరమశివుడు నిత్యముజపించు రాముడెవరు? తత్వవేత్తలు, సర్వజ్ఞానసంపన్నులునగు తామీ విషయమును విచారించి తెలుపవేడుకొనుచున్నాను. మీవాక్కులచే నాయజ్ఞానముసంశయము, తప్పకతొలగిపోవును. కానదయచేసి శలవిండు, అని యాజ్ఞవల్క్యమహాముని మోమునచిరునవ్వొలుక నిట్లనియె. ఓభరద్వాజా, నీకురామమహత్వము బాగుగ దెలియును. నీవునిజమగురామభక్తుడవు. చతురుడవు, అయినను నావలన రామునిగూఢతత్వమును వినదలచి, యజ్ఞానివలె నన్ను ప్రశ్నింపుచుంటివి. నిశ్చలమనస్కుడవై వినుము. నేనుసగుణబ్రహ్మయగురాముని కథను చెప్పుచున్నాను. అదికాళికాదేవిమహిమాసురునివలె నీసంశయమును భేదించును. ఈకథ సత్పురుషచకోరములకుచంద్రిక. నీవలె పార్వతికిని సంశయముకలుగనా సంశయమునుతీరునట్లు శివుడు తొల్లిచెప్పియున్నాడు. ఆశివపార్వతులసంవాదమునే చెప్పుచున్నాను. దీనపార్వతికివలె నీకును సర్వసంశయములు తొలగిపోవును.

శివకథాప్రారంభము

త్రేతాయుగమునం దొకనాడు దక్షసుతయగుసతిని వెంటనిడికొని శివుడగస్త్యనియొద్దకు వచ్చెను. ఆముని వారిని జగన్మాతాపితరులుగ నెరింగి యర్ఘ్యపాద్యాదులతో పూజించి, సుఖాసనోపవిష్టులుగజేసి, వినుతించి, మహదానందమునొందుచు, రామచరిత్రమును గానముచేయుచుండెను. దానిని వినుచు శివు డానందించుచుండెను. అగస్త్యుడు రఘువరభక్తిని గురించి శివునడుగుచుండ నితడు భక్తివిషయములవిననర్హతకలసమర్థుడని తెలిసికొని, భక్తివిధానము నంతయు విస్తరించి శివు డగస్త్యనకు జెప్పుచుండెను. ఇట్లు రామచరిత్రను చెప్పుకొనుచు కొంతకాల మటనివసించి, పిమ్మట నాదక్షకుమారితో శివుడు కైలాసమునకుబయలుదేరెను. ఆసమయమునసే భగవంతుడు భూభారనివారణార్థము రఘుకులమునం దుద్భవించి, రామచంద్రుడనుపేరుతో వర్ధిల్లుచు, పితృవాక్యపరిపాలనార్థము రాజ్యమును విడిచి, ఉదాసీనుడు నవినాశియు నగురాముడు దండకాటవియందు సంచరించుచుండెను. అప్పుడు శివు డిట్లాలోచింపసాగెను. భగవంతునిదర్శనము నాకెట్లు లభించును? అతడు తన తత్త్వమును వెల్లడింపక మనుజభావముతో సంచరించుచున్నాడు. కాననే రాముని మనుజుడని జనులు తలంచుచున్నారు. ఇపుడు నేనాతని దర్శించుటకు వెళ్ళినయెడల, పరు లాతని పరబ్రహ్మ మని తెలుసుకొందురు. అట్లు తెలిసిన రాముడు చేయబూనినపని జరుగదు. అందుచే నాతనినిజూచుటకు భయమగుచున్నది. కానిచూడవలెనని మనస్సు తొందరపడుచున్నది. అని తనలో తాను తలపోయుచుండెను. శివునిమనసు నందలికలతను సతీదేవి గుర్తించుట లేదు. మఱియు శివుడిట్లనుకొనెను. రావణునకు మృత్యువు మనుజునిచేతిలోని దగుటచే, భగవంతుడు బ్రహ్మవాక్యమును ధృవపఱచుటకు మనుజుడై జన్మించెను. కాననాసగుణమూర్తిని కన్నులార కాంచవలయును. కాలయాపనము చేసినచో సతనిదర్శనము దుర్లభమగునని పరిపరివిధముల చింతించుచుండెను. ఇంతలో రావణుడు మారీచునిచే మాయామారిణరూపమును ధరింపజేసి సీతను అపహరించెను. కాని శ్రీరామచంద్రునిపరాక్రమమును మాత్రము గ్రహించుటలేదు. లేడినిసంహరించి లక్ష్మణసహితముగ నాశ్రమమునకువచ్చి, సీతనటగానక శ్రీరామచంద్రుడు తనేత్రకమలముల నశ్రుధారలచేనింపుచు, సామా

న్యనివలె విరహావ్యాకులత నొందుచుండెను. సోదరులిరువురు, వ్యాకులచిత్తులై అరణ్యమునందంతటను సంచరించుచుండిరి. నిజమునకు భగవంతునకు ఆదిశక్తితో వియోగమెన్నడునులేదు. అయినను ప్రపంచదృష్టికొఱ కీవిరహదుఃఖమును ప్రకటించెను. అతివిచిత్రమైనయీచరిత్రను మహామేధావంతులుగాని తెలిసికొనజాలరు. ఇట్లుశివుడు తటపటాయించుచుండ నాలోన నరణ్యమార్గమునబోవుచు రాముడు శివునకు దర్శనమిచ్చెను. ఆరఘువంశమణియగు రాముని జూచి శివు డానందాబ్ధి నోలలాడి భగవంతు ననేకవిధముల నుతించెను. ఓసచ్చిదానంద పరబ్రహ్మమూర్తీ, మీకు జయమగుగాక, యనిపలుకుచు, అటనుండి ఇంకనుస్తుతిచేసినచో, దుష్టులు రాముని పరబ్రహ్మమని తెలిసికొందురు. అప్పు డతనితోయుద్ధముచేసిమృతినొందుట సంభవింపదని తలంచి చేష్టలుమాని కొంతతడవటనుండి స్మరహరుడు నిజనివాసమున కరిగెను. ఆతని ననుసరించినసతి, దీనినంతను చూచుచుండెను. ఆమె యాతనిచేష్టల జూచి మిక్కిలిసందేహముకలదై ఇట్లనుకొనెను. నాభర్తయగుశంకరుడు జగద్వంద్యుడు. జగదీశ్వరుడు. సురాసురనరులు మునులు, యెప్పుడు నీతని సేవింతురు. అట్టి శివుడీ రాజకుమారుడైనరాముని, ఓసచ్చిదానందపరబ్రహ్మరూపా, యని మాటిమాటికి పలుకుచు నమస్కరించుటకు, కారణమేమి? ఆతని దివ్యతేజస్సునుజూచి ఆనందపరవశుడగుచున్నాడు. ఈతనిహృదయమందలి ప్రేమకు మేరలేదు. ఏపరబ్రహ్మము, సర్వవ్యాపకము, మాయాతీతము, జన్మాదిభావవికారమో, అట్టిపరబ్రహ్మను వేదములుగూడ నిరూపింపజాలవుకదా. దేహధారులగుమనుజు లెట్లు తెలిసికొనగలరు. ఆపరబ్రహ్మము మనుజు డెట్లగును? విష్ణువు దేవతాహితముకొఱకు మనుష్యరూపమును ధరించి శంకరునితోసమానుడై యుండవచ్చును. కాని పరబ్రహ్మమూర్తియగులక్ష్మీపతి అసురాపహృతయగుభార్యకొఱకు, ప్రాకృతునివలె దుఃఖించుచు తదన్వేషణార్థ మీమాయరణ్యమంతయు సంచరించుట యెందులకు? నాకేమియు గోచరించుటలేదు. మనుజుడగురాముడే బ్రహ్మమని శివుడనేకపర్యాయములు చెప్పుచున్నాడు. అతనిమాట ఎన్నడు నసత్యము కాజాలదు. అని దక్షకుమారి పరమాత్మజ్ఞానము లేకుండుటచే సందేహించుచు మిక్కిలి పరితపించుచుండెను. కాని తనభర్తకీమర్మము నేమాత్రము దెలుపుటలేదు. మహాదేవుడు సర్వజ్ఞుడగుటవలన

విషయము నంతను దెలిసికొని సతితో నిట్లనెను. సతీ, నీదిస్త్రీస్వభావము. కాన నామాటలందు నీకు ధృఢవిశ్వాము కలుగుటలేదు. నీకిట్టి సందియ మెందులకు కలిగినదో తెలియుటలేదు. ఇంతకు ముందగస్త్యుడు నీవు వినుచుం డగనే కద రామచరిత్రమును చెప్పియుండెను. నేనును రామభక్తిని విస్ము ముగ నిరూపించియుంటిని. రఘుపతి నాకిష్టదైవము. రాముని కపిలాదిమహా యోగులు, సనకాదిసిద్ధులు, నారదాదిదేవర్షులు, నిర్మలహృదయములతో నిరంతరము ధ్యానించుచుందురు. సామాదివేదములు, పాద్మాదిపురాణములు, న్యాయాదిదర్శనములును యితని కీర్తిని, సుగుణనిర్గుణరూపములను, చెప్పుచు నతడు, సర్వవ్యాపకుడనియు, సకలబ్రహ్మాండాధిపతియనియు, మాయాధీశ్వరు నియు, నిత్యాఖండస్వరూపు డనియు, నిరూపించుచున్నవి. భక్తహితార్థము స్వేచ్ఛగనే రఘుకులశిరోమణియగు రామచంద్రునిగ నవతరించెను, అని శివుడు మాటిమాటికి బహువిధముల నిరూపించినను సతి, రామమహిమ, నిసుమంతై నను గ్రహింపజాలదాయెను. అజ్ఞానము ప్రబలము. ఎంతబోధించినను ఈమెకు సంశయములు వీడుటలేదని, యెంచి శివుడు నవ్వుకొనుచు నిట్లనెను. ఓ దక్ష కుమారీ! నేనెంతబోధించినను నీసందేహములు తీరుటలేదు. నీవు పోయి రాముని పరీక్షింపుము. అపుడు నీ సంశయము లన్నియు తీరిపోవును. నీవు తిరిగి వచ్చు నంతదనుక నే నీ వటవృక్షచ్ఛాయయం దుండెదను. నీ సందియములు తీరునంతదనుక ప్రయత్నించి తెలిసికొనుము అని పలుక దాక్షాయణి యామాటలవిశ్వసించి, శివునియాజ్ఞానుసారము బయలుదేరి పోవుచు, ఆరఘురాము నెట్లుపరీక్షింతును, నాసంశయము లెట్లుతీరును. అని మనమునతర్కించుకొనుచు నడచుచుండెను. దక్షసుత కిప్పట్టునశుభముచేకూర కుండుటయెగాక అనిష్టములు రానున్నవి. నేనెంత చెప్పినను ఆమెసంశయములు తీరుటలేదు. విధాతప్రతికూలుడగుటచే ప్రస్తుతమామెకు మంచిదశకనబడుట లేదు. నేనేమిచేయుదును, రాముడేమిచేయదలచిన నట్లుజరుగును. ఇటుతర్క ములకు తావులేదు, విధిని దాటనెవరికిని తరముకాదుగదాయనిశివుడు తనలో తాను పరిపరివిధముల నాలోచించిమనస్సును కుదుటపఱచికొని రామనామ మును జపించుచు తపోనిష్ఠుడై వటవృక్షచ్ఛాయను కూరుచుండెను. అపుడు సతి బహువిధముల నాలోచించి, సీతారూపమును ధరించిరాముసన్నిధి కేగెను.

మాయసీతను జూచి లక్ష్మణు డాశ్చర్యసంశయముల నొందుచు, ఇదంతయు రామప్రభున కేతెలియు నని తానూరకుండెను. అంతలో రామప్రభుపు ఆమె యొక్క-కపటవేషమును గ్రహించెను. ఎవనిని స్మరించినంతమాత్రమున, అజ్ఞా నము సమూలముగ నశించిపోవునో, సర్వాంతర్యామియు, సర్వజ్ఞుడునగు నాప్రభువున కీవేషము దెలియు చెంతటివింత. జగన్మోహినీరూపమున శివుని గూడ మోసగించినమహాత్మున కీ కపటము నెఱుంగు చెంతటిపని. ఆమెను జూచినతోడనే రాము డిట్లనుకొనెను. స్త్రీస్వభావ మతిచపలము. దానిని మించినది మాయ, అనిదరహసవదనుడై, యూరకొనిట్లనెను. తల్లీ? దశరథాత్మజుడగురాముడు నీకుమ్రొక్కుచున్నాడు. మహేశ్వరు లెక్కడ నున్నారు? మీరిట్లేల నొంటిగవచ్చితిరి? తమకు నేమయ్యెద. రాముని నిగూఢ మృదుమధురాలాపముల విని, సతి మిక్కిలి సంశయించుచు, పరిపరివిధముల నాలోచించుచు, భయపడినదై, ఏమియు బదులుచెప్పజాలక మరల శివుని సన్నిధి కేగదలచి పోవుచు నిట్లనుకొనెను. నేను శివునిమాటల నమ్మలేక, యజ్ఞానముచే రాముని పరీక్షింప వచ్చితిని. నీవెట్లు పరీక్షించితివను శివున కేమి సమాధానము చెప్పవలయునని చింతింపు చుండుట రామచం ద్రుడుగ్రహించి, ఆమెదుఃఖమోహాముల బోగొట్టసమకట్టి, తనప్రభావ మును ప్రకటింపదలచి. రాముడు లక్ష్మణసమేతుడై సతి ఎదుట సాక్షాత్క రించెను. అమె ఎటుచూచినను రామలక్ష్మణులె కనిపించుచుండిరి. మఱియు రాముడు సిద్ధులచేతను, మునులచేతను, త్రిమూర్తులచేతను, ఇంద్రాదిదేవతల చేతను, బహువిధముల-పూజింపబడుచున్నట్లును, లక్ష్మీసరస్వతులు, సతియు నాతని సేవించుచున్నట్లును, ప్రపంచమండలిచరాచరాత్మకమగుప్రాణిజాత మంతయు రాము నారాధించుచున్నట్లును, కనబడుచుండెను. ఈయద్భు తములనన్నిటిని జూచి, సతిఆశ్చర్యపడుచు నిట్లుతలపోయుచుండెను. ఇపు డిందరుదేవతలు, త్రిమూర్తులు, కనబడుచున్నారు. కానిరాముని పోలినవా రొక్కరునులేరు. ఇతని కితడే సాటి. ఇట్లనుకొనుచుండ, నాసభయందు మఱి యొకసీతారాములులక్ష్మణుడు:నుండుటను జూచెను. అప్పు డాశ్చర్యముగ్ధయై వారియందముల మాటిమాటికి దలపోయుచు, పరమానందమునొందుచు, రామునిప్రభావమునుజూచి, లజ్జించి, తానుచేసినపనికి భయకంపితయై నేత్రముల

మూసికొనెను. అంతలో నటనేమియు గోచరించుటలేదు. దీనినంతను జూచి ఆశ్చర్యపడుచు రామునిప్రభావమును గొనియాడుచు, శివునిసన్నిధికి బోయెను. సతినిజూచి శివుడు మందహాసమొనరించుచు, కుశలమడిగి ఇట్లనెను. నీవు రాము నివద్ద కేగితివా? ఏగిఎట్లు పరీక్షించితివి? ఆవిషయమునంతను నాకుసరిగా జెప్పుము. ఇప్పటికైనను నీమోహవిభ్రాంతి తొలగినదా? యన సతి రఘుపతి మహిమను దెలిసినదై, భయపడుచు నోటమాటరాక తడబడుచు, సమాధా నముచెప్పుట తప్పకపోవుటచే నిట్లనెను. స్వామీ, ఆరఘుకులదీపకుని నేనెట్లు పరీక్షింపగలను? వారిని పరీక్షించుటకు నేనుతగినదాననుకాను. వారికొక నమ స్కారమును చేసియూరకుంటిని. త్రిమూర్తులు, ఇంద్రాదిసమస్తదేవతలు, తమ తమభార్యలతో వారిని సేవించుచున్నట్లు నాకుగోచరమయినది. అతడు సర్వాం తర్యామి. నాకింకేమియు సందేహములేదు. ఇంద నృతమేమియును లేదు. ఈవిష యమును మీరిదివరకే చెప్పియుండిరి. కాని ఎవరికైనను స్వానుభవమువలన కానితేటపడదు. మీవలె నేనును నమస్కరించితి ననిచెప్ప, సర్వజ్ఞుడగుశివుడు సర్వమును దెలిసికొని రామునకు నమస్కరించి, సతీవాక్యములం దనృతమున్న దని గ్రహించి, తనలో నిట్లనుకొనెను. దైవమునుదాట నేరికిని శక్యముకాదు. ఈసతి సీతారూపమును ధరించినది. కాననీమెను నేనెట్లు గ్రహింపగలను? సీతారాములు నాకుమాతాపితలుగదా. సీతారూపమునొందినసతి నాకుమాతృ సమాన. ఈమెనుగ్రహించిన భక్తిమార్గమునకుభంగమువాటిల్లును. సతియనిన నాకుమిక్కిలిప్రేమ. ఆమెను పరిత్యజించుటెట్లో నాకు తెలియకున్నది. ఈమెను ప్రేమించుట పాపము. ఓప్రభూ నేనేమి చేయవలయును? నీస్మరణమాత్రమున సర్వతాపములు నశించునుగదా. నేనికసతినిమాత్రము స్వీకరించను. ఈనాసంక ల్పము నెరవేరునట్లనుగ్రహింపుము. అని తలచుచుండ, నంతలో యశరీరవాణి, అట్లేయగుగాత మనిఇట్లనెను. శంకరా! నీకు జయమగుగాక. నీభక్తిప్రతిజ్ఞలు నెఱవేఱుగాక. నీవునీకెసాటి. ఇట్టిప్రతిజ్ఞ నింకెవ్వరును జేయజాలరు. ఆమాటల విని శివుడు ప్రసన్నుడై తనగుట్టును సతికి దెలుప కూరకుండెను. కానియాకాశ భాషణములకు సతి దిగులొందుచు నిట్లనియె. ఓదయానిధీ, తమప్రతిజ్ఞ ఎట్టిది, ఎందులకు? సత్యవ్రతులగు తమ రాప్రతిజ్ఞను నాతోనేల చెప్పరు? అనిపరిపరివిధ ములబ్రతిమాలినను శివుడామెకు బదులుచెప్పక మిన్నకుండెను. అప్పుడు సతి

తనలో నిట్లనుకొనెను. శివుడు సర్వజ్ఞుడు. కాననాసంగతి నంతనుగ్రహించి యుండును. సీతాపాపమును పొందినట్లు నేజెప్పకున్నను వారుసర్వజ్ఞులగుటచే దెలిసికొని యుండవచ్చును. స్త్రీలు సహజముగ చపలలు, అజ్ఞానఖనులును. నేనట్లుల జేసితిని? శివుడు పరిత్యజించిన నాకేమిగతి. నీరముక్షీరమునుగూడి మైత్రినినలిపి తానుక్షీరరూపమునొంది క్షీరముతోబాటు గౌరవింపబడు చుండును. కపటమనెడిపులుపు క్షీరమునుజెందిన నాక్షీరములు విరిగి భిన్నభిన్న ములై పోవును. ఈమాటియోగ మట్లున్న దనిమాటిమాటికి దలపోయుచు కుమిలి కృశించుచుండెను. ఆమెవేదన వర్ణనాతీతము. మఱలసదాశివుడు కృపాసింధువు నాయపరాధమును మన్నించునని తలంచుచు, సతిశివుని జూచి ఇట్లనెను. స్వామీ! నన్ను విడువదలచితిరా? ఏమి నాపాపము! నాహృదయము కుమ్మరియావమువలె కుమిలిపోవుచున్నది. నాకు గతిఏమి? అనిదీనవదనయై పలికెడి సతీవాక్యములవిని, జాలినొంది, పరమశివుడు, ఆసతికి మనోహరములగుకథలను ఇతిహాసములనుచెప్పుచునుండ నంతలో తనప్రతిజ్ఞ జ్ఞాపక మునకు రాగా నావటవృక్షచాయయందు బద్ధపద్మాసనుడై యఖండసమాధిలో నుండిపోయెను. దీనినంతను జూచినసతి, కైలాసమునం దిటునటుసంచరించుచు, వేదనాదహ్యమాన మానసయై, దినము నొకయుగముగ గడుపుచుండెను. ఆమె దినమున కొకక్రొత్తయాలోచనలతో కృంగుచు, ఎన్నటికైన నీదుఃఖము నశించునా? నేను పతిమాటలు వినక రామునవమానించినందులకు విధాత నాకీఫలము నిచ్చెను. ఓవిధాతా? నాకీగతిని ఏలకల్పించితివి? నాకేకలంక మును లేదు. నేనేపాపము నెఱుగను. ఓరామచంద్రా! నీవు దీనబాంధవు డవు. అని వేదము లుద్ఘోషించుచున్నవి. ఈదీనురాలిమొరవిని రక్షింపుము. నేను త్రిశుద్ధిగ నీకు ప్రేమొక్కచుంటిని. ఓప్రభూ, నేను శివభక్తురాల నేని, పతివ్రతనేని, సత్యవ్రతదీక్షాపరాయణనేని, నీయందు భక్తికలదానినైతి నేని, యీనా దేహమునుండి ప్రాణములు శీఘ్రముగ నుత్క్రమించుగాత. ఓసమదర్శీ నావాక్కుల మన్నించి నాకేదేని యుపాయమును జెప్పుము. నాకిట్టి దుస్సహ మైనవిపత్తు నేలదెచ్చితివి? ఓమృత్యువా! నీవైన నాయీవిపత్తును దొల గింపుము. ఇట్లనేకవిధముల వాపోవుచుండ నెనిమిదిపదువేల వత్సరములు గడిచి నవి. అంతట శివుడు సమాధినుండి విరమించి కన్నులదెరచి రామనామమును

స్మరించుచుండెను. అప్పుడు దక్షాత్మజ శివుని సమీపించి శిరమువంచి నిలబడ, శంకరుడుసతినిజూచి తనవద్దకూర్చుండుట కాసనమునిచ్చి యమృతాయమానము లైన పురాణేతిహాసములతో కాలక్షేపమును జేయుచుండెను. అప్పుడు బ్రహ్మాది దేవతలును బాగుగనాలోచించి, యనేక క్రతువుల జేయుటచే నీతడాపదవి కర్హుడనియెంచి దక్షునకు ప్రజాపతిపదవి నిచ్చిరి. నాటనుండి, యున్నతాధి కారమునొంది అధికారమదమున గర్వితుడై పెద్దల ధిక్కరించుచు, ప్రభుశబ్దము తనకే తగునని పలుకుచు దేవతలను సయితము ధిక్కరించుచు,మునుల రావించి తానొకగొప్పక్రతువును చేయుటకు నిశ్చయించి, తనయజ్ఞమునం దేయే దేవతలు భాగార్హులోయనివిచారించి వారల నందఅనుబిలువబంచి, సాదరముగ బంధువుల బిలిపించి, ఎవరివలన తనకీపదవిలభించినదో వారినిమాత్రమువిడిచి గర్వోన్మత్తు డైయుండెను. ఎట్టివారైనను అధికారమునసిద్ధించిన నిట్లే యుండెదరు. తమపని తీరినపిదప వెనుకటిదృష్టి యుండుట అరుదుగదా! యక్షకిన్నరనాగసిద్ధగంధ ర్వాదిదేవతలు తమతమ పత్నులతో దక్షయజ్ఞమును జూచుటకు విమానము లతో బయలుదేరుచుండిరి. త్రిమూర్తులుమాత్ర మచటికి బోవుటలేదు. సతి యాకసమందుబోవుచున్న నానావిధవ్యోమయానముల జూచుచు, అందలి దేవాంగనల మధురగీతికల వినుచుండెను. అప్పటిసందడిని విని యోగనిష్ఠులగు మునులుగూడ తమతమధ్యానముల విరమించి, నింగికి చూడ్కులవ్యాపింపజే సిరి. ఆసందడులజూచి దక్షప్రతి ఇట్లనెను. శంభూ! గగనముపై నీకోలాహ లము లెందులకు? అనవిని శివుడు సకలవృత్తాంతమును సతికి జెప్పెను. తోడనే ఆమెపట్టరానిసంతోషముతో నేనిప్పట్టున నటకేగిన బాగుండును. నా నాయకు డనుమతించిన నాతండ్రియింట కొన్ని నాళ్ళుండెదను. పతివియోగముచే దుర్భర దుఃఖము ననుభవించుచుంటిని. నాయపరాధమును తలంచిన మరింతబాధ హెచ్చగుచున్నది, అని ఆమె పరిపరివిధముల తలపోయుచు, మనమున ప్రేమ భయసంతోషములు ముప్పిరిగొన మృదుమధురవాక్కులతో నిట్లనియె. స్వామీ, నాతండ్రి గొప్పయజ్ఞమును చేయుచున్నట్లు తామె శలవిచ్చితిరి. నాకాక్రతువును జూడవేడుకయగుచున్నది. దయయుంచి నన్ను పంపగోరుచు న్నాను, అనవిని శివు డిట్లనియె. సతీ నీవుచెప్పినది బాగుగనె యున్నది. కాని పిలువనిపేరంటమునకు పోరాదు. దక్షుడు తనపుత్రికలనల్లుండ్ర నంద

అను బిలిచియు, నాతోడివైరముచే మనలను పిలుచుటమానెను. నెనుక బ్రహ్మ సభలో నేనాతని నవమానించితి ననుకోపముతో, నిన్నయిననుజూడక నేడా కసిని దీర్చుకొనుచున్నాను. ఇట్టిసమయమున పిలువక యె నీవేగిన నీమర్యాద నిలుపక నిన్నవమానించును. భవానీ! మిత్ర, ప్రభు, గురు, గృహాములకు, పుట్టినయింటికిని పిలువక యె పోవచ్చును కాని, ప్రస్తుతపరిస్థితి అనుకూలముగ లేదు. విరోధభావ మున్నపు డచటికి, పోరాదు, మనమర్యాద నిలువ దని పలువిధముల శివుడు బోధించెను. కాని ఆమాట లామెకు రుచించుటలేదు. శివుడు సతీభావమును తెలుసుకొని, చేయునదిలేక, కానున్నదికాకమానదని తలంచి, తనముఖ్యగణములదోడిచ్చి, ఆమెను పంపెను. భవపత్నియగుసతి తండ్రియింటికివచ్చుటను జూచి, దేవతలు మునులును దక్షునిభయముచే నామెను బలుకరింపక మిన్నకుండిరి. తల్లియు చెల్లెండ్రును సతికెదురేగి, కుశల మడిగి, సాదరముగ దోడితెచ్చిరి.

దక్షుడు కూతునుపలుకరించుట కాని సేమమడుగుటకాని లేదు. సరికదా, ఎఱ్ఱవారినముఖముతో మండిపడుచుండెను. కొంతసేపునకు సతి యజ్ఞవాటికనం తను జూచి, శంకరున కెక్కడనుభాగములేకుండుట గమనించి, శివునిమాటల జ్ఞాపకము చేసికొనుచు, శివునకు జరిగినయవమానమును సహింపజాలక మిక్కిలి బాధపడుచుండెను. గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లుపతివియోగదుఃఖముచే కుమిలిపోవుచున్నయామె కీదారుణదుఃఖము వాటిల్లెను. ప్రపంచమునం దెన్నేని దుఃఖములు కలవు. కాని పుట్టినింటివారిచే నవమానింపబడినందువలన కలిగిన దుఃఖమునకు బోలినదుఃఖములేదుగదా. అప్పుడు రోషావేశముచే సతీదేవి మోము కన్నులు నెఱ్ఱవారిపోయినవి. ముఖమునుండి స్వేదబిందువులు ముత్తెము లట్లు రాలజొచ్చెను. ఆమెతల్లి దీనినంతను జూచి సతిని బహుభంగుల నూరా ర్చెను. సతి శివావమానమును సహింపజాలక, క్రోధమును బట్టజాలక సభవైపు జూచి యిట్లనెను. ఓసభ్యసత్పురుషులారా! నాతండ్రి శివునిపరాభవించి హవి ర్భాగము లాతనికి లేకుండజేసెను. అది జూచియు ఇదితగదని మీరెవ్వరును వారింపరైరి. శివనిందను విని మీరు సహించి యూరకుండిరి. ఎవరు పరమ శివుని నిందింతురో, ఎవరా వాక్యములను వినియెదరో, అట్టివారు నెంటనే తగిన ఫలము ననుభవింతురు. నాతండ్రియు పశ్చాత్తప్తుడు కాకపోడు. ఎవరు సత్సు

రుషులగు శివకేశవుల నిందించెదరో, వానినాలుకలను పమర్థుడు ఖండింపవల యును. అసమర్థుడైనచో, చెవులు మూసిగొని, శివకేశవులను స్మరించుచు నట నుండి లేచిపోవలయును. శంకరుడు జగదారాధ్యుడు. జగజ్జనకుడు. దయామ యుడు. అట్టివానిని మతిలేని నాతండ్రి నిందించి అతనికి హవిర్భాగ మీయ లేదు. పాపాత్ముడగునాదక్షునివలన యీనాశరీర మేర్పడినది కాన నేనును పాపాత్మరాలనే యగుచుంటిని. కాన నేనీశరీరమును దహించి కృతార్థను కాగలను. అని పలుకుచు శివునియందు మనసు నిలిపి, ఎప్పటికైనను శివునే భర్తగా కోరుకొనుచు, యోగాగ్నిచే శరీరమును దహింపజేసెను. వెంటనే యజ్ఞశాలయందు హాహాకారము వ్యాపించెను. సతీమరణానంతరము శివగణ ములు యజ్ఞమును ధ్వంసముచేయ నారంభించిరి. కొందఱు ప్రాగ్వంశము, కొందఱు పత్నీశాలను, మరికొంద రాగ్నీధ్రశాలను, విహారములను పడగొట్టిరి. కొందఱు యజ్ఞపాత్రల పగులగొట్టిరి. కొంద ఱగ్నులను చల్లార్చిరి. కొందఱు పాతిపోవుచున్న దేవతలను పట్టుకొనిరి. శివనిందాసమయమున గడ్డమును సవ రించుకొనుచున్న భృగుని వీరభద్రుడు పట్టుకొని ఆగడ్డమును పెరికివైచెను. శివ నిందనుచేసిన దక్షునికి కనుసన్న చేసినందునభృగుని కన్నుల నూడబెరికెను. శివ నిందాసమయమున నవ్వుచు పండ్లుపైకిపెట్టినందున పూషుని పండ్లు నూడ గొట్టెను. దక్షుని యురమును భేదించుటకు ప్రయత్నించియు కృతార్థులుకాక తుదకాతనితలను నరికి దక్షిణాగ్నియందు హోమముచేసి శివకింకరులు వీరభ ద్రుడును నిజనివాసములకు పోయిరి. అటుశివనిందను విని సహించినవారం దఱు నిట్లు సదోషఫలమునందిరి. ఈదక్షాధ్వరము సర్వవిదితము కానవిస్త రించి వ్రాయుటలేదు సతిమరణకాలమందు శివచరణకమలములందుదృఢమగు భక్తి నిలుచుగాక, ఎన్నటికైనను శివుడే తనకు భర్తకావలయును, అనికోరు కొనుటచే, హిమవంతునింట పార్వతి యనుపేరుతో మేనకయం దుద్భవించెను. ఈమెపుట్టిననాటినుండియు, హిమవంతుడు సకలసంపదలతో తులదూగుచు డెను. అక్కడక్కడ నివసించెడిమునిబృందము లన్నియునీపర్వతమునె చేరికొ న్నవి. హిమవంతు డామునులకు తగిననివాసముల నేర్పఱచి వారిని తగురీతి నాదరించుచుండెను. సర్వదాఫలించు వృక్షములతోడను, ఎల్లఋతువును పుష్పించు పూలమొక్కలతోను, నానామణిగణములతోడను, స్వచ్ఛమగుప్రవాహముకల

నదులతోడను, పరస్పరసఖ్యభావముతోనుండెడి పశుపక్ష్యాదులతోడను, ఆహిమవంత మెంతయు శోభిల్లుచుండెను. గిరిజ జన్మించినపిమ్మట నచ్చటివారందఱు రామభక్తితత్పరులైరి. ఆమె నివసించెడిగృహము నిత్యమంగళోపేతమై యుండెను. బ్రహ్మాదిదేవత లామెను స్తుతింపమొదలిడిరి. నారదమహర్షియు పార్వతీ జననమును వినిపరమానందభరితుడై హిమవన్నగమునకు వచ్చెను. హిమవంతుడును నారదుని రాకకు మిగుల సంతసించుచు, నాతని కర్ఘ్యపాద్యాదులొసంగి, సుఖోపవిష్టుం జేసి, భార్యాసహితముగ మునిచరణసరోజములకు నమస్కరించి, వారిపావనపాదోదకముల శిరమున గ్రహించి, ఆమహర్షి వనేకవిధముల కొనియాడి, తన పుత్రికయగు పార్వతిని బిలిపించి, మునిపాదపద్మములకు నమస్కరింపజేసి, యామునివర్యునితో నిట్లనెను. ఓమునివర్యా, తాము త్రికాలజ్ఞులు. తమకు తెలియనివిషయములేదు. కానతమరు బాగుగనాలోచించి నాపుత్రికయగు పార్వతియొక్కజననకాలగ్రహస్థితిని పరీక్షించి, శుభాశుభలక్షణముల జెప్పవేడుకొనుచున్నాను. అనవినినారదుడు మోమునచిరునవ్వులొలుక, మృదుమధురగంభీరస్వరముతో నిట్లనియె. ఓపర్వతరాజా! నీపుత్రి, సద్గుణములకురాశి. ఈమెసహజసౌందర్యవతి, సుశీల. ఈమెవలన తలితండ్రులు సుఖమునందెదరు. ఈమెను, ఉమ, అంబిక, భవాని, అనిపిలచెదరు. ఈమె పతిభక్తపరాయణ. సర్వమంగళ. ఈమెజగత్పూజ్యయగుటకు సందేహములేదు. ఈమెనుసేవించెడివారికి నలభ్యమగునదిలేదు. ఈమెను భజించెడిస్త్రీలు అసిధారావ్రతలై ప్రవర్తిల్లెదరు.

ఓరాజా! నీపుత్రిక బహులక్షణసంపన్న. కానికొన్నియవలక్షణములును కలవు. వినుము. నిర్గుణ, మానరహిత, జననమరణశూన్య, ఉదాసీన, సర్వసంశయరహిత, ఈమెకు మోగియు, జడధారియు, కామరహితుడు నసంగుడు, మంగళవేషధారి, జననమరణశూన్యుడునగువాడు భర్తకాగలడు. కానకొన్నిశుభలక్షణములు, కొన్నియశుభలక్షణములు నీమెయందు కలవు. సత్యమును బలుకుచుంటిని. అనినారదుడు పలుక, మేనకాహిమవంతులిద్దరు మిక్కిలి దిగులుపడుచుండిరి. పార్వతిమాత్రము సంతోషించుచుండెను. పార్వతి యానందాశ్రువులచేతను, తలితండ్రులు దుఃఖాశ్రువులచేతను, చూచువారలకు మువ్వురును సమముగా నగపడుచుండిరి. ఈమాటలుపిని పార్వతియొక్కసఖీజనమును

విచారింపసాగెను. నారదునిమాట లెన్నటికి ననృతములుకాజాలవని మేన విచారించుచు, పార్వతిని తోడ్కొ-ని లోనికేగెను. పార్వతి శివపదకమలముల ధ్యానించుచు, శివునిపొందుట మిగులదుర్ఘటమని తలంచుచు, శివుని తలంచిన పుడు పులకితగాత్రియై, తనతలంపుల బయటపడనీయక, నఖులతో కూడియుండెను. మేనాహిమవంతులు మాటిమాటికి నారదవాక్యముల తలపోయుచు, చతురులతో నాలోచింపుచు, భవిష్యత్తును విచారించుచు మాటిమాటికి నారదుని పలుకరించుచు, దీనికేదేని యుపాయమును చెప్పుమని ప్రశ్నించుచు, నున్మత్తులవలె సంచరించుచు, కొంతవడి ధైర్యమునువహించి, ఓమహానీంద్రా, పార్వతీపరిణయమునుగురించి నాకేమియు తోచుటలేదు. ఈగ్రహదోషములకు శాంతిలేదా యనివిలపించుచుండ నారదుడు జాలిపడి ఇట్లనియె. ఓహిమాద్రీ! ఎంతటిధీరులైనను, దేవదనుజ, నర, నాగ, మునులైనను, బ్రహ్మలిపిని తుడిచిపెట్ట జాలరు. అయినను నాకుతోచినయుపాయమును జెప్పుచున్నాను. వినుము. ఇపుడునేజెప్పినయవగుణములన్నియు శివునియందున్నవి. ఆతడుపరమేశుడు, కానపార్వతికి తగియుండును. గొప్పవారియవగుణముల సయితము సుగుణములగ నెంచెదరు. అనేకసుగుణములుండి, రెండుమూడవగుణములున్నను నవియు సుగుణములుగ భాసించును. అతడు సర్వేశ్వరుడుగాన నతనిదోషముల నెవరును గణింపరు. దీనికికొన్నియుదాహరణములుగలవు. విష్ణుభగవాను డురగశయను డయినను విద్వాంసుల కదిదోషముగ భాసించుటలేదు సరిగదా, యాతనిని, శేషశాయియనియు, పన్నగశయనుడనియు, స్తుతించుచున్నారు. సూర్యుడు, అగ్నియు, సర్వరసభక్షకులైనను వారిని దుష్టులనక పరమపవిత్రులనుచున్నారు. అపవిత్రములగుజలములు గంగలోకలిసినను గంగమాత్ర మతిపవిత్రమై యలరారుచున్నది. అట్లే సమర్థుల దోషములును గణనకు రావు. జీవులందరును పరమాత్మస్వరూపులే కాననెవరిని నిందింపరాదు. అట్లు తెలిసికొనక పరనింద చేసినవా రెన్నిజన్మముల కైననుపరమేశ్వరసాన్నిధ్యము నొందజాలరు సరిగదా నిరయము నందుచుందురు. సురను గంగాజలముతో తయారుచేసినను సత్పురుషులు గ్రహింపరు. గంగానదిలో సురను కలిపినను గంగఎన్నడు నపవిత్ర కాజాలదు. సరిగదా! గంగలోకలిసిననుసుర పవిత్రయగుచున్నది. ఇట్లే పరమేశ్వరునకు దోషమేమాత్రమున్నను వారెట్టివారైనను ముక్తులగుచున్నారు. పరమే

శ్వరధ్యానములేనివా రెన్నితపస్సులజేసినను ముక్తులు కాజాలరు. సురకు గంగకు నెంతభేదమున్నదో, జీవేశ్వరుల కంతభేదము కలదు. కాన నద్వైతనిష్ఠ దుర్లభము. శివుడు పరమేశు డగుటచే నాతనిసాన్నిధ్యము నందుటకు తీవ్రమగు తపమాచరింపవలయును. శివుడు సమర్థుడు, అణిమాదిసిద్ధులుకలవాడును. భగ పంతుడునుకాన మనపార్వతి కతడే తగినవరుడు. శివానుగ్రహము తీవ్రతపస్సు వలనగాని సిద్ధింపదు. కానశివునికై, నీపుత్రిచే నట్టితపమును జేయింపుము. లోకమునందెన్నేని నదులు కలవు. కానిగంగకుసరియగునది మఱియొకటిలేదు. అట్లేశివునకు సరియగు పురుషు డెందునులేడు. అతడు భక్తిపూర్వకమగు తపమునకు గాని, వేరొండుమార్గమునకు ప్రసన్నుడుకాడు. అతడార్తత్రాణ పరాయణుడు, కృపాసముద్రుడు. భక్తమనోరథములనెఱవేర్చుట కితడేదక్షుడు. జపము, తపము, యోగము, మున్నగు సాధనములకు సిద్ధింపని కోరికలు, శివారాధనవలన తప్పక సిద్ధించును. కాననీవుతప్పక నట్లుచేయుమని చెప్పి, నారదమని, జయ! జయ! ముకుందా, లక్ష్మీరమణా, యనివిష్ణునామమును జపించుచు, పార్వతి నాశీర్వదించి, పార్వతిని తపస్సునకు బంపుటకీదినమే సుదినము. సర్వవిధముల బాగున్నదని శైలరాజుతోజెప్పి బ్రహ్మలోకమునకు బోయెను. మేన నారదవాక్యముల విని పతితో నిట్లనియె. రాజా! యీ మునివాక్యము లేమియు నాకు గోచరించుట లేదు. పార్వతికి తగినవరునిజూచి వివాహము కావింపుడు. అట్లుకానినాడు కన్యగనే యుండనిండు. ఈపసిపాప తపము నెట్లుచేయగలదు? నాకేమియు దోచుటలేదన, హిమవంతు డిట్లనియె. ఓకాంతా! ఈకన్యను నాప్రాణములకన్న నెక్కుడుగ ప్రేమించుచుంటిని. ఈమెకుతగినవరు డెందునుకనిపించుటలేదు. ఎటులనో మనసును సరిచేసికొని ఎవని కైన నిచ్చితిననుము ఈతడు స్వభావజడమైన పాషాణరూపుడు. ఇట్టివరున కేల నిచ్చు ననిప్రజలు ననున్ననిందించెదరు. చందురునం దగ్నియైన పుట్టవచ్చు, కాని నారదునిమాట లెన్నటికి నసత్యములుమాత్రము కాజాలవు. కాననీవు దుఃఖిం పకుము. ఎవనియనుగ్రహమువలన నీమె మనకు లభించినదో, అట్టి రామచం ద్రుని స్మరింపుము. ఆతడే ఈమెకు మంచివరుని కూర్చగలడు. నీకీమెయం దను రాగముకలదేని నీవీమెచే శివునిగురించి తపమును జేయింపుము. అతడే ప్రస న్నుడై మనకోరికల నీడేర్చును. నారదవాక్యములు సారభరితములు, సహేతుక

ములును. సుగుణరాశియు, సుందరమూర్తియునగుశివు డన్నివిధముల మనకు తగినవాడు. మేన పతివాక్యములాకర్ణించి ప్రసన్నయై లేచి పార్వతిచెంతకేగి సప్రేమముగ నామెనుజూచి, యానందబాష్పపూరితనేత్రయై, యామె నొడియం దుంచుకొని, ముంగురులసవరింపుచు, గద్గదస్వరముచే నోటమాటరాక నిట్టూ ర్పును విడుచుచుండెను. తల్లియవస్థ సంతనుజూచి, పార్వతి మృదుమధుర వాక్కులతో నిట్లనెను. తల్లీ! నాకొకస్వప్నము వచ్చినది. చెప్పెద వినుము మారసుందరుడు, గౌరాంగుడునగుబ్రాహ్మణోత్తముడు నాకిట్లుపదేశించెను. ఓగిరిజా! నారదవాక్యము సత్యము. కాననీవాలసింపక తపమాచరింపబొమ్ము. నీతలిదండ్రులు నందుల కంగీకరింతురు. తపస్సు దుఃఖహరముశుభప్రదమును. తపోబలముచేతనే త్రిమూర్తులు వారివారికృత్యముల నెరవేర్చుచున్నారు. శేషుడు తపముచేతనే భూభారమును వహించుచున్నాడు. తపమే సృష్టికి మూల కారణము. కాననీవాలసింపక శ్రమయనక తపమాచరింపుము. అట్లు కానినాడు శివుడు ప్రసన్నుడుకాడు, అని చెప్పెను. కాననేనట్లుచేసెదను. బిడ్డమాటలవిని మేనక ఆశ్చర్యమందుచు నీస్వప్నవృత్తాంతము నంతయు నగరాజున కెరింగిం చెను. ఆదంపతు లిరువురు హర్షపులకితగాత్రులై పార్వతికి తగువిధములు బోధిం చిరి. వారిబోధలవిని పార్వతి హర్షవికసితవదనయై, తపమాచరింప ననువగు చోటునకు బయలుదేరెను. ఆమెగృహమును వీడునప్పుడు, తల్లితండ్రులు, పరివా రము సఖీవర్గము, నామెయందలిప్రేమభరమున, గద్గదస్వరముకలవారై పలుక నేరక, నిశ్చేష్టులై ఆమెయందె చూడ్కులు నిగిడించి చూచుచుండిరి. ఆసమయ మునసే వేదశిరుడనుముని బయటకేగుదెంచి, పార్వతియొక్కమహిమను చెప్పుచు నామెకొఅకు బెంగగొనవలదనియు, నామెలోకమాతయనియు, చెప్పివారలకు జ్ఞానము నుపదేశించి వెడలిపోయెను. అట పార్వతి వనమునకు బోయిప్రాణవల్ల భుడగు శివుని మనంబున నిల్పుకొని, తపమాచరింపుచుండెను. అతిసుకుమార కోమలదేహ మీకఠినతపస్సునకు తగదు. అయినను భక్తిజ్ఞానతత్పరయై, శంకర చరణకమలంబుల మనమున నిల్పుకొని, సమస్తభోగముల త్యజించి, దేహమును శుష్కింపజేయుచు, సహస్రవర్షంబులు ఫలముల భక్షింపుచు, శతవర్షంబులు శాకము నారగించుచు, కొంతకాలము జలమునే పానముచేయుచు, తరువాత కొంతకాలము నేలరాలినపండుటాకుల దినుచు, పిమ్మట వానినిగూడ విడిచి,

కేవలవాయువునె భక్షింపుచు, మూడువేలసంవత్సరములు ఘోరతపమాచరిం చెను. నాటనుండి యీమెకు యపర్ణ యనిసార్థకనామ మేర్పడెను. ఆమెతపము నకుమెచ్చి యాకాశవాణి ఇట్లనెను. ఓగిరిరాజపుత్రీ? నీమనోరథము లీడేరును. ఇకనీతపమును చాలింపుము. నీకుపరమేశ్వరునిపొందు లభించును. ఇట్టితపస్సును మునీంద్రులైనను చేయజాలరు. నీతండ్రి నిను పిలువవచ్చును. అతనివెంట నీవిం టికి జనుము. నిన్ను చూచుట కటకు మహర్షులు రాగలరు. వారు నీవివాహసం ధానమును చేయగలరు. ఇది నిజమనిన ఆమృదుమధురవాక్కులవిని పార్వతి హర్షపులకితగాత్రియైమనమునశివుని నిలిపి, ఆశరీరవాణి చెప్పినచొప్పున తప మును చాలించెను. అటసతీవియోగముచేవిరక్తుడైన శివుడు నిరంతరము రామ నామమును జపించుచు, రామకథాకాలక్షేపములవినుచు, చిదానందమయుడు, సుఖధాముడునగుశివుడు కామమోహామదములత్యజించి, ఎల్లజగముల మోహిం పజేయుచు, సమస్తభూవలయమున ద్రిమ్మరుచు, జ్ఞానవిజ్ఞానసంపన్నుడయినను ననురక్తయగు సతీవియోగదుఃఖముచే కృశించుచు, కొందఅమునులకు జ్ఞానము నుపదేశించుచు, కొందఅకు శ్రీరామచంద్రగుణతత్వముల బోధించుచు, భక్తుల ఎడబాటును సహింపజాలనిపరమదయాళుడు సతీవియోగదుఃఖమును సహింప జాలక తానును దుఃఖించుచు, శ్రీరామపదకమలములందు నిత్యనవీనప్రేమ లుప్పొంగిపోవ కైలాసమును:వీడి సంచరింపుచుండెను. సతియందలిస్థిరప్రేమను, దృఢవ్రతమును, అమితమగురామభక్తిని జూచి, ఆకృపాసముద్రుడగు రామచం ద్రుడుప్రత్యక్షమై శంకరుని కుశలమడిగి, ఇట్లనెను. ఓశంకరా! నీప్రతిజ్ఞను నిల బెట్టికొంటివి. ఇప్పుడాసతి హిమవంతునింటపార్వతియై జన్మించి నీకొఅకు ఘోర తపమును చేసియున్నది. కాననామాటలందు విశ్వాసముంచి, హిమవంతుని ముద్దులపట్టియగు నాపార్వతిని వివాహముజేసికొనుము అనిచెప్పి, ఆమెపవిత్రతను కొనియాడుచుండనాహరితో హరుడిట్లనియె. ఓరామా! నాకిప్పుడు వివా హము తగదు. అయినను మీయాదేశము నతిక్రమింపజాలను. తల్లిదండ్రులు గురువులు. వారెప్పుడును శుభంకరములు, ప్రేమభరితములు నగుహితములనె యుపదేశింతురు. కానవారిమాటల నాలోచింపకయె చేయుదు నని చెప్పవలెను. మీరు నాకన్నివిధముల శ్రేయోదాయకులు. మీకన్నను హితులు నాకింకొక రులేరు. కాన మీయాజ్ఞను శిరసావహింతునన, భక్తిజ్ఞానధర్మయుక్తములగు

శివునివాక్యములవిని, సంతసించి అట్లుచేయుమనిచెప్పి, భగవంతుడగు రామచంద్రుడంతర్ధాతుడయ్యెను. శంకరుడు భగవద్రూపమును ధ్యానించుచుండ నంతలో సప్తమహర్షులు శివునిజూడ నటకు వేంచేసిరి. అంత శివుడు జరిగినవిషయము నంతను వారి కెరింగించి, ఓమునివర్యులారా! మీరాహిమవన్నగమున కేగి, పార్వతియొక్కరూపశీలముల బరీక్షించి, పార్వతిని గృహమునకు దోడ్కొనిపోవునట్లు నియమించి, వారిసందేహముల బాపిరండన నాబుషులు శివునిమాటల గారవించి, ఆనందమగ్నమానసులై, తండ్రియింట తపమాచరించుచున్న భవానిని దర్శించి మునులిట్లనిరి. ఓశైలకుమారీ, నీవెందుల కీతపమాచరింపుచుంటివి? ఏదేవునారాధించుచుంటివి? నీవాంఛితమేమి? మాతో నిజము పలుకుమన నాజగదంబ మునివర్యులతో నిట్లనియె. ఓమునివర్యులారా! 'నావాంఛితమును చెప్పుటకు నాకే సిగ్గగుచున్నది. మీరునాజాడ్యమునకు నవ్వుదురేమెయని భయమగుచున్నది. నేనీజాడ్యభారమున నిసుకవలె క్రిందికిక్రుంగిపోవుచుంటిని కానిపైకిలేవలేక పోవుచున్నాను. రెక్కలులేనిపక్షివలె పైకెగురజాలకుంటిని. నేనా నారదునిమాటల నమ్మి, ఎన్నటికైనను తపస్సుఫలింపకపోవునా యనునాసతో నిట్లుతపమాచరించుచుంటిని. అనునాపార్వతిపలుకులవిని, బుషులుమందహాసముచేయుచు నిట్లనిరి. పార్వతీ! నీపలుకులు సత్యములు. నీవెప్పుడును బరువగుదానవే, నీయీశరీరము నగసంభూతముగద, నీకు తేలిక ఎట్లుకలుగును? జగన్మాతవగునీవు బరువగుటలో నాశ్చర్యమేమున్నది? నిస్సారమగునది తేలికగనుండును. నారదవాక్యములవిని నీవిట్లు కృశించుచుంటివా? నారదోపదేశము లెవ్వరినిగృహమునం దుండనీయవు. అతడు దక్షుపుత్రుల కుపదేశించి, వారలకింటిముఖమైనను జూపక విరాగుల జేసెను. ఇతనియుపదేశములచే చిత్రకేతువను రాజు జ్ఞానియై సంతానహీనుడయ్యెను. హిరణ్యకశిపునకు, కుమారుడగుప్రహ్లాదునకును, భేదమును కలిగించి, విరోధమును పెంచెను. స్త్రీలైనను, పురుషులైనను, నారదోపదేశములవినినంతనె విరాగులై గృహంబుల వీడిపోవుదురు. అతడెంతటిగొప్పవారి నైనను తనతో సమానమగువిరాగుల చేయుచుండును. ఆతని నమ్మరాదు. ఆతనివాక్యములందే నీకువిశ్వాసమున్నచో, నతడుచెప్పిన వరునిస్వభావములను జెప్పెదము వినుము. శివుడు సహజముగ నుదాసీనుడు. గుణరహితుడు. త్రపావిహీనుడు, కపాలమాలి, యమంగళవేష

ధారి, కులహీనుడు, అనికేతనుడు, దిగంబరుడు, సర్వాభరణుడు, వ్యాఘ్రచ
ర్మాంబరుడు. నీవువరించినవరుని లక్షణముల వింటివికద. అట్టివానితో నీవేమి
సుఖ మనుభవింతువు. మోసములో పడిపోవుచుంటి వేమొ? ఇంకొకరహస్య
మున్నది వినుము. శివుడు తొల్లి దక్షాత్మజయగు సతిని వివాహమాడి, ఆమె
యందు కళంకమాపాదించి యామెను త్యజించెను. ఆమె శివవియోగమును
సహింపనిదై, అవమానమును భరింపజాలక తుదకు బలవన్మరణమునందెను.
అట్టిమగనివలన నీవేమిసౌఖ్యము నందెదవు. దుఃఖాతీతుడగు నాతనికి సతీవియోగ
మనెడుచింతయే లేదు. బందుగులెవ్వరును లేరు. గేస్తులఇండ్లబిచ్చమెత్తుకొ
నుచు నంబఱు తనవారె యని చెప్పుకొనుచుండును. అట్టివానిపొందు నమా
యకురాలవైన నీవుకోరుచుంటివి గాని ఇంకెవ్వరైయు కోరదు. నీవుమామాటలు
విన్నచో నీకుతగినవరుని చెప్పెదము. అతడన్ననో, అతిసుందరుడు, పరమపవి
త్రుడు, నిత్యసుఖి, సుశీలుడు, అతనికీర్తిని వేదములుసయితము స్తుతించుచు
న్నవి. దూషణరహితుడు, సకలసద్గుణములకు నిధానము. అతడు వైకుంఠ
వాసియగు శ్రియఃపతి, నీవాతని వరునిగ గ్రహించిన బాగుండును. నీక్షేమమరసి
చెప్పుచుంటిమి. ఇట్లాఋషులవాక్యముల వినిభవాని, మందస్మితమధురవదనయై
యిట్లనియె. ఓమునులారా, ఈనాశరీరము పర్వతరాజునుండి ఉద్భవించెను కాన
నాహృదయము రాతికన్న కఠినము. నాదేహప్రాణములు రెండును నతికఠిన
ములు. నాప్రాణములుపోయినను సరే, నాపూనికను మాత్రము విడువను. సువ
ర్ణము పాషాణాదులనుండిబయలుపడి అగ్నిలో పడవైచినను తనస్వాభావికగుణ
మును వీడదుసరిగదా మరింత వన్నెకెక్కును. నేనును నారదవాక్యముల విడుచు
దానకాను. అతడు నాకు గురువు. గురువిశ్వాసములేనివారికి స్వప్నమందై
నను సుఖము సున్న. గురుభక్తున కెట్టిభయమును లేదు. శివుడవగుణములు
కలవాడైనను, విష్ణువు గుణరాశియైనను నామనము శివునె ప్రేమించుచున్నది.
మీమాటలు విశ్వసింపదగినవే, అయినను నాజీవితమునంతయు శివునికై ధార
వోసితిని. ఎన్నటికైనను నాభర్తశివుడెకాని మఱియొకడు కాజాలడు. గుణదోష
ములతో నాకు పనిలేదు. మీకిష్టమగునేని త్వరలో శివుని రావించి నాకోరి
కను సఫలము చేయుడు. నేను శివునిగాక మఱియొకనిని వివాహమాడుట ఎన్న
టికిని జరుగుపని కాదు. శివుడు నన్ను వివాహమాడ నొల్లడేని, ఇట్లే కన్యగ

నుండిపోవుదును. కాని వేరొండువిధముగ జేయజాలను. శివుడువచ్చి చెప్పినను నారదమునివాక్యముల విడువను. మీరిట్టిమాటలు మరెన్నడును పలుకవలదని మిమ్మల వేడుకొనుచున్నాను. దయయుంచి వెడలుడు, అనిపలుక నాపార్వతి పలుకులు విని, ఋషు లానందసంభ్రమము లొలుక నిట్లనిరి. ఓభవానీ! నీపతి భక్తియు, నిశ్చలజ్ఞానమును జూచిన మాకాశ్చర్యము కలుగుచున్నది. నీకుశుభ మగుగాక. నీవు ప్రకృతివి. అత డీశ్వరుడు. కాన మీరిరువురు నీసకలప్రపంచము నకు మాతాపితరు లగుచున్నారు. ఓతల్లీ! నీపాదపద్మములకు వందనములు. మాపలుకులకు కోపగించిక మన్నింపుమనుచు పురాణదంపతులస్తుతింపుచు పుల కితగాత్రులై యాఋషులు ఆమెనువీడ్కొని హిమవంతునిదరి కరిగి ఆతనికి పార్వతిదృఢనిశ్చయము నెరిగించి యాతనిమన్ననల వడసి మఱలవచ్చి శివునికి పార్వతియొక్కభక్తిప్రేమల వెల్లడించి, యాతని యనుజ్ఞగైకొని నిజనివాసంబు లకు జనిరి. అంతట హిమవంతుడు తనముద్దుబిడ్డనుజూడవచ్చి పార్వతిని తన నిజనివాసమునకు దోడ్కొనిపోయెను. ఋషులమాటలచే శివుడు ప్రసన్నుడై రఘునాథుని ధ్యానింపుచు నిశ్చలయోగసమాధియం దుండెను. అప్పుడు తార కుడనురాక్షసుడు మిక్కిలి బలవంతుడై లోకములను లోకపాలురను జయించి, దేవతలను భయభ్రాంతులజేయుచు వేయిసారులు వారినోడించి వారి సంపదల హరించెను. దేవత లీరాక్షసబాధను సహింపజాలక బ్రహ్మయొద్దకుపోయి మొర వెట్టుకొనిరి. వీరి దుఃఖములజూచి బ్రహ్మ కనికరముగలవాడై ఇట్లనెను. ఓ దేవతలారా!, ఈదైత్యుడు మీచే జయింపబడడు. మహేశ్వరపుత్రునిచే నితడు జితుడు కాగలడు. శివున కింతవరకు సంతానములేదు. సతి దక్షునింట జీవిత మును చాలించి, హిమవంతునింటపార్వతియై జన్మించి శివుని పతిగ గోర ఘోర తపమాచరించి యున్నది. శివగిరిజల వివాహమయిన మనకార్యము సిద్ధించును. కాని ఇపు డాశివుడు సమాధినిష్ఠుడై యున్నాడు. ఆతని మేల్కొలుపుట చాల కష్టము. నేనొకయుపాయమును జెప్పెద. వినుడు. మన్మథుని శివునివద్దకు బంపి అతని అచలసమాధిని విడిపింపజేయవలయును. పిమ్మట నేను వచ్చి మిగిలిన పనిని చక్కజేసెద నన విని దేవతలు సంతసించి, కామదేవునిచెంత కరిగి యీవృత్తాంతమంతయుచెప్పి అతనిని ప్రార్థించిరి. దేవతలవిపత్తుల ఓనిజాలి నొందియు, మనమున శంకించుచు, దరహసితవదనుడై మదను డిట్లనియె, ఓ దేవత

లారా! శివునిజయించుట సామాన్యముకాదు. అతనితోడి విరోధము మృత్యువునుకొని తెచ్చుకొనుటయే? జయమెన్నటికిని కలుగదు. అయినను మీవిపత్తులదొలగించుటకు మీకెట్టిసహాయము నైనజేయబూనితిని. "పరోపకారార్థమిదంశరీరమ్" అని పెద్దలు జెప్పియుండిరి. వేదములుగూడ పరోపకారమును మించినధర్మము లేదనుచున్నవి. అట్టివారిని సత్పురుషులు ప్రశంసించెదరు. కాన నాయీశరీరమును పరోపకారమునకు వినియోగించెద ననిదేవతల కభయమిచ్చి, శివునిస్మరించుకొనుచు, శివునిచే మరణముధృవ మనినమ్మి, చెఱకువిలుకాడు తనబాణముల సవరించుకొనుచు తనప్రభావమును, విస్తరింపజేసెను. దానితో ప్రపంచమంతయు తనకు వశముగాక తప్పదని భావించెను. మన్మథప్రభావముచే వేదమర్యాదలు నశించుచుండెను. బ్రహ్మచర్యమంతరించుచుండెను. మన్మథప్రభావముచే మహామునులుగూడ, ధైర్యములవీడి, ఇంద్రియనిగ్రహమునువీడి, సదాచారజపతపోయోగములబాసి, ధర్మజ్ఞానపరాఙ్ముఖులై సంచరించుచుండిరి. మహాయోగులును మన్మథునిధాటి కోర్వజాలక, బయటికివచ్చిన తమనియమము లంతరించునని శంకించుచు, గుహలందే నివసించుచుండిరి. కానివారివిజ్ఞానము వారియనుచరులతోగూడి పారిపోయెను. అప్పుడు వారు సద్గ్రంథరూపములగు గుహలందు దాగుకొనజొచ్చిరి. వారువీరనలేల! ప్రపంచమంతయు మన్మథాగ్నిచే తపింపబడుచుండెను. ఇప్పుడీశ్వరుడు తక్కినన్యాలీయుపద్రవమునుండి రక్షింపజాలరని శివుని వేడుకొనుచుండిరి. ప్రపంచమందలి జడచేతనాత్మకమగు ప్రాణిజాతమంతయు, మన్మథవశమై యుండెను. లతలను జూచి వృక్షములువంగి ముద్దిడుకొనుచున్నవి. నదులు పొంగి సముద్రమున కలియుచున్నవి. పశుపక్ష్యాదులును, మన్మథునికిలొంగి తమకుసహజమగు ప్రేమతో ప్రవర్తించుచుండెను. ఇక మనుజులవిషయమును వేఱుగ జెప్పనక్కరలేదు. దేవదైత్యనరకిన్నరకింపురుషవిద్యాధరప్రేతపిశాచభేతాళములదశ వర్ణనాతీతము. సిద్ధులగు మునులె చలింప, నీచజీవులమాట చెప్పనేల? ప్రపంచమునంతను బ్రహ్మమయముగ నెంచెడి మహామహులందఱకు నిప్పుడు స్త్రీలకు పురుషమయముగను, పురుషులకుస్త్రీమయముగను గన్పట్టుచుండెను. ఇట్లు మన్మథుడు తనప్రతాపము నొకముహూర్తకాలముజూప ప్రపంచమంతయు తలక్రిందయ్యెను. కాని శివుడుమాత్రము చలించుటలేదు. అప్పుడు మదనుడు శివుని

వద్ద సంచరింపుచు, నతని జూచినపుడెల్ల భయపడుచు, ఎప్పటికప్పుడు తన ప్రాణంబుల రక్షించుకొంటినని సంతసించుచు, ఏవేవియోయుపాయంబుల బన్నుచు, నాలోచింపుచుండెను. అంతనొకదివ్యవనమును, అందునూతనవృక్షములను, మధురఫలముల, సుగంధపుష్పవాటికలను, ఉపవనములను, వాపీకూప తటాకాదులను, చక్కనిపొదరిండ్లను గల్పించి, వసంతుని స్మరించినంతనె యాదివ్యవనము ద్విగుణీభూతమైన శోభకలదాయెను. అప్పుడు జగమంతయు ప్రేమమయముగా నుండెను. దానింజూచి మరుడె మరులుకొనజొచ్చెను. ఈశ్వరునకు కామాగ్నిని రగులొక్కలుపనెంచి, మందమలయవాయువులను, ప్రోత్సహించుచు, సరోవరములందలి నానావిధకమలంబులందు విహరించెడి భ్రమర ఝుంకారముల కానందించుచు, శుకశారికాగానములకు కులుకుచు, అప్సరఃకామినులచే నృత్యముమున్నగు సరసకార్యంబుల జేయింపుచు, నానావిధమగు తనకౌశలమును జూపుచుండెను. కానిఅతడు చలించుట లేదు. అదిజూచిమదనుడు క్రోధావిష్టమానసుడై, ఒకచూతశాఖ నధిష్ఠించి, పంచబాణముల నొక్కసారిగ, శివునిమీదకు వదలి జూచుచుండెను. అంతశివుడు సమాధిభంగముచే తీక్ష్ణమగునేత్రములతో నలుదిక్కుల బరికింపుచుండెను. అపుడు మదనుడు చూతశాఖిలమాటున దాగియుండుట జూచి, పట్టరానికోపముతో మూడవ కంటిని, దెరచెను. అపుడు ముల్లోకంబులు భయభ్రాంతములాయెను. వెంటనే ఆనేత్రానలమందు మన్మథుడు భస్మావశేషుడయ్యెను. మన్మథసంహారముచే ప్రపంచమంతట నాహాకారములు ప్రబలుచుండెను. దేవతలు మున్నగువారు దుఃఖించుచుండిరి. యోగులు, మునులు, మొదలగువారు, తమతమ తపస్సమాధులకు విఘ్నము నశించెనని సంతసించుచుండిరి. కామాతురులు విచారింపుచుండిరి. పతిమరణమునువిని రతి స్మృతిలేక కొంతతడవు పడియుండి, పిమ్మట ననేకవిధముల విలపించుచు, శివుని సమీపించి, నానాధుని మన్నించి బ్రతికింపుమని ప్రార్థింపుచు, దుస్సహామగుబాధను పడుచుండెను. ఆరతినిజూచి శివుడు జాలిపడి ఇట్లనెను. రతీ! నీప్రియుడనంగుడై సంచరించుచు యసంగుడని పిలువబడుచుండును. రాబోవుయుగమందు భూభారావతరణముకొఱకు, కృష్ణుడను పేరుతో విష్ణువు అవతరించును. అపుడు నీభర్త ప్రద్యుమ్ననామముతో నాతనికి పుత్రుడై జన్మించును. అతడు మఱల నీకుభర్తయగును. నామాటలు సత్య

ములు. నీవు దురపిల్లకుమని బలుక నామెయూరడిల్లి, శివునివద్ద ననుజ్ఞగై కొని వెడలిపోయెను. ఆమాటనువిని బ్రహ్మాదిదేవతలును సంతసించిరి. పిమ్మట బ్రహ్మాదిదేవతలు వైకుంఠమునకుబోయి, విష్ణుభగవానునిముందిడుకొని, శివ సన్నిధికివచ్చి, కైలాసవాసా! జగదీశా! యని శివుని స్తుతించిరి. చంద్రశేఖ రుడు వారలజూచి సంతసించుచు, నిట్లనియె. ఓకమలాపతీ! ఓకమలాసనా! ఓదేవతలారా! మీరాక కెంతయు సంతసించుచున్నాను. మీకందఱకు కుశల మేకద, మీరాకకు కారణమేమి? అన బ్రహ్మ ఇట్లనెను. గిరిశా! నీవు సర్వాం తర్యామివి. నీకు దెలియని దేమున్నది. లోకకళ్యాణముకొఱకు మిమ్ము బ్రార్థింపవచ్చితిమి. శివపార్వతుల కళ్యాణమహోత్సవమును ఎప్పుడుజూడగలుగు దుమో యని దేవత లువ్విళ్ళులూరుచున్నారు. ఓస్మరాంతకా, యీమదనుని రాకయు మృతియు, మీకళ్యాణముకొఱకు దేవతలు పన్నినయుపాయమే. సర్వాంగసుందరుడగుమదను డనంగుడగుటయు, నొకతీరున లోకమునకు హితమే అయినది. తాము మదనుని శిక్షించి, భర్తృవియోగమువలన చింతింపు చున్న రతికి వరమిచ్చి యామెను కటాక్షించితిరి. తమబోటిపెద్దలు ముంగ శిక్షించియు, పిమ్మటవారి నాదరించెదరు. పెద్దలచే జేయబడినశిక్షయు, శిక్ష తులమేలుకొరకే - యగుచున్నది. పార్వతికఠినతపము నాచరించి, బహుకష్ట ములనంది, నేటికి సఫలమనోరథ యగుచున్నది. అనెడికమలాసనుమాటల విని, విష్ణువు సంతసించుట జూచి, శివుడు వల్లెయని యందుల కంగీకరించెను. శివుడు వివాహమున కంగీకరించుటను జూచిదేవతలు, జయజయ ధ్వానముల జేయుచు, కుసుమవర్షమును గురియించిరి. అంతసప్తమహర్షు లటకురా, వారల వివాహసంఘటనమునకు హిమవన్నగమునకు బంపిరి. వారచటకేగి, పార్వతిని జూచియిట్లనిరి. తల్లీ! నారదవాక్యము లనృతములు. శివుడు వివాహమాడుట కల్ల. ఇదివఱలో నేమో యనుకొంటిమి కాని యిప్పుడట్లనుకొనుటకు వీలులేదు. అతడు కాముని భస్మమొనరించి, రతికి వరమునిచ్చియున్నాడు. నీవీవిషయ మును వింటివోలేదో. అతడు నిష్కాముడు. అట్టివానికి వివాహ మెందులకు? అనెడి మహర్షులమాటల విని, వారికి పార్వతి యిట్లనియె. ఓమహాత్ములారా, మీరు విజ్ఞాననిధులు. మీరు నుడివినట్లు శివుడు కామవికారము నందియె, కాముని భస్మముచేసె ననుకొందును. అట్లయిన నన్ను స్వీకరించుననియు

తోచుచున్నది. శివుడు మహాజ్ఞాని, యోగీశ్వరుడు, నిత్యుడు, భోగరహితుడు, జన్మరహితుడు, జితకాముడు, ననవద్యుడు ననవిని నేను త్రిశుద్ధిగ శివు నారాధించితిని. అతడు భక్తప్రియుడు. భక్తులేదికోరిన నద్దానిని ఇచ్చును. నేనాతనిని, నన్నువినాహామాడు మనికోరియుంటిని, అత డందుల కంగీకరించెను. అతడు నాప్రతిజ్ఞ నిలబెట్టును. కానమీమాటల నేనమ్మజాలకుంటిని. అనలము నందు తుషారబిందువులవలె, నీశ్వరపాలనమునందు, మదనతుషార మింకిపోయినది. అతడు భక్తికి వశుడు కానిమఱి దేనికిని వశుడు కాడు. ఇవన్నియు మీకు దెలియనివికావు. నన్ను పరీక్షించుట కిట్లనుచుంటిరి, అన నాగిరిజమాటల విని, ఋషులు సంతసించి, ఆమెను దీవించి, ఆమెదృఢభక్తికి మెచ్చుకొనుచు, హిమవంతు నొద్దకేగి, మన్మథుడు భస్మమగుట మున్నగువార్తల నెరిగించి, యుండిరి. ఆమాటలవిని, హిమవంతుడు, మన్మథనాశమును, రతీవరప్రాప్తి కినిఖేదమోదముల నంది, శంకరమహాత్మ్యమును దెలిసికొని, సాదరముగ మునుల రావించి, తగుశుభముహూర్తమును బెట్టించి, సప్తఋషుల నొప్పించి, వారల కాలగ్నపత్రము నర్పించి, శేషకార్యసంధానమును గావింపుడని సబహుమానముగ ప్రార్థించెను. వారును సంతసించుచు నాప్రతికను దీసికొని బ్రహ్మను చేరి బ్రహ్మకాలేఖను సమర్పించిరి. అతడాలేఖనందికొని చదువుచుండ నచటిదేవత లెల్లరువిని సంతసించుచు, పూలవానను గురిపించిరి. వారి సంతోషమునకు మేరలేదు. దేవతలన్నిదిశలనుండియు మంగళవాద్యముల మ్రోయించుచుండిరి. వివాహము వెంటనే కుదిరినందున, దేవతలందఱు తమతమ వాహనముల నలంకరింపుచు, తామలంకరించుకొనుచు, వివాహమునకు బయలుదేరుచుండిరి. వారట్లుబయలుదేరుచుండ వారలకు శుభశకునము లగుచుండెను. అప్సరాంగనలు, నృత్యగానముల జేయుచుండిరి. ఇటశివునిగూడ నలంకరించుచుండిరి. జటాజూటమును పన్నగములచే బిగియించి నాగాభరణకలితముగ నొనర్చిరి. కర్ణములకు కుండలములను, హస్తములకు నాగకంకణములను సమర్చిరి. శరీరమందంతటను భస్మము నలది, వ్యాఘ్రచర్మాంబరమును గట్టించిరి. శివుడు జటాజూటమునందు గంగతోను, శిరోభూషణమగు చంద్రునితోడను, నాగయజ్ఞోపవీతములతోడను, గరళకంఠముతోడను, ఉరమున కపాలమాలలతోడను, నేత్రత్రయముతోడ నలంకృతుడై, సమస్తమంగళములకును మూలమగు

నీపరమశివుడు, బాహ్యమునకుమాత్ర మశుభమగువేషమును ధరించెను. మఱియు నొకహస్తమందు త్రిశూలమును, మఱియొకహస్తమునందు డమరుకమును ధరించి, వృషభారూఢుడై కదలుచున్న శివుని మ్రోల నసేకమంగళ వాద్యముల మ్రోయించుచుండిరి. శివుని ప్రయాణమును జూచుచున్న దేవాంగనలు, చిరునవ్వునవ్వుచు, తమలో తామిట్లు తలపోయుచుండిరి. ప్రపంచమునం దెచ్చటనైన నిట్టిపెండ్లికొడుకు గలడా యనియు, ఇట్టియోగ్యతయింకెవరికైన గలదా యనియు, గుసగుస లాడుకొనుచుండిరి. కమలాసనుడు, విష్ణువు, ఇంద్రుడు మున్నగు దేవతలందఱు, నహామహామికలతో ప్రయాణముల సాగింపుచు, నీశ్వరునితో సమానుడగువరు డెందైనగలడా యనిపలుకుచుండిరి. అంతలో విష్ణు విట్లనెను. ఓలోకపాలులారా! ఏగణముల కాగణములు వేఱు వేఱుగ బ్రయాణమును సాగించిన బాగుండును. శివునితోసరియగువరు డింకొకడులేడను విషయమును మనకు తెలిసినట్లితరులకు దెలియునోలేదోయని సందియమగుచున్నది. మహాత్ముల కాడంబరముతో బనిలేదుకదా, ఆమాటలకు దేవతలు చిరునవ్వు నవ్వుచుండిరి. శివుడును మోమున చిరునవ్వలంకరింప, భృంగి మున్నగుగణముల రావించెను. వారియాకారము లిట్టివి. వారిలో కొందఱకు ముఖములులేవు. కొందఱు బహుముఖులు. మఱికొందఱు కరచరణాదులు లేకను, వేఱొక కొందఱు బహుకరచరణాదులు కలిగియు నుండిరి. కొందఱు బహునేత్రులు, మఱికొందఱు నేత్రవిహీనులు, కొందఱు బలహీనులు, కొందఱు మోటువారు. కొందఱు అందముకలవారు, కొంద రనాకారులు, కొందఱు మలినులు, కొందఱు తేజోవంతులు, వారు అందరు భయంకరములగు నాభరణముల ధరించి, రుధిరపూరితములగుకపాలములనుహస్తముల ధరించిరి. కొందఱు అసురసృగాలముఖములుకలిగి యనేకవేషముల ధరించి, గార్దభస్వరముతో నసేకగీతికల గానముచేయుచుండిరి. ప్రేతపిశాచయోగినీగణములు, లెక్కకుమిక్కుటమై, శివునివెంట బయలుదేరి తరంగములవలె నుప్పొంగుచు నానందమున నాట్యమాడుచు, పాటలబాడుచు, పరస్పరము సంభాషించుకొనుచు, భయంకరరూపములతో నడచుచుండిరి. హిమవంతుడు పెండ్లివారు వచ్చువఱకు, విచిత్రములగుమండపముల నిర్మింపించి, నగరమునంతయు నలంకరించెను. ఆనగరశోభ వర్ణనాతీతము. ప్రపంచమునందలినదులన్నియు నొక్క-

సాగరమునకు సరిరావన్న శ్లేనగమును హిమవంతమునకు సరిగాకుండెను. నదులనుగూడ వివాహమున కాహ్వానించియుండెను. నదీనదములన్నియు మనోహరములైన స్త్రీపురుష వేషముల ధరించి వచ్చియుండిరి. గంధర్వాంగనలు మనోహరగీతికల బాడుచుండిరి. పెండ్లివారందఱును తమ కేర్పఱచినవిడుదులందు బసల జేయుచుండిరి. హిమవంతుని ఏర్పాటుల జూచి దేవతలు సంతసించుచుండిరి. విధాతయు నిట్టిసృష్టినిచేయ లేదని చెప్పుకొనుచుండిరి. అచటివనములు, పూదోటలు, సరోవరములు నందలివిహరించెడిపక్షులు చూపరుల కానందమును గొలుపుచున్నవి. అచట కవాటముల కన్నిటికి, మంచిముత్యములను, మాణిక్యములను, తోరణములుగగట్టి, శుభసూచకములుగ మామిడితోరణములగూడ గట్టిరి. జయపతాకములు ప్రతిఇంటను ఎగురుచున్నవి. అచటనివసించెడుస్త్రీల దివ్యకాంతుల జూచిమునిమనంబులును మోహింపజొచ్చెను. జగన్మాతయొక్క జన్మస్థలమగు నీనగమున కిట్టిశోభ కలుగుటలో నాశ్చర్యమేమియును లేదు. అక్కడ సర్వసిద్ధులు నిత్యనవీనములై వృద్ధినందుచుండెను. హిమవన్నగవాసులందఱు విష్ణువును జూచి, మహానందమునొందిరి. దేవతలు జూచిసంతసించిరి. శివగణముల జూచి భయమందుచుండిరి. ఎక్కిలిధీరు లటనుండి చూచుచుండిరి. కాని కొందఱు బాలు రాశివగణముల జూచి బెదరుచూపులతో తమ తమ ఇండ్లకు పరుగులిడుచుబోయి, భయకంపితహృదయులై, తమ తల్లితండ్రులతో నిట్లనిచెప్పసాగిరి. అమ్మా! ఏమిచెప్పుదుము. మాకునోటమాటలు రాకున్నవి. మాగుండెలు కొట్టుకొనుచున్నవి. ఈపెళ్ళివారు చూచుటకు యమకింకరులవలె నున్నారు. ఇక పెండ్లికుమారుడన్ననో, సర్పహారములు, ప్రేలమాలలు, వ్యాఘ్రచర్మములుధరించి, వృషభారూఢుడై, శరీరమందంతటనుబూడిద పులుముకొని, జడలుధరించియుండుటయెగాక, తనయనుచరులందఱు వికృతాకారులై, వికృతవేషముల ధరించి, భూతప్రేతపిశాచయోగినీగణంబుల గూడిసరససల్లాపము లాడుచుండ మేముజూచి గడగడ వడకుచు, ప్రాణముల దక్కించుకొని వచ్చితిమి. పెండ్లివారి కందచందములు లేవుసరిగదా, చూడ నశక్యములగు భయంకరాకారములు కలవు. మనపెండ్లివారిశోభ చెప్పశక్యము గాకున్నదనిబాలకు లందఱుమగపెండ్లివారినందఱి చతురముగ నపహాసించుచుండిరి. పుణ్యాత్మలగు పెద్దలు శివపార్వతులవివాహ మెప్పుడుజరుగునా యని

కనిపెట్టుకుని యుండిరి. అంతవరునకు మంగళహారతులనిచ్చుటకు మేన బంగారు పళ్ళెరమున కర్పూరమునిడికొనిఁ చెలికత్తెలతో గలిసిమంగళగీతములబాడుకొ నుచు వచ్చియుండెను. ఆవచ్చినస్త్రీ లెల్లరు శివునిజూచి నివ్వెరబోవుచు, బెద రుచు నామంగళహారతుల నటవిడిచి పారిపోవుచుండిరి. మేనయు లోనికివచ్చి దుఃఖించుచు, పార్వతినిపిలిచి, ఒడియందుంచుకొని, కన్నులనీరు గార్చుచు నిట్లనెను. ఓతల్లీ! విధాతనీకీజడుని పతిగ నిర్మించినపుడు, నీకీసౌందర్యము నేల నిచ్చెను? ఇట్టివిపరీతదాంపత్య మెంద్దైనకలదా? కల్పవృక్షమునుకోరిన తుమ్మ చెట్టు లభించినది. ఈదుఃఖమును నేసహింపజాలను. తల్లీనేనిపుడు నీతోగూడ, పర్వతాగ్రమునుండి క్రిందపడిగాని, అగ్నిజ్వాలల కాహుతియైకాని, సముద్ర మున బడికాని, మరణించెద. ఈగృహమంతయు నశించినను, నాకుయశోహాని కలిగినను, నాకంతమునబ్రాణ మున్నంతవఱకీవివాహమునుమాత్రము జరుగ నీయ నని విలపించుచున్న మేనను జూచి అచటి స్త్రీలందఱు వ్యాకులచిత్తలై దుఃఖింప మొదలిడిరి. ఆమె బిడ్డను గురించి మిక్కిలి బాధపడుచున్నది. నారదు డిటకేలరావలయును? వచ్చినను బిడ్డచే తపమేల చేయింపవలయును? అట్టి తప మున కిదియా ఫలము? ఆవరుని యేతల్లి కన్నదో, కాని యమాయకుడు. మోహరహితుడు. ఉదాసీనుడు. నిర్ధనుడు. అనికేతనుడు. బంధువిహీనుడు. సర్వసముడు. భిక్షుకుడు. లజ్జావిహీనుడు. సౌందర్యరాశియగు నీపార్వతికి నీవరు నికిని, బ్రహ్మ ఎట్లు సంఘటన మొనరించెనో అని అందఱు చెప్పుకొనుచుండ నామాటల విని, తల్లి పొందుచుండిన దుఃఖమును జూచియు, జ్ఞానవతి యగు నచలరాజకన్యక మృదుమధురవాక్కులతో నిట్లనియె. తల్లీ! నీకెందుల కీవిచా రము? విధి నెవరును దాటజాలరు. వారివారి పూర్వకర్మల ననుసరించి ఫలముల ననుభవింతురు. విధిని నీవు తప్పింపగలవా? ఇకనై ననునీమోహవిభ్రాంతిని విడు వుము. శివుని సామాన్యునిగ భావింపకుము. ఆమాటల విని మనసు నెక్కొట్టు లనో సరిపెట్టుకొనుచు, పొంగిపొరలివచ్చెడి దుఃఖము నాపుకొనుచు, విధాతను నిందించుచుండ నీసమాచారము నంతను హిమవంతుడు విని నారదున కెరిగింప నాముని మేనను సమీపించి యిట్లనెను. మేనా! నీవేలదుఃఖింతువు. నేనునిజము చెప్పుచుంటిని. నీపుత్రియగు పార్వతి జగన్మాత. ఆద్యంతరహిత. ఆదిశక్తి. శివున కర్ధాంగి. వీరిరువురివలననే జగదుత్పత్తి స్థితిసంహారములు జరుగుచుండును. మీ

కోర్కెలదీర్చుట కీమె మాయింట వెలసినది. ఈమె ప్రథమమున దక్షపుత్రికయై జన్మించి మిక్కిలిరూపవంతురాలై సతియనుపేరుతో నీశివుని వివాహమాడెను. ఒకనాడు శివునితో విహరించుచు, రఘుకులశిరోమణియగు రామచంద్రుని దర్శించి యతనిని పరిశీలింపదలచి సీతారూపమును ధరించి వెడలెను. శివుడు దీనినంతను దెలిసికొని, మాతృసమానయగు సీతారూపము నీసతి ధరియించెనుఅని శివుడామెను పరిత్యజించెను. పతివియోగమును సహింపనేరక, దుఃఖోపశమనమునకై పితృగృహమున కేగి, యజ్ఞమునందు దక్షునిచే నవమానితయై జన్మాంతరము నందును శివునె బతిగ గోరుచు, యోగాగ్నిదగ్ధయై మృతినొందెను. ఆసతియె ఈపార్వతి. ఈమె శివునిగాక మఱియొకనిని వివాహమాడు నెట్లు? కావునని యీమెశివునికై యింతఘోరతపము నాచరించినది. సతి యందలిప్రేమచే నాతడీవివాహమున కంగీకరించెను. అతడింకొకతెను ఎన్నడును వివాహముజేసికొనడు. ఇదంతయు పరమరహస్యమన మేనాహిమవంతు లాశ్చర్యచకితహృదయులై, ఆనందపరవశమున పార్వతిపాదపద్మములకు నమస్కరింపుచు, శివనిందకు పశ్చాత్తాపము నందుచు, వివాహప్రయత్నముల గావింపుచుండిరి. పట్టణమంతయు మంగళవాద్యములతోడను, నాట్యవినోదములచేతను శోభిల్లుచుండెను. పసుపుకుంకుమ మున్నగు మంగళద్రవ్యముల పసిడిపళ్ళెరములందమర్చి, కళ్యాణమండపమునొద్ద ముత్తయిదువులు మంగళహారతులతో నిలబడి మండపము నలంకరింపుచుండిరి. పాకశాస్త్రము ననుసరించి పలువిధములగుపాకములు తయారుచేయబడుచున్నవి. పిండివంటకముల సంఖ్య లెక్కకు మిక్కుటముగ నున్నవి. అంతకంతకు పెండ్లివారిశోభ హెచ్చుచుండెను. అది జగన్మాతకు జన్మస్థలము. కాన విష్ణువుమున్నగువారు పెండ్లికి వచ్చిరి. శివుడు పెండ్లికొమఱుడు. ఈవివాహము నెట్లువర్ణింపగలము? వరునితో గూడి దేవతలందఱు విందుల పాల్గొనుచు మధురపదార్థముల నారగించుచు సరసోక్తుల నాడుచుండ, నాడపెండ్లివారు హాస్యపుపాటల బాడుచుండిరి. హాస్యగీతికలవినుచు మందహాసము జేయుచు, దేవతలు మెలమెల్లన భుజింపుచుండిరి. ఆవైభవము వర్ణనాతీతము. ఇట్లు దేవతలు భుజించి, హస్తప్రక్షాళనమునొనర్చి, కర్పూరతాంబూలచర్వణ మాచరించి, వారివారి విడుదలకేగిరి. తరువాత సప్తమహర్షులువచ్చి, లగ్నము సమీపించుచున్నది. దేవతలకు

కబురంపమని హిమాద్రితోజెప్ప నాతీరున హిమవంతు డాదరాభిమాన ములతో, వారికి కబురంపి, వారివారికి తగునాసనముల సమర్పించి, వేదసమ్మతముగ నిర్మింపబడిన కళ్యాణమండపము నడుమ నవరత్నఖచితమైన స్వర్ణసింహాసనమును స్థాపించెను. దానియందు బ్రహ్మ యనుమతినొంది, బ్రాహ్మణులకు శిరము వంచి, తన దైవమగు శ్రీరామచంద్రుని స్మరించుకొని శివుడు కూరుచుండెను. అంత మునులు పార్వతిని తోడితెమ్మన సఖులామెను సింగారించి వేదికవద్దకు తీసికొనివచ్చిరి. ఆమె జగన్మోహనాకారమును జూచి, దేవత లందఱును ముగ్ధులైరి. ఆమె చక్కదనమును వర్ణించుకవు లీజగమందు లేరు. చూడవచ్చినవా రందరు పార్వతిని జూచి ముగ్ధులై వీరె జగన్మాతాపితరు లని దెలిసికొని నమస్కరింపుచుండిరి. శేష శారదలు సయిత మాజగన్మాతను వర్ణింపలేకుండిరి. మేన వచ్చి పార్వతిని శివపర్యంక మందు గూరుచుండబెట్ట నాభవాని, సిగ్గునందుచు, పరమేశుని చరణ కమలముల జూడదలచినంతనె, కమలములందు వ్రాలిన తుమ్మెదలవలె నామె చూపులు శివపాదపద్మములందు వ్రాలుచుండెను. ఇతరులు కనుగొనియెద రను శంకచే శివుని జూచియు చూడనట్లు జూచుచుండెను. పిమ్మట మునుల యాజ్ఞానుసారముగ శివపార్వతు లిరువురు గణపతిని పూజించిరి. ఈత డాదిగణపతి; ఇట్లు బ్రహ్మగారి యాధిపత్యమున వేదో క్తవిధమున మునులందఱును శివకళ్యాణమును చేయించిరి. హిమవంతుడు కుశల గ్రహించి, పార్వతి చేయి బట్టుకొని ఉదకపూర్వకముగ శివుని చేతిలో సమర్పించెను, ఈపాణిగ్రహణమహోత్సవమును జూచి దేవత లెంతేని సంతసించిరి. మునులు వేదపాఠము నొనరించుచుండిరి. గణము లన్నియు, గిరిజారమణునకు జై, పార్వతీపతికి జై, యని జయనినాదముల జేయుచుండిరి. భేరీమృదంగాదిధ్వనులచే ప్రపంచమంతయు మారు మ్రోగుచుండెను. దేవతలాకసమునుండి కుసుమవర్షమును గురిపింపుచుండిరి. ఆసమయమున చతుర్దశభువనములు నానందపరవశమై పోయినవి. మేనాహిమవంతులు, పార్వతికి నానావిధములగు చీరెలను, కానుకలను. దాసదాసీజనంబులను, రథగజతురంగాదులను, మణిముక్తాకలాపంబులను, సువర్ణపేటికలను, పాత్రలను, వారి మనస్సంతోషమున కిచ్చిరి. కాని కైలాసనాథుడును మేరు ధన్వియునగు శివున కేమికొఱత? హిమవంతుడు చేతుల జోడించి శంకరునితో

నిట్లనియె. ఓచంద్రమౌళీ, నీవాప్తకామకుడవు. నీకు లేనిదేదియును లేదు. మామనస్తుష్టికే యీకానుకల నిచ్చితిమి. నీకిచ్చుటకు మేమెంతటివారము. మాపై దయయుంచమని చరణకమలముల నంటబోవ కృపాసింధువగు శంకరుడు మామగారిని సంతోషపఱచెను. మేనయు శివునియందలి భక్తిప్రేమలచే నాతని పాదముల కెఱిగి ఇట్లనియె. ఓకృపాసింధూ! ఈపార్వతిని యల్లారు ముద్దుగ, ప్రాణములకన్న నెక్కుడుగ బెంచియుంటిమి. కాన నీమెను తమ సేవ కురాలినిగ ననుగ్రహింప ప్రార్థించుచుంటిని. మాసర్వాపరాధముల మన్నించి మాకీవరమును దయచేయ ప్రార్థింపుచుంటిని. అని గద్గదకంఠియైన యత్తగారిని శివుడూరడించి, ప్రయాణమగుచుండెను. తల్లియగు మేన పార్వతిని విడువజాలక, చేరబిలిచి యొడియం దిముకొని, తల్లీ! నీవెల్లపుడును శంకరుని పాదపద్మముల సేవింపుము. స్త్రీలకు పతిసేవను మించిన ధర్మము లేదు. పతిని మించిన దైవమును లేదు, అని బుద్ధులుగరపుచు, కనుల నీరునింపుచు, బిడ్డ ముంగురుల సవరింపుచు, తన ముద్దులపట్టి గృహమునుండి వెడలుచున్నదని విచారింపుచు, నిట్లనుకొనియెను. విధాత స్త్రీల నెందులకు సృజియించెనోకాని, వారెల్లపుడు పరాధీనలై, యుండవలెను. వారికి సుఖము శూన్యమనియెంచుచు నిది దుఃఖింప సమయము కాదని ధైర్యమును వహించుచు, మాటిమాటికిని గిరిజను కౌగలించుచు, ఆమె జగన్మాతయని యామె పాదముల కండ్లకద్దుకొనుచు, దుఃఖము నాపుకొనజాలక నేలమీద కొరగెను. ఆమె ప్రేమాతిశయము వర్ణనాతీతము. పార్వతి దీని నంతను జూచి తల్లి నోదార్చి, సఖులకడ శలవునంది, వారి యాశీర్వాదముల బొంది, ప్రయాణమును సాగింపుచు, తల్లిదండ్రులను, సఖురాండ్రను మాటిమాటికి వెనుదిరిగి జూచుచు, శివుని సమీపించి, యోగులను గణములను సంతసింపజేయుచు, కైలాసమున కేగుచుండ నంత దేవతలు కుసుమవృష్టిని గురిపించి, దుందుభుల ప్రమోయించిరి. పెండ్లివారు నిజనివాసముల కరుగుచుండ, శైలరాజు వారందఱను, తగురీతిని సత్కరించి పంపుచుండెను. అల్లుని సాగనంపుటకు హిమవంతుడు, సపరివారుడైవచ్చి, శివుని యాజ్ఞానుసారము తనయింటికి మరలెను. శివపార్వతు లిద్దరు నానందాంబుధి నోలలాడుచు కైలాసమును చేరిరి. అప్పటి వారి యానందము వర్ణనాతీతము. గౌరీశంకరు లనేకభోగవైభవములతోడను, ప్రమథగణములతోడను, నిత్యనవీనములైన కైలాసమునందలి

పుష్పవాటికలందు విహరింపుచు కాలమును గడుపుచుండ, కొంతకాలమునకు కార్తికేయుడు జన్మించి, యుద్ధమున తారకుని బరిమార్చి, సజ్జనులకు దేవతలకును బట్టరాని సంతోషమును కలిగించెను. స్కందభగవానుని చరిత్రము వేద పురాణసమ్మతము, సర్వజనవిదితము. కాన శివతనయుని చరిత్రము సంక్షిప్తముగ దాటించితిని. శివపార్వతుల వివాహగాథల నెవ్వరైనను చదివిన వినిన, వ్రాసినను సకలసుఖముల ననుభవించి, తుదకు శివసాన్నిధ్యమును బడసెదరు. అని చెప్ప రసవత్తరమగు శివకల్యాణమును విని భరద్వాజు డానందాంబుధి నోలలాడి, ఆనందాశ్రువులచే పులకితగాత్రుడై యుండెను. అతని భక్తివిశ్వాసముల జూచి ప్రసన్నుడై, యాజ్ఞవల్క్య డిట్లనెను. ఓభరద్వాజా ! నీవు ధన్యుడవు. శివపార్వతుల, ప్రాణతుల్యముగ ప్రేమించుచుంటివి. శివునియందుప్రేమ లేనివారు స్వప్నమందైనను రాముని కనుగొనజాలరు. నిష్కల్మషహృదయముచే విశ్వనాథుని సేవించుటయె, రామభక్తుల లక్షణము. రఘుపతిభక్తులలో శివుడగ్రగణ్యుడని యిందువలన దెలియుచున్నది. సతీదేవి సీతారూపమున రాము నవమానించెనని, నిర్దోషయగు సతిని, శంకరుడు పరిత్యజించెను. అట్లు పరిత్యజించియు, కఠినవ్రతముల సలిపిన ధీరుం డెందైనం గలడా ! శివుడు ప్రేమించినట్లు రాము నెవరు ప్రేమింపగలరు. శివుని భజించినగాని రామభక్తి యలవడదు. కాన ముందుగ శివకథను జెప్పియుంటిని. ఈకథను వినుటచే నిజమగు భక్తిప్రేమలు కలిగి నిర్వికారుడై, భేదభావములేక, నిజసేకుడవై వర్తిల్లెదవు. నీగుణశీలముల దెలిసికొని పరమానందము నందితిని. ఇక రామలీలల వర్ణించెద. ఓమునివర్యా ! రామచరిత మపారము. శతకోటి శేషులకును వర్ణింప నలవికానిది. అయినను నేనిదివఱలో వినినటుల నానేర్చినంతవఱకు, శ్రీరామచంద్రుని స్మరించుకొని చెప్పుచుంటిని వినుము.

సూత్రధారుడు కొయ్యబొమ్మచే ననేకరీతుల నాట్యమాడించునటుల పరమాత్మ యీపాంచభౌతికమగు శరీరమందుండి, సూత్రధారియై, బహువిధములగు కవితాసృష్టుల కలిగించుచున్నాడు. శారదాదేవియు రామభక్తిలేని యెడ నుండజాలక, కొయ్యబొమ్మవలె సంచరించును. రామునిస్మరింపక, ఏవాక్కుల బలుకుటకు నశక్తయై యుండును. సరస్వతియే యిట్లుండ మనబోటుల సంగతి వేఱ జెప్పనక్కరలేదు. భగవల్లీలల వ్రాయుటకు, జెప్పుటకును, భగవ

దనుగ్రహము కావలయును. కైలాసమునందు శివపార్వతులు సుఖముగ కాలము గడుపుచుండిరి. ఆపర్వతమునందు, శివభక్తులు, యోగులు, కిన్నరులు, మునులు, నాపురాణదంపతుల సేవింపుచు నివసించుచుండిరి. శివకేశవుల సేవింపనివారికి స్వప్నమందైనను సుఖము శూన్యము. ఆకైలాసమున సర్వకాలములందును, శుభకరమగునీడ నిచ్చు వటవృక్షము మొండుకలదు. అది ఎప్పటికప్పుడు నవీనపత్రశాఖలతో నొప్పుచుండును. ఆవృక్షచాయయం దెప్పుడును శీతలమందసుగంధవాయువులు వీచుచు మంచివిశ్రాంతిని కలిగించుచుండును. పరమేశుడు తఱచుగ నావృక్షచాయయందె విశ్రమించుచుండును. ఒకనాడు శివుడు విశ్రాంతికొఱకట, వ్యాఘ్రాసనాసీనుడై యుండెను. శివుడట, కుందేందు సమానచాయకలవాడై, ఆజానులంబిబాహువులుకలవాడై, వ్యాఘ్రచర్మాంబరధరుడై, నూతనారుణకమల సదృశచరణనఖకాంతుల శోభిల్లుచు, భక్తహృదయాంధకారముల దొలగించుచు, సర్వాభరణభూషితుడై, భస్మమలదుకొని జటాజూటమందు గంగతో బ్రకాశింపుచు, కమలపత్రసదృశనేత్రుడై, నీలకంఠుడై, లావణ్యనిధియై, శరత్కాలచంద్రుని ధిక్కరించెడి శరీరకాంతికలవాడై, మస్తకమందు బాలచంద్రుని ధరించి, శాంతరసము లుట్టిపడునట్లు శోభిల్లుచుండెను. ఇట్లు సావధానుడైన శివుని జూచిపార్వతి ఆతనిసమీపమునకు వచ్చెను. వచ్చిన పార్వతిని జూచి, తన వామభాగమున జోటిచ్చి, కూర్చుండుమన నామెయు కూరుచుండెను. భవాని యట్లు కూర్చుండునపుడు శివునకు పార్వతీ పూర్వజన్మవృత్తాంతము జ్ఞప్తికి వచ్చెను. తనయందు పతికిగల ప్రేమాతిశయమును జూచి సంతసించుచు, లోకహితము కొఱకా గిరికన్యక శంకరునితో నిట్లనియె. స్వామీ! మీ మహిమ త్రిభువనవిదితము. మిమ్ములచరాచరములు, నాగ మనుష్య దేవాదులును సేవించుచుందురు. తమరు సర్వజ్ఞులు, సర్వసమర్థులు, సంపూర్ణకళానిధులును. యోగజ్ఞానవైరాగ్యనిధులు. తమ నామము భక్తకల్పకము. కాన నాయందు దయనుంచి భగవంతుడైన రాముని చరిత్రమును వర్ణించి చెప్పుచు నాయజ్ఞానమును దొలగింపుడు. కల్పవృక్షము నాశ్రయించినవానికి దారిద్ర్యదుఃఖములు నశించునట్లు, మిమ్మాశ్రయించినవానికి, మోహావిభ్రాంతులు నశించును. కాన నాభ్రమనివారణమునకును, లోకకళ్యాణముకొఱకును, రామచరితను జెప్పవేడుకొనుచున్నాను. పరమార్థ

వేత్తలగు మునులు, రాముని యనాదిబ్రహ్మమని జెప్పుచున్నారు. శేషుడు, సరస్వతి, వేదములు, పురాణములు నేరఘుపతిని కీర్తించుచున్నవో, మీరు సర్వదా ఎవనినామమును జపించుచుండిరో, అట్టి జన్మాదిభావవికారరహితుడు, గుణరహితుడు, గణనాతీతుడునగు పరబ్రహ్మమూర్తి, దశరథకుమారుడగు రామచంద్రుడేనా? అట్లగునేని భార్యావియోగముచే దుఃఖితుడగునెట్లు? ఆతనిభార్య ఒకనీచునిచే బంధింపబడునా? నాకిదంతయు నగాధముగనున్నది. ఏమియు తోచుటలేదు. నిశ్చేష్టుడును, సర్వవ్యాపకుడునగు పరమాత్మ కేల విచారము కలిగెను? రామచంద్రునికథను నాకుదెలియజెప్పి, నన్ననుగ్రహింప వేడుచుంటిని. నాయజ్ఞానమును మన్నింపుడు. లోగడ నేను రామచంద్రుని ప్రభావమును జూచి, వ్యాకులచిత్తనై, భయమంది తమకు జెప్పియుండలేక పోతిని. మీకడమర్మముంచి చెప్పకదాచినఫల మనుభవించితి. అప్పటి యజ్ఞానమిప్పుడు కనిపించుటలేదు. మీపాదములకు వందనము చేయుచుంటిని. వేదసమ్మతమగు నీకథను స్త్రీలకు వినరాదందురేని, నేను త్రిశుద్ధిగ మీ దాసురాలను. మతియు నజ్ఞానులకు నార్తులకును జెప్పవచ్చునని యున్నదికదా! నాప్రార్థనను దలచి ఏవగించుకొనక, నిర్గుణపరబ్రహ్మము సగుణమై యవతరించుటకు కారణమేమి? చెప్పగోరుచుంటిని. ముందుగ నాకు రాముని బాల్యచరిత్రను జెప్పుడు. అతడెందులకు రాజ్యమును త్యజించెను? రావణవధయు, రాజ్యపాలనావిశేషములను, అతడు సల్పిన యాశ్చర్యకరవృత్తాంతములను, తత్త్వజ్ఞులయిన మునులు ఎట్లుతత్త్వజ్ఞానమగ్నులయిరి? భక్తిజ్ఞానవిజ్ఞానము లెట్లులభించును? రామచంద్రుని గూఢతరగాథలను, సవిస్తరముగ జెప్పవలయును. నేనడిగినవన్నియు మర్మములేకుండ జెప్పి నన్ను తరింపజేయుడు. మీరు త్రిలోకగురువులని వేదములు చెప్పుచున్నవి. మిమ్ములసేవించినట్టి మూఢులైనను జ్ఞానవంతులగుచున్నారు. అని పలికెడి నిష్కపటమనోహరవాక్కులవిని, శివుడు ప్రసన్నుడై, రామచరితమును తలచినంతటనె, పులకితగాత్రుడై, యానందాశ్రువులు దొడలవ్యాపింప రఘుపతిని ధ్యానింపుచు, రెండుగడియలకాలముండి, శ్రీరామచరిత్రను జెప్పనారంభించుటకు ముందిట్లు చెప్పదొడంగెను. రజ్జుసర్పభ్రాంతి, సత్యమగు రజ్జువును దెలిసికొనినపిమ్మట ఎట్లుండజాలదో, అట్లే భగవంతుని సత్యస్వరూపమును దెలిసికొనినపిమ్మట మోహవిభ్రాంతులు నశించిపోవును. స్వప్నము జాగ్రదవస్థ

యం దెట్లునశించునో, అట్లే భగవత్తత్వము దెలిసినవానికి, నామరూపాత్మక మగు నీమిథ్యాప్రపంచము నశించును. బాలరూపుడగు రామునికి నమస్కారము. వాని నామమును జపించుటచే, సర్వసిద్ధు లతిసులభములు. దశరథప్రాంగణమునం దాడుకొనెడి బాలరాముడు, నాయందు ప్రసన్నుడగుగాత యని పలుకుచు, రామునకు వందన మాచరించి, త్రిపురారి ప్రసన్నుడగుచు, నమృత తుల్యములగు వాక్కులతో నిట్లనియె. ఓగిరిరాజపుత్రీ, నీవు ధన్యవు. నీచేలోక ములును ధన్యములు. నీవడిగిన ప్రశ్నము గంగవలె పవిత్రము జేయుచు, భగవంతుడైన రామునందు దృఢభక్తిని గలిగించును. శ్రీరామకృపాపాత్రునకు, సమస్తదుఃఖములు దూరమై, శోకమోహాములు నశించును. ఈకథవలన నీకును, నాకును మంచిశ్రేయస్సు, లభించును. భగవత్కథల వినని చెవులు, వల్మీకసదృశములు. రామచంద్రునిగాని, ఆతని ప్రతిమనుగాని, దర్శింపజాలని కన్నులు, నెమలికన్నులవంటివి. భగవంతునికి వంగని శిరములు, చేదుపుచ్చకాయలకన్నను మిన్నలు. భగవద్గురుభక్తులు కానివారు జీవచ్ఛవములే యనదగు. భగవద్గుణవర్ణము జేయని జిహ్వాలు, భేకజిహ్వాలవంటివి. భక్తిలేనివారి వక్షస్థలము, బండరాతిని పోలియుండును. రామచరిత దేవతలకు హితముగను, రాక్షసుల కహితముగను ఉండును. ఈరామచరిత, సత్పురుషులకు, దేవలోకముగను, కామధేనువుగ నుండును. మఱియు నీచరితము దేవలోకమున కామధేనువువలె, సత్పురుషసమాజమున విరాజిల్లుచున్నది. జ్ఞానసంపన్నులలో రామకథను వినినివారు లేరు. ఈకథ సంశయము లనెడి పక్షుల పారద్రోలుటకు, కరతాళధ్వనివంటిది. పాపవృక్షమును ఛేదించుట కిదియె పరశువు. పార్వతీ! నీవడిగిన ప్రశ్న, సర్వసమ్మతము, సంతోషకరమును. కాని నీప్రశ్నము నందొకలోపమున్నది. అది నాకు దుస్సహముగ నున్నది. వేదశిఖల జెప్పబడి, మునులచే ధ్యానింపబడుచున్నట్టియు, నాకు నిత్యారాధ్యుడు నగు రాముడితడా, లేక మఱియొకడా? యను నీప్రశ్నము నన్ను బాధించుచున్నది. పాషండులు, మోహపిశాచగ్రస్తులు, హరిభక్తిదూరులు, అజ్ఞానాంధులు, హరిభక్తి శూన్యులు, శాస్త్రాభ్యాసములేనియవిద్వాంసులు నగువారి కిట్టిసంశయములు గలుగుచుండును. వారి మనోముకురము, విషయమాలిన్య కలుషితము. కాన సంసారపంకమగ్నులై, కపటస్వభావులై, కుటిలవర్తనులై, సత్పురుషుల దర్శిం

పక, వేదవిరుద్ధవాదులై, లాభాలాభముల గుర్తెరుంగరు. వారు మలినమనస్కులగుటచే, వారికి జ్ఞానముదయింపదు. కాన వారు భగవంతుని జూడజాలరు. వారీ రాముని సగుణ నిర్గుణరూపముల దెలిసికొనజాలక, వ్యర్థాలాపముల జేయుచు, సంసారములో నీదులాడుచు, విషయలోలుప్తులై సంచరింతురు. అట్టివారికి భగవత్కథల జెప్పుట ఎట్లు? ఉన్మత్తభూతావిష్ట, మద్యపులవంటి వారి మాటలు గణింపదగినవి కావు. ఓపార్వతీ? నామాటల విని, సర్వసంశయములు వీడి, రాముని స్మరింపుము. మోహాంధకారమునకు భానుకిరణతుల్యము లగు నామాటల శ్రద్ధాసక్తులతో వినుము. సుగుణనిర్గుణములకు వాస్తవికభేదము లేదని యుపనిషత్తులు ఘోషింపుచున్నవి. నిర్గుణుడగు భగవంతుడు భక్తపరవశుడై, సగుణరూపమును ధరించుచుండును. అట్లు కానినాడానిర్గుణరూప మేరికిని గోచరము కాజాలదు. నిర్గుణుడు సగుణు డెట్లగుననియు శంకింపతగదు. వడగలి జలముగను, జలము వడగలిగను ఎట్లు మారుచుండునో, అట్లే నిర్గుణ బ్రహ్మము, సగుణ రామునిగ మారెను. అతనికి మోహాంధకార మంటదు. సూర్యునొద్ద చీకటులు చేరలేనట్లు, రామభాస్కరునియెద్ద మోహాంధకారము జేరనేరదు. సూర్యునకు వాస్తవికములగు నుదయాస్తమయములు లేవు. కాని భాస్కరు డుదయాస్తమయములు కలవానివలె మన కగపడుచున్నాడు. అట్లే సగుణబ్రహ్మరూపుడగు రామునకు, జీవలక్షణములగు హర్షవిషాదములు, జ్ఞానాజ్ఞానములు, అహంకార మమకారములు, శోకమోహాములు, లేవు. కాని నటుని వలె నాయాసమయములందు వాని నన్నిటి నభినయించుచున్నాడు. ఈరామ బ్రహ్మము సర్వవ్యాపకము. పరమానందస్వరూపము. కాన నట్టి స్వప్రకాశ మగునట్టియు, పరాత్పరమగునట్టియు, రఘుకులమణి యగునట్టియు, దశరథనంద నుడైనట్టియు, నాకు ప్రభువగునట్టియు, సగుణబ్రహ్మరూపుడగు శ్రీరామచంద్రునకు శిరము వాంచి నమస్కరించుచున్నాను. తెలియనివారు మేఘావృతుడగు సూర్యుని లేడందురు, కాని స్వప్రకాశుడగు సూర్యునకు మేఘము లడ్డము వచ్చెనని తలంపరు. అట్లే మోహ యవనికావృతులు పరమాత్మను గ్రహింపజాలక, భగవంతుడు లేడను నాస్తికవాదములను నుడువుచుందురు. కాని భగవంతున కంతమాత్రముచే లోప మేమియు లేదు. చంద్రు డొక్కడైనను, వ్రేళ్ళ మధ్యనుండి జూచునపుడు ఇద్దఱు చంద్రు లగపడెదరు. ఇట్లే రామునందు

మోహము మున్నగునవి యజ్ఞాని దృష్టికి గోచరించును. ఆకసమునందు, ధూళి మున్నగునవి సూర్యబింబమును గప్పిపుచ్చి, భ్రమలకు కారణము లగుచున్నవి. జీవులు, ఇంద్రియములు, ఇంద్రియాధిష్ఠాన దేవతలు, మున్నగునవి, రామని యనుగ్రహము లేనిదే, తమతమవ్యాపారముల సాగించజాలవు. ఈజగత్ప్రకాశ మంతయు నారామునిప్రకాశమే. మాయ యతనికి వశవర్తిని. ముత్యపు చిప్పను, వెండియనియు, ఎండమావుల నీరనియు భ్రమజెందినట్లు, ప్రపంచమం తయు సత్యమని భ్రమించి, జీవులు దుఃఖించుచున్నారు. స్వప్నమందు వివిధ దుఃఖముల ననుభవించుచు, మేల్కాంచినతోడనే, అదంతయు మిథ్య యని గ్రహింతుము. అట్లే భగవద్జ్ఞానబద్ధు లీప్రపంచము నంతను మిథ్య యని దెలిసికొని, బాహ్యాభ్యంతరదుఃఖముల విడిచి సుఖించుచుందురు. ఎవనివలన నీప్రపంచమునకు సృష్టిస్థితిలయము లేర్పడుచున్నవో, అతడే శ్రీరాముడు. అతని కాద్యంతములు లేవు. అతనిని వేదములు కొంతవఱకు స్తుతించి యూర కున్నవి. అతనికి చక్షురాదిజ్ఞానేంద్రియములుకాని, వాగాదికర్మేంద్రియ ములుకానిలేవు. కాని తన యలౌకికమహిమచే సకలవ్యాపారములజేయుచుండును.

ఆతనిని, "ఆపాణిపాదోజవనోగృహీతా, పశ్యత్యచక్షుస్సశ్రుణోత్య కర్ణః। సవేత్తివేద్యం నచతస్యవేత్తాతమాహురగ్ర్యంపురుషం మహాంతమ్" అని వేదములు స్తుతింపుచున్నవి. మునులుగూడ నిట్లు స్తుతింపుచున్నారు. శ్లో॥ యస్యాంతర్నాదిమధ్యం నహి కరచరణం నామగోత్రం నసూత్రమ్। నోభూతి, శ్యామవర్ణః, నభవతి పురుషః నోనపుంసో, నచస్త్రీ, నాకారం, నో వికారం, నహిజని, మరణం, నాస్తిపుణ్యం, నపాపం, నోతత్వం, తత్త్వమేకం, సహజసమరసం, రామచంద్రం నమామి॥

ఓభవానీ, కాశియం దసువుల విడచినవారికి నేను రామమంత్రము నుప దేశించి మోక్షము నిచ్చుచుందును. రఘునాథుడు చేతనాచేతనాత్మక మగు నీనిఖిలప్రపంచమునకును భర్త. అంతర్యామియు నగుచున్నాడు. ఈరామ నామము నజ్ఞాని ప్రమాదవశమున నుచ్చరించినను బహుజన్మార్జితాఘములు నశించును. * "వనేచ రామోవనితాహరామః నద్యస్తరామో నభయం

---

* వనమున సంచరింతుము. స్త్రీల నపహరింతుము. నదులను దాటెదము. మాకెందునను భయములేదు. అని దొంగలనుకొనుచుండ నప్రయత్నముగ వారినోటినుండి వెలువడిన రామ నామమువలన వారందఱను తరించిరి.....

స్మరామః" అను దొంగలుసయితము తరించిరి. ఇక జ్ఞానవంతులమాట వేరుగ చెప్పనేల. ఈరామనామమును సాదరముగ జపించినవారు, సంసారసాగర మును గోష్పదమునువలె ననాయాసముగ దాటగలరు. గిరిజా! యీ రాముడె పరమాత్మ. ఇప్పటికైన నీయజ్ఞానము తొలగినదా! ఈచరితము మనస్సునందలి దారుణసంకల్పవికల్పముల బారద్రోలును. అమృతోపమము లగు నీశివునివాక్కులవిని, అంబిక యానందపరవశయై, ఇట్లనియె. ఓ పర మేశా! చంద్రికాతుల్యములగు నీవాక్కులచే, శరత్సూర్యకిరణసదృశమగు నా మోహతాపము, సమూలముగ నశించెను. నాసంశయము లన్నియు వీడిపోయినవి. ఇప్పటికి రామస్వరూపమును గొంతవఱకు దెలిసికొంటిని. నేను మీదాసిని. కాన నాప్రశ్నములకు, విసుగుజెందక యుత్తరముల జెప్ప వలయు. సచ్చిదానందరూపుడగు పరమాత్మ, సగుణరూపమును ధరించుటకు కారణమేమి? యసనామె భక్తిప్రేమములకు సంతసింపుచు శివుడిట్లనియె. ఓ పార్వతీ! నిర్మలమగు, రామచరితమానసమును పవిత్రగాథను, కాకభ శుండు డెట్లుగరుత్మంతునికి జెప్పెనో, అట్లే నేనునీకు జెప్పుచున్నాను. నీవు భక్తిశ్రద్ధలతో రామచరిత్రను వినుము. అతనికథలసంఖ్యాకములు, అయి నను నాబుద్ధికి గోచరించినంతవఱకు చెప్పుదును.

శ్లో॥ యదాయదాహిధర్మస్య గ్లానిర్భవతిభారత। అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥ అని భగవంతుడే నుడివి యున్నాడు. ఎప్పుడు ధర్మమునకు హానియు, నధర్మమునకు వృద్ధియు కలుగునో, ఎప్పుడసురబా ధలు కలుగునో, దేవబ్రాహ్మణులు తీవ్రవేదన నెప్పుడందెదరో, అప్పుడుతప్పక ధర్మము నుద్ధరించుటకును, భూభారమును దీర్చుటకును, భగవంతు డనేకరూ పములనంది, దుష్టశిక్షణమును, శిష్టరక్షణమును జేయుచుండును. మఱియు తననామము ప్రపంచప్రసిద్ధమై, యుండుటకును నవతరించుచుండును. శ్రీరామ జననమున కనేకములగుకారణములు కలవు. వానిలో భక్తజనోద్ధరణము ముఖ్యకారణము. వైకుంఠమున జయవిజయులను భగవద్ద్వారపాలకులుండిరి. వీరిరువురును సనకాదులచే శపింపబడి, రాక్షసులై జన్మించిరి. మొదటిజన్మ మున హిరణ్యాక్ష హిరణ్యకశిపులై జన్మించి, ఇంద్రునిమదమడచినట్లు, లోక విదితము. వీరు సంగ్రామవీరులై, విశ్వవిఖ్యాతులై యుండిరి. వీరిలో హిర

ణ్యాక్షుని వరాహావతారమెత్తి, భగవంతుడు సంహరించెను. హిరణ్యకశిపుని నరసింహావతారమెత్తి, సంహరించి, ప్రహ్లాదునిరక్షించి యుండెను. ప్రహ్లాదుని కీర్తి లోకవిదితమైయున్నది. మఱిల వీరిరువురును, రావణ కుంభకర్ణులై జన్మించి, యుద్ధములందు దేవతలందఱను జయించి జగద్విఖ్యాతులైరి. ఈబలవంతుల నిద్దఱజంపుటకే రాముడుదయించి వారిని సంహరించెను. మఱిల వారు శిశుపాల దంత్రవక్త్రులై జన్మింప, భగవంతుడు కృష్ణుడై వారల సంహరించెను. ఇందులకై భగవంతు డవతరించెను. భగవంతున కొకప్పుడు అదితికశ్యపులు తల్లిదండ్రులై యుండిరి. రామావతారమున కౌసల్యా దశరథులు, తల్లిదండ్రులు. ఒక్కొకసమయమునం దొక్కొకకల్పము నందొక్కొకతీరున భగవంతు డవతరించి, తనలీలల బ్రదర్శించుచుండును. ఒకప్పుడు దేవతలందఱు, జలంధరునివలన మిక్కిలి బాధల నందుచుండిరి. వారినుద్ధరింపదలచి భగవంతుడగు విష్ణువు జలంధరునితో యుద్ధముజేయ మొదలిడెను. నేనెంత యుద్ధమును జేసినను యీతడు మృతినందుటలేదు. దీనికీతని భార్యయగు బృంద యొక్కపాతివ్రత్యమె కారణము. అని తెలిసికొని విష్ణువు మాయోపాయముచే బృందపాతివ్రత్యమును భంగపఱచి, జలంధరునిజంపి, దేవతలదుఃఖముల బోగొట్టెను. జలంధరునిభార్య విష్ణుమాయనెఱిగి క్రోధమునంది, ఓవిష్ణూ! నాకు నాభర్తతో వియోగమును దెచ్చితివి కాననీవు నరజన్మమెత్తి, భార్యావియోగముచే దుఃఖింపుమని భగవంతుని శపియించెను. భగవంతుడు రాముడై జన్మించుట కిదియొక కారణము. ఆజలంధరుడే రావణుడై బుట్టెను. వానిని యుద్ధమందు రాముడు సంహరించెను. భగవదవతారకథ లనేకవిధములుగ నున్నవి. ఒకప్పుడు నారదుడు విష్ణువును శపియించెను, అనవిని యాశ్చర్యమందుచు పార్వతి యిట్లనెను. ఓ శంకరా! నారదుడు జ్ఞానసంపన్నుడు. మునివర్యుడు, హరిభక్తుడు, నని వినుచుందుము. అట్టివాడు భగవంతు నెందుల కిట్లు శపియించెను? భగవంతుడు నారదున కేమి యపకారమును జేసియుండెను? అద్దానినంతయు నాకానతిండన, శంకరుడు దరహసితవదనుడగుచు నిట్లనియె. జ్ఞానియైనను అజ్ఞానియైనను భగవదిచ్ఛానుసారము వర్తింపవలయునని, శివుడు పార్వతికి చెప్పినతీరున, యాజ్ఞవల్క్యుడు భరద్వాజునకు చెప్పనారంభించెను.

హిమాలయమందు పవిత్రమైనగుహా యొకటికలదు. అద్దాని సమీప మున గంగ ప్రవహించుచుండెను. అటనొక పవిత్రాశ్రమముకలదు. ఒకనాడు నారదుడటకువచ్చి చూచి, ఆనందపరవశుడై పర్వతశ్రేణుల పరికింపుచు, అందున్న సరోవరముల, వనముల, సుపవనముల జూచుచు, నంతలో భగవ ద్భక్తిచే పులకాంచితదేహుడై, నారాయణస్మరణ జేయుచు, యోగముచే శ్వాసల బంధించి, సమాధినిష్ఠుడై యుండెను. ఈనారదుని తీవ్రతపమును జూచి, ఇంద్రుడు భయకంపితుడై, మన్మథుని బ్రతిమాలి, నారదుని తపో భంగమును జేయమని చెప్పెను. కామికులు, లోభులు,నీచులు,కాకులవలెనందరకు భయపడుచుందురు. నీచమైన శునకము తన నోటనున్న మాంసఖండమును సింహము హరించునను భయముచే, సింహమును జూడగనె భయపడి పారిపో వును. కాని యాతుచ్ఛమాంసమువలన సింగమున కేమిపనియని తలంపదు. అట్లే ఇంద్రపదము నారదు డాసింపకపోయినను, ఇంద్రుడుమాత్రము భయ పడుచుండెను. మన్మథుడు నారదుని వద్దకేగి, తన ప్రభావముచే వసంతాదుల గల్పించి, మనోహరములగు ఫలవృక్షముల, పుష్పవాటికల నిర్మించి, వాని యందు, కోకిలారవములు, మధురఝుంకారములు, మందమారుతములు నను వుగ పొందుపఱచి, కామాగ్నిని ప్రజ్వలింపజేయుచు, కామకళానిపుణులైన రంభాదిదేవతా స్త్రీలచే నాట్యమాడింపుచుండెను. వారును మధుర రాగాలా పనలతో, లయదప్పక గీతికల బాడుచు, కామదేవునకు సహకరించుచుండిరి. వీరందఱిట్లు తపోభంగమునుజేయ బ్రయత్నించినను, నారదు డణుమాత్రమైనను చలించుటలేదు. దేవనారీమణులు నారదునికి భయపడుచుండిరి. మన్మథుడు నారదుని పాదపద్మములపై బడి, క్షమింపవేడుకొనెను. నారదునకు క్రోధమేమి యును లేదు. నీవును, నీయనుచరులును, నిటనుండి మఱలిపొండు. నిశ్చల మగు మనసుకలవారిని నీవేమిచేయగలవని మధురవాక్యములతో పలుకగనే మన్మథుడు సిగ్గుపడి, తన యనుచరులతోగూడి మఱలిపోయెను. మన్మథుడు దేవసభకుబోయి, నారదుని జితేంద్రియత్వమును పొగడి యావృత్తాంతమునం తను జెప్పి, నామాటలవిని మునులాశ్చర్యపడుచు, నారదుని బ్రశంసించిరి. దేవేంద్రుడుమాత్రము లజ్జచే శిరమువంచి యూరకుండెను. కాముని జయిం చితినను గర్వముతో నారదుడు శివునివద్దకేగి, మన్మథవృత్తాంతమును జెప్పి,

తన నిర్వికారత్వమును బొగడుకొనుచు, తన జితేంద్రియత్వమును శివునితో మాటిమాటికిని జెప్పజొచ్చెను. మహేశుడామాటలువినిఇట్లనెను. నారద!నీ జితేంద్రియత్వము నింతపొగడుచుంటివి. నీవు గొప్పవాడవు కావచ్చును. కాని నాతోచెప్పినట్లు విష్ణుతో నెన్నడును జెప్పకుము. నామాటల విశ్వసింపక అట్లుచెప్పితివేని, విష్ణునిమాయకులోబడి యవమానింపబడియెదవు. అనినీమాటల జెవినిబెట్టక, సగర్వముగ వీణె మీటుచు రాగాలాపముజేయుచు బయలుదేరెను. భరద్వాజా! ఇటనొకచిత్రముజరిగినది. వినుము. విధినిదాట నేరికిని శక్యముకాదుగదా. ముందుజరుగబోవుదాని నాలోచింపక, నారదుడు బ్రహ్మలోకమున కేగి, అట తనగొప్పదనము బొగడుకొనుచు, కొన్నిదినములుండి, ఒకనాడు విష్ణుకీర్తనల బాడుకొనుచు, వైకుంఠమునకు బోయెను. మానిరాకనెఱిగి విష్ణువు హర్షపరవశుడై, యాసనమిడి, కుశలమడిగి, నారదునితో నిట్లనియె. నారదా! నిన్నుజూచి చాలకాలమైనది. విశేషములేమి? విశేషములేనిదే నీవు రావుగదాయన, నారదుడు సంతోషముచే నుబ్బుచు, శివుడు చెప్పిన మాటల మఱచి, తన వృత్తాంతమంతను సవిస్తరముగ జెప్పివేసెను. అంతనాభగవంతుడు, నారదా! నీవంటి జితేంద్రియుడు యెందును గానరాడు. నీకునీవసాటి, యని నారదుని పొగడెను. అంత నారదుడు రెట్టించిన గర్వముకలవాడై, ప్రభూ! నీయనుగ్రహముననె నాకింత జితేంద్రియత్వము లభించినది. నన్నుజూచి మహామునులును నాశ్చర్యచకితమానసులైరి. అని నారదుడుపలుక, కరుణాసింధువగు భగవంతుడు నారదునివైఖరిని జూచి ఇట్లనుకొనెను. ఇతనిమనసునందు, గర్వమనెడి మహావృక్షముద్భవించి పెఱుగనున్నది. దానిని వృద్ధిసందక మునుపే ఛేదింపవలయును. నాసేవకులకు హితమును జేయుటయె నాపని, కానదీనికిసరియగు నుపాయమాలోచించి, ఈతని చెడుగర్వమును ఛేదించి బాగుచేయనినా డీతడు చెడిపోవును. నా భక్తులు చెడుటను నేనుజూడజాలను. అనితలచుచుండ నారదుడు భగవంతునకు ప్రమొక్కి పయనమాయెను. అంత నారదగర్వభంగమునకై భగవంతుడు తనమాయచే నిట్లుసృజించెను. నారదుడు పోవుమార్గమున, నూరుయోజనముల పొడవును, అంతియ వెడల్పునుగల గొప్పపట్టణము నొకదానిని సృజించెను. అదివైకుంఠమును దిరస్కరించువై భవముతో నలరారుచుండెను. అపట్ట

ణములో రతిమన్మథుల దిరస్కరించెడి రూపయౌవనలావణ్యములుకల స్త్రీ పురుషులను, చతురంగబలసమేతుడగు రాజును, నదీనదంబులను, పూలతోట లను, ఫలవృక్షములను, దివ్యసౌధంబులను నిర్మించియుండెను. ఆరాజు యౌవన రూపలావణ్యములు కలిగి, అతిబలశాలియై, నీతినిపుణులతో రాజ్యమును పాలిం పుచుండెను. అతనికి విశ్వమోహిని యనుపేరుగల ఒక కూతురుండెను. ఆమె రూపమును జూచి లక్ష్మియు సిగ్గుపడుచుండును. తనకుమార్తెకొఱకు రాజు స్వయంవర మేర్పఱచి యుండెను. అందుకురాజు లండఱు వచ్చియుండిరి. నారదు డీవిచిత్రమగు పట్టణమును జూచి, ఆశ్చర్యమునంది, దీనిని పాలించెడి రాజెవరని యాపురవాసుల నడుగుచు, వారివలన సకలవృత్తాంతమును దెలిసి కొని రాజసౌధమున కేగెను. నారదునిజూచి యారాజు, అర్ఘ్యపాద్యాస నంబులనిడి, పూజించి తనపుత్రినిజూపి, యీమెకు జాతకఫలముల జెప్ప మనెను. నారదుడామె సౌందర్యమును జూచి ముగ్ధుడై, విరహవేదననందుచు, తదేకదృష్టితో నాకన్యను దిలకింపుచు, నామె రూపరేఖావిలాసముల కచ్చెరు వందుచు, మోహావిభ్రమమున చిత్తరువునందలి బొమ్మవలె నిశ్చేష్టుడై యుంచెను. ఆ సౌందర్యవతిని జూచినతోడనె మనస్సుచలింప, నోటమాటలు తడబడ, రాజుతోనిట్లనెను. రాజా! ఈమెకు కాబోయెడిభర్త, అమరుడు నజేయుడు, చరాచరపూజ్యుడు నగును. ఈమె సర్వలక్షణసంపన్న. ఈమె కెందును లోపముండదని చెప్పి, మనంబున నేదియో దలపోయసాగెను. అట నుండి వెడలి ఇట్లనుకొనెను. నేను తగుప్రయత్నమును గావించినగాని యీరాచ పట్టి నన్నువరింపదు. ఇది జపతపముల కదనుకాదు. ఓ విధాతా! ఈకన్నెను నాకు లభించునట్లు చేయుము. ఇప్పట్టున నాకతిలోకోత్తర రూపముకలిగిన నీమె నన్నుగాకింకెవ్వరిని వరింపదు. నాకంఠముననె పూలమాల వేయును. ఈసమయ మున వైకుంఠనాథుని వేడికొనిన నాకోరికలన్నియు సిద్ధించును. విష్ణువుతో సరియగు నాప్తబంధువులిం కెవ్వరును లేరు. నాయం దతనికి నత్యధికమగు ప్రీతి కలదు. కాని నేనట బోవువఱకు సమయ మతిక్రమించును. ఏమిచేయుటకును దోచుటలేదు. అని విష్ణుభగవానుని ధ్యానింపుచు, పరిపరివిధముల వేడుకొన సాగెను. కపటనాటక సూత్రధారియగు భగవంతుడా నారదున కచటనె ప్రత్యక్షమయ్యెను. భగవంతుని జూచి నారదు డానందపరవశుడై, తన కోరిక ను

వినిపించెను. ఓదయానిధీ! నాకు మీవంటి దివ్యరూపము నిచ్చినయెడల నాకన్నియ నన్నె వరించును. నాకాసహాయమును జేసి బ్రతికించుము. నేను మీదాసుడ నని యతిదీనముగ బలికిన నాతని పలుకు లాలకించి, తన మాయకు తానె విస్మయమందుచు మందహాసముతో నిట్లనియె. నారదా! నేనెప్పుడును నీక్షేమమునె జూచుచుందును. భక్తుల కుపకారమునే గాని యపకార మెన్న డును జేయను. రోగి యపథ్యముల గోరును. వైద్యు డాయపథ్యమున కంగీక రింపక, తగు చికిత్సను గావించి, యారోగ్యమున కనువగు నాహారము పెట్టిం చును. అట్లే నీహితమును తప్పక జేయుదును. అని పలికి యంతర్ధా తుడాయెను. నారదుడు భగవదాజ్ఞాక్యముల గుర్తెరుంగక, భగవంతుడు తన్ననుగ్రహించెనని తలంచుచు, స్వయంవర మండపము దరికేగి, రాజులందఱు తమతమ యాసన ముల సుఖోపవిష్టులగుట జూచి, అందు తాను నొక యాసనము నధిష్టించెను. నేను భగవత్కృపచే మిక్కిలి సుందరుడనై తిని. ఆకన్నియ నన్నె వరించును. అనుకొనుచు రాచపట్టివలె శీఘ్ర గూర్చుండెను. సభాసదులందఱు నారదుని జూచుచుండిరి. శివగణములలోనివా రిఱువురు, విప్రవేషములతో, నారదచర్యల నన్నిటిని కనిపెట్టి చూచుచుండిరి. నారదుడు తన వేషమునకు మురియుచు, విశ్వమోహిని రాక కెదురుచూచుండెను. ఆకపటబ్రాహ్మణులు నారదునకు వినిపించునట్లు, మెల్లగ నిట్లు చెప్పుకొనుచుండిరి. ఈతని సౌందర్యమును జూచి ఏరాచకన్యక వరింపరు. ఇందఱు రాజులరాక యనవసరమవి పరిహసింపుచుండ, నది యంతయు నిజమనుకొని నారదుడు మురియుచుండెను. విష్ణుభగవాను డితని మేలును కోరి, చూచువారలకు నారదునిగను, ఆస్వయంవరకన్యను, కోతి మోము కలవానిగను, నారదున కమోఘరూపసంపన్నునిగను, నగుపడునట్లు చేసియుండెను. ఆరాచకన్నియ పూలమాలతో సభకు వచ్చి, సుందరులగు రాకొమఱుల జూచి ముఱియుచు, కోతిముఖముగల నారదుని జూచి ఏవగించు కొని క్రోధ వీక్షణములతో జూడసాగెను. ఆమె అందకత్తియలగు చెలుల వెంటనిడికొని, వయ్యారముగ నడచుచు, మందమరాళ గమనయై, రాజకుమారుల భ్రమింపజేయుచుండెను. రాకుమారి తనవైపు జూడనందు లకు విచారింపుచు, అందమునకు లోపమువచ్చునేమోయని హారముల సవరిం చుకొనుచు, నుత్తరీయము నటునిటు భుజమునందు ద్రిప్పుకొనుచు, ననేకచర్యల

జేయుచుండెను. దీనినంతను, విప్రవేషధారులగు శివకింకరులు జూచుచు పరిహాసము జేయుచుండిరి. అంత విష్ణువు తానొక రాకుమారుని వేషమును ధరించి అటకు వచ్చియుండెను. ఆదివ్యమూర్తిని జూచి యాకన్నియ ప్రసన్నవదనయై, భూపతులందఱు జూచుచుండ, నావిష్ణుమూర్తికంఠమునం దామాల నలంకరించెను. అటనున్న రాజులందఱు నిరాశజెందిరి. నారదుడదిజూచి, తనచేతనున్న చింతామణి జారిపోయినట్లు బాధపడుచుండెను. ఇంతలో స్వప్న దృశ్యమువలె నటనెవ్వరు నగపడుటలేదు. ఆకపటవిప్రులిర్వురు నొకయద్దమును దెచ్చి నారదునకు జూపుచు నవ్వసాగిరి. అద్దమును జూచినతోడనే తన కోతి ముఖము తనకగపడెను. వెంటనే దిగులుపడి, వారి పరిహాసమున కృద్ధుడై రాక్షసయోనియందు జన్మింపుడని వారికి శాపమిడెను. భరద్వాజా! మునులతో పరిహాసమునకు తగినఫలము ననుభవింపవలయునుగదా. పిమ్మట నారదుడు స్వచ్ఛమగు జలమునందు తన ముఖప్రతిబింబమును జూచుకొని, కృద్ధుడై త్వరలో విష్ణుభగవానుని దర్శింపదలచి వెళ్ళుచు తనలో నిట్లనుకొనెను. నేను తొందఱపడి శివగణములలోనివారిని శపించితిని. దీనితో నాయవివేకము స్పష్టమయినది. ప్రపంచమంతయు నన్ను పరిహసింపకమానదు. ఇట్లను కొనుచుండ మార్గమధ్యమున లక్ష్మీసమానయగు, తాను మోహించిన రాచకన్నియతో విష్ణువు ప్రత్యక్షమాయెను. వారినిజూచి నారదుడు విస్మయమునందుచుండ, నారదా! ఎక్కడికీప్రయాణమని విష్ణువు పలుకరించెను. ఆమాటలకు నారదు డాజ్యపూరితాగ్నివలె ప్రజ్వరిల్లుచు ఇట్లనెను. నేవలచిన కన్యను చేజిక్కించుకొని నీవేమైనను చేయగలవు. నీవు పరులసంపద కోర్వలేని వాడవు. నీవెప్పుడును కపటముతో వర్తింతువు. సముద్రమథనమునందు శివునిచే విషమును త్రాగించి, రాక్షసులకు మద్యమును, దేవతల కమృతమును, బోసి, నీవు లోకోత్తరములగు, లక్ష్మీకౌస్తుభముల చేజిక్కించుకొంటివి. దానితో నీస్వార్థపరత, కౌటిల్యమును, బయల్పడినవి. నీవంటి మాయావి, స్వతంత్రుడును మఱియొకడు లేడు. నీవు మంచిని చెడుగుగను, చెడుగును మంచిగను, మందుని సుమతిగను, సుమతిని మందునిగను, ప్రపంచమునంతను నీయిచ్చవచ్చినట్లు చేయుదువు. నీకు పూర్వశోకములు, మానాభిమానములు హెచ్చుతగ్గులులేవు. నీవందఱను భ్రమపెట్టి పరీక్షించుచుందువు. నీకు శుభా

శుభకర్మలతో సంబంధములేదు. నీవు భయమును, బాధను ఎరుగవు. నేను బేలనై నీమాయలో పడిపోతిని. ఎంతటివాడైనను నీమాయలో జిక్కకతప్పదుగదా! నన్నిట్లు మాయచే దుఃఖితునిజేసినందులకు తగినఫలము ననుభవింతువులే. నన్నవమానించినందులకు నావలె నీవును మానవజన్మమునెత్తి, భార్యావియోగముచే దుఃఖితుడవై, హర్షశోకముల ననుభవించుచు, నాకు కోతిముఖమును గల్పించితివిగాన నీవును కోతులతో చెలిమిజేయుచు, స్త్రీకై పరితపించెదవు. నా శాపము తప్పదు. అని పలికినతోడనే, నిష్ణువు అందులకంగీకరించి, తన మాయను తొలగించి, లక్ష్మితోగూడ సాక్షాత్కరించెను. అప్పుడు నారదుడు గడచినదానికి వగచుచు, తన యవివేకమునకు సిగ్గుపడుచు, తానిచ్చిన శాపమునకు పశ్చాత్తప్తుడగుచు, భగవంతుని పాదములపై బడి, ప్రభూ! అనాథరక్షకా, రక్షింపుము అని ఇట్లు కీర్తించెను.

తోడిరాగము. ఆదితాళము.

మాం సముద్ధర, మాధవా, నారాయణ, దేవదేవ ॥

2 యజ్ఞవరాహ - హిరణ్యాక్షసంహార, నరసింహరూపధర, హిరణ్యకశిపు సంహార, మీనరూపధర-సోమకదైత్యహార-కమఠాకార మాధవా-శ్రీధర॥

3 వామనాకార-బలిరాజ్యాపహర-భార్గవాభిధరామ-భంజిత నృపస్తోమ ॥

4 దశరథకుమార-దశకంఠసంహార-ముసలాయుధధర-ముకుంద, భవహార ॥

5 బుద్ధకల్కిరూప-భుజగాధిపశయాన-క్షీరసాగరనిలయ-క్షితిభార మపనయ॥

మాం॥

ఇట్లు స్తుతించి, తండ్రీ! నీకిడిన నాశాపమును తగులకుండునట్లు చేయుము. మందుడనై ఇట్లు పలికితి. నీవు క్షమింపకున్న నాకు వేఱుగతిలేదు. నాదుర్భరణములు నన్ను మిక్కిలి పీడించుచున్నవి. అని బహుభంగుల వేడ, దీనబంధువగు భగవంతుడిట్లనియె. నారదా! నీవు భయపడవలదు. దీని నంతయు నీక్షేమమునకై కల్పించితిని. నాభక్తులను చెడుత్రోవల బోనీక, మంచిత్రోవల జూపుట నావిధి. నీవిచ్చిన శాపము దేవతల కెంతేని సంతసమును గలిగించుచున్నది. కాన నిన్నెవ్వరును నిందింపరు. దేవకార్యమున కుపయోగించుటవలన నాకును సంతోషకరముగనే యున్నది. అనవిని నారదు

డోతండ్రీ! నిన్ను నిందించితిని. దీన నెట్టిదుఃఖముల ననుభవింపవలయునో, అను మునిపలుకులవిని, నారదా, శంకరనామమును నూఱునిమిదిపర్యాయ ములు జపించిన నేదోషములైన నశించును. నాకు శంకరునివంటి బంధువు మఱియొకడు లేడు. అతనిని సేవింపనివారు నాభక్తు లెన్నటికి కాజాలరు. అనిచెప్పి భగవంతు డంతర్హితుడయ్యెను. పిమ్మట నారదుడు శివనామమును జపించి, హరిస్మరణ చేయుచు, బ్రహ్మలోకమున కేగి, అట విష్ణుగుణముల వర్ణించుచు, ఆకాశయానము చేయుచుండ, నారదునిచే శపింపబడిన శివగణ ములలో నిరువురు నారదునిజూచి, నమస్కరించి తప్పులక్షమింపుమని మొర పెట్టుకొనిరి. అజ్ఞానము తొలగినందున నారదుడు వారలతో నిట్లనెను. ఓ శివ కింకరులారా! నాశాపము వ్యర్థముకాదు. కీడులోమేలన్నట్లు మీకొకమం చిని జెప్పెదను వినుడు. మీరిద్దరును రాక్షసయోనులందు బుట్టి, మహా వైభవముల ననుభవింపుచు, నిరుపమాన పరాక్రమసంపన్నులై, ప్రపంచము నంతను, జయింతురు. అప్పుడు మీదౌష్ట్యమును సహింపనేరక భగవంతు డవతరించి మిమ్మ్నిలసంహరించి మీకుముక్తి నిచ్చుననిచెప్పి, ఆతడు వెడలి పోయెను. నారదశాపమును బట్టి వారిరువురును రాక్షసులై పుట్టిరి. భగవం తుడు సగుణరూపుడగుటకును నారదశాపమే కారణము. మఱియు దుష్టశిక్ష ణార్థము భగవంతు డనేకయవతారములనెత్తి, యనేకచర్యల జేయుచుండును. ఇట్టి విచిత్రములైన భగవత్కథలను, కవులు ప్రబంధరూపమున వర్ణించిరి. హరి అనంతుడనియు అతనిచరిత్రము లనంతములనియు చెప్పబడుచున్నవి. ఇంకొక విచిత్రమైనకథకలగు. శ్రీహరి మనోహరచరిత్రను కోటికల్పములు వర్ణించినను తృప్తినందుట కష్టము. మహాజ్ఞానులైనను హరిమాయను దాట జాలరు. అతనిని భజించుసేవకులు మాత్రము సులభముగ నన్నిమాయలను దాటగలరు. రామచంద్రుని విచిత్రగాథల విస్తరించిచెప్పెద. వినుడు. జన్మ రహితుడు, నామరూప రహితుడునగు పరమాత్మ, అయోధ్యకు రాజగుట, సీతాలక్ష్మణసహితుడై మునివేషమును ధరించి వనవాసమును జేయుట, మున్నగునవి గూడజెప్పెదను. అప్పటి వారియరణ్యవాస సమయమందె నీవు దశ్రునికుమార్తవై యుండి వారలనుజూచి భ్రమనందితివి. ఇప్పటికైనను నీ మోహచ్ఛాయ వదలలేదు. ఈకథను శ్రద్ధాభక్తులతోవిని, మోహభ్రమల

నివర్తించుకొనుము. పార్వతి లజ్జావనతవదనయై, యీశ్వరుడు జెప్పుచున్న కథను వినుచుండెను.ఓభరధ్వాజా!నీవునుశ్రద్ధతోవినుము. స్వాయంభువమనువు,భార్యశత రూప. వీరివలన మానవసృష్టిఅంతయు నేర్పడినది. ఆదంపతులచరిత్ర వేదములందు నేటికినిజెప్పబడుచున్న ది.వారికిఉత్తానపాదుడను పుత్రుడుకలడు.అతనికి ధృవుడు, ప్రియవ్రతుడు నను నిరువురు పుత్రులుండిరి. వారును పురాణప్రసిద్ధులు. స్వాయం భువ మనువునకు దేవహూతియను కొమరితయు కలదు. ఆమె కర్దమమునిభార్య. ఆదంపతులకు నాదిదేవుడైన భగవంతుడు, కపిలబుషియై జన్మించెను. ఆతడు సాంఖ్యశాస్త్రమును విస్తరింపజేసెను. స్వాయంభువమనువు, భూమి నంతను పాలించి, చిరకాలము రాజ్యభోగముల ననుభవించి, ఎల్లప్పుడు భగవద్భక్తి తత్పరుడై, కాలక్షేపమును జేయుచు, వృద్ధుడై, గృహమం దుండుట కిష్టపడక రాజ్యభోగములం దనిష్టము కలిగి, విరాగియై, భార్యాసహితముగ దప మాచ రించుటకు వనమునకు బోదలచి, తన కుమారునకు రాజ్యమొసగి, అనుకూలవ తియు, పతివ్రతయు, నగు శతరూపతో గూడి వనమున కేగుచు, మహర్షుల కావాసమును, ఉత్తమక్షేత్రము నగు నైమిశమును జేరెను. అచట నుండెడి సిద్ధపురుషుల జూచి యమందానందము నంది, కొన్నిదినము లట నివసించెను. ఇంకను ముందునకు ప్రయాణమును సాగింపదలచి పోవుచుండ, చూచువారలకు భక్తిజ్ఞానములు ప్రయాణమై నడచుచున్న ట్లాదంపతులు గోచరించుచుండిరి. అట్లు పోయిపోయి గోమతీనదీతీరమును జేరి హర్షమునంది, అందు స్నానమాచ రించి, అటనుండెడి సిద్ధపురుషులను, మహాములను, జూచుచు, వైరాగ్యజ్ఞానసంప న్నులగు వారల సేవింపుచు, వారలచే సత్కారములనందుచు, తామును తాపస వేషముల ధరించి, నిత్య మాతపోధనులవలన పురాణేతిహాసముల వినుచు, కొన్నిదినములు గడిపి, విష్ణుపదకంజములం దనురాగము కలవారై, వాసుదేవ మంత్రమును జపించుచు, తప మాచరించుచు, కందమూలఫలాదుల భుజించుచు, పరమాత్మను స్మరింపుచు, కొంతకాలము గడిపి, వానిని గూడ తినుట మాని, నీటినిమాత్రము గ్రహింపుచు, ఘోరతప మాచరింపుచు, పరమాత్మస్వరూప మును జూడగోరుచు, అఖండానాద్యనంతనిర్గుణపరబ్రహ్మను, దృఢభక్తితో ధ్యానముచేయుచు, నిట్లు తలంచుచుండిరి. " ఈపరమేశుని స్వరూపమును నిగ మములు, కొన్ని తావులందు సగుణముగను, మఱికొన్ని తావులందు నిర్గుణము

!)

గను వర్ణించుచున్నవి. ఈతని యంశముచే ననేకబ్రహ్మాండము లుద్భవించు చున్నవి. ఈతడు భక్తహితముకొఱకు సగుణుడై వెలయుచుండునని వేద ములు చెప్పుచున్నవి. కాన మన మనోరథము తప్పక సిద్ధించు" నని, కేవల జలపానముచే నారువేల సంవత్సరముల గడపి, పిమ్మట దానినిగూడ విడిచి, కేవలము వాయుభక్షణము జేయుచు, కొంతకాలమున కదియు మాని తప మాచరింపుచుండెను. ఇట్లు పదివేలసంవత్సరములు గడచినవి. పిమ్మట నేక పాదస్థితులై తపమాచరించుచుండిరి. ఇట్లుండ బ్రహ్మవిష్ణుమహేశ్వరు లాతని తపస్సునకు మెచ్చి, ప్రత్యక్షమై, రాజా! నీతపస్సునకు మెచ్చితిమి. నీకు సమ్మత మగు వరమును కోరుకొనుము, అని పలికిరి. కాని ఆదంపతులు దృఢభక్తిచే నెదుటవారిని జూడకి మైమఱచి, తదేకధ్యానములో నుండిరి. వీరి నిశ్చలధ్యాన మున కచ్చెరువందుచు నాత్రిమూర్తు లంతర్ధాతులైరి. వారుమాత్రము విసువు జెందక ఘోరతపము నట్లే జేయుచుండిరి. అప్పుడు సర్వాంతర్యామి యగు ప్రభువు, ఆదంపతులు తనకు హితులని దలంచి, సకృపావలోకనము జేసి, యమృతనిష్యందులగు గంభీరవాక్కులతో నంతరిక్షమునుండి ఇట్లనియె. ఓదంప తులారా! ఏదేని వరము నడుగుడు. ఇచ్చెదను. ఇక తపమును జాలింపుడు. ఆదంపతుల కావాక్కులు, నిర్జీవునకు జీవనమును బోసినట్లును, నిర్ధనునకు ధనమబ్బి నట్టును, కర్ణరంధ్రముల ద్వారమున హృదయమున ప్రవేశించి, నూతన తేజో బలముల గల్పించెను. అంత నాదంపతులు, నూతనశరీరధారులవలె ప్రకాశిం చుచు పులకాంచితశరీరులై, వికసితహృదయములతో గనుల విప్పి, దిక్కుల బరికించి చూచుచుండ, నావాక్కులె వినబడుచుండెను. పిమ్మట వారాదివ్య మూర్తిని జూచి, సాష్టాంగనమస్కారమును చేయవలెనని యూహించి లేచిరి. ఓ సేవకకల్పవృక్షమా! ఓభక్తకామధేనూ! ఓకృపానిధీ! శరణాగతవత్సలా! ఓచరాచరనాయకా! నేటికి మీదర్శనభాగ్యము కలిగినది. మాజన్మములు ధన్యములు. మాతపములు ఫలించినవి. ఏచరణకమలరజమును త్రిమూర్తులు ధరింతురో, అట్టి దివ్యపరాగము మాకు లభించినది. మీపాదములను విడు వము. వరము నడుగుమని పలికితివి. తండ్రీ! మాకీవరము ననుగ్రహింపుము. ఏదేవుని శివుడు సర్వదా ధ్యానము చేయుచుండునో, ఎవని కరుణకై మహా మునులు ఘోరతరప్రయత్నము లాచరింతురో, కాకభశుండుని, మానససరోవ

రమునం దెవడు హంసయై క్రీడించుచుండునో, ఎవనిని వేదములు సగుణనిర్గుణ భేదమున బ్రశంసించుచున్నవో, అట్టి దివ్యమూర్తిని, మాయందు దయ యుంచిమాకు దృగ్గోచర మగునట్లు చేయుము. ఇంతవరకు మీ వాక్కులను వినుటయే కాని, మీ దివ్యరూపమును దర్శించుకొన జాలకుంటిమి. అని మృదుమధురముగ బలుక, భక్తవత్సలుడు జాలనొంది వారికనులయెదుట సాక్షాత్కరించెను. ఆతడు నీలనీరదమువలె, నిందీవరమువలె, నింద్ర నీలమువలె, శ్యామలశరీరుడై, కోటిమన్మథుల దిరస్కరింపుచుండెను. శరచ్చంద్రతుల్యమగు ముఖకాంతియు, మనోహరములగు చెక్కిళ్లును, అందమయినచుబుకంబును, శంఖమువంటి కంఠమును, బింబఫలమువంటి యధరమును ముద్దులమూటగట్టు దంతపంక్తియు, మనోహరమగు నాసికయు, చంద్రకిరణముల దిరస్కరించు సుందరమృదుమధురదరహాసమును, నూతనపద్మముల వంటి, మనోహరభావములతో గూడిన నేత్రకాంతులును, మన్మథబాణముల వంటి కనుబొమలునుకలిగి, లలాటంబున విద్యుత్సమానమైన తిలకంబును, చెవులకు మకరకుండలంబులును, శిరమునందనేకరత్నఖచితమగు కిరీటమును కలిగియుండెను. మఱియు నురమున శ్రీవత్సలాంఛితుడై, గళమున వనమాలతో పాటు మణిగణఖచితముక్తాహారాలంకృతుడై, సింహకంధరసదృశకంఠమున యజ్ఞోపవీతముల ధరించి, కరికరనిభములగు బాహువులందు కామోదకి మున్నగుదివ్యాయుధముల ధరించియు, నడుమునం దమ్ములపొదియు, హస్తమునందు ధనుర్బాణములను ధరించియు, ఉదరమునందు వళిత్రయమును కలిగి సుందరయమునావర్తమువంటి నాభితో నాదంపతులకు సాక్షాత్కరించెను. ఏ పాదపద్మములందు మునిమానసభ్రమరములు సదానివసించునో, అట్టిపాదము లీదంపతులకు లభించెను. ఆభగవంతుని వామభాగమున జగన్మూలకారణ మగునాదిశక్తి విరాజిల్లుచుండెను. ఈమెయంశముచే' సర్వగుణసంపన్నలు, నసంఖ్యాకములగు, సరస్వతి, కమలా, పార్వతీమూర్తు లుద్భవించుచున్నవి. ఈమె భ్రూకుటీ విలాసముచే బ్రహ్మాండము లావిర్భవించుచున్నవి. భరద్వాజా! ఆయాదిశక్తియె, రామునిభార్యయై సీతయనుపేరున ప్రఖ్యాతికెక్కియుండెను. ఆదివ్యమూర్తులజూచి మనుదంపతులు, ఆశ్చర్యసంభ్రమానందములతో, నొక పరికన్నులమూయుచు, మఱియొకతడవు నేత్రములదెఱచుచు, కొంతవఱకు

అనిమేషదృష్టితో దిలకింపుచు, అంతతో తృప్తినందక, హర్షవివశులై, తనువులమఱచి, భగవత్పాదములను తమహస్తములతో స్పృశించుచు, నాపాదపద్మము లందుపడియుండిరి. వారిదశనుజూచి వారిని భగవంతుడు తనహస్తముల లేవనెత్తి ఇట్లు పలికెను. ఓ భక్తులారా! మీయచంచల భక్తికి సంతసించితిని. మీరు నాయం దత్యంతాదరము కలిగి ఘోరతపముచే నిట్లుకృశించిరి. మీయెడ నాకు గాఢానురాగము కలిగినది. మీరేది కోరినను తప్పక యీయగలను. కోరుకొనుడను భగవద్వాక్యముల విని ఆదంపతులు చేతులు జోడించి నమస్కరించుచు ధైర్యము నవలంబించిరి. మృదుమధురవాక్యములతో మను విట్లుబలికెను. ఓప్రభూ! తమ చరణకమలదర్శనముచే మాతపములు, కోర్కెలును ఫలించినవి. అయినను మాకొకపెద్దకోరిక గలదు. తమకది చిన్నదియే కావచ్చును. దానిని మీకు దెలుపుటకు సంశయించుచున్నాను. ఇచ్చట మీకెంత తేలికఅయినను పుచ్చుకొనుటకు మాకంత కష్టమైనదిగ దోచుచున్నది. మిమ్ముల నేమికోరవలయునో మాకు దోపకున్నది. దరిద్రుడు కల్పవృక్షచ్ఛాయకేగి, బహుళసంపత్తులకోర శంకించును. ఎన్నడును భాగ్యమునెఱుగక నేమికోరవలయునో దెలియక నోట మాటరాక కూలబడును. ఆవృక్షప్రభావమునె గుర్తెరుగని ఆతడేమికోరగలడు? మేమును ఆవిధముగ నుంటిమి. స్వామీ! మా మనోరథములు మీకు దెలియనివికావు. తమరు సర్వాంతర్యాములు. అని పలుక భగవంతుడిట్లనెను. నేనీయలేని దేదియునులేదు. కానమీకిష్టమైనదానిని అడుగుడు. సంశయమక్కరలేదు: నీవడగనియెడల నేనెట్లీయగలను? అన నాదంపతు లిట్లనిరి, ఓవదాన్యశిరోమణీ! ఓకృపాజలనిధీ! అట్లయిన నడిగెదము. మీవద్ద దాపరికమేల? మిమ్ముబోలిన పుత్రుని ప్రసాదింపుము. అని మనువన నాతనిగాఢాను రాగభరితములగువాక్కుల విని భగవంతుడు సంతసించి, రాజా! నాతో సమానుడు మఱియొకడులేడు. కాన నేనే మీపుత్రుడనై జన్మించెదను అనిచెప్పి, శతరూపవైపు జూచి, దేవీ! నీవును ఏదేనివరమును కోరుకొనుమన, తండ్రీ! నాభర్తకోరిన వరమునే నేనును కోరుచుంటిని, దానినే ప్రసాదింపుమన భగవంతుడు, తథాస్తు, అని పలికెను. మఱల నాదంపతు లిట్లనిరి. స్వామీ! మేము మిక్కిలి చపలులము. మీరు భక్తుల కోర్కెలదీర్చువారలు. బ్రహ్మ

దిజనకులు, జగత్ప్రభువులు, పరబ్రహ్మస్వరూపులు, సకలజగదంతర్యాములు. అట్టిమీరు నాబోటి దీనురాలి గర్భమునం దెట్లావిర్భవింతురో తెలియకున్న ది. మీపలుకులు సత్యములుగాన మాకోర్కెలు ఫలించునని సంతసించుచుంటిమి. మీభక్తులకు దుర్లభమేదియులేదు. నాకుమాత్రము, నీపాదసేవయు, పునరా వృత్తిలేని గతియు, దివ్యజ్ఞానమును కలుగజేయుము. అని శతరూప వేడిన, నీ కోర్కెల దప్పక తీర్చెదను, నీ యలౌకిక జ్ఞానము నాయను గ్రహముచే నెన్నడు నశింపదు, అనిన భగవంతుని జూచి మను విట్లనియె. ప్రభూ! మిమ్ము విడువరాని మోహముచే మిమ్ముల పుత్రునిగ బడయగోరితిని. నామూఢతకు ప్రాజ్ఞులు పరిహసింతురు. కానిమ్ము. చంద్రికా విరహిత చాతకంబులు, జలవిహీన మీనంబులు నెట్లు పరితపించునో, మిమ్ము పిడిన నేను నట్లే పరితపించెదను. మాజీవితములు మీయధీనములు. అని పలుక భగవంతుడు సంతసించి, రాజా! నీకోరిక సిద్ధించును. ప్రస్తుతము నీవు కొంత కాలము స్వర్గమునందుండి, అచటి భోగముల ననుభవించి, మిమ్మట దశరథుడను పేరుతో నయోధ్యాపతివై జన్మింతువు. అపుడు నేను నీకు పుత్రుడనై జన్మించెద. అపుడు భక్తహితార్థినై నేననేకాద్భుతచర్యల జూపెదను. ఓయదృష్ట వంతుడా! నేజెప్పిన దంతను శ్రద్ధతో వినుము. నావలన మోహరహితుడవై సంసారార్ణవమును దాటగలవు. ఈయాదిశక్తియు లోకోద్ధరణమునకై యవత రించును. ఈశతరూప కౌసల్యయై జన్మించి నీకు భార్య యగును. ఆమెకు నేను జన్మించి మీకోర్కెల దీర్చెదను. నామాటలు సత్యము లని చెప్పి భగవంతు డంతర్ధానమునందెను. ఆదంపతులు తమకు గోచరమైన స్వరూపమును దలచు కొనుచు, హృదయమునం దామూర్తిని నిలుపుకొని ధ్యానింపుచు, కొంతకాల మాయాశ్రమమునం దుండి, ఒకనా డనాయాసముగ బ్రాణముల వీడి, స్వర్గ వాసులై సకలభోగముల ననుభవింపుచుండిరి. భరద్వాజా! పవిత్రమగు నీకథను వినియుంటివి. శ్రీరామావతారమున కిదియొక కారణము. ఆభగవంతుడే రాముడై జన్మించెను. ఇంకొక యితిహాసము కలదు. వినుము. జగత్ప్రసిద్ధ మైన కేకయదేశమును సత్యకేతు డను రాజు పాలింపుచుండెను. అతడు ధర్మ దురంధరుడై, నీతినిపుణుడై, సర్వశాస్త్రకోవిదుడై, దుస్సహప్రతాపుడై, శీల సంపన్నుడై, మహాబలవంతుడై, మహా తేజస్వియై యుండెను. అతనికి సకలగుణ

నిధులును, రణధీరులును, నీతిధురంధరులును నగు నిరువురు పుత్రులు కలరు. వారిలో పెద్దవాని పేరు ప్రతాపభానుడు. రెండవవాని పేరు అరిమర్దనుడు. వీరి భుజబలముచే సంగ్రామములం దెల్లప్పుడు జయమే కలుగుచుండెను. వీరిరువురు నిష్కల్మషమైన మైత్రితో ప్రవర్తింపుచుండిరి. రాజు పెద్ద వాడై ప్రతాపభానునకు రాజ్యము నిచ్చి నిశ్చింతుడై తాను వానప్రస్థాశ్ర మమునకు బోయెను. నాటినుండియు ప్రతాపభానుడు శాస్త్రోక్తవిధిని రాజ్యపాలనము జేయుచు, ప్రజలతో నైకమత్యము కలవాడై, యఘరహితుడై, యుండెను. రాజునకుహితుడును, చతురుడును, నగుధర్మ రుచియనుమంత్రికలడు. ఈతడు నీతిశాస్త్రమున శుక్రునంతటివాడు. మంత్రి నీతి శాస్త్రపారంగతుడు, అనుజుడు మహాబలశాలి. తాను నిర్వ్యాకులపరాక్రమము కలవాడు. ఇట్టిరాజునకు లోపమెట్లుండును? ఆతనికి యపారమైనచతురంగ సేనయు, నసంఖ్యాకులగు వీరభటులును గలరు. వారెల్లప్పుడు జయభేరుల మ్రోయించుచుండ రాజాధ్వనులనువిని సంతసించుచుండును. ఒకనాడు శుభ సమయమున సేననంతను సిద్ధపఱచి, చతురంగబలములతో ప్రతాపభానుడు దిగ్విజయమునకు బయలుదేరి, బలవంతులగురాజుల నందఱ జయించి, తనభుజ బలముచే సప్తద్వీపముల వశపఱచుకొని, వారివలన కప్పములంబడసి, పృథ్వీ మండలమునంతను నేకచ్ఛత్రాధిపత్యముతో నేలుచుండెను. ఈతనిపరిపాలనము నందు పృథివి కామధేనువువలె, కల్పవృక్షమువలెను, సకలాభీష్టముల నిచ్చు చుండెను. ప్రజలు దుఃఖదూరులై, సుఖసంపన్నులై యుండిరి. స్త్రీపురుషులు తమతమధర్మముల విడనాడక, నీతివంతులై యుండిరి. మంత్రియగు ధర్మ రుచియు, రాజభక్తిపరాయణుడై, రాజక్షేమమునె గోరుచు, రాజునకు నీతి నుపదేశించుచుండెను. రాజు నిత్యము, గురు, దేవ, బ్రాహ్మణ, సత్పురుష సేవాతత్పరుడై యుండెను. వేదవిహితధర్మముల సాదరముగా ప్రవర్తింప జేయుచుండెను. ప్రతిదినము ననేకములగుదానముల జేయుచు, పురాణేతిహా సములవినుచు, అనువగుచోటుల వాపీకూపతటాకాదుల నిర్మింపజేయుచు, అం దనువగు పుష్పవాటికల నిర్మించుచు, బ్రాహ్మణుల కనువగుగృహాముల నిర్మిం చుచు, సర్వతీర్థములందును హరిహరాలయముల పాదుకొలుపుచు క్రతియోచి తములగు క్రతువుల సహస్రాధికముగ జేయుచు, తత్ఫలము నపేక్షింపక భగవ

దర్పణము జేయుచుండెను. ఒకనాడారాజునకు వేటయం దిచ్ఛకలిగెను. వెంటనే ఒకజవనాశ్వము నధిష్టించి, మృగయావినోదార్థము వింధ్యారణ్యమున కేగి, అటనుండెడి సాధుమృగముల వధించుటకు శంకించుచు, వనమంతయు సంచరించుచు నొకసూకరమును కనుగొనెను. ఆసూకరము, రాహువు చంద్రుని జూచు కైవడి రాజును జూచుచు, రాజును వశపఱచుకొనసమకట్టి, వనమం తయు క్రమ్మరజొచ్చెను. దానిమాయల నారాజెఱుంగడాయెను. తెల్లని దాని కోఱలు బాలచంద్రునివలె ప్రకాశించుచున్నవి. తెగబలిసిన యాసూక రము గుట్టిఫుడెక్కల ధ్వనిని విని, గురగురలాడుచు చెవులు నిక్కబొడిచి యాశ్చ ర్యచకితయై చూచుచుండెను. కాటుకకొండవంటి యాసూకరమును జూచిన తోడనే యశ్వము తనఖురముల విదళించుచు, బెదురుచూపులతో నతివేగముగ మార్గామార్గముల గమనింపక తోచినట్లు పరుగిడసాగెను. గుట్టిఫుడెక్కల ధ్వనిని విని సూకరమును మిక్కిలివేగముగ పరుగిడుచుండెను. రాజాసూకర ముపై బాణముల వదలుచుండెను. సూకరమాబాణముల నుపాయముగ దప్పించుకొనుచు, నొకసారి గోచరింపుచు నొకసారి యదృశ్యమగుచు నావన మంతయు ద్రిప్పుచు, రాజునకు కోపము నినుమడింపజేసెను. మఱియు తప్పు త్రోవల బ్రవేశపెట్టుచు వనమంతయుత్రిప్పి యలయించెను. క్రోధపరవశుడైన రాజు మృగమును వెంటాడుచు, నొకమహారణ్యమున బ్రవేశించి, అలసిసొలసి, ఎట్టైన నీమృగమునుబట్టుదునన నామృగము రాజు క్రోధమునుజూచి భయపడి, గంభీరమగు నొకగుహయందు దూరి యదృశ్యమైపోయెను. ఆగుహ, అంధకార బంధురమై, సరియగు మార్గములేక దురవగాహమై యుండెను. రాజు దానిం జూచి చేయునదిలేక ఖిన్నుడై కొంతతడ వటవిశ్రమించి, మఱల తాను వచ్చిన తావునకు బోదలచి చూచిన నటమార్గమేదియు నగపడకుండెను. రాజు తన యవివేకమునకు దురపిల్లుచు, డప్పిగొనినవాడగుటచే జలము నన్వేషింపుచు నటునిటు దిరుగుచు నందొక యాశ్రమమును జూచెను. అందొకరాజు మునివే షముతో నివసించుచుండెను. ఆరాజు సంపదనంతను ప్రతాపభానుడిదివరలో హరించియుండెను. అతనిప్రతాపమున కాగలేక అతని కొదిగియుండుట కిష్టము లేక, రాజ్యమును విడిచి, ఏకాకిగ నరణ్యమునందు మునివేషధారియై సంచరిం పుచు, ప్రతాపభానుడు వేటకొఱ కిటుకు బంటురిగ నెప్పుడేని వచ్చిన నాతనిని

భంజింపవలయునని కాచుకొని యుండెను. ప్రతాపభానుని, కపటమునివెంటనే తెలిసికొనెను. మునివేషమును ధరించుటచే రాజాతనిని గ్రహింపజాలకుండెను. గుఱ్ఱమును దిగి మునికి నమస్కరించి, తన పేరునుమాత్రము చెప్పక తన యాకలిని దప్పికను ఆతనికి వెల్లడించెను. ముని రాజునకొకసరోవరమును జూపెను. అద్దానిం జూచి ప్రసన్నుడై, అందు స్నానమాచరించి, తానును యశ్వమును దప్పిదీర్చుకొని మార్గాయాసమును దీర్చుకొనుటకు మఱల నాయాశ్రమమునకు వచ్చెను. ఆముని యాసనమిచ్చి యాదరించెను. అంతలో సూర్యుడస్తమించెను. రాజుతో ముని ఇట్లనెను. ఓరాజా! నీవొంటరిగ నీయరణ్యమున సంచరించుటకు కారణమేమి? ఈసుందరమైన యీవనమందిట్లేల కష్టపడుచుంటివి? నీయందు చక్రవర్తిలక్షణములగుపడుచున్నవి. నిన్ను జూడ జాలికలుగుచున్నది. అని పలుక, ఓమునిశేఖరా! యీభూభాగమును పరిపాలించెడి ప్రతాపసేనుడను రారాజు కలడు. నేనతని మంత్రిని. మాబోంట్లకు తమవంటిమహాత్ముల దర్శనము దుర్లభము. ఇది నామంచికొఱకే వచ్చినదని సంతసించుచుంటిని. అనవిని ముని యిట్లనియె. తండ్రీ! ఇప్పుడు చీకటిపడినది. మీగ్రామమిచటికి డెబ్బదియోజనముల దూరము నందున్నది. ప్రయాణమున కీచీకటిలో దారి యగపడదు. కాన నీరేయి యిటనాగి ప్రొద్దుననే బయలుదేరి వెళ్ళుము అనెను. ఓభరద్వాజా! ఈతడు, వేటకై రానేల! వచ్చినను ద్రోవను తప్పుటేల? ఆసూకరమును వెంటాడనేల? ఈకపటమునియాశ్రమము జేరనేల? చేరినను, ఆదినమచట నాగనేల? ప్రారబ్ధమునుబట్టి ఎట్టివాడైనను సుఖదుఃఖముల ననుభవింపక తప్పదు. కర్మఫలము ఇంటనున్నను, అరణ్యమందున్నను అనుభవించితీరవలయును. ఆమునిపలుకుల విని, రాజు సంతసించి, శిరమువంచి, నమస్కరించి, మీయాజ్ఞానుసారముగ చేయుదునని పలుకుచు, గుఱ్ఱమునొకచెట్టునకుగట్టి మునివద్ద కూరుచుండెను. ఆముని ననేకవిధముల ప్రశంసించుచు, వాని పాదములకు నమస్కరించుచు, ముని సందర్శనభాగ్యమును కొనియాడుచు, మృదుమధురవాక్యములతో నిట్లనెను. ఓప్రభూ! మీరు నాకు పితృతుల్యులు. మీరు నన్ను పుత్రునిగ, సేవకునిగ ననుగ్రహించి, మీపేరును నాకు దెలుపవేడుకొనుచుంటిని, అని సవినయముగ ప్రార్థించెను. మునిని రాజు గుర్తించుటలేదుకాని, ముని రాజును గుర్తించెను. రాజు

చిత్తము పరిశుద్ధమైనది. ముని మానసము కపటాసూయాభరితము. రాజు తనకు సహాజశత్రువు. మఱియు క్షత్రియుడు. తనకు వశవర్తి. ఇనియన్నియు తన కార్యసిద్ధికి అనుకూలముగనున్నవి. ఈరాజు రాజ్యమునంతను నిష్కంటకముగ ననుభవించుచు సుఖించుచున్నవాడని, ఓర్వలేనితనముచే నతనిహృదయము, ఉఖాగ్నివలె లోలోపల దగ్ధమగుచుండెను. ముని వేషమువలన సహాజసిద్ధమగువైర మెట్లుపోవును? నృపుని నిష్కపటాలాపమును విని, తన శఠత్వమును దలంచుకొని, లోలోన సంతసించుచు, కపటమును పన్నుచు, యుక్తియుక్తముగ మృదుభాషణముల నిట్లనియె. ఓతండ్రీ! నాపేరును జెప్పుటకేమున్నది? నన్ను నిర్ధననిర్గ్రాహుడు (బికారి) అని పిలుతురని ముని చెప్పరాజిట్లనియె. ప్రభూ! తమరు విజ్ఞాననిధులు, నిరభిమానులు, తత్త్వవేత్తలు నయిన మీరు మీనిజస్వరూపమును వెల్లడిచేయరు. సత్యస్వభావులెన్నడును కువేషధారులుకారు. సత్పురుషులను వేదముసయితము ప్రశంసించుచున్నది. భగవంతుడు దరిద్రులనే ఎక్కువగ ప్రేమించుచుండును. భగవంతుని దృష్టముగనమ్మినవానిని, సర్వసంపదలనశింపజేసి, కష్టములపాలొనర్చి, పరీక్షించితనపరీక్షకాగినవానికి, మఱిలసర్వసంపదలనొసగి తుదకుమోక్షసామ్రాజ్యమునొసగును. కాన మిమ్ముల ద్రిమూర్తులు కాపాడెదరు. అనిరాజుపలుక నాతనిస్వాభావికప్రేమను, తనయందలి దృఢవిశ్వాసమునుజూచి, ధైర్యము నవలంబించి, మిక్కిలిస్నేహముకలవానివలె నటించుచు రాజుతో నిట్లనియె. రాజా! నేను నిక్కముచక్కాణింపుచుంటిని. నేనిట చాలకాలమునుండి నివసింపుచుంటిని. ఇంతవఱకు నేనొకనిని కలియుటకాని, ననొ్నకడు కలియుటకాని జరిగియుండుటలేదు. ఏలనన లౌకికవ్యాపారములనెడి మహారణ్యమును దహించుటకు తపస్సు దావాగ్నివంటిది. దాన నితరసంసర్గమును మాని తపమాచరింపుచుంటిని. నెమలి తనపించమునువిప్పి, నాట్యమునుజేయుచు, అమృతతుల్యములగు కేకారావములజేయుచు, ఎట్టిసర్పములనైన వశపఱచుకొని భుజించుచుండును. అట్లే కాపురుషులు సాధువేషములబూని యెట్టివారినైనను మాయచేసి వారికపకారమునొనర్చెదరు. రాజా! పైకారణములచే ప్రపంచసంసర్గములు విడిచి, ఇటనుండి భగవత్సేవకు సరియగునదేదియు లేదనిగ్రహించి, తప మాచరింపుచుంటిని. నీవు స్వచ్ఛస్వభావుడవు. బుద్ధిమంతుడవు. నేననిన నీకుమిక్కిలిప్రేమ. ఇక

దాపరిక మేల ! నీవంటివానివద్ద ననృతమునాడిన నాకు మహాపాపము వచ్చును. నాస్థితినంతను మర్మములేక జెప్పెదవినుము. నాపేరు ఏకతనువు. అనగా సృష్టిప్రారంభమునుండి యింతవఱకు నీతనువుతో నుంటిని. ఇందాశ్చర్య మేమి యులేదు. తపఃప్రభావముచేతనే నేనిట్లుంటిని. తపోబలముచేతనే బ్రహ్మ దులు సృష్టిస్థితిలయములను జేయుచున్నారు. అని చెప్పుచు ముని, రాజును పూర్తిగ నమ్మించి, కర్మలగూర్చియు, వైరాగ్యమును గూర్చియు ననేకేతి హాసములజెప్పుచు, జ్ఞానాజ్ఞానముల వివరించుచు, సృష్టిస్థితిలయములగూర్చి యద్భుతోపన్యాసముల గావించుచుండెను. దీనినంతను వినినకొలది రాజు నకు మునియందు విశ్వాసము మెండగుచుండెను. త్రికరణశుద్ధిగా నతనిని నమ్మి యతనికివశుడై, మర్మములేక తనపేరును వెల్లడించెను. రాజా ! నా తపోబలముచే నీపేరును నీస్వరూపమును ఇదివఱకే దెలిసికొంటిని. నన్నెర గక నీపేరును దాచియుంచితివి. నీస్వభావమును, ప్రేమను, నైపుణ్యమును, జూచి నాకు నీయందు వాత్సల్యము పెరుగుచున్నది. కాన నీవేదడిగినను జెప్పె దను. నిస్సందేహముగ నడుగుము. అని మునిపలుక రాజుసంతసించి, మునివర్యా, నీదర్శనభాగ్యముచే, చతుర్విధపురుషార్థములు, నాకు హస్తగతములు అయినను మీకు నాయం దుదయించినవాత్సల్యమును బట్టి, మిమ్మల నొక దుర్లభమగు వరమును కోరదలచితిని. జరామరణదుఃఖములు లేకుండుట ; యుద్ధమం దజేయుడనగుట, శత్రురహితుడనై నిష్కంటకముగ నూరుకల్ప ములవఱకు నేకచ్ఛత్రాధిపత్యమును బొందుట నాకు కావలయును. అనవిని తపస్వి ఇట్లనియె. రాజా ! నీకోరిక సిద్ధించును. కాని దీనికొక కఠిననియ మము మాత్రమున్నది. ఒక బ్రాహ్మణకులముతప్ప మిగిలిన దంతయు నీకు పాదాక్రాంతము కాగలదు. బ్రాహ్మణులు తపఃప్రభావముచే సదా బలవంతులు. వారి కోపమునుండి రక్షించువా రెవరును లేరు. బ్రాహ్మ ణులకు ముల్లోకములు, త్రిమూర్తులును, వశవర్తులు. కాన బ్రాహ్మణసంత ర్పణము చేసినకొలది నీకార్యములన్నియు సులభముగ సిద్ధించును. బ్రాహ్మ ణానుగ్రహపాత్రుడవగు నిన్ను, బ్రాహ్మణశాపము దక్కనింకేదియు నశింప జేయజాలదు. అన విని రాజిట్లనియె. ఓమునీంద్రా, బ్రాహ్మణసంతుష్టిచే నాకు వినాశము సంభవింపదు. వారి యాశీర్వాదమే నాకు రక్షకము. మీకృపచే

నాకు శుభమగును. కాన మీరెట్లు శలవిచ్చిన నట్లుచేయువాడ నన నాకపట
మని యిట్లనియె. ఓరాజా! నీవీయరణ్యమునకు వేటకు వచ్చిన ట్లితరులకు
దెలిసిన నీకు దోషము సంభవించును. మన సంభాషణము నితరులతో జెప్పిన
యెడల నీకోరిక ఫలింపకపోవుటయెకాక, నీవీయరణ్యమందు నశించెదవు. ఈనా
వాక్కులు సత్యమని నమ్ముము. నావాక్కుల బ్రకటించినచో నీకు ద్విజశాపము
తప్పదు. ద్విజుల కాగ్రహము వచ్చిన, హరిహరాదులైనను రక్షింపజాలరు.
కాన నెల్లకాలము బ్రాహ్మణసమారాధనను జేయుచు, వారి యాశీస్సుల నంది
తివేని నీకోరిక లీడేరు నన విని రాజిట్లనియె. మానివర్యా! మీరు నుడివినది
సత్యము. బ్రాహ్మణ కోపము గురువుల కోపము నెవరు సమర్థింపగలరు. దేవుడు
కోపగించిన గురువు రక్షించును. గురువు కోపగించిన రక్షింప నెవ్వరును సమర్థులు
కాజాలరు. మీమాటను నేనెన్నడును మఱవను. నేనెందుకును భయపడను.
కాని బ్రాహ్మణశాపమునకు భయపడుదును. కాన బ్రాహ్మణులు నాకెట్లువశు
లగుదురో శలవీయవలెను. బ్రాహ్మణసమారాధనముల తాము దగ్గరనుండి
చేయింపవలయును. అన విని యామాముని యిట్లనియె. రాజా! ప్రపంచమున తర
ణోపాయము లనేకములు కలవు. నాకొక యుపాయము దోచుచున్నది. అది
కొంచెము తేలికగను, కఠినముగను ఉన్నది. ఆకార్యమును నేను నెరవేర్పగలను
కాని, నేను పుట్టినది మొదలు నేటివఱకు నేగ్రామమునకును వెళ్ళియుండుట
లేదు. మీపట్టణ మెటనున్నది నేనెఱుగను. నీవు తలపెట్టిన పని చాల కఠిన
మైనది. మీగ్రామమునకు వచ్చుటకు నాకు వీలులేదు. నేను రాకున్న నీకార్యము
సమకూడదు. అనిన రాజిట్లనియె. ఓమునిపుంగవా, నాయందు దయయుంచి
యీదీనుని రక్షింపుడు. మహాత్ము లెన్నడును నీచులనియు, మంచివారనియు
భావింపక సమానప్రేమను జూపుదురు. పర్వతము అతి లఘువైన తృణమును
తన శిరస్సునందు ధరించును. అగాధమగు సముద్రము అతి సూక్ష్మమయిన
నురుగును భరించుచుండును. భూజము లతిశాంతముతో ధూళిని ధరించు
న్నవి. కాన సర్వసమర్థులగు మీకు నశక్య మేమున్నది. మీబోంట్లకు భేద
భావ ముండదు. అను నాతని దీనాలాపముల విని, రాజు తనకు వశుడగుట
నెరింగి, ధూర్తశిరోమణియగు మాయాతపస్వి ఇట్లనియె. రాజా! నీవింత
విధేయతతో బలుకుచుంటివి కాన జెప్పుచుంటిని. నాకసాధ్య మెందును లేదు.

నన్ను నీవు త్రికరణశుద్ధిగ నమ్ముకొంటివి కాన నేను నీపనిని నెరవేర్చెదను. నేను తపఃప్రభావముచే నీకు ఫలమును జూపించెదను. నేను భోజనమునకు వంటకముల దయారుచేసెదను. ఇతరు లెవరును నన్ను తెలిసికొనజాలరు. నేవండిన వంటక ముల నెవరు భుజించెదరో వారందఱు నీకు వశులగుదురు. కాన నిత్యము నొక లక్షబ్రాహ్మణుల నాహ్వానము చేయుము. ప్రతిదినము క్రొత్తక్రొత్తవారు సకు టుంబముగ రావలయును. నేను నీసంకల్పము సిద్ధించునంతవఱకు నాతపోబల ముచే వంటకముల జేయించి ప్రతిదినము సిద్ధముచేసి యుంచెదను. ఇట్టి స్వల్ప క్లేశమువలన బ్రాహ్మణు లందఱు నీకు వశులగుదురు. బ్రాహ్మణులు యజ్ఞ ముల జేయుదురు కాన దేవతలు బ్రాహ్మణులకు వశులై యుండెదరు. ఇట్లు దేవబ్రాహ్మణులు నీకు వశులగుటచే నీకార్యము తప్పక సిద్ధించును. ఇంకొక మాటను వినుము. నేనీకూపముతో నెన్నడును నీరాజ్యమునకు రాజాలను. నాప్రభావముచే నీపురోహితునకు నారూపము నిచ్చి, వాని రూపమును నేను గ్రహించి, ఒకసంవత్సరము నీగృహమున వసించి, సర్వవిధముల నీకనుకూలుడనై నీసర్వకార్యముల నెరవేర్చెదను. ఇది నిజము, నమ్ముము. ఇప్పటికి రాత్రి చాల గడచినది. నీవిక నిదురింపుము. నేను దినత్రయములో నిన్ను కలియగలను. నాతపఃప్రభావముచే నిన్నును నీయశ్వమును సురక్షితముగ నిల్లు జేర్చెదను. నేను నీపురోహితవేషమును ధరించి యటకు వచ్చెదను. నీవు నన్ను గుర్తించి, నీరహస్యవిషయముల నన్నిటిని యేకాంతమున నీవు నాతో జెప్పవలయును. అని చెప్ప రాజు ముని యాజ్ఞానుసారముగ నిదురించుచుండెను. ఆకపటముని తన యాసనముమీద కూర్చుండి ఏదియో చింతింపుచుండెను. అంతలో కాల కేతుడను రాక్షసు డటకు వచ్చెను. వెనుక సూకరవేషమున రాజును మోస గించినవా డితడే. ఈతడు నామాయాతపస్వియు మిక్కిలి మైత్రితో మెలగు చుందురు. ఆరాక్షసు డనేకమాయల నెరిగినవాడు. ఈతనికి నూఱుగురు పుత్రులు, పదుగురు సోదరులును కలరు. వారు మిక్కిలి దుష్టులై ప్రవర్తిం చుచు, దేవతలను పీడించుచు, బ్రాహ్మణుల హింసింపుచు, సత్పురుషుల బాధిం పుచు నుండిరి. వార లందఱు నీప్రతాపభానుడు యుద్ధమున సంహరించెను. ఈతడుమాత్ర మెట్లోతప్పించుకొని పారిపోయి ప్రాణముల దక్కించుకొని, రాజుపై పగసాధింపవలెనని ప్రయత్నించుచుండెను. కావుననే యీతడు

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc.No.

మాయామునియు మిత్రుఁడై, రాజుపై పగసాధింప జూచుచుండిరి. వీరి యాలో చనల నిదురించుచుండిన రా జేమియు నెరుగడు. ఎంతవిశిష్టుఁడైనను ఒంటరిగా నున్నప్పుడు శత్రువుచేత బడవలయునుగదా! బలవంతుడగు శత్రువు నిదురించు చున్నను నిర్లక్ష్యము చేయరాదు. ఈతని పేరును వినినంతనే మిక్కిలి భయమగు చున్నది. రాహు కేతువులు స్వల్పపరిమాణము కలవారైనను సూర్యచంద్రులను క్షణములో గ్రసింతురు. అటులనే ఈతడు ఒంటరివాడైనను మనలను బాధించు నేమో యని భీతి కలుగుచున్న దని కపటమునిరాక్షసునితో మిత్రభావమున దనకు రాజునకును జరిగిన సంభాషణముల నన్నిటిని సవిస్తరముగ జెప్పి, తనకు బూర్వము జరిగిన యవమానమును విన్నవించుకొనుచు, ప్రతాపభానుని ద్రోహమునకు దగిన పన్నుగడల బన్నుచుండెను. ఆమాటలవిని రాక్షసుడు మండిపడుచు, తనపూర్వవైరమునుస్మరించుకొని, ఓరాజా! నీశత్రువును క్షణములో సవంశబాంధవముగ నిర్మూలించెదను. ఔషధములేకయే రోగము నివారించి నట్లు ఇతరసహాయము లేకయే నీశత్రుకులమును నాశనముజేసి నాలుగుదినము లలో మరలనిన్ను కలియగలను. అనేకమాయలపన్నుశక్తి నాకుగలదు. నీ వించు కంతయు భయపడనక్కరలేదు. నీవికకడనేయుండుము. నే నన్నిపనులను చక్కపఱచి వచ్చెదను. ఇట్లారాక్షసుడు మాయాతపస్విని సంతసపఱచి, మహా కపటియు, మహాక్రోధియు, నగునానిశాచరుడు తనపనిని సాధించుటకు వెడలి పోయెను. రాక్షసుడు తన మాయాబలముచే ప్రతాపభానుని రాణివాసమందిర మునశయనింపజేసి, గుఱ్ఱమును గుఱ్ఱపుసాలయందు బంధించియుండెను. పిమ్మట రాజపురోహితుని దొంగలించి, వానిబుద్ధిని మందగింపజేసి, ఒకపర్వతగుహ యందుదాచి, తానాపురోహితవేషమును ధరించి, తానొకశయ్యమీద నిదు రించుచున్నట్లు నటించుచుండెను. ఇంతలో సూర్యుడుదయించెను. రాజు కనులదెరచి చూచువరకు, తనకోట, తనపరివారము అగపడుచుండెను. దాని నంతనుజూచి యాశ్చర్యచకితుడై, ఇదియంతయు నామునియొక్క మహిమయే యని సంతసించుచు, లేచి కోటయం దంతటను ద్రిమ్మరుచుండెను. అశ్వశా లను కనుగొన తానధిష్ఠించినయశ్వ మందుగాననయ్యెను. రాజాయశ్వము నధి ష్ఠించి యరణ్యమునకుజని అందెచ్చటను మునిని గానక మఱల మధ్యాహ్నసమ యమునకు తిరిగిరా బురవాసులందఱు నతనిరాకచూచి మంగళతూర్యధ్వని

JAIROMEM LIBRARY

పురస్సరముగ పురములోనికి దోడికొనివచ్చిరి. రాజు పురోహితునిజూచి సంత సించి, తానుచేయవలసిన వ్రతము జ్ఞప్తికిరాగా మునిశలవిచ్చిన దినత్రయ మెప్పుడువచ్చునాయని నిరీక్షింపుచు దినమునొకయుగముగ గడపుచుండెను. కపటమునిరాజుయొక్క బుద్ధినంతను మార్చివేసెను. అహర్నిశము లామునివచనములనె తలపోయుచు, కాలక్షేపము చేయుచుండనంత సమయమునదెలిసికొని పురోహితవేషముతో నున్న మాయావి, రాజునొద్దకువచ్చి, తానె యామునినని నమ్మించి ముందుపనిని శ్రద్ధగాజేయవలెనని, బోధించిచెప్పుచుండ నారాజునకంతయు జ్ఞప్తికివచ్చి యాతడే తనగురువని నమ్మి మహదానందము నందుచు, నాతనిశక్తికచ్చెరువందుచు, నిశ్చేష్టుడై, మాటిమాటికి గురుని మహిమను, దలపోయుచు, లేచి ఒకలక్షబ్రాహ్మణులను కుటుంబసహితుల నాహ్వానించెను. పురోహితుడు కావలసినవంటకముల దయారుచేయుచు షడ్రసో పేతములగు చతుర్విధాన్నములను, పిండివంటలను తయారుచేయుచుండెను. అం దనేకవిధములై నమృగమాంసములనుబ్రాహ్మణమాంసములతోకలిసివంటకముల సిద్ధముచేయించెను. పిలిచిన బ్రాహ్మణులందఱును వచ్చి స్నానమాచరించి యను స్థానముల దీర్చికొని, సంసిద్ధులై యుండిరి. రాజాబ్రాహ్మణులవద్దకు వచ్చి వారలసగౌరముగ సత్కరించి, పంక్తులుపంక్తులుగ గూరుచుండ నియమించి, నండినమృష్టాన్నములను వడ్డింపజేసి, తాను సంతోషముగనుండు సమయమునం దశరీరవాణి ఇట్లనియె. ఓబ్రాహ్మణులారా, యీపదార్థముల ముట్టకుడు. వెంటనే లేచి మీమీయిండ్లకుపొండు. దీనిని దినిన హానికలుగును. ఇది బ్రాహ్మణమాంసముచే తయారైనది. అని గంభీరముగ బల్కి విని వారందరు నొక్కసారిగ లేచిపోయిరి. వ్యాకులచిత్తుడగు రాజునోటినుండి మాటవచ్చుట లేదు. దీనినంతను రాజే చేయించెనని నమ్మి, సత్యము నాలోచింపక, బ్రాహ్మణు లిట్లనిరి. ఓరాజా! నీవు చేసిన యీఘాతుకకృత్యమునకు సకుటుంబ బంధు మిత్రసహితముగ రాక్షసయోనియందు జన్మింపుము. నీవు కుటుంబసహితముగ బ్రాహ్మణుల రావించి మోసగించితివి. కాన సబాంధవముగ నశింపుము. నీకు తిలోదకములనిచ్చువారుసయితము లేకుందురుగాక యని శపించిరి. రాజా వాక్యముల విని భయముచే గడగడ వడకసాగెను. అప్పుడాకాశవాణి మఱల నిట్లనెను. ఓద్విజోత్తములారా! మీరాలోచింపకయె నీరాజును శపియించితిరి.

ఈతడు నిర్దోషియన విని వారాశ్చర్యచకితులైరి. రాజు పాకశాలను జూడబోయెను. అట పాకకర్తకాని, పక్వాన్నములుకాని యేవియును లేవు. దానిని జూచి రాజు విస్మయమునందుచు, మనంబున నేదియో తలపోయుచు, జరిగిన దంతయు బ్రాహ్మణునకు విన్నవించి, భయభ్రాంతుడై వాని పాదములకు వందనమాచరింపుచు భూమిమీది కొరగెను. దానినంతను జూచి, రాజు నిర్దోషియని తెలిసికొని బ్రాహ్మణు లిట్లనిరి. రాజా! యిందు నీదోషమేమియులేదు. కాని బ్రాహ్మణశాప మమోఘము. దీనిని తప్పించుట కేరికిని తరముకాదు. కావున యనుభవించితీరవలయునని చెప్పుచు నాబ్రాహ్మణులు వెడలిపోయిరి. ఈవార్త పురమంతయు వ్యాపించెను. పౌరులీవార్తను విని దుఃఖించుచు విధాతను నిందింపసాగిరి. పురోహితవేషధారియగు నారాక్షసు డాకపటమునివద్దకేగి జరిగినదానినంతను జెప్పి నాతడావార్తవిని, దుష్టమగు తన పరివారమునంతను రావించి, కొండఱరాజుల జేర్చికొని, జయభేరులు మ్రోయింపుచు, ప్రతాపభానునిపురముపై దండెత్తివచ్చి యుద్ధముచేయ నారంభించెను. కర్మగతిచే మిత్రులుగూడ శత్రువులైరి. కాలవశమున బంధుమిత్ర సోదర సేనాసహితముగ ప్రతాపుడు అస్తమించెను. బ్రాహ్మణశాపముచే సత్యకేతుకులమందొక్కడైనను మిగులుటలేదు. ఇట్లు ప్రతాపభానుని జయించి యాతని పురమును వశపఱచుకొని రాజులందఱు తమతమ నిలయములం జేరికొనిరి. భరద్వాజా! ఎవనికైనను దైవము ప్రతికూలమగునపుడు, ధూళి పర్వతముగను తండ్రి శమనుడుగను, రజ్జువు సర్పముగను మారిపోవును. బ్రాహ్మణశాపముచే ప్రతాపభానునివారందఱును రాక్షసులై జన్మించిరి. అందు ప్రతాపభానుడు పది శిరస్సులు, నిరువది భుజములు కలిగి రావణుడను పేరుతో నగ్రజుడై జన్మించెను. అతని తమ్ముడగు నరిమర్దనుడు బలశాలియగు కుంభకర్ణుడై జన్మించెను. ఈతని మంత్రియగు ధర్మరుచి విభీషణుడై పుట్టెను. ఆతడు విష్ణుభక్తుడై మిక్కిలి జ్ఞానము కలవాడాయెను. రాజు పరివారమంతయు రావణానుచరులగు రాక్షసులైరి. వారు కామరూపులై, కుటిలవర్తనులై, భయంకరులై, మహాపాపులై, స్వేచ్ఛావిహారులై, ప్రపంచము నందంతటను సంచరించుచుండిరి. రావణ, కుంభకర్ణులిద్దఱును పవిత్రమైన పులస్త్యకులమునకు లపాంసనులై ద్విజశాపముచే దుష్ప్రవర్తనులై సంచరించుచుండిరి. ఈసోదరత్రయమును ఘోరాతి

ఘోరమగు తప మాచరించినది. బ్రహ్మ వారి తపస్సునకు మెచ్చి వరముల కోరుడన రావణుడిట్లనెను. ప్రభూ! నరవానరభిన్నమగు నేవ్యక్తిచేతను మృత్యువులేకుండు నట్లనుగ్రహింపుము. అన బ్రహ్మ దానికంగీకరించెను. తరువాత కుంభకర్ణునికడకేగి వానినిజూచి ఆశ్చర్యపడుచు, కుంభకర్ణా! నీ తపస్సునకు మెచ్చితిని. నీకు వలసిన వర మడుగు మనుచు, తనలో నిట్లనుకొనెను. ఈదుష్టుడు నిత్యము భుజించినచో నీసృష్టిచాలదు. కాన సరస్వతిని ప్రేరేపించి వీని బుద్ధిని మందగింపజేసి వంచించెదను. ఆమెను ప్రేరేపించి ఆరుమాసములు నిద్దుర యని పలికించెదను. అనుకొనెను. పిమ్మట వాడు నిద్దురయని కోరెను. అట్లే ఆరుమాసములు నిద్దుర ఒకరోజు మెలకువ యని వరమిచ్చి, విభీషణునివద్దకేగి, వరమడుగు మనెను. విభీషణుడంత సంతసించి, భగవత్పదకంజములందెల్లప్పుడు నచంచలమగు ననురాగము కలుగునట్లనుగ్రహింపుమన బ్రహ్మ సంతసించి అట్లేయగునని యదృశ్యుడయ్యెను. ఇట్లు సఫలమనోరథులై సోదరులు ముగ్గురు నిజనివాసంబుల కరుదెంచిరి. అంత మయుడు తన కూతురైన మండోదరియను కన్యారత్నమును దెచ్చి రావణునికిచ్చి వివాహము చేసెను. అమెయె యాతనికి పట్టమహిషి. మఱియు ననేక కన్యారత్నములను గ్రహించి తాను వివాహమాడి, తన తమ్ముల కిద్దఱకును తగుకన్నెల పాణిగ్రహణము చేయించెను. సముద్ర మధ్యమునం దొకత్రికూటమను పర్వతరాజము కలదు. అందేరికిని ప్రవేశింప వీలులేదు. అందు మయుడు రత్నఖచితము, సువర్ణప్రాకారశోభితము, వర్ణనాతీతమునగు గొప్పపట్టణమును నిర్మించెను. అది భోగవతిని, స్వర్గమును మించిన శోభకలదై, లంకయనుపేర ప్రసిద్ధమై యుండెను. దానికి సముద్రమే పరిఖ. అది స్వర్ణప్రాకారశోభితము, మణికుట్టిమోపేతమునై, వర్ణనాతీతముగ నుండెను. ఒకప్పుడు శూరులును, బాహుబలసంపన్నులును, కరాళరాక్షసనా పరివృతులగు రాక్షసరాజు లట నివసించెడివారు. వారల నందఱను యుద్ధమున జంపి, ఇంద్రుడు కుబేరుని ప్రోత్సహించి సానుచరముగ నాపట్టణమును గాపాడ నియమించెను. ఈసమాచారమును రావణుడు విని, లంకను ముట్టడించి యుద్ధమునందు యక్షుల పారద్రోలి లంకనాక్రమించుకొనెను. రావణుడాలంకాపట్టణముయొక్క సౌభాగ్యమును జూచి యచ్చెరువందుచు, సంతసించుచు తన నివాసమున కది యనువగు తావని నిర్ణయించి, దానిని

తన రాజధానిగ జేసికొని యట నివసించుచుండెను. తన పరివారమునకు, సేన లకు తగిన గృహముల నిర్మింపజేసి వారలనం దుండున ట్లాజ్ఞాపించెను. వారా పట్టణ శోభను, సంపత్తును జూచి మిగుల నానందించుచుండిరి. ఒకనాడు రావ ణుడు కుబేరుని జయించి యాతని విమానమును వశపఱచుకొనెను. మఱియొక ప్పుడు కైలాసమునెత్తి తనభుజబలమునకు గర్వించుచుండెను. ఆతనికి సుఖము, సంపద, పుత్రులు, సైన్యము, పరాక్రమము మున్నగునవి దినదినాభివృద్ధి నంగు చుండెను. ఎప్పటికప్పుడు నిత్యనవీనవస్తుసమృద్ధి చేకూరుచుండెను. వానితో పాటు లోభమును పెరుగుచుండెను. ఆతని తమ్ముడగు కుంభకర్ణుడు నిరుపమాన పరాక్రమశాలి. ఈతడు మద్యపానముచేసి ఆఱుమాసములు నిద్రించి, మేలొక్క నినతోడనే యాహారము చేయుచు, దృష్టికి గోచరించినదానిని భ్రమింగుచు నతిభయంకరుడై యుండును. మేఘనాదుడు రావణుని జ్యేష్ఠపుత్రుడు. ఈతడు యోధాగ్రణి. ఇతనిని యుద్ధమున జయించు వీరులు లేరు. ఈత డింద్రుని జయించి ఇంద్రజిత్తు అను బిరుదము నందినవాడు. అకంపన, ధూమకేత్వాది కాయ, వజ్రదంష్ట్రాద్యనుచరులతో గూడి రావణుడు ప్రపంచము నంతను జయించి వచ్చుచుండెడివాడు. కామరూపియై, మాయావియై, స్వప్నమునం దైనను దయాదాక్షిణ్యముల నెరుగక, తిరుగుచు నొకనాడు సభామధ్యమున గూరుచుండి, తన పరివారమును, పుత్రులను, సేవకులను, దండనాథులను, అసంఖ్యాకమగు రాక్షసానీకమును జూచి, గర్వించి, మదక్రోధము లినుమడింప నిట్లనియె. రాక్షసులారా! వినుడు. దేవతలు మనకు సహజశత్రువులు. వారు మనబలము నోర్వలేక పారిపోవుచున్నారు. యుద్ధమునకు వచ్చుటలేదు. ఎట్లయినను వారిని నిర్మూలింపవలయును. కాన యాగహోమతపోదానా దుల లేకుండ జేయుడు. అట్లయిన దేవతలు ఆకలిచే కృశించి బలహీనులై క్రమముగ నశింతురు. అని పలికి మేఘనాదుని బిలిచి, పుత్రా! శత్రువుల జయించుటకు తగినశిక్షను నీవందితివి. నీవు తపస్సుజేసి బ్రహ్మాస్త్రమును సంపాదించితివి. దేవతలు యుద్ధనిపుణులు. బలవంతులు. కాన వారి నెట్ల యిన జయించి బంధించి తీసికొని రమ్ము. లెమ్ము, ఆలసింపకుము. అన విని మేఘనాదుడు తండ్రి యాజ్ఞానుసారముగ సేనాసమేతుడై బయలుదేరెను. ఇట్లాతనిని ప్రోత్సహించి తానును గదాపాణియై సింహగర్జనముల జేయుచు

బయలుదేరెను. ఆతని సన్నాహమునకు భూమి వడకుచుండెను. సముద్రములు ఘూర్ణిల్లెను. కులపర్వతములు చలించుచుండెను. దేవత లీగర్జనములను విని మేరుగుహాలందు దాగుకొనుచుండిరి. లోకమంతయు రావణునికి వశమయ్యెను. సంగ్రామప్రియుడగు రావణుడు లోకముల గ్రుమ్మరుచు తనకు తగిన ప్రతివీరుని యెందును గానక, నిర్విణ్ణుడై సూర్యచంద్రులను అష్టదిక్పతులను, యక్ష కిన్నర కింపురుషాదులను, నాగులను, వీరువారనలేల, నందఱను జయించెను. ఇట్లు సకల ప్రపంచమును స్వాధీనము చేసికొని, వారల నెల్ల దన కింకరులజేసి స్వాతంత్ర్యమనునది ఏరికిని లేకుండజేసి, రాజాధిరాజై పాలింపు చుండెను. మాండవికుడనుముని రావణునకు హితోపదేష్టగ నుండెను. దేవ యక్షకిన్నర నాగమనుష్యులందలి సుందరాంగులను తనభుజబలముచే గైకొని వివాహమాడుచుండెను. మేఘనాదుడును తండ్రియాజ్ఞానుసారముగ బయలు దేరి, దేవతలభంజించుచు, బహువిధమాయల బన్నుచు ధర్మనిర్మూలనము చేయుచు, వేదవిరుద్ధాచరణముల గావింపుచు, గోబ్రాహ్మణుల హింసించుచు శుభకర్మల నశింపజేయుచు, యజ్ఞాదులనిరోధించి, తపస్సులనరికట్టి, దానధ ర్మముల కడ్డుపడుచు, సేనాసమేతుడై ప్రపంచమునంతను గ్రుమ్మరుచు, తండ్రిని మించినవాడాయెను. రావణుడును, తనపుత్రునిచేతకు తృప్తినందక తానును, సాధులహింసించుచు, తపములచెఱచుచు, యజ్ఞముల ధ్వంసముచేయుచు యోగులభంజింపుచు, ధర్మపదముల కడ్డుతగులుచు, వర్ణసాంకర్యమును గల్పిం చుచు, గణనాతీతములగు దుష్కార్యముల నాచరించుచుండెను. పరస్త్రీపరధన ములు వానికి ఖండశర్కర. దేవబ్రాహ్మణహింస వానికి నిత్యోత్సవము. గురు దేవభక్తులగు సజ్జను లాతనిపాదదాసులు. వేయేల! అతడుచేయని దుష్కా ర్యములేదు. ఈదుష్టరాక్షసగణముల భరింపజాలక భూదేవి ఇట్లుతలపోయనా రంభించెను. వృక్షములు, నదులు, పర్వతములును నాకేమియు భారమనిపిం చుటలేదుకాని, యీదుష్టరాక్షసగణమును, మోయజాలకుంటిని. దీనికేదేని యుపాయము నాలోచింపవలయునని తలంచుచు గోరూపమును ధరించి, దేవతలుండెడి తావునకుబోయి వారికి తనబాధ నెరిగించెను. వారేమియు జేయజాలక, గోరూపధారిణియగు భూమిని వెంటనిడికొని, కమలాసనునికడ కేగిరి. బ్రహ్మ వారలనాదరించి వారిరాకకు కారణమరసి తెలిసికొని, ఇట

తాజేయునదేమియు లేదని, నిశ్చయించి వారలతోనిట్లనియె. ఓ భూదేవీ! దేవతలారా! విచారింపకుడు. మనలనందర రక్షించుపరమేశుడు వైకుంఠమునందున్నాడు. ఆతడు మీబాధల దప్పకమాన్పును. ధైర్యమునవలంబించి భగవంతుని భజించిన నెట్టిదారుణందుఃఖమునైనను నశించును. మనమిప్పుడా యవినాశియగు ప్రభువునొద్దకు జనవలెనన దేవతలందఱు సావధానులై చింతింప మొదలిడిరి. ఆభగవంతు డెటనుండును! మనమిపు డెట్లేగవలయును? అంత కొంద ఱిట్లనిరి. ఆభగవంతుడు వైకుంఠమునం దుండును. మఱికొందరు క్షీరసాగర మనుచుండిరి. ఎవరియందు భక్తిప్రేమవిశ్వాసము లుండునో, అట్టిమహాత్ముల హృదయపీఠమం దుండునని కొందఱనిరి. పార్వతీ! నేనుగూడ నటనుంటిని. కాననాకు తోచినరీతిని నేనిట్లంటిని. భగవంతునిసంగతి నాకు కొంతవఱకు దెలియును. అతడు సర్వవ్యాపకుడు. ప్రహ్లాదుడు చెప్పినట్లు పిపీలికాదిబ్రహ్మ పర్యంతము భూనభోంతరాళమునందు, సర్వదిక్కులందును వ్యాపించియుండును. అతడులేని స్థలమేలేదు. అతడు రాగద్వేషశూన్యుడు. అతడు భక్తులకోరి కల సిడేర్చుచు వారికి దర్శన మిచ్చుచుండును. కాష్ఠద్వయసంఘర్షముచే నగ్నియుద్భవిల్లినట్లు, తీవ్రమగుభక్తిప్రేమలచే భగవంతుడు ప్రత్యక్షముకా గల డనునావాక్యములవిని దేవతలందఱును సంతసించిరి. బ్రహ్మయు నావా క్యములభశంసించి, మనమునందత్యానందమంది, పులకితగాత్రుడై, ఆనంద బాష్పములొలుక, స్థిరచిత్తుడై చేతులుజోడించి ఇట్లు స్తుతిచేయనారంభించెను. ఓజగత్ప్రభూ! సురనాయక! దీనజనరక్షకా! నీకు జయమగుగాత. ఓ గోబ్రా హ్మణహితకారీ! రాక్షసవైరీ! లక్ష్మీరమణా! నీకుజయమగుగాత. ఈభూభా రమునుమాన్పి దేవతలను కాపాడుము. నీవాద్యంతరహితుడవు. నీవేమిచేయు చుంటివో ఎవరికిని తెలియదు. కాని నీవు కృపానిధివనిమాత్రము తెలియును. ఓయవినాశీ! సర్వాంతర్యామీ! పరమానందస్వరూపా! ఓదేవదేవా! నీకు జయమగుగాత. మునులు రాగద్వేషములవిడిచి, మాయామోహాముల త్యజించి గాఢానురాగముతో సంతతము నిన్నుధ్యానింపుచు, నీగుణముల గానము చేయుదురు. వారలకే నీవుగాన్పింతువుకాని సాధారణులకు దర్శనమీయవు. ఓ సచ్చిదానందరూపా! ఇంద్రియాతీతా! నీకుజయమగుగాత! నీసహాయము చేతనే నేనొక్కడనైనను చతుర్విధభూతగ్రామములను సృజించుచుంటిని.

నాసృష్టిలోనివారల పాపపుణ్యములకు నీవేషలమునిచ్చుచుంటివి. నాకునిన్ను సేవించెడివిధాన మేమియుదెలియదు. సమస్తదేవతలు, భూదేవియు, నిన్ను సేవించుటకైవచ్చియున్నారు. వేదములు, సరస్వతియు, నాదిశేషుడు, ఋషులు నిన్ను స్తుతించుటయేకాని, నీ నిజస్వరూపమును దెలిసికొనలేకైరి. వారువేనో ళ్ళస్తుతించినను నీసంపూర్ణగుణముల వర్ణింపజాలరు. సంసారసాగరమును మథించుటకు నీవు మందరగిరివని, వేదములు ఘోషించుచున్నవి. మునులు, సిద్ధులు దేవతలు, అందఱును భక్తితో తమపాదకమలములకు నమస్కరింపనున్నారు. నీవొకసారి దర్శనమునీయ ప్రార్థింపుచుంటిని. వారికభయము నిచ్చువారిం కెవ్వరునులేరు. అని బ్రహ్మప్రార్థింప వారిదీనాలాపములవిని, దేవతలను, మునులను, భూదేవిని రక్షింపదలచి, దివ్యవాణి, స్నేహపూరిత గంభీరవాక్కులతో నిట్లనియె. ఓసిద్ధ, ముని, సురలారా! భయపడకుడు. మీకొఱకు నేను మానుష రూపమునుధరించి, సూర్యవంశమునందు జన్మించి, మిమ్ములనుద్ధరించెదను. మున్నదితికశ్యపులు నాకై కఠినమగు తపమాచరించిరి. వారికి నేను వరమిచ్చి యుంటిని. వారిప్పుడు కౌసల్యా దశరథరూపములతో నయోధ్యాపురమును బాలింపుచున్నారు. ఆదశరథునకు చతుర్విధపుత్రరూపమున బుట్టి మిమ్ము రక్షించెదను. ఇదివరలో నారదమునినాకిచ్చినశాప మిప్పు డుపయోగ మునకు వచ్చినది. నేను నాదిశక్తియు భూమియం దవతరించి, భూభార ముడిపి, మిమ్ముల గాపాడెదము. మీరందఱు నిర్భయులుకండు. అనునా మాటల విని, దేవాదు లందఱు నానందపరవశులైరి. ఆదివ్యవాక్యములు సత్యములు గాన నీవు భయపడవలదని బ్రహ్మ భూదేవి నోదార్చెను. భూదే వియు నూరడిల్లెను. బ్రహ్మ దేవతలను నిర్భయులుకండు. మీరందఱును స్వామి సేవకొరకు వానరులై భూలోకమున సంచరింపుచుండు డని యానతిచ్చెను. దేవతలందఱును బ్రహ్మవాక్యముల నంగీకరించి తమతమ నెలవులకు బోయిరి. భూదేవియు నిర్భయముగానుండెను. దేవతలందఱు వానరులై జన్మించి, బహు బలపరాక్రమవంతులై, వీరాగ్రేసరులై, తరు, దంత, నఖాయుధులై, స్థిరమన సుకలగుచు పరాత్పరుని యవతారమున కెదురుచూచుచు, వనములందు, పర్వ తములందును సంచరించుచు, కాలక్షేపము చేయుచుండిరి. పార్వతీ! ఈయద్భుత చరిత్రను వినుము. అయోధ్యాపురిని రఘువంశశిరోమణి యగు దశరథుడు

పాలింపుచుండెను. ఆతడు సుప్రసిద్ధమగు ఖ్యాతి కలవాడును, ధర్మజ్ఞాన గుణ నిధియు నై యుండెను. అతడు విష్ణుభక్తులలో నగ్రగణ్యుడు. అతనికి కౌసల్య, సుమిత్ర, కై కేయి, యను మువ్వురు భార్యలు కలరు. ఆరాణులు పతి యాజ్ఞానుసారము మెలంగుచు పరమేశ్వర చరణకమలములందు దృఢమైన భక్తి ప్రేమలు కలిగియుండిరి. ఆరాజునకు సంతానలోపము దప్ప మరి యేలోపమును లేదు. అతని కాలోపము హృదయశల్యమై బాధించుచుండెను. ఒకనా డాతడు తన గురుడగు వశిష్ఠుని గృహమున కేగి, వశిష్ఠుని దర్శించి సవినయముగ తన మనోవేదనను విన్నవించుకొనెను. గురు డాతని దీనోక్తుల నాలకించి తగు నుపాయమును జెప్పెదను. నీవూరడిల్లుము. త్రిభువనప్రసిద్ధులు, నార్తత్రాణపరాయణులు నగు నలుగురుపుత్రులు నీకుద్భవింతురు. ఋశ్యశృంగుని రావించి పుత్రకామేష్టిని చేయుమని చెప్పి దశరథునితో నామునిని గూడ బంపెను. దశరథుడొక శుభసమయమున బుత్రకామేష్టిని జేయబూని, ఋషుల నందఱి రావించి, ఋశ్యశృంగుని యాధ్వర్యమున నాక్రతువును ప్రారంభించెను. ఆముని భక్తిపురస్సరముగ నాహుతులర్పించుచున్న దేవుడు పాయసపాత్రముతో సాక్షాత్కరించెను. ఆదేవుని జూచి వశిష్ఠు డాశ్చర్యపడుచు పరమానందము నొంది, దశరథుని బిలిచి, రాజా! నిన్ననుగ్రహించి వీతిహోత్రుడు పాయసము నిడె దెచ్చియున్నాడు. దీనిని నీవు గ్రహించి యోగ్యమగు భాగములజేసి నీభార్యలకు పంచియిమ్మనునంతలో నావీతిహోత్రుడు అదృశ్యు డాయెను. దశరథు డిదంతయు జూచి సంభ్రమాశ్చర్యములచే పులకితగాత్రుడై యానందాశ్రువులొలుక గురు చరణములకు వందన మాచరించి తన సదనమునకు బోయి, మృదుమధుర మంగళకరములైన వాద్యముల వినుచు, శుభశకునంబుల గాంచుచు, తన రాణుల బిలువనంపెను. తోడనె వారును వచ్చిరి. అపుడు దశరథు డాపాయసమును రెండుభాగములుగ జేసి అందొకభాగమును కౌసల్యకిచ్చెను. మిగిలిన సగముభాగమును కై కేయికిచ్చెను. శేషించినభాగమును రెండుభాగములుగజేసి కౌసల్యా కైకలచే నాభాగములను సుమిత్ర కిప్పించెను. శేషించిన భాగమును ద్విధావిభజించి ద్వికలాయుక్తమగు భాగమును కై కేయి కిచ్చెను. మిగిలిన ద్వికలాయుక్తభాగమును కౌసల్యా కైకలు తీసికొని సాదరముగ సుమిత్రకే యిచ్చిరి. ఈరీతిని వారందఱు నాపాయసమును భుజించి, గర్భముల ధరించిరి.

ఈవార్తను విని రాజపరిమితానందము నందెను. ఏనాడు కౌసల్యాగర్భము నందు భగవంతుడు ప్రవేశించెనో, నాటనుండి సమస్తలోకములు సుఖ సంపదలతో ప్రకాశించుచుండెను. రాణులు మిక్కిలి తేజముతో నొప్పు చుండిరి. నవమాసములు గడచిన పిదప తిథివారనక్షత్రములు, సమస్తగ్రహ ములు ననుకూలమై యుండ, చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రమున మధ్యాహ్నసమయమందు, శీతలమందసుగంధవాయువులు వీచుచుండ, దేవతలు ప్రసన్నులై యుండ, నదు లుప్పొంగగ, సత్పురుషు లానందమంద, రామజన్మో త్సవమును జూచుటకు విరించి హంసవాహనారూఢుడై బయలువెడలుచుండ, దేవత లాకసమున బంక్తుల దీర్చి తిలకింపుచుండ, గంధర్వులు గానము చేయు చుండ నప్సరోగణములు నృత్యము చేయుచుండ దేవదుందుభులు మ్రోయగా గుసుమవృష్టి గురియుచుండ, దేవాదులు స్తుతించుచుండగా సమస్తజగత్కా ర్యా ణముకొఱకు జగన్నివాసుడైన భగవంతుడు కౌసల్యాగర్భమునం దవతరించెను. మునిమనోహరమగు నాయద్భుతరూపమును జూచిన కౌసల్యానందమునకు మేర లేకుండెను. కౌసల్య చూచునప్పుడు పుండరీకాక్షుడును, మేఘశ్యామలాంగు డును, వనమాలాలంకృతుడును, చతుర్భుజుడును, శంఖచక్రగదాఖడ్గపాణియు, శోభాసింధువు నగు రాక్షసాంతకు డామెకు సాక్షాత్కరించెను. ఆదివ్యమూ ర్తి నిజూచి చేతులజోడించి కౌసల్య ఇట్లు స్తుతింపసాగెను. ఓఅనంతా! మాయా తీతా! జ్ఞానగమ్యా! గుణాతీతా! మానరహితా! వేదవేద్యా! కరుణానిధీ! సుఖసాగరా! అనంతకల్యాణగుణా! సత్పురుషసేవితా! నిన్ను నేనెట్లు స్తుతింపగలను? ఓలక్ష్మీరమణా! నన్ననుగ్రహించి సంతోషపఱచుటకు నాగర్భమునం దావిర్భవించితివి. నీప్రతి రోమకూపమునందును ఒక్కొక్క బ్రహ్మాండము కలదు. అట్టి యనంతబ్రహ్మాండనాయకుడవగు నీవీ నాయుదర మునం దెట్లుంటివోకద! బ్రహ్మాదులును నీయాజన్మమును జూచి విస్మితు లగుచున్నారు. ఇట్లనేకవిధములు స్తుతించు నామెహృదయమున జ్ఞానోదయ మగుటను జూచి, భగవంతుడు మందహాసము చేయుచు నామెకు పూర్వ జన్మ వృత్తాంతమును దెలిపెను. అంత నామె భగవత్కటాక్షమునకు సంతసించుచు మాటిమాటికి నమస్కరించుచుండెను. పిమ్మట భగవన్మాయా మోహితయై, ప్రభూ! ఈ నీరూపమునుమార్చి శిశురూపమూని బాలక్రీడల

నన్నానందింపజేయుమని కోరెను. ఆమె మాటల మన్నించి, బాలకునివలె రోదనముచేయసాగెను. ఈచరిత్రము నెవరు గానముచేయుదురో, వారు సంసార మునుదరించి భగవచ్చరణసన్నిధిని జేరుదురు. మాయాతీతుడు నింద్రియా గోచరుడనగు భగవంతుడు సజ్జనగోబ్రాహ్మణోద్ధరణముకొఱకు కౌసల్యాగర్భ మున జన్మించి బాలకుడై రోదనముచేయ నచటి వారారోదనమును విని బాలునిజూచుటకు తొందఱగా వచ్చుచుండిరి. దాసీజనము వచ్చి చూచి యాశుభవార్తను నగరమందంతటను వ్యాపింపజేసెను. దశరథమహారాజు పుత్ర జననమును విని మనమున సంతసించుచు పులకితగాత్రుడై, ఇట్లనుకొనెను. భగవన్నామమును స్మరించినంతనే సర్వమంగళములు చేకూరును. అట్టి పుణ్య మూర్తి నాయింట నుద్భవించిన నాభాగ్యము నేమని పొగడవలయునని సంత సించుచుండెను. రామజననవార్తను విని యానగరమందంతటను మంగళవాద్య ముల మ్రోయింపుచుండిరి. గురువగు వశిష్ఠున కీశుభవార్తను విన్నవించి, రాజు విప్రుల స్వస్తివచనములతో నాబాలుని దర్శించెను. తొడనే నాందిని గావించి జాతకర్మమునాచరించి, స్వర్ణగోమణివస్త్రముల బ్రాహ్మణులకిచ్చి, ధ్వజతోర ణములచే బురమునలంకరించి, పుత్రోత్సవములజేయుచు నానందపరవశుడై యుండ నంతలో పుష్పవృష్టి గురిసెను. పురస్త్రీలు బంగరుపళ్ళెరములందు మంగళద్రవ్యముల నేకరించి, పికస్వరమున గీతములబాడుచు హారతిపళ్ళెరము లతో గుంపులుగుంపులుగ రాజద్వారమున బ్రవేశించి, రాజపుత్రునికడ నామంగళద్రవ్యముల నిడుచుండిరి. వందిమాగధులాబాలుని కొనియాడు చుండిరి. దశరథుడు సకలదానముల జేయుచుండెను. వచ్చినవారెవరును రిక్త హస్తములతో జనుటలేదు. చందనాది సుగంధద్రవ్య మిళితమగు జలమును రాజమార్గముల జల్లుచుండిరి. పిమ్మట సుమిత్ర లక్ష్మణశత్రుఘ్నులను కవలలును, కైకేయి భరతుని, కనిరి. అపుడయోధ్యాపురియొక్కశోభ వర్ణనాతీతమై యుండెను. రాత్రులు ప్రభుని దర్శించుచున్నవా! యనునట్లు, అగరుధూపములు వ్యాపించుచుండెను. ఈధూమము లాకసమంతయు వ్యాపించుటచే సంధ్యవచ్చు చున్నదని సూర్యుడనుకొనుచుండెను. మరియు నగరమంతయు నీధూమముచే నంధకారకలితమాయెను. అప్పుడు నగరిలోని మణులు తారలవలె భాసిల్లు చుండెను. రాజద్వారమునందలి చంద్రకాంతమణిమయమగు పూర్ణకలశము

చంద్రునివలె శోభిల్లుచుండెను. సంధ్యాసమయమున గూండ్లకుబోవు పక్షుల కిల కిలారావములువలె గృహకీరములు మధురాలాపములజేయుచుండెను. ఈకౌతుక మునుజూచి, సూర్యభగవానుడు తన రథము నాపి, సకలవృత్తాంతము నెఱిగి, భగవంతుని స్తుతించి, మఱల తన పనిని కొనసాగించుకొనుచుండెను. ఈదివ్య మహోత్సవమునుజూచి, దేవతలు, మునులు, నాగులు, తమతమ భాగ్యమును కొనియాడుకొనుచు తమతమ నివాసముల కేగిరి. పార్వతీ! ఆభగవజ్జన్మదినో త్సవసమయమున నేను, కాకభశుండుడును, మానవరూపముల ధరించి, యాదివ్య మూర్తిని దర్శించి, యాయుత్సవములనన్నిటిని గనుగొంటిమి. మేమా యయోధ్య నానందపరవశులమై జూచితిమి కాని మమ్మెవరును గుర్తుపట్టుట లేదు. ఎటుజూచినను పూలవాసనలు, అగరుధూమములు మిక్కుటముగా నుండెను. అటకు వచ్చినవారలందఱకును రాజు, రథగజతురగ గోహిరణ్య వజ్ర ముల గానుకగనిచ్చుచుండెను. అప్పుడందఱును నాసత్కారమునకు సంతసించుచు, దశరథనందనులు చిరంజీవులై వర్ధిల్లెదరుగాతయని దీవింపుచుండిరి. రామజన్మో త్సవముల రాత్రిందివములుకొనియాడుచుండిరి. అటుపిమ్మట రాజు తనపుత్ర లకునామకరణమహోత్సవమును చేయదలచి, వశిష్ఠునిరావించి, పూజించి తన పుత్రులకుదగిననామముల నుంపుడనిప్రార్థించెను. అప్పుడాముని, రాజుతోనిట్ల నియె. రాజా! నామములనేకములుకలవు. ఐననుచెప్పెదనువినుము. ఎవడానంద సింధువో, ఎవడు సకలప్రాణులకు సుఖప్రదుడో, ఎవడణురూపుడయ్యును లోక ముల బ్రకాశింపజేయుచుండునో, ఎవడు హరిహరాత్మకుడో, అట్టినీ పెద్దకుమా రునికి, నారాయణమంత్రమునుండి, రకారమును, మహేశు మంత్రమునుండి, మకారమును గ్రహించి, రామః యను నామముంచుట యుక్తమగుచున్నది. విశ్వమును భరించు శక్తికల నీ రెండవకుమారునికి, భరతుడనుపేరు తగి యున్నది. శత్రునాశకుడగుటచే నీ సుమిత్రానందనునకు శత్రుఘ్నుడను పేరమరు చున్నది. సకల సల్లక్షణములుకలవాడుగాన నీతనికి లక్ష్మణుడనుపేరు సరియగు చున్నది. రాజా! నీ పుత్రులు వేదసమ్మతమగు తత్త్వరూపులు, వీరు మునుల ధనము, మహాదేవునిహృదయ చోరులు. అనిచెప్పి వశిష్ఠుడు వెడలిపోయెను. ఆరాజపుత్రులు దశరథ గృహమందు బాలక్రీడల జరుపుచు తల్లిదండ్రుల కమితానందమును గలిగించుచుండిరి. బాల్యమునుండియు లక్ష్మణుడు రాముని

తనప్రభువని తెలిసికొని రాముని చరణకమలములయం దెక్కువ మక్కువ కలిగియుండెను. భరతశత్రుఘ్నులిరువురును రామునకు సేవకులమని యెఱిగి సేవించుచుండిరి. వీరిలోనిద్దరు శ్యామలవర్ణము గలవారు. మిగిలినవారిద్దరును గౌరవర్ణము కలవారు. ఇట్టి తేజోవంతులగు పుత్రుల గనుగొని తల్లులు ఆనందపరవశలై మాటిమాటికి దృష్టిదోషమును పరిహరించుచుండిరి. ఈ నలుగురన్నదమ్ములును శీలరూపగుణనిధులై యుండిరి. శ్రీరామచంద్రుడు స్మితజ్యోత్స్నాంకురములు ప్రసరింప తమ్ములతో నాడికొనుచుండును. ఒకప్పుడు తల్లి యొడిలో గూరుచుండి ప్రియవాక్యముల బలుకుచుండును. సర్వవ్యాపకుడు నిర్గుణుడు నిరంజనుడు, నిర్వికారుడు, నాద్యంతరహితుడు, నగు పరమాత్మ, కౌసల్యాభక్తిప్రేమలకు వశుడై, ఆమె ఒడియందు బాలునివలె నాడుచు, నామెను సంతోషపెట్టుచుండెను. కోటిమన్మథ సదృశుడగు రామచంద్రుడు, ఇందీవరఘనశ్యామాంగుడై, రక్తాంబుజసదృశచరణుడై, తారానిభనఖకాంతి కలవాడై, కమలదళనేత్రుడై, మత్స్యకులిశధ్వజాది రేఖాంకితకరకమలుడై, మునిమానసమోహకమగు నూపురధ్వనికలవాడై, కింకిణీనిక్వాణసుభగ కటి సూత్రాలంకృతుడై, వళీత్రయభాసమానోదరుడై, నిమ్ననాభికలవాడై, దివ్య భరణాలంకృతభుజయుగళమండితుడై, పులిగోరు పతకముచే నలంకృతకంబుకం ఠుడై, మణిహారాలంకృతుడై హృదయధృతభృగుపాదచిహ్నుడై, సుందర చుబుకుడై, కుందకుట్మలనిభదంతుడై, బింబాధరముతోను, చాంపేయనాసిక తోను విరాజిల్లుచు, సుందరమగు తిలకము కలవాడై, శ్రీకారాకర్ణుడై, ముకురసుందరకపోలుడై, మృదుమధురగంభీరవాక్కులకలవాడై, ఉన్నతోన్నత శ్రోణియై, వక్రభ్రూవిరాజితుడై, ఫాలతలవిరాజమానకుటిలాలకుడై, పీతాంబర ధారియై సింహాసంహాననుడై, గజగమనుడై, విరాజిల్లుచుండెను. పరమానందరూ పుడు వేదాంతవేద్యుడు నిర్మముడు నగు రామచంద్రుడు తల్లిదండ్రుల ప్రేమిం చుచు, బాలక్రీడలనానందింపజేయుచు, నయోధ్యానివాసుల కానందమునిచ్చు చుండెను. పార్వతీ! రామపరాఙ్ముఖుడు కోటిప్రయత్నముల జేసినను సంసార బంధ విముక్తుడు కాజాలడు. అతడుతనమాయాప్రభావముచేసూత్రధారుడై సకలబ్రహ్మాండముల ప్రవర్తింపజేయుచుండును. ఈతనికివశవర్తినియగుమాయ యీతనినిజూచినతోడనే యదృశ్యమైపోవును. ఇది తెలిసినవారీతనినివిడిచి

యన్యులనేలసేవింతురు ? మనోవాక్కాయముల నీతనిభజించినవారిని ఆకృపాధిం బుధి తప్పకరక్షించును. ఇట్లుశ్రీరాముడుబాలలీలలచే నయోధ్యావాసుల కానందమును గొలుపుచు, మాటిమాటికిని జననియొడియందుగారాబంబుల జరుపుచుండెను. కౌసల్యబుత్రప్రేమచే దివారాత్రములనెఱుంగక యానంద పరవశయైకాలమునుగడుపుచుండెను. ఒకనాడుకౌసల్యపుత్రునికిస్నానముచేయించి, యలంకరించి, దుస్తులతొడిగి, యూడించిపరుండబెట్టి, తనకుల దేవతయగు భగవానునియారాధించుటకు పక్వాన్నములదయారుచేయించి, పూజాద్రవ్య ముల సమకూర్చుకొని, దేవునిపూజించి, నైవేద్యమునిమిటకై పాకశాలకేగెను. తల్లివచ్చుసరి కావండినపదార్థములను శ్రీరాముడుభుజించుచుండెను. అదిచూచి తల్లిభయాశ్చర్యములనందుచు, పరుండబెట్టిన బాలునొద్దకువచ్చిచూడ నాబాలు డచటనిదురించుచునే యుండెను. తల్లి యాశ్చర్యముతో పూజామందిరమున కేగి చూడ నట శ్రీరామచంద్రు డగపడెను. అపుడా వేదనతోగూడిన హృదయ ముకలదై, మహానసమునందు పూజాగృహమున, శయనాగారమునను బాలు డగపడుచున్నాడు. నాకు మతిభ్రమకలిగినదా ? లేక ఆబాలుడు మరియొ కడా ! యని తలంచుచు, రామచంద్రుని జాలిగొనజూచుచు నేమియుననజాల కూరకుండెను. భగవంతుడు దీనినంతనుగ్రహించి నవ్వుచు తల్లియొద్ద గూరు చుండి తనవిశ్వరూపము నామెకుజూపెను. అతని ప్రతిరోమకూపమునను బ్రహ్మాండములు విరాజిల్లుచుండెను. వానిలో ననేకులగు సూర్యచంద్రులు ననేకబ్రహ్మలు, మహాదేవులు, పర్వతములు, నదులు, సముద్రములు, భూములు, వనములు కలవు. ఆమె ఎన్నడు కనివినియెరుగని దృశ్యంబులజూప నామె భయ భ్రాంతయై గడగడవడకుచు కనులమూసికొనియు సకలభూతములంజూచుచు, భగవంతునియందు పుత్రభావమునువీడి పరమాత్మయనిస్తోత్రముచేయుచుపులకిత గాత్రయై గద్గదస్వరముతో మాటలుతడబడ నేత్రములమూసికొని భగవత్పా దములందు శిరమునాల్చెను. కాని భయసంభ్రమములచే స్తుతించుటకుమాట వెలువడుటలేదు. జగద్గురుడగు నీతనినినేను పుత్రుడని తలంచుచుంటిని. ఇది మహాపరాధము అని పరిపరివిధముల తలంచుచుండ నాభగవంతుడు తల్లిభా వమునుగ్రహించి, ఆమెకు దివ్యజ్ఞానము నొసంగి తనయవతారతత్వమంతయు నామెకెరింగించెను. నేనిట్లునీకు దర్శనమిచ్చితినని ఏరికినిజెప్పవలదను రామ

చంద్రునికి, కౌసల్య మాటిమాటికి చేతులుజోడించి వినుతింపుచు, మరల బాలుడవై వర్తింపుమన తల్లివిన్నపమాలించి, ప్రభువు యథాప్రకారముగ బాలచేష్టల చేయుచుండెను. ప్రభువిట్లు తనభక్తుల నానందింపజేయు చుండును. ఇట్లు కాలముగడుచుచుండ నొకనాడు దశరథుడు గురునానతిని వారికి చౌలసంస్కారమును చేయించి, బ్రాహ్మణులకు బహువిధ దక్షిణలిచ్చి, పుత్రుల యాటపాటలచే సంతసించుచుండెను. గిరిజా! ఆవాఙ్మానసగోచరు డగుస్వామి దశరథప్రాంగణమునం దాటలాడుచు దిరుగుచుండెను. ఒకనాడు దశరథుడు రామచంద్రుని తనతో భోజనమునకు రమ్మనిపిలచెను. రామచం ద్రుడు తోటిబాలురతో నాటలాడుచు భోజనమునకు బోకుండెను. అప్పుడు కౌసల్యవచ్చి పిలువ నామెవైపునకు వచ్చుచు, మఱల దూరముగబోవుచు మఱలవచ్చి తల్లిపట్టుకొనబోవగా దప్పించుకొనుచు తల్లినికొంతసేపాడించి, తుద కామెకు పట్టువడెను. అపుడు కౌసల్య రామునిపట్టుకొని తనచేలచెరగున నాతనిశరీరమందలి ధూళిని తుడుచుచు రాజునొద్ద భుజించుటకు కూర్చుండ బెట్టెను. ఎవనిస్వరూపమును వేదములుసయితము వర్ణింపజాలవో, ఎవనిని శివుడుగూడ దెలిసికొనలేకుండెనో, అట్టిపరమాత్మ, తల్లికిలొంగివచ్చి తండ్రి తొడపై కూర్చుండి, ముఖమంతయు దధిసిక్తముకాగ నన్నమును దినుచుం డెను. రాముని బాలచరిత్రము అతిసరళమై చూచువారల కానందమునుగొ లుపుచుండెను. ఓ భరద్వాజా! సరస్వతి, శేషుడు, మహేశ్వరుడు, వేదములు నీతనితత్త్వమును దెలిసికొనజాలకుండిరి. ఇక సామాన్యులమాట చెప్పనేల. ఇట్లా నలుగురుపుత్రులు తల్లిదండ్రులకు ప్రజలకు నానందమును గలుగజేయు చుండిరి. పిమ్మట నాబాలురు నందఱను విద్యాభ్యాసమునకు గురువులయొద్ద నప్పగింప వారచిరకాలముననే సకలవిద్యాపారంగతు లయిరి. ఎవనికి వేదములు నిశ్వాసప్రాయములో, అట్టి భగవంతుడు సామాన్యమనుజునివలె జదువనారం భించెను. గురువు లుపదేశించుటయే తడవుగ వారికన్నివిద్యలు సిద్ధించుచుం డెను. వారికి వినయగుణశీలములు సహజసిద్ధములు. వారు బాల్యముననె ధనుర్విద్యా పారంగతులైరి. వారిసౌందర్యమునకు పట్టణవాసులు మోహి తులై, రామచంద్రుని ప్రాణములకన్న నెక్కుడుగ ప్రేమించుచుండిరి. వారు మిత్రులతోగలసి, వేటకుబోవుచు, క్రూరమృగముల జంపుచు వానినితెచ్చి

రాజునకు జూపుచుండిరి. రామనిహతములగుమృగములకును స్వర్గతియే కలుగుచుండెను. వారు వేటమున్నగు ననన్నిపనులందును పరస్పర మైత్రితో మెలగుచుండిరి. రామచంద్రుడు పెద్దలవలన పురాణేతిహాసములనుచు నందలి ధర్మముల ననుజులకు బోధించుచుండెను. మఱియు ప్రాతఃకాలమునలేచి, తల్లి దండ్రులకు గురువులకును నమస్కరించి, ప్రాతఃకృత్యముల దీర్చికొని తండ్రి యాజ్ఞానుసారముగ వర్తింపుచు నాతనిని సంతసింపజేయుచుండెను. పుత్రుని ప్రజ్ఞావిశేషములగని తండ్రి యానందపరవశు డగుచుండెను. సర్వవ్యాపకుడు, ననంతకళ్యాణగుణ పరిపూర్ణుడు నగు భగవంతుడు భక్తులకుకట్టువడి యిట్టియద్భుతలీలల జూపుచుండును. పార్వతీ! యీకథ నతిశ్రద్ధతోవింటివి. ముందు కథనుగూడ శ్రద్ధతోవినుము.

భరద్వాజా! జ్ఞాననిధియగు విశ్వామిత్రుడు వనమునందొక చక్కని యాశ్రమమును నిర్మించుకొని తపోయజ్ఞములచే భగవదారాధనము జేయు చుండెను. అంత మారీచసుబాహులను రాక్షసులు కొందఱురాక్షసుల గూర్చు కొని, యాతడు యజ్ఞమును తలపెట్టగనే మహోపద్రవముల గావించుచు యజ్ఞ మును ధ్వంసమొనరింపుచుండిరి. అప్పుడు విశ్వామిత్రుఁడీ రాక్షసులు భగవంతు నిచేగాక మఱియొకనిచే జావరు. రాక్షసంహార మొనరించి భూభారము నడ చుటకు భగవంతుడవతరించియే యున్నాడు. కాన నేను దశరథుని ప్రార్థించి భగవంతుని దర్శించెదను. అతడు తన పుత్రులను నాకు సహాయమొనరింప బంపును. కాన నేనచటకేగి భగవద్దర్శనభాగ్యము నందెదనని తలంచి ప్రయా ణముచేసి కొన్నిదినములకయోధ్యనుజేరి సరయూస్నానమాచరించి, క్రమముగ రాజద్వారమును జేరెను. దశరథు డంతద్వారపాలకులచే విశ్వామిత్రుని రాక విని, బ్రాహ్మణులతో నెదురేగి, సాష్టాంగదండప్రణామమాచరించి, తోడి తెచ్చి యుచితాసనమునందు గూరుచుండబెట్టి, యర్ఘ్యపాద్యముల నొసంగి, మధురాహారముల నారగింపజేసి మహర్షిని యోగక్షేమముల నడుగుచుండెను. రాజుయొక్కభక్తిప్రేమల జూచి మని యానందించుచుండెను. అంతదశరథుడు తన నలుగురు పుత్రులను మని పాదములబడవైచి నమస్కరింపచేసెను. మని రామచంద్రునిజూచి, ప్రేమానందపరవశుడయ్యెను. పూర్ణచంద్రదర్శనమున చకోరములవలె, రామముఖచంద్రదర్శనమున మని మానసచకోర మల

రారు చుండెను. రాజు మనమందానందముప్పొంగ మునితో నిట్లనియె. ముని వర్యా! తాము నాయందిట్టి వాత్సల్యము నిదివఱకెప్పుడును జూపియుండుట లేదు. తమ రాకకు కారణమును దెలుపగోరెద. తమయాజ్ఞను నెరవేర్చి కృతార్థుడగాగలనన మునియిట్లనియె. రాజా! నన్ను రాక్షసులుబాధించుచున్నారు. కాన లక్ష్మణునితోగూడ రామచంద్రుని నావెంటనంపుము. వారురాక్షసుల సంహరించెదరు. సంశయింపకుము. నీకుమారుల నావెంటబంపిన నీకుకీర్తియు, శుభమును చేకూరును. అమాటల వినినంతనె రాజు కంపితహృదయుడై, వెల వెలబోయుచున్న ముఖముతో నిట్లనియె. స్వామీ! నాకీపుత్రులు ముదివయసున జన్మించిరి. వారి యందు నాకు మోహమగ్గలము. నాసర్వస్వమును తమకు సంతోషముతో సమర్పింతును. దేహప్రాణములకన్న ప్రియమగునది మఱి యొకటి లేదుకదా! వానినైనను సమర్పించెదను. కాని ప్రాణాధికుడగు రాముని మాత్రము పంపజాలను. ఘోరాతిఘోరములగు రాక్షసగణముల నీమధుర మోహనమూర్తియగు బాలుడెట్లు సంహరింపగల డనుప్రేమభరితములగు రాజుమాటలువిని జ్ఞానియగుమునియంతరంగమున సంతసించుచుండెను. అంత వశిష్ఠుడురాజున కనేకవిధముల బోధించి, అతని సర్వసంశయములనుడిపిన, రాజు సాదరముగ రామలక్ష్మణులను బిలిపించి, ముద్దుపెట్టుకొని, బహువిధ ములబోధించి, విశ్వామిత్రునితో నిట్లనియె. మహాత్మా! ఈబాలులిద్దఱు నాకు ప్రాణాధికులు. ఇపుడు వీరికి తామే తల్లియు, దండ్రియు, సర్వజ్ఞులగు తమకు వేరుగ నేనేమియు చెప్పనక్కరలేదు. అనిపుత్రుల నాశీర్వదించి మునికి సమ ర్పించెను. పిమ్మట రాముడు మాతృగృహమునకేగి తల్లికి నమస్కరించివచ్చెను. గంభీరధీరులగు నాపురుషసింహులు మునిభయమును బాపుటకు హర్షముతో నామునివెంట జనుచుండిరి. అప్పుడు వారరుణనయనములతోడను, విశాలవక్ష స్థలములతోడను, ఆజానులంబిబాహువులతోడను, నీలపీతములగుతనుచ్ఛాయల తోడను, శోభిల్లుచు, కటిలంబితేషుధులగుచు, ధనుష్పాణులై తనవెంటవచ్చు చుండ నాముని నిధిదొరికినట్లు సంతసించుచు, ఈప్రభుడాదిదేవుడు. తండ్రి యీతని నాకొఱకుబంపెను. నాయదృష్టమునకు గర్వింపవలయునని తలపోయు చుండెను. రాజర్షియగు విశ్వామిత్రుడా బాలురకు మృదుమధురములగు కథల జెప్పుచు సరణ్యమునందలి వింతలుజూపుచు పోవుచుండనంత తాటకయను

రక్కసి వారి ప్రసంగమును వినియతిభయంకరరూపముతో త్రోవకడ్డముగనిలిచి యుండెను. అప్పుడువిశ్వామిత్రుడు రామా! సంశయింపకుము. దీనినిబరిమార్పుమ నెను.గురూపదేశానుసారముగ వెంటనేబకబాణముతోదానినిగొట్టెను. ఆబాణము రాక్షసరాజ్యరమతోబాటు దానివక్షస్థలమునుభేదించి యసువుల బాపెను. అది యె రాక్షససంహారమునకునాంది. పిమ్మటమునిసంతసించి జృంభకాదివ్యాస్త్రములను, క్షుత్పిపాసావారకములగు, బలాతిబలలనెడివిద్యలను రామునకొసంగెను. వాటి వలనక్షుత్పిపాసలులేక తేజోబలసంపన్నులై ప్రకాశించుచుండిరి. ఇట్లుసమస్తాయు ధశస్త్రాస్త్రములనొసంగి, యాబాలురదనయాశ్రమమునకుదోడికొనివచ్చి, కంద మూలాదులనిచ్చి భుజింపజేసెను. అంతరాముడుమునితోనిట్లనెను. మానీంద్రా! తామికనిర్భయముగమఖము నారంభింపుడు. మేమామఖమునుసంరక్షించెదము. అనవిని విశ్వామిత్రుడుమునులరావించి, బాలురరక్షకులుగనియమించి యజ్ఞము నారంభించెను. మారీచుడుమున్నగురాక్షసులీవార్తనువిని వృద్ధులై సానుచరులై వచ్చిరి. అప్పుడురాముడుసేనాసహితుడగుమారీచునిజూచి, వీడేసురద్రోహియని తలచి, తనబాణముచే సాగరాంతమున శతయోజనదూరమున బడవైచి, మిగి లిన సైన్యమునంతనుయమపురికంపెను. పిమ్మటసుబాహుడురాగ జూచి యాగ్నే యాస్త్రముచే వానినిసంహరించెను. లక్ష్మణుడు వానిసైన్యమునంతను నిశ్శేష ముగ దునుమాడెను. అట్లురాక్షససంహారమయినంతనే మునులుఋత్విజులు నారామచంద్రుని కొనియాడుచు, నిర్విఘ్నముగ నాయజ్ఞమునుముగించిరి. వారలభక్తిప్రేమలకు వశుడై రామచంద్రుడటగొన్ని నాళ్ళుండి, చాలపురాణ ములవినెను. పిమ్మటవిశ్వామిత్రుడు సాదరముగ గొన్నిగాథల నుడువుచు, ననేకవిశేషముల జూపుచు, జనకునిచరిత్రమును జెప్పెను. రాముడాథనుర్యాగ మునువిని సముల్లాసముతో తానునుమిథిలకుబయనమాయెను. అట్లుమునితో మిథిలకుబోవుచుండ నాదారినొకయాశ్రమమగపడెను. అందుమృగపక్ష్యాదు లేవియుగానబడుటలేదు. ఒకపెద్దపాషాణమటపడియుండుటనుజూచి ఇదియేమని ప్రశ్నింప నాగాధనంతను రామచంద్రునకువినిపించి, మునిఇట్లనెను. రామా! గౌతమమునిభార్యయగుననహల్య యీశిలారూపమునపడియున్నది. ఈమెనీచరణ కమలరజఃకణమునభిలషించుచున్నది. ఈమెననుగ్రహింపుమనరామచంద్రుడట్లు చేసినతోడనే యాశిలస్త్రీరూపమునందెను. ఆమెదీనబంధువగురామచంద్రుని

జూచి, విహ్వలమతియై యానందాశ్రువులొలుక పులకితగాత్రియై, చరణకమల ములవ్రాలి చేతులజోడించి నిర్మలములగుమృదుమధుర వాక్కులతో నిట్లు స్తుతింప సాగెను. ఓ రామచంద్రప్రభూ ! నీకుజయమగుగాత. అపవిత్రనగునేను నీచరణ రజస్సుచే పవిత్రనైతిని. ఓ భక్తసుఖదా ! పంకజనయనా ! సంసారభయ నాశకా ! నన్ను రక్షింపుము. భర్తృశాపావసానము నా కాశీర్వాద మాయెను. ఈ శాపమువలననేకద భవభయహారుడవగు నీవు నాకన్నుల బడితివి. ఏమినాభాగ్యము ! నీదివ్యమహిమనామహేశుడెరుగును. స్వామీ ! మిమ్మొకదివ్యవరమడుగ దలచితి. నామనోభ్రమరము, తమపదసరోజ మకరందాస్వాదముజేయుచు నిరంతర మటనుండునట్లనుగ్రహింపుము. ఆచరణ కమలమం దుద్భవించిన పరమపవిత్రమగుగంగను శివుడు శిరమునదాల్చుచు న్నాడు. ఏనీ పాదపద్మములను మహర్షులు సదాపూజింపుచుందురో ! ఆనీ పాదములనొకమారు నాశిరమందుంచుము తండ్రీ ! మీదర్శనభాగ్యముచే నాసర్వదోషములు నశించినవి. అనుచునాయహల్య రామచరణకమలములకు వందనమాచరింపుచు తన మనోభీష్టములనంది పతియొద్దకుబోయెను. పరమాత్మ, దీనబంధువు. కాననెవడు నిష్కపటియై యాత్రనిభజించునో, యాతనిని దప్పక రక్షించును. పిమ్మటరామలక్ష్మణులు మునివెంటజనుచు, తాముసంచరించిన ప్రదేశముల బవిత్రముజేయుచు, గంగనుజూచి సంతసించుచు, నానదికిప్రణమిల్లియుండ విశ్వామిత్రుడు గంగభూలోకమునకవతరించినవిధమును వారలకువిని పించుచుండెను. వారాపవిత్రచరిత్రనువిని మునితోగలిసి అందుస్నానమాచ రించి, విశ్వామిత్రునివెంటజనుచు మార్గమందలి విశేషములనుగనుచు, నచిరకా లంబున మిథిలనుజేరిరి. ఆపట్టణశోభను దిలకించుచు, నందలి యుద్యానవనముల జూచుచుండెను. అందమృతోపమజలభరితములగు ననేక వాపీతూపతటాకములు గలవు. వానికి మణిమయములగు సోపానములు కలవు. అందలి కమలములను ఆకమలములందు మధుపానమత్తములగు భ్రమరములను జూచుచు, శ్రోత్రపేయ ములగు సారసధ్వనులను వినుచు వారానందపరవశులైరి. ఆపట్టణము నలు దిక్కులపూవుదోటలతో విరాజిల్లుచుండెను. అతోటలందనేక ఫలవృక్షము లుండెను. శుకపికశారికలావృక్షములందు శ్రుతిహితముగ గూయుచు విహరించు చుండును. ఆపురశోభవర్ణనాతీతము. ఆనగరమందలి బజారులు విచిత్రవస్తువుల

తోడను యమూల్యములగు మణులతోడను విలసిల్లుచుండెను. ఈ పట్టణమును విధాతప్రయత్నపూర్వకముగ నిర్మించియుండనోపు. వేదవేదాంగ నిపుణులగు విప్రులు, బాహుబలసంపన్నులగు క్షత్రియులు, మహాధనవంతులగు వైశ్యులు, గుణవంతులగు శూద్రులు. నిపుణులగు వేశ్యలు నందుకలరు. అందలి వీధులన్నియు సుగంధకలితములు. అందలి ప్రతిగృహము మంగళాయతనమే. ప్రతిగృహమునకొక పూదోట మన్మధహస్త విరచితమువలెనుండెను. పవిత్రులు గుణవంతులునగు నందలిస్త్రీ పురుషులు చక్కదనమున రతిమన్మథులబోలియుందురు. అందలి రాజభవనము నిరుపమము. దేవతలుసయితమద్దాని శోభకు విస్మయము నందుచుందురు. అందురాజపుత్రిభవనము చంద్రకాంతమణి నిర్మితమై, సౌవర్ణప్రాకారాలంకృతమై, మణికుట్టిమోపేతమై, లోచనాసేచనకమైయుండెను. ఆ మిథిలయందు జనకుడింద్రతుల్యవైభవముల ననుభవించుచుండెను. ఆతని రథగజతురగశాలలు వర్ణనాతీతములు. ఆ మహారాజునొద్ద నిపుణులగు సచివులు, శూరులగు సేనానులు, చాలామంది కలరు. వారలరాజు తనతో సమానముగ గౌరవించుచుండెను. ఆపురప్రాంతమున సరోవరములు, నదీనదములును, వాని ననుసరించి పూదోటలును కలవు. విశ్వామిత్రుడీ సన్నివేశమును జూచి విగులసంతసించుచు, ఒటనే శ్రమింపదలచి ఆగిపోయెను. ఇది విశ్రమించుట కనువుగనున్నదన రామలక్ష్మణులందుల కంగీకరించిరి. మునులు నందులకు సమ్మతించిరి. విశ్వామిత్రుని రాకవిని జనకుడు సపరివారముగ పురోహితులముందిడికొని విశ్వామిత్రునికడకేగెను. అట్లేగి సాష్టాంగ నమస్కారమాచరింపనంత విశ్వామిత్రుడు ప్రసన్నుడై జనకునాశీర్వదించెను. జనకుడు తొలుత విశ్వామిత్రుని, పిదపనాతనితో నున్న మునిబృందమును సత్కార్యాది సపర్యలనర్చించి, యుండనంత విశ్వామిత్రుడు జనకుని కూరుచుండ నియమించి, క్షేమవార్తల నడుగుచుండెను. అంతకుముందు పూలతోటలో విహరించుటకు పోయిన రామలక్ష్మణులాసమయమున కచటకువచ్చిరి.

శ్యామగౌరాంగులై సమవయస్కులై నేత్రానందకరులై యచటకువచ్చిన విశ్వమోహన విగ్రహులజూచి, లేచి అందఱునునిలుచుండిరి. విశ్వామిత్రుడు రామలక్ష్మణుల చెరి యొకప్రక్కను గూర్చుండబెట్టుకొని యుండెను. ఆ బాలుర నందఱు జూచుచుపులకితశరీరులైరి. జనకుడామధురమోహనరూపుడగు శ్రీరామ

ద్రునిజూచి, చైతన్యములేక దేహమును మఱచి విదేహుడయ్యెను. పిమ్మట ప్రేమమగ్నుడైన జనకుడు తన యవస్థనుదెలిసికొని, స్వస్థచిత్తుడై మునిపాద ములకు నమస్కరించి, గద్గదకంఠముతో మునికిట్లనియె. మానివర్యా! ఈ బాలురిద్దరు మునివంశశిఖామణులా! లేక నృపకులశిరోమణులా! లేక వేదబోధితుడగు భగవంతుడీ రూపములను ధరించివిచ్చేసెనా? నేను సహజముగ విరాగిని, అయినను వీరలనుజూచి నామనస్సు చలింపుచున్నది. చంద్రికనుజూచిన చకోరమువలె వీరలనువీడి నామనస్సెందును పోజాలకున్నది. మానివర్యా! నాయందు దయనుంచి మర్మమేమియులేక యథార్థమును వెల్లడింపవేఁడుచుంటిని. నేనుబ్రహ్మానందసుఖమునకై సర్వమును ద్యజించితిని. ఈబాలురకన్న నా యానందము వేఱుగగోచరించుటలేదు. వీరియందలి ప్రేమచే నావైరాగ్యమెట కేగుచున్నదో యగపడుటలేదు. ఆపలుకులకు మందహాసముచేయుచు విశ్వా మిత్రుడిట్లనియె. రాజా నీనుడువులు సత్యములు. ఈతడుచరాచరములనన్నిటిని తనవలె ప్రేమించును. అన రామచంద్రుడు చిఱునవ్వునవ్వెను. మఱల విశ్వా మిత్రుడు జనకునితోనిట్లనెను. రాజా! వీరురఘుకులశిరోమణియగు దశరథుని నందనులు. వీరిని రామలక్ష్మణులందురు. వీరిని నామఖసంరక్షణమునకు నా వెంటదెచ్చితిని. వీరు రూపశీలబలశాలురు. వీరిబలమును నామఖమే చాటుచున్నది. వీరుబలవంతులైన యనేకరాక్షసులదునుమాడిరి. అనవిని మునితో రాజిట్లనియె. ఓమునిచంద్రమా! తమ దర్శనభాగ్యము నేమని కొని యాడగలను? మీవలననేకదా యీమనోహరరూపుల జూచుభాగ్యమబ్బినది. వీరియెడ నాకు ప్రీతిమెండగుచున్నది. జీవాత్మ పరమాత్మ యందువలె నాజీ వము వీరియందు లీనమగుచున్నది. అనిపలుకుచు రెప్పపాటులేక రాముని జూచుచు మునిని బొగడుచు, వారలవెంటనిడుకొని, నగరుబ్రవేశించి, స్నాన పానములకు శీతోష్ణములకు ననువగు తావున గుడారమును నిర్మించి, సకలవిధ ముల వారినిసత్కరించి, వారినందునివసింపజేసి రాజు నిజనివాసమున కరిగెను. శ్రీరామచంద్రుడు సోదరసహితుడై, విశ్వామిత్రునితో గలసి భుజించి, విశ్ర మించుచుండెను. అట్టియెడ లక్ష్మణునకు జనకుని పురమునంతను జూడవలెనను కోరికపుట్టెను. కాని మునియొద్ద సంకోచముచేతను అన్నగారివద్దనుండుభయము చేతను తనకోరికను జెప్పజాలకుండెను. రాముడు దానినంతను గ్రహించి, భక్తా

భీష్టసంధాతగావున సోదరాభీష్టమును దీర్పదలచి, గురుని యనుమతి కొఱకు, సవినయముగ దరహసితవదనుడై, మునితో నిట్లనియె. గురువర్యా! మాలక్ష్మ ణునకు జనకనగరిని జూడవలెననియున్నది. కాని భయముచే తమయొద్ద నేమియు బలుకజాలకున్నాడు. కాన తమశలవయిన మేమిరువురము పోయి నగరసౌభాగ్యమునంతను జూచిత్వరలో తిరిగిరాగలము. అనవిని రామా! ధర్మ రక్షకా! మీరిరువురుగలిసి పోయినగరమును దర్శించి, మీసుందర ముఖార విందములచే నందలి స్త్రీపురుష నేత్రభ్రమరములకానందమును గలిగించి రండను మునిపలుకులు విని మునిపాదములకు నమస్కరించి, యాతని సెలవుగైకొని వెడలి నగరశోభను దిలకించుచుండిరి. వారి మనోహరరూపముల జూచుచు, వారిమృదుమధురాలాపములవినుచు నానగరివారందఱు నాశ్చర్యనిమగ్న మానసులైరి. వారిరువురు పీతాంబరధారులై, నడుములనమ్మల పొదులు ధరించి, ధనుర్బాణపాణులై, సుగంధలిప్తాంగులై, శ్యామగౌరవర్ణములు, సింహమధ్యములు, విశాలవక్షస్థలములు కలవారై, కంఠముల నాగమణి మాలలధరించి, తమను జూచువారల తాపములనుహరించుచు, కర్ణముల మకరకుండలములను, లలాటముల దిలకములను, శిరములనుష్ణీషములను ధరించి సుందరగంభీరాకృతులతో పురవీధులసంచరింపుచుండ, వారలజూచినపురజనులు వారలచేరంబూని, వారలకా పురవిశేషములు జూపుచుండిరి. అప్పుడాపురజనులు తమకార్యములమాని, వారిరువురసౌందర్యవిలాసములనె జెప్పుకొనుచు, దరి ద్రుడునిధినివలె, పరుగునవచ్చి, రామలక్ష్మణుల గలియుచుండిరి. స్త్రీలుగవాక్షు ములనుండి రెప్పపాటులేకయె రాముని జూచుచు వారిలో వారిట్లనుకొనసాగిరి. సఖీ! మదనుని దిరస్కరించెడి వీరియందమును జూచితివా! సురనరనాగగంధ ర్వులందిట్టి, చెలువమును కనివిని యెరుగము. విష్ణువుసుందరుడని చెప్పుదురు కాని, ఆతనికి నాలుగుచేతులుకలవట. అదియేమి అందము? బ్రహ్మ మిక్కిలి తేజోవంతుడయినను నాలుగుమోములుకలవట. అదియేమిచందము? మహాదేవునియందము పంచవక్త్రములచేతను, నాగాభరణముల చేతను, గజా జినముచేతను తెల్లమేగద! ప్రపంచమున ఈబాలుర పోలినవారినెందును కన జాలము. వీరు చూచుటకు సుకుమారులు. వీరియంగములందు కోటిమన్మథ లావణ్య మగుపడుచున్నది. సఖి! ఇట్టిసుందరులు మరెందైననుగలరా! చెప్పుము.

ఈరూపమునుజూచి మోహింపనివారెవరు. వీరలెవరో తెలియకున్నది. నీ కేమైనను దెలియునా ? యని ప్రేమతోబలుక వారిసంగతి నాకు దెలియునని మఱియొకతె ఇట్లనెను. వీరు దశరథపుత్రులు. ఈ బాలచంద్రు లిద్దఱు నన్న దమ్ములు. విశ్వామిత్రుని యాగసంరక్షణమునకు వచ్చి, రణధీరులు నజే యులగు రాక్షసుల నెందఱనో బరిమార్చిరి. వీరిలో గమలనేత్రుడు శ్యామ లాంగుడు మారీచసుబాహుల మదమడంచెను. తాటకను బరిమార్చెను. ఈతడే కౌసల్యానందనుడు. చూడుము. ఈతనిపేరు రాముడు. ఈతనివెనుక ధనుర్ధరుడగు నా గౌరవర్ణుడీతనితమ్ముడు. సుమిత్రానందనుడు. ఆతనిపేరు లక్ష్మణుడు. వీరు విశ్వామిత్రుని యాగమునుగాపాడి మన జనకమహారాజు చేయు ధనుర్యాగమును జూడదలచి వచ్చుచు మార్గమధ్యమున గౌతముని భార్యయగు నహల్యనుద్ధరించిరి. అనునా మాటలవిని యచటిస్త్రీలందఱును వికసితవదనలైరి. అందొకతె రాముని జూచి ఇట్లనియె. సఖీ! యీతడు మనజానకికి తగినవరుడు. మనరా జీతనిజూచిన తనప్రతిననువదలి సీత నితనికే యిచ్చును. మఱియొకతె ఇట్లు పలికెను. మనరాజు వీరలను, విశ్వామిత్రుని సత్కరించి తగునివాసము నేర్పఱచియుండెను. కాన రాజువీరల జూచియే యుండును. ఇట్టిసుందరాంగుడు కలడని తెలియక అట్టిప్రతిజ్ఞను మనరాజు బూనియున్నాడు. కాని ఆప్రతిజ్ఞనువిడిచి యీతనికి మనజానకినిచ్చి వివాహము జేసిన నెంతేని బాగుండునన మఱియొకతె ఇట్లనదొడగె. చెలీ! విధాత మన జానకికి మంచిఫలము నిచ్చును.మనసీత యీతనినే వివాహమాడును. సందియము లేదు. దైవవశమున నీవధూవరులకు సంఘటన మేర్పడిన మనమెంతేని సంత సింపవచ్చును. ఇట్టివరునిజూచుటయు భాగ్యమేకద. అన నింకొకతె ఇట్లనెను. సఖీ ! నీమాటమిక్కిలి సమంజసముగ నున్నది. కాని యీతడు మృదుగా త్రుడు. శంకరచాప మతికఠోరము. కాన సందియమగుచున్నదన నింకొకతె ఇట్లువచించెను. ఈతడు బాలుడైనను మహానుభావుడు. తాటకను మర్దించి, తపసిజన్నముగాచి, రాతినాతిగజేసిన రాకుమారుడు శివచాపమును మాత్ర మేల ఎక్కుపెట్టజాలడు ? వీని మహత్తరకార్యములవినియు నేలసంశయింపు చుంటివి ? విధాత మనసీత కీతనినే వరునిగజేసియుండునన విని వారందఱును మిగులసంతసించిరి. అట్లు హర్షవికసిత వదనలగు వారందఱు నాబాలురపై

తమ తమ చూపులనుంచి వారిని ఇందీవరమాలాలంకృతుల గావించిరి. కొందఱు సౌధాగ్రముల నుండి పుష్పాంజలుల నర్పించుచుండిరి. వారట్లు పురమును జూచి పిమ్మట ధనుర్యజ్ఞశాలను దర్శింపబోయిరి. ఆ శాల అతి విశాలమై, మిక్కిలి పొడవువెడల్పులు గలదై యలరారుచుండెను. అందొక వేదినిర్మింపబడినది. దానికినాలుగువైపుల బంగారుమంచెలు నిర్మింపబడినవి. వీనిని మహీశులధిష్ఠింతురు. వానికివెనుక ప్రేక్షకులాసీనులగుటకు తగినయాసనములమర్పబడినవి. వానికివెనుకనింకను సోపానములవలె నిమ్నోన్నతములగు మంచెలేర్పఱుపబడినవి. ఆయాసనములందు కూరుచుండిన పౌరులకు నిర్బాధముగ నచటివిశేషములన్నియు గోచరించును. మధ్యనొకపెద్దమహాలు కలదు. అది ఘోషాస్త్రీలకు నియమింపబడినది. నానాదేశములనుండి యీధను ర్యాగమును జూచుటకు స్త్రీలుపురుషులు తండోపతండములుగవచ్చుచుండిరి. ఆవచ్చినవై దేశికులను, నగరవాసులను వారివారికులాచారపద్ధతి ననుసరించి, రాజభటులు కూరుచుండబెట్టుచుండిరి. ఆలసించిన చోటుదొరకదని ప్రజలు ముందుగనేవచ్చి, వారికనువగుస్థలముల గూర్చొనుచుండిరి. వారందఱు నాకట్టడములను, అలంకరణములను జూచివిస్మితులగుచుండిరి. రాజువచ్చినవారందఱకు తగుమర్యాదల గావించుచుండెను. నగరవాసులగు బాలురు, రామలక్ష్మణుల కద్దానినంతనుజూపుచు, నాభగవత్స్వరూపులకరముల స్పృశించుచు హర్ష పులకితగాత్రులగుచుండిరి. రామచంద్రుడా బాలకుల ప్రేమను దెలిసికొని, వారినిమాటిమాటికి బలుకరించుచు, వారిభుజములపై చేయినిడి స్పృశించుచు వారినిసంతోషవారిధినోలలాడింపుచుండెను. అంతరాముడు లక్ష్మణునిబిలిచి, లక్ష్మణా! యీపురవై భవమెంత బాగుగనున్నదోచూచితివా! అనిచెప్పుచు నాశ్చర్యముగ దిలకింపుచుండెను. ఎవడుసంకల్పమాత్రమున ననేకబ్రహ్మాండ ములసృజించునో! అట్టిభగవంతుడేమియునెఱుగనివానివలె నాబాలురుజూపెడి వాని ననుటినిజూచుచుండెను. రాముడాధనుర్యజ్ఞప్రాంతమునంతనుదిలకించి, యీలసించినందుకు గురుడుకోపగించుననిభయమందుచు విశ్వామిత్రునివద్దకు మఱలివచ్చెను. ఎవనిభజించినసకలభయములుపోవునో ఆట్టివాడుభక్తుడగు విశ్వామిత్రునకుభయపడివచ్చుచుండెను. వచ్చిమునికినమస్కరించి యీతనియను మతివడసికూరుచుండెను. అపుడుసంధ్యాసమయమగుటచే సంధ్యనుపాసించి,

పురాణేతిహాసకథలను ఆతనివలనవినుచుకాలక్షేపముచేసిరి. అంతవిశ్వామిత్రుడు పరుండ నారామలక్ష్మణులిద్దఱు నాతనిచరణసన్నిధిని జేరిపాదములొత్తుచుండిరి. ఎవరినిచరణసరసిజములదర్శించుటకు మహాత్ములు వివిధంబులగు జపతప హోమాదుల గావింపుచుండెదరో, అట్టిభగవంతుడు విశ్వామిత్రునిచరణముల నొత్తుచుండెను. ఏమియామునిభాగ్యము! ఇట్లుమునినిసేవించి యాతనిచే ననుజ్ఞాతుడై శ్రీరాముడు నిదురింపనంతలక్ష్మణుడు రాముని చరణకమలముల దన యంకమునజేర్చి, హృదయంబున నద్దుకొనుచు, చరణంబుల నొత్తుచు, వినోదకరములగు కథలజెప్పుకొనుచుండ, లక్ష్మణా! రాత్రిచాలగడచెను. ఇక నిదురింపుమని రాముడనయన్న గారియాజ్ఞానుసారముగ లక్ష్మణుడునిదురించెను. అంతనారాత్రిగడవ ప్రాతఃకాలమునకుక్కుటధ్వనిని విని లక్ష్మణుడు ముందుగ లేచెను. పిమ్మటగురునకుపూర్వమే రాముడు మేల్గాంచెను. పిమ్మటశౌచాదిక్రియ లనిర్వర్తించి, స్నానమాచరించి,సంధ్యనుపాసించి, గురునకువందనంబిడి, యాతని యాజ్ఞానుసారముగ వారిరువురును గురునకు పుష్పాలదెచ్చుటకు బయలుదేరి ఒక మనోహరమగువనమునుజూచి,అందలిపుష్పవాటికలను, చిత్రముగనేర్పుపడిన వృక్షములను,లతలను, అందువిహరించుచున్న శుకశారికాదిపక్షిగణములనుజూ చుచుండెను. ఆవృక్షములు వినూతనపత్రపుష్పఫలభరితములై, కల్పవృక్షముల బోలియుండెను.అందు నెమిళ్ళు పించములనువిప్పినాట్యమునుజేయుచుండెను. ఆవన మధ్యమున మనోహరమగు సరోవరమొకటి యుండెను. అదిమణిమయ సోపాన ములతోడను, మధురజలములతోడను వికసితపుండరీకములతోడను, మనో హరముగనుండెను. ఆవనమును సరోవరమును జూచి, సోదరా! చూచితివా, ఎంతమనోహరముగనున్నదో యీవనమనుచు, రాముడందు విహరించుచు, అందుండిన తోటమాలినిజూచి, ఓయీ! దేవపూజార్థము పుష్పములను దులసిని గ్రహింపవచ్చితి మనెను. అట్టియెడ తల్లియానతిచే గౌరిపూజకొఱకు పూలను గోయుటకు జానకి సఖీసమేతయై యటకువచ్చిమనోహరముగ, మృదుమధుర స్వరముతోబాడుచు పూలగోయుచుండెను. ఆసరోవరప్రాంతమున చూచు వారలకాశ్చర్యసంభ్రమములగొలుపుచు వర్ణనాతీతమైన దేవీయాలయ మొండు కలదు. సీతసఖీసమేతయై యందుస్నానమాచరించి, ప్రసన్నహృదయయై గౌరీమందిరమునకేగి ఆదేవినిపూజించి, తనకుతగినవరునిమ్మనిప్రార్థించుచుండెను.

అంతనొకచెలిపూలతోటనుదిలకింపజని, రామలక్ష్మణులజూచి, వారిమనోహర రూపంబుల కాశ్చర్యపడుచు, వివశహృదయయై, సీతచెంతకరిగి, పులకిత గాత్రియై, యానందాశ్రువులుదిగజార మృదుమంజుల భాషణముల మెల్లననిట్లనియె. సఖీ! యేమిచెప్పుదును! ఇద్దఱు రాజపుత్రులీవనమునవిహరించుచున్నారు. వారియందము నేమనిచెప్పుదును! వారిలోనొకడు శ్యామాంగుడు, నింకొకడు గౌరాంగుడును. వారిరువురు మేఘవిద్యుత్తులవలెబ్రకాశించుచున్నారు. వారు తరుణవయస్కులు. వారిని చూచి తీరవలయుననుచుండ, సీత యాదరముతో వినుచుండెను. అంతనాసఖీజనమునందొక తెలేచియిట్లనెను. ఈరాకుమారులునిన్న విశ్వామిత్రునితోవచ్చినవారై యుండవలయు. వారిరూపములజూచి పురవాసు లందఱు మోహితులై మనసీతకుతగినవరుడీతడనిప్రశంసించిరి. ఆలసింపకతక్షణమె వారినిచూచివత్తము, అనునామెపలుకులవిని సీతమిగులసంతసించుచు, ఆరాజ పుత్రులనెప్పుడుజూచెదనాయనిఆతురపడుచు, తనప్రియసఖిని ముందునడువుమని చెప్పుచు, తనలోనిభావమునుబ్రకటింపక, మందమందముగనడువసాగెను. నారద వాక్యములస్మరించుకొనుచున్న సీతకుడెందమున ప్రేమయతిశయిల్లు చుండెను. ఆ మునిమాటల కచ్చెరువందుచు, చకితకురంగలోచనయగు నాసీత, కంకణకింకిణీ నూపురధ్వనులెసగ గజగామినియై వచ్చుచుండెను. ఆ ధ్వనులను విని రాముడు లక్ష్మణునితో నిట్లనియె. సోదరా! కందర్పజైత్రయాత్రారంభమున విజృంభిం చెడి విజయమందుభిధ్వనివలె శ్రోత్రపేయమగునా ధ్వనిని వింటివా! యనుచు, నీశబ్దమెటనుండి వచ్చుచున్నదో యని నలుదిక్కుల దిలకింపుచు, సీతాముఖ చంద్రకాంతిని, తననేత్రచకోరములచే బానముచేయుచు, నాముఖకాంతిచే మిరి మిట్లు గొలుపుకన్నులమూయుచు, విప్పుచు, నెట్టకేలకుధైర్యమూని, లజ్జితుడై, యానందపరవశుడై ఇట్లు తలపోయసాగెను. ఈమెసౌందర్యము వర్ణనాతీతము. బ్రహ్మస్వయముగ నీమెనుసృజించి ప్రదర్శనమునకై యిట్లుంచెనుగాబోలు! బ్రహ్మ సర్వసౌందర్యములను ప్రోగుచేసి యీమెను సృజించియుండవలయు. స్త్రీలోకమునకీమె తలమానికము. ఈమెసొబగును జూడవిదేహరాజసుతయని తోచగలదు. ఈమెను కూతురుగగన్న విదేహరాజునకు సరియగు రాజులేడు. ఇట్లు సీతాసౌందర్యమును కొనియాడి రామచంద్రుడు లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముడా! ఈమెజనకరాజుపుత్రికానోపు. ఈమెకై ధనుర్యాగ మారంభింప

బడినది. ఈమె సఖులతో గూడి గౌరీతపమున్కై, ఇటకువచ్చి, యీపుష్ప వాటిక నెంతయు శోభిల్ల జేయుచున్నది. ఈమెముఖ చంద్రునిజూచినంత నె, పవిత్రమగు నామనంబు య్యేల లూగుచున్నది. మఱియు నాకుడిభుజమదరు చున్నది. రాఘవుల మనమెన్నడును కుమార్గమునకు బోజాలదు. లక్ష్మణా! ధర్మమో, యధర్మమో కాని నాదృష్టి యీమెయందు ప్రసరించుచున్నది. అని చెప్పుచు సీతాముఖాంభోజ మరందమును నేత్రభ్రమరము గ్రావుచుండ మైమ ఱచి యుండెను. సీతయు రాకుమారులెటనుండిరా! యని నలుదెసలు, దెల్లకలువ రేకులజిమ్మ్కై వడి, తనచూడ్కుల నిగిడించి చూడసాగెను. అంతలో పొదల చాటున నున్న రాకుమారులజూచి, నిధినికాంచిన నిరుపేదక్కై వడి యానందాశ్రు పూరితనేత్రయై, పులకితగాత్రియై, నిర్నిమేషముగజూచుచు, శరచ్చంద్రుని గాంచుచకోరమువలె పరవశయై, తన నేర్పుచే రాముని, నేత్రమార్గమున హృదయపీఠమునజేరిచి, కనురెప్పలచే నామార్గమును మూసి, బ్రహ్మానందము నందుచున్న సీతనుజూచి, సఖులేమియు బలుకక సంతసించుచుండిరి. ఆసమయ మున మేఘముక్త శశాంకునివలె సోదరులిరువురును పొదల చాటునుండి యటకు వచ్చిరి. రాముడు నీలమేఘశ్యాముడు. లక్ష్మణుడు శంపానిభచ్ఛవి. వారిముంగు రులు పరిమళపుష్పాలంకృతములు. శ్రమసలిలబిందు విలులితములగు తిలకములు వారిమోముల కెంతేని సొబగునొసగుచున్నవి. వారి కుండలకాంతులు దేహ ముల వ్యాపించుచుండెను. విండ్లబోలు బొమలచేతను, చక్కని నాసికలచేతను విశాలవక్షస్థలముల శోభిల్లు మణిహారములచేతను, నింపగు చెక్కులచేతను, దరహాసాలంకృత వదనములచేతను, కంబుకంఠముల తోడను, కర్ణాంతాయత నేత్రములతోడను, మదనుని లజ్జింపజేయుచు నాజానులంబిబాహువుల పూల సజ్జల గొనివచ్చుచున్న, పీతాంబరధారులగు నారాకొమరులజూచి, సఖులు నిశ్చేతనులైరి. అందొకజాణ ధైర్యమూని సీతచేయిపట్టుకుని ఇట్లు వలికె. సీతా! మనయెదుటనున్న రాకుమారులజూచి సంతసింపదగు నీసమయమున కనులమూసికొని గౌరీధ్యానము చేయుచుంటివా! అను నామాటలువిని జనక రాజపుత్రి, ఏమిచూడమనుచుంటివని నేత్రములువిప్పి, రఘుకులశిరోమణి నట గాంచి, యాపాదమస్తము నాతనిగాంచి, తనతండ్రిచేసిన ప్రతిజ్ఞనుదలపోసి మనమున చింతింపసాగెను. ఈమెభావమును సఖులుగ్రహించి జనకునిప్రతి

జ్ఞకు భయమందుచు, జానకీ! రేపీసమయమునకు మఱలవచ్చి పూలతోటనం
తను జూతము. నేడు కాలమతిక్రమించినదను, సఖీవచనములనువిని సీత లజ్జిత
హృదయయై, యీ యాలస్యమునకు దల్లియేమనునో! యని శంకించుచు,
రాముని తన హృదయసీమమునం దిడుకొని సఖులతోగూడి మందగమనంబున
పితృగృహమున కేగుచుండెను. అప్పుడచటి వనవిశేషముల జూచునెపమున
మరల మరల రాముని జూచుచు నాతని దనమనమున మెచ్చుకొనుచు, గాఢాను
రాగపాశబద్ధయై పోజాలక, తడబడుచు, దురారోహమగు శివధనువును
మాటిమాటికి దలచి దలంకుచు, రాకుమార్తె ప్రయాణసమయమును దెలిసి
కొని, యెట్టకేలకు వెడలిపోయెను. అట్లుపోయి శ్రీరాముని మోహనమూ
ర్తిని ప్రేమరసముచే హృదయఫలకమున చిత్రించుకొని, భవానీమందిరమున
కేగి చేతులమొగిడ్చి, వందనమాచరించి ఇట్లు స్తుతించెను. ఓగిరిరాజనందినీ! నీకు
జయమగుగాత. ఓశివముఖచంద్రచకోరీ! నీకుజయము. ఓగణేశకార్తికేయజననీ!
ఓత్రిభువనజనయిత్రీ! నీకుజయము. ఓయాద్యంతరహితా, అమితప్రభావా, నిన్ను
వేదములుసయితము తెలియజాలవు. నీవుమూలప్రకృతివి. ఓవిశ్వమోహినీ!
భవానీ, శారదానంతులును నీయనంతలీలల వర్ణింపజాలరు. నేనెంతదానను.
సకలజనమనోవీథులందు విహరించెడినీకునామనోరథమును వేఱుగ దెలుపలయునా!
యని పార్వతిపాదములబడివేడుకొను సీతభక్తినిమెచ్చి యాభవాని ఒకపూలదండ
నామెచేతిలో బడవేసెను. ఆమహాప్రసాదమును సాదరముగ గ్రహించి హృద
యమునధరించెను. అపుడాపార్వతి ఇట్లనెను. సీతా! నీ మనోరథమీడేరును.
నారదుని మాటనిక్కము. నీవెవనిజూచివలచితివో, ఆఘనశ్యాముడు కరుణా
నిధియగు శ్రీరాముడు నీకుభర్తకాగలడు. అను నాభవాని వచనములకెంతయు
సంతసింపుచు, నామెను స్తుతించుచు, రాజభవనమున కేగునామె కెడమకన్ను
దరజొచ్చెను. సీతాసౌందర్యమునకు మెచ్చుకొనుచు నామె గుణములనే
వర్ణించుచు నారాకొమరులిద్దఱు నటకొంత తడవుండి, పిమ్మట గురువునొద్ద
కేగిరి. నిష్కపటియు, సరళస్వభావముగల రాముడు విశ్వామిత్రునికి వనవిశేష
ములనెల్ల సవిస్తరముగ దెలిపెను. పిమ్మట విశ్వామిత్రుడు వారుదెచ్చిన పూల
నైకొని వారి నాశీర్వదించెను. అట్లు ముని యాశీస్సులనంది వారు మిగుల
సంతసించిరి. అంత భోజనానంతరము తత్వవేత్తయగు ముని మనోహరములగు

పురాతన గాథలజెప్పుచుండ నంతలో సూర్యుడస్తమించెను. ముని యాజ్ఞాను సారముగ వారిరువురును సంధ్యోపాసనమునకేగిరి. అంతచంద్రు డుదయించెను. ఆచంద్రుని జూచినతోడనే ఇందుముఖియగు సీత రామునికి జ్ఞాపకమునకు వచ్చెను. అపుడు రామచంద్రు డిట్లనుకొనెను. కళంకియగు నీచంద్రునకు, నిష్కళంకమగు సీతావదనమునకును సామ్యమెట్లు పొసగును? మఱియు నీ చంద్రుడు హాలాహలమునకు సోదరుడు. పగలు కళాహీనుడు. వృద్ధిక్షయములు కలవాడు. విరహిణులను పీడించుచుండును. ఇతనిని రాహువు మ్రింగివేయు చుండును. ఈతడు చక్రవాకములను విడదీయును. కమలవైరి. కాన నీతనికిని వైదేహీ మోమునకును సామ్యమెన్నటికిని సరిపడదు. ఇట్లనుకొనుచుండ నా రాత్రి చాలవఱకు గడచిపోయెను. అంతగురువునొద్దకుబోయి, వారి చరణము లకు వందనమాచరించి, కొంతతడవటనుండి, వారియొద్ద శలవుగైకొని, సోదరు లిద్దరు ముచ్చటలాడుకొనుచు నిద్రించిరి. పిమ్మటరాముడు మేల్కాంచి, లక్ష్మణా! లెమ్ము. సూర్యోదయసమయమగుచున్నది. చక్రవాకములుకూయుచు తమ సంతోషమును వెలిబుచ్చుచున్నవన లక్ష్మణుడులేచి, చూచి, అన్నా! నీవు చెప్పినట్లు అరుణోదయమగుటతోడనే కమలములు వికసించుచున్నవి. కుముదములు ముకుళించుచున్నవి. తారలు మందగిల్లుచున్నవి. ఇట్లే తమ రాకనువిని బలహీనులగు రాజులుగూడ మందగిల్లుచున్నారు. అన్నా! సూర్యుడు నీప్రతాపమును ప్రకటించున ట్లుదయించుచున్నాడు. నీభుజబల మీ దనువునందు ప్రకటమగుగాక! అనెడి లక్ష్మణునిమాటలకు మంద హాసమొనరించుచు, శౌచాదిక్రియలనిర్వర్తించి, స్నానముజేసి సాంధ్య కృత్యములనాచరించి, సోదరసహితముగ గురువునొద్దకేగి వందనమాచరించి కూర్చుండెను. అపుడుజనకుడు తనపురోహితుడగు శతానందునిరావించి, విశ్వామిత్రునికడకేగుమని పంపగానతడు రాజాజ్ఞానుసారముగ వచ్చి, విశ్వా మిత్రునికిజనకసందేశమును విన్నవించెను. ఆమాటలకువిశ్వామిత్రుడు సంత సించుచు, రామలక్ష్మణులజూచి శతానందునకు వందనమాచరింపుడన గురు నాదేశానుసారము శతానందునకు నమస్కరించి, గురువు సమీపమున గూర్చునియుండ విశ్వామిత్రుడిట్లనెను. నాయనలారా! ధనుర్యాగమును, సీతాస్వయంవరమునుజూచుటకు జనకుడు మిమ్ములబిలువబనిచెను. అనవిని

లక్ష్మణుడిట్లనెను. మానీంద్రా! తమయనుగ్రహమున్న యెడల మాకుతప్పక జయముకలుగగలదు. ఆమాటలువిని యచటిమునులందఱు నాశీర్వదించిరి. అప్పుడుశ్రీరాముడుసోదరసమేతుడై, మునులతోగలసి ధనుర్యజ్ఞ వాటమును దర్శింపబోయెను. రామలక్ష్మణులు రంగస్థలమునకుబయలు దేరిరనువార్తనువిని నగరవాసులందఱు, తమతమపనులనువిడిచి వారినిజూచుటకు గుంపులు గుంపులుగా వచ్చుచుండిరి. అట్లు వచ్చినవారలందఱకు నుచితాసనములనిడి, కూర్చుండనియమింపుడని, జనకుడుచతురులగుసేవకులనంప, వారునుమధురాలాపములనుడువుచు, సవినయముగ వారికనువగునాసనములజూపుచు వారల గూర్చుండబెట్టుచుండిరి. అప్పుడు రామలక్ష్మణులచటకువచ్చిరి. వారిమనోహరరూపములను, తారామధ్యవర్తియగుచంద్రునివలె, జూచి, యచటివారు సంతసించుచుండిరి. అప్పుడు రాజు లారామునిజూచి, వీరరసముశరీరధారియై విరాజిల్లుచున్నదా! యనితలంచుచుండిరి. కొందరారామమూర్తినిజూచి భయపడసాగిరి. కొందఱురాక్షసులు నృపవేషములధరించి యచటకువచ్చుచుండిరి. వారారామునిజూచి, ఈతడుప్రత్యక్షకాలుడా! యని యనుకొనుచుండిరి. నారీజనములు ప్రసన్నహృదయలై, తమతమరుచ్యనుగుణముగ గాంచుచుండిరి. విద్వాంసులు రాముని నాదిదేవునిగ జూచుచుండిరి. జనకునిబంధువులెల్లను తమయాత్మబంధువుగ జూడసాగిరి. రాజగుజనకుడు నతనిభార్యయు పుత్రనిర్విశేషముగ జూచుచుండిరి. యోగులు, శాంతైకరసరూపమగుపరతత్త్వముగ జూచుచుండిరి. హరిభక్తులు తమకిష్టమైనదైవమీతడేయనిచూచుచుండిరి. సీత అప్పుడురాముని జూచి, తనేత్రములుసఫలములయినవనియు, నాతడేతన జీవితసర్వస్వము - ప్రేమనిధానము అనియు వర్ణనాతీతమగు ప్రేమతో జూచుచుండెను. సకలప్రపంచమునుమోహింపజేయు నారామలక్ష్మణు లాసభను మోహింపజేయుటయం దాశ్చర్యమేమియులేదు. ఆపాదమస్తకము శోభా విరాజమానములగు నాదివ్యమూర్తులజూచి, కొందఱు భయమును, కొందఱానందమునుపొందుచుండిరి. సభ్యులందఱు నీబాలురజూచి నిశ్చేష్టులై యుండిరి. జనకుడు వారినిద్దఱనుజూచి ప్రసన్నుడై ఎదురేగి విశ్వామిత్రునిపాదపద్మములకు నమస్కరించి, సవినయముగ తానుజేసినప్రతిననువిన్నవించి, వారల కారంగభూమినంతను జూపింపదలచి యటునిటుజనుచుండ నాబాలురు దివ్య

యాపముల జూచి యచటివారందఱు నాశ్చర్యచకితులగుచుండిరి. విశ్వామిత్రుడు రాజా! నీవొనర్చినప్రతిజ్ఞయు, నీరంగమండపంబును నాకు మిక్కిలి సంతసమును గలిగించుచున్నవని జనకునితోననెను. అటనున్న యాసనములన్నిటిలోను విశాలము సుందరమునగు నొక యాసనముపై విశ్వామిత్రుని రామలక్ష్మణులను గూర్చుండబెట్టెను. చంద్రుని క్రమోలతారలవలె, ఇతరరాజులు రామచంద్రుని జూచినతోడనే, ఈతడు నిస్సందేహముగ ధనుర్భనముచేయునని కళావిహీనులై యనుకొనుచుండిరి. ఈతనిని జూచినతోడనే సీత యీతనికంఠమున జయమాలనుంచును. సోదరులారా! నామాటలవినుడు. మీరు తేజోబలప్రతాపాభిమానముల విడిచి, మీ మీ నెలవులకుజనుట మంచిది. ఇటనుండి యవమానమునందనేల యని వారిలో నొకడన నామాటలు విని యజ్ఞులగుకొందఱట్లనిరి. ధనుర్భనమన మీతడే చేయుటెట్లు? ఒకవేళచేసినను వివాహమెన్నటికిని జరుగనేబదు. సంగ్రామమున జముడుమాకెదిరియైనను జయింతుము. అను వారి యవివేకప్రసంగముల విని, భగవద్భక్తులగు ధార్మికులు మందహాస మొనరించుచుండిరి. ఈరాజుల గర్వమునణచి, సీతను వివాహమాడుటకు రాముడే తగునని కొందఱును, సీతజగన్మాతయనియు, రాముడు జగజ్జనకుడనియు, కానరాము నకే సీతాకళ్యాణమగునని భక్తులగు మఱికొందఱును అనుకొనుచుండిరి. మహాదేవునిహృదయము నందీశ్యామసుందరుడే నివసించునని కొందఱనుకొనుచుండిరి. మనజన్మములు ధన్యములు. ఈదివ్యకార్యమును జూడకుండ మనమెట్లు పోగలము! సుధాసముద్రతీరమును విడిచి ఎవడుమృగతృష్ణల కాసపడును? అని రాముని యనుపమరూపమును వర్ణించుచుండ, నంతరిక్షమున దేవతలు విమానము లందుండి యీసభను జూచుచు, రామలక్ష్మణులపై పూలవానను గురిపించుచుండిరి. ఇదియె మంచి సమయమనిదలచి జనకుడు సీతను పిలువనంపెను. అంతచతురలగు సుందరాంగు లాసీతను తోడితెచ్చుచుండిరి. శోభనాలంకారభూషితయై స్వయంవరమాలను కైకొనివచ్చుచున్న సీతాసౌందర్యము అతిలోకోత్తరము. వర్ణనాతీతమును. అయోనిజయగు నీమెకు నేమానవాంగనయు తులకానేరదుగదా! దేవాంగనలందును, సరస్వతివాచాల, పార్వతియర్ధాంగి, లక్ష్మిచపల. మఱియు విషసురలకుసహజ, ఇక రతిభర్తయనంగుడగుటచే దీనవదన. మఱియు నీసీతను, కాంతియను సుధాంబు

నిధియందు, సౌందర్య కచ్ఛపముపీఠున, శృంగార రసమును మంథరము నకు లావణ్యమను రజ్జువు దగిలించి, మదనుడు స్వయముగ మథించినపు డుద్భవించిన యీమెకీమెయెసాటియగుగాని ఇతరవనిత లెట్లు సాటియగుదురు? నిపుణసఖీజనము, మంగళగీతికల బాడుచు సీతను దెచ్చుచుండిరి. అప్పుడాసీత నవక్షౌమమును ధరించెను. సీతచే నాక్షౌమమునకును, క్షౌమముచే సీతకును పరస్పరశోభ కలుగుచుండెను. సఖులామెను భూషణములచే నలంకరించిరికాని యీమెచే భూషణములే యలంకరింపబడుటచే, భూషణభూష్యభావము వ్యత్య స్తమాయెను. రంగమండపమున కరుదెంచినసీతనుజూచి యచట వారందఱు మోమున్యమానులైరి. దేవదుందుభులు మ్రోగినవి. పూలవాన కురిసినది. అప్సరసలు నాట్యముచేయుచుండిరి. సీతాకరమందలి జయమాలను జూచి రాజులందఱు నివ్వెరబోవుచుండిరి. సీత, రాముని నిర్నిమేషముగ జూచుచు, సిగ్గుచే మరలుచు మరల మరల, నిధినివలె జూచుచుండెను. అచటి రాజు లందఱు సీతను జూచి మోహితులగుచుండిరి. సీత రామని జూచుచు, సమీ పమునందున్న గురుజనంబులను, బందుగులను, జూచి లజ్జావనతవదనయై, రామునిజూడ సంకోచింపుచు, సభనంతను కలియ జూచుచు, రామమనో హరమూర్తిని హృదయపీఠమునందిడికొని, సఖులజూచినట్లు నటించుచుండెను. సభలోనున్న సీతారాముల జూచి అచటివారందఱు నానందమందుచు, వీర లిరువురకు వివాహమయిన బాగుండునని తలంచుచు, బ్రహ్మను వేడుకొన సాగిరి. ఓవిధాతా! యీజనకుని పట్టుదలను మాన్పి, మాకుండెడికోర్కె నీతనికి గలిగించి, వెంటనే వివాహమగునట్లు గావింపుము. అట్లైనజానకికి తగిన వరుడు లభించును. నీశ్రమఫలించును. జగత్తునిన్ను మెచ్చును. అని బహుభంగుల నుడువ సాగిరి. జనకుడంత వందిజనమునుబిలిపింప వారాజనకవంశావళిని గీర్తించిరి. పిమ్మట జనకుడు తనప్రతిజ్ఞను చాటుడన వారానందముతోబోయి, రాజులనడుమ నిలిచి, వారందఱువినున ట్లాప్రతిజ్ఞను నుడువసాగిరి. ఓభూపతులారా! చంద్రసదృశు లగుమీభుజబలమును, రాహుతుల్యమగు నీ శివధనువు మ్రింగజూచుచున్నది. ఈధనువు, మిగుల కఠినమైనదనియు, మిక్కిలిబరువయినదనియు, నని మీ కెల్లరకు విదితమే. రావణుడు, బాణుడు, మున్నగు వీరాధివీరు లీధనుస్సునుజూచి, యేమియు చేయజాలక తమతమ నెలవులకుబోయిరి. ఈమహాదేవుని శరాస

మును యీరాజసభయందెవరువంచెదరో, అట్టివారు త్రిభువనవ్యాప్తమగు కీర్తితోపాటీసీతాకరగ్రహణ మొనరింపగలరు. అనునాప్రతిజ్ఞనువిని రాజులలో కొందఱు సంతసించిరి. అభిమానదుర్వ్యదగ్ధులగు కొందఱు క్రోధోద్రిక్తమాన సులై, నడుములబిగించిలేచి వేగిరపడుచు, నభీష్టదైవముల ప్రార్థించుచు, ధనువును సమీపించి, ఆవేశముతో నాధనువును ఎత్తసాగిరి. కాని ఒక డైనను ఏ యుపాయములచేతను కదల్పజాలకుండెను. వారిభంగ పాటునుజూచి తక్కినరాజులు సంశయింప మొదలిడిరి. మఱికొంద రింతటి వారే కదల్పజాలని యీవిల్లును మనమెట్లు కదల్పగలమని యూరకుండిరి. కొందఱిది పనికాదని పదివేలమహాయోధు లొక్కుమ్మడి నాధనువెత్త సమ కట్టి కదల్పజాలక పోయిరి. కాముకుని ప్రియోక్తులచే పతివ్రత చలించనట్లా ధనువెవ్వరికిని చలింపకుండెను. ఇట్లా భూపతులందఱును వైరాగ్యరహితు లగు సన్యాసులవలె నిందపాలైరి. అచటనున్న రాజలోకమంతయు నా ధను వును గదల్పజాలక, కళావిహీనమై, తమతమ యాసనముల జదిగిలపడెను. ఆ రాజబృందమునంతను జూచి జనకుడు వ్యాకులచిత్తుడై యీందోళనము నం దుచుండెను. పిమ్మట రోషాయత్తమనస్కుడై ఇట్లనసాగెను. దేశ దేశముల నుండి యనేకులగు రాజులిటకు వచ్చిరి. మఱియు, దైత్యులు, దానవులు, దేవ తలును, మనుష్యరూపముల ధరించి యిటకువచ్చియుండిరి. నాపుత్రి మిక్కిలి రూపవతి, గుణవతియు. ఈధనువునెత్తినకీర్తికి ఎవరును నోచుకొనరైరి. నే నేమిచేయుదును? ముల్లోకంబులలోను నీధనువును మోపెట్టగలవీరుని విధాత సృజింపలేదు గాబోలు! ఓ క్షత్రియులారా! నేనిట్లు భగ్నప్రతిజ్ఞుడ కావల సినదేనా! ఈశంకరచాపము నెత్తువా రెవరునులేరా! ఎత్తలేకుండినను కదల్ప నైన లేకుండిరేల! ఇట వీరులెవరును లేరా? పృథివియం దెవ్వరును వీరులు లేరని ఇప్పటికి దెలిసికొంటిని. నాబిడ్డకు వివాహయోగ్యతను బ్రహ్మ లిఖింప లేదు గాబోలు! ఈమె వివాహమునకు నాప్రతిజ్ఞనువీడిన నాసుకృతము నశిం చును. కాననాబిడ్డ యవివాహితయై యిట్లేయుండును. నేనేమిచేయుదును? నాప్రతిజ్ఞ పరిహాసమునకు పాలగునుగాబోలు! ఈ జనకునిమాటల విని బంధు గులు, మిత్రులు, సీతనుజూచి దుఃఖింపసాగిరి. లక్ష్మణుడుమాత్రము క్రోధోద్రి క్తుడై పండ్లుకొఱుకుచు, రాముడేమనునో యను భయముచే నేమియుననజా

లక, జనకునిమాటలు ములుకులై గ్రుచ్చుకొన, రామునిపాదములకు శిరము వంచి, మృదుమధురోక్తుల నిట్లనియె. అన్నా! రఘువీరులున్న యీసభ యందు ఎట్టి యసంబద్ధాలాపములు వినబడినవి? రఘువంశమణియగు శ్రీరామ చంద్రునీసభయందు జూచియు, జనకుడిట్టి యసంబద్ధముల నాడుచున్నాడు. ఓసూర్యవంశకమలసూర్యా? రఘువర్య! నావిన్నపము నాలింపుము. నేను గొప్పకై చెప్పుకొనుటలేదు. దురభిమానరహితుడనై సత్యమునే పలుకు చుంటిని. తమశలవైనచో, యీబ్రహ్మాండమునంతను బంతివలె నెత్తి విసరి వేయగలను. సుమేరుపర్వతమును మొదలంటబెఱికి, నాబాణపాతమున నపక్వ ఘటమునువలె తుత్తునియలజేయగలను. నామాటయటుండనిమ్ము. నీప్రతాపము ముందట నీపినాకపాణి పురాతనచాపమెంతటిదిప్రభూ! నాకాజ్ఞనిత్తువేని సవిలా సముగ నీధనువును కమలనాళమువలె ద్విశతయోజనములదూరము విసరివేతును. అట్లుచేయజాలనినాడు నేనస్త్రసన్యాస మొనరించెదను. మీపాదములాన ప్రభూ! అనునాక్రోధోద్రిక్తములగు లక్ష్మణుని పలుకులకు భూమికంపింప సాగెను. దిగ్గజములు చలించుచుండెను. రాజలోకమంతయు భయముచే వడకుచుండెను. సీతయానందించుచుండెను. జనకుడుచకితమనస్కుడయ్యెను. ఈవాక్యములవినిగురువగువిశ్వామిత్రుడు, రామచంద్రుడును, తమతోవచ్చిన మునులును, నానందముచే పులకితగాత్రులగుచుండిరి. రామచంద్రుడులక్ష్మ ణుని నివారించి, సాదరముగ తనసమీపమున - గూరుచుండబెట్టుకొనెను. విశ్వామిత్రు డిదితగినసమయమని తలంచి, సస్నేహమధురోక్తుల నిట్లనియె. రామచంద్రా! లెమ్ము! ఆలసింపకుము. ఈశివచాపమునువిఱిచిజనకునిదుఃఖ మును దూరముచేయుము. అనగుర్వాజ్ఞానుసారముగలేచి, గురుచరణములకు నమస్కరించి, మనమందీషన్మాత్రమయిను హర్షవిషాదగర్వములులేక, సహజ గంభీరస్వభావముతో నిలిచియుండెను. ఆతడుచూచువారలకు మృగమధ్యమున నున్న సింగపుగొదమవలెనుండెను. మంచోదయాద్రియందు, రామబాల సూర్యోదయమునుజూచి, సజ్జనకమలములువికసించెను. ప్రసన్నములైననేత్ర భ్రమరము లటుబోవుచుండెను. రాజులయాశారాత్రి నశించెను. కుటిల రాజనేత్రతారాగణములు క్షీణింపసాగెను. రాజాభిమానకుముదములు సంకోచమునందుచుండెను. కపటరాజఘూకములు మూలలందుదాగనారం

భించెను. దేవతాచక్రవాకములు శోకరహితము లగుచున్నవి. ఆసమయ
మున దేవతలు పూలవానను గురియింపుచుండిరి. రామచంద్రుడు గురువునకు
నమస్కరించి, ఏనుగుగున్న వలెనడచుచుండ, నచటివారందఱుపులకితగాత్రులై
యత్యాశ్చర్యముతోజూచుచుండిరి. మాపూర్వపుణ్యప్రభావముచే నీనీలమేఘ
శ్యాము డీశివధనుస్సును, మృణాలనాళమునువలె సనాయాసముగవిరుచుగాత!
యనితమతమయిష్టదైవంబుల వేడుకొనసాగిరి. జనకునిభార్య, రామచంద్రుని
నిర్భరప్రేమతోజూచుచు, దుఃఖాక్రాంతమానసయై ప్రియసఖులతోనిట్లనియె.
ఈబాలుడీధనువునెత్తుటకుసిద్ధపడుచున్నాడు. రాజులందఱుచూచువారలెకాని,
బాలకా! నీకీపనితగదనిచెప్పువారిరి, ఈబాలుమధనువునెత్తజాలక భంగపడుట
కన్న మిన్నకుండుటలెస్స. బాలునకు దగనిపట్టుదల కూడదు. రావణుడు
బాణుడు మున్నగువీరులెందరో యీధనువును కదల్పజాలకుండిరి. మరాళము
మందరమునెత్తుటకు సిద్ధపడినట్లు బాలరాముడు సిద్ధపడుచున్నాడు. ఇదిఏమి
చోద్యము! విధాతతలంపెట్లో తెలియకున్నది. మనసీతకువరుడులేడుగాబోలు!
నని యామెమెదీనవదనయై సఖులతోపలుకుచుండ, నిపుణయగుసఖియొకతె
మృదుమధురవాక్యముల నిట్లనియె. అమ్మా! తేజోవంతులకు వయసుతో
బనిలేదు. అగస్త్య డంభోనిధిని పానముచేసెను. సూర్యమండలముచూచు
టకు చిన్నదైనను త్రిభువనమందలి తమస్సును నశింపజేయుచున్నది. మం
త్రము చిన్నదైనను దేవతలందఱు దానికి వశులగుచున్నారు. మత్తేభ
మంకుశమునకు స్వాధీనమగుచున్నది. మన్మథుడు కుసుమాస్త్రములచే త్రిభువన
ములను జయించుచున్నాడు. కాన నీవు సందియమందనక్కరలేదు. ఈరామ
చంద్రుడు నిక్కముగ శివధనుర్భంగము చేయగలవాడను నామెమాటల విని,
రాణిమనమున సంతసిల్లుచుండెను. జానకి రామచంద్రునిజూచి, భీతిల్లుచు మన
మున తనయిష్టదైవమును ప్రార్థించుచు, మిక్కిలి యావేదన సందుచుండెను.
ఓమహాదేవా! ఓభవానీ! మిమ్ములబూజించిన సేవాఫలమును నాకిచ్చి నన్ను
సంతసింపజేసెదరని నమ్మించుంటిని. శ్రీరామచంద్రు డీధనువువద్దకు వచ్చు
నప్పటికి దీనిబరువు తూలప్రాయ మగునటుల జేయుము. ఓగణనాయకా!
వరదాయకా! నేటివఱకు నీసేవనెన్నడును మానియుండుటలేదు. నావినతుల
గొని యాశివచాపమునొక్క భారమును అతిస్వల్పమగునట్లు చేయుము. నా

మొరాలకింపవా తండ్రీ! యనిసీత బహుభంగుల ప్రార్థింపజొచ్చెను. రాముని ధైర్యమునకు దేవత లానంద బాష్పము లంకురింప బులకితగాత్రు లగుచుండిరి. రాముడింకను ధనువునొద్దకు రాకుండుటనుజూచి, రామసౌందర్య మోహిత యగుసీత మనంబున నిట్లు తలంచుచుండెను. ఓతండ్రీ! నీ విసుమంతయైన విచారింపక యిట్టి కఠినప్రతిన జేసియుంటివి. నీవలనిభీతిచే మంత్రులెవరును మారాడజాలరైరి. ఇట్టి విద్వత్సభయం దింతటియన్యాయము జరుగుచున్న దే. వజ్రతుల్యమగు ధనువెక్కడ? కోమలశరీరుడగు రాముడెక్కడ? నాకేమియు తోచకున్నది. పూలరేకులచే వజ్రమెట్లు భేదింపబడును? నీవనుగ్రహించి శివ ధనువు శ్రీరామునకు దేలికయగునట్లుచేయుము. అని సీతమిక్కిలి ఖేదపడుచు క్షణమొకయుగముగ గడుపుచు, మాటి మాటికిని రామునిదిలకింపుచు, లజ్జచే నవనతవదనయై, చంచలనేత్రయైన సీతముఖారవిందమున నాయలలూగుచున్న మీనమిథునమువలె నామెచూపులు గన్పట్టుచుండెను. ఆమెయొక్క లజ్జ యనురాత్రినిజూచి, వాగిందిందిరములు ముఖపద్మమునుండి బయటికిరాజాల కుండెను. తండ్రి మున్నగు గురుజనంబులను, సఖులనుజూచి సిగ్గున తలవంచు కొని మాటాడజాలక లోభి ధనమునుబైటపెట్టక కాపాడునట్లు, ఆమె కన్నీ ళ్లను బయటపడకుండ నాపుకొనుచుండెను. ఇట్లు బాధపడుచు మఱిలధైర్యము నవలంబించి, ఇట్లనుకొనెను. సర్వాంతర్యామియగు భగవంతుడు నాహృదయ మును దెలిసికొని నన్ను రామచంద్రుని సేవకురాలినిగ జేయును. పరిశుద్ధమగు ప్రేమలు వారిమనోరథములనీడేర్చును. ఇట్టిపవిత్రమగుప్రేమను భగవంతుడెన్న డును వమ్ముచేయడు. అనితలంచుచు, రామునిమాటిమాటికినిదిలకింపుచుగాధాను రాగముచేఫులకితగాత్రియైనసీతనుజూచి ఆమెభావములనుగ్రహించిగరుడుడుసర్వ మును జూచుకైవడి శివధనువువైపుజూచెను. రామచంద్రుడు శివచాపమునుజూడ గనేలక్ష్మణుడు సంతసించి, భూమిచలింపకుండ దనపాదాంగుష్ఠముతో త్రొక్కి ఇట్లనెను. ఓదిగ్గజములారా! ఓవరాహ, శేష, కమఠములారా, మీరుధైర్యమూని ధరిత్రినికాపాడుడు. రామచంద్రుడు శివచాపమునధిరోపించుచున్నాడు. అను చుండనంతరాముడు శివచాపమును సమీపించెను. అపు డటనున్న వారందఱు రామునకుజయమగుగాతమని యిష్టదైవములప్రార్థింపసాగిరి. అపుడుప్రజల సంశయము, రాజులయజ్ఞాన, మార్ష్య, గర్వ, అసహనములు, పరశురాముని

గర్వగౌరవములు, దేవతలపరికితనము, జానకీమనోవేదన, జనకునిపశ్చాత్తాపము, జనకభార్యదారుణదుఃఖము, ననుసామగ్రిని శివచాపమునునావయందుంచి, రామబాహుబలమహోదధియందానావనువిడిచిపెట్టిరి. దైవమేమి చేయునోయని తలంచుచు చిత్తరువులవలె నిశ్చేష్టులగునచటివారల మనంబులగ్రహించి, దుస్సహామగువేదనచేబాధపడుచున్న సీతహృదయమునుగ్రహించి, రాముడిట్లనుకొనెను. దాహముచేబాధపడి యసువుల గోల్పోయినపిమ్మట నాతని నమృతసరోవరమునముంచినను లాభములేదు. సస్యము నశించినపిదప మేఘుడు వర్షించిననుపయోగములేదు. అట్లే "సీత లేకున్న నీశివచాపమునెత్తిననేమిఫలము?" అనితలంచుచు, రామచంద్రుడు సీతాముఖాంభోజమును మఱియొకసారిచూచి, మనమునగురుపాదములధ్యానించి, యనాయాసముగనాశివచాపమునుగ్రహించి, రాజులందఱు జూచుచుండ రెప్పపాటుకాలములో, నెక్కిడెను. అట్లెక్కిడినారిని సారించుచు పూని లాగునంతలో నాధనువు భగ్నమాయెను. అప్పుడు ముల్లోకములుచలించునంతటిధ్వని బయలుదేరెను. ఆధ్వనికి సూర్యునిగుఱ్ఱములు బెగ్గటిల్లి త్రోవతప్పిపరుగిడుచుండెను. దిగ్గజములు భయకంపితములగుచుండెను. భూమి వడకుచుండెను. శేషవరాహకూర్మములు చలింపసాగెను. రాక్షసులు వికలమనస్కులై కృంగిపోవుచుండిరి. సురమునిబృందములు హర్షమునందుచుండిరి. శంకరచాపమునుఁబడ, రామభుజబలసాగరమునబడి, ప్రజలసంశయము మున్నగుపదార్థములతోపాటు మునిగిపోయెను. రాముడాశివధనుఃఖండములను భూమిపై బడవేయనంత గొందఱుభీతిని, మఱికొందఱుముదమునుబొందిరి. కౌశికాంబుధి రామచంద్రునిజూచి యుప్పొంగిపోవుచుండెను. ఆనందతరంగములు పెల్లెగయుచుండెను. దేవదుందుభులుమ్రోగినవి. అప్సరాంగనలు నృత్యమునుచేయుచుండిరి. పూలవానగురియుచుండెను. ఎక్కడజూచినను జయధ్వనులు వినవచ్చుచుండెను. బ్రహ్మాదిదేవతలు, మహర్షులు, రామచంద్రు నాశీర్వదించి ప్రశంసించుచుండిరి. వందిమాగధులు శ్రీరామచంద్రుని వంశస్తుతిని జేయుచుండిరి. జనకపరివారము, రామునకు, రత్నములను, సువర్ణమును వస్త్రములను, దిగదుడిచి ప్రజలకుపంచిపెట్టుచుండిరి. మఱికొందఱు భేరీశంఖకాహళాదిమంగళధ్వనులచే రాముని సేవింపుచుండిరి. స్త్రీలు మంగళహారతులనిచ్చుచుండిరి: వర్షముచే నలరారు సస్యమువలె, నాజనకునిరాణిహర్ష

పులకితగాత్రియైచూచుచుండెను. నదిలోపడి దరిగానకకొట్టుకొనిపోవుచునంతలో నొక దయాళువుచే గట్టుకు జేర్పబడినపాంథునివలె జనకుడువిగతశోకుడై సంతసించుచుండెను. రవికిరణసన్నిధిని దీపికానికరమువలె, నచటరాజులెల్లరు వెలవెలబోవుచుండిరి. సీతయానందమువర్ణనాతీతము. లక్ష్మణుడు చకోరమువలె రామచంద్రుని జూచుచుండెను. శతానందుని యాజ్ఞానుసారముగ సఖులు మంగళగీతికలబాడుచు, సీతను రామసన్నిధికి దోడ్కొనివచ్చుచుండ, నాసఖుల మధ్యను మరాళగమనముగలసీతయంగలావణ్యమెంతేనికొనియాడదగియున్నది. ఆమె తారలనడుమ చంద్రునివలెనున్నది. విశ్వవిజయశోభయో యనునట్లామె కరకమలమునజయమాలను ధరించియుండెను. ఆమెపైకి సిగ్గుపడుచున్ననుహృదయమునందమందానందము నందుచుండెను. కాని యానిగూఢానురాగమునించుకైనను ప్రకటించుటలేదు. అట్లు రామునియొద్దకుదోడ్కొనిరాబడిన రాజపుత్రి చిత్తరువువలెనుండెను. సఖులామెనుజూచి, తల్లీ! సిగ్గుపడక యీజయమాలను రామునికంఠసీమయందుంచుమనిరి. ప్రేమపరవశయగు నారాజపుత్రి, జయమాలనెత్తి రాముని కంఠమందు వేయజాలక అల్లనినిలబడి యుండెను. అప్పటి సీతారాములస్థితి యనుభవైకవేద్యము. సీతాహస్తగతమగు జయపద్మమాల, రామాదిత్యవికసితంబును, సీతాముఖచంద్రముకుళితమునై, చూపరులకెంతేని యానందమును గలిగించుచుండెను. సీతాముఖచంద్రుడు, రామదివాకరునిజూడ జాలకుండెను. ఇట్లు కొంతతడవుండి ఆజయమాలను సీత రాముని కంఠమునందుంచెను. అట్లుజయమాలాలంకృతుడగు రామచంద్రునిజూచి దేవతలానందించుచుండిరి. రామభాస్కరునివలన నచటి రాజులవదనకుముదములు ముకుళించినవి. పురమునను, ఆకసంబుననను మంగళధ్వనులు చెలరేగుచుండెను. దుష్టముఖములు మలినములైనవి. సజ్జనముఖములు తేజరిల్లుచుండెను.

బాలకాండ - ద్వితీయభాగము

దేవతాముని గణంబు లాశీర్వదింపుచుండిరి. దేవాంగనలు మంగళగీత ముల బాడుచు కుసుమముల జల్లుచుండిరి. బ్రాహ్మణబృందము వేదపఠన మొనరించుచుండెను. వందిమాగధు లుభయకులంబుల గొనియాడుచుండిరి. ఈవిషయమును దెలిసికొనిన ముల్లోకంబులు నానందపరవశములైనవి. పురస్త్రీ లందఱు నాసీతారాములకు మంగళహారతుల నొసంగుచుండిరి. కాంతిశృంగార ములు కలిసినట్లాసీతారాములు శోభిల్లుచుండిరి. సఖులు రామునకు వందన మాచరింపుమన లజ్జావశమున నట్లు చేయజాలక మనమున నమస్కరింపుచు నిట్లనుకొనెను. ఈతని పాదస్పర్శనముచే శిల స్త్రీరూపము నందినది. కాన నేనీతని పాదముల స్పృశించిన యెడల నాయంగుళీయకము లందలి రత్నములు, మణిహారమునందలి మగరాలును, స్త్రీరూపము నందగలవు. అప్పుడు వారంద ఱిలో నన్నీతడు గుర్తింపజాలడను సందియము వొడమచున్నది. కాన నేనీత నిని స్పృశింపకయే నమస్కరింతును. రాముడామె సంకల్పమును గ్రహించి చిరునగవుతో నుండెను. అప్పుడు క్రూరులగు రాజు లిట్లు తలంచిరి. ఇల్లలు కగనే పండుగ కాజాలదు. ధనుర్భంగ మొనరించినంత మాత్రమున సీతాకర గ్రహణ మీతడెట్లు చేయునో చూతము. మమ్ముల జయించిగదా ! వివాహ మాడవలయును ! వీరికిట సహాయ మేమియును లేదు. కాన వీరల బంధింపుడని కొందఱు దుష్టులగు రాజు లనుచుండ మఱికొందఱు రాజు లిట్లనసాగిరి. ఓరాజాధములారా ! సిగ్గులేక మీరిట్లు ప్రేలుచున్నారు. శివచాపమే రాముని కీర్తిప్రతాపములను ముల్లోకంబుల చాటుచున్నది. దైవము మీమోముల మసిని బూసి, జయమును రామచంద్రునకిచ్చెను. నష్టశౌర్యములగల మీరిట్లు పలికెదరేల ? ఈర్ష్యామోహముల విడిచి యీరామసింహకిశోరము నొక్క సారి తిలకింపుడు. లక్ష్మణుని క్రోధాగ్ని కాహుతులుగాక, జాగరూకులై మెలంగుడు. గరుడునిభాగమును కాకులు కోరునట్లు, మృగేంద్రుని వంతును నక్కలు కోరునట్లును, రామచంద్రుని జయమును మీరు కోరి పరిభవింపబడ నేల ! ఈప్రల్లదముల మానుడు. క్రోధోన్మాద కలితులకు విజయము సున్న. శివద్రోహుల కైశ్వర్య మెట్లబ్బును ? లోభి కీర్తినర్ధించినట్లు, కాముకుడు,

సత్ప్రవర్తనమును కోరినట్లును. హరిచరణసేవాపరాఙ్ముఖుడు మోక్షము నాసించినట్లును మీరింకను జయమును కోరుచున్నారా? అనుచుండ వారిప్రసంగములను విని సీత సంకోచింపుచు సఖులతోగూడి తల్లివద్దకు బోయెను. రాముడు నిశ్చలమగు సీతప్రేమను, నిరుపమాన సౌందర్యమును దలంచుకొనుచు విశ్వామిత్రుని దరికేగెను. దైవమేమిచేయునో యని సీతయు తల్లియు దలపోయుచుండిరి. లక్ష్మణుడు ఆరాజుల పరుషోక్తుల వినియు, రామునివలని భయముచే నేమియు ననజాలకుండెను. కాని కనుబొమల ముడి బెట్టుచు క్రోధారుణదృష్టుల నారాజులజూచుచు, గజబృందమధ్యవర్తియగు మృగేంద్రకిశోరమువలె నిటునటు సంచరించుచుండెను. ఈపరిస్థితినంతను జూచి యచటివా రాదుష్టరాజుల నిందింపసాగిరి. ఇంతలో నాధనుర్భంగధ్వనిని విని, భృగుకులకమల మార్తాండుండగు పరశురాము డటకువిచ్చేసెను. ఆతనినిజూచి భూపతులెల్లరు గడగడ వడంకుచు దూరముగబోయి దాగుకొనసాగిరి. స్వర్ణచ్ఛాయకలశరీరమందును, విశాలఫాలభాగమందును, భస్మమును ధరించి, సహజమగు క్రోధముతో పరశురాముడాసభను దిలకింపసాగెను. జటాలంకృతమస్తకము, చంద్రసదృశమగు ముఖము, క్రోధారుణనయనములు, భృకుటీయుతలలాటము, వృషస్కంధము, దీర్ఘబాహుయుగళము, విశాలవక్షస్థలమునుగలిగి, యజ్ఞోపవీతధారియు, జపమాల, వ్యాఘ్రాజినము, వల్కలము, ధనుర్బాణములు, ధరించి, కార్తవీర్యార్జునభుజవనభంజకమగు పరశువును భుజమందిడికొని, వీరశాంతరసములు కలిసినట్లున్న యాపరశురాముని జూచి, యచటి రాజులందఱును, భయభ్రాంతులై, తమతమ కులగోత్రముల జెప్పుచు ప్రణమిల్లసాగిరి. పరశురాముని జూడగనే జనకుడు, తనయవస్థ వెనుకకుగోయి, ముందునూయి యనునట్లున్నదని, తలంచుచు, దైవముమీద భారముంచి, సబహుమానముగ నమస్కరించి, సీతచే నమస్కరింపజేసెను. అంతనతడాశీర్వదింప నాతనియనుమతిగొని, సీత నంతఃపురమునకు జెలులు దోడ్కొనిపోయిరి. అంత విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో గలిసివచ్చి పరశురాముసకు నమస్కరించి, వీరలు దశరథుని తనయులని విన్నవించెను. భార్గవుడు వారలనాశీర్వదించి, రామచంద్రుని సావధానముగ జూచి, జనకునితో నిట్లనెను. జనకా! యీజనమంతయు, నిట కేలవచ్చెను? రాజమండలి ఇక్ష్వాకుల

కోపోద్రిక్తముగనున్నది? అనవిని జనకుడు చేతులజోడించి సవినయముగ నన్ని సంగతులను మనవి చేసెను. అంతభార్గవుడిటునటు జూచి, శివధనుఃఖండముల నటగాంచి, కోపోద్దీపితమనస్కుడై, ఇట్లుపలికెను. ఓరీమూర్ఖా! ఈచాపమునెవ రిట్లుభంజించిరి? ఆదుష్టునినాకుజూపుము. అట్లుచూపవేని నీరాజ్యమునంత నశింప చేయుము ననభయభ్రాంతచిత్తుడగు జనకుడేమియు బలుకజాల కూరకుండెను. కుటిలపార్థివులు సంతసింపసాగిరి. నగరవాసులేమి యుపద్రవము వాటిల్లునో యని భయపడుచుండిరి. దైవమీశుభసమయమునం దిట్టి దుస్సంఘటనము నేల కల్పించెనని జనకుని రాణి విచారించుచుండెను. పరశురాముని స్వభావము వినియున్న సీత మూర్ఛనందుచుండెను. శ్రీరాముడు మాత్రము హార్థివిషాద ములు లేక నిర్భయముగా నాతనితో నిట్లనెను. స్వామీ! తమదాసుడగు రామునిచే నీచాపమిట్లాయెను. ఈదాసుని బాహుబలముగాని, శివచాపము యొక్కదౌర్బల్యముగాని తెలియకుండుటచే నిట్టిప్రమాదము వాటిల్లినది, కాన క్షమింపుడన విని, క్రోధోద్దీపితమానసుడైన పరశురాము డిట్లనియె. రామా! శత్రువు సేవకుడైనను విడువరాదు. శివధనుర్భంజకుడు నాకు కార్తవీర్యార్జునుని వంటివాడు. వాడెట్టి వాడైనను వానిని నేను తప్పక సంహరింతును. అనవిని చిరు నగవుతో రాము డనాదరముతోప నిట్లనియె. స్వామీ! మేము బాల్యమున ననేకధనువుల విఱిచితిమి. అట్లే యీచాపమును విఱిగినది. దీనికై యింత యాగ్ర హింపబనిలేదు. అనవిని పరశురాము డోనృపాత్మజా! నీకు కాలమాసన్నమైనట్లగ పడుచున్నది. జీవితేచ్ఛకలవాడెవ్వడును నాతో నిట్లు మాటాడజాలడు. శివధను ర్మాహాత్మ్యము సకల జగద్విదితము. ఇది యితరధనువులతో నెన్నడును సరి కాదు. అనవిని లక్ష్మణుడిట్లనియె. మానివర్యా! ధనువులసారము మాకు దెలియును. ఈపురాతన ధనువును విఱిచిన మీకేమి నష్టము? మాయన్నగా రీచాపప్రసిద్ధిని విని ఎక్కుబెట్టుదలచి ఎత్తి ఎక్కిడుసరి కదియె విఱిగినది. అందు మాయన్న తప్పేమున్నది? మీకింతకోపమేల? నన విని పరశురాము డాతనివైపు చురచుర జూచుచు, నోరీ! నీకు నాప్రభావమేమియు దెలియదనుకొందును. ననొకసామాన్యమునిగ దలంచుచుంటివి కాబోలు! నీవు పసివాడవగుటచే నూరకుంటిని. నేను క్షత్రియకులవైరి ననుమాట జగద్విదితము. నే నిరువది యొక్కమారు క్షత్రియవంశములను నిర్మూలించి, వారి యైశ్వర్యములను

విప్రుల కొసంగితిని. సహస్రబాహుడగు కార్తవీర్యార్జునుని ఖండించిన యీ పరశువును జూడుము. దీనిపాలబడి నీ తల్లిదండ్రుల దుఃఖితుల జేయకుము. అనెను. లక్ష్మణు డామాటలు విని సవినయముగ నిట్లనియె. స్వామీ! మీరు మిగుల యుద్ధప్రియులువలె నున్నారు. మాటిమాటికి పరశువు నిచ్చేలజూపెదరు? ఫూత్కారముచే పర్వతము లెగుయునా! మీరీ పరశువును ధనుర్బాణములను ధరించుటచే నిట్లనుచున్నారు. కాని మీరు భార్గవులగుటచే బ్రాహ్మణులు. కాన మీమాటల కెంతకోపము వచ్చినను నేనాపుకొనుచున్నాను. మాకులమునం దెవరును గోబ్రాహ్మణులయందు పూజ్యభావముచేత, పౌరుషమును జూపరైరి. కాని తమవాక్కులు వజ్ర ములవలె కఠోరములై యున్నవి. మీకీ ధనుర్బాణములు వ్యర్థములని తోచుచున్నది. మహాత్మా! మిమ్ములని ట్లనుచి తాలాపములచే శ్రమపెట్టు చున్నందులకు నన్ను మన్నింపుడను లక్ష్మణుని పలుకులకు మిగుల కృద్ధుడగు భృగునందనుడు మరల నిట్లనియె. ఓవిశ్వామిత్రా! వీనిమాటల వింటివి గదా! ఉద్ధతుడు మూర్ఖుడు నగు నీబాలకునకు మృత్యు వాసన్నమైనది. మఱియు వీనిమూలమున వీనివంశ మంతయు నశింపక తప్పదు. సూర్యవంశ మున కీతడు కళంకమువలె నున్నాడు. ఇతనిని కాలము గ్రసింపుచున్నది. నేనుముందుగనే జెప్పుచుంటిని. నాదోష మేమియునులేదు. ఈతనిని నీవు రక్షింపదలచితివి కాబోలు. నాపరశువున కడ్డులేదనుసంగతిని గుర్తిడుకొనుము. అనుపరశురాముని తీవ్రవచనములను విని రామానుజుం డతని కిట్లనియె. ఓమునివర్యా! తమ కీర్తిప్రతాపముల వర్ణింప నేరికిని దరముకాదు. కాన తమరే తమకీర్తిని పొగడుకొనుచున్నారు. పరులు కొనియాడిన తమకంత సంతోషము కలుగదు. కాన తమ్ము తామే కొనియాడుకొనుచున్నారు. మీరు యుద్ధ ప్రియులు గాన నీవ్యర్థాలాపముల మాని అందుకు సంసిద్ధులయిన బాగుండును. శూరులు వాగ్యుద్ధమును చేయరు. శత్రువు సంగ్రామమందు నిలిచియుండ, నూరక కాలహరణమేల? మీరు కాలమును వెంటనిడికొని వచ్చితిరిగాబోలు. మాటిమాటికిని కాలము కాలమని బెదరించుచుంటిరి. అని పలుకు లక్ష్మణుని పరుషోక్తులకాముని యుగ్రుడై, తనభుజముపై నున్న పరశువును చేతబూని యిట్లనియె. ఓసభ్యులారా! యీబాలకుని పరుషవాక్యములను వినియుంటిరి

గదా ! ఈబాలకుని సంహరించినను నాతప్పేమియునులేదు. ఇంతవఱ కీతడు పసివాడని యేమియుజేయుటకు సంకోచింపుచుంటిని. అన నా భార్గవునిమాట లకు విశ్వామిత్రు డిట్లనియె. ఓమహాత్మా ! యీబాలుని యపరాధముల మన్నింపుడు. సజ్జనులు బాలురదోషములను పాటింపరు. అని విశ్వామిత్రుడు శాంతవాక్యముల బలుకుచుండ నాపరశురాము డిట్లనియె. నేను సహజముగ క్రోధనుడను. దానికితోడు నాచేత పరశువుకలదు. గురుద్రోహి నాయెదుట నుండ నేనెట్లు సహింతును ! కాన నీకఠినకుఠారముచే శత్రువును చీల్చినాగురు ఋణమునుదీర్చికొందును. లేనియెడల నేను గురుద్రోహి నగుదుననిపలుక విశ్వామిత్రుడు లోలోన నవ్వుకొనుచు నిట్లనితలంచెను. ఈ భృగునందను డింతవఱకు భగవంతుడగు శ్రీరాముని శత్రువుగ దలంచుచున్నాడు. ఈతడు శివచాపమును యిక్షుఖండమునువలె ఖండించియుండెను. దీనిని జూచియు నీతని ప్రభావమును దెలియజాలకున్నాడు. ఇంతలో మఱల లక్ష్మణు డిట్లనియె. ఓమానివర్యా ! జగద్విఖ్యాతమగు తమప్రభావము నెవరెఱుంగరు ? పితృఋణము తీరినదనియు, గురువులఋణము తీరలేదనియు తమమనము బోధపడుచున్నది. మాశిరములనూడ్చి మీ గురువులఋణమును దీర్చికొనవలెనని మీ తలంపు కాబోలు ! అట్లైన నేనందులకు సిద్ధముగ నున్నాను. మీరాయుధ్మాలపొదిని తెరు వుడు. లేక నన్ను తెరువుమనిన దెరిచెదను. అను నాతని ధీరోక్తులకు ద్విగుణిత క్రోధుడై, పరశురాముడు పరశువును సంధించుచుండెను. అచటి వారలా పరశు వును జూచి యాహాకారముల నొనరింపుచుండిరి. అప్పుడు లక్ష్మణు డిట్లనియె. ఓక్షత్రియాంతక ! తాము మాటిమాటికిని పరశువునుజూపుచున్నారు. తమ్ముని బ్రాహ్మణులని విడచుచున్నాను. తామెన్నడును యుద్ధములందు దృఢయో ధుని కలిసియుండలేదు కాబోలు ! మీరు దేవబ్రాహ్మణులందు వీరులముకాని మావంటివారికి వీరులుకారనునంత నాతనిమాటలవిని యచటివారు, లక్ష్మణా ! నీవిట్లనుట తగదని లక్ష్మణునివారించిరి. ఇట్లూడ తగదని రాముడు కనుసైగజేసి శాంతింపజేసెను. లక్ష్మణవాక్యములను నాజ్యాహుతిచే ప్రజ్వరిల్లు చుండిన భార్గవక్రోధాగ్నిని జూచి, రాముడు చల్లనిమాటలతో నిట్లనియె. ప్రభూ ! బాలకునియందు కృపను జూపుడు. ఈతడు పసివాడుకాన వీనియందు క్రోధ మూనకుడు. ఈతడు తమప్రభావమును దెలియ కిట్లనుచున్నాడు. తామొక్కడ !

యీ పసివాడెక్కడ! బాలుడ నుచితకార్యముల జేసినచో, గురువులు పైకి కోపమునందియు, లోన బ్రసన్నులగుదురు. ఈతడు క్షీరకంఠుడు. వీనిని తమ దాసుడని మన్నించి కృపజేయుడు. సమశీలురు. ధీరులునగు తమకు నేజెప్పవల సిన దేమియులేదు. అను రామవచనములచే నాతడు కొంతవఱకు శాంతినం దెను. అప్పుడు లక్ష్మణుడు మందహాసమును జేయుచుండెను. నవ్వుచున్న లక్ష్మ ణుని జూచి క్రోధోద్దీపితుడైన ముని యిట్లనియె. రామా! నీ సోదరుడు విష కంఠుడుగాని క్షీరకంఠుడుకాడు. ఈతని శరీరము శుద్ధమైనను మనసుమాత్రము విషము. ఈనీచుడు మృత్యుతుల్యుడ నగు నన్నుగూడ నిరసించుచున్నాడు. అన విని నవ్వుచునే లక్ష్మణు డాతనికిట్లనియె. స్వామీ! క్రోధము అజ్ఞానము యొక్క ప్రధానకార్యము. దీనికి వశులగువా రెట్టి యనుచితకార్యముల కైనను వెనుదీయరు. మునిరాజా! నేను తమకు దాసుడను. కానమీరు ప్రసన్నులై నాయందు దయజూపుడు. విరిగిన ధనుఃఖండముల మీకోప మతుకజాలదు. కాన మీరీకోపమును జాలించి కూర్చుండుడు. ఇట్లెంతసేపు నిలుచుండెదరు? తమకీ ధనువునం దెక్కుడు మక్కువగలదేని నేనొక యుపాయమును జెప్పెద వినుడు. నిపుణులగు శిల్పుల రావించి మఱల నీధనుఃఖండముల నతిగించుకొనుడు. అని లక్ష్మణు డనుచుండ నంత జనకుడు భయమందుచు లక్ష్మణా! జాగ్ర త్తగ నుండుము. ఈయనవసరసంభాషణము నీకు తగదు. అనుచుండ నచటి వారు గడగడవడకుచు నిట్లనుకొనసాగిరి. ఈబాలుని వాక్యముల విని ముని ఏమిచేయునో! ఈతడూరకుండిన బాగుండెడిది. లక్ష్మణుని పలుకులచే పరశు రాముని బలము క్షీణింపసాగెను. పిదప నాముని శ్రీరామచంద్రుని సానుగ్ర హముగ జూచి యిట్లనెను. రామా! నీతమ్మునికి బుద్ధిని జెప్పుము. నేనింతవ అకు నాతని క్షమించితిని. ఇట్టి మలినహృదయుని అందము వ్యర్థము. విషపూ రితమగు సువర్ణఘటమువలె నున్నాడు. అను నామాటలవిని లక్ష్మణుడు మఱల నవ్వసాగెను. అంత రాముడు లక్ష్మణుని కనుసంజ్ఞచే వారింప నాతడు గురు వగు విశ్వామిత్రుని పజ్జకేగెను. అంతరాముడు చేతులుజోడించి, మృదుమధుర భాషల నిట్లనియె. స్వామీ! తాము సర్వజ్ఞులు. స్వభావచపలులగు బాల భాషలను జెవిని పెట్టకుడు. సత్పురుషు లెన్నడును బాలకుల దోషముల గణింపరు. ఇపు డతనితో తమకేమియు బనిలేదు. తమకోపమునకు కారణ

మగు నేను తమఎదుట నుంటిని. కాన తమయనుగ్రహమునకు గాని, శిక్షకు గాని పాత్రుడనగు యీమీదాసుని తమయిష్టానుగుణముగ వినియోగించు కొనుడు. మీక్రోధమెట్లు చల్లారునో శలవిచ్చిన నేనట్లు నడచుకొను వాడను, అనురాముని వినయోక్తులవిని ముని యిట్లనియె. రామా! యింతవఱకు నీతమ్ముని సోల్లుంభవాక్యముల వింటివికద. నాక్రోధమెట్లు పోవు నంటివి. నాక్రోధముచే నేనేమి చేయకలిగితిని? ఈనాపరశువు సామాన్యముకాదు. దీనిశబ్దము శత్రుస్త్రీలకు గర్భనిర్భేదకము. ఈపరశువు చాలరాజబృందముల సంహరించినది. కాని మిమ్ముల నీపరశు వేమియు చేయజాలకున్నది. లోపల కోధాగ్ని ప్రజ్వరిల్లుచున్నది. కాని చేతులు మాత్రము కదలకున్నవి. సకల రాజవిధ్వంసకమగు నీకుఠారము ప్రవర్తించుట లేదు. నాకును బలము క్షీణించు చున్నట్లగపడుచున్నది. నాస్వభావము మాఱుచున్నది. ఇంతవఱకు దయచే వదలిన శత్రువు ఒకడైననులేడు. నాహృదయ మతినిష్ఠురము. అట్టినాకీసమయ మునం దీశాంత మెటనుండివచ్చినది? నాకీయవమానదుఃఖమును భగవంతుడే సహింపజేయుచున్నాడు. అంతలక్ష్మణుడు శిరమువంచి చిరునగవుతో నిట్లనియె. స్వామీ! తాముకృపానిధులు. మీరు కృపను దాల్చినపుడె యిట్లు ప్రజ్వ రిల్లుచుంటిరిగదా! క్రోధముతో నున్నపుడు మిమ్ముల జూడ నేరికి దరమగును? అనిన విని జనకునివైపు తిరిగి, జనకా! ఈబాలుని మూర్ఖత్వమునుజూచితివి గదా! ఈక్షణమున నీమూర్ఖుని యమున కతిథినిగ జేయుదును. నీవీ మూర్ఖుని నాకనులఎదుటనుండి తప్పింప వెందులకు? వీని చెడునడవిడిని జూచుచు నూరకుండెదవేల? అని జనకు ననుచుండ, లక్ష్మణుడు నవ్వుచు మఱల మునితో నిట్లనియె. స్వామీ! మీరితరులతో చెప్ప బనిలేదు. మీకు స్వాధీనములైన కనులమూసికొనిన, మీకీశత్రువు అగపడడు. అట్లుండిన మీతోనెవఱును మాటాడజాలరు. అను నాపలుకులు విని పరశురాముడు సక్రోధముగ రాముని జూచి యిట్లనియె. మూర్ఖా! నీవీశివచాపమును విఱచు టయే గాక, నీసోదరుని నిందావాక్యములను సమర్థింపుచుంటివా? నీయవినీతిని నేనెఱుగనను కొంటివి కాబోలు! నీసమ్మతిలేనిది నీసోదరు డిట్లుల పలుకును? నీవేమియు నెఱుగనివానివలె కపటంబుల జేయుచు వినయమును జూపుచు నీతమ్మునిచే ప్రేలింపుచుంటివి. ఏది ఎట్లున్నను నీవు యుద్ధముచేసి నన్ను సంత

సింప జేయవలయు. లేదేని రామనామమును వదలుకొనుము. ఓరీ శివద్రోహీ! ఈకపటమును చాలించి యుద్ధమునకు సిద్ధముకమ్ము. ఇపుడె సోదరసహితముగ సంహరింతుననుచు తన ప్రకాశమానమగు పరశువు నెత్తబోయెను. అపుడు శ్రీరాముడు మనమున నవ్వుకొనుచు నిట్లనెను. 'ఓదయామయా! మాయపరాధములు క్షమింపుడు. మేమపరాధులమని మామాటలే చెప్పుచున్నవి. వక్ర చంద్రుని రాహువుసయితము గ్రసింపడుగద. బాలురనేరమున కింత తీవ్రత యేల? మీరు క్రోధమును వీడుడు. మీకెట్లుసమ్మతమో అట్లే ప్రవర్తింతును. పరశువు మీహస్తమునందే యున్నది. ఎదుట నేను శిరమును వంచియుంటిని. ఈమీదాసుని మీరెట్లుచేసినను చేయవచ్చును. భూసురోత్తమా! నేవకు నితో యుద్ధమెందైనను కలదా? తమ మునివేషమును జూచి మాబాలకు డేమోమో పలికియుండెను. మీస్వభావము నెఱుగక పలికినమాటల గణింప కుడు. మీరు కుఠారధనుర్బాణముల ధరించుటచే మహావీరులని యెంచి, మీకు కోపమును పుట్టించుటకట్లనెనే కాని మఱేమియుగాదు. తమనామమును వినియుంటిమే కాని తమ దర్శనమును చేసియుండలేదు. వాని వంశమును బట్టి అట్టివాక్యములనెను కాని తమయందు మునిలక్షణము లగపడిన నసంశ యముగ తమపాదములకు ప్రణమిల్లెడివాడు. బ్రాహ్మణులు దయామయులు కాన మాపొరపాటుల మన్నింపుడు. మాకును మీకును పోలికయేలేదు. పాద ములకు మస్తకమునకున్నంత యంతరముకలదు. రెండక్షరములుగల నామ ము నావలె చాలాచిన్నది. పంచాక్షరభరితమగు తమ నామము గురువు. మఱియు మాకొక్క ధనుర్గుణమేకలదు. తమకు నవగుణభరితమగు యజ్ఞోప వీతముకలదు. అన్నివిధముల మీరే ఘనులు. కానమాయపరాధముల క్షమిం పుడు. అని రాముడు మాటమాటికిని విప్రోత్తమా! యని బలుకుట విని పరశు రాముడిట్లనియె. రామా! నీవును సీతమ్మనికి దీసిపోవు. నన్ను బ్రాహ్మణ మాత్రునిగ దలంచుచుంటివి కాబోలు! నే నెట్టిబ్రాహ్మణుడనో వినుము. నేను నాక్రోధమను యగ్నియందు, బాణమను స్రువముచే, చతురంగసేన లనుసమిత్తులను, యీమహీపతులను పశువులను యీనాపరశువుచే ఖండఖండ ములుగజేసి భూరిదక్షిణలతో ననేక సంగ్రామాధ్వరములుజేసి యుంటిని. నాప్రభావమును నీవు దెలిసికొనజాలక కేవలవిప్రుడని తలచి ఇట్లనుచుంటివి.

నీకీవిల్లును విఱచుటచే నహంకారము హెచ్చినది. ఇంతమాత్రమున ప్రపం చము నంతను గెలిచితి ననుకొనుచుంటివికాబోలునను భార్గవునిమాటలు విని శ్రీరాము డిట్లనియె. ఓమునికులతిలకా ! తామాలోచించి మాటాడవల యును. అతిస్వల్పములగు మాయపరాధములను తాము క్రోధవశమున నెక్కు డుగి భావించుచున్నారు. ఈపురాతనధనువు నెక్కిడునంతలో విఱిగిపోయెను. ఈమాత్రపుపనికి యభిమాన మెందులకు? నేను మిమ్ముల బ్రాహ్మణులని తెలి సియు యవమానింతునా? నేనిదివఱ కెట్టివీరునకును శిరమువంచి యుండుట లేదు. మీరు త్తమ ద్విజులని శిరమును వంచియుంటిని. దేవదానవులతోడను మీతో సమానమగు వీరులతోడను మేము యుద్ధము నొనరింతుము. వారు వీరనఁజేల కాలునితోనైనను యుద్ధ మొనరింతుము. ఱ్ఱత్రియు డెవ్వడైనను యుద్ధమునకు వెనుదీయడు. అట్లు చేసినచో కులమునకు కళంకము నాపాదిం చినవాడె యగును. అదియట్లుండనిండు. మారఘువీరులతో యుద్ధమునకు కాలుడైనను వెనుదీయును. మీవిప్రవంశము గొప్పదని మాకు దెలియును. కావుననే మీకునేను శిరమునువంచితిని. అను నారాముని మధురగంభీరభా షణములచే పరశురాముని హృదయకవాటము దెరువబడెను. అంత నాతడు శాంతచిత్తుడై యిట్లనెను. రామచంద్రా! యీవిష్ణుచాపము నెక్కిడి నాసంశ యములబాపుము అని పలుకుచు నాధనువును రాముని హస్తమందిడెను. తోడనే శ్రీరాముడు దాని నెక్కిడెను. అదిచూచి పరశురాము డాశ్చర్యచకి తుడై, రామప్రభావమును దెలిసికొని, ఆనంద పులకితగాత్రుడై, హృదయ మునందత్యంత ప్రీతిగలిగి, చేతులజోడించి యిట్లు స్తుతింపసాగెను. ఓరఘువంశక మలబాంధవా! ఓదనుజకులదహనా, ఓకృపాజలనిధీ, నీకుజయము. ఓసురవిప్రధేను హితకారీ! మదమోహాలోభభ్రమహారీ! జయవినయశీల! కరుణాగుణసాగర! మునివచనాచరణా! జయ, అతిసాగరసేవకసుఖదా! సుభగసకలాంగా! జయ, ఓసుందరముఖవిజితచంద్రా! రామచంద్ర! ఏకముఖుడనైన నేను నిన్నెట్లుస్తుతిం పగలను? ఓమహాదేవమానసహంసా! నీకు జయము. ఓక్షమాంబుధీ! నేను తెలియక నిన్ననుచితవాక్యముల నంటిని. నీ సోదరునితోపాటు నన్ను క్షమి యింపుము. అని పలుమారు పలుకుచు రామచంద్రునియొద్ద ననుజ్ఞనుదీసికొని, పరశురాముడు తపోవనమునకేగెను. దీనినంతనుజూచిన రాజులు భయపడుచు

తమతమనెలవులకు జననారంభించిరి. దేవతలు దుందుభులమ్రోయింపుచు పూల వాననుగురిపించిరి. నగరవాసులందఱును మనభయము లిప్పటికి తీరినవని సంతసించుచుండిరి. సంతోషవశమున నగరమున జయభేరుల మ్రోయింపుచుండిరి. సుందరాంగులు మధురాలాపముల రాముని గీర్తింపుచుండిరి. అప్పుడు జనకుడు, పెన్నిధి నందినపేదవలె యమితానందము నొందుచుండెను. చంద్రోదయమును జూచిన చకోరివలె, సీతవిగతభయయై సంతసించుచుండెను. పిమ్మట జనకుడు విశ్వామిత్రునకు మ్రణమిల్లి, స్వామీ! మీయనుగ్రహముచే శ్రీరాముడు నాప్రతిజ్ఞను నెరవేర్చి నన్ను కృతార్థునిగ జేసెను. కాన నే జేయవలసినపని నానతిండు. అని ప్రార్థించెను. ఆమాటలకు సంతసించుచు విశ్వామిత్రుడిట్లనియె. ఓరాజచంద్రమా! ఈధనుర్భంగముచే సీతాకల్యాణము సిద్ధించినదని యెల్లరు ననుకొనుచుందురు. కాన మేధావులగు బ్రాహ్మణులతోడను, గురువుల తోడను ఆలోచించి, కులాచారమునుబట్టి విధిప్రకారము వివాహమొనరింపుము. అను మునిపలుకులు విని జనకుడు తన పురోహితుడగు శతానందుని తోడిచ్చి వారితో కొందర దూతల యయోధ్యా పురమున కంపెను. మంత్రుల రావించి నగరము నంతను చక్కగ నలంకరింపజేయుడని యాజ్ఞాపించెను. వారు సంతసించుచు తగుపరిచారకుల నియమించిరి. అంతవారు నగరమునంతను మిక్కిలి చక్కగ నలంకరించిరి. పిమ్మట వివాహమండపము నిర్మింపదలచి నిపుణులగు శిల్పుల రావించిరి. వారును విధాతకు నమస్కరించి పనిని మొదలిడి, స్వర్ణస్తంభములను కదళీకాండములవలె నిర్మించిరి. వానికి గరుడపచ్చలను పత్రములుగను, పద్మరాగములను ఫలములుగను, చిత్రింప నాపనిని జూచువార లకు ఇది వాస్తవమా! లేక కల్పితమా! యను సందియము కలుగుచుండెను. ఆస్తంభములపైని వేసిన సువర్ణమణిమయ దండములు, నిజమగు వేణువుల దిరస్కరించుచుండెను. పండుతమలపాకుతీగెలు సువర్ణనిర్మితములై, సహజనాగ వల్లీ దళములను మించియుండెను. అందచ్చటచ్చట మౌక్తికసరముల వ్రేలాడ గట్టిరి. మఱియు నానావిధములగు మణులచే పలురంగుల కమలములను నిర్మించిరి. ఆ శిల్పమెంతేని సంతసమును గలిగించుచున్నది. ఇట కమలములెట్లుద్భవించినవని జూపరులు విస్మయము నందుచుండిరి. ఆ కమలములందు తుమ్మెదలు, స్తంభములందు పలురకముల పక్షులును కలవు. అవి వాయుప్రేరిత

ములై కూయుచున్నట్లున్నవి. స్థంభముల నానుకొనియున్న దేవతాప్రతిమలు, మంగళద్రవ్యములబూని నిలచియున్న, నారీరత్నములవలె నగపడుచుండెను. మఱియు నింద్రనీలములను మూమిడికొమ్మలవలెజేసి వానికి స్వర్ణముచే కుసుమగుచ్ఛముల నమర్చి యమర్చిరి. ఇది బ్రహ్మమానసిక సృష్టియని చూచువార లనుకొనుచుండిరి. అందనేక ధ్వజములు, చామరములు, మంగళ కలశములును నిర్మింపబడెను. వివిధమణిదీపికలచే నామండప మెంతేని ప్రకాశించుచుండెను. ఇటులనే జనకుని కోటనంతను చక్కగ నలంకరించిరి. దానిని పురజను లెల్లరు వచ్చి చూచుచుండిరి. జనకుని పురమునంతను మిక్కిలి చక్కగ నలంకరించిరి. ఆపురి సౌందర్యము వర్ణనాతీతమై యుండెను. ఆపురిశోభను జూచి ఇంద్రుడు సయితమాశ్చర్య మందుచుండెను. లక్ష్మియు నాపురశోభను జూచి మోహితయై కపటవేష మును వేసికొని యందే నివసించుచుండెను. అట జనకప్రేరితులగు శతానందా దులయోధ్యాపురికేగి యద్దాని శోభను గాంచి సంతసించుచు, రాజద్వారమున కేగి, తమరాకను రాజున కెరిగించిరి. వెంటనే రాజు వారలలోనికి రానుమ తింప, వారు వచ్చి దశరథుని దర్శించిరి. ఉచితమర్యాదలు జరిగినంతనె వారు తాము తెచ్చిన శుభలేఖను వారి యెదుట నుంచిరి. రాజా లేఖను దీసికొని యందలి యంశముల గ్రహించి, యానందముచే పులకితగాత్రుడై, రామలక్ష్మ ణులజూచి నట్లానందించుచు సంతోషపారవశ్యముచే కొంతతడవా లేఖను చదువజాలక, ఎట్టకేల కాలేఖయందలి విషయములను తానె స్వయముగ జదివి సభాసదులకు వినిపించెను. ఆవార్త నచటనె యాటలాడుచున్న భరత శత్రుఘ్నులువిని తోడనే సభకువచ్చి, తండ్రి నడుగుటకు శంకించుచు, ఎట్టకేల కిట్లనిరి. తండ్రీ! యీపత్రిక ఎటనుండి వచ్చినది! మాసోదరులకు కుశలమేకద! ఇపుడు వారెచ్చటనున్నవారు? అని సాదరముగ నడిగెడి భరతశత్రుఘ్నులకు మఱల నాజనకుని పత్రికను చదివి వినిపించెను. అందలి విషయమును విని వారిరు వురు నానందపరవశులైరి. భరతుని పవిత్రప్రేమను జూచి సభ్యులాశ్చర్యపడు చుండిరి. అపుడు దశరథు డావచ్చినవారిని సమీపమున గూర్చుండ బెట్టుకొని మధుర భాషణముల నిట్లనియె. ఓదూతలారా! మాబాలకులు, కుశలముగను సంతోషముగ నున్నారా? వారిని మీరు స్వయముగ జూచితిరా! నాపుత్రు

లలో నొకడు శ్యామలాంగుడు. రెండవవాడు స్వర్ణచ్ఛాయకలవాడు. వారి రువురును ధనుర్బాణధారులై విశ్వామిత్రుని వెంటనుండెదరు. వారిని మీరు గుర్తించితిరా! అటులైన వారి స్వరూపస్వభావముల జెప్పుడు. ముని వెంట బోయిన నాబిడ్డల క్షేమవార్త నేడే మాకు తెలిసినది. నాబిడ్డలు మిథిల కేల వచ్చిరి? జనకరాజు వారి నెట్లు గ్రహించెను? అని దశరథుడు ప్రశ్నింప నాప్రేమభరితములగు మాటల విని మందహాసము జేయుచు వారిట్లనిరి. ఓరాజ లలామమా! మీవంటిధన్యు లిక నెందును లేరు. విశ్వభూషణులైన రామ లక్ష్మణులు, మీకుతనయులు. అట్టిభాగ్యము మీకుదప్ప నింకెవ్వరికిని లేదు. వారి నామోచ్చారణమునకు గూడ తగనివారు వారికి తండ్రియగుటెట్లు? మీరు రాజమార్తాండులు. మీ కీర్తిప్రతాపములు దిగంతవిశ్రాంతములు. వానిఎదుట సూర్యచంద్రులు కళావిహీను లగుచున్నారు. మా కుమా రుల గుర్తించితిరా! యని మమ్మడిగితిరి. సూర్యుని వెలుతకుటకు దీపము కావలయునా? ప్రభూ! సీతాస్వయంవరమున కనేకులగు రాజవర్యులు వచ్చిరి. త్రిభువనవీరు లందఱును తమశక్తినంతను యుపయోగించిరి. కాని జనకుడు ప్రతినవట్టిన శివచాపము నించుకేనియు గదల్పజాలక పశ్చాత్తప్తులై, సిగ్గుచే మరలుచుండిరి. మందరపర్వతము నవలీలగ నెత్తిన దేవదానవులు సయిత మీవిల్లును గదల్పజాలకుండిరి. వినోదమునకై కైలాసమునెత్తిన రావణుడు గూడనీవిల్లును గదల్పజాలక సిగ్గుచే మరలిపోయెను. ఓ ప్రభూ! మామా టలు నిజము. వినుడు. గజరాజు కమలనాళమును ఖండించు కైవడి, రఘుకుల మణియగు రామభద్రుడా చాపము ననాయాసముగ విఱిచివైచెను. ఆ శివ ధనుర్భంగధ్వనిని విని కృద్ధుడైన పరశురాము డటకువచ్చి తనకోపము నంతను వెలిబుచ్చుచుండెను. పిమ్మట రాముని ధైర్యపరాక్రమముల జూచి యచ్చెరు వంది తనధనువు నారామునిచేతి కిచ్చి, సవినయముగ గొనియాడి తనతపో వనమునకు మఱలిపోయెను. రాజులందరు నారామచంద్రుని నిరుపమానబల పరాక్రమముల జూచియు, మత్తేభయూథ మధ్యంబున వీరవిహారమునుజేయు చున్న సింగపుగొదమవలె విహరించుచున్న లక్ష్మణునిజూచియు, భయకంపితు లగుచుండిరి. పౌరులందఱు వారిసౌందర్యమును నిర్నిమేషముగజూచి యచ్చెరు వందుచుండిరి. ఇట్లు ప్రేమప్రతాప వీరరసములతో గూడినవారి మాటలవిని

ధశరథు డానందపరవశుడై యుండెను. సచివులందఱు నానందమందుచు నాదూతలను మాటిమాటికి బ్రశ్నింపుచు, మారాజపుత్రులకు మారాజపుత్రికల నిచ్చి వివాహాముల జేసెదరా ! మీరును మేమును ధన్యులమని సంతసింపు చుండిరి. అపుడు రాజులేచి యాపత్రికను వశిష్ఠునిచేతికిచ్చి, దూతలుచెప్పిన విషయమునంతను గురువర్యునకు విన్నవించెను. అంతనావసిష్ఠు డిట్లనియె. సముద్రునందు నదులవలె, నీకును సకలాభీష్టములును తమంతటతామే సిద్ధిం చును. ధార్మికులకు సుఖసంపత్తులు కోరకయే సిద్ధించుచుండును. నీవు గురువు లను, గోబ్రాహ్మణులను ఆరాధింపుచుందువు. కాన నీకిట్టి శుభములు చేకూ రుట కేమివింత ? మఱియు కౌసల్య మిక్కిలిపవిత్ర. మీవంటిదంపతులు ప్రపం చమునం దరుదుగదా ! నీనలుగురు పుత్రులును సుగుణసంపన్నులు. కాన మీ కెల్లపుడును శుభములే చేకూరుచుండును. ఇకనీవును వివాహమున కనువగు మంగళద్రవ్యముల సముకూర్పుము. ఆలసింపకుము. అను నాగురునిమాట లకు సంతసించి, నమస్కరించి, యాతనివద్ద శలవు గైకొని, యంతిపురికి జని, రాణులరావించి, జనకుని శుభపత్రమును వారలకు వినిపించెను. అంత నారాణులు నానందభరితులైరి. జనకుని వైభవమును గొప్పతనమును నెఱిగిన యారాణులీ శుభవార్తను విని, మేఘగర్జితమును వినినమయూరులవలె హర్షపులకిత గాత్రలైరి. కులవృద్ధులు వారల దీవింపుచుండిరి. మిక్కిలి ప్రియ మగు నాశుభలేఖను రాణులు మాటిమాటికి జదువుకొనుచు, మితిలేనియానం దము నందుచుండిరి. మిథిలలో రామలక్ష్మణులు చేసిన ప్రతాపమును దశ రథుడు మాటిమాటికిని దనభార్యలకు జెప్పుచుండెను. ఇదంతయు విశ్వా మిత్రుని వలన మనకు సిద్ధించినదని యాతనిని కొనియాడుచుండిరి. పిమ్మట కౌసల్య బ్రాహ్మణుల రావించి వారలకు సంతృప్తికరములగు దానముల నిచ్చి వారి యాశీర్వాదముల నందుచుండెను. ఈయానందమును ప్రకటించుచు ననేక మంగళధ్వనులజేయ నాధ్వని పట్టణమంతయు వ్యాపించుచుండెను. సీతా రాముల వివాహాంగముగ నయోధ్యనంతను చక్కగ నలంకరించిరి. రామ చంద్రుని జన్మస్థానమగు నయోధ్యాపవిత్రత వర్ణనాతీతమై యుండెను. మఱియు నీకల్యాణమహోత్సవ సందర్భముల దాని శోభద్విగుణితమాయెను. విచిత్రము లగు పతాకములచేతను, కదళీకాండముల చేతను ఆ పట్టణమెంతయు ప్రకా

శించుచుండెను. రాజమార్గము నందంతటను తోరణములు మున్నగువానిచే నలంకరించిరి. ప్రతిగృహప్రాంగణమున పూర్ణమంగళకలశము లమర్పబడినవి. లోకోత్తరమగు సీతారాముల కల్యాణమహోత్సవమున పౌరులు తమతమ గృహములను జక్కగా నలంకరించిరి. ఎటజూచినను నేత్రపర్వముగ నుండెను. చతుష్పథముల బన్నీటదడిపి యనేకవిధములగు రంగవల్లులచే నలంకరించిరి. చంద్రముఖులు కొంద ఱలంకృతాంగలై మంగళగీతికల బాడుచుండ నాపాటల విని కోకిలలు లజ్జించుచుండెను. జగన్మోహనమైన రాజమందిరము వర్ణనాతీతము. అది యనేకములగు మంగళద్రవ్యములచే నలంకరింప బడియుండెను. అట వంది మాగధుల స్తుతిపాఠములు, బ్రాహ్మణుల వేదపాఠములు వినువారల నెంతేని యాకర్షించుచున్నవి. సుందరాంగులు కొంద ఱచట సీతారాముల కళ్యాణమును గూర్చి పాడుచుండిరి. రాజనగరంతయు నానందభరితమై యుండెను. దేవతా సార్వభౌముడగు రాముడుదయించిన యామందిరము నెవరు వర్ణింపగలరు? దశరథు డంత భరతుని రావించి, రామచంద్రుని వివాహప్రయాణమునకు దగిన ప్రయత్నముల గావింపుమన విని సంతసించి తండ్రి యానతి ననుసరించి ముఖ్యాధికారుల బిలిపించి, ప్రయాణమునకు తగు నేర్పాటుల గావింపుడని యాజ్ఞాపించెను. అపుడు వారతిమనోహరములును, పవనజవములును, వివిధమనోజ్ఞములునగు యుత్తమాశ్వములను పల్యాణములచే నలంకరించి తీసికొనిరాగ నన్నివిధముల భరతునితో సమానులగు నాభరతుని మిత్రులగు రాకొమరు లా యుత్తమాశ్వము నధిష్ఠించి ధనుర్బాణతూణీరముతో విరాజిల్లుచుండిరి. వారు వఱుసలదీర్చి ప్రయాణోన్ముఖులై నిలిచియుండిరి. మఱియు సంగ్రామప్రవీణులు. నానాయుధధారులగు శూరాగ్రేసరులు ప్రభువులరాకను నిరీక్షించుచుండిరి. ప్రయాణభేరి మ్రోగుచుండెను. సారథులు ధ్వజములను మణులచే విచిత్రముగ నలంకరించిరి. ఆరథములు చామరములచేతను చిరుమువ్వలచేతను మిగుల శోభిల్లుచుండెను. శ్యామకర్ణములుగల గుఱ్ఱములొక్కొక్క రథమునకు రెండు చొప్పున గట్టబడెను. వానియంగములు మనోహరముగ నలంకరింపబడి యుండెను. ఆరథముల కెందును గతిభంగములేదు. ఎంతవేగముగ పఱుగెత్తినను ఖురపాంశువు లెగురకుండబోవుట వానికి సహజసిద్ధము. ఆరథములను నడుపుటకు నిపుణులగు సారథుల నియమించి, వానియందు శస్త్రాస్త్రముల

పొందుపఱచిరి. కొందఱు గజారూఢులై పయనమగుచుండిరి. ఆభద్రజాతి గజముల కందముగ మాతంగ శృంగారము చేయబడినది. అవి మేఘములవలె బృంహితముల జేయుచున్నవి. వేదమంత్రముల బఠింపుచు బ్రాహ్మణబృందము బయలు దేరునప్పుడు వేదములే బయలు దేఱుచున్నట్లగపడుచుండెను. వందిమాగధులు స్తుతిపాఠముల జేయుచుండిరి. మఱియు పౌరులందఱును తమకనువగు సామగ్రులను, వేసడములు, ఒంటెలు మున్నగువానియందమర్చుకొని బయలు దేఱుచుండిరి, సేవకులు దమదమ కర్తవ్యముల నప్రమత్తులై నిర్వహించుచుండిరి. శ్రీరాము నెప్పుడు జూచెదమాయనిహర్షపులకితగాత్రులై ప్రయాణమును సాగింపుచుండిరి. ఆసమయమున గజఘంటారావములు, రథనిర్ఘోషములు, వాజిహ్రేషారవములు, మంగళధ్వనులును దిగంతవ్యాప్తములగుటచే నొకరిమాట మఱియొకరికి వినరాకుండెను. భూమి యీనినట్లైటు జూచినను ప్రజానీకమే యగపడుచుండెను. స్త్రీలు మేడలపైనుండి చూచుచుమంగళహారతుల నిచ్చుచుండిరి. అంత సుమంతు డుత్తమాశ్వముల బూన్చి, వానియం దవసరము లగు సకలపదార్థముల నాయత్తపఱచి రెండురథముల నటకుదెచ్చి యుంచెను. అందొకటి దశరథునకును, రెండవది వశిష్ఠునకును నిర్దేశింపబడియుండెను. అప్పుడు దశరథుడు మందస్మితమును జేయుచు, దనరథము నధిష్ఠించి, సురగురునివెంట జనుదేవేంద్రుని పగిది, వశిష్ఠునివెంట ప్రయాణమును సాగించుచుండెను. అప్పుడు దేవతలు పుష్పవర్షమును గురిపించుచుండిరి. అప్పుడు మంగళధ్వనుల కనుగుణముగ నుజ్జ్రుంభుల నడకను జూచి నాట్యకళానిపుణు లాశ్చర్యము నందుచుండిరి. అప్పుడు మంచి శుభశకునము లగుచుండెను. శీతలసుగంధ మందమారుతములు వీచుచుండెను. పుణ్యస్త్రీలు పూర్ణకలశముల ధరించి వచ్చుచుండిరి. సకలజగన్మంగళాలయుడగు శ్రీహరి తనకు పుత్రుడగునప్పుడు మంగళముల కేమికొదువ? సీతారాముల వంటి వధూవరులును, దశరథజనకులవంటి వియ్యంకులును ఏలోకమునందును లేరు. భానుకులాలంకారుడగు దశరథుని రాకను విని జనకుడు మార్గమధ్యమందున్న నదుల కానకట్టుల గట్టించి, వారినివాసమున కనువగు గుడారములు నిర్మింపించి, వానియందు వారినివాసమునకు దగిన సమస్తసామగ్రిని పొందుపఱచి యుండెను. అట్లు దశరథుడు కతిపయప్రయాణములజేసి మిథిలను

సమీపించుచుండిన వార్తను విని, జనకునియనుచరులు, ఏనుగులు, గుఱ్ఱములు రథములు మున్నగువానిని దీసికొని తగురీతిని వారి నెదుర్కొనసాగిరి. భక్ష్యములు, ఫలములు, పాలు మున్నగు పదార్థములును జనకుడధికప్రీతితో వారల కంపుచుండెను. పిమ్మట వారలొకరితో నొకరు కలసికొనిరి. ఆసమయమున దేవదుందుభులు మ్రోగుచుండెను. జనకుడంపిన వస్తువుల నన్నిటిని దశరథుడు సగౌరవముగ గ్రహించెను. జనకుడా మగపెండ్లివారు నడుచునంతమేరను రత్నకంబళముల బఱపించి, వారలకు తగువిడుదుల నేర్పాటు చేసెను. పెండ్లివారానగరసమీపమునకు వచ్చుటను విని సీత అష్టసిద్ధులను స్మరింప నాసిద్ధులు సకలసుఖముల గలుగ జేయుచు నట నివసింపుచుండెను. మగపెండ్లివారు తమ తమవిడుదులజూచి సంతసించుచు, సర్వసుఖముల ననుభవించుచుండిరి. జనకుని వైభవమర్యాదల నొకరితో నొకరు ముచ్చటించుకొనసాగిరి. రామచంద్రుడు దీనినంతను సీత మహిమనుగా దెలిసికొని సంతసించుచు, తండ్రిగారి యాగమనమును విని వారిదర్శనమును గోరుచు, గురువు నడుగుటకు శంకించుచుండ దీనినంతను విశ్వామిత్రుడు గ్రహించి లోన సంతసించుచు, రామలక్ష్మణుల వెంటనిడుకొని దశరథునివద్ద కేగెను. పుత్రసహితుడగు విశ్వామిత్రుని జూచిదశరథుడు పట్టరానిసంతోషముతో నెదురేగినమస్కరించెను. విశ్వామిత్రుడంతనాతనిని కౌగలించుకొని యాశీర్వదించెను. రామలక్ష్మణులిద్దఱును, తండ్రికి నమస్కరింప వారలనాశీర్వదించి కౌగలించుకొని పుత్రవియోగదుఃఖమును తరించెను. పిమ్మటవారిరువురును వసిష్ఠునకునమస్కరింప నాతడువారల కౌగలించుకొని యాశీర్వదించెను. పిమ్మట బ్రాహ్మణులకునమస్కరించి వారలయాశీర్వాదమును బొందిరి. అంత భరతశత్రుఘ్నులు రామునివద్దకువచ్చి నమస్కరింప వారల నానందపరవశుడ్డైయక్కున జేర్చుకొనెను. లక్ష్మణుడపరిమితానందము నందుచుండెను. పిమ్మట దయామయుడగురామచంద్రుడు, పౌరసామంతామాత్యాది పరిజనమును తగురీతిని గౌరవించెను. శ్రీరామచంద్రునిజూచినంతనే వారలందఱకు నపరిమితానందము కలిగెను. శరీరధారులైన చతుర్విధపురుషార్థముల వలె వారు నలుగురును తండ్రిని పరివేష్టించి యుండిరి. పుత్రసహితుడగు దశరథునిజూచి యచటివా రెంతేని సంతసించుచుండిరి. జనకుడు మంత్రిసామంత పురోహితులతోడను, వందిమాగధాదిపరివారముతోడను వచ్చి, పెండ్లివారి

నందఱను సత్కరించి వారిచే సత్కరింపబడి నిజనివాసమున కేగెను. వివాహ సమయ మాసన్నమగుకొలది పురవాసు లత్యంతానందము నందుచు నీవివాహ కౌతుకము ననుభవించుట కీసమయమున బ్రహ్మ దివారాత్రములపొడిగించిన బాగుండు ననుకొనుచుండిరి. సీతారాములశోభాతిశయము మఱెవ్వరికిని లేదు. జనకదశరథులసుకృతము వర్ణనాతీతము. వారిపౌరుల మగుటచే మనమును ధన్యులము. ఈసీతారాములపరిణయ మహోత్సవమును జూచు భాగ్య మబ్బుట సామాన్యముగాదు, అనికొందఱును, ఈరాజపుత్రు లెంతమోహ నాంగు లనికొందఱును, అనుకొనుచుండిరి. అందొకఁ తె, మనమహారాజు జానకీ విరహమునుసహింపలేక జానకిరామచంద్రుని యిటకు మాటిమాటికిని దేగ లడు. కాన మనకు దఱుచుగ రామచంద్రుని జూచుభాగ్యము లభింపగల దనెను. మఱియొకఁ తె, చెలీ! దశరథునివద్ద నీరామలక్ష్మణులబోలిన మఱి యిద్దఱుపుత్రులు గూడనుండిరి. వారియంగసౌష్ఠవము వర్ణనాతీతము. చూచి తీరవలయును. వారి నామములు భరతశత్రుఘ్నులట. వారిలోభరతు డన్ని విధముల రామునే పోలియుండెను. లక్ష్మణశత్రుఘ్నులరూప మొక్కటివై యున్నది. వీరు కవలవారై యుండవలె ననియెను. బలవిద్యావినయశీల సంపన్నులగు నీనలుగురుఱకును నిటకల్యాణమయిన మిక్కిలి బాగుండును. అప్పుడు గదా మనయానందము పరిపూర్ణమగును. అనిపలికెను. దూరము నుండి వివాహమునకు వచ్చిన నృపతు లీనలుగు రన్నదమ్ముల జూచి, సంత సించుచు, రామచంద్రునికీర్తిప్రతాపములను వర్ణించుచు, వారివారికి నియమింప బడిన విడుదుల బ్రవేసించిరి. ఇట్లందఱును నానందమగ్నులై యుండ మంగళ ములకుమూలమయిన మార్గశీర్ష మాసమునం దనుకూలతిథివారనక్షత్రాదుల విచారించి, సుముహూర్తమును నిర్ణయించి, శుభలేఖను వ్రాసి, బ్రహ్మ నారదునిచేతికిచ్చి జనకున కంపెను. అంతకుముందుగనే యాస్థానవిద్వాంసు లగు జ్యోతిశ్శాస్త్రనిపుణులు గూడ నట్టిముహూర్తమునే స్థిరపఱచి, యుండిరి. గోధూళికాసమయము సమస్తమంగళావహ మని విప్రవరులు వివాహముహూ ర్తమును జనకునకు విన్నవింపజనిరి. వారిమాటల నాలకించి, శతానందుని బిలిపించి యాలసింపక వివాహోపయుక్తములగు వస్తువులను సిద్ధపఱుపుమని యాజ్ఞాపింప నంత శతానందుడు తగువారల రావించి అన్నివస్తువులను సిద్ధ

పఱుపు డని యాజ్ఞాపించెను. వారట్లు మంగళద్రవ్యములను సమకూర్పగా వారందఱతోడగలిసి విడిదికేగి దశరథుని సభను జూచి సంతసించుచు నాతనితో నిట్లని విన్నవించిరి. అయ్యా! వివాహసమయ మాసన్న మగుచున్నది. కాన తాము బంధుమిత్రపరివార సహితముగ విచ్చేయు డని మనవి చేయు డన నతడును గురువుల యాజ్ఞానుసారముగ వంశాచారప్రకారము సుముహూర్తము నకు దగిన పస్తువులను సమకూర్చి వశిష్ఠుని ముందుగ నుంచుకొని, సకలబంధు వర్గముతోడను సపరివారముగ వివాహమునకు బయలుదేరెను. బ్రహ్మాది దేవత లాదశరథుని భాగ్యవైభవముల గొనియాడుచు, ఈ కల్యాణమును జూడనివారి జన్మము విఫలమని తలంచుచు, పుష్పులవానను గురియింపుచు, దేవదుందుభుల మ్రోయింపుచు, విమానముల నెక్కి మిథిలకు బోయి అచ్చటివారల సౌందర్య సౌశీల్యముల కచ్చెరు వందుచుండిరి. ఆ కల్యాణమండపమును దిలకించి బ్రహ్మాది దేవత లాశ్చర్యమునందుచుండ వారలజూచి శివు డిట్లనియె. సుపర్వులారా! ఏల మీకింతయాశ్చర్యము! ఎవరినామము సమస్తదురితములను హరించి, సకల శ్రేయముల నొనగూర్చునో! అట్టి సీతారాములకల్యాణ మండప మిట్లుండక మఱియెట్లుండును? రండు పోదమనుచు దనవృషభమునెక్కి ముందునకు జనుచుం డెను. అటనింద్రతుల్యుడగు దశరథుని యాతని పరివారమును, రామచంద్రుడు మున్నగు సోదరులను జూచి మహేశుడు ఆనందపరవశు డగుచుండెను. మణి భూషణభూషితుడై పీతాంబరధారియై, సోదరసహితముగ నశ్వారూఢుడైన రామచంద్రుని శివి వర్ణనాతీతము. దేవేంద్రుడు మున్నగు దేవత లారామచం ద్రుని సౌభాగ్యగరిమ కచ్చెరువంది చూచుచు, తమకుగల యనిమేషత్వము, లోచనాధిక్యమును నేడు సఫలమయిన వని సంతసింపుచుండిరి. జనకమందిరమును పెండ్లివారు సమీపించుకొలదియు మంగళధ్వనులు మిన్ను ముట్టుచుండెను. అప్పుడు జనకునిరాణి దివ్యాలంకారభూషితయై, దివ్యాంబరముల ధరించి, పుణ్యాంగనలతో గూడి, బంగరుపళ్ళెరముల గర్పూరహారతుల గైకొనియుండ నాభాగ్యము తమకు గూడ కావలయునని తలంచి, పార్వతి మున్నగు ననిమిషాంగనలు మానుషీ రూపముల ధరించి, వారలతో గలిసి మంగళహారతుల నిచ్చుచుండిరి. వివాహ సమయ మాసన్నమగుట నెరింగి, మగపెండ్లివారి యడుగునకు మడుగులొత్తుచు రామచంద్రుని మండపసమీపమునకు దోడితెచ్చి, మిగిలినవారిని యథోచితా

సనముల గూరుచుండబెట్టిరి. అపుడు పూలవాన గురియుచుండెను. వేదఘోష ముతో పాటు మంగళ ధ్వనులు మిన్నుముట్టుచుండెను. అపుడు రామచంద్రు నకు నుచితాసనమునిచ్చి తత్కాలోచిత కృత్యముల జరుపుచుండిరి. బ్రహ్మాది దేవతలు బ్రాహ్మణవేషముల ధరించియారామచంద్రుని సేవింపుచు తమజీవి తము సార్థకమైనదని సంతసింపసాగిరి. జనకదశరథులు, వారిపురోహితులును తత్కాలోచితవైదికలౌకిక కార్యములను సంతోషముతో నిర్వహింపుచుండిరి. ముల్లోకములందు నిట్టివధూవరులను, ఇట్టిసంబంధులను కనివినియెఱుగమని దేవత లనుకొనుచుండ వారిమాటల కావియ్యంకు లెంతేని సంత సించుచుండిరి. అంత జనకుడు దశరథున కర్ఘ్యమునిచ్చి, యుచితాస నమున గూర్చుండబెట్టి, వశిష్ఠుడు విశ్వామిత్రుడు మున్నగు మహర్షు లను, రాజబంధువులను, సుమంత్రుడు మున్నగు మంత్రిసామంతాది మాన్యులను, యథోచితాసనముల గూరుచుండబెట్టి తగురీతిని పూజించి, నేటికి నాజన్మము సఫలమైనదని పలుకుచు సంతసించుచుండెను. బ్రహ్మాది దేవతలు రామచంద్రుని ప్రభావమును దెలిసికొని, యావేడుక నంతను జూడ దలచి విప్రవేషములధరించి మహదానందము నందుచుండ జనకుడు వారి నిజ రూపములను గ్రహింపకపోయినను వారల నుచితరీతినిబూజించి యుచితాసన ముల గూరుచుండబెట్టెను. రామచంద్రుడు వారలజూచి మానసికముగ బూజించెను. ప్రేక్షకు లారామచంద్రుని నేత్రచకోరములతో పానముచేయు చుండిరి. అపుడు వివాహసమయ మాసన్నమగుట నెరింగి వశిష్ఠు డావిషయ మును శతానందునకెరిగింప శతానందుడు సీతను వివాహవేదికకు దేనలయునని జనకరాణికి దెలిపెను. అంతనామె పుణ్యస్త్రీలను రావించి కులాచారాను సారముగ మంగళకౌతుకమును నిర్వర్తించెను. పిమ్మట గజగామినులగు చంద్రవదన లిరుప్రక్కలనుండ నాసర్వాంగసుందరియగుసీత వివాహమండపమున కరుదెంచుచుండెను. అపుడామె తారాగణమధ్యమున రోహిణివలె నుండెను. అప్పటి యామె సోయగము వర్ణనాతీతము. ఆమెను ప్రయత్నపూర్వకముగ జూచి పూర్ణకాముడగు రాముడు సయిత మాశ్చర్యము నందుచుండెను. మిగి లిన దశరథరాజనందనులు సీతకు నమస్కరింపుచుండిరి. మును లీమె మంగళము లకు మూలమని యాశీర్వదింపుచుండిరి. వైదికమంత్రములచేతను మంగళవాద్య

ములచేతను మంగళగీతికలచేతను రోదోకుహారము పిక్కటిల్లుచుండెను. అప్పుడా శీఘ్ర పూర్వకముగ సీతనువివాహమండపమున గూరుచుండబెట్టిరి. పిమ్మట నుభయకుల గురుఫులు కులాచారము ననుసరించి యథావిధిగ వివాహక్రియల జఱుపుచుండిరి. అంబికాగణేశుల నర్చింపజేసిరి. అందు దేవతలు ప్రత్యక్షముగ బూజింపబడిరి. పిమ్మట వివాహమునకు కావలసిన మంగళద్రవ్యముల నన్నిటిని బంగరుపళ్ళెరములందుంచి సేవకులు సమీపమున నిలిచియుండగా కులాచారము ప్రకారము మధుపర్కప్రాశనము మున్నగుక్రియల జరుపుచుండిరి. దశరథు డప్పుడు విద్వాంసుల నర్చించి, యాచకుల కభీష్టముల నెరవేర్చుచుండెను. వధూవరు లొకరి నొకరు ఓరచూపుల జూచుకొనుచు నయననళినీ నాళానీతమగు పరస్పరప్రేమ రసము నొరులెరుంగకుండ ననుభవించుచుండిరి. జగజ్జననియగు సీతకు మాతయగు జనకపట్టమహిషి సునయనసుకృతమును వర్ణింపనేరితరము? వివాహసమయ మాసన్నమగుచున్నదని యామెను మహర్షులు పిలువనంప నామె సఖులతో గూడివచ్చి జనకుని వామపార్శ్వమున, గిరిజాకల్యాణసమయమున హిమవంతుని పార్శ్వమున మేనవలె గూరుచుండెను. ఆదంపతులు రామచంద్రున కెదురుగ గూరుచుండిరి. మంగళద్రవ్యములను బంగరుపళ్ళెరములం దిడికొని, మణియుక్తమై, పవిత్రజలభరితమగు సువర్ణకలశమునుండి జనకరాణి జలముల బోయుచుండగా, నేపాదములను శివుడు నిరంతరము ధ్యానించుచుండునో, ఏపాద పద్మములు అహల్యను శాపమునుండి విడిపించెనో, వేనియందు పరమపావనియగు గంగ యావిర్భవించెనో, అట్టి త్రిజగత్పూజ్యములగు శ్రీరామచంద్రుని పాదపద్మములను, విప్రులు వేదపఠనమును జేయుచుండ, నాకాశమునుండి పుష్ప వృష్టి గురియుచుండగా, నానందపరవశుడగు జనకుడు కడిగి తరించెను. అప్పుడు జయజయధ్వానములు మిన్ను ముట్టుచుండెను. హిమవంతుడు పార్వతిని శివున కిచ్చినట్లును, సముద్రుడు లక్ష్మిని విష్ణువున కొసంగినట్లును, జనకుడు సీతను రామచంద్రునకు సమర్పించెను. అట్లు సమర్పించి జనకదంపతు లెంతేని సంతసింపుచుండిరి. కులగురువులగు వశిష్ఠ శతానందులు, వారివారి ప్రవరల జెప్పుచు యథావిధిగ వివాహమును జేయింపుచుండిరి. అప్పుడు జనకుడు కన్యాదానముతో పాటు సమస్తదానములను జేయుచుండెను. ఆసమయమున జనకు డానందపరవశుడై మేనుమఱచి తన విదేహనామమును సార్థకము చేసికొనుచుండెను.

పిమ్మట వధూవరుల నేకాసనోపవిష్టుల జేయ, మణిస్తంభముల బ్రతిఫలించు చున్న వారి ప్రతిబింబములు, వివాహమహోత్సవమును జూడవచ్చిన రతీమన్మథుల వలె నుండెను. రతిమన్మథులు సీతారాముల సౌందర్యమునుజూచి సిగ్గుచే దాగు చుండిరా యనునట్లా ప్రతిబింబము లొక్కొక్కసారియదృశ్యములగుచుండెను. వశిష్ఠుడుశ్రీరామునిచేసీతాశిరస్సునందుసిందూరతిలకమును బెట్టించెను. వశిష్ఠానుమతిని ఏకాసనోపవిష్ఠులగు సీతారాములజూచి దశరథుడు తనసుకృతకల్పకము ఫలించె నని సంతసించుచుండెను. వారివివాహమును జూచి ప్రపంచ మిక మంగళబహు ళమై ప్రశాంతముగ నుండునని యచటివారు భావింపుచుండిరి. అంతవశిష్ఠు డాలోచించి తన యభిప్రాయమును జనకునితో జెప్ప నాతడందులకంగీకరించి, సీతకు జెల్లెలును దనకు కూతురునగు యూర్మిళను లక్ష్మణునకును, తనతమ్ము డగు కుశధ్వజుని పుత్రికలగు మాండవీశ్రుతకీర్తులను, భరతశత్రుఘ్నులకునిచ్చి వివాహమును జేయించెను. ఆవధూవరుల కలయిక ప్రత్యయప్రకృతుల కల యికను పోలియుండెను. నూతనవధువులతో గూడిన రాజపుత్రులు సిద్ధులతో గూడిన సామాద్యుపాయములవలె శోభిల్లుచుండిరి. వారినిజూచి దశరథుడు చతుర్విధపురుషార్థములు సిద్ధించినట్లానందించుచుండెను. పిమ్మట జనకుడు వచ్చిన పెళ్ళివారి నందఱను తన విభవానుసారముగ వస్త్రాభూషణాద్యలంకా రములచేతను, గజతురగరథపదాతిదాసదాసీ పరివారములచేతను నుచితరీతి నర్చించెను. యాచకులను పూర్ణకాముల జేయుచు పౌరులను ఆత్మబంధువులను తగురీతి నర్చించి, యందఱతోను తనలోపములు మన్నింపుడని సవినయముగ బ్రార్థించెను. పిమ్మట మునులను దేవతలను యథావిధిగ జూచి వారియను గ్రహమునువడసెను. పిమ్మట జనకుడు నతని సోదరుడును దశరథుని సమీపించి చేతులుజోడించిరిట్లనిరి. అయ్యా! మీసంబంధముచే మేమన్నివిధములధన్యులము. నేటినుండిమేము మాప్రజలును తమయాజ్ఞానుసారముగ వర్తింతుము. నేటినుండి యీ మాబిడ్డలు తమకును తమపుత్రులకు నుచితరీతి నుపచారముల జేయుచు నుభయకులముల నుద్ధరింతురుగాత. యనువారి వినయోక్తులకు సంతసించుచు దశరథుడు మృదుమధురగంభీరములగు వాక్కులచే వారిని సంతసింపజేసెను. అంత వసిష్ఠుని యాజ్ఞానుసారము సువాసినులు మంగళహారతుల నిచ్చి వధూ వరులను దేవతామందిరమునకు దీసికొని పోయిరి. అపుడు సీత, సిగ్గువెనుకకు

నభిలాష ముందునకును లాగుచుండ నేమియు దోచక, క్రీకంటి చూపులచే శ్రీరామచంద్రుని సౌందర్యమును పానము చేయుచుండెను. అప్పుడు రామచంద్రుని ఘనశ్యామలాంగము, పసుపుపారాణులతో కూడిన పాదపద్మములు, పీతాంబరము, కనకకటిసూత్రము, మణిమయాభరణములు, ముక్తామణి ఖచితస్వర్ణయజ్ఞోపవీతము, మణిగణఖచితాంగుళీయకములు నెంతేని శోభిల్లుచుండెను. చూపులు తుమ్మెదలను బోలియుండెను. కర్ణాభరణభూషితమగు ముఖము వర్ణనాతీతము. ఆతని కనుబొమలు సింగిణులు. నాసిక చాంపేయమును దిరస్కరించుచున్నది. పౌరాంగనలు దేవతాస్త్రీలును నాసౌందర్యమునుజూచి యబ్బురపడుచుండిరి. అప్పుడు కుసుమవృష్టి గురియుచుండ, వందిమాగధస్తుతులు మిన్నంటుచుండ, నావధూవరులను పుణ్యస్త్రీలు దేవతామందిరమును జేర్చిరి. అంత భవానీవాణులు సీతారాములచే నచట చేయదగినపనులను సక్రమముగ జరిగింపుచుండిరి. అప్పుడువారి విలాసవిశేషములను జూచినవా రెల్ల తమ తమ జన్మము సఫలమైనదని సంతసించుచుండిరి. అప్పుడు సీతారాములు తమతమ మణిమయాభరణములందు పరస్పర ప్రతిబింబముల జూచి మురియుచు కదలిన నీస్థితిపోవునని నిశ్చలముగనుండిరి. అట్టి వారివిలాసముల జూడవలయునే కాని, వర్ణింపవీలులేదు. ఇట్లు కొంతకాలము గడిచిన పిమ్మట సువాసినులు ఆ వధూవరులను విడుదులకు దోడ్కొనిచనిరి. అట పెద్దల యాశీస్సులనంది పిమ్మట దశరథుని దర్శింపబోయిరి. అచటివారందఱు నానందమునందుచుండ నావధూవరులు దశరథునికి నమస్కరించిరి. అంత జనకుడు వారలను భోజనమజ్జనాదుల కాహ్వానింప నాదశరథుడు బంధుమిత్రపుత్ర పరివారసమేతుడై రాగా నట జనకుడు వారలనందఱ తగురీతిని గౌరవించి యుచితాసనముల గూరుచుండబెట్టి, మంచి రుచికల రాజ్యభోజ్యములగు పదార్థముల నుచితపాత్రలయందుంచి వారలను భుజింప ప్రార్థించెను. అప్పుడు జనక దశరథులు సరసోక్తుల నాడుకొనుచు పరస్పరప్రేమను ప్రకటించుకొనుచుండిరి. పిమ్మట భోజనానంతరము వారిని చందనతాంబూలాది సత్కారములచే గౌరవించి సగౌరవముగ విడిదికి సాగనంపెను. పిమ్మట దశరథుడు వసిష్ఠుని జూచి ఋషిచంద్రా! తమ యనుగ్రహమువలన నేటికి నాకోరిక లీడేరినవి. కాన నొక సభను జేయించి యథాశక్తిని విప్రుల బూజింపవలె నను

కొనుచుంటి నని మనవి చేసెను. అందులకు వసిష్ఠు డెంతేని సంతసించుచు నట్లేకానిమ్మని బదులుచెప్పెను. అంతనారాజు తన విడిదిలో నొకదర్బారును జేసి బ్రాహ్మణోత్తముల రావించి వారలనందఱి సగౌరవముగ బూజించి, వార లకు గోభూహిరణ్యవస్త్రాదుల నొసంగి వారలయాశీస్సులనంది కృతార్థుడయ్యెను. అట్టిరామచంద్రుని వివాహవైభవమును వర్ణింపనేరితరము. దశరథుడు మాటి మాటికిని విశ్వామిత్రుని గొనియాడి, జనకునితో నిష్టాగోష్ఠిని జఱుపుచుండెను. మైత్రీపాశబద్ధులై యొకరి వియోగము నొకరు సహింపజాలక కొంతకాలము ప్రయాణప్రసంగమునే మఱచిపోయిరి. పిమ్మట విశ్వామిత్రబోధితుడై దశరథుడు దనపురమునకు ప్రయాణమును సిద్ధంచెను. తోడనే యీవార్త పురమం తయు వ్యాపింప నచటిపౌరులు ఖిన్నమనస్కులైరి. ఇంతలో జనకుని యాజ్ఞను సారముగ దశరథుని ప్రయాణమున కనువగుతీరున జనకునిమంత్రు లన్నిఏర్పా టులను గావించిరి. అంత జనకుడు తనవిభవానుసారముగ గజతురగరథపదాతి దాసదాసీజనంబులను, మణిభూషణాంబరాదులను చందనతాంబూలములతో వారికందఱికును తగురీతిని సమర్పించెను. అంత సీతను తల్లి తనయొడిలో గూర్చుండబెట్టుకుని, అమ్మా! నీవత్తమామలసేవింపుము. భర్తనుప్రేమింపుము. దాసదాసీజనముల సదయలై జూడుము. మనరెండువంశములను దరింపజేయుము, అని తల్లి పిల్లకు బోధింపదగినతీరున బోధించెను. చెలికత్తె లామెవియోగమున కెం తేని చింతించుచుండియు నామె కుచితరీతిని ధైర్యమును గఱపుచుండిరి. అంతలో శ్రీరామచంద్రు డత్తమామలకు ప్రణమిల్లి వారియనుజ్ఞను బడయగోరి సోదర సహితుడైయట కరుదెంచెను. అప్పుడచటివారందఱు నాదివ్యమూర్తుల దర్శించి తమజన్మము సఫలమైనదని యానందించుచుండిరి. పిమ్మట నటమజ్జనభోజనాదుల నాచరించి, రాణివాసముతో మాటాడుటకు సంకోచింపుచు రాముడు మెల్లన నిట్లనియె. ప్రయాణసన్నద్ధుడగు నయోధ్యాధీశుడు మమ్మ్మలను మీవద్ద ననుజ్ఞను గైకొనిరా బంచెను. కాన సానుగ్రహముగ శెలవు నిండను నాపలుకులు విని వారం దఱు ముగ్ధలైరి. ఎట్టకేలకు ధైర్యమును జిక్కబట్టి వధువులను వరుల కప్పగించు, సులోచన రామునితో నిట్లనియె. రామచంద్రా! నీవెరుగని దేదియును లేదు. మాకందఱికును బహిఃప్రాణమగు నీసీతను నీకు సమర్పించుచుంటిమి. నేటినుండి సీతకునుమాకును నీవేగతి. మావియోగమునకు సీత దురపిల్లకుండునట్లు గారవింపు

మని మాకోరిక. యని చింతాక్రాంతయై పలుకుచున్న యత్తగారిని యుచి తాలాపముల నూరడించి, ప్రణమిల్లి, యాశీస్సులనంది, యనుజ్ఞాతుడై సోదరసహితముగ నటనుండి వెడలిపోయెను. రాణివాసమంతయు వధువుల ప్రయాణమునకు ఖేదమోదముల నందుచుండెను. సీతచే పెంచబడిన పక్షి జాతమే సీతావియోగమునకు దురపిల్లుచుండ నిక సఖీజనము దుర పిల్లుట కేమివింత ! జనకుడు తమ్ముడగుకుశధ్వజునితో గలిసివచ్చి, సీతా వియోగమునకు ప్రాకృతజనునివలె దురపిల్లుచుండ నిక కుశధ్వజునిమాట చెప్ప నక్కరలేదు గదా ! అప్పుడు ప్రాజ్ఞులగుసచివులచే నోదార్పబడి, ధైర్యము నవలంబించి, ఇదిదుఃఖసమయముగాదని నిశ్చయించి, బిడ్డల నలుగుర జేరదీసి దీవించి, ప్రయాణోచితములగు యానముల సిద్ధపఱుపుడని యాజ్ఞాపించెను. అంతకుముందుగనే ప్రయాణార్హములగు శిబికలను మంత్రులేర్పఱచియుండిరి. అంత శుభముహూర్తమున గణనాథుని పూజించి, మంగళధ్వనులు మిన్ను మిట్టు చుండ నాపల్లకీలలో వధువులకులమర్యాదలనుసరించి గూరుచుండబెట్టి, సపరివార ముగ వారిప్రయాణమును సాగింప నంగీకరించెను. పిమ్మట బ్రాహ్మణోత్తములు, మంత్రిసామంతాదిపరివారమువెంటరా నాజనకకుశధ్వజులు పెళ్ళివారిని సాగ నంప బయలుదేరిరి. పెండ్లివారు తమతమ యానముల సిద్ధపఱచి ప్రయాణో న్ముఖులగుటజూచి మంగళధ్వనులు ప్రారంభమయ్యెను. దశరథు డంత విప్రుల రావించి గణేశునర్చించి, బ్రాహ్మణులపూజించి, వారియాశీస్సులనంది, పౌరు లను తగురీతిని గౌరవించి, దేవదుందుభులు మ్రోయుచుండ, పుష్పవృష్టి గురియుచుండగా, ప్రయాణోన్ముఖుడై, జనకునిజూచి, ఓమిథిలాధిపా ! మీసం బంధమునకును, మీగౌరవమునకును చాలసంతసించితి నని యానందాశ్రుపూర్ణ లోచనుడై పలికెను. ఇనకులతిలకా ! నిన్ను గౌరవింప నేనెంతటివాడను. అభి మానాతిశయముచే మీరట్లనుచుంటిరి. నాలోపములమన్నించినందుల కెంతయు కృతజ్ఞుడ ననిపలికి, యాతనిచే ననుజ్ఞాతుడై, రామచంద్రుని సమీపించి చేతులు జోడించి, యానందాశ్రుపూరితనయనుడై యిట్లనియె. మహాదేవమానస రాజహంసమా ! రామచంద్రా ! వీతరాగులు, సమాధినిష్ఠాగరిష్ఠులగు మహా యోగులు సయితము నీస్వరూపమును గ్రహింపజాలకున్నారు. అవాఙ్మానస గోచరుడవగు నిన్ను వేదములుగూడ జెప్పజాలకు. అట్టినిన్ను నేనేమని

బొగడగలను? భక్తానుగ్రహముచే నీవీ సగుణరూపమును ధరించి నన్ననుగ్ర హించితివి. నేనెంతేని ధన్యుడను. నీచరణకమలములు నాహృదయమునం దుండునట్లనుగ్రహింపుము. అనిప్రార్థింప నట్లకానిమ్మని మామను గౌరవిం చెను. పిమ్మట జనకుడు వశిష్ఠవిశ్వామిత్రుల సమీపించి. నమస్కరించి, మీనివర్యులారా! మీయనుగ్రహమున నేధన్యుడనైతిని. ఏయనుగ్రహ ముచే నన్నిట్లనుగ్రహించితిరో! యీ యనుగ్రహ మెల్లప్పుడు నుండు నట్లు గటాక్షింపుడని ప్రార్థించెను. పిమ్మట తగురీతిని జనకుని గౌర వించి, యాతని నాగుమని జెప్పి, మంగళధ్వనులు మిన్నుముట్టుచుండ ప్రయాణమును సాగించిరి. మిథిలాపురవాసు లందఱు నిట్లు పెండ్లి వారిని సాగనంపి ఖేదమోదభరితమనస్కులై తను తమ నివాసములకు బోయిరి. అట్లుబయలుదేరి సురక్షితసుఖమయ కతిపయప్రయాణంబుల నయో ధ్యను సమీపించి, నృత్తగీతవాదిత్రములు మిన్నందుచుండ శుభముహూర్త మున పెండ్లివా రయోధ్యను ప్రవేశించిరి. అపుడు పౌరాంగన లానూతనవధూ వరుల జూచువేడుకచే సౌధాగ్రములందును, గవాక్షములందును, గృహప్రాం గణములందును, యథావకాశముగ గుమిగూడి యుండిరి. పురవీథులన్నియు శుభ్రపఱచి, పన్నీరుచల్లి, అందముగ ముగ్గుచే నలంకరించి, మంగళద్రవ్య ములచేతను, పూర్ణకలశముల చేతను, కదళీకాండములచేతను నలంకరింపబడి యుండెను. బ్రహ్మాదులా రామచంద్రుని పురప్రవేశమున కెంతేని సంతసించు చుండిరి. అష్టసిద్ధులును పౌరులతోబాటు రామచంద్రుని సేవించుట కటసన్ని హితములై యుండెను. పౌరపుణ్యస్త్రీలును, కౌసల్యాదిరాణులును ఆనంద పరవశలై మంగళద్రవ్యముల జేకొని రామచంద్రుని రాకకై నిరీక్షించుచుం డిరి. రామచంద్రుని జూచుటకు సౌధాగ్రములం దుండెడియువతులు విద్యుల్ల తలవలె ప్రకాశించుచుండిరి. అట్టి శుభసమయమున దశరథుడు వసిష్ఠానుమతి నంది, గౌరీశంకరగణేశులను, యథావిధిగ నర్చించి, పురప్రవేశమును జేయు నపుడు దేవతలు కుసుమవృష్టిని గురియించిరి. ఇట్లు పురప్రవేశ మొనరించిన దశరథునికిని రామచంద్రునికిని నమస్కరించి వారిదర్శనముచే కృతార్థులగు పౌరు లెంతేని సంతసించు చుండిరి. ఇట్లు పౌరులనానందింప జేయుచు రాజు నగరద్వారమును జేరెను. అంతరాణు లందఱును వధూవరులను నేత్రపర్వ

ముగ జూచి యానందించుచు మంగళహారతులుమున్నగు కులాచారకృత్యముల జఱిపి వారలను దోడ్కొనిపోయిరి. పిమ్మట వారల నుచితాసనముల గూరు చుండబెట్టి చేయదగిన మర్యాదలన్నిటిని జేయించిరి. అంత నావధూవరులు దల్లులకు సవినయముగ నమస్కరింప, వారిని యాశీర్వదించి యుచితాలాప ముల కాలక్షేపమున జేయుచుండ వారి పరస్పరప్రేమకు రామచంద్రుఁ లోలోన నవ్వుకొనుచుండెను. పిమ్మట దశరథుఁడు తనరాణులతోడను, వధూ వరులతోడను గలిసి గృహదేవత నారాధించి, వారి యనుగ్రహము వడసి బంధుమంత్రిసామంతాదుల రావించి, వారలనందఱను యథోచితముగ భూషణ వస్త్రమాల్యానులేపనాదుల సత్కరించెను. అట్లు సత్కృతులై రామచంద్రుని కల్యాణవైభవమును కొనియాడుచువారునిజనివాసముల కేగిరి. పిమ్మట దశరథుఁడు రాణివాసమున కేగి కొడుకులను కోడండ్రను, తనవద్ద గూర్చుండ బెట్టుకొని, వివాహ విశేషములను, జనకునిఐశ్వర్యమును, వారుకావించినమర్యాదలను మాటిమాటికి ముచ్చటించుచు రాణులనానందపరవశలజేసెను. అంత భోజనసమయమాసన్న మగుటచే దశరథుఁడు సపుత్రబంధుమిత్రసహితముగ స్నానమాచరించి, ధౌత వస్త్రముల ధరించి, సుగంధానులేపనం బొనరించి, యథావిధిగ నాహ్నిక కృత్యము లాచరించి, దేవతల బూజించి, షడ్రసోపేతములగు మధురాహార ముల భుజించి, తాంబూలచర్వణ మొనరించి, యిష్టాలాపముల గొంతపొద్దు గడపి, వారివారి నివాసములకు జన ననుజ్ఞనీయ వారందఱును ఆనందపరవ శులై నిజనివాసములకు బోయిరి. ఈరామచంద్రుని కల్యాణమహోత్సవమును వర్ణింపనేరికిని దరముకాదు. అంత దశరథుఁడు రాణులజూచి యిట్లనియె. ఈ బాలికలు పితృగృహమును వీడి యిప్పుడే మనరాణివాసమునకు వచ్చియుండిరి. కాన వీరికి మనోవ్యాకులత లేకుండునట్లు మీరన్ని విధముల జూచుకొనుచుం డుడు. మఱియు కల్యాణసందర్భమున బడలియున్న వీరికి విశ్రాంతియవసరము. కాన తగురీతిని విశ్రమింపజేయుడని చెప్పి రాజు తనవిశ్రాంతి భవనమునకు జనియె. పిమ్మట రాజాజ్ఞానుసారముగ వారు కోడండ్ర కుచితాహారాదుల నొసంగి యర్వాశయ్యాలంకృత దివ్యభవనంబుల వారిని విశ్రమింప బనిచిరి. అట్లు బనిచి సుఖశయనోపవిష్టుడగు రామచంద్రుని సమీపించి, తండ్రీ! యాగసంరక్షణమున కేగిన నీవెట్లాతాటకను దునుమాడితివి? అజేయమగు

సుబాహ్వాదిప్రముఖదనుజానీకము నెట్లు సంహరించితివి. నిర్విఘ్నముగ యాగమును సంరక్షించి విశ్వామిత్రుని యనుగ్రహమును బడసి, కృతార్థుడ వైతివి. నీపాద సంస్పర్శముచే నహల్యా శాపవినిర్ముక్తయైనది. ఇతర దురారోపమగు నా శివధనస్సును నీవెట్లు భంజించితివి. ఆ శివధనుర్భంగమే నీకును నీసోదరులకు పరిణయకారణము. రామా! నీముఖకమలము నెంత జూచినను తనివి తీరకున్నది. మాజన్మము సార్థకము. మేము కృతార్థులము. అను నాతల్లుల మాటలు విని యుచితాలాపంబుల వారలను సంతసింపజేసెను. పిమ్మట మహాదేవుని స్మరించుచు రామచంద్రుడు నిదురించెను. నిద్రాసమయంబునను రామచంద్రునిమోము సంకుచితారవిందమువలె శోభిల్లుచుండెను. అంత ప్రాతఃకాలమగుటచే వందిమాగధస్తుతులచే మేల్కాంచి, గజపూర్ణకలశాదిమంగళ వస్తువుల దిలకించి, ప్రాతఃకాలకృత్యములనిర్వర్తించి, స్నానసంధ్యాది నిత్యకర్మానుష్ఠానమును గావించి సోదరసమేతుడై తండ్రిని సమీపించి నమస్కరించి, యాతని యాజ్ఞానుసారముగ నుచితాసనమున గూరుచుండెను. అపుడా రామచంద్రుని జూచువారందఱును తమనేత్రములు జన్మమును సార్థకములయినవని సంతసించుచుండిరి. అంతలో వశిష్ఠవిశ్వామిత్రు లటకరుదేర రాజును సభ్యులును లేచి,వారికి నమస్కరించి పూజించి యుచితాసనముల గూరుచుండబెట్టి వారి యనుజ్ఞను బడిసి తామును గూరుచుండిరి. అపుడు వశిష్ఠుడు ధర్మోపదేశముల జేయుచుండ వారందఱును వినుచుండిరి. పిమ్మట వశిష్ఠుడు ప్రసంగమును గల్పించి గాధినందనుని చరితమును జెప్ప నారంభించెను. ఇతర మునిదుర్లభంబగు విశ్వామిత్రుని చరిత్రము నెంతేని సావధానముగ విని వారందఱు నానందపరవశులగుచుండిరి. తమగురువుల మహిమను విని రామలక్ష్మణులు మిక్కిలి సంతసించుచుండిరి. ఇట్లు నిత్యము మంగళోత్సవములతో నా యయోధ్య విరాజిల్లుచుండెను. అచటిప్రజలు దివారాత్రము లానందపరవశు లగుచుండిరి. దేవతలుగూడ శ్రీరామచంద్రుని లీలావలోకనకౌతుకమున దమ కా యయోధ్యానివాస మబ్బిన బాగుగనుండునని యనుకొనుచుండిరి. రాముని యందలి ప్రేమాతిశయముచే విశ్వామిత్రుడు రాముని విడువజాలక కొంతకాల మటనుండి, ఎట్టకేలకు దనప్రయాణమును నిశ్చయించి దశరథున కెరిగించెను. అపుడు దశరథుడు పుత్రసహితముగవచ్చి, విశ్వామిత్రునకు

నమస్కరించి, పూజించి, యిట్లనియె. మానివర్యా! నాయీయభ్యున్నతికి తమ యనుగ్రహమే కారణము. తమయుపకృతి మరువరానిది. తాముమావత్సలనాశీర్వదించి, మాకప్పుడప్పుడు దర్శన మిచ్చుచుండవలయును. అన విని ముని వారల నాశీర్వదించి, వారలచే ననుజ్ఞాతుడై నిజాశ్రమమునకుం జనియె. అపు డాముని యందలి గౌరవాతిశయముచే రామచంద్రుడు సోదరసహితుడై కొంతదూర మాతనిసాగనంపి, యాతనిచే ననుజ్ఞాతుడై మఱలివచ్చి, నిజనివాసంబునకుం జనియె. రామచంద్రుని పవిత్రవివాహమహోత్సవము త్రిలోకవ్యాప్తము. ఆ యుత్సవమును శేషుడైనను వర్ణింపజాలడు. కవుల కీరామచరితమే జీవనాధారము. కాని యేకవియు నీ రామచరిత మనుయపారసాగరమును దాట జాలడు. ఎవడీ పవిత్రమగు రామజననమును, కల్యాణమహోత్సవమును గానము చేయునో, లేక వినునో, వాడు సీతారాములకృపాపాత్రమై, యిహపరాముష్మిక సుఖముల నిస్సంశయముగ నందగలడు. ఓపార్వతీ నావలన నీరామజననకల్యాణముల విని యుంటివి. కాన నీవు ధన్యవు. నీవన్నిటికి నధికారిణివి. నీకు నిశ్చల హరిభక్తి లభించును. రామచరణకమలధ్యానరూపమగు పవిత్రోదకము సంసార తాపత్రయమును దప్పక చల్లార్చును. ఇట్లు శివుడు పార్వతికి బోధింప తులసీదాసుడు శ్రీరామమహిమను దెలిసికొని హరిగుణసంకీర్తనమును జేయుచు నీకథను రచించెను. ఈసంసారార్ణవమును దాటుటకు హరినామ సంకీర్తనము దప్ప వేఱొండు సాధనములేదు. రాముని చరితము సర్వమంగళములకును మూలము. కాన యజ్ఞానమునుండి మేల్కొని, రామనామసంకీర్తన మొనర్చుచు కృతార్థులు కండు.....

ఇట్లు శ్రీమద్గురుస్వామి తులసీదాసవిరచిత శ్రీరామమానసమున, సకలకలి
కలుషవిధ్వంసకమును, విమలవిజ్ఞానవైరాగ్య సంపాదకము నగు
బాలకాండ మను ప్రథమసోపానము సమాప్తము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

అయోధ్యాకాండము

శ్లో॥ వామాంకెచవిభాతిభూధరసుతా, దేవాపగామస్తకె
ఫాలేబాలవిధు, ర్గళేచగరళం, యస్యోరసివ్యాళరాట్
సోయం, భూతివిభూషిత, స్సురవర, స్సర్వాధిప, స్సర్వదా.
శర్వ, స్సర్వగత, శ్శివ, శ్శశినిభ, శ్శ్రీశంకర, పాతు, మామ్॥

వామాంకమునభూధరసుతయు, మస్తకమున గంగయు, ఫాలమున చంద్రకలయు, గళమున గరళమును, వక్షస్థలమున సర్పరాజును, గలిగి భూతి విభూషితగాత్రుడై, సర్వాధిపుడును సురశ్రేష్ఠుడును సర్వగతుడును నగు శశి ప్రభగలశర్వుడు మమ్మెల్లప్పుడు రక్షించుగాత.

శ్లో॥ ప్రసన్నతాంయానగతాభిషేకత, స్తధానమ్లే, వనవాసదుఃఖత
ముఖాంబుజశ్రీ, రఘునందనస్య మె సదాస్తు, సా, మంజులమంగళప్రదా॥

ఎవనిముఖకమలము రాజ్యాభిషేకమునకు వికసించుటయు, వనవాసఖేద మునకు ముకుళించుటయు, నెఱుంగదో, అట్టి రఘునాథుని ముఖములకాంతి, మాకెప్పుడును మంగళప్రదమగుగాత.

శ్లో॥ నీలాంబుదశ్యామలకోమలాంగం, సీతాసమాసాదితవామభాగమ్
పాణౌమహాసాయకచారుచాపం నమామిరామమ్ రఘువంశనాథమ్॥

ఎవడిం దీవరశ్యామలకోమలగాత్రుడో, ఎవనివామభాగమునసీత విరా జిల్లుచున్నదో, ఎవనిపాణికమలమున ధనుర్బాణములు విలసిల్లుచున్నవో, అట్టి రఘునాథుని నమస్కరించున్నాను.

గురుచరణరజఃకణములచే నా మనోదర్పణమును నిర్మలము గావించి, చతుర్విధపురుషార్థముల నొసంగెడి రఘువర విమల యశస్సును వర్ణింపుచు న్నాను. ఎపుడు సీతారాము లయోధ్యయందు కూడియుండిరో నాటినుండి యయోధ్య సకలమంగళాకరమై నిత్యనవీనశోభలతో వర్థిల్లుచుండెను. మఱియు చతుర్దశభువనముల సుకృతమేఘములు సుఖామృతమును వర్షింప సంపద్రూప ములగు నదులు నలుదెసల ప్రవహించి యయోధ్యార్ణవమున గలియు

చుండెను. సముద్రమునందువలె నిందును నరనారీ గజతురగరత్నములు భాసిల్లు చుండెను. నిత్యము శ్రీరామచంద్రుని దర్శనభాగ్యముచే నచటివా రమితా నందభరితులగుచుండిరి. రామచంద్రుని గుణశీలసౌందర్యములజూచి దశరథవశిష్ఠు లెంతేని సంతసించుచుండిరి. ఇంద్రాదిదేవత లారాజును జూచి ముల్లోకము లందును నిట్టిధన్యుడు లేడని పొగడుచుండిరి. రామచంద్రునకు దండ్రియగు నాతని కెవరుసాటికాగలరు? ఒకనాడారాజు యుద్ధమున నిజరూపమును దిలకించు కొనునపుడుజరపలితరూపముదాల్చియాతనిచెవియొద్దజేరి రాజా! నీవిక రామునకు రాజ్యమునిమ్మనిమెల్లగనుపదేశించుచుండెను. అంతదశరథు డాలోచించి రాము నకు బట్టాభిషేకమును జేయనిశ్చయించి, ముదితహృదయుడై, యీవిషయము నుగురువునకు మనవిజేయదలచి మంచిసమయమున గురుని దర్శించి యిట్లనియె. మాానివర్యా! నావిన్నప మాలింపుము. రామచంద్రు డిపు డన్నివిధముల రాజ్యాభిషేకమున కర్హుడని తోచుచున్నది. మంత్రిసామంతాదిపౌరులెల్ల రాతనినిష్ప్రేమించుచు నాతనిపట్టాభిషేకమున కెదురుచూచుచున్నారు. దేవ బ్రాహ్మణభక్తియు, ప్రజానురక్తియు, గురుచరణసేవాసక్తియు, రామునకు సహజసిద్ధములు. కాన తమకు సమ్మతమగునేని నేనాతనికి బట్టమును గట్టదలం చితిని. అనవిని వశిష్ఠు డిట్లనియె. రాజోత్తమా! నీకు మంచికోరిక గలిగినది. రామచంద్రు డన్నివిధముల బట్టాభిషేకమున కర్హుడు. కాన నీ వాకార్య మును దప్పక నెరవేర్పు మన విని సంతసించుచు దశరథు డిట్టులనియె. గురు వర్యా! అటులయిన రాముని బట్టాభిషేకమున కనువగు సుముహూర్తమును నిర్ణయింపు డని మనవిచేయుచు, స్వామీ! మానవశరీరములు జీవితములును బుద్బుదప్రాయములు. కాన నీకార్యము సాధ్యమగునంత త్వరలో జరుగున ట్లనుగ్రహింపవలయు నన వశిష్ఠు డిట్లనియె. రాజా! ఎవనిని భజింపక జీవులు సంసారబద్ధు లగుచుండిరో, ఎవనికటాక్షలేశముచే తాపత్రయము నిర్మూలింపబడునో, అట్టి రామచంద్రుడు నీపవిత్రప్రేమ కధీనుడై యుండ నీకే భయమేల! నీవన్నియు సిద్ధము చేయించుము. శుభసమయమున రామచం ద్రుడు యువరాజు కాగలడన విని రాజపరిమితానందము నొంది యాతని యనుజ్ఞను బడసి తనమందిరమున కేగిమంత్రుల రావించి, వారి కీయభీష్టమును దెలిపెను. ఆ మాటలకు అచటివా రపరిమితానందము నొందిరి. పిమ్మట

రాజు రామచంద్రునిపట్టాభిషేకమునకు దగినపదార్థములను త్వరలో జాగ్రత్తగా సిద్ధపఱుపు డన నప్పుడు సుమంత్రుడు వశిష్ఠుని జేరియిట్లనియె. గురువర్యా! దశరథుడు రామచంద్రునకు బట్టముగట్ట సమకట్టియున్నాడు. కాన దానికి వలయు పదార్థముల నానతిండు. అనవిని వశిష్ఠుడు ముదితాంతరంగుడై యిట్లనియె. సుమంత్రా! సమస్తతీర్థోదకములు గావలయును. మఱియు నవరత్నములు సమస్తౌషధులు, చామరములు, శంఖములు, శ్వేతాతపత్రము, దివ్యాంబరములు ఫలసమిత్కుశకుసుమములు గావలయును. గోభూతిలహిరణ్యాది నవధాన్యము లను సిద్ధము చేయుడు. పురమునంతను చక్కగ నలంకరించి చతుష్పథము లందు తోరణపతాకముల నిలుపుడు. నీవీరఘుకులమునకు ప్రాచీనసచి వుడవు. కాననీకు నాయుపదేశము నిమిత్తమాత్రము. నీకు దెలియని దేదియు లేదన విని సుమంత్రుడు ముదితాంత రంగుడై వశిష్ఠునియొద్ద శలవుగైకొని చని శిల్పులను రావించి యయోధ్య నలంకరింపు డని యాజ్ఞాపింప వారును నతిమనోహరముగ నలంకరించిరి. అప్పుడాపుర మలకా పురమును మించి శోభిల్లుచుండెను. అంతలో సేవకులు ప్రభునానతిచొప్పున, బట్టాభిషేకమున కనువగు సకలపదార్థములను సిద్ధపఱచి భద్రగజము నలంక రించిరి. అంత దశరథుడు వసిష్ఠునియాజ్ఞానుసారము దేవబ్రాహ్మణులబూజించి సకలశ్రేయోభివృద్ధికొఱకు దగిన సమస్తదానముల జేసి యానందించుచుం డెను. అప్పుడు సీతారాములకు శుభసూచకములగు యంగస్పందనము లగుచుం డెను. అప్పుడు రాముడు సీతతో నిట్లనియె. సీతా! యీశుభస్పందనముల వలన నాకిట్లుదోచుచున్నది. భరతుడు చిరకాలమునుండి మాతులగృహమున కేగి యున్నాడు. భరతుడు నాకుమిగుల ప్రేమాస్పదుడగుటచే నాకాతని వియోగము దుస్సహముగ నున్నది. కాన నాత డిటకు త్వరలోరాగలడని తలంచెద ననెను. రామచంద్రుని పట్టాభిషేక మహోత్సవమును విని రాణివా సము స్త్రీలు మిక్కిలి సంతసించుచు ప్రప్రథమమున నీవార్త నెఱింగించినవారిని బహుమానములచే గౌరవించిరి. సుమిత్ర తనభవనమును యమూల్యములగు విచిత్రవస్తువులచే నలంకరింపించెను. కౌసల్య గణనాథుడు మున్నగు దేవతల బూజించి వస్త్రాభరణాదులచే బ్రాహ్మణుల నర్చించి, దాసదాసీజనంబులను పారితోషికములచే నానందింపజేసెను. అటనుండెడి పుణ్యస్త్రీలు రామరా

జ్యాభిషేకమునకువలయు మంగళద్రవ్యముల సమకూర్చుచుండిరి. అంత దశరథునిపంపున వశిష్ఠమహర్షి రామునకు రాజనీతి నుపదేశింపదలచి రామునికడకు వచ్చెను. వెంటనే రాము డెదురేగి నమస్కరించి, యుచితా సనమున గూరుచుండబెట్టి యర్ఘ్యపాద్యాదులచే బూజించి, కుశలమడిగి మృదుమధురోక్తుల నిట్లనియె. గురువర్యా! తమరాక మాకెంతేని శుభ ప్రదము. తమయాజ్ఞను శిరమునదాల్చి నిర్వహింపగలను. ఆనతిం డన రామ చంద్రుని వినయాదిగుణముల కెంతేని సంతసించుచు మని యిట్లనియె. భాను కులతిలకా! నీవెరుగనిదేమున్నది. మీతండ్రిగారు నీకుపట్టమును గట్టదలచి సర్వమును సిద్ధముచేయుచున్నారు. కాన నీవికమీద నప్రమత్తుడవై రాజ్య రమను జూచుచుండవలయును. రాజ్యలక్ష్మి యతిచపలయు ననర్థభూయిష్ఠ యును గాన నేమాత్రమైనను నేమరుపాటు పనికిరాదు. అని తత్కాలోచిత ములగు నీతుల నుపదేశించి యాతనిచే ననుజ్ఞాతుడై మఱల రాజభవనమున కేగెను. పట్టాభిషేకవార్తను వినినతోడనే రాముడిట్లు తలపోయసాగెను. మా సహోదరులునలుగురకును జననము, విద్యాభ్యాసము, చౌలోపనయనాదిసంస్కా రములు, వివాహము మున్నగునవన్నియు నేకకాలమునసే జరిగినవి. ఆటల యందైనను మేమొకరినొకరు వీడియుండుటలేదు. అయిన నీపట్టాభిషేకము జ్యేష్ఠునకే చేయుట మావంశాచారమై యున్నది. పట్టాభిషేకము మా కలయికకు భంజకమగునేమో! యనిసోదరప్రేమచే రాముడు పరిపరివిధముల దలపోయుచుండెను. అప్పుడానందపరవశుడగు లక్ష్మణుడేతెంచి, అన్నా! చూచి తివా! మనపురశోభను! నీపట్టాభిషేకవార్తనువినిపౌరులుపట్టరానియానందముతో మంగళద్రవ్యములసమకూర్చుకొనుచు గృహములను దేహములను యలంకరించు కొనుచు నెప్పుడు రామచంద్రుని పట్టాభిషేకమహోత్సవము జరుగునా! యని యువ్విళ్ళు లూరుచున్నారు. ఇప్పటిలో భరతుని రాకయొక్కటియే మనకు లోపముగనున్నది. అని యేమేమొ ముచ్చటించుచుండెను. అంత దేవత లానం దర్భమును గ్రహించి సరస్వతియొద్దకేగి ఇట్లనిరి. అమ్మా! రామచంద్రునికి బట్టాభి షేకమట. అట్లయిన రామునికి వనవాసము రాక్షససంహారము ఎట్లుజరుగును? మాఇక్కట్లు లెట్లుతొలంగును? కాన నీవు రామునికి బట్టాభిషేకమునుమాన్పి వనవాసమున కేగునట్లనుగ్రహింపవలయు నన విని భారతి యేమో యాలో

చింపుచుండెను. రామచంద్రుని పట్టాభిషేకమునకు విఘ్నమును గల్పించుట ఏమిన్యాయము ! దేవతలు స్వార్థపరులై యిట్లనుచున్నారు. వీరిబుద్ధి యెంత నీచము ? అనుకొనుచు మఱలనిట్లు దలపోయసాగెను. ఖేద మోదరహితుడు, నిత్యపరిపూర్ణుడు నగు రామచంద్రున కరణ్యవాసము, రాజ్యాభిషేకమును సమానములు. మఱియు నాతడు దుష్టనిగ్రహమునకును శిష్టపరిపాలనమునకు నవతరించియుండెను. కానభవితవ్య మిట్టిది. ఇందు నా కేమియు దోషము లేదని నిశ్చయించి, చంద్రిక, కమలవనమునందువలె తానయోధ్యలో బ్రవేశించెను. అంత కైకేయిదాసియగు మంథరను సమీపించి యీమెమూలమున దనకార్య మును సాధింపనెంచి యీమెముఖమున బ్రవేశించెను. తోడనే మంథరబుద్ధి మాఱిపోయెను. అంతనాకుటిల, రామునిపట్టాభిషేకమున కెట్లైనను విఘ్నమును గల్పించి తీరవలయునని నిశ్చయించి యేడ్చుచు దనరాణియగుకైకను సమీపించెను. వెంటనే మంథరా ! నీకేమి విపత్తువాటిల్లినది ? ఎందుల కిట్లేడ్చుచుంటివి ? అని పలుమారు ప్రశ్నింపగా నెట్టకేల కామంథర కైకతో నిట్లనియె. అమ్మా ! యిప్పటివఱకు నందఱకు గుశలమే. కాని తన యజమానికి రానున్నయాపద నెఱిగిన యేసేవకుడైనను దుఃఖింపక యూరకుండజాలడు. నీవీ తాత్కాలికభోగములకు మురియుచుంటివే కాని రానున్న విపత్తును గమనింపజాలకుంటివి. నీకొమరుడు గ్రామాంతర మందున్నవాడు. రేపు రామునకు బట్టాభిషేక మగునని కౌసల్య యానందమునకు మేరలేదు. ఆమెను జూచిన నాకెంతేని దుఃఖము వొడమచున్నది. నీభవితవ్యమును నీవాలోచింపజాలకుంటివి. అను నామంథరమాటల వినికైక మిక్కుటమగు కోపముతో నిట్లనియె. ఓసీ ! నీవిక నీప్రల్లదముల గట్టిపెట్టుము. ఏమో యాపదవాటిల్లినదని భయమందుచుంటిని. రామచంద్రుని సౌశీల్యమును నేనెఱుగుదును. మఱియు జ్యేష్ఠుడగు నాతనికి బట్టముగట్టుట యుచితమేగద ! ఇందు రాజుచేయు మోస మేమున్నది ? రాముని బట్టాభిషేకమునకు మేమే యిట్టి యానందము నందుచుండ కౌసల్య యానందించుట కేమి వింత ? ఈ సమయమున నీకీదుర్బుద్ధి యెందులకు వొడమినది ? అన నామె కామంథర మఱల నిట్లనియె. తల్లీ ! నీయోగక్షేమముల నరయుట మాకు విధి. కాన రానున్న యాపదనుబట్టి నేనిట్లు చింతిల్లుచుంటిని. ఇంతవఱకు రాజునకు పరమప్రేమా

స్పదవగు నీవికమీద కౌసల్యకు దాసివలె నుండవలయును. ఎంతయుదార స్వభావముగలదై నను దనసవితిని ద్రిబేమించువనిత యెందునులేదు. రాము డెంత గుణనిధియైనను దల్లిని యెట్లు శాసింపగలడు ? ఇంతదనుక నిట్టిస్వాతంత్ర్యము ననుభవించిన నీవాకౌసల్యాదాస్యము నెట్లుసహింపగలవు ? నీయందలి యభిమానముచే నేనిట్లంటిని. దాసినగు నామాటలందున్న పొఱబాటును మన్నింపుము. నీభావినాలోచించుకొనుము. పోయివచ్చెద ననుమంథర మాటలు దొలుత నామెకుకటువుగా నున్నను క్రమక్రమముగ నామెహృదయమున ద్రవేశించి, సరస్వతీమోహావేశమున నమృతోపమములయ్యెను. అంత నామె హృదయమును గ్రహించి మఱల మంథర ఇట్లనియె. అమ్మా! సమయవిశేషముబట్టి మిత్రులు శత్రు లగుచుందురు. కౌసల్య చాల నేర్పుకలది. లేకున్న నీబిడ్డడు గ్రామమున లేకుండజేసి యిప్పుడే రామునకు బట్టమును గట్టునట్లుల జేయును ? లోకమునం దెందఱో స్త్రీలు తమసవతుల్ను వంచించిన కథల నీవు వినియుండుటలేదా యను నాదాసికి కైక యిట్లనియె. మంథరా ! రాజు జ్యేష్ఠునకు బట్టమును గట్టుట యుచితమేగదా ! అట్లయిన నాకేమినష్టము వాటిల్లును? అన నామంథర మఱల నిట్లనియె. తల్లీ ! తిర్యగ్జంతువు సయితము తమ మంచిచెడ్డల గ్రహించును. కాని నీవుమాత్రము గ్రహింపజాలకుంటివి. నేడునీదాసినగుటచే నీహితమును కోరి చెప్పుచుంటిని. రేపు రాముడు పట్టాభిషిక్తు డగును. అంతటినుండి నీవు వేడిపాలలోనీగవలె మాడిపోయెదవు. నీవు పుత్రసహితముగ దాసివి గావలయును. లేనినాడు నీకిటనుండుటకు దావులేదు. లక్ష్మణు డెపుడును రామునకు మిత్రుడే యగును. ఇకనీకును నీతనయునికిని కారాగారమే శరణ్యము. అనినిష్ఠురముగా బలుకుచున్న యామెమాటల విని కైక కంపితగాత్రియై యేమియుదోపక విచారించుచుండెను. మంథర తన కటూపదేశములచే నంచకొదమనుబకముగామార్చివేసెను. అపుడామెకు దురుప దేశవిషదిగ్ధగాత్రియగు కైక యిట్లనియె. మంథరా నీమాటలు సత్యములు. నాయందు నిజమగుప్రీతికలదానవు. కాన రాబోవుపరిస్థితి నంతను గమనించి నీవిట్లు చెప్పితివి. మఱియు నాకు కుడికన్నదరుట, దుస్స్వప్నములు వచ్చుట మున్నగు ననర్థసూచకములు లగపడచున్నవి. విధాత నాకిట్టి దారుణదుఃఖమును గల్పించియుండెనేమో ! ఏమిచేయుదును ? నాకేమియు దోపకున్నది.

నేను దేహమునైనను విడిచెదను కాని సవతులకుదాసినై యుండజాలను. అనిపలువిధముల జింతించుచున్న యారాణినిజూచి మంథర ఇట్లనియె. అమ్మా! నీవు వగవకుము. నీవు సర్వవిధముల సుఖముల నందెదవు. నీకు చెడుగును దలపెట్టినవారికే దుఃఖములు వాటిల్లును. రామునిపట్టాభిషేకవార్తను వినినది మొదలు నేనునీవిషయమును దీర్ఘముగ నాలోచించుచుంటిని. దైవజ్ఞుల నడిగితిని. వారు నాకొకరహస్యమునుజెప్పిరి. భరతునకే రాజ్యమువచ్చును కాని రామునకురాదని నొక్కివక్కాణించిరి. ఎట్టిపనికైనను బ్రయత్నము గావలయును. కాననేనొకయుపాయమునుబన్నెదను. నామాటలశ్రద్ధగావినుమన కైక యిట్లనియె. మంథరా! నాహితమునుగోరిన నీమాటల జవదాటను. నీవేమిచెప్పినననట్లుచేయుదాన. తప్పక చెప్పుమన నామంథరకైకను యజ్ఞపశువునువలె భావిదుఃఖమునబడవేసిహింసింపదలచి, వ్యాధుడు శారికను వాగురాబద్ధనుజేసినట్లు, తన కుటిలవాగ్వాగురముల నాకైకను దృఢముగ బంధించియుంచెను. వాగురాబద్ధమగు శారిక భావ్యనర్థమును పాటింపక, యాహారమును దినుట్లామంథరా దురోభధమును కైక వినుచుండెను. అప్పుడు మంథర యిట్లుపన్యసింపసాగెను. అమ్మా! రాజు నీకు రెండువరముల నిచ్చినట్లు తొల్లి చెప్పియుంటివి. ఇపుడు వానివలన నీయభీష్టము సిద్ధించును. వానిలో నొకదానికి భరతునకు రాజ్యమును, రెండవదానికి రామునకు వనవాసమును గోరుము. అట్లయిన కౌసల్యానందము భగ్నమగును. నేటిరాత్రియందే మనపని పూర్తికావలయును. కాన నీవు కోపాగారమున బ్రవేశింపుము, అచటనే మనపనులన్నియు చక్కబడగలవు. అను నామంథరపలుకుల మెచ్చుకొనుచు, నాకు నీవంటి హితకారిణి లెవ్వరును లేరని యామె బుద్ధికౌశలమునకు మెచ్చుకొనుచు నామె చెప్పినట్లు కోపాగారమున బ్రవేశించెను. అప్పుడు కైక యను వసుంధరయందు పడిన విపద్బీజములు మంథరాకుటిలవాగ్జలముచే దడపబడి భావిదుఃఖఫలము నిచ్చటకు వరద్వయరూపద్విదళాంకురములుగ పరిణమించెను. అప్పుడు కైక కోపవేషమును ధరించి రాజురాకకెదురు చూచుచుండెను. కానియిది తనయనర్థమునకు మూలమని గ్రహింపజాలకుండెను. అప్పుడయోధ్య సర్వాలంకారశోభితయై విరాజిల్లుచుండెను. కాని కైకభవనము మాత్రము కలావిహీనమై యుండెను. అయోధ్యయందలి స్త్రీపురుషు లందఱును మంగళద్రవ్యముల సమకూర్చుకొని

యమితానందముతో గుంపులుగుంపులుగా రాజనగరున బ్రవేశించుచుండిరి. రామచంద్రుని శుభప్రదమగు పట్టాభిషేకవార్తను విని యాతనిబాల్యమిత్రులగు రాజపుత్రులుకొంద ఱాతనియొద్దకు వచ్చిరి. రాముడంత వారల నాదరించి, ప్రేమపూర్వకముగ మృదుమధురాలాపముల జేసి వారల నంపుచుండెను. వారు రామచంద్రుని ప్రేమకు యచ్చెరువందుచు, నిగర్వచూడామణి యని రాముని బ్రశంసించుచు, నట్టిరాముని యనుగ్రహమునకు బాత్రము లైన తమ జీవితము లెంతేని ధన్యములని సంతసించుచు బోవుచుండిరి. అంతస్నేహము దేహమును ధరించి, నిష్ఠురత్వము సమీపమునకు బోవు నట్లు సంధ్యాసమయమున రాజు కైకేయీ భవనమునకు బ్రయాణమయ్యెను. రాణి కోపగృహమునందున్నట్లు దెలిసికొని సంకుచితగమనుడై మనంబున భయమందుచు నడుగుముందిడజాలకుండెను. ఎవని భుజబలముచే నింద్రాదులు నిర్భయముగ నుండిరో! రాజలోకమంతయు నెవనికటాక్షమున కెదురుచూచు చుండునో! అట్టివాడు నే డొకవనిత కోపమునకు భయము నందుచున్నాడు. ఏమి యాశ్చర్యము? శూలపాణిసహితము మదనుని కుసుమసాయకములకు లొంగిపోవుచున్నాడు. మదనపరవశుడగు రాజు సాశంకముగ ప్రియురాలియొద్ద కేగి యామె దుఃఖదశను జూచి తానును దుఃఖితుడై యుండెను. కైక జీర్ణమలి నాంబరమునుధరించి, నిరాభరణయై భూమిమీదపరుండి యుండెను. అప్పటి యామెవేషము భావివైధవ్యమును సూచించుచుండెను. రాజప్పుడు చెంతకేగి భామినీ! నీయాకోపమునకు కారణమేమి యని పలుకుచు తన హస్తము నామె దేహమునందిడ నామె రాజు చేయిని విదళించి క్రోధావిష్టమగు కృష్ణసర్పము వలె నాతని జురచుర చూచుచుండెను. దంష్ట్రాకరాళయగు వ్యాఘ్రాంగనవలె నామెయు నదనుజూచుకొని వరములను దంష్ట్రలచే నారాజు నెపుడు పీడింతునా యని జూచుచుండెను. ఆమె యెంతక్రూరముగ బ్రవర్తించినను రాజామెను, సుముఖ! సులోచనా! గజగామినీ! నీయాకోపమునకు కారణమేమి? నేనెన్న డును నీయెడల నపచార మొనరించియుండుట లేదు. పరు లెవ్వరేని నీకప చార మొనరించిన జెప్పుము. వాడెట్టివాడైనను తప్పకదండింతును. నాసామ ర్థ్యమును నీవెఱుంగుదువుగదా. నేను నాప్రజలు నారాజ్యమును నీయధీనములు రామచంద్రుమీద నొట్టుగా జెప్పుచుంటిని. నీయభిమతమును దప్పక నెఱవేర్చు

వాడను. నా నయన చకోరములు నీముఖచంద్రు నభిలషించుచున్నవి. నీ నగు మోము నొకసారి జూపుము. ఇట్టి యమంగళవేషమును వదలి నీమేని నలంక రింపుము. అన విని యాకోమలి తన యభీష్టము సిద్ధించు నను తలంపున లేచి, వ్యాధుడు మృగమునకై వాగురముల బన్నినట్లు రాజుకొఱకు తానాభర ణముల ధరింపసాగెను. రాజామె ప్రసన్నయగుచున్నదని మనమున సంతసిం చుచు ననురాగఫులకితాంగుడై మృధుమధుర వాక్కుల నిట్లనియె. ప్రేయసీ! మన నగరమంతయు నానందపరవశమైయుండ నీవేల నిట్లుచింతించుచుంటివి? రేపు రామచంద్రుని యువరాజునుగ జేయుచున్నాను. కాన నీవును నందుల కనువగుమంగళద్రవ్యముల సిద్ధముచేయింపుము. అన విని కంపితహృదయయై లోన విచారించుచు పైకి తనదుర్నయ మగపడకుండు నట్లభినయించుచు నావృద్ధుని మోసగింపసాగెను. రాజు నీతికుశలుడైనను యగాధమగు స్త్రీ చరిత్రమును గమనింపజాలకుండెను. కుటిలమతియగు కైక దీనినంతను గమనించి సానురాగముగ జూచుచు చిరునవ్వుతో నిట్లనియె. నాథా! నాయందు మీకు ప్రేమయగ్గలమని నేనెఱుగుదును. కావుననే మీరు నాకోరికను తప్పక నెరవేరుతురని నమ్మ్మచుంటిని. తామిదివరలో నాకు రెండువరముల నిచ్చిన విషయము తమకు గుర్తులోనుండునని తలంచెదను. వాని నిప్పుడిచ్చుటకేమేని యాటంకము కలదా? లేనిచో నడుగవచ్చునా, యన రాజిట్లనియె. ప్రేయసీ! నీకిచ్చిన రెండువరములును నేను మఱువలేదు. కాని యిప్పుడు మఱి రెండడిగినను యిచ్చెదను. మారఘుకులమున మఱుపు నసత్యము సనునవి లేవుగదా. కాన రామచంద్రునిపై నొట్టుపెట్టుకొని జెప్పుచుంటిని. నీ వేమికోరినను తప్పక యిత్తును. చెప్పుమన విని కుటిలస్వభావముగల కైక, వేటకాడు మృగమును ఉరిత్రాళ్లచే బంధించినట్లు, వరములను నురిత్రాళ్లచే రాజునుబంధించి యిట్ల నెను. రాజా! నీవు నాకీయదగిన రెండువరముల గోరుచుంటిని. సావధానముగ విని నామనోరథము నీడేర్పుము. అట్లుచేయనినాడు సత్యవ్రతముతోపాటు ననున్నుగోల్పోయెదవు. అందుభరతుని యువరాజునిగజేయుట మొదటివరము. పదునాలుగు వత్సరములు శ్రీరాముని వనవాసమునకంపుట రెండవవరము. అనునామెమాటలువినినతోడనే పిడుగుపడినవానివలె వికలాంగుడై మూర్ఛి తుడై నేలగూలెను. స్త్రీలు మృత్యువుకన్నను భయంకర స్వభావముగలవా

రను నారోక్తి యసత్యమెట్లగును? ఇట్లు కైకయనుకరిణి దశరథకల్పవృక్షము నిట్లు నేలగూలద్రోసెను. పిమ్మట రాజు తెలివినొంది ఇట్లుతలపోయసాగెను. వనితాను రాగమునకు దగినఫలములభించినది. అప్రతీకారపారుష్యముగల వనితల నెన్నడును నమ్మరాదను నారోక్తి వమ్మగునా. ఈశుభసమయమేమి! ఈకోరిక యేమి! అని విచారించుచున్న రాజును జూచి కైక యిట్లనియె. రాజేంద్రా! ఏల నిట్లువిచారించుచుంటివి. నన్ను వివాహముజేసికొనినపుడే నాబిడ్డనికి రాజ్యము నిచ్చెదనని ప్రతిజ్ఞ జేసితివి. ఇపుడట్లుచేయక యీమార్పు ఎందులకువచ్చినది? సత్యసంధులగు మీరే యిట్లొనరించిన నిక ప్రజ లెట్లు సంచరింపవలయును? అసత్యభీరువులగు శిబి దధీచిమున్నగు మహనీయులు ప్రాణములనైన నిచ్చి తమ సత్యవ్రతమును గాపాడికొనిరన వినమో! అట్లే తామును తమసత్యమును గాపాడగల రని నమ్మచున్నాను. ఇపుడే నీ వేదికోతిన నిచ్చెదను. రామునిమీద నొట్టుపెట్టుకొనుచుంటినని శలవిచ్చి యింతలోపలనే ఇట్లేల మాఱిపోవుచున్నారు? నాకు జెప్పకయే రామునకు బట్టాభిషేకము నెందులకు నిర్ణయించితిరి? కౌసల్యబోధించెనా! లేక భరతుడుమీపుత్రుడుకాడా! ఓధార్మిక మూర్ధన్యా! నేత్రములదెరువుము. నాకోరికను నెఱవేర్పుము. అనవినిరాజు మెలమెల్లన కనులవిప్పి, దీర్ఘముగ నిశ్వసించి, హీనస్వరముతో నిట్లనియె. కైకేయీ! నీవు హాస్యమున కిట్లనుచుంటివో లేక నిజముగా జెప్పుచుంటివో నా కేమియుగోచరించుటలేదు. కౌసల్యవద్ద రామచంద్రుని పట్టాభిషేక ప్రసంగ మెన్నడును రానేలేదు. నాకు రామభరతులిద్దరును, రెండుకన్నులవలె సమానులు, వారియెడ నాకు భావభేదమేమియునులేదు. కాని రామచంద్రుడు జ్యేష్ఠుడగుటచే నాతనికి బట్టమును గట్టదలంచితిని. నీవివాహసమయమునకు నేననపత్యుడను. కౌసల్యాసుమిత్రలకు సంతానము కలుగదు. నీకు దప్పక గలుగునను తలంపుచే నేనపుడట్లంటిని. కాని సంప్రదాయమునుబట్టియు, రాముని యందు ప్రజలకుగల యాదరమునుబట్టియు నిట్లు చేయవలసివచ్చినది. కాన నన్ను మన్నించి నీవే యీకార్యమును నెఱవేర్పుము. అట్లుకాదేని నీ భరతునకే రాజ్యమునిచ్చెదను. కాన రాముని వనవాసమునుగోరక యింకేదేని గోరికొనుము. అట్లుచేయుదును. అపుడు నీయభీష్టము నాసత్యప్రతిజ్ఞయు నెఱవేఱును. అట్లు కాక రాముని వనవాసమునకంపిన నాప్రాణములు నిలువ

జాలవు. అపుడు నీకపకీర్తియు, దుఃఖమును దప్పవు. కాన నామాటవినుమన
్కైక కనులెఱ్ఱవార మండిపడుచు నిట్లనియె. చాలుచాలును! ఈధర్మోపదేశ
ములగట్టిపెట్టుము. తొలుత నీవేమి కోరిననిత్తునని మఱల నడిగిన తోడనే
యీశూన్యోక్తు లేల? నీమూలపురుషుడగు రఘువును దలంపుము. మఱియు
సత్యవ్రతుడగు హరిశ్చంద్రుని స్మరింపుము. రాముని రాజుగజేసి నన్ను కౌస
ల్యకు దాసిగ జేయనెంచితివా? రాముడిటనుండిన భరతునికి రాజ్యమెట్లు
సిద్ధించును? ప్రజలాతనిని ప్రేమింతురా? కాన నావరముల నాకీయవలసినదే
యన రాజేమియు ననజాలక నిట్లుతలపోయసాగెను. ఈమూర్ఖపుపట్టును విడుచు
నట్లులేదు. రాముడు లేకుండిన నేనుబ్రతుకుటకల్ల. దైవమీమెను నాకుమృత్యు
వుగ సృజియించెనుగాబోలు! మఱియు తొల్లి నేను వేటకేగునపుడు నాకొకమువి
శాపమిచ్చి యుండెను. అపు డనపత్యుడనగుటచే నాకాశాపమంతగా బాధక
ముగాకుండెను. ఇపుడది ఫలోన్ముఖమయినట్లగపడుచున్నది. కానిచో నాకీక్లిష్ట
పరిస్థితి ఏలవాటిల్లును? ఇపుడు రాముని ధ్యానింపుచు ప్రాణముల విడుచుటయే
కర్తవ్యమని నిశ్చయించి రాజు కనులమూసి యూరకుండెను. అంతప్రాతఃకా
లమగుటచే శంఖభేరీమృదంగాది ధ్వనులు వందిమాగధస్తుతులతో పాటు నలుదిశల వ్యాపించుచుండెను. సర్వానందకరములగు నాధ్వనులు రాజు చెవులకు ములుకులవలె నుండెను. పౌరులు నేడే రాముని పట్టాభిషేకమని సంతసించుచు దమపనులను చురుకుగా చేసికొనుచుండిరి. అరుణోదయమునకు బూర్వమే మేల్గాంచెడి ప్రభువీనాడింకను మేల్కొకనకుండుట యాశ్చర్యముగ నున్నది. కారణమేమైయుండునా! యని మంత్రులు శంకించుచుండిరి. అపుడు సుమంతుడు కైకభవనమునకేగి, యచట విచారగ్రస్తులై దుఃఖమూర్ఛులై మౌనముద్రను వహించిన పరిజనులవలన కారణము దెలియనందున శంకించుచు కైకేయీ శయనాగారమున బ్రవేశించి, భూమిపై నిశ్చేతనుడై పడియున్న రాజును జూచి, భయచింతా శోకములు ముప్పిరిగొన నిర్నిమేషముగ జూచుచు కొంతతడవల్లే నిలబడి యుండెను. అంత కైకేయి సుమంతునితో నిట్లనియె. సుమంతా! రాజునకు రాత్రి నిదుర యేలేదు. రామా! రామా! యని పలవరించుటదప్ప మఱేమియు మాటాడుటయులేదు. కాన నీవిపుడేగి రామునిదీసికొని రమ్ము. ఆతనితో నేమేని

జెప్పునేమో యన విని యిదంతయు కైకేయి పన్నుగడ యేనని నిశ్చయించి యిప్పుడు రాముని దోడితేవలయునా, వద్దా, యని విచారించి తుదకు దోడి తెచ్చుటయే కర్తవ్యమని నిశ్చయించి, రామచంద్రునియొద్దకేగి, యాతని మన్న నలవడసి, రాజావస్థను రామునకెఱిగించి, రామునితో గలిసి మఱల కైకేయి యింటి కేగుచుండెను. అప్పుడు వారలజూచి ప్రజలు ఏమేనిప్రమాదము వాటిల్లినదా యనిభయమందుచుండిరి. అట్లు చనివారిరువురును రాజును సమీపించిరి. అపుడు రాజు సింహాపరిగృహీతమగు గజరాజువలె చేష్టలుడక్కి యల్పావశిష్టప్రాణుడై పడియుండెను. ఆయనచెంత మృత్యుపాశమువలె కైకకూర్చుని యుండెను. రాముడీయవస్థనుజూచి విచారించి కొంతతడవూరకొని, పిమ్మట ధైర్యమున వలంబించి, కైకతోనిట్లనియె. తల్లీ! యీ యవస్థకు కారణమేమి? ఇదినివారితమెట్లగును? అననంత కైక యిట్లుజెప్ప నారంభించెను. రామా! నీయందలి గాఢమగు ననురాగమే దీనికి కారణము. రాజు నాకిదివరలో రెండు వరములనిచ్చియుండెను. ఇపుడావరములనే నడిగితిని. అందువలన నిపుడీతడేమి యును జేయజాలక సత్యపాలన, పుత్రప్రేమల మధ్యబడి యిట్లు బాధపడు చున్నాడు. అని తనకును రాజునకును జరిగిన ప్రసంగమునంతను సవిస్తరముగ జెప్పెను. రామచంద్రు డామాటలనన్నిటిని విని మృదుమధుర గంభీరోక్తుల నిట్లనియె. తల్లీ! యీ యల్పవిషయమున కింతచింతఏల! తల్లిదండ్రులప్రేమించి వారియాజ్ఞనుశిరమునదాల్చి ప్రవర్తించువాడే పుత్రుడు. మఱియు భరతుని కన్ననునాయం దేనీకును ప్రేమయధికమని నాకుదోచుచున్నది. చూడుము. రాజ్య భారమునంతను భరతునియందిడి వనవాసమును నాకు బ్రసాదించితివి. కుటిలనీతి ప్రధానమగు రాజ్యము పురుషు నతికర్దమమున పారవైచును. వనవాసము సన్మునిసాంగత్యమున, విమలజ్ఞానమునకు సాధనము. రాజ్యము దుఃఖసాధనము. వనము సుఖసాధనము. ఇంతదనుక నాయపచారమువలన నీయవస్థవచ్చినదేమో! యని భయమందుచుంటిని. ఇపుడాభయము తీరిపోయినది. అను నా రామ చంద్రుని గంభీరమధురభాషణంబులవిని కైక మనమునందిట్లు తలపోయసాగెను. ఏమి యీతని యౌదార్యము? రాజ్యమునుపీడి వనమునకు బొమ్మన సంత సించువాడెందేనిగలడా, ఇట్టివారలుగూడలోకమున నుండెదరా, అనివిస్మయము నందుచుతుదకు ధైర్యమునూనియిట్లనియె. రామా! రఘుకులసోమా! నీపితృభక్తి

మెచ్చితిని. నీవలన నీరఘువంశము శాశ్వతయశమునందగలదు. నావరముల బా
లించి నీతండ్రిని సత్యవ్రతుని జేయుము. అంతలో రాజు, కొంచెము తెలివివచ్చి,
దైవమా! యెంతదుర్దశనుగల్పించితివి? రామునకు వనవాసమా! అని విలపింప
సాగెను. అప్పుడు సుమంతు డదనుగనిపెట్టి రామచంద్రుడు దర్శనమునకు వచ్చి
యుండెనని మనవిచేసినతోడనే రాజు కనులవిప్పి రామునిజూచి కన్నీరుకార్చు
చుండెను. అంతరామచంద్రుడు సమీపించి నమస్కరింపగా లేచి రాముని
కౌగిటజేర్చి గాఢాలింగనమొనర్చి, రామాంగస్పర్శముచే లబ్ధచేతనుడై ఇట్లు
తలపోయుచుండెను. ఈరాముడు జగదభిరాముడు. ఈతనియెడబాసి నేనెట్లుండ
గలను? ఎడబాయజాలక సత్యవ్రతమును గోల్పోవుటట్లు! కటకటా! ఏమియు
దోచకున్నది. వెనుకగోయి, ముందునూయి, ఏమిచేయవలయును? అంత
రామచంద్రుడు ఎదుటనిలిచి చేతులుజోడించి యిట్లనియె. తండ్రీ! అమ్మ
గారు కోరిన యీస్వల్పవిషయమున కింత వంతనందనేల? భరతుడును నావలె
రాజకార్యముల మీకుదోడ్పడగలడు. నేను ననాయాసముగ పదునాలుగేండ్లను
గడిపి మఱల తమపాదకమలముల సేవింతును. దాన దల్లిగారి మనోరథము,
మీసత్యవ్రతమును నెరవేఱును. కాన నాకనుజ్ఞనిండని పాదములకు ప్రణమిల్లి
లేచి యాతని మానమునే యంగీకారముగ గ్రహించి, కైకచేతనుజ్ఞాతుడై
బయటకువచ్చెను. ఇంతలో నీవార్త పురమంతయువ్యాపింప పౌరులసంతోష
మంతయు దుస్సహాదుఃఖముగ మారిపోయెను. అపుడు కైకను దిట్టనివారులేరు.
ఈయభాగ్యురాలు రఘువంశమునకు జిచ్చునుబెట్టినది. అమృతమందు విష
మును గలిపినది. విషాగ్నిమృత్యువులు సయితముచేయజాలనిపనిని స్త్రీలు
చేయుదురు. స్త్రీలహృదయము వజ్రముకన్నను కఠినము, అనునార్యోక్తి
యీమెయందు తప్పక వర్తించుచున్నది. దర్పణములోని ప్రతిబింబమునైన
బట్టవచ్చునుగాని స్త్రీహృదయము మాత్రముగ్రహింపబడదు. స్త్రీలకసాధ్య
మగుపని లేదుగదా. రా జాడదానివలలోబడి చేతులార తనకిట్టి దుఃఖమును
తానే తెచ్చిపెట్టుకొనెను. భరతుడుమాత్ర మీరాజ్యమునకు సమ్మతించునా,
అని పలురకములనాడుకొనుచుండిరి. పుణ్యస్త్రీవలె సర్వాలంకారసుందరమగు
నయోధ్య కైకవలె క్షణములో మారిపోయెను. అపుడురాముడు దల్లికి
ప్రణమిల్లి యీమెకీవిషయమునుజెప్పి యీమెయనుజ్ఞనుగూడ పొందదలచి

యామెయంతిపురికేగెను. రాముడుతొంటికన్న నెక్కుడుగ సంతసించుచుండెను. దశరథాలానమున రాజ్యశృంఖలాబంధము తనంతదానె తొలగినది. అని సంతసించుచు తల్లివద్దకేగి యామె పదకమలముల నమస్కరించెను. అట్లు ప్రణమిల్లిన కుమారు నాశీర్వదించి, శిరమునమూర్కొని తలను తనపాణికమల మున నిమురుచు, సమీపమునం దుచితాసనమున గూర్చుండ నియమించి, రాముని ముఖాబ్జమును నేత్రములను చకోరములచేతను, నాస్వాదించుచు తనివితీరక యానందపులకితగాత్రియై, మృదుమధురభాషణంబుల నిట్లనియె. తండ్రీ! నాపుణ్యఫలమా, జగదానందకందా, రామచంద్రా, నీవు నాకు బుత్రుడ వగుటచేతనే, నే నమితానందము నందుచుంటిని. అట్టి నన్ను నీవు పట్టాభిషిక్తుడవై యానందపఱుచుసమయ మాసన్నమగుచున్నది. చంద్రోదయ మునకు జకోరకములవలె సయోధ్యావాసులందఱు, నీ యీ శుభోదర్క మున కెంతేని ఎదురుచూచుచున్నారు. చెప్పుము తండ్రీ! యన నగుమో ముతో రాము డిట్లనియె. అమ్మరో! మనకు రెండురాజ్యములుకలవు. అందు నేనటవీరాజ్యమును బాలింపవలయును. తండ్రిగారి యభిమతమట్టిది. కాన నీవు ననుజ్ఞనొసగిన నేను వనమునకేగెదను. అందులకై నీవడలకుము. పదు నాలుగువర్షంబు లటనుండి మఱలివచ్చి నీపాదాభివందన మొనరింతును. సహజ ధీరవును, దశరథునికిరాణివియునగునీవు నావియోగమునకు వంతగుందవనుకొను చున్నాను. అనునాతనిపలుకు లామె కర్థముగాకుండినను మనసునందొక విధ మగు సంక్షోభమువూత్రము ముఖమున జనించెను. అపుడామె కంపితగా త్రియై డగ్గుత్తికతో మెల్లన నిట్లనియె. తండ్రీ! మహారాజు నిన్ను ప్రాణతుల్య ముగ జూచుచు, నీప్రవర్తనమునకు సంతసించి, నిన్ను యువరాజునిగ జేయ నెంచి సుముహూర్తమును గూడ స్థిరపఱచి యుండిరిగదా. ఇంతలో నిట్టి మార్పెట్లువచ్చినది. నీమాటలు నాకేమియు నర్థముగాకున్నవి. మనసుచాల కలవరపడుచున్నది. కాన జరిగిన దేమియో సవిస్తరముగ వినిపింపుమన నంత రాముని కనుసన్ననుగ్రహించి సుమంత్రుని కుమారుడు జరిగినదానినంతను సవి స్తరముగ జెప్ప నామెస్మృతితప్పి, నిశ్చేష్టయై, కరిణీవిలూనయగు మూలతీలత వలె నేలంగూలెను. అప్పు డా గృహమంతయు చిత్తరువువలె నిశ్శబ్దమైయుం డెను. పార్వతీ! యప్పటి యామెబాధను వర్ణింపజాలను. విధాతగతియెప్పుడు

ననుకొనినట్లుండదు. కొంత తడవునకామె స్మృతినంది ఇట్లు తలపోయసాగెను. దైవము దుర్లంఘ్యము. నేను మూర్ఖనై నిర్బంధముచేసిన ధర్మలోపము. రామునివిడిచిన నేను బ్రతుకజాలను. వెనుకకుగోయి, ముందుననూయి, ఏమి చేయుటకును దోచుటలేదు. దైవమా ! ఇట్టి దుస్సంగతి నేలగల్పించితివి ? అని కొంతతడవు చింతించి తుదకు ధైర్యము నవలంబించి, ఇట్లు నిశ్చయించెను. నాకు భరతరాములలో భేదభావములేదు. కాన భరతుడురాజయిన నవుగాక. ఇకధర్మము, పుత్రప్రేమలలో ధర్మము శాశ్వతమైనది. తాత్కాలికమగు పుత్రప్రేమకొఱకు ధర్మమునువిడువరాదు. పితృవాక్పరిపాలనము ధర్మములలో మిన్న. అని తలంచి మృదుమధురవాక్యములతో రామునకిట్లనియె. తండ్రీ ! నీవు మంచిపనిచేయదలచితివని నేను మిగులసంతసించుచున్నాను. ధార్మికుడవగు నీవుధర్మ్మవు నెట్లువీడుదువు. నీకు రాజ్యమునువనమునుసమములే. నీకావన మేతండ్రి, వనదేవత లేతల్లులు. అటనుండెడిమృగములు వనచరులునుపరివారము. మునులు గురువులు. నీకెందునులోపముండదు. కాని నినువిడిచి, నేనుగాని రాజుగాని మనపౌరులుకాని, యుండజాలమేమోయని భయమగుచున్నది. రామచంద్రా ! నీవియోగసంయోగములచే నయోధ్యయెంత యభాగ్యశాలినియో, వనమంత భాగ్యశాలిని. రామా ! తల్లియొక్కప్రేమను నీవెఱుంగవు. నేను నిన్ను విడిచియుండజాలను. కాననన్ను నీతోకానలకు గొనిపొమ్ము. నేనులేకున్నను మీతండ్రిగారికేలోపము నుండదు. నాకీపదునాలుగువత్సరములు పదునాలుగు యుగములుగ దోచుచున్నయవి. అని బహువిధముల విలపించుచు నామెరామ పాదసన్నిధినిపడి మూర్ఛిల్లెను. అంతరాముడామెనోదార్చుచు లేవనెత్తి మృదుభాషల నిట్లనియె. అమ్మా ! నీవు ధీరస్వాంతవు. ఉత్తమక్షత్రియాంగనవు. రాఘవస్నుషవు. అట్టి నీవే యిట్లువిలపించిన నిక లోకములు నిలుచుటెట్లు ? మనుజులకు సంయోగవియోగములు, ప్రియాప్రియములు నాగంతుకములు. ఇట్టివానికొఱకు ధర్మమునువీడుట ధీరలక్షణముకాదు. అని యామెనోదార్చి చుండ నంతలో నీవార్తను పరిజనులవలనవిని భయకంపితమానసయై సీత యత్తగారిమ్రోల కేతెంచెను. అప్పుడటనున్నతల్లి బిడ్డల పరిస్థితిని జూచి యేమియుదోపక వారికిబ్రణమిల్లి శిరమువంచి చింతాకులస్వాంతయై తన యవస్థను దల్లికిజెప్పుటకై సంజ్ఞచేయునట్లు పాదాంగుష్ఠముతో నేలను వ్రాయుచుం

డెను. అప్పుడామెనూపురములు, అమ్మా! నీవొకవేళభర్తతో వనవాసమున కేగవలసివచ్చినను మమ్మ్మలను మాత్రముపీడకుము. మేమునీవియోగమును సహింపజాలము, అని మొఱపెట్టుకొనుచున్నట్లు క్రోగుచుండెను. అంత కౌసల్య సీతనుజూచిదీవించి రామునితో నిట్లనియె. రామచంద్రా! మిథిలాధీశుని ముద్దుబిడ్డ, పత్కీరథునిపెద్దకోడలు, అందములరాశి, సుగుణములప్రోగును నగు నగు నీయర్ధాంగిని జూచితివా? ఈముద్దరాలిని నేను ప్రేమరసపేకముచే దడుపుచు లతకూననువలె బెంచుకొనుచుంటివి. ఈమె యింతవఱకు బాదచారిణియై సంచరించి ఎఱుగదు. అట్టి ఈపసిముద్దరాలిని నీవరణ్యమున కేగిననేమి జేయవలయునో నాకేమియు గోచరించుటలేదు. అనునామె మాటల నూతగొని మెల్లన సీత రాముడువినుచుండ నత్తతో నిట్లనియె. అత్తా! మీకును, మీపుత్రులకును దెలియని దేమున్నది! చంద్రిక చంద్రుని, ప్రభ సూర్యుని విడిచియుండిన నుండవచ్చునేమోకాని సీత రామచంద్రుని విడువజాలదు. ఒకవేళ ప్రబలహేతువుచే నట్టియవస్థ వాటిల్లినను సీతాప్రాణములు మాత్రము రామచంద్రుని విడిచియుండజాలవు. కాన రామచంద్రు డెటనుండిన సీతయు నటనే యుండును. కాన సీతవిషయమున మీకు చింతఏల? నన కౌసల్య సీతతో నిట్లనియె. తల్లీ నీమాట నిక్కము కాని వనవాసము నీవంటి వారికి సరిపడదు. వనము సింహశార్దూలాది క్రూరమృగములతోడను, భయంకరము లగు సర్పములతోడను, దుష్టులగు రాక్షసులతోడను, దురవగాహము. అచటి ప్రాణులు దయావిహీనములు. నీవన్న నోమృదులస్వాంతవు. మణికుట్టిమముల నడచుటకే నీపాదములు కందిపోవుచున్నవి. గృహమయూరముల కేకలకే నీవు బెదరెదవు. అట్టినీవు ఘోరవనవాసము నెట్లుచేయగలవు? రామచంద్రునియందలి యనురాగముచే నీవిట్లనుచుంటివి. మఱియు ధీరవీరుడగు రామచంద్రుని విడు చుటయేనాకు దుర్భరమగుచుండ నిన్నుగూడ విడిచి నేనుండుటెట్లు? నీవింట నున్న నిన్ను జూచుకొనుచు నైన ప్రాణముల నిలుపుకొనియెద ననుకొను చుంటిని. అను నాతల్లి మాటలవిని రామచంద్రుడు, అమ్మా! ధీరస్వాంతవు. యుక్తాయుక్తముల దెలిసినదానవు. మన మీయనాదియగు సంసారమునందెన్ని జన్మముల నెత్తితిమో, ఎందఱనెట్లు ప్రేమించితిమో, తుదకెట్టి విరసావసా నము జరిగినదో, జఱుగుచున్నదో గమనింపుము. కావుననే, మునులీ సాంసా

రిక సుఖమును విడిచి నిస్సంగులగుచున్నారు. అని మృదుమధురోక్తుల దల్లి నోదార్చి సీతను జూచి యామెతో నిట్లనియె. ప్రేయసీ! నీకు నాయందు గల యనురాగమును నేనెఱుంగుదును. కాని వనవాసము దుర్భరము. వనమన్న నెట్లుండునో నీవెఱుంగవు. రాజహంసిమానససరస్సునందుండగలదు. కాని ముఠికి గుంటయం దెట్లు బ్రతుకగలదు? కాన నీవు నామాటలువిని ఇంటనుండి నాకు బదులుగ నాతల్లిదండ్రుల సేవింపుము. అట్లయిన నీసత్స్వభావముచే మన మందరము బ్రశాంతముగ గాలమును గడపగలుగుదుము. అట్లయిన నేను పదు నాలుగు సంవత్సరములను పదునాలుగుదినములవలె గడిపి సుఖముగ నిలు సేర గలను. అట్లు కానినాడు ఘోరసత్వసంచార భయంకరమగు కాననమున నీవును నిన్ను బట్టి నేనును దుఃఖముల ననుభవింపవలసివచ్చును. ఇంట నుండిన స్త్రీలకు మర్యాద దక్కును. కాని యిల్లువిడిచిన జవ్వనులకు మర్యాదను గాపాడు కొనుట చాలకష్టము. స్త్రీలను బట్టి పురుషులకును దప్పక కష్టములు వాటిల్లును. కాన నీవింటియొద్ద నుండుటయే సముచితముగ దోచుచున్నదన వని, యాభూపుత్రిక కన్నుగవనశ్రుధారలొలుక నేమియుదోపమికొంత తడవు నిశ్చేష్టయై, తనలో నిట్లుతలపోయసాగెను. నాబోటివారలకు వనవాసముదుస్సహమే కాని ప్రాణనాథుని వీడియుండుట అంతకన్నను దుస్సహము. నాస్వభావము నెఱింగియున్న నా జీవితేశ్వరు డిట్లుల పలుకుచుండెనో నా కేమియు గోచరించుట లేదు. జలమునువీడి మీనమైనను బ్రతుకునేమో కాని రామచంద్రునివీడి సీతమాత్రము బ్రతుకజాలదు. అని యేమేమో తలపోయుచు భయకంపితగద్గదస్వరముతో మెల్లగనిట్లనియె. ప్రాణేశ్వరా! తమకు దెలియని దేమియును లేదు. ఎన్ని భోగములున్నను అవియన్నియు మానవతులకుజీవి తేశునిసన్నిధిని సుఖమునిచ్చునేకాని లేనినాడవియన్నియును దుఃఖసాధనములే యగును. ప్రాణనాథునిసాన్నిధ్యములేనినా డీయలంకారములన్నియు దుఃఖ హేతువులనియే వీనినిదీసివేయుచున్నారు. మతియుసహగమనమునుబట్టి స్త్రీలకు భర్తృవియోగమెంతదుస్సహమో దేటపడుటలేదా! మతియువనితలే యమూల్యప్రేమాస్పదమగువస్తువునాసించి తల్లిదండ్రులను భ్రాతృవర్గమునువీడి శ్వశుర గృహమున కేతెంతురో! అట్టివస్తువు కనులకగపడక దూరమునందున్నపు డాశ్వశురగృహము వారికెట్లుండునో యోచింపుడు. నీవులేని యయోధ్యయం

దుండుటకన్న నీతోగూడి వనమందుండుటయే నాకన్నివిధముల యుక్తమని దోచుచున్నది. మఱియునీతోనుండిన నీకుపచారములజేయుచుందును. నీయుపచారముకన్న నాకెక్కుడుధర్మమింకేమిగలదు. నీతోగలిసివిహరించుట, నీతోగలిసి భుజించుట, నిద్రించుటకన్న నేమికావలయును? సర్వాభయప్రదాతవగు నీసన్నిధిని నాకు భయమెందులకు ? నాకునీవియోగముకన్న భయంకరమగునదియేది యునులేదు ప్రభూ ! మీరుకరుణానిధులు, సర్వాంతర్యాములును. కాన మీకు దెలియనిదిలేదు. తమఱుబాగుగవిచారించిననన్ను తమవెంటదీసికొనిపొండు. ఇట నేనుండజాలను. ననుమీరుతీసికొనిపోనినాడు నాప్రాణములై ననుమీవెంటబడక మానవు. తమ సుందరపదకమలములదర్శించుచుండెడినాకు మార్గాయాసమెట్లుం డును ? తమకన్నివిధముల సేవజేయుదును. మీరు వృక్షచ్ఛాయల గూరుచుండి నపుడు మీపాదముల నొత్తుచు శ్రమవాయునట్లు విసరెదను. చిరుచెమటతో గూడిన మీశ్యామలగాత్రమును జూచుచునాశ్రమసుమఱచిపోయెదను. అనువగు ప్రదేశమందు పల్లవముతో సెజ్జనమర్చి మీరు పరుండిన పిమ్మట మీచరణసేవ నొనరించెద. తఱుచుగ మీదివ్యరూపమును జూచెడి ననున్ను శీతోష్ణము లెట్లు బాధించును ? మీవద్దనున్న నన్నెవరును బాధింపజాలరు. సింగమువై పు కుందే ళ్లెట్లుచూడగలవు ? నన్ను సుకుమారివంటిరి. మీరుమాత్రము సుకుమారులు గారా ! మీకేవనము తగియున్నది కాని నాకు తగదు కాబోలును ! మీమా టలువింతగనున్నవి. మీవియోగదుఃఖమును నాయీనీచప్రాణము లెట్లుసహిం చును ? ఇట్లు సీత యొక్కదుఃఖాకులోక్తుల విని, సీతనుజూచి, రామచంద్రు డామెనింటనుండు మనజాలక, బాగుగనాలోచించి రాముడిట్లనియె. సీతా ! నీపలుకుల వినదలచి నేనట్లంటిని కాన విచారమునుమాని వెంటరమ్ము. ఇది దుఃఖింపదగు సమయము కాదు. కాన ద్వరలో వనమునకేగుటకు దగినపరికర ములతో సిద్ధముకమ్ము. అని ఆమెతోచెప్పి, తల్లిపాదములకు నమస్కరించి యామె దీవనల నందెను. అంత కౌసల్య రామునితో నిట్లనెను. తండ్రీ ! నీగడువు దాటినతోడనె వచ్చి ప్రజల దుఃఖమునుమాన్పుము. కఠినచిత్తురాలగు నీతల్లినెన్నడును మఱువకుము. నాసంతోషదశమఱలిపోయినది. మిమ్ములనిద్దఱి జూచి యానందించెడి భాగ్యము మఱలనెన్నటికోగదా ! మఱల మీముఖముల జూచుభాగ్యమున్నదో, లేదో, పుత్రా ! రఘుకులప్రదీప ! మఱల నిన్నెన్నడు

కాగలింతురా, యని విలపించుచు, దుఃఖపరవశయై మిన్నకుండెను. రామచంద్రుడపుడామె ననేకవిధముల నోదార్చెను. అప్పటివారిస్థితి వర్ణనాతీతము. సీత అత్తకునమస్కరించి యిట్లనియె. తల్లీ ! నేనభాగ్యను. మిమ్ము సేవించుచు సుఖముగనుండెడి సమయమున విధాతనాకీ వనవాసమును గల్పించెను. నామనోరథము నిష్ఫలమయ్యెను. నన్ను మరువకుడు. కర్మగతి నతిక్రమింప నేరికిని దరముకాదు. అని సవినయముగబల్కి కోడలిమాటలకు కౌసల్యమిగుల బరితపించుచు, సీతను మాటిమాటికి కాగలించుకొనుచు, నమ్మా! గంగాయమున లెంతకాలము బ్రవహించునో నీవంతకాలము సుమంగలివిగమ్మని దీవించి, వనవాసపద్ధతిని బోధించెను. ఈసమాచారమును లక్ష్మణుడు దెలిసికొని యీవేదనతో ద్వారగవచ్చి, యశ్రుపూరితనయనములతో, కొంతతడవూరకుండి ఇట్లు విలపింపసాగెను. సీతారాములకిట్టి దుర్దశ ప్రాప్తించునని యెన్నడుననుకొనియుండలేదు. హతవిధీ! నీవింత నిర్దయుడవైతివేమి? నీవెప్పుడును సన్మార్గులకే గష్టములగల్పింతువు. రామవిరహితమైనయయోధ్యలో నేనుండజాలను. నాకీ భోగములతో బనిలేదు. నేను రామచంద్రునితోగలిసి యడవికే పోయెదను. అని నిశ్చయించి చేతులుజోడించి దీనాననుడై నిలిచియున్న తమ్మునిజూచి రాముడిట్లనియె. లక్ష్మణా! విలపించుట ధీరలక్షణముకాదు. తండ్రియాజ్ఞాసారము పదునాలుగేండ్లు గడిపి నేనువెంటనే తిరిగిరాగలను. నేను వచ్చునంతవఱకు నీవింటియొద్దనుండి తల్లిదండ్రులసేవింపుచు భరతునకు సహాయుడవుగమ్ము. మఱియు మద్వియోగమున దుఃఖితుడగు రాజునకు నీవు శోకోపశమనము గావింపుము. ఈసమయమునసీవు రాజును విడువరాదు. భరతుడింటలేడు. రాజు వృద్ధుడు. కాన నీవన్నివిషయముల నాలోచించి, మద్వియోగఖిన్నులగు గురుబంధు, పౌరపరిజనుల నోదార్చుచు నీవింటనుండుమన, లక్ష్మణుడు హిమనిర్మృష్టపద్మమువలె చిన్నబోయి, కొంతతడవూరకుండి, మెల్లగనిట్లనియె. ప్రభూ! నీయుపదేశము ధీరునకెంతేని యుపకరించునుకాని నావంటి భీరుప్రకృతికది యెట్లుపొసగును? ధర్మజ్ఞులగు ధీరులు మీయుపదేశము ననుసరింపవచ్చును కాని నావంటిఖాలుడట్లు నడువజాలడు. మఱియు మిమ్మనుసరించినవాడు సర్వధర్మముల నాచరించినవాడగును. మిమ్మువీడినవాడు సర్వధర్మబహిర్భూతుడనినానమ్మకము. నాకు మీచరణసేవతప్ప వేరొండు స్వర్గమైనను బనిలేదు.

కాన దీనబాంధవులు సర్వజ్ఞులు నగుమీరు నాభావమునెఱిగి ఎట్లానతిచ్చిన నట్లు చేయువాడనన, రాముడు సంతసించి, అట్లైన నీతల్లియనుమతిని వడసి నాతోవచ్చుటకు సిద్ధముగ నుండుమనెను. అంత లక్ష్మణుడు నిరుపేదకు నిధి దొరకినట్లు పట్టరానియానందమున సుమిత్రకడకేగి నమస్కరించి తనకర్తవ్యము నెఱిగింపనామె దావానల మధ్యవర్తినియగు హరిణాంగనవలె నేమియుదోపక విచారింపసాగెను. అట్లు విలపించుచున్న తల్లినిజూచి లక్ష్మణు డడలుచు మిన్న కుండెను. అంత సుమిత్రయె, సీతారాముల గుణశీలములదలచి, దశరథునికి గలస్త్రీమోహామును దలచియు, తలపంకింపుచు, దుష్టసంకల్పముగల్గైక స్త్రీ లోకమునకె తలవంపును దెచ్చిపెట్టినది. ఏమి యీమెనైపుణ్యమని విస్మయ మందుచు, సహజహితకారిణియగుసుమిత్ర కొడుకుతో నిట్లనియె. పుత్రా! నీవుధన్యుడవు. ఇకనుండిసీతారాములె నీకుతల్లితండ్రులు. వనమె యయోధ్య. రాముడు లేని యయోధ్యలో నుండుటకన్న రామునితో గలసి వనవాసము చేయుట మంచిది. నీకురాముడే సర్వస్వము. రాముడు బ్రాణములకుబ్రాణము. జీవనమునకు జీవము. కారణములేని మిత్రుడు. పూజ్యులగు రామభక్తులు మన బాంధవులు. కాన నీవు సీతారాముల సేవింపుము. అట్లైన నీవంటి యదృష్ట శాలి మఱియొకడుండడు. నీజన్మము సార్థకము. నీవలన నేనును ధన్యను. రామ భక్తునిగన్న తల్లియే తల్లి. రామభక్తుని గనలేనినాడు గొడ్రాలగుట మంచిది. రాముడు వనవాసము చేయుటవలన నీపుణ్యము ఫలించినది. అతని సేవ నీకు లభించినది. సీతారాముల సేవకన్న మిన్నయగు ధర్మములేదు. కాన కామ క్రోధాదుల వీడి, త్రికరణశుద్ధిగ వారిని సేవింపుము. వారితో గూడిన వనవాస మయినను సుఖప్రదమె. నేనీకు జెప్పిన దేమన, అయోధ్యను, తల్లితండ్రులను, బంధువులను మఱచి, సర్వము సీతారాములె, యని యెంచి, సంతతము వారి నారాధింపుము. దాన నీకు సకలాభీష్టములు సిద్ధించును. నిర్విచారముగ బోయి మఱల సీతారాములతో గలిసి సుఖముగ రమ్మన నామె మాటకు సంతసించి, యామెకు ప్రమొక్కి, దీవనల నంది, శలవు గైకొని, రామసన్నిధి కేగి నమస్కరించి, తల్లి యంగీకారమును దెలిపి సంతసించుచుండెను. పిమ్మట నాముప్పిరిను రాజభవనమునకు బోవుచుండిరి. పౌరు లందఱు నట గుంపుగుంపులుగ జేరి, మనము దైవోపహతులము. లేకున్న నిట్టి యుపద్రవ మేలవాటిల్లునని చెదర

గొట్టిన తేనెటీగలవలె విలపింపసాగిరి. అప్పటి వారి దుఃఖ మపారము. సుమం తుడు, రామచంద్రుని రాకను దెల్పి రాజును లేవనెత్తి కూరుచుండబెట్టెను. సీతారామలక్ష్మణుల జూచి రాజు, వ్యాకులచిత్తుడై ప్రేమాతిశయమున వార లను స్పృశించి, దుఃఖోద్రేకమున మాటాడజాలక దుర్పిల్లుచున్న రాజు పాద ములపై బడి, రాము డిట్లనియె. తండ్రీ! మీరిట్లు ప్రేమోన్మాదమున నిష్కలంక మగు రఘుకులమున కపకీర్తి నాపాదింపకుడు. నాకు వనవాసమున కనుజ్ఞనొసగి, మోహమును వీడి సక్రమముగ ప్రజల పాలింపుడు. భరతుడు బుద్ధిశాలి, వినీ తుడు. మీకన్ని కార్యములందును దోడ్పడగలడు. అన రాజు రామచంద్రుని చేయి బట్టుకొని, కుమారా! నీవు సకలప్రపంచమునకు ప్రభువువని వశిష్ఠముని నాకిదివఱకే జెప్పియుండెను. జీవులకు దా మొనరించిన శుభాశుభకర్మలు తమ తమకాలములలో ఫలము నిచ్చుచుండును. కాన నాకర్మఫలమును నేననుభ వింపకతీరదు. కర్మగతిని దెలిసికొనుట చాలకష్టము. నాకర్మమూలమున నీవును శ్రమపడవలసివచ్చిన దని విలపించుచు రాజు రాముని ప్రయాణము నాపుటకు ప్రయత్నించెనుగాని లాభము లేకపోయెను. పిమ్మట సీతను జూచి విలపించుచు నామెకు వనవాసక్లేశమును జెప్పి అత్తలయొద్ద నుండుమని జెప్పెను. కాని సీత మనము రామచంద్రునియందే నిలిచియుండుటచే రాజు జెప్పిన యుపదేశము లామెకు రుచించుటలేదు. మంత్రిభార్యయు, గురుభార్యయు మొదలగు మాన వతు లామెకు వనవాసము తగదని బోధించిరి. కాని వారి మాట లామెకు చక్రవాకికి శరచ్చంద్రికవలె దుస్సహము లయ్యెను. అంత కైకేయి రామ చంద్రునికి వనవాసోచితములగు నారబట్టల దెప్పించి అటనుంచి ఇట్లనియె. రామా! నీవు రాజునకు ప్రాణాధికుడవు. కాన రాజు నిన్నువిడువజాలడు. కాన నాతడు నిన్ను వనమున కేగుమని చెప్పజాలకున్నాడు. కాన నీవే ఆలోచించి రాజునకు రఘుకులమునకు నపయశము వాటిల్లకుండునట్లు జేయుమన రామచంద్రుడు సంతసించెను గాని రాజున కామాటలు ములుకులవలె నుండెను. నేనీదుఃఖమును భరింపజాలను. నాకిపుడు ప్రాణవియోగమైన బాగుం డునని యెంచి మూర్ఛితుడయ్యెను. అంత రామచంద్రుడు తండ్రిపాదములకు ప్రణమిల్లి ముని వేషమును ధరించి, సీతాలక్ష్మణ సమేతుడై గురుచరణము లకు నమస్కరింప నాతడారాముని జూచి నిశ్చేష్టుడయ్యెను. అంత రామ

చంద్రుడు వశిష్ఠునితో నిట్లనియె. గురువర్యా! నను జూడవచ్చిన విప్రులకంద రకు సంవత్సరమునకు పూర్తిగా సరిపడు గ్రాసము లిచ్చి సంతోషపెట్టుడు. తండ్రిగారు పెద్దలు. భరతుడు పసివాడు. రాజ్యము ఛిద్రబహుళము. కాన ప్రజాభారమును, రాజ్యభారము గ్రమముగ నిర్వహింపవలసిన బాధ్యత తమయందు బడినది. సర్వజ్ఞులరగు తమకింతకన్న నెక్కుడు మనవిచేయజాలనని ప్రజలతో నిట్లనియె. పౌరముఖ్యులారా! రాజున కన్నివిధముల సహాకరించువారే నా ప్రేమకు బాత్రులు. కాన మీరన్నియెడల దుఃఖాతురుడగు ప్రభువునకు దుఃఖోప శమన మొనరించుచు, సన్మార్గము నతిక్రమించక ప్రవర్తింపుచు సుఖముగనుండుడు. నాతల్లులు నాకై విలపింతురు. కాన వారినూరడింపుడని యందఱకన్నివిధముల నుపదేశించి గురువులకు నమస్కరించి గణనాథుని శివపార్వతులను బూజించి గురువుల యాశీస్సులనంది, ప్రయాణోన్ముఖుడై యుండెను. అప్పుడా పౌరుల యార్తనాదములు వినశక్యముగాకుండెను. అంత రాజు మూర్ఛదేరి రామ చంద్రుని నిశ్చయమును దెలిసికొని సుమంతుని రావించి, సుమంతా! నీవు శీఘ్రముగ రథమును దీసికొని చని, సీతారామలక్ష్మణులను దానియందెక్కిం చుకొనిఁ గొంతవఱకు దీసికొనిచని, వారితోగలిసి నాలుగు దినములుండి వారికి గావలసిన వాని నొసగిరమ్ము. సత్యవ్రతము, ధృఢప్రతిజ్ఞ యుగల రాముడుగాని, యతని కనుచరుడగు లక్ష్మణుడుగాని మఱిలరు. కాని వన వాసక్లేశమును భరింపజాలని జానకి నెట్లైనను నచ్చజెప్పి మఱిల నీతో తోడితెమ్ము. ఆమె ఇటనున్నచో కొంతవఱకు నేనూరడిల్లెదనని బలికి, సీతా రామలక్ష్మణుల దలచి దుఃఖముప్పొంగ మఱిల మూర్ఛితుడయ్యెను. సుమంతు డంత రాజాజ్ఞానుసారము రథమును సిద్ధముజేసి, సీతారాముల కడకేగి దశ రథుని మాటలు వారికి వినిచి, తనరథము నెక్కుడనెను. వారు నయోధ్యకు నమస్కరించి, రథాధిరూఢులై గమనోన్ముఖులయిన తోడనే యయోధ్యా పురవాసులందఱు నొక్కసారి భోరున విలపింపసాగిరి. అంత రాముడు రథము నాపి వారలనోదార్చి వెనుకకు మరలించుచుండెను. సీతారామవిరహితమైన యయోధ్య కళావిహీనమై స్మశానమువలెను, అందలి ప్రజలు పిశాచములవలెను భూపరులకు భయంకరముగ నుండెను. శోకదైన్యములాపురిలో దాండవించు చుండెను. కరితురగములు సయితము కన్నీరు గార్చుచుండెను. పక్షిమృగ

సంతతులాహారమును మాని దీనారావములచే జాలిగొలుపుచుండెను. నగరమరణ్య సదృశమయ్యెను. పౌరులు నిర్జీవప్రతిమలవలె నుండిరి. సకల సౌభాగ్యసమన్విత మైన యయోధ్య కైకయను దావాగ్నిచే దగ్ధమై చూపరులకు శోకభయము లకు గారణమయ్యెను. శోకవ్యాకులచిత్తులగు ప్రజలు రాముడులేని యయో ధ్యలో మనముండరాదు. రాముడెటనున్న నదియె యయోధ్య, మనమటనె యుండవలయునని నిశ్చయించి, బాలురను వృద్ధులను ఇండ్లకడ విడిచి రాము డెంతవారించిన నాగక రథమువెంట జనుచుండిరి. వారిభక్తివాత్సల్యములకు రాముడచ్చెరువందుచు, నిట్టివారిని బొమ్మనుటకుగాని వెంట గొనిపోవు టకుగాని దోచక చింతాక్రాంతుడయ్యెను. రామచంద్రుడు ప్రథమ దివస మున దమసానదీ తీరమున నివసింపనెంచి యటనాగెను. ప్రజలునట నాగి మార్గాయాసమున నొడ లెఱుంగక నిద్రింపుచుండిరి. అప్పుడు రామచంద్రుడు సుమంతునితో నిట్లనియె. సుమంతా! నే నెంత జెప్పినను వీరు మనల విడుచుటలేదు. కాన వీరల మఱిగుపఱిచి మన మేగవలయు. ఇపు డర్ధరాత్రమై యున్నది. ప్రజలు మార్గాయాసమున నొడ లెఱుంగ కుండ నిద్రించుచున్నారు. కాన నిప్పుడు నిశ్శబ్దముగ రథమును నడిపించు కొనిపోవలయును. అట్లయిన మనలనువిడిచి వీరిండ్లకుపోగలరన సుమంతుడు వల్లెయని దోడనె రథమునాయత్తపఱచి సీతారామలక్ష్మణుల నందెక్కించు కొని నిశ్శబ్దముగ రథమార్గము గోచరించకుండునటుల రథమును నడిపించుకొని పోయెను. అంతదెల్లవారగనె బ్రజలుమేల్గాంచి రామచంద్రునిగానక విలపించుచు నొకరితోనొక రిట్లనుకొనసాగిరి. రామచంద్రుడు మనలవంచించి వెడలిపో యెను. ఆతనికిట్లు వంచించుట న్యాయముకాదన మఱియొకడిట్లనియె. మనము వనవాసక్లేశము ననుభవింపజాల మనియు, మనమాప్రభుని మఱియొకతీరున విడువమనియు నెంచి రామచంద్రు డిట్లర్ధరాత్రమున మనలనువీడిపోయెను. మన మూలమున రామచంద్రునకిట్లు పోవలసివచ్చినది. జలమునువీడి మీన మొక్క గడియయ్యైనను బ్రతుకజాలదు కాని రామచంద్రునివీడి మనమిట్లు బ్రతికియుం టిమి. మనప్రాణము లెంతకఠినమైనవి. మనమిప్పుడేమి చేయవలయును. నిరసన వ్రతమునూని ప్రాణములవీడుటయా? లేక సమయానంతరము మరల రామ చంద్రుని దర్శింపదలచి యాతని సుఖాగమనమునుగోరి దేవతలనర్చించుచుండు

టయా? అని విచారించి, బ్రతికియుండిన రామచంద్రునిదర్శన మెన్నటికైన నబ్బును. కాని మరణించినచో, రామచంద్రుడులేని స్వర్గమైనను మనకెట్లుసుఖావహమగునని, నిశ్చయించి, రామచంద్రుని పునర్దర్శనము నభిలషించుచు వారుమరల నయోధ్యకుబోయిరి. అంత రామచంద్రునిరథము శృంగిబేరము కడకేగెను. తోడనె రామచంద్రుడు గంగనుజూచి, రథమునాపించెను. పిమ్మట వారందఱును దిగి గంగకు నమస్కరించి మిగుల సంతసించిరి. గంగ తాపత్రయ హారిణీయనియు, సకలానందసంధాయిని యనియు గంగనుగురించి యనేకేతి హాసముల సుమంతుడుజెప్ప వారు శ్రద్ధతోవిని గంగలో స్నానమాచరించి, పవిత్రగంగాజలముల పానముజేసి, సంతసింపుచుండిరి. రాముని యాగమన మునువిని నిషాధాధిపతియగు గుహుడు, బంధుమిత్రులతో గలిసి పుష్పఫల ములజేకొని, రామచంద్రునిసమీపించి, పులకితగాత్రుడై యానందాశ్రువులు బయలువెడల నిశ్చేష్టుడై చూచుచుండ భక్తపరాధీనుడగు రామచంద్రుడతని దయార్ద్రదృష్టులజూచి, క్షేమమడిగి సమీపమున గూరుచుండ నియమింప గుహుడిట్లనియె. ప్రభూత్తమా! తమ పదపంకజదర్శనభాగ్య మబ్బిన నాకును నాపరివారమునకును, గుశలము. నేనెంతేని ధన్యుడను. నాసకలభాగ్యమును తమ కర్పణమొనరించి, సపరివారముగ దమదాస్యమొనరింపుచు, ధన్యుడగా నెంచు చుంటిని. కాన తామునామనవిని చెల్లింపుడన రామచంద్రు డతని కిట్లనియె. మిత్రనూ! నీమాటల కెంతేని సంతసించితిని. నేను పదునాలుగువత్సరములు మునివేషధారినై, కందమూలాదుల భుజింపుచు నరణ్యావాసమును జేయనిశ్చ యించుకుంటిని గాన నేనుగ్రామమునను నగరమునను ప్రవేశింపవీలులేదు. నియ మము నతిక్రమించినవాడు నరకమునబడి యపకీర్తిపాలగునన రామునిమాటలకు గుహుడు మిగులచింతించెను. సీతారామలక్ష్మణుల దివ్యరూపములజూచి విస్మయ మందుచు శృంగిబేరపురాంగన లిట్లనుకొనసాగిరి. సఖీ! పిన్నలగువీరల వనవాస మునకనిపి బ్రతుకగలతల్లిదండ్రు లెచ్చటనై ననుందురా? యని యొకతెబలికెను. చెలీ! మనయదృష్టము వీరలనిటు దెచ్చెను. లేకున్న వీరిదర్శనభాగ్యము మనకబ్బు నెట్లని మఱియొకతె బలికెను. అంతలో సీతారాముల నివాసమున కేగింశుపావృక్ష మెంతేనియనువుగనున్న దనియెంచి గుహుడాశింశుపామూలమున శుభ్రపఱచి రామచంద్రునకాస్థలమునుజూప నదిబాగుగనున్న దనిచెప్పి రాముడటనివసించెను.

పౌరులందఱు వారలకు జోహారులర్పించి, తమతమ నెలవులకు బోయిరి. అంత రాముడు గంగాతీరమున కేగి సంధ్యోపాసన మొనరించి, మఱలివచ్చునంతలో గుహుడు రామచంద్రునికి దగినశయ్యనట గల్పించి, ఫలహారమునకు దగిన సామగ్రినట సిద్ధముచేసెను. పిమ్మట రాముడటకువచ్చి, గుహునిచే సిద్ధము చేయబడిన ఫలమూలాదుల ననుజసతీసుమంతసహితముగ నారగించి, విశ్రమించు చుండ లక్ష్మణుడన్నగారిపాదముల నొత్తుచు, నిదురపుచ్చి, సుమంతునిగూడ నిదురింపుమని, తాను ధనుష్పాణియై, దూరముననుండి సీతారాముల సేవింపు చుండెను. అట్లుస్థండిలశాయియగు రామునిజూచి గుహుడు కన్నీరుగార్చుచు, లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! చూచితివా! విధివిలాసమును! అమరావతిని మించిన శోభకల యయోధ్యాపురమునం దతిమనోహరమగు శయ్యా గృహమునందు హంసతూలికాతల్పమున, మణిదీపికానికరమధ్యమున సుగంధ మందపవమానుడు సేవింపుచుండ నిదురించెడి రామచంద్రుడిట్లుస్థండిలమున దన బాహువునుపధానముగ జేసికొని నిదురింపవలసివచ్చినది. మఱియు జనకుని కూతురు, దశరథుని కోడలు, శ్రీరాముని కర్ధాంగియు, నెండనెఱుంగని ముద్ద రాలు, కోమలగాత్రియునగు సీతయే యిట్లుధరాతలమున బరుండవలసివచ్చిననిక విధి నెవరుదాటగలరు! సకలసౌఖ్యముల ననుభవింపదగిన సమయమునందీదంప తులకు వనవాసమా! రఘుకులకల్పకమునకు పరశువైన కేకయరాజుపుత్రి కీ దుర్బుద్ధి ఏలపుట్టెనని పరిపరివిధముల దుఃఖించుచున్న యా నిషాదరాజు నకు భక్తిజ్ఞానవైరాగ్యనిధియగు లక్ష్మణుడు మృదుమధురోక్తుల నిట్లనియె. మిత్రమా! సుఖదుఃఖములు వారివారికర్మలవలన వచ్చునుగాని ఒకరిచ్చునవి కావు. సంయోగవియోగములు, శత్రుమిత్రులు, సుఖదుఃఖములు, జనన మరణములు, స్వర్గనరకములు ననునివి సర్వప్రాణి సాధారణములు. ఇవి స్థిరములు కావు. ఇవన్నియు నజ్ఞానమూలకములు. స్వప్నమాయాతుల్య ములు. స్వప్నమున రాజు భిక్షువగును. భిక్షువు రాజగును. జాగ్రదవస్థయం దది భాసిల్లదు. జాగ్రత్ప్రపంచమునందుండదు. కాన స్వప్నజాగ్రత్తులు రెండును, రజ్జుసర్పమువలె యజ్ఞానకల్పితములై మనను బంధించుచున్నవి. ఈసత్యమును దెలిసినవానినివి బాధింపవు. అజ్ఞానికి పరమార్థము గోచరింపనట్లే జ్ఞానికీ సంసారమును గోచరింపదు. రాముడాది మధ్యాంతరహితుడగు పురాణ

పురుషుడు. వేదము లీతని నవాఙ్మనసకిగోచరుడనియు, నిర్వికారుడనియు, నపరిచ్ఛిన్నుడనియు, జగదుత్పత్తి స్థితిలయ హేతుభూతుడనియు, సీత యీతని యనంతశక్తి యనియు జెప్పుచున్నవి. సీతారాములకు సుఖదుఃఖములు లేవు. వారికి హంసతూలికాతల్పమయినను, స్థండిలమయినను సమానము. దీనబంధువగు రామచంద్రుడు దుష్టనిగ్రహ మొనరించి శిష్టరక్షణార్థము మనుజభావము నందిన యాదిదేవుడు. ఆతని చరణసరోజముల భక్తితో సేవించినవారజ్ఞానవిరహితులై యీతని యనుగ్రహమునకు బాత్రులు కాగలరు. కాన నీవీ యజ్ఞానమును వీడి యీతని పదముల గొలువు మను నాలక్ష్మణుని యమృతోపమములగు వాక్కుల విని గుహు డపరిమితానందము నందుచుండ లోకబాంధవుని రాక నెఱింగింపుచు ప్రాతఃకాలచిహ్నములగు గుక్కుటధ్వనులు వినబడుచుండెను. అంత జగదానందకరుడగు రామచంద్రుడు మేల్గాంచి, కాల్య కృత్యంబుల దీర్చి స్నానసంధ్యావందనాద్యనుష్ఠానంబుల నాచరించి, సుఖోపవిష్టుడై యుండ సుమంతుడు సమీపించి, యశ్రుపూరితలోచనుడై దీనముగ నిట్లనియె. మీతండ్రిగారు నీతో జెప్పుమనినమాటల జెప్పుచుంటిని. "సుమంతా! నీవు రథమును దీసికొనిపోయి సీతారామలక్ష్మణుల నందెక్కించుకొనిపోయి వనమును జూపి గంగాస్నానము జేయించి, శీఘ్రముగ వారల మఱల నిటకు దోడితెమ్ము. వారి సంశయముల నన్నిటిని వాపి ఎట్లైనను వారి నిటకు దప్పక గొనిరమ్ము." అని దశరథుని పలుకుల వినిచి రాముని చరణములపై బడి బాలునివలె విలపింపసాగెను. మఱియు రామచంద్రా! నీవు వచ్చిన యయోధ్య యనాథ కాకుండదని మఱల మఱల జెప్పుచున్న సుమంతుని జూచి దయానిధి యగు రామచంద్రు డాతని లేవనెత్తి, సచివోత్తమా! చిరకాలమునుండి రఘు కుల సచివుడవైన నీకు దెలియని ధర్మములేదు. శిబి దధీచి హరిశ్చంద్రాదులు సత్యముకొఱ కెంతకష్టపడినది నీకు దెలియును. రంతిదేవుడు పడినపాట్లు నీవెఱు గనివికావు. సత్యముతో సమమగు ధర్మము వేఱొండు లేదని వేదమతము. మాపూర్వులకు వార్ధక్యమున సిద్ధించెడి వానప్రస్థము నాకు బాల్యముననే సిద్ధించినది. ఇపుడు నేనీసత్యవ్రతమును విడిచిన నాకె కాక రఘువంశమునకె యపకీర్తి వాటిల్లును. కాన మాతండ్రిగారి మనస్సు కలగకుండునట్లు మెల్లన నాపలుకుల విన్నవింపుము. మాతండ్రిగారిని సమాధానపరుచు భారమును నీపై నిడు

చుంటి నన గురుడు విస్మితుడయ్యెను. అంత లక్ష్మణుడు బాల్యమును బట్టి కొంచెము దీర్ఘముగ బ్రసంగింపగా రాము డాతని వారించి, సుమంతా! యీ బాలుని పరుషోక్తులను మఱచిపొమ్ము. తండ్రిగారి కీమాటల జెప్పి ఖేద మును గలిగింపకుము. అన నంత సుమంతుడు సీతతో వనవాసక్లేశమును దశ రథుని సందేశమును వినిచి, రామచంద్రా! సీతనై నను బంపివేయుము. ఆమెను జూచి నీతలిదండ్రులు కొంతవఱ కూఱడిల్లగలరన రాముడు సీతా! సుమంతుని మాటల విని నీవింటి కేగుము. అట న త్తమామల యాదరము గొనుచు వారల సేవింపు మన నాజానకి యిట్లనియె. ప్రాణేశ్వరా! తమ కగోచర మెద్ది యును లేదు. సూర్యుని విడిచి ప్రభయు, చంద్రుని విడిచి చంద్రికయు, దేహ మును విడిచి నీడయు నెట్లుండజాలవో, అట్లే నేను మిమ్ము వీడియుండ జాలను. నన్ను మన్నింపుడని సుమంతునితో నిట్లనియె. మంత్రిపుంగవా! నీవు నాకు బితృతుల్యుడవు. అన్నియు దెలిసినవాడవు. నామాటల నన్యథా భావింపవని జెప్పుచుంటిని. నేనార్యపుత్రుని చరణముల బాసి బ్రతుకజా లను. నాతండ్రి రాజర్షి. నామామ పురందరుని యర్ధాసనము నధిష్ఠించిన సార్వభౌముడు. అత్తలు నాకు దల్లులవంటివారు. రాజ్యభోగముల నేనెఱుం గుదు. వనితలకు వల్లభ సాన్నిధ్యముకన్న నెక్కుడు సుఖకరమైన దేది యును లేదు. కాన నాయత్తమామలను, నానాథుని విడిచి రాజాలనందులకు క్షమింపవలయునని జెప్పుము. మఱియు లోకైకవీరుడగు రామచంద్రుడును, ధనుష్పాణియగు లక్ష్మణుడును నాకు దోడ్తొయుండ నీవన్యమృగములుగాని, వనచరులుగాని, నిశాచరులుగాని నన్నెట్లు బాధింపగలరు. ప్రాణనాథునితో గలిసియున్న నాకు వనవాసమెట్లు దుఃఖాకరమగును. ఉత్తమక్షత్రియాంగనకు భయమెందులకు? కాన నామనోనిశ్చయమును అత్తమామల కాగ్రహము గలుగకుండునటుల మృదుమధురసమయోచితవచనముల విన్నవింపుమని నిన్ను బ్రార్థించుచుంటిని. అను నామె వాక్కులకు విస్మయమందుచు సుమంతుడు చేయునదిలేక నిరుత్తరుడై తన ప్రయత్నము విఫలమైనందుకు విచారింపుచు, వారలకు నమస్కరించి, ప్రయాణోన్ముఖుడై పోవుటకు కాళ్ళురాక, ఎట్టకేలకు మనస్సు కుదుటపఱచికొని బయలుదేరెను. కాని తురంగములు ముందున కడుగిడుటలేదు. ఎట్టకేలకు రాముని విడువజాలక మెలమెల్లన సుమంతుడు

ప్రయాణము సతికష్టముతో జేయుచుండెను. రామచంద్రుడట్లాతని సాగనంపి, గంగాతీరమునకువచ్చి నావను సిద్ధముచేయుమన గుహుడిట్లనియె. ప్రభూ! ఆగుము. నీపాదముల గడిగెదను. నీపాదములందు, రాళ్ళను, కఱ్ఱలను, మనుష్యులు గజేయు శకిగల పరాగముండియుండును. కాన నీ పాదరజమువలన నానావయు మానుషియగునేని నావృత్తికి, భంగమువాటిల్లునని నగుచుబలికిన, భక్తవరదు డగు రామచంద్రుడు నవ్వుచు నట్లేకానిమ్మని గుహుడు తన పాదముల కడుగు టకు సమ్మతించెను. ఏపాదములు త్రివిక్రమావతారమున ముల్లోకముల నాక్రమించెనో, త్రిలోకపావనియగు గంగ ఏపాదములందుద్భవించెనో, ఏపాద ములు శివమానసరాజహంసములో, అట్టి రఘునాథుని పాదములను ఆనందాశ్రు ధారాసమ్మిశ్రితములగు గంగాజలముతో గడిగి యాపాదోదకమును గుహుడు తన శిరమున జల్లుకొనునపుడు, గుహునివంటి పుణ్యపురుషుడు లోకమునం దింకొకడులేడని యాతని యదృష్టమునకు మెచ్చుకొనుచు వియచ్చరులు విరుల వాన గురియించిరి. అట్లు గుహుడాపాదోదకమును బంధుమిత్రసపరివారముగ శిరమునదాల్చి, సీతారామలక్ష్మణుల నావపై నెక్కించి, తాను స్వయముగ నావికుడై నిరపాయముగ వారల నవ్వలయొడ్డునకు జేర్చెను. పిమ్మట రామ చంద్రుడాగువానకు పడవకేవుకుగా దన యంగుళీయకము నీయబోగా గుహు డిట్లనియె. ప్రభూ! ఈయంగుళీయకము తమకే దగియున్నది. కాన నాకిది వలదు. తమ నిశ్చలచరణకమలభక్తిని బ్రసాదింపుమని బ్రార్థించిన నాతని మనసునెఱింగిన రామచంద్రుడు చిరునగవుతో నట్లేకానిమ్ము. మేము తిరిగివచ్చు నపుడు కలియుదమనిచెప్పి, యాతనిని బంపివైచెను. పిమ్మట సీతారాములు గంగలో స్నానముజేసి శివునర్చించిరి. అంత సీత గంగకు నమస్కరించి, అమ్మా! భాగీరథీ, నీవు రఘుకులస్నుషల కాడుపడుచువు. కాన నీవు నాకవశ్య పూజ్యవు. నానతులగైకొని నన్ననుగ్రహింపుమన గంగ యమితానందమునంది, ప్రవాహాంతర్గతయై దివ్యవాణితో నిట్లనియె. సీతా! నీ యంగసంస్పర్శముచే నేనెంతయు ధన్యనైతిని. నీవయోనిజవు. దేవతలు నిన్ను సేవించి నీయనుగ్ర హాముపలన సకలసౌఖ్యముల ననుభవించుచున్నారు. నీవు వనవాసానంతరము మఱల వచ్చి నన్నాదింపజేయ గోరుచున్నాను. సుఖముగ మఱల రమ్ము. ఆపలుకులు విని సీత మిగుల సంతసించుచుండెను. గుహుడు కొంత

దూరమేగి రామవియోగమును భరింపజాలక మఱల వచ్చి ప్రభూ! నాలుగుదినములు మీతో గలిసియుండి మీాసపర్యనుజేయుచు, మార్గమును జూపుచు, పిమ్మట తమయాజ్ఞానుసారము జేయుదునన నాతనిభక్తికి మెచ్చి యట్లేగావింపుమని, శివపూజానంతరము మఱల గంగకుమ్రొక్కి, వారితోగలిసి ప్రయాణము సాగించెను. అట్లుపగలంతయు ప్రయాణముజేసి సాయంకాల మునకొక వృక్షమూలమును జేరి యట గుహాలక్ష్మణులచే సిద్ధముజేయబడిన సురుచిరప్రదేశమునం దారాత్రిని గడపుచు, దీర్ఘరాజమగు ప్రయాగను జేర దలచిరి. అందు తీర్థరాజు, సత్యమును సచివునిగను, శ్రద్ధను భార్యగను, వేణీ మాధవుని మిత్రునిగను, పురుషార్థములను ధనాగారములుగను, గ్రహించి యాపుణ్యక్షేత్రమునంతను బాలింపుచుండుటచే గామాద్యరిషడ్వర్గమా ప్రాం తమునెన్నడును సమీపింపజాలకుండెను. ఆతని సేనాముఖములగు మహానదులు పాపరూపములగు శత్రుదళముల నిర్మూలించుచుండును. గంగాయమునా సంగమ మాతనిసింహాసనము. అక్షయవటము, శ్వేతచ్ఛత్రము. గంగాయమునా ప్రవాహములె చామరములు. సజ్జను లా తీర్థరాజును సేవించి, స్వాభీష్టముల నందుచుందురు. సకలపురాణము లాతనికీర్తిని వందిమాగధులవలె గాన మొన రించుచుండును. ఆతని ప్రభావము నెవరువర్ణింపగలరు? ఆతడు పాపమత్తేభ దళనమృగేంద్రుడు. అట్టిప్రయాగను సమీపించిరాము డత్యానందమునందుచు సీతాలక్ష్మణులకు గుహునకును ప్రయాగమాహాత్మ్యమును జెప్పుచు, నచటి విశేషముల వారలకుజూపి చెప్పుచు, త్రివేణీదర్శన మొనరించి, నమస్కరించి యందుస్నానమాచరించి, యచటిదేవతల నారాధించి, శివునిపూజించి, సపరి వారముగ భరద్వాజాశ్రమమున కేగెను. అటభరద్వాజుని దర్శించి నమస్క రింప నాముని రామునికాగలించి యాశీర్వదించి కుశలమునడిగి యుచితాసన మునగూర్చుండ నియమించి కందమూలాది మధురఫలముల నొసంగ, సపరి వారముగ రాముడాఫలముల నారగించి, యపగతమార్గాయాసము కలవాడై సుఖోపవిష్టుడయినంతనె, భరద్వాజు డిట్లనియె. రామచంద్రా! నేటికి నా తపస్సు ఫలించినది. నేనెంతేనిధన్యుడను. ఇంతకన్నను నాకేమికావలయును? నాకు నీయనన్యభక్తిని ప్రసాదింపుము. దానికి సరియగునది వేఱొండులేదు. అదిలేనివా డెన్నడును తరింపజాలడన, రామచంద్రుడు మందహాసము నొన

రించుచు నచటివారితో నిట్లనియె. ఈమునివర్యుడు మహాతపస్వులలో నగ్ర గణ్యుడు. ఈతనిప్రభావము జగద్విదితము. అనిచెప్పుచు నాతనితో సాదర ముగ నిష్టాగోష్ఠిని జఱుపుచుండెను. రామచంద్రుడు భరద్వాజాశ్రమమునకు వచ్చినవార్తను విని అచటితాపసులెల్లరు రామచంద్రుని దర్శింపవచ్చిరి. రామ చంద్రుడు వారలకు నమస్కరించి, వారలక్షేమమునడిగి వారలనెంతేని గౌర వించెను. వారును నేటికిమనతపస్సులు ఫలించినవని యపరిమితానందము నందు చుండిరి. అట్లాదినమును గడిపి మఱుచటిదినము ప్రాతఃకాలమున ద్రివేణీ స్నానమాచరించి సంధ్యాదికృత్యములదీర్చి భరద్వాజునకు నమస్కరించి యను జ్ఞనంది, యాతనిశిష్యులచే మార్గమును దెలిసికొని, పైప్రయాణమును సాగిం చుచు నటనుండెడి పల్లీజనులచే గౌరవింపబడుచు వారల నానందపఱచుచు దన ప్రయాణమును సాగించుచుండెను. అట్లు చనిచని నిజదేహసచ్ఛాయయగు యము ననుగాంచిసంతసించిఅందుస్నానముజేసిసంధ్యాద్యనుష్ఠానములదీర్చుచుండ నచటి వారందరు వారలనిరుపమానలావణ్యమునుజూచి విస్మయానందములందుచు వారి నివాసమును, ఇట కరుదెంచుటకుగల కారణమును దెలిసికొనవలె ననుకొనుచుండ వారిలోవృద్ధులు వారికృపములనుబట్టి సీతారామలక్ష్మణులనిగ్రహించి వారి వృ త్తాంతమును సవిస్తరముగ దెలుపగా నచటివారు రాజును కైకను నిందింపసాగిరి. పిమ్మట రామచంద్రుడు దనతో వచ్చుచున్న గుహుని బోధించి నిజపురమునకు జనుమన రామాజ్ఞను తలదాల్చి యాతడు తన పురమున కేగెను. పిమ్మట రామచంద్రుడు సీతాలక్ష్మణులకు యమునామహాత్మ్యమును జెప్పుచు జను చుండ మార్గమధ్యమున గొందఱు వారలజూచి, అయ్యా! మీరెవరు? ఎందుల కీఘోరారణ్యమున మునివేషములతో సీకోమలాంగిని వెంట నిడికొని యిట్లు సంచరించుచుంటిరి? రాజ్యభోగార్హములగు మీశరీరము లెక్కడ? క్రూరసత్వ సమన్వితమైన యీఘోరారణ్య మెక్కడ? ఎటకేగుచుంటిరి? మాసహాయ మపేక్షిత మైనయెడల మేము తమ శలవుప్రకారము జేయగలవార మన వారి ప్రేమభరితములగు మాటల కెంతేని సంతసించి, వారల కుచితరీతిని సమాధాన మొసగుచు, మెలమెల్లన దమ ప్రయాణమును సాగించుచుండెను. రాముని సంచారమువలన నాప్రదేశమంతయు నాగదేవలోకములకన్న మిన్నయై యల రారుచుండెను. రామచంద్రుడు సంచరించు ప్రదేశములందు వారి కెండ దగుల

కుండ మేఘము లడ్డుపడుచుండెను. చల్లని సుగంధమారుతములంగానుకూల ముగ వీచుచుండెను. వారట్లు ప్రయాణమును సాగించుచు వన పర్వత శోభల దిలకించుచు మార్గాయాసమును గూడ మఱచి సుఖముగ బోవుచుండిరి. రామ పాదస్పర్శముచే నచటి ప్రదేశములు, స్నానపానములచే నచటి సరోవరములు, రాముని దర్శించుటచే నచటి సత్వములు, ఫల, ఛాయల నొసంగుటచే నచటి వృక్షములును నెంతేని ధన్యము లగుచుండెను. అక్లేగుచున్నవారల జూచి యచటనున్న యాటవికులు దమ బంధువులను మిత్రులను దోడితెచ్చి వారలకు జూప వారాదివ్యసుందరవిగ్రహముల జూచి యానందపులకితగాత్రులై యోగు లకుగూడ నందని యచలస్థితిలో నిండిరి. వారట్లానందపరవశులై రామునితో గలసి పోవుచు, రామునకు వలయు నుపచారముల జేయుచు, పల్లవ శయ్యల గల్పించుచు, మార్గమున నిష్కంటకముగ సరిచేయుచు, రామోపచారములచే దెలియకుండగనె ధన్యులగుచుండిరి. రామచంద్రుడు వారి యవ్యాజమగు భక్తి ప్రేమలకు సంతసించుచుండెను. అంత సీత మార్గాయాసఖిన్నయగుట జూచి రాము డొకతరుచ్ఛాయను విశ్రమింపదలచెను. అప్పుడు వారి లోకోత్తర సౌందర్యమును గన్నులార జూచి తనివితీరక యచటివా రిట్లనుకొనుచుండిరి. ఈలోకోత్తర రూపము, యీ యామునుల వేషము, యీ ధనుర్ధారణములు పరస్పర విరుద్ధములై నను వీరియందొక్కెడ నెట్లుండినవి? మన కేమియు గోచరించుట లేదు. వీరి తలలందు జడలు, హస్తముల ధనుర్బాణములు, విశా లములగు వక్షస్థలములు, ఆజానులంబి బాహువులు, వీరి యవయవములన్నియు జూచినకొలది తనివితీరకున్నదని ముగ్ధులగుచుండిరి. అందలి స్త్రీలు సీతను జూచి విస్మితలై యామెను సమీపించి మెల్లన నిట్లు ప్రశ్నింపసాగిరి. అమ్మా! సీతో మాటలాడుటకు మాకు భయమగుచున్నది. మాతప్పుల మన్నింపుము. ఆ యుపకశ్రేష్ఠు లిరువురు లోకోత్తరసౌందర్యరాసులై ముద్దులమూటగట్టు చున్నారు. వారు నీకేమి గావలయును? మీరిందుల కేల వచ్చితిరి? ఎటకేగుచుంటిరన, వారి యమాయికములగు మాటలకుసంతసించుచు, సీత ఇట్లనియె. ఆగౌరాంగుడు నామజుది. ఆశ్యామసుందరాంగు డాతనియన్న గారు. నామరదిపేరు లక్ష్మణుడు. నాపేరుసీత. మేముకొంతకాలము కారణాం తరమున వనవాసమును జేయవచ్చితిమి. అన వారుసంతసించుచు నమ్మా! నీవు

చిరకాలము సౌభాగ్యవతివై మమ్ములమఱువకుండుమన వారిప్రీతికి జానకి సంతసించుచు వారలతో ముచ్చటించుచు వారల మిగులసంతసింప జేసెను. అంత లక్ష్మణుడు రామునిముఖమునుజూచి భావమునుగ్రహించి యచటివారల వలన మార్గమునుదెలిసికొని ప్రయాణోన్ముఖులై, మంచిమాటలచే నచటి ప్రజలవీడ్కొని బయలుదేరిరి. అచటి ప్రజలిట్లు విలపింపదొడంగిరి. దైవమె ప్పుడును నిరంకుశము. నిర్దయము. కాకున్న చంద్రునిగళంకిగా నెందులకొన రించెను? సాగరజల ముప్పుదేలగావలయు? చింతామణిని రాయిగను, కామ ధేనువునుదిర్యగ్జన్యంతువుగను, కల్పకమును వృక్షముగను నేలసృజింపవలయు? మతియు నిట్టి మనోహరాకృతుల కీవనవాసక్లేశ మెందులకు? వీరు వనవాస మునుజేయుచు కందమూలముల భుజింపుచు, ధరణిపైశయనించిన యెడల, నీసౌధములు, పర్యంకములు, మధురాహారములు, మణిభూషణములు, దివ్యాం బరములన్నియు నెందులకు సృజియించెనో దెలియదు అని కొందఱును, మన పుణ్యాముమంచిది. కాన మనకువీరి దర్శనభాగ్యమును గలిగించుటకిట్లు చేసెను. విధాతను నిందింపవలదని గొందఱును, విధాత ప్రయత్నపూర్వకముగ వీరిని సృజించి, పౌరదృష్టిదోషమును బరిహరించుటకు బ్రచ్ఛన్నముగ నుంపనెంచి వీరలనిటకు దెచ్చెనని గొందఱును, దనకిట్టి మనోహరరూపముల సృజియించుట చేతగాక, స్వయముగనవతరించిన యీమానవమోహనాంగుల నీర్ష్యచేనిట్లు హిం సించుచున్నా డనిమఱికొందరు ననుకొనుచు విలపింపసాగిరి. సీతారామ లక్ష్మ ణులరాకనువిని దూరమున నున్నవారుసయితము శ్రమకోర్చి వచ్చి వారల దర్శించి వారివృత్తాంతమును దెలిసికొని, దశరథకైకలను కొందరు నిందింప సాగిరి. మఱికొందరు దశరథకైక లిట్లు చేయకున్న మనలకు వీరి దర్శనభాగ్య మెట్లబ్బును? కాన వారు మనకుహితము నొసరించిరనియు, నెవరికిదోచినట్లు వారు చెప్పుకొనుచుండిరి. ఇట్టి దివ్యరూపముల జూచినమనము, వీరికన్నతల్లి దండ్రులు, సృజియించిన విధాతయును ధన్యులము. వీరియశము సకలజగద్వ్యా ప్తము. అనుకొనుచుండ, రామలక్ష్మణులనడుమనున్న సీత జీవబ్రహ్మలనడుమ నున్నయాదిశక్తివలె గోచరించుమండెను. మఱియు వసంతమన్మధుల మధ్య నున్నరతివలె, బుధచంద్రులనడుమనున్న రోహిణివలెను గాన్పించుచుండెను. రామపదచిహ్నముల ద్రొక్కుటకు సందేహించి, సీత ఎడమవై పునకును,

లక్ష్మణుడు కుడివై పునకును మఱలి జాగ్రత్తగ నడచుచుండిరి. వారలజూచి తిర్యగ్జంతువులుసయిత మానందించు చుండెను. అట్లు చనుచుండెడి వారల దర్శించిన వారందఱు దుస్తరమగు సంసారార్ణవము నశ్రమముగ దాట గలుగుచుండిరి. మునులకు గూడ దుర్లభమగు పదవిని వారు పొందుచుండిరి. మార్గాయాసమున సీత యలసినదని రాముడు గ్రహించి, యట నొక వటవృక్ష ఛాయనాగి అటనున్న సరోవరమునందలి పానీయమునుగ్రోలి, కందమూలాదుల భుజించి యారాత్రినట గడిపి మరునాడు ప్రాతఃకాలమున నట స్నానసంధ్యాద్య నుష్ఠానములదీర్చి మనోహరములగు నదనదీపర్వతారణ్యముల జూచుచు గ్రమ ముగ వాల్మీకిమహర్షి యాశ్రమమునుజేరిరి. ఆయాశ్రమము ఫలభరితములగు వృక్షములతోడను, మధురజలపూర్ణములగు జలాశయములతోడను, పుష్ప గుచ్ఛవినమ్రములగు లతలతోడను, పరస్పరమైత్రితో నిర్భయముగ మెలగు జంతువులతోడను కన్నులపండువుగనుండెను. శిష్యులవలన వాల్మీకి రామచం ద్రునిరాక నెరింగి, ఎదురుగవచ్చెను. తోడనే రాము డాతనికి నమస్కరింప నాతడారాముని దీవించి తోడితెచ్చి యర్ఘ్యపాద్యములనొసగి యుచితాసనముల గూరుచుండబెట్టి, క్షేమమడిగి, మధురములగు ఫలములను గందమూలములను దెప్పించి వారికొసగి, వారిదర్శనమువలన దనతపస్సు ఫలించినదనియు, జన్మము సఫలమైనదనియు, నత్యంతానందమునందుచు, రెప్పవేయక వారిదివ్యరూప ముల జూచుచుండెను. అంతరామచంద్రుడు సవినయముగ నాతనితో నిట్లనియె. మానివర్యా! సర్వజ్ఞులగు తమకీప్రపంచమంతయు గరతలామలకమువలెనుండును. నేను మాతండ్రిగారి యాజ్ఞనుబట్టి కొంతకాల మరణ్యమున వసింపవలయును. కాన నిచటివారలకు మావలన నంతరాయము లేకుండునట్టియు, మానివాసమున కనువగునట్టియు ప్రదేశము నానతిచ్చిన మేమందువసింతుమన వాల్మీకి నవ్వుచు నిట్లనియె. ప్రభూ! నీదర్శనమువలన నేను ధన్యుడను. ఎవనిమహిమను గొని యాడజాలక వేదములూరకుండెనో, ఎవడాద్యంతరహితుడై పరిపూర్ణుడై, యానందమయుడై చిద్రూపుడై, మాయాతీతుడై వెలుంగుచుండునో, ఎవని కటాక్షమాత్రమున నీబ్రహ్మాండములన్నియు నుద్భవిల్లుచున్నవో, ఎవడు బ్రహ్మ విష్ణుమహేశ్వరరూపమున సృష్టిస్థితిలయముల నొనర్చుచుండునో, ఎవడు దుష్ట నిగ్రహమును శిష్టసంరక్షణమును జేయుటకును భక్తులననుగ్రహించుటకును

మాయామానుషాదిరూపముల ధరించుచుండునో, అట్టి పరబ్రహ్మస్వరూపుడ
వగు నీకు నేను నివాసార్హమగు నెలవునుజూప నెంతటివాడను? మఱియు
నీలక్ష్మణుడు సరిత్సాగరపర్వతారణ్యభరితమగు నీభూమండలము సశ్రమముగ
వహించుచు, చతుర్దశభువనకుక్షివగు నీకు తల్పమగు ననంతుడు. ఈసీత జగ
న్మాత. మీరులేని వస్తువెందునులేదు నీవు సర్వాంతర్యామివి. కాన
నెల్లడలను నీవు స్వేచ్ఛగ నివసింపవచ్చును. అయినను నన్నడిగితివిగాన వివరిం
చెదను. ఎవని కర్ణసముద్రమునందు నీకథావాహినులు లీనమగుచుండునో, ఎవని
నేత్రచకోరములు మీ ఘనశ్యామసుందరగాత్రమును జూచి దనివినొందజాల
కుండునో, ఎవని హృదయచాతకము విషయభూజలంబుల విడిచి, నీనామామృత
దివ్యపయఃపావనము నభిలషించునో, ఎవడు నీవిమలయశోమానసమున రాజ
హంసవలె నీదులాడుచుండునో, ఎవడు నీగుణమౌక్తికముల దన జిహ్వాచే
గ్రహించునో, భవన్నివేదితాన్నమునే భుజించుచుదన సర్వస్వమును నీకర్పణ
మొనరించునో, ఎవడు దేవబ్రాహ్మణభక్తుడై, గురువుల నారాధించుచు
సత్కర్మల నొనర్చుచు, నరిషడ్వర్గమునకు లోబడక, ద్వంద్వసహిష్ణుడై జగద్ధిత
మునే కోరుచుండునో, ఎవడు పరస్త్రీ పరధనముల నాశింపక సత్యవ్రతుడై,
ఇతరచింతల వీడి నీజగన్మంగళదివ్యరూప సందర్శనమున గృతార్థుడగునో, అట్టి
భక్తాగ్రగణ్యుని నిర్మలహృదయపీఠమున నీవు సీతాలక్ష్మణసహితుడవై నివ
సింపుమను నామునివాక్కులకు రామచంద్రుడు చిరునగవు మోము నలంకరింప
నిట్లనియె. మునివర్యా! నీవనినది నిక్కువమ. అయినను లోకానుసారముగ
నాకిపు డనువగు తావును జూపుమన ప్రభూ, అట్లైన నదిగో! చిత్రకూటము.
అది ఫలపుష్పభరితములగు కాననములతోడను మృగపక్షిగణములతోడను
నెంతేని మనోహరముగ నుండును. అం దత్రి మున్నగు మహర్షులు దపముచేయు
చుందురు. అం దనసూయాప్రభావసమానీతయగు మందాకిని నిత్యము నిర్మల
మధురశీతలోదకముల ప్రవహించుచుండును. కాన నీవట కేగి సుఖముగ నుండు
మన వల్లెయని సీతారామలక్ష్మణు లటకేగి యాప్రదేశమును జూచి సంతసిం
చిన పిదప రాముడు సోదరా! యీపర్వత మామునివరుడు దెల్పిన
ట్లెంతేని రమణీయముగ నున్నది. కాన నీవు చక్కగ నిరూపించి, మన నివాస
మున కనువగు తావును నిర్ణయింపుమన నాసౌమిత్రి యాగిరిని నలుదిక్కుల దిల

కించి వచ్చి రామునితో నిట్లనియె. ప్రభూ! ఈగిరివీరుడు మందాకినీజ్యాకలిత మగు నుత్తరతటకార్మ్మకమందు శమాదిశరములచే దురితవైరుల బారద్రోలు చున్నాడు. కాన నాయుత్తరతటము మన నివాసమున కనువుగ నున్నదన నాతని పలుకులు విని రాము డట నివసించుట కంగీకరించెను. దేవత లంత రామచంద్రు డానివాసమున కంగీకరించుట నెఱింగి, తోడనే గిరాతరూపముల ధరించి, అట కరుదెంచి, చక్కని రెండు పర్ణశాలల నిర్మించిరి. సీతారాము లందు వసంతసహితులగు రతిమన్మథులవలె లక్ష్మణునితో సుఖముగ నివసించు చుండిరి. అపుడింద్రాదిదిక్పతులు, దేవతలునువచ్చి రాముని దర్శించి, యాతని మన్ననల వడసి కృతార్థులమైతి మని సంతసించుచు విరులవాన గురియించిరి. రామచంద్రు డట నివసించుట విని మునివరు లరుదెంచి రాముని మన్ననల నంది, వారల దివ్యమంగళవిగ్రహముల దర్శించి, నేటికి మన తపస్సు ఫలించిన దని, హర్షపులకితగాత్రులై, కొంతతడవట నాగి, రామానుజ్ఞాతులై, నిజనివాస ముల కేగి సుఖముగ దప మాచరించుచుండిరి. రామచంద్రు డట నివసించు టను విని యాప్రాంతముననున్న యాటవికులు గందమూలఫలాదులను, మధు వును, వ్యాఘ్రచర్మ గజదంతములను మౌక్తికముల నుపాయనములుగ దెచ్చి రామచంద్రుని దర్శించి, వారల దివ్యమంగళమనోహరరూపముల కచ్చెరు వందుచు వారలకు బ్రణమిల్లుచు జిత్తరువులవలె నిశ్చేష్టులై నిలువ, వారల ముగ్ధభావములకు సంతసించుచు, వారల నాదరముతో బలుకరింప వార లానంద బాష్పకలితలలితనయనులై, ముకుళితకరకమలములు ఫాలము నంట నిట్లనిరి. మాయదృష్టవశమున దమ దర్శనభాగ్య మబ్బినది. మీరు సంచరించిన భూభా గము లతిపవిత్రములు. ఈవనప్రదేశము సర్వకాల మనోహరము. మేమంద ము మీసేవకులమై మీకు గావలసిన పనుల నన్నిటిని జేయుచు, క్రూరమృగ ములవలన బాధలేకుండ గాపాడుచు నిటనున్న విశేషముల జూపుచు, మీరు వేట కేగునపుడు మీకనుచరులమై, దరీనికుంజముల జూపుచు, మిట్టిపల్లముల సవరించుచు, కందమూలాదుల నర్పించుచు సపర్యల జేయుదుము. మమ్ములన్ నీదాసులుగ గ్రహింపుమనిరి. కరుణానిధి యగురామచంద్రుడు వారియవ్యా జప్రేమకు సంతసించుచు, వారల నత్యాదరముగజూచుచు, నుచితరీతిని మాటా డుచుండెను. వారట్లు కొంత తడవుండి రామునియాదరాభిమానముల గాని

యాడి బ్రణమిల్లి యనుజ్ఞనొంది నిజనివాసముల కేగిరి. ఇట్లు రామచంద్రుడు దేవమునివనచరులతో నుచితరీతిని భాషింపుచు, సీతాలక్ష్మణులతో గూడి సుఖముగ నటగాలమును గడుపుచుండెను. రాముడట్లు నివాసమేర్పరచుకొని నదిమొద లటవృక్షము లెప్పటికప్పుడు ఫలపుష్పభరితములై కల్పవృక్షముల వలె విరాజిల్లుచుండెను. లతలు పూలగుత్తులతో నేలకు బ్రవేలాడుచుండెను. నదులు మధురశీతలజలములు వహించుచుండెను. వేయేల ! ఆ వనము నందన వనమువలె బ్రకాశించుచుండెను. నందనవనముగూడ రామపాదస్పర్శచే జిత్ర కూటవనమె ధన్యమనిభావించుచుండెను. అచటమృగములు స్వాభావికవైర మునుమాని పరస్పరమైత్రితో మెలగుచుండెను. రాముని దేహకాంతినిజూచి పిపాసితములైన మృగములు యమునాప్రవాహమని పరుగెత్తుచుండెను. మేఘు మాలయని నెమలి పించమునువిప్పి యాడుచుండును. గంగాది పుణ్యానదులు చిత్రకూటమునందున్న మందాకినిని బొగడుచుండెను. మేరుమందరాది మహా నగములు చిత్రకూటమె ధన్యమైనదని బ్రశంసించుచుండెను. చిత్రకూటమునం దుండి రామునిదర్శించు జంగమములు, రామునికై యుపయోగించు స్థావరములు మనకన్నను ధన్యములని దేవతాగణము లనుకొనుచుండిరి. సీతారామలక్ష్మ ణులు క్షీరసాగరమువంటి యయోధ్యనువీడి ఏచిత్రకూటమున నివసించుచుం డిరో అట్టిచిత్రకూటమహిమ వర్ణనాతీతము. లక్ష్మణుడు సీతారాముల చరణ కమలముల జూచుచు, నపరిమితానందమగ్నుడై, మాతాపితృ గృహదారా దులస్మరింపక నిరతము వారలనె సేవింపుచుండెను. భక్తాగ్రగణ్యుడగు లక్ష్మ ణునిభాగ్యము నెవరు వర్ణింపగలరు ? సీతయు రామచంద్రుని ముఖకమలము జూచుచు, బిత్రవర్గమునుగాని శ్వశురవర్గమునుగాని స్మరింపక సుఖముగనుండెను. రామచంద్రునికి దనయందుగల ప్రేమాతిశయమును జూచి సంతసించుచు, నా వనమునె యయోధ్యగను, పర్ణశాలనె దివ్యసౌధముగను, కందమూలాదు లనె మధురాహారములుగను, కుశకిసలయశయ్యనె హంసతూలికా తల్పముగను, మృగాంగనలనె పరిజనముగ నెంచుచు, నత్యానందముతో గాలక్షేపమును జేయుచుండెను. ఎవతె కృపావలోకనమున నింద్రాదులు దివ్యభోగముల ననుభ వించుచుండిరో అట్టి జగన్మాతకీ సాధారణ మనుష్యభోగము లెంతటివి ? ఎవ నిని స్మరించెడిభక్తులు విషయవిరక్తులగుచుండిరో ! అట్టి భగవంతుని నిత్యము

సేవించెడి సీతాలక్ష్మణులకీ విషయములతో నేమిపనిగలదు ? రామచంద్రుడు సీతాలక్ష్మణులకు వెనుకటి రాజర్షులచరితముల జెప్పుచు సంతోషమును గలిగించుచుండెను. రామునివలన నద్భుతములగు పుణ్యకథలవినుచు వారుమిగుల సంతసించుచుండిరి. శచీజయంతులతో గూడిన దేవేంద్రు డమరావతియందువలె సీతాలక్ష్మణులతో గూడిన రామచంద్రుడు చిత్రకూటమున సుఖముగనుండెను. అచటివారును సీతారాములదర్శించుచు సుఖముగనుండిరి.

గుహుడు రామానుజ్ఞాతుడై మఱలివచ్చువఱకు సుమంతు డచటనే నిలిచి విలపించుచుండెను. అట్లు విలపించుచున్న సుమంతునిజూచి గుహుడును చాల విలపించెను. సుమంతుడు మాటిమాటికిని సీతారాములకు సంభవించిన వనవాసమును దలపోయుచు దుఃఖించుచుండ నాతని రథాశ్వములుగూడ దక్షిణ దిక్కువైపు జూచుచు కన్నుల నీరు కార్చుచుండెను. అంతలో గుహుడు కొంచెము ధైర్యమునూని సుమంతునితో నిట్లనెను. సుమంత్రా ! తత్త్వజ్ఞుడవగు నీవిట్లు విలపించుట యుక్తముకాదు. దైవము నెవ్వరైనను దాటజాలరుగదా ! అని యనేకవిధముల నాతని నోదార్చి మెల్లన రథముపై గూరుచుండబెట్టెను. కాని యాతడారథమును నడుపజాలకుండెను. అంత గుహుడు తన యనుచరుల బిలిచి మీరీరథమును నెమ్మదిగ నయోధ్యకు జేర్పుడని చెప్పి తాను వెనుకకు మరలెను. ఆ భిల్లు లారథము నతిజాగరూకతతో నడుపుచు సుమంతుని జూచి దుఃఖింపుచు, మెల్లన నయోధ్యను జేరుచుండిరి. అయోధ్యను సమీపించుకొలది సుమంతుని దుఃఖము మితిమీరుచుండెను. రామచంద్రుని వీడిన యీజీవిత మెందులకు ! నేనీయపకీర్తి నెట్లుభరింపగలను? నాహృదయ మయోమయము. కాకున్న నిట్టిదుస్తరదుఃఖము నెట్లుసహించును. నేనీయయోధ్యాపుర వాసులకు రామచంద్రుడేడీ యన నేమిచెప్పవలయునని యనేకవిధముల విలపించుచుండెను. ధనమును గోల్పోయిన లోభివలె, సంగ్రామ నివృత్తుడగు శూరునివలె, మద్యపానమొనరించిన శ్రోత్రియునివలె, స్ఖలితపాతివ్రత్యముగల కులాంగనవలె నాతడు దుఃఖించుచుండెను. ఆతనికన్ను లశ్రుపూరితములయ్యెను. మోము వాడిపోయెను. అట్లు సరయూప్రాంతమునకేగి రథమునాపి యాబోయలను వెనుకకు మరలించి సుమంతుడటనొక పృక్షచ్ఛాయయందు గూర్చుండి ఇట్లు దలపోయసాగెను. రాముడులేని రథముతో నయోధ్య నెట్లు ప్రవేశించగలను ?

రామదర్శనోత్సకులగు పౌరులకు నేనేమిచెప్పవలయును? పుత్రదర్శనలాలస లగు రాణుల కేమిచెప్పగలను? రాముని దెచ్చితివాయని రాజడిగిన నేమిచెప్ప వలయునో! నా కేమియు దోపకున్నది. హతవిధీ! నాప్రాణముల నింతనిష్ఠు రములుగ సృజించితివేల? నేనయోధ్యకేగి ఏమియనుభవింపవలయును? రామ రహితమగు నయోధ్య నరకప్రాయముగద. పదునాలుగు వత్సరములు గడిచిన పిమ్మట రాముని జూడవచ్చునన్నను నీపదునాలుగుయుగములు గడుచుపట్లు? అని పరిపరివిధముల జింతింపుచు, ప్రొద్దుగ్రుంకునంతనఱ కచటనేయాగి పిమ్మట మహాపాతకివలె నయోధ్యలో ప్రవేశించి ప్రచ్ఛన్నముగ రాజద్వారమును సమీపించి రథమునట నాపి రాజభవనములో ప్రవేశించెను. రామవిరహిత మగు నారథమును జూచినతోడనే ప్రజలమనసు వడగండ్లవలె నీరై పోయెను. నిర్జలమీనములవలె గొట్టుకొనుచుండిరి. మంత్రిరాకను విని రాణివాసమంతయు వ్యాకులమయ్యెను. ప్రేతభూమికేగువానివలె సుమంతుడు భయమందుచు లోని కేగ నచటివా రేమేమో ప్రశ్నింపుచుండిరి, కాని సుమంతుడు వారలకేమియు బదులుచెప్పక, రాజెక్కడనని యడిగి కౌసల్యాభవనమునందున్నట్లు దెలిసికొని దోడనె యటకేగి, కళావిహీనుడగు చంద్రునివలెపడియున్న రాజును గాంచెను. రాజు నిద్రాహారములులేక వాడిన మోముతో భూషణరహితుడై మలినాంగ ములతో నేలపై నిటునటు బొరలాడుచు, మాటిమాటికి రామా! యని పలవరించుచు, సూర్యరశ్మిచే రెక్కలు మాడిపోయిన సంపాతివలె పడి యున్న రాజును జూచి, సుమంతుడు మఱియు దుఃఖించుచు గద్గదకంఠ ముతో, మహారాజా! జయమని బల్కరించెను. సుమంతుని మాటను వినిన తోడనె దుస్సహదుఃఖము ననుభవించుచున్న దశరథుడు మెల్లన లేచి సుమంతు కౌగలించుకొని రాముని దెచ్చితివా, యేడీ! నారాము డని పలుకుచు నాతని చేతుల బట్టుకొని ఇట్లు బలుకసాగెను. సచివోత్తమా! సీతారామ లక్ష్మణులకు సేమమకదా? వారలు నామాటల విని నీతో వచ్చిరా? లేక వనమునకె బోయిరా! అన సుమంతునకు దుఃఖమాగుటలేదు. అంతలో మరల రాజిట్లనియె. సుమంతా! ఏల నూరకుంటివి? సీతారామలక్ష్మణుల గుణశీల ముల నొకసారి వర్ణింపుము. నేను రామునకు రాజ్యము నిత్తునని చెప్పి వనమున కంపితిని. నానిలకడలేని మాటలకు రాము డేమనుకొనెనో? రాము డిటకురాని

యెడల నన్నటకు గొనిపొమ్ము. అని రాజు పలుమారులు పలుక సుమంతు డిసుమంత ధైర్యమూని సవినయముగ నిట్లనియె. మహారాజా! మీరు ధీర వరులు, జ్ఞానసంపన్నులు, ధర్మనిధులు. సాధుసాంగత్యమున నన్నియు దెలిసిన వారు. కాన నేను మీకు జెప్పవలసిన దేమున్నది? జనన మరణములు, సంయోగవియోగములు, సుఖదుఃఖములు, ప్రాణుల కర్మవిశేషములనుబట్టి రాత్రింబవళ్ళవలె వచ్చుచుండును. ప్రాజ్ఞులు వానిని సమబుద్ధితో జూచుచు ఖేదమోదములకు వశులుగాక యుండెదరు. మహాజ్ఞానసంపన్నులరగు మీరును ఖేదమోదముల విడిచి నానుడువుల నాలింపుడు. మొదటిదినమున దమసానదీ తీరమున నాగి రెండవదినమున గంగాతీరమున కేగితిమి. అట స్నాన మాచ రించి జలపానమును మాత్రము జేసితిమి. అచటి కనతిదూరమున శృంగి బేరపురాధీశుడు మారాక నెఱిగి మాకు కందమూలఫలాదుల నొసగి సక లోపచారముల గావించెను. మరునాడు రామలక్ష్మణులు జటాధారులై గుహుడు సిద్ధముచేసిన నావను సీతాసహితముగ నధిష్ఠించి, చిన్నపోయి చూచుచున్న నన్నుజూచి రామచంద్రు డిట్లనియె. నాయందు సంపూర్ణప్రేమ గల మాతండ్రిగారికి నానమస్కారములను జెప్పుము. మాకై దుఃఖింపవల దనియు దమ యనుగ్రహమువలన సుఖముగ వనవాసవ్రతము నాచరించి గుశ లముగ నయోధ్యకు వచ్చి తమ పాదపద్మముల నర్చించుచు దల్లుల నానంద పఱచెద నని మనవిచేయుము. సుమంత్రా! నీవు నాకు బిత్రతుల్యుడవు. కాన మాతండ్రిగారికి దగురీతిని శోకోపశమనమును జేయుచుండుము. గురుచరణము లకు వందనముల జెప్పి నాకై విచారింపవలదని చెప్పుము. రాజానుమతముగ ప్రభవిష్ణుడు రాజును దుఃఖమునుండి మఱలింపుచుండెడివారె నాకు హితు లనియు, భరతుడు మీ కేలోపము లేకుండ మిమ్ములను బాలించుననియు యయో ధ్యాపురవాసులకు జెప్పుము. మాభరతునితో నామాటగ నిట్లనుము. నీవు జాగరూకుడవై రాజ్యమును సక్రమముగ బాలింపుచు, దల్లుల యోగక్షేమ ముల నరయుచు దండ్రిగారికి దుఃఖోపశమనమాచరించుచు, సర్వవిధముల నేను లేని లోపమును పూర్తిచేయుము. ఇట్లందఱి కన్నివిధముల జెప్పినేగాని నేనెన్నివిధముల ప్రతిమాలినను నాప్రయత్న మంతయు విఫల మయ్యెను. పిమ్మట లక్ష్మణు డేమేమో చెప్పబోగా రాముడు వారించెను. సీత కొన్ని

మాటల జెప్పదలచెనుగాని దుఃఖప్రేమపరవశయై ఏమియు బలుకజాలకుండెను. పిమ్మట నావికుడు రామచంద్రుని ముఖలక్షణమును జూచి పడవను నడుపనారంభించెను. అప్పుడు పట్టరాని దుఃఖముతో నిశ్చేష్టుడనై జూచుచుంటిని. పిమ్మట నన్ను నేను నిందించుకొనుచు రామచంద్రుని సందేశమును వినిపించుటకై తమ యొద్దకు వచ్చితినని బలికి సుమంతు డూరకుండెను. రాజాసుమంతుని మాటల విని, రామవియోగజాతమగు దుర్భరబాధను సహింపజాలక నిర్జలమీనమువలె నిటునటు గొట్టుకొనుచుండెను. ఆతని దుర్దశను జూచి రాణులు విలపింపసాగిరి. మూర్తీభవించిన శోకమువలెనున్న వారినిజూచిన నెంతటిధీరులకైనను ధైర్యము దిగజారిపోవుచున్నది. రాణివాసమంతయు విలపించుటను విని నగరవాసులందఱు నశనిపాతమున పాఱు పక్షులవలె నేడువసాగిరి. అపుడాయయోధ్య మూర్తీభవించిన కరుణరసమువలె నుండెను. క్రమక్రమముగ రాజు నింద్రియములు గజాకృష్ట కమలములవలె క్షీణింపుచుండెను. అప్పటి రాజు స్థితినిజూచి సూర్యవంశభానుడస్తమింపనున్నాడని తలంచి కౌసల్య ధైర్యము నవలంబించి రాజుతో నిట్లనియె. జీవితేశ్వరా! తామాలోచించి మనమును దిట్టము చేసికొనుడు. ఈరామవియోగార్ణవమును దాటుటకు చతుర్దశవత్సరావధి యను నౌక కలదు. మన పౌరులు బంధువులు స్నేహితులు నందఱు నానౌకపై నెక్కియున్నారు. కాన తామానౌకకు గర్ణధారులై జాగ్రత్తగ గడపిన నవధి గడచినతోడనే సీతారామలక్ష్మణు లిటకువచ్చి మఱల మనల నానందమగ్నుల జేయగలరు. అట్లు కానినాడు మన మందఱు మాసముద్రములో మునుగవలసివచ్చును. అనునామె వాగమృతమువలన దెలివొంది కనుల విచ్చి యామెను సాదరముగ జూచుచు, నామె తొడపై తల నిడి దీనముగ నిట్లనియె. ప్రియా! నీవాక్యము లెంతేని సమంజసములు. కాని సీతారామలక్ష్మణుల జూచు భాగ్యము నాకు మాత్రము లేదు. దానికి గారణము మునిదంపతుల శాపమని యావృత్తాంతము నంత నామె కెఱింగించి, రామవిరహితమైన యీజీవిత మెందులకని దనను దానె నిందించుకొనుచు, మాటిమాటికి రామా! రామా! యని బలుకుచు రామునితోబాటు ప్రాణముల గూడ విడిచి స్వర్గమున కేగెను. లోపల వెలుపల రాముని దివ్యమంగళవిగ్రహమునె జూచుచు, రామనామమునె బఠించుచు ప్రాణముల వీడిన దశరథుని యశస్సు దశరథునికన్న ముందుగనే స్వర్గమును

వ్యాపించియుండెను. రాజు మరణింపగనే రాణు లతని రూపగుణశీలధైర్యముల నుగ్గడించుచు నురస్తాడన మొనర్చుకొనుచు వివశలై విలపింపసాగిరి. వారలజూచి పరిజనులును వారల జూచి పౌరులును విలపించుచు, ధార్మికుడగు దినకరకులశీత భాను డస్తమించెను, రామచంద్రు డరణ్యమున కేగెను, ఇక మన కేదిదిక్కు? అరాజకమగు రాజ్యమందు నివసించుటెట్లు? అని పరిపరివిధముల దీనాలాప ముల బలుకుచుండ నటకు వసిష్ఠుడు మున్నగు మునులు వచ్చి, ప్రాచీనగాథలను జీవితమునొక్క నిస్సారతను బోధించి, వారల నందఱి నోదార్చిరి. అంత నొక తైలద్రోణియందు దశరథుని శరీరమును భద్రపఱచి, తగు దూతల రావించి, వశిష్ఠుడు వారలతో నిట్లనియె. ఓయీ! మీరు శీఘ్రముగ బోయి రాజు మరణవార్త నట దెల్పక, నామాటగా భరతశత్రుఘ్నుల నిటకు ద్వరగ దోడి తెండన వారును వశిష్ఠు నానతిని దలదాల్చి శీఘ్రగాములగు తురంగముల నెక్కి ప్రయాణమై పోయిరి. రామచంద్రు డయోధ్యను వీడినది మొదలు భరతునకు దుస్స్వప్నములు వచ్చుచుండెను. అందుకు భరతుడు విచారించుచు తచ్ఛాంతి కొఱ కనువగు జపదానాదుల నొనరించుచు నేమియు దోపక చింతాకులస్వాం తుడై యుండ నంతలో వశిష్ఠు డంపిన దూత లటజేరి వశిష్ఠునాజ్ఞను విన్నవింప తోడనే భరతుడు శివునిపూజించి యనుజసహితుడై బయలు దేరెను. గుఱ్ఱ ములు నిరాఘాటముగ బరుగెత్తుచుండెను గాని భరతుడిట్లనుచుండెను. నేనయోధ్య నెప్పటికి జేరగలను? నాకు తొక్కలుండిన బాగుండెడిది. అనితల పోయుచుండగనే వారయోధ్యను సమీపించిరి. అట్లుసమీపించి నగరులో నడుగుపెట్టగనే భరతునకు దుశ్శకునము లగుచుండెను. కాకములు సృగాల ములును విషమవిరావముల జేయుచుండెను. సౌధాగ్రముల గృధ్రములుగూరు చుండెను. వానినిజూచిన భరతునిహృదయము శూలావిద్ధమైనట్లు బాధపడు చుండెను. అయోధ్య కళావిహీనమై మూర్తీభవించిన శోకదేవతవలె నుం డెను. భరతున కెదురైన నగరవాసులు నమస్కరించిరే కాని మాటాడజాల కుండిరి. దుఃఖితమనస్కుడగు భరతుడును వారల బలుకరించుటలేదు. భరతు నకు నగరమంతయు దావాగ్నిపరీతమైన ట్లగపడుచుండెను. భరతుడు వచ్చు చున్నవాడని విని, భానువంశకమలకౌముది యగు కైకేయి లోనసంతసించుచు ద్వారదేశమువఱకు వచ్చి దుఃఖాకులితస్వాంతు డగుభరతుని గుశలమడిగి

లోనికిదోడ్కొనిజని మాతులుని క్షేమమడుగుచుండెను. భరతుడుతల్లికి నచటి క్షేమము నెఱిగించి, తనతండ్రిగారియొక్కయు, సీతారామలక్ష్మణులయొక్కయు క్షేమము నడుగుచు నమ్మా! మనపరివారజన మేలనిట్లు దీనముగ విచారించుచున్నదని యడుగ నాతనికి శ్రవణవిదారణముగ నైకఇట్లనియె.

పుత్రా! మంథరాసహాయమున నేనన్ని పనులను సవరించితినికాని దైవము ప్రతికూలమై మనకుగొన్ని విఘ్నముల గల్పించుచున్నది. కానిమ్ము. క్రమముగనన్నియు జక్కనగును. అని తనచాతుర్యమువలన సీతారామలక్ష్మణులకు గలిగినవనవాసమును, తన్మూలమున దశరథునికి సంభవించిన విపత్తును వరుసగ జెప్పగా నశనిహతమగు గిరివలె దుఃఖవశమున మూర్ఛిల్లుడై నేలపై బడిపోయెను. పిమ్మట కొంతవడికిదెలిసి తండ్రిగారి మరణమునకు విలపించుచున్న పుత్రునితో నైకేయి యిట్లనెను. వత్సా! చిరకాలము రాజ్యభోగముల ననుభవించి ధార్మికుడై తుదకుధర్మమున నై ప్రాణములవిడిచి స్వర్గమునకేగిన మీతండ్రిగారినిగురించి పిలపింపబనిలేదు. ఎవనికైనను మరణముతప్పదుగదా. ఇక క్షత్రియునకు ప్రజలబాలింపుచు ధర్మకార్యముల జేయుచు, రాజ్యభోగముల ననుభవించుటయే కర్తవ్యము. అట్లు చేయజాలనిక్షత్రియుడు వానపామువంటివాడు. మఱియు నీతండ్రిగారివలన నన్నిమన్ననల వడసి, ఇపుడు కౌసల్యకడ దాసివలెనుండుట నాకిష్టముగాదు. ఇంతకు నావరములనేను గోరితినికాని హెచ్చుగనేమియు గోరుటలేదు. కాన పసివాడవగునీవు మఱియొక తీరుగభావింపక ప్రయత్నపూర్వకముగ నార్జించినరాజ్యమును నిష్కంటకముగ బాలింపుమను తల్లిమాటలువిని శోకక్రోధములచే మండుచు ధీరోదాత్తుడగు భరతుడు తల్లితో నిట్లనియె. ఓసీ కులపాంసనా! భర్తృఘాతినివగు నీముఖమునుజూచిన పాతకము వాటిల్లును. పవిత్రమగు సూర్యవంశమున దశరథునకు బుత్రుడనై రామున కనుజన్ముడనైనన్నేను, భానుకులజలధి బడబానలమువంటి నీగర్భమునబుట్టుటకెంతపాపము జేసితినో తెలియకున్నది. నాపాపఫలమును నేననుభవింపవలయును. నిన్ను నిందించిన ఏమిప్రయోజనము? రాముని వనమున కంపుమనుటకు నీకునోరెట్లువచ్చినది? స్త్రీబుద్ధిప్రళయమునుగల్పించుననునార్యోక్తి మున్మాటికిసత్యము. రాజునకుమతిచెడియుండవలయు. లేనిచో నీకీవరములెట్లున్నచ్చును? అంగనాహృదయము క్రూరాతిక్రూరమనియు, బ్రహ్మనైనను దెలియరా

దనియు పెద్దలు జెప్పినమాటలు నీయందుసత్యములై నవి. రాముని వననాసమున కంపుక్రూరరాక్షసస్వభావముగల నీగర్భమునబుట్టుటచే నావంటిపాపి మఱియొక డుండడు. ప్రపంచమంతయు రాముని ప్రేమించుచుండ నట్టిరాముని వనమున కంప నీమన సెట్లొప్పెను? నీవు నాకు దల్లివై తివి. లేనిచో నిన్నేమిచేయుదునో యని పట్టరాని శోకావేగముతో నేలపై బడి మూర్ఛిల్లెను. అంతలో మంథర యలంకరించుకొని కులుకుచు నటకురాగా శత్రుఘ్ను డాదాసిని నెత్రుగ్రక్కు నట్లు నిర్దయగ గొట్టెను. ఆమె మీక్షేమమునకై పాటుపడినందుకా! నాకీ సన్మానమని యేడువదొడగెను. ఓసి! ముండా! నీవా! మాకీయుపకార మునుజేసితివి? నీ మనఃకౌటిల్యమును నీయాకృతియే చెప్పుచున్నది. నీయుప కారమున కీబహుమాన మెంతటిదని మఱిల దాని జుట్టుబట్టి ఈడ్చుచుండ దయానిధియగు భరతుడామెను విడిపించెను. పిమ్మట భరతుడు శత్రుఘ్నునితో గూడి కౌసల్యయింటికి బయలుదేరెను. అటగౌసల్య మలినవస్త్రధారిణియై వికలమనస్కయై, కృశించి, శోకాధిదేవతవలెనుండెను. భరతునిరాకను దాసీ ముఖమున దెలిసి యాతని కెదురేగదలచి లేచి కొంతవఱకేగి నడువజాలక యట జతికిలబడియెను. అట్టి యాకౌసల్యను సమీపించి, చేతులు జోడించి తల్లీ! రామచంద్రుని వనవాసమునకును, పితృమరణమునకు, నీయాదీనావస్థకును గారణమైన మహాపాపియగు భరతుడు నమస్కరించుచున్నాడు. నేనీసూర్య వంశమున దావాగ్నివలె జన్మించితిని. ఇప్పుడు నాజన్మమెందులకో నాకర్థమగు చున్నది. పట్టాభిషిక్తుడైన రామచంద్రుని గన్నులారజూచుచు నాతని చరణ ముల సేవింపుచు గృతార్థుడనగుదును. అని యువ్విళ్ళూరుచుండెడి సంకల్ప లతాంకురములన్నియు నైకేయీవరములను గండకత్తెరచే నొక్కతృటిలో ఖండింపబడినవి. నావంటి నిర్భాగ్యుడెందైనగలడా! రామచంద్రుని ముఖ కమలమును జూచుచు, పదకమలముల సేవించుచు బరమానందమగ్నమానసు డగు లక్ష్మణుడెంతధన్యుడోగద! అని విలపించెడి భరతుని లేపనెత్తి బాలుని వలె కౌగగలించుకొని శోకాశ్రువులచే నాతని తలను దడుపుచు నాతనియొడ లెల్ల నిమురుచు రామచంద్రుడెదుటనిలబడినట్లు భావించుచుండెను. ఇంత శుద్ధ స్వభావముగల వనిత ఎందైనగలదా? భరతుని ఒడియందిడుకొని కన్నిరు తుడుచుచు మెల్లననిట్లనియె. వత్సా! ధీరుడవై దుఃఖమును సహింపుము.

సుఖదుఃఖములు కర్మలనుబట్టి వచ్చుచుండును. కాన ధీరులు వీనిని గమనింపరు. ప్రస్తుతపరిస్థితికి నీదోషమేమియులేదు. ప్రతికూలదైవము నన్నిన్ని పాటుల బెట్టుచున్నది. ఎప్పటికేగతిపట్టునో ఎవనికిని దెలియదు. తండ్రి యాజ్ఞనుబట్టి రామచంద్రుడు చీనాంబరములను విడిచి వల్కలధారియై, హర్షశోకరహితుడై ప్రసన్నహృదయుడై వనమునకు బ్రయాణమగుచుండ, విని రామునియందలి ప్రేమాతిశయముచే నింటనుండనొల్లక సీత పతిసనుసరించెను. రామచంద్రు డెంతచెప్పినను వినక లక్ష్మణుడును వారితో బయలుదేరెను. నేను మాత్రము బయలుదేరజాలకుంటిని. మీతండ్రిగారు ప్రాజ్ఞులుగాన రామచంద్రుడింటనున్న వఱకును జీవించి రామచంద్రుడు వెడలినవెంటనే దృఢప్రాయముగ ప్రాణముల త్యజించిరి. కుమారా! చూచితివా! వారికిని నాకునుగలభేదమును! స్త్రీల హృదయము కఠినము. ప్రేమను నటింతురేకాని నిజమగుప్రేమ స్త్రీలకెక్కడిది? ఇంత ఘోరావస్థయందు నేనిటులనేయుంటినని కన్నీరుగార్చుచున్న కౌసల్యను జూచి భరతశత్రుఘ్నులు ధీరులైనను రాజభవనము ప్రతిధ్వనించునట్లేడువ సాగిరి. వారల యవస్థనుజూచి కౌసల్యవారల జేరదీసి బుజ్జగించుచు వారలకు శోకోపశమన మొనరించుచుండెను. ఇట్లు తల్లికొడుకులు పరస్పరము నోదార్చు కొనినపిమ్మట భరతుడు చేతులజోడించి కౌసల్యతో నిట్లనియె. తల్లీ! నాకు రామచంద్రుని వనవాసవృత్తాంతమేమియు దెలియదు. అట్లయిన నీదురవస్థ మనకు వాటిల్లకుండెడిది. ఇందు నాదోషమేమియునులేదు. నిజము జెప్పుచుం టిని. ఇందు నాకెట్టిసంబంధమున్నను పంచమహాపాతకులగతికి పోవుదును. గోశాలలు, బ్రాహ్మణాగ్రహారములు తగులబెట్టిన దోషమును, స్త్రీ, శిశు హత్యాపాతకమును, మిత్రునకు ప్రభువునకు విషముపెట్టిన దోషమును, తల్లి దండ్రులను వధించినదోషమును మహాపాతకములు. ఉపపాతకములవలనకల్గిన దోషములును, పండితులు చెప్పినట్లుగా ప్రతికరణశుద్ధిగ జేసెడి పాపములును నాకు జెందునుగాక. తల్లీ! రామ వనవాసము నాకెంతమాత్రము తెలిసినను శివకేశవుల సేవించక నీచమైన భూతగణములు సేవించెడివాని ఫలము నొందె దను. నాకేమియు తెలియదు తల్లీ! దీనిలో నేమాత్రము తెలిసినను వేద విక్రయఫలమును, ధర్మమువీడి ధనసంపాదన చేసెడివాని ఫలమును, క్రోధ వశుడై కపట, కుటిల కలహప్రియుడై, వేదదూషకుడై, విశ్వవిరోధియై,

లోభియై, విషయలంపటుడై, చపలుడై, పరధన, పరదారాసక్తుడైయున్న వాని ఘోరపాపముల నొందెదను. ఇంకను సత్సంగానురాగమునువీడి, అభాగ్యుడై, పరమార్థవిముఖుడై, మానవశరీరముపొందియు భగవంతుని మరచి, హరిహరుల గీర్తింపక, వేదమార్గదూరుడై, కుమార్గగామియై, వంచకవేషము లతో, జగత్తును వంచించినవానికి పరమేశ్వరుడే ఘోరగతి సిద్ధింపజేయునో, నాకాగతి వచ్చుగాక! వైరాగ్య, వివేక, విజ్ఞానంబుల బోగొట్టుకొని, సదాగృహంబుల నివసించుచు స్త్రీ సంభాషణాసక్తుడై తన ధర్మములవీడి సంచరించు సన్యాసి శోచనీయుడు. ఆత్మపోషణమే ముఖ్యమని యెంచుచు పరద్రోహులై సంచరించువారును దేవపితృవంచకులై కాముకులై సంచరించువారును శోచనీయులు. భరతుని సత్యసరళవాక్యముల విని కౌసల్య యిట్లనియె. నీకీసంగతి ఏమియుదెలియదని నేనెఱుగుదును. రామునకు నీవును నీకు రాముడును బ్రాణాధికులు. మీకుగల పరస్పరసౌహార్దమును నేనెఱుంగుదు. నీవు భానువంశ ప్రదీపుడవు. నీకీర్తి జగద్విఖ్యాతమగును. చంద్రునియందు విషమైనను పుట్టవచ్చునుగాని నీకు రామునం దన్యభావమెన్నడును కలుగనేరదు అని పలుదెరగుల బోధించి భరతుని కౌగలించుకొని యశ్రుధారలచే నాతని దడుపుచుండ నామెకు స్తన్య ముద్భవించెను. ఇట్లు వారు పరస్పరము మాటలాడుకొనుచుండగనె ప్రాతఃకాల మయ్యెను. అంత వశిష్ఠమహర్షి వచ్చి మంత్రుల రావించి భరతునకు ననేక విధములగు నితిహాసముల జెప్పి దుఃఖోపశమనము గావించి ఇట్లనియె. నాయనా! భరతా! నీవు శోకింపతగదు. శోకించెదువా లెవరన సద్బ్రాహ్మణుల నవమానించెడివారు, ధనవంతుడైన లోభి, అతిథిని శివస్వరూపునిగా నర్చింపనివాడు, గర్వముగల జ్ఞాని, ధర్మమువీడిన గృహస్థుడు, తపమువీడి భోగలాలసుడగు యోగి, తన పోషణకై నిర్దయజూపువాడు, శోచనీయులు. కాని, నీతండ్రి అట్టివాడు కాడు. అతని కీర్తి పదునాల్గు భువనములు వ్యాపించెను. త్రిమూర్తులు దిక్పాలురు దశరథుని వేనోళ్ళ పొగడియుండిరి. ఇంక చెప్పనేల? నీతండ్రి యంతటి పుణ్యశాలి ఏలోకంబునను లేడు. తలితండ్రుల మాట చెల్లించువాడే పుత్రుడు. పరశురాముడు తండ్రి అజ్ఞను శిరసావహించి తల్లిని చంపిన సంగతి లోకవిదితమేకద. యయాతిపుత్రుడు తండ్రికి తన యౌవనమిచ్చి వాని ముదు

సలితనమును పుచ్చుకుని తండ్రిని సంతోషపెట్టెను. ఉచితానుచితములు విచారింపక తండ్రి ఆజ్ఞను పాలించువాడు, సమస్తక్రతుఫలంబుల నొంది, నాకవాస మొందగలడు. గాన, భరతా! నీతండ్రి ఆజ్ఞ పాలింపుము. ఇందు నీ దోష మేమియు లేదు. నీవిక ధైర్యమూని ముందుపనుల దీర్పవలయును. ఇప్పటికె కాల మతిక్రమించిన దన భరతుడు లేచి యవసరమగు సంభారముల సిద్ధము చేయించి, రాజు కళేబరమునకు స్నానము చేయించి, పూలవిమానమున నునిచి, సహగమనోన్ముఖులగు తల్లుల బ్రార్థించి, వారలకు రామదర్శనలాభాశను గల్పించి, వారల సహగమనమును మాన్పించి, పూలవిమానమునం దుంచిన తండ్రిగారి శరీరమును వశిష్ఠాదిమహర్షులు, సుమంత్రాదిమంత్రులు, పౌరముఖ్యులు దోడరాగా సరయూతీరమునకు గొంపోయి యట స్వర్గసోపానమువలె సిద్ధము గావింపబడిన చందన దారుమయమైన చితియందుంచి సమంత్రకముగ నగ్నికి సమర్పించెను. పిమ్మట నట గావింపదగిన కృత్యము వంతను యథావిధిగ నిర్వర్తించి, క్షత్రియోచితరీతిని దండ్రిగారి యూర్ధ్వదైహికమును గజతురగాద్యనేక దానములతో నిర్వర్తించి, వశిష్ఠోపదిష్టరీతిని బ్రాహ్మణ సంతర్పణాది సకల కార్యములను పూర్తిచేసి పితృఋణ విముక్తుడయ్యెను. అంత వశిష్ఠుడు రాజ సభకు వచ్చి మంత్రి సామంత పౌర ముఖ్యుల రావించి, భరతుని తన చెంగట గూరుచుండబెట్టుకొని ఇట్లుపన్యసింపసాగెను. ఓ భానువంశాగ్రణీ! ప్రపంచమంతయును దైవాయత్తము. సుఖదుఃఖములు స్వకర్మోపార్జితములుగాని పరప్రయుక్తములు గావు. కాన ప్రాజ్ఞుడు గర్మప్రాప్తములగు సంయోగవియోగములకు హర్షవిషాదముల నందక రాగద్వేషములకు జిత్తమున దావివ్వడు. రాజిట్లు మరణించుటకు రాజే కారణమని రాజునకు మునిదంపతులవలన గలిగిన శాప వృత్తాంతము నెఱింగించెను. మఱియు దశరథు డన్నివిధముల శ్లాఘ్యముగ జీవించి, ప్రజలను, వర్ణాశ్రమధర్మముల దప్పకుండునటుల పాలించి, సకలభోగములు ననుభవించి, చతుర్వ్యూహములతోడను, చతుర్విధపురుషార్థములతోడను, విష్ణుని చతుర్బాహువులతో బోల్పదగిన నలువురగొడుకులగని చిరకాలము జీవించి భగవల్లగ్నమనస్కుడై యోగిదుర్లభమగు సద్గతినందిన పుణ్యమూర్తి. మన మాతనికై శోకింపజనదు. వేదాధ్యయనమొనరింపక వేదవిహితకర్మల నాచరింపనివిప్రుడు, ధర్మబద్ధముగ ప్రజాపాలనమొనరింపక రణభీరువగు క్షత్రియుడు,

స్వధర్మపరాఙ్ముఖులగు వైశ్యశూద్రులు, విరక్తుడుగాని యతియు, భర్తృ విరుద్ధాచారయగు భామినియు, భగవద్భక్తుడుగాని మానవుడును శోచనీయులు. కాన నీవు వీతశోకుడవై మీతండ్రిగారిరాజ్యమును, పాలింపుము. మీతండ్రిగారియాజ్ఞచే మీయన్న వనమున కేగెను. రామవియోగముచే మీతండ్రిగారు దివంగతులైరి. రాజ్యము రాజకమైన ప్రజలు నిశ్చింతముగ నుండజాలరు. క్షత్రియునకు ప్రజాపాలనము పరమధర్మము. మీతండ్రిగారియభిప్రాయము నట్టిద. కాన నీవుశోకమునువీడి ప్రజలపాలింపుము. అట్లయిన స్వర్గస్థుడగు దశరథుడు, వనస్థుడగు రామచంద్రుడు, పౌరసామంతాదిప్రజలు, కౌసల్యాది మాతృజనమును సంతసిల్లెదరు. అన నాతనిమాటలననుసరించి మంత్రులు నచ్చెబలికిరి. ఇంతలోకౌసల్య తిరిగియిట్లనెను. భరతా! విచారముమాని గురువు చెప్పినట్లుచేయుము. గురువుమాట, తండ్రిమాట తిరస్కరింపరాదు. మమ్ములను ప్రజలను దుఃఖదూరుల చేయుము. నీవైన నింటనుందువని సంతోషించుచుంటిని. కాలగతిని తప్పించువా రెవరున్నారు? కర్మలననుభవింపక తప్పదు. ఎవరిదోషమును లేదు. భరతుడు కౌసల్య అవ్యాజప్రేమనుజూచి శోకమును పట్టజాలక చైతన్యహీనుడై కొంతసేపటికి తెలివినొంది సరే! మీయాజ్ఞ శిరసా వహించెదను. అంత గురూపదేశమునను కౌసల్య మాటలవలనను భరతుడూరడిల్లి, ముకుళితకరకమలుడై మెల్లన నిట్లనియె. గురువర్యా! తాముమా క్షేమమును, ప్రజలక్షేమమును గోరి దూరదృష్టితోచెప్పిన హితోపదేశమును వింటిని. తలిదండ్రులు, గురువు, ప్రభువు, ఆజ్ఞ పాలించుట విధియైయున్నది. కాని నామనసు బాగులేదు. దుఃఖితుల కుచితానుచితవిచారము లుండవు. ఏమిచేయ వలయునో నాకుతోచుటలేదు. ఎటుజూచినను ధర్మము చెడిపోవుచున్నది. సీతారాములచూడనిదే నేనేధర్మములను పాటించలేదు. సీతారాముల వీడిన ధర్మము, వస్త్రములేని ఆభరణములు. విరక్తిలేని బ్రహ్మవిచారము, రోగికి భోగాలంకారములు, భగవద్భక్తి లేని జపతపయోగములు, జీవము లేని తనువు, ఇవన్నియు నిష్ఫలములయినట్లు, రాముడులేని అయోధ్య నాకనవసరము. నాప్రభువునుచూడనిదే నేనొకక్షణమైనయుండలేను. నాఅపరాధములున్న నన్నుక్షమించి వారినిచూచుట కనుజ్ఞయిండని మిమ్ములను ప్రార్థించుచున్నాను. ధార్మికుడగు ప్రాజ్ఞుడు రాజ్యమును పాలింపవలయును. కైకేయీగర్భజాతు

డనై, పితృభ్రాతృవియోగమునకును, పౌరదుఃఖమునకును గారణుడనగు నా వంటి యధార్మికుడెందును నుండడని నాతలంపు. మఱియు సకలభోగములువీడి రామచరణసేవకై వనమున కేగిన లక్ష్మణునిజూచియు నేనెటులరాజ్యమును జేయగలను? నన్ను మీరుమన్నించి యనుజ్ఞనుదయచేసిన నేనారామచంద్రుని సన్నిధికేగి, యాకృపాసింధుని, దీనదయాళుని బ్రార్థించి, నాయపరాధమును నాతల్లియపరాధమును మన్నించి, మఱలనయోధ్యకు దయచేయుమని బ్రార్థించెదను. ఆకృపానిధి నాప్రార్థనము నంగీకరించుననుకొనుచున్నాను. తామెంత జెప్పినను రామదర్శనాభిలాషయగు నాహృదయము రాజ్యమునిచ్చగింపకున్నది. క్షమింపుడు. రామదర్శనానంతరము గర్తవ్యము నిర్ణయింతము. రామదర్శన విలంబమును నాహృదయ మంగీకరింపకున్నది. కాన నాకురామునిదర్శించుట కనుజ్ఞను బ్రసాదింపుడను భరతునివాగమృతమును శ్రోత్రపుటములగ్రోలి, భరతుని యవ్యాజమగు ప్రేమకు, భరతుని ప్రార్థనమువలన మఱల రామచంద్రుడిటకువచ్చుననుచు సంతోషించుచు, భరతా! నీవు దృఢవ్రతుడవు. నీవుజెప్పినదియు నుచితముగనే యున్నది. అట్లే గావింపుమని అచటివారెల్ల భరతుని గమనమున కామోదమును దెలిపి ఇట్లనిరి. భరతా! రామభక్తిభరతా! రాముడుప్రాణాధికుడవగు నిన్నేలప్రేమింపడు. నీతల్లిస్వభావమును నీయందెవడు నాపాదింపడు. సర్వజన్యమగుమణి సర్పవిలక్షణస్వభావముకలదై సర్పవిషమును హరించును. అట్లేనీవలనకైకనుండివచ్చిన యుపద్రవముశాంతించును. నీవుతప్పక రామదర్శనార్థము బ్రయాణముగమ్ము. మేమును నీవెంటవచ్చెదము. మమ్మా శోకసముద్రమునుండి యుద్ధరింపుము. మేమాఘనశ్యామని దర్శనమునకై చాతక ములవలె నిరీక్షించుచుంటిమి. అని ప్రయాణ కృతనిశ్చయులై ఇట్లనుకొనుచుండిరి. భరతుడు ధర్మాత్ముడు. తల్లి కలంకమును గడిగివేయుచున్నాడు. ఆతని వలన మనకు మఱల రామదర్శనభాగ్య మబ్బుచున్నది. మన జీవితములు ధన్యములని బ్రయాణమున కనువగు సాధనముల సమకూర్చుకొనుచుండిరి. అంత భరతుడు వారల యుత్సాహమునకు సంతసించుచు మూలబలమును రావించి వారలతో నిట్లనియె. ఓసేనాపతులారా! ఇది శ్రీరామచంద్రుని రాజ్య సంపత్తు. ఆప్రభువు ప్రస్తుత మిట లేడు. కాన మన మప్రమత్తులమై దీనిని గాపాడవలయును. అట్లు కానియెడల మనము స్వామి కపకార మొనరించిన

వారల మగుదుము. కాన నేను రామచంద్రునికడ కేగి మఱలివచ్చునంతవరకు మీరతిజాగరూకతతో నీరాజ్యసంపదను గాపాడవలయు నన వారందుల కంగీక రించిరి. పిమ్మట రామవియోగఖిన్నమానసయగు కౌసల్యకడ కేగి తన ప్రయా ణమును వినుపింప నామెయు రామదర్శనము నభిలషించెను. అట్లే కైకేయీ సుమిత్రలకును రామదర్శనాభిలాష కలదని ఎఱింగి తల్లుల ప్రయాణమున కను వగు యానముల సిద్ధముచేయుడని యాదేశించి మంత్రుల రావించి వారితో నిట్లనియె. మనము వనముననే రామచంద్రునికి రాజ్యాభిషేక మొనరించి తోడి కొనివత్తము. కాన రాజ్యాభిషేకమునకు దగిన సంభారముల సిద్ధముచేసి మనతో గొనిరావలయునన వారెంతేని సంతసించుచు నభిషేకసామగ్రి సిద్ధము చేసి రథగజతురంగాదుల నాయత్తముచేసి ప్రయాణసమయమునకై నిరీక్షించు చుండిరి. అంత ప్రొతఃకాల మగుటయు ప్రయాణసూచకమగు భేరీధ్వనిని వినినతోడనె ముందుగ వశిష్ఠమహర్షి యరుంధతీసహితుడై యగ్నులతో విప్ర బృందము వెంటరా రథము నధిష్ఠించెను. పిమ్మట నగరవాసులు తమ తమ యానములతో బయలుదేరిరి. అటుపిమ్మట నుచితపరివారముతో నర్హాములగు పల్లకీలతో మువ్వురుతల్లులు వారివెంట చతురంగసేనాసమేతులగు మంత్రిపుంగ వులు వారితో గలిసి సామంతులును బయలుదేరిరి. ఇట్లు వారి నందఱ సాగ నిచ్చి భరతశత్రుఘ్నులు పాదచారులై వచ్చుచుండిరి. అట్లరుదెంచువారల జూచి మంత్రిసామంతాదు లందఱును పాదచారులై నడచుట జూచి, కౌసల్య తన శిబిక నాపి భరతుని జేరబిలిచి, తండ్రీ! నీవిట్లు పాదచారివగుట సరికాదు. నీవు పాదచారివగుటచే నందఱును నడుచుచుండిరి. ఇట్లయిన మన ప్రయాణము సాగనేరదు. కాన నామాట విని మీరిరువును రథాధిరూఢులుగండన దల్లి యాజ్ఞ ననుసరించి వారును రథాధిరూఢులై ప్రయాణమును సాగించుచు మొదటి దినమున దమసానదీతీరమున నివసించి, రెండవదినమున గోమతీనదీతీరమున స్కంధావారము నాపి యుచితాహారముల గ్రహించి, భోగముల త్యజించి నియమనిష్ఠులై రామదర్శనము నభిలషించుచు మూడవదినమున శృంగిబేరపుర మును సమీపించిరి. భరతుని యాగమనమును విని గుహు డిట్లు వితర్కింపసా గెను. ఇపు డిట్లు చతురంగసేనాపరివృతుడై భరతు డిట కేలవచ్చెను? ఈతడు కైక కొడుకు. గాన దల్లి రాజ్యభ్రష్టుని గావించిన రామచంద్రుని హింసింప

నెంచి వచ్చియుండనోపు. రాజ్యమెంతమోహమును గలిగించుచున్నది. ఇంద్రాదులకైనను దుర్జయుడగు రామచంద్రు నీభరతు డెట్లు నిర్జింపగలడు? ఈతడు కేవల మనాత్మజ్ఞుడు. భరతు డిట్లువచ్చుటలో నాశ్చర్య మేమియును లేదు. విషవల్లి కమృతఫల మెట్లుద్భవించు నని పరిపరివిధముల నాలోచింపుచు స్వజనముతో నిట్లనియె. మీరందఱును పోయి శేవుల ధ్వంసముజేసియు నావల ముంచియు భరతుడు గంగను దాటకుండునటుల జేయుడు. అవసర మయినచో మరణమునకు భయపడక భరతు నెదుర్కొనుడు. రామకార్యార్థము గంగాతీరమున సంగ్రామమున మరణము దుర్లభము. శరీరములు నశ్వరములు. కీర్తి శాశ్వతమయినది. భరతుడు రామచంద్రునికి సోదరుడు. నీచులమగు మన కాతనిచేతిలో మృతినందుటకన్న నేమికావలయును? రామకార్యమునకై యసువుల నర్పించువాడు శాశ్వతకీర్తిని గడించి సద్గతిని బడయగలడు. రామభక్తుడు గాక సజ్జనులలో బరిగణింపబడనివాని జీవితము వ్యర్థము. అని వారల కుత్సాహమును గల్పించి తానును రామచంద్రుని స్మరింపుచు నమితోత్సాహముతో ధనుర్బాణముల ధరించి తన యనుచరులనందఱు యుద్ధసన్నద్ధులు కండన వారు నమితోత్సాహముతో. జయము రామా! యని బలుకుచు, దమ ఏలికకు నమస్కరించి, కవచముల ధరించి, ధనుర్బాణములబూని, వివిధాయుధోపేతులై సిద్ధముగ నుండిరి. అట్లు యుద్ధాభిముఖులగు వారల జూచి గుహుడు ప్రత్యేకముగ వారల నందర బరామర్శించి, ఇట్లనెను. మిత్రులారా! మన మిప్పుడొక ఘనకార్యమును జేయబూనితిమి. కాన మీరప్రమత్తులై ప్రవర్తింపవలయునన వారిట్లనిరి. ప్రభూ! మీరు శంకింపవలదు. మాకంఠములలో ప్రాణములున్నంతవఱకు నిర్భీకముగ బోరాడి శత్రుసైన్యముల జెండాడెదము. ఇదె మీపాదముల నంటి చెప్పుచుంటి మన నతడు మిగుల సంతసించి రణభేరిని మ్రోయింపుడన నంతలో నాతని వామపార్శ్వమున నెవరో తుమ్మిరి. తోడనే శకునవేత్తల నడుగ వారు మీకు జయ మగునని చెప్పిరి. అంత నొక వృద్ధుడు గుహునితో నిట్లనియె. ప్రభూ! మీకిపుడు యుద్ధ మనవసరము. భరతు డిపుడు రామచంద్రుని దర్శనార్థ మేగుచున్నాడు కాని యుద్ధమునకు గాదన గుహు డాలోచించి తన మూర్ఖత్వమునకు విచారించుచు భరతుని హృదయము దెలియక నేనెంత పొరబడుచుంటిని. అని తన మూర్ఖత్వమునకు దాను

సిగ్గుపడుచు దన సేవకుల బిలిచి, ఓయీ! మీరు రేపుకడ సిద్ధముగ నుండుడు. నేను ముందుగ బోయి భరతుని యభిప్రాయమును గమనించి వచ్చిన పిమ్మట కర్తవ్యమును నిశ్చయింతమని భరతసందర్శనమునకై బయలుదేరుచు నతనికి నుపహారముగ గందమూలఫలాదులను, మంచిమంచి మృగమాంసములను, రక రకములైన చేపలను, వేఱువేఱుగ విభజించి, సేవకులచే బట్టించుకొని భరత దర్శనార్థమై బోవుచుండ నాతనికి శుభశకునము లగుచుండెను. అట్లు చని దూరమునుండియే వశిష్ఠునకు నమస్కరించి తన రాక నెఱింగింప నీతడు రామ భక్తుడని యెఱింగి, ముని యాతనిని దీవించి యాతనిని భరతున కెఱింగింప భరతు డాతని గౌరవించెను. భరతుని జూచినతోడనె గుహు డాతనికి దన జాతి నామ గ్రామముల నెఱిగించి సాష్టాంగనమస్కార మొనరింప నాతని భక్తి గౌరవములకు మెచ్చి, లక్ష్మణుని జూచినట్లానందించుచు నాతనిని గాఢలించెను. ఇట్లు పరస్పరాలింగితులగు గుహభరతులపై పూలవానను గురియింపుచు దేవత లిట్లనుచుండిరి. భగవద్భక్తుల కెందును జాతిభేదముగాని నీచోత్తమ భావము గాని లేదు. గంగాప్రవాహము తనతోగలిసిన ముఱికినీటిని వేఱుచేయక దనలో గలిపికొని పవిత్రింపజేసినట్లు భగవద్భక్తి ఏజాతివానినైన నుత్తముని జేయును. భగవద్భక్తిలేని యుత్తమజాతిసంభవునికన్నను, భగవద్భక్తుడగు యధమజాతి వాడె ఘనుడు, వంద్యుడు, నను వారిసల్లాపమును విని యచటివారు మిగులసంత సింపుచుండిరి. అంత భరతుడు గుహుని గుశలమునడుగ దానంతకుముందు జేయబూనిన కృత్యమును దలంచిలజ్జితుడై కొంతవడికి ధైర్యమూని ముకుళిత కరకమలుడై ఇట్లుబలికెను. ప్రభూ! సకలశ్రేయోనిధానమైన తమపదకమల దర్శనముచే మాకెల్లరకు క్షేమమే. తమయనుగ్రహముచే నాకులమంతయు తరించెను. రామచంద్రుడు నాయందుజూపిన యనుగ్రహము చిరస్మరణీయము. నేను జాతిక్రియాగుణములచే హీనుడ నయినను రామానుగ్రహముచే లోకమా న్యుడనయితిని. అనునంతలో శత్రుఘ్ను డటకురాగా నతనికి నమస్కరించెను. పిమ్మట కౌసల్యాదులకు నమస్కరించి వారలచే నాశీస్సులనంది, యయోధ్యా వాసుల మన్ననలవడసెను. పిమ్మటగుహుడు వారలకచటి విశేషములజూపుచు దనసేవకులచే వారల కనువగునివాసముల గల్పింప వారటసుఖముగ నుండిరి. శృంగిబేరపురమును జూచినతోడనె భరతుడు రామునిస్మరించుచు గుహునిత్తో

గూడి యచటివిశేషముల జూచుచుండ వినయానురాగములు శరీరమునుధరించి చనుచున్నట్లుండెను. గుహుడు రాముడునివసించినప్రదేశముల జూపుచుండ భరతుడు మున్నగువారు రాముని దర్శించిన ట్లానందించుచుండిరి. అట గంగను జూచి అందుస్నానముజేసి నమస్కరించి, తల్లీ! మాకుదామచంద్రునం దచల భక్తిని ప్రసాదింపుమనిప్రార్థించిరి. భరతుడు వసిష్ఠానుమతిని దల్లుల గంగలో స్నానము చేయించెను. భరతుడంత శత్రుఘ్ననకు దల్లులనప్పగించి గుహుని తోగూడి మఱలరాముడు వసించినప్రదేశముల జూచుచు వాటికిభ్రణమిల్లుచు శోకావేగమున ఖిన్నుడై గుహునితో నిట్లనియె. మిత్రమా! నామూలమున సీతారాముల కెట్టిఇక్కట్లు వాటిల్లినవి? జనకచక్రవర్తికి ముద్దుకూతురు, దశరథునికి పెద్దకోడలు, రామచంద్రుని యర్థాంగియు, నయోనిజయు నగు పతివ్రతాశిరోమణి కిట్టి కఠినశిలాతలము శయ్యయైనది చూచియు నాగుండెవ్రయ్యలుగాకున్నది. ఎంత కఠినమయినదోగదా! మఱియు నాతమ్ముడగు లక్ష్మణుడు సుకుమారగాత్రుడు. అట్టివాడీ యరణ్యవాసక్లేశము ననుభవించుచుండుట జూచియు నాప్రాణములిట్లు యుండుటకన్న వింతయేమిగలదు? ఎవని జన్మమువలన ప్రపంచమంతయు సంతసించుచుండెనో, ఎవనిగుణములను శేష శారదలుగూడ వర్ణింపజాలరో, ఎవండు పరదుఃఖముల సహింపజాలడో, ఎవనిని దశరథుడు, తల్లులు, ప్రజలు ప్రాణాధికముగ జూచుచుండిరో! అట్టి శ్రీరామచంద్రునకు నామూలమున నింతటిదుర్దశవాటిల్లినది. హతవిధీ! నిన్నేమన వలయును? సీతారాముల కిట్టివనవాసక్లేశమును గల్పించిన నీకసాధ్యమేదియు, లేదుగదా! అని దుమ్మెత్తిపోసెను భరతునోదార్చుచు గుహుడిట్లనియె. ప్రభూ! నీవు విచారింపకుము. రామచంద్రుడు సర్వము నెఱుంగును. కాన నీయందా తనికిసుమంతయు నప్రీతియనునది లేదు. ఇట నున్నంతకాలము నీగుణగణముల నుగ్గడించుచునే యుండెను. కాన నిన్నాతడు తప్పకబ్రోవించును. ధైర్యము నవలంబించి నీవాతని దర్శింపుము. నీకు తప్పక శుభములు చేకూరు నన గుహునివాక్యములవలన ధైర్యమునూని భరతుడు రామునిస్మరింపుచు తనగుడా రమునకేగెను. అయోధ్యాపురవాసులు రాముడు సంచరించిన తావులన్నిటిని జూచి భక్తివినమ్రులై పూజించి, దశరథుని కొనియాడుచు, కైకను నిందించుచు రాముని సుగుణముల గొనియాడుచు నారాత్రినంతను గడిపి తెల్లవారినతోడనె

ప్రయాణోన్ముఖు లైరి. అంత గుహుడు వారల కనువగు నావల సిద్ధము చేయగా వార లందఱు నుచితరీతిని నావల నధిష్ఠించినపిమ్మట నతిభద్రముగ వారల నందఱ గుహు డావలియొడ్డునకు జేర్చెను. అట్లందఱు చేరుట గని వారందఱు నట ప్రాతఃకాలకృత్యముల దీర్చికొనినపిమ్మట గుహుడు ముందుగ జనుచు మార్గమును జూపుచుండ, ముందు బ్రాహ్మణబృందముతో గూడిన వశిష్ఠుడు, పిమ్మట తల్లులు, పిమ్మట మంత్రిసామంతాదిపౌరులు క్రమముగ సర్వసైన్యములతో గలిసి శత్రుఘ్నుడును జనుచుండిరి. వారివెనుక భరతుడు పాదచారియై జనుచుండెను. సూతుడు రథమును దెచ్చి యతనియొద్ద నుంచెను కాని రామచంద్రుడు పాదచారియై నడచిన యీప్రదేశమున నేను రథాధిరూఢుడనై ప్రయాణమును జేయనని చెప్పి పాదచారియై మూడవజామునకు ప్రయాగను జేరుకొనిరి. కాలినడకచే కమిలిపోయిన భరతుని పాదముల జూచి వారందఱు మిగుల దుఃఖించుచుండిరి. అట్లు వారందఱు ప్రయాగకుజేరి త్రివేణీస్నాన మొనరించినపిమ్మట భరతుడు త్రివేణీసంగమమున విధిప్రకారము స్నాన మాచరించి యనేకదానముల జేసి, చేతులు జోడించి యిట్లనియె. ఓసర్వకామప్రదమగు తీర్థరాజమా! నీప్రభావము జగద్విదితము. భ్రాతృపితృవియోగఖిన్నుడ నగు నేను భూలోకకల్పకమగు నినున్నొకటి వేడుచుంటిని. నాకెన్ని జన్మములం దైన రామచరణకమలభక్తి నశింపకుండున ట్లనుగ్రహింపుము. నాకింకేమియు నక్కర లేదు. రామచంద్రుడు నన్న కుటిలుడని ప్రేమించునట్లును, ప్రజలు నాదోషము లేదని గ్రహించునట్లును కటాక్షింపుము. చాతకము మేఘమునందువలె నా హృదయ మా మేఘశ్యాముసియందు లగ్న మగునట్లు ప్రసాదింపుము. అను నాభరతుని పలుకులు విని యాత్రివేణి మధ్యనుండి ఒక గంభీరమగు వాక్కు వినబడెను. భరతా! నీవు చింతింపకుము. రామునకు నీకన్న నెక్కుడు ప్రేమాస్పదమయిన వాడింకొకడు లేడు. నీకు రామపదకమలములయం దచంచలమగుభక్తి శాశ్వతముగ నుండుమనుచు త్రివేణిపలుకుల విని భరతుడు పులకితగాత్రుడై యానంద పరవశుడై యుండ నాతనిపై దేవతలు ధన్యవాదములతో పూలవాన గురియించిరి. ప్రయాగవాసు లందఱును భరతుని శీలమును గొనియాడుచు రాముని గుణగణముల వర్ణించుచుండ భరతుడు సంతసించుచు, మునిశ్రేష్ఠుడైన భరద్వాజుని యాశ్రమమునకు జని యాతనికి దండప్రమాణ మాచరింప నాతని

జూచి, భరద్వాజుడు లేవనెత్తి కౌగలించుకొని యుచితాసనమున గూరుచుండ నియమించెను. భరతు డాయాసనముపై గూరుచుండి లజ్జావనతవదనుడై ఏమియు బలుకకుండుట జూచి ముని ఇట్లనియె. రఘుకులాగ్రణీ! నీవు చింతింప బనిలేదు. దైవము దుర్లంఘ్యము. రామ వనవాసమునకును, దశరథుని మరణమునకును, నీవుకాని, నీతల్లికాని కారణము గారు. దశరథుడు తన శాపమువలన నట్లు మరణించెను. దేవకార్యార్థమై సరస్వతి నీతల్లిముఖమం దుండి అట్లు బలికించెను. కాని నీతల్లి ఏపాపము నెఱుగదు. కాన మీరిరువురు నిర్దోషులు. రామచంద్రునకు నీయం దపారమగు ప్రేమకలదు. నీకాతనియం దవ్యాజమగు భక్తికలదు. రామచంద్రుని కీర్తివలె నీకీర్తియు జగద్విఖ్యాతము కాగలదు. నీవిమలయశోనిశాకరు డుదయాస్తమయములులేక నిత్యపరిపూర్ణుడై భానుప్రతాపవివర్ణుడుగాక సైంహికేయుని నోటబడక ప్రపంచమున్నంతకాలము వృద్ధిహ్రాసములులేక దివారాత్రములు ప్రకాశించును. స్మరణమాత్రమున సకల దోషములనుహరించి సకలమంగళముల నొసంగెడి గంగను దెచ్చిన భగీరథుని వంశమునజన్మించితివి. ఎవనిని శివుడుసర్వకాలములందును భజించుచుండునో, అట్టిభగవంతు డెవనిభక్తిప్రేమలకు వశుడై తనగర్భమున జనించెనో, అట్టి దశరథునిపుత్రుడవు. రామచంద్రుని కనుజన్ముడవు. నీవలనమేము శ్రీరామచంద్రుని దర్శింపగలిగితిమి. ఆయనమూలమున నిన్నుజూడగలిగితిమి. మా ప్రయాగవాసులవఁడఱుము ధన్యులమైతిమను మునిమాటలకు సభాసదులానందమగ్నులైరి. భరద్వాజుని పలుకులుసత్యమని దేవతలు పుష్పవృష్టిని గురియించిరి. ఆసన్నివేశమును జూచి భరతుడానందాశ్రుపూరిత నయనుడై చేతులుజోడించి, మృదుమధురవాక్కులతో నిట్లనియె. మునిచంద్రమా! ఈతీర్థరాజమున నీబ్రహ్మసభలో నేను యదార్థమును మనవిచేయుచున్నాను. చిరకాలము ప్రజలబాలించి సకలభోగముల ననుభవించి, సత్కర్మల నాచరించి, తుదకు రామవియోగమును సహింపజాలక యసువులగోల్పోయిన మాతండ్రిగారి మరణమునకు నేనంతగ జింతించుటలేదు. ఆయన అన్నివిధములధన్యుడు. కాని సీతారామలక్ష్మణులు మునివేషధారులై పాదచారులై వనమందుసంచరించుచు గందమూలాదుల నారగించుచు, స్థండిలశాయులై శీతాతపములవలన బాధలనందుచుండుటకు నాహృదయము చాల బాధపడుచున్నది. దీనికి నేనే

మూలము. నాకై నాతల్లిదుర్బుద్ధియను కుఠారముచే దశరథకల్పవృక్షమును కూలద్రోసి వరఖడ్గముచే ఖండించి, నన్ను అయోధ్యాకూపమున బడవైచి, యయోధ్యను భీభత్సముగ జేసెను. తిరిగి రామచంద్రుడు వచ్చునంతవఱకు నా యయోధ్య అంధకారబంధురమును శోకమూర్తియు ననివిలపించు నాభరతుని యౌదార్యభక్తిప్రేమల కచటివారాశ్చర్య పడుచుండిరి. అంత భరద్వాజు డాతని నుపశాంతవచనములచే నూరడించి, ఇట్లనియె. రాజపుత్రా! నీవు నేడు మాకతిథివై తివి. కాన నాయాతిథ్యమును కాదనక స్వీకరించి పిమ్మట రాముని దర్శింపుము. దాన నీదుఃఖములన్నియు శాంతించును. అననంతట భరతుడే మియుననజాలక యాతని యాతిథ్యమున కంగీకరించెను. అంతభరద్వాజు డణి మాదిసిద్ధుల స్మరించినతోడనె యాసిద్ధులతనికి సాక్షాత్కరించెను. తోడనె యాసిద్ధులు భరద్వాజు నభిమతమునెఱింగి రామోపజీవుల నర్చించుభాగ్య మబ్బినదని సంతసించుచు, వారలకనువగు నివాసములగల్పింప నానివాసముల సౌష్టవమునకు విశ్వకర్మ లజ్జింపుచుండెను. అచటి భోగ్యపదార్థముల జూచి యమరు లచ్చెరువందుచుండిరి. ఇట్లాసిద్ధులు క్షణములో నటగావలసిన సకల పదార్థములను సిద్ధముజేసిరి. స్వప్నమందైనను కనివినియెరుగని దేవదుర్లభము లగునావస్తువులజూచి భరద్వాజుని తపస్సిద్ధికి సకలమునులాశ్చర్యమందుచుండిరి. అయోధ్యాపురవాసు లెక్కడనుందురనది ఏమిచేయుచున్నదియు దెలియక విస్మితు లగుచుండిరి. భరతున కనువగునివాసమును అటనుండెడి వస్తుజాతమును జూచి ముని తపోమహిమకు బ్రహ్మాదులు విస్మితులగుచుండిరి. భరతుడు ముని ప్రభా వమును జూచి, లోకపాలుర యైశ్వర్యమయినను దీనికి సరికాదని తలపోయు చుండెను. ఎటుజూచిన నందమైన పూలతోటలు, అందు పద్మసరస్సులు, వాని యందు అనేకరకములగు జలవిహంగములు, ఫలకుసుమభరితములగు వృక్ష ములు, మున్నగువానిని జూచి ఇంద్రునకు నచటి భోగములందాసక్తి కలుగు చుండెను. ఇట్లు సకలభోగములను చక్రవాకాంగనతో భరతుడను చక్రవాక మును భరద్వాజు డాశ్రమపంజరమున బంధించెనే కాని రామభానువియోగ దుఃఖితుడగు భరతు డీభోగముల ననుభవింపనొల్లక రాముని స్మరించుచుండ గనే దెల్లవారజొచ్చెను. అంత భరతుడు స్నానసంధ్యాదికృత్యముల నిర్వ ర్తించి భరద్వాజునకు ప్రణమిల్లి యాతని యాశీరనుజ్ఞలనంది, శిష్యోపదిష్ట

మార్గమున గుహుని భుజముపై చేయినిడి ప్రయాణమును జేయుచుండ భక్తి ప్రేమల జంటవలె గాన్పించెను. అట్లు భరతుడు ఛత్రపాదుకల విడిచి, వ్రత నియమము నవలంబించి, రామస్మరణమును జేయుచు, రాముడాగిన ప్రదేశముల గుహునివలన దెలిసి చూచుచు, శోకసంతప్తమానసుడై జనుచుండ దేవత లాతనిపై పూలవాన గురియించిరి. ఎండబాధ లేకుండ మేఘములు వ్యాపించు చుండెను. శీతలసుగంధమందమారుతములు వీచుచుండెను. భూమి తన సహజకాఠిన్యమును వీడి మృదులమయ్యెను. పంచభూతములు రామునికన్నను భరతునికే మిక్కిలి యనుకూలములయ్యెను. కాని రామదర్శనలాలసుడగు భరతునకీప్రయాణ సౌకర్యమేమియును గోచరింపదయ్యెను. రామదర్శనము వలన సకలదురితవినిర్మలములయిన యచటి ప్రాణివర్గము భరతుని దర్శనము వలన నపరిమితానందము నందుచుండెను. అట్లనన్యమనస్కుడై రాముని ధ్యానించుచు ప్రయాణమునుజేయుచున్న భరతునిజూచి, స్వార్థతత్పరుడగు నింద్రుడిట్లు తలపోయసాగెను. భరతునియందు రామునకు వాత్సల్యము మెండు. ఈతని యభ్యర్థనమును ద్రోసిపుచ్చజాలక రాముడయోధ్యకేగిన దేవకార్యము చెడిపోవును. అని విచారించుచు దనగురువగు బృహస్పతితో నిట్లనియె. గురువర్యా! ఈభరతుడు రామునియొద్దకేగినచో మన కార్యమునకు భంగమువాటిల్లును. కాన రామభరత సమాగమము గాకుండు నుపాయమును జింతింపుడను సుత్రామునివాక్యముల విని, ఈతడు సహస్రాక్షుడయినను అంధుడే యని గ్రహించి దేవగురు డిట్లనియె. సుత్రామా! నీవీదురూహను విడువుము. రామభక్తులయెడ మనమాయలు పనికిరావుసరికదా! మనమే తుదకు మోస పోవుదుము. భక్తపరాధీనుడగు రామచంద్రుడు స్వాపరాధమున్నైన సైరించును కాని భక్తాపరాధమునుమాత్రము సహింపడు. భగవంతునకు భక్తులకన్న నాప్తులుగాని బంధువులుగాని లేరు. భగవంతుడు రాగద్వేష సుఖదుఃఖ సర్వకర్మరహితుడై, స్వపరభేదములేక ఏకరసస్వభావుడై, ప్రాణికర్మానురూప ములగు ఫలముల నిచ్చుచుండును. మఱియు నాతడు సహజముగ నిర్గుణు డైనను భక్తానుగ్రహార్థము, ధర్మస్థాపనముకొఱకును, దుష్టనిగ్రహ శిష్ట రక్షణమునకును, మాయామానుషరూపమును ధరించి యీలీలల జూపుచుం డును. కాన రామభక్తుడగు భరతుని వంచింపనెంచుట తగని తలంపు. రామ

భక్తులు పరులదుఃఖమును సహింపరు. కాన నీవు భక్తాగ్రగణ్యుడగు భరతుని భయమందనక్కరలేదు. భగవంతుడైన రామచంద్రుడు తన ప్రతిజ్ఞను విడువక మనకార్యమును నెరవేర్చును. భరతుడురామాజ్ఞనుమీరువాడుకాడు. అనునాతని మాటలవినితనయజ్ఞానముదోలగినతోడనె ఇంద్రుడుప్రముదితాంతరంగుడై భరతు నిపై పూలవానగురియించెను. భరతునిఏకాగ్రతనుజూచిమునులు లజ్జించుచుండిరి. భరతుని యుచ్ఛ్వాసనిశ్వాసములుసయితము భక్తిభరితములై దోచుచుండెను. అట్లు ప్రయాణమును సాగించుచు మార్గమధ్యమున యమునానదిని జూచినతో డనే రామచంద్రుని దేహచ్ఛాయ స్మృతిపథారూఢమగుటచే భరతుడు కొంత తడవు చింతించి, మఱల ధైర్యము నవలంబించి ఆదినమంతయు యమునాతీర మున విశ్రమించెను. మరునాడుదయమునను గుహునిచే నియుక్తములయిన నావలతో సపరివారముగ యమున నతిక్రమించి, అట స్నానాదికృత్యముల నిర్వర్తించి యమునకు ప్రణమిల్లి సపరివారముగ గుహునితో గలిసి ప్రయాణ మును జేయుచు, ముందు వశిష్ఠుని, నావెనుక కౌసల్యాది రాజు భార్యలను, పిమ్మట పరివారమును నియమించి తుదకు భరతశత్రుఘ్నులు గుహుడు నడచు చుండిరి. అట్లు సేవకులు వెంటరా సీతారామలక్ష్మణుల స్మరింపుచు, వారాగిన తావుల దర్శించుచు బోవుచుండ వీరి రాకను విని యచటి స్త్రీలు వచ్చి వారిని జూచి సంతసించుచు నిట్లనుకొనుచుండిరి. చెలీ! వీరు రామలక్ష్మణులవలె నున్నారు. కాని సీత లేకుండుటచేతను, హృదయగత శోకముచే ఖిన్నవదను లగుటచేతను వారుమాత్రము కారు. కాని యీపరివారమును, నేనను జూడ వీరు రాజపుత్రులుమాత్ర మగుదురన మఱియొకతె ఇట్లనియె. సఖీ! నాకిట్లు దోచుచున్నది. వీరిరువురు దశరథరాజు తనయులగు భరతశత్రుఘ్నులు. ఇందు భరతుడు పితృలబ్ధమగురాజ్యమునువీడి రామసందర్శనార్థమిట్లేగుచున్నా డన నొకతె, బోటీ! నీమాట మిక్కిలి సమంజసము. మఱియొకరి కీయాపము నింత రామభక్తియు నెట్లుండును? కాని యీతడు కైక కడుపున బుట్టదగిన వాడు కాడన నింకొకతె ఇట్లనియె. ఓసీ! కైక దోషమిం దేమియును లేదు. మన సుకృతపరిపాకమువలన వీరి కీవనవాసము సంభవించెను. అట్లు కానినాడు మన కీదివ్యసుందరమూర్తుల దర్శన మెట్లబ్బును? అని పరిపరివిధముల సంభా షించుచు నెన్నిధినిగన్న పేదలవలె నమితానందము నొందుచుండిరి. భరతుడు

వారి సల్లాపముల వినుచు, రాముని స్మరించుచు, నందందు లభించెడి దీర్థముల గ్రుంకులిడుచు నాశ్రమముల దర్శింపుచు, మునులకు సమస్కరింపుచు, సటనున్న వారల గాంచి సవినయముగ నిట్లనియె. అయ్యా! సీతారామలక్ష్మణు లెటనుం డిరో! దయయుంచి దెలుపుడన నాభరతుని జూచి మనజీవితము సఫలమైనదని సంతసించుచు వారిట్లనిరి. రామభక్తాగ్రేసరా! సీతారామలక్ష్మణులు చిత్ర కూటమున నివసించుచున్నారు. వారల మేము జూచితిమను నాయమృతోప మమగు వాక్కుల విని సంతసించి రాముని స్మరించుచు, ప్రయాణమును. సాగిం చుచు, సాయంకాలమున కొకతావును జేరి యారాత్రి నటగడిపి, ప్రాతఃకాల మయినంతనె ప్రయాణమును జేయుచు, దమకు గలుగుచున్న శుభశకునములకు సంతసించుచు రామదర్శనము తమకు దప్పక లభించునను సంతోషముతో మార్గాయాసమును గణింపక జనుచుండ నదిగో! రామచంద్రుడు నివసించెడి చిత్రకూట మని గుహుడన నాచిత్రకూటమును జూచి హర్షపులకిత గాత్రులై పొంగి పొరలివచ్చు సంతోషము బట్టజాలక పైకి విడుచు చున్నట్లానందాశ్రువులు గారుచుండ నాచిత్రకూటమునకు నమస్కరించి, యీ చిత్రకూట మిపు డయోధ్యకన్నను మిన్నయని బలుకసాగిరి. అప్పటి భరతునియానందము వర్ణనాతీతము. చిత్రకూటసమీపమున బయస్వినీ యను నది ప్రవహించుచుండెను. దానియొడ్డుననున్న సీతారామలక్ష్మణుల నివాస మును దూరమునుండియెజూచి, రావా! నీకుజయమని కేకలువేయుచు హర్ష పారవశ్యమున నడుగులుదొట్రువడ నడువజాలక కొంతదూరమేగి అటననువగు చోటున రాత్రినిట్లోగడిపి, మఱలప్రాతఃకాల మయినంతనె త్వరితగతిని ప్రయాణమారంభించిరి. అట చిత్రకూటమున సీతారాములు రాత్రి సావశేష ముగనుండగనే మేల్కాంచిరి. అంతసీత రామునితో దనస్వప్నవృత్తాంతము నిట్లు చెప్పదొడగెను. నాథా! భరతుడు సేనాసహితముగ నిటకువచ్చెను. ఆతడు మీవియోగముచే గృశించియుండును. అయోధ్యాపురవాసులందఱును వికలమనస్కులై యుండిరి. అత్తలందఱు వైధవ్యము ననుభవించుచుండిరి. కారణమేమైయుండు నన సకలదుఃఖహరుడగు రామచంద్రు డశ్రుపూరిత నయనుడై తమ్మునితోనిట్లనియె. సోదరా! ఇది దుస్స్వప్నము. తండ్రిగారి స్థితి ఎట్లున్నదోగద! యని స్నాన మాచరించి శివునిపూజించి యటనున్న

తాపసులరావించి, వారికినమస్క-రించి వారిశుభాశీస్సులనంది ఉ త్తరాభిముఖుడై జూచునంతనె ఆకసమంతయు ధూళిధూసరమై కాన్పించెను. పక్షులు, మృగ ములు వ్యాకులమంది ఇటునటు చలించుచుండెను. అంతకారణ మేమైయుండు నని నిలుచుండి చూచునంతలో నాటవికులువచ్చి ప్రభూ! భరతుడు సేనాసమే తుడై వచ్చుచున్నవాడని భరతునిరాక నెఱింగించిరి. అట్లు భరతాగమనశుభ వార్తను వినినతోడనె పులకాంకితగాత్రుడు నానందాశ్రుభరిత కమలాక్షుడు నగు రామచంద్రుడిప్పుడిట్లు భరతునిరాకకు, గారణమేమైయుండునో యని తలంచుచు, భరతుని గుణగణములను, వచ్చినతీరునుబట్టి ఏమియుదోపక వ్యాకులమనస్కుడగు రామచంద్రునితో లక్ష్మణు డిట్లనెను. స్వామీ! నాకు దోచినట్లు మనవిచేయుచుంటిని. మన్నింపుడు. ఎట్టి ప్రాజ్ఞునికైనను ప్రభుత్వ ముతోపాటు యవివేకము, లోభము, మదము, దుర్బుద్ధియు, సంభవించును. భరతుడు సజ్జనుడనియు, మీయందు భక్తికలవాడనియు, జగద్విదితము. అయి నను నేడు రాజ్యరమాసక్తుడై స్వభావముమాఱి, తమరొంటరిగ నుండుటను గ్రహించి, రాజ్యమును నిష్కంటకముగ నేలదలచి, సేనాసహితుడై వచ్చు చున్నవాడు. ఎంతయు త్తముడయినను రాజ్యముకొఱకెన్ని యకృత్యములనై నను జేయవచ్చును. లోభికిని, మదాంధునకును యుక్తాయు క్తవివేక ముండనేరదు, చంద్రుడు గురుతల్పగతుడయ్యెను. నహుషుడు మునులచే దనశిబికనుమో యించెను. వేనుడు ధర్మవిరుద్ధముగ బ్రవర్తించెను. మఱియు కార్తవీర్యార్జునుడు. త్రిశంకువు, దేవేంద్రుడును, రాజ్యమదమునజేసిన యకృత్యములు లోకవిది తములుగద. శత్రుఋణాగ్ని శేష ముండరాదనియెంచి భరతు డిప్పుడు మనల నిర్జించుటకై వచ్చియుండవలయు. కాని నాడీసేనలెందుకు? భరతుడు మనల నిర్జించుటకే వచ్చుచున్నాడు. సందియములేదు. కాని బాల్యమునుండియు దమ పరాక్రమమునెఱింగిన భరతునకిట్టివ్యామోహ మెట్లు కలిగెనాయనినాకు విస్మయ మగుచున్నది. కానిండు. వాయుప్రేరితమగుధూళి, జలములచే జల్లార్పనినాడు నెత్తిపై కెక్కును. కాన నుత్తమక్షత్రియ వంశజాతులమగు మనమిప్పుడు వాని దుర్బుద్ధిని దండోపాయనుచే దొలగింపవలయునని జటాజూటమును దృఢ ముగబంధించి ధనుర్బాణతూణీరములధరించి మూర్తిభవించిన వీరరసమువలె, ప్రళయకాల రుద్రునివిలె రామాజ్ఞను నిరీక్షించుచున్న లక్ష్మణునిజూచి,

ఇంద్రాదిలోకపాలుర భయమందుచుండిరి. అపుడశరీరవాణి ఇట్లుబలుకసాగెను. యుక్తాయుక్తముల విచారింపక యేపనినైనను జేయరాదు. తొందరపడినవారు తుదకు పశ్చాత్తాపమునకు పాత్రులగుదురు. ఆమాటల విని లక్ష్మణుడాలో చింపుచుండ సీతారాములు లక్ష్మణుని శాంతింపజేయుచుండిరి. సోదరా! రాజ్యమదమన్నిదుశ్చర్యలకు గారణమను నీమాట సత్యము. కాని యీసృష్టిలో భరతునివంటి సద్గుణసంపన్నుడింకొకడులేడు. భరతుడింద్రపదవినిచ్చినను మదమాత్సర్యాది గుణము లతనినంటజాలవు. సూర్యాగ్నులు చల్లబడినను, మేరువు తలక్రిందయినను అర్ణవసప్తకంబొకటియైనను, భరతుడసన్మార్గగామి ఎన్నటికిని కాజాలడు. ఇక్ష్వాకు కులాలంకారమైన భరతరాజమరాళము, సమ్మిశ్రితములగు గుణదోషక్షీర నీరముల విభజించి, గుణక్షీరములనె గ్రహించును. ఆతని కీర్తిజగద్వ్యాప్తమను రామచంద్రుని శాంతగంభీరవాక్కుల విని, రామచంద్రునివంటి కృపానిధి మఱియొకడులేడని బహువిధముల నాతని దేవతలు స్తుతించిరి. భరతుడు మహానుభావుడు. మహాభక్తుడు. గుణనిధియని వారు వినునట్లుబలికిరి. అంత నామువ్వురు బ్రబసన్నులయిరి. అట భరతుడు పరివారమునంతను పయస్వినీతీరమందుండ నియమించి కృతస్నానుడై గురువులకు నమస్కరించి, వారిచే ననుజ్ఞాతుడై, శత్రుఘ్నుగువాలుదోడరా రామదర్శనమునకై బయలుదేరెను. అట్లు బయలుదేరి మార్గమధ్యమున దన తల్లి దుర్నయమును స్మరించుచు నిట్లుతలపోయుచుండెను. నారాక నెఱిగి సీతారామలక్ష్మణు లీపాపికి దర్శనమీయదగదని మఱియొకతావునకు జనరుగదా! యని శంకించుచు నితడును తనదల్లివంటివాడేయని భావింతురేమోయని దిగులందుచు, నాయవగుణముల మన్నించి నన్నతడాదరింపకుండునాయని యూరడిల్లుచు, రామచంద్రుని చరణకమలములపై బడినగాని నామనోవేదన తగ్గదనియు, చాతకములు తమ నీమమును వీడనట్లు నా మనము రాముని వీడకున్న నంతియెచాలు ననియు పరిపరివిధముల దలపోయుచుండెను. అట్లు తలపోయుచు శిథిలాంగుడై తల్లి దుస్స్వభావమునకు వెనుకాడుచు, రామచంద్రుని స్వభావముదలంచి త్వరగ నడచుచు, సుడిగుండములోబడిన ప్రవాహమువలె గొట్టుకొనుచున్న భరతుని జూచి గుహుడు విస్మితుడై జనుచు మార్గమధ్యమున శుభశకునములగాంచి, వాని ఫలమును దెలిసికొని, రాజపుత్రా! యీశకునములు దొలుత సుఖమును

తుదకు విపర్యయమును సూచించుచున్నవన నతనిమాటల వినుచు నాశ్రమ సమీపమునకు జని అటనున్న వనపర్వతశ్రేణుల గని దరిద్రునకు ధనమబ్బినట్లును, గ్రహబాధితునకు గంగాస్నానము లభించినట్లును సంతసించుచు రాముని చే బాలింపబడుచున్న యావనరాజ్యమును జూచెను. అందు వివేకము ప్రభువు. వైరాగ్యము ప్రధాని. యమనియమములు భటులు. త్రికూటము దుర్గము, శాంతి, పవిత్రతలు రాణులు, మునుల యాశ్రమములు పురములు, నానావిధ మృగములు సేన, మయూరములు నర్తకులు, కోయిలలు గాయకులు, చమరీ మృగములు చామరగ్రాహిణులుగనుండిరి. రామాధిష్ఠితమగు నాశైలమును జూచినతోడనె భరతుడు తపస్సిద్ధినందిన తపస్వివలె సంతసించుచుండెను. అంత గుహుడాతనితో నిట్లనియె. ప్రభూ! ఆతమాల వనరాజినడుమనున్న విశాల వటవృక్షమును దిలకింపుము. ఆవృక్షచ్ఛాయ సర్వకాలసుఖప్రదము. ఆవృక్ష సమీపమున ప్రవహించుచున్న నదీతీరమునందున్న రామచంద్రునిపర్ణ కుటీరమును జూడుము. అటనున్న బృందావనమును, ఆవృక్షచ్ఛాయ యందు సీత నిర్మించిన యా వేదికనుజూడుము. అందు రామచంద్రుడాసీనుడై మునిబృందోపదిష్టములగు పుణ్యగాథల వినుచుండునన నావృక్షవేదికల జూచి భరతశత్రుఘ్నులు కన్నీరు కార్చుచు, జనుచుండ వీరియెడలగల ప్రేమాతిశయమున రామచంద్రుడుమఱలి వచ్చునేమోయని సరస్వతికి సందియమగుచుండెను. ఇట్లు పోవుచు వారు రామ పదచిహ్నముల జూచి దరిద్రునకు నిధి దొరికినట్లానందించుచు, నాచిహ్నముల కన్నుల కద్దుకొనుచు పాదరజమును తలపై దాల్చుచు రామచంద్రుని చూచిన ట్లానందించుచుండిరి. భరతుని గాఢప్రేమను జూచిన గుహుని యడుగులు తడ బడుచుండెను. దేవతలు కుసుమవృష్టిచే మార్గమును మృదులముగ జేయుచుం డిరి. భరతుని జూచి సిద్ధపురుషులు ప్రసన్న లగుచుండిరి. భరతుడను క్షీరసా గరమును, రామవియోగ మందరముచే మథింపగా, సకలభువనక్షేమంకరమగు రామభక్త్యమృత ముద్భవిల్లెనని యచటివా రనుకొనుచుండిరి. వనము దట్ట ముగా నుండుటచే భరతాదు లితరులకు గనుపించుటలేదు. శాంతపావనమగు రాముని యాశ్రమమును జూచినంతనె ముక్తుడగు మహాయోగివలె భరతుడు సకలప్రపంచమును మఱచి యానందమగ్నుడయ్యెను. లక్ష్మణుడు రాము నెదుట చేతులు జోడించి నిలిచియుండగా రామచంద్రు డాతనితో నేమియో చెప్పుచుం

డెను. జటాజూటమును బంధించి, బాణబాణాసనేషుధుల ధరించి మునిబృంద పరివేష్టితులై వేదికపై సుఖాసీనులైన సీతారాములు, శంపావార్షికమేఘముల వలె నుండిరి. మునిమండల మధ్యమున సుఖాసీనులగు నాసీతారాములు భక్తివివే కములవలె భాసిల్లుచుండిరి. అంత భరతుడు గుహునితోడను శత్రుఘ్నునితో డను గలిసి వారి సమీపమునకు వచ్చి, రామచంద్రప్రభో! రక్షమాం! అని పలుకుచు వారి పదములపై బడెను. అట్లు భక్తిప్రేమపరవశుడై దండప్రణా మము నాచరించుచున్న భరతుని జూచి లక్ష్మణు డాశ్చర్యము నందుచు నిశ్చే ష్టుడై నిలుచుండెను. అంత భరతుడు గద్గదస్వరముతో, రామచంద్రా! మహా పాపియగు కైక కొడుకు పరమపవిత్రములగు నీపదసరోజములకు బ్రణమిల్లు చున్నవా డన నాతని భక్తిప్రేమల కమందానందమందుచు రామచంద్రుడు ధనుర్బాణముల నటుంచి దిగ్గున లేచి అట్లు పడియున్న భరతుని లేవనెత్తి గాఢ ముగ గౌగలించుకొనెను. అక్లేకభావమునంది పరమానందమగ్నమగు వారి స్థితి జీవబ్రహ్మైక్యము ననుకరించుచు వర్ణనాతీతమై యుండెను. వారిని దర్శిం చిన యచటివా రందఱు మోక్షావస్థయం దిట్లే జీవులు బ్రహ్మలో లీనమగుదు రని భావింపుచుండిరి. అప్పటి వారి స్థితిని శేషుడైనను వర్ణింపజాలడు. రామ భరతైక్యమును వర్ణింపబూనుట విడిచేతులతో సముద్రమును నీదుటవంటిది. అప్పుడు దేవతలు తమకార్యమువలన విఘ్నము గలుగునని భయమందుచు, గురు వాక్యములచే నూరడిల్లుచు నారామభరతులపై పూలవాన గురియించిరి. అంత రామచంద్రుడు శత్రుఘ్నుని దీరదీసికొని గుహుని బలుకరించి సాంజలిబద్ధు డగు భరతుని మరల గౌగలించుకొనెను. పిమ్మట లక్ష్మణుడు భరతునకు బ్రణమిల్లి సాదరముగ శత్రుఘ్నుని గౌగలించుకొని గుహుని గౌరవించెను. అంత భరతశత్రుఘ్నులు మునిమండలికి బ్రణమిల్లి వారి యాశీస్సులనంది సీతకు నమస్కరింపగా సీత తన పాణిపల్లవముచే వారి శిరముల స్పృశించి యానంద వశమున నోట మాటరాక మనసులోనన వారల దీవించెను. అంత నాసోదరులు నలువురు నానందాంబుధినిమగ్నులై మాటాడజాలక నిర్నిమేషముగ నొకరి నొకరు జూచుకొనుచుండిరి. అంత గుహుడు లేచి చేతులు జోడించి యిట్లనియె. ప్రభూ! మీకులగురువులగు వశిష్ఠమహర్షియు, తల్లులు, మంత్రులు, సేనాధిప తులు, సేవకులు, పౌరులును దమవియోగమును సహింపజాలక తమ దర్శనము

నకై వచ్చియుండిరన సుగుణాకరుడగు రామచంద్రుడు గుర్వాగమనమును విని సీతాసంరక్షణార్థము శత్రుఘ్నుని నియమించి, భరత లక్ష్మణులతో గలిసి వారలజూచుటకుతోడనె బయలుదేరెను. రామలక్ష్మణులు దూరము నుండి గురువులజూచివినమ్రులై నమస్కరింప వశిష్ఠుడుస్వయముగ నెదురుగ వచ్చివారల నత్యాదరముతో దీవించెను. గుహుడంత దననామమునుదెలిపి దూరమునుండియె వశిష్ఠునకునమస్కరింప నాతనిరామమిత్రునిగ నెఱింగి యాత నిని సబహుమానముగ నాదరించెను. అప్పుడు దేవతలిట్లనుకొనసాగిరి. రామ భక్తివంటిపవిత్రమయిన దెందునులేదు. వశిష్ఠునంతవాడు గుహుని నిషాదుడని యెంచక స్వయముగ లేవదీసి గౌరవించెను. రామభక్తులకు జాతిభేదముతో బనిలేదు. అట్లనుకొనుచు నానందమునుబట్టజాలక ప్రూలవానను గుహునిపై గురియించిరి. కరుణానిధియగు రామచంద్రుడు దుఃఖపీడితులగు ప్రజలనందఱి వేఱువేఱుగ బరామర్శించి వారలదుఃఖదూరుల గావించెను. వాఱందఱు రామచంద్రుని దర్శనభాగ్యముచే నానందాంబుధి నోలలాడుచుండిరి. అంత రామచంద్రుడు హిమహతపద్మాలతలవలె కలావిహీనలై కృశించినతల్లుల జూడబోయి ముందుగ కైకకడకేగి యామెకునమస్కరించి, తల్లీ! నీలోపమేమి యునులేదు. దైవమేరికిని దుర్లంఘ్యమని యామె నోదార్చి, పిమ్మట మిగిలిన తల్లులవద్దకేగి నారికినమస్కరించి, తగురీతిని వారలకు హితమును బోధించి, వారియనుమతినివడిసి, గురుపత్నియగు నరుంధతిని మిగిలిన బ్రాహ్మణస్త్రీలను దర్శించి నమస్కరించి వారి దీవనలనందిరి. మఱుల సుమిత్రాకౌసల్యల దర్శించి వారిపాదముల ప్రాలి మాటరాక అట్టెపడియుండ నామె వారినిరువుర జేరదీసి కౌగలించుకొని యశ్రుజల ధారలచే వారిని స్నానముజేయించెను. అప్పుడు రామచంద్రుని దర్శన మబ్బుటచేతను, తనకు సంభవించిన భర్తృ వియో గముచేతను నామెకు గలిగిన హర్షశోకములు వర్ణనాతీతములు. అట్లు రామ చంద్రుడు వారలనందఱను గలిసి భాషించి గురువులవద్దకేగి చేతులు జోడించి, సవినయముగ నందఱి దోడికొని తన యాశ్రమమునకు విచ్చేయు డని ప్రార్థించెను. అప్పుడు గుర్వాజ్ఞానుసారము వారందఱు నచటి పర్వతనదీవన ప్రదేశముల దిలకించుచు సమవిషమప్రదేశముల నతిజాగ్రత్తగ నడచుచు, రామలక్ష్మణ భరతులతోగలిసి క్రమముగ నాశ్రమమును జేరిరి. అంత సీత

అరుంధతీ వశిష్ఠులకు బ్రణమిల్లి వారి యాశీస్సులనంది యత్తల దర్శించెను. సీతను జూచినతోడనె వారు దుఃఖమును బట్టజాలక విలపింపసాగిరి. అంత సీతవారి చరణములకెరగి వారిదీవనల నందెను. వాఁడు వనవాసక్లేశము ననుభవించుచు కృశించిన సీతను జూచి, తమ యవస్థను జూచియు దురపిల్లుచు దైవమును దూరుచుండ సీత వారలకు సంభవించిన దురవస్థకు విచారించుచు వారల చెంగటనె గూరుచుండెను. ఇట్లు పరస్పరావస్థలజూచి విలపించుచున్న వారలంకురితములయిన శోకలతలవలె నుండిరి. అంత వశిష్ఠమహర్షి వారల నందఱ నోదార్చి కూరుచుండ నియమించి తాను నుపవిష్టుడై, క్రమముగ లోకస్థితిని ధర్మమును నిరూపించి ప్రసంగవశమున దశరథుని స్వర్గగమన వృత్తాంతమును వినిపించెను. తోడనె రామచంద్రుఁడు తండ్రి స్వర్గస్థుడగుటకు దానె కారణమని సామాన్యమానవునివలె విచారించెను. వజ్రతుల్యములగు నా మాటలవిని సీతాలక్ష్మణులు దుఃఖించుచుండ వారలజూచి రాణులు పరిజనులును మిగుల విచారింపసాగిరి. అచటి పరిస్థితినిజూడ దశరథు డానాఁడు మరణించినట్లుం డెను. పిమ్మట వశిష్ఠుఁడు వారల నోదార్చి సీతారామలక్ష్మణుల నటనున్న నదిలో స్నానము చేయించి తండ్రిగారి కుత్తరక్రియల చేయుమన నతిశ్రద్ధగ వశిష్ఠో పదిష్టక్రమమున నన్నిక్రియలను సక్రమముగ రామచంద్రుఁడు నిర్వర్తించెను. అట్లు రామచంద్రునిచే నౌర్ధ్వదైహికక్రియలనందిన దశరథు డెంతధన్యుఁడోగద! మఱియు గంగాసంసర్గమువలన నితరజలములు పవిత్రము లయినట్లు రామచంద్రునిచే నిర్వర్తింపబడిన సకలక్రియలు పవిత్రములై నవి. అట్లు రెండుదినములు గడిచినపిమ్మట రామచంద్రుఁడు వశిష్ఠునితో నిట్లనియె. గురూత్తమా! మనవారందఱు నీకందమూలాదుల భుజించుటచేతను వనమునందలి శీతతాపములచేతను గాసినందుచున్నారు. మఱియు నయోధ్య యిప్పుడు రాజు లేకుండుటచే నరాజకమయినది. చిరకాలమునుండి నిర్వక్రపరాక్రమముగల మాపెద్దలచే మాపర్యవేక్షణమున సుసంరక్షితమైన యయోధ్య నేడు నామూలమున నిట్లుండుట కెంతేని విచారించుచుంటిని. కాన తామిపౌరసామంత మంత్రులతో గలిసి భరతుని వెంట నిడికొని తల్లుల దోడ్కొని యయోధ్య కేగి ప్రశాంతముగ బ్రజల గాపాడుడని ప్రార్థించుచుంటి ననుఁ రామచంద్రుని మాటల విని వశిష్ఠుఁడిట్లనియె. రామచంద్రా! నీమాట నిక్కము. కాని నీవియోగదుఃఖముచే బాధ

పడుచున్న వీరల కీవన మయోధ్యకన్న నన్నివిధముల సుఖకరముగ నున్నది. నీసాన్నిధ్యము వారలకు స్వర్గముకన్నను సౌఖ్యావహము. కాన వారల యుత్సాహమునుబట్టి మఱికొన్ని నాళ్ళిట నుండనిమ్ము. అను నాతనిమాటలవిని యయోధ్యావాసులు మిగుల సంతసించిరి. రాముడును గురుని మాటల కెదురాడకుండెను. అంత వారందఱు నావనమందలి మనోహరప్రదేశముల జూచుచు, నదీజలముల స్నానపానాదిక్రియల నిర్వర్తింపుచు, రామచంద్రుని దివ్యమంగళవిగ్రహమును సేవింపుచు, నయోధ్యను సకలప్రపంచమును మఱచి మహాయోగివలె నానందాంబుధి నోలలాడుచుండిరి. అంత నటనున్న యాటవికులు దొన్నెలతో మధువును, బుట్టలతో గందమూలఫలాదులను దీసికొనివచ్చి వారలకు సమర్పించి, వాటి రుచి భేదములు నిరూపించుచుండ, నాపౌరులు వాటిమూల్యముల నడుగ నాటవికు లిట్లనిరి. అయ్యా! పుణ్యపాపవిచక్షణము లేక జీవహింసయే ముఖ్యవృత్తిగా గ్రహించిన మూఢులమగు మాకు శ్రీరామచంద్రుని యనుగ్రహము లభించినది. మానిషాదకులమును రామచంద్రు డుద్ధరించెను. మాకును నాతడే ప్రభువు. కాన సోదరభావముతో మేమొసంగిన ఫలమూలాదుల గ్రహించి మమ్ము గృతార్థుల జేయుడు. మీవంటి యతిథుల సత్కరించుటకు దగిన వస్తువులు మావద్ద నేవియునులేవు. మానవజాతిలో మావంటి నీచు లెందును లేరు. అయినను కరుణామయుడగు రామచంద్రుడు మాపాపముల బాపి మమ్ములను నుద్ధరించెను. రామచంద్రునివలననె మాకు మీయందఱి దర్శనము లభించెను. అను నాయాటవికుల మాటలు విని యయోధ్యాపుర వాసు లిట్లనిరి. సతతము రామచంద్రుని దర్శించుచున్న మీయదృష్టము వర్ణనీయము. మీరెంతేని ధన్యులు. సీతారాముల పదపద్మముల దర్శించుచు వారి నారాధించుచున్న మీరు మాకన్నను మహాయోగులకన్నను మిన్నలని వేరె జెప్పనక్కరలేదు. అని యీవనవాసులతో గలిసి యటనున్న విశేషముల నరయుచు వార్షికమేఘముల జూచి నాట్యమాడెడి మయూరములవలె నయోధ్యాపౌరులు సంచరించుచుండిరి. అట్లు వారు దినము నొకక్షణముగ గడపుచుండిరి. సీతయు దన సేవామాయారూపములచే మువ్వురత్తలను సేవింపుచుండెను. ఈరహస్యము మాయాధిష్ఠానభూతుడగు రామునకు దప్ప నింకెవ్వరికిని దెలియదు. సీతారాముల సరళస్వభావమునుజూచి కైక తన

దుర్నయమునకు దానె పశ్చాత్తాపము నొందదొడంగెను. నేననాయ్యముగ రాముని వనమున కంపితిని. రామవియోగ ఖిన్నుడగు భరతు డయోధ్యను పాలింప నొల్లడయ్యె. రాము డిపుడయోధ్యకు రానినా డయోధ్యగతి యేమికావలయును? నాకుత్సితప్రయత్నమునకు, రాజు మరణము, నాకు వైధవ్యము, అయోధ్యాపురవాసులకు అనాథత్వము, నా కుమారునికి దైన్యమును ఫలములయ్యెను. విధాతా! నాకిట్టిపాడుబుద్ధి నేలకలిగించితివి? అని పరిపరివిధములా విచారించుచుండెను. భరతుడు సంకల్పవికల్పములతో రాత్రినంతను గడిపి తెల్లవారినతోడనే స్నానాదికృత్యముల నెరవేర్చుకొని రామచంద్రుని పాదములకు నమస్కరించి, వశిష్ఠుల రావించి వారికి నమస్కరించియుండ నంతలో బ్రాహ్మణ మంత్రి పౌరులును వచ్చియుండిరి. పిమ్మట వశిష్ఠుడిట్లనియె. ఓ భరతాది సభ్యులారా! భగవంతుడు లోకకళ్యాణమునకై భానువంశమున రామచంద్రుడై యుదయించెను. ఈతడు పితృవాక్పరిపాలకుడు. దుష్టనిగ్రహ శిష్టరక్షణతత్పరుడు. మల్లోకాధిపతులు, చరాచరరూపమగు ప్రాణివర్గమంతయు రామాజ్ఞను మీఱజాలకుండును. కాన బుద్ధిమంతులరగు మీరందఱు నాలోచించి మీయభిప్రాయము నాతనికి దెలుపుడను ముని మాటల విని, భరతుడు లేచి ముకుళితకరకమలుడై సవినయముగ నిట్లనియె. గురువర్యా! మా పూర్వుల పుణ్యవిశేషమునుబట్టి పరమేష్ఠిసదృశులగు తాము మాకు గురువులై మా యోగక్షేమముల నరయుచున్నారలు. తమ ప్రభావాను గ్రహములవలననె మావంశమునం దుత్తరోత్తరోత్కృష్టపురుషు లుద్భవించు చున్నారు. తాము శలవిచ్చినట్లు భగవంతుడే మావంశమున జన్మించెనన దమ ప్రభావానుగ్రహముల వేఱజెప్పబనిలేదు. తమకు దెలియని విషయము నసాధ్యమును లేదు. కాన మన రాకను తామె రామచంద్రున కెఱిగించి మమ్ముల సఫలమనోరథుల జేయుడన నాతసి భక్తిప్రేమ మనోదార్ఢ్యముల నెల్ల వారికి దెలియపఱుపనెంచి వశిష్ఠుడిట్లనియె. భరతా! రాముడయోధ్య నేలు టయే నీకు సమ్మతమయిన నామాటల సావధానముగ వినుము. మీ తండ్రి గారు నీకును రామునకును రెండురాజ్యముల నిచ్చిరి. కాన రాముడయోధ్యను పాలించెడిసమయయమున నీవీ యటవీరాజ్యమును రామునివలె పాలింపవల యును. అది నీకు సమ్మతమేనా! యన భరతశత్రుఘ్నులు పరమానందభరితు

లైరి. ప్రజలు ఈషద్దుఃఖషమ్మిశ్రానందము కలవారును, రాణులు సమదుఃఖ సంతోషములు గలవారు నైరి. అంత భరతు డిట్లనెను. గురువర్యా! తమ శలవుప్రకారము జేయుటకు నేను సిద్ధముగ నున్నాను. అను నాతని మాటలకు సభ్యులు నివ్వెరపడి చూచుచుండిరి. వశిష్ఠుని బుద్ధిచాతుర్యములు భరతుని ప్రేమ భక్తి యౌదార్యసాగరములలోబడి మునిగిపోయెను. అంత వశిష్ఠుడు పౌర భరతసమేతుడై రామచంద్రుని కడ కేగెను. రామచంద్రుడు గురువులకు నమస్కరించి భరతుని తనయొద్ద గూరుచుండబెట్టుకొని పౌరుల యథోచితముగ గూరుచుండ నియమించెను. అంత వశిష్ఠుడు మృదుమధురవాక్కులతో నిట్లనియె. రామచంద్రా! సర్వజ్ఞుడవు, ధార్మికుడవు, కృపాళుడవు నగు నీకు నేజెప్ప బనిలేదు. ఈ భరతుడు నిన్నయోధ్యకు గొనిపోవలయునని పట్టుబట్టి యున్నాడు. పౌరులు నీవియోగమును సహింపజాలకున్నారు. కాన నీవు సర్వసంతోషకరమగు నుపాయము నాలోచింపు మన రామచంద్రు డిట్లనియె. మానివర్యా! తమకు దెలియని యుపాయములులేవు. తమ శలవు నతిక్రమించు వారెవ్వరునులేరు. కాన తామే సర్వము నాలోచించి చెప్పుడు. తమయాజ్ఞను మేమందఱము శిరమున దాల్చెద మన ముని ఇట్లనియె. రామచంద్రా! నీవు నిజము వలికితివి. భరతుని దుఃఖమును, నీప్రతిజ్ఞను జూచిన నాకేమియు దోచకున్నది. అన విని గురువులకుభరతునియందలి, ప్రేమకు సంతసించుచు, భరతునికి తనయందు గల భక్తిప్రేమలకు నౌదార్యమునకు మెచ్చుకొనుచు మందస్మితముతో నిట్లనియె. గురువర్యా! భరతునివంటి సోదరుడెన్నడు నెవ్వరికినిలేడని నేను నిక్కముగ బలుకుచున్నాను. పరమేష్ఠికెనయగు తమపరిపూర్ణానుగ్రహపాత్రుడగు భరతునియదృష్టము వర్ణనాతీతము. కాన భరతాభీష్టమును వీలున్నంతవఱకు నెరవేర్చుట మనకుకర్తవ్యమన వశిష్ఠుడుభరతునివంక జూచి, రాజపుత్రా! నిశ్శంకముగ నీయభీష్టమును జెప్పుమన గురువునకును, రామచంద్రునకును, దనయెడగల ప్రేమాతిశయముల కానందించుచు, ప్రేమపులకితాంగుడై నిలబడి చేతులుజోడించి యెల్లవారు వినునిట్లనియె. గురువర్యా! తామును రామచంద్రుడును నాయందుజూపినప్రేమకు నేనుకృతజ్ఞుడను. నాహృదయము మీరెఱుంగనిది కాదు. రామచంద్రు నెంతజూచినను నాకుతనివి తీరదు. దైవము మామైత్రినిసహింపక నాతల్లిద్వారమున మాకిట్టివియోగ

మునుగల్పించి, మాతండ్రిని పరలోకమునకు గొంపోయి, యయోధ్యావాసుల కపరిమితదుఃఖమును గల్పించెను. వీనికన్నిటికి నేను మూలము. నిషాదవంశ జాతుడగు గుహునిజూచిన నాకుసిగ్గగుచున్నది. కౌసల్యాసుమిత్రల దుఃఖమును రామలక్ష్మణుల మునివేషములను, వనవాసమునుజూచిన నామనసు బ్రద్దలుకా కుండుటచే నదివజ్రమయము. విషజంతువులకు గూడ దుర్భరమగువిషముగల కైకకొడుకునని నన్నే విషజంతువు లయినను దరియ భయమందుచున్నవను నా భరతుని కరుణోక్తులవిని సభ్యులెల్లరును శోకవికలచేతస్కులై కన్నీరు గార్చు చుండిరి. అప్పుడచటనున్న మునివరు లనేకప్రాచీనేతిహాసములజెప్పి వారలనోదా ర్చిరి. అంత రామచంద్రుడు మధురస్వరముతో నిట్లనియె. తమ్ముడా! ప్రాణు లన్నియు గర్మపాశబద్ధములై పరతంత్రములై యుండు. తన సుఖదుఃఖములకు దానెగ్గగాని పరులెన్నడును గాజాలరు. కాన ప్రాజ్ఞులెవరును నిన్నుగాని నీతల్లినిగాని దూషింపరు. మూర్ఖులమాటల గణింపబనిలేదు. కాన నీవులేని పోని సంశయములచె వంతనొందకుము. నీవును ప్రాజ్ఞుడవు. ధర్మజ్ఞుడవు. మన వంశమునం దింతవఱకు ధర్మమార్గము నతిక్రమించినవారు లేరు. కావుననే మన తండ్రిగారు సత్యపరిపాలనమునకై యసువుల బాసెను. కాన మనము పితృవాక్పాలనమును జేయకుండిన ధర్మహానికలుగును. అప్పుడు మనమూల మున మనవంశమునకే కళంకము కలుగును. అది యుక్తము కాదుగదా. ఇక నిన్నుజూచినను మనపౌరులజూచినను జనయిత్రులజూచినను మనసుకరిగిపోవు చున్నది. కాన ధైర్యమూని యుక్తాయుక్తముల జక్కగవిచారించి, నీవెట్లు జెప్పిననట్లు చేయుటకుసిద్ధముగనున్నాను. అను రామచంద్రుని మాటలవిని యచటివారందఱు నమందానందము నొందిరి. అప్పుడు దేవతలు తమకార్యము నకు విఘ్నమువాటిల్లునని భయమందుచుండిరి. రామచంద్రుడు భక్తపరా ధీనుడు. భక్తులకొఱకాతడేపనినైనను జేయవెనుదీయడు. తొల్లి ప్రహ్లా దునికొఱకు నృసింహరూపము నంగీకరించెను. కాన నిపుడేమిచేయునో యను కొనుచుండ నింద్రుడిట్లనియె. దేవతలారా! మీరుసందేహము సహేతుకము. ఇపుడు మనకార్యము భరతునిచేతిలో నున్నది. కాన మనమాభరతు నాశ్ర యింతము. రామచంద్రుడు దననుసేవించువారికన్నను, దనభక్తుల సేవించువారి నెక్కుడుగ బ్రేమించును. అన వారిప్రసంగముల నన్నిటిని సర్వాంతర్యామి

యగు రామచంద్రుడాలించి కర్తవ్యము నాలోచించుచుండెను. భరతుడు ధర్మ మునువిడువవలయునా? రామునివిడువవలయునా! యనివిచారించి ఏమియుదోచక రామచంద్రు డెట్లుచెప్పిన నట్లుచేయుట యుక్తమని తుదకు నిశ్చయించి యంజలి బంధముతో మెల్లననిట్లనియె. రామచంద్రప్రభూ! నీయనుగ్రహపాత్రుడనైన నేనెంతేనిధన్యుడను. నాసకలదుఃఖములు నశించినవి. సర్వసందేహములు తీరి పోయినవి. నీపదకమలముల నాశ్రయించినవారి కెన్నడును, ఏదుఃఖములు నుండజాలవు. నేను నీయభిషేకమునకు సర్వసంభారముల గొనివచ్చితిని. ఇపుడు మాప్రసంగమువలన నాచిత్తము ధర్మసంమూఢమై ఇతికర్తవ్యతావివేకవిధురమై యున్నది. కాన సర్వజ్ఞుడవగు నీవును, సర్వజ్ఞకల్పులగు గురువులు నాలోచించి కర్తవ్యమును నిర్ణయింపవలయునేకాని నాకేమియు దోచుటలేదు. నేను మీ యాజ్ఞానుసారముగ వర్తించువాడనన నాతనిపలుకులకు దేవతలు మునులును సంతసించుచుండిరి. స్వార్థతత్పరులగు నయోధ్యాపౌరులుమాత్ర మేమిజరుగు నోయని శంకింపుచుండిరి. రామచంద్రుడేమియు బలుకక గంభీరముగ మౌన ముద్రనువహించెను. అంతలో జనకచక్రవర్తియొద్దనుండి దూతలువచ్చినవార్తను విని వసిష్ఠుడు వారలరాననుజ్ఞనీయగా వారువచ్చి రామచంద్రుని మునివేష మును జానకిని జూచి ఖిన్నమనస్కులై వసిష్ఠునకు నమస్కరింపగా వసిష్ఠుడు జనకునిక్షేమమడుగ వారిట్లనిరి. మునివర్యా! మారాజు కుశలము. మిథిలా సౌభాగ్యము దశరథునితోడనె పోయినవి. ఇపుడయోధ్యయు మిథిలయు సమముగనున్నవి. దశరథుని మరణవార్తను, సీతారాముల వనవాసమును వినినతోడనె మారాజు నిజముగ విదేహుడయ్యెను. అట్లు కొంతవఱకు నిశ్చే తనుడైపడియుండి మఱల దెలివినంది ధైర్యమూని మంత్రులరావించి కర్తవ్య మును విచారించి తగుదూతలరావించి, యయోధ్యకంప వారట్లుజని యచటి వృత్తాంతమునంతను సవిస్తరముగ దెలిసికొనివచ్చి మారాజునకెరిగింప భరతుని భక్తిజ్ఞానములకు సంతసించి నగరరక్షణమున కనువగుబలము నటనియమించి, సముచితసేనాపరివారముతో నిటకురాబయనమై వచ్చుచున్నవాడు. అట్లు కతి పయప్రయాణముల ప్రయాగకుజేరి త్రివేణీసంగమమున స్నానమాచరించి మఱల ప్రయాణముజేయుచు యమునననుదాటి తమరాకను మీకెఱింగింప మమ్మంపెనన విని తోడనె వశిష్ఠుడు జనకునిదోడితెమ్మని సపరివారముగ

భరతునంపెను. అపుడయోధ్యాపురవాసులు సంతసించుచుండిరి. దేవతలుమా త్రమీజనకునిరాక గోరుచుట్టుపై రోకలిపోటువలె నున్నదని విచారించుచుం డిరి. ఒకొక నేనెట్లు జనకునిజూడగలనని లజ్జావిషాదముల నందుచుండెను. అంత ప్రాతఃకాలమయినతోడనే యయోధ్యాపౌరులు స్నానాదిక్రియల నిర్వర్తించు కొని తమకిష్టదైవమగు సూర్యభగవాను నర్చించి, ప్రభూ! లోకబాంధవా! నీవు సర్వజ్ఞుడవు. కాన మాప్రార్థనముల మన్నించి సీతారాముల నయోధ్యకు వచ్చి రాజ్యమునుబాలించునట్లును భరతుడు యువరాజగునట్లును జేసి మమ్మ్మల గృతార్థులజేయుమని ప్రార్థించి పిమ్మటరామచంద్రుని దర్శించి నమస్కరింప, రామచంద్రుడు వారలనందఱ కగురీతినాదరించి సంతోషబెట్టుచుండెను. అట్లు భరతు డన్నపనుపునజని జనకునిదర్శించి, పితృఘాతకుడు, జ్యేష్ఠవనవాసక్లేశ హేతువునగుకైకకొడుకునమస్కరించుచున్నాడని, యశ్రుపూరితనేత్రుడై జనకుని పాదములపై బడ నాతడాభరతునిలేవనెత్తి కౌగలించుకొని, తండ్రీ! నీవు నిర్దోషి వని నేనెఱుంగుదును. ఇందు నీతల్లితప్పేమియు లేదు. దైవమేరికినిదుర్లంఘ్యము గదా. కాన చింతింపకుమనియనేకవిధముల నోదార్చి తనరథముమీద గూరు చుండబెట్టుకొని, వచ్చుచుండెను. అంత జనకుడు సమీపమునకు వచ్చెనను వార్తనువిని రామచంద్రుడు గురుమంత్రి సోదర పౌరసహితముగ నెదురేగెను. జనకుడును రథమునుదిగి చిత్రకూటమునకు నమస్కరించి సీతారాముల జూచు నభిలాషతో మార్గాయాసమును గణింపకనడచుచుండెను. అట్లు సమీ పించిన జనకపరివారము నయోధ్యాపురవాసులును రత్నాకరమహోదధులవలె గలిసెను. అంత జనకుడు వశిష్ఠునకును, రామచంద్రుడు శతానందునకును నమస్కరించి వారి యాశీస్సుల నందినపిమ్మట సోదరసహితముగ రామ చంద్రుడు జనకునకు నమస్కరించి యాతనిని సపరివారముగ దనయాశ్రమము నకు దీసికొనిపోవుచుండెను. అపుడు జనక పరివారరూపమగు దయాతరంగిణి, రామాశ్రమమను శాంతమహోదధిని జేరుచున్నట్లుండెను. ఆకరుణాతరంగిణి శోకవాఃపూరభరితమై జ్ఞానతటముల నుల్లంఘించుచు ధైర్యవృక్షములను గూలద్రోయుచుండెను. ఆసన్నివేశమును జూచిన మునులకును చిత్తము చలించుచుండెను. దశరథుడు మరణించుట, రాముడు వనవాసమున కేగుట, భరతుడు రాజ్యము నంగీకరింపకుండుటయు నానదియందు భయంకరావర్త

ముల్లై ఏరికిని దాటుట కశక్యమై యుండెను. ఇక వశిష్ఠమహర్షి తన విజ్ఞాన నౌకచే నచటివారల నందఱను జాగరూకతతో దాటింపుచుండెను. అట్లా కృపాపయస్విని రామాశ్రమమను శాంతసముద్రములో లీనమైపోయెను. అట్లు వారందఱుగలిసి దశరథగుణముల నుగ్గడించుచు వికలమనస్కులై విధాత నిట్లు దూరజొచ్చిరి. ఓవిధాతా! దయామయుడవగు నీవు మాయందింత నిర్దయుడవయితివేల? మారామచంద్రునకీ వనవాసమును మాన్చి మఱల మాకు రాజుగజేసి మమ్మాశోకాంబుధినుండి యుద్ధరింపుము. అని విలపించెడి వారల నెట్టకేలకు వశిష్ఠు డూరడింపుచు జనకునితో నిట్లనియె. కర్మజ్ఞాన వైరాగ్యములకు నిధివైన నీవిట్లు పామరునివలె విలపించుట నా కాశ్చర్యముగ నున్నది. నీవెఱుంగనిదియు నీకు బోధింపదగినదియు లేదని మెల్లన నా జనకు నోదార్చెను. అంత వారందఱు నట రామఘట్టమున స్నాన మాచరించి ఆనాడు నిర్జలోపవాసమునుజేసి మఱునాడు నట్లే స్నానాదికృత్యముల దీర్చి కొని వారందఱును రాముడు నివసించెడి వటవృక్షచ్ఛాయ నాశ్రయించి కూరుచుండ వశిష్ఠశతానందులు జ్ఞానజనకములైన ఇతిహాసములజెప్పి వార లకు దుఃఖోపశమన మొనరించుచుండిరి. అప్పుడు దేవత లచటనున్న వార లందఱకును తగునట్లనేక విధఫలమూలాదుల నాపర్వతమున సమకూర్చిరి. అపుడాపర్వతము సుమేరువుకన్నను మిన్నయైయుండెను. అపుడచటి యాట వికులు గుహుని పంపున నపరిమితములగు ఫలమూలాదుల నట రాసులుగ సిద్ధముచేసిరి. అపుడు రామాజ్ఞచే వారందఱు నాఫలమూలాదుల భుజించి తృప్తినంది వారిలో వారిట్లనుకొనుచుండిరి. మనవంటిధన్యు లెందునులేరు. మందాకినీ స్నానము. రామచంద్రుని దివ్యమంగళ విగ్రహదర్శనము. దేవతా దుర్లభములగు నీమధుర ఫలమూలా స్వాదనము. మనకింకేమి కావలయును? రామసన్నిధికన్న నుత్కృష్టస్థాన మేదిగలదు? కాన మన మీరామచంద్రు నితో పదునాలుగు వత్సరముల నమితానందముతో నొకగడియవలె గడిపి రామచంద్రునితో గలిసియె పోవుదము అనుకొనుచుండ నంతలో జనకరాణి యగు సునయన దాసివలన నచటి వృత్తాంతమంతయు విని సీతారాముల జూడవలెనని యట కరుదెంచెను. పిమ్మట వశిష్ఠు ననుమతిని శతానందునితో గలిసి కౌసల్యను దర్శించెను. అపుడు వారిరువురను మూర్తీభవించిన శోక

రసమువలె నుండిరి. కొంత తడవట్లూరకుండి పిమ్మట ధైర్యము నవలంబించి, సునయన కౌసల్యతో నిట్లనియె. వదినా! దైవము మనకు బ్రతికూలము. కాని యెడల కుసుమ సుకుమారులగు మనబిడ్డలకు వనవాసము, మనకిట్టి దుస్థితియు నేల కలుగవలయును? బ్రహ్మసృష్టి స్వరూపమే ఇట్టిది. సుఖముల దుఃఖాంతము లుగ నొనరింపుచు రమ్యవస్తువుల గబళించుచు మనపరాధీనతను మాటిమాటికిని ధృవపఱచుచుండును. పౌరుష మెన్నటికిని దైవమును మీఱజాలదు. అనునం తలో సుమిత్ర ఇట్లనియె. దేవీ! విధివిలాస మేరికిని దురూహాము. అతనికి స్వార్థములేకున్నను విలాసమున కీసృష్టిస్థితిలయముల ముప్పొద్దులజేయుచుండును. ఐంద్రజాలికుడు మాయానాటకము నాడున ట్లూతడు మనలతో నాటకమాడు చుండు నన కౌసల్య ఇట్లనియె. భగవంతు డీసృష్టిని మనకొఱకే జేయుచు న్నాడు. తనను భజించి తరించుట కనువగు దేహమును మనకు బ్రసాదించి తనను భజించి తరించుమురని యాతని తలంపు. కాని మన కెన్ని దుఃఖముల గల్పించి నను మనమాతని భజింపనేఱక యూఱక నాతని నిందించి మఱికొంత పాపమును దెచ్చికొనుచుంటిమి. ప్రపంచమంతయు గర్మబద్ధము. కర్మ నెవరు నతిక్రమింప జాలరు. అట్లు కానినాడు సీతారాములకు వనవాసము, మాకీదుర్దశయు నెట్లు వాటిల్లును? ఇది ఇట్లుండ భరతుడు రాజ్యము నంగీకరించుటలేదు. రాము డయోధ్యకు రా సమ్మతించినట్లు గాన్పింపదు. అయోధ్యగతి యేమి కానున్నదో తెలియదు. భరతునకు రామునియందు భక్తి యపారము. భరతుడు రాముని ఋణమైనను విడువజాలడు. లక్ష్మణశత్రుఘ్ను లయో ధ్యను జూచుచు, భరతుడు రామునితో నుండిన బాగుండును కాని అదియు దుర్ఘటమె. ఏమికానున్నదో తెలియకున్నది. వదినా! మన యీకరుణా ప్రసంగములలో వేళ యతిక్రమించినది. కాన మీరు మీనివాసమున కరుగు డను కౌసల్యాప్రేమవై రాగ్యముల కచ్చెరువందుచు సునయన ఇట్లనియె. దేవీ! నీవు దశరథునకు రాణివి. రామునకు జననివి. మీయధృష్టము కొనియాడదగి నది. రామచంద్రు డీవనవాసవ్రతమున దేవకార్యముల నెరవేర్చివచ్చి యయో ధ్యను పాలించును. ఆతడు భగవంతుడని యాజ్ఞవల్క్యునివలన వినియుంటిని. కాన నీవు విచారింప బనిలేదని యామె పాదములకు నమస్కరించి సీతను తన వద్ద నుంచుకొనుట కనుజ్ఞను వడిసి యామెతో గలిసి నిజనివాసమునకు జనెను.

సీత నిజబంధువుల గలిసి సంతసించుచుండెను. వారామె వేషమును జూచి విచారించుచుండిరి. జనకుడును వశిష్ఠు ననుమతి వడిసి నిజనివాసమునకు వచ్చి సీతను జూచి తన ప్రాణాధిక యగు నామెను కౌగలించుకొనెను. అప్పు డాతని మనసు ప్రయాగవలెను సీతయందలి ప్రేమ యక్షయవటమువలె నుండెను. మార్కండేయుడు ప్రళయకాలమున జలార్ణవమున మునిగితేలునట్లు జనకు డానందాబ్ధి నోలలాడుచుండెను. సీతయొక్క తాపసీవేషమును జూచి జనకు డిట్లనియె. సీత తలితండ్రులజూచి ధైర్యముచే దుఃఖమాపుకొనెను. తాపసివేష ముతోనున్న సీతను జూచి దుఃఖితుడై, జనకుడు ధైర్యము తెచ్చుకొని ఆనం దాశ్రువుల నింపుచు, ఆమె తాపసివేషమును జూచి ఒకవైపు సంతోషము ఒక వైపు విచారముచే బాధపడుచు ఇట్లనియె. పుత్రీ! ఉభయవంశముల తరింప జేసి, పవిత్రత నొందజేసితివి. నీకీర్తి ప్రపంచమంతయు కొనియాడెదరు. నీకీర్తి గంగను మించి యున్నది. ఏమన గంగ కొన్ని చోట్లనే ప్రవహించును. నీకీర్తి లేనిచోటే యుండదు. మరొకవిషయము, అది గొప్పస్థలములలో మూడుచోట్ల ప్రవహించుచుండెను. హరిద్వారము, ప్రయాగ, సాగర సంగమమని చెప్పుదురు. నీకీర్తి సాధుజనులందరిలోను ప్రవహించుచుండును. తల్లీ! నీవు పితృ శ్వశురవంశముల నలంకరించితివి. నీకీర్తి భాగీరథివలె ముల్లోకముల వ్యాపించుచున్నది అను తండ్రిమాటలకు సంతసించుచు, తాను వచ్చి తడవాయెనని తలంచుచు తన మనసులోని కోర్కెను తల్లితండ్రులకు జెప్పుటకు సందియమందుచుండ నామె భావమును గ్రహించి సునయన జనకు నితో జెప్పుచు నాసందర్భమునసే భరతుని సౌశీల్యమునుగూడ జెప్పెను. జనకు డంత భరతుని గొనియాడుచు సువర్ణమునకు దావియబ్బినట్లు భరతుని సౌశీల్య మునకు రామభక్తికూడ యబ్బినదని సంతసించుచు సులోచనతో నిట్లనియె. సుముఖీ! భరతుని సుగుణములను వర్ణింప నేరికిని శక్యముగాదు. అతని కతడే సాటి. భరతుని స్వభావము రామునకును రాముని మహాత్మ్యము భరతు నకే దెలియును. నేను ధర్మమును, రాజనీతిని, బ్రహ్మవిచారమును గొంతవఱ కైన దెలిసితిని గాని భరతుని యగాధస్వభావమును గ్రహింపజాలకుంటినని రామభరతుల గూర్చి ముచ్చటించి సీతను మఱల నటకు బంపివేసెను. మఱు నాడు సూర్యోదయమైనతోడనె యుభయపక్షములవారును ప్రాతఃకృత్య

ముల దీర్చినపిమ్మట రామచంద్రుడు వశిష్ఠుని సన్నిధికేగి నమస్కరించి, గురువర్యా! భరతుడు, తల్లులు, పౌరులు వచ్చి వనవాసక్లేశము ననుభవించుచుండ జనకుడును సపరివారముగ వచ్చి యాక్లేశమునే యనుభవించుచున్నాడు. వనవాసవ్రతము నాకు దప్పదు. కాని నాతోపాటు వారిక్లేశము ననుభవించుట నాకు సమ్మతము గాదు. కాన మీరు వారలకు దగుతీరున బోధించి వారల నిజనివాసముల కనుపుడన వశిష్ఠుడు కన్నుమూసి ఆలోచించి, రామునితో నిట్లనియె. రామచంద్రా! నీవు సర్వజ్ఞుడవు. నీకు దెలియని దేదియునులేదు. నీసన్నిధిని వనవాసమైనను వారికి స్వర్గతుల్యము. నీవు లేని పుర మరణ్యము. కాన వారికి క్లేశమేమియును లేదు. ఐనను పురముల వీడి చిరకాల మిట నుండుట ధర్మముకాదు. కాన నీవు నీనివాసమునకు జనుము. నేనాలోచించెదనని రాముని బంపి తాను జనకుని రావించి సగౌరవముగ నిట్లనియె. జనకమహారాజా! నీవును భరతుడును పురముల వీడి రామునియందలి ప్రేమచే సపరివారముగ నిటకువచ్చి వనవాసక్లేశము ననుభవించుచుండిరి. మఱియు జిరకాలము ప్రభువులేని పురము నశించిపోవును. దాన నధర్మము వాటిల్లును. నీవు ప్రాజ్ఞుడవు. ధర్మజ్ఞుడవు. కాన నీసమయమున బాగుగ నాలోచించి, రామచంద్రునకును మనకు ననువగు తీరున నుపదేశింపవలయు నన జనకు డత్యాశ్చర్యము నందుచు, మునివర్యా! మీకు దెలియని దేమున్నది? మీరు నానోట బలికింప నెంచి యిట్లనుచుంటి రని తన మనసునం దిట్లు దలపోయసాగెను. రాముని విశువజ్ఞాలక దశరథుడు ప్రాణముల విడిచెను. నేను బ్రతికియుండుటకు ఫలము సీతారాముల వనవాస క్లేశమును జూచుట. ఆహా దైవమా! అసమయమున జచ్చుట, సమయమున బ్రతుకుట ఏరికిని దరము కాదుగదా! రాముని వనవాసమును మానుమనిన ధర్మలోపము దేవకార్యమునకు హానియు వాటిల్లును. భరతుని యయోధ్యకు బొమ్మనిన నాత డెట్లగునో! ఏమిచెప్పుటకును దోచకున్నది. ఈసమయమున నేనిటకు వచ్చుటయే తగని పని యని పరిపరివిధముల తలపోసి తుదకు ధైర్యమూని భరతునికడగు సపరివారముగ బయలుదేరెను. అంత భరతు డెదురేగి జనకుని దోడిదెచ్చి సగౌరవముగ నుచితాసనమున గూరుచుండబెట్టి, స్వామీ! తామూరక నిటకు దయచేయరు. తమ యాజ్ఞచే నీకింకరు ననుగ్రహింపు డన భరతుని వినయమునకు సంతసింపుచు జనకు డిట్లనియె. రఘువంశవిభూషణా!

నీకు రాముని స్వభావము బాగుగ దెలియును. రాముడు సత్యవ్రతుడు, ధర్మ నిష్ఠుడు, భక్తపరాధీనుడు. కావునదే అత డిపు డేమియు బలుకజాలకున్నాడు. కాన మనమే కర్తవ్యమును నిర్ణయించుకొనవలసియున్నది. ఇపు డేమిచేయుట యుక్తమో నీవాలోచించి చెప్పుమన భరతుడు గడగడవడకుచు కన్నుల నీరు కార్చుచు చేతులు జోడించి సగద్గదముగ నిట్లనియె. అయ్యా! రామచంద్రుడు నాకు బ్రాణములకన్న నెక్కుడు. తాము పితృతుల్యులు. గురువులగు వశిష్ఠులు తాతాధికులు. నేను బాలుడను. మఱియు శోకవికలమానసుడను. దైవోప హతుడను. అట్టి నేను తమ సన్నిధి నేమిచెప్పగలను. తమరు, మాగురువులు. బాగుగ నాలోచించి ఎట్లాజ్ఞాపించిన నీకింకరు డట్లుచేయువా డన నాభరతుని వాక్యములవిని జనకు డాశ్చర్యమందుచు నీతనినూటలు ప్రణవముకన్నను గంభీరముగ నున్నవి. ఈసందర్భమున నేమిచేయవలయునో నాకేమియు దోచకున్నది. తొందఅపడి ఏమేని జెప్పితినా ధర్మహానియో, మఱియొక యనర్థమో వాటిల్లును అనుకొని భరతుని దీసికొని వశిష్ఠుని సహాయముగ రామచంద్రుని కడకేగిరి. అట్లుజనుచున్న జనకభరతుల జూచి రామచంద్రుని భక్తపరాధీనతను దలంచి ఇంద్రాది స్వార్థపరులగు దేవతలు భయమందుచు నేమియగునో, భక్తపరాధీనుడగు రామచంద్రుడేమిచేయునోయనిచింతింపుచుండ సంతనింద్రుడు వాగ్దేవిని ప్రార్థించెను. తోడనె యామె సాక్షాత్కరింప దేవతలందఱు ముకుళితహస్తులై, తల్లీ! శరణార్థులమైన మమ్మురక్షింపుము. తొల్లి కైకబుద్ధిని మరలించినట్లే ఇపు డీభరతునిబుద్ధిని మరలించి మమ్ము గాపాడుమన వారి యవివేకమునకు లోలోన దిగులందుచు నిట్లనియె. ఇంద్రా! నీ వేయికన్నులు బాహ్యమునే జూచును కాని యాంతరమును జూడజాలవు. భరతుని హృదయ మందెల్లప్పుడును రామభానుడు ప్రకాశించుచుండును కాన మన మాయలచటకు జేరజాలవు. మఱియు చంద్రచంద్రికల నెట్లువిడదీయవలనుపడదో యట్లే రామ భరతులను విడదీయుట యసాధ్యము. కాన నేను మీకీసహాయము నొనరింప జాలనందులకు చింతించుచుంటినని యామె తనలోకమున కేగెను. అంత దేవ తలు చేయునదిలేక మన కార్యమంతయు భరతాయత్తమై యున్నదని యాభరతునే వేయివిధముల స్మరింపుచుండిరి. అంత వశిష్ఠుడు భరతజనకులతో గూడి రామచంద్రునివద్దకేగి భరతజనక సంవాదమునంతను రామున కెఱిగించి,

ఇట్లనియె. మానిమానసమరాళమా! ఈసమస్య మాచే బరిష్కరింపదగినది గాదు. నీవెట్లుజెప్పిననట్లు నడువగలవారమన రామచంద్రుడు మందస్మితముతో నిట్లనియె. గురువుల ఎదుట నేను నిర్ణయించుట యుక్తముకాదు. కాన మీరెట్లునిర్ణయించిన నట్లు నడచువాడనన వారిరువురును భరతునివంక జూచు చుండిరి. భరతు డంత గడగడవణకుచు కన్నీరుగార ముకుళితకరకమలుడై ఇట్లనియె. స్వామీ! మీరు మాకు గురువులు. జనకుడు పితృతుల్యుడు. రామచంద్రుడు నాకు ప్రాణాధికుడు. ఇట్టి మీసన్నిధిని బాలుడనగు నేనేమి మనవిచేయగలను? అనుచు నగస్త్యుడు వింధ్యాద్రిని దొక్కినట్లు తన మోహ ప్రేమలను ద్రొక్కి సభ్యులకు నమస్కరించి, తల్లీ! నానోట నసందర్భములగు వాక్కుల రానీయకుమని సరస్వతిని ప్రార్థించి ఇట్లనియె. నేను రామచంద్రునే తండ్రిగను, గురువుగను, నాసర్వస్వముగను, భావించి ప్రేమించుచుంటిని. కావుననే రాజాజ్ఞనుగూడ నుల్లంఘించి రామవియోగమును సహింపజాలక నిట్లువచ్చితిని. ఈనాదోషమును మన్నింపుడు. రాముని దండ్రియాజ్ఞ నుల్లం ఘించుమనుటకుగాని, రామునిపీడి యయోధ్యకు జనుటకుగాని, ఏమిచేయుట కును నాకేమియు దోచకున్నది. ఇట్లే సంకటస్థితిలో నన్నుద్ధరింపుము ప్రభూ! యని రామచంద్రుని పాదములపై బడి విలపించుచుండెను. ఆభరతుని స్థితి వర్ణనాతీతము. అపుడు రామచంద్రుడాభరతుని లేవనెత్తి కౌగలించుకొని సాంత్వనోక్తుల నోదార్చుచు దనచెంతగూరుచుండబెట్టుకొనెను. అపుడు వారిరు వురస్థితినిజూచి దేవతలు మఱిల భయమందుచుండిరి. స్వార్థపరులకు ధర్మాధర్మ వివేకముండదుగదా! ఆసభవారందఱు నారామభరతులజూచి నిశ్చేష్టులై చిత్త రులవలె నుండిరి. రామచంద్రుని భక్తవాత్సల్యమును, భరతుని భక్త్యతిశయ మును వర్ణించుటకాసరస్వతియే సిగ్గుపడుచుండ నికనెవరు వర్ణింపగలరు? రామ చంద్రుని యనుగ్రహమును పొందుటకు భరతుడే ద్వారము. భరతుని దెలియని వారు రాముని భజింపజాలరు. ధర్మజ్ఞుడు, సత్యవ్రతుడు, నీతివిశారదుడు, దయామయుడు నగు రామచంద్రుడు దేశకాలానుగుణముగ నిట్లనియె. తమ్ముడా! నీవు ధర్మమును, లోకవృత్తమును, మన వంశప్రతిష్ఠను బాగుగ నెఱింగినవాడవు. నీకునీవేసాటి. నాయందలిప్రేమచే నీవిపు డిట్లుంటివి. మనకు దండ్రిగారు స్వర్గమునకేగుచు గురువులకప్పగించి చనిరి. కాన నిప్పుడీమహీను

భావులే మన యోగక్షేమముల నరయుచుందురు. మనము నిమిత్తమాత్రము. కాన నీవీ గురునాజ్ఞానుసారము పదునాలుగువత్సరము లీప్రజల బాలింపుచు మనవంశప్రతిష్ఠను గాపాడుము. నీమనస్సు మిగులమృదులము. అయినను నా కొఱకె నీకీక్లేశమును గల్పింపవలసి వచ్చినది. కాన నీవునామాటను మన్నింపు మని భరతుని దనయొడిలోనుంచుకొని సభ్యులెల్లరువిన మెల్లన మృదువాక్కు లతో నుపదేశించెను. అప్పుడందఱును జిత్తరులవలె నిశ్చేష్టులై జూచుచుండ భరతుడు చేతులుజోడించి చింతాకులస్వాంతుడై ఇట్లనియె. ప్రభూ! నేను నీసేవకుడను. నీయాజ్ఞానుసారము వర్తింపగలవాడను. కాని నేనొకవిన్నపమును జేయుచున్నాను. గురువర్యుల యనుగ్రహముచే నన్ని కార్యములు జక్కనగును. తమ పట్టాభిషేకమునకు సిద్ధపఱచిన యీ సకలదీర్థములకు వినియోగము నానతీయవలయు. మఱియు నాకీచిత్రకూటవిశేషముల జూడవలయునని యున్నది. దానికేమిశలవు? అన, దమ్ముడా! అత్రిమహర్షి ప్రభావముచే నీప్రదేశమంతయు బవిత్రము, రమణీయమునై యున్నది. కాన నీవాతనియను మతినివడసి ఇచటివిశేషముల నన్నిటినిగనుగొనుమన నాతడత్రిమహర్షి పాదముల బడి తనమనోరథమును వెల్లడించెను. అంతనాముని భరతా! నీవుదెచ్చిన సకలతీర్థములను ఆకూపమునందుంచుము. ఒకప్పుడది బహుపవిత్రమై కాలక్ర మమున నిప్పుడది ప్రజలకగోచరమైనది. మఱల నా శిష్యులవలన కనుగొనబడి నది. కాన దానియం దీతీర్థములనుంచిన నేటినుండి ఇది భరతకూపమని లోకమున ప్రసిద్ధమగును. ఇందు స్నానముచేసినవారికి సర్వతీర్థస్నానఫల మబ్బునన వల్లె యని భరతుడాతీర్థముల నాకూపమునందిడి యాతనియనుమతివడసి శిష్యోపదిష్ట మార్గమున నావనమంతయు జూచుచు నందలివిశేషములను మృగములను వాపీ కూపతటాకాశ్రమాదులను జూచి యచ్చెరువందుచు, నిట్టివనమందు నివసించు టయు పుణ్యవిశేషము లేనివారలకు దుర్లభమని తలంచుచుండెను. భరతుని ధర్మనిరూఢి, రామునిసత్యప్రతిజ్ఞయు నిప్పుడమనల గాపాడినవని దేవతలానం దించుచుండిరి. జనకుడు రామభరతుల సేవ్యసేవకభావమున కానందపరవశు డయ్యెను. సభ్యులలోగొందఱు రాముని, గొందఱుభరతుని గొనియాడుచుం డిరి. ఈరామభరత సంవాదమువినినవారికి సర్వదుఃఖములునశించును. భరతు డట్లావనవిశేషముల నరయుచు, సాయంకాలమున కాశ్రమమును జేరుచు మఱల

బ్రాతఃకాలమునలేచి స్నానాదివిధుల నిర్వర్తించి వనవిశేషముల సరయుచు నైదుదినముల గడిపెను. ఆఱవనాడుదయమున బ్రాతఃకాలకృత్యముల దీర్చి భరతాదులందఱును రామచంద్రుని సన్నిధికేగిరి. రామచంద్రుడు వారల పురమునకేగుడని జెప్పుటకు సందియమందుచు మోమువాంచి మిన్నకుండెను. అంత భరతుడు రామునియభిప్రాయమును గ్రహించి చేతులుజోడించి ఇట్లనెను. ప్రభూ! కరుణామయుడవగు నీవు నీవనవాసక్లేశమును సహించుచు నా దుఃఖముల నెడబాపితివి. మఱలనీవు వచ్చువఱకు నీయయోధ్యను గాపాడుచుండెదను. అంతవఱకీ దుఃఖాంబుధిలో మునుగకుండునట్లు నాకొకతెప్ప ననుగ్రహింపుము. నేడు శుభదినముగాన నీపరివారమునుదీసికొని జనవలెననుకొనుచుంటిని. శలవునొసంగుమను నాభరతుని గంభీరవాక్కులవిని సభ్యులు నిశ్చేష్టులైరి. రామచంద్రుడు దేశకాలానుసారముగ నిట్లనియె. తమ్ముడా! మనరాజ్యమును పురమును పౌరులను గాపాడెడివారు గురువులు. కాన నీవు వారియాజ్ఞానుసారము బ్రవర్తింపుము. దాన మనకు సకలశ్రేయములు చేకూరును. మంత్రులను, పౌరులను, యధోచితముగ జూచుచుండుము. మంత్రమునుగుప్తముగానుంచుము. ప్రతిదినము సప్తాంగములపర్యవేక్షించునది. విప్రులబూజింపుము. బందుగులగౌరవింపుము. ప్రజలనాదరింపుము. కోశదండములందప్రమత్తుడవై వర్తింపుము. స్వాపరవిశేషములగమనింపుము. అని అనేకరాజనీతిమర్మములనుపదేశించెను కాని భరతుడు రామవియోగసాగరమునందు మునుగకుండుటకు దగినసాధనములభింపనికిన్నుడైయుండెను. సర్వాంతర్యామియగు రామచంద్రు డాతనిభావమునెఱింగి, తన పాదుకల నాతనికిచ్చి, సోదరా! యీనాపాదుకలను నేను వచ్చునంతవఱకు నీయొద్దనిడికొని నీదుఃఖాంబుధిని దరింపుమన నత్యాదరముతో భరతుడాపాదుకల గ్రహించి కంఠ్లకద్దుకొని శిరమునందిడికొని హృదయమునందత్తుకొని రామచంద్రునకు దనయందుగల యవ్యాజమగు ప్రేమకు నిరవధికానందమునంది మనసులో నిట్లు దలంచుచుండెను. నావంటి ధన్యు డెందేనిగలడా? ఏవి సకలజగదాధారములో, ఏవి సంసారోద్ధారనౌకలో, ఏవి శివుని హృదయకమలమునందుండెడివో, ఏవి సుకర్మలకును జ్ఞానవైరాగ్యములకును ప్రవర్తకములో, అట్టి పాదుకలను రామచంద్రుడు నాకనుగ్రహించెను. ఇంక నాకేమి కావలయును? ఈపాదుకల గొనిపోవుచున్న నేను సీతారాముల గొనిపోవుచున్నట్లే. కాన

నాకోరిక లీడేరినవి. నాజన్మము సఫలమయ్యెనని సంతసింపుచు, ప్రభూ! పోయి వచ్చెద శలవిమ్మన నాభరతుని వీడజాలక రామచంద్రు డాతని గాఁగలించుకొని యాతని భుజముపై చేయిపైచి, సాగనంపుచుండ వారి ప్రేమలు వర్ణనాతీతములై యుండెను. అప్పుడు పాదుకాలాభమున భరతు డానందాశ్రువులు గార్చుచుండ భరత వియోగముచే, ధీరుడగు రామచంద్రుడు గార్చుచుండెను. ఆస్థితిని జూచి జ్ఞానవైరాగ్యసంపన్నులగు వశిష్ఠజనకులు చలితమానసులైరి. ఇక నితరులమాట చెప్పనేల! పిమ్మట శత్రుఘ్నుని గాఁగలించుకొని భరతునకు సహాచరుడవు గమ్మని చెప్పెను. అంత సేవకులు వారియభిప్రాయానుసారము ప్రయాణసన్నాహమొనరించుచుండ భరతశత్రుఘ్నులు సీతాసన్నిధికేగి నమస్కరించి యామె యనుమతి నంది జనకునకు నమస్కరించి యాతని యాశీస్సుల నంది బయలుదేరనుండిరి. వనచరులు వారి ప్రయాణసన్నాహమును వింతగ జూచుచుండిరి. అంత జనకుడు ప్రయాణోన్ముఖుడుకాగా రామలక్ష్మణు లాతనికి నమస్కరించి. అయ్యా! తమరాక మాకెంతేని ముదావహము. తమ కిటు దగుసపర్యల జేయజాలకపోయితిమని చింతించుచుంటిమి. మాతోపాటు మీరును వనవాసక్లేశము ననుభవించితిరి. అనుగ్రహముంచుడన నాతడు వారల దీవించి, రామచంద్రా! నీసన్నిధి ఏర్పైనను సుఖప్రదమే. కాన నాకిట నునికి దుఃఖావహ మెట్లగును. నీవు నీప్రతిజ్ఞను పూర్తిచేసికొని సుఖముగ నయోధ్యకు వచ్చినఁగోడనె మఱల వత్తునని చెప్పెను. అంత రామలక్ష్మణులు సునయసవద్దకేగి నమస్కరింప నామె దీవించి, లక్ష్మణా! నీవెప్పుడు నప్రమత్తుడవై మాజానకిని గాపాడుచుండు మనియెను. పిమ్మట శతానందాది విప్రవరులకు బంధువులకు నుచితరీతిని గౌరవించి వారల ప్రయాణమునకనువగుకృత్యముల గావింప వనేచరుల నియమించిరి. అంత బంధువియోగఖిన్నమానసయగు సీత తల్లికడ కేగి యామెకు నమస్కరింప శోకోద్విగ్నమానసయగు సునయన యామె నకుఁన జేర్చి కన్నీరు గార్చుచు, తల్లీ! ఘోరమృగసంకులమగు వనమున నీవప్రమత్తవై జరింపుమని హితవు గరపి విడువజాలక ఎట్టకేల కామెను విడిచి పెట్టెను. అంత సీత మిథిలావాసిను లందరియొద్ద ననుజ్ఞనుగొని యత్తలకడ కేగి వారలకు నమస్కరింప వారును ఆమెను కౌగలించుకొని భోరున ఏడ్చుచు నామెకు వనవాసోచితములగు బుద్ధుల గరిపి ఎట్టకేలకు విడువగలిగిరి. అంత

ప్రయాణసూచకములగు మంగళవాయిద్యములు ప్రేమోగుచుండ నటు జన
కుడు నిటు భరతుడును ప్రయాణమై సీతారాముల స్మరించుచు సపరివార
ముగ బయలుదేరిరి. గజతురగాదులు గూడ రాముని వీడజాలక రాముని
వంకకు మాటిమాటికి జూచుచు మెల్లన జనుచుండెను. సీతారామ
లక్ష్మణులు గురుచరణములకు నమస్కరించి, వారి యాశీస్సులనంది సుమంతు
నామంత్రించి దృష్టిగోచరమగునంతవఱకు వారలనేజూచుచు మఱలి యాశ్రమ
మునకువచ్చిరి. పిమ్మట గుహునిజూచి ఓనిషాదరాజా! నీభక్తిప్రేమలకు మేము
మిగులసంతసించితిమి. నీవియోగముచే నీప్రజలు బాధపడుచుందురు. కాన
నీవును నీనగరికరుగుమన నాతడు ఖిన్నమనస్కుడై చేయునదిలేక నిజపురమున
కరిగెను. వనచరులును రామాజ్ఞనువడసి నిజనివాసముల కేగిరి. ఇట్లందరనంపి
వేసి సీతారామలక్ష్మణు లావటవృక్షచ్ఛాయ నాసీనులై నిజబంధువిశ్లేషమునకు
కొంచెము విచారించుచుండిరి. అట్లు జనకభరతులు సపరివారముగ నేగుచు సీతా
రాముల గుణగణముల ముచ్చటించుకొనుచు యమునానదిని దాటి గంగను
సమీపించినంతనె గుహుడు వారల నుచితరీతిని గౌరవించి ఒకదినమట నాపి
గంగనుదాటించెను. అట్లు కతిపయప్రయాణముల సరయువును సమీపించి
క్రమముగ నయోధ్యనుజేరిరి. పిమ్మట జనకుడట గొన్నిదినములుండి భరతునకు
ధైర్యమునుగఱపి రాజ్యకీలకముల బోధించి యాతని సమ్మతిని మిథిలకేగెను.
అంత నయోధ్యపురవాసులందఱు రామ పునర్దర్శనలాలసులై నియమముతో
వ్రతముల సలుపుచుండిరి. వారందఱును వశిష్ఠాదేశానుసారము వర్తింపుచు
బ్రశాంతముగనుండిరి. భరతుడును బ్రాహ్మణుల పూజించి మంత్రుల రావించి
ప్రజలకనువగు కృత్యములగావింప నియమించి శత్రుఘ్నుని మాతృరక్షణార్థము
నియోగించి వశిష్ఠాశ్రమమున కేగి గురువుకు నమస్కరించి ఇట్లనియె. మా
వర్యా! మా రాముడు మఱలివచ్చునంతవఱకు నేనును వ్రతనియమముల నుండ
దలచితిని. అయోధ్యకు గావలసిన ఏర్పాట్లన్నిటిని జేసితిని. అనుజ్ఞ నీయవ
లయునన వశిష్ఠుడు విస్మితుడై, భరతా! రామానుజుడవగు నీకు ఇది యుచి
తము. కానిమ్మన నతడమితానందమునందుచు శుభముహూర్తమున రామ
పాదుకల సింహాసనమందిడి వానికి పట్టాభిషేకమొనరించి, కౌసల్యావశిష్ఠులకు
నమస్కరించి, వారి యనుమతిని బడసి నందిగ్రామమున కేగి అటనొక పర్ణశా

లను నిర్మించుకొని జటావల్కలధారియై, స్థండిలశయనాది నియమములతో సీతారాముల భజించుచుండెను. ఏయయోధ్యాభోగములకు నింద్రుడు విస్మితుడగుచుండెనో, అట్టిభోగముల బరిత్యజించి భరతుడు రామునికొఱకు తపము జేయుచున్నాడు. చాతకము మున్నగు పక్షులే ఎట్టి ఇక్కట్టులనైన తమ పట్టిన నియమమును విషువజ్జాలవన వివేకధురీణములగు మానవులేల తమ నియమముల బాలింపరు? అట్లు భరతుడు నియమనిష్ఠుడై కృశాంగుడైనను శాణోల్లీఢమణివలె తేజోధికుడై విరాజిల్లుచుండెను. నిర్మలమగు నాతని హృదయాకాశము నందు రామభక్తిశశాంకు డనవతరము బ్రకాశించుచుండెను. అతడు నిత్యము రామపాదుకల బూజించుచు సకలరాజకార్యముల నాపాదుకలకు విన్నవించుచు రామచంద్రునిరాకను నిరీక్షించుచు నప్రమత్తుడై యుండెను. భరతుని నియమధర్మభక్త్యతిశయములు శేషునకైనను వర్ణింపనశక్యములు. ఇట్లు భరతుడు నియమనిష్ఠుడై రామనామమును జపించుచు నింటనుండెను. సీతారామలక్ష్మణులట్లరణ్యమున నుండిరి. పార్వతీ! భరతుని ప్రవర్తన మతిపవిత్రమై మధుర మంగళప్రదమై సకలకలికర్మసహారియై యజ్ఞానాంధకార దినకరప్రాయమై యుండెను. భక్తాగ్రగణ్యుడగు భరతు డిహలలోకమునకును యమనియమాది సాధనానుష్ఠానమునకు మార్గదర్శకుడయ్యెను. ఎవరీభరతచరిత్రమును నియమపూర్వకముగ భక్తి శ్రద్ధలతో నాలకింతురో, వారు రామ భక్తులై సంసార విముఖులై మోక్ష సామ్రాజ్యము నశ్రమముగ నలంకరించెదరు.

అయోధ్యాకాండము సమాప్తము

అరణ్యకాండము

శ్లో॥ మూలం ధర్మతరోర్వివేకజలధేః పూర్ణేందు మానందదం,
వైరాగ్యాంబుజభాస్కరం హ్యఘఘనధ్వాంతాపహం తాపహమ్.
మోహాంభోధరపుంజ పాటనవిధౌ జంఝానిలం శంకరం
వందే బ్రహ్మమయం కలంకరమనం శ్రీజానకీవల్లభమ్॥ ౧

సాంద్రానందపయోద సుందరతనుం పీతాంబరం సుందరం,
పాణౌబాణ శరాసనం కటిలసత్తూణీర మానందదమ్,
రాజీవాయతలోచనం ధృతజటాజూటేన సంశోభితం
సీతాలక్ష్మణ సంయుతం పథిగతం రామాభిధానం సుమః॥ ౨

ధర్మమునకు మూలమగునట్టియు, వివేకసముద్రమునకు జంద్రుడగు నట్టియు, వైరాగ్య పద్మబాంధవుడగునట్టియు, మోహమేఘు వాయువగు నట్టియు పరబ్రహ్మ స్వరూపుడగు జానకీవల్లభునకు నమస్కారము.

ఘనశ్యామసుందరుమును పీతాంబరధారియు, కోదండపాణియు జటా జూట శోభితుమును సీతాలక్ష్మణసఖుడై వనవాసరతుడగు రామునకు నమ స్కారము.

పార్వతీ! రామునిమహిమ మతిగుప్తము. నాబుద్ధి ననుసరించి భరతుని యనన్య భక్తిప్రేమల నయోధ్యకాండమున వర్ణించితి. ఇక సురముని పూజ్యుడగు భగవంతుని యవ్వలికథను వినుము. ఒకనాడు రామచంద్రుడు కొన్ని పూవులు కోసితెచ్చి స్ఫటిక శిలావేదికపై కూర్చుండి సీతను తనవద్ద కూర్చుండబెట్టికొని ఈ కోసితెచ్చిన పూలామె జడపై నలంక రించుచు, విలాసముగ నేదోసంభాషించు సమయమున సముద్రము నీదు నభిలాషగల చీమవలె ఇంద్రపుత్రుడగు జయంతుడు వాయసవేషము ధరించి రాముని మహిమ పరీక్షింపదలచి సీత చరణమును బొడువ రక్తము ప్రవ హింపసాగెను. అదిజూచి రాముడుగ్రుడై యటనున్న దర్భకాండము నభిమం త్రించి వానిపై ప్రయోగించెను. రామచంద్రుని హృదయము సజ్జనులయం దెంతసరళమో దుష్టులయందంత పరుషము. అపు డాదర్భకాండము భయం

కర్మై మండుచు వానిని వెంబడించెను. అంత నావాయసము భయమంది పరుగిడుచు నింద్రుని శరణమర్థించెను. రామకోపపాత్రుల నెవరు రక్షింప గలరు? ఇంద్రు డాతని నుపేక్షించెను. అంత నావాయసము ముల్లోకముల నెందును శరణమునుగానక ఖిన్నమై విచారించుచుండ సంతనారదు డాతనికి బ్రత్యక్షమై రాముని ప్రభావమును జెప్పి నీవారామచంద్రునే శరణువేడుము. మఱియొకరు నిన్ను రక్షింపజాలరన నాతడు తోడనె రామసన్నిధికేగి శరణము నర్థించుచు నిట్లనియె. రామచంద్రా! నీప్రభావము నెఱుంగని నాయవి వేకకృత్యమును సైరించి నన్ను రక్షింపుము. నీకన్ననాకు వేఱుగతిలేదని మొఱవెట్టు నావాయసమును మన్నించి, తన యమోఘసాయకమునకు వాని కన్ను నెఱవెట్టి వానిని విడిచిపుచ్చెను. అట్లు రామచంద్రుడు జితకూటమున వసింపుచు పరమపావనమగు దనచరితమునట గొంతజఱపి, ఇంక నిటనుండిన మఱల నయోధ్యాపురవాసులు వచ్చెదరను తలంపుతో నాప్రదేశమును వీడ దలచి యచటిమునుల యనుమతినంది అత్రియాశ్రమమునకు బోవనెంచి సీతా లక్ష్మణులతో బయలుదేరి యటకేగెను. వారిరాకను జూచి ఆమహర్షి హర్ష సంపుల్లహృదయుడై ఎదురేగి వారల సమీపించెను. అంత రామలక్ష్మణు లాతనికి నమస్కరింప నామునివారల గౌగలించుకొని యానందాశ్రువుల వారి శిరముల దడుపుచు దనయాశ్రమమునకు దోడితెచ్చి యర్ఘ్యాదు లొసంగి యుచితాసనమున గూరుచుండబెట్టి వారల దివ్యమంగళవిగ్రహముల దనివిదీర గని ఇట్లు వినుతించెను.

శ్లో॥ నమామి భక్తవత్సలం కృపాళుశీలకోమలం
భజామి తే పదాంబుజం అకామినాంస్వధామదమ్
నికామ శ్యామసుందరం భవాంబునాశ మందరం
ప్రఫుల్ల కంజలోచనం మదాది దోషమోచనమ్॥

శ్లో॥ ప్రలంబబాహువిక్రమం దురూహదివ్యవైభవం
నిషంగచాపసాయకం భజేత్రిలోకనాయకమ్।
దినేశవంశమండనం మహేశచాపఖండనం।
మునీంద్రచిత్తరంజనం సురారిబృందభంజనమ్॥

శ్లో॥ మనోజవైరివందితం అజాదిదేవసేవితమ్
విశుద్ధబోధవిగ్రహం సమస్తదుఃఖతాపహమ్
నమామి ఇందిరాపతిం సుఖప్రదం సతాంగతిం
భజేసశక్తిసానుజం శచీపతిప్రియానుజమ్॥

శ్లో॥ త్వదంఘ్రిమూలమేవ యేభజంతి హీనమత్సరాః
పతంతి నో భవార్ణవే వితర్కవీచిసంకులె
ప్రబుద్ధయోగిన స్సదాభజంతి ముక్తయె ముదా
నిరస్యచేంద్రియాదికం ప్రయాంతి తే నిజంపదమ్॥

శ్లో॥ త్వా మేక మద్వయం ప్రభుం నిరీహ మీశ్వరం విభుం
జగద్గురుంచ శాశ్వతం తురీయమేవకేవలం
భజామి లోకవల్లభం కుయోగినాం సుదుర్లభమ్
స్వభక్తకల్పపాదపం సమంసునేవ్య మన్వహమ్॥

శ్లో॥ అనూనరూపసంపదం నతోహముర్విజాపతిం
ప్రసీద మె సమామి తె పదాబ్జభక్తిదో హి మె
పఠంతి యె స్తవం త్విమం నరాఽఽదరేణ తే పదం
వ్రజంతి నాత్రసంశయ స్త్వదీయభక్తిసంయుతాః॥

ఇట్లు స్తుతించి ప్రభూ! నామన సెన్నడును తమ పదకంజముల బాయ కుండునట్లనుగ్రహింపు మన నాతని యాదరాభిమానములకు రామచంద్రుడు మిగుల సంతసించెను. పిమ్మట సీత సవినయముగ నాతని భార్యయగు ననసూ యాపదములకు ప్రమొక్కి యామె యాశీస్సులనందెను. అంత ననసూయ సీతకు దివ్యవస్త్రాభరణాదుల నొసగి తల్లీ! వీనిని నీవు ధరింపుము. వీనివలన నీదుఃఖ ములు దూరమై మంగళములు చేకూరును. అని చెప్పి మఱల మధురభాషల నిట్లనియె. రాజపుత్రీ! ప్రాజ్ఞవగు నీకు దెలియనిది లేదు. అయినను నాకు దోచినదానిని జెప్పుచుంటిని. స్త్రీలకు భర్తృతుల్యమగునది మఱియొకటి లేదు. తల్లిదండ్రులు బంధువులును ఇచ్చున దల్పము. భర్త ఇచ్చున దమితము. పతి దేవతలగు స్త్రీలకు బడయరానిది లేదు. వారి కెందును భయముండదు. ఉత్త మాంగనలు శ్వశుర పితృకులముల నుద్ధరింతురు. వంశముల నుద్ధరించుటకు నధో గతిపాలు చేయుటకును స్త్రీలే కారణము. భర్త ఎట్టివాడైనను నాతనిని త్రిశు

ద్ధిగ సేవించు వనితల కిహాపరములు హ స్తగతములు. మనోవాక్కాయములచే నవ్యభిచరితలగు మానవతుల కగ్ని చందనశీతలమగును. దేవతలును బ్రసన్ను లగుదురు. సహజపతివ్రతాశిరోమణివగు నీకీయుపదేశ మక్కరలేదు. కాని లోక మున్నకై జెప్పితిని. నీవు రామచంద్రుని యర్ధాంగివి. జనకరాజపుత్రివి. నిన్ను దలంచినవారు సకలపాపవినిర్ముక్తు లగుదు రన నాసీత మోము వాంచి మఱల నామెకు నమస్కరించెను. అంత రాము డత్రిమహర్షిని జూచి, మునీశ్వరా! మేమిట గొంతకాల ముండవలయును. కాన మానివాసమున కనువగు తావును నిర్దేశించి మార్గమును జూపుడన నాముని మిగుల సంతసించుచు నిట్లనియె. ప్రభూ! అజరుద్రాదులు సనకాదిసిద్ధులు నీకృప కెదురుచూచుచుందురు. నీవు సర్వాంతర్యామి యగు సర్వజ్ఞుడవు. నీకు దెలియనిమార్గ మేమున్నది? నీవు దుష్టశిక్షణమునకును శిష్టరక్షణమునకును మాయామానుషవిగ్రహము నూనిన పరమపురుషుడవు. నాయదృష్టముచే నీదర్శనభాగ్య మబ్బినది. నేనెంతేని ధన్యు డనని యానందాశ్రుపూరిత నయనములతో పులకితగాత్రుడై ముని యాతని దివ్యమంగళవిగ్రహమును రెప్పపాటులేక జూచుచు నిట్లనియె. రామచంద్రా! నీయునికికి దగిన ప్రదేశ మీదక్షిణదిశనున్నది. కాన నీవట కేగుమన రామ చంద్రు డామునికి నమస్కరించి బయలుదేరెను. రామలక్ష్మణుల నడుమనున్న జానకి జీవబ్రహ్మల మధ్యనున్న మాయవలె నుండెను. వారట్లు జనుచు మార్గ మునందుండెడి నదులను, వనములను, పర్వతములను, జూచుచు నట నుండెడి మృగవిశేషముల గనుగొనుచుండిరి. వారి కామార్గమంతయు జలఫల కుసుమసమృద్ధమై మందమారుతములతోడను మేఘవృక్షచ్ఛాయలతోడను సుఖప్రదమై యుండెను. వారిట్లు జనుచుండ విరాధుడనురాక్షసు డొకడతి భయంకరాకారముతో మార్గమధ్యమున వారినడ్డగించి సీతనపహరింప దలం చెను. వానినిజూచి సీత భయమందుచుండ నంతలో లక్ష్మణుడొక బాణముచే వానివక్షమును భేదించెను. అంత నాదానవుడుగుపితుడై యంతకునివలె శూల మునుజేకొని వారిపై బ్రయోగించెను. దానిని రామచంద్రుడు మధ్యమునన నె దనబాణముచే ఖండించెను. ఇంతలో లక్ష్మణుడు వేఱొకబాణమును వానిపై బ్రయోగింప నారాక్షసుడతిక్రుద్ధుడై, నాఎదుటబడిన మీరెందుపోగలరనుచు నత్యుగ్రుడై వారలపై బడుచుండ నాకసమున దేవత లాహాకార మొనరించుచుం

డిరి. అంతనాదానవుడు వృక్షశిలావర్షమును గురియింప వానినన్నిటిని రామచంద్రుడు తనబాణములచే వారించి వానిని దునుమాడెను. తోడనె వాడొక గంధర్వుడై రాముని సన్నుతించి యాతనియనుగ్రహమును వడసి తనత్రోవనేగ దేవతలారామవిజయమునకు సంతసించుచు పూలవాన గురియించిరి. అంత సీత రామచంద్రుని భయభ్రాంతనయనయై కౌగలించుకొనియెను. సీతా! వనవాసక్లేశమెట్టిదో చూచితివాయని రాముడు మందహాస మొనరించెను. పిమ్మటవారు శరభంగాశ్రమమునకు బోవుచుండ నంతలోనింద్రుడు రావణసంహారమును గూర్చియు నితరరాక్షస సంహారమునుగూర్చియు శరభంగద్వారమున రామునకుదెలుపనెంచి రథారూఢుడై చనుదేర నాకసమున వెలుగుచున్న ఇంద్రునిరథమును రామచంద్రుడు సీతాలక్ష్మణులకుజూపి ఇంద్రునిప్రభావమును వారలకెరిగించెను. ఇంద్రుడశేషరాక్షసవినాశమును గోరుచు రామునితో మాటాడక శరభంగునితో నన్నివిషయములజెప్పి తనత్రోవనే బోయెను. రామచంద్రుడు సీతాలక్ష్మణులతోగూడి శరభంగాశ్రమమును జేరినంతనె శరభంగుడా రామచంద్రుని ముఖకమలమునందలి శోభామకరందమును దననేత్రభ్రమరములచే బానముచేయుచు ధన్యుడై రామునితో నిట్లనియె. ఓ కృపానిధీ! నేను బ్రహ్మలోకమునకు బోదలంచియు నీయాగమనవార్తను విని నీరాక కెదురుజూచుచు నిటనుంటిని. నేటికి నాకోరిక దీరినది. ఓ శంకరమానసరాజహంసమా! యీదీనుని కృపజూడుము. నాతపఃఫలమునంతను నీకర్పించుచుంటిని. నాకునీయనన్యభక్తిని బ్రసాదింపుమని యానీలమేఘశ్యాముని హృదయమునందిడి యోగాగ్నిదగ్ధశరీరుడై యాతని దివ్యధామమునకరిగెను. అచటి మునులాశరభంగుని యచలభక్తికి మెచ్చుకొనుచుండిరి. పిమ్మట సీతారామలక్ష్మణులతోగలిసి వారందఱు జయజయధ్వానము లొనరించుచు నడచుచు రామచంద్రా! ఈ ఎమ్మెలప్రోవుల జూడుము. ఇవిరాక్షసులు మునులదిని పారవైచిన ఎముకలరాసులు. దీనదయాళూ! మమ్మారాక్షసుల బారినుండి కాపాడుము. అను వారలదీనాలాపములకు జాలినొంది ఇక లోకము నరాక్షస మొనరించి మీభయమునువాపెదనని ప్రతిజ్ఞచేసెను. అట్లుబోవుచుండ నామార్గసమీపమున నగస్త్యశిష్యుడగు సుతీక్ష్ణుడు తపమాచరించుచుండెను. ఆతడు అన్యదేవతలవీడి రామునే ధ్యానించుచు నాతనిదర్శనమునకై నిరీక్షించుచుం

డెను. అంత రామచంద్రుడాతని బరీక్షింపదలచి కనబడియు మఱలకనబడ కుండెను. అంతనాముని మిగులవిచారించుచు రామచంద్రుని దర్శనమబ్బుభా గ్యము దనకులేదని విచారించుచుండ నాతనిభక్తికిమెచ్చి రామచంద్రుడు తన దివ్యరూపమును జూపెను. అంత నతడాదివ్యమంగళవిగ్రహమునుజూసి యాత నికి నమస్కరింపగా నాతడా మేఘశ్యామలరూపమునుజూచి యానందనిర్భరమా నసుడై చేష్టలదక్కి నిర్నిమేషముగజూచుచు నాదేహప్రభను బొనముచేయుచు నాతనికి మనమునందే వివిధపూజలుజేయుచు నిట్లనియె. అనంతకల్యాణగుణ సంపన్నుడవగు నిన్ను స్తుతింప బహ్మాదులకును దరముగాదు. నేనెంతటివాడను. ప్రభూ! ఈదీనుని యనుగ్రహింపుమని మాటిమాటికి నాతని స్తుతింపుచుండెను. పుండరీకాక్షుడును, ఘనశ్యాముడును, జటాజూటధారియు, ధనుర్బాణధరుడు నగు రామచంద్రునికి నేను నమస్కరింతును. ఎవడజ్ఞానమహారణ్యదావానలమో ఎవడు సత్పురుషకల్పవృక్షమో, ఎవడు రాక్షసమత్తేభకంఠీరవమో, ఎవడు భక్తమందారమో, ఎవడు సంసారమహార్ణవోత్తారనౌకయో, అట్టి రాముడు నాహృదయమున వసించుగాక. మఱియు, నెవడు సగుణనిర్గుణరూపుడో, ఎవడద్వితీయ సత్యజ్ఞానానందరూపుడో, ఎవడవాఙ్మానసగోచరుడో, ఎవడు జగదుత్పత్తిస్థితిలయహేతువో, ఎవడాద్యంతరహితుడో, అట్టి రాముడు నాకు దిక్కు. ఎవడు భూభారమును దొలగించుటకు రఘువంశమునం దుద్భవించెనో, ఎవని నామము సకలదురితసర్పగరుడుడో, ఎవడు దుష్టశిక్షణ శిష్టరక్షణము నకు బద్ధకంకణుడో, అట్టి దీనదయాళువు నన్ను రక్షించుగాక. అని భక్తిపరా ధీనుడై యెడలెఱుంగక చేతులు జోడించి యానందాశ్రుపూరితనయనుడై ఎదుటనున్న యామునినిజూచి యతని భక్తికి సంతసించుచు రామచంద్రు డాతనిని దనపాణిపల్లవమున స్పృశించి ఇట్లనియె. మునీంద్రా! నీభక్తికి మెచ్చితిని. నీకేమిగావలయునో! కోరుకొనుమన నాతడు ప్రభూ! అజ్ఞుడనగు నాకేదిశ్రేయస్కరమో నాకు దెలియదు. కాన నీవే నాకనువగుదాని నెంచి ప్రసాదింపుమన నాతని నిష్కలంకహృదయమును మెచ్చుకొనుచు,నోమునీంద్రా! యోగిదుర్లభమగు యనన్యభక్తిని నీకు ప్రసాదించితి. నీవు కృతార్థుడవని యాతనితోబల్కి యాతనివీడ్కొని క్రమముగ నగస్త్యాశ్రమమున కేగెను. సుతీక్ష్ణుడు నట్లురాముని యనుజ్ఞవడసి తోడనె అగస్త్యాశ్రమమున కేగి గురువు

నకు బ్రణమిల్లి, గురువర్యా! ఎవని పదకమలముల ననవరతము ధ్యానించు చుంటిమో, ఆకోసలాధీశుడు, ఆఘునశ్యాముడు. అరఘుకుల తిలకుడు, సీతా లక్ష్మణసహితముగ నిటకువేంచేయుచున్నాడను నాయమృతోపమలగు వాక్కు లవిని యగస్త్యుడు పులచికితగాత్రుడై లేచి ఎదురేగుచుండనంత సీతారామలక్ష్మ ణులాతని సమీపించి నమస్కరింప నాతడు వారలనాశీర్వదించి తన యాశ్రమ మునకు దోడితెచ్చి, యుచితాసనమున గూరుచుండబెట్టి యర్ఘ్యపాద్యాదుల బూజింప నంతలో నచటిమునిబ్రాత మెల్ల నచటికివచ్చి రామచంద్రునిదర్శించి కృతార్థమాయెను. అంతరామచంద్రు డగస్త్యునితో నిట్లనియె. మునిచం ద్రమా! సర్వజ్ఞులగు మీకు నాప్రతిన దెలియనిదికాదు. కాన నాప్రతిజ్ఞ సఫల మగుపద్ధతి నానతిండన నాముని నవ్యుచు నిట్లనియె. ఓ మాయామానుష విగ్రహా! సకలబ్రహ్మాండ కారణమగుమాయ మీపాదకమలమును ఆశ్ర యించియుండెను. బ్రహ్మాండములా మాయయందు మేడిచెట్టునందు ఫలముల వలె బ్రవేలాడుచుండును. అట్టి పరబ్రహ్మస్వరూపుడును, మాయాతీతుడవు నగు నీసగుణరూపమును ధ్యానించుచు నీయనుగ్రహమును బ్రార్థించెడిమమ్ము నీవిట్ల డుగుట భక్తజనానుగ్రహమును బ్రకటించుటగాక వేఱొండుగాదు. కాన నాకుదెలిసినది జెప్పెదను వినుము. ఇచటికి దక్షిణముగ బంచవటియను మనో హరక్షేత్రమొండు కలదు. అద్దాని కనతిదూరమున గౌతమి ప్రవహించుచు న్నది. దానినానుకొని దండకయను మహారణ్యముకలదు. నీవటనివసించి మునుల యభిమతమునుదీర్చుచు నావనమును నిష్కంటకమొనరింపుమన రామచంద్రుడు వంచవటికి బ్రయాణమయ్యెను. అట్లుచని పంచవటి యందొక పర్ణశాలను నిర్మిం చుకొని అందు సీతాలక్ష్మణులతోగలిసి సుఖముగ గాలము గడుపుచుండెను. రామచంద్రుడు నివసించుటచే నావనము నిర్భయమై శ్లాఘ్యమై దినదినప్రవర్ధ మాన శోభాభరితమై విలసిల్లుచుండెను. అంత నొకనాడు సుఖాసీనుడైన రామచంద్రుని పదములకు నమస్కరించి సౌమిత్రి సవినయముగ నిట్లనియె. ప్రభూ! జ్ఞానవైరాగ్యస్వరూపమును, భక్తిప్రభావమును, జీవేశ్వరభేదమును సుస్పష్టముగ నానతీయవలయును. అన నాతనికి రామచంద్రు డిట్లనియె. సోదరా! నీప్రశ్నముల కుత్తరముల జెప్పుచుంటిని. సావధానముగ వినుము. అహంమమాభి మానము మాయ. మాయావశుడు జీవుడు. వశీకృత మాయ

కలవాడీశ్వరుడు. జీవుడు మాయావశుడగుటచే నాతనికి స్వస్వరూప జ్ఞాన ముండదు. ఆతడు మాయాపరతంత్రుడై సంసారార్ణవమున మునుగుచు దేలుచు నుండును. ఈశ్వరుడు మాయావశుడుకాడు. కాన నాతని సర్వజ్ఞత్వాది గుణములకు భంగములేదు. మఱియు నాతడీ మాయకు బేరకుడై సకలజగత్సృష్టిస్థితిలయముల జేయుచుండును. మఱియు నీమాయ విద్యా విద్య భేదమున ద్వివిధము. అందవిద్య దుఃఖమూలము. విద్యవలన పురుషుడు తరించును. మాయవలననే జీవేశ్వరభేద మేర్పడుచున్నది. అందీశ్వరుడు సేవ్యుడు జీవుడు సేవకుడు. ఈశ్వరుడు నిత్యముక్తుడు. జీవుడు బద్ధుడు. దర్పణమువలన ముఖమునకు బింబప్రతిబింబభావ మేర్పడినట్లు మాయవలననే జీవేశ్వరభావ మేర్పడుచున్నది. ఈప్రపంచము బ్రహ్మకన్న వేఱుగ లేదని దెలియుటయే జ్ఞానము. ప్రపంచమంతయు దుఃఖమయమని దెలిసి అద్దానినివిడచుట వైరాగ్యము. నిష్కామకర్మలు చిత్తసుద్ధిమూలమునను, వైరాగ్యము సహజముగను జ్ఞానోత్పత్తిసాధనములు. కాని జ్ఞానము దుస్సాధ్యము. నేను భక్తిచే ద్వరలో బ్రసన్నుడ నగుదును. భగవత్ప్రాప్తి సాధనములలో భక్తివంటిది వేఱొండులేదు. భక్తునకు వినిపాతములేదు. నేను భక్తపరాధీనుడను. భక్తి యనుపమ సుఖసాధనము. ఎవడు సర్వకర్మలను నాయందర్పించి నన్నే సేవించునో, వానికినేనత్యంత సులభుడను. నేను వానిహృదయము నెన్నడువిడువను. వాడు నాకత్యంతప్రియుడు. అనిరామచంద్రుడు లక్ష్మణునిప్రశ్నములకు సదుత్తరములజెప్పి వారటబ్రశాంతముగ కాలమునుగడుపుచుండ నొకనాడు రావణావరజయగు శూర్పణఖ యటకరుదెంచి రామునిమోహనరూపమునుగాంచి కామవివశయయ్యెను. స్వభావచపలలగుస్త్రీలు సుందరపురుషునిజూచినంతనె యుక్తాయుక్తములగణింపక కామవివశలగుదురు. కాన యౌవనమదాంధయగు శూర్పణఖ, సకలజగన్మోహనాంగుడగు రామునిగామించుట కేమివింత? తోడనే యామెయు లోకోత్తరరూపమునుధరించి రామునిచెంతనిలిచి ఇట్లనియె. ఓపురుషశ్రేష్ఠా? ముల్లోకంబుల నిన్నుబోలినవాడెందును లేడు. నేనునాకు దగినవరు నన్వేషించుచు ముల్లోకములదిరిగి ఎందునునీవంటి వానిని గానైతిని. కాన కన్యనగు నన్ను బరిగ్రహించి సుఖింపుమన రామచంద్రుడు నవ్వుచు నోసీ! నాకు భార్యకలదు. కాన నాతమ్ముడచట నున్నవాడు. వానికడకేగుమన వల్లెయని యామె

లక్ష్మణునికడకేగి తనయభీష్టమును దెలుప నాత డిట్లనియె. ఓసీ! నేను సేవకుడను. నన్ను వివాహమాడి నీవును దాస్యమును గొనిదెచ్చికొనియెద వెందులకు? నీవాతనివద్దకేగి యాతనినేవరింపుము. మఱియు జ్యేష్ఠుని ప్రేమించిన నీవు నాకు బూజ్యురాలవు. నిన్ను నేనెట్లు గ్రహింతును. కాన నీవాతని యొద్దకే బొమ్మన నది మఱల రాముని యొద్ద కేతెంచెను. దీని నంతను చూచి సీత నవ్వగా నోసీ! హరిణము వ్యాఘ్రిని హసించుచున్నది. చూడుము. నీనవ్వున కనువగు ఫలము ననుభవించెద వనుచు నిజరూపముతో సీతను బట్టుకొన బోవ నంతలో లక్ష్మణు డామెస్వరమును రూపమునుజూచి తోడనె తనఖడ్గముచే నామె కర్ణనాసికలగోసి పారద్రోలెను. తోడనె యది యాక్రోశించుచు దన యన్నయగు ఖరునికడకేగి తన యవస్థను జరిగిన వృత్తాంతమును జెప్పి నాతడు విధూమానలమువలె మండిపడుచు నేమీ? ఒకసామాన్యమానవు డిట్లు భంజించెనా? చూడు! నామహిమ. నేటితో ప్రపంచ మమానుష మగునని చెప్పి యామె నోదార్చి తనసేనలనన్నిటి నాయత్తముగావించి యామెను ముందుంచుకొని వారలజూపుమనుచు బయలుదేరెను. వికృతాంగిని ముందిడుకొనుటయే వారికమంగళమయ్యెను. అట్లు చలించుచున్న పర్వతములవలె రాక్షసవీరులు బయలుదేఱినతోడనె భూమి కంపింపసాగెను. సాగరములు ఘూర్ణిల్లుచుండెను. అప్పు డారజనిచరసేనాకలకలములువిని సీతాకపోలదర్పణమున జటాజూటమును సవరించి దృఢముగ బంధించి తమ్మునితో నిట్లనియె. లక్ష్మణా! ఈకలకలమునుబట్టి రజనీచరసైన్యములు వచ్చుచున్నట్లున్నది. కాన నీవీజానకిని బర్ణశాలలో భద్రముగ గాపాడుచుండుము. నేనచిరకాలములో నీరాక్షసానీకముల దునుమాడి మిమ్ములగలియుదునని వారినటకుబంపి తానుధనుర్బాణములధరించి గజయూథమున కెదురేగు మృగాధిపునివలె ధీరగంభీరదృష్టులతో నటుజూచుచుండెను. అట్లుసన్నద్ధులగు నారాక్షసులజూచి ఖరుడుసంతసించుచు దూషణ త్రిశిరస్కులతో నిట్లనియె. మీరిరువురు నారాజపుత్రులనిర్జింపుడు. నేనాతని భార్యను బంధించెదననుచు రామచంద్రుని ముట్టడించెను. కాని యాతని దుర్నిరీక్ష్యరూపమును జూచి ఎవరునేమియు జేయజాలక నిశ్చేష్టులై యూరకుండిరి. అంతఖరుడు దూషణునితో నిట్లనియె. ఓయీ సురగరుడోరగ యక్షరాక్షసులలో నిట్టిరూపము నెన్నడునుజూచుటలేదు సరిగదా! వినియు

నుండలేదు. కాన వీనిజంపనుంకింపననుచు నొకనిని బిలిచి ఇట్లనియె. ఓరీ! నీవు పోయి నామాటగా నామానవునితో నిట్లనుము. ఓరిమానవా! నీవు మాసోదరి నవమానించి మాకెంతేని యపకృతినొనర్చితివి. ఐనను నాసోదరి నిన్ను బ్రేమించుటచే నిన్నుజంపుటకు మనసొప్పకున్నది. కాన నీవు మాచెలియలి యభీష్టమును నెఱవేర్చిమాకింకరుడవై నీప్రాణముల గాపాడుకొనుము. అట్లు జేయవేని నిన్నచిరకాలమునసె వధించిభక్షింతుమన నాతడు రామునికడకేగి యావృత్తాంతము నంతనుజెప్ప రామచంద్రుడు మందహాస మొనరించుచు నిట్లనియె. ఓరీ! రాజపుత్రులమగుమాకు రాక్షసాంగనలతో బనిలేదు. మేము రాక్షససంహార మొనరించుటకె ఇటకు వచ్చితిమి. కాన మాకు మీరన్నను యుద్ధమన్నను భయములేదు. నీవు దూతవగుటచే విడిచిపుచ్చితిని. నీవుపోయి మీప్రభువును రణరంగమున బాహుబలమును జూపుమనుమన వాడేగి ఖరునితో నావృత్తమెఱిగింప నాతడు క్రుద్ధుడై పండ్లుగొఱుకుచు దనసైనికుల బురికొలుప నంతలో రామచంద్రుడు ధనువునందల్లెత్రాటిని సంధించి, టంకార మొనరింప నాధనుష్టంకారము భూనభోంతరాళమునవ్యాపించి రాక్షసశ్రవణవిదారక మగు చుండెను. అంత పదునాలుగువేల రథికులు శ్రీరామునిమీట్టడించి యాతనిపై నిశితబాణవర్షమును గురియింప రాముడా బాణజాలమును మఱలించి యా రాక్షసానీకమునుదసబాణాసారమున ముంచుచుండెను. ఇట్లాచతర్దశ సహస్ర సంఖ్యాకయోధుల నొక తృటికాలములో మడియించెను. అంతనారాక్షస సైన్యము నందొక్కడైనను మిగులకుండ నారామబాణాసారమున మునిగి పోయెను. రణభూమియంతయు రాక్షసకళేబరములతోడను, శిరస్సులతోడను, బ్రేవులతోడను, అస్థికూటములతోడను, మాంసఖండములతోడను, రక్తప్రవాహములతోడను నటసంచరించెడి భూతప్రేతపిశాచములతోడను, గృధ్రికాకాదిపక్షులతోడను యమసదనమువలె జూపఱులకతిభయంకరమై యుండెను. అట్లురాక్షసుల నందఱదునుమాడి జయలక్ష్మితో విరాజిల్లుచున్న రామచంద్రునిపై దేవతలు పూలవానను గురియించి యాతనిపరాక్రమమున కచ్చెరువందుచు నాతనిని బహుభంగుల గొనియాడుచు నిజనివాసములకేగిరి. అట్లు రాక్షసులదునుమాడి దండకనునిర్బాధ మొనర్చి యచటిమునిప్రాంతమున కభయమునుజేకూర్చి రామచంద్రుడు పర్ణశాలాప్రాంతమునకురా సీతాలక్ష్మణు

లాతనిదర్శించి పాదములపై బడి నమస్కరించిరి. అంతరాముడాతనిలేవనెత్తి కౌగలించుకొనియెను. పిమ్మట హర్షపులకితగాత్రయగుసీత తనభర్త విజయమున కమితానందమునందుచు మెలమెల్లన నాతనిజేరంజని తిరిగిప్రణమిల్లెను. ఇట్లు దండకనరాక్షస మొనరించి సీతాలక్ష్మణులతో గూడి రామచంద్రుడట బ్రశాంతముగ గాలమునుబుచ్చుచుండెను. అంతశూర్పనఖ లంకకేగి రావణునితో నిట్లనియె. అన్నా! నేనెంతపరాభవమునొందితిని? నీవునీదేశమును ప్రజలను, జనానాను, బొత్తుగామరచి, దివారాత్రములు, సురాసక్తుడవై, మైమరచి, బొత్తుగలోకపుసంగతిని బట్టించుకొనుటయే లేదు. నాసంగతేమియు నీకు తెలియనేలేదు కాబోలును! శత్రువు నీతలపై బడ సిద్ధముగానున్నాడు. రాజనీతిలేని దానధర్మములు, హరిసమర్పణములుకాని సత్కర్మలు, జ్ఞానము లేని విద్యయు వృథాశ్రమలుకదా! సాంగత్యముచే యతీశ్వరుడు, కుత్సిత మంత్రిచే రాజు, లాలనచే సుతుడు, అభిమానముచే జ్ఞానము, సురాపానముచే లజ్జ, వినమ్రతలేమిచేబ్రీతి, చెడిపోవునుకదా? శత్రువు, రోగము, అగ్ని, పాపము, ప్రభువు, సర్పము, చిన్నదైనను నిరసించరాదు. అయోధ్యాధిపుడగు దశరథుని పుత్రులు రామలక్ష్మణులనువారు తండ్రియనుమతిని దండకాటవికివచ్చి యట నివసించుచున్నారు. వారలోకసామాన్యపరాక్రమవంతులు. వారు మునులపాలిట కల్పవృక్షములై మనపాలిటయమసదశ్యులై యున్నారు. వారు మునులకభయము నిచ్చి మనజాతిని నిర్మూలించుచుండిరి. వారితో నొక వామలోచనగూడకలదు. ఆమె సౌందర్యరాశి. ఆమెనుబోలిన అందకత్తె ముల్లోకములందునులేదు. ప్రపంచమునందలి సౌందర్యమునంతను ప్రోవుజేసి బ్రహ్మయామెను సృజించియుండెను. వేయేల! ఆమెనుజూచిన, స్త్రీలకును మోహ ముదయించును. రతినిమించిన రూపవతి. ఆమెనుజూచినతోడనె యామెను మనలంకలో నీకర్ధాంగిగ జేయదలచితుద కిట్టి యవమానమునకు భాల్పడితిని. నాయీ యవమానమును జూచి సహింపజాలక మనఖరుడు మున్నగు రాక్షసవీరు లాతనితో దలపడి తుద కాతనిచే మడిసిరి. శత్రువుప్రగల్భుడు కాననీవాతనిదునుమాడినా యీయవమానమును, దీర్చి ఖరాదులకు ప్రీతినగలిగింపుము. అట్లుకానినాడాతడింకనుబలుడై మనరాక్షసవంశమున కింకను హానినికలిగించునని యతిదీనముగ బరిదేవన మొనర్చి నామెనోదార్చి, చెలియలిని వికృతాంగి నొనర్చుటచేతను, ఖరాదులదును

మాడుటచేతను, కుసితుడై రాముడు తనతలపై రెండుపాదములనుంచెను. ఈయవమానము నాదికాని నీదికాదు. కాన నారామలక్ష్మణులజంపి, యాతని భార్యను జెరవెట్టితీరుదు నని యామెతో జెప్పి యామెను నిర్విచారముగ నుండుమని శత్రువునుద్దేశించి దలపోయసాగెను. లోకపాలురు మున్నగువా రెవ్వరైనను నాయనుచరులనైన నోడింపజాలరు. మఱియు ఖరదూషణాదులు నాతో సమమగు బలవంతులు. వారిని భగవంతుడుదప్ప నింకెవ్వరును సంహరింపజాలరు. కాన భగవంతుడే దేవతలకానంద మొనగూర్చుటకును పృథ్వీభార మును దొలగించుటకును నీరాముడై యవతరించియుండనోపు. సందియములేదు. నేనునుదామసుడనై యకృత్యములనెన్నేనియొనరించితిని. ఇకనైనను దరణోపాయము సరయవలదా ! నావంటివాడు జపతపస్సులచే దరించుట దుర్లభము. ఈతుచ్ఛభోగములతో విసిగితిని. కాన నాకిపుడొకటి తోచుచున్నది. భక్తివైరములలో దేనిచేతనైనను భగవంతుని సేవించినవారు తరింతురు. అందును భక్తికన్నను వైరము శీఘ్రముగ భగవత్సన్నిధిని జేర్చును. కాన నాతడు భగవంతుడే అయిన నేనచిరకాలములో నాసర్వస్వము నాతనికి రణయజ్ఞమునం దర్పించి కృతార్థుడ నయ్యెద. సామాన్యమానవుడయ్యెనేని నేనాతనివధించి, యాతనిభార్యనుహరించి వైరనిర్యాతన మొనరించెదను. ఎట్లైనను మనకిపు డా యోధనము కర్తవ్యమని నిశ్చయించి, తానొంటరిగ రథాధిరూఢుడై ప్రయాణ మును సాగింపుచు రావణుడు గరుడపక్షివలె అతివేగముగ ప్రయాణము సాగించుచు, అసమాన ధైర్యసాహసములు కలవాడై దివ్యతేజస్సు గలిగి శిరంబులనుచామరంబులచే సుశోభితుడై, శ్యామవర్ణముగల ఛత్రము కలవాడై అనేక నదీనదంబులు. వాపీకూప తటాకంబులు పర్వతంబులు పుష్పవనములు, తోటలు మనోహర సరస్సులు, పవిత్రనగరములు, ఋషులయాశ్రమంబులు, అనేక తటాకంబులు అట విహరించు, పవిత్రఖగమృగంబులు. మాటలాడు శుకశారికంబులుజూచుచు, రావణుడు గగనమార్గంబున ప్రయాణము సాగింపు చుండెను. శతయోజన విస్తీర్ణమైన సముద్రతటమున, వివిధజీవజంతువులు దివా రాత్రములు వివిధగర్జనలతో కోలాహలములు చేయుచుండుట ఆరాక్షసుడు తిలకించుచు, కొన్ని గర్జనలు ఘీంకారములు, సకిలింపులు, గంతులు, కూతలు, మొదలగునవి వింతగాజూచుచు, బలవంతుల వీరాలాపంబులు వినుచుండెను. పక్షి

జాతులన్నియు ఇసుకతిన్నెలమీదకూర్చుని, విహరించుచు, నెగురుచున్న రావణునిజూచి జీవులన్నియు భయపడసాగెను. అట్లు రావణుడు మారీచునియాశ్రమమును జేరికొనెను. అటరామచంద్రుడొకనాడేకాంతమున సీతతోనిట్లనియె. సీతా! పతివ్రతవగు నీవు మనకార్యము పూర్తియగునంతవఱకు నగ్నియందు బ్రవేశించి నీప్రతిబింబమునిటనుంచుము అని భవిష్యత్తునంతను వివరించిచెప్ప నామెభర్త చరణకమలముల హృదయమునందునిలిపి తన ప్రతిబింబమునటనునిచి తానగ్నిలో బ్రవేశించెను. ఈరహస్య మాయిరువుఱకుదప్ప నింకేరికినితెలియదు. అట స్వార్థతత్పరుడగు రావణుడు మారీచుని దర్శించి యాతనికి నమస్కరించెను. హఠాత్తుగ వచ్చి సవినయముగ నమస్కరించిన రావణునిజూచి మారీచుడంతరంగమున భయమందుచు నేలకో! యీతడిట్లువచ్చి సవినయముగ నమస్కరించెను. నాప్రాణమును దీయనెంచెను గాబోలు ననుకొని యాతనిని గౌరవించి, రాక్షసేశ్వరా! నీవిట్లొంటిరిగ నరుదెంచుటకు కారణమేమన నాతడు జరిగినవృత్తాంతమును దననిశ్చయము నాతనికి దెలిపి ఇట్లనియె. మారీచా! నీవు దలంచిన నసాధ్యమెద్దియునులేదు. కాన నీవొక మనోహరమృగరూపమును ధరించి సీతా రాములచెంగట మెలంగుచు జానకికి మోహమును గల్పించి యామెను రాముని నకు దూరముజేయుము. తోడనే నేనాజానకినివంచించి లంకకుగొనిపోయెదను. రాముడంత జానకీవియోగమునగృశుడై బ్రాణములబాయును. దాన నశ్రమముగ మనకార్యములన్నియు జేకూరునన నామారీచుడు కొంతతడవు నిశ్చేష్టుడై మెల్లగనిట్లనియె. రావణా! రాముని మానవమాత్రునిగ దలంచుచుంటివి గాబోలు! అతనిపరాక్రమమును నీవెఱుంగవు. అతడు బాల్యమునను విశ్వామిత్రుని యాగసంరక్షణమునకై జని మార్గమధ్యమున నాగాయుతబలయగు తాటకను దునుమాడెను. పిమ్మట మఖవిఘ్నసంరబ్ధులమగు నన్ను నాయనుజుని చెఱియొకకోలతోగొట్టిన నాయనుజన్ముడు తోడనెమరణించెను. నేను చావుదప్పి నూఱుయోజనములనున్న సముద్రమున బడితిని. నాటనుండియు నాతనిపరాక్రమమునుదలంచుచు దలంకుచుంటిని. నాకానాటినుండియు నెటజూచినను రాముడే యగపడుచున్నాడు. మఱియు శివధనుర్భంగమొనరించి. పరశురాముని గర్వభంజన మొనరించిన యామహావీరునితో నీకువైరమేల? మనఖరదూషణాదుల వధమూలమున నాతని పరాక్రమము దెలియుటలేదా! రామవిరోధుల కెన్నడును

శాంతిసుఖము లుండవు సరిగదా రామవిరోధులు సకలబంధుమిత్ర పుత్రాదు లతో నశింతురు. మృత్యుదేవత శూర్పణఖారూపమున నిన్ను గ్రహేరణజేసెనని నాకుదోచుచున్నది. కాన నామాటలమన్నించి నీవు లంకకు మఱలిపోయి సుఖముగ నుండుమన నాతనిపలుకులకు రావణుడు మండిపడుచు, నోరీ! నాప్రతాపము నెఱింగియు నీవు నాచెలియలి కవమానమొనరించిన మానవునికి భయపడి ఇంటికి బొమ్మనుంటివా? ఓరిపందా! నాపనుపును మన్నింపనినా డీచందహాసముచే నిన్ను దొలుత దునిమి పిదప నామనోరథమును దీర్చికొనియెద నన నారావణుని మూర్ఖత్వమునకు చింతిల్లుచు నిట్లనితలపోయసాగెను. పామునకు బాలు విషమగునట్లు మూర్ఖునకు హితము నహితమే యగును. మఱియు నాసన్నమృత్యువుల కపథ్యమే హితమగుచుండును. ఇపుడునాకు జీవితాశ పోయినది. యీమూర్ఖుని పనుపును జేయనినాడీతడు నన్నుదప్పకజంపును. వీనిపనుపునుజేసిన నారాముడు నన్నువధించును. ఎట్లయినను మరణముతప్పని నాడీమూర్ఖునిచే జచ్చుటకన్న భగవంతుడగు నారామునిచే జచ్చుటయే మంచిది. బాగుగానాలోచించిన నాకీరావణునివంటిహితుడు మఱియొకడులేడు. ఎవనిస్మరణముచే యోగులు పరమసిద్ధులగుచుండిరో, అట్టిరామచంద్రుని కనులారజూచి యాతనితో నాటలాడుచు నాతనిబాణాగ్నిలో నీతనువునుత్రవేల్చి దివ్యధామము నశ్రమముగనందెదనని నిశ్చయించి యారావణునితో నిట్లనియె. ప్రభూ! నాయపరాధమును మన్నింపుము. నేను నీపరాక్రమమునెఱుంగని వాడనుగాను. వెనుక రాముడుకొట్టినదెబ్బ నాచేనట్లుబలికించెను. నేనును నీతోడనెవచ్చి వెనుకటినాకసిదీర్చుకొనియెదనని బలుకుచు నాతనితోగూడ బయలుదేరి సీతారామలక్ష్మణులు నివసించెడి పర్ణశాలాప్రాంతమునకుజని మోహనహరిణరూపమును ధరించి యాసీతారాములదర్శించుచు రాముని చరణకమలముల మనసునందిడికొని వారికనతిదూరమున జరింపుచుండెను. అద్భుతరూపముగల యామాయకురంగమును జూచిజానకి రాముునితోనిట్లనియె. నాథా! ఈకురంగమెంత వింతగనున్నదో చూడుము. ఇట్టిమృగమునెచ్చటను జూచియుండలేదు. నాముద్దునుజెల్లించి నాకాకురంగమునుబట్టితెచ్చియిండన నామెమాటలమన్నింపుచు దేవకార్యమును స్మరించుచు రాముడు లక్ష్మణుని జూచి, తమ్ముడా! ఇదిరాక్షసభూయిష్ఠప్రదేశము. ఇందేమరక సీతను గాపాడు

చుంకును. నేనీమృగమునుబట్టి తెచ్చెదనని యాతనిని సీతారక్షణార్థము నియమించి తానామృగమును వెంబడించెను. పార్వతీ! చూచితివా! ఎవని స్వరూపమునుజెప్పజాలక వేదములూరకుండెనో, ఎవడుమాయాతీతుడో, అట్టి రామచంద్రు డామాయామృగము నజ్ఞానివలె వెంబడించుచుండెను. అంత నామృగము రామునిచేజిక్కిన ట్లగపడుచు నాతనికి దొఱకకుండగ దప్పించు కొనుచు నాతనిని దవ్వులకు గొనిపోయెను. రామచంద్రుడంత విసిగి దానిని గ్రహించుట దుర్లభమనియు, అదిరాక్షసమాయకానోపుననియు దలంచి బాణమునుసంధించి దానినికూలనేసెను. తోడనె యామృగము హాసీతా! హాలక్ష్మణా! యని యార్తనాదమొనరించుచు, రామచంద్రుని యనుగ్రహ ముచే దనతుచ్ఛకళేబరమునువిడిచి యోగిదుర్లభమగు దివ్యధామమునందెను. మారీచుడు నిహతుడైనతోడనె దేవతలానందించుచు రామచంద్రుని కృపాతి శయమునకు మెచ్చుకొనుచు నాతనిపై పూలవానను గురియించిరి. అట్లసువుల బాయునప్పుడు మారీచుడుచేసిన యార్తనాదమునువిని సీత భయకంపితగాత్రియై దీనముగ లక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! స్త్రీలు మూఢచిత్తలు. నాకీ మృగాభిలాష మెంచలకుగలిగెను? నామూలమున నీయన్నగారికెట్టి యాపద వాటిల్లినదో తెలియకున్నది. ఆ యార్తనాదమును వింటివిగదా! నాపై చింతిల్లక నీవు త్వరగబోయి నీయన్నగారి కేమియాపద వాటిల్లినదో దెలిసికొని నీవాతనిదోడిదెమ్ము. నాకేమియుదోపకున్నదని గద్గదస్వరముతో బలుక లక్ష్మణుడు నవ్వుచు నిట్లనియె. అమ్మా! నీకేటికీవంత! రాముడెక్కడ! ఆర్తి యెక్కడ! ఆతనికెన్నడును నార్తియనునదిలేదు. నీవాతనినెఱుగనిదానివలె బలుకుచుంటివేల? ఇది రాక్షసమాయకాని వేఱొండుకాదన నామెలక్ష్మణుని శ్రవణపరుషములగు మాటలచే నొప్పింప నాతడేమియు బలుకక రాముని దలంచుచు తనదుష్కృతమును నిందించుకొనుచు నటనున్నవన దేవతలకా సీతను వప్పించి ధనుష్పాణియై రాముడుజనిన త్రోవనె బోయెను. గోమా తను విడచిపోవుచున్న లేగదూడవలె, సీతనుమాటిమాటికి వెనుదిరిగిచూచుచు లక్ష్మణుడు పోవుచుండెను. అన్నగారిమాటకు వ్యతిరేకించి వెళ్ళవలసి వచ్చెను గదా! యని ఒకబాధయు, సీతవంటరిగానున్నదని రెండవబాధయు గలిగి, వెలవెలబారు ముఖముతో తేజోహీనుడై అగ్నిచెంతనున్న మల్లిపూవువలె

నుండెను. అప్పుడు త్రిలోకకంటకుడైన దశకంఠుడు యతివేషముతో నొంటరిగ నున్నసీతను సమీపించెను. గరుత్మంతా!! భావిదశానురూపమగు కుత్సితబుద్ధి గల రావణుడట్లు సీతను సమీపించి కొన్ని పూర్వగాథలనుడిపి సామదానము లతో దన మనోభీష్టమును బయల్పఱచెను. అంత సీత వానినిజూచి భయముం దుచు నిట్లనియె. ఓయీ! నీవు నీయాశ్రమమునకు విరుద్ధముగ మాటలాడుచుం టివి. నీవునిజమగుసన్యాసివలె గాన్పించుటలేదు. నీవెవ్వడవో నిజముచెప్పుమన నాతడు తననిజరూపమునుజూపి తన ప్రతాపమును జెప్పగనే సీత భయముచే గడగడ వణకుచు కొంతతడ వూరకుండి మఱలధైర్యమూని వాని కిట్లనియె. ఓరీ దుష్టాత్మా! నీకు మృత్యువాసన్నమయినట్లు తోచుచున్నది. లేనిచో నీకీ దుర్బుద్ధి యెందుల కుదయించును? నీవు నాభర్త వచ్చునంతవఱ కాగుము. నీకాతడే తగుసమాధానము నీయగలడు. పరదారలు నీకంత చులకనగ నున్నారా? అని రోషఘూర్ణితనయనయై బలుకనానీచున కాసీతారూపము కాళీరూపమువలెగనపడెను. అంత నారావణుడు నేటికి నేనుకృతార్థుడనైతినని దలంచుచు రావణుడు అనేకమాయలుపన్ని లక్ష్మణుడు గీచిన హద్దుదాటి సీతనురప్పింప ప్రయత్నించుచు, భవతిభిక్షాం దేహి! యనిపలుక సీత కందమూల ఫలంబులు గొనివచ్చుచుండ, ఓసుందరీ; నిన్ను బంధింపవచ్చినవాడనుగాని, భిక్షకుడనుగాను అని బలుక, కాలగతి మిక్కిలి ప్రబలము. విధాత వక్రపు పనులు ఇట్టివె యని తలంచుచు సీత మొర్రో యని రోదనము చేయుచు, ఒడలెరుంగక ఆ గీటుదాటి బైటికి వచ్చెను. రావణుడు కపటవేషములు బన్నుచు విశ్వపోషిణి పాపదహనాశిని దేవతాకార్యసాధని, యని యెరుంగక ఆమెకు అనేకరాజనీతుల నుపదేశించుచు సామదానభేద దండోపాయంబుల జూపుచుండెను. సీత గడగడ వణకుచు ఓయతీ! నీవు చూచుటకు యతివలె నున్నావు కాని, నీచేష్ట లతిదుష్టములను "వై దేహి పలుకులు విని రావణుడు తన నిజరూపముజూపించి నామధేయము తెలుప సీత ఆపేరును విన్నంతనే భయ పడిపోవుచు ధైర్యమూని ఓమూర్ఖా! నాస్వామివచ్చువరకు ఆగుము. సింగము చిన్నదైనను చెవులపిల్లి సింగమెదుటబడగలదా! నీకు కాలము సమీపించినది వాయసము గరుత్మంతునితో సరియగునా! చెరువు సముద్రునితో సరియగునా! ఖరము కామధేనువుని బోలునా! అజ్ఞానముచే నీవు ప్రగల్భము లాడుచుంటివి

కాని నన్నేమియు చేయజాలవన రావణుడు తన నీచత్వమునకు సిగ్గుపడుచు మనంబున సీతకు నమస్కరించి జగన్మాతగా తలచుచు తన జన్మసార్థకమైనదని తలచుచు నామెను బలవంతముగ దన రథముపై నిడికొని ద్వరితముగ గగన మార్గమున బోవుచుండెను. అంతనాజానకి రామా, రక్షింపుము. దీనబాంధవా, యాపన్ననగు నన్నీనీచుడు హవ్యమునుశునకమువలె గొనిపోవుచున్నాడు. కాపాడుము. లక్ష్మణా! నిర్దోషివగు నిన్నవమానించి తూలనాడిన ఫలము వెంటనే సిద్ధించినది. సత్పురుషావమానము వెంటనే ఫలించునుగదా? నాతప్పును మన్నించి నీవైనను నాకడ్డుపడుము. ప్రపంచమున కంతకు నభయప్రదాతయగు రాముని యర్థాంగినగునేనిట్లశరణ్యనై యొక తుచ్ఛునిచే బలాత్కారమగ గొనిపోవబడు చుంటిని. నా మొరాలకించువారెవరునులేరా! నాకెవ్వరునడ్డుపడ రారా! అను నాజానకి యాక్రోశమునువిని యచటి చరాచర ప్రాణులన్నియు విలపించుచుండెను. అట్లు విలపించుచున్న సీతయొక్క యార్తనాదమును విని గృధ్రరాజగు జటాయు విట్లుదలంచెను. రఘుకులచంద్రుడగు రామచంద్రుని భార్యయగు జానకినెవ్వడో రాక్షసుడు, మ్లేచ్ఛుడుగోవును బంధించినట్లు బందిగ గొనిపోవుచున్నాడు. ఇపుడీమెకడ్డుపడినాజీవితమును సార్థకమొనరించుకొనియెద ననిదలంచి, తోడనే పైకెగిరి, అమ్మా! నీవు భయపడకుము. ఇదిగో వచ్చు చుంటిని. ఈనీచునిపుడె దునుమాడి నిన్ను విడిపించెదనని బిగ్గరగనఱచుచు నిట్లనియె, ఓరిదురాత్మా! ఎటుబోయెదవు? నిలువుము, నన్నెఱుగవుగాబోలు ననుచు నద్రిపైనశనివలె నాతనిమీదకుబోవుచుండ రావణు డిట్లు తలంచెను. ఆనచ్చువాడెవడైయుండును? మైనాకుడా! లేక గరుత్మంతుడా! ఎవడైననేమి రానిమ్ము! అనుకొనుచుండ నంతలో జటాయువాతని సమీపించెను. రావణు డాతని జటాయువుగ నెఱింగి పాపమీతడు రామునియందలి యభిమానముచే నిట్లువచ్చుచున్నాడు. కానిమ్ము. నాకరవాలధారచే నీతని మడియింతుననుకొను చుండెను. అంత జటాయువాతనితో నిట్లనియెను. రావణా! నీకీ దుర్బుద్ధి ఏలకలి గెను? నామాటవినుము. జానకినివిడిచిపెట్టి సుఖముగ నింటికిబొమ్ము. అన్యాయ ముగ, స్వభుజసమార్జితమగు లంకారాజ్యము నేల పాడుచేసికొనియెదవు? రామచంద్రుని పరాక్రమమును నీవెఱుంగవు. రామవిరోధులు సాన్వయముగ నశించిపోవుదురన నాతని మాటలవినిపించుకొనక రావణుడు ప్రయాణమును

సాగింపుచుండెను. అంతజటాయువు క్రుద్ధుడై యాతనిరథముపై బడి యాతని కేతనమును విఱిచివై చెను. తోడనె దశాననుడలిగి యాతనిపై నిశితబాణముల బ్రయోగించెను. అంతజటాయువాతని శరీరమును నఖములతోడను ముక్కు తోడనుజీల్చి రక్తసిక్తముగావించెను. అంతరావణుడుగ్రుడై తన చంద్రహాస ముతో నాతనిరెక్కలను నఱికివై చెను. అట్లు ఛిన్నపక్షములుగల జటాయువు వజ్రనిహతమగు పర్వతమువలె నేలగూలెను. తోడనే రావణుడింకను ఎవ్వరై నను రాగలరను సందియముచే దనరథమును ద్వరగబోనిచ్చుచుండెను. అట్లు రావణునిచేగొని పోవబడుచు నార్తనాదము నొసరించుచున్నసీత తన భూషల గొన్నిటినిదీసి తనవస్త్రఖండమున వానిని మూటగాకట్టి, అచటనున్న పర్వతము నందు సంచరించుచున్న వానరులజూచి వారి సమీపమున జారవిడిచెను. అట్లు రావణుడామెను లంకకుగొనిపోయి తన యశోకవనమధ్యమం దొక యశోక వృక్షమూలమం దామెనునిచి తగుపరివారము నామెకుగావలియుంచి, యామెను వశపఱచుకొనుటకు దగిన ప్రయత్నములజేయుచు విఫలమనోరథ డయ్యును మఱల మఱల బ్రయత్నించుచుండెను. జానకియు నన్యచింతలవీడి మృగానుసారియగు రామచంద్రుని దివ్యమంగళవిగ్రహమునెద నిల్పుకొని నిరంత రము రాముని ధ్యానింపుచు నాతనినెజూచుచు, నాతనినామమునె స్మరించుచు చింతామగ్నమానసయైయుండెను. అటరామచంద్రుడు లక్ష్మణుడు వచ్చుటను గాంచి చింతాక్రాంతమానసుడై లక్ష్మణునితో నిట్లనియె. సోదరా! నామాటను విడనాడి సీతనొంటరిగ నటనుంచి నివేల ఇటువచ్చితివి? ఈ ప్రాంతమున రాక్ష సులు మెండుగనున్నారు. మఱియు వారలు మనకు విరోధులైయుండిరి. మఱియు నీమృగము గూడ రాక్షసుడే. మనలవంచించుట కీమృగరూపమును ధరించి తానెవంచితుడాయెను. మనము పర్ణశాలకేగువఱకాజానకి ఏమగునో! మనకు శకునములు గూడననుకూలముగలేవు. అన నాలక్ష్మణుడు రామచంద్రుని పదములకు నమస్కరించి జరిగిన వృత్తాంతమునంతను విన్నవించి అన్నతో గలిసి పర్ణశాలకుజనియె. అట సీతనుగానక రామచంద్రుడు ప్రాకృతజనునివలె విలపింపసాగెను. ఓ గుణనిధీ! పతివ్రతాతిలకమా! జానకీ! నీ వెందుంటివి? లక్ష్మణునిమాట వినక పొరపడితివి. సుఖముగ గృహమందుండుమన నాయందలి ప్రేమచే నాతోడనెవచ్చి నాకనుకూలవతివై నేడిట్లైతివేల? సీతఏది? యను

నయోధ్యావాసులకేమి చెప్పవలయును? అని విలపించుచు నటనున్న వృక్షము లను మృగములను పక్షులను సీతనుగాంచితిరా? యని పరిపరి విధముల విల పించుచు నడుగుచుండెను. అట్లు పలవించుచు నరణ్యమున వెదగుచు, కమల నయానా! కంబుకంఠీ! చంద్రముఖీ! చక్రవాక స్తనీ! భ్రమరకేశీ! సుభ్రూ! కుసుమకోమలగాత్రీ! సీతా! నాకగపడవెందులకు? నేనామృగమును దేలేదని కోపమా! ఈనాదీనావస్థనుజూచి కరుణింపవేల? నీమనమతిపేశలముగదా! యని యున్మత్తునివలె ప్రలపించుచు నావనమంతయు దిరుగుచుండెను. సంపూర్ణ కాముడు సర్వజ్ఞుడునగునా రామచంద్రుడు సామాన్యమానవునివలె నితరులు దననెఱుగకుండునట్లు పలవించుచుబోవుచుండ మార్గమధ్యమున రామనామ స్మరణమొనరించుచు పడియుండిన జటాయువును జూచి తన హస్తకమలములతో నాతని స్పృశించినతోడనె యాతడు విగతశ్రముడై రామచంద్రునితోనిట్ల నియె. ప్రభూ! నీకరస్పర్శముచే నా సర్వదుఃఖములు నశించిపోయినవి. దుష్టుడగు రావణుడు సీతనపహరించుకొని పోవుచుండ నామృగేక్షణ కురరివలె నతిదీన ముగా విలపించుచుండ నేనాతని కడ్డువడి నాయోపినంతవఱకుబోరితిని. తుదకా దురాత్ముడు చంద్రహాసముచే నా రెక్కలనఱికివేసెను. తోడనె నేను నేలగూలి తిని. వాడంత దక్షిణదిశకేగెను. నీదర్శనభాగ్యమున కీ ప్రాణములింతవఱకు నిలిచియున్నవి. ఇక బోయినను చింతలేదన రామచంద్రుడిట్లనియె. పతంగ పుంగవా! నీకు రెక్కలతో గూడిన శరీరము కావలయునా! యన నాజటా యువు నవ్వుచు నిట్లనియె. ప్రభూ! ఎట్టియధముడైనను మరణసమయమున నీ నామమును స్మరించిన కృతార్థుడగునని వేదసమ్మతము. అట్టినీవు సాక్షాత్క రించి సంభాషించుచుంటివి. ఇంక నాకేమి గావలయును? ఇకనాకీ శరీరముతో నేమి పనికలదు? అనవిని రామచంద్రుడు నాకై ప్రాణముల విడచుచుంటివి. పరోపకారమునకై ప్రాణత్యాగమొనరించువారికి సద్గతి తప్పక సిద్ధించును. దానికిమించిన ధర్మములేదు. నీవన్నివిధముల ధన్యుడవు. కాన నీవీ శరీరమును విడిచి పుణ్యలోకముల కేగుము. అటమాతండ్రియగు దశరథునకీ సీతాపహరణ వృత్తాంతమును మాత్రముజెప్పకుము. సాన్వయముగ నిహతుడైన రావణుని వలననే యావృత్తాంతము దెలియనగునన నంతలో జటాయువు దనశరీరమును వీడి విష్ణుసారూప్యమునంది రామచంద్రునిట్లుస్తుతించెను.

జటాయు స్తవము :

జయరామరూప, అనుపమ నిర్గుణసగుణగుణ ప్రేరకసహే।
దశకంఠబాహు ప్రచండఖండన చాపధర మండనమహే।
పయోదగాత్రం సరోజముఖం రాజీవాయతలోచనం।
నితనోమిరామ నృపాలం బాహువిశాలం భవభయమోచనమ్ ॥

రామరూపముతోనున్న నిర్గుణ సగుణస్వరూపా! నీకు జయము. నీవు సత్వరజస్తమోగుణముల ప్రేరేపించి మూర్తిత్రయద్వారమున జగదుత్పత్తి స్థితి లయముల నాచరించుచుంటివి. దశకంఠనిప్రచండ బాహువులను ఖండించుటకై చండశరచాపములతో నీభూమండలమున నుద్భవించితివి. కమలముఖా! రాజీవాయతలోచనా! విశాలబాహూ! భవమోచనా! కృపానిధీ! నీకునమస్కారము.

బలమప్రమే యమనాది మజమవ్యక్త మేవగోచరం।
గోవిందగోపద ద్వంద్వహర విజ్ఞానఘనధరణీధరం।
జేరామ మంత్రజపంత సంత అనంత జనమన రంజనం।
నితనౌమిరామ అకామప్రియ కామాదిబృందదల కంజమ్ ॥

రామా! నీబలమప్రమేయము. నీ వనాదివి. అజన్ముడవు. అవ్యక్తుడవు. ఏకాకివి. అగోచరుడవు. వేదగమ్యుడవు. గోలోకవాసివి. ద్వంద్వాతీతుడవు. విజ్ఞానఘనుడవు. ధరణీధరుడవు. నీమంత్రమును జపించు భక్తులహృదయమును రంజింపజేతువు. నై రాగ్యనిధివి. కామాదిఖలబృందముల హరించెడి రామచంద్రా! నీకు నమస్కారము.

జోహిశ్రుతి నిరంతర బ్రహ్మవ్యాపక విరజ అజకహిగావహి।
కరిధ్యాన జ్ఞానవిరాగ జేగ అనేకమునిజ హిపావహి।
శోప్రకటకరుణాకంద శోబాబృంద అగజగమోహ ఈ।
మమహృదయ పంకజభృంగ అంగఅనంగ బహుభవిశోహ ఈ ॥

శ్రుతులెవనిని నిరంతరము సర్వవ్యాపకుడనియు, రాగరహితుడనియు, ననాదినిధనుడనియును స్తుతించుచున్నవో? జ్ఞానవైరాగ్యయోగధ్యానాది సాధనములచే మునులెవనిని జేరగలుగుచుండిరో? అట్టి ధన్యులకే నీవు బ్రత్యక్షమగు

చుంటివి. అనేక మన్మధశోభాతిశాయియగు దేహకాంతిచే జగన్మోహనుడ వగు కరుణానిధీ! నీవు నాహృదయకమలమున భృంగమువలె విహరింపుము...

జయఆగమసుగమసుభావనిర్మల అనుపమసమశీతలసదా,
పశ్యంతిజే జోగీజతనుకరి కరతమనగోవసజదాసో
రామరమానివాససంతత దాసనివాస త్రిభువనధనిమమఉరవస
వుసోసమన సంస్కృతి జ్యోసుకీరతిపావని॥

ప్రభూ! నీవు దుష్టుల కగమ్యుడవు. శిష్టసుగముడవు. స్వభావనిర్మలుడవు. అసముడవు. సర్వసముడవు. సదాశీతలుడవు. జితేంద్రియులగుయోగులు మనో వాక్కాయకర్మల భవదాయత్తమొనర్చి నిన్నె చూచుచుందురు. ఓలక్ష్మీపతీ! రామచంద్రా! నీవు భక్తపరాధీనుడవు. త్రిభువనేశుడవు. నీపవిత్రచరిత్రము జనసమరణహారము. అట్టి నీవు నాహృదయమున విహరింపుము. నా కింతకన్న నేమిగావలయును! అని స్తుతింపుచు జటాయువు దివ్యరూపముతో హరిధామ మునకేగెను. ఆ పక్షీంద్రునకు రామచంద్రుడు యథోచితముగ నౌర్ధ్వ దైహికకృత్యముల నిర్వర్తించెను. పార్వతీ! చూచితివా! రామచంద్రుని దీనదయాళుత్వమును? భగవద్భక్తు లెవ్వరైనను మోక్షసామ్రాజ్యము నందెదరు. అట్లురామలక్ష్మణులు సీతాన్వేషణమొనరించుచు ముందుకుజన నట నొక మహారణ్యముగాన్పించెను. అందునానావిధవృక్షములు దట్టముగనుండెను. పక్షిమృగాదులు స్వేచ్ఛగసంచరించుచుండెను. ఆఘోరారణ్యమున సంచరించు చున్న రామలక్ష్మణులను కబంధుడనురాక్షసుడడ్డగింప రామచంద్రుడాతనిని సంహరించెను. తోడనె వాడు గంధర్వుడై రామునితో నిట్లనియె. రామ చంద్రా! నేనొకగంధర్వుడను. దుర్వాసునిశాపమువలన నేనురాక్షసుడనై నీయనుగ్రహమువలన దిరిగినానిజరూపమునందగలితిని. అననాతనికి రామ చంద్రుడిట్లనియె. ఓయీ! బ్రాహ్మణులు పూజార్హులు. వారినవమానించిన సకలశ్రేయములు నశించును. కాన బ్రాహ్మణుడెట్టివాడయినను నాతని నవ మానింపరాదని బ్రాహ్మణప్రభావము మున్నగు ననేకధర్మముల నుపదేశించి యాతడు దనచెడజూపినభక్తివిశ్వాసములకు బ్రసన్నుడయ్యెను. అంతనాగంధ ర్వుడు రామచంద్రునకు బ్రణమిల్లి యనుమతివడసి నిజనివాసమునకేగెను.

పిమ్మటరామచంద్రుడు శబరియాశ్రమమున కేగెను. అట్లురామచంద్రుడు తన యాశ్రమమునకువచ్చుటజూచి శబరి, మతంగునిమాట నేటికిసత్యమయినదని భావించుచు నపరిమితానందమునొంది, రామచంద్రుని దివ్యమంగళవిగ్రహమును, లక్ష్మణునిమోహనరూపమును జూచి తనివితీరక అట్లేరెప్పపాటులేక చూచుచు నానందపరవశయై తనజన్మము ధన్యమయినదని సంతసింపుచు నాతని చరణకమలములకెఱగి నమస్కరించిలేచి, యర్ఘ్యపాద్యములనొసంగి యుచితాసనమున గూరుచుండబెట్టి మధురాతిమధురములగు కందమూలఫలాదులనొసగి యారగింపుడని ప్రార్థించెను. రామచంద్రుడాఫలములగ్రహించి వాని రుచినిగొనియాడుచు భుజింపుచుండ నాశబరిచేతులుజోడించి సవినయముగనిట్లనియె. ప్రభూ! రామచంద్రా! నేధన్యను, కాని మూఢాతిమూఢమగు నధమజాతిలోబుట్టినస్త్రీనగుటచే నిన్నెట్లుకొనియాడవలయునో నాకుదెలియకున్నది. నీయనంతగుణములను వేదములే కొనియాడజాలవని వినుచుంటిని. కాన నేనెట్లు కొనియాడగలను? నాయీయంజలినే గ్రహింపుమన నామెకు రామచంద్రుడిట్లనియె. ఓభామినీ! నేనుభక్తిచేదసిసినట్లు స్తుతుల సంతసింపను. భక్తులుగాని వారల, జాతిమతకులములు, సంపదలు, కర్మలు, దానధర్మములు, నిర్జలమేఘములవలె దర్శనమాత్రరమణీయములె. ఎంతటిఘనుడైనను భక్తిలేనినాడు నన్నుపొందజాలడు. నేను నవవిధభక్తిని జెప్పుచున్నాను. సావధానముగవినుము. 1. సత్సంగతి. 2. నాకథలయందనురాగము. 3. సద్గురూపాసనము. 4. నిష్కపటముగనన్నుగీర్తించుట. 5. దృఢవిశ్వాసముతో నామంత్రమును జపించుట. 6. శమదమములతో సత్కర్మల నాచరించుట. 7. నన్నీప్రపంచమునందంతటనుజూచుట. 8. పరులనిందింపక యదృచ్ఛాలాభసంతుష్టి. 9. సర్వభూతములందును సమదృష్టితో, నిష్కపటియై సర్వమును మదర్పణముసేయుట. యను నీనవవిధభక్తులలో నేయొక భక్తికలిగినవారెవరైనను నన్ననాయాసముగ బొందగలుగుదురు. నీవు నవవిధభక్తులుకలదానవు. నీభక్తివంటిభక్తి యోగులకునుదుర్లభము. కావుననే నిరుపమసుఖావహమగు నాదర్శనము నీకబ్బినది. శబరీ! నేను సీతాన్వేషణార్థమిటకు వచ్చితిని. నీకామెజాడ తెలిసిన జెప్పుమన నామె వినమితశిరస్కయై సవినయముగనిట్లనియె. రామచంద్రా! ఇటపంపాసరోవరమొండుకలదు. అటమునిబృందము నివసించు

చుండును. వారలవలన నీకు సకలవృత్తాంతమును దెలియును. మఱియు నిట కనతిదూరమున మతంగుని యాశ్రమముకలదు. అటకేగిననునీకు సీతావృత్తాం తము దెలియుననిబలికి యాశబరి రామచంద్రుని పదకమలముల దనహృదయ ముననిలిపి యోగాగ్నిదగ్ధశరీరయై భగవంతునిలో లీనమయ్యెను. భక్తి మాహాత్మ్యమిట్టిది. సుకృతదుష్కృతరూపములగు కర్మలన్నియు సుఖదుఃఖాను షంగముచే మనుజులబంధించును. భక్తి భగవంతునిబంధించును. కాన సర్వ కర్మలనువీడి దృఢవిశ్వాసముతో రామచంద్రుని భజించిన మహాత్ములు పునరావృత్తిరహిత భగవత్సాయుజ్యమున శబరివలెనందెదరు. భగవంతుడగు రామచంద్రు డిట్టివాడనిదెలిసియు మూర్ఖమానవు లైహికసుఖముల వీడజాలక రాగద్వేషపూరితమానసులై స్వప్నమనంతైనను దలంపజాలకుండిరని తులసీ దాసు నరుల నుడువుచున్నాడు. అంత రామచంద్రుడటనుండి బయలుదేరి సీతావిరహవేదనా దోదూయమానమానసుడై అటనున్న వృక్షలతాదుల దిలకించుచు లక్ష్మణునితో నిట్లనియె. సోదరా! ఈవనశోభ ఎట్టివానినైనను జలింపజేయును. ఇటనున్న పక్షులు తమతమ ప్రేయసులతోగూడి స్వేచ్ఛగ విహరింపుచు నన్నెగతాళిజేయుచున్నట్లున్నవి. మనలనుజూచి కొన్ని లేళ్ళు పరుగిడుచుండ మఱికొన్ని లేళ్ళు మారట్లుల పరుగిడియెదరు! వారుమనకొఱకు రాలేదు. బంగారులేడిని వెదకుచుండిరనుసట్లు శాంతముగ నున్నవి. ఆమత్తే భము కరిణీకలితమై, రామా! నీవేలపియనువీడి ఇట్లొంటిగవచ్చితివనుసట్లు న్నది. లక్ష్మణా! శాస్త్రమును మాటిమాటికి నావృత్తిచేయవలయును. ప్రభుని దయచుగ దర్శింపవలయును. కాంతలనెల్లపుడు సప్రమత్తుడై గాపాడవలయుగ. అట్లుకానినాడీమూడును స్వాధీనములుకాక ఇట్టి ఇక్కట్లు సంభవించును. సోదరా! ఆవసంతశోభనుజూడుము. ప్రియావిరహితుడనగు నన్నీవసంతము భయపెట్టుచున్నది. ఆమదనుడు తనసైన్యమును వెంటనిడుకొని పుష్పచాపము నూని నాపై దండెత్తుచున్నాడు. నావెంట నీవుండుటనుజూచి మఱలవెనుకాడు చున్నాడు. ఈమలయమారుతములు నన్నడ్డుబెట్టుచున్నవి. లతలావృక్ష ముల నెట్లులముకొనుచున్నవో చూడుము. పుష్పస్తబకవిరాజితములగు నావృ క్షములు మదనునిసాయుధసైనికులవలె నున్నవి. ఆయనటికంబములు ధ్వజముల వలెనున్నవి. ఆసెలయేరులు నృత్యమొనరించు వారాంగనలవలె నెంతసొగసుగ

బ్రవహించుచున్నవోచూడుము. లక్ష్మణా! ఇట్టివనమం దెవరునిశ్చలమనస్కులై యుందురో, వా రేధీరులు. మదనునిబలమంతయు నారీప్రధానము. స్త్రీలకధీనుడు కానివాడెనిజమగుబుద్ధిమంతుడు. కామమెట్టివానినైనను వికలేంద్రియుని జేయును. కామముక్రోధలోభములకుమూలము. స్త్రీలుకామమునకుమూలము. కావుననే విద్వాంసులు స్త్రీ సాంగత్యము సర్వానర్థమూలమని బలుకుచుందురు. పార్వతీ! గుణాతీతుడు సర్వాంతర్యామి చరాచరగురుడునగు రామచంద్రుడు సామాన్యమానవునివలె దీనముగ గాన్పించుచు నీమాయానాటకమునైంద్రజాలికునివలె నాడుచుండెను. కాని వశీకృతమాయుడగు నారామచంద్రునకీ సీతావియోగ దుఃఖమావంతయునులేదు. ఇది సర్వగోచరము కాదు. నేను మాత్రమారాముని యనుగ్రహమువలనను దీనినంతను బ్రత్యక్షముగ దెలియగలిగితి. అట్లు రామచంద్రుడు పంపాసరోవరముదరికేగి యాసరోవరమును దిలకించుచుండెను. ఆ సరోవరమతిరమణీయమై యుండెను. అందలి జలము సజ్జనమానసమువలె నతినిర్మలమై యతిగంభీరమై యుండెను. మాయ జీవుని గప్పినట్లండలి పద్మపత్రము లాజలము గప్పియుండెను. దాని నాలుగువైపుల నతివిశాలములగు దీర్ఘములుండెను. అతిథులవలె నాతీర్థములనుండి మృగము లాజలాశయ జలములగ్రోలుచుండెను. అగభీరోదకమునందు మీనములు ధార్మికులవలె సుఖముగ రసాస్వాద మొనరించుచుండెను. అందలి పద్మషండముల భ్రమరములు భిక్షుకులవలె మధురగీతికల బాడుచుండెను. అందలి శీతల సుగంధమందమారుతములు దెరువరులకెంతేని సుఖాధాయకములగుచుండెను. ఆ సరోవరప్రాంతమునను మునుల యాశ్రమములుండెను. ఆ యాశ్రమములకనతి దూరమున ఫలవృక్షభరితములైన నానావిధ వృక్షములుండెను. మునుల తపఃప్రభావమువలన నచటి మృగములు సహజవైరమును వీడి పరస్పరమైత్రితో మెలంగుచుండెను. పుష్పఫలభరితములైన యావృక్షములు సంపత్సమృద్ధులయి వినమ్రములగు సత్పురుషులవలె నమ్రములై యుండెను. రామచంద్రుడా సరోవరమును జూచి సంతసింపుచు నందు స్నానమాచరించి మృదుళమృణాళములనాస్వాదించి యందలి యమృతోపమ మగు నీటిని ద్రావి అటనొక విశాలరమణీయ ఛాయాలంకృతమగు వృక్షమూలమున సుఖాసీనుడైయుండ, దేవతలటకు వచ్చి రామచంద్రుని స్తుతించి తమతమ నివాసములకు జనుచుండిరి.

రామచంద్రుడు విశ్రమించుచు దమ్మునితో ననేక సత్కథల జెప్పుకొనుచుం డెను. అట్లుకూరుచుండిన రామచంద్రునిజూచి నారదుడు నాశాపము నంగీ కరించినందున భగవంతుడిట్లు దుఃఖముననుభవింప వలసివచ్చినదని మిగుల జింతి ల్లుచు నిట్టియవకాశము లభించుట దుర్లభమని ఎంచి తన మహతిని బూని మధురతంత్రీనినాదముతో రామనామసంకీర్తన మొనరించుచు రామచంద్రుని కడకరుదెంచి సాష్టాంగదండప్రణామ మాచరింప, రామచంద్రు డాతనిని కౌగ లించుకొని నేమ మడిగి తనచెంతనె కూరుచుండ బెట్టుకొనెను. తోడనె లక్ష్మణు డాముని పాదములగడిగి పూజింపనంత నారదుడు రామునివినుతింప రామ చంద్రుడు ప్రసన్నుడయ్యెను. నారదుడంతచేతులుజోడించి రామునితో నిట్ల నియె. రామచంద్రా! భక్తవత్సలా! దీనదయాళూ! నీవు సర్వజ్ఞుడవు. సర్వాం తర్యామివి. కాన నిన్నొకటివేఁడుచుంటిని. బ్రసాదింపు మన రామచంద్రు డిట్లనియె. మునీంద్రా! నేను భక్తపరతంత్రుడనను విషయము నీవెఱుంగనిది గాదు. మఱియు నేను భక్తులకొసంగ దగనిదియులేదు. కాన నీయభీష్టమును దెలుపుమన నారదుడపరిమితానందము నందుచు నిట్లనియె. ప్రభూ! నీకనంత నామములు గలవనియు నన్నిటియందును రామనామ ముత్కృష్టమనియు వేదములందు ప్రసిద్ధము. పాపమృగములకు రామనామము వ్యాధునివంటిదని స్మృతిప్రసిద్ధము. దీనికి కారణమేమన రామచంద్రుడిట్లనియె. నాకును నానామ మునకును భేదములేదు. కానభక్తహృదయాకాశము నందితరనామములు దారల వలెవిలసిల్లుచుండ రామనామశశాంకుడుజ్వలభక్తిచంద్రికల బ్రసరింపజేయుచు నాతోపాటు విరాజిల్లుచుండును. మఱియు నీరామనామము, తొలియక్షర ముచే సకలసంచితదురితములహరించుచు మలియక్కరముచే మోక్షమును బ్రసాదించును. ఇట్టిశక్తి ఇంకేనామమునలేదన నారదు డపరిమితానందభరి తుడై ఇట్లనియె. ప్రభూ! నీవుదొల్లినన్ను మాయామోహితునిగనొనర్చి నేనొకకన్యారత్నమునుబరిగ్రహింపదలప నాకార్యమున కేల విఘ్నమాచరించితి వన నాతనికి రామచంద్రుడిట్లనియె. ప్రపంచమందలి బ్రాణులన్నియు నాసం తానము. అందుజ్ఞానులు నాజ్యేష్ఠపుత్రులు. వారునావలె సర్వస్వతంత్రులు. కానవారివిషయమును నేనుజూడనక్కరలేదు. ఇకభక్తులు నాకనిష్ఠపుత్రులు. కానవారిని నేననర్థములనుండి కాపాడవలయును. వారిని కామక్రోధాద్యనర్థ

ములు వెన్నంటియుండును. సర్వానర్థమూలముకామిని. ఆమె మోహావన వసంతము. తపోవ్రతజలాశయగ్రీష్మము. కామక్రోధాదిభేకములకు వర్షాగమము. దుర్వాసనాకమలశరదాగమము. ధర్మపంకజ హేమంతము. మాన మతాదిరూపకుందకుసుమములకు శిశిర ర్తువు. పాపోలూకములకు కృష్ణపక్షనిశీధిని. శీలసత్యమానములకుగాలము. అవగుణములకు మూలము. దుఃఖనిలయము. ఇట్టిసకలానర్థమూలమును వారింపదలచి నీవివాహమునకడ్డు బెట్టితి ననునారదు డమితానందమునందుచు నిట్టి దీనదయాళువెందేనిగలడా! యని దలంచుచు మఱల రామచంద్రునితో నిట్లనియె. రామచంద్రా! భవభంజనా! దీనదయాళూ! నాకుసత్పురుషలక్షణములనెరింగింపుమన నాతనికి రామచంద్రుడిట్లనియె. ఎవరు కామాదుల నిర్జించి ప్రశాంతముగ నుండెదరో, ఎవరు అచలాకించనపవిత్రసుఖధామములో, ఎవరు నియతాహారవిహారములుగలిగి సత్యవ్రతమును బాలింతురో, ఎవరు భగవంతునియందు నిరంతరధ్యానయోగమగ్నులో, ఎవరు ధైర్యముచే మానమదములమర్జించి ధర్మతత్పరులై సద్గుణములవీడకుందురో, ఎవరు సర్వసందేహములవీడి దారాపుత్రాద్యాసక్తినిమాని సర్వకాలముల నన్నే సేవింతురో, ఎవరు తుల్యనిందాస్తుతికలవారై శత్రుమిత్రసమభావముకలిగి వర్తింతురో, ఎవరు యజనయాజనాధ్యయన దానతపోవ్రత నియమనిరతులో, ఎవరు సత్యాహింసానిరతులై దంభాహంకారవిరహితులై జ్ఞానవైరాగ్యవిజ్ఞానములుకలిగి నిష్కపటముగ నాపదముల నారాధించెదరో, వారు ప్రతిఫలనిరపేక్షముగ బరోపకారధురీణులును సత్పురుషులనబడుదురు. సత్పురుషుల లక్షణముల సాకల్యముగ నిరూపించుటకు ననంతశారదలకు శక్తి చాలదు. అనరామచంద్రునివలన సత్పురుష లక్షణములవిని యాతనిపదములకు నమస్కరించి, యాతని కల్యాణగుణములవర్ణింపుచు యాతనిదివ్యనామ సంకీర్తనమొనరించుచు నమితానందభరితుడై యాతనియనుమతినివడిసి నారదుడు బ్రహ్మలోకమునకేగెను. రామచంద్రుని దివ్యచరిత్రమును వినుచు గానముచేయువారికి జ్ఞానవైరాగ్యములులేకున్నను వారశ్రమముగదరింతురు. ఓసోదరులారా! స్త్రీలగ్నిశిఖాసదృశలు. కాన నాయగ్నిశిఖలంచు పతంగముల వలె నాహుతిగాక షడ్వికారములవీడి పరాత్పరునిభజించి తరింపుడని తులసీదాసుని విన్నపము.

అరణ్యకాండము సమాప్తము

కిష్కింధాకాండము

శ్లో॥ కుందేందీవరసుందరా వతిబలౌ విజ్ఞానధామావుభౌ
శోభాఢ్యావరధన్వినౌ ఋతిమతౌ గోవిప్రబృందప్రియౌ
మాయామానుషరూపిణౌ రఘువరౌ సద్ధర్మవర్మౌ హితౌ
సీతాన్వేషణతత్పరౌ పథిగతౌ భక్తిప్రదౌ తౌ హినః ॥

మొల్ల, నల్లకలువలవలె మనోహరరూపములు కలిగినట్టియు, బలమునకు విజ్ఞానమునకును స్థానమగునట్టియు, ధనుర్ధరులై శోభిల్లుచున్నట్టియు, వేద సమ్మతులై గోబ్రాహ్మణులగాపాడునట్టియు, మాయామానుషరూపమును ధరించిధర్మతత్పరులై సీతనువెదకుచున్న రామలక్ష్మణులు మాకుదృఢభక్తిని బ్రసాదింతురుగాక !

శ్లో॥ బ్రహ్మాంభోధిసముద్భవం కలిమలప్రధ్వంసనం చావ్యయం
శ్రీమచ్ఛంభుముఖేందుసుందరవరం సంశోభితంసర్వదా ।
సంసారామయభేషజం సుమధురం శ్రీజానకీజీవనం
ధన్యాస్తే కృతినః పిబంతి సతతం శ్రీరామనామామృతం ॥

బ్రహ్మయనుసాగరమందుబుట్టి, శంకరుని ముఖమునలంకరించుచు కలి మలముల దొలగించుచు, సీతాజీవితసర్వస్వమును, సంసారరోగమునకు దివ్యౌషధమునునగు శాశ్వతరామనామామృతమును పానము జేయువారెంతటి ధన్యులో గదా !

శ్రీరామాంజనేయ సమావేశము

ఎట్టి మోక్షనిధానమో, జ్ఞానమునకు నిలయమో, నిరస్తకలుషమో, అట్టివారణాసియందు, హాలాహలపాన మొనరించి లోకోపద్రవమును దొలగించి, భక్తాభీష్టప్రదుడగు శివుడు భార్వతితోగూడి నివసించుచున్నాడో అట్టిశివుని భజించెద. అట్టి కరుణామయుడెందునులేడు. సోదరసోదరీమణులారా ! ముందు కథనువినుడు. నారదు డట్లుచనినతోడనే రామలక్ష్మణులు ఋశ్యమూకమును సమీపించిరి. అట సచివసహితముగ నివసించుచున్న సుగ్రీవుడు వారలజూచి

భయకంపితగాత్రుడై, హనుమంతునితో నిట్లనియె. హనుమా! ఆ వీరవరేణ్యుల నిద్దఱజూచితివిగద. వారిని వాలి పంపియుండెనేమో! అట్లయిన మన మీ పర్వతమును వీడి యెందేనిపోవలయును. కాన నీవు మాఱువేషముతో నటకేగి వారి వృత్తాంతమును సమగ్రముగ దెలిసికొని రమ్మన నాతనియానతిని బట్టి హనుమంతుడు వటువేషమునూని వారలదరికేగి నమస్కరించి సవినయముగ నిట్లనియె.

స్వాములూ! శ్యామగౌరమనోహరగాత్రులగు మీరెవ్వరు? క్షత్రియవీరులవలె గనబడుచున్నారు. మీకీ వనసంచారమెందులకు? అతిమృదులములగు మీపాదకమలము లీ వనసంచారము నెట్లు సహించుచున్నవి! మృదుగాత్రము లీ దుర్భరసీతాతపముల నెట్లోర్చుచున్నవి! మిమ్ములజూడ భూభారము నణగించుటకు మానుషవేషముల ధరించిన నరనారాయణులని తోచుచున్నయది. కాన నిజమునుజెప్పి నన్ను కృతార్థునిజేయుడన సౌమిత్రి యిట్లనియె. వటూత్తమా! మేము కోసలాధీశుడగు దశరథునిపుత్రులము. మేము పితృవాక్పరిపాలనకై వనమునకు జనుదెంచితిమి. మేమన్న దమ్ములము. మాయన్నగారగు నీతడు రామచంద్రుడు. నన్ను లక్ష్మణుడందురు. మాతోగూడి మావదినగారగు సీతయువచ్చినది. ఆమెనెవరో రాక్షసు లపహరించిరి. మేమామెను వెతకుటకై యిట్లుదిరుగుచుంటిమి. అనవినినతోడనే ఆకపివర్యుడు రామచంద్రుని పదకమలములపై బడిపోయెను. పార్వతీ! హనుమంతునియప్పటి యానందము వర్ణనాతీతము. అప్పుడాహనుమ రామచంద్రుని శ్యామలకోమలాంగమును మాటిమాటికి దిలకించుచుపులకితగాత్రుడై, యానందపారవశ్యమున నోటమాటరాక కొంతతడవట్లుండి. పిమ్మట తన ప్రభుని గుర్తించి యిట్లు వినుతించెను.

హనుమంతుడు రాముని స్తుతించుట

స్వామీ! నీమహిమను బ్రహ్మాదులై ననుదెలియజాలరు. నేనెంతటివాడను. నేనజ్ఞానముచే మిమ్ములనెవరని బ్రశ్నింపగా, మీరును నన్నెఱుంగనివారివలె బ్రశ్నింపుచుంటికేల? మాంద్యమోహాజ్ఞానముచే నావరింపబడిన నేను తమను గుర్తింపలేకపోతిని. దీనబంధూ! కృపానిధీ! భక్తవత్సలా! సకలావగుణనిధాన

మగు నీదాసునియనుగ్రహింప నిటకువచ్చితివా! నీకు భక్తవత్సలుడను బిరుదము సార్థకము. నీయనుగ్రహమునగాని, యీమోహముదొలగదు: తండ్రీ! పుత్రుమతల్లి దండ్రులమఱచిస్వేచ్ఛగదిఱుగునట్లు నేమిమ్మునుమఱచిదిఱుగుచుంటిని. మిమ్మునెట్లుభజింపవలయునో నాకుదెలియకున్నది, అనివ్యాకులచిత్తుడై నన్నుమన్నింపుమని పాదములపైబడెను. అంత నావటురూపముపోయి నిజరూపము వచ్చెను. అప్పుడురామచంద్రుడా హనుమంతుని లేవనెత్తి కౌగలించుకొని, హనుమా! నీవు చింతింపకుము. నన్నును లక్ష్మణుని సదా శేవింపుచుంటివిగదా! నీకీ వంతయెందులకు? నేనెప్పుడును భక్తులబేమించుచునేయుండెద. అందును యన న్యభక్తులన నాకెంతేని సంతసము. భగవంతుడు భగవద్దాసుడును దప్ప వేఱొండు లోకమున లేదనుదృఢైకాగ్రభావనను యనన్యభక్తియందురు. అన విని హనుమ యపరిమితానందభరితుడై దనప్రభునితో నిట్లనియె.

రామసుగ్రీవ సమాగమము

ప్రభూ! ఆ పర్వతముమీద తమ దాసుడగు సుగ్రీవుడు నివసించు చున్నాడు. తామాతని ననుగ్రహించి మిత్రభావముతో నభయమిచ్చిన నాతడు వానరవీరుల నంపి సీతాన్వేషణముగావించుననిచెప్పి వారలదనభుజము లందెక్కించుకొని సుగ్రీవుని సన్నిధికరుదెంచెను. అంతసుగ్రీవుడులేచి, నమస్కరించి వీరెవ్వరు! ఇటకేలవచ్చిరని మనమున దలపోయుచుండ నంతలో హనుమ వారి వృత్తాంతమునంతను నాతనికెరిగించెను. అంతసుగ్రీవుడు రామచంద్రునికి దండప్రణామమాచరించెను. అపుడు వారిఱువురు నగ్నిసాక్షికముగ దృఢమైత్రిని గావించుకొనిరి. పిమ్మట లక్ష్మణుడు కైకవరములు, తమయరణ్యవాసము, సీతాపహరణము మున్నగు దమవృత్తాంతమునంతను సుగ్రీవునితో జెప్ప, వారి చరిత్రమునంతనువిని సుగ్రీవుడుజాలినొంది దుఃఖించుచు ప్రభూ! మైథిలి తమకు దప్పకలభించును. నేనొకనాడు నామంత్రులతోగలిసి సుఖాసీనుడనైయుండ, గగనమార్గమందొక నారీయార్తనాదము వినవచ్చెను. అపుడామె, రామా! రామా! యని విలపించుచు మమ్ము జూచి మాకు సమీపముగ నొకవస్త్రఖండమును విడిచెను. అన విని రాముడత్యాతురుడై, ఏదీ అవస్త్రము? శీఘ్రముగా దెప్పింపుమన నంత సుగ్రీవుడవస్త్రఖండమును రాము

నెదుట నుంచెను. తోడనే రాము డాపత్స్రమును గ్రహించి చూచి హృదయ
మునం దిడికొని దుఃఖింపసాగెను. అంత సుగ్రీవుడు, రామచంద్రా! విలపింప
కుము. ధైర్యమును వహింపుము. నీసేవకులమగు మేము మాయోపినంతవరకు
బ్రయత్నించి జానకిని దమకు జేగుర్పగల మన నూరడిల్లి రాము డిట్లనియె.
సుగ్రీవా! నీకును వాలికిని ఇంతతీవ్రవైర మెందువలన వచ్చినది? అన నా
సుగ్రీవు డిట్లు తనవృత్తాంతమును జెప్ప మొదలిడె.

ప్రభూ! మేమిఱువురమన్నదమ్ములము. పరస్పరమైత్రితో మెలగు
చుండెడివారము. ఒకనాడర్ధరాత్రమున మయునికుమారుడగు మాయావి
యను రాక్షసుడు మానగరద్వారముకడకువచ్చి పెద్దబొబ్బలిడసాగెను. అరి
మర్ధనుడగు మాయన్న తోడనేవానినిగవిసెను. అంతవాడుమాయన్ననుజూచి
పరుగిడ మాయన్న వానిని వెన్నంటిజనుచుండ నేనును యాతని సహాయమునకు
బోతిని. అంతనారాక్షసు డొకగుహాయందు డాగెను. అపుడు మాయన్న
నాతోనిట్లనెను. తమ్ముడా! మనశత్రువీగుహాలో డాగియున్నాడు. కాన
నేనువానిని సంహరించుట కీగుహాలో బ్రవేశింతును. నీవీబిలద్వారమునగాచి
యుండుమనిచెప్పి నన్నటనిలిపి యాతడాగుహాలో బ్రవేశించెను. నేనట నొక
మాసముంటిని. అప్పటికి మాయన్నరాలేదు సరిగదా యాగుహాద్వారము
నుండి రక్తధారలు బ్రవహింపసాగెను. అన్నపదునైదుదినములలో వచ్చెదనని
జెప్పెను. ఇప్పటికొకనెల గడిచినది. అన్నరాలేదు. రక్తధారలు వచ్చు
చున్నవి. ఆమాయావి అన్నను మోసగించి చంపియుండవలెను. లేనిచో
అన్నయింతవఱకు నెందులకు రాకుండును? ఇకనిటనుండరాదు. వాడుబయటికి
వచ్చి నన్ననుగబళించును అని విచారించి యాగుహాద్వారమునకొక గండ
శిలనునిచి, నేనునగరమునకు దిరిగివచ్చితిని. అపుడచటివారు రాజులేనిరాజ్య
మరాజకమగునని నిర్ణయించి నన్ను బలాత్కారముగ రాజునుజేసిరి. అంతమా
యన్న యారాక్షసుని సంహరించి గుహాద్వారమునకువచ్చి యాగండశిలను
జూచి దానినిదొలగించి బైటకువచ్చిననన్నుగానక నిటునటు వెదకి తుదకునగరు
చేరెను. అటన్నను జూచి కృద్ధుడై, మూర్ఖా ననుమోసగించి ఇటరాజ్యము
నేలుచుంటివా! అనినన్నుహింసించి నాసర్వస్వమును, భార్యాసహితముగ
హరించి, నన్ను వెడలనడచెను. అపుడాతని భయముచే భువనమంతయుదిరిగి

ఎచ్చటను విశ్రాంతినొందజాలక, మతంగమునిశాపమువలన వాలి యీకొండ దండకురాజాలడనినిశ్చయించి యిందునివసించుంటిని. కానివాలివలనభయము మాత్రము నన్నువీడుటలేదు. అనవిని, కరుణామయుడు నాశ్రితవత్సలుడునగు రామచంద్రుడు తనతోసమానదుఃఖముగల సుగ్రీవుని యోదార్చుచునిట్లనియె.

సుగ్రీవా! నేనావాలినిజంపి నీకారాజ్యము నిచ్చెదను. ఎవ్వరడ్డము వచ్చినను యీకార్యమును తప్పక సాధింతును. ఎవడు మిత్రునియార్తిని దొలగింపజాలక యూరకుండునో అతడు మిత్రుడెట్లగును? ఎవడు మిత్రుని యావంత దుఃఖమునైనను కొండంతగా భావించి యడ్డుపడునో వాడే సన్మిత్రుడు. ఎవడుమిత్రుని కుమార్గమునుండి మఱలించి, సన్మార్గమున బ్రవేశింపజేయునో! వాడే నిజమగుమిత్రుడు. మిగిలినవాడు మిత్రాభాసము. అంతియకాదు. మూర్ఖుడగు భృత్యుడు, కృపణుడగురాజు, దుష్టమతియగు భార్య, కపటియగు మిత్రుడు, నీనలుగురు హృదయమునకు శల్యము లగుచున్నారు. మిత్రమా! నీవు విచారింపకుము. నీకు నేనన్ని దెరగుల సహాయమొనరింతును. అనవిని సుగ్రీవుడిట్లనియె. ప్రభూ! వాలిమహాబలుడు. అతనికి ప్రతివీరు డెందునులేడు. ఆఎదురనున్న పర్వతాకారముగల రాశిని జూడుము. అది దుందుభియను రాక్షసుని ఎముకలప్రోగు. ఇంతవఱకెవ్వరు నాతనినెదుర్పజాలరైరి. అట్టి దుందుభిని వాలి యనాయాసముగ నిర్జించెను. కాన నీవాగుట్టనొక బాణమున దొలగింపుము. ఆసప్తతాళముల నొక కోలం దెగటార్చుము. అట్లయిన నీవాతని తప్పక నిర్జింతువని నమ్మెదననవిని రామచంద్రుడు పుండహాసము జేయుచు నొకయమ్మున నాదుందుభి యస్థిసంచయమును శతయోజనముల దూరమునబడవైచి, వేఱొకయమ్మున సప్తతాళముల గూల్చెను. అంతనాసుగ్రీవుడు శ్రీరాముని పరాక్రమమున కచ్చెరువందుచు నీతడు తప్పక వాలిని నిర్జించునని నిశ్చయించుకొని, ఈతడు భగవంతుడేకాని మానవమాత్రుడు కాడనియు నీమహనీయునిమైత్రి తన కబ్బుట మహాభాగ్యమని సంతసించుచు నిట్లనియె.

రాముని సుగ్రీవుడు బొగడుట

ఓరఘుకులతిలకా! నీకృపవలన నాయజ్ఞానము భగ్నమయినది. కాన నేనీయస్థిరములయిన సుఖసంపత్పరివారంబుల వీడి నీచరణకమలముల నారా

ధించుచుండును. సాంసారిక సుఖముల గోరువారికి మీచరణసేవ దుర్లభము. మాయికమగు నీజగంబున శత్రుమిత్రులు, సుఖదుఃఖములనెడి ద్వంద్వంబుల పరమార్థ మిసుమంతయులేదు. కావుననే భాగవతులు సంసారసుఖముల నాశింపరు. తమదర్శనలాభమునకు గారణమగు వాలి నాకిప్పుడు మిత్రుడు. స్వాప్నికము జాగ్రత్తున మిథ్యయగునట్లు మా తొంటివైరమిప్పుడు మిథ్యయే యగుచున్నది. కానప్రభూ! నేనిప్పుడు వానినన్నిటిని విడిచి మీపాదముల నారాధింతునన వానివైరాగ్యోక్తులకు ధనుర్ధరుడగు రాముడు మోమున చిఱునవ్వొలయ నిట్లనియె. మిత్రమా! నీపలుకులు సత్యములే. అట్లే వాలిని సంహరింతునను నామాటయు నసత్యము కారాదనియెను.

ఓగగుత్మంతా! నటుడువానరముల నాడించునట్లు రాముడు జీవులచే నాట్యమాడించుచుండును. కావుననే యీతనికపటనాటక సూత్రధారుడందురు. పిమ్మట రాముడు ధనుర్బాణసహితుడై, సుగ్రీవుని వెంటనిడుకొని, కిష్కింధను సమీపించి, సుగ్రీవుని బంపనాతడు రాముని బలము నూతగొని నగరము వెలుపలనిలిచి పెద్దగ గర్జింపసాగెను. అంతవాలి కృద్ధుడై యీతని నిర్జింప నెంచి బయలుదేరెను. అంతలో నాతని భార్యయగు తారవచ్చి పాదంబుల బడి వినయముతో నిట్లనియె. ప్రభూ! నావినిన దానిని జెప్పుచుంటిని. తేజోవంతులగు నిరువురు సోదరులతో జెలిమి చేసివారి సహాయమున సుగ్రీవు డిటకు వచ్చెను. వారు కోసల రాజపుత్రులగు రామలక్ష్మణులు. వారు దురమున యమునై నజయింతురట. అనవిని ప్రియా! నీవింత భయపడ నేల? నీవుచెప్పినట్లు రాముడేయగునేని యీతడు ధర్మమూర్తి. ఆతడు నన్నేల జంపును? ఒక వేళచంపినను దివ్యధామమునందెదను. నీవుమారాడకు మని చెప్పి, మహాభిమానియగువాలి సుగ్రీవుని దృణప్రాయముగనెంచి, కృద్ధుడై గర్జించుచు దలపడి పిడికిట దమ్మునిబొడిచెను. వజ్రతుల్యమగు నాపోటును సహింపజాలక, బరుగునరాముని కడకువచ్చి, రామా! కృపామయా! వాడు నాపాలిటి యముడని నేనిదివఱకే జెప్పియుంటిని. చాల నొచ్చితినిప్రభూ! అనవిని, మిత్రమా! మీరిరువురు సమానరూపులగుటచే సందియమునొడమి నేనేమియుజేయజాలకుంటిని. కానిమ్మని రామచంద్రుడు సుగ్రీవుని తనయభయ హస్తముచే స్పృశించెను. అంతనాతడు బాధతొలగి వజ్రనిభగాత్రుడయ్యెను.

పిమ్మట రామచంద్రుడు సుగ్రీవునిమెడనొక పూలదండనువైచి మఱలబంపెను. అంతనాసోదరులిద్దరును మిక్కిలి ఘోరముగ బోరుచుండిరి. రామప్రసాదము వలన సుగ్రీవుడును వెనుదీయకుండెను. సహజమగుబలముచే వాలియు వెనుదీయుటలేదు. చెట్టుచాటుననుండి వారిరణమును దిలకించుచున్న రాముడు, వాలి సుగ్రీవున కజేయుడని నిశ్చయించి ఇకజాగుచేసిన సహాయము వాటిల్లునని నిశ్చయించి, ఒకతీవ్రబాణముచే వాలియురమునుభేదించెను. అంతవాలి నేల గూలి మూర్ఛితుడై మఱలదెలివొంది చూచువఱకు మేఘశ్యామలగాత్రుడు, జటామండితమస్తకుడు, కోదండపాణియునగు ప్రభువు సాక్షాత్కరించెను. అంత వాలి తనజన్మము సఫలమైనదని సంతసించుచు, సాదరముగ రామపాదముల నీక్షించుచు, చిత్తమున నిల్పుకొని విగతభయుడై, రామచంద్రుని వాక్కుల వినగోఱి యిట్లనియె. రామా! నీవుధర్మమూర్తివి. ధర్మమునుద్ధరించుటకే యవతరించితిని. అట్టినీవు అనిమిషాభిలాషియగు వ్యాధుడుగూడజంపని మర్కట రూపుడనగు నన్నేలజంపితివి? సర్వసముడవగునీకు సుగ్రీవుడహితుడు నేనహితుడనుగానుగదా! యన నాతనికి రామచంద్రుడిట్లనియె. శాఖామృగేంద్రమా! నీవనినట్లు నేనుధర్మోద్ధరణమునకే నిన్నుకూలనేసితిని. చూడుము. పరభామలగోరుట యధర్మము. అందును సోదరునిభార్యను, కూతును, గోడలిని, గోరుట నీచాతినీచము. కిష్కింధాధిపతివగు నీవేయిట్లుచేసిన యిక ధర్మ మెట్లు నిలచును? నీవట్టినీచాతినీచకృత్యము నొనరించుటచే మోమునుగూడ ఎదుటజూడనొల్లక యట్లు చెట్టుచాటుననుండి శబ్దవశమున నినుగొట్టితిని. ఇపుడు నాబాణపూతమున శుద్ధుడవైతివన వాలియిట్లనియె. ప్రభూ! నేనుధన్యుడను. అజన్మాంతము ఘోరతపమాచరించిన మునులకు సయితము నీదర్శనము దుర్లభము. అవినాశియగు శంకరుని మీనామప్రభావముచే గాశీవాసులకు మోక్షమునొసంగుచు నటనివసించుచుండును. అట్టిమహనీయమూర్తి నాకనుల ఎదుట సాక్షాత్కరించినది. నాకింకేమికావలయు నసవిని రాముడు వాలిశిరమును దన హస్తముతో నిమురుచు నిట్లనియె. కపీంద్రా! నీకు కాలమాసన్నమయినది. కాన నీమనోరథమును దెల్పుమన ప్రభూ! ఎవని స్వరూపమును వర్ణింపజాలక వేదము మూకభావముననుండెనో అట్టి పరమాత్మ సాక్షాత్కరించినవాని కేమికావలయును? నీ చరణకమలసేవదక్క తక్కినదంతయు

దుఃఖాన్వితము. కాన నాకింకేమియువలదు. నా మనోరథమును దెలుపుమంటివి. చెప్పుచుంటిని వినుము. నే నేయోనులయం దుద్భవించినను నీపదభక్తి నాకు దివ్మై యుండవలయు. నావలె బలవంతుడు నాపుత్రుడునగు నీయంగదుడు వినీతుడు. ఇతనికి శుభంకరుడవుగమ్ము అని రామచంద్రుని చరణసన్నిధిని సంతసముతో ప్రాణముల విడువ నతనిని తన దివ్యధామమున కనిచెను. ఈవార్త వినినంతనే నగరవాసులందఱు దత్తరపాటుతో పఱుగుపఱుగున వచ్చిరి. వాలి భార్యయగు తార బహుభంగుల విలపింపసాగెను. ఆమె శిరోజములు ముడివీడి చిందరవందరలై నేలబొరలాడ నురస్తాడనమొనరించుచు దుఃఖావేశమున స్మృతి దప్పియుండ నామెనుజూచి రామచంద్రుడు హితము నుపదేశించి యామె యజ్ఞానమును వారించుచు నిట్లనియె. పాంచభౌతిక మగుదేహము నీఎదుటనేయున్నది. ఇకనిత్యుడగు జీవునికై పరితాపమెందు లకు? అన నామె యుదితబోధయై, రామచంద్రుని పదములబడి ప్రభూ! నాకు నీయండెడతెగనిభక్తి ననుగ్రహింపుమని ప్రార్థించెను. పార్వతీ! రామ చంద్రుడీజీవులను గొయ్యబొమ్మలట్లూడించుచుండును. అంత సుగ్రీవుని రావించి వాలికి ప్రేతకృత్యముల నాచరింపుమన నతడట్లాచరించెను. పిమ్మట లక్ష్మణుని బిలిచి సుగ్రీవునకు బట్టముగట్టుమన నతడు కిష్కింధకేగి పౌరుల రావించి, వారి సమక్షమున సుగ్రీవుని రాజుగను, అంగదుని యువరాజుగనుజేసి యచటి వారిని సంతోషబెట్టెను.

పార్వతీ! తల్లి తండ్రి మొదలగువా రెవరును రామచంద్రునివంటి హితులు కాజాలరు. ఆతడనశ్వరమగుమేలును జేయును. అతడవాప్త సకల కాముడు కాన స్వార్థరహితుడు. ఎవడు వాలివలని భయముచే నహోరాత్ర ములు కృశించుచుండెనో, అట్టి సుగ్రీవుడు, రాముని యనుగ్రహమువలన నిష్కంటకముగ కిష్కింధ నేలుచున్నాడు. చూచితివా! రామునిప్రభావము? రాముని స్వభావము మహిమను దెలిసికొని యాతని భజింపక జనులు విపదం బుధిని మునిగిపోవుచుందురు. అంత రాముడు సుగ్రీవుని బిలిచి రాజనీతినంతను బోధించి, సుగ్రీవా! నేనీవనవాసవ్రతము ముగియునంతవఱకు నగరమున ప్రవే శింపరాదు. వర్షర్తువాసన్నమగుచున్నది. కాన మేమిప్రవర్షణగిరియందు నివసింతుము. నీవంగదునితోగూడి రాజ్యమునుబాలింపుము. మాపనినిమిత్తము

మఱువకుమన సుగ్రీవు డారామాజ్ఞను శిరమునదాల్చి వెడల, రామలక్ష్మణు లాపర్వతగుహాయందు నివశించుచుండిరి. రాముడట నివసించునని విరించి, యందొక మనోహరమగు గుహాను, ఫలవృక్షములను కందమూలాదులను నిర్మించి యతిమనోహరము గావించెను. దానిశోభ వర్ణనాతీతము. దేవతలు మునులు మున్నగువారు, ఖగమృగరూపముల ధరించి రామచంద్రుని సేవింపు చుండిరి. రామలక్ష్మణులట నివసించుటచే నాప్రదేశము మిక్కిలి శోభిల్లు చుండెను. అందొక స్ఫాటికవేదికపై గూర్చుండి రాముడు తమ్మునికి జ్ఞానవై రాగ్యముల నుపదేశించుచుండెడివాడు - ఇట్లుండ గ్రమముగా గలిగిన కాలభేద మును నిరూపించుచు రాముడిట్లనెను.

వర్షాకాలవర్ణనము

లక్ష్మణా ! విరక్తులగు గృహస్థులు, విష్ణుభక్తులగాంచి సంతసించు నట్లాకసమునందలి ఘనగర్జితములవిని యీమయూరము లెట్లు నాట్యమునుచేయు చున్నవో చూచితివా ! ఈఘనగర్జితములకు ప్రియావిరహితమగు నామనసెం తేసి వంతనందుచున్నది. దుష్టమైత్రివలె నావిద్యుల్లతలెంత చంచలములో చూడుము. ఆ మేఘములు మత్తగజములవలె వర్షించుచున్నవి. ఖలదూషణ ములను సత్పురుషులవలె నీవర్షధారలను పర్వతములుసహించుచున్నవి. ఖలుల చిత్తవృత్తులవలె నీసెలయేరులెట్లు ప్రవహించుచున్నయవో ! జీవుడుమాయలో బడి మలినుడయినట్లీ వర్షోదకము భూసంపర్కమున మలినమగుచున్నది. సద్గుణ ములచే సజ్జనమానసమువలె నాసరోవర మీవర్షోదకముచే బూర్ణమగుచున్నది. భక్తులు భగవంతునియందు సుస్థిరులగునట్లు నదులుసముద్రమునంది, సుస్థిరము లగుచున్నవి. పాషండాగమములచే నుత్తమమతములట్లీ తృణములచే మార్గ ములు విహితములగుచున్నవి. విద్యార్థుల వేదపఠనమువలె నీమండూకములు నలుదిక్కుల ధ్వనిచేయుచున్నవి. సాధువులమనములందు వివేకమువలె నీవిటప ములనుండి పల్లవము లుద్భవించుచున్నవి. నీతినిపుణునిరాజ్యమున ఖలచేష్టిత ములవలె జిల్లేడు నశించుచున్నది. క్రోధముచే ధర్మమువలె బురదచే ధూళి నశించినది. ఉత్తమునిసంపదవలె, భూమి సస్యశ్యామలమగుచున్నది. దంభ సమాజమువలె నీకటికిచీకటిలో ఖద్యోతములు విలసిల్లుచున్నవి. స్వాతంత్ర్య

మున స్త్రీలవలె నతివృష్టిచే పూవుతీగెలు చెడిపోవుచున్నవి. సజ్జనులు మోహ మదములను దూరముచేసినట్లు, హాళికులు సస్యములనుండి కలుపును దీసివేయు చున్నారు. కలియందు ధర్మమువలె చక్రవాకములెచటను గానుపించుటలేదు. హరిభక్తులమనమున, కామమువలె చవిటినేలలందు గడ్డి మొలచుటలేదు. ఉత్తమరాజ్యమందు ప్రజలవలె సస్యములభివృద్ధి సందుచున్నవి. జ్ఞానులయింద్రి యములవలె పాంథులు విశ్రమించుచున్నారు. కుపుత్రునిచే కులధర్మములట్లు ప్రచండమారుతముచే మేఘములు చెదిరిపోవుచున్నవి. కుజనమైత్రిచే సద్బుద్ధి వలె, మేఘములచేసూర్యుడు గప్పబడుచున్నాడు.

శరత్కాలవర్ణనము

తమ్ముడా! యీదుస్తరమైనవర్షాకాలము పాముకుబుసమువలె తనంత దానె జారిపోయినది. ఇక సుఖకరమగు శరత్కాలమువచ్చినది. వర్షాకాల మయెొక్క వార్ధక్యమునవలె దుబ్బునారెల్లు ఎట్లుపూచినదో చూడుము. సంతోషముచే లోభమునవలె నాతపముచే పూర్ణమందలిబురదలు ఎండిపోవు చున్నవి. సత్పురుషుల మనంబులట్లు నదీజలంబు లతి నిర్మలములగుచున్నవి. మంచిరోజులలో సుకృతము ఫలించునట్లు కాటుకపిట్టలెగురుచున్నవి. నీతినిపు ణుడగురాజు పరిపాలనమున ప్రజలకష్టములవలె ప్రోవలోనిబురదలు తొలగి పోవుచున్నవి. నిర్ధనునికుటుంబమువలె స్వల్పజలమునందలిమీనంబులు కుందు చున్నవి. ఆశలనువీడిన హరిభక్తులమానసములవలె మేఘావరణముదొలగిన ఆకసమెంతేని నిర్మలముగానున్నది. భగవత్ప్రసన్నులగు మహాభక్తులవలె యగాధజలమందున్న మీనములు నిర్విచారముగ నున్నవి. నిర్గుణమూర్తి సగుణమూర్తిఅయినట్లు కమలములు వికసించుచున్నవి. అందు మధుకరము ఝుంకారమును జేయుచున్నట్లు, నాభక్తులు నన్ను స్తుతించుచుందురు. దుర్జను లితరులసంపదలకు దుఃఖించునట్లే శరద్రాత్రులందు చక్రవాకములు చింతిల్లు చున్నవి. శివనిందాపరులవలె చాతకములు తృషితములగుచున్నవి. సద్గురు కటాక్షమువలన సంశయభ్రమలు నశించునట్లు వర్షాకాలమం దుద్భవించినక్రిమి కీటకములు నశించుచున్నవి.

సీతాన్వేషణయత్నము

సోదరా! ఇంతవఱకు సీత జాడ తెలియుటలేదు. ఆమె జాడ దెలిసిన యమున్నై నను నిర్జింతుము. సుగ్రీవుఁడు రాజ్యమును. పురమును, భార్యలను జూచుకొనుచు మనలను మఱచియుండనోపఁడు. కాన నీవేగి వాలినిజంపినబాణము మనయొద్దనున్నదని జెప్పుము. అనునంత లక్ష్మణుఁడు ధనుఃపాణియై ప్రయాణోన్ముఖుడగునెడ, దయామయుడగు రామచంద్రుఁడాతనితో నిట్లనియె. సుగ్రీవుని బెదరింపుమాటలాడి తీసికొనిరమ్ము. ఆతనిని హింసింపకుము. ఆతఁడు నా భక్తుఁడు. కాన నాతని హింసను నేను సహింపజాలను. అని బోధించి బంపెను. అంతలో రాజ్యలోలుఁడై సుగ్రీవుఁడు మఱచెనని దలచి మారుతి యటకేగి శిరము వంచి నమస్కరించి, రామునకిచ్చినవాగ్దానమును జెల్లింపుమని ప్రార్థింప నంత రవిసూనుఁడు మిక్కిలి భయమందుచు, విషయాసక్తుఁడ నగుటచే నేనీకార్యమును మఱచితిని హనుమా! నాకు మిక్కిలి భయమగుచున్నది. ఏమియును దోచుటలేదు. అన నాతనికి హనుమ ఇట్లనియె. కపికులపతీ! ఇప్పుడైనను వానరసేనను రావించి సీతాన్వేషణమునకు బంపుము. ఒకనెలలో దిరిగి రాని వారిని తీవ్రముగ దండింతుననియు నాజ్ఞాపింపు మన సుగ్రీవుఁడట్లకానిమ్మన నంత హనుమ వానరవీరుల రావించి, వారికర్తవ్యమును బోధించి, సుగ్రీవాజ్ఞనుగూడ జెప్పెను. అంత నావానరవీరులు సుగ్రీవాజ్ఞను తలను దాల్చి సీతాన్వేషణమునకు బయలుదేరుచుండిరి. ఆసమయమున కృద్ధుఁడైన లక్ష్మణుఁడటకు వచ్చి క్రోధతామ్రాక్షుఁడై, చూపుడీ! పురమును క్షణములో భస్మముచేయుదు నన నాతని పలుకుల కందఱును భయమందుచుండ నపుడంగదుఁడు వచ్చి సవినయముగ నమస్కరింప లక్ష్మణుఁడతని కభయము నిచ్చెను. కృద్ధుఁడగు లక్ష్మణుని రాకను విని సుగ్రీవుఁడు భయమందుచు మారుతిని బిలిచి హనుమా! నీవీతారను వెంటనిడికొని లక్ష్మణుని శాంతింపజేయు మన నతఁడట్లుచేసి రాముని గుణముల వర్ణించి యాతనిని వశపఱచుకొని రాజగృహమునకు దోడితెచ్చి యర్ఘ్యపాద్యంబుల నిచ్చెను. అంత సుగ్రీవుఁడు వచ్చి యాతని పాదంబుల బడి సవినయముగ ప్రార్థించెను. లక్ష్మణుఁడంత కోపముడిగి సుగ్రీవుని భుజముపై చేయినుంచి ప్రసన్నుఁడై మాటాడదొడగెను. సుగ్రీవా! తప్పెవరికైనను రావ

చ్చును. దానిని మాన్పుటకు తిమార్పణ మొక్కటియే సాధన మన నంతలో మారుతి, సీతాన్వేషణమునకు దూతల నంపినవిషయము నెఱిగింప, సుగ్రీవాది వానరవీరుల వెంటనిడికొని లక్ష్మణుడు రాముని సన్నిధికి వెడలెను. అంత సుగ్రీవుడు రాముని పాదముల బడి ఇట్లు వేడుకొనెను. ప్రభూ! నేను మీపనిని మఱచుటలో నాతప్పేమియును లేదు. నీమాయ నీయనుగ్రహమువలనగాని వీడదు. నీమాయకులోనై బ్రహ్మాదులు విషయాసక్తులై యుండ, బామరుడను, గామకుడను, వానరుడ, నగు నేనిట్లుండుట కేమివింత! కాంతాకనకములకు లోబడక మోహపాశనిబద్ధులు కానివారు మీతో సమానులే యగుదురుగద. ఈమాయ నీయనుగ్రహమువలనగాక మఱియేయుపాయమువలనను దొలగదు. అన విని రామచంద్రుడు మందహాసముతో నిట్లనియె. సుగ్రీవా! నీవు భరతునితో సమానుడవు. సీత జాడ మన కెట్లు దెలియునో! ఆపనిని ముందు జూడు మనునంతలో పరాక్రమశాలురగు వానరులు గుంపుగా నటకు వచ్చిరి. వారు లెక్కకు నెక్కుడుగ నున్నారు. వారిని గణింపదలచినవారు చేతకానివా రగుదురు. వారట్లు వచ్చి రామచంద్రునకు నమస్కరించి నిలువ వారలనెల్ల వేఱు వేఱుగ గుశలము నడిగి మీరుచుండమని రాముడన సంత సుగ్రీవుడు వారలకు జేయదగిన విధానము నంతను జెప్పి, రామకార్యమును సాధించినవారు నాకు మిక్కిలి హితులు. కాన మీరు నలుదిక్కులకుబోయి సీతాన్వేషణ మొనరించి ఒకమాసములో దిరిగిరావలయును. అట్లు చేయనివారు నాచేత మరణింతురు. అన సుగ్రీవుని యాజ్ఞను గైకొని వారాయాదిక్కులకు బోయిరి. అంత సుగ్రీవుడంగదాదుల జూచి యిట్లనియె. కపివీరులారా! మీరు బుద్ధిమంతులు. బలవంతులు, చతురులు, కాన మీరు తగుసహాయులగొని దక్షిణదిక్కునకుబోయి సీత జాడను దెలిసికొని రండు. అట్లుకానినాడు మీరు నన్నును రామచంద్రుని దాటిపోజాలరు. నశ్వరములగు నీశరీరముల గణింపక రాముని కార్యమును సాధించి శాశ్వత కీర్తి సౌఖ్యముల నందుడు. రఘువీరుని చరణకమల సేవకులే ధన్యులు. అన విని వానరు లందఱు, రామునకు సుగ్రీవునకు నమస్కరించి, రాముని మనమున దలంచుచు బయలుదేరిరి. అంత హనుమంతుడును రాముని కి నమస్కరించి యనుజ్ఞనువేడ, నీతడు కార్యసాధకుడని యెంచి, యాతని దగ్గరకు బిలిచి తన పాణిపద్మము నాతని శిరమునం దుంచి, యాశీర్వదించి, తన

స్వరూప పరాక్రమముల నాతని కెరిగించి, తన ముద్రిక నానవాలుగ నొసంగి, త్వరలో దిరిగిరమ్మ:న నాతడును తన జన్మము సఫలమైనదని తలంచుచు, రామ చంద్రుని హృదయమునం దిడుకొని ధ్యానించుచు బయలుదేరెను. రామున కన్నియు దెలిసినను లోకమర్యాద ననుసరించి దూతల నంపుచుండెను.

వానరులు సీతకై వెదుక బోవుట

అట్లువానరులు రామకార్యతత్పరులై మైమఱచి, వనముల నదుల బర్వతముల గుహల వెదకుచు, గనబడిన దుష్టులజంపుచు, మునుల దర్శించుచు దిరుగుచుండ నొకనాడు త్రోవదప్పి దప్పిగొని బాధపడుచుండ వారలజూచి హనుమంతుడొక పర్వతమునెక్కి నలుదిక్కులగలయజూడ నటనొక బిలము గాన్పించెను. దానినుండి హంసలు మున్నగు జలపక్షులు వచ్చుచుండుటజూచి యటజలముండుననియెంచి పర్వతమునుదిగి వారల నాబిలముకడకు దీసికొని బోయెను. పిమ్మట తానుముందుగనుండి వారల నాబిలముగుండ దీసికొని చన నట నొక సరోవరము గాన్పించెను. అందువికసితములగు కమలములు కన్నులపండువు గావింపుచుండెను. ఆసరోవరప్రాంతమున నొకయుద్యానవన మును దానిమధ్యనొక సుందరమగు మండపమునందు స్వయంప్రభయను సుందరాంగియు గానంబడియె. వానరులామెకునమస్కరించి యామెవృత్తాంతము నడుగ నామె తనవృత్తాంతమునుజెప్పి వీరియాగమనకారణంబడుగ రామ కార్యార్థమువచ్చితిమని సవిస్తరముగజెప్పి యామె యనుజ్ఞచే నాసరోవర జలంబులద్రావి ఫలములదిని సేదదేరిరి. పిమ్మటతపస్వినియగు నాస్వయంప్రభ వారలతో నిట్లనియె. కపివీరులారా! రామదర్శనమును గోరి నేనిటనుంటిని. నేనారామని దర్శింపబోవుచున్నాను. మీరొకక్షణకాలము కనులమూసి కొనుడు. వెంటనే సముద్రతీరమును జూడగలరు. అటమ్మెధిలిజాడను దెలియ గలరన వారట్లుచేసి సముద్రతీరమును జేరిరి. పిమ్మట స్వయంప్రభ రాముని దర్శించి నమస్కరించి స్తుతించెను. రాముడామె యనన్యభక్తికిమెచ్చి యామెను బదరికేగుమన నామెశివునకునమస్కరించి, రామునిధ్యానించుచు, నరనారాయణ నివాసమైన బదరికాశ్రమమునకుబోయెను. ఇటవానరులు గుమి గూడి ఇట్లాలోచింపసాగిరి. మనకు సుగ్రీవుడిచ్చినగడువు దాటుచున్నది. పని

కాలేదు. ఏమిచేయుటకును దోచకున్నది. అనవినియశ్రుపూరితలోచనుడగు యంగదుడిట్లనియె. మనకెట్లును మృత్యువుతప్పినట్లులేదు. సీతజాడదెలియక సుగ్రీవునొద్దకుబోయిన నాతడుజంపును. పోనినాడు క్షుత్పిపాసలచే నిటభ్రాణములు నిలువవు. అనవినివానరులెల్ల మిగులదుఃఖించుచు, సీతజాడదెలియని నాడు మనమటకుబోనేల ? ఇటనే ప్రాయోపవేశమును జేయుదమని నిశ్చయించుకొని ఆసముద్రతీరమున గూర్చుండిరి. అప్పుడు విలపించుచున్న యంగదుని జూచి దుఃఖోపశమనమునకనేకములగు కథలజెప్పుచు, జాంబవంతుడిట్లనియె. తండ్రీ! రామచంద్రుని మనుజునిగ భావింపకుము. ఆత డజేయుడు నజుడునగు నారాయణుడు. మనమదృష్టవంతులము. కాన నాతనిసేవాతత్పరులమై ఇటకు వచ్చితిమి. ఈతీరున మనకాసగుణమూర్తిని సేవించుభాగ్యమబ్బినది. దుష్ట శిక్షణమొనరించి సాధురక్షణమున కవతరించిన విష్ణుమూర్తి. కాన మన మన్నిటినివీడి రాముసేవింతము.

సంపాతికథ

అనుచుండ వారిసందడినివిని, పర్వతగుహయందున్న సంపాతియనుపక్షి బయటకువచ్చి వానరులదిలకించి, ఈశ్వరుడు నేటికి దృష్టికరమగు నాహారమును బ్రసాదించెను. వీరినిభక్షించి నాయాకలిని దీర్చికొనియెద. చాలదినముల నుండి క్షుత్తుచే బాధపడుచుంటిని. ఒక్కసారి యింతపుష్కలమగు నాహారము దొఅకినదని సంతసించుచుండనంత వానరులాపక్షీంద్రునిజూచి ఎటులయినను మరణము ధృవమనినన్నిలేచినిలుచుండిరి. దీనినితప్పించుకొనుట కుపాయము నాలోచింపుచున్న జాంబవంతునకొకయూహదోచెను. సంపాతిజటాయువు లన్నదమ్ములు. కాన జటాయుని వృత్తాంతముచే సీతని శాంతింపజేయుదుననని యిట్లనియె. రామునిపనికై యసువులనర్పించిన జటాయువునంతటి భాగ్యశాలి యెందేనిగలడా! అతడు ధన్యజీవి. అపలుకులవిని హర్షశోకపరీతమానసుడగు సంపాతి మెల్లన వానరుల సమీపించుచుండెను. అప్పుడాతనినిజూచి వానరులు భయమందుచుండ నాతడు వారలతో నిట్లనియె. నాయనలారా! భయమందకుడు. నేను మిమ్ములహింసింపను. మీరెవరిటకేలవచ్చితి రని, వారివృత్తాంతమును జటాయునివృత్తాంతమునువిని వారలతో నిట్లనియె. మీరు

మెల్లన నన్ను సముద్రతీరమునకుగొనిపొండు. నేనట నాసోదరునకు దర్పణముల నిచ్చెదనని తనవృత్తాంతమునుజెప్పి ఇప్పుడునేనుమీకు వాక్సహాయమును మాత్రము జేయగలను. అనవారట్లుచేసిరి. సంపాతి జటాయువునకు దర్ప ణాది విధులజేసి పిమ్మట వారలతోనిట్లనియె. నాయనలారా! మాబాల్యమున మేమిరువురము పన్నిదమువైచికొని సూర్యుని ముట్టబోతిమి. నాతమ్ముడు సూర్యుని వేడిమికిదాళజాలక కొంతదూరమువచ్చి వెనుకకుమఱలిపోయెను. నేను దురభిమానముచే సూర్యుని సమీపింపగా నారెక్కలుమాడి నేలగూలి తిని. అంతచంద్రుడనుముని నాయవస్థనుజూచి దయదలచి, నాకు జ్ఞానమునుపదే శించెను. అంతశరీరాభిమానమును వీడితిని. మఱియుద్రేతయందు పరమాత్మ మానవజన్మమునెత్తి వనవాసమునుజేయుచుండ రావణుడు మాయోపాయముచే నాతనిభార్యయగు సీతనపహరించును. అప్పుడు సీతాన్వేషణమునకు వానరుల నంపును. వారీప్రాంతమునకువచ్చెదరు. వారి దర్శనమువలన నీవు పవిత్రుడ వగుదువు. మఱియు శ్రీరాముని యనుగ్రహమువలన నీకు రెక్కలుమొలచును, అనియునాతడుజెప్పెను. మునివాక్కులు నేటికిఫలించినవి. ఇకమీరా రాముని కార్యమును సాధింపుడు.

సంపాతి సీతవసతిని తెలుపుట

ఈ సముద్రము శతయోజనవిస్తీర్ణము. ఆవలప్రతికూటమను పర్వతము కలదు. అందున్న లంకయనుపట్టణమును రావణుడునిర్భయముగ పాలింపు చున్నాడు. ఆతని యశోకవనమున దుఃఖభరాలసయై సీతకూర్చున్నది. అన వానరులామెనుమాకు జూపుమనిరి. నాయనలారా! మాకుగల దూరదృష్టి మీకులేదు. కాన మీరామెను జూడజాలరు. నేనును వృద్ధుడనగుటచే మీకు దగిన సహాయమొనరింపజాలనైతిని. శ్రీరాముని యనుగ్రహపాత్రు లీయపార భవజలధిని యవలీలగదరించున్నారు. అట్టి రఘునాథుని కింకరులగు మీరీసము ద్రమునానాయా సముగ దాటగలరు. కాన రామపదకమలముల మదిని నిల్పి మీరుమీకార్యమును సాధింపుడు. మీదర్శనమున నాకు రెక్కలువచ్చినవి. నేబోయివచ్చెదననిచెప్పి సంపాతివెడలిపోయెను.

సముద్రతరణము

సంపాతిపలుకులవిని వానరులమితానందమంది తమతమ బలముల జెప్పి కొనుచుండిరి. కాని వారిలో సముద్రమును బూర్తిగదాటుసామర్థ్య మెవరికిని లేకుండెను. అంతజాంబవంతు డిట్లనెను. నేను వృద్ధుడనగుటచే నాబలము క్షీణించినది. భగవంతుడు వామనావతారము నెత్తినపుడు నేనమితబలము గలిగియుండెడివాడను. ఆ సమయమున బలినిబంధించి త్రిజగద్వ్యాపియై యున్న వామనమూర్తికి రెండుగడియలలో నేడుమారులు నేను ప్రదక్షిణముజేసి యుంటిని. ఇపుడాబలమంతయు నేమయ్యెనో! దెలియకున్నది. ఇపుడైనను సముద్రమును దాటగలనుగాని పునరాగమనమున సందేహమగుచున్నది. అన నంగదుడిట్లనియె. నేనుపోయి రాగలనుకాని అక్షయుడట నున్నంతకాలము నేనటకు జనరాదన, నంగదా! నీవు యువరాజువు. సేనానాయకుడవు. నీవేగిన నీసేనను గాపాడువారెవరు? కావ నీవు బోరాదని జాంబవంతుడు హనుమంతు నితో నిట్లులనియె. హనుమా! నీవూరకుంటివేల? నీవసమానబలుడవు. ప్రజ్ఞానిధివి. యుక్తాయుక్తవిచక్షణుడవు. పితృతుల్య పరాక్రముడవు. నీవు రామకార్యార్థ మవతరించితివన విని హనుమంతుడబ్బి సింహనాదముజేయుచు స్వర్ణపర్వతాకారుడై యిట్లనియె. ఈ సముద్రమును దాటుటయెగాక లంకకేగి సర్వసేనాసమన్వితుడగు రావణునిదునుమాడి, లంకాధార మగుద్రికూటము నూడబెరికి మీసన్నిధికిజేర్తును. కాన నేనటకేగి జేయదగినకార్యమును జెప్పు మనజాంబవంతుడిట్లనియె. హనుమా! నీకు నే జెప్పవలయునా! సీతాన్వేషణ మెనరించి, యామెతో రాముని క్షేమమునుజెప్పి, రాములుద్రిక నామె కొసంగి, యామెకుశలమునరసిరమ్ము. ఆతరువాతికార్యము నపుడాలోచింత మనెను. ఈ పవిత్రచరిత్రమును, దేవతలు నారదాదిమహర్షులును గానము చేయుచుండెదరు. ఈ చరిత్రమునెవ్వరువినిసను జదివినను దురితములుదొలగి సుఖంబుననుండి దివ్యధామమున కేగెదరు. తులసీదాసుడనగునేను రఘువీరుని పదకమలముల దుమ్మొదనై సంచరింతును. రఘువరునిచరితము భవరోగభేష జము. నీలోత్పలదళ శ్యామలకోమలాంగుడును, కోటిమన్మథరూపుడు నగు రాముని చరితమును వినువారందఱును దుఃఖదూరులై సకలాభీష్టముల నందెదరు.

కిష్కింధాకాండము సమాప్తము

సుందరకాండము

శ్లో॥ శాంతం శాశ్వత మప్రమేయ మనఘం నిర్వాణశాంతిప్రదం
శంభుబ్రహ్మఫణీంద్రసేవ్య మనిశం వేదాంతవేద్యం విభుం
రామాఖ్యం జగదీశ్వరం సురగురుం మాయామనుష్యం హరిం
వందేహం కరుణాకరం రఘువరం భూపాలచూడామణిం॥

నాన్యాస్పృహా రఘుపతే ! హృదయేఽస్మదీయే
సత్యంవదామిచ భవానఖిలాంతరాత్మా
భక్తిం ప్రయచ్ఛ రఘుపుంగవనిర్భరాం మె
కామాదిదోషరహితం కురుమానసం చ॥

ఆతులితబలధామం స్వర్ణశైలాభదేహం
దనుజవనకృశానుం జ్ఞానినా మగ్రగణ్యం
సకలగుణనిధానం వానరాణామధీశం
రఘుపతివరదూతం వాతజాతంనమామి॥

జాంబవంతుని సుఖకరములగు పలుకుల విని మనంబున సంతసించి, సచివోత్తమా ! ఫలమూలాదుల భుజించుచు నెట్టికష్టములకైన నోర్చి నేను సీతను జూచి వచ్చెదను. అంతవఱకు నా రాకను నిరీక్షించుచు మీరిట నుండుడు. సోత్సాహముగ రామకార్యమును సాధింతునని జెప్పి, వారికి నమస్కరించి, రఘునాథుని హృదయమునందిల్పి, యమితానందముతో బయలుదేరి, అటనున్న మహేంద్రపర్వతమ్మైకి లంఘించి, సింహనాదము నొనరించెను. ఈతని లంఘనాహతిని సహింపజాల కాపర్వతము కృంగిపోయెను. అంత నాహనుమంతుడు రామాస్త్రమువలె నంబరవీధిని జనుచుండ నీతడు రఘువీరుని దూతయని దెలిసికొని విశ్రమించుటకు సముద్రుడు మైనాకుని బంప నాగిరిపైని చేయినిడి, రాముని కార్యమును సాధించునంతదనుక విశ్రాంతిని గొననని చెప్పి, హనుమంతుడు మఱల ప్రయాణము సాగించుచుండెను. అంత దేవత లితని బుద్ధిబలవిశేషంబుల నరయగోరి సురసయను నాగమాతనంపిరి. ఆమె మార్గమున కడ్డముగా నిలిచి నాయాకలిని దీర్చుమన, నేను రాముని దూతను. రాముని పనిమీద బోవుచుంటిని. సీత జాడను దెలిసికొని రాముని సేవించి మఱల వచ్చి నీయభీ

ష్టమును దీర్చెద. నామాటను నమ్ముము. నన్ను పోనిమ్ము. నన్ను నీవు మ్రింగ జాలవు అని హనుమ బలుక, సురస తన ముఖము నొకయోజనము పెంచెను. అది జూచి హనుమ తన తనువును రెండుయోజనములు పెంచెను. అంత నామె తన ముఖమును పదునాఱు యోజనములు పెంచెను. దానిని జూచి హనుమ ముప్పదిరెండు యోజనములు పెరిగెను. ఇట్లామె మోమునకు రెట్టింపుగా బెరుగుటను జూచి సురస తన నోటిని నూరుయోజములు పెంచెను. అప్పుడు హనుమంతు డాలోచించి సూక్ష్మరూపమును దాల్చి యామె ముఖమున బ్రవేశించి మఱల వచ్చి నమస్కరించి, నిలిచిన నాసురస సంతసించుచు నీవు రామకార్యమును నెరవేర్పగలవు. పోయిరమ్మని దీవించి వెడలిపోయెను. అట్లామెచే ననుజ్ఞాతుడై హనుమంతు డాకసమున బోవుచుండ నాజలధిని డాగి, గగనగతములగు పక్ష్యాదుల ఛాయను గ్రహించి దన్మూలమున వానిని కబళించుచు తున్నివారణమును జేసికొనుచున్న సింహికయను రక్కసి హనుమంతుని గ్రహింప నాతడారక్కసిని దునుమాడి, యనాయాసముగ సముద్రమును దాటి యచటి వనశోభను దిలకించుచు, మధులోభముగల జంచరీకముల ధ్వనుల వినుచు, ఫలపుష్పభరితములగు నానావిధవృక్షంబులను, ఖగమృగబృందవిహారములను జూచి సంతసించుచు, తన కెదురుగానున్న యామహాద్రిపైకి లంఘించి, నలుదిక్కుల జూచుచుండెను.

హనుమంతుడు లంకను జూచుట

ఉమా! శ్రీరాముని మహిమను జూడుము. ఇదంతయు నాతని ప్రభావము. హనుమ యటనుండి లంకాపురిని జూచుచుండెను. ఆపట్టణ మెంతేని శోభిల్లుచున్నది. అచటి దుర్గములు అందలి కోటలు నాకోటల బురుజులు స్వర్ణమయములై ధగధగలాడుచుండెను. ప్రాకారము లత్యున్నతములై విలసిల్లుచుండెను. నలువైపుల నతివిశాల రమణీయములగు నగడులు మహార్ఘవస్తుభరితములై యుండెను. మఱియు మనోహరములగు రాజమార్గములును, నసంఖ్యాకములగు రథగజ తురంగపదాతుల వర్ణింపనలవిగాకుండెను. నానారూపులు నమితబలశాలురునగు నిశాచర యోధుల యూథంబు లెన్నియోగలవు. మఱియు ననేకములగు పూలతోటలు, అందమగు దిగుడుబావులు, వాని

దాపున పొడరిండ్లుకలవు. వానియందు బందీకృతులగు సురనాగగంధర్వకన్నెలు నసంఖ్యాకములు గలరు. వారి సోయగమున కెట్టిమునులు మోహితులుగాక యుండజాలరు. మఱియు పర్వతాకారులగు మల్లులు సింహనాదముల జేయుచు తమతమ బాహుబలముల బ్రకటించుచుండిరి. వికటాకారులగు రాక్షసులు పట్టణమును నలుదిక్కులఁ గాపాడుచు, లభించిన మహిష, మనుజ, గో, గార్ధభాదులను నిర్దయగ జంపి భక్షించుచుందురు. మహోద్దుష్టులగు వీరు రామబాణ తీర్థమున మునిగి సద్గతినొందగలరు. నిరామిషంబైన శల్యమునుజూచి కాకము నిద్రాదికమునువీడి దానిని బొడుచునట్లఖిలవర్ణనము నింతతో ముగించి ముందు కథకు బోవుదము.

హనుమంతుడు లంక జొచ్చుట

హనుమంతుడా విశేషములగమనించి, పగటిసమయమున బ్రవేశించుట యుక్తముగాదని నిశ్చయించి, రాత్రియందల్పకాయుడై, రామునిస్మరించుచు నగరమున బ్రవేశించుచుండ నంత లంకిణియనురక్కసి యాతనిని గుర్తించి, మూర్ఖా! నన్నువంచించి యెటకేగుచుంటివి? నన్నెఱుగవుగాబోలు! ఇట బ్రవేశించెడివారు నాకాహారము కాకతప్పదు. అని యామూగుతిని బట్టనుంకించెను. అంతనతడామెను తలప్రహారముచే దప్పించుకొనెను. ఆదెబ్బతోనామె రక్తమునుగ్రక్కుచు వివశయై మృదుభాషల నిట్లనియె. మహాత్మా! అజుడు రావణునకు వరములిచ్చివెడలునప్పుడు నాతోనిట్లనియె. ఓసీ! నీవెప్పుడు నానరునిచే నిర్జింపబడుదువో, ఆనాడునీకు ముక్తియు, లంకకువినాశము, రావణాదిరాక్షసవీరులకు మృతియు సంభవించును అని. అట్లే నేటికి నీదగ్గనము లభించినది. నేనెంతేనిధన్యను. స్వర్గమును, సత్సంగతిని, తులదూచగా సత్సంగతియే మిన్నయగుచున్నది. కోసలాధీశుని భజించుచు నగరమున ప్రవేశించి నీకార్యముల నెరవేర్చుకొనుము. రాముని యనుగ్రహమువలన, విషమమృతము, శత్రులుమిత్రులు, సింధువు గోష్పదము, అనలము శీతలము నగును. రామచంద్రుని కృపవలన నీకార్యముసిద్ధించును. నాకుశలవునిమ్మన వల్లెయని యాకేసరికిశోరము లంకబ్రవేశించి, ఒక్కొకసౌధమునే శోధించుచు నటనున్న విశేషముల దిలకించుచు, నటసీతనుగానక వర్ణనాతీతమగు రావణుని సౌధ

మున బ్రవేశించి, నిద్రాపరవశమగు స్త్రీసమూహమును జూచి సీతనటగానక మఱియొకభవనమును జూచెను. అందొక భగవన్మందిరమును, దానిముంగిట దులసీవనమును జూచి సంతసించుచు దుష్టరాక్షసమయమగు నీలంకలో నిట్టి భగవన్మందిర మెట్లున్నదా యనితలంచుచుండునంతలో విభీషణుడు మేల్గాంచి భగవత్స్మరణమును జేయగా విని యాతనిభక్తికి హనుమ విస్మయమందుచు, సజ్జనసహవాసమువలన కార్యహాని కలుగదనితలంచి, అతనికి తనరాకనెఱి గింపనెంచి, విప్రరూపమున నాతనిసమీపించెను. అంతవిభీషణు డవిప్రపుంగ వునిజూచి నమస్కరించి కుశలమడిగి, స్వామీ! మీరు హరిదాసులవలె నున్నారు. మీయందు నాకపరిమితమగు ప్రేమకలుగుచున్నది. నీవా దీనద యాళుడగు రామచంద్రుడవు కావుగద. అట్లైననాభాగ్యము నేమనవలయును? అనవిని హనుమంతుడు తనపేరునుజెప్పి తానువచ్చినపనిని వినిపించెను. అంత వారిరువురును రామకథాప్రసంగముచే పులకితగాత్రులైరి. పిమ్మట విభీషణుడు రామునిస్మరించి, హనుమా! యీరాక్షసులనడుమ దంతములనడుమ నాలుక వలె నేనుంటిని. ఇట్టి నన్ను రామచంద్రుడు కటాక్షించకపోవునా? తామ సుడనగు నాకు రామభక్తిదుర్లభము. అయినను నాయందు రాముని కనుగ్ర హముకలదనియే నానమ్మకము. లేనిచో నాకునీదర్శనభాగ్య మెట్లులభించును? అనునావిభీషణునితో హనుమయిట్లనియె. విభీషణా! రఘునాథు డెప్పుడును సేవకులను బ్రేమించును. నన్నుజూడుము. నేనకులీనుడను. చపలుడను. వాన రుడను. ఇట్లన్నివిధముల హీనుడనగు నాయందతనికికల యనుగ్రహము వర్ణనా తీతము. అనుచు రామచంద్రునిగుణగణంబుల నుగ్గడించుచు నానందబాష్పము లొలుక బులకితగాత్రుడగు నాహనుమనుజూచి విభీషణుడు విస్మయమందుచు నిట్టి రామభక్తు లెందునులేరని సంతసించుచు సీతావృత్తాంతము నంతను వివరించెను.

హనుమ సీతనుగాంచుట

అంత సీతను జూడదలచి మారుతి యాతని యనుజ్ఞనుగొని మెల్లన నశోకవనమును బ్రవేశించి, అందాదేవిని దర్శించెను. హనుమ మనసున నామెకు నమస్కరించుచు, నామెతో మాటాడుటకు సమయమును నిరీక్షించు

చుండెను. కృశించిన తనువు, నేకవేణీధరయు, మలినాంగియునగు సీత రామ నామమును జపించుచు నాచెట్టుక్రింద కూరుచుండెను. ఆమైథిలి రామచరణ కమలముల దనమానసమునందిడికొని దీనాననయై తదేకాగ్రదృష్టితో ధ్యానింపు చుండెను.

హనుమ యామెనుజూచి మిక్కిలి దుఃఖించుచుండ నంతలో రావణుడు అలంకరించుకొని విలాసవతులు వెంటరా నటకుజనుదెంచెను. అతడాసీతతో దన పరాక్రమచాతుర్యముల జెప్పి తనను ప్రేమింపమనియు, నంతఃపురకాంతల సందఱి నీకు పరిచారికలగ జేసెదననియు ననేకవిధముల బోధింప నాపై దేహి తృణమునొకదాని నడ్డముబెట్టుకొని వానితో నిట్లనెను.

సీతా రావణ సంవాదము

రావణా! అయోధ్యాధీశుని ప్రభావమును నీవెఱుంగవు. ఖద్యోత ప్రకాశమునకు పద్మములు వికసింపవు. ఎవని బాణప్రభావముచే కాకాసురుడు ముల్లోకములదిరిగి రక్షకుడులేక తిరిగి యాతనినే శరణుజొచ్చెనో! అట్టి రాముడులేని సమయమునందొంటిగానున్న నన్నపహరించిన నీవు నావద్దనే నీ పరాక్రమమును జెప్పుచుంటివా? నీకు సిగ్గులేదు అని యామైథిలి బలుక, నేను ఖద్యోతసముడనా? రాముడు సూర్యసముడా? చూడు నామహిమ! యని బలికి రావణుడు కృద్ధుడై కరవాలమునుతీసి, సీతా! నీవు నన్నవమా నించితివి. కాన నీశిరము నీకరవాలముతో ఖండించెదను. నీవు నామాటల విన కున్న నీప్రాణములు నిలువవని పలుక జానకి శిరమువంచి, రాముని ధ్యానిం చుచు నిట్లనియె. ఓరీ నీచుడా! ఆమేఘశ్యాముని శుండాలసదృశమగు నీబా హువుగాని, నీకరవాలముగాని నామెడమీదబడవలయును. రామవిరహాగ్నిచే క్రమ్మగుచున్న యీప్రాణములు త్వరలో బోవుటయే మేలు. ఓ కరవాలమా! రామవిరహాగ్నిచే దగ్ధమగు నీశరీరమును నీధారాజలముచే జల్లార్పుము. అట్లయిన నీపాపి నాకగపడకుండునని విలపించుచున్న యామైథిలిని కృద్ధుడై రావణుడు జంపనుంకింప నంతలో మండోదరి అడ్డుపడి హితమును బోధింప, నారాక్షసుడు రాక్షసాంగనలజూచి మీరీమెను సామాదిచతుర్విధోపాయముల

చేతను నొకమాసములోపల వశపఱుపుడు. లేనినాడా మెతోబాటు మీకును యీకరవాలమె శరణ్యముకాగలదనిచెప్పి వెడలిపోయెను.

అంత నారాక్షసాంగనలు సీతను భయపెట్ట మొదలిడిరి. వారిలో త్రిజటయను పేరుకల విభీషణునికూతురొక తెగలదు. ఆమె రామభక్త. విజ్ఞాన వతి. ఆమె ఆరాక్షసాంగనలబిలిచి తన స్వప్నవృత్తాంతమును వారికిట్లు జెప్ప నారంభించెను. వానరుడొకడువచ్చి రాక్షసవీరుల వధించి లంకను దగుల బెట్టెను. రావణుడు దిగంబరుడై ముండనమొనరించుకొని ఖరము నధిష్ఠించి దక్షిణాభిముఖుడై చనుచుండెను. నగరమునందంతటను రామచంద్రుని జయ ధ్వనులు వ్యాపించుచుండెను. విభీషణుడు లంక నేలుచుండెను. రాముడు సీతా సమేతుడై పుష్పకమునెక్కి యయోధ్యకు బోవుచుండెను. నాస్వప్న మెన్నటి కిని అసత్యము కానేరదు. త్వరలో దీనిఫలము గనపడును. అను నామె మాటలువిని రాక్షసాంగనలు భీతినందుచు సీతకు బ్రణమిల్లి దూరముగబోయిరి.

సీత విచారించుట

అంత సీత రావణు డిచ్చిన గడు వొకమాసమే కలదు. మరణమెట్లయి నను తప్పదు. అని భయమందుచు, త్రిజటను జూచి, సఖీ! నాకేదేని యుపా యమును జెప్పుము. నన్నీవిపత్తునుండి రక్షింపుము. రావణవియోగము దుర్భర ముగ నున్నది. రావణునిసూట లంతకన్నను దుర్భరములు. కాన ప్రాణత్యా గమే యుక్తమని దోచుచున్నది. నాకు చితిని సిద్ధముచేయుము. నిప్పు నంటిం చుము. కర్ణకఠోరములగు రావణుని మాటల వినజాలకుంటిని. అన నాత్రిజట సీతకు బ్రణమిల్లి, రామచంద్రుని మహిమనుపొగడి, యామె నోదార్చి తానిం టికి బోయెను. అపుడు సీత ఇట్లు విలపింపసాగెను. దైవ మనుకూలింపనినాడు మరణము దుర్లభమే యగును. కానినాడు నాకగ్ని యేల దుర్లభమగును? ఓఅంగారకుడా! నీవైన నొకకణమును నాపయినబడవేయుము. ఓయశోకమా! నీకిసలయము లగ్నితుల్యములు. కాన వానినుండీ నాకొక యగ్నికణమును ప్రసా దించి నీపేరును సార్థకము జేసికొనుము.

మారుతి సీతకు ముద్రిక నిచ్చి రాము కథను దెల్పుట

అని విలపించుచున్న యాజానకిని జూచి సమయమును నిరీక్షించుచున్న హనుమ, ఆయశోకమునుండి రామముద్రికను బడవేసెను. అంత జానకి యశోకము దన కంగారమును బడవేసెనని సంతసించుచు లేచి యాముద్రికను దీసి చూచి యందలి రామనామమును జదివి, హర్షవిషాదవ్యాకులచిత్తయై, ఏమిది? ఈయుంగర మిటకెట్లువచ్చెను? ఎవరేని నానాథుని వంచించిరా? ఆతడజేయుడే! నానాథుడే దూత నంపెనా? లేక రాక్షసమాయయా! ఇది మాయానిర్మితము వలె లేదే! నాకేమియును దోపకున్నదని సీత తలపోయుచుండ నంత మృదు మధురస్వరమున నామె వినునట్లు హనుమ, రామునకు సీతావియోగమయిన పిమ్మట, సుగ్రీవ సఖ్యము మున్నగు నన్నివిషయములను దానిచటకు వచ్చునం తవఱకు జెప్ప నాతనివలన రామచంద్రుని క్షేమమును విని, సీత ఇట్లనియె. నాయనా? నీవెవ్వడవు? నాకీసమయమున రామనామామృతము నొసగి బ్రాణ దానము జేయుచుంటివి. తండ్రీ! నీవొకసారి నాకు నేత్రపర్వ మొనరింపు మన నంత నిదె యదనని దలచి యామహావీరుడు వినతుడై యామె ఎదుట సాక్షా త్కరించెను. ఆతనిని జూచి ఇది రాక్షసమాయ యని భయపడుచున్న జానకిని జూచి, తల్లీ! నీవు నన్ను వేఱుగభావింపకుము. నేను నిజముగ రామదూతను. నీనాథుడంపగా నీయొద్దకు వచ్చితిని. ఈముద్రికను నీనమ్మకముకొఱకు నీనాథు డీయ నేడెచ్చితిని. అన విని సీత యిట్లనియె.

వానరోత్తమా! నరులకు వానరులకును మైత్రి ఎట్లుకలిగెను? ఆశ్చర్య ముగ నున్నదన, హనుమ సుగ్రీవ సఖ్యము, వాలి సంహారము, మున్నగువిషయ ముల నన్నిటిని సవిస్తరముగ దెల్ప నీతడు నిక్కముగ రామదూతయే యని నిశ్చయించి, యాసందాశ్రుభరితనేత్రయై, పులకితగాత్రియై, యారామభక్తుని జూచి, హనుమా! విరహోదధిని మునిగిపోవుచున్న నన్ను నీవుద్ధరించితివి. నీవాగమృతముచే నాతాపము చల్లారినది. నిజమును జెప్పుము. అఖలారి, సుజనబాంధవుడు, గుణధాముడు, నగు నాశ్యామలకోమలాంగుడు, సోదరసహి తముగ గుశలియై యున్నాడుగద! ఆభక్తమందారము నన్నెప్పుడైన దలం చునా! ఆకోమలాంగునిదర్శించి నానేత్రము లెప్పుడు ధన్యములగునో! యని విల పించుచు నోట మాటరాక కన్నీరు కార్చుచు, రామా! నన్ను మఱచితివా!

యని విలపించుచున్న యాసాధ్విని జూచి హనుమ ఇట్లనియె. తల్లీ! రామ లక్ష్మణులు క్షేమముగ నున్నవారు. వారికి మీవియోగదుఃఖము తప్ప వేఱొండు దుఃఖము లేదు. నీప్రేమకన్నను వారిప్రేమ ద్విగుణితము. నీవిపుడు దుఃఖమును మాని ధైర్యమునూనిన నేను వారి సందేశమును వినిపించెదను. అని గద్గదకంఠముతో నిట్లనియె.

భూపుత్రీ! నీవియోగమువలన రామునకన్నియు విపరీతమగుచున్నవి. పల్లవములగ్నివలెను, రాత్రికాలరాత్రిగను చంద్రుడు వేడిగను, కువలయవనము కంటకవనముగను భాసిల్లుచుండును. మేఘములు భయంకరములగుచున్నవి. మందమారుతములు సర్పశ్వాసలవలెనుండెను. లక్ష్మణా! నాకీబాధయెట్లుదొలగును? సీతా! నాయీబాధను నీ వెరుంగవుగదా! అను నీసందేశమునువిని సీతప్రేమమగ్నయై చైతన్యము దప్పియుండనో తల్లీ! నామాటనువిని ధైర్యమూనుము. రాఘవబాణాగ్నిలో నీనిశాచరశలభములు భస్మమగుటను జూచెదవు. రామభాస్కరుడు బాణకిరణప్రసారముచే నీనిశాచరతిమిరమునంతను క్షణములో మాయించును. రామచంద్రుడు నీసమాచారమును వినినతోడనె, వానరవాహినీసమేతుడైవచ్చి రాక్షసంహారమునుజేయును. ప్రభునాజ్ఞలేదుగాని, లేకున్న నేనిపుడే నిన్ను నావీపుపై నిడికొని రామసన్నిధిని జేర్పకుందునా? నారదాదులు మీకీర్తిని గానముచేయుచుందురు. నీవు దుఃఖింపకుము. అనిహనుమ బహుభంగుల నోదార్పగావిని, హనుమా! వానరులందఱునీవలె నల్పకాయులు. వారితో నాప్రభువీయకరాలయమునెట్లు గడవనగును? వారి సహాయమున నీ రాక్షసులనెట్లు రూపుమాపునన నంతనాకపివీరుడు తనరూపము నామెకుజూపెను. అపుడాధీరవరుని మేరుమందర సంకాశమగు నారూపమును జూచి సీత విశ్వాసము కలదయ్యెను. అపుడు మఱల తనతొంటిరూపమునూని, తల్లీ! శాఖామృగములమగు మాకు బుద్ధిబలవిశేషములు లేవు. శివునాశ్రయించిన సర్పము గరుడుని గుశలమడిగినట్లు, నీనాథుని ప్రభావముచే మేమెంతపనినైనను జేయగలము. అనునాతని పలుకులువిని, ఈతడు భక్తిప్రభావతేజోబలపంపన్నుడు. రామప్రియుడునని తలంచి, హనుమా! నీవజరామరుడవుగమ్ము, రఘునాథుడెపుడు నిన్ను బ్రోవిమించును. నీకు నిశ్చలమైన భక్తికలుగుగాక.

అని యాశీర్వదింపనాహానుమంతు డత్యంతానందమునొందుచు, తల్లీ నీయాశీర్వాద మమోఘము. నేను ధన్యుడను. నాకిపుడుమిక్కిలి యాకలి యగుచున్నది. నే నీవనమందలి ఫలముల భుజింపవచ్చునా! యన నాయనా! మహాబలశాలులగు రాక్షసు లీతోటను కావలిగాయుచుందురు. వారల నెటు నిర్వహింతువన, నీయనుగ్రహమున్న నాకు వారివలన భయమేమియును లేదన నాకపివీరుని ధైర్యోత్సాహములకు సంతసిల్లి, తండ్రీ! రామచంద్రుని మనమం దిడికొని యామధురఫలంబుల భుజింపుమన నతడు సీతకుబ్రణమిల్లి యాతోటలో బ్రవేశించెను.

ఆంజనేయ బలప్రదర్శనము

అటమధురఫలంబుల భక్షింపుచు, వృక్షములవిఱచుచు, నడ్డువచ్చిన రాక్షసులజంపుచు స్వేచ్ఛగావిహరించుచున్న యాకపివీరునిజూచి రక్కసులు రావణునిపాలికిజని ప్రభూ! మనయశోకవనమునందొక పెద్దకోతి ప్రవేశించి, యశోకవనమునంతను విఱచి ధ్వంసముచేయుచు నటనున్న రాక్షసులజంపి చాలాభీభత్సమును జేయుచున్నదనవిని రావణుడు కృద్ధుడై, కొందఱరాక్షస వీరుల నటకుబోయి యాకోతినిశిక్షింపుడన వారుజని యాకోతితోతలపడిరి. అంత నా హనుమంతుడు గర్జించుచు వారలనందఱ జంపివేసెను. అంత హతశేషులు పరిగిడిపోయి రావణునకీవార్తనుదెలుప నంత రావణుడు కోపోద్దీపితుడై అక్షుని జూచి నీవాకోతిని జంపుమన నతడు సేనాసమేతుడై ధనుర్బాణంబులను రథ మధిరిడుకొని బోయెను. వానినిజూచి హనుమగర్జించుచు నాతనితోదలపడెను. వారువురును ఘోరముగబోరిరి. అంత హనుమంతు డొకవృక్షము నూడబెరకి దానితోవాని రథమును, సారథిని, గుఱ్ఱములనుజంపి సైన్యమునంతను నురు మాడెను. అదిచూచి అక్షుయుడుఖడ్గపాణియై యాతనిపైకురికెను. అంత నాత డాయక్షుయుని పాదములను నేర్పుతోపట్టి గిరగిరద్రిప్పి నేలపైమోది చంపెను. అట్లక్షుయుడు మరణించిననేడనే, హతశేషులీవార్తను రావణునకుదెల్పి, శోక క్రోధతామ్రాక్షుడగు రావణు డీకోతి సామాన్యమగునదికాదు. అని తలచి మేఘునాదుని బిలిపించి, పుత్రా! నీవుపోయి యాకోతినిజంపక బంధించిదెమ్మన నాతడు వల్లెయని, యపరిమితమగు సైన్యమునువెంటనిడికొని, రణోత్సాహ

ముతోబోయి యావానరహీరుని శరవర్షముచేనింపివేసెను. అంతనాహానుమం తుడు క్రోధోద్దీపితుడై, ఒకవృక్షమునుబెరికి దానితో సైనికులజంపి యాతనిని విరథునిజేయ నాతడుకృద్ధుడై హానుమతో దలపడెను. అప్పుడువారు మత్తేభ ములవలె బోరాడుచుండగా హానుమంతుడొక దెబ్బతోనాతని మూర్ఛనొందిం చెను. కొంతవడికాతడు తెలివొంది యనేకోపాయములబన్ని యాతనిని నిర్జింప జాలక తుదకుబ్రహ్మాస్త్రమును బ్రయోగించెను. అంత మారుతి ఇట్లుదలపో సెను. అదిగో బ్రహ్మాస్త్రము వచ్చుచున్నది. దీనికినేను బద్ధుడనుకావలయును. కాన నదివచ్చులోపల నీహత శేషమగుసైన్యమును నిర్మూలించెద ననుకొని బ్రహ్మాస్త్రమువచ్చునంతలో మిగిలిన రాక్షసానీకమును సమయించుచు తుదకా బ్రహ్మాస్త్రముచేగట్టువడి మూర్ఛనందెను. మేఘనాథుడట్లు మూర్ఛితుడగు హానుమంతుని తండ్రియొద్దకుగొనిపోయెను. పార్వతీ ! ఎవనినామముచే భవబంధ నములూడిపోవుచున్నవో అట్టిరామభక్తున కీబంధమెట్లు ? అని శంకింపకు. రామకార్యార్థ మాతడట్లు బంధింపబడెనుగాని వేరొండుకాదు. అట్లు రాజ సభకు గొనిదేబడిన హానుమనుజూచుటకై పెక్కండ్రు రాక్షసులు వచ్చిరి. హానుమంతుడా రావణసభనుజూచి విస్మితుడై ఇట్టిసభను ఎక్కడమ జూడలే దనుకొనెను. దిక్పాలురందఱు నారావణుని యనుగ్రహము నపేక్షించుచు చేతులుజోడించి భయకంపితగాత్రులై నిలబడిరి. అట్టియెడ నాహానుమంతుడు నిర్భీకుడై జూచుచుండెను.

హనుమద్రావణసంవాదము

అంత రావణుడాకపివీరునిజూచి పుత్రశోకవ్యాకులుడై క్రోధతామ్రమూ తుడై, హానుమతో నిట్లనియె. ఓరీ ! నీవెవ్వడవు ? ఎవనిపంపున నీవిటకువచ్చి తివి. అశోకవనము నేలభంగపఱచితివి ? రాక్షసులనేలవధించితివి. నీకు ప్రాణ ములం దాస లేదనుకొందును. ఇంతనిర్భయముగ నేలజూచుచుంటివన హానుమ యిట్లనియె. రావణా ! నేనెవడనో జెప్పుచున్నాను. సావధానముగవినుము. ఎవనిసన్నిధిచే మాయ యనేకబ్రహ్మాండములగల్పించుచున్నదో, ఎవనిసహాయ మున ద్రిమూర్తులుసృష్టిస్థిలయముల జేయుచుండెదరో, ఎవనిబలముచే శేషుడీ

లోకములనశ్రమముగశిరమందిడుకొని మోయుచుండెనో,ఎవడు దేవతాహితమున కనేకయవతారములనెత్తి నీవంటిదుష్టుల నంత మొందించెనో, ఎవడుశివధనుర్భంగముగావించి దానితోగూడ పరశురాముని గర్వమడంచెనో, ఎవడు వాలినిజంపి సుగ్రీవునకు గిష్కింధనిచ్చెనో, ఎవనియనుగ్రహావేశముచే నీవిట్టిపరాక్రమశాలివై సమస్తసుఖములననుభవించుచుంటివో, నేనారఘువీరునిదాసుడను. నీవు మదాంధుడవై యామహనీయునిభార్య నపహరించితివి. నేనామెను వెదకుచు నిటకు వచ్చితిని. నీవు బ్రతుకదలచితివేని యారఘువీరునిభార్య నాతనికి సమర్పించి శరణుబొందుము. నేను క్షుద్బాధచే ఫలముల దినుచు వానరస్వభావముచే గొన్ని కొమ్మల విఱచితి. కొందరు దుర్మార్గులగు రాక్షసులు నన్ను గొట్టగా నాప్రాణరక్షణమునకై నేనును వారల వధించితి. ఇంతలో నీపుత్రుడు నన్ను బంధించి యిటకుదెచ్చెను. నేను నీహితముగోరి యిటకువచ్చితిని. రావణా! దోసిలొగ్గి నిన్ను వేడుటలేదు. నామాటను వినుము. నీవు దురభిమానమువీడి, బాగుగ నాలోచించుకొని, భక్తవత్సలుడగు నారఘురాముని భజింపుము. ఎవనివలనిభయముచే నింద్రాదులు తమతమ విధుల సప్రమత్తులై నిర్వహించుచుండిరో, కాలముసయిత మెవనికిభయపడి యీలోకములనన్నిటిని సక్రమముగ గ్రసించుచున్నదో, అట్టివానితో వైరమునుమాని సీతను యాతనికిచ్చివేయుము. శరణాగతరక్షకుడగు నారఘునాథుడు నీతప్పుల మన్నించును. రామచరణకమలముల ధ్యానించుచు, నిరాతంకముగ నీలంకను శాశ్వతముగ నేలికొనుము. నిర్మలమగు పులస్త్యవంశమునకు గళంకము నేలదెచ్చెదవు? రామచరణ సేవావిముఖులయైశ్వర్యము, గ్రీష్మమునందలి సరోవరజలమువలె హరించిపోవును. రామద్రోహులను నెందును రక్షించువారులేరు. దుఃఖమూలమగు నభిమానమునువీడి, కృపాసింధువగు రఘునాథుని భజింపుమని భక్తిజ్ఞానభరితములగు సీతివాక్యముల నామారుతి బలుక దురభిమానియగు నా రావణుడు వికటముగ నవ్వుచు, ఏమీ! కోతియూ నాకు నీతి నుపదేశించునది? ఈమర్కటాధమునకు మృత్యువాసన్నమయినది! అన, నోరీ! నాకుగాదు. నీకే మృత్యువు సమీపించినది. లేనిచో రఘువీరునితోడివైరము నేలపెట్టుకొనియెద వన నారావణుడు కోపించి యీమారుని ప్రాణములదీయుడని యాజ్ఞాపించెను.

లంకాదహనము

అంత విభీషణు డడ్డమువచ్చి, ప్రభూ! దూతవధ శాస్త్రవిరుద్ధము. కాన మతియొకశిక్షను విధింపుము. ఈదూతను బంపినవారిని వధింపుము అన రావణుడందులకంగీకరించి, వీని పుచ్ఛమునుగాల్చి పంపుడన నచటి రాక్షసులు సంతసించుచు నామారుతి పుచ్ఛమునకు గుడ్డలజుట్టి తైలమునుబోసి మట్టింప నుద్యుక్తులైరి. అంత మారుతి కానిండు! దీనికి దగిన ఫలము ననుభవింతురు గాత మని దలంచుచు దనవాలమును బెంచసాగెను. రాక్షసు లావాలమునకు దగినన్ని బట్టలజుట్టి తైలమునుబోసి నిప్పును మట్టించి, వాయిద్యములతో నూరేగించుచుండ నామారుతి యిట్లుతలపోయసాగెను. వీరికి దగినశాస్తిచేసిన గాని బుద్ధికలుగదు. కానిమ్ము. ఈపుచ్ఛాగ్నిచే నీలంకను దగులబెట్టి యగ్నికి ప్రీతినొనరించెదనని నిశ్చయించి, సూక్ష్మరూపమునంది యాబంధములను దప్పించుకొని యారాక్షసుల దునుమాడి మేడలపైకురికెను. అంత వాయుసహా యమున నాయగ్ని ప్రజ్వరిల్ల సౌధపరంపర మట్టింప నాతడు లంకనంతను తగులబెట్టుచుండెను. అప్పుడచటి రాక్షసాంగనలు ఇదికోతికాదు. కాలాగ్నియె యీరూపముతో వచ్చినది. లేకున్ననీమంటలేమియని మొరలిడుచుండిరి. విభీష ణుని సౌధముదప్ప తక్కిన సౌధములన్నియు క్షణములో నగ్నికాహుతియై పోయెను. పార్వతీ! రామునిమహిమ వర్ణనాతీతము. ఇట్లులంకనంతను దహిం చిన వహ్ని హనుమంతునితోకయందలి వెండ్రుకనైనను గాల్చుటలేదు. అట్లు లంకను భస్మావశేషముగావించి, హనుమ తన వాలమును సముద్రములో ముంచి మంటలనార్పుకొని, వైదేహి కడకువచ్చి, తల్లీ! నీనాథునకేదేని యానవాలిమ్మన నామె తన చూడామణినిదీసి యాతనిచేతికిచ్చి, హనుమా! రామునకు నామాటగా నిట్లుజెప్పుము. ప్రభూ! సంపూర్ణకాములు, దీన దయాళువులునగుమీరు నన్ని దుఃఖవారాశినుండి యుద్ధరింపుడు. నాయందలి ప్రేమచే నల్పాపరాధియగు కాకాసురునిదండించి, కరుణించిన మీరొకమాస ములోపల రానియెడల నాప్రాణములు దక్కవు. నాసతుల నందుకొని మీహృదయేశ్వరిని మన్నువకుడు. తండ్రీ! యీనా మాటలజెప్పి నానాథుని శీఘ్రముగ దోడితెమ్ము. నిన్నుజూచుచుండుటచే నాహృదయము చల్లబడినది. నీవేగిన నీదివారాత్రముల నెట్లుగడుపవలయునోయని చింతిల్లుచున్న యాజానకి

నోదార్చి, ప్రణమిల్లి ప్రయాణమున కనుజ్ఞనడిగి, రాక్షసగర్భ నిర్భేదముగ గర్జించుచు సముద్రమును దరించుచు తన కార్యసిద్ధిసూచకముగ గర్జించుచు వచ్చుచున్న ఆ హనుమసింహనాదములవిని, మనహనుమంతుడు వచ్చుచున్నాడని యచటివానరులు సంతసించుచు నెదురుగవచ్చుచుండనంతలో హనుమవారిని సమీపించెను. వారాతని సంతోషవికసితమగు మోమునుజూచి యీతడు రామకార్యమును సాధించెననియు మనజన్మము సఫలమైనదనియు నానందించుచు, నాతనిగలిసి యచటి వృత్తాంతములనెల్ల నడుగుచు, రాము సన్నిధికి ప్రయాణమునుసాగించుచు దారిలో నున్న మధువనమున ప్రవేశించి, యందలి తేనెను మత్తుగద్రాగి యడ్డువచ్చినవారిని బాధింప నావనపాలకులు సుగ్రీవునికడకేగి, ప్రభూ! మనయంగదుడు సపరివారముగవచ్చి మధువనమున జూచ్చి, మధువునంతనుగ్రోలి యావనపాలకులను బాధించెను. దేవరకీ విషయమును విన్నవించితిమన, రామకార్యమును సాధించినకాని యిట్టిసాహసమునుజేయరు. కానిమ్మని సంతసింపుచు సుగ్రీవుడుండనంతలో వానరులువచ్చి సుగ్రీవునిపాదములబడ నతడపరిమితానందముతో గుశలమడుగ, స్వామీ! మీదయచే మఱలమాకు దమపాద దర్శనభాగ్యము, రామునికరుణచే నేయడ్డమునులేక కార్యసిద్ధియు గలిగెను. హనుమంతుడీకార్యమును సాధించి మాప్రాణముల గాపాడెనన విని సుగ్రీవుడ మందానందమందుచు హనుమంతుని గాగలించుకొని వారందఱను గలిసి రామునికడకేగెను. వానరులు కార్యమును సాధించివచ్చుచుండిరని రాముడు మనంబున సంతసిల్లుచు ననుజసమేతుడై స్ఫటికశిలాఫలకమున గూరుచుండెను.

రాముడు సీతవిషయము దెలుసుకొనుట

అంత వానరులువచ్చి రామపాదములంబడ నాతడు వారలక్షేమమడుగ, స్వామీ! మీయనుగ్రహముచే మాకెల్లరకు గుశలమే. తమ యనుగ్రహపాత్రులకు కుశలముగాకుండు టెట్లు? ప్రభూ! యీ విజయమునకు గారణము హనుమంతుడు. ఆతడుసాధించినపనిని వేనోళ్లయినను పొగడజాలవు. అని జాంబవంతుడు హనుమంతునిజూప నాతనివలన సకలవృత్తాంతమును దెలియ గోరి రాముడు హనుమంతుని కౌగలించుకొని, హనుమా! సీతఎట్లున్నది?

సవిస్తరముగ దెల్పుమన నాహానుమంతుడు రామునకు ప్రణమిల్లి ఇట్లు జెప్పనారంభించెను. రామచంద్రా! మీనామమనురక్షకభటులచే గాపాడ బడుచు, మీచరణకమలధ్యానమను వజ్రపంజరములోబంధించి, నిశ్చలభక్తి యను బీగమునువేసి యామె ఎటులనో ప్రాణములధరించుచున్నది. ప్రభూ! మీకిమ్మని యామె యీచూడామణి నిచ్చినదని యాచూడామణినీయగా రాముడానందముతో దానినిగ్రహించి హృదయమందిడికొన నామారుతి సీతా సందేశము నిట్లువినుపించెను.

సీతాసందేశము

రామచంద్రా! దయాసాంద్ర! అనుజ సహితులగు మీచరణసరోజ ములకు నానమస్కృతులు. నేను త్రిశుద్ధిగ మీచరణానురక్తను. స్వామీ! నన్ని ట్లేల వీడియుంటిరి? మీవియోగము ననుభవించుచు ప్రాణముల ధరించు టయే నాయపరాధము. ఏమిచేయుదును? ఈనానేత్రములనుండి వెలువడు చున్న యశ్రుధారావృష్టిచే జ్వల్లారకుండిన నీవిరహాగ్ని జ్వాలలు తూలతుల్యమగు నీనాదేహమును క్షణములో భస్మముచేయకుండునా? కానిమ్ము! అని దీనవద నయై బలికెను. ఆమె దుఃఖావస్థను జూడలేకపోతిని. ఆమె చెప్పిన మాటల నన్నిటిని జెప్పుటకు నోరు రాకున్నది. ఆమె నిమిషము నొకయుగముగ గడ పుచున్నది. తమ రాలసింపక రాక్షససంహార మొనరించి యామెను దీసికొని రానిచో నామె ప్రాణములు నిలువవు. అన విని యాపుండరీకాక్షు డశ్రుభరిత నేత్రుడై యుండ మఱల మారుతి యిట్లనియె.

శ్రీరామాంజనేయ సంభాషణము

ప్రభూ! ఏల చింతించెదరు? మిమ్ము నమ్మినవారి కాపదలుండవు. మిమ్ము భజింపనినా డాపదలు తప్పవు. నిరంతరము మిమ్ముల ధ్యానించు సీతకీవిపత్తు రాక్షసనాశమునకు వచ్చినది. కాన వారిని జంపి సీత నుద్ధరింపుమన నామారుతి వాక్యములకు సంతసించి హనుమా! నీవంటివాని నెందును గానను. నిన్ను నీఎదుట స్తుతించుట యుక్తముకాదు. నీఋణమును దీర్పజాలను. నీయుప కారము నెన్నటికిని మఱువజాల ననుచు నానందనిర్భరాశ్రుభరితములగు

జూడుక-ల నాతనియందు నిలిపియుండు నారామచంద్రుని నిర్భరప్రేమ కచ్చెరు వందుచు నామారుతి ప్రభుని పాదముల బడ నారామచంద్రు డాతని లేవనెత్తి కౌగలించుకొని తన పాణిపల్లవముచే నాతని శిరమును నిమురుచు నాశీర్వదించె నని జెప్పుచు శంకరుడు తన్మాయత్వము నందెను.

ఓభరద్వాజా! కొంతతడవట్లుండి మఱల కథ నారంభించెను. హనుమం తుని తనచెంత గూరుచుండబెట్టుకొని రామచంద్రు డిట్లనియె. హనుమా? దుర్గమమగు నాలంక నెట్లుదహించితివి? రాక్షసుల నెట్లుదునుమాడితివన నాత డిట్లనియె. ప్రభూ! శాఖామృగములు చెట్లనుండి చెట్లపైకి దాటగలవు. అంతియకాని సముద్రమును లంఘించుట, స్వర్ణప్రాకారములతోగూడిన లంకను దహించుట, రాక్షససంహారమును గావించుట, మున్నగునవి మాకెట్లు సాధ్య మగును! అఘటితఘటనాసమర్థమగు తమ ప్రభావమే నాచే నిన్నిపనుల జేయించినది. నీయనుగ్రహ ముండినవారి కసాధ్యమేదియునులేదుగదా! ప్రభూ! నీయనన్యభక్తిని నాకనుగ్రహింపు మన రాము డతని నిరభిమానతకు మెచ్చి యట్లె యగుగాతమని బలికెను. పార్వతీ! రామచంద్రుని స్వభావమును దెలి సియు భజింపనివారి కెట్టిసుఖములును గలుగనేరవు. రామాంజనేయసంవాద మును హృదయమందు నిల్పుకొనువారలకు రామచరణకమలభక్తి తప్పక కలు గును. భగవద్వాక్యములను విని వానరులు జయధ్వానము లొనరింపుచుండిరి.

లంకాప్రయాణము

రామచంద్రుడు సుగ్రీవుని జూచి, మిత్రమా! మన ప్రయాణసన్నాహ మును జేయుమన నీకాతుకమును జూచి దేవతలు పుష్పవర్ష మును గురియించి వారివారి నిలయముల కేగిరి. పిమ్మట సుగ్రీవుడు సేనాధిపుల రావించి, వానర యోధుల రావింపుమననాతని శలవుచొప్పున నానావర్ణములు కలిగి యతులిత బలశాలురగు వానరయోధు లసంఖ్యాకముగవచ్చి, రామునకు బ్రణమిల్లి నిలువ వారినెల్ల రామచంద్రు డపాగకృపాదృష్టితో జూడ వారందఱును పటుములతో గూడిన పర్వతములవలె బ్రయాణమును సాగింప హర్షవికసితవదనుడగు రఘు పతియు వారలతోగూడి జనుచుండ ననేకశుభశకునము లగుచుండెను. రావణున కశుభసూచకముగ నంగములదరజొచ్చెను. అంతనాసేన గర్జించుచు వృక్షముల

ధరించి గంతులిడుచు సింహానాదములజేయుచుండ నాశబ్దమునకు దిగ్గజములు చెదిరి పారిపోవుచుండెను. కులగిరులు చలింపసాగెను. సముద్రములు కల్లోలభరితము లయ్యెను. సూర్యచంద్రుల గతులు మాఱిపోవుచుండెను. సుర, ముని, గంధర్వాదులు సంతసించుచుండిరి. అసంఖ్యాకమగు నాసేన జయధ్వానముల జేయుచు, రాముని పరాక్రమమును గొనియాడుచు సమితోత్సాహముతో నడచుచుండ, వారి కుప్పిగంతుల సహింపజాలక శేషుడు మాటిమాటికిని శిరఃకంపమును జేయుచు నాదికూర్మము వీపును గఱచుచుండెను. శేషకూర్మము లింతశ్రమను అతికష్టమున సహించుచు, రాక్షససంహారముచే భూభారము తగ్గునని సంతసించుచుండెను. రామచంద్రు డిట్లు ప్రయాణమును సాగించి సముద్రతీరమును జేరగనే, వానరు లటనున్న ఫలముల గొని తెచ్చి రామునకిచ్చి తామునుభుజించిరి.

మండోదరి సీతను రామున కర్పింపుమని రావణునితో జెప్పుట

అట లంకను దహించి వానరపుంగవు డేగినపిమ్మట నాతని బలప్రతాపముల కచ్చెరువందుచు రాక్షసులు భయవిహ్వలులై, రాక్షసవంశము నశించును. ఒక్కవానరుడు వచ్చి మన కిట్టివిపత్తుల గలిగించెను. వాని బలము పరిమితము. ఆతడు వచ్చినది మొదలు మనకేవియో యిక్కట్లుగలుగుచునేయున్నవి. ఏమియు దోపకున్నదని రాక్షసులు పరస్పరము చెప్పుకొనుట విని, మండోదరి మనంబున భయమందుచు, నేకాంతసమయంబున రావణుని పదంబులబడి సవినయముగ నిట్లులనియె. నాథా! భగవంతుడగు రామచంద్రునితో వైరమును మానుము. ఆరామదూత యొనరించిన కృత్యముల దలంచిన రాక్షసాంగనలకు గర్భనిర్భేదమగుచున్నది. స్వామీ! నామనవిని విని సీతను రామున కప్పగింపుడు. ఆసీత మన లంకకు కాలరాత్రివంటిది. ఆమైథిలిని అప్పగింపని యెడల నజశంకరులయినను మీకు మేలొనర్పజాలరు. నిశాచరశ్రేకములను రామాగ్నిగపన్నగములు గ్రసింపకముందుగనే ఏదేని యుపాయము నాలోచింపుడు. నాప్రార్థన నంగీకరింపుడన దురభిమానియగు నారావణుడు వికటముగ నవ్వుచు నిట్లనియె. ప్రియా! అందఱు స్త్రీలవలె నీవును భయమందుచుంటివి. దిక్పాలకులనెల్ల నిర్జించిన మహావీరునిభార్య కింతభయ మెందులకు? వానరులు సముద్రము నెట్లు దాటగలరు? ఒకవేళ వారట్లు వచ్చినను వారిని మనరాక్షస

పీరులు సుఖముగ భుజింతురు. అని యామెకు బదులుజెప్పి పంపివేయుచు, నాతామసుడు కొలువున కేగెను. విధి తనపతియందు ప్రతికూలుడై యుండెనని మండోదరి చింతించుండెను.

విభీషణుడన్నకు బుద్ధులు గఱపుట

రావణుడట్లు కొలువునకు వచ్చి, రాముడు వానరసేనాసమేతుడై సముద్రమున కానల విడిసియుండెనని చారులవలన వినియుంటిమి. ఇపుడు కర్తవ్యము నాలోచింపుడన, దుర్మంత్రివలన రాజ్యము, కుత్సితుడగు వైద్యునివలన దేహము, యనార్యుడగు గురువువలన ధర్మము నశించును. ఈతనికి మన హితము రుచింపదు. అని భయమందుచు నేమియు నుడువజాలక, మంత్రులు తమకు దెలియని ధర్మము లేవియును లేవు ప్రభూ! అని నవ్వుచు నూరకుండిరి. సురాసురుల నవలీలగ జయించిన నాకీనరవానరులన నేమి లెక్క! యను రావణుని మాటలను విని వారు మాటాడ కూరకుండిరి. అంత విభీషణుడు ముందునకు వచ్చి శిరమువంచి అన్నకుమ్రొక్కుచు సవినయముగ నిట్లనియె. ప్రభూ! నన్ను చెప్పుమన్న నాకుదోచినవిషయమును మనవిచేయుదును. తమరు సత్కీర్తిని మంగళములను, సద్గతిని బొండవలెనన్న భాద్రపదశుక్ల చవితినాటిచంద్రుని వలె పరస్త్రీముఖమును జూడరాదు. చతుర్దశభువనాధీశుడగు నారామచంద్రునితో వైరమూనినవాని కెందును సుఖముదుర్లభము. ఉదారగుణము లెన్నియున్నను లోభమువానిని నశింపజేయును. కామక్రోధములు నరకద్వారములు. కాన బాగుగనాలోచించి త్రిజగద్వంద్యుడగు రామచంద్రుని భజించి యరిషడ్వర్గము జయింపుము. అన్నా! రాముని సామాన్యభూపతిగ భావింపకుము. అతడు త్రిభువనాధీశుడు. కాలునకును కాలుడు. భావవికారదూరుడు. అజేయుడు. సర్వవ్యాపకుడు. ఆభగవంతుడు దేవబ్రాహ్మణగోహితార్థము మనుజుడై యవతరించెను. ఆతడు భక్తార్తిభంజనుడై దుష్టనిగ్రహమును, ధర్మోద్ధరణమును జేయుచుండును. అట్టివానితో వైరమునునూని సీతనిచ్చి, శిరమువంచి సేవింపుము. ఆరఘువీరుడు ప్రణతార్తిభంజనుడు. శరణాగతవత్సలుడు. అతనిని సేవింపనివాడాత్మద్రోహి. ఆతనినామము తాపత్రయమును హరించును. నిన్ను బ్రతిమాలుచుంటిని. మదమోహములవీడి యాతని భజింపుము. మనపుల స్త్యుని యావిషయమునుజెప్పి శిష్యునంపెను. సీతాపహార

ణము ఆతనికెంతమాత్రము నిష్టముకాదు. పెద్దలమాటను మన్నింపు మన నంతలో మంత్రిప్రుంగవుడగు మాల్యవంతుడిట్లనియె. ప్రభూ ! మనవిభీషణుడు నీతికోవిదుడు. కాన నీతనిహితమును గ్రహింపుమన రావణుడుక్రుద్ధుడై వీరిరువురును శత్రువును శ్లాఘించుచున్న రాజద్రోహులు. కాన వీరలను సభనుండి వెడలగొట్టుడన మాల్యవంతుడు క్రుద్ధుడై తనగృహమున కేగెను. విభీషణుడు మాత్రమచట నేయుండి, ఇంకను అన్నకుబోధింపనెంచి, అన్నా ! నీపదములకు మ్రొక్కుచుంటిని. నావిన్నపమాలింపుము. నీహృదయమునందిప్రుడు చెడు బుద్ధి ప్రవేశించినది. అది విపరీతకార్యముల జేయించుచు, హితమునుదెల్పెడి మిత్రులను శత్రువులుగ జేయుచున్నది. సీతను రాక్షసకులమునకు గాళరాత్రి యనితలంపక యామెను ప్రేమించుచుంటివి. నీవావై దేహిని రాముసికడకంపి వేయుము. మనకు మేలుచేకూరునని శ్రుతిసమ్మతముగ బలుకు నావిభీషణుని జూచి క్రుద్ధుడై, .రావణుడిట్లనియె. ఓరిదుష్టుడా ! యీకారులగట్టిపెట్టుము. నీకు మృత్యువాసన్న మైనట్లున్నది. మూర్ఖా ! నాయెదుట నాశత్రువును బొగడు చుంటివా ! నాయన్నమునుదినుచు నాశత్రువునం దభిమానమునుజూపుచుంటివి. నన్ను నిర్జించువాడెందైనను గలడా ? నాపురమందుండి యీసన్యాసుల ప్రేమించుచుంటివి. ఈనీతులను వారివద్దనేజెప్పుము. అని అతనిని కాలితోదన్నెను. అయినను విభీషణుడన్నను ప్రతిమాలజొచ్చెను. పార్వతీ ! జూచితివా ! సజ్జన స్వభావమును ? ఎంతదూషించినను హితమునే గోరుదురు. మఱల విభీషణుడిట్లనియె. అన్నా ! పితృతుల్యుడవగు నీవుతన్నినను నాకుకోపములేదు. ఈ నీ యుపకారమున నేనారఘూద్వహుని శరణుజొచ్చి సేవింతును. నావిధినినేను నెఱవేర్చితి ననిపలికి తనమంత్రివర్గముతోగలిసి యాకసమున కెగిరి, రాముడు సత్యసంకల్పుడు. రావణునకు సబాంధవముగ చేటువాటిల్లును. నేనిప్రుడు రాముని శరణువేడబోవుచుంటిని. నాదోషమేమియును లేదని యందఱువినగ జెప్పి విభీషణుడు వెడలిపోయెను.

రామవిభీషణసమాగమము

పార్వతీ ! సాధుతిరస్కారము సకలానర్థములకు మూలము. అట్లు విభీషణుడు పోయినది మొదలు రావణుడు వికలమనస్కుడయ్యెను. అట్లువిభీ

షణుడు రాముసన్నిధికి బోవుచు నిట్లుదలపోయసాగెను. ఏపాదరజముచే నహల్యతరించెనో, దండకారణ్యము పవిత్రమయ్యెనో, వేనిని సీతతనయురం బునధరించెనో, వేనిని శివుడునిరంతరము ధ్యానించుచుండునో, ఏపాదములను భరతుడారాధించు చుండెనో, అట్టి శ్రీరామపదపద్మముల దర్శించుభాగ్య మింతకాలమున కబ్బినది. ఆహా! నేనెంతటి భాగ్యశాలిని. ఆ కంజదళాక్షుని జూచుచున్నడో, అనితలంచుచు సముద్రమునుదాటి, విభీషణుడు వచ్చుచుండ నెవడో శత్రుపక్షమువాడు వచ్చుచున్నాడని తలంచి, వానరులు వానినటనాపి సుగ్రీవునితో నాతనివృత్తాంతమును దెల్పిరి. అంతసుగ్రీవుడు తమదర్శనమునకు రావణానుజుడగు విభీషణుడు వచ్చియున్నాడు. ప్రభూ! ఏమిశలవు? అనవిని రాముడు మిత్రమా! అతడెందులకునచ్చెనో, నీకేమైనదెలియునా? అన కపి రాజిట్లనియె. ప్రభూ! రాక్షసులు మాయావులు. కామరూపులును. వారిని మనమెట్లు దెలిసికొనగలము? మనరహస్యమును దెలిసికొనుటకు వచ్చియుండు నని తలంచెదను. కాన నాతనినిట బంధించియుంచుటమేలు. అనవిని రాము డిట్లనియె. మిత్రమా! నీవు రాజనీతినిబట్టి చెప్పితివి. సంతోషము. కాని శరణార్థులగాపాడుట నాస్వభావము. అను రాముసిమాటలవిని హనుమంతు డానందమున మునిగిపోయెను. సుగ్రీవా! అహితులని యపోహచే శరణాగ తుల విడుచువారిముఖమునుజూచిన పుణ్యములు క్షీణించును. పాపములు సిద్ధిం చును. శరణాగతుడెట్టి దుష్టుడయినను నేనాతనిని విడువజాలను. పాపాత్మ లెన్నడు ననున్నభజింపజాలరు. దుర్మార్గుడు నాయెదుట కెట్లురాగల్గును? నా వద్ద కపటముచెల్లదు. మనరహస్యమును దెలిసికొని రమ్మనమని రావణుడంపి నను మనకుభయమేల? ప్రపంచమునందలి రాక్షసులనందఱను మనలక్ష్మణు డొకతృటికాలములో రూపుమాపును. కాన నాతడెట్టివాడైనను సరే, తీసికొని రండు. అన నంగదాదులువెడలి జయజయధ్వానములతో విభీషణుని వెంట నిడుకొనిరా, దూరమునుండియెవిభీషణుడు రామలక్ష్మణులజూచి యపరిమితా నందమునందుచు, తదేకదృష్టితో నిర్నిమేషముగ, నాప్రణతార్తిహరుడు మేఘశ్యామలగాత్రుడు, సింహసంహాననుడు నగు రామచంద్రునిజూచి, ఓ కరుణానిధీ! నేను రావణానుజుడను, రాక్షసవంశజాతుడను, దివాంధమువలె నిశాచరుడను, పాపపంకిలుడనగు విభీషణుడను. తమరు శరణాగతరక్షకులని,

నీములోకములందు వ్యాప్తమగుకీర్తినివిని, శరణార్థినై తమసన్నిధికివచ్చితిని. పాహిమాందయానిధే! పాహి! యని మృదువాక్యముల బలుకుచు దండప్రణామమాచరింప, రామచంద్రుడు హర్షపులకితగాత్రుడై యాతనిని లేవనెత్తి కౌగలించుకొని, తమ్మునొకవంకను, విభీషణునొకవంకను గూర్చుండబెట్టుకొని లంకేశా! కుశలమేగద! నీవాదుష్టరాక్షస మధ్యముననుండియు నీధర్మమును నిర్వర్తించుకొనుచుంటివి. నీవు నాభక్తుడవని నేనెఱుగుదును. అనవిని విభీషణుడిట్లనియె. రామచంద్రా! మీదర్శనముచే నేటికిగుశలము. నన్ను నీదాసునిగ గరుణించితివి. కాననేనుధన్యుడను. లోభమదమాత్సర్యభూయిష్ఠమగు హృదయమునందు నీవెన్నడును నివసింపవు, స్వామీ! ప్రభూ! నీప్రతాపభానుడుదయించనంతకాలము, మమతాంధకారములో, రాగద్వేషాద్యులూకములు స్వేచ్ఛగ సంచరించుచుండును. అట్టివారికెన్నడును సుఖలేశమైన నుండజాలదు. మీదర్శనభాగ్యముచే నేను నిర్భయముగ సుఖించుచుంటిని. మీయనుగ్రహమున నాతాపత్రయము నశించినది. రాక్షసుడనగు నాకు, మహామునులకును దుర్లభమగు మీదర్శనము లభించినది. మఱియు నన్ను గాఢాలింగన మొనరించుకొంటిరి. నేనెంతధన్యుడను. అజరుద్రాదిసేవ్యమగు నీపదకమలముల నేజూడగలిగితిని. అనవిని, రామచంద్రుడు సంతసించుచు, మిత్రమా! నాస్వరూపస్వభావములను, కాకభశుండుడు, శివపార్వతులు నెఱుగుదురు. ఎట్టిపాపియైనను, నన్ను శరణువేడిననాతని యరిషడ్వర్గమునుద్రుంచి, కృతార్థునిజేయుట నావిధి. ఎవడు మమతారహితుడై నన్ను భజించుచుండునో, ఎవడు నిష్కాముడై ద్వంద్వాతీతుడై, సమబుద్ధియెయుండునో, వానిని నేనెన్నడును విడువను. నీవంటిభక్తుల నుద్ధరించుటకె నేనీయవతారమునెత్తితిని. ఎవడు దయా సత్యశౌచములు గలిగియుండునో, వానిని నేను మిక్కిలిప్రేమింతును. ఈసద్గుణములు నీయందుకలవు. అనవిని విభీషణుడు మిన్నుముట్టుచు, మాటిమాటికిని రామచరణసరోజముల స్పృశించుచు, ఓసకలభవనాధీశా! శరణాగతవత్సలా! దీనదయాళూ! సర్వాంతర్యామీ! మీపదభక్తిప్రవాహమున నాదుర్వాసనలన్నియు నశించినవి. శివునికివలె నాకును నిశ్చలాననన్యభక్తిననుగ్రహింపుమన నాతనికి, రామచంద్రుడిట్లనియె. మిత్రమా! నీకోరిక ఫలించును. కాని నీవు కొంతకాలము లంకాధీశుడవై యుండవలయును. మాకాడకుమని సముద్రజల

ములదెప్పించి, విభీషణుని లంకారాజ్యమున కధీశునిగ నభిషేకమొనరింప నప్పుడు దేవతలు పువ్వులవాననుగురియించిరి. మహోత్తరమగు తపము నొనరించి, తుదకు తన తలనుగూడ ఖండించి హోమమొనర్చి సంపాదించిన రావణ రాజ్య లక్ష్మిని, భక్తిపాశబద్ధుడై భగవంతుడు విభీషణుని కిచ్చివేసెను. గిరిజా! చూచితివా! భక్తిప్రభావమును? అట రావణుడు క్రోధాగ్నిచే ప్రజ్వరిల్లుచు క్రౌచుపామువలె బుసగొట్టుచుండెను. ఇట్లపరిమితమహిమగల భగవంతుని విడిచి యన్యులభజించువారు శృంగపుచ్ఛవిహీనులగు ద్విపాదపశువులు. వారి కన్నను భగద్దాసులగు వానరులు వేయిరెట్లుమెరుగుసుమా! అప్పుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిభరితుడగు నాప్రభువు సామాన్యమానవునివలె డగ్గనియె.

సముద్రతరణము

ఓసుగ్రీవ విభీషణులారా! క్రూరసత్వసంకులము నగాధము ననంతము నగు నీసముద్రము నెట్లుదాటవలయునో దోచకున్నది. అనవిని విభీషణు డిట్లనియె. ప్రభూ! నీబాణాగ్ని కోటిసముద్రములనయిన నింకించును. అయినను నీతిననుసరించి, నీవు సముద్రుని ప్రార్థింపుము. అతడు మీపూర్వులవలన నభివృద్ధినందినవాడు. కాన మీకు దగునుపాయమును జెప్పునన. మిత్రమా! మంచిమాటనుజెప్పితిని. దైవసహాయమందుటకు గావలయునన లక్ష్మణుడంత రక్తాంతనయనుడై ఇట్లనియె. అన్నా! పౌరుషహీనులు దైవమును జెప్పుదురు. మనకమోఘములైన బాణములున్నవి. కాన మనము సముద్రుని ప్రతిమాల నక్కరలేదు. అనవిని రాముడు తమ్ముని ధైర్యసాహసములకు మెచ్చుకొనుచు, మందహాససుందరవదనారవిందుడై యిట్లనియె. తమ్ముడా! నీమాట నిక్కము. కాని తొందపడరాదు. అని సాగరుని సమీపించి, సవినయముగ శిరము వంచి నమస్కరించి, కుశాసనాసీనుడై యుండెను.

శుకదౌత్యము

అట రావణుడు విభీషణుడు వెడలిపోయినది మొద లేవృత్తాంతము దెలియ నందున, నచటివిశేషముల దెలియదలచి శుకుడనుదూత నొకనిని నచటకు బంపెను. కామరూపుడగు నాదూత వానరరూపమునుధరించి, వానర సేనలో

బ్రవేశించి యిటునటు దిరుగుచు నచటివిశేషములనరయుచు, రామచంద్రుని యమిత్రపేషపరాక్రమముల కచ్చెరువందుచుండ, రామచంద్రునివద్ద మాయలు చెల్లవు గాన నాతని నిజరూపము గోచరమయ్యెను. తోడనే వానరు లాతని బంధించి సుగ్రీవుని నెదుట బెట్టిరి. అంత సుగ్రీవుడు విచారించి వానికంగభంగ మొనరింపుడన వానరు లాతని హింసింప మొదలిడిరి. అంతవాడు పెద్దగనార్చుచు రామా! రక్షింపుమని మొరబెట్టుచుండెను. లక్ష్మణుడా మొరనువిని తనయొద్దకు రావించి యాతనినింతటితో విడువుడనిచెప్పి, ఓరీ! నిశాచరుడా! యాలేఖను నీప్రభువునకిమ్మనిచెప్పి ఒకలేఖనాతనికిచ్చెను. అందిట్లుకలదు. ఓరీ నిశాచరాధమా! రావణా! నాసందేశమును గ్రహించి వెంటనే సీతను రామునకు సమర్పింపుము. లేదేని హరబ్రహ్మాదు లడ్డుపడినను బంధుమిత్ర సహితముగ నీకుజావుతప్పదు. ఆ లేఖ నాదూతకిచ్చిపొమ్మన నాతడులక్ష్మణునకు నమస్కరించి, లంకకుబోయి రావణుని సమీపించి నమస్కరించి నిలిచిన, దశాననుడు నవ్వుచు, శుకా! కుశలముగవచ్చితివిగద! లంకను వీడి యాసన్నమృత్యువుగల యా విభీషణుడెట్లున్న వాడు? పులస్త్యునివంశమున బుట్టి, రావణసహజన్మ్మడై, తుదకొక మానవుని శరణుజొచ్చినమూర్ఖుడు. ఆతుచ్ఛుని మాటనటుండనిమ్ము. వానరభల్లూకముల వృత్తాంతమునుజెప్పుము. వారట్లు సముద్రమును దాటగలరు? ఒకవేళ సముద్రమును దాటివచ్చినను మనకాహారము కావలసినదే. ఆ మానవదీనులు మనకు భయపడుచుండిరా? నాప్రతాపమునువిని వారు వెనకకు మఱలిరా? వారి బలములసంఖ్యావిశేషములెట్టివి? నీవేలనిట్టుల నిశ్చేష్టుడవయితివి? అనవిని యాతడిట్లనియె. ప్రభూ! సావధానముగ కోపమాపి యవధరింపుము. మీసోదరుడట కేగిన తోడనే రాముడాతనికి లంకారాజ్యము నిచ్చుటకు ప్రతిజ్ఞచేసెను. నన్నుబట్టి వానరు లనేక విధముల బాధించిరి. నాకును కర్ణనాసికలభేదింపబూనిరి. అంతలో నాయాక్రందనమునువిని లక్ష్మణుడు నను విడిపించెను. వానరబలము సంఖ్యేయము. సహస్రముఖుడగు నాదిశేషుడైనను గణింపజాలడు. వికటముఖులగు నాభల్లూక వానరవీరులు చూపఱకుభయమునుగొల్పుచుందురు. మహాతేజస్సంపన్నులగు నాయోధులు నాగాయుతబలులు. మనలంకను దహించి యక్షయుని వధించిన హనుమనుమించిన బలశాలురు, ద్వివిద, నల, నీల

కుముద, కేసరి, దధిముఖ, అంగదాదులందెందఱో కలరు. అందు జాంబవంతుడు నిరుపమానబుద్ధిశాలి. రామచంద్రుని యనుగ్రహముచే వారంతబలవంతులై ముల్లోకముల దృణప్రాయముగ జూచుచుందురు. పదునెనిమిదిపద్మంబుల వానరయోధులను మాత్రము లెక్కింపగలిగితి. వారందఱునమితోత్సాహముతో సింహనాదములజేయుచు, భుజాస్ఫాలన మొనరించుచు, ముందుకు లంఘింపనెంచియు, రామాజ్ఞ లేనందున వెనుకాడుచుందురు. సహజశూరులును, రామకటాక్షపాత్రులునగునా వానరవీరులు లంక ననాసముగజయింపనుత్సహించుచున్నారు. భయంకరమగు మకరాలయము నవలీలగ దాటి, దంతనఖాయుధములచే రాక్షసులదునుమాడి లంకనాక్రమింతుమని వీరాలాపముల నాడుచున్నారు. రాముని తేజోబలంబులను, బుద్ధికౌశలమును సహస్రశేషులైనను వర్ణింపజాలరు. రామునిబాణాగ్ని నూఱుసాగరములనయిననింకించును. అయినను నీతిసిపుణుడగురాముడు సముద్రమును దాటునుపాయమును జెప్పుమని విభీషణునడిగి యాతడుజెప్పినతీరున రామచంద్రుడాసముద్రుని మార్గమునిమ్మని ప్రార్థించుచుండెనని యాదూతసర్వవిషయముల సవినయముగ విన్నవించెను. రావణుడునవ్వుచు, రామునిబుద్ధియుబలమును దెలిసినవి. వానరులు సహాయులు. విభీషణుడు సలహానిచ్చువాడు. బాగున్నది. సముద్రమును బ్రార్థించు నాతనినేమనుకొనవలయును? పిఱికిపందయగు విభీషణుడుమంత్రియగునాతని విజయము తెల్లమగుచునేయున్నది. అని పలుకు రావణునిజూచి, దూతవిచారించుచు సమయమునుజూచి ప్రభూ! లక్ష్మణుడీజాబునుదమకీయుమని బంపెనని యాజాబు నందించెను. రావణుడాజాబు ననాదరముగగైకొని మంత్రికిచ్చిజదువుమన నాతడిట్లుజదివెను. ఓరిమూర్ఖా! కులనాశకుడవు గాకుము. రామచంద్రునిశత్రువును హరబ్రహ్మాదులైనను గాపాడజాలరు. దురభిమానమును వీడినీసోదరునివలె ప్రభునిపదసరోజములనుసేవింపుము. అట్లుకాదేని రామబాణాగ్నిలో శలభమువలె సబాంధవముగనశింతువు. ఆసందేశమునువిని లోనభయందుచు, పైకినవ్వుచు, సభ్యులారా! వింటిరా! యీసందేశమును? వామనుడాకసమునంటగోరునట్లు, ఈబాలతపస్వినాకుబుద్ధులగఅపుచున్నాడు. అని విని యాదూతమఱలనిట్లనియె. ప్రభూ! ఆతనిప్రాతసత్యము. తమరుగర్వాభిమానక్రోధములవీడి నామాటను మన్నించి రామునితో వైరమునుమానుడు. సర్వ

లోకాధీశుడగునాతడు శరణాగతవత్సలుడు. తామూతనినిదర్శించి సీతనర్పింపు డన నాధూర్తుడాదూతను కాలితోదన్న నతడు రావణునివిడిచి, రాముసికడకు వచ్చి ప్రణమిల్లిజరిగినదంతయుజెప్ప నారాముడాతనికి మునిజనదుర్లభమగుపద మునిచ్చియాదరించెను. * ఈతడగస్త్యశాపముచే రాక్షసుడై తుదకు సద్గతి నందినవాడు.

సేతుబంధము

రామచంద్రు డట్లు మూడుదినములు సముద్రుని ప్రార్థించినను ఆతడు ప్రత్యుత్తరమీయకుండుటచే రామచంద్రుడు కృద్ధుడై, లక్ష్మణా! ధనుర్బాణముల నిటు దెమ్ము. ఈతనిని బాణాగ్నిచే శోషింపజేయుదును. మూర్ఖునియెడ వినయము, కుటిలునియెడ నీతియు, కృద్ధునికి శాంతిని బోధించుట, యూషరక్షేత్రమున బీజావాపమువంటిది. కాన నితడు బాణమునకుగాని చక్కబడడని రాముడు శరసంధాన మొనరించెను. లక్ష్మణుడు నిర్విణ్ణుడై చూచుచుండెను. రాముని క్రోధావేశమును జూచి, సముద్రుడు గడగడలాడుచుండెను. మకర మీనాది జలచరము లన్నియు దురపిల్లుచుండెను. అంత సముద్రు డభిమాన మును వీడి, విప్రవేషమును ధరించి, నవరత్నభరితమగు బంగరుపళ్ళెరమును గైకొని, సవినయముగ రాముని సమీపించెను. అరటిమొలక శిరచ్ఛేదమునగాని ఫలింపనట్లు జడులు దండమునగాని చక్కబడరు. అట్లు రామబాణమునకు భయ పడి సముద్రుడు వచ్చి రాము పాదములకు ప్రణమిల్లి, ప్రభూ! నాలోపమును మన్నింపుము. భూతములు స్వభావజడములు. ఇవన్నియు నీమాయావిలసిత ములు. నీమాయావిలాసమగు నీప్రపంచము నిన్నెట్లతిక్రమించును? మృదంగము, మూర్ఖుడు, పసుపు, స్త్రీలు, మున్నగునవి తాడనమునగాని ప్రోవకు రారు. నన్ను ఇంకింపజేసి వానరుల దాటించు శక్తి మీకు గలదని నేనెరుంగుదును. సర్వశక్తిసంపన్నులగు తామేమి దలచినను నిరాటంకముగ సాగిపోవును. కాన తమ చిత్తమునకు వచ్చినట్లు జేయుడను నాసముద్రుని వినయోక్తులకు రామ చంద్రుడు మందహాసమును జేయుచు, వారిధీ! యీభల్లూక వానరసైన్యము లన్నియు నశ్రమముగ నిన్ను దాటు నుపాయమును జెప్పుమన నాతడిట్లనియె.

---

* ఎట్లో, ఎవతో, తెలియదు.

ప్రభూ! నీసేనలో నలుడు, నీలుడు నను సోదరు లిరువురు గలరు. వారికి దండి గారి వరము కలదు.* వారెట్టిపర్వతములను నీటిలో బడవైచిన నవి బెండ్లవలె దేలిపోవును. కాన వారిరువురిచే కొండలచే వారధిని బంధించునట్లు చేయుము. అపు డీ వానరసైన్యము లశ్రమముగ దాటగలవు. వారిధిబంధనముచే మీకీర్తి శాశ్వతము కాగలదు. మీ బాణమమోఘము. దాన దానిచే యుత్తరతీర మందున్న ఖలుల జెండాడుమను నాసముద్రుని పలుకులు విని, యా కృపాళు డగు రాముడు సముద్రు నభినందించి విడిచిపెట్టెను. సముద్రు డారామచరణ సరోజములకు నమస్కరించి సుఖముగ బోయెను. అంత రామచంద్రుడు సము ద్రుని యుపదేశమునకు సంతసించుచుండెను. సకలకలికలుషములను హరించు టకు తులసీదాసు డీచరితమును సభక్తికముగ రచించెను. సుఖధాముడు సకల సంశయశమనుడు, దుఃఖదూరుడు నగు రాముని యీ పవిత్రచరిత్రమును జదివి నను, వినినను, ఎట్టివారైనను దుఃఖదూరులై యుండెదరు. కాన సకలకార్యము లను వీడి ఈచరితము నందరును జదువవలయును. సకలమంగళదాయకములగు రఘునాథుని కథల నాదరముతో గానముజేసెడివా రీసంసారసాగరము నవలీలగ దాటగలరు.

సుందరకాండము సమాప్తము

---

* వీరిరువురు సోదరులగు నగ్ని పుత్రులా

లంకాకాండము

శ్లో॥ రామం కామారిసేవ్యం భవభయహరం కాలమత్తేభసింహమ్
యోగ్రీంద్రజ్ఞానగమ్యం గుణనిధి మజితం నిర్గుణం నిర్వికారం
మాయాతీతం సురేశం ఖలవధనిరతం బ్రహ్మబృందైకవేద్యం
వందే కుందావదాతం సరసిజనయనం దేవ ముర్వీశరూపం॥

శ్లో॥ శంఖేంద్వాభ మతీవసుందరతనుం శార్దూలచర్మాంబరం
కాలవ్యాళకరాళభూషణధరం గంగాశశాంకప్రియం
కాశీశం, కలికల్మషౌఘశమనం కళ్యాణకల్పద్రుమం
నౌనీడ్యం గిరిజాపతిం గుణనిధిం వందేనిశం శంకరమ్॥

శ్లో॥ యో దదాతి సతాం శంభుః కైవల్యమపి దుర్లభమ్
ఖలానాందండకృద్యోసౌ శంకర శ్శం తనోతువః॥

సముద్రతరణము

ఓమానసమా! ఎవనికి యుగములు నిమేషములో కల్పములు, వత్సరములో, కాలము కోదండమో, క్రోధము బాణమో, అట్టిరామచంద్రుని భజింపుము. రామచంద్రుడట్లు సముద్రుని యుపదేశమును గ్రహించి, సచివుల రావించి, ఇంకను, కాలయాపన మేల? సేతువును నిర్మించి సేనల నడుపుడన, జాంబవంతు డోభానుకులసోమా! రామ! నరులు తమనామమునుసేతువునెక్కి సంసారజలనిధి నవలీల దాటుచున్నారు. ఈపరిమితమగు సాగరమును దాటుట ఎంతపని ప్రభూ! యని దోసిలొగ్గి పలికెను. బాణాగ్నిచే సముద్రము నింకించి, మరల యుద్ధానంతరము, శత్రుస్త్రీనయనోదకములచే నీలవర్ణాంబురాశిని బూరింపుమని హనుమంతు డనెను. అంత రామచంద్రుడు మందహాసముతో హనుమంతుని జూచుచుండ, నాలోన జాంబవంతుడు నలనీలుల రావించి, సముద్రుడు చెప్పినచొప్పున సేతునిర్మాణమును జేయుడన వారందులకు సమ్మతించి రామచరణకమలములకు ప్రణమిల్లి యనుజ్ఞను గైకొనిరి. పిమ్మట వారు వానరగణంబుల బిలిచి, మీరు మీమీశక్తినిబట్టి పర్వతములను త్వరగ దెండన వారు

నమితోత్సాహముతో, స్వామికార్యమును జేయనెంచి, జయజయధ్వానముల జేయుచు బయలుదేరి మహోన్నతగిరిశృంగంబుల నూడబెరికి తీసికొనిరా నానల నీలు లాకొండల ననాయాసముగ గ్రహించుచు సేతుబంధనము జేయుచుండిరి.

రాముడు శివలింగమును ప్రతిష్ఠించుట

ఇట్లు స్వల్పకాలమునసే వారాసేతువు నతిసుందరముగ నిర్మించి రాము నకు జూప రాముడు సంతసించి, యానిర్మాణమున కచ్చెరువందుచు నిట నొకశివ లింగమును ప్రతిష్ఠించినగాని ముందునకు బోరాదన నంత సుగ్రీవుడు వానరుల రావింప రామచంద్రు డట శివలింగమును యథావిధిగ ప్రతిష్ఠించి పూజించి ఇట్లనియె. నాకును శివునకును భేదమేమియును లేదు. శివభక్తులై నన్ను ద్వేషిం చినను, నాభక్తులై శివుని ద్వేషించినను వారికి నిరయము తప్పదు. ఈలింగము నాచే ప్రతిష్ఠితముగాన దీనిని రామేశ్వరు డనియు, రామలింగేశ్వరు డనియు వ్యవహరింతురు. దీనిని దర్శించినవారు నాకృపాపాత్రు లగుదురు. గంగాజలము లచే నీలింగమున కభిషేకమును జేసినవారు, ఎట్టిపాపములనైనను వీడి నాసాయు జ్యము నందెదరు. భక్తితో నీరామలింగేశు నర్చించినవారు నాకటాక్షమున, శివుని కటాక్షమునకు బాత్రులగుదురు. ఈసేతువును జూచినవార లశ్రమముగ భవసాగరమును దరియింతురు. అని రాముడు రామేశ్వర మాహాత్మ్యమును జెప్ప నచటివార లమందానందము నందిరి.

సేనాతరణము

పార్వతీ! రాముడు శరణాగతరక్షకుడు. ఆతని ప్రభావముచేతనే నల నీలులు సేతువును నిర్మించి శాశ్వతమగు కీర్తి నందిరి. అతని యనుగ్రహము లేనిచో నాకొండలు బెండులవలె మున్నీట దేలుకొట్లు? దీనికి సముద్రపాషాణ వానరమహిమ కారణము కాదుగదా. ఇట్టిమహిమగల రామచంద్రుని సేవింపక యితరుల సేవించువారి నేమనవలయును? దృఢముగ బంధింపబడిన యావం తెన మీద గంతులిడుచు, గర్జించుచు బోవు నావానరసైన్యము వర్ణనాతీతము. రామ చంద్రు డాసేతువునెక్కి సముద్రముయొక్క ఆయామవిస్తారముల జూచుచుండ, సముద్రములోని జలచరములు పరస్పరవైరములు మాని తలలెత్తి జూచుచుం

డెను. అప్పుడాజలచరములచే గప్పబడి సముద్రోదక మదృశ్యమయ్యెను. కొందఱు వానరు లాజలచరముల వీపులమీదుగ బోవుచుండిరి. వానరవీరులలో గొంద ఱాకసమునుండియు, కొందఱాసేతువుమీదనుండియు, మఱికొందఱు మకరాది జలచరములమీదనుండియు బోవుచు, చూపఱులకు నివ్వెరగొల్పుచు నావలి యొడ్డును జేరుచుండిరి. ఆసేనాప్రయాణమును జూచువారలు భగవద్భక్తు లిట్లే భవసాగరమును తరింతురని దలంచుచుండిరి. రామలక్ష్మణు లీసేనాసంత రణమును జూచి సంతసించుచు వారును తరించుచుండిరి. ఇట్లు క్రమముగ వారి ధిని దాటి యావలిగట్టును జేరి యట నొకగుడారమును వేయించి, రామలక్ష్మ ణులును, వేఱువేఱుగుడారముల సుగ్రీవ విభీషణులును నివాసములను నిర్ణయిం చిరి. అంత నటజేరిన ఋక్షవానరవీరు లందరు రాముని యనుమతిని వడిసి అట నున్న ఫలమూలముల దినుచు హాయిగ నుండిరి. భగవత్కటాక్షపాత్రునకెందై నను దుఃఖము లుండవుగదా! రామచంద్రు డటకు జేరినతోడనే వృక్షము లకా లికఫలపుష్పభరితములై ఎంతకోసినను దఱుగకుండెను. అంత వానరు లావృక్ష ములందు, పర్వతములందును, నిరాఘాటముగ విహరించుచు నటనున్న రాక్ష సులబట్టి, వారి నాసికాశ్రవణముల ఖండించుచు, నాడించుచు, రామునకు జయ మగుగాతమని పలికించి విడుచుచుండిరి. అట్లు వానరపీడితు లయిన నిశాచరులు రావణునికి తమబాధల నెరిగింప, సాగరమును బంధించి శత్రువులటకు వచ్చిరని దెలిసికొని దిగ్గునలేచి, సంభ్రమమున పదినోరులతోను ఒక్కమాఱుగ నేమీ! సముద్రమును బంధించి రాముడు వచ్చెనా? యని బలుకుచు, వికటముగనవ్వుచు తనలో దానేదియో గొణుగుకొనుచుండెను.

మండోదరి రావణునకు హితవు జెప్పుట

అతడట్లు వికలహృదయుడై మండోదరీగృహమునకేగ నామె ఎదురుగ వచ్చి పతిని దోడుకొని చని, రాముడు సముద్రతీరమున విడెనెనని శంకాకుల స్వాంతయై, రావణుని పాదములపైబడి ఇట్లనియె. ప్రభూ! క్రోధమును వీడి నాపలుకుల నాలకింపుడు. శత్రుబలాబలముల నెఱింగి ప్రవర్తింపవలయునుకాని క్రోధావిష్టులై ఎల్లరతోడను వైరమూనరాదు. రామునకు మీకును చాల

భేదము కలదు. కాన నాతనితో వైరము మంచిదికాదు. ఆత డొక్కడే మన ఖరదూషణాదుల నందఱ సమయించెను. ఆతడు మానవమాత్రుడు కాడు. దుష్టనిగ్రహ మొనరించి, భూభారము నడంచుట కవతరించిన నారాయణుడు. మఱియు నారామచంద్రుడు కాలమను ధనువున కర్మలను బాణముల సంధించి జగదుత్పత్తి స్థితిసంహారముల గావించును. ఆతడు శరణాగతరక్షకుడు. కాన సీత నర్పించి యాతనిని వేడుకొని, పుత్రునకు రాజ్యమునిచ్చి వనమున కేగి తపమాచరింతము. దీనదయాళుడగు నాతడు మనల మన్నించును. దయామయుడైన రాముడు తప్పక మిమ్ముల క్షమియించును. తామిదివఱకు దిక్పాలురనెల్ల ననాయాసముగ జయించి జగద్విఖ్యాతి నందిన మహావీరులు. సమస్తభోగముల ననుభవించిన మహాభోగులు. ఇక మనము కామక్రోధముల విడిచి వైరాగ్యము నొంది యాదివ్యపురుషుని భజించుట మంచిది. మహామునులు, మహారాజులును సర్వమును విడిచి ఎవనిని భజించెదరో అట్టి నారాయణుడు మనల నుద్ధరించుటకు వచ్చియున్నాడు. మన మాతని సేవింతము. ఆలసింపకుడు. అట్లు కానినాడు మనకు నాశము తప్పదు. అని యామండోదరి యాతనిపాదములబడి కన్నీరు కార్చుచు దీనముగా బలుక నామెను కౌగిటజేర్చి యోదార్చుచు రావణు డిట్లనియె.

ప్రాణేశ్వరీ! సురాసురనరనాగ గంధర్వాదులనెల్లనిర్జించి, మహాతపమున మహాదేవునిమెప్పించి, యాతనిచేతనేకవరములనంది, స్వర్గముకన్ననుమిన్నయగు నీలంకనేలుచు, రాక్షసానీకమునకంతకును చక్రవర్తియై ముల్లోకముల కీర్తిని గడించిన వీరాధివీరుడగు నాకర్ధాంగివి, ఇంద్రుని జయించిన మేఘనాదునకు దల్లివి, ముల్లోక భీకరుడగు కుంభకర్ణునకు వదినవు నగు నీకేభయమేల! భయమనగనేమియో యెఱుంగని నాకేపితికిమందు నేల బోయుచున్నావు? నీవు చెప్పినట్లు వనమునకుబోయి తపమాచరించిన నంతకన్న నపకీర్తి వేఱొండుండునా! నీవుచెప్పినట్లు నేనారామునిశరణుజొచ్చి సేవించుటకల్ల. వీరులకు దపమెందును జెప్పబడుటలేదు. అది విధముకాదు. కాన నేనారాముని రణయజ్ఞమున దనియించి సహస్రాశ్వమేధముల ఫలమునందెదను. నీవు చింతింపకుము అని యామెనోదార్చి నామెయు నీతనిబుద్ధి మఱిలునదికాదని యూరకుండెను.

యుద్ధాలోచనము

పిమ్మట రావణుడు సభామండపమున కేగి మంత్రులరావించి మంత్రాలోచనమును జేయసాగెను. అందొకడిట్లనియె. ప్రభూ! మనుజులతోడను వానరుల తోడను యుద్ధమేల? వారినిజంపి మనము భుజింతుముగద! అట్టివారితో యుద్ధమునకీప్రయత్న మేల! అనునంత ప్రహస్తుడిట్లనియె. ప్రభూ! సచివుడైన్నవాడును కార్యాకార్యములనాలోచించి యుక్తాయుక్తముల వివరింపవలయు నంతియకాని ప్రభువునకు ముఖప్రీతిగ నిచ్చకములనాడరాదు. అట్టి వీరియాలోచన మాదిని యమృతమువలెనున్నను తుదకు విషమనుపాథమును విన్పించును. వెనుక నక్ష యాదుల వధించి, మన లంకను దహించిన వానరుని మీరేల మెసంగకుంటిరి? వారధిని బంధించి వానరసేనతోగూడి సువేలాద్రియందు విడిసిన రాముడు మానవుడనియా! మీ తలంపు? ఆతడు నరుడుకాడు. వారు వానరులును కారు. శరణాగతుడగు విభీషణుని లంకారాజ్యమునకు ప్రభువుగ నభిషేక మొనర్చిన యాతని ధైర్యాదార్యగాంభీర్య పరాక్రమముల నూహింపుడు. ఔషధపరాఙ్ముఖులగు నార్తులవలె నిచ్చకములకు బ్రెబడివారు చాలమందికలరు. కాని హితమును జెప్పువారును వినువారును మాత్రమరుదుగనుందురు. అనవిని రావణుడు కృద్ధుడై యిట్లనియె. ప్రహస్తా! ఈనీతులను గట్టిపెట్టుము. నేనింత మాత్రము దెలియనివాడనుగాను. మనకిపుడు గర్తవ్యము సమరముగాని సంధి కాదు. నీకీసమాలోచనము సమ్మతముకాదేని, నీవును విభీషణునివలె వైదొల గుమన నాత డాసన్నమృత్యువుగల యాతని కౌషధమువలె నామాటలేమియు రుచించుటలేదు. కానిమ్ము. దైవమునుదాట నేరికిని దరముకాదు. అని దలబో యుచు నవ్వలకేగెను. అంత సంధ్యాసమయమగుటయు, రావణుడు కొలువు జాలించి, క్రీడాశైలశిఖరనిర్మితమగు విలాసభవనమునకేగి తన్ను కిన్నరులు గీర్తింపుచుండ, సుఖాసీనుడై, యప్సరాంగనలు నృత్యముజేయుట గాంచి యానందించుచుండెను. శత్రువువచ్చి పైబడనున్నను, నిర్భీకుడై నిశ్చింతముగ నాట్యవినోదముల గాలముపుచ్చునాతని మనోనిశ్చయమేరికిని గోచరించుటలేదు.

ప్రకృతివర్ణనము

అట సువేలాద్రిననువగు స్థలమందు లక్ష్మణుడొక పూలపాన్పును గల్పించెను. అందు సుగ్రీవునితొడపై తలనిడికొని రామచంద్రుడు శయనించెను

విభీషణుడు చెంతనుండి మాటాడుచుండెను. హనుమంతుడు పాదములొత్తు చుండెను. ధనుర్బాణహస్తుడగు లక్ష్మణుడు వెనుకను వీరాసనాధిష్ఠితుడై యుండెను. ఇట్టి కృపాధాముడగు రామునెవరుధ్యానింతురో ! వారుధన్యులు. అప్పుడుదయించుచున్న చంద్రునిజూచి రాముడిట్లనియె. మిత్రులారా ! పూర్వాద్రిగుహానుండి సింగపుగొదమవలె వెలువడు నీచంద్రునిజూచితిరా ! ఈత డంధకారమత్తేభములనెట్లు రూపుమాపుచున్నాడో చూడుడు. మత్తేభకుంభముల నుండి రాలినముత్తెములవలె దారకలాకసమున విరాజిల్లుచున్నవి. ఇవి నిశానాయికధరించిన ముక్తాభరణములవలె నున్నవి. చందురునిలోపల నానలుపెట్లు వచ్చినదో ! యన, రామచంద్రా ! భూచ్ఛాయ చంద్రునిపై బడి అట్లుండెనని యొకరును, రాహు దంతక్షతమువలన కలిగిన వ్రణకిణమని యొకరును, రతీ నిర్మాణమునందామె ముఖమునునిర్మించుటకై సారాంశమును బ్రహ్మ స్వీకరించెను. అందువలన నామచ్చవచ్చినదని యొకరును బలికిరి. చంద్రుడు విష సహజన్ముడు. కాన నాకాలకూట మాతనియందు వ్యాపించినది. కాననే యాతడు వియోగుల బాధించుచున్నాడని వనితావియుక్తుడగు రాముడనెను. అంత హనుమయిట్లనియె. ప్రభూ ! సహజముగ దెల్లనివాడగు చందురుడు తమ మేఘశ్యామల దివ్యసుందరవిగ్రహమును దన హృదయపీఠమునం దిడుకొనుటచే నట్లగపడుచుండె నన రామచంద్రుడు మందస్మితసుందర వదనారవిందుడై, హనుమంతుని యనన్యభక్తికిమెచ్చుకొని విభీషణునితో నిట్లనియె. మిత్రమా ! ఆనీలమేఘమును జూచితే ! అదిగర్జనములతోడను, మెఱుపులతోడను ధారావర్షమును గురియునట్లున్నది. అన నాతడిట్లనియె. ప్రభూ ! అది మేఘము కాదు. అవి మెఱుపులునుగావు. లంకాశిఖరమునందొక యందమైన నృత్యశాలగలదు. అందు రావణుడు గూరుచుండెను. ఇంద్రనీల మణిమయమగునా తనికిరీటము మేఘమువలె నున్నది. మండోదరి కర్ణాభరణకాంతులు మెఱుపులట్లగపడుచున్నవి. అటనున్న మృదంగధ్వని గర్జనములవలె నున్నది. అనవిని రామచంద్రుడు రావణుని యవివేకమును దొలగింపనెంచి బాణమును బ్రయోగించెను. అది తోడనేబోయి రావణుని ఛత్రమకుటములను, మండోదరి కర్ణాభరణములను నేలబడవైచి మఱల రామునిఅంబులపొదిలోబ్రవేశించెను. అప్పుడు రావణునిసభయందు కలవరము ప్రారంభమయినది. నిర్నిమిత్తముగనీ మకుట

కుండలపాతమేమి ? ఇట్టి యపశకునము లింతవఱ కెన్నడును గలుగుటలేదే యని యచటివారందఱును భయభ్రాంతులగుచుండ సంతరావణు డిట్లనియె. శిరములద్రుంచి యగ్నిలోబడవేయునప్పుడు లేని యమంగళమిప్పు డెట్లువచ్చును ? ఈనామకుటము సరిగ యథాస్థానమునం దుంచకపోవుటచే నిట్లుజారెను. ఇంత మాత్రమున కమంగళశంకనువీడి మీమీ నివాసములకు బొండని వారిని బంపివేసెను.

మండోదరి రాముని వర్ణించుట

కర్ణాభరణము లాకస్మికముగ జారిపడుటకు మండోదరిశంకించుచు, నంజలి ఘటించి సవినయముగ రావణునితోనిట్లనియె. రాముడు మానవమాత్రుడుకాడని భావించి, యాతనితోవైరమునుమానుము. ఆతడువిశ్వరూపుడగు నారాయణుడు. లోకములన్నియు నాతనిశరీరమందిమిడియున్నవి. ఎవనికి ద్యులోకము ముఖము, అగ్ని నోరును, సూర్యచంద్రులు కన్నులు, మేఘములు-శిరోజములు, ఆకసము మధ్యప్రదేశము, వాయువుప్రాణము, జలము బస్తిప్రదేశము, పృథివి కటిప్రదేశము, క్రిందిలోకములు ఊరుజాన్వాదిపాదాంతప్రదేశము, వనస్పతులు రోమములు, పర్వతములు అస్థిఖండములు, బుద్ధి బ్రహ్మ, అహంకారము శివుడును, అగుచున్నవో ? ఏమహామహుని శరీరమున ప్రతిరోమకూపమున నొకబ్రహ్మాండ మున్నదో ? అట్టిభగవంతునితో మనకు వైరమేల ? నాసౌభాగ్యమును నిలుపుమను నామెపలుకులువిని రావణుడిట్లనియె.

సాహసము, చాపల్యము, అనృతము, మాయ, భయము, అపవిత్రత, యవివేకము, నిర్దయ, యను నీఎనిమిదిగుణములు స్త్రీలకు సహజసిద్ధములు. నీవు నాఎదుటనాశత్రువును బొగడుచుంటివి. వేదవ్యాఖ్యాతనగు నాకు నీవు తత్త్వము నుపదేశించుచుంటివి. నాయందలిప్రేమచే నీవిట్లు భయమందుచుంటివి కాని నీవు నాపరాక్రమము నెఱుగనిదానవు కావు. నీవాక్కు లతినిగూఢములు. అన విని మండోదరి, భవితవ్యము నెవరును మాన్పజాలరు. ఈతనికి మనహితోపదేశము తలకెక్కుటలేదు. ఏమిచేయుదుమని చింతించుచుండెను. అంత ప్రాతఃకాల మగుటయు, రావణుడు కాల్యకృత్యములదీర్చికొని, యుచితవస్త్రాలంకారములధరించి, సభాభవసమున కేగెను.

అంగదదౌత్యము

ఇట రఘునాథుడును మేల్కాంచి కాలకృత్యములదీర్చికొని మంత్రుల రావించి, ముందుకర్తవ్యమును నిర్ణయింపుడన జాంబవంతుడులేచి రామునకు నమస్కరించి యిట్లనెను. ప్రభూ! సర్వజ్ఞులగుమీకు మాబోటులుపదేశింపదగిన దేదియునులేదు. అయినను నాకు దోచినదానినిమనవిచేయుచున్నాను. అవధరింపుడు. మనమిపుడు రావణునియొద్దకు మనయంగదునంపి వాని దృఢనిశ్చయమును, అచటిబలాబలములను, వారిసన్నాహములను దెలిసికొనిన పిమ్మటమన కర్తవ్యమునుజేయుట మంచిదన నందులకచటివారందఱు నంగీకరించిరి. అపుడు రామచంద్రు డంగదునిరావించి, యంగదా! నీవిపుడు లంకకుబోయి రావణుని నిర్ణయమును అచటిసన్నాహమును దెలిసికొని రావలయును. నీవేయందుకు దగినవాడవు. నీవెట్టివానినయినను యుచితోక్తుల వశపఱచుకొను శక్తి గలవాడవన నతడారామునియానతిని తలనుదాల్చి, జానకీనాథునకు, జాంబవదాదివృద్ధులకును నమస్కరించి యటనుండివెడలి లంకలోప్రవేశించి, యాలంకా సౌభాగ్యమును దిలకించుచు బోవుచుండ నట రాక్షసయువకు లాతనిగాంచి, ఓహో! వానరము. దీనినిబట్టుడన వారిలో నమితబలశాలియగు రాక్షసయువకుడొక డంగదునిబట్ట నుంకించెను. అంత నాయిరువురకును ఘోరమగుబాహాయుద్ధము ప్రారంభమాయెను. అంత నిపుణుడగు యంగదుడు వీనితో పోరుట కిదియదనుగాదని దలంచి, యాతనిని దూరముగ బారవైచి, లంకా సౌభాగ్యమును దిలకించుచు ప్రగమముగ సభామందిర ద్వారము కడకేగి రావణునకు దన రాక నెఱింగించి, యాతని యనుమతి నంది సింగపు గొదమవలె నాసభలో ప్రవేశించి, సభనంతను కలయజూచి సింహాసనాసీనుడగు నారావణుని జూచి యిట్లు తలపోయసాగెను. ఏమి వీని దర్పము! నేసిందఱి జూచితినికాని యిట్టి ధీరవీరప్రకృతినెందునుజూడలేదు. ఇట్టివీరు డింద్రాదులజయించుట కేమివింత? కాటుకకొండవంటి దేహము, పంచాస్యమహోరగములవంటి బాహువులు, విశాలమగు నురము, ఆకర్ణాయత రక్తాంతనేత్రములు, సహజగంభీరమగు చూపు, ఈతడు క్రూరుడు గాకుండిన ముల్లోకముల నేలదగినవాడే. అనుకొనునంతలో నాయంగదునిజూచి యచటివారు గుసగుసలాడుకొనుచుండిరి. అంత సచివోత్తముని జూచి, మంత్రివర్యా! ఈత డెవడు, ఎందులకువచ్చెనో?

దెలిసికొనుమన నాయంగదుడు రావణునకు నమస్కరించి యిట్లనియె. రాక్షసే శ్వరా! నేను నీమిత్రుడగు వాలిపుత్రుడను. అంగదుడనువాడను. శ్రీరామునిపను పున నేనిటకువచ్చితిని. నీవు పులస్త్యునివంశమునబుట్టి, సకలవేదముల నభ్యసించి, శివపూజాదురంధరుడవై, తపమాచరించి, వరములబడసి, భుజబలముచేదిక్పతుల నోడించి, విశ్వవిఖ్యాతమగుఖ్యాతిని గడించితివి. నీవనుభవించు భోగముల నింద్రా దులు ననుభవించి ఎరుగరు. నీవెఱుంగని ధర్మములు లేవు. అట్టిమహానీయుడ వగు నీవీసర్వానర్థమూలమగు పరదారాపహరణము నెట్లాచరించితివో దెలియ కున్నది. కానిమ్ము. గతించినదానికి వగవనేల? ఇపుడైనను సీతను రామునకిచ్చి యీముప్పునుదప్పించుకొనుము. రామచంద్రుడుశరణాగతవత్సలుడు. సందేహింప నక్కరలేదు. రాము డెంతదయామయుడో అంతపరాక్రమశాలి. ఆతడు కార్త వీర్యార్జును నోడించిన భార్గవుని నిర్జించెను. నీమిత్రుడగు వాలి నొక్కకోలతో దునుమాడెను. ఆతని ధర్మపత్ని నపహరించి యాతనితో వైరమూనుట నీకు శ్రేయము కాదు. నేనన్నివిధముల నీహితమునుగోరి జెప్పుచుంటిని. అన విని రావణు డిట్లనియె. అంగదా! నీవు పిన్నవయినను నాకు హితమును ధర్మమును బోధింపవచ్చితివి. సంతోషము. నీవును నీరాముడు నెంతధార్మికులో జూతము. రాముడు ధనుర్విద్య నభ్యసించినందుకు దొలుత జేసిన ఘనకార్యము స్త్రీవధ. రెండవఘనకార్యము మునివంచనము. తనను ప్రేమించినవనితకు కర్ణనాసికాచ్ఛేదన మొనరించుట మూడవధర్మకార్యము. నీతండ్రిని చెట్టుచాటునుండిజంపుట నాల్గవ ధర్మము. ఇక నీవిషయమును విచారింతము. ఎవడన్యాయముగ తండ్రిని జంపి నీతల్లిని మతియొకని కప్పగించెనో, అట్టివానికి దాసుడనని నిర్లజ్జముగ జెప్పు కొను నిన్నేమనవలయునో దెలియకున్నది. పౌరుషహీనుడు కులపాంసనుడు నగు నీవంటికొడుకును గని ప్రతికియుండి బాధపడుటకన్న చచ్చి నీతండ్రి సుఖముగ నున్నవాడని తలంచెదను. నీతల్లిని మతియొకని కప్పగించిన నీవు సహించితివి. కాని నాచెలియలి ముక్కుచెవుల గోసినవానిని నేనెట్లుసహింతును? నేను వాని భార్యను బందిగా గొనివచ్చితినేకాని వానివలె స్త్రీహింసను జేయుటలేదు. నాచెలియలిని యథాపూర్వముగ నాకప్పగించిన నేనాతనిభార్య నాతనికి వప్ప గింతును. చిరకాలమునుండి తగు ప్రతివీరుడులేక వ్యర్థమగుచున్న యీనాభుజము లెట్లుసార్థకమగునో జూడవలయును. శివునిగిరినెత్తిన రావణునకు, శివధనుర్భంగ

మొసరించిన రాముడన భయమెందులకు? రామరావణుల బలాబలములను రణరంగమునజూచి అప్పుడు మీరామునిబొగడుకొనుము. అన్నచేదన్నులతిని పారిపోయిన సుగ్రీవుడు, పిటికిపందయగు విభీషణుడు, మసలిముద్దయగు జాంబవంతుడును మంత్రులు. శస్త్రాస్త్రవిద్యావిశారదులు, ననేకయుద్ధములందారితేరిన నీబోటి వానరులు సైనికులు. ఇక రామునికి లోపమేమున్నది? ఆకసమంతయు నాతనికి దుర్గము. ఇట్టివానితో యుద్ధమునకు సిగ్గుపడవలయునో సంతసింపవలయునో దెలియకున్నది. అనవిని యంగదుడిట్లుబలికెను. రావణా! సముద్రమును బ్రాగిన యగస్త్యున కెంతసహాయముండెను? ముల్లోకంబుల నిర్జించిన మదనుని పరికరములెట్టివి? మాకు శస్త్రాస్త్రనైపుణ్యము లేదంటివి నిజము. కాని మా హనుమచే శస్త్రాస్త్రనిపుణులగు నీయోధులెందరు మడిసిరి? శస్త్రాస్త్రనిపుణులగు మీవారలందరును లంకను దగ్ధముగాకుండ నేలగూపాడజాలరైతిరి? అదంతయు నటుండనిమ్ము. ఇపుడు:నాకేమియు నాయుధములులేవుగద. శస్త్రాస్త్రనిపుణులగు మీలో నన్ను నిర్జించువారెందరున్నారు? నావంటివారు రామునికడ నెందఱు న్నారో నీవెఱుంగవు. ఇంతకు నాసన్నమృత్యువుకలవాని కౌషధమువలె నీకును హితము చెవికెక్కుటలేదు. రణరంగమున నిహతరాక్షసానీకుడవై, రామబాణాగ్నిని సహింపజాలక బాధపడునప్పుడైనను నామాటలను పాటింపుము. అనరావణుడు పట్టరానికోపముతో నంగదుని దన్ననుంకింప నాతడతని కాలునుబట్టుకొని సింహాసనమునుండి పడవైచెను. అప్పుడచటిసభలో హాహాకారముప్పొంగెను. రామబాణములకు లొంగదగిన యీతడు హితోపదేశముల కెట్లొడబడును? మూర్ఖునియొద్ద సామము, నైశ్వర్యమదమత్తునియొద్ద దానమును పనికిరావు. కాన వీనిని వంచించిబోయెద. ఈపద్ధతిని హనుమంతుడిదివఱకే జూపియున్నాడని తలపోసి, యాసమయమునం దంగదుడెట్లో వీలుచూచుకొని యారావణుని కిరీటములలో నొకదానిని లాగికొని లంఘించి, రామసన్నిధికి బోయెను.

మండోదరి రావణునికి దిరిగి హితవు జెప్పుట

అంత సాయంకాల మగుటచే నంగదుని బలధైర్యముల కాశ్చర్యము నొందుచు రావణుడంతిపురమునకుబోయెను. అట మండోదరి రావణుని సగౌర

వముగ నెదుఱేగి దోడితెచ్చి యుచితాసనమున గూరుచుండనిచ్చి యిట్లు చెప్ప మొదలిడెను. నాథా! మీమానసము మోహావిష్టము. మీరు రాముని యుద్ధమునందు నోర్వజాలరు. రామలక్ష్మణుల పరాక్రమము మీ రెఱుంగనిది కాదు. వారికిని మీకునుగల తారతమ్యము, పరోక్షమున సీతాపహరణము చేతనే ప్రకటమగుచున్నది. అదియట్లుండనిండు. వారి దూతనయినను మనము నిగ్రహింపజాలమయితిమి. ఆతడశ్రమముగ సముద్రమును దాటివచ్చి మన లంకలో నిర్భయముగ సంచరించి యశోకవనమునుచెఱచి యక్షయాదిరాక్షస సమూహామును దునుమాడి మనలంకను దగ్ధముచేసిపోయెనుగదా! అప్పుడు మన వారిబలగర్వములేమైనవి? నామాటనుమన్నింపుడు. రాముడు మానవమాత్రుడు కాడు. నిరుపమాన పరాక్రమశాలియగు చరాచరప్రభువు. అతని బలము నెఱిగిన మారీచు డనేకవిధముల బోధించినను వినక యింతవఱకు దెచ్చి కొంటిరి. జనకునిసభలో రాజులందఱు జూచుచుండ శివచాపము నవలీలగా విఱిచి, దనపరాక్రమమును ప్రకటించెను. మీరుసమర్థులయిన నప్పుడుశివచా పమునెక్కిడి సీతనెందులకు దీసికొనిరారైరి? పరునికళత్రమును బలాత్కార ముగ గ్రహించుటకుఫలము మనకువెంటనే సిద్ధించుచున్నది. ఇంద్రపుత్రుడగు కాకాసురుడు రామునిపరాక్రమము నెఱుగును. కబంధఖరదూషణాదుల దును మాడి యొక్కమ్మున వాలినిజంపిన రాముడుసామాన్య మానవుడెట్లగును? సముద్రము నవలీలబంధించి, సేనాసమేతుడైవచ్చి సువేలాద్రినివిడిసినరాముడు కరుణానిధికావుననే మీక్షేమమునకై మీవద్దకుదూతనంపెను. కలభమువలె మీగర్వతరువును భంజించినయంగదుడు, మనయక్షునిజంపి లంకాదహనమొన రించిన హనుమంతుడు నతనిసేవకులు. కాలమాసన్నమగు వానికి బుద్ధితొలం గును. కాలముమనకు యుక్తాయుక్తబుద్ధుల బుట్టించునేకాని ఎవనికినిగనబడదు. ఇరువురుపుత్రులు గతించిరి. పట్టణము దగ్ధమయినది. మనబలము క్షీణించు చున్నది. కాన నిప్పటికయినను గుర్తెరింగి యీరఘునాథునిసేవించి విమలయ శము నందుమను. నామండోదరి కిట్లనియె.

ప్రాణేశ్వరీ! నీయుపన్యాసమయినదా! ఇకనామాటలవినుము. సర్వ మును ప్రింగుటయేమృత్యువునకు స్వభావము. ఒక్కశివుడుదప్ప మఱియెవరును మృత్యువును జయించినవారులేరు. కాల మాసన్నమయినవానికి దానుభుజిం

చెడియాహారమే మృత్యుసాధనమగును. దైవమునుదాట నేరికినిదరముకాదు. రాముడు మానవమాత్రుడుగాక, నన్నువధించుట కవతరించిన భగవంతుడే యగునేని వధింపకమానడు. చావు సహజసిద్ధము. దానికిభయపడుట యవివేకము. నీవు భగవంతుడని కొనియాడుచున్న రాముడుమాత్రము చావకుండునా? మఱియు మహాతపస్సుచేసి శివునియనుగ్రహమును వడసి, దిక్పాలుర నెల్లర ననాయాసముగజయించి నిష్కంటకముగ లోకములనేలుచు, సమస్తభోగముల ననుభవించు నీరావణుడొకనికి శరణుజొచ్చుటకన్నను జచ్చుటయే మేలు. వీరుడు పగతుర శరణుజొచ్చుటకన్న రణరంగమునజచ్చుట శ్లాఘ్యము. వీరపత్నివి, వీరమాతవునగు నీవెందులకింత వంతగుందుచుంటివో నాకు గోచరముగాకున్నది. ఇకనైనను నీవీపిఱికిదనమునుమాని ధీరస్వాంతవు గమ్ము. అని తననిశ్చయము నెఱింగించెను. అంగదుడట్లుపోయి రామునిసన్నిధినిజేరి రామునకునమస్కరించి రావణసభావృత్తాంతమును విన్నవించి, తాదెచ్చిన యా మకుటమును రామపాదసన్నిధినుంచి, ప్రభూ! ఇది రావణమకుటము. తాము విభీషణుని లంకకురాజుగ నేర్పఱచితిరి. కిరీటములేనిరాజు శోభించడు. కాన లంకాధిపతి ధరింపదగిన యీకిరీటముచే మనవిభీషణు నలంకరింపుమన నాతని చతురోక్తులకు సంతసించి, రామచంద్రుడు మంత్రులరావించి కర్తవ్యము నాలోచించు చుండెను.

వానరసేనావిన్యాసము

అంత విభీషణుడు మున్నగుమంత్రులు చేతులుజోడించి రామున కిట్లనిరి. ప్రభూ! ఈలంకకు దుర్భేద్యమగు ప్రాకారముకలదు. మఱియు నాప్రాకారమునకు నాలుగుదిక్కుల నాలుగుద్వారములున్నవి. వానిచెంత నసంఖ్యాకులగు రాక్షసులాయుధపాణులై ఎల్లప్పుడును కావలియుందురు. కాన మనసైన్యమును నాలుగుభాగములుగ భాగించి, తగినయోధులను సేనాధిపతులుగ నియమించి, ఒక్కసారిగ నాలుగుద్వారముల ముట్టడింపవలయును. అట్లయినవారికి బరస్పరసహాయము జిక్కకుండునన రాముడువల్లెయని, వానరసేనను నాలుగు భాగములుజేసి, తగినయోధులను నాయకులుగ నియమించి, సుగ్రీవుని, యంగదుని, జాంబవంతుని యాయాద్వారముల ముట్టడింపనియమించి, ధనుష్పాణులై

తానుత్తరద్వారమును ముట్టడింప నిశ్చయించెను. వారును రామపాదములకు నమస్కరించి, రామునకు జయమగుగాత యనిపలుకుచు, గండశిలల చేత బూని, రామభక్తుల కసాధ్యములేదని మదినిభావించుచు, భేరీమృదంగధ్వనుల వలె నఱచుచు, సింహనాదములజేయుచు, మేసుమాలలవలె నాలుగుద్వార ముల నొక్కపెట్టున ముట్టడించిరి.

రావణుడు వానరసేన నుసిగొల్పుట

ఆకోలాహలమును విని రావణు డుగ్రుడై, రాక్షసులతో నిట్లనియె. నిశాచరయోధులారా! కాలపేరితులై మనయాకలిని దీర్పవచ్చిన యీవాన రులెట్లు వాగుచుండిరో చూడుడు. భగవంతుడప్రయత్నముగ మనకు పుష్కల మగు నాహారము నిచ్చుచున్నాడు. కాన మీరు నలుదిక్కులకు బోయి యీ వానరభల్లూకములను నిశ్శంశయముగ భుజింపుడు. పార్వతీ! చూచితివా! ఆకసము మీదపడినయెడల కాళ్ళతో నాపగలనని దలంచి కాళ్ళు పైకి బెట్టి నిద్రించు తలక్రిందు పక్షివలె రావణుడు దురభిమానముచే నిశ్చింతముగ నుండెను. రాజాజ్ఞచే రాక్షసులు, తోమరాది సకలాయుధములగొని, గృధ్రము పద్మరాగశకలముల జూచి మాంసఖండములని భ్రమనంది, వానిని బొడిచి తన ముక్కును విఱుగగొట్టుకొనినట్లు వానరసేనల మీదికి పరుగెత్తసాగిరి. నానా ప్రహరణముల గైకొని, కోటబురుజుల నెక్కి రాక్షసులు, మేరుశృంగముల నాశ్రయించిన మేఘములవలె గూరుచుండిరి. రణభేరి మ్రోగుచుండ వారు పర స్పరము వీరాలాపముల నాడుచుండిరి. అపుడు రాక్షసుల గుండెలు పగులునట్లు వానరవీరులు సింహనాదముల జేయుచుండిరి. ఇట్లా యుభయసేనల గర్జితములు రణభేరిమ్రోతలు భూనభోంతరాళములనిండిపోయెను.

యుద్ధవిజృంభణము

అంతనుభయసేనలు, దమదమప్రభువుల జయధ్వానములతో యుద్ధము నారంభించిరి. అపుడురాక్షసులు పర్వతశిఖరములనువానరుల పైప్రయోగింపవా రాశిఖగములను బంతులవలెబట్టుకుని తిరిగిరాక్షసుల పైవిసరుచుండిరి. కొందఱు రాక్షసులనుబట్టుకుని . గిరగిరద్రిప్పినేలపై బడవేయుచుండిరి. కొందఱు వానర

యువకులు కోటబురుజులపైకి లంఘించి సింహనాదములజేయుచుండిరి. రామానుగ్రహముచే గ్రమక్రమముగ వానరులు సౌధములపైకెగురుచు, రామునకు జయమగుగాతమని కేకలువేయుచుండ పట్టణమందు హాహాకారము బయలుదేరెను. భయంకరమగునాస్థితినిజూచి యాదుస్థితి రావణునివలన వచ్చినది. అతడీమృత్యువును కోరితెచ్చిపెట్టెనని యచటివాఅనుకొనుచుండిరి. అంత రావణుడు చెదరినసేననుజూచి కృద్ధుడై, సైనికుల నదలించుచు, నా ధనమును దిని సమయమువచ్చినపుడు వెనుకాడిన నాకరవాలమునకు బలియగుదురు. వానరులకు భయపడుట మనకెంతయవమానమో యూహింపుడు. అను నాతని యాలాపములవిని రాక్షసవీరులు లజ్జాభయపరీతమానసులై, ఈతని కరవాలమున మరణించుటకన్నను రణరంగమున మరణించుట మంచిదని తలంచి, సకలాయుధముల ధరించి, రణోత్సాహము పెంపొంద కపివీరులతో దలపడి, వానరుల నొప్పింప, వారలు చెదతొరుచు, హనుమా! అంగదా! రండు, కాపాడుడని మొఱలిడ నాయార్తనాదముల నాలకించి హనుమంతుడు పశ్చిమ ద్వారముకడకేగ నటనింద్రజిత్తు కవాటముల బంధించి యుద్ధచేయుచుండెను. హనుమంతుడు గర్జించుచు నాకవాటములభేదింపసాగెను. అవి కఠినములగుటచే భేదింపబడకుండెను. అంత హనుమ లంఘించి కోటబురుజుపైకెగిరి ఒకపర్వత శిఖరమును ఇంద్రజిత్తురథముపై విసరెను. దానితో రథమువిరిగి సారథి మూర్ఛిల్లెను. మేఘనాదుడు మఱియొక రథమునందాసారథినిడికొని పోయెను. అంతలో అంగదుడాహనుమకు దోడ్పడెను. అట్లువారిరువురును గలిసి వీరవిహారమును సలుపుచు నటనున్న వస్తువుల బొడుసేయుచుండ నటనున్న రాక్షసాంగనలు, వెనుక నొకకోతి వచ్చి మనలంకను గాల్చెను. ఇపుడు రెండు కోతులు వచ్చినవి. ఏమిమూడనున్నదోయని భయపడసాగిరి. ఇట్లు వారిరువురును వానరచేష్టలజేయుచు వారలనందఱి భయపెట్టుచు, రామప్రతాపమును బ్రకటించుచు, కాంచనస్తంభముల నరటిబోదెలవలె విఱచుచు, రాక్షసులతో దలపడి వారల మర్దించుచు, రామాగ్రహమునకిది ఫలమనిజెప్పుచు, రాక్షసుల తలల దాటిపండ్లవలె నెగురవైచుచు, నందలి యోధుల కాళ్ళుబట్టి గిరగిర ద్రిప్పి రామసన్నిధికి విసరుచుండిరి. విభీషణుడు వారిని రామునకెఱిగింప నారాక్షసులకు రాముడు దివ్యధామము నొసంగుచుండెను. ఓగిరిజా! రాముని

దయనుజూచితివా! ద్విజమాంసాశనులగు నాఖలులు మహాయోగులకుగూడ నలభ్యమగు దివ్యధామమును బొందిరి. వైరులకుగూడనట్టి దివ్యపదమునిచ్చు రాముని యనుగ్రహపాత్రుల సుగతిని జెప్పనలవికాదు. ఇది తెలియని యభాగ్యు లారాముని సేవింపజాలరు. ఇట్లనేక రాక్షసవీరుల జంపి యంగదహనుమంతులు మందరపర్వతములవలె నటగూరుచుండి శ్రమను దీర్చికొని సంధ్యాసమయము నకు రాముని సన్నిధిని జేరిరి. అప్పుడు రామచంద్రుని కరుణాకటాక్షముచే వారిశ్రమలన్నియు దీరిపోయినవి. మిగిలిన వానరభల్లూకము లటునిటుదిరు గుచు, ప్రదోషసమయమున విజృంభించిన రాక్షసులతోదలపడి ముష్టియుద్ధము నొనర్చుచు, వాయువిశీర్ణములై మబులమబుల గలియు పయోదములవలె పోరాడుచుండిరి. ఋజుమార్గమున వైరులనిర్జించుట యసాధ్యమని దలంచి, యకంపనుడు మున్నగురాక్షసవీరులు మాయాంధకారమునుగల్పించి పాషాణ వర్షమును గురియింప నావానరులాయంధకారమున నొకరినొకరుగానక కలవర వడుచు నరువసాగిరి. ఈయవస్థనుజూచి యంగదాదులు రోషమునంది, యటు బోవుచుండ రాముడాగ్నేయాస్త్రమును బ్రయోగించెను. అంత జ్ఞానముచే నజ్ఞానమువలె యంధకారమునశింప నంగదాదుల గర్జితములవిని రాక్షసులు పారిపోవుచుండిరి. అప్పుడు దొఱికినవారిని వానరవీరులు చంపి సముద్రములో బడవేయుచుండిరి. అంత నిశాసమయమగుటచే వానరబలములు రామసన్నధికి బోయెను. అప్పుడు రాముని కృపాలోకనముచే వారిశ్రమలన్నియు దొలగెను.

మాల్యవంతుడు రావణునకు హితవును దెల్పుట

అప్పుడు రావణుడు మంత్రులతో నిట్లనియె. మనవీరులు మడయుచు న్నారు. కాన నుపాయమునాలోచింపుడనినంత వృద్ధుడగుమాల్యవంతుడిట్లనియె. ప్రభూ! నీవు సీతనుదెచ్చినది మొదలు మనకపశకునములే దోచుచున్నవి. భయ ముచే నూరకుంటిని. రాముడు భగవంతుడు. అతనికీర్తినివేదము లుద్ఘోషించు చున్నవి. భగవద్విరోధులకెన్నడును సుఖముండదు. తొల్లి మధుకైటభులు, హిరణ్యాక్షహిరణ్యకశిపు లాతనిచే జంపబడిరి. అతడు కాలస్వరూపమున దుష్టు లబలమును హరించును. సకలగుణనిధియగు నాతని శివుడు బ్రహ్మయు సేవించు చుందురు. అట్టివానితో విరోధము తగదు. జగన్మాతయగు నాసీతనిచ్చి వైర

మును మాని యాతనిభజింపు మన నాతనిమాటలా రావణునికి ములుకులై దోప నిట్లనియె. ఓరి యభాగ్యుడా! నీవు మృత్యువువాతబడనుంటివి! లేనిచో నిట్లేలపలుకుదువు? నీవువృద్ధుడవని క్షమించితిని. పొమ్ము! నీముఖము నికనాకు జూపకుము. అన నారామునిచేత నితనికి మృత్యువు తప్పదు. కాల మాసన్న మగుటచే నిత డిట్లనుచుండెనని తలంచి యామాల్యవంతుడు లేచిపోయెను.

మేఘనాదయుద్ధము

అప్పుడు మేఘనాదుడు రోషావేశవివశుడై, తండ్రీ! తెల్లవారనిమ్ము. నాప్రతాపమునుజూపెదను. మాటలతో లాభము లేదను నాతనియనుకూలురా మాటలువిని సంతసింపుచు నాలోచించుచుండగ నె తెల్లవారెను. అంతవానరసే నలు నలుదిక్కులమోటడింప మొదలిడెను. పట్టణమునందంతటను కోలాహలము ప్రారంభమయ్యెను. అపుడురాక్షసులాయుధముల బూనివానరులతోదలపడిరి. అపుడు రాక్షసులకును వానరులకును సంకులయుద్ధము ప్రారంభమయ్యెను. అప్పుడు రాక్షసులుమిక్కుటముగమరణించుండిరి. అంతనింద్రజిత్తుకృద్ధుడైవచ్చినయాతని జూచివానరులు భయపడి పరుగిడుచుండిరి. అప్పుడావానరులతో నతడిట్లనియె. ఓవానరాధములారా! విఖ్యాతవీరుల మనుకొను ధనుద్ధరులగు రామలక్ష్మణుల జూపుడు. అంగదహనుమంతులెటనున్నారు? భ్రాతృద్రోహియగు విభీషణు డెక్కడ? నేడు వారలనందఅమడియించెద. జూడుడనుచు తీవ్రనారాచముల ప్రయోగింప నవి సపక్షసర్పములవలె నలుగడల వ్యాపించుచుండెను. ఇట్లామేఘనాదుని నిశితబాణవృష్టిలో జిక్కుకొనివానరసైన్యము దీనావస్థనొం దెను. మేఘనాదుడు సోత్సాహముగ గర్జించుచుండనాలోనహనుమత్కృద్ధుడై, పరుగెత్తుకొనివచ్చి ఒకపర్వతశిఖరమునాతనిపై విసరెను. దానినాతడు తప్పించు కొనగ నతనిరథసారథులు నశించెను. హనుమంతుని పరాక్రమమునెఱింగినవాడ గుటచే నింద్రజిత్తాతనినెదురొక్కనజాలకుండెను. పిమ్మట రామునెదురొక్కని వివిధ విశిఖముల నాతనిపై బరపెను. రాముడావిశిఖములననాయాసముగ మఱలించెను. సకలప్రపంచ మెవనిమాయను దాటజాలకుండెనో! అట్టి రాముని చెంగట నింద్ర జిత్తుతనమాయల నుపయోగింప మొదలిడెను. మేఘనాదుడాకసమునుండి యంగార వర్షమునుగురియింప రాముడు వారుణాస్త్రమున వారించెను. పిమ్మట నారాక్షస

వీరుడు పిశాచములసృజించి వానిచే వానరులభయపెట్టుచు నొకపరి పాషాణము లను, మఱియొకప్పుడు రుధిరమునువర్షింపసాగెను. అంత వానరు లీతనిగెలువ జాలమని విమస్కులైరి. అంతరాముడు వానిమాయలనన్నిటినిరూపుమాపి, తనదయార్ద్రదృష్టిచే వానరులసనుగహింప, వాఅందఱును విగతభయులై, మఱలయుద్ధోత్సాహముతో సింహనాదములజేయుచుండిరి. అంతరామాజ్ఞనంది హనుమదాదులతో లక్ష్మణుడింద్రజిత్తుపై దాడివెడలెను. మేరుధీరుడు, విశాలో రస్కుడు, రోషారుణనయనుడగు లక్ష్మణుడు, ధనుష్పాణియై యుద్ధమునకు వెడలెనని చారులవలసవిని రావణుడు అనేకరాక్షసవీరుల నంపవారుశస్త్రపాణులై మేఘనాదుని సహాయార్థముబయలు దేరిరి. వానరులును తరుశైలములనాయు ధములుగగొని వచ్చుచుండిరి. అట్లిరువాగులవారును సమరోత్సాహభరితులై, తమతమప్రభువులకు జయమునుగోరుచు, సంకులయుద్ధము నారంభించిరి. అంత వానరులు పాషాణములను వృక్షములను రాక్షసులపై విసరి రాక్షసులబరిమార్చు చుండిరి. రాక్షసులును వానరుల జంపుడు పొడువుడని కేకలిడుచు వివిధాయుధ ములనుపయోగించుచుండిరి. అంత వీరికోలాహలమునువిని దేవత లానందించు చుండిరి. ఆసమరభూమియందు రక్తనదులుప్రవహించుచుండెను. రాక్షసమాంస ఖండములు లోహితాంగారములవలె నుండెను. అపుడు మేఘనాద లక్ష్మణులు పరస్పరము యుద్ధముచేయ మొదలిడిరి. సదృశులగు నావీరుల యసదృశపరాక్ రమమునకు, నిరుపమధనుఃపాండిత్యమునకు ననిమిషు లాశ్చర్య మొందుచుండిరి.

లక్ష్మణమూర్ఛ

అపుడు మేఘనాదుడు మాయాయుద్ధము నారంభింపలక్ష్మణుడు క్రుద్ధుడై, సూతునిరథ్యములనుపడగొట్టి చాలవఱకు రాక్షసానీకమునుదును మాడెను. అంత మేఘనాదుడు శక్తినిప్రయోగింప నది లక్ష్మణునిహృదయమున నాటనతడుమూర్ఛిల్లెను. అపుడింద్రజిత్తాతనిదరికేగియతనినెత్తికొనిపోవదలంచెను గాని మాతనిప్రయత్నము విఫలమయ్యెను. బలవంతులగు రాక్షసవీరులుపలువురు కలసియు నెత్తజాలక లజ్జించుచుండిరి. భూమినంతను మోయునాదిశేషు నెవరెత్త గలరు? పార్వతీ! లక్ష్మణుడుకోపించిన చతుర్దశభువనములును క్షణములో నశిం చును. సమస్తదేవతలు నాతనిసేవింతురు. అట్టివానిని ఇంద్రజిత్తుకావున దురమున

నోర్చెను. ఇతనిపేరును వినిన దేవతలు భయకంపితు లగుచుందురు. పుత్రుడే యింతపరాక్రమశాలి యగునపుడు తండ్రి ఎంతబలశాలియో! యూహింపుము. కావుననే వీరినిరువురను జంపుటకై రామలక్ష్మణు లవతరించిరి. వీరిరువురును త్రిలోకకంటకులు. అంత సాయంకాలమగుటయు, హనుమంతుడా లక్ష్మణుని తనభుజముపై నిడుకొని, కరుణామయుడగు రామునిసన్నిధికి జేరెను. మూర్ఛితుడగు తమ్మునిజూచి రామచంద్రుడు ప్రాకృతమానవునివలె విలపింపజొచ్చెను. అపుడు జాంబవంతుడువచ్చి, ప్రభూ! విలపింపకుడు. మనసైన్యములో సుషేణుడను ఘనవైద్యుడుకలడు. ఆతనిని రావింతము. అతడు తగునుపాయమును జెప్పునన నతనిరావించి యతనితో జఱిగినవిషయమునుజెప్ప నాత డాలక్ష్మణుని బరీక్షించి యాతనికి దగునౌషధమును, అదియుండెడి తావును, జెప్పి యాపనికి దగినవాడని హనుమంతుని నిర్దేశించెను.

కాలనేమి చరిత్రము

అంత నాహనుమంతుడు రామపదకమలములను దనహృదయముననిలిపి ప్రయాణోన్ముఖు డయ్యెను. ఈవార్తను చారులవలనవిని రావణుడు కాలనేమియనువానిని రావించి, విషయమునంతను జెప్పి, ప్రయాణమును జేయుచున్న హనుమంతుని పరిమార్పుమన నాతనిపలుకులు విని తలపంకించుచు, నాతనితో నిట్లనియె. ప్రభూ! తమసమక్షమున లక్షాదిరాక్షసవీరుల జంపి లంకాదహనమొనరించి నిరాతంకముగ దనప్రయాణమునుసాగించిన యాతని ప్రయాణము నాటంకపఱచి వధించుట ఎట్లు పొసగును? ప్రతిప్రాణిని కాలసర్పము క్రుంగుచునే యుండును. కాన వ్యర్థముగ కాలమునుగడపక నాపరాత్పరుడగు శ్రీరామచంద్రుని సేవించి, యహంకార మమకారముల వీడి యవిద్యానిద్రనుండిమేలొ్కాని శుభములనందు మన నుగ్రుడై రావణు డిట్లనియె. ఓరీ! నాకునీవు జ్ఞానము నుపదేశించుచుంటివా! పిరికిపందా! భయపడిన చావుదప్పునా? పౌరుషములేనివాడు బ్రతికిననేమిలాభము. నీవు నన్నెరుంగుదువుగదా! యన సీతనిచేతజచ్చుటకన్న నారామునిభజించుచు నారామభక్తునిచే జచ్చుటమేలని యెంచి, యాగ్రహింపకుము. అట్లే చేయుదుమని చెప్పి శెలవుగైకొని కాలనేమి హనుమంతుడుబోవు మార్గమధ్యమమునం దొకయాశ్రమమును

గల్పించి, అందొకసరోవరమునుగూడ గల్పించి యట జపముచేయుచు మునివే షముతోనుండెను. హనుమంతుడా మార్గమునబోవుచు నాయాశ్రమమునుజూచి సంతసించుచు నిటవిశ్రమించి దప్పిదీర్చికొనిపోయెదనని తలంచి యా యాశ్రమమున బ్రవేశించెను. అంత నాకాలనేమి హనుమంతుని వంచింపనెంచి కపట ముని వేషమునూని మాయజపము నాచరించుచుండెను. హనుమంతుడామునిని సమీపించి నమస్కరించిన నటగూరుచుండ నియమించి ఇట్లనియె. నీనుమా! దుర్బుద్ధియగురావణుము రామచంద్రునితో యుద్ధమునకు సిద్ధపడుచున్నాడు. కాని జయము రామునకేయగును. దీనినినేను దివ్యదృష్టిచే గనుకొంటిని. అన హనుమ, స్వామీ! చాలడస్సితిని. నీరుద్రావక నిలువలేను. కాన నాడప్పిని దీర్చుమన నాతడదిగో సరోవరము. అందుస్నానమాచరించి నీడప్పినిదీర్చికొని రమ్ము. నీకును దివ్యదృష్టిని బ్రసాదించెదనన నాహనుమ సరోవరమునబ్రవేశింప నొకమకరి యాతనిపాదమునుబట్ట నతడద్దానిని దునుమాడెను. తోడనే యా మొసలి దివ్యాప్సరాంగనయై యాతనితో నిట్లనియె. మహాత్మా! నేనొక మహర్షి శాపముచే నిట్టిజన్మమునువడసితిని. నాపేరు ధాన్యమాలిని. నీవలన నా శాపమునశించినది. నేపోయివచ్చెద. ఆ యాశ్రమమునందున్న వాడు కాలనే మియను రాక్షసుడు, కాని మునికాడు. వాడునీకు విఘ్నమునాచరింప నిటకు రావణాజ్ఞచే వచ్చియున్నాడు. కాన వానిని నిర్జించి సుఖమునబొమ్మనిచెప్పి యామెతనత్రోవనుబోయెను. పిమ్మటహనుమంతుడా యాశ్రమమున జేరి, గురు వర్యా! ఎటనుంటిరి? ముందునేనిచ్చు గురుదక్షిణను స్వీకరింపుడు. పిమ్మట నాకుపదేశమును జేయవచ్చుననిచెప్పి యారక్కసునిమెడకు దనవాలమునుజుట్టి నేలనువేసి గొట్టనుంకింప సంతలోనాతడు రామనామమును స్మరింపుచు, నసువులబాసెను.

మారుతి సంజీవిని దెచ్చుట

అంతనాహనుమ సంజీవి పర్వతమును సమీపించి యామూలికనుబరీక్షించుచు గురుతుపట్టజాలక యాపర్వతము నూడబెఱికి దానిని జేతబూని యయోధ్యమీదుగ వచ్చుచుండ నాతనినిజూచి భరతుడీతడెవడో రాక్షసుడని తలంచి బాణమునుసంధించి, విడువ నాశరము హనుమంతునిహృదయమున నాటెను.

అంత నాహానుమంతుడు వికలమనస్కుడై, రామచంద్రా ! లక్ష్మణా ! మీసేవ జేయజాలకపోతిని. మీకు సంజీవినీయజాలకుంటిని, అని యార్తనాదమును జేయుచుమూర్ఛిల్లెను. అంతభరతుడీతడు రామభక్తుడు కావలయును. ఎంతపనిని జేసితిని ! అని భరతుడు హనుమంతునిజేరి చూచునంతలో నతడు మూర్ఛితుడై యుండెను. ఎంతప్రయత్నించిననాతడు మూర్ఛ దేలకుండుటనుజూచి, దైవమా ! రామచంద్రుని విడిచియుండుటచే కృశించుచున్న నేనీరామభక్తుని బడగొట్టుటచే రెండవదుఃఖమును చేతులార దెచ్చికొంటిని. నేను నిజమగురామభక్తుడ నేని, రామచంద్రుడు నాయందభిమానముకలవాలడేని, యీరామభక్తుడు పీడారహితుడై లేచుగాక యని భరతుడు బలుకగనె, జయజయ ! కోసలా ధీశా ! యని పలుకుచు హనుమంతుడు లేచికూరుచుండెను. భరతుడంత పులకిత శరీరుడై యాతనిని కౌగలించుకొని, యానందబాష్పములగార్చుచు, అయ్యా ! రామలక్ష్మణులు, మాతల్లియగు జానకియు సుఖులై యుండిరికదా ! చెప్పుమన నచటి వృత్తాంతమును సంక్షేపముగజెప్పెను. దానినంతను విని భరతుడు మిగుల దుఃఖించుచు నేనీప్రపంచమునందేల జన్మించితిని ? నేను రామున కొకసహాయమునైనను జేయలేకుంటిని సరిగదా ! సర్వదుఃఖములకు నేనేకారణమయితిని. అనిదుఃఖించుచు మఱల ధైర్యమూని, మిత్రమా ! ఇప్పటికే ఆలస్యమయినది. సూర్యోదయమయినయెడల కార్యమంతయు చెడును. నీవెంత త్వరగానేగినను వారినిచేరజాల వనుకొనుచున్నాను. కాన నీవుపర్వతసహితముగ నాశరమునపై గూరుచుండుము. నినొ్నకక్షణములో శ్రీరామచంద్రునియొద్దకుజేర్చెదనన నా వేగముకన్న శరవేగమెక్కుడాయని, తలంచుచు ప్రభూ ! నేను మీశరముచేరునంతలో రామచంద్రుని చేరగలను. అనుజ్ఞనొసగుడన భరతుడు సంతసించి అట్లేకానిమ్మన హనుమ భరతునకు ప్రణమిల్లి యటనుండిబయలుదేరి, భరతుని బాహుబలమునకు, రామభక్తికిని సంతోషాశ్చర్యములనందుచు, ప్రయాణమును చేయసాగెను.

రాముడు మూర్ఛనొందిన లక్ష్మణునికై విచారించుట

అట రామచంద్రుడు ప్రాకృతజనునివలె విలపించుచు, రాత్రి "చాలవఱకు గడిచినది. హనుమంతు డింతవఱకు రాలేదు. ఏమికానున్నదో" యని తమ్ముని కౌగలించుకొని సోదరా ! నీవునన్నెప్పుడును దుఃఖమును పొందించి ఎఱుగవు.

ఇపుడేలనన్నిట్లు దుఃఖపెట్టుచుంటివి? నీమానసమతికోమలము. నాకై నీవు తల్లితండ్రులను, భార్యను విడిచి, శీతాతపముల సహించి, వనవాసక్లేశము ననుభవించుచుంటివి. అట్టినీవు నన్నిపుడెందులకిట్లు దుఃఖపెట్టుచుంటివి? కనుల విప్పి చూడుము. మాటాడుము. వనవాసమున సోదరవియోగము గలుగునని దెలిసిన నేనీవనవాసమును మానుకొనియెడివాడను. కళత్రము, పుత్రులు, వారినిబట్టి ఏర్పడిన బంధువర్గము ఎక్కడనయినను లభించును. కాని నీవంటి సోదరుడుమాత్ర మెచ్చటను లభించడు. రెక్కలులేనిపక్షి, తొండములేని గజమువలె నిన్ను బోగొట్టుకొని నేను విలపించుచుంటిని. జడుడగు దైవము నీతో నాకీవియోగమును గల్పించెనుకాని నిన్నువీడి నేనెట్లు బ్రతుకగలను? నేనెట్లయోధ్యకు పోగలను! భార్యకోఱకు సోదరుని గోలుపోయెనను యపకీర్తి నెట్లు సహింతును? నిన్నడిగిన సుమిత్రకు నేనేమి చెప్పవలయును! సీతావియోగముకన్ను నీవియోగము దుర్భరము. నేనికసర్వస్వమును త్యజించి ప్రాయోపవేశమును జేయుదును. నీకై విలపించుచున్న యీకపివీరుల నోదార్పుము. లెమ్ము. అని సకలప్రాణిదుఃఖాపహారియగు నాదీనబాంధవుడు తమ్మునికై యనేకవిధముల విలపింపసాగెను. పార్వతీ! చూచితివా! యాయద్వితీయాఖండానందరూపుడగు రఘునాథుడు, సామాన్యమానవునిలె తన లీలలను జూపుచుండెను. ఆతనిలీలను జూచి వానరులును విలపింపసాగిరి. అంతమూర్ఛ భవించిన వీరరసమువలె హనుమంతుడు సంజీవి పర్వతముతోగూడ జనుదెంచెను. ఆతనిని జూచి రామచంద్రు డమితానందము నందుచు, నింతటి పరోపకారధురంధరుడు లేడని యాతనిగొనియాడెను. పిమ్మట నాసంజీవినుండి మూలికను సుషేణుడు లక్ష్మణున కుపయోగింపగా నతడు నిద్రనుండి మేల్కాంచినట్లు లేచి కూర్చుండెను. రామచంద్రుడు తమ్మునికాగలించుకొని సంతసించుచుండ వానరసేనలన్నియు సంతసించుచుండెను. పిమ్మట నాపర్వతమును హనుమ యథాస్థానమునందుంచి మఱలివచ్చెను.

రావణుడు లక్ష్మణమూర్ఛావిముక్తిని విని కుంభకర్ణుని మేల్కొలుపుట

ఈవృత్తాంతమునంతను రావణుడు విని శిరమును పంకించుచు ననేక ప్రయత్నములచే కుంభకర్ణుని లేపించెను. అతడు ప్రళయాంతకునివలె లేచి కూర్చుండి, రావణుని జూచి అన్నా! నీమోమట్లు చిన్నపోయినదేమి! అం

అకు గుశలమేకద! అని ప్రశ్నింప రావణుసు సీతాపహరణము మొదలునజరిగిన వృత్తాంతమునంతను వినిపించెను. కుంభకర్ణా! ఏమిచెప్పుదును. వానరసేనలు వచ్చి మహావీరులగు రాక్షసులను దునుమాడినవి. మఱియు దుర్ముఖాతికా యాకంపన మహోదరాది రాక్షసవీరులందఱును యుద్ధమునందు మడిసిరనవిని, కుంభకర్ణుడు విచారించుచు అన్నా! ఎంతపనిజేసితివి! జగన్మాత యగు నాసీత నపహరించిన మన కెట్లు జయమగును! ఇప్పటికైనను యభిమానమునువీడి, వై దేహి నిచ్చి యాపరాత్పరుని సేవింపుము. లేని యెడల నీకు శుభములుచే కూఱవు. రాముని మనుజుడనియు, హనుమంతుని సేవకుడనియు నెన్నడును దలంపకుము. వారిని నీవు జయింపజాలవు. తగనిపనిని జేసితివి. ముందుగనే నన్ను మేల్కొలిపిన నింతవఱకు రాకుండగ జేసెడివాడను. ఆరాముని శివ బ్రహ్మాదులు సేవింపుచుందురు. అట్టివానితో విరోధమును దెచ్చికొంటివి. తొల్లి నారదమహర్షి నాకు భగవంతుడు రాము డనుపేర నవతరించి ముక్తి నొసంగు నని చెప్పియుండెను. సమయము చిక్కినందున నేనావిషయమును నీకు జెప్పి యుండలేదు. కానిమ్ము. కానున్నది కాకతప్పదుగదా! నేనామేఘశ్యాముని, పుండరీకాక్షుని ధ్యానించెదనని కనుల మూసుకుని యానందపరవశుడై యుండ నంతలో రావణు డొకకోటిఘటముల సురయునంతకు దగిన మహిషాదిమాంస ములను సమకూర్చి యతని కాహారమును సిద్ధముచేయించెను. అత డామాంస మును భక్షించి యాసురనుద్రావి పిడుగువలె గర్జించుచు కోటను దాటి బయలు దేఱెను. అతడు పరివారము లేకుండ వచ్చుటను జూచి విభీషణు డెదురేగి యతని పాదములపై బడి తన పేరును జెప్ప నాత డావిభీషణుని లేవనెత్తి, కౌగలించుకుని, నీవు రామభక్తుడవని విని మిగుల సంతసించితిని. వర్ధిల్లు మన నంత విభీషణు డిట్లనియె. అన్నా! నేను రావణున కెంతేని విధేయుడనై యతనికి క్షేమంకరములై నమాటల జెప్పితిని. ఆమాటలనుమంచివనిదలంపక నన్ను కాలితోదన్ని వెడలగొట్ట నంతదిక్కులేనివాడనై రాముని శరణుజొచ్చితిని. అతడు దీనదయాళువుకాన నన్ననుగ్రహించెను. అన విని తమ్ముడా! రావణు నకు కాలమాసన్నమయినది. కాన మంచిమాటలాతనిచెవికెక్కవు. కానిమ్ము. నీవు ధన్యుడవు. కులభూషణుడవు. నీవైనను రాముని సేవించి సుఖింపుము. నాకును కాలమాసన్నమయినది. రాజాజ్ఞనుబట్టి శత్రుమిత్రభేదములేక రణరంగ

మున విహరించి చేతనయినంతవఱకు శత్రువుల బరిమార్చి తుదకు రాముని చే ముక్తిసందెదను. నీవిక బొమ్మన నన్నయానతిని విభీషణుడు రాముని చెంత కరిగెను.

కుంభకర్ణని యుద్ధము

వానరులాకుంభకర్ణని జూచి కిలకిలారావములజేయుచు, వృక్షములను గండశిలలను బెఱికి యాతనిపై విసరుచుండిరి. వారు విసరిన గండశిలలు మత్తేభముమీదబడిన పండ్లవలె నిష్ఫలములగుచుండెను. అతడేమియు చలించుటలేదు. అప్పుడు హనుమంతుడుగ్రుడై పిడికిటబొడిచెను. దాన కుంభకర్ణుడు చలించి నేలపడి లేచి మహోద్రేకముతో నాహనుమంతునిగొట్టి నాదెబ్బకు తాళలేక హనుమ నేలపై బడెను. పిమ్మట నమితబలవంతుడగు కుంభకర్ణుడు అనేకవానరవీరులను బట్టుకొని నేలపై గొట్టిచంపుచుండ నాతనిజూచి మిగిలిన వానరులు భయమంది నాలుగుదిక్కులకు పారిపోవుచుండిరి కాని వానినెదిర్చి ఎవరును పోరాడజాలరైరి. అంత నంగదాదివీరుల నిర్జించి సుగ్రీవునెత్తికొని పోవుచుండెను. పార్వతీ! చూచితివిగదా! భగవద్విలాసమును. పాములతో గరుడుడు చెలగాటమునాడునట్లు వానరరాక్షసానీకములచే యుద్ధమునుజేయుం చుచున్నాడు. ఆతడు యుద్ధప్రియుడై యుండనోపు. ఎవడు సంకల్పమాత్రమున సకలప్రపంచమును రూపుమాపునో, అట్టివాడు ప్రపంచమును బవిత్రమును జేయుటకును, దనకీర్తిని దిగంతవిశ్రాంతముగ జేయుటకు నిట్లింతసావధానముగ యుద్ధమునుజేయుచున్నాడు. ఎవని భ్రుకుటీవిలాసమున ననేకబ్రహ్మాండముల కుత్పత్తిస్థితిలయములు క్షణములో సిద్ధించుచుండునో, అట్టిరామచంద్రుడు, తనకీర్తిని చారిత్రకముగ గానముచేయుభక్తజనమునుద్ధరించుటకిట్లు యుద్ధమును జేయుచున్నాడు. లేనిచో వానికింతయుద్ధమేల? పిమ్మట హనుమంతుడు మూర్ఛనుదేరి సుగ్రీవుని వెదకుచుండ గుంభకర్ణుని వక్షమున ద్రవేలాడుచు జచ్చినవానివలె నటించుచున్న యాతనిని మరణించెననియెంచి యశ్రద్ధగాన్నున్న కుంభకర్ణుని కర్ణనాసికలగొఱికి సుగ్రీవుడు గగనమునకు లంఘింపబోవ నతనిని బట్టి కుంభకర్ణుడు నేలపై బడగొట్టెను. అంత సుగ్రీవుడు కొంతవడికిలేచి హుంక రించి కుంభకర్ణునిపై బడి యాతనినిగొట్టి రాముని సన్నిధికేగెను. సుగ్రీవుడు చేసిన పనికి క్రోధవిషాదముల నంది కర్ణనాసికా రహితుడై యుద్ధభూమి

యందు సంచరించుచుండిన యాకుంభకర్ణునిజూచి వానరులు, కిలకిలధ్వానముల జేయుచు వృక్షములను గండశిలల నాతనిపై బడవేయుచుండిరి. కృద్ధుడైన యాకుంభకర్ణుడు కాలునివలె నారణరంగమున సంచరించుచు, కోట్లకొలది వాన రులపట్టుకొన వారందరునాతని నాసికాశ్రవణ రంధ్రములలోనికేగి తమప్రాణ ముల రక్షించుకొనుచుండిరి. కాని యాపిరాడక కొట్టుకొనుచుండిరి. కొంద ఱాతనిచేతులలో నలిగిపోవుచుండిరి. ముక్కు-చెవులలో దూరినవానరులెట్లో తప్పించుకొని పాఱిపోవుచుండిరి. కొందరునశించిరి. అట్లుయుద్ధభూమి భయం కరముగనుండెను. అపుడు కుంభకర్ణుడు వానరుల నిశ్శేషమొనరించెనని తలచి రాక్షసులు పఱుగుపఱుగున వచ్చుచుండిరి. తననేన చెదరిపోవుటజూచి, రామ చంద్రుడు, లక్ష్మణవిభీషణుల జూచి, సోదరులారా! మనసేనను నిలువరింపుడు నేనాశత్రువుల మదమడచెదనన వారట్లుచేయ, రామచంద్రుడు యుద్ధసన్నద్ధుడై ధనుష్టంకారమొనరింప నది శత్రుగర్భనిర్భేద మగుచుండెను. తోడనే రాముడు వారిపై బాణవర్షమునుగురియింప నవికాలసర్పములవలె పగరదాకి చీల్చుచుం డెను. అంతనారాక్షస సైన్యమంతయు కబంధబాహుళమయ్యెను. ప్రాణావ శిష్టులుకొందరు కదలలేకమూల్గుచుండిరి. కొందఱుపాఱిపోవుచుండిరి. మఱికొం దఱు పట్టుడు, చంపుడనుచు ముందునకు వచ్చుచుండిరి. రామబాణముల రుచి జూచినవారందఱు మఱలనాబాణముల కెదుర నిలువజాలకుండిరి. ఇట్లాబాణ ములారాక్షసులదునిమి మఱలరామునిదూణీరమున ప్రవేశించుచుండెను. రాక్ష సులు పొలియుటనుజూచి కుంభకర్ణుడుగ్రుడై గర్జించుచు వృక్షములను పర్వత ముల నూడబెఱికి వానరులపై బడవేయుచుండ వానినన్నిటిని రాముడుతన బాణములచే గొట్టివేయుచుండెను. అంతరాముడు కృద్ధుడై బాణవర్షమును గురియ నాబాణములు కుంభకర్ణునిమేననాటి, మేఘమునందలి మెఱుపులవలె ప్రకాశించుచుండెను. అతనికాయమునుండి రక్తము సెలయేఱులవలె ప్రవ హించుచుండెను. ఇట్లు రామబాణచ్ఛన్నడగు కుంభకర్ణుని జూచుటకు వాన రులు కుప్పలుకుప్పలుగవచ్చి వానివికృతకాయమును జూచి భయకంపితులై పాఱిపోవుచుండిరి. అంత కుంభకర్ణుడులేచి గర్జించుచు వానరసేననుదునుమాడ జొచ్చెను. వానిబారికోర్వజాలక వానరులు, దుర్భిక్షమునందలి ప్రజలవలె తహతహపడుచు, జగదేకవీరా! రామా! రమ్మా, రక్షింపుమన నా వాన

రుల దీనాలాపముల నాలకించి యాకరుణామయుడు సేనాముఖమునకు వచ్చి తీవ్రమగు బాణముచే నతనిని గొట్టెను. అంతనారాక్షసుడు దుస్సహామగు నా రామప్రహారమునకు నొచ్చి, మిగుల కృద్ధుడై, పరుగిడుచుండ భూమికంపింప సాగెను. అట్లుపరుగిడి రెండుచేతులతో రెండుకొండలనూడబెఱికి దెచ్చుచుండ రాముడతని రెండుబాహువులను ఖండించెను. అంతనారాక్షసుడు రెక్కలు నఱుకబడిన మందరమువలె నొప్పుచు ప్రళయాంతకునివలె కృద్ధుడై రాముని వైపు బరుగిడుచుండెను. ఆతనిగర్జనముల కాకసమునందుండిన దేవతలు భయ ముచేనాహాకారముల నొనరించుచుండిరి. అప్పుడు రామచంద్రుడు క్రూరనారాచ ముల నాతనినొంచెనుకాని యావీరుడు చలించుటలేదు. రామబాణముల నోర్చిన యాతనిశరీరము వజ్రమయముగానోవు. శరవిద్ధసకలాంగుడగు నాకుంభ కర్ణుడు ప్రళయాంతకునివలె రామునివైపు పరుగిడుచుండ నారాముడుగ్రుడై తీవ్రనారాచమున యాతనితలను దుంచెను.

కుంభకర్ణుడు చనిపోవుట

రామబాణనికృత్తమగు వానిశిరము రావణునిసమీపమునబడ నతడది జూచి వికలమనస్కుడై, మణిరహితసర్పమువలె దుఃఖింపసాగెను. అట్లు శిరో విరహితమైన యాకబంధము నఱుదిక్కుల పరుగిడుచుండ నామొండెమును రాముడు ఖండించి నేలపాలొనర్చెను. పర్వతాకారమగు నాశరీరము నేలపడు నపుడటనున్న వృక్షములు నుగ్గైపోయెను. ఇట్లు కుంభకర్ణు డసువులబాసిన తోడనే యాతనితేజము రామునిలో గలిసిపోయెను. దానినిజూచి దేవతలా శ్చర్యమునందుచు నాతనియుత్కృష్టమును గొనియాడుచు, దుందుభుల మ్రోయిం చుచు, పుష్పవర్షమును గురియింపుచు జయజయధ్వానముల నొనరింపసాగిరి. నారదుడు గగనమునుండి నాట్యమును జేయుచు, పురుషాకృతినిబడసిన వీరరసము వలెనున్న రామచంద్రునిజూచి సంతసించుచు, మిగిలిన ఖలరాక్షస సంహార మును త్వరలో గావింపుమని బలికి వెడలిపోయెను. అప్పుడాసమరాంగణమున స్వేదబిందుసమలంకృత సుందరవదనారవిందుడును, ధనుష్పాణియు, వానర సేనాపరివృతుడునై, వీరవిహారమొనరించు రాముని వర్ణింపనేరికిని తరముగాదు. పార్వతీ! దుష్టరాక్షసులకు సంయితము తన పదవినిచ్చు రామచంద్రుడు భక్త

లకు తన స్థానము నొసంగకుండునా! అది తెలియక మందమతులగు వారాభగ వంతుని భజింపజాలకున్నారు. అంత భానుడస్తమింప నుభయపక్షములవారును తమతమ నెలవులకు జనిరి. యుద్ధపరిశ్రాంతమగు వానరసేనకు రామచంద్రుని కృపావలోకనమున క్షణములో శ్రాంతమానశించెను.

ఇంద్రజిద్యుద్ధము

అట రావణుడు దనవీరులు చాలవఱకు నశించుటచే దనభాగ్యము క్షీణించినదని తలంచుచు దీర్ఘమగు నాలోచనలోమునిగియుండెను, మహావీరులగు రాక్షసశార్దూలములింతలో నిట్లయిరని వారి భార్యలు విలపింపజొచ్చిరి. అంత నింద్రజిత్తా రావణుని సమీపమునకేగి బహుభంగుల నాతనినోదార్చి యాతనికి శౌర్యమును పురికొల్పుచు, తండ్రీ! శత్రు నాపరాక్రమమును జూచెదవుకాక! క్షణములో శత్రువుల దునుమాడెదను. నీవు వగవకుము. అని మాటాడుచుండగనే ప్రాతఃకాలమగుటయు, భానుమంతుడుదయాద్రి నలంకరింపగనె, వానరసేనలన్నియు మఱల కోటను ముట్టడింప మొదలిడెను. రాక్షసవీరులు శస్త్రాస్త్రముల ధరించి వారలతో దలపడుచుండిరి. పార్వతీ! అప్పటి వారలయుద్ధము వర్ణనాతీతము. మేఘనాదుడు మాయాకల్పిత మగు నరదము నెక్కి యాకసమున కెగసి భయంకరమగు సింహనాదములజేయ, వానరులు బెదరిపోవుచుండిరి. వారట్లు బెదురుటగని స్వాతీగత శుక్రునివలె బాణవర్షమును గురియింపుచు మేఘనాదుడు తన పరాక్రమమును జూపుచు విజృంభింపసాగెను. పట్టుడు, కొట్టుడు, చంపుడను శబ్దములు వానరులకు వినవచ్చుచుండెను. కాని ఎవరుకొట్టుచున్నది వారికి తెలియకుండెను. వానరులు వృక్షములను శిలలను గ్రహించి గగనమున కెగరుచుండిరేకాని శత్రువును గానక మఱలివచ్చుచుండిరి. ఆవీరుడు బాణవర్షమును గురియింపుచు వానరులు నిలుచుటకు తావులేకుండ జేయుచుండెను. మందరము మున్నగు మహాద్రులింద్రునికి భయమంది నట్లాతని పరాక్రమమునకు వానరవీరులు భయమందుచుండిరి. మేఘనాదుని పరాక్రమమున కంగదాది మహావీరులే భయమందుచుండ నికమిగిలినవారినిజెప్పనేల? సుగ్రీవ విభీషణ లక్ష్మణులను గూడ బాణవర్షముచే నొప్పించుచుండెను.

నాగపాశబంధము

అనంతరము శ్రీరామచంద్రుని నాగపాశబద్ధునిగజేయ నాయస్త్రమునకు, సర్వబంధ వినిర్మక్తుడు, చిదానందఘనుడునగు నారామచంద్రుడు మాయామానుషరూపధారియై, విలాసమునకు రణకేళిసలుపుచు బద్ధునివలె నుండెను. సకల బంధములను ఛేదించెడి వానికేబంధమేమిలెక్క ? అయిననట్లు బద్ధుడైనరాముని జూచి వానరులు భయమందుచుండిరి. గరుత్మంతుడా ! ఎవనినిసేవించిన సంకల భవబంధములు నశించునో అట్టి పరాత్పరునకు బంధమెట్లుకలుగును ? కుతర్కముల వీడి యీరామచరితమును నిశ్చలమనస్కులై గానముచేయువారికి సకల బంధములు నశించును. కాననేమాత్రము జ్ఞానముకలిగినను విషయాంతరముల వీడి రామకథార్ణవమునమునిగి ముక్తినందుదురు. అనుచు కాకభశుండు చెప్పి యుండెను. ఓపార్వతీ ! ఇట్లామేఘనాదుడు రామచంద్రునియాతనిసేనలనుచీకాకు పఱుచుచుండ జాంబవంతుడు కృద్ధుడై, ఓరీ రాక్షసాధమా ! మాయలపన్ను చుంటివా ! నిలువుము, నిన్నేమిచేయుదునో చూచెదుగాక ! యన నాతడలిగి, ఓరీ ! వృద్ధుడవని నిన్ను విడిచితిని. నీవు నన్నేమిచేయగలవు ! కాచికొనుమనుచు నొకశూలమును ప్రయోగింప నతడద్దాని నొడిసిబట్టి మేఘనాదుని యురమున గొట్టెను. అంత మేఘనాదు డాదెబ్బలను సహింపజాలక నేలబడెను. వెంటనే వానిని పాదములబట్టి ఓరీమూర్ఖా ! జూడు మీముదుసలి బలము నని గిట్టిన ద్రిప్పి లంకవైపు విసరివేసెను. ఆదెబ్బకు వాడుచావక వరప్రభావముచే బ్రతికి పోయెను.

నాగపాశవిముక్తి

రాముడట్లు సేనాసహితముగ నాగపాశబద్ధుడగుటను జూచి నారదుడు గరుడుని బంప నాతడువచ్చి యానాగములనిర్జించి, రాహుముక్తుడగు చంద్రుని వలె, నాగపాశముక్తుడగు రామచంద్రునికి నమస్కరించి తన స్థానమున కరిగెను. వానరులందఱు సంతసించుచు, మేఘనాదుడు చేసిన పనికాతనిపై మిగుల కోపించి పాషాణవర్షమును గురియింపగా, రాక్షసులా దాడికి సహింప జాలక పరుగిడసాగిరి. అంత నింద్రజిత్తు మూర్ఛదేరి జాంబవంతునిపరాక్రమమున కచ్చెరువందుచు, దానజేయుడగుట కొక యాగమును జేయబూని రహస్యముగ

నొక గుహయందు బ్రవేశించెను. అంతనావిషయమును గ్రహించి విభీషణుడు రామునితోనిట్లనియె. ప్రభూ ! మేఘనాదుడు తానజేయుడగుట కొక యాగమును దలపెట్టెను. ఆయాగము సిద్ధించిన వాడజేయుడగును. కాననాయాగమును సాగకుండనట్లు చేయవలయునన నావిభీషణుని మెచ్చుకొని, యంగదుని బిలిచి, అంగదా ! మీరులక్ష్మణునితో గలిసి యామేఘనాదు డొనరించు యాగమును ధ్వంసము చేయవలయును. అనిచెప్పి లక్ష్మణునిజూచి, తమ్ముడా ! నీవీవానరవీరులతోబోయి జగత్కంటకుడగు నామేఘనాదుని మర్దించి, దేవతలను సంతసింపజేయుము. వాడు మిక్కిలిమాయావి కాన మిక్కిలిజాగరూకుడవై మెలగుము. వాడు సామాన్యుడుకాడని, సుగ్రీవాదులజూచి, మీరును జాగరూకులై మెలగుడు. మీమీమాయాయుధముల ధరించి లక్ష్మణు నేమరక జూచుచుండుడని రామచంద్రుడన వారందఱు రామాజ్ఞను శిరమున ధరించి యమితోత్సాహమున బయలుదేరిరి.

లక్ష్మణ మేఘనాదుల యుద్ధము

అప్పుడు లక్ష్మణుడు ధనుష్పాణియై కపివీరులు వినుచుండ నిట్లనియె. నేను నిజమగురామభక్తుడనేని నేడామేఘనాదుని చంపక మఱలువాడనుగాను. నాకు శంకరుడు దోడ్పడుగాత మని రామచంద్రునకు నమస్కరించి, వానరవీరులవెంటనిడుకొని బయలుదేరెను. అప్పుడింద్రజిత్తు యాగమును జేయుచు మహిషరుధిరముతో నగ్నిని ప్రేల్చుచుండెను. వానరులప్పుడాతని యాగమును భంజింపనెంచి ఎంతచీకాకుపఱచిన నాతడుమాత్రము చలించుటలేదు. తాబూనినకార్యమును తుదముట్టింపదలచి వానరచేష్టితములను వారాడుదుర్భాషలను సహించుచుండెను. అప్పుడంగదుడు వానిని కాలితోదన్ని జుట్టునుబట్టి ఈడ్వసాగెను. అప్పుడు మేఘనాదు డాయవమానమును సహింపక శూలమునూని వానరులను బొడువమొదలిడెను. అప్పుడావానరులు లక్ష్మణుని మాటునజొచ్చిరి. అంతనారాక్షసుడు లక్ష్మణునిమీదకు వచ్చుచుండ నాతనికంగదుడెదురయ్యెను. అప్పుడారాక్షసు డంగదుని నేలబడగొట్టి త్రిశూలమును లక్ష్మణునిపైకి విసరెను. లక్ష్మణు డాత్రిశూలమును ఖండించి, యాతనిని శరజాలమున గప్పెను. అంతనంగదుడులేచి హనుమంతునిసహాయమున నారాక్షసునితో తల

బడెనుకాని వీరినారాక్షసుడు సరకుగొనకుండెను. అంతలక్ష్మణుడది సహింపక వానిపై తీవ్రనారాచముల నిగుడింప నాతడంతర్హితుడై మాయాయుద్ధము నొనర్చుచు నొకపరిదృశ్యుడగుచు నొకపరియదృశ్యుడగుచు పోరుచుండుటజూచి వానరులు భయమందసాగిరి.

ఇంద్రజిద్వధ

అప్పుడు లక్ష్మణుడు కృద్ధుడై, వీని నిక సహింపరాదు. ఇంతదనుక విలాసముగ బోరితిని. అని రామచంద్రుని స్మరించి ధనువున తీవ్రనారాచమును సంధించి, ఏను నిజమగురామభక్తుడనేని యీబాణముతో నీతడు సమయుగాత మని పలుకుచు నాప్రదరమును విడిచెను. అప్పు డాబాణము కాలసర్పమువలె నాతనివక్షమును పెకలించి, యాతనిమాయలనన్నిటిని రూపుమాపెను. అప్పు డావీరుడు నిజరూపముతో రామునిస్మరించుచు నసువులబాసెను.

అప్పుడంగదాదు లతని సమీపించిచూచి, ఏమివీనిదర్పము ? ఇట్టిమహా వీరునెన్నడును చూచియెఱుగము. మేఘనాదా ! నిన్నుగన్నతల్లి ఎంతధన్య ! అనిపొగడుచు నాతని కళేబరమును లంకాద్వారమునందిడి మగిడివచ్చిరి. అప్పు డాకసమున దేవతలా మేఘనాదుని మృతిని కన్నారజూచి, లక్ష్మణా ! నీవీతని దునుమాడి లోకములకు మహోపకార మొనరించితిని. నీమేలు మఱువరానిదని కొనియాడుచు దుందుభుల మ్రోయించుచు పువ్వులవానను గురియించిరి. అట్లింద్రజిత్తును సమయించి, జయలక్ష్మితో శోభిల్లుచు లక్ష్మణుడు రామునికడ కేగెను. హసన్ముఖుడగు తమ్మునిజూచి రాము డాతని కౌగలించుకొని సంతసింపు చుండ నాలోన విభీషణుడు వచ్చి; సమరవృత్తాంతమును సవిస్తరముగ వినిపిం చెను. మేఘనాదుని బాణములచే పూరింపబడిన లక్ష్మణునిశరీర మొకయమ్మల పొదివలెనుండెను. అట్లు యుద్ధపరిశ్రాంతుడగు తమ్ముని, కరుణాతరంగితాపాంగ ములజూచి, రామచంద్రుడు కరస్పర్శన మొనరింప నాశరములన్నియు నేల బడెను. అప్పుడాతనిశ్రమపోయి మఱల దృఢగాత్రుడై సోత్సాహముగనుండెను. పిమ్మట లక్ష్మణుడు బాణాగ్రమునందిడికొని తాదెచ్చిన మేఘనాదునిశిరము నన్న చరణ సమీపమునందుంచెను. అప్పుడు రామచంద్రుడా శిరమును సకౌతుకముగ జూచి దీనిని భద్రపరుపుడన సుగ్రీవుడా శిరమును వానరవీరులచే నెత్తించి తగు

చోటున భద్రపఱచెను. పిమ్మట రామచంద్రుడు తనకృపామయమగు దృష్టిని వానరసేనలందు బరగింప, వారందఱు విగతశ్రములై సోల్లాసముగ జయజయ ధ్వానములొనరించుచుండిరి. పార్వతీ! జూచితివా! రామచంద్రుని మహిమాతిశయమును? ఇంకొకవిచిత్రమగు గాథను వినుము.

సులోచనాచరిత్రము

యుద్ధసమయమున లక్ష్మణుని బాణముచే దెగి ఇంద్రజిత్తుని బాహువు పక్షివలెనెగిరి యాతని సౌధప్రాంగణమునబడెను. ఇంద్రజిత్తుసిభార్య సులోచన. ఆమె పతివ్రతయగు నాగకన్య. ఆమెతండ్రి వాసుకి. అతడు తనకూతున కెన్నేని మణుల నాభరణములను కానుకగ నిచ్చియుండెను. ఆమెమిక్కిలిచక్కనిది. ఆమె నేత్రశోభవర్ణనాతీతము. కావుననే యామె కాపేరు వచ్చినది. ఆమె రత్నఖచిత సింహాసనమున గూరుచుండి పరిచారికలు వివిధోపచారముల జేయుచుండ నాసమయమున కల్పశాఖవలె నింద్రజిత్తుని బాహు వామెముందు బడియెను. రుధిరమును స్రవించుచున్న యాబాహువును సమీపించి యామె సఖులుచూచి యాశ్చర్యచకితమానసలై, ఏమి ఘోరము! ఈదారుణాహవమునందెందఱిట్లు మడియుచుండిరో! కల్పశాఖకూలినది. ఇక సర్వనాశము కావలసినదే. అని దురపిల్లుచున్న యాపరిచారికలవలన నాతనివృత్తాంతమును విని ఖిన్నలై యా బాహువును సమీపించి చూచి గుర్తించి, మూర్ఛిల్లి కొంతవడికి దెలిసి, ముల్లోకముల నప్రతిరథునిగ జరించిన మహావీరున కిట్టి యాపదవాటిల్లినది. విధినెవ్వరును గడువజాలరుగదా! అనిదురపిల్లుచు, నట్టిమహావీరున కిట్టిగతి ఎట్లుసంభవించెను? నేనాతనిపరాక్రమమునెఱుగుదును. ఇది యాతనిభుజముకాదేమో యనిశంకించి, మఱలమఱల పరీక్షించి, తుదకు నిర్ణయించి, పదునాలుగువత్సరములు నిద్రాహారములమాని బ్రహ్మచర్యమూనిన మహానుభావుడెవ్వడో, అట్టివానిచేతగాని నాప్రాణవల్లభుడు నిర్జింపబడడుగదా యనితలంచుచు, నాబాహువుతో నిట్లనియె. ఓ బాహుదండమా! నీవేనాసందియమును బాపవలయును. నీవునిక్కముగ నాప్రాణవల్లభుని బాహుదండమవై తేని నాకొక సందేశమునుప్రాసి నాసందియమును వాపుమన నంత నాబాహువు చలించుచు, నామణికుట్టిమ మందు సఖీసమర్పితమగు కుంచికనుబూని, స్రవించుచున్న రుధిరముతో నిట్లు

వ్రాయ మొదలిడెను. ప్రేయసీ! రాముడాద్యంతరహితుడు. సర్వాంతర్యామి. సృష్టిస్థితిసంహారకర్త. వర్ణనాతీతుడు. అతనిని శారదాశంకరులు సదాభజించుచుందురు. భక్తహితార్థమాతడనేకరూపముల నవతరించుచుండును. ఆతని యనుజుడైన లక్ష్మణుడు భూభారమునంతను వహించెడి శేషుడు. వారిముందు మనపరాక్రమము సముద్రముచెంగట గోష్పదమువంటిది. వేదములేవారిని కొని యాడజాలవుగదా! నేనెంతపాటిదానను. నాశిరము శ్రీరాముని సన్నిధిని గలదు. అనిలిఖింప చదువుకొని సులోచన శోకవివశమానసయై, పతిగుణముల మాటిమాటికుగ్గడించుచు, నింద్రునిగూడ నిర్జించిన యీ బాహువున కిట్టి గతి పట్టినదా! యనివిలపించుచు, రణోత్కర్షియు, నాభ్యారుజఘనస్పర్శియు, నీవీ విస్రంసకమునగు నీబాహువును నేనెట్లుమఱతునని విలపించుచున్న యామెను సఖు లూరడించుచున్నను శోకాగ్నిదగ్ధయై, యున్మాదినివలె లేచుచు పడుచు నుండెడియామె దురవస్థనుజూచి సఖులోర్వజాలక విలపించుచుండిరి.

అంతనొకతె యామెనుసమీపించి, అమ్మా! విచారించిన లాభ మేమి? నీవెఱుగని దేమికలదు? మృత్యువు సహజసిద్ధము. ఏరికిని దప్పినది కాదు. ప్రాజ్ఞమానసులెన్నడును మృత్యువునకు దురపిల్లరు. నీభర్తధన్యుడు. సకలభోగముల ననుభవించి, దిగంతవిశ్రాంతమగు కీర్తినిగడించి, రణరంగమున లక్ష్మణునితోపోరి సద్గతినందిన మహావీరుడు. అతనికై ఇట్లుదురపిల్లుట నీవంటి ధీరస్వాంతకు లక్షణముకాదని యుచితరీతి ననునయింప నామె కొంతదేరి సఖీ! నీమాటలునిక్కువము. కాని దైవము నాకీదుర్గతిని గల్పించునని యెన్నడు నను కొనియుండలేదు. నా జీవితమంతయు శోకమయమైపోయినది. రామలక్ష్మణులు తప్పకజయమందెదరు. కీర్తికాంత వారలవరింపనున్నది. విభీషణుడు మనరాక్షసవంశమునకు కుఠారమైనాడు. కాదుకాదు. నామామయే మనవంశ నాశనమునకు కారణము. ఇకనుండిదేవతలు నిశ్శంకముగ సంచరింపగలరు. పుల స్త్యవంశమింతటితో నంతరించును. రవిచంద్రులు ప్రకాశింతురు. పావకు డికనుండి తేజోవంతుడుకాగలడు. వాయువుస్వేచ్ఛగావీచును. ఇంద్రుడికనిష్కం టకముగ స్వర్గమునుపాలింపగలడు. దిక్పాలకులు నేటికిమనకోరికలీడేరెనని కులు కుచు తమతమపదవుల స్వీకరింతురు. బ్రాహ్మణులు జన్నముల నాచరింప, దేవతలు నిర్భయముగ హవిర్భాగముల స్వీకరింతురు, నేడు వారలకు

సంతసింపదగినకాలము నచ్చినది. ఏనాటి కేమివాటిల్లునో తెలియరాదనుచు నాసులోచన మందిరాభ్యంతరమునకేగి తన యైశ్వర్యమునంతను కన్నులార దిలకింపసాగెను. ఆమె సంపదకు నింద్రునిసంపద దిగదుడుపు. అప్పుడామె ఎంత యైశ్వర్యమున్నను వనితలకు పతితో సమానమగునది వేఱొండులేదని నిశ్చయించుచు, భర్తృవిహీనలకు తనువేభారమగునపు డీయైశ్వర్య మెందులకని దలంచి, యామె తన యైశ్వర్యమునంతను అచటివారలకు బంచిపెట్టి, యచటి వారినెల్లర సంతసపఱచి, మణిఖచితమగు బంగారు పాలకిని దెప్పించి, అందు తన ప్రాణనాథుస బాహువునునిచి, దేవదుర్లభభోగభూయిష్ఠంబగు నామందిరమును, విరాగి విషయముల వీడినట్లు వీడి, పతిపదంబుల మనమునం దిడికొని తాను నాపల్లకినెక్కి కూరుచుండెను. పాపమాసులోచన స్వర్ణపంజరములందు బెంచి మాటలనేర్పినశుకశారికానికర మామెయట్లు వెడలుటగాంచి, సులోచనా! మమ్మేలవీడి ఎటకేగుచుంటివని దీనముగ బలుకదొడగెను. ఆపక్షుల యార్తరవమున కామెహృదయము చెదరుచుండెను. పక్షులే ఇంతజాలిగొలుపునపుడు పురజనులమాట వేఱజెప్పనేల? ఇట్లు పౌరబంధు పరివృతయై యామె క్రమముగ రావణునికోటద్వారముకడనాగెను. అపుడు శత్రుసేనలువచ్చినవి, యస్త్ర శస్త్రములసిద్ధముచేయుడని రావణుడు పలుక నచటియోధులు, నడుములబిగించి, ధనుర్బాణముల ధరించి, సకలాయుధహస్తులై, పట్టుడు, చంపుడు, పొడువుడను వీరాలాపములబలుకుచు ద్వారముకడకేతేర, బందుగులతోగూడిన పాలకినిజూచి, అందు సులోచనను దిలకించి, లజ్జితులై జోహారుల నర్పించిరి. అంత ద్వారపాలురుపోయి సులోచనరాకను రావణున కెఱిగింప, వెంటనేలోనికి రాననుమతింప నామె లోనికేగి, యవనతవదనయై రావణునకు నమస్కరించి, భర్తృబాహువు నాతనియెడుటనుంచి, జాలిగొల్ప నిట్లనియె.

మామా! మీసమక్షమునసే నాకీదుస్థితి వచ్చినది. నాసుఖములు నేల గలిసినవి. రుధిరమును స్రవించుచున్న యీబాహువు గగనతలమునుండి వచ్చి, నాక్రమోల పడినది. అంత నేను భయవిస్మయములనంది, శంకించుచుండ నీబాహువు చలించినది. వెంటనే దానియందొకలేఖ మమర్చితిని. అంత నీబాహువు రామలక్ష్మణుల వృత్తాంతము నంతను వారి పరాక్రమమును లిఖించినది. తోడనే నేనాశ్చర్యమందుచు నేనొకమోసగానిని ప్రేమించితిననియు, వారు

మహానుభావులనియు గ్రహించితిని. నాపతి శిరము శ్రీరామునివద్ద నున్నది. దానిని తాము నాకొసంగిన నేనద్దానితో సహగమన మొనరింతునను కోడలి మాటలు పిడుగులవలె చెవులసోక నింక రాముని జయింపగల ననుయాసనువీడి, పైకి గాంభీర్యము చెడకుండ నిట్లనియె. సుదతీ! నిరుపమాన పరాక్రమనిధినగు నాపలుకు లాలింపుము. నేనిపుడు రణరంగమునకేగి, రామలక్ష్మణ సుగ్రీవ విభీషణాదులనందఱి దునుమాడి, వారి తలతోపాటు నీపతిశిరమును దెచ్చెద. ఇంతవఱకు కుంభకర్ణ మేఘనాదులు బలవంతులనినమ్మి వారిపై కార్యభారము నంతయునుంచి నేనింటనుండుటచే నిట్టిదురవస్థ వాటిల్లినది. మనవాఁడు నరవానరులచే మడసిరని విని చాల లజ్జించుచుంటిని. మనకు దశ మారినట్లున్నది. ఎవ్వడైనను కర్మఫలము ననుభవింపక తప్పదు. కాకున్న దేవదానవవిరావులు మేరుమందరతుల్యులు నగు రాక్షసవీరులు, నరవానరులచే మడియుటెట్లు? కానిమ్ము. కొంచమోపికబట్టితేని నాపరాక్రమమును జూడగలవు. అనాయాసముగ మనశత్రువుల తలలదరిగి నీచెంగటబడవేయుదును. అను నాతనిమాట లకు సులోచన లోనకనలియు, మెల్లన నాతనితోనిట్లనియె. మామా! ఆ నరవానరుల పరాక్రమమునుజూచియు వారలనిట్లు నిరసించుచుంటివేల! సముద్రమును దాటివచ్చి మనలంకనంతను దహించినను వానిని జులకనజేయుచుంటివి. మహావీరులగు కుంభకర్ణాదులు, సోదరసహితముగ నాభర్తయు, నెందరేని రాక్షసవీరులు మడసిరి. మోహాంధులై రాజ్యకాంక్షచే నిట్లనుచుంటిరే కాని మీరుమాత్ర మామహావీరుల గెలుచుటెట్లు? గెలిచినను నాకేమిలాభము? పతిలేనిసుఖములు నరకతుల్యములు గద! అని ముందుకార్యమునువిడిచి యిట జాగుసేయుట పాపము. సకలబంధువులు నశించినను యీతడు తనపట్టు విడువడు. అనితలంచి, ఆయనయనుమతింగొని యత్తకడకుబోయి, శోకవికలస్వాంతయై యామెపాదములబడి కన్నీరుగార్చుచు నంతయు విన్నవించెను. అట్లు విలపించుచున్న కోడలినిజూచుచు, పుత్రశోకమున గుందుచు, పుత్రునిబాహువు తెగి వానిసుంగిటబడుట, దానిచే వర్ణింపబడిన రామలక్ష్మణుల మహిమాతిశయమును, భర్తయొక్క యవివేకముతోగూడిన పట్టుదలను, కొమరుని తల రామసన్నిధినుండుట మున్నగువానిని దలపోయుచు మండోదరి ఇట్లు తలపోయసాగెను.

తొల్లి నారదుడుచెప్పిన ట్లన్నియు జరుగుచున్నవి. ఆతనిపలుకు లెన్న డును వమ్మ్మకావు. మనము మోహాంధులమై వానినింతవఱకు లెక్కచేయకుం టిమి. జఱుగనున్నదాని నంతను నారదు డిట్లుచెప్పియేయుండెను. మూఢభావ ముచే దశకంఠుడు ప్రాణములనైన విడుచునుగాని తన పట్టుదలనుమాత్రము వీడడు. అన్యాయముగ సోదరునితో విరోధమునండెను. దాన లంక నశించెను. వానరులు సీతాశోకమునుబాపి, రాజ్యమును చిందరవందర జేయుదురు. మణు లను వస్త్రాభరణములను వానరు లనుభవింతురు. పుష్పకము మనకువక్కదు. విభీషణుడు లంకను పాలించును. సుఖదుఃఖములు ప్రాక్తనకర్మాయత్తములు. ఎంతటిప్రాజ్ఞుడైనను కర్మానుసారముగ ప్రవర్తిల్లుచుండును. రావణుని యవి నీతివలన లంకకు జేటువాటిల్లినది. అట్లామునివాక్యముల దలపోయుచు కోడ లితోనిట్లనియె. అమ్మా! నీమామ యవినీతిహెచ్చినకొలది లంకాప్రాభ వము క్షీణింపసాగెను. నేను దీనినిగ్రహించి యెంతజెప్పినను ఆతడు వినుటలేదు. ఇకమనము ముందుపనిని జూచుకొనుట మంచిది. నీవు నిస్సంశయముగ రాముని వద్దకేగి నీపతిశిరమును దెచ్చుకొనుము. రాముడు కృపామయుడు. విభీషణుడు నీకుమామ. అంగదుడు నాకుపుత్రతుల్యుడు. రామలక్ష్మణు లేకపత్నీవ్రతులు. హనుమ నైష్ఠికబ్రహ్మచారి. కాన నటకేగుటకు నీవు సందియమందనక్కర లేదు. పోయిరమ్మన నామెయాజ్ఞానుసారముగ సులోచన రామచంద్రుని సన్ని ధికి బయలుదేరెను.

సులోచన రాముని దర్శింపబోవుట

అటసముద్రమునుండి సువేలవఱకు వ్యాపించిన వానరసేన రెండవసము ద్రమువలె నుండెను. అట్టి వానరసేనాసముద్రమధ్యమున రాముడు శేషరూపు డగు లక్ష్మణుని తొడపై తలనిడిపరుండెను. అట నక్షయవటమువలె విభీషణుడు కూర్చునియుండెను. అప్పటి రాముని దివ్యరూపమునుజూచినవా రెంతధన్యులో కద! అట్టిరూపమును ధ్యానించియు తరింపవచ్చును. అపుడు సులోచన వారిని జూచి భయమందుచు, రామచంద్రుడు నను మన్నింపకుండడని మరల ధైర్య మూని, సేనామధ్యమున ప్రవేశించివచ్చుచుండ వానరు లిట్లనుకొనదొడంగిరి. లంకనుండి పల్లకివచ్చుచున్నది. ఇంద్రజిద్వధానంతరము రావణుడు భయమంది

జానకిని బంపివేయుచున్నాడని దోచుచున్నది. అట్లైన మనకు యుద్ధముండదు. వానరులు రాక్షసుల నిర్జించి సీతనుదెచ్చి రామున కర్పించి రను కీర్తి మన కక్షయముగసిద్ధించినది. రాముని ముఖము మింతటితో దీరిపోయినది. మనము కృతార్థులమైతిమి. అనుకొనుచుండనంతలో సులోచన పల్లకినుండిదిగి ముందునకు బోవుటకు శంకించుచు నిటునటుజూచుచు రామలక్ష్మణులజూచి మనమునందిట్లు తలపోయసాగెను. అహా! ఏమియాదివ్యమంగళరూపము! వీరితనుచ్ఛాయను జూచి, స్వర్ణమరకతములు, భుజములజూచి కరికరంబులును, యధరమును జూచి బంధూకమును, నాసికనుజూచి, చంపకమును, దంతములజూచి దాడిమీ బీజములును, సిగ్గున తలవంపక తప్పదు. వీరి వక్షము లతివిశాలములు. నేత్ర ములు కంజదళములు. వీరి నిరుపమరూపము నాశేషుడు వర్ణింపజాలడు. వక్ర ములగు కనుబొమ్మలు, మనోహరకపోలములు, శిరములజడలు, నుదుట తిలకములు, కటినివల్క-లములును గలిగి, ధనుష్పాణులై, వననూలాలంకృతులై, విరాజిల్లు చున్నారు. మునిమానసచంచరీకము లీయరుణచరణకమలముల నెన్నడును వీడవుగదా! శివవిరించులీచరణకమలముల ధ్యానించి, తమతమ కార్యములను నిర్విఘ్నముగనెఱ వేర్చుకొనుచున్నారు. గంగ యీపాదవ్యపాదమునుండియే యుద్భ విల్లినది. ఈపదములు భవసాగరనౌకలు. సర్వదుఃఖనివారకములు. సకలమంగళ ప్రదములు. అనుకొనుచు, నంగదాదివానరవీరులు సుగ్రీవ విభీషణు లిరుప్రక్క-ల గూరుచుండ, హనుమంతుడు పాదముల నొత్తుచుండ, నామధ్యను తారాగణ మధ్యవర్తియగు నుడుపతివలె విరాజిల్లుచున్న రామచంద్రునిజూచి సులోచన తననేత్రములు సఫలములనియు, తాను ధన్యననియు దలంచుచు, వానరులచే ననుజ్ఞాతయై, రాముని సమీపించి, శిరమువాంచి, నమస్క-రింప విభీషణు డామెనుజూచి జాలిపడి, రామచంద్రా! ఈమె దశకంఠునికోడలు. మేఘనాదుని భార్య. వాసుకి కూతురు. పతివ్రతాశిరోమణియగు సులోచన. మాయన్నగారి దుర్నయమువలన యీమెకీదుర్గతివాటిల్లినది. మిమ్మ్మెదర్శింపవచ్చినదనిచెప్పెను.

సులోచన రామునితో సంభాషించుట

అంత సులోచన ధైర్యమునూని, రఘుకులతిలకా! రామచంద్రా! నాపతిబావమరుదుడు. మీ యపారమహిమను వ్రాసి నాకు దెలిపినది. నాభర్త

శిరమును ప్రార్థించుట కిట వచ్చితిని. అందువలన మీ దివ్యదర్శనమును జేసి కృతార్థనైతిని. నాపుణ్యము ఫలించినది. మిమ్మునస్తుతింప నే నెంతటి దానను! మీసేవదుర్లభము. మీనామముచే తరియించితిని. దీనురాలను. ప్రభూ! మా యపరాధముల మన్నించి మాకు సద్గతి నొసంగుము. కపటజంబాలమును వీడి మిమ్ము భజించువారెంతేని ధన్యులు. నన్నీభవసాగరమునుండిదాటింపుము. ప్రపంచమసత్యము. నానాథుని యజ్ఞానమును మన్నింపుము. శరణాగతరక్షకుడవనితెలిసి వచ్చితినను యీమెదీనాలాపముల విని, కరుణామయుడగు రామచంద్రుడిట్లనియె. సులోచనా! నీవు చింతిల్లకుము. నీపతిని బ్రతికించి యిచ్చెదను. నీవు చిరకాలము లంకారాజ్యభోగముల ననుభవింపుము. దుఃఖింపకుమన నాపలుకులువిని యచటివారు భయమందుచు, వీడు మఱల బ్రతికిన మమ్ములబ్రతకనిచ్చునా! దేవతల కష్టము లెట్లుతొలంగును? జానకిచెర తప్పునెట్లు! వీడు బ్రతికిన విభీషణుడు లంక నెట్లు పాలింపగలడు? ఆకృపామయు డీసందర్భమున తొల్లితానిచ్చిన వరమును సయితము మఱచియుండనోపు! ఈతడు దీనదయాళువు. శరణాగతరక్షకుడను బిరుదమెంతయు సమంజసముగనున్నది. అని యచటివారు తలపోయుచుండ, రామచంద్రుని యపారప్రేమకాసులోచన యాశ్చర్యమందుచు నిట్లనియె. ప్రభూ! ప్రాణికోటి తమకు పుత్రనిర్విశేషము. తమకు శత్రుమిత్రభేదములేదు. మీసామర్థ్యమును నేనెరుగుదును. తమఱు నాభర్తను బ్రతికింపగలరు. కాని లక్ష్మణునంతవానితో పోరి రణమున నాభర్త ప్రాణములనర్పించెనుకాన నాతడు మృతజీవుడు. ఈతఱి ణముదాటిన యిట్టికీర్తి మాకు లభింపదు. వీరపత్నులు యాచింపదగదు. మఱియు నాపతిముల్లోకముల జయించి, నిఖిలభోగములనుభవించి, లక్ష్మణుని తగినపాత్రమనిగ్రహించి, యాతనికి రణతీర్థమున ప్రాణములర్పించెను. ఇచ్చిన దానిని మఱల గ్రహింప నుచితముకాదు. మీదర్శనముచే ధన్యులమైతిమి. ఇక భోగవాంఛ మాకులేదు. కాన భర్తతో సహగమనమాచరించి, యోగులకుగూడనందరాని పదమునందెదము. సముద్రమునందు నదులు నామరూపములువీడినట్లు నీదివ్యధామమున జననమరణములు, తారతమ్యములునులేవు. మమ్మునీభవసాగరమునుండి దాటించి, నీచరణసన్నిధిని జేర్చుము. ఇక మాకీ తుచ్ఛభోగములతోబనిలేదన నామె పలుకులకు రామచంద్రుడు సంతసించి,

సుగ్రీవునివై పుజూచెను. తోడనే సుగ్రీవుడాజ్ఞాపింప వానరులాశిరమునుదెచ్చి యటనుంచిరి. దానినిజూచి సులోచన కృతార్థనై తిననితలంచి, భర్తృవియోగ దుఃఖితమగు మోమునై బడినధూళి చేలచెఱంగున దుడుచుకొనుచుండెను. ప్రభూ! ఖండితమైనభుజము నేలమీద వ్రాయుచెట్లు? ఇది నమ్మతగదు. రాక్షసమాయ గానోపునని సుగ్రీవుడన రామచంద్రు డిట్లనియె. సుగ్రీవా! నీవీకుతర్కమును మానుము. ఆభుజము తప్పక వ్రాసియుండునన సుగ్రీవుడు ప్రభూ! యీశిరమిపుడు నేజూచుచుండ నవ్వినచో నేను నమ్ముదుననెను. అంత నాసులోచన, నాథా! మీరు వ్రాసినదాని నీవాన రేశ్వరుడు నమ్ముట లేదు. కాన నొకసారి నవ్వి నామాటను నమ్మజేయుడు. నేను పతివ్రతనేని యీశిరమిప్పుడు నవ్వుగాతమను నాసతిమాటలవిని యీశిరము నవ్వసాగెను. అంత వారాశ్చర్యచకితులై జూచుచుండ నాశిరము మఱలమఱల నవ్వుచు పెద్దగ గర్జిల్లెను. ఆగర్జితమున కచటివారందఱు నట్టిగర్జితము నెన్నడును విని యుండకుండుటచే నిశ్చేష్టులయిరి. సులోచన మిగులసంతసించెను. అప్పుడు రామచంద్రుడు, సుగ్రీవా! చూచితివిగదా! పతివ్రతామహిమను? పతివ్రత కసాధ్య మెద్దియును లేదు. అనుచు పతితనువు రామచంద్రుని పాదములనిడి ప్రభూ! నాకై యీదినమున యుద్ధమునాపుజేయవలయునని ప్రార్థించి, శిరమును గైకొని,విభీషణునిజూచినమస్కరించి, మామా! మీరుపుల స్త్యవంశభూషణులు. మీవలన మనవంశముతరించినది. మీకు రామునిదివ్యసన్నిధియే తగియున్నది. నేనిదివఱలో నజ్ఞానముచే మిమ్ము దెలిసికొనలేకపోయితిని. ఇపుడు మీస్వభావమున కెంతేనిసంతసించుచుంటిని. మీరు చిరకాలము లంకను పాలింపగలరు. రావణునిచే నుద్వృత్తమై నశించిన రాక్షసవంశము మఱల మీవలన పవిత్రమైనదై యభివృద్ధినందగలదు. మీకీర్తి రామచంద్రుని కీర్తితోపాటు శాశ్వతముకాగలదు. నాకు శలవొసంగుమను కోడలిమాటలకు విభీషణుడు జాలిపడి శోకవికలమనస్కుడై యెట్టకేలకు మనమును చిక్కబట్టెను. సులోచనయు శిరఃకాయముల గైకొని రణభూమినుండి వెడలిపోయెను.

సులోచన భర్తతో సహగమించుట

అంతసులోచన పతిశిరమును గ్రహించి, బయలుదేరెను. సుగ్రీవుడు మున్నగువానరవీరు లామె సౌశీల్యమున కచ్చెరువందుచు పూర్వవైరమునుమఱచి

యామెవెంట జనుచుండిరి. విభీషణుడును కోడలి ననుసరించి పోవుచుండెను. పిమ్మట సులోచన పతిశరీరమునుపాలకియందుంచి, రామునిపదకమలములను తన హృదయపీఠమునం దిడికొని, రామనామమును స్మరించుకొనుచు నడచుచుండెను. ఆమె మఱల లంకకు జనక, ఆ సమీపమం దున్న యొకపవిత్రప్రదేశమున సహగమనమును జేయ నిశ్చయించి సపరివారముగ నటకేగుచుండెను. ఈవార్తను చారులవలన విని రావణుడు భార్యాసమేతుడై సపరివారముగ నటకుజనుదెంచెను. అపు డట శోకము మూర్తినిదాల్చి తాండవమాడుచుండెను. సులోచనయాజ్ఞచే సేవకులు చందనతరుకాష్ఠములదెచ్చి జ్వాలగావింప నాసులోచ ధైర్యమునూని, పెద్దలకు నమస్కరించి, వారి యనుజ్ఞనువడసి, యగ్నికినమస్కరించి, భర్తృశిరో భుజములతో కాయమును ధరించి, యాచితినధిష్ఠించి, పద్మాసనమునగూర్చుండి, భర్తయొక్కభుజమును శిరమును, ఒడియం దిడికొని, బద్ధాంజలియై, రాముని ధ్యానించుచుండెను. ఆమె సంస్పర్శమువలన పావకు డానందమందుచు, నలు వైపుల ప్రజ్వరిల్లుచుండెను. ఆవెలుంగును నాకవాసులు చూచుచుండిరి. ఆమె అట్లు దహింపబడుటను జూచి రావణుడు మూర్ఛితుడై పడిపోయెను. మండో దరి మున్నగు కాంతలు గుండెల మోదుకొనుచు విలపింపసాగిరి. పురవాసులు దుఃఖించుచు రావణుని నిందింపసాగిరి. ఎట్టకేలకు రావణుడు తెలివంది, మెల్లన వారలనూరడించుచు నిట్లనియె. ఎప్పటికైన ప్రపంచము నశియింపక తీరదు. ప్రపంచమునం దేదియు నశింపనిదిలేదు. జననమునకు మరణముతో నవినాభావసంబంధముకలదు. కాన దీనికివగవబనిలేదు. అని వారలకు హితము నుపదేశించుచుండెనే కాని, తాను దుఃఖమున పొగులుచునే యుండెను. హితము నుపదేశింపవచ్చును కాని తానాచరించుట కష్టము. అట్లు పొంగిపొఱలివచ్చు దుఃఖము నాపుకొనజాలక దగ్ధహృదయుడై విలపించు నాతని, మంత్రులు సమీపించి ప్రభూ ! ఏల యిట్లు విలపించెదరు. ధీరోదాత్తులగుమీరువిలపించుట, మందరముపగులుటగాదా! మఱియు బ్రతికినంతకాలము నిరుపమాన శౌర్యధైర్యసాహసములతో పగతుర నోడించి సకలసుఖముల ననుభవించి వీరోచితవిధముగ సద్గతినందినవారలకై విలపించుట మీవంటిధీరుల కుచితము కాదు. కాన శత్రువుల గెలుచునుపాయము నాలోచింపవలయును. అన రావణుడు మనసును కుదుటపఱచుకొని యొకశివాలయమున ప్రవేశించి యర్ధరాత్ర మగునంతవఱ కాలోచించుచుండెను. అట్లాలోచింపుచు

తన యిరువదిబాహువుల నెత్తి శివునకు నమస్కరించెను. అంత పాతాళవాసి యగు నహిరావణుడు స్మరణమునకు వచ్చెను. వెంటనే లేచి, స్నానమునుజేసి యాకర్షణమంత్రమును పఠింప నట యహిరావణునకు చలనము గలిగెను.

అహిరావణచరిత్రము

గరుత్మంతుడా! శివభక్తుడగు రావణుడే మంత్రమును పఠించినను అది తప్పకసిద్ధించును. ఆతడాకర్షణమంత్రమును పఠించినతోడనే పాతాళవాసియగు నహిరావణుడిట్లు తలంచెను. లంకాధిపతియగు రావణుడెందులకో తొందఅగ ననున్నాహ్వానించుచున్నాడు. అతడు మహావీరుడు. ఈతనికినాతో బనియేమి కలదు? అనుకొని, తనయిష్టదైవమగు, కామదాదేవిని పూజించుచుండెను. అహిరావణుడు బలశాలియగు కామరూపుడు. అతడు రావణుని యాహ్వాన మునుబట్టి తోడనేలంకకేగి, శివమండపమునందున్న రావణునిజూచి నమస్కరింప, నతడతిప్రేమతో నాతనిని తనసమీపమున గూర్చుండ బెట్టుకొనెను. అంత నహిరావణుడు కుశలమునడుగ నాతనితో, శూర్పనఖావమానము, ఖర దూషణాదులసంహారము, మారీచవధ, సీతాపహరణము, లంకాదహనము, సేతుబంధనము, కుంభకర్ణాదిరాక్షసనాశము, ఇంద్రజిన్మరణము, సులోచనా దేహత్యాగము మున్నగువిషయములదెలిపి, ఇపుడు రాముడిచటనేయున్నాడు. నాదురవస్థను ఏమిచెప్పుదును? మనయోధులందఱును రామశరాగ్నిచే దగ్ధమై పోయిరి. మనుజులచే రాక్షసులుమడియుట ఇంతవఱకెన్నడును, కనివినిఎఱుగను. మన విభీషణుడు శత్రువులలో జేరెను. ఏమియుదోచక నిన్నుబిలిచితిని. నీవు నాకు సహాయుడవై రామలక్ష్మణుల ద్వారలో బరిమార్చు నుపాయము నాలోచించి, రాక్షసకలంకమును, నామనశ్శల్యమును వాపుమన, అన్నా! నీవు చింతింపకుము. రామలక్ష్మణుల నపహరించి, నీవంత దొలగింతును. వారిని యపహరించి పాతాళమునందున్న నాదేవికి బలినిచ్చి, రాక్షసుల కీర్తిని కాపాడెదను.

అహిరావణుడు రామలక్ష్మణుల పాతాళమునకు గొంపోవుట

అహిరావణుడట్లుపలికి రావణునకునమస్కరించి యనుజ్ఞాతుడై, రామాపహరణమునకై బయలుదేరి రామునిసేనలో ప్రవేశింపబోయెను. అది రాత్రి

సమయము. అంధకారము మెండుగనుండెను. వానరులు రాముని చుట్టును జాగరూకులై కావలికాచుచుండిరి. కాలుని కైనను ప్రవేశింప నలవిగాకుండెను. హనుమంతుడు తనతోకను బెంచి, ప్రాకారమువలె నెత్తుగ జుట్టియుండెను. ఆచుట్ట యాదిశేషునివలె నుండెను. దానిచుట్టును వానరవీరులు శైలములవలె గూరుచుండిరి. దానిముఖద్వారమున హనుమంతుడుండెను. దానిని జూచి యహిరావణుడు నివ్వెరబోయి, ఏమియుదోచక చింతాకులస్వాంతుడై యాలోచింపగ నొకయుపాయము పొడగట్టెను. తోడనే విభీషణుని రూపమును ధరించి, హనుమంతుని సమీపించి, యాతనిని వంచించి, లోనికిబోవదలంచెను. అట్లు వాయుసూనుని సమీపించినతోడనే మారుతి, నీవెవ్వడ! వెందు బోయెద! వన నాత డిట్లనియె. నేను విభీషణుడను. సంధ్యోపాసనమునకై బయటకుబోయి భగవద్ధ్యాన మొనరించుచుండ, కాలము తెలియక నాలస్య మయినది. రామచంద్రు డేమనునో యని శంకించుచుంటిని. త్వరగ బోనిమ్మన నాతడు విడిచిపెట్టెను. గరుత్మంతా! దైవ మెంతబలమైనదో చూచితివిగదా! మాయావు లెవ్వరినైనను మోసగింతురు. ఇట్లు హనుమంతునివంచించి లోనికేగి రామచంద్రుని సమీపించెను. అట సుగ్రీవాది వానరవీరులు, జాంబవద్విభీషణులును రాముని చుట్టును, నిద్రాపరవశులై యుండిరి. వారినడుమను రామలక్ష్మణులు సుఖనిద్రలోనుండిరి. అపుడు క్షీరోదధిమధ్యమునం దహితల్పశాయియగు పుండరీకాక్షునివలె రాముడుండెను. అట్టి రామచంద్రుని దర్శించిన యహిరావణుని భాగ్యమేభాగ్యము. ఎవడు బ్రహ్మాదులకు నగమ్యుడో, ఎవనినామమును శివుడు సదాజపించుచుండునో, ఎవని పదకమలములను, మహాయోగులు నిరంతరము ధ్యానించుచుండెదరో, అట్టి రామబ్రహ్మమును హింసింప నెంచి వచ్చిన యహిరావణుడు కన్నులారజూచి సంతసించుచుండెను. అట్లు కొంతతడవుండి, తనపనిని నెరవేర్చదలచి వారినందఱను మోహనమంత్రముచే మోహితులజేసి, రామలక్ష్మణుల భుజములపై నిడికొని గగనమార్గమున బోవుచుండ నొకదివ్యజ్యోతిస్సు కనుపింపగ నహిరావణుని పలుకులు తథ్యమని రావణుడు సంతసించుచుండ నామాయావి క్షణములో వారిని పాతాళమునకు గొనిపోయెను. అంత వానరులు తెలివంది రామలక్ష్మణుల గానక భయమందుచు కేకలిడుచు, దీనాననులై విలపింపసాగిరి. రామచంద్రు డెటకేగెను!

మనతోజెప్పక యీయర్ధరాత్రమున నిట్లేగుటకు గారణమేమి? మనకు జయము చేకూరుసమయమాసన్నమైయుండ నిట్లేలజేసెను? అనిపేమిచేయుటకునుదోచక మరపిల్లుచుండ నింతలో నరుణోదయమగుటయు, అపుడు హనుమంతు డిట్లనెను. రాత్రి ఒకడు విభీషణునిరూపముతో నాకడకువచ్చి, నాయనుమతిని వడసి, మన వానరకటకములో ప్రవేశించెను. అది రాక్షసమాయ గానోపు. నేను గ్రహింపలేకపోతినన విని విభీషణు డిట్లనియె.

అహిరావణుడు పాతాళమునందున్నవాడు. వాడు నారూపమునుధరించి మనల వంచించి, రామలక్ష్మణుల, పాతాళమునకు గొనిపోయి యుండవలయు. వాడు మిగుల మాయావి. పరాక్రమశాలి. రామలక్ష్మణుల వంచించిగాని జయింపజాలమని రావణుడు బంప వచ్చి యీపనిని జేసియుండును. కాన తప్పక వారు పాతాళమున నుండగలరన, జాంబవంతుడు విని హనుమంతుని జూచి, హనుమా! నిన్నుమించినబలవంతు లెందునులేరు. ఉపాయశాలివి. కాన రామ లక్ష్మణులదెమ్మన సుగ్రీవుడిట్లనియె. పావనీ! రామలక్ష్మణులు సజీవులై యుండ నిటకుదేవలయు. లేనిచో మనప్రయత్నమంతయు విఫలము. నీవు ముద్రికచే సీతను బ్రతికించినట్లును, సంజీవిచే లక్ష్మణుని బ్రతికించినట్లును, రాము నిచే మమ్ములనందఱ బ్రతికింపుము. లేనియెడల మేము బ్రతుకుట కల్లయన మారుతి యిట్లనియె. కపిరాజా! నీవు విచారమునుమాని జాగరూకతతో వానరకటకమును గాపాడుచుండుము. చతుర్దశభువనములలో నెటనున్నను ఎవ్వరడ్డమువచ్చినను వారిని నిర్జించి, రామలక్ష్మణులదెచ్చెదను. సందియము వలదనిపలికి, రామునిస్మరించుచు హనుమంతుడు బయలుదేరెను. అట్లుబోవుచు నొకవృక్షమ్రీందనిలిచి పక్షిమిథున సంభాషణము నాలించెను. "నాథా! నాకు మనుష్యమాంసమును దినవలెనని యున్నది. ఎట్లైనను నాకు దెచ్చిపెట్టు మను నావిహంగిమాటల విని మగపక్షి ఇట్లనియె. ప్రేయసీ! నీకోర్కెను దప్పక దీర్చెదను. అహిరావణుడు దేవికి బలినిచ్చుటకై యిరువుర రాజపుత్రుల దెచ్చి యున్నాడు. బలినిచ్చి యామాంసఖండముల బారవైచును. వానిని నీకు దెచ్చి యిచ్చెదనని యాగృధ్రరాజమనెను." ఆపలుకుల విని హనుమంతుడు సంతసించి, రామచంద్రుని స్మరించుకొనుచు శీఘ్రగతిని పాతాళమున కేగెను.

మకరధ్వజవృత్తాంతము

అహిరావణుని నగరద్వారమున మకరధ్వజుడను వానరవీరుడు కావలి యుండెను. అతడాహనుమంతునిజూచి, ఓరీ! ఎవ్వడవీవు! ఎందులకిటకువచ్చి తివి? నన్నువంచించి ఎట్లుపోయెదవు! నన్ను నీవెఱుగవు గాబోలు! పవనసుతుడగు హనుమంతునికుమారుడను. నాతండ్రిజగద్విఖ్యాతవీరుడు. మరలిపొమ్మన నామారుతి విస్మితుడై, ఓయీ! ఇది ఎట్లుపోసగును! నేనే హనుమంతుడ. నేను స్వప్నమందైనను స్త్రీసంబంధములేని నైష్ఠికుడను. నీవు నాకెట్లు పుత్రుడవన నామకరధ్వజుడిట్లనియె! తండ్రీ! నేనెన్నడును తలిదండ్రులపేరు దాచువాడనుగాను. నీవు నిజముగ హనుమంతుడవేని తప్పక నీవేనాతండ్రివి. నీవు లంకను దహించి అలసిన సమయమునసే సముద్రమును దాటునపుడు నీయెడలిచెమట సముద్రములో బడెను. వెంటనే దానినొక మత్స్యముగసింప, నేనామత్స్యగర్భమున జనించితిని. తోడనే సంప్రాప్తయౌవనుడనై, యిటకువచ్చి యీ యహిరావణుని గొలుచుచుంటిని. పుట్టినతోడనే ఫలభ్రాంతిచే సూర్యునికబళింపనెంచి యాకసమున కెగిరిన నీమారుతున కీమాత్రము బలముకలుగుట కేమివింత! యన నాతనిపలుకులు సత్యమని తోచి హనుమ ఇట్లనెను. కుమారా! నీమాట నాకు నచ్చినది. నేనొకపనిమీద నిటకు వచ్చితిని. అహిరావణుడు రామలక్ష్మణుల దెచ్చి నిటనుంచెను! నేను వారినిదర్శింపవలయును. నేను వారిదరికేగు నుపాయమును జెప్పుమన నతడిట్లనియె.

మారుతి మకరధ్వజునివలన రామలక్ష్మణుల యునికిని వినుట

రామలక్ష్మణుల నెటనుంచెనో! నాకు దెలియదు. కాని మాప్రభువు రామలక్ష్మణుల దెచ్చెననియు, నేడు వారిని దేవికి బలినిచ్చుననియు వినియుంటిని. అస విని అట్లైన నన్ను లోనికిబోనిమ్ము. నేనే వెతకికొనియెద నన, నాప్రభుని యాజ్ఞ లేనిదే, నేనెవనిని లోనికి బోనీయను. తుమింపు మన హనుమంతుడు బలవంతముగ లోనికి ప్రవేశింపసాగెను. అపుడు మకరధ్వజు డాతని నీవల కీడ్చివేసెను. అంత నామహావీరుల కిరువురకును ఘోరమగు సంగరము సాగుచుండెను.

మారుతిచే అహిరావణుని దేవీపూజ భంశమొందుట

అప్పుడు హనుమంతుడిది జాగుచేయుటకు సమయముకాదని ఎంచి వానిని వాలముచే బంధించి, సూక్ష్మరూపమున లోనికరిగి, దేవీపూజాయతనమున బ్రవేశించెను. ఆ దేవీమండప ప్రాంగణమున, హోమమునకై దేబడిన జీవము లసంఖ్యాకములై యుండెను. అభిషేకార్థము రక్తసిక్తములగు ఘటములు సిద్ధము చేయబడెను. పలురకముల ఫలములు, పుష్పములు సిద్ధముగ నుంపబడియెను. మఱియు దేవికై పూలదండలను దెచ్చుచుండిరి. అప్పుడు మారుతి సూక్ష్మరూపుడై పూలదండలో నొకపుష్పమునం దిమిడి ఏరికిని గోచరుడుగాక లోనికి బోయెను. అణిమాదిశక్తిసంపన్నుడగు హనుమంతుడు క్షణములో స్థూలసూక్ష్మ రూపముల ధరించుట కేమివింత ! అప్పుడాపూలదండను దేవిపైనుంచిన తోడనే యా దేవీ విగ్రహము హనుమచ్చరణ సంస్పర్శనమున క్రిందికి దిగబడిపోయెను. అంత హనుమంతుడు వికటరూపమును ధరించి యెదుట నిలబడియుండ నచటి వారందఱు నాశ్చర్యమందుచు, నహిరావణుని భక్తికిమెచ్చి దేవి ప్రత్యక్షమై నిజరూపముతో నీపూజను గ్రహింపవచ్చినది. దేవీనిజరూపమును జూచిన మన మందఱము ధన్యులము. అని పూజించుచు మాటిమాటికి నమస్కరించుచుండిరి. అంత హనుమంతు డచటి పండ్లనుదినుచు, మాంసమును చిమ్మిపారవైచుచు, రక్తఘటముల బగులగొట్టుచు సవిలాసముగ వారలజూచుచుండెను. అంత నహిరావణుడు బలినిచ్చుటకై కొన్నిజంతువులను తనభుజములందిడికొని బ్రవేశించెను. తోడనే రామలక్ష్మణుల నటకుదెప్పించెను. రాక్షసులు వివిధాయుధముల ధరించి, కృపాణపాణులై యహిరావణుని యాజ్ఞానుసారము వర్తించుచుండిరి. అపుడాప్రదేశము యమసదనమువలె భయంకరముగ నుండెను. ఆవికృతాకారులగు రాక్షసులు కత్తులబైకి దూసి ప్రభునాజ్ఞకెదుఱు జూచుచుండ, రాజనీతిననుసరించి మూడుఘడియలువిలంబముచేయుడు. భగవత్ప్రార్థనమునకు కొంతకాలమాగవలయునని యొకవృద్ధుడుబలికెను. అంత నొకమూర్ఖుడువచ్చి, మీదైవమును త్వరగా బ్రార్థించుకొనుము. మీకే దేనికోరిక యున్న జెప్పికొనుడు. సమయమత్యాసన్న మయినదనెను. పార్వతీ ! చూచితివా ! వారల యవివేక మెట్లున్నదో ! భగవంతునెఱుంగక, యుక్తాయుక్తవివేక శూన్యులై వారట్లు ప్రేలుచుండిరి. ఆమాటలవిని యన్నదమ్ములొకరి నొకరు చూచుకొనిరి. అప్పుడు

రాముడు వారల జూచి యిట్లనియె. ఓ నిశాచరాధములారా! మామాట నటుండనిండు. మీరు కొలుచు దేవియే మిమ్మ్మల బ్రిం గ సమకట్టినట్లున్నది. చూడుడు. మీరు కాలునియొడిలో నున్నారు. కాన మీరే వేఱొకదైవమును బ్రార్థింపు డన రాక్షసులు వెఱగొందుచుండిరి.

మారుతి అహిరావణుని వధించి రామలక్ష్మణుల దెచ్చుట

అంత హనుమంతుడు ప్రళయపయోధరమువలె గర్జింపసాగెను. ఆగర్జిత ములకు రాక్షసులగుండెలదర మనమిపు డేమిచేయగలము! మనదేవియే మనల గబళింపజూచుచున్నది. ఇదంతయు మనరాజువలన వచ్చినది. ఈదివ్యసుందర మూర్తుల నిద్దఱను మనదేవికి బలినీయ దెచ్చెను. దేవి వీరిబలి కంగీకరించుట లేదు. కాన నిట్లు గర్జిల్లుచున్నది. మనదేవియేయలిగిన మనకింక బ్రతుకెక్కడిది? మనలనందఱ గబళించుశక్తి యామెకుగలదు. చెంతకేగి ప్రార్థింతుమన్నను, భయమగుచున్నదని వారిలోవా రనుకొనుచుండ నా వాయుపుత్రుడు ఘోరా కృతినూని భయంకరముగ గర్జించుచుండ రాక్షసులమనములు తల్లడిల్లసాగెను. అపుడు హనుమంతుడు రామలక్ష్మణుల విడిపించి తనభుజములపై వారినిడికొని యటనున్న రాక్షసుల జిత్రవధజేయ మొదలిడెను. రాక్షసుల చేతనున్న కరవాల ముల నూడబెఱుకి వానిచే వారలతలల ద్రుంచుచుండెను. కొందఱమోది వారల నాగుండములో పారవైచుచుండెను. భయభ్రాంతులై పాఱిపోవుచున్న వారిని తనవాలమున బంధించి యీడ్చి యా గుండములోనికి విసరివేయుచుండెను. అహిరావణు డీభీభత్సమునంతనుజూచి, తనలో నిట్లనుకొనెను. ఈదుష్టవానరుడు లంకనుదహించిన హనుమంతుడు. వీడు రామలక్ష్మణుల నిటకుదెచ్చితినని విభీ షణునివలన దెలిసికొని ఇటకువచ్చియుండనోపు. వీ డీరామలక్ష్మణుల నెట్లు కాపాడునో! జూచెదను. ముందు వీనినిజంపి పిమ్మట వారల బదిమార్చెదను. అని నిశ్చయించి హనుమతో నిట్లనియె. ఓరీ దురాత్మ! నీవింతనిర్భయముగ నాయెదుట జరించుచుంటివి. ఇది యహిరావణుని పట్టణముకాని లంకకాదు. నే నహిరావణుడను. బాలుడగు యక్షుయునిజంపి, పరాక్రమశాలి ననుకొను చుంటివికాబోలు! నీ కాయువు మూడినది. నిన్నిపుడె జమునిప్రోలి కనుపుచుంటి

నని సునిశితకరవాలము నాతనిపై విసరెను. క్రోధరక్తాంతలోచనుడగు హను మంతు డకరవాలమునుగ్రహించి దానితో నహిరావణుని శిరమును ద్రుంచి హోమగుండమున బడవైచి పూర్ణాహుతిని గావించెను. పాపము. తానొకటి దలచిన దైవ మొకటి జేసెను. భగవద్విరోధులకు జయ మెట్లు కలుగును? అట్లాశిరము నాహుతినొనర్చి రామలక్ష్మణులగైకొని వచ్చుచు మకరధ్వజుని ప్రార్థనపై నాతనిబంధముల దప్పించి, యాపట్టణమున కాతని ప్రభునిగజేసి, నాయనా! నీవును నావలె స్వామిభక్తుడవని సంతసించితిని. నీవు నాకిష్టుడైన వగు రామునిభజించుచు సుఖముగనుండుమని జెప్పి, రామలక్ష్మణుల దీసికొని తనమిత్రులతో గలిసికొనెను. మకరధ్వజుడును దండ్రియాజ్ఞానుసారము రామ భక్తుడై నిష్కంటకముగ రాజ్యమును బాలించుచుండెను. రామలక్ష్మణుల జూచి వానరులు పోయినప్రాణములు తిరిగివచ్చిన ట్లానందించుచుండిరి. సుగ్రీవ విభీషణులు సంతోషమును బట్టజాలక స్వామిపాదములపై బడి యట్లేయుండిపో యిరి. అంగద జాంబవదాదిసైన్యము లానందాశ్రుపూరిత నయనములతో నిర్నిమేషముగ జూచుచుండ, వారల రామచంద్రుడు కృపావలోకనమునగార వించెను. వాఅందఱు హనుమంతునిజూచి సంతసించుచు, మారుతీ! నీమూల మున మేమందఱము బ్రతికితిమని పొగడదొడంగిరి. దేవతలు కుసుమవృష్టిని గురియించిరి. హనుమా! నాకై ఎట్టియిడుములనైన సహించి నాకుపకారమును జేయుచుంటివి. నీవంటిసహచరుడు ఇంకొకడులేడు. నీకీర్తిప్రతాపములు ముల్లో కముల శాశ్వతముగ నుండగలవని రామచంద్రుడన, ప్రభూ! నన్నింతగ గొనియాడనేల! ఇదిమీమహిమగాని, నాప్రయోజకత్వముకాదు. మీరనుగ్ర హింపకున్న నేనేమియు చేయజాలను. నౌకాసహాయమున నగాధజలనిధిని తరించునట్లు, మీనామసంకీర్తన బలమున నేనెంతపనినైన ననాయాసముగ జేయగలను అని మారుతిబలుక, రామచంద్రుడాతనినిగాగలించుకొని యానం దాశ్రువుల దడిపెను. పార్వతీ! ఈకథను వినినవారు, కీర్తించినవారును సత్కీర్తినిబడసి సుఖింబుండెదరు. ఈవృత్తాంతమును జూచి, స్తుతించుచున్న దేవతలంగాంచి రామచంద్రుడిట్లనియె. సురలారా! నేను జయవిజయ రాక్ష సుల కమోఘములగు వరములనిచ్చుటచే నిట్టినాటకముల నాడవలసివచ్చినది. లేకున్న మాలక్ష్మణుడే వీరలనందఱ మడియింపగలడు. మీరు విచారమును

మాని ఇటుపై జరుగబోవుసంగరమును దిలకింపుము. ఇంకను రాక్షసులలో బెక్కండ్రుయోధులు కలరు. రణరంగమున ననాయాసముగ వారినెల్ల నిర్జించెదనన విని దేవతలమితానందము నొంది, రామచంద్రా! నీకు జయమగుగాత మని సుమంబుల జల్లిరి. రామచంద్రునిగృపచే నీచరితమును నీకు జెప్పగలిగితినని కాకభసుండుడు ఖగపతితో ననెను. ఓభరద్వాజా! నేనీకథను నీకు జెప్పితినన భరద్వాజుడు యాజ్ఞవల్క్యునిపాదములకు నమస్కరించి, గురువర్యా! మీయనుగ్రహమువలన నేనీశుభచరితమును వినగలిగితిని. అహిరావణునివధానంతర వృత్తాంతమును వివరింపుడన, యాజ్ఞవల్క్యుడు పులకితగాత్రుడై, శివుని, రాముని, స్మరించుచు నిట్లనియె. భరద్వాజా! నీప్రశ్నము, పవిత్రమయినది. రామమానసచరిత ముత్తమోత్తమము. వంచకులీ చరితమును నిందింతురు. వారికెన్నటికిని సద్గతికలుగజాలదు. సజ్జనులకీచరితమునందు తనివికలుగదు. వినుము. రామలక్ష్మణు లట్లు వానరకటకమధ్యమున కూరుచుండ, రామునికి జయమగుగాత మని సింహనాదముల జేయమొదలిడిరి. వీరిసంతోషమునకు గారణమేమి? యని యాలోచించుచు, నహిరావణుని మరణవృత్తాంతమును చారులవలన విని రావణుడు నిశ్చేష్టుడై, వజ్రనిహతమగు పర్వతమువలె నేల గూలబడెను. వానిముఖము శుష్కించెను. కన్నీరుధారగ గారుచుండెను. ఆ స్థితినిజూచి మండోదరి చేరజని, నాథా! ఇప్పటికైనను పట్టుదలను మానుడన నాత డుగ్రుడై, యామెమాటల జెవిబెట్టకుండెను. రోషావేషవివశుడై, ఏమి చేయుటకుదోచక లేవబోవుచుండ, నంత సింధురనాథుడను మంత్రి సమీపించి, యాతనిని సవినయముగ బ్రార్థించి కూరుచుండబెట్టెను.

నరాంతకుని చరితము

సింధురనాథుడు బలవంతుడు, చతురుడును. అతడు విభీషణానుయాయికాన తఱుచు రావణునివద్దకేగుటలేదు. ఇది సమయమని రావణునివద్దచేరి యాతనికి హితమునుపదేశించెను కాని యాసన్నమృత్యువుగల రావణుడు వాని మాటలను గణింపకుండెను. అంత నాసచివోత్తము డీతడు దురభిమాని, మొదలంట నశించుననియెంచి యిట్లనియె. రాజోత్తమా! నేనొకయుపాయమును జెప్పెదవినుము. ఇంద్రజిత్తుకన్నను మిక్కిలిబలశాలియగు పుత్రుడు నీకుండ

నీవిట్లేలవిలపించెదవు? అన రావణుడిట్లనియె. నాకట్టి పుత్రుడెవడు! వాడెట
నున్నాడన, ప్రభూ! అతడు నరాంతకుడు. మూలానక్షత్రమున బుట్టుటచే
నాతనిని మనము సముద్రములో బడవై చితిమి. ఆతడు సజీవుడై, శివుని యను
గ్రహముచే నొకపురమును నిర్మించుకొని, అందు తనతో సమానబలముకల
డెబ్బదిరెండుకోట్ల రాక్షసవీరులుసేవింప రాజ్యమునుచేయుచున్నాడు. కాన
మనమొక నిపుణుడగు దూతనంపి యాతనిరావించిన యాతని సహాయమున
మనము శత్రువుల ననాయాసముగ నిర్జింపగలమను నాతనిపలుకులవిని రావ
ణుడు ధైర్యమూని, ధూమ్రకేతుడనువానిని రావించి, ఓయీ! నీవు మిక్కిలి
చతురుడవు. కాన నీవు విహ్వలపురమున కేగి, నరాంతకున కీజాబు నిమ్ము.
శీఘ్రముగబొమ్మన నాతడాతని శలవునుబట్టి అటకుబయలుదేరెను. అనవిని ఖగ
పతి యాశ్చర్యమునందుచు, కాకభశుండా! నరాంతకుని చరితమును సవిస్తర
ముగజెప్పుమన నాతడిట్లుచెప్పదొడంగెను. ఖగపతీ! లంకలో నొకనాడు
మూలానక్షత్రమున రాక్షసులకు డెబ్బదిరెండుకోట్లశిశువు లుద్భవించిరి.
వారితోపాటు నరాంతకుడును బుట్టెను. రావణుడీవార్తనువిని, సంతోషవిస్మ
యములనందుచు శుక్రాచార్యుల రావించి యిట్లనియె.

గురువర్యా! ఏకకాలమున లంకలో నిందఱుశిశువు లుద్భవించిరి. వీరి
వలనకలుగు శుభాశుభముల దెలుపవలెనన నాతడంతయు పరిశీలించి యిట్లనియె.
రావణా! ఈబాలకులు దుర్ముహూర్తమున బుట్టిరి. వీరి నింటనుంచిన ధనహా
నియు, ప్రాణహానియు దప్పకవాటిల్లునన నంతరావణుడు గురూత్తమా! దీని
కుపాయమేమన నతడిట్లనియె. వీరినందఱు సముద్రమున బారవేయుటమంచిదన
వెంటనే యాశిశువుల నొకచోటునకు జేర్పుడన ప్రభునానతిప్రకారము తల్లులు
విలపించుచున్నను గణింపక వారాశిశువుల నొకతావునజేర్చి వారినందఱు దేన
టిగలవలె సముద్రములో పాఱవైచిరి. ఖగపతీ! ప్రాణములన నెంతతీపియో
దెలిసినదా! తమక్షేమమున్నకై యందఱశిశువుల సముద్రముపాలుచేసిరి.
కాని దైవము నెవ్వరుమార్పగలరు? అట్లుచేసినను మరణింపక యాశిశువు
లొకమట్టికొమ్మ నాశ్రయించి దానిపాలను ద్రాగుచు, ఏడేండ్లు గడిపి, అట
నుండి బయలుదేరి పోవుచు దారిలో గంగాసాగరసంగమమగుచోట నొకశివా
లయమునుజూచి, లోనికేగి శివునిసేవించి కొంతకాలమటనుండి, మఱియొక

తావునకుబోవసమకట్టిరి. అట్లువారు లంకకు తూర్పుగ నాఱువందలక్రోసుల దూరమేగి అటసముద్రతీరమున ననువగుతావునుజూచి, అటనాగిరి. అట్లాగి వారు కర్తవ్యము నాలోచించి, సద్గురునిబడసి యాతని యుపదేశానుసారము దపమాచరించి శివుని యనుగ్రహమును బడయదలచి, ఎటులనో శుక్రునికడ కేగిరి. అట్లేగి శుక్రునకు నమస్కరించి వినతులైయున్న వారలజూచి, ఒక్కసారి ఇందఱుశిష్యులు తనకు లభించుట కెంతేనిసంతసించుచు వాఱల దీవించి, వారి జన్మవృత్తాంతము నెఱింగించి, ఓదార్చి వాఱలకు దగుమంత్రము నుపదేశించి తపముజేయుడని చెప్పెను.

అంతవారు సముద్రతీరమునకేగి యొకవివిక్త ప్రదేశమున గూర్చుండి నిశ్చలమనస్కులై బ్రహ్మనుగురించి తపమాచరింపమొదలిడిరి. వారట్లొక్కవేయిసంవత్సరములు తపమాచరించి, పిమ్మట వాయువును బంధించి నిలుచుండి నిశ్చలముగ నొక సంవత్సరమును, తఱువాత నేకపాదమున నిలబడి యూర్ధ్వముఖులై మఱియొక సంవత్సరము నత్యుగ్రముగ దపముచేయుచుండిరి. ఆబాలురదపమున కచ్చెరువంది విధాత, హంసవాహనారూఢుడై యటకరుగుదెంచి యాబాలకుల దయార్ద్రదృష్టినిజూచి, బాలకులారా! మీతపమున కెంతేని సంతసించితిని మీకిష్టమగు వరముల నొసంగెద గోరుకొనుడన వారల మితానందమునొంది బ్రహ్మతోనిట్లనిరి. ప్రభూ! మాయదృష్టముమంచిది. మేముధన్యులమైతిమి. నీకుమాయందనుగ్రహము కలిగినది. మామనవినివినుము. మేమెవ్వరికైన నజేయులము కావలయును. మాకెవ్వరివలనను మృతిలేకుండునట్లనుగ్రహింపుమనిరి. అంత విధాత విచారించి వారల కిట్లనియె. నాయనలారా! దేహమెన్నటికైనను నశింపకతప్పదు. కానవానరభల్లూకములు దప్ప నింకేరికిని మీరునిర్జితులు కాజాలరు. మృతులునుకాజాలరు. పిమ్మట నరాంతకునిజూచి, ఓయీ! నీకుసహోధ్యాయి యగు వానరుడు దక్కినింకేరి చేతను నీకుమరణము లేదు. కానినీవాతనితో నెన్నడును కలహింపకు మనిజెప్పి రాక్షసబాలకులిట్లనిరి. ఓశారదామనోహరా! మాకు నిత్యవైరులైన దేవతలవలన మాకపజయము లేకుండునట్లను గ్రహింపుమని వేడనతడందుల కియ్యకొని యంతర్ధానమందెను. అంతటితో తృప్తినందక యానిశాచరులందఱు శివునిగురించి మఱల తపమాచరింపమొదలిడిరి. వా రేకపాదముపై నిలిచి, యూర్ధ్వబాహువులై, నిరాహారులై

వేయిసంవత్సరములు, సధోముఖులై, పవనునిబంధించి మఱియొక వేయిసంవత్స రములును శివునిధ్యానించిరి. వారినిజూచి దేవతలును భయకంపిత మానసులగు చుండిరి.

అంతశివుడు ప్రసన్నుడై, తనవాహనమునెక్కి, గిరిజాసమేతుడై యటకు వచ్చి, సాక్షాత్కరించి, బిడ్డలారా! మీయపారతపమునకు మెచ్చి వరమీయ వచ్చితిని. అన నరాంతకుడు పులకితగాత్రుడై, దేవతాసార్వభౌమా! నీదర్శన మున్కై యింతకాలమిట్లు తపమాచరించుచుంటిమి. మాజన్మములు ధన్యములు. మాతపస్సు సార్థకము. మాకేమికోరుటకును దోచకున్నది. ప్రస్తుతము మాని వాసమున కనువగుపురమవసరము. మఱియు మేమందఱము భేదభావములేక మైత్రితో కలకాలముండునట్లును గ్రహింపమన నట్లొయగుగాతమని భూతపతి యంతర్ధాతుడయ్యెను. అంతవారు శివుని యనుగ్రహమువలన నతిరమణీయ మైన యొకపురమును గల్పించుకొనిరి. అది రెండువందలయేబదినాలుగు క్రోసుల పొడవునునంతియవెడల్పును గలిగియుండెను. దానిపరిఘమతి గంభీరము. ప్రాకార మతిదృఢతరము. వీధులతివిశాలరమణీయములు. సమానాకారములుగల డెబ్బది రెండుకోట్ల స్వర్ణసౌధములతో నాపురము విరాజిల్లుచుండెను. అందలిబజారులు సర్వవస్తుసంభరితములు. అచటివారు కుబేరునినించిన ఐశ్వర్యముగలవారు. ఆపురము యొక్కశోభను జూచి విశ్వకర్మ విస్మితుడయ్యెను. అందలిసరోవర ములు స్వర్ణకమలములతో విరాజిల్లుచుండును. అందు పదునాఱుక్రోసుల వైశా ల్యముగల దుర్గమొకటుండెను. అందసంఖ్యాకములగు చతురంగసైన్యము లుండెను. దానికి నరాంతకుడు ప్రభువు. అచటరాజును ప్రజలును పరస్పరమైత్రి కలిగి ప్రవర్తిల్లుచుందురు. వారు విద్యలనభ్యసింపనెంచి గురువర్యుని రావించి యాతనియొద్ద విద్యాభ్యాస మొసరింపబూనిరి. గరుత్మంతా! చూచితివా! భగవద్విలాసమును. అంతసుగ్రీవుని పుత్రుడగు దధిబలుడా పురమున ప్రవేశించి యచటి శోభాసంపదల కచ్చెరువందుచు నట గొన్నిదినములుండి వారితో గలిసి విద్యనభ్యసించుచుండెను. ఇట్లొక సంవత్సరము గడిచెను. పిమ్మట నరాం తకుడు బ్రహ్మవాక్యములస్మరించి, గురువులతో జెప్పనాతడా దధిబలుని రావించి, ఓయీ! నీవిటనొక నిముషమైననుండరాదు. అట్లుంటివేని నీకీరాక్షసులవలన మరణము తప్పదన నాతని పలుకులకు దధిబలుడు వగచుచు పురంబుదాటి

పోవుచుండ దారిలో నారదుడెదురై, దధిముఖా! ఎటనుండివచ్చుచుంటివన నాతడు తనవృత్తాంతమును, ఆపురశోభను, అచటి రాక్షసుల వృత్తాంతమును జెప్పనారదుడిట్లు తలపోయసాగెను.

నరాంతకుడీతనిచే మడియును. అట్లుకానినాడీశుడట విద్యాభ్యాసమున కేగుటదుర్ఘటము. అనుకొని దధిముఖునిజూచి, నాయనా! భక్తిలేనివాని జన్మము, విద్యయు వ్యర్థములు. భక్తుల నెవ్వరునేమియు జేయజాలరు. నదులు సముద్రుసివలె భక్తునిసర్వవిద్యలు తమంతదామే సేవించును. కాన నీవు విచారమునుమాని, రామభక్తుడవై, రామమంత్రమునుజపించుము. దానినీకన్నియు చేకూరునన విని దధిముఖుడామునికి ప్రణమిల్లి, ఆతనియాశీస్సులనంది, సముద్ర మధ్యమందున్న ఒకపర్వతమును జూచి, సంతసించుచు, నందున్నవిశాలరమణీయమగు గుహాలోప్రవేశించి, గణపతినిప్రార్థించి, శివపార్వతులకు ప్రణమిల్లి నారదోపదిష్టమగు రఘువరునిమంత్రమును జపింపమొదలిడెను. దధిముఖుని తపస్సునకుసంతసించుచు దీనికిఫలము ముందున్నదనితలంచి నారదుడు బ్రహ్మలోకమున కేగెను. ఇటనరాంతకుడు విద్యలనభ్యసించి, దండయాత్రకు బయలుదేరెను. వీడజేయుడని దేవతలీతనికి భయపడుచుండిరి. బిందువను రాక్షసుడొకడు వితలమున నివసించుచు, మంచిసేనల గూర్చుకొని స్వర్గమును ముట్టడించెను. వానివద్ద రణదుర్మదులగు నేడుకోట్ల రాక్షసవీరులుండిరి. దేవాసురులకొక సంవత్సరము పోరుసాగెను. ఇంద్రుడారాక్షసులనందఱి బొరిగొనెను. అప్పుడు చేయునదిలేక బిందువుపారిపోయి ఇంటదాగి దివారాత్రములు వనితాసక్తుడై భోగించుచుండెను. అంత తనకుదగిన యనేకులగు పుత్రులుద్భవించిరి. ఆ ఏడుకోట్లకొడుకులకును బిందువు పలురకములగు పేరులబెట్టెను. వారనుదిన ప్రవర్ధమానులగుచుండిరి. తరువాత బిందువునకు డెబ్బదిరెండుకోట్ల కన్యలుద్భవించిరి. దేవకాంతలందట్టి సుందరాంగనలు లేరు. బిందువు తనబిడ్డలకు వివాహముచేయదలచి, నరాంతకునివంటి వరుడెందునులేడని నిర్ణయించి యాతనిరప్పించి, తనబిడ్డలలో నగ్రజయగు బిందుమతిని నరాంతకునకును, మిగిలినవారిని యతని యనుచరులకు నిచ్చి మహావిభవముతో వివాహమొనరించెను. నరాంతకుడు సపరివారముగ నాకన్నెలతోను, తనభార్యతోను నిజపురికరిగెను. పిమ్మట మఱికొంద రందకత్తెలను గూడ వివాహమాడెను. వారందఱు నైక

మత్యము కలిగియుండిరి. వారి పాతివ్రత్యమహిమవలన రాక్షసులకెట్టి యాప దలును వాటిల్లకుండెను. బిందుమతి సకలవిద్యలలో నారితేరి రెండవశారద వలె నుండెను.

రావణుడు నరాంతకునికడకు దూతనంపుట

ఖగపతీ! నరాంతకునికథ యిది. ఇక ముందుకథను వినుము. రావణ దూతయగు ధూమ్రకేతువు బయలుదేరి నరాంతకునిపురికేగి అందు ప్రవేశించి, కొంతదూరమేగి యాపురశోభను దిలకించుచు మెచ్చుకొనుచు, నందుఫలముల గోయుపురుషునిజూచి, ఓయీ! నీవెవ్వడవన నాపురుషుడిట్లనియె. అయ్యా! నేను నరాంతకుని సేవకుడను. మీరెవ్వరన, నేను మీనరాంతకుని జూడవచ్చి తిని. నేను లంకాధిపతియగు రావణానుచరుడను. నాపేరుధూమ్రకేతువు. నాకు నరాంతకునిదర్శనమున కనువగు నుపాయమును జెప్పుమన నాత డిట్లనియె. ఓయీ! నరాంతకుని దర్శనమగుట సామాన్యముగాదు. మహామహులె యా తనిదర్శనమునకు నిరీక్షించుచుందురు. కాని నేడిటనొక నాటకము ప్రదర్శింప బడును. దానికొఱకు నటులనేకులువచ్చెదరు. కానీవును వారితోగలసి సభకు బోయి నరాంతకునిదర్శింపుమన నాతడువల్లెయని మెల్లమెల్లనబోవుచు నానగరసౌ భాగ్యమును దిలకించుచు నచటివారలనెల్ల జూచుచు నీపురము మనలంకకన్న నెంతేని మిన్న. ఇచటిసేవకులుగూడ రాచబిడ్డలవలె నున్నారు. వీరందఱు నైకమత్యముతో మెలంగుచున్నారు. అనుకొనుచు జనిచని ముందర నొక సంఘమునుజూచి, వారిని దెలిసికొని యానటబృందముతోగలిసి సభామంది రములోని కేగెను. అట డెబ్బదిరెండుకోట్ల సవయస్కులతోడను, పదునెనిమిది లక్షల ముప్పదియారువేల రాక్షసవీరులతోడను, పండితులతోడను, వందిమా గధులతోడను గూడుకొని నరాంతకుడు రత్నసింహాసనమున గూరుచుండెను. తక్కినవారందఱు నుచితాసనముల నలంకరించిరి. ధూమ్రకేతుడాసభనుజూచి నివ్వెరబోవుచు, ఏమియీవింత! సమాన రూపవేషభాషలుకల వీరందఱును నరాంతకునివలెనున్నారు. ఇట్టిపరిస్థితి యెందునులేదు. అని తలంచుచు మెల మెల్లన నచటివారిచే దనరాకను నరాంతకున కెఱింగించి యాతని యనుమతిని దరికేగి నమస్కరించి, రావణుడిచ్చిన పత్రమునందిచ్చెను. నరాంతకుడాపత్ర

మున్నగైకొని, చదివి, తండ్రి తన నాహ్వానించినందులకు సంతసించుచు, నాతని వలన నచటివృత్తాంతమునంతను విని, కొంతతడవాలోచించి, సభను చాలించి లోనికేగి, బిందుమతికాపత్రికను వినిపించి, తండ్రికి గొప్పవిపత్తువాటిల్లినది. కాన నేనిపుడటకు బోవలయుననవిని యామె ఇట్లనియె. నాథా! రఘురాము నితో యుద్ధమునకు మిమ్ములబిలువనంపలేదుగద! మీరారఘుపతితో యుద్ధమునకుమాత్రము పోవద్దు. ఆతడు భగవంతుడు. వెళ్ళవలెననియున్న నొకసారి యాతనిదర్శించి, యాతనినామము నుచ్చరించి జన్మమును సఫలము జేసికొనుడు. ఆతని సేవించి యాతనియనుగ్రహమునువడిసి నిశ్చింతముగ రాజ్య మును పాలింపుడనెను.

నరకాంతకుని యుద్ధసన్నాహము

ఆమెమాటుల బెడచెవినిడి, రాజద్వారమునకేగి సేనాపతులజూచి చతు రంగబలము నాయత్తముచేయుడు. రణభేరినిమ్రోయించి మీరు సిద్ధముకండు. లంకకు బోవలయును. అన నందఱును సమరాభిలాషులై ప్రయాణమునకు సిద్ధముగనుండిరి. ఆచతురంగసేననుజూచి భూమ్రకేతుడు విస్మయానందముల నందుచు నిక్కమనకు జయము తప్పకసిద్ధించుననుకొనుచుండెను. రణభేరిని వినిన తోడనే, తనభర్త ప్రయాణమును మానుటతేదనియు, రామునితో వైరము దుఃఖావహమనియు లోలోనగుందుచు బిందుమతియు సర్వాభరణభూషితయై, తానును ప్రయాణమునకు సిద్ధమయ్యెను. నాథా! నే నత్తనుజూడవలయును. కాన నన్నును మీవెంట గొనిపొండన నాతడందులకంగీకరించెను. ఈవార్తను వినినతోడనే మిగిలిన రాక్షసాంగనలును ప్రయాణమైరి. ఇట్లు నారీసహితముగ రాక్షసవీరులు పెండ్లికిబోవునట్లు బయలుదేరిరి. వారి ప్రయాణోత్సాహము వర్ణనాతీతము. అయిదులక్షల ఏడువేల రాక్షసులు, భేరిమున్నగు వాయిద్య ముల వాయింపుచుండిరి. నరాంతకుడిట్లు భూమ్రకేతుని ముందిడుకొని ప్రయా ణమును జేయుచుండ నపశకునములనేకములు వొడముచుండెనుకాని సన్నిహిత మృత్యువుకలవారు వానిని లెక్కచేయక ప్రయాణమునుసాగించి లంకను జేరి కొనిరి. వీరి ప్రయాణమునుజూచి, శేషకచ్ఛపములు భయమందుచుండెను. దేవతలు రామచంద్రుని ప్రభావమునెఱిగినవారగుటచే నంతదిగులుపడక రామ

చంద్రుని ధ్యానింపుచుండిరి. లంకలో నరాంతకుని సైన్యము నలువదిక్రోసుల ప్రదేశమునాక్రమించెను. అట రామచంద్రుడు సేనామధ్యమున సుఖోపవిష్టుడై, యానరాంతకుని సేనలజూచి మంత్రుల బిలిచి, యిటుజూడుము ! మేఘములు గర్జించుచు నీభూవలయము నాక్రమించుచున్నవన, విభీషణుడిట్లనియె. ప్రభూ ! అవి మేఘములుకావు. నరాంతకుని సేనలు. రావణుడు సహాయమునుగోరి వారిని బిలిచియుండును. నరాంతకుడు విహ్వలపురమునుండి ధూమ్రకేతునితో గూడి వచ్చుచున్నవాడు. ఇది వానిసేనాసన్నివేశమన విని రాముడు చిరునవ్వు నవ్వి యూరకుండెను. అంత రామాజ్ఞనువడసి, హనుమంతుడు వారికన్ను మిక్కుటముగ గర్జించుచు వారికభిముఖముగ బోవ, నరాంతకుడు ధూమ్రకేతువుతో నిట్లనియె. ఓయీ ! ప్రళయపయోధరమువలె గర్జించుచు, స్వర్ణగిరివలె వచ్చుచున్న యావీరుడెవడన, నయ్యా ! సముద్రమునుదాటి, యక్షయుని జంపి, లంకాదహనమొనరించిన హనుమంతుడీతడే. మఱియు కాలనేమినిజంపి, సంజీవిపర్వతమునుదెచ్చి, లక్ష్మణుని బ్రతికించినవా డీతడే. మఱియు నీతడు పాతాళమునకేగి యహిరావణుని వధించి, వానిసైన్యమును దునుమాడి రామ లక్ష్మణుల విడిపించిదెచ్చెను. ఇతడిపుడు మీవైపునకె వచ్చుచున్న వాడనెను.

యుద్ధము

నరాంతకుడాతని పరాక్రమున కచ్చెరువందుచు, బాణమును సంధించి హనుమంతునిపై విడువనాతడద్దానిని విఱిచివైచెను. అంత నరాంతకుడుగ్రుడై మారుతిపైబడ నతడా నరాంతకుని బట్టి తనపిడికిటబొడువ నతడు పర్వతమువలె నేలగూలి మూర్ఛిల్లెను. అంతహనుమంతుడు వాలమును బెంచి వారిరథములను సారథులను నుగ్గుచేయుచుండెను. ఎంతకొట్టినను వరమహిమచేవారు ప్రాణములను వీడరైరి. ఇట్లారాక్షసవీరులు క్షణకాలమాగి మఱలలేచి హనుమనెదురొక్కసజొచ్చిరి. వానరసేనలపైబడి బాణవర్షమును గురియింపుచుండ నామారుతి యాశరజాలమును వారింపగా దేవతలా మారుతిని గొనియాడుచుండిరి. అంత నరాంతకుడు క్రుద్ధుడై, హనుమంతుని సమీపించి, వానరాధమా ! నిలువుము. ఈదెబ్బతో నిన్ను జమునింటి కంపెదనని బలుకుచు నాతనిని దన పిడికిట బొడిచెను. హనుమంతుడు మందహాసముచేయుచుండ నారాక్షసు డలిగి

తనబలమునంతను వినియోగించి పిడుగువలె బెట్టిదముగ గ్రుద్దెను కాని హనుమ చలించుటలేదు. మరలమరల నరాంతకుడు కొట్టుచుండ హనుమంతుడు కృద్ధుడై తనవాలముచే నాతని జుట్టి గాఢముగ నేలపైగొట్టెను. ఆహనుమంతుని జూచి రాక్షసులు భీతిల్లసాగిరి. వారల దొఱకినంతవరకు హనుమపట్టుకొని నురుమాడు చుండెను. ఆతని దెబ్బలకు తాళజాలకవారు పాఱిపోవుచుండిరి. దేవతలాతనిని మెచ్చుకొనుచుండిరి. నరాంతకుడు మఱల దెలివొంది యుద్ధమునకు దలపడి మారుతిపై బాణవర్షమును గురియింప వానిని వారించి హనుమంతుడు, మత్తే భము కువలయ వనమునువలె రాక్షసుల దునుమాడుచుండెను. అంతనంగదాది వీరు లాతని సహాయమునకై వచ్చి రాక్షసులపైని శిలావర్షమును గురియించి రాక్షసులను జంపుచుండ నరాంతకుని సేనలు పాఱిదొడంగెను. అపుడు నరాం తకుడా రాక్షసులనుజూచి, పోకుడు, పోకుడు, నేనుండ మీకు భయమేల! ఈవానరుల నెల్లభుజించి పృథివిని వానరశూన్యముగజేసి, ఆరామలక్ష్మణుల బంధింపుడు. అనమరల నారాక్షసులు యుద్ధాభిముఖులైవచ్చి, గాఢాంధకార మును గల్పించి శస్త్రాస్త్రములను, ప్రయోగింపుచు, పాషాణవర్షమునుగురియిం పుచు, వానరవీరుల జీకాకుపఱచుచుండ జేయునదిలేక వారు శరవిశీర్ణగాత్రులై, కర్తవ్యముదోపకయా ర్తినొంది రామచంద్రునిఁ బ్రార్థింప నారఘుపతి వారి బాణ ములనన్నిటిని తొలగించి, యాగ్నేయాస్త్రముచే నాయంధకారమును దొలగిం చెను. అంత వానరులువిజృంభించి, వృక్షములను గండశిలల బూని, రాక్షసులతో దలపడి, ఆరుకోట్లరాక్షసుల జంపి, సంధ్యాసమయమగుటచే యుద్ధమునుమాని, యంగద హనుమంతులు వానరసేనలతో గూడ రాముని సన్నిధికి జేరుకొనిరి. రామచంద్రుని కృపావలోకనమున వారి శ్రమలన్నియు వాసెను. అంత వారు రామునిచరణసన్నిధిని గూరుచుండి యాతనిచరణములొత్తుచుండ జూచి దేవ తలు, మనము వానరులమయిన మనకును భగవత్పాదసేవ లభించునుగదా! యని తలపోయుచుండిరి. అట్లు సోదరునితోడను, వానరసేనలతోడను గూడి సుఖాసీనుడగు రామచంద్రుని ధ్యానించు భక్తులును, తులసీదాసు నగునేనును ఎంతేని ధన్యులము.

నరాంతకుడును యుద్ధమును చాలించి తల్లడికడకు బోయెను. రావణు డాపుత్రుని వానిసైన్యమునుజూచి యూరడిల్లి, సీతాపహరణము మొదలు జరిగిన

వృత్తాంతమునంతయు నాతనికిజెప్పి మేఘనాదకుంభకర్ణాహిరావణులు మున్నగు రాక్షసవీరుల మృతికి విచారించుచుండ నరాంతకు డాతని నోదార్చి, తండ్రీ! గతమునకువిచారింపకుము. రేపునాప్రతాపమును జూచెదవు. తెల్లవారినతోడనే పుడమిని వానరరహితముగ నొనర్చి, రామలక్ష్మణులజంపి, నీకపకారియగు విభీషణునిదెచ్చి నీచరణములపై బడవేయుదును. నాపలుకులసమ్మతమున నాతని మాటలకుసంతసించి, రావణుడాతని కౌగలించుకొని, నృత్తవినోదమున కాలక్షేపముచేయుచుండెను. బిందుమతి మున్నగురాక్షసాంగనలు మండోదరిని జూడ బోవ నామెవారలనందఱుగౌరవించి కుశలమడిగి, రామచంద్రుని ప్రభావమును వారలతోజెప్పవారును రామచంద్రుని స్మరింపుచు తమతమవిడిదలకుబోయిరి. రావణుడంతనరాంతకుని బరుండబనిచి దానును శయనాగారమునకు బోయెను. అంత మండోదరివచ్చి సవినయముగ నాతనివద్దగూరుచుండి ఇట్లు చెప్పదొడంగె. నాథా! సర్వనాశనమాసన్నమగునపుడు తగునుపాయమున వీలున్నంతవఱకు దప్పించుకొనుట ప్రాజ్ఞలక్షణము. అట్లుచేయనివాడు మూర్ఖుడై నశించును. తామ్రప్రాజ్ఞులు. కాన పట్టుదలనువీడి, ముందుగసీతనర్పించి, మీరు పుత్ర సహితముగ రాముని దర్శించి విభీషణునివలె యాదవామమయుని యనుగ్రహమునువడిసి, మమ్మలమిమ్మల రక్షింపుడు. బలవద్విరోధము క్షేమంకరముకాదు. అను నామెపలుకులు చెవులకు ములుకులై సోక నేమియుననక రావణు డూరకుండెను.

అంత నరుణోదయంబగుటచే రాముడు మేల్కాంచుటజూచి, వానరులు వృక్షములను గండశిలలను బూని యుద్ధసన్నద్ధులై యుండిరి. అట్లు వారు సన్నద్ధులై జయజయధ్వానములు చేయుచు లంకను ముట్టడింప నరాంతకుడు కృద్ధుడై సేనలనూర్చుకొని వచ్చిచూడ లంకాద్వారములన్నియు వానరసేనాక్రాంత మయ్యెను. రాక్షసవీరులు గుహలనుండి వెలువడు సింగంబులవలె వచ్చుచుండిరి. అంత నరాంతకుడు శరవర్షమునుగురియింప వానరులు తాళజాలక చెదరి పరుగిడుచుండ మారుతి చూచి వాలమునుబెంచి రాక్షసుల బంధించి వారిశిరముల ద్రుంచి ఎగురవేయుచుండెను. ఇట్లొకవైపున హనుమంతుడును మఱియొకవైపు అంగదుడును ప్రచండదోర్విక్రమమున సాగరము మథించు మందరములవలె జయాభిలాషమున బోరాడుచుండ రామచంద్రుడు మందహాస

ముతో వారలజూచుచుండెను. హనుమదంగదుల పరాక్రమమునకు నరాంత
కుడు కృద్ధుడై వానరసేనపై పాషాణవర్షమును గురియింపుచుండెను. నరాంత
కునితాకిడికోర్వజాలక వానరులు నిశ్చేష్టులై విలపింపసాగిరి. అప్పుడు నరాంత
కునిమంత్రి అంగదునిబట్టి నుంకింపగా అంగదుడాతనిని దనవాలమునజుట్టి మింటి
కెగసి వానిని పలురకములద్రిప్పుచు సూర్యమండలముదగ్గరకు జేర్చి వాడావే
డిమికి దాళజాలక యాతనిదోకను విడిపించుకొని నేలబడెను. మఱలనంగదుడు
పొలికలని బ్రవేశించినతోడనె రాక్షససేనాపతి పిశాచముల బురికొల్పి పోరు
చుండ శూలముచే నాతనివక్షమున బొడిచెను. అంగదు డాశూలఘాతములకు
తాళలేక మూర్ఛితుడై నేలబడ నంత హనుమంతుడు కృద్ధుడై యాశూలమును
లాగికొని దానితోడనె సేనాపతినిఖండించి జమునియింటికంపెను. అంతరాముడు
లక్ష్మణునిజూచి, సోదరా! రణరంగమున నంగదుడు మూర్ఛితుడై పడియుం
డెను. కాన నీవుపోయి వాని నుద్ధరించి మనవారలకు దోడ్పడుమన లక్ష్మణుడు
ధనుష్పాణియై రణరంగమునకేగి, రాము నిస్మరించుచు నంగదునిపై చేయినిడ
నాతడు తెలివంది విగతార్తుడై మరలయుద్ధమునకు సన్నద్ధుడయ్యెను. లక్ష్మ
ణుని ధనుష్టంకారమును వినినతోడనె పరాఙ్ముఖులైన వానరవీరులు మఱలసో
త్సాహముగ యుద్ధాభిముఖులై, పొలికలనికి వచ్చుచుండిరి. అప్పుడు వానరులు
రాక్షసులును పరస్పరజయకాంక్షచే పట్టుదలతో బోరుచుండిరి. అప్పుడులక్ష్మ
ణుడు విజృంభించి బాణవర్షమునుగురియింప రాక్షసులసైన్యము బెదరి చెదరు
చుండెను. మఱలవిజృంభించి రాక్షసవీరులు బాణవర్షమును గురియింపుచుండిరి.
దేవతలీదృశ్యమును గగనమునుండి జూచుచు విస్మితులై, వానరసైన్యముపై,
కుసుమవృష్టిని గురియింపుచుండిరి. అప్పుడు వానరులు కృద్ధులై రాక్షసులతలల
నూడబెఱికి, రావణసన్నిధికి విసరుచుండిరి. మధ్యాహ్నమగువఱకు నరాంత
కునిసైన్యము సగమువఱకు నశించెను. అంత నరాంతకుడు కృద్ధుడై రథ
ముతోగూడ మింటికెగసి యదృశ్యుడై, శరవర్షమును గురిపించుచు వానరుల
నండఱ మూర్ఛితులజేయుచు, రామునిసమీపించి గర్జించుచు, దూలనాడుచు
చెంతనున్న విభీషణునిజూచి, ఓరీ కులద్రోహీ! అన్ననువీడి శత్రువునాశ్ర
యించిన ఫలమునందెదవుగాక?, నిన్నీక్షణమున జంపివేసెదనని జాంబ
వంతుడు తలపడ్డ నాతనిపై నరాంతకు డొకశూలమును విసరెను. జాంబవంతు

డాశూలమునే గ్రహించి దానితోనరాంతకునిబొడిచి క్రిందపడవై చి మూర్ఛ తునిగావించెను. రామచంద్రుని కటాక్షముచే వానరులులేచి మూర్ఛతుడై పడి యున్న నరాంతకునిజూచి సంతసించుచు మఱల యుద్ధముచేయ మొదలిడిరి. అపుడంగదుడిట్లు తలపోయసాగెను. ఎంతనిష్ఠురముగ గొట్టినను యీనీచుడు మరణించుటలేదు. వీనికిమాచే మరణములేదు గాబోలు, ననుకొనుచు నరాంత కునికాళ్లుపట్టుకొని గిరగిరద్రిప్పి రావణసౌధప్రాంగణములోనికి విసరివై చెను. తాళవృక్షమువలె ప్రాంగణమునబడిన నరాంతకునిజూచి రావణుడువిలపించుచు సమీపించి వానినికాగలించుకొనెను. నరాంతకుడు లేకపోవుటచే రాక్షస సేనలు వెనుకకుమఱలెను.

అంత సూర్యుడస్తమింప వానరసైన్యము రాముని సమీపించి యాతని దయార్ద్రదృష్టిపాతముచే విగతశ్రమమైసుఖముగనుండెను. సుఖాసనోపవిష్టుడగు రామునిచెంత లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు గూరుచుండిరి. అంత హనుమదంగదులు రామచంద్రునిచరణముల నొత్తుచుండిరి. పార్వతీ! నిత్యము భగవంతుడు ప్రసన్నుడై వారల సేవలనందుచున్నాడు. వారెంతటి ధన్యులో గదా! అట రావణప్రాంగణమున మూర్ఛతుడైన నరాంతకునిజూచి వాని భార్యలు విలపించుచుండ నంత నరాంకుడు మూర్ఛదేరి యచటిసన్నివేశమును జూచి లజ్జితుడై, ఎవ్వరితోడను మాటాడక రథాధిరూఢుడై రణరంగమున కేగి గగనమునకెగసి, యదృశ్యుడై బాణవర్షమును గురియింపసాగెను. ఆకస్మిక మగు నాబాణవర్షమునకు దాళలేక వానరసైన్యము చెదరిపోవుచుండెను. కొందరు వానరయోధులాకసమునకెగసియు నటనేమియుగానక శరనిహతులై క్రిందబడుచుండిరి. సుగ్రీవు డెంతనిలువరించినను వానరులు నిలువక ప్రాణరక్షణ తత్పరులై వెనుకకుజూడక పఱుగిడుచుండిరి. అపుడు కొందఱువీరులు పై కెగసి నరాంతకునెటనుగానక కృద్ధులై లంకలో ప్రవేశించి గర్జించుచు రాళ్ళను రువ్వుచు దొఱికినరాక్షసులనెల్ల జంపుచు నానాభీభత్సమును జేయుచుండిరి. వారి రాయిడికి రాక్షసాంగనలు రోదనముజేయ నాధ్వని నింగిముట్టుచుండెను. రావణుడిదిజూచి రాక్షసుల బిలిపించి, ఓయీ! మీరీవానరుల జంపుడు. సందియమునుమాని నాయాజ్ఞను బాలింపుడన రాక్షసవీరులావానరులతో దల పడి వివిధాయుధంబుల ప్రయోగింప వానరు లారాక్షసులబట్టి వాలంబులజుట్టి

యూపిరాడకుండజేయుచు నేలపై మోదుచు చంపుచుండిరి. మఱియు సౌవర్ణ స్తంభముల నూడబెఱుకి మేడల గూలద్రోయుచు, దొరకిన రాక్షసులను చిత్ర వధచేయుచుండిరి. వారి ధాటికి నోర్వజాలక రాక్షసులు విలపింపసాగిరి కాని వారి నోదార్చువారులేరైరి. చలపిప్పలమువలె లంకయంతయు చలించిపోవు చుండెను. కొందఱువానరులు రాక్షసాంగనల జుట్టుబట్టి ఈడ్చుచుండ నారాక్ష సాంగనలు బిగ్గరగ విలపింపసాగిరి. ఆమొఱలనువిని నరాంతకుడు కృద్ధుడైవచ్చి వానరాధములారా! స్త్రీలకడనా మీపౌరుషము! ఛీ! రండు! నాతో కదన మొనర్పుడని సింహనాదముచేయుచుండ, నోరీ! నీవలె మేము దొంగయుద్ధ మును జేయువారము కాము. నీవదృశ్యుడవగుటచే నిన్ను రప్పించుటకోపనిని జేసి తిమికాని మేమూరక స్త్రీలను బాధించువారముగామని వారలవిడిచిపెట్టిరి. నరాంతకుడంత బాణవర్షమును గురియింప వానరులలిగి గండశిలలచే వాని హయసారథిరథముల రూపుమాపి, యాతని బాణబాణాసనములను శస్త్రాస్త్ర ములను విఱిచి పారవైచి యాతనిని మూర్ఛనొందించి, దొఱకిన నిశాచరులనెల్ల వధించుచు నల్లకల్లోలము జేయుచుండిరి. అంత సూర్యుడస్తాద్రికరుగ వానరులు యుద్ధమునుచాలించి, రామచంద్రునికడకేగి నమస్కరించి, యాతని కృపావ లోకనమున విగతశ్రములై, యాతని యనుజ్ఞనుబడిసి తమ కనుకూలములగు వృక్షపర్వతగుహాలలో సుఖముగ నుండిరి. పార్వతీ! భగవదనుగ్రహపాత్రుల కెందైనను లోపముండదుగదా!

అట నరాంతకుడు మూర్ఛదేరి యచటిపరిస్థితినిజూచి, ఖిన్నుడై, తోడనె పట్టరానికోపముతో రాక్షసవీరుల వెంటనిడుకొని మఱల బాణబాణాస్త్రశస్త్ర మండితమగు రథమునధిష్ఠించి, యుద్ధాభిముఖుడై, సింహనాదము జేయుచుండ నాతనియనుచరులు యుద్ధోన్మత్తులై రణరంగమున నాట్యమాడుచుండిరి. కరి తురగములరవములు భూనభోంతరాళమున వ్యాపించుచుండెను. రాక్షసులు రౌద్రమూర్తులై ఒడలెఱుంగక వానరులపై శరజాలమును వర్షింపసాగిరి. వాన రులు నమితోత్సాహముతో హుంకరించుచు కిలకిలారావములు జేయుచు, పెద్దపెద్దవృక్షములబెకలించి రాక్షసులపై విసరుచు రాక్షసులదునుమాడుచుండిరి. సింగము మృగములనువలె గజతురగాదులనెల్ల జంపివేయుచుండిరి. అప్పుడు రణభూమి రాక్షస కరితురగ కళేబరములతోడను, రక్తవాహినులతోడను

మిక్కిలిభయంకరముగ నుండెను. రామనామము నుచ్చరించుచు వానరులు సోల్లాసముగ రాక్షసుల బరిమార్చుచుండిరి. ప్రచండానిలము మేఘజాలమును వలె వానరానీకము రాక్షససైన్యమును చెదరగొట్టుచుండెను. ఇట్లు వానరరాక్షసైన్యములు రెండును పరస్పరజయాకాంక్షచేమిక్కిలిపట్టుదలతో ఘోరముగ బోరుచుండ, రాక్షసుల బాణవర్షముచే రణరంగ మంధకారావృత మయ్యెను. అప్పుడు నిశాచరులు సోల్లాసముగ బోరుచుండిరి. వానరులా యంధకారములో జేయునదిలేక ఖిన్నులగుచుండిరి. అంత శ్రీరాముడొక దివ్యాస్త్రమునుబ యోగింప దానికాంతిచే నాయంధకారము తొలగిపోయెను. మఱల వానర వీరులు సోత్సాహముగ జెట్లను, గండశిలలనుబూని రాక్షసుల నొప్పించుచు, వారితలల దునుముచు, రాక్షసులు బ్రయోగించెడి యాయుధముల నొడిసి పట్టి, వానిచే వారినేజంపుచు సత్యాగ్రహావముచే నారాక్షసుల నోడించుచుం డిరి. హనుమదంగదులు విజృంభించి, రాక్షసుల జిత్రవధగావించి సముద్రము లోనికివిసరివేయుచు యుద్ధభూమిని విరళరాక్షసముగ జేయుచుండిరి. ఇట్లాకద నమున నరాంతకునిసేనలు నలువదిరెండుకోట్లు మడిసినవి. పార్వతీ! రాత్రిరి గూడ చీకటినిబాపి తనసేనల కుత్సాహమును గల్పించి యుద్ధమునుసాగించిన రామచంద్రునిప్రభావమును దెలిసికొంటివా! అట్లు కదనమున దన యోధులు మరణించుటకు నరాంతకుడు దురపిల్లి, మఱలనొక కోటిసైన్యమును రప్పించి యుద్ధమునకేగెను. అంత నరాంతకుడు సంమోహనాస్త్రమును బ్రయోగింప వానరసేనలు చిత్తరువునందు లిఖింపబడినట్లు నిశ్చేష్టములైయుండెను. అప్పుడు నరాంతకు డావానరవీరులను బట్టి కొట్టుచు లంకలోనికి విసరివేయుచుండెను. రావణుడు కొడుకుపరాక్రమమునకు సంతసించుచుండెను. అంగదహనుమంతులు మూర్ఛదేలియు మఱల నరాంతకుని యస్త్రముచే మూర్ఛితులయిరి. ఇట్లు మధ్యాహ్నమువఱకు నరాంతకుడు విజృంభించుచుండెను. బ్రహ్మవరమును పాటించుచు రాక్షసజయమును వానరపరాజయమును జూచుచు రామచంద్రుడు నిర్వికారముగ నుండెను. పిమ్మట రామచంద్రుడొక హుంకారమును జేసెను. తోడనె వానరులందఱు మూర్ఛనుండిదేరిరి. అంగదాదులు రాముని జేరి చరణ ములకునమస్కరించి, యాతనికృపావలోకనమున విగతశ్రములై నిలిచియుండ రాము డిట్లనియె. వానరులారా! బ్రహ్మ మున్నిచ్చిన వరప్రభావమున

మీరిట్లు మూర్ఛనంది పరాజితులైరి. ఇక నెన్నడును మీకిట్టిపరాభవము కలుగ నేరదు. మిమ్మస్మరించువారికిని పరాభవముకలుగదని బలుక నంగదహానుమం తులు మిగులసంతసించిరి. అంతలంకలో బంధితులయిన వానరుల విడిపించి తెండనిరాముడన, రామాజ్ఞనుదలదాల్చి వారిరువురు లంకలోబ్రవేశించిరి. అటబంధితులైన వానరులుమూర్ఛదేరి రాముసిస్మరింపగనే వారిబంధములూడి పోయినవి. వారంత బైటకువచ్చి అంగద హనుమంతులజూచి సంతసించిరి. పిమ్మట వారందఱునుగలిసి అటనున్న రాక్షసుల వధింపమొదలిడిరి. అంత నంగదహనుమంతులా వానరులను రామసన్నిధినిజేర్పవలెనని బయలుదేరివచ్చు చుండ, నరాంతకుడు వారలనెదిర్చి పోరాడసాగెను. వానరులాతని పరాక్ర మమునకు భయపడుచుండిరి.

లక్ష్మణ నరాంతకుల యుద్ధము

అదిజూచి రాముడు, లక్ష్మణా! వానరులు భయమందుచున్నట్లున్నది. కానవీవేగుమన, లక్ష్మణుడు ధనుష్పాణియై రామాజ్ఞను వడిసి, యుద్ధ భూమి కేగి, ఓరీ దుష్టాత్మా! ఆవానరుల నేల భయపెట్టెదవు! ఇటురమ్ము. నాతో పోరి వీరుడ వనిపించుకొనుమనుచు బాణవర్షముచే రాక్షసుల దునుమాడసాగెను. అంత నరాంతకుడు కృద్ధుడై, లక్ష్మణునిపై నంపవానను గురియింప నాత డాబాణవృష్టిని మధ్యనే నిలిపి నరాంతకుని నొవ్వనేయ, దానికి వానరులు, దేవతలును సంతసించిరి. పూలవాన గురియుచుండ జూచి నరాంతకు డొకశక్తిని లక్ష్మణునిపై విసరెను. దానితో లక్ష్మణుడు మూర్ఛితుడయ్యెను. అపుడు రాక్షసులు వానరులను బట్టి భ్రమింగదొడగిరి. అప్పుడు వానరులు చేయునదిలేక భయముచేపారదొడగిరి. రాక్షసులు వానరరూపములదాల్చి వానరులతోగలిసి రహస్యముగ వానరుల భ్రమింగుచుండ వానరులీవిషయమును గుర్తించి మిక్కిలిభయమందుచు నెవరిని ఎవరును నమ్మ లేకపోవుచుండిరి. నరాంతకుడు విభీషణునివేషముతో నంగదహనుమంతుల దరికేగ వారాతనిని దెలిసికొనలేకుండిరి. ఇంతలో లక్ష్మణుడు మూర్ఛదేరి చూచువఱకు వానరసైన్యము క్షీణించెను. అంత హనుమంతుడును నరాంత కుని మాయను గ్రహించెను. అపుడు లక్ష్మణుడు మాయాహారిశరముచే వాని

మాయ నిర్మూలింప నరాంతకుడు విజయముకొఱ కొక యజ్ఞమును జేయ దలచి దాని కనువగుసామగ్రిని సంపాదించుచుండెను. అట హనుమంతుడు విజృంభించినతోడనే రాక్షసులు చెదిరిపోయిరి. అంతప్రదోషసమయ మగుటచే యుద్ధమునుచాలించి వానరులు రాముని సమీపింపనాదయామయుని కృపా ర్ద్రచిత్తుడై వారందఱు విగతశ్రములై సోల్లాసముగనుండిరి. లక్ష్మణు డును రాముని దర్శించి కృతార్థుడయ్యెను. రామచంద్రుడు లక్ష్మణునిగౌగ లించుకొని దగ్గిరకూర్చుండబెట్టుకొని, అంగదహనుమంతుల పరాక్రమమునుగొని యాడెను. లక్ష్మణు డన్న పాదములనొత్తుచుండ సుగ్రీవ విభీషణులు ప్రక్కల గూచుచుండి యుద్ధవిశేషములను నరాంతకుని యుద్ధకౌశలమును మచ్చటిం చుచు ,వీడు విధాత్రవరప్రగల్భుడు. కాకున్న నింతపర కెట్లుమరణింపడు? వీని జంపునుపాయమెద్ది? అనవిని రామచంద్రుడు మందహాసముచేయుచు నిట్లనియె.

రాముడు తనకును శివునకును భేదములేమిని దెలుపుట

మిత్రులారా! నరాంతకుడు నిజముగశివానుగ్రహపాత్రుడు. ఆశివుడు భక్తులకు మోక్షములగు వరములిచ్చుచుండును. శివునకును నాకును భేదములేదు.

శ్లో॥ రకారం రుద్రరూపంతు మకారం శక్తిరుచ్యతే
శివశక్తిసమాయుక్తో రామ యిత్యక్షరద్వయం॥

ఇట్లు కొందరుభక్తులు మాకిరువురకభేదకల్పనము జేసికొని మోక్షమునొం దుచున్నారు. ఈవిషయము నెఱుంగక రాక్షసులునాతోపైరమును, శివునియందు భక్తినిబెట్టుకొనుచున్నారు. కాని మాయిరువురకు భేదములేనందున శివభక్తులను నేనుపేమింతును. శివుని సేవించినవారికి సకలశ్రేయస్సులు కరతలామలకములు. మీనమునజలమును విడువ నట్లుమాయిరువురిమనములు నొకరినొకరిని వీడవు. నా కాతనిహృదయము, నాతనికినాహృదయమును నివాసస్థానములు. ఈవిషయము నెఱుంగక హరిహరులకును భేదమునుగల్పించి మతవైషమ్యచే లోకులుచెడి పోవుచున్నారు. మాలో నెవరిని నిందించినను దుర్గతికి పాలగుదురు. శివభక్తు డైన నరాంతకు డజేయుడగుటలో నాశ్చర్యములేదు. మీరును శివు నారాధిం చిన యజేయులుకాగలరు. శివు నారాధింపనివారు నాకును భక్తులుకాజాలరు. శివభక్తులహృదయమున నేను నివసింతును. శివపార్వతుల నారాధించినవారు

భవసాగరము సనాయాసముగ నోడలేకయె దాటగలరను రామచంద్రునిమాటల విని వారందఱును సంతసిల్లి శివనామస్మరణమును గావింపదొడంగిరి. అప్పుడు రామచంద్రు డానందాబ్ధి నోలలాడుచు దానును వారితోపాటు శివనామమును స్మరించుచుండెను. అప్పుడు రాత్రి రెండుగడియలు దాటినది. అంతనారద మహర్షి రామదర్శనమునకువచ్చి, రామలక్ష్మణుల దివ్యరూపములగాంచి తన నేత్రములు సఫలములైనవని సంతసించుచుండెను. అంత రాముడు నారదుని జూచి, లేచినమస్కరించి సుఖాసీనునిగావించి, కుశలమడిగినంత నెమహర్షి యపరిమితానందమునంది ప్రభూ! నీవెఱుగనిదేదియునులేదు. అయినను మమ్ముల గృతార్థుల జేయుట కిట్లునటించుచుందువు. కమలభవుడు నీనామమును స్మరించుచుండును. నేనాతని పంపున నీవద్దకు వచ్చితిని. అతడు తాను రాక్షసుల కిచ్చినవరములను, నరాంతకునకు నీభక్తుడగు దధిబలునిచేత మృతియు, మీకెరింగించి, ఈరాత్రి తెల్లవారకమునుపె దధిబలుని రావించి యాతనిచే నరాంతకుని జంపింపుమని జెప్పుటకై నన్నిటకు బంచెననిచెప్పి రాముని స్మరించుచు నాముని మఱల సత్యలోకమునకు జనియె.

రాముడు *దధిముఖుని గొనితేర మారుతి నంపుట

అంత రామచంద్రుడు హనుమంతుని జూచి, హనుమా! సముద్రమధ్యమున ధవళగిరియందు *దధిబలుడు చిరకాలమునుండి నాకై తప మాచరించుచున్నాడు. నీవచటికేగి యాతపోనిధిని గలిసి మాటాడి శీఘ్రముగ నిటకుదోడితెమ్ము. అని దీవించి బంప నాతడు రామచరణకమలములకు నమస్కరించి, రామనామమును స్మరించుచు బయలుదేరి శరవేగమున జని మూడు ఘడియలకాపర్వతమును జేరి, ఇటునటు దిరుగుచు సూర్యసంకాశమగు నొకగుహను గాంచి యటకేగి దధిబలుని జూచి సంతసించి అట నిలబడెను. కాని యాతడు నిమీలితనేత్రుడై ఏకాంతభక్తితో నచలస్థితి యందుండెను. అప్పుడు హనుమంతుడిట్లు తలపోయసాగెను. ఏమి యీతని భక్తి! ఎంతధన్యుడు! నేనిట్టి భక్తునెందును జూడలేదు. అని విస్మయమందుచు నీతడు కన్ను తెఱవచుట లేదు. ఈతనితో మాటాడుటెట్లు! కాలమతిక్రమించుచున్నది. కొండనుపెకలించి తీసికొని పోవుటకు రామాజ్ఞలేదు. ఏమిచేయుటకును దోపకున్నదని చింతించుచు

---

* నామాంతరము.

దానును రామనామమును జపింప మొదలిడెను. అంత భగవత్ప్రేరణమువలన దధిబలుడు కన్నువిప్పి ఎదుటనున్న హనుమంతునిజూచి సంతసించి యాతని గాగ లించుకొని కుశలమడుగ హనుమ ఇట్లనెను. మిత్రమా నీవెవనియనుగ్రహమున్నచే ఇట్టు ఘోరతపమాచరించుచుంటివో! ఆరామచంద్రప్రభువు సోదరసహితుడై ఇట కనతిదూరంబున నున్నవాడు. నీవు ధన్యుడవు, నీతపస్సు ఫలించినది. ఏపాదపరాగమువలన యహల్య ముక్తినందెనో! అట్టి సుందరచరణకమలమును కన్నారజూచి నమస్కరించి కృతార్థుడవు కమ్ము లెమ్ము. నీతపమునకు మెచ్చినిన్ను తోడిదెమ్మని నన్నాప్రభువు పనిచెను అని యమ్మృతో పమనులగు నాతని మాటలవినితోడనె దధిబలుడాతనివెంట బయలుదేరిచని, శివహృద యాంతర్వాసియగు శ్రీరామచంద్రుని కన్నులారజూచి, పదంబులపై బడి మైమఱచి పులకితగాత్రుడై ధ్యానింపుచుండ నాతని లేవనెత్తి భగవంతుడు తనచెంత గూరుచుండబెట్టుకొనెను.

నరాంతక దధిముఖ సమాగమము

పార్వతీ! చూచితివా! రామునిభక్తవాత్సల్యమును? అప్పుడు దధిబలుడు సుగ్రీవునికి నమస్కరింప సుగ్రీవుడాతనికాగలించుకొనెను. అప్పుడాతండ్రికొడుకులు పరస్పరము గాఢాలింగన మొనరించుకొని యమితానందమగ్నులైరి. దధిబలుని జూచిన యంగదునియానందమునకు మేరలేకుండెను. అంత ప్రాతఃకాలమగుటచే వారందఱు గృతస్నానులై భగవత్పాదములకు నమస్కరించి సంతసించుచుండిరి. అంతవానరవీరులు రామునకునమస్కరించి యనుమతివడిసి, గండశిలలను వృక్ష ములను బూనియమితోత్సాహముతో రణరంగమునకు బయలుదేరిరి. వీరికోలా హలమునువిని నరాంతకుడుయజ్ఞమునకు వీరివలనవిఘ్నమునుశంకించి, వీరలబరి మార్చి నిర్విఘ్నముగ యజ్ఞమునుజేయదలచి, రాక్షసవీరులవెంటనిడికొని రథా రూఢుడై బయలుదేర నారాక్షసవీరులు కారుమేఘములవలె సంగ్రామాంగణ మునాక్రమించిరి. అంతనరాంతకుడదృశ్యుడై మాయలబన్నుచుండెనుకాని రామ చంద్రునిప్రభావముచే నామాయలన్ని యుసమసిపోయి నరాంతకుడుప్రత్యక్ష మయ్యెను. అంతదధిబలుడుమిత్రుని పరుగునబోయికౌగలించుకొనెను. నరాంత కుడును దధిబలునిజూచి సంతసించుచుకౌగలించుకొని, తానిటకువచ్చుటకుగార

ణమును, తాజేసినపనినిజేయదలంచినదానిని సవిస్తరముగదధిబలునితోజెప్ప దధిబలుడిట్లనియె. మిత్రమా! నీవుప్రాజ్ఞుడవై యుండియునిట్లులపొరబడుచుంటివి? సహజగుణములు మాఱువు. విషవల్లికి నమృతఫలములద్భవింప వను నార్యోక్తి నీయెడ సత్యమగుచున్నది. నీవవినీతుడవైన తండ్రివలెచెడక, యుక్తాయుక్తముల నాలోచింపుము. తండ్రిచెడుగైన ప్రాజ్ఞుడగుకొమరుడు వానినిమఱలింపవలెనుగాని తానుతండ్రిననుసరించిచెడుటయుక్తముకాదు. కాననీవునీతండ్రినిబోధించి, యాతని మంచిదోవకుదెమ్ము. నేటికి నాలుగుదినములనుండి యుద్ధముచేయుచుంటివి. కాన వానరపరాక్రమము నీకుదెలిసియేయుండును. ఖరదూషణకుంభకర్ణమేఘ నాదయహిరావణుల ననాయాసముగజంపినరాముడు మానవుడెట్లగును? భగవద్విరోధులకు బ్రతుకుదెఱువులేదుగదా! కాన నీవునునీతండ్రియు నారామచంద్రుని భజించియాతనియనుగ్రహముచే దుఃఖదూరులై సుఖింపుడన నరాంతకుడుకృద్ధుడై ఇట్లనియె. ఓరిపిఱికిపందా! నీవానరజాతి, లజ్జాపౌరుషవిహీనము. రాముడు వాలిని జంపినంతమాత్రమున సిగ్గునువీడియంగదుడా పితృఘాతకునికి దాసుడై సేవించుచున్నాడు. నీవును నీపెద్దతండ్రినిజంపెననిదలంపక నీతండ్రికుపకారమును జేసినందులకు సంతసించి యాతనిని నీతండ్రితోపాటుసేవింపుచుంటివి. మాజాతి యవమానమునుసహించి శత్రువునెన్నటికినిసేవింపదు. మఱియు గుంభకర్ణునివంటిపినతండ్రిని, మేఘనాదాక్షయకుమారులవంటి సోదరులనుజంపిన కులఘాతకుడగురాముని సేవింపుమనిన నిన్ను బాల్యమిత్రుడవు సహాపాఠివి అనిమన్నించితిని. లేనిచోనీనాలుక నూడబెఱుకియుండెడివాడనని యాతనినిదాటి రాముని పైబడబోవ, దధిబలుడు నరాంతకుని దనవాలముతోబంధించెను.

దధిముఖుడు నరాంతకుని సంహరించుట

అంత నరాంతకుడు కృద్ధుడై, ఓరీ! నావద్దనే నీపరాక్రమమును జూపుచుంటివా! చూడునాపరాక్రమమునని బలుకుచునాతనిని నేలబడవైచి రాముని పైకుఱుకుచుండ దధిబలు డడ్డముగవచ్చి యాతనితోదలబడెను. అపుడు వారిరువురకు ఘోరమగు ద్వంద్వయుద్ధము ప్రారంభమయ్యెను. అంత వానరవీరులు రాక్షసులతోదలపడి చిత్రవధగావించుచు నరాంతకుని యనుచరులందొక్కరుడైనను మిగలకుండ సంహరించిరి. ఇక నరాంతకదధిబలులు, కజ్జల

కాంచనగిరులవలె ఘోరముగపోరుచుండిరి. ఇట్లు కొంతతడవుపోరి నరాంతకు డదృశ్యుడై యాకసమునకెగర, దధిబలుడును వానితోడన గగనమునకు లంఘించి, శాస్త్రోక్తరీతిని ఆతనితోషడ్విధముల రణమొనర్చుచుండ, పైనుండి దేవతలు, క్రిందనుండి సుగ్రీవుడును విస్మితులైచూచుచుండిరి. అంతపుత్రుని రణకౌశలమున కచ్చెరువందుచు పులగితగాత్రుడైనను సుగ్రీవుడు జాంబవంతుని జూచియిట్లనియె. సచివోత్తమా! వీరిరువురు సమానబలనై పుణ్యాములు గల వారు. సమముగ బోరాడుచుండిరన నాతనిభావమును గ్రహించి జాంబవంతు డిట్లనియె. వానరసాగ్వభౌమా! విరించివరప్రభావమున వాడింతవఱకు బోరాడు చున్నాడు. నరాంతకునకు దధిబలునిచే మృత్యువుతప్పదు. సమయమాసన్న మయినది. నరాంతకు డలసిపోవుచున్నవాడన సుగ్రీడు సంతసించుచుండెను. అంతలో దేవతలాకశమునుండి, దధిబలా! నీపరాక్రమమునకు మెచ్చితిమి. నీయుద్ధనై పుణ్య మనన్యసాధారణమనిపొగిడి యాతనిపై కుసుమవృష్టిని జిమ్మి గురియింప నరాంతకు డతికృద్ధుడై దధిబలునిబట్టి మిక్కిలి దూరముగనెగల సియటముష్టియుద్ధమును జేయుచుండెను. అపుడు దధిబలుడు తామున్న గగన భాగము భూమికి ఎనుబదియోజనముల దూరమున్నదనిగ్రహించి, నరాంతకుని పాదములబట్టి గిరగిరద్రిప్పి బలముకొలది భూమిమీదకు విసరెను. తోడనె నరాంతకుడా దెబ్బకు తాళజాలక భూమిపై బడి గిలగిలదన్నుకొనుచు రాముని జంపలేకపోతినని రామునిస్మరించుచు నీయధమశరీరమును విడిచి యోగిదుర్లభ మగు దివ్యధామమునందెను. దేవతలువానికట్టి దివ్యధామము నిచ్చినందులకు విస్మితులగుచుండిరి. రామచంద్రునిపై పుష్పవర్షమునుగురియించిరి. అంతదధి బలుడువచ్చి చచ్చిపడియున్న నరాంతకుని శిరమునూడబెఱికి చేతనుంచుకొని, మొండెమును లంకలోనికి విసరివైచి, తానురామచంద్రునికడ కేగెను. అంతలో చీకట్లుక్రమ్మగ భూతభేతాళగణములు రణభూమినాక్రమించుకొని యారాక్షస కళేబరముల భక్షించుచు నోలలాడుచుండెను. వచ్చినదధిబలునిజూచి రాముడు సగౌరవముగ నాతనికాగలించుకొని తనచెంత గూరుచుండబెట్టుకొనెను. దధి బలుడు తాదెచ్చిన నరాంతకునిశిరమును ప్రభునియొద్దనుంచగా, సుగ్రీవా! దీనినిభద్రపఱుపుమని రాముడానతిచ్చి దధిబలుని కొనియాడుచుండెను.

దధిముఖుడు తనరాజ్యమునకు బోవుట

పార్వతీ! ఎవనియనుగ్రహముచే నింద్రాదులంతనునులై రో! అట్టిరామ చంద్రుడు దధిబలునాశీర్వదించికొనియాడ నాతడానందపులకితగాత్రుడై, భక్తిరస ప్రవాహమున మునుగుచు నంబులఘటించిఇట్లనియె. ప్రభూ! నాశ్రమమన్నియు ఫలించినవి. దీనదయాళువులగు మీయనుగ్రహమె మమ్మింతవాఅలజేసినది. స్వభావచపలులు, మూఢులు, విషయలోలుపులునగు వానరులెక్కడ! ఈమహాతార్కుములెక్కడ! నీదాసులమగు మమ్మునీవుపొగడుటచే నాకుసిగ్గగుచున్నది. తమకీర్తిప్రభావములు ముల్లోకములందునుసవిదితము. మిమ్ములవేదములు, శేష సరస్వతులేకొనియాడజాలరన నేనెట్లుస్తుతింపగలను? ఆకులనమ్మికొనువానికి మణి విశేషములెట్లుగోచరమగును? ప్రభూ! అనిరామచంద్రు ననేకవిధముల స్తుతించుచు నాతనిపదకమలములబడి లేవకున్నదధిబలుని యమితభక్తికి దేవతలచ్చెరువందనాతనిని రామచంద్రుడులేవనెత్తి, వత్సా! నీవునిష్కలంకభక్తుడవు. నీకు సమ్మతమగువరమునిత్తును కోరుమననాతడు సంతసించుచు నిట్లనియె. ప్రభూ! నీరూపగుణనామము లెల్లకాలము నాహృదయాగారమున నుండునట్లనుగ్రహింపుము. సాధ్వినిజభర్తను, మహానదిసముద్రమును, వీడకుండునట్లు నామనము నిన్ను వీడకుండుగాతమన నట్లేయగును. నీవు ముదముతో శివునారాధించుచు బిహ్బలపురమునుపాలింపుము. శివభక్తులందు నాకపరిమితప్రీతి కలదని రామచంద్రుడుబలికెను. పార్వతీ! రామభక్తులకు దుర్లభమయినదిలేదు. మాకిరువురకును భేదములేదు కానభేదదృష్టినిమాని మమ్మారాధించినవారిని కృపాదృష్టితోచూచుచుందుము. నది సాగరమునబ్రవేశించినట్లు, రామకటాక్షము భక్తులందుబ్రవహించుచుండును. ఇట్లు దధిబలుని రాజతిలకునిగ జేసినందుకు సుగ్రీవాంగదులెంతేని సంతసించిరి. అంతదధిబలుని విహ్వలపురమునకు ప్రయత్నపూర్వకముగబంపెను. దధిబలుడును రామాజ్ఞను శిరమునదాల్చి మిత్ర బృందముతోగూడి యాపురమునకేగి రాజ్యమును పాలింపుచుండెను. నరాంతకుని మొండెమునుజూచి, రావణుడు ధైర్యమునువీడి ముక్తికంఠముతో విలపింపసాగెను. లంకయంతయు కలవరమందుచుండెను. మండోదరిమున్నగు నారీమణులు దుఃఖార్ణవమున మునిగిపోయిరి. బిందుమతిమున్నగు నరాంతకుని భార్యలు, మూర్ఛలోమునిగిపోయిరి. గరుత్మంతా! వారిశోకసముద్రమునందు

లంకఁబడవలెనున్నది. అందానారీమణులు విలపించుచునెక్కిరి కాని మునుగు చున్న యోడను బైకిదీయువారెవ్వరును లేరైరి.

బిందుమతిచరిత్రము

అంతమండోదరి కోడలినోదార్చి సులోచనావృత్తాంతమును దెలుప బిందు మతిధైర్యము నందిచెల్లెండ్రనోదార్చి తనసర్వాభరణంబులవీడి, అత్తకునమస్కరించి నిలువగా, అమ్మా! నీవుప్రాజ్ఞవు. పతివ్రతవు. కానరామచంద్రునిదర్శించి నీభర్తృ శిరమునుదెచ్చుకొని నీకర్తవ్యమును జేయుమన వెంటనేపల్లకిని దెప్పించి పతికళే బరమునందుంచి, తానును దానిలోకూరుచుండెను. తోడనే చిత్రలేఖ, అక్కా! నీవొంటరిగజనుట యుక్తముగాదు నేనునువచ్చుచుంటిని. దయయుంచితోడకొని పొమ్మన నామె యభిప్రాయమును గ్రహించి సమ్మతించి తనతోపాటు కూరు చుండబెట్టికొనెను. సపరివారముగ వచ్చుచున్న వారలజూచి, శత్రుసైన్యము వచ్చుచున్నదని కొందఱు వానరులాపల్లకి కెదురుగబోయి, అందుస్త్రీలుండుట గాంచి, వారినిదెలిసికొని, రాముని సన్నధికేగి, ప్రభూ! నరాంతకుని భార్యలు వచ్చుచున్నారు. ఏమి! శలవన, వారబలలు. ఏకపత్నీవ్రతులమగు మనకు వారితో మాటాడుట యుక్తముగాదు. కానవారెందులకువచ్చిరో! తెలిసికొనిరండన, వానరులు రామాజ్ఞను దెలుప వారిట్లనిరి. మేము రామునిదర్శించినేత్ర సాఫల్యము నందవచ్చితిమి. కానమాకు తప్పకదర్శన మీయవేడుచుంటిమి. వానరులారా! మామాట రామునకుజెప్పుడు. "రామా! నీకుభేదభావములేదు. చరాచర జీవలోకమంతయు నీసంతానము. నీవేయీబిడ్డల జూడనియెడల వీరికి దిక్కెవ్వరు? బిడ్డలనవమానించు తండ్రులెందైనగలరా! మతియు నహల్యను గాపాడితివి. శబరినుద్ధరించితివి. మాబోటి యనాథలనురక్షించుటపరమధర్మము. కాన త్రిజగద్వంద్యుడవైన నీవుమాకు తప్పక దర్శనమీయవలయును. మాకు రాక్షసభావమువీడిపోయినది. నీవు సర్వజ్ఞుడవు. మేము ప్రతివ్రతలము. సత్పురు షులు పరస్త్రీలను స్వప్నమందైనను స్మరింపరనుమాట నిక్కువము. కాని స్వార్వాంతర్యామి వగు నీకు స్వపరభేద ముండదగదు. నదులన్నియు సాగర ములో గలిసినట్లు భక్తులెల్లరు నీచరణములను జేరవలసినదే. నీవు నిర్దోషివి. కాన మాకు దర్శనమిచ్చి మమ్ము గృతార్థలజేయుము. విలంబము

వలదు. మాభర్త తమ యనుగ్రహామును వడసెను. కాన మమ్మ్మనుగ్రహింప వలయు'' నని విలపించుచు నేలపడిపోయిరి. ఆస్త్రీల దీనాలాపముల విని రామ చంద్రుడు జాలినొంది వారికి దర్శనమిచ్చి, మృదుమధురవాక్యములతో నిట్లనియె. బిందుమతీ ! నీవు బుద్ధిమంతురాలవు. పతివ్రతవు. నీభక్తికి వివేకమునకును మెచ్చితిని.నీయభీష్టమెసగెద.కోరుకొనుమన నానందపరవశయై,యంజలిఘటించి, ప్రభూ ! నేను ధన్యను. నీపవిత్రపాదములందుద్భవిల్లిన గంగ త్రిలోకపావని. అట్టి నీచరణకమలములజూచిన మేమెంతేని కృతార్థులము. ఇట్టి మహాభాగ్య మదుదు. మమ్మ మానాథునితో గూర్చుము. నీకీర్తి ముల్లోకముల వ్యాపించును. మాపనిని ద్వరగ నెఱవేర్చుమని ప్రార్థింపగ రామచంద్రుడు జాలివడి, అమ్మా ! నీకేమియు భయమక్కరలేదు. నీనాథుని బ్రతికింతును. నీవు నీనాథునితోగలిసి సుఖముగనుండుమన, ప్రభూ ! మాకీజననమరణ ప్రవాహమున బడుటకిష్టములేదు. మాభర్త మీచరణసన్నిధి నసువులబాసి కృతార్థుడయ్యెను. మీయనుగ్రహామునుబడిసి మాసులోచన ధన్యయైనది. మీనామమును స్మరించుచు మృతులగువారే ధన్యులన మీసన్నిధిని మృతులధన్యతను చెప్పవలయునా ! ఈసమయముదాటిన నిట్టిఫలమెన్నడును కలుగనేరదు. నీదర్శనమునుగోరి శివపార్వతులంతటివారు విరాగులైయడవుల దపనూచరించుచున్నారు. ఎందఱో మహాయోగులు ఘోరతర తపమాచరించుచున్నారు. వారందఱకన్నను మేముధన్యులము. అమృతమును గ్రోలినవానికి విషమెందులకు?

బిందుమతి సహగమనమును జేయుట

ప్రభూ? నాపతిశిరమునిచ్చి మమ్మనుగ్రహింపుమన, రామచంద్రుడు నరాంతకునిశిరమును దెప్పించి బిందుమతికిప్పించి, అంగదాదులరావించి, చందనతరు కాష్ఠములచే చితినమర్పుడని, విభీషణునిజూచి, లంకేశా! నీకోడలు సహగమనము జేయుచున్నది. ఆకృత్యమునంతను సక్రమముగ జేయింపుమన, విభీషణుడు పదివేల బారువుల చందనమును బట్టించుకొనిపోయి, సులోచనాసహగమనస్థానమున కనతిదూరమున చితిని సిద్ధముచేయించెను. బిందుమతి సవతులు పదునలుగురు నటకువచ్చి యాచితినిజూచి మూర్ఛితలైరి. తుదకు లేచి యాచితాగ్నిని జూచి భయపడి వెనుకకుబోయిరి. తిరిగిచూచి, బిందుమతీ ! మమ్మ్మలవీడి నీవు

పతిననుకరించుచుంటివి. ధన్యవని విలపించుచు, మన పదునారుగురిలో నీవును చిత్రలేఖయు ధన్యాలని పొగడుచుండిరి. అంత వారందఱు గంగాసాగరసంగమ మందు స్నానముజేసి, మృతపతి కళేబరమును స్నానముచేయించి, రాముని స్మరించుచుండిరి. అంత రావణుడు మూర్ఛదేరి భార్యవలన బిందుమతీవృత్తాంత మునువిని భార్యలతో నాచితినిజూచుటకు బయలుదేరెను. సపరివారముగ వచ్చుచున్న రావణునిజూచి బిందుమతితోనేగిన వానరులు భయపడివచ్చి రామునకీవృత్తాంతమును జెప్పగ వెంటనే విభీషణుని దోడితెండని రాము డాజ్ఞాపించెను. అంత కుమారుడనువాడటకేగి రామాజ్ఞ నెఱిగింప, గోడంద్రకు జ్ఞానోపదేశ మొనరించి విభీషణుడు రామసన్నిధికేగెను. రావణుడటకేగి యట నున్న బిందుమతీ చిత్రలేఖలజూచి, పండితుడయినను పామరునివలె విలపింప జొచ్చెను. విలపించుచున్న మండోదరిని కోడంద్రు జ్ఞానబోధలను, పతివ్రతా మహాత్మ్యమునుజెప్పి యోదార్చుచుండిరి. బిందుమతినిజూచి మిగిలిన సవతు లందఱును విభీషణోపదేశము ననుసరించి, జ్ఞానసంపన్నలై సహగమనమె శ్రేయస్కరమనియెంచి, చితివద్దకేగి బిందుమతికి దమయభిప్రాయము నెఱిం గించి, యామె సమ్మతినివడసి, చితారూఢలై యధోచితరీతిని గూర్చుండిరి. అంత చితిప్రజ్వరిల్లి యగ్నిజ్వాల లాకసమునందుకొనుచుండెను. ఆజ్వాలల నాధా రముగగొని యాపతివ్రత లూర్ధ్వలోకమునకరిగిరి. వారల దేవతలు పొగడు చుండిరి. పిమ్మట రావణుడేదియో తలపోయుచు నిజనివాసమున కేగెను. మండోదరి పుత్రులందఱు దనకన్నులముందఱ నిట్లగుటకెంతేని విలపింపసాగెను. ఆమె దుఃఖమునుజూచి ఎల్లఱు భయమందుచు, రామునితో వైరమువలదని ఎవ్వరుజెప్పినను మనరాజువినడయ్యెనని విలపింపసాగిరి. రావణుడట్లేగి ఇక ముందు కర్తవ్యమేమి! యని దీర్ఘముగ నాలోచింపమొదలిడెను. అట రామ చంద్రుడు సుఖాసీనుడైయుండ సచివులాతని బరివేష్టించి, ప్రభూ! ఇంతవఱకు చాలమంది రాక్షసవీరులు నిహతులైరి. కాని బలవంతుడగు రావణుడు మిగిలి యున్నవాడు. వానిని సంహరించుటెట్లో తెలియకున్నదన, సఖులారా! భయమందకుడు. శివుని యనుగ్రహమువలన సర్వవిజయములు చేకూరగలవు. అనునాప్రభునిమాటల విని యావానరులు హస్తనాసికాముఖములతో, డమరు కాది వాయిద్యముల ననువదింపజేయుచు, శివనామసంకీర్తనము జేయసాగిరి.

నడుమనడుమ శంఖముల పూరించుచుండిరి. కొందఱు తన్మయులై నృత్యము జేయమొదలిడిరి. రామలక్ష్మణులాసన్నివేశమును జూచి సంతసించుచుండిరి. ఇట్లు భక్తిపరవశులై శివనామసంకీర్తనమున మునిగిదేలుచుండ నర్ధరాత్రము గడచెను. అంత రామచంద్రుడావానరుల నిద్రింప నియమించి, వానరవీరులు సేవించుచుండ దాను ననుజసహితముగ నిద్దురించెను.

రావణు నియుద్ధసన్నాహము

పార్వతీ ! యీపవిత్రచరితము నింతవఱకువింటివి. ఇకముందు కథను వినుము. అటరావణుడా రాత్రియంతయు మంత్రులతో నాలోచించి ప్రాతఃకాలమయినతోడనె యుద్ధభూమి కరుగనిశ్చయించి, భగవంతునితో వైరమూని జయాభిలాషియ్యె, యస్త్రశస్త్రముల నాయత్తపఱచి, సేనలఁబోత్సహించుచు, నజేయుడను. శివానుగ్రహపాత్రుడను. మనకుజయము సునిశ్చితమనిజెప్పుచు, యుద్ధసన్నద్ధుడైయుండ వానరసైన్యములు లంకను ముట్టడింపసాగెను. వారి కోలాహలమును విని రావణుడు తనసైనికుల బిలిచి మీలో రణభీరువులున్న యెడలనిప్పుడె తప్పుకొనుడు. యుద్ధములో వెనుదీయుట తగదు. నాభుజబలముచే శత్రువులచెండాడి, జయమును సంపాదించగలనన వారందఱును మేము రణమునకు వెనుదిరుగువారముకామనిరి. అంత రావణుడు వాయువేగముగల రథము నాయత్తపఱుచుకొని రథారూఢుడై, తగుయోధులువెంటరా రణభేరిమ్రోయుచుండ, గాటుకకొండల వెంటనిడికొని వెలువడిన చీకటిరాత్రివలె బయలుదేరెను. అపుడపశకునములు దోచుచుండెను. అతనిచేతినుండి విల్లుక్రిందబడెను. ధ్వజపతాకము క్రిందకుజారెను. కఱులు కన్నీరుగార్చుచుండెను. తురగము మోకరించుచుండెను. పైని గ్రద్దలాడుచుండెను. నలుదిక్కుల నక్కలు గూయుచుండెను. ఉలూకము లెదురగుచుండెను. దురభిమానియగు రావణుడు భవితవ్యమునుబట్టి వానిని పాటింపడయ్యె. భగవద్విరోధులకు మంచిశకునము లెట్లగును ? యుద్ధోన్ముడగు రావణునితో ననేకరథములు, కరిఘటలు, పదాతులును బోవుచుండ, కాలమేఘ మాలచలించుచున్నట్లుండెను. మాయోపాయజ్ఞులగు యోధులసంఖ్యాకులుగ నాతని వెంట జనుచుండిరి. ఆరావణుని జూడ వీరరసమాకృతిని దాల్చి పోవుచున్నట్లుండెను. అట్లాతడుపోవుచుండ సముద్రము క్షోభించెను. కులగిరులుచలించెను.

దిగ్గజములు పాఱిదొడగెను. సేనాపరాగము మిన్నంది నలుదిశలగప్పుటచే సూర్యబింబ మదృశ్యమయ్యెను. ప్రళయగర్జితములవలె రణభేరి మ్రోయుచుండెను. రాక్షసవీరులు సింహనాదముల జేయసాగిరి. అంత రావణుడు, యోధులారా ! మీరు వానరులమ్రింగుడు. నేనాతపస్వుల దునుమాడెదనని ముందునకు జనుచుండెను. అట్టి రావణసైన్యమును జూచి వానరవీరులు పెద్దపెద్ద చెట్లునూడబెఱికి చేతులలో నుంచుకొని రెక్కలుగల పర్వతములవలె ముందుకునడచుచుండిరి. అంతనారెండుసేనలు తలపడి పరస్పరజయాభిలాషతో పోరునకుగడంగెను.

రథస్థుడగురావణుని, పదాతియగు రాముని జూచి విభీషణుడిట్లనియె. ప్రభూ ! బలవంతుడు నజేయుడగు రావణుడు కవచమును ధరించి రథాధిరూఢుడై వచ్చుచున్నవాడు. తాము రథకవచములు లేనివారు. అనఁ నాతనిభావమునెఱింగి, మిత్రమా ! నీకు భయమెందులకు ? చెప్పెదవినుము. మన జైత్ర రథమునకు, శౌర్య, ధైర్యములు చక్రములు. సత్యశీలములు ధ్వజపతాకములు బలవివేకశమదమము లశ్వంబులు. దయాక్షములు రజ్జువులు. ఈశ్వరభక్తి సారథి. వైరాగ్యము డాలు. సంతోషము కృపాణము. దానము పరశువు. బుద్ధి, శక్తి. ఉత్తమజ్ఞానమే ధనువు. సంయమనియమంబులు శరములు. నిశ్చలమగుమనస్సు ఇషుధి, విప్రగుర్వారాధనము కవచము. ఇట్టి విజయరథ మొండులేదు. ఇట్టి ధర్మరథారూఢు డెట్టిప్రతివీరుడైన నవలీల గెలువవచ్చును. దీనియెదుట సంసారలంపటులరథము లెన్నడునునిలువజాలవు. అని రామచంద్రుడన విభీషణుడపరిమితానందమంది, యాతనిపాదములబడి ప్రభూ ! మీయుపదేశమువలన నాసంశయములన్నియుదీరినవి. నేధన్యుడనని యారామచంద్రుని ధైర్యసాహసముల కచ్చెరువందుచుండెను. అంత రామరావణుల యుద్ధమును జూచుటకు గగనమందు విమానాధిరూఢులై బ్రహ్మాదిదేవతలు సిద్ధులుమొదలగు దేవయోనులు వచ్చియుండిరి. వారివిమానములచే నాకసము క్రిక్కిరిసియుండెను. వారితోపాటు నేనును రఘువీరునియుద్ధమును జూచుచుంటిని. వానర రాక్షసవీరులు పరస్పరముదలపడి, జయమునభిలషించుచు, గొట్టుచు, పొడుచుచు, గ్రుద్దుచు, బడద్రోయుచు, ఖండించుచు, శిరంబులద్రుంచుచు, పదంబులద్రొక్కుచు, నఖములజీరుచు, శూలంబులబొడుచుచు, బుజంబుల మెలివెట్టుచు నేలగూలద్రోయుచుండిరి. వానరవీరు లనేక రాక్షసులజంపి గోతులలోనుంచి

ఇసుక గప్పుచుండిరి. వారియుద్ధముజూడ, కాలుడిన్నిరూపముల ధరించెనా! యనునట్లుండెను. వానరవీరులు రాక్షసులజంపి వారినెత్తురును పూసుకొని సింహనాదములజేయుచు భయంకరరూప్పులై, రణరంగమును భీభత్సమొనరించుచు, వాలంబుల రాక్షసులజుట్టి, నఖంబులజీరి, దంతములతోగొఱికి, పాదంబులదన్ని చిత్రవధ గావించుచుండిరి. మఱియు వారిపొట్టలుజీరి ప్రేవులలాగి మాలలుగధరించి నృసింహమూర్తులవలె భయంకరులై రణమొనర్చుచుండ, పట్టుడు, చుట్టుడు, కొట్టుడు, చంపుడనుశబ్దము భూనభోంతరాళము నిండిపోయెను. రామచంద్రునిమహిమచే వానరులు పట్టినతృణమైనను వజ్రసన్నిభమై రాక్షసులబాధించుచు, రాక్షసప్రయుక్త ఘోరాయుధములు తృణకల్పములయ్యేను.

రావణుడిట్లు తనసేనలు నశించి చెదరిపోవుచుండుటజూచి వృద్ధుడై, తన వింశతిబాహువులచే ధనుర్బాణములధరించి, మరలతనసేనలబురికొలుపు కొనుచు ముందునకు వచ్చుచుండ, వానరులుగండశిలలను వృక్షమునొక్కసారిగ నాతని పైవిసరిరి. కాని వానివజ్రకాయమున దగిలియవియన్నియు చూర్ణములయ్యేను. అంతరావణుడుగ్రుడై బాణములప్రయోగింపనుంకింప వాని రూపమునుజూచి వానరులలోకొందఱు హనుమంతుని, కొందఱంగదుని, మఱికొందఱు రామచంద్రుని, రక్షింపుడని వేడుచు, రావణుడు కాలునివలె మాపైబడుచున్నాడని మొరవెట్టసాగిరి. రావణు డంత బాణవర్షమును గురియింప మొదలిడ, వానరులకునిలుచుటకు తావులేక యూహాకారమొనరించుచుండ లక్ష్మణుడు ధనుష్పాణియై యన్నకు నమస్కరించి సెలవంది రావణునకెదురై నిలిచి, ఓరీ రాక్షసాధమ! దీనులగు వానరులనేల జంపెదవు! చేతనైన నాతోబోరుము. అన, మాయుతే! ఈనాటికిదొరకితివి. నాపుత్రునిజంపినపగను దీర్చుకొనుటకై నిన్ను వెదకుచుంటిని. నేను నిన్నుజంపి నాయుడుకు జల్లార్చుకొనియెదనని యనేకసుని శితబాణములనేయ నాతడు వానినన్నిటిని ఖండించివైచెను. అంత రావణుడు మఱలననేకబాణముల ప్రయోగింపవానినివారించి లక్ష్మణుడాతని పదితలలపై వేయిబాణములను వక్షస్థలమున నూఱుబాణములను నాటెను. అపుడు వాని తలలుపన్నగాక్రాంతములగు సుమేరుశృంగములవలె నుండెను.

లక్ష్మణునిపై రావణుని శక్తి ప్రయోగము

అంతరావణుడు క్రుద్ధుడై బ్రహ్మదత్తమయిన ప్రచండశక్తి నాతనిపై ప్రయోగించెను. ఆశక్తిపాతమునకు లక్ష్మణుడు మూర్ఛితుడై నేలమీదబడ నాతనిని దీసికొనిపోవనెంచిరావణు డాతనినెత్తబోయి విఫలమనోరథుడయ్యెను. సంపూర్ణభూమండలమును దనఫణాగ్రమునధరించెడి శేషమూర్తినీమూర్ఖుడెట్లు లేవనెత్తగలడు? లక్ష్మణునిబడగొట్టుట జూచి హనుమంతుడు క్రుద్ధుడై రావణున కెదురై నిలువ నాతడాహనుమంతు నొకగ్రుద్దుగుద్దెను. దానితో నాతడు మూర్ఛితుడై నేలబడి మఱల దెలివొంది తనబలముకొలది రావణుని గుండెలపైగ్రుద్దెను. ఆదెబ్బకు తాళజాలక రావణుడు వజ్రనిహతమైన శైలమువలె నేలగూలి మఱల లేచి హనుమంతునిబలమును గొనియాడ, నోరీ! ఒకగ్రుద్దుతో నిన్ను జంపలేని నాబలము నేల పొగడెదవు? నాకు సిగ్గగుచున్నది. అని లక్ష్మణునిలేవనెత్తి తన భుజముపై నిడికొనిపోవుచున్న యామారునిని బలమునకు రావణు డాశ్చర్యమందుచుండెను.

లక్ష్మణుడు శక్తిచే విముక్తుడగుట

మూర్ఛితుడైనలక్ష్మణుని హనుమంతుడు రామునిసన్నిధినిజేర్చినతోడనె రామచంద్రు డాతనిని తనపాణిపల్లవమున స్పృశించెను. తోడనే ఆశక్తియాక సమున కెగిరిపోయెను. లక్ష్మణుడంత దెలివినొందివిగతశ్రముడై, ధనుర్ధరుడై మఱలశత్రువుపై బడి యాతని సారథినిజంపి రథమును విరగగొట్టి, రావణుని విరథుని జేసి శరజాలమున ముంచివేసెను. అంతతో గసిదీఱక నూఱుబాణము లాతనిహృదయమున నాటెను. అంత రావణుడు మూర్ఛితుడై పడిపోయెను. అట్లుపడినరావణు నాతని పరివారమింకొకరథమునం దిడికొని లంకలోనికిదీసికొని పోయెను. లక్ష్మణు డిట్లు రావణునిభజంచి రాముని సన్నిధికేగి యాతనికి నమస్కరించి యతని యాశీస్సులనంది సుఖంబున నుండెను.

రావణుడు యజ్ఞము చేయబోయి విఫలుడగుట

అట రావణుడుమేల్గాంచి విజయమునకై యజ్ఞమునుజేయ సమకట్టెను కాని భగవద్విముఖున కెట్లువిజయము సిద్ధించును? అంత రావణుని తలంపు

నెఱిగిన విభీషణుడు రామునిసవిూపించి, ప్రభూ! మాయన్న యజ్ఞమునుబ్రొ
రంభించెను. అదిసిద్ధించినవాడుచావడు. కాననాయజ్ఞమును ధ్వంసమొనరింప
వలయునన రామాజ్ఞచే, హనుమదంగదాదులు మఱికొందఱు వానరులదీసికొని
బయలుదేరి లంకలోనికేగి రావణగృహములో ప్రవేశించి, యజ్ఞమునొనరించు
చున్న రావణునిజూచి, ఓరీపిఱికిపందా! యుద్ధముజేయజాలక ఇలుసొచ్చి యజ్ఞ
మునుజేయుచుంటివా! యని దూరజొచ్చిరి. అంగదుడాతని కాలితోదన్నెను.
ఎవరెన్ని చేసినను ఆరావణుడు వానినన్నిటిసహించి, తన యజ్ఞమును నడుపు
కొనుచుండెను. అవుడంగదుడు వానిభార్యలను జుట్టుబట్టి బైటకీడ్వగా నాయవ
మానమును సహింపజాలక వారు భోరున నేడ్వసాగిరి. వారి యార్తనాదముల
విని పౌరుషవంతుడగు రావణుడు క్రుద్ధుడై, లేచివానరుల నెదుర్కొనెను.
అట్లుయజ్ఞధ్వంసమొనరించి వానరులు మెలమెల్లన రామసన్నిధిని జేరుకొనిరి.

రామరావణయుద్ధము

యజ్ఞవిఘ్నమునకు దిగులందుచు జీవితాశనువీడి రావణుడురణరంగమున
కేగుచుండ నాతనికపశకునములు పెక్కులగుచుండెను. ఆసన్నమృత్యువగు నాత
డాయపశకునములబాటింపక, రణభేరినిమ్రోయింపించుచుచతురసేనలతో గాలా
గ్నికుఱుకు మిడుతవలె రామునెదుర్కొనబోవుచుండెను. రాక్షసులు మిడుతల
దండువలెబయలుదేరిరి. అప్పుడురాముడు నిశ్చలముగనుండెను. అంత దేవతలు,
ప్రభూ! జగన్నాటకసూత్రధారా! ఇంకనీవిలాసములజాలింపుము. ఇంకను జాన
కినిమమ్మునేలవంతలముంచెదవు? త్వరలో నీరావణునిసంహరించి మమ్మునకృతా
ర్థులజేయుమనిప్రార్థింప, రామచంద్రుడుమందహాసమొనరించుచు ధనుర్బాణముల
సవరింపజొచ్చెను. పార్వతీ! యుద్ధసన్నద్ధుడగుచున్న రామచంద్రునిశోభవర్ణనా
తీతము. ముఖమందుచెదరియున్న జటాజూటమునుసరిగబంధించి, మొలనుబాణ
భరితమగు నక్షయతూణీరమునుబంధించి, కంఠమునదులసిమాలదూగాడ, భృగు
పాదచిహ్నాంకితమగు విశాలవక్షస్థలముతోడను, నాకర్ణాయతనేత్రములతోడను
విరాజిల్లుచున్న యానీలమేఘశ్యామలగాత్రుడు యుద్ధసన్నద్ధుడయినంతనె,
కూర్మరాజు, భుజగాధిప, గోత్రగ్రావ, దిక్కరులు, వడకుచుండెను. మి
కంపింపసాగెను. సముద్రముక్షుభ్యమగుచుండెను. బ్రహ్మాండమూగులాడజొచ్చెను.

అట్లుయుద్ధోన్ముఖుడగు రామచంద్రునిజూచి దేవతలు విరులవానగురియింపు చుండిరి. నారదుడు బాడుచునాడదొడగెను. గజయూథములవలె వచ్చుచున్న రాక్షససేనలమీదికి వానరసింగములెగురుచుండెను. ఆవానరసైన్యముమేఘ మాలవలెను, వారుధరించిన యాయుధములుమెఱుపులవలెను, రథగజతురగ పదఘట్టనధ్వని, గర్జితములవలెను, సుదీర్ఘములగు వానరవాలములింద్రధనువు లవలెను, శరపాతమువర్ష ధారలవలెను, ఉభయపక్షములవారును విసరెడిశిలా సంఘట్టనమువలన బుట్టెడిధ్వని యశనిపాతమువలెనుండెను. అప్పుడు రామచం ద్రుడు క్రోధతామ్రాక్షుడై, శరపరంపరలనేయ రాక్షసశరీరములనుండిర క్త ధారలు, గిరులనుండిప్రవహించు సెలయేళ్లవలెప్రవహించుచుండెను. ఆరుధిరప్ర వాహమునకు నుభయపక్షసైనికులుగట్టులవలెనుండిరి. రామబాణములచేగూలి రథగజతురగము లారుధిరప్రవాహములో కొట్టుకొనిపోవుచు భయంకరములగు జలజంతువులవలెనుండెను. అందుపడితేలుచున్న బాణములు సర్పములవలెను, విండ్లుతరగలవలెను, పలకలు కూర్మములవలెను, వీరులమాంసఖండములు, మా జ్జామేదస్సులుపంకమువలెను, గనబడుచుండ యోధులుత్సాహపూరితులైరి. భూతప్రేత పిశాచ భేతాళము లానది నోలలాడుచు గ్రీడించుచుండెను. పడియుండిన మాంసఖండములగాక గృధ్రములు నోటగఱచుకొని పైకెగరి భుజించుచుండెను. పిశాచములా శవములకొఱకు బెనుగులాడుచుండ, రామ రావణ సంగ్రామమునగూడ మీకఱవుదీరలేదా! యని ప్రక్కను భేతాళములు పరిహసించుచుండెను. మఱికొన్ని భేతాళములు పుర్రెలనిండ పులినెత్తురును పూరించి ప్రియలచే ద్రావించుచు దామును ద్రావుచు నపరిమితోల్లాసముతో నృత్యమొనరించుచుండిరి. కొందఱు భేతాళురారుధిరస్రవంతినుండి శవముల ప్రేవుల లాగుచు, మీనములకై వలనువైచిన జాలరులవలెనుండిరి. శవముల ప్రేవుల లాగికొని పైకెగలయుచున్న గృధ్రములు, వేటకాని వలలో బడి పైకెగరు పక్షులవలె నగపడుచుండెను. కొన్నిభూతములాయోధులపై తాళ ముల వేయుచు సోల్లాసముగ బాడుచుండెను. జంబుకముల సంఖ్యాకములుగ వచ్చి మాంసఖండముల దినుచు, మధ్యమధ్య నెముకలను కటకటలాడించుచు సగము సగము తిని పారవైచుచుండెను. రాక్షసుల మొండెములు వీర విహా రము నొనరించుచుండెను. తెగిపడిన తలలు జయము రావణా! యని బలుకు

చుండెను. అట్లు రణరంగమున బ్రాణములనర్పించిన యోధవరులు, స్వర్గమున కేగి, విమానారూఢులై, దేవకన్నెలు సేవింపుచుండ రణరంగమున బడియున్న తమ కళేబరముల సోత్సాహముగ జూచుచుండిరి. దురభిమానులగు రాక్షసులు వానరులతో తలపడి పోరుచుండ రామసాయకములా రాక్షసులను దీర్ఘనిద్ర నొందించుచుండెను. ఇట్లు తన సైన్యము నశించుట, వానరోల్లాసము పెరుగుటను జూచి, రావణుడు మొండిధైర్యముతో మాయల బన్నజొచ్చెను. ఇంతవఱకు రాముడు రథము లేకయె, రథాధిరూఢుడగు రావణునితో పోరుచుండెను.

ఇంద్రప్రేషితరథమునెక్కి రాముడు సంగ్రామమొనర్చుట

అంత నింద్రుడు మాతలిని బిలిచి, పదాతియగు రామునికొఱకు మన రథమును దీసికొనిపొమ్మన నాతడు వల్లెయనితోడనే జైత్రమగు దివ్యరథమును రామచంద్రునికడనుంప రామచంద్రుడు మందహాసమొనరించుచు నారథము నధిష్ఠించెను. రథాధిరూఢుడయిన కోదండపాణిని వర్ణించుట కేరికిని దరము కాదు. ఆరథమువెంట నసంఖ్యాకములగు వానరసైన్యములు బయలుదేరెను. ఆవానరసైన్యమును జూచి రావణుడు కటకటంబడుచు ననేకమాయలు వన్నుచుండెను. ఆమాయలచే ననేకకోట్ల రాక్షసులు పుట్టుచు రామచంద్రుని జూచినతోడనె నశించుచు, వానరుల కాశ్చర్యమును గొలుపుచుండిరి. మాయాతీతుడగు రామునియొద్ద మాయలెట్లు సాగును? రామునిపట్ల నుపయోగింప బడిన మాయలు రామునకు వశములై వానరసైన్యమునందనేక సుగ్రీవులను, విభీషణులను లక్ష్మణులను గల్పింప, వానరవీరులాచోద్యమును సవిస్మయముగ జూచుచుండ రావణుడు దిగులందుచుండెను. అంత రామచంద్రుడు వానర వీరుల జూచి, ఓవానరయోధులారా! ఇంతవఱకు మీరు నాకై మిక్కిలి శ్రమనందితిరి. కాన విశ్రమించుచు, నాయొక్కయు రావణ సంగ్రామమును జూచుచుండుడు. అని పలికి దేవగురు విప్రులకు నమస్కరించి, రథమును ముందుకు బోనిచ్చెను. రావణు డంత క్రుద్ధుడై గర్జించుచు రామునితో నిట్లనియె. ఓయీ! నీవెంత నిపుణుడవై నను ననొ్నర్వజాలవు. నీవు క్షత్రియుడవు కాన చాపధరుడవు మాత్రమె. బ్రాహ్మణుడనగు నేను చాపశాపములు ధరించుచున్నవాడను.

మన్యుప్రహరణావిష్టాః। రాజానశ్శస్త్రపాణయః
శస్త్రమేకాకినంహంతి। విప్రమన్యుః కులత్రయం॥

కదా? ముల్లోకవ్యాప్తమగు నాపరాక్రమమును నీవెఱుంగవు. నేను రావణుడను. నీవిదివఱకు, ఖరదూషణాదులను, విరాధవాలులను, మేఘనాద కుంభకర్ణులను, అహిరావణ నరాంతకులను, దునుమాడి గర్వించుచుంటివి. నేను మాత్రమట్టివాడనుగాను. నీకు కాలమాసన్నమయినది కాన నాఎదుటబడితివి. రాక్షసలోకమునకు నీవొనర్చిన యపకృతికి నిన్ను దునుమాడి నాకసిని దీర్చుకొనియెద. క్షణకాలము నాఎదుట నిలువుమను వానివెడగుమాటలవిని రామచంద్రుడు మందహాసమొనరించుచు నిట్లనియె. రావణా! నాపరోక్షమునందు జోరునివలె నబలాపహరణ మొనరించిన నీపరాక్రమము ముల్లోకవిదిత మెట్లుగాకుండును? అప్పుడె నీవు నాకంటబడిన రాక్షసజాతికింత ప్రమాదము వాటిల్లకుండెడిని. కానిమ్ము! నేనొకమాటజెప్పెద వినుము. పాటలపున్నాగములు కుసుమమాత్రమనోహరములు. చూతమును కుసుమరమణీయమే. పనస వృక్షము ఫలమాత్రరమ్యము. అట్లే కొందఱు వాఙ్మాత్రశూరులు. మఱికొందఱు, వాక్క్రియాదక్షులు. కొందఱు క్రియామాత్రశూరులు. కాననీవు పాటలమువలె, వాఙ్మాత్రశూరుడవన రావణుడు నవ్వుచునిట్లనియె. ఓయీ! నీవు మృత్యుముఖమున ప్రవేశించుచుంటివి. కాచికొనుమని రావణుడు రాముపైని బాణవర్షమును గురియింపగ, రామచంద్రుడాగ్నేయాస్త్రముచే నాబాణమునన్నిటిని దగ్ధమొనరించెను. అంతరావణుడు క్రుద్ధుడై శక్తినిప్రయోగింప దాని నాతనిపై బడునట్లు రాముడు మఱలించెను. పిమ్మట రావణుడసంఖ్యములగు నానావిధాయుధముల ప్రయోగింప వానినన్నిటి ననాయాసముగ రాముడు ఖండించెను. అంతరావణుడు పట్టరానికోపముతో, రామసారథియగు మాతలిపై వజ్రతుల్యములగు ననేకబాణముల ప్రయోగింప నాబాణనిహతుడై మాతలిమూర్ఛిల్లెను. పార్వతీ! చూచితివిగదా! రావణునిపరాక్రమమును? దేవతలను నిర్జించిన రావణునకు మాతలియొకలెక్కయా? రామచంద్రుడు దనకృపాదృష్టిచే జూచుచు పాణికమలముచే స్పృశించినంతనే మాతలిమూర్ఛ డేరి మరలస్వస్థచిత్తుడయ్యెను. అంత రామచంద్రుడు రక్తాంతలోచనుడై ధను

ష్టంకారమునుజేయుచుండ హతశేషులగు రాక్షసుల గుండెలవియుచుండెను. మండోదరి హృదయము తటతటకొట్టుకొనుచుండెను. దేవతలాసన్నివేశమును జూచి, రావణుడింక నశించునని సంతసించుచుండిరి.

అప్పుడు రాముడాకర్ణాంతము శింజినినిలాగి తీవ్రబాణమును విడిచెను. అంతనాయమోఘసాయకము సపక్షసర్పమువలె నెగడి, రావణుని సారథిని, గుఱ్ఱములను జంపి రథమునుభగ్నముగావించి, రావణునియురమును దూసియు, నిర్మలమై, మఱలశరధింజొచ్చెను. వెంటనే రావణుడు వేరొకయురదమునెక్కి యనేకదివ్యాస్త్రముల రాముపైబ్రయోగించెను కాని యవియన్నియు పతితునిమంత్రములవలె నిష్ఫలములయ్యెను. పిమ్మట పదిశూలములచే రామచంద్రునిగుఱ్ఱముల మూర్ఛనందించెను కాని యవి రామచంద్రుని కృపావలోకనమున దోడనెమూర్ఛదేరి సుస్థిరములయ్యెను. పిమ్మట రామచంద్రుడాకర్ణాంతము ధనురాకర్షమునొనరించి తీక్ష్ణసాయకములను వరుసగవిడువ నవి తుమ్మెదలవలె రావణముఖకమలములజేరి యాతనిశిరములఖండింప గంతనాళముల నుండి రక్తధారలొలుకుచున్నను అతడు యుద్ధోన్మత్తుడౌచుండ మఱల రామచంద్రుడు మూడుబాణములచే వానివింశతిభుజముల ఖండించెను. కాని వాడంతటితో జచ్చుటలేదు. రాము డెన్నిసారులు ఖండించినను రావణుడంతలో నూతన శిరోబాహువులతో నలరారుచుండెను. రామబాణ ఖండితములగు బాహు ఋజము లాకసమున రాహుకేతువులవలె దిరుగుచుండ మఱల రాముడా శిరో బాహువులను గొట్టెను. అవి బాణనిహతములై ఆకసమునె నిలిచిపోయెను. కాని క్రిందబడుటలేదు. అనుభవించినకొలది విషయములు పెరిగినట్లు ఖండించుచున్నకొలది రావణుని శిరోబాహువులసంఖ్యాకములుగ బుట్టిచుండెను. ఆవిచిత్ర సంఘటనము శివపూజాఫలమని విస్మయానందముల నందుచు నిక దనకు మరణములేదనిసంతసించుచు రావణుడు ధనుర్బాణధారియై రాముని శరజాలమునగప్పగా, మంచుచేగప్పబడిన సూర్యునివలె రామచంద్రుని రథము క్షణకాలమదృశ్యమయ్యెను. అంత దేవత లాహాకార మొనరించుచుండ రామచంద్రుడు క్రుద్ధుడై రావణశిరస్సుల ఖండింప నాశిరస్సులచే రణరంగమంతయునిండిపోయెను. కొన్నితలలాకసమున కెగసి, రావణునకు జయమగుగాత మని పలుకుచుండెను. మఱికొన్నితలలు, రాముడెక్కడనున్నాడు! లక్ష్మణు

డేడీ! సుగ్రీవవిభీషణుల జూప్పుడు. పట్టుడు, కొట్టుడని కేక లిడుచుండెను. ఈభయంకరదృశ్యమునుజూచి వానరులు భయమంది పారజొచ్చిరి. రామచంద్రుడదిజూచి యొకసాయకమును విడువ నందునుండి యనేక కరాళకాళిక లుద్భవించి రావణుని శిరస్సులనన్నిటిని దండలుదండలుగ గ్రుచ్చి, రక్తప్రవాహమున స్నానమొనరించి, యువతులశ్వత్థ వృక్షమునువలె రణాంగణమున, ప్రదక్షిణము చేయుచుండ, రావణుడు కృద్ధుడై, ఎదుటనున్న విభీషణునిపై నొక శక్తిని ప్రయోగించెను. అది యమోఘమని యెంచి రామచంద్రుడు విభీషణుని వెనుకకు మఱలించి, తాను ముందుగ జని యాశక్తిని సహించెను. దానిచే రామచంద్రుడు క్షణకాలము మూర్ఛనంద దేవతలాహాకార మొనరింపసాగిరి. రామున కాపద సంభవించిన మనజీవిత మెందులకని విభీషణుడు గదనుబూని రావణు నెదురొక్కని, మూర్ఖా! నీకింకనుబుద్ధిరాలేదు. నీమూలమున రాక్షసజాతిరూపు మాసినది. లక్ష్మీనిధానమయిన లంకస్మశానమయినది. పూర్వము శిరస్సుల ద్రుంచి శివునర్చించితివి కాన నీకిప్పుడిన్ని తలలు మొలచున్నవి కాని రాముని తోవైరమూనిన నీకు జయమెట్లుకలుగును? శివానుగ్రహముచే నింతవఱకు బ్రతి గితివి. ఇప్పుడు నీకాయువు మూడినది. రామునితో విరోధమును బెట్టికొని యింకను సంపదల ననుభవింపదలచితివా! చూడుమని గదతో రావణుని హృదయముపై గొట్టెను. తోడనెరావణుడు ముక్కులనుండి, నోళ్లనుండియు నెత్తురు గక్కుచు మూర్ఛితుడై నేలబడియెను. పిమ్మట దెలివందగ ఆసోదరు లిద్దఱును ముష్టి యుద్ధమును ప్రారంభించిరి. కాని యెంతపోరాడినను విభీషణుడు రావణునినిర్జింపజాలకుండెను.

పార్వతీ! చూచితివా! రామచంద్రుని యపారమహిమను? ఎన్నడును రావణునకెదుటబడని విభీషణు డీనాడు రావణు నెదిరించి యాతనిగొట్టి యాతనిదెబ్బల నోర్చుకొనుచున్నాడు. అంతలో హనుమంతు డొక పర్వతమును దెచ్చి దానితో రావణుని హయరథసూతుల చూర్ణముచేసి, రావణుని గుండెలపై నొక గ్రుద్దుగ్రుద్దెను. అంతరావణుడు మూర్ఛితుడై నేలమీదబడెను. మఱల రావణుడు దెలివంది హనుమంతునితో దలపడి ఘోరరణ మొనరించుచుండెను. అప్పుడు వారిరువురును పోరాడుచున్న కజ్జలమేరునగములవలె నుండిరి. ఇట్లు కొంతవఱకు పోరాడి హనుమంతుడు రావణుని దనవాలముతో జుట్టి గిరగిర

ద్రిప్పి దూరముగ విసరివై చెను. హనుమంతుని పరాక్రమమున కచ్చెరువందుచు దేవతలాతనిపై పూలవాన గురిపించిరి. విభీషణుడు రామచంద్రుని సన్నిధినిజేరు కొనెను. రామచంద్రుడంత దనసైన్యములబురికొల్ప వారు రావణునిసైన్యముతో తలపడి రాక్షసుల దునుమాడజొచ్చిరి. అంత రావణుడు తనసేనలు క్షీణించుట జూచి, యంతర్ధాతుడై మాయాబలముచే ననేక రావణరూపుల సృజించెను. ఎటుజూచినను రావణుడేయగపడుటచే వానరసేనలు భయభ్రాంతములై పాఱి పోవుచుండెను. రణరంగమంతయు రావణమయమగుటజూచి దేవతలు, ఏమి యీవింత ! ఇందఱు రావణులెటనుండివచ్చిరి ! వీరినెల్లరరాముడెట్లు జయించును ! మనమెట్లుబ్రతుకగలము ! ఎటకుబోవలయును. ఎవనిని శరణము వేడవలయు ! నని తల్లడిల్లుచుండిరి. బ్రహ్మదులీమాయ నెఱింగినవారగుటచే నిశ్చలముగ నుండిరి. విభీషణసుగ్రీవాంగద హనుమదాదులేమియు దోపకుండిరి. రామ చంద్రుడు వాఱిలనెల్లరజూచి మందహాసమొనరించుచు నొకబాణమును విడువ గనె, సూర్యునివలన చీకటులువిరిగినట్లు రావణమాయనశించి రావణుడొకడు మాత్రమగపడుచుండెను. దేవతలంత ప్రముదితులై రామునిపై పూలవాన గురియించిరి. వానరులందఱు బిలబిలమని రణరంగము నలంకరించుచుండిరి. అంత మింట నానందపరవశులగు దేవతలజూచి, రావణుడు పండ్లుగొఱుకుచు, నోపిఱికిపందలారా ! ఇంతవఱకుదాగి యిప్పుడుబయటికివచ్చి కులుకుచున్నారా ! నాదెబ్బల మఱచితిరికాబోలు ! ఇప్పుడేరుచిజూపెద నిలువుడనుచు మింటికెగసి గర్జింప, దేవతలాహాకార మొనరించుచు పరుగిడసాగిరి. ఇసీ ! ఇటనుండిదప్పించు కొని యెటుపోగలరు ! నిలువుడు మీనవ్వులేమైనవన నంతలో నంగదుడుపై కెగిరి రావణుని మెడబట్టి క్రిందికి త్రోసి మఱల రాముని సన్నధికేగెను. అట్లు త్రోపు వడిలేచి రావణుడు కృద్ధుడై శరవర్షమును గురియింపవానరసైన్యము పలుచబడుట జూచి తనబాహుబలమును దానెమెచ్చుకొనుచుండ, రామచంద్రుడొక బాణ ముచే నాతని శిరోబాహువుల ఖండించెను గాని పాపము పెఱిగినట్లాతని శిరో భుజములు పెఱుగుచునేయుండెను. అంత నంగదాది వానరవీరు లలిగి వృక్షము లను పర్వతశిఖరముల నాతపై విసరిరి కాని యాతడు చలించుటలేదు. కొందఱు వానరులాపడిపోయిన శిరస్సులదరిసివానిని బలుకరించి వానిచే కఱువబడిభయ మందిపాఱుచుండిరి. మఱికొందఱు రావణుని తలలపై కెక్కినఖములచేజీరి నెత్తు

రొలుకునట్లుజేయ, రావణుడు కృద్ధుడై వారలబట్టబోవ, గమలవనమున సంచ రించుతుమ్మెదలవలె నాతనికి జిక్కక దప్పించుకొనుచుండిరి. ఎట్టకేలకు వారలలో గొందఱబట్టుకొని నేలబడవై చి చాపాగ్రమున వారలవీప్పులచింపుచుండ నంగ దుడు రోషముతో నాతనిపై పర్వతశిఖరములవైచి యదనుజూచి వాని వక్ష స్థలము నందొక దెబ్బను గొట్టెను. దానితో నాతడు మూర్ఛితుడై నేలకొర గెను. వానిభుజములపై వానరులు నాట్యమాడదొడగిరి. కొందఱుమోదు చుండిరి. అంత సూర్యుడస్తమింపగనె వారందఱు రామచంద్రుని సన్నిధికేగి యాతని కృపావలోకనమున గృతార్థులయిరి. రావణుడును మూర్ఛదేరి మిగి లిన నిశాచరులతో గలిసి లంకకేగెను.

త్రిజట సీత నోదార్చుట

ఆ నిశీథమందు త్రిజట సీతను సమీపించి జరిగిన యుద్ధవృత్తాంతము నంతను వినిపించిన, సీత విస్మయమందుచు, ఏమీ రావణునితలలు దెగిన తోడనె మఱల మొలచుచున్న వా దీనికి గారణమేమి ! ఇత డెట్లు చచ్చును ! అని వంతనొందుచు, దైవముప్రతికూలమై నాకన్ని విధముల దుఃఖములను గల్పించుచున్నది. నాయభాగ్యముచేతనే వాడు జచ్చుటలేదు. కాకున్న రామబాణ మెట్లు వ్యర్థమగును ? నేనీ రామవియోగమును గడచుటెట్లు ? మాయామృగమును జూచిననాటనుండియు నేనుదుఃఖమునేయనుభవించుచుంటిని. దీనికి యవధియగపడుటలేదు. ఆనాడు గుణవంతుడగు లక్ష్మణుని దూలనాడితిని. దానివలననె నాకీయవస్థ సంభవించినది. సాధుపరివాదమూరకబోవునా ! యని సీతవిలపించుచుండ త్రిజట ఇట్లనియె. అమ్మా ! రావణుడు చావకుండుటకు నీవ కారణము. వినుము నీవారావణుని హృదయములోనుంటివి. రామచంద్రుడు నీహృదయముననున్న వాడు. కాన వానిహృదయమును భేదించిన నద్దాన నీకును, నీమూలమునదనకును దనమూలమున పదునాలుగుభువనములకును ముప్పువాటి ల్లునని రామచంద్రుడాతని హృదయమునుభేదింపక తలలనే ద్రుంచుచున్నాడు. ఇట్లుతలలదునుమాడుటవలన వాడునీధ్యానమునువిడిచి తలలధ్యానమునబడును. అప్పుడు వానిహృదయమునుభేదించి రామచంద్రు డవలీల వానిదునుమాడును. కానచింతింపకుము. వానికి మృత్యువాసన్న మగుచున్న దని చెప్పి త్రిజట తనయింటికి

బోయెను. అంత సీత విరహమునకోర్వజాలక రామునె స్మరించుచు క్షణము నొక యుగముగగడుపుచుండెను. మధ్య మధ్యను ఎడమకన్ను దురుట మున్ను గుశుభశకు నములవలన గొంత ధైర్యము నవలంబించుచుండెను.

రావణునికి శివుడు రామునిచే జచ్చుట మంచిదని చెప్పుట

అంత రావణుడు స్నానముజేసి భస్మనలదికొని పూజాగృహమున ప్రవేశించి శివుని మనసారపూజించి ధ్యాననిమీలితనేత్రుడైయుండ నాతనికి శివుడు సాక్షాత్కరించి ఇట్లనియె. రావణా! నీవుధన్యుడవు. బాల్యమున సకల విద్యలనభ్యసించి ఘోరమగుతపమొనర్చి కృతార్థుడవై, దిక్పతులనోడించి సకలభోగముల ననుభవించుచుంటివి. కానియాభోగములు జలబుద్బుదప్రాయ ములు. ప్రాజ్ఞుడు వీనికై ప్రాకులాడడు. నీవునాతోపాటు రామచంద్రునిగూడ నారాధించుచున్నావు. భక్తిచేతనైనను, కామముచేతనైనను, వైరముచేతనై నను రామునారాధించువారలకు తప్పక ఫలముచేకూరును. నీవు రణయజ్ఞమునం దాత్మార్పణము జేసినధన్యుడవు. వేగమ కృతార్థుడవుకమ్ము. అని ఆనతిచ్చి శివు డంతర్ధానమందెను.

రావణుడు మాయను ప్రయోగించుట

అంతరావణుడు కనులదెఱచిచూచి హర్షపులకితగాత్రుడై ద్విగుణీకృతో త్సాహముతో రథారూఢుడైరణరంగమునకేతేర, వానరయోధులు వృక్షశైల శిఖరములధరించి యాతనిముట్టడించి, వృక్షములతోమోదుచు, గండశిలల విసరుచు, గోళ్లతోజీరుచు నాతనిని చీకాకుపఱచుచుండ నాతడదృశ్యుడై, తన మాయను ప్రయోగించెను. తోడనే భూతప్రేతపిశాచభేతాళములు ధనుర్బాణముల ధరించి రణరంగమున ప్రత్యక్షమయ్యెను. యోగినీగణము లొకచేతకపాలమును రెండవచేత ఖడ్గమునుధరించి, శోణితాసవమునుగ్రోలుచు నున్మత్తలై, పట్టుడు, కొట్టుడు, చంపుడు, అనియఱచుచు పరుగిడుచుండిరి. వారలజూచి వానరులు భయపడిపాఱుచుండిరి. రావణుడు సింహనాదములజేయుచుండ వానరులు మూర్ఛిల్లుచుండిరి. మఱియు రావణమాయచే ననేకహనుమంతులు, పర్వతశిఖ రములనుధరించి, పుచ్ఛములనాడించుచు, రామచంద్రునిముట్టడించి, సండ్లుగొరు

కుచు, హుంకరించుచు, వికటముగ గర్జించుచుండిరి. అంగదాదివానరవీరులు నివ్వెరపడిచూచుచుండిరి. అంత రామచంద్రు డొకబాణమును బ్రయోగించి యామాయనంతమొందించి వేఱొకబాణముతో నారావణుని శిరంబులద్రుంచి వైచెను. ఈ రామరావణయుద్ధమును బ్రహ్మాదులె వర్ణింపజాలరు. ఇట్లు రామ చరిత్రమును జడమతియగు తులసీదాసు డెట్లు వర్ణింపగలడు? మశక మాకస మునం దెగురునట్లు నాశక్తికొలది వర్ణించుచున్నాను. ఎన్ని మారులుఖండించినను రావణుడు మృతినందకుండుటజూచి వ్యోమచరులు తహతహలాడుచుండిరి. లాభమునుబట్టి లోభము పెరుగునట్లు, కొట్టినకొలది వానితలలు పెరుగుచున్నవి. సైన్యము లలసిపోవుచున్నవి. అంత రామచంద్రుడు విభీషణునితో నిట్లనియె.

విభీషణుడు రావణ వధోపాయము నెరింగించుట

పార్వతీ! ఎవని ఇచ్ఛచే బ్రహ్మాండములు సయితము క్షణములో నశించునో! అట్టి ప్రభువు భక్తిని బరీక్షించుటకై, విభీషణా! రావణుడు మృతినందకుండుటకు గారణమేమి? యన, ప్రభూ! సర్వజ్ఞుడవగు నీవు నాచే జెప్పింపదలచితివి. వినుము. నాయన్న నాభియం దమృతకలశమున్నది. దానిచే నాతడు మరణించుటలేదు. అన రామచంద్రుడు మందహాస మొనరించుచు ధనువునంది బాణసంధానము చేయునంతలో రావణుని శిరములందు గృధ్రము లాడజొచ్చెను. ఉల్కలు పడుచుండెను. మండోదరి హృదయము కంపించుచు కన్నీరు తెంపులేక కార్చుచుండెను.

రావణవధ

అంత రామచంద్రుడాకర్ణాంతము ధనువునులాగి ముప్పదియొక్క బాణములనొక్కమాఱువదలెను. అవి కాలసర్పములవలెబోయి వానిలో నొకటి రావణుని హృదయమును అందలి యమృతకలశమును భేదించెను. మిగిలిన ముప్పదిబాణము లొక్కసారిగ రావణుని పదితలలును ఇఱువది బాహువులను ఖండించెను. అట్లు శిరోబాహువిహీనమగు రావణుని మొండెము రణరంగము నందిటునటు పరుగిడుచుండ నాభయంకర రూపమును జూచి వానరులు పరుగెత్తసాగిరి. మఱల రాముడొకబాణముచే నా మొండెమును రెండు ముక్కలుగ

జేయ నది నేలపై బడెను. దానిక్రిందబడి వానరులెందరో మృతినందిరి. రావణు డవసానకాలమందును, రాముని బట్టుడు, బంధింపుడని గర్జింపుచుండ భూమి, కులగిరులు, దిగ్గజములు చలించుచుండెను. రావణుని శిరస్సులను మండోదరివద్దకు నెగురవైచి రామసాయకములమ్మలు పొదిలోచేరినవి. అద్దాని జూచి దేవతలు పట్టరాని సంతోషముతో దుందుభుల మ్రోయించుచు విరుల వాన గురియింపుచుండిరి. రావణుని తేజము రామునియందు లీనమయ్యెను. శివవిరించులు ప్రసన్నులయిరి. సురయక్ష నాగకిన్నర మునిమనుజులు జయ ధ్వానమొనరించుచుండిరి. మఱియు నిట్లునుతింపసాగిరి.....

జయ, కృపాకంద ముకుందద్వంద్వహరణ । శరణసుఖదప్రభో
జలదళవిదారణ పరమకారణ । కారుణీకసదావిభో
సురసుమనవర్షహి హర్షసంకుల । రాజ దుందుభి గహగహణీ
సంగ్రామాంగణానంగ । బహుశోభాలహీ॥

ఓ కృపానిధాన; ముకుందా; ద్వంద్వహరణా; శరణాగతసుఖప్రదా; ప్రభూ! దుష్టదళ విదళనా; పరమకారణ; కరుణా వరుణాలయా; విభూ! సురలు హర్షాతిరేకమున దుందుభుల మ్రోయించి సుమవర్షమును గురియింప సంగ్రామాంగణమున బుష్పసాయకునివలె నొప్పుచున్న రామా! నీకు జయము.

శిరజటామకుటప్రసూన బిచబిచ । అతిమనోహరరాజహీ
జను నీలగిరిపరతడితపటల । సమేత ఉడుగణభ్రాజహీ
భుజదండ శరకోదండ । పెరతరుధిరకనతను అతిబనె
జను రాయముని తమాలపర । బై తీవిపులసుఖ ఆపనె॥

నడుమనడుమ కుసుమశోభితమైన జటాజూట మకుటంబులు నీలగిరిపై నున్న విద్యుత్సమూహావలె నున్నవి. భుజదండమున శరచాపకములదాల్చి సవిలాసముగ ద్రిప్పుచు రక్తబిందు సమలంకృతమైన నీతనువు అరుణప్రవాళా లంకృతమగు తమాలవృక్షమువలె శోభిల్లుచున్నది.

మండోదరీవిలాపము

ఇట్లు సకలదేవతలు స్తుతింప రామచంద్రుడు వారినందఱి గృపాదృష్టిని జూచి వారలభయంబు నుడిపెను. వానరు లమితానందముతో రాముని కొని యాడుచుండిరి. ప్రాణనాథుని శీర్ష ంబులజూచి మండోదరి దుర్భరమగుశోక వేగమున మూర్ఛిల్లెను. చెలికత్తెల యుపచారములవలన కొంతతడవునకు మూర్ఛదేరి, భర్తృసమీపములకు జని యాతని మృతకళేబరమునుజూచి, మోదుకొనుచు నిట్లువిలపింప దొడగెను. ఎవనిప్రతాపమును సూర్యచంద్రా గ్నులు సహింపలేకుండిరో! ఎవనిబాహుబలమున కోడి దిక్పాలురరిగాపులై వినమితశిరస్సులతో నాజ్ఞానువర్తులై మెలగుచుండిరో! ఎవనిసంపదకుకు బేరుడు గూడలజ్జించెనో! ఎవడు త్తమాంగములను మించిశివునిమెప్పించెనో! ఎవడు తనబాహువులచే గైలాసము ననాయాసముగ నెత్తి తనభుజబలమునుచాఁటెనో కుంభకర్ణ మేఘనాదాదులెవని మాటజవదాటకుండిరో! అహిరావణ నరాంత కాది రాక్షసవీరు లెవనికొఱ కసుమల నర్పించిరో! అట్టిజగదేకవీరునకు నేడిట్లు రణాంగణమున వీరశయ్య యందు ధీర్ఘనిద్ర నొందవలసివచ్చినది. నాథా! రామునితో వైరమువలదని నేనెన్నిసారులు బోధించినను నామాటవినక నన్ను న్నాథను జేసితిరి. భగవద్విరోధులకు మేలెట్లుచేకూరును? నీపరివారమునువీడి ఇట్లొంటిగ నిద్రించుచుంటిరా? చందనకస్తూరికాదుల నలంది పూలసెజ్జపై నుండెడియీమేనిపుడు ధూళిధూసరమై స్థండిలశాయియయ్యెనా? మంగళగీత ముల నాలకించెడి చెవులునక్కకూతల వినుచున్నవా? లక్షాధికపుత్రులుగల రాక్షసేశ్వరునకగ్ని సంస్కార మొనరించువారైనను లేకుండిరే! ఏమియీ దుర్గతి? ఏశిరస్సులు శివునిపాదపద్మముల దగిలియుండెడివో? అట్టితలలు గ్రద్దలపాదముల వ్రేలాడుచున్నవి. ఇంతకన్న ఘోరమేమున్నది! మీ రన్యా యముగ భగవద్విరోధమును దెచ్చికొంటిరి. వాతాశనమగు పన్నగము గరు డుని ప్రాణవాయువు నపేక్షించునట్లు రామకళత్రము నపేక్షించి తుదకు సర్వ నాశనమునందితిరి. ఎవడు చరాచరమయుడో! ఎవనినియజరుద్రాదులు సేవిం చుచుందురో! ఎవడు పాపులపాపములను నశింపజేసివారికి సద్గతి నొసంగునో ఎవడుద్వంద్వాతీతుడో! అట్టిపరాత్పరుడగు రామచంద్రుని నమస్కరించుచు

న్నాను. అనిపలుకుచు తననాథుని దివ్యతేజము రామచంద్రునందు లీనమగుట దెలిసి, నాథా! నీవుధన్యుడవు. యోగిదుర్లభమగు సద్గతిని, భగవద్విరోధ ముచే బడయగలిగితిని. నీకుభార్యనైననేనును ధన్యనను మండోదరీ వాక్య ములవిని యచటివారందఱును నామెవివేకమునకు సంతసించిరి. అన్నగారి యవస్థను వదినదుఃఖమును జూచి విభీషణుడు విలపించుచుండ లక్ష్మణుడాతని నోదార్చి రామచంద్రుని వద్దకు దీసికొనిపోయెను. అంత రామచంద్రుని కృపావలోకనముచే నాతడు వీతశోకుడయ్యెను.

సీతానయనము

పిమ్మట రామానుమతినంది విభీషణుడు రావణుడు మున్నగు భ్రాతృ వర్గమునకును మేఘనాదుడు మున్నగు కుమారులకును నౌర్ధ్వదైహికక్రియల నాచరించెను. మండోదరిమున్నగు రావణాంగనలు భర్తకు దిలాంజలులనిచ్చి తమగృహముల కేగి రామచంద్రునిధ్యానింపుచుకాలమును గడుపుచుండిరి. ఔర్ధ్వ దైహికక్రియలనిర్వర్తించి విభీషణుడురామచంద్రుని సమీపించి వినమితశిరస్కు డైయుండ రామచంద్రుడులక్ష్మణునిజూచి, సోదరా! నీవుసుగ్రీవాంగదజాంబవదా దులతోగూడి హనుమంతుని ముందిడికొని లంక కేగి విభీషణుని రాజ్యాభిషిక్తునిగ జేయుమని, విభీషణునివంకజూచి, మిత్రమా! మాతండ్రిగారి యాజ్ఞానుసార ముగ నేనుబట్టణములోబ్రవేశింప వీలులేదు. కాన నాసోదరుడును, సుగ్రీవుడును వచ్చుచున్నారు. నీవు మరియొకతీరుగ భావింపక వీరినితీసికొని చని రాజ్యాభి షిక్తుడవు గమ్మన, రామచంద్రుని యాజ్ఞ ననుసరించి వారందఱును లంక కేగి విభీషణుని బట్టాభిషిక్తునిగజేసి సింహాసనారూఢుడైన విభీషణుని గొనియాడిరి. పిమ్మట విభీషణునితోగలిసి వారందఱు రాముని సమీపించి వినమితశిరస్కులై నిలుచుండిరి. అంత రామచంద్రుడు ప్రియవచనములచే వారి నాదరించి కూర్చుండ నియమించి, ఇట్లనియె. మిత్రులారా! మీసహాయముచే బలవంతు లైనశత్రువులజయించి కృతార్థుడనైతిని. మీబలముచేతనే విభీషణుడు లంకా ధిపతియయ్యెను. మీకీర్తి ముల్లోకముల వ్యాపించును. మీగాథల గీర్తించు మనుజు లశ్రమముగ సంసారార్ణవమును దాటగలరు. అను నమృతోపమానము లగు రాముని మృదువాక్కులచే తృప్తినందక వారందఱు నాతని ముఖపద్మ

మును భృంగములవలె సేవింపుచుండిరి. పట్టరానిసంతోషముతో నాతనిపదముల కెరగినమస్కరించుచుండిరి. పిమ్మట రామచంద్రుడు హనుమంతుని జూచి, హనుమా! నీవు లంకకేగి వృత్తాంతమునంతను సీతకెరింగించి యామెక్షేమ మరసిరమ్మన నాతడు బయలుదేరి లంకలో బ్రవేశింపగనె యచటివారాతనిని సవినయముగ నర్చించి, సీతయొద్దకు దీసికొనిపోయిరి. అప్పుడు చేతులుజోడించి, తల్లీ! రామదాసుడగు హనుమంతుడు నమస్కరించుచున్నాడన నాతురతతో హనుమా! సపరివారసోదరుడగు రఘునాథునకుశలమే? యన, నమ్మా! రావణుని బంధుపుత్రమిత్రసహితముగా దునుమాడి, విభీషణుని లంకాధిపతిగ నొనరించి తీర్ణప్రతిజ్ఞుడగు రఘునాథుడు సోదరమిత్రసహితముగ గుశలియైయున్నాడన నమృతోపమములగు నాపలుకులువిని, యానందపరవశయగు సీత పులకితగాత్రియై, యానందాశ్రువులగార్చుచు, తండ్రీ! నీకు నేనేమియివ్వగలను? నీఋణము నెట్లుదీర్చుదాననన దల్లీ! ముల్లోకరాజ్యలాభమువలన గలిగెడి యానందము, శత్రుసంహారమొనరించి, యనుజసహితముగ నాసీనుడైన కోదండపాణి పదకమల దర్శనజనితానందమునొక్క శతాంశమునకైన సరిరాదు. మీసేవానందమునకెనయగునది బ్రహ్మానందముదక్క వేఱొండులేదు. అన నాతని భక్తికి సీత సంతసించి, హనుమా! రామచంద్రుడు సర్వకాలములందు నీమానసమున నివసించుగాతమని దీవించెను. అంత మారుతి యామె యనుమతినిబడసి రామచంద్రునియొద్దకేగి సీత క్షేమమునెఱిగింప రఘుపతి సుగ్రీవ విభీషణులజూచి హనుమంతునితోగలిసి మీరుపోయి సీతను దోడికొనిరండన వారు హనుమతోగూడి సీతాసన్నిధికేగుసరికి రాక్షసాంగనలామెను సభక్తికముగ సేవించుచుండిరి. విభీషణుడు వారలబిలిచి సీత కభ్యంజనమొనరించి, దుకూలములగట్టించి, దివ్యాభరణములచే నలంకరింపుడన వారట్లు చేసిరి. అంతలో నొకబంగారుపల్లకినిదేగా నామెథిలి హృదయమున రామపదకమల ములనిడుకొని యాశిబికనధిష్టింప రాజలాంఛనములతో నామెను దెచ్చుచుండ వానరులామెనుజూచుటకై తొందఱగ ముందుకు బరుగెత్తుచుండ బార్శ్వరక్షకులు వారిని వారించుచుండిరి. అదిచూచి రామచంద్రుడు నవ్వుచు, విభీషణా! యీయాడంబరమెందులకు? మాతృదర్శనాభిలాషులగు బిడ్డలవలె పరుగిడుచున్న వారియుత్సాహమున కభ్యంతరము గలుగనీయక వారలకందఱకు

నామెదర్శనమగునట్లామెను దోడితెండను రాముని యాదరమునకందఱును సంతసించి ప్రశంసించుచుండిరి. వచ్చుచున్న సీతనుగాంచి సురలు సుమవర్షమును గురియించుచుండిరి.

జానకి అగ్నిప్రవేశ ప్రకాశములు

సీత యగ్నిలో దాగియున్నదని మున్నే చెప్పియుంటిని. రాముడద్దాని నెరుంగును. కాగారాముడు సీతనుజూచి, సీతా ? నీవగ్నిప్రవేశముజేసినగాని పవిత్రవుగావన నచటివారందఱు నిశ్చేష్టులయిరి. అంత సీత రానునియానతి ననుసరింపదలచి, లక్ష్మణునిజూచి, లక్ష్మణా ! నీవు ధర్మజ్ఞుడవు. మామాటకు జవదాటనివాడవు. కాన త్వరగ నగ్నినిసమకూర్పుము. మాయన్నగారి సంశయమును వాపెదనన, విరహ,వివేకధర్మబద్ధములగునామెపలుకులాకర్ణించి,కన్నీరుగార్చుచు చేతులుజోడించి, ఏదో చెప్పదలచియు, నేమియు బలుకక యన్నముఖమును జూచి యాతనిభావముదెలిసి యగ్నినిసిద్ధముచేసెను. ఆప్రచండాగ్నినిజూచి సీత సంతసించుచు నిర్భయముగ నగ్నినిసమీపించి, బద్ధాంజలియై పావకా ! నీవుసర్వజీవులందునుండువాడవు. నీకు దెలియని దేదియునులేదు. నేనుత్రికరణశుద్ధిగ రాముని నమ్మిన పతివ్రతనయేని, నాకు చందనపంకశీతలుడవై, నా పాతివ్రత్యమును వెల్లడిజేయుమనుచు సీతయగ్నిప్రవేశమొనరించెను. అంతనగ్ని దేవుడు సీతాసంస్పర్శమున దానెపవిత్రుడనైతినని భావించుచు, సీతాపాతివ్రత్యమహిమచేజల్లబడెను. అదిచూచియచటివారెల్ల నాశ్చర్యమందుచు సీతారాములస్తుతింపసాగిరి. మాయసీత అగ్నిలోగలిసిపోయెను. ఈరహస్యము శివ విరించులకు మాత్రము దెలియును. అగ్నిబ్రాహ్మణ రూపమునుధరించి, సముద్రుడుతొల్లిలక్ష్మిని విష్ణువునకర్పించినట్లు సీతను రామున కర్పించెను. సీత రాముని పార్శ్వమున శంపాలతవలె నొంతేని శోభిల్లుచుండెను. ఆకసమున దేవదుందుభులు మ్రోయుచుండ పువ్వులవాన గురియుచుండెను. కిన్నరులుపాడుచుండ నప్సరసలాడుచుండిరి. సీతారాములను జూచుచున్న దేవతలకు, వానరరాక్షసులకును సంతోషము పట్టరాకుండెను. వారందఱును రామచంద్రా ! నీకు జయమగుగాత మని పలుకుచుండిరి. మాతలి రామునకుమ్రొక్కి యనుజ్ఞనువడిసి, రథముతో స్వర్గమునకుబోయెను. స్వార్థపరులగు దేవతలు పరమార్థవచనములతో రామునిస్తుతింపసాగిరి.

దీనబంధున యాఖురఘురాయా । దేవకీనదేవన పరదాయా
విశ్వద్రోహరత యహఖలకామీ । నిజాఘుగయోకుమార్గగామీ ॥ 1
తుమసర్వజ్ఞ బ్రహ్మఆవినాశీ । సదైకరస సహజ ఉదాసీ
అకల, అగుణ, అబు, అనఘుఅనామయ । అజితామోఘుశక్తికరుణామయ॥ 2
మీనకమర సూకరనరహారీ । వామన పరసురామవపుధారీ
జబజబ నాధసురనదుఃఖపానా । నానాతను ధరితుమహినశావా ॥ 3
రావణ పాపమూల సురద్రోహీ । కామలోభమదరతి అతికోహీ
సోకృపాలు తవధామసిధావా । యహహామరె మనఅచరజ ఆవా ॥ 4
హామదేవతా పరమఅధికారీ । స్వారధరతతవ భక్తినిసారే
భవప్రవాహసంతత హామపరె । అబప్రభుపాహిశరణ అనుసారె ॥ 5

దీనబంధూ ! దయాళూ, ! రఘురాయా, ! సురలకో ర్కెలనీడేర్చువాడా ! విశ్వమోహి, దుష్టుడు, కాముకుడు, కుపథగామియు నగు రావణుడు, తనపాప ముచేతనే మృతినందెను. ప్రభూ ! నీవు సర్వసముడవు సర్వజ్ఞుడునవినాశియునగు పరబ్రహ్మమవు, ఏకరసస్వరూపుడవు, ఉదాసీనుడవు, నిష్క-లుడవు, నిర్గుణుడవు అజుడవు, నిర్దోషుడవు, నిరామయుడవు, అజేయుడవు, అమోఘుశక్తియుతుడవు, కరుణామయుడవు, మఱియు దేవార్తిభంజనమునకు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామాద్యవతారములనొందితివి. నీవెల్ల ప్పుడు మమ్మ్మలగాపాడుచుండెదవు. పాపమూలము, సురద్రోహి, కామక్రోధా దులకు పుట్టినిల్లునగు రావణుని నీదివ్యధామము నొసంగి మాకువిస్మయమును కలిగించితివి. మేము దేవతలమగుటచే నీభక్తికి నధికారులమయ్యును, స్వార్థప రులమై, నిన్ను భజింపక, సంతతమీసంసార ప్రవాహమున గొట్టికొనిపోవుచుం టిమి, శరణు ! ప్రభూ ! రక్షింపుము.

బ్రహ్మస్తుతి

జియరామ సదాసుఖధామ హరె । రఘునాయక సాయకచాప ధరె
భవవారణ దారణసింహప్రభో । గుణసాగరనాధవిభో ॥ 1

రామా, సుఖధామా ! రఘునాయకా ! ధనుర్బాణధార ! భవవారణ సింహామా ! గుణసాగరా ! నీకుజయమగుగాత !

తనుకామ అనేక అనూపమచ్ఛవీ । గుణగానత అనేకసిద్ధము నింద్రకదీ
జనుపావన రావణనాధమహా । ఖగనాధ జధాకరి కోపగహా ॥ 2

స్వామీ ! నీవు నిరుపమ శరీరశోభముచే ననేక కామదేవులవలె నొప్పు చుందువు. నీగుణములను సిద్ధులు, మునులు, కవులు, వేనోళ్లగొనియాడు చుందురు. నీకీర్తి అతి పవిత్రమయినది. నీవు దశాననమహాసర్పమును గరుడుని వలె గ్రసించితివి.

జనరంబున భంజన శోకభయం । గతక్రోధసదాప్రభుభోగమయమ్
అవతార టదార అపారగుణమ్ । మహిభారవిభంబున జ్ఞానఘనమ్ ॥ 3

జనులను రంజించువాడా ! భయశోకములనుభజించువాడా ! క్రోధ రహితా ! చరాచరప్రభూ ! జ్ఞానరూపుడా ! సకలావతారరూపా ! ఉదార స్వరూపుడా ! అపారగుణనిధీ ! భూభారహరా ! జ్ఞానధనా ! నీకుజయము.

అజవ్యాపకమేకమ నాదిసదా । కరుణా-కర రామనమామిముదా
రఘువంశ విభూషణ దూషణహా । కృతభూప విభీషణ దీనరహా ॥ 4

ఎప్పుడును సదా ఏకరూపుడవై ఆద్యాంతరహితుడవైన రఘువంశవిభూ షణా ! ఖరదూషణసంహరణా ! శరణాగతవిభీషణ రాజ్యప్రదా ! కరుణాకరా ! నీకు ముదముతో ప్రొక్కెదను.

గుణజ్ఞాననిధానఅమాన అజం । నితరామనమామి విభుంవిరజమ్
భుజదండ ప్రచండ ప్రతాపబలం । ఖలబృందనికంద మహాకుశలమ్ ॥ 5

గుణజ్ఞాననిధివైనీవు, అమేయుడవు. జన్మరహితుడవు. సర్వవ్యాపకుడవు. రజోగుణరహితుడవు. నీభుజదండప్రచండప్రతాపముచే, ఖలబృందకందములను నేర్పుతోఖండించిన రామచంద్రప్రభూ ! నీకు నమస్కారము.

వినుకారణ దీనదయాళు హితం । భవిధామనమామి రమాసహితమ్
భవతారణ కారణకాయపరం । మనసంభవదారుణ దోషహరమ్ ॥ 6

నిస్కారణముగ దీనులందుదయచూపెడువాడా, సంసారమును తరించు టకు కారణమైనవాడా, శరీరవ్యతిరిక్తుడవై, మానసదారుణ దోషముల హరిం చెడి తోజోనిధీ, రమాసహితుడవైన నీకువందనము.

శరచాప మనోహరతూణ ధరం । జలజారుణలోచన భూపవరమ్
సుఖమందిర సుందర శ్రీరమణ । మద మార సుధామమతాశమనమ్॥ 7

మనోహరశరచాపతూణీరములు ధరించి, రక్తాంభోజసదృశ నేత్రములు గలిగి రాజశ్రేష్ఠుడవై, సుఖనికేతనుడవై, సుందరుడవై, శ్రీరమణుడవై ననీవు, మదమునుహరించి, విషతుల్యమగు విషయేచ్ఛను శమింపజేయుదువు. అట్టినీకు వందనము.

అనవద్య అఖండ గోచరగో । సబరూపసదాసబహో ఇనసో
ఇతివేదనదంతినదంత కథా । రవి ఆతపభిన్నమభిన్నయధా ॥

నీవు దోషరహితుడవై, యఖండుడవై, ఇంద్రియాతీతుడవై, సకల వస్తువ్యాప్తుడవై యుంటివి. సూర్యునకు ప్రభకు ఎట్లుభేదాభేదమో, అట్లే నీకును బ్రపంచమునకును భేదాభేదములు కలవని శ్రుతులు జెప్పుచున్నవి.

కృతకృత్యవిభోసబవానరయే । నిరకంతితవానన పాదరజె
ధిగజీవన దేవశరీరహరె । తవభక్తినినాభవభూవిహరె॥

దేవాంశసంభూతులగు నీవానరులు ఎల్లప్పుడు సాదరముగ మీయాానన మును జూచుచు కృతార్థులై, జీవనములయెడల నిరసనగలవారై సంసారమున బడక, మీభక్తిని విడువజాలకున్నారు. వారిజన్మమె సార్థకము. విభూ.

అబదీనదయాళు దయాకరియే । మతిమోరివిభేద కరీహరియె
జహితీ విపరీతక్రియాకరియె । దుఖసోసుఖమానసుఖీచరియె॥

ఓదయాపరా, ఏ సుఖదుఃఖములచే భ్రమించుచుంటినో, వానినిహరించి విపరీతకార్యముల జేయించు నామతిభ్రమలదొలగించి, నన్ను దయజూడుము. భేదబుద్ధిని హరింపుము ప్రభూ.

ఖలఖండనమండన రమ్యక్షమా । పదపంకజసేవితశంభుఉమా
నృపనాయకదేవరదానమిదం । చరణాంబుజ ప్రేమసదాశుభదమ్॥

ఓ రామా! ఖలులనుఖండించి, భూమికి రమ్యమగుశోభ నొసంగితివి. శివపార్వతులు సదాసేవించెడి మీపాదపద్మములందు నాకెల్లప్పుడు ప్రేమకలుగు నట్లు వరమొసంగుము నృపనాయకా.

ఇట్లు బ్రహ్మ, స్తుతించుచు ప్రేమపులకితగాత్రుడై ఆనందాశ్రువులచే నాకృపాసింధుని దిలకింపలేకుండెను. అపుడు దశరథుడచటకువచ్చి, పుత్రునిజూచి, యానందాశ్రునయనుడై యుండి, రామలక్ష్మణులు నమస్కరింప వారల నాశీర్వదించెను. అంత రాముడు తండ్రీ! నీపుణ్యప్రభావముచే, నేనజేయులగు నిశాచరుల సంహరింపగలిగితినన దశరథుడు పులకితగాత్రుడై యుండ, నతనికి దన యందెక్కుడు మక్కువయనియు, తనవియోగమును సహింపకయే ప్రాణములు విడిచెననియు దలంచి, యాతనికి దివ్యజ్ఞానము నొసంగెను. పార్వతీ! దశరథుడీ పుత్రమోహముచేతనే మోక్షము నందజాలకుండెను. సగుణారాధకులకు భగవంతుడు, భక్తినొసంగునుకాని మోక్షమునీయడు. నిర్గుణరూపమును ధ్యానించెడివారె మోక్షమునకర్హులు. కాన నట్టిజ్ఞానమును దండ్రికిచ్చిన నతడు సంతుష్టుడై, భగవంతుడగు రామునకు మాటిమాటికిని మ్రొక్కుచు నిజస్థానమున కరిగెను. పిమ్మట పురందరుడు సీతారామలక్ష్మణుల దివ్యశోభను దిలకించుచు నిట్లు స్తుతించెను.

ఇంద్రస్తుతి

జయరామశోభాధామ । దాయకప్రణతవిశ్రామ
ధృతతూణవరశరచాప । భుజదండప్రబలప్రతాప
జయదూషణాదిఖరాదిమర్దన । నిశాచరధారీ
యహదుష్టమరేవునాథ । భయదేవసకలసనాద॥

శోభానిధీ, ప్రణతవిశ్రామదాయకా, తూణీరశరచాపములు ధరించి, ప్రచండ భుజప్రతాపముచే ఖరదూషణాదిరాక్షసులమర్దించి దేవతలసకలభయంబులబాపి రక్షించినరామా, నీకుజయమగుగాత!

జయహరణ ధరణీ భారమహిమాటదార అపార
జయరావణారి కృపాలకియె యాతుధాన విహాల
లంకేశాతి బలగర్వకియె వశ్యసురగంధర్వముని
సిద్ధనాగహరిపంధసబకె లాగ॥ 2

ఓ ధరణీభారహరణా, నీకుజయమగుగాక, నీమహిమముదారము నపార మును. సుర, గంధర్వ, సిద్ధ,ముని, జర, సర, నాగుల మార్గముల బంధించిన

లంకేశుడగు రావణుని గర్వమడంచి సమయించిన ప్రభూ, కృపాసింధూ, నీకు జయమగుగాత.

పరద్రోహరత అతిదుష్టపాయో సోఫలపాపిష్ట
అబసు నహొదీన దయాలరాజీ వనయన విశాల
మోహిరహా అతిఅభిమాన నహికోవు మోహిసమాన
అబదేఖి ప్రభుపదకంబుగ తమాన సప్రదుఃఖపుంబు॥ 3

పరద్రోహి, పాపిష్ఠుడనగు రావణు డిట్టిఫలముగాక మరెట్టిఫలమునందును! దీనదయాళూ, కంజవిశాలలోచనా, నావిన్న పమాలింపుము. నిన్ను నేను దురభిమానినై యుంటిని. మీపదకంజముల దర్శించినతోడనే దుఃఖములనిచ్చు దురభిమానములన్నియు నశించిపోయినవి.

కోయిబ్రహ్మ నిర్గుణ ధ్యావఅవ్యక్త జెహిశ్వతెగావ
మోహిభావ కోసల భూపశ్రీరామ సగుణస్వరూప
వైదేహిఅను జసమేత మమహృదయ కరహొనికేత
మోహిజానియెని జదాస భక్తిరమానివాస॥ 4

ఓ ప్రభూ, కొందఅవ్యక్తమైన నిర్గుణబ్రహ్మమును ధ్యానించెదరు. ఓ కోసలభూపతీ! సగుణస్వరూపా! రామచంద్రా! నేనుమాత్రము నిన్నె ధ్యానించెదను. ఈ దాసుని హృదయమున సీతాలక్ష్మణ సమేతుడవై నివసించి యచలభక్తినిమ్ము.

దేవభక్తిరమా నివాసత్రాసహరణ శరణసుఖదాయకమ్
సుఖధామరామనమామి కామఅనేక భవిరఘునాయకమ్
సురబృందరంబున ద్వంద్వభంజ మనుజతను అతులితబలమ్
బ్రహ్మాదిశంకర శేవ్యరామనమామి కరుణా కోమలమ్॥ 5

ఓరమారమణా, త్రాసహరణా, శరణార్థిసుఖప్రదా, రఘునాయకా, కోటిమన్మథ కాంతిపుంజమా, సురబృందరంజనా, ద్వంద్వహరణా, మనుజశరీరా, బ్రహ్మాది శంకరసేవితచరణా, కరుణామయా, కోమలస్వభావా, నీయం దేకాగ్ర భక్తిని బ్రసాదింపుము. అని పలుమారువేడుచు బురుహూతుడు ముకుళిత కర

కమలుడై యుండ, దీనదయాళుడైన రామచంద్రుడాతని ప్రియవాక్కులకు సంతసించి యిట్లనియె.

రాముడయోధ్యకు ప్రయాణము చేయుట

సురనాయకా! కొందఱు వానరు లీరణరంగమున రాక్షసులచే మరణించిరి. వారందఱుబ్రతికింపుమన నింద్రుడమృతవృష్టిని వారిపై గురియింప వారందఱును సజీవులై లేచి రామచంద్రునికడకేగి యమితానందమునందిరి. జగపతీ! రాముని మహిమయనంతము. అజరుద్రాదులకును గోచరముకాదు. రామచంద్రుడు త్రిలోకవాసులను క్షణములోజంపి మఱలసృజింపగలడు. ఇంద్రునకీఘనత నిచ్చుటకై వానరులబ్రతికింపుమనిజెప్పెను. రణమునందు మృతులయిన రాక్షసులు, భయముచే రామునియాకారమును మనసునందిడుకొని నిహతులగుటవలన భవబంధముక్తులై పరమపదమునందిరి. వారిగతులుమునులకును దుర్లభములు. అంత సురనాథుడు సీతారాములకుమ్రొక్కి వారియనుమతివడసి నిజనివాసమునకరిగెను. అంత శంకరుడు తగినసమయము చిక్కినదనిఎంచి, రామునిసమీపించి, యానందాశ్రువు లొలుకపులకితగాత్రుడై, డగ్గుత్తికతో నిట్లుపొగడదొడగెను.

మామభిరక్షయ రఘుకులనాయక । ధృతవరచా పరుచిరకరసాయక
మోహమహా ఘనపటల ప్రభంజన । సంశయవిపిన అనల సురరంజన॥ !

ధనుర్బాణధరుడవయిన రఘుకులనాయకా, నీవు ముఖమను మేఘపంక్తికి ప్రభంజనుడవు. సంశయవిపినమునకు దావాగ్నివి. ఓసురరంజనా! నన్ను రక్షింపుము.

సగుణాగుణ గుణ మందిర సుందర భ్రమతమః ప్రబలప్ర
తాపదివాకర । కామక్రోధ మదగజ పంచానన
పసహుది నిరంతరజన మనహా కానన॥ 2

ఓ సగుణనిర్గుణస్వరూపా, గుణాగారా, సుందరాకారా, భ్రమయనెడి తమస్సునకు ప్రబలప్రతాపముగల దివాకరుడా! అరిషడ్వర్గమత్తగజమృగేంద్రమా, భక్తజనహృదయారణ్యవిహారీ, నీకుజయమగుగాత.

విషయ మనోరధ పుంజకంజవన
ప్రబలతుషార ఉదార పారమనభవవారిధిమంధర
పరమంధర వారయ తారయసంసృతి దుస్తర॥ 3

విషయమనోరధకంజవన ప్రబలతుషారహా, ఉదారా, మనోతీతా, భవవారధిమధనమంధరా! త్రిస్వరూపా, శత్రువులకు మంధరుడా! దుస్తర సంసారసముద్రమును తరింపజేయురామా, నీకువందనము.

శ్యామగాత్ర రాజీవవిలోచన, దీనబంధుప్రణతార్తివిమోచన
అనుజ జానకీ సహిత, నిరంతరం ఏసహు రామనృపమమ ఉరఅంతర
మునిరంజన మహిమండల మండన, తులసీదాసప్రభు త్రాసవిఖండన॥ 4

ఓశ్యామసుందరాంగా! రాజీవనేత్ర! దీనబంధూ! ప్రణతార్తిభంజనా! రామా! అనుజజానకీ సహితుడవై నాహృదయమందెల్లప్పుడు నివసింపుము. ఓ మునిరంజనా, పృథివీమండలభూషణా, రామచంద్రప్రభూ, తులసీదాసునగు నాభయంబులదొలగించి రక్షింపుము.

ఓకృపాసింధూ! నీవు కోసలరాజ్యమును జేయుచుండ నీఉదారచరితమును జూచుటకు మఱలనేను నయోధ్యకు రాగలననిచెప్పి శివుడు కైలాసమునకేగెను. పిమ్మట విభీషణుడు రామునిసమీపించి, ప్రభూ! రావణుని సపుత్రబాంధవముగ సంహరించిన మీకీర్తిముల్లోకములవ్యాపించినది. నాకన్న బుద్ధిహీనుడు, మహా పాపియు, నేలోకడులేడు. నాయన్న గుట్టునంతను ఎరింగించినసీచుడను. కులఘాతకుడను. కాన నీపాపికి దగు దండనను విధించిన సంతసముతో గ్రహింతును. మఱియు దమరొకసారి మాగృహంబునకువిచ్చేసి మజ్జనమాచరించి విశ్రమించి, నాదేశమును, కోశమున గల విత్తమును, గృహారామంబులను నీవానరుల కందఱకుబంచియిచ్చి, నన్ను మీతో నయోధ్యకు గొనిపొండు. నేనట మీపరి చర్యలంజేయుచు గాలముగడపెదను. నాకీరాజ్యభోగమువలదని దీనాననుడై బలుకు విభీషణునిజూచి, రామచంద్రుడు జాలినంది, మిత్రమా! ఇందు నీదోష మేమియులేదు. నీయన్న తనయధర్మమువలన సాన్వయముగ నశించెను. నీవు యథార్థవాదివి. కాన నీయన్న నీకువిరోధియయ్యెను. రావణునిశ్వర్యము నాకు సంక్రమించినది. దానిని నేనునీకిచ్చితిని. కాననీవొక కల్పమువఱకు రాజ్యమును పాలింపుచు, నాభక్తుడవై

పిమ్మట సత్పురుషప్రాప్యమగు నాదివ్యధామము నొందగలవు. మఱియు భరతుడు నారాక కెదురు చూచుచు క్షణమొక యుగముగ గడుపుచు గృశాంగుడై కొనయూపిరితో నుండును. సమయమునకు నేనచటికేగనియెడల నాతడు నాకై ప్రాణములవిడువగలడు. కాన నేనతిత్వరితముగ భరతునిజూడ వలయునన విభీషణుడు పులకితగాత్రుడై, రామచంద్రునిపాదములకు ప్రణమిల్లి, లంకలోనికేగి. వివిధమణులను, వస్త్రాలంకారములను పుష్పకమునిండ నిడుకొని యాపుష్పకమును రామునిసన్నిధి నుంచెను. రాముడామణిభూషణ వస్త్రాదులను వానరులకొసంగుమన విభీషణుడు వానినన్నిటిని వానరులకు బంచియిచ్చెను. వానరులా మణిభూషణాదుల గ్రహించి, వికటముగధరించి సోల్లాసముగ దమదమ చేష్టలజూపుచుండ, సీతారామలక్ష్మణులు వారివినోదముల సాదరముగ జూచుచుండిరి. పార్వతీ! మహామునులనేక యుపాయములచే నారాధించియు నేభగవంతుని పొందజాలకుండిరో, నిగమములెవ్వని స్వరూపమును స్పష్టముగ నిరూపింపజాలకుండినవో, అట్టిప్రభువు వానరులతోనాటలాడుచు వారల నాడించుచున్నాడు. చూచితివిగదా! భగవంతుని భక్తవాత్సల్యమును! దాన జపాగ్నిహోత్రములచే గట్టుపడనిభగవంతుడు భక్తిని గట్టువడును. కాన భగవత్ప్రాప్తికి భక్తివంటి సాధనమొండులేదు. విభీషణుడొసగిన వస్త్రాభరణాదులధరించి వానరులు రామునిసమీపింప, వివిధ విచిత్రవర్ణములుగల వారల జూచి రామచంద్రుడు మందహాస మొనరించుచు, మిత్రులారా! మీ సహాయమున రావణసంహార మొనర్చి విభీషణుని లంకాధిపతిగ నొనర్పగలిగితిని. ఇంకమీరు మీనివాసములకేగి నన్ను భజించుచు సుఖముగనుండుడు. మీకెన్నడు నెవ్వరివలనను భయముకలుగదను రామచంద్రుని యవ్యాజప్రేమభరితములైన వాక్కులవిని వానరవీరులు సాంజలిబంధులై, ప్రభూ! త్రిభువనాధీశులగు మీరీదీనుల సంతోషమునకట్లంటిరి. కాని మీకుమాసహాయము ఖగపతికి మశకసహాయమువంటిది. మీపలుకులవలన మాకు సిగ్గగుచున్నదని బలుకుచు, రామచంద్రుని వీడజాలక, యాతనియాజ్ఞను మీరజాలకయు డోలాయమానమానసులై, హర్షశోకములనందుచు, మాటిమాటికి రామచంద్రుని ముఖకమలమును దిలకించుచు, నెట్టకేలకు దమదమనివాసంబులకు జనిరి. విభీషణసుగ్రీవాంగద జాంబవదాదియోధులు హనుమంతుడు, నచటనె నిలిచి,

నిర్నిమేషదృష్టితో నాశ్చర్యసుందరమూర్తి నాలోకించుచుండిరి. అచ్లేమియు బలుకకనిలిచియున్న జూచి వారలయభిప్రాయమును గ్రహించి, రామచంద్రుడు వారితోగలిసి పుష్పకమునెక్కి గురువులధ్యానించి యుత్తరాభిముఖముగ బయలుదేరెను. విమానము బయలుదేరగనే, రామచంద్రునకుజయము. అని వానరులు కేకలుబెట్టుచు గోలాహలము గావింపుచుండిరి. దానిలో నెత్తగు స్వర్ణసింహాసనమును సీతారాము లధిష్ఠింప సుమేరుశిఖరమునందున్న ప్రియంగు లతాసక్తమగు తరుణతమాలములవలె నుండిరి. వారిపై దేవతలు పూలవాన గురియింపుచుండిరి. వారు ప్రయాణమును సాగింపుచుండ శీతలసుగంధమంద పవనములు వీచుచుండెను. ఆకసము నిర్మలమై ఎటగాంచినను శుభశకునము లగుచుండెను. నదీనదములు సరోవరములును నిర్మలోదకములతో విలసిల్లుచుం డెను. "సీతా! అటుజూడుము. అట లక్ష్మణు డింద్రజిత్తును వధించెను. ఆపడి యున్న రాక్షసవీరుల నంగదాదులు దునుమాడిరి. దేవరావణులగు రావణ కుంభకర్ణులిట మడిసిరి. ఇటమాకు నాగపాశబంధ మేర్పడినది. అది సేతువు. ఇచటనే నేను శివుని ప్రతిష్ఠించితిని. చూడుమని రాముడన నందఱును రామలింగేశ్వరునకు నమస్కరించిరి. రామచంద్రుడు దానాగిన ప్రదేశముల మైథిలికి జూపి వానివిశేషముల జెప్పుచుండెను. అంతనావిమానము దండక మీదుగా నగస్త్యాశ్రమమును జేర నటనాగి యామునితిలకుని దర్శించి, యాతని యాశీస్సులనంది, యటనుండి చిత్రకూటమున కేగి యచటివారల నానంద మొందించి, ప్రయాణమునుసాగించుచు, కలికలుషహారిణియగు యమునను సీతకుజూపి, పిమ్మట గంగనుజూపి, గంగకు నమస్కరింపజేసి, త్రివేణీ సంగమమునుజూపి, ఇది కల్పవృక్షమువలె సకలమనోరథముల నీడేర్చును. తీర్థరాజమగు నీప్రయాగక్షేత్రము, దర్శనమాత్రమున సకలదోషముల హరించును. ఈత్రివేణి స్వర్గమునకు సోపానపంక్తివంటిది.

సీతారామలక్ష్మణు లయోధ్యకు జేరుట

అదిగో! మన యయోధ్య. అది సాంసారికరోగములకశ్వినీదేవతల వంటి దన నందఱు నాపురికి నమస్కరించిరి. సీతారామలక్ష్మణులయోధ్యను జూచి కన్నీరు గార్చిరి. మాటిమాటికాపురమునుజూచి పులకితగాత్రులగు చుండిరి. ఇపుడాత్మబంధువుల జూడగలమని వారానందబాష్పములను విడు

చుండిరి. విమానారూఢులగుటచే వారికయోధ్య దూరమునుండియే గోచర మగుచుండెను. రామచంద్రుడు త్రివేణిలో స్నానముచేయ నందఱు నట స్నానములజేసి సంతుష్టులయిరి. అంత రామచంద్రుడు హనుమంతుని బిలిచి, హనుమా! నీవు విప్రవేషమును ధరించి, భరతునకు మారాక నెరిగించి, యాతనిక్షేమమును మాకు జెప్పుమన నాతడు రామాజ్ఞనంది తోడనే జనెను. తరువాత రామచంద్రుడు భరద్వాజాశ్రమమున కేగ నా మునిపుంగవుడమితా నందమునంది, రామచంద్రు నర్ఘ్యపాద్యాదులచే గౌరవించి యాశీర్వదించి, రామచంద్రుడు మునిపదములకెరగి, యనుజ్ఞగొని విమానరూఢుడై వచ్చు చుండ, గడువుదాటుచున్నది. కాన రామచంద్రుడు బయలుదేరవచ్చునని తలచి, గుహుడు నావల సిద్ధపఱచి నిరీక్షించుచుండ గంగాతీరమున విమానము నాపి శ్రీరాముడు గంగకు నమస్కరించెను. సీతయు గంగకు బ్రణమిల్లి బహు విధముల నర్పింప నామెభక్తికి మెచ్చి గంగ ప్రత్యక్షమయి, అమ్మా! నీకచలసౌభాగ్యము సిద్ధించునని దీవించెను. అంత రామచంద్రుడు వచ్చుటను జూచి గుహుడు గంగనుదాటి పరుగునవచ్చి రామచంద్రుని పాదములపై బడి యానందపరవశుడై శరీరమును మఱచియుండెను. గుహుని గాఢప్రేమకు మెచ్చి రామచంద్రుడాతని లేవనెత్తి కౌగలించుకొని కుశలమడుగ, విరించి శంకరార్చితములగు తమపదకంజముల దర్శనభాగ్యముచే మాకెల్లరకు కుశలము ప్రభూ! అని గుహుడుబలికెను. ఓపార్వతీ! చూచితివా! శ్రీరాముని యౌదార్యమును! అతనికి భక్తి ప్రధానముగాని జాతిభేదములేదు. మూర్ఖులీవిషయమును గ్రహింపక, తలకొకతీరున బట్టుదలతో వితండవాదములజేయుచు నితరులను గూడ వంచించుచున్నారు. ప్రభూ! మందమతియగు తులసీదాసుని నుతుల గ్రహించి యరిషడ్వర్గమును దొలగించి, యచలభక్తిని బ్రసాదింపుము. రామ చంద్రుని పవిత్రకథవలన దురితములు నశించును. దేవతలు ప్రసన్నులగుదురు. సర్వశుభములు చేకూరును. ఈ యుద్ధచరితమును వినినవారికి, విజయమును జ్ఞానైశ్వర్యములను రామచంద్రుడు ప్రసాదించును. కలిమలప్రధ్వంసమునకు రామనామమువంటి సాధనము వేరొండులేదు. ముమ్మాటికినినిజము.

లంకాకాండము సమాప్తము.

ఉత్తరకాండము

శ్లో॥ కేకీకంఠాభనీలం సురవరవిలసద్దివ్యపాదాబ్జచిహ్నం
శోభాఢ్యం। పీతవస్త్రం సరసిజనయనం సర్వదాసుప్రసన్నమ్ ।
పాణౌనారాచచాపం కపినికరయుతం బంధుభిస్సేవ్యమానం
నౌ మీడ్యం జానకీశం రఘువరమనిశం పుష్పకారూఢరామమ్॥

శ్లో॥ కోసలేంద్ర పదకంజమంజులౌ । కోమలౌవిధిమహేశవందితౌ
జానకీకర సరోజలాలితౌ । భక్తమానసమిళిందసంయుతౌ॥

శ్లో॥ ఇందుకుంద హిమశైలసుందరం ఆంబికాపతి మభీష్టసిద్ధిదమ్
భక్తమానసగతం సులోచనం నౌమి। శంకరమనంగ మోచనమ్॥

అయోధ్యాపురవాసులు రామవిరహార్తులై రోజులలెక్కింపుచు, నిక రామచంద్రుడు వచ్చుట కొకదినము గడువున్నదని రామునిరాక కెదురు చూచు చుండిరి. శుభసూచకములగు శకునములబట్టి రామచంద్రుడనుకొనినట్లు తప్పక రాగలడను సంతోషముతో పురమునంతను చక్కగ నలంకరించిరి. తల్లులు మిగుల సంతసించుచుండిరి. సీతారామలక్ష్మణులెదుట నిలిచినట్లు వారికగ బడుచుండెను. భరతునకు శుభసూచకములగు దక్షిణభుజనేత్రము లదురు చుండ సంతసించుచు, మాయన్న వచ్చుట కొకదినము అవధిగలదు. నాజీవి తమునకునదియె యవధి. కానియింతవఱకు వచ్చుజాడగాని వర్తమానము గాని ఏమియునులేదు. కారణముదెలియదు. నన్నుకుటిలుడని యతడురాకుం డునా? అక్లిన నాప్రాణములే యతనిచెంత కేగగలవు. ఔరా! లక్ష్మణు డెంత యదృష్టశాలి. అతడు భగవంతుని యనుసరించిపోయెను. కపటచిత్తుడ నని యెంచి నన్ను విడిచియుండునా! కాదు! నేనే పొరబడుచుంటిని. కరు ణామయుడగు భగవంతుడు భక్తునియవగుణంబుల గణింపడు. అతడట్లు పాటిం చిననావంటివాని కెన్నటికిని ముక్కలుగుటకు వీలులేదు. ఈనాశుభసూచ నములబట్టి రామదర్శనము కావచ్చును. అవధి గడిచినపిమ్మటగూడా నేను బ్రతికియుండిన నావంటిపాపి మఱియొకడుండడు. అవధిగడుచుచున్నది. ఇక నేను జీవించుట మంచిపనికాదని తలంచి, దుర్బలశరీరుడై, దర్భాసనమున

గూర్చుండి రామనామస్మరణము జేయుచు విచారించుచున్న భరతుని దూర మునుండిచూచి హనుమంతుడు పులకితగాత్రుడై, యానందబాష్పములొలుక నెదుటనిలిచి, వచ్చుచున్నారు సీతారామలక్ష్మణులు. వచ్చుచున్నారని వీను లకువిందొనర్చుచు నమృతోపమములగు వాక్కులబలుకుచు, భరతా! ఎవని వియోగముచే రాత్రిందినములు గృశించుచుంటివో! ఎవనినామము నహర్నిశలు జపించుచుంటివో! ఏమహానీయుడు దుష్టరాక్షస సంహారమొనర్చి శిష్టులగాపా డెనో! అట్టి రఘురాముడు సీతాలక్ష్మణులతోగూడి సుఖముగ వచ్చుచున్న వాడన వినిన భరతునకు తృషితున కమృతము లభించినట్లయ్యెను. తోడనే భరతుడులేచి, నాకీప్రియసందేశమును వినిచి నాప్రాణములగాపాడిన నీవెవరు తండ్రీ! యనిభరతుడన, నేనువాయుపుత్రుడ, రామదాసుడనగు హనుమంతు డను. వానరుడనని బలుక నాతనిని మహానందముతో భరతుడు కౌగిలించు కొనెను. అప్పటి భరతుని యానందమునకు మేరలేకుండెను. పులకితగా త్రుడై, హనుమా! నీరాకచే నాసర్వదుఃఖములు నశించినవి. మాయన్న కుశలముగనున్నాడా! నన్నెపుడైన దలంచునా! యనిమాటిమాటికి బలుకుచు, నీకేమిప్రత్యుపకార మొనర్పగలను. నీవాక్కులకు సరియగువస్తువు ముల్లోక ములనులేదు. నీఋణమునెట్లుదీర్పవలయునో! దోపకున్నది. అని భరతుడన నతనికినమస్కరించి, రాముని చరిత్రమునంతను వినిపింప, భరతుడు తృప్తినందక మఱలమఱలనడుగుటజూచి హనుమంతుడుసంతసింపుచు, భరతా! నీవుధన్యుడవు. చరాచర గురుడగు రామచంద్రుడు, 'నీవంటి నీతినియమములుగల సోదరు డెందును లేడని పలుమారులుగ్గడించి యుండెను.' నిన్నుజూచినంతనే నాకు శ్రీరామచంద్రుని జూచినట్లున్నది. నీవు రామునకు బ్రాణాధికుడవు. నీయచలభక్తికి సాటిలేదని బలికి శలవుగైకొని, మారుతి రామునియొద్దకేగి భరతుని క్షేమమునుజెప్ప విని సంతసించి హనుమంతుని విమానముపై నెక్కిం చుకొని రామచంద్రుడు వచ్చుచుండెను. అంత భరతుడయోధ్యకేగి రామ చంద్రుడు సీతాలక్ష్మణసహితుడై సుఖముగ వచ్చుచున్నాడని ముందుగ వశి ష్ఠునకుజెప్పి, పిమ్మట తనవారికందఱకుదెలిపెను. తల్లులామాటనువిని పట్టరాని సంతోషముతో పాలు పెఱుగు మనోహరములగు ఫలపుష్పగంధతులసీ ప్రధా నములగు మంగళద్రవ్యముల సమకూర్చి బంగరుపాత్రలందిడుకొని, సువాసినుల

చేతికిచ్చి రామాగమనము ప్రతీక్షించుచుండిరి. ఈవార్తను వినినతోడనే పౌరులు తమతమ పనులవీడి, రామదర్శనలాలసులై పరుగుపరుగున వచ్చి రాముని జాడను నిరీక్షించుచుండిరి. అపుడయోధ్య శోభానిధియై విరాజిల్లు చుండెను. సరయువు నిర్మలముగ ప్రవహించుచుండెను. శీతలసుగంధమంద మారుతములు వీచుచుండెను. భరతుడు పూజాసంభారముల సమకూర్చుకొని, వశిష్ఠుని ముందిడుకొని, మంత్రి సామంత సోదర పౌరసహితుడై, రామున కెదు రేగుచుండెను. పౌరాంగనలు సౌధములపై నెక్కి, పై నుండివచ్చుచున్న విమా నమునుజూచి యానందపరవశు లైరి. రామచంద్రుని రాకచే నయోధ్యా సముద్రముప్పొంగుచుండెను. ప్రజల కోలాహలము మిన్ను ముట్టుచుండెను. భానుకులకమలదివాకరుడగు రామచంద్రుడు, వానరులకాపట్టణశోభనుజూప, సుగ్రీవ విభీషణాద్యనుచరులాశోభ కచ్చెరువందుచు, ఈపుర మెంతేని పవిత్ర మయినది. ఈదేశము మనోహరమయినదని ప్రశంసించుచుండిరి. అంత రామ చంద్రుడిట్లనియె. మిత్రములారా! వైకుంఠమునకుసరియగు బురములేదని వేద పురాణములందును, లోకములందును ప్రసిద్ధికలదు. కాని నాకీపురమునం దెక్కుడు మక్కువగలదు. దీనితోదుల్యమగునదేదియునులేదు. ఇది నాజన్మ భూమి. ఇందు నాజనని గలదు. దీనికుత్తరముగ పవిత్రమగు సరయువు ప్రవ హించుచున్నది. అందెవరు గుంకెదరో వారనాయాసముగ నాలోకమునందె దరు. ఇటనివసించువారు నాకత్యంతప్రియులు. ఇదియె నానివాసమన, నీపవిత్ర పట్టణమునుగాంచిన మేమెంతేని ధన్యులము ప్రభూ! అని వారు పలికిరి. అంత బురవాసులను, గురువులను, సచివులను, అనుజులనుజూచి, విమానమునాపి, అందఱును దానినుండి దిగి, ఓపుష్పకమా! నీవు కుబేరునికడ కేగుమననదియు, రామపాదస్పర్శముచే, రావణదూషితమగునేను పవిత్రమయితిని. రావణ నిర్బంధ ముక్తమై నేడు మఱల నామిత్రునిజూచుభాగ్యమబ్బినదని సంతసించుచు కుబే రునికడ కేగెను.

అంత రామచంద్రుడు కృశించియున్న భరతుని పౌరులను, వశిష్ఠాది గురువులను, సుమంత్రాది మంత్రులనుజూచి చేతనున్న ధనుర్బాణములను హనుమచేతికిచ్చి, యనుజసహితుడై, వశిష్ఠునిపదములకు ప్రణమిల్లెను. అపుడు పులకితగాత్రుడైన గురువు వారల లేవనెత్తి కుశలమడిగెను. తమ యనుగ్రహ

ప్రభావమున నంతయు శుభోదర్కమేయసి బలుకుచ, ధర్మధురంధరుడు రామచంద్రుడు బ్రాహ్మణ బృందమునకు నమస్కరించెను. హరవిరించి పురందరప్రముఖ దేవమాన్యుడగు రామచంద్రునిపదములబడి తనివిదీరక యెప్పటికిని లేవని భరతుని రామచంద్రుడు లేవనెత్తి కౌగలించుకొనెను. పులకిత గాత్రులై, ఆనందబాష్పభరితనేత్రులగు వారి కలయిక నెవరు వర్ణింప గలరు? మూర్తీభవించిన వీరశృంగారములవలె నొప్పుచుండిరి. రాముడు భరతుని గుశలమడుగ, గద్గద కంఠముతో, ఓ కోసలాధీశా! వియోగాంబునిధిలో మునిగిన నన్ను చేయూత నొసగి యుద్ధరించితివి. నే నెంతేని ధన్యుడను. ఇప్పుడు నాకు గుశలమని భరతుడనెను. పిమ్మట రామచంద్రుడు శత్రుఘ్నుని కౌగలించుకొనియెను. పిమ్మట భరతలక్ష్మణ శత్రుఘ్నులు గాఢాలింగనముల నొనరించుకొని సంతసించుచుండిరి. వారి హృదయములందాయా నందమిముడుటలేదు. పిమ్మట భరతశత్రుఘ్నులు వదినెకుశిరములవంచి నమస్కరించిరి. పౌరులెల్లరు రాముని దర్శించి, వియోగబాధనుండి ముక్తులయిరి. పౌరులయవ్యాజ ప్రేమకు సంతసించి రాముడందఱ యథోచితముగ గుశలమడిగి, వారల సంతుష్టులజేసెను. ఇట్లందఱ రంజింపజేసి రామచంద్రుడు ముందుకు జనుచుండ, చేపువచ్చిన పాలను శిశువులకిడుటకు సంధ్యాలందు మళ్లెడి తూవుల వలె నాతురతతో కౌసల్యమొదలగు తల్లులు రాముని జూడ నరుదెంచుచుండ దల్లులకు నమస్కరించి సాదరముగ బలుకరింప వారి దుఃఖములన్నియు దొలగి వారానందమున నోలలాడుచుండిరి. రామచరణసేవనీకులభించెను. నీవుధన్యుడ వని సుమిత్ర లక్ష్మణుని కౌగలించుకొనెను. కైక రాముని దరిజేరుటకు సంకోచించుచుండెను. లక్ష్మణుడు మువ్వురు తల్లులకు నమస్కరించి వారియాశీస్సుల నందెను. కైక తాను చేసినపనికి లోలోన సిగ్గిలుచుండెను. పిమ్మట సీత మువ్వురత్తలకు ప్రొక్క వారావెను కౌగలించుకొని యచల సౌభాగ్యవతివికమ్మని దీవించిరి. రాముని జూడగనె తల్లులకు దశరథుడు స్మృతికివచ్చి వారిమనములు కొద్దిగ కలతవడినను ధీరస్వాంతలగు వారాలోపమును నగపడనిచ్చుటలేదు. పిమ్మట గర్పూరమును బంగరు పళ్ళెరములందిడికొని హారతులిచ్చుచుండ, కౌసల్య తనయుల రెప్పవాల్చక జూచుచు నీసుకుమారులు బలవంతులగు రాక్షసుల నెట్లు సంహరించిరో! యనుకొనుచు వారి దివ్యతేజములను

జూచి, పులకితగాత్రియగుచుండెను. సుగ్రీవాది వానరవీరులు మానవశరీరములు దాల్చి, రామలక్ష్మణభరతశత్రుఘ్నులతో గలిసి తిరుగుచు, భరతునివ్రత నియమములకు, నాతని యచలభక్తికి, బ్రజలు రాముని యందు జూపుచున్న యపారప్రేమకు నచ్చెరువందుచు బ్రశంసింపుచుండిరి. పిమ్మట రామచంద్రుడు సుగ్రీవాది మిత్రులకు వశిష్ఠునిజూపి, వీరు మాకులగురువులు. వీరియనుగ్రహము వలననె మనమా రాక్షసుల జయించితిమని, వారల గురువునకుజూపి, గురువర్యా! వీరు నాకు పరమమిత్రులు. వీరి సహాయ్యమువలన నేను రణసాగరము నవలీలగ దాటగలిగితిని. వీరునాకై ప్రాణముల ధారవోసిరి. వీరు నాకు సోదరుల కన్న నెక్కుడు. అన వారు మిగులసంతసించుచు, వశిష్ఠునకు బ్రొక్కి, పిమ్మట కౌసల్యకు బ్రొక్కి, మీరు నాపుత్రతుల్యులని యామె యాదరించెను.

పిమ్మట రామచంద్రుడు రాజమందిరమున కేగుచుండ సురలు పూలవాన గురియించిరి. పురస్త్రీలు సౌధములపైనుండి, భగవంతుడైన రామచంద్రుని దిల కించుచు నానందపరవశులగుచుండిరి. రాజమందిరద్వారమును పూర్ణకలశముల చేతను, రంభాస్థంభములచేతను, పలురంగుల పతాకములచేతను చక్కగ నలంక రించిరి. రాజమార్గములందు పన్నీరుచిలికి, ముత్యములచే నందముగ ముగ్గులబెట్టిరి. చత్వరములనానేకమణితోరణములచే నలంకరించిరి. చతుష్పథములు నానాలం కారశోభితములై విరాజిల్లుచుండెను. మంగళధ్వనులు మిన్నుముట్టుచుండెను. పుణ్యాంగనలు హారతులనిచ్చుచు మంగళగీతములపాడుచుండిరి. మఱికొందఱు రామునిపై పువ్వుల జల్లుచుండిరి. అప్పటి పట్టణ శోభను, ప్రజల యుత్సాహ మును, జూచితీరవలయునుకాని వర్ణింప నేరికినిదరముకాదు. అయోధ్యా సరో వరమునందలి వనితానేతకుముదములు, రామవిరహభానుకర ముకుళితములై మఱల రామచంద్రుని రాకవలన వికసించి యాహ్లాదమును గొలుపుచుండెను. ఎటు జూచినను శుభశకునము లగుచుండెను. దేవదుందుభులు మ్రోయు చుండెను. సర్వజ్ఞుడైన రామచంద్రుడు ముందుగనైక మందిరమున కేగి యామె నోదార్చి యామెసంకోచమును దొలగించి, పిమ్మట పురజనుల యాదరముతో గూడ రాజభవనమును బ్రవేశించెను.

రాముడు సింహపీఠిక నధిష్ఠించాడు

అచట సిద్ధపఱుపబడిన సర్వసంభారములజూచి సంతసింపుచు దనమంది రమునకేగ నంత శుభముహూర్తమాసన్నమగుటచే వశిష్ఠుడు వచ్చి, విప్రుల రావింప, నేడుగదా! సంతోషసమయమని బ్రాహ్మణ బృందము లనేకములు వచ్చెను. అప్పుడు రామచంద్రుడు గురునానతి ననుసరించి, బ్రాహ్మణులకు గురువులకు దల్లులకు నమస్కరించి, సింహాసనము నధిష్ఠించెను. అంత మంత్రి సామంతపౌరజనులు, గురువర్యా! ఇక రాముని పట్టాభిషిక్తునిగావింపు మనఁ రఘునాయకా! సకలజగదానందాయకమగు నీపట్టాభిషేకమునకు దేవతలు మానవులును నెదురుజూచుచున్నారని వశిష్ఠుడుసుమంతునిజూచి, సుమంతా! పట్టాభిషేకమునకు గావలసినపదార్థముల సమగూర్పుమన సుమంతుడు చతురంగసేనల నలంకరించి, సిద్ధముజేయించెను. సముద్రములయొక్కయు, మహానదులయొక్కయుఁ జలకములదెప్పించెను. మఱియు బట్టాభిషేకమునకవసరమగు సకల ద్రవ్యములను సిద్ధముజేసి, పట్టణమంతయు నలంకరింపించెను. సురలుదుందుభుల మ్రోయింపుచు విరులవానగురియింపుచుండిరి. అంత రామచంద్రుడు సేవకులకు, సుగ్రీవప్రముఖవానరవీరులకును, విభీషణాది రాక్షసులకును నభ్యంజనమొనరింపుడని యాజ్ఞాపింప వారట్లు చేసిరి. పిమ్మట భరతుని జడలను స్వయముగవిప్పి, భరతలక్ష్మణశత్రుఘ్నుల కభ్యంజనము జేయించి, తానును యభ్యంగనమును గావించుకొనెను. రామచంద్రుని మృదుల స్వభావము, భరతునిభాగ్యమును, వర్ణనాతీతములు. అట్లభ్యంగస్నానమొనరించి, దివ్యమాల్యాంబరాను లేపములను, రత్నాభరణములను ధరించిన రామచంద్రునిశోభకు కోటిమన్మథులైనను సాటికారాజాలరు. పిమ్మట అత్తలు సీతకభ్యంజనమొనరించి, పీతాంబరముగట్టించి, సర్వాభరణశోభితాంగినొనరించిరి. సహజసౌందర్యవతియగు సీత సర్వాభరణభూషితయై మహాలక్ష్మివలె నుండెను. అట్లు విభూషితులగు సీతారాములజూచి, తల్లులుతమజన్మము సార్థకమయినదని యమితానందము నందుచుండిరి. పట్టాభిషేకమహోత్సవమును దిలకించుటకు, శివవిరించిపురందరాది దేవతలు, నారదాది దేవర్షులు, యక్షకిన్నరాది దేవయోనులునే తేర వారివిమానములచే నాకాశము నిరవకాశ మయ్యెను. మునులు తండోపతండములుగవచ్చి రామచంద్రుని దర్శించి

కృతార్థులమైతిమని సంతసించుచుండిరి. సూర్యసంకాశమగు సింహాసనముపై సీతారాములాసీనులైయుండ, విప్రులు వేదమంత్రములబఠింపసాగిరి. ప్రజలు హర్షపరవశులై జయజయధ్వానములొనరించుచుండిరి. అంతవశిష్ఠుడు, సముద్రోదకములతోడను, గంగాదిమహానదీజలములతోడను నిండినకలశములను గ్రహించి సమంత్రకముగ నభిషేకము గావించి ఇట్లనియె. రామచంద్రా! నాచేతులచే నీకు బట్టాభిషేక మొనరించుటచే నేటికినాజన్మము సార్థకమయినది. నేను కృతార్థుడనయితిని. నీవీవంశమునందుదయించెదవనియు, నీకీపట్టాభిషేక మహోత్సవమునొనరించి నీకు గురువునై కృతార్థుడను గావలెననియు దలంచియే నేనీపురోహితకృత్యమున కొడంబడితిని. నేటికిది సిద్ధించినదని, ఆనంద పులకితగాత్రుడయ్యెను. పిమ్మట సీతారాములు బ్రాహ్మణులకు నమస్కరించి యాసీనులైయుండ, విప్రులభిషేకమంత్రముల బఠింపుచుండ సీతారాములకు మణికిరీటములనమర్చిరి. అట్లు కిరీటధారులైన సీతారాములజూచి, తల్లులు మంగళహారతులనిప్పించి పరమానందభరితలైరి. పిమ్మట విప్రులకమితముగ గోభూహిరణ్యాది దానములజేసి రాముడాసీనుడైయుండ దేవదుందుభులు మ్రోసెను. పూలవానగురిసెను. అప్సరసలాడిరి. గంధర్వులుపాడిరి. సీతనువామ పార్శ్వము నందిడికొని రామచంద్రుడు సింహాసనాసీనుడైయుండ, భరతశత్రుఘ్నులు చామరములను, లక్ష్మణుడు శ్వేతచ్ఛత్రమును, సుగ్రీవ విభీషణులు ధనుర్బాణములను, అంగదహనుమంతులు గదాతోమరములను, నలనీలురు పాశాంకుశములను; ధరించి రెండుప్రక్కల వరుసగనిలిచియుండిరి.

శ్రీసహిత దినకరవంశ భూషణ కామబహుచ్ఛవి నోహ ఈ
నవాంబుద వరగాత్ర అంబరపీత మునిమన సోహ ఈ
మకుటాంగదాది విచిత్రభూషణ అంగఅంగ హ్రపతిసజై
అంభోజన యనవిశాల ఉరభుజ ధన్యనరనిరంఖతతె

దినకరవంశభూషణుడగు సీతామనోహరుడు కోటిమన్మధకాంతితో శోభిల్లుచుండెను. పీతాంబరధారియు, సర్వాభరణభూషితుడు, మణికిరీటాలంకృత మౌళియునగు, శ్రీరామచంద్రునిజూచి మునులుసయితము మోహితులైరి. ఆవిశాలోరస్కుడు నంభోజనేత్రుడు నగు శ్రీరామచంద్రుని జూచినవారు

ధన్యులు. ఖగపతీ! ఆరామచంద్రునిశోభ, అచటివారలయానందము వర్ణనాతీతములు. రాముని సంపూర్ణముగ దెలిసినవాడొక్క శంకరుడుమాత్రమె. దేవతలప్రభు వందిమాగధరూపముల ధరించి తమశక్తికొలది రామచంద్రుని స్తుతింపసాగిరి. వారినందఱి శ్రీరామచంద్రుడు సాదరముగ జూచుచుండెను. వేదములుగూడ రూపమునుధరించి రామచంద్రుని స్తుతియించెను.

ఋగ్వేదస్తుతి

ఓ రాజశిరోమణీ! నిర్గుణస్వరూపుడవగు నీవు, దశకంధరాది ప్రచండ రాక్షసుల భుజబలమునడంచి, భూభారమును తొలగించి మాదుఃఖములహరించుటకై ఈ సగుణమానుషరూపము నందితివి. ఓ ప్రణతపాలా! దయాలవాలా! యమితశక్తిగలనీకు జయమగుగాత. నీవు భూభారముతో బాటు భక్తుల సంసారభారమును దొలగింతువు. మఱియు మాయకువశులై, సంసారవారాశింబడి దివారాత్రములు కొట్టుకొనుచు తుదిగానక యలసిపోయినప్రాణులనందఱిను, వారివారి కర్మలనుబట్టి యుద్ధరించు మహాపురుషుడవీవ. నీకృపాపాత్రులు సంసారాతీతులై తాపత్రయమునుండి తొలంగెదరు. కృపాసింధూ! నీకరుణాదృష్టిని మాయెడనుంచి మమ్మురక్షింపుము.

యజుర్వేదస్తుతి

ఓ రామచంద్రా! నీభక్తుడుకానివా డెట్టితపముజేసినను కృతార్థుడుకాజాలడు. కాన నీయచలభక్తిని బ్రసాదింపుము. ఏచరణములను శివ విరించులు పూజించుచుండెదరో! ఏచరణ రజఃస్పర్శమువలన నహల్యా శాపవిముక్తయయ్యెనో! ఏ చరణనఖాగ్రమునుండి త్రిలోకపావనియగు గంగ యుద్భవించెనో! ఏచరణములు, చక్రచాపధ్వజకమల చిహ్నితములో అట్టి పదపంకజకలితుడవగునిన్ను మేమునిరతము భజియించుందుము ప్రభూ!

సామవేదస్తుతి

ప్రభూ! ఏవృక్షమవ్యక్తమో, ఏవృక్షమునకు, స్వేదజో, ద్విభజ్జి, అండజ, జరాయుజరూపమగు చతుర్విధభూతములు త్వక్కులో, దేనికి, శీతోష్ణ, సుఖదుఃఖ జ్ఞానాజ్ఞానములుకాని, లేక జననమరణవృద్ధిక్షీ యపక్వాపక్వములుకాని,

లేక, కామక్రోధలోభమోహమద మాత్సర్యములుకాని, స్కంధములో! దేనికి పంచవింశతి తత్వములుశాఖలో! చిత్తవాసనలుపత్రములో! సంకల్పములు పుష్పములో! పాపపుణ్యములనెడి తిక్తస్వాదుఫలములు కలవో! ఆశాలత లచే నలుముకొనిన ఆసంసారమహీరుహమునకు నీవు మూలము. అట్టి నీకు నమస్కారము.

ఆధర్వస్తుతి

ప్రభూ! ఎవనిని యోగులు జ్ఞానులు నజుడనియు నద్వితీయుడనియు, నవాఙ్మానసగోచరుడనియు, శుద్ధముక్తస్వభావుడనియు, మాయాతీతుడనియు ధ్యానింతురో, అట్టి సగుణనిర్గుణరూపుడవగు నీకు నమస్కారము. మేము త్రిశుద్ధిగ మిమ్ము సేవించునట్లనుగ్రహింపుము.

ఇట్లందఱు చూచుచుండ నాలుగువేదములును రామునిస్తుతించి యంత ర్ధానమయ్యెను. ఖగపతీ! పిమ్మట శివుడు సమీపించి ఇట్లు స్తుతింపసాగెను.

శివస్తుతి

రామచంద్రా! నీకు జయము. రమారమణా, భవతాపశమనా, భక్తార్తిభంజనా, అయోధ్యాధీశా, సకలజగదధీశా, శరణాగతరక్షకా, విభో, నీవు రావణుని సపరివారముగబరిమార్చి భూభారమును దొలగించితివి. రజనీచర పతంగములు,నీబాణాగ్నిచే నశించిపోయినవి. సాధులబాధలు నశించినవి ప్రభూ!

రామా! నీయుదయమువలన భూలోకమలంకరింపబడినది. నీబాణ భాస్కరునిచే, నరిషడ్వర్గాంధకారము నశించినది. మన్మథుడను వేటకాడు కుత్సితభోగములను వలలనుగల్పించి, ప్రాణులను మృగముల వేటాడుచుండును. ఆతనివలలోబడినవారు విషయాసక్తులయి కుమార్గములక్రుమ్మరుచుందురు. వానిబారినుండి నన్నురక్షింపుము. ఇదియె ప్రార్థనము.

ప్రాణులు నీపదపద్మములభజింపక సంసారసాగరమునబడిబ్రెట్టకు రాజా లకయందేమునిగి పోవుచున్నారు. అట్టివారి నుద్ధరించుటకు నీపవిత్రచరిత్రమే నావకదా!

రాగద్వేషములవీడి, సంపద్విపత్తులసమబుద్ధికలిగి, సకల విషయముల విడిచి, త్రిశుద్ధిగమిమ్ము భజించెడివారు ధన్యులు. పరిశుద్ధమనస్కులై నియమ

పూర్వకముగ నిన్ను నిరతము భజించుచు, మానావమానముల వీడినీపదపంక జములనే గొలుచు ధన్యులకు నమస్కారము. వారు నీకటాక్షముచే నట్టిభక్తులై రి ప్రభూ!

ఓమునిమానసపంకజరోలంబా! రఘువీరా, రణధీరా, అజేయా, హరీ, నీనామము నేనెల్లప్పుడు స్మరించుండెదను. భవభంజనా, మదహరా, గుణశీలా, కృపానిధీ, రమారమణా, ద్వంద్వహరా, దీనావనా, నిరతము నిన్ను సేవించెడి యానన్ను గృపాదృష్టితో ననుగ్రహింపుము.

ఓప్రభూ! నీచరణకమలం దెడ తెగనిభక్తి ననుగ్రహింపుము. నాకింత కన్నను వేరొండు కామ్యములేదు. సత్సాంగత్యముననుగ్రహింపుము. అనిశివుడు రామచంద్రుని కొనియాడి కైలాసమున కమితానందము నొందుచుజనెను.

ఖగపతీ! ఈపవిత్రచరిత్రము, తాపత్రయమును, భవభయమును హరించును. రాముని బట్టాభిషేకచరిత్రను వినినవారికి, జ్ఞానవైరాగ్యములు, సకలాభీష్టములు సిద్ధించును. ఈచరిత్రమును వినినవారల ఇహమందు సకలసౌఖ్యముల ననుభవించి, పరమందు విష్ణుసాయుజ్యము నందెదరు. ఈ కథభోగలాలసులకు సమస్తభోగములను, భక్తులకు విమలజ్ఞానవైరాగ్యములను గలిగించి, సంసార సాగరమును దాటుటకు నౌకవలెనుండును. నాబుద్ధిననుసరించి యింతవఱకుజెప్పి తిని. ఇక ముందుకథను వినుము.

రాముడందఱను సత్కరించి పంపుట

అయోధ్యాపురవాసులందఱు సకలభాగ్యముల దులదూగుచు నెప్పటి కప్పుడు పట్టణమునలంకరించుచు, రామపదకమలముల నూతనభక్తినిగలిగి, దేవబ్రాహ్మణులనర్చించుచు, నన్నివిధముల నానందధరితులై యుండిరి. పట్టాభిషేకానంతరము రామచంద్రుడు, శివుని, బ్రహ్మాది దేవతలను పూజించి, బ్రాహ్మణులకనేక దానములజేసి, గురువులసత్కరించి, యాచకులదృప్తిబఱచి, భిక్షుకులదారిద్ర్యమునువాపి, పౌరులనందఱనానంద పఱచుచుండెను. రామచంద్రుని దర్శనమునకు వచ్చువారెడతెరపిలేకుండ వచ్చుచు దమతమ కోరికలదీర్చుకొని సంతుష్టాంతరంగులై పోవుటచూచి, సుగ్రీవవిభీషణాంగదాదులానందాబ్ధినోల

లాడుచు, దమతమ నివాసములమఱచి యాయుమాసములనొక క్షణమువలె గడపిరి. అంతనొకనాడు రామచంద్రుడు వారలదనచెంత గూరుచుండబెట్టుకొని యిట్లనియె. మిత్రులారా! మీమేలుమఱువరానిది. మీవంటి పరోపకారపరీణులెందైనగలరా? మీరునాకొఱకు సర్వమునువిడిచి, దివారాత్రములెంతో శ్రమపడితిరి. కాన మీరు నాసోదరులుకన్న నెక్కుడని నేను మనస్ఫూర్తిగ జెప్పుచున్నాను. నేనందఱకన్నను మిమ్ములనెక్కుడుగ ప్రేమించుచుండెద. మీరిక మీమీనివాసములకేగి, సర్వగతుడనగు నన్ను సదాధ్యానింపుడు. మీరట్లుచేయనినాడు మీమీ రాజ్యములరాజకములై క్షీణించును. కాన మీరు మీమీనివాసములకేగి సుఖముండుడన, నామాటలకు సంతోషవిషాదములు ముప్పిరిగొన నేమియుబలుకజాలక నిశ్చేష్టులై రామపాదముల దిలకించుచు నూరకుండిరి. వారి యపారప్రేమమునకు రామచంద్రుడు సంతసించుచు, వారికిమఱల హితమునుపదేశించెనుకాని వారికాయుపదేశమంతగ రుచింపకుండెను. పిమ్మట రామచంద్రుడు వారలకొఱకనేక రత్నాభరణములను, బట్టువస్త్రములనుదెప్పించెను. భరతుడు సుగ్రీవుని స్వయముగ వస్త్రాలంకారభూషితునిగావించెను. పిమ్మట లక్ష్మణుడు విభీషణుని వస్త్రాలంకారములతో నలంకరించెను. రామచంద్రుడు జాంబవన్నలనీలద్విదకుముదులకు స్వయముగవస్త్రాభరణాదుల నొసంగెను. వారందఱు నాకానుకలగ్రహించి, రామచంద్రుని మనంబుననిల్పుకొని ప్రయాణోన్ముఖులైరి. అంగదుడంతలేచి ప్రాంజలియై, రామచంద్రుని పాదములపైబడి, యశ్రుపూరితనయనుడై, గద్గదస్వరముతో సవినయముగనిట్లనియె. ప్రభూ! తాముసర్వజ్ఞులు. నాతండ్రి యవసానసమయమున నన్ను తమపదములపైబడవైచి తానునిశ్చింతముగ దివికేగెను. తమరు దీనానాథ శరణాగతరక్షకులు. నాకు సర్వస్వముమీరె. కాన మిమ్ములవీడి నేనింటికిబోజాలను. నేనిటనేయుండి మీదాసులకు సేవకుడనై, మీపదసరోజముల నిత్యముజూచుచు నానందించెదను ప్రభూ! నన్నువిడనాడకుడని ఏడ్వసాగెను. రామచంద్రుడప్పుడాతని లేవనెత్తి కౌగలించుకొని యాతనికన్నీటినిదుడిచి, తాను ధరించిన మణిమాలను ఉత్తరీయము నాతనిమెడలోవైచి, యోదార్చుచు, మెల్లననిట్లనియె. యువరాజా! నీకీచింతఏల! నీకన్నిటికిని నేనుంటినిగదా, సుగ్రీవుడు రాజ్యమును పాలించునంతకాలము నీవు యువరాజువై, పిమ్మట

రాజువై రాజ్యభోగముల ననుభవించి, తుదకు నాసాయుజ్యము నందగలవు. నిర్విచారముగనేగుము. అనిబల్కి, భరతలక్ష్మణ శత్రుఘ్నుల గొంతదూరము సాగనంపబనిచెను. ఇకచేయునదిలేక నంగదుడతికష్టమున రామునివీడి, బయలుదేరెను. భరతాదులతని సాగనంపివచ్చిరి. హనుమంతుడు రామానుమతుడై సుగ్రీవునితో కిష్కింధకేగి కొన్ననాళ్ళటనుండి, ప్రభూ! రామదర్శనముజేసి మఱలవచ్చెదను. శలవొసంగుమన, సుగ్రీవుడు హనుమా! నీవుధన్యుడవు ఆభగవంతుని తనివిదీరసేవించిరమ్మనెను. అంగదుడంత హనుమంతునిచేరి, మిత్రమా నీయదృష్టమునకు మేరలేదు. ఆరఘునాయకునికి నాప్రణతు లర్పింపుమనియు, తననుకటాక్షించుమని చెప్పుమనియును మనవిజేసెను. హనుమంతుడు శ్రీరామునిదర్శించి నమస్కరించి, యంగదునిప్రణతులను మనవిచేయ నాతనిభక్తిప్రేమలకు రాముడుసంతసించెను. ఖగపతీ! రామచంద్రునిమనస్సు, ఒకప్పుడు వజ్రముకన్ననుకఠినము. ఒకప్పుడు కుసుమముకన్ను కోమలము. పిమ్మట గుహుని బిలిచి, మిత్రమా! నీవునాకు భరతునివంటివాడవు. నీవప్పుడప్పుడిటకువచ్చి నన్నుజూచి పోవుచుండుము. త్రికరణశుద్ధిగ నన్ను భజింపుమన నతడు రామచంద్రుని పాదములపై బడి నమస్కరించి పులకితగాత్రుడై కన్నీరుగార్చుచుండ నాతనిలేవనెత్తి కౌగలించుకొని యాతని వస్త్రాలంకార భూషితుంజేయ నతడయోధ్యానోభనే మనసున నెన్నుచు నిజపురంబున కేగి, తనబందుగుల కయోధ్యావిశేషముల జెప్పుచు రామభక్తుడై సుఖముగ కాలమును గడుపుచుండెను.

రాముని రాజ్యపాలనము

రామచంద్రుడు రాజ్యమును జేయుచుండ ముల్లోకములవారును, శోకభయవైరములులేక కుత్సితులుగాక, పరస్పరమైత్రికలవారై, యానందాబ్ధినోలలాడుచుండిరి. వైదికనూర్గనిరతులై సత్కర్మల నాచరింపుచు, తాపత్రయము నెఱుంగక యనామయులై సుఖముగనుండిరి. ధర్మము సంపూర్ణముగనుండెను. స్వప్నమందైనను పాపచింతనములేక రామభక్తిపరులై యచటవారందఱును మోక్షాధికారులైయుండిరి. మఱియు నచటివారు, అపమృత్యు భయములేక, దారిద్ర్య దుఃఖభయవ్యాధుల నెఱుగక, సకలకలానిధులై, సర్వవిద్యాపారంగతులై, సర్వలక్షణసంపన్నులై ధర్మతత్పరులై, జ్ఞానవైరాగ్యసంపన్నులై, కృత

జ్ఞులై మెలగుచుండిరి. సప్తసముద్రవలయితమై సప్తద్వీపాలంకృతమగు భూమండలమునకు, రామచంద్రుడేక ఛత్రాధిపత్యమును జేయుచుండెను. ఖగపతీ! ఎవనిరోమకూపములందనేక బ్రహ్మాండములు విలసిల్లుచున్నవో! అట్టి భగవంతునకీ భూమండలసామ్రాజ్య మెంతటిది? కావుననే రామునిమహిమ వర్ణనాతీతము. భక్తులకే యాతనిమహిమ గోచరమగును. రామరాజ్యములోనుండు యానందవై భవములు వర్ణనాతీతములు. అచటిపురుషులు దారులై ఏకపత్నీవ్రతస్థులై గురువిప్రపూజాతత్పరులై యుందురు. స్త్రీలుపతివ్రతలై భర్తృసేవాతత్పరులై సహజమగు చాంచల్యమునువీడి నిశ్చలభక్తికలవారై మెలగుచుందురు. రామరాజ్యమున యతులకే దండగ్రహణముకాని ప్రజలలోలేదు. భేదము సర్వతాళనృత్యములందేకాని ప్రజలందులేదు. సామదానము లందయి యందును సాధారణములుగనుండెను. అచటి మృగపక్ష్యాది తిర్యగ్జంతువులు కూడ సహజమగు విరోధమునువీడి పరస్పరమైత్రికలవై మెలగుచుండెను. శీతలసుగంధ మందమారుతము లెల్లప్పుడును వీచుచుండును. సరోవరము లతిస్వచ్ఛములై, భృంగాలంకృత పద్మవనములతో నెంతేని శోభిల్లుచుండెను. లతలు వృక్షములు ప్రజలకభీష్టములయిన పుష్పఫలముల నొసంగుచుండెను. గోవులు సమృద్ధిగ క్షీరముల నిచ్చుచుండెను. భూమి సస్యసమృద్ధయై మనోహరముగనుండెను. రామరాజ్యము ప్రతేతయందైనను కృతయుగధర్మములే యటగోచరించుచుండెను. పర్వతములు మణిమయములయ్యెను. నదులు నిర్మలోదకములతో ప్రవహించుచుండెను. సముద్రము తన హద్దును మీరకుండెను. దిక్కులు ప్రసన్నములై యుండెను. చంద్రుడు సుధావృష్టిని గురియుచుండెను. సూర్యుడనుకూలముగ దపించుచుండెను. మేఘములు సకాలముగ వర్షించుచుండెను. రామచంద్రుడనేక జన్నములజేసి యపరిమితదక్షిణలచే విప్రుల నానందపఱచుచుండెను. ధర్మరతుడై సుగుణఖనియైన రాముని భోగములు పురందరభోగములకన్న మిన్నలై యుండెను. సుశీలయు, శోభానిధియు, గుణాన్వితయునగు మైథిలి, భర్తృచరణ సేవానిరతయైయుండెను. దాసదాసీజనములున్నను స్వయముగ రామునియుపచారముల జేయుచుండెను. మఱియు మువ్వురత్తలను నుచితరీతిని సేవింపుచుండెను. ముల్లోకములతల్లి జనకునికి పిల్లయై, సర్వానుకూలముగ ననవద్యవృత్తిని జరించుచుండెను. ఆమె యనుగ్రహా

మును దేవతలు కోరుచుందురు. అష్టసిద్ధులు నామెను సేవింపుచుండును. ఆమె తన ప్రజల నపరిమితప్రీతితో జూచుచుండును. రాముని సోదరులన్నయందు ప్రీతిగలిగి సవినయముగ నాతని సేవింపుచుందురు. వారు రాముని పదకమల ములనెప్పుడును విడువక నేనించుచుండెడివారు. రామచంద్రుడు సోదరుల నమిత ప్రీతితోజూచుచు వారలకు హితము నుపదేశించుచుండును. రామరాజ్యమున ప్రజలు హర్షాంబుధినోలలాడుచు, స్వర్గసుఖముల ననుభవించుచు, విధీ! మాకు రామపదములందచలభక్తి కలుగునట్లనుగ్రహింపుమని దైవమును ప్రార్థింపు చుందురు.

రాముని నిత్యకృత్య వివరణము

ఇట్లుండ కొంతకాలమునకు సీత గర్భవతియై, శుభసమయమున జగత్ప్ర సిద్ధులగు నిరువురు కొడుకులగనెను. వారిరువురు నాకారగుణశీలశౌర్యముల రామ చంద్రునిబోలియుండిరి. అవాఙ్మానసగోచరుడు, మాయాతీతుడు, షడ్భావ వికారరహితుడునగు భగవంతుడు లీలామానుషవిగ్రహమునుధరించి ఇట్టిలీలల జేయుచుండెను. ఇక నాతని నిత్యకృత్యముల వినుడు. ప్రత్యూషమున లేచి సరయువును సమీపించి, మజ్జనమాచరించి, సాంధ్యకృత్యములదీర్చి, సావిత్రిని జపించి, సూర్యునకు నమస్కరించి, దేవాలయమున ప్రవేసించి శివునిపూజించి, గోవిప్రులనర్చించి, అనుజసహితుడై సభనలంకరించి, వశిష్ఠోపదిష్టధర్మముల నాలకించి, మాతృదేవతకు నమస్కరించి, యనుజులతోగలిసి భుజించును. తరు వాత కొంతవఱకు విశ్రమించి రాజసభకేగి, మంత్రులతోగలిసి రాజకార్యముల నవలోకించును. కవి గాయక పండితులతోగలిసి కొంతకాలము గడుపును. ఒకప్పుడు సానుజుడై హనుమంతునితోగలిసి వనవిహారమున కేగును. అట గొంత తడవుగడిపి, వినోదముగ రావణసంహారాదివిషయములను హనుమంతుడు జెప్పు చుండ విని సంతసించుచున్న భరతాదులజూచి సంతసించుచుండును. హను మంతునివలన బయలుదేరిన రామచరితామృతము లోకమందంతటను వ్యాపించు చుండెను.

అయోధ్యావర్ణనము

సనకసనందన నారదాదిమహర్షులు రామదర్శనముకై వచ్చి యయో ధ్యాశోభనుజూచి కలిగినమహానందముచే దమవై రాగ్యమును గూడ మఱచిపో

వుచుండిరి. విరాగులే యట్లుండ నికసరాగులమాట చెప్పనేల ? ఆపట్టణమున రత్నఖచితములైన స్వర్ణసౌధము లనేకములుగలవు. చుట్టునున్న ఎత్తైనప్రా కారములు నానావర్ణములతో విరాజిల్లుచుండెను. వానినడుమను సౌధములు గ్రహములవలె ప్రకాశించుచుండెను. ఆసౌధములనడుమ నొకపెద్ద భవనము కలదు. స్ఫటికమణిమయమగు నాభవనమాకసము నంటుచుండెను. అందలి గవాక్షములు ద్వారములన్నియు మణిఘటిత సౌవర్ణములైయుండెను. దానిపై నున్నసువర్ణపూర్ణ కలశములు సూర్యచంద్రులవలె విరాజిల్లుచుండెను. అందె చ్చటజూచినను రత్నదీపములే ప్రకాశించుచుండెను. మఱియు మరకత స్తంభ ములు, స్ఫటికశిలావేదికలు, వజ్రకవాటములు, మనోహర చంద్రశాలలు కలిగి యాభవనమెంతేని మనోహరముగ నుండెను. అటనున్న పుష్పవాటికలశోభ వర్ణనాతీతము. వాని యందెల్లప్పుడును నందనమునందువలె షడ్ఋతుసంపత్తి గాన్పించుచుండును. అందలి సుగంధమందమారుతములను, పక్షుల కూజితము లను, వాని మనోహరచేష్టితములను జూచితీరవలయును. అందలి శుకశారికలు, రామనామమునే గానముచేయుచుండును. అచట రాజమార్గము, విపణివీధులు మిక్కిలివిశాలములై, నిర్మలములై, యతిరమణీయములై యుండును. అందలి విప్రులమితవిద్వాంసులు. రాజపుత్రులతిబలశాలురు. వైశ్యులమిత సంప న్నులు. నాలవజాతివా రతివినీతులు. రథగజతురగపదాతిసంపత్తి వర్ణనాతీ తము. ఇవియన్నియు నలంకారమునకేగాని, కోదండపాణియగు రామునకు వీనియవసరముమాత్రము లేదు. ఆ నగరికుత్తరమున సరయువు శీతలపవిత్రో దకములతో ప్రవహించుచుండును. దానితీరములం దిక్ష్వాకువంశసార్వభౌముల యశ్వమేధయూపములు నారికీర్తిపతాకలవలె విరాజిల్లుచుండెను. దానికి సర్వ ప్రాణిసుఖావహములగు తీర్థములెన్నేని కలవు. ఆ రేవులకడ నతిమనోహరము లగు పూలతోటలు, వానియందు పవిత్రములగు దేవళములు, అట ననేకవిధ ముల రామునుపాసించు యోగులును, జూపరుల కింపుగొలుపు చుందురు. ఆ నగరమును దర్శించినంతనె సకలకల్మషములు నశించి సకలసౌఖ్యములు చేకూ రును. అష్టైశ్వర్యములు నట సీతారాముల సేవించుచుండును. అచటివారు దర్శనమునకు వచ్చినవారికందఱకు రామచరితము నుపదేశించుచుందురు. అందు దారకమంత్రమును బఠింపనివా రెవ్వరునులేరు. అటకేగినవారికి రామనామము

రామచరితముదప్ప వేరొండుకథలు వినరావు. వారెంతధన్యులోగద ! అట భక్తార్తిభంజకుడగు రామచంద్రుడు సదానివసించుచుండును. అతడు రణధీరుడు, దీనబాంధవుడు, సజ్జననయనకమలవన దివాకరుడు. దుఃఖసర్పములకు గరుడుడు. దురాశాలతలకులవిత్రము. దుష్టేంద్రియమృగములకు వ్యాధుడు. మనోవికార మత్తమాతంగములకు కేసరి. భక్తమనఃకుముద శీతభానుడు. శోకాంధకార భాస్కరుడు. దుష్టరాక్షస వనదావాగ్ని. వాసనామశకములకు హిమరాశి. ఏకరసుడు, జన్మాదిభావవికార రహితుడు. మునుల రంజింప జేయుటకు, ఖలులభంజించి, భూభారము నడంచుటకు తులసీదాసుడనగు నన్ను ద్ధరించుటకును మాయామానుష విగ్రహుడై, జన్మించెను. కాన నో సోదర సోదరీమణులారా ! ఇట్టి శ్రీరామచరితమును చదివి, విని, ఆరామునిభజించి, సేవించి, స్మరించి తరింపుడు.

ఇట్లాపురవాసులందఱు నారామునిభజింపుచు స్మరింపుచు ధ్యానించుచు తరించుచుండిరి. ఖగపతీ ! ఇట్లు రామప్రతాపభానుడుదయింప ముల్లోకములు శోభిల్లుచుండెను. అవిద్యాంధకారము దొలగుటచే, పాపోలూకములు పటాపంచలయ్యెను. అరిషడ్వర్గకుముదములు ముకుళించెను. వివిధకర్మగుణ కాలస్వభావరూపచకోరములు కలతబడుచుండెను. మానమోహామదాది చోరులు దలలెత్తజాలరైరి. ధర్మతటాకాంతర్గతములగు విజ్ఞానపంకజములు వికసిల్లుచుండెను. విరాగవివేకరావములగు చక్రవాకములు బరమానందమునందుచుండెను. కామాదివాసనలు నశించుచుండెను. రామచంద్రుడు భరతునితోగలసి హనుమంతుని వెంటనిడికొని వనవిహారమునకేగెను. ఆవనము ఫలపుష్పభరితమై మనోహరముగనుండెను.

మునులు రాముని దర్శించి స్తుతించుట

ఆసమయముననె తేజోమూర్తులగు సనకాదులటకేతెంచిరి. వారుబహుకాలముగడచినను బాలురవలెనేయుండిరి. సమదర్శులు, నాత్మనిష్ఠులు, దిగంబరులుసగు నాసల్వురు నాలుగువేదములవలె బ్రకాశించుచుండిరి. రామచరితము కాలక్షేపముచేయుతావులకు వారుజని శ్రద్ధతోవినుచుందురు. పార్వతీ ! తొల్లి

యగస్త్యుడీ రామచరిత్రను గానముజేయ వీరట కేగివినియుండిరి. రామచరిత్రము, యోగాగ్నిని శేకెత్తించుట కరణివంటిది. కాననీచరిత్రమున్న తావుల వారునివసింతురు. ఆమునులజూచి రామచంద్రుడెదురేగి నమస్కరించిగుశలమడిగి యుచితాసములవారల గూరుచుండబెట్ట భరతాదులువారికి సాష్టాంగప్రణామమాచరించిరి. రామచంద్రుని దివ్యశోభ నామునులు నిర్నిమేషముగజూచుచుండిరి. ఆశ్యామసుందర శరీరమును, పద్మనేత్రములను, ఆసౌశీల్యమును, ఆగాంభీర్యమును జూచుచు నిర్భరానందమగ్నులైన వారలజూచి, రామచంద్రుడానందాశ్రులగార్చుచు, బులకితగాత్రుడై వారల తనయొద్దనిడికొని మృదుమధురవచనములతో నిట్లనియె. మునిముఖ్యులారా! మీదర్శనమువలననే గృతార్థుడనైతిని. సత్సంగము మహాభాగ్యము. దానివలననశ్రమముగ సంసారబంధమునశించును. మోక్షముసిద్ధించును. అని రామచంద్రుడన నామునులపరిమితానందమునందుచు నిట్లారామునినుతించిరి. అనంతా! అనామయా, అనఘా, ఏకానేకస్వరూపా, సగుణనిర్గుణరూపా, గుణసాగరా, సుఖమయా, కరుణామయా, సుందరాంగా, ఇందిరారమణా, భూభారహరణా, ఆద్యంతరహితా, నీకు జయమగుగాత. ఓజ్ఞాననిధీ, మానరహితా, మానప్రదా, నీపవిత్రచరితము వేదపురాణప్రసిద్ధము. ఓతత్వస్వరూపా, అజ్ఞానభంజనా, నామరూపవివర్జితా, బహురూపధారీ, నిరంజనా, నిర్వికారా,సర్వాంతర్యామీ, సదామమ్ముల రక్షింపుము. ఓ ద్వంద్వహరణా, బంధమోచనా, విపదంతకరణా, కామాదిదూరా, సదా మాహృదయములవసింపుము. రామా! నీవు పరమానందరూపుడవు. పరిపూర్ణకాముడవు. కృపానిధీ! మాకచలభక్తినొసంగుము. ప్రభూ, రఘుపతీ, మాకు భవతాపములెన్నడు నంటకుండునట్లనుగ్రహింపుము. స్వామీ! నీవు భక్తకల్పవృక్షమవు. సంసారసాగరాగస్త్యుడవు. నీసేవకులకు సకలసుఖములు ననాయాసముగ సిద్ధించును. సకలదుఃఖములు నశించును. సమదర్శనమలవడును. ఆశాభయేర్ష్యలుదొలంగును. రాజశిఖామణీ, భువనాభరణా, భవసాగరతారకమగు నీభక్తినిమ్మని మాప్రార్థనము. ఓమునిమానసమరాళమా, రఘుకుల శేఖరా, శివవిరించివందితచరణా, శ్రుతిరక్షాదక్షా, కాలకర్మస్వభావగుణభక్షకా సంసారతారణా, భూషణహరణా, త్రిభువనభూషణా, యనిమునులు పలుమాఱు స్తుతించి యాతనివలన నభీష్టములనొంది, బ్రహ్మలోకంబున కేగిరి.

రాముడు భరతునికి సత్పురుష కాపురుష విభేదములను దెల్పుట

అంతభరతాదులు రామునిగొన్ని సందియములడుగదలచి దమయభి
ప్రాయమును హనుమకు దెలుపనంతలో సర్వజ్ఞుడగు రామచంద్రుడు వారల
యభిప్రాయమునెఱింగి, హనుమా! ఎందులకింతజంకు! మీయభిమతమునడుగు
డన, మారుతి ముకుళితకరకమలుడై, భరతుడు మిమ్మగొన్ని విషయములడు
గదలచియున్నాడు. మీసంభాషణమునువిని మేమును ధన్యులమయ్యేదమన,
హనుమా! నాస్వభావము మీతెరుంగనిదిగాదు. కాన యధేష్టముగ నడుగ
వచ్చునన, భరతుడు రామపదకమలములనంటి, ప్రభూ! సజ్జనులమహిమను
వేదములు వేవిధముల జాటుచున్నవి? తామును సత్పురుషులగొనియాడు
చుందురు. కాన సత్పురుష లక్షణములను నసత్పురుషలక్షణములను
దమవలన దెలియనెంచితిని. నాయీప్రార్థనమును మన్నింపుడన, సోదరా!
సత్పురుషలక్షణము లనంతములు. చెప్పెదవినుము. సత్పురుషులు చందన తరు
వులవంటివారు. చందనతరువు గొడ్డలి తనను నఱికిను ఆపీడను సహించి,
గొడ్డలికి దనసుగంధము నిచ్చును. అట్లే సత్పురుషులు కాపురుషులు తమ్మి
బీడించిన నాపీడను సహించి వారికుపకారమునే జేయుదురు. కాపుననె జంద
నము దేవతాశిరోధార్యమగుచున్నది. గొడ్డలిని నిప్పులో గాల్చి మఱియు
సాగగొట్టెదరు. అట్లే కుత్సితులు దుఃఖములననుభవించుచున్నారు. సత్పురు
షులు విరక్తులై, గుణశీలసంపన్నులై, పరుల సుఖదుఃఖములను దమసుఖదుఃఖ
ములుగ భావించుచు, సమదర్శనులై, అరిషడ్వర్గనిర్ముక్తులై, ద్వంద్వసహి
ష్ణువులై, హర్షవిషాదరహితులై దీనదయాళువులై;నిష్కపటులై భగవద్భక్తులై
పరులప్రాణముల దమప్రాణములకన్న నెక్కుడుగ జూచుచుండెదరు. సోదరా!
మఱియు సర్వప్రాణుల భగవద్రూపులని భావించుచు, నిష్కాములైనానామ
ములను నిరంతరము స్మరించుచు, శాంతాత్ములై, ముదితమానసులై, ప్రియ
భాషులై సర్వహితులై, ధర్మజ్ఞులై, శమాదిషట్కసంపన్నులై, నీతియుతులై,
నాపదముల వీడక మెలంగెడివారు సత్పురుషులు. వారు నాకు ప్రాణాధికులు.
ఇక గుజనలక్షణముల వినుము. దుష్టుల హృదయమతికఠినము. ఈర్ష్యాకలు
షితము. దంభాహంకారభరితము. దుష్టులు పరనిందాపరులై, పరస్త్రీ ధనము

లండాసకలవాఁడై, యరిషడ్వర్గారికాంతుఁడై, నిష్కారణవైరమునూని, హితాహితముల గ్రహింపక, మయూరములవలె బైకినందముగ గన్పడుచు, మానుష శరీరమునందిన రాక్షసులవలె నుందురు. వారిసహవాసము ప్రాణాంతకము. వారి తెలివి పరవంచనకుపయోగించును. ఈదుష్టులు కృతతేతలందులేరు, ద్వాపరమున నరుదుగనుండెడివారు. కలియుగమున వారిదే రాజ్యము కాగలదు. సోదరా! పరోపకారమువంటి ధర్మమును, పరద్రోహమువంటి పాపమునులేవు. మనుజులకు జననమరణములు స్వాభావికములు. అయినను మానవులు దఱుచుగ నైహికభోగాసక్తులై, పరమును మఱచెదరు. అట్టివారిని నేను కాలరూపుడనై గ్రసింతును. కాన ప్రాజ్ఞులీ సంసారమును వీడిననన్నే భజించి తరింతురు ఈసుమతికుమతుల చరితమును దెలిసినవాడెన్నడును భవబంధమున జిక్కడు. వాడే జ్ఞాని, ధన్యుడునన, రామచంద్రుని వచనామృతమును గ్రోలి సోదరులు హానుమయు నపరిమితానందమునందిరి.

అట్లు వారు దఱుచుగ రామునిభోధల వినుచుండిరి. నారదుడు దఱుచుగ రాముని దర్శించిస్తుతించి బోవుచుండెను. ఒకనాడు నారదుడు బ్రహ్మలోకమున కేగి రామవైభవమును వర్ణింపనావిరించి యపరితానందము నందెను. బ్రహ్మ జ్ఞాన సంపన్ను లగు సనకాదులును నారదుని వలన రామచరితమునువిని సంతసించుచుండిరి. పార్వతీ! రామచరితమెట్టిదో ! తెలియుము. ఒకనాడు రామచంద్రుడు నిండుకొలువున నుండి ఇట్లనియె.

రాముడు భక్తినిగురించి సభ్యులకుపన్యసించుట

ఓపౌరులారా! మీరు నాయందు గల భయభక్తులచే నాయాజ్ఞను బాలింపుచుంటిరి. సంతోషము. నేనొక విషయమును జెప్పెదను. వినుడు. లోకమున మానవజన్మము దుర్లభము. దీని వలన జననమరణ ప్రవాహము నతిక్రమించి దివ్యధామమునందవచ్చును. ఇట్టి జన్మమునందియు, నీషణత్రయమున జిక్కుకొని, సర్వము దైవాధీనమని కొందఱు, నీశ్వరుడు లేడని కొందఱు, ప్రపంచము మిథ్యయని కొందఱు, నైహికభోగములననుభవించుటయె కర్తవ్యమని కొందఱు, స్వల్పసుఖములన నభిలషించుచు, కాలమును గడుపుచుందురు. గుంజాభిలాషి నాగమణి నపేక్షింపనట్లు, అట్టివారు

నిత్యనిరతిశయసుఖమునభిలషింపరు. ఎనుబది నాలుగులక్షల జీవరాశులందును జీవుల వినాశులు. వారిని కాలకర్మ స్వభావము లావరించి యుండెను. ఇట్లనేకజన్మములు గతించిన పిమ్మట భగవదనుగ్రహముచే యుక్తాయుక్తవివేకార్హమగు మానవజన్మము లభించును. సంసార సాగరములు దరించుటకు మానవజన్మమునావంటిది. నాకృపయనుకూలపవనము. సద్గురుడు నావికుడు. సద్గురుడీనావనవలీలగ దాటించును. ఇట్టియవకాశముగల మాన వులుపయోగించు కొనకుండుట యవివేకము. అట్టివారాత్మవంచకులనబడు దురు. మతియొకమాటనువినుడు. కైవల్యసాధనములగు భక్తిజ్ఞానములలో భక్తిమార్గముమంచిది. జ్ఞానమార్గము విఘ్నబహుళము. తత్సాధనములు గష్టసాధ్యములు. కావుననే నజ్ఞానమార్గానూఢులు గొందఅధఃపతితులగు చున్నారు. స్వతంత్రము, సకలసుఖసాధనమునగు భక్తి సత్సంగతివలన లభించును. జన్మాంతరసుకృతమువలనగాని సత్సంగతియలవడదు. పుణ్యోపార్జనమునకు బాహ్మణసేవముఖ్యము. విప్రుడు సర్వదేవతామయుడు. కాన విప్రారాధనమున సకలదేవతలు తృప్తులగుదురు. మతియొకరహస్యమును వినుడు. నాకును శంకరునకునుభేదములేదు. కానశంకరభక్తులు కానివారు నన్నెంతపూజించినను నాభక్తులుకాజాలరు. భక్తిమార్గమునం దుపవాసాది క్లేశము లేదు. యదృచ్ఛాలాభసంతుష్టులై నిష్కపటముగ భగవంతునారాధించుట చాలాసులభము. ఇతరాసక్తులవీడి నన్ననిశము సేవించువాడేభక్తుడు దాంభికులు భక్తులుగారు. భక్తులయెడనాకు మిగులప్రీతి. నేను భక్తపరాధీనుడను. కాన మీరునిర్వ్యారులై ఆశాదూరులై నన్ను భజింపుడు. అంతటను మమతాశూన్యులై, సజ్జనానురక్తులై స్వర్గాదిభోగములగణింపక, కామాదులనిర్జించి, మద్గుణనామసంకీర్తన మొనరించుచు నీతత్త్వమునుగమనించినవారు బ్రహ్మానందము ననుభవింతురని రామచంద్రుడు బలుకనచ్చటివారు సంతోషమునుబట్టజాలక, రామపదకమలములకు ప్రేమొక్కుచు రామచంద్రా! మాసర్వస్వమునీవ - మమ్ములనీవింతగ బ్రేమించుచుంటివి. ఇంక మాకేమికావలయును ప్రభూ! అనాథబాంధవుడవగు నీకన్న మాకుహితులెవ్వరు. మాకీవాగమృతమును బ్రసాదించి మమ్ములగృతార్థులజేసితివి. అనవారిమాటలకు రామచంద్రుడానందమగ్నుడయ్యెను.

పిమ్మట రామానుమతినంది వారినిజనివాసములకుబోయిరి. పార్వతీ ! ఇట్లు రామానుగ్రహపాత్రులైన యయోధ్యాపుర వాసు లందఱు ధన్యులు. ఒకనాడువశిష్ఠుడు రాముని దర్శింపగోరి జన రామచంద్రుడెదు రేగి నమస్కరించి యర్ఘ్యపాద్యాది విధులబూజించి సుఖోపవిష్టునిగావించి గుశలమడిగి ఇష్టగోష్ఠిని జఱుపుచుండ వశిష్ఠుడుసాదరముగ నిట్లనియె. రామా ! నాపుణ్యము వర్ణనాతీతము. నిన్ను జూచినకొలది నాకునీపై మోహ మెక్కుడగుచున్నది. ఇది నీమహిమ. నీమహిమను బ్రహ్మాదులే వర్ణింపజాలరు. నేనెట్లు వర్ణింపగలను ? పౌరోహిత్యము నీచకృత్యమని దెలిసియు, నేనీపదవి కియ్యకొంటిని. కావున నే నీజన్మదినోత్సవము మొదలు నేటివఱకు జఱిగిన నీశుభకార్యము లన్నియు స్వయముగ జేసితిని. నాకింతకన్న కావలసిన దేమున్నది ? ఇదియనన్యదుర్లభము. నేను దొలుత నీపౌరోహిత్యమున కంగీకరించ లేదు. అపుడబ్జయోనిస్వయముగ వచ్చి, నాయనా ! పరమాత్మ రఘుకులాంభోధియం దవతరించును. కాన నీవాతనికి గురువువై సకలకార్యముల జఱుపవచ్చును. ఈయవకాశమును బోగొట్టుకొనకుమన నేనందులకియ్యకొంటిని. ఎవనిను ద్దేశించి యోగకర్మ తపోదానాదులేర్పడినవో ! అట్టిపరమాత్మ దర్శనోపాయమగు నీపౌరోహిత్యమునకు సరియగు ధర్మ మొండులేదు. సకలసత్కర్మలఫలమును నీ సేవాఫలమందంర్భితమగుచున్నది. నీభక్తిలేనినా డీకర్మలన్నియు నిష్ఫలములగుచున్నవి. భగవద్భక్తిజలక్షాళితముగాని హృదయము నిర్మల మెట్లగును ? నీపదకమల భక్తికలవాడె పండితుడు, గుణవంతుడు, ధన్యుడు సర్వజ్ఞుడునగుచున్నాడు. నేను నిన్నొకవరమునడుగ వచ్చితిని. నాకు సార్వకాలికమగు నీయచలభక్తి బ్రసాదింపుము. అన రామచంద్రుడట్లేయగునన వశిష్ఠు డమితానందముతో తనయింటికేగెను. పిమ్మట రామచంద్రుడు, సోదర హనుమంతులతోగూడి వాహ్యాళికిజని చతురంగసేనల జూచి వారియభిమతములదీర్చి సమీపముననున్న వనమున కేగి యటభరతునిచే గల్పింపబడినయాసనమున సుఖోపవిష్టుడైయుండ హనుమంతుడానంద పరవశుడై భగవత్సేవలజేయుచుండెను. అట్టి భక్తుడుగాని, ధన్యుడుగాని మఱి యతఁడులేడు. ఆసమయమున నారదుడట కరుగుదెంచి రాముని గుణగణముల వీణాగానమొనరించుచు, నవీనపదగుంభనమున నిట్లు స్తుతించెను.

మామవలోకయ పంకజలోచన । కృపావిలోకన శోకవిమోచన
నీల నీరదశ్యామ కామారిహృదయకమలమకరందమధుప హరీ॥

ఓ కమలాక్షా, శోకవిమోచనా, నీరదశ్యామలాంగా, శివమానస కమల మధుపా, హరీ నన్ను కృపజూడుము. దుష్టరాక్షసులభంజించి, మునుల రంజించిన, దీనదయాళూ! నీవు రావణుని సంహరించి భూభారమడచితివి. ఓరఘుకుల కుముదబాంధవా! నీకీర్తి వేదస్తుత్యము. ఓకోసల మండనా! నీనామము కలికలుషహరము. ఓకరుణావరుణాలయా! మాంపాహియని బలుకుచు నారదుడు బ్రహ్మలోకమునకేగెను. ఓపార్వతీ! రాముని చరిత్రమనంతము, శతకోటి ప్రవిస్తరము. శేషభారతులయిననను సాకల్యముగ వర్ణింపజాలరు. రాముడనంతుడు. ఆతని గుణములు కర్మలు, జన్మములు, నామములు ననంతములే. కాననాయోపినంతవఱకు జెప్పితిని. ఈయుజ్జ్వల చరితమును శ్రద్ధగ వినినవారికి యచలభక్తియు వైకుంఠమును సిద్ధించును. మున్నీకథను కాకభుశుండి గరుత్మంతునకు జెప్పియుండెను. నేను నీకిపుడు జెప్పితినన బార్వతి యమితానందము నొందుచు, చేతులజోడించి మృదుమధురముగ నిట్లనియెను. శంకరా! మీయనుగ్రహమువలన నేనీచరితమును విని ధన్యనైతిని. తమ యనుగ్రహముచే గృతార్థనైతిని. నా మోహము నశించినది. సచ్చిదానందరూపుడగు రాముని ప్రతాపమహిమల దెలిసికొంటిని. ఓధీరమతీ! మీముఖచంద్రునివలన వెలువడు నీ రఘువీర కథామృతమును శ్రోత్రపుటములచే నెంతపానము చేసినను దనివితీరకున్నది. రామచరితామృతమును గ్రోలి దృప్తుడగు రసజ్ఞుడెందును ఉండడని నాతలంపు. మహామునులు రామచరితామృతమును గ్రోలి జీవన్ముక్తులై, భవసాగరమునవలీల దాటుచున్నారు. విషయాక్తులును రామచరితను విని దుఃఖదూరులగుచున్నారు. ప్రపంచమందీకథను విననివారుండబోరు. ఈకథయందాధారములేనివారు జడులు నాత్మవంచకులు నగుచున్నారు. ఇట్టి హరిచరిత మానసకథను మీవలనవిని యమితానంద సుఖముల నందితిని. కాని నాకొక సందియము బాధించుచున్నది.

కాకభశుండుని చరిత్రము

కాకభశుండుడుడీ కథను గరుత్మంతునితో నెట్లుజెప్పెను ? కాకమునకింతటి రామ భక్తి వైరాగ్యములెట్లులభించెను? మఱిల దానీకథనితరుల కుపదేశించునంతటి శక్తి యాకాకమున కెట్లుకలిగెను ? లోకమునవేయిమందిలో నొకడు ధార్మికుడగును. లక్షమంది ధార్మికులలో నొకడు విషయపరాఙ్ముఖుడగును. కోటిమంది విరాగులలో నొకడు దత్తజ్ఞానసంపన్నుడగును. అట్టితత్త్వజ్ఞానులందును జీవన్ముక్తులరుదుగనుందురు. జీవన్ముక్తులయిన నుండవచ్చును గాని, దంభాహంకార వర్జితుడై నిశ్చలరామభక్తాగ్రగణ్యుడుండుట దుర్లభమసి పెద్దలందురుగదా! విశ్వనాథా ! కాకికిట్టి రామభక్తి ఎట్లుగలిగెనో ! దెలియకున్నదిస్వామీ ! అట్టి రామభక్తిపరాయణుడును, గుణవంతుడు, ధీమంతుడునగు వానికీ, కాకశరీరమెట్లు కలిగినది ? ఈసంఘటనము వింతగనున్నది. దయయుంచి యీనాసందియమును దీర్పుడు. మఱియు మీరీచరితమునెవరివలనగ్రహించితిరి ? గరుత్మంతుడన, మహా జ్ఞానసంపన్నుడు, సద్గుణరాసి, హరిభక్తుడు, సకలకాలములందును, హరిసన్నిధానవర్తి, మునిసంఘములందు జరించువాడు. అట్టివాడు కాకిచెప్పిన పురాణమును ఎట్లువినెను ? కాకభశుండగరుడ సంవాదము నానతీయవలయునన, శివుడ పరిమితానందము నందుచు సాదరముగ నిట్లనియె. గిరిజా ! నీవుధన్యవు. నీకు రామచంద్రునందు నిశ్చలమగు భక్తికలిగినది. ఈపవిత్రేతిహాసమును వినిన నీసందేహము దొలంగును. రామునియందమిత విశ్వాసముగలుగును. సంసారార్ణవమునశ్రమముగదాటగలవు. ఖగపతి కాకభశుండునికడకేగిన విధమును బ్రశ్న ప్రకారమును సవిస్తరముగజెప్పెద. సావధానముగవినుము. సుముఖీ ! నేనీకథను విని భవబంధముక్తుడనై తిని. తొల్లినీవుదక్షునికుమార్తవై సతియను నామమున నుంటివి. అపుడు నీవునాకర్ధాంగివైయుండ నొకనాడు దక్షుడుయజ్ఞముజేయుచు నాయజ్ఞమున నన్న కారణముగ దూషించెను. అపుడు నీవుపట్టరానికోపావేశమున యోగాగ్నిచేదగ్ధశరీరవైతివి. అపుడు నాయనుచరులచే నాజన్నమును ధ్వంసమొనరింపించి, నీవియోగమువలన విరక్తుడనై సంచరించుచు, వెఱ్ఱివానివలె సకలగిరి కాననములందును నిలకడలేక దిరుగుచుంటిని. అపుడీ ప్రకృతి నాకసహ్యముగనుండెను. నేనట్లుజరించుచు సుమేరువునకుత్తరమున కొంతదూరము

నందున్న నీలాద్రికేగితిని. అదిమనోహరసౌవర్ణ శిఖరచతుష్టయ విరాజితమై జూపరుల దృష్టినాకర్షించుచుండెను. నేనాపర్వతము నధిరోహించి దాని శిఖర భాగ్యమును దిలకించుచుంటిని. శిఖరముల నడుమ నతివిశాలరమణీయ మగు సమప్రదేశముగలదు. అందు పనస, మామిడి, మట్టి, జువ్వి మొదలగు మహావృక్షభరితమగు సుందరవనమొండుగలదు. అందలి వృక్షము లతివిశాల శాఖాబాహుళములై, ఫలకుసుమభరితములై యలరారుచున్నవి. వానియం దనేకపక్షులు కులాయముల నిర్మించుకొని నిర్భయముగ నివసించుచున్నవి. ఆవనరాజిమధ్యము నందొక సరోవరముకలదు. ఆవిశాలసరోవరమునకు నలు వైపుల నతిమనోహరములగు వివిధమణిఖచిత సోపానములుగలవు. అందలి జలము సజ్జనమానసమువలె నతినిర్మలమైయుండెను. ఆజలము పద్మరేణుపరిమళ భరితమై నన్నాకర్షించుచుండెను. అందలి మందమారుతములచే నాఖేదమంతయు దొలంగెను. నాకాసరోవరముమ జూచినతోడనె సకలక్లేశములు నశించినవి. ఆనందపరవశుడనై నేనాసరోవరము నట్లేనిర్ని మేషముగ జూచుచుంటిని.

ఆసరోవరమతిప్రశాంతమై, శీతలమధుర జలభరితమై యుండెను. అందలి కమలవనమందనేక కాదంబములు మధుకరములును గర్ణసుఖముగ ధ్వనుల జేయుచు విహరించుచుండెను. ఇట్టి సరోవరముతో గూడిన యాపర్వతశోభ వర్ణనాతీతము. అందుకాకభశుండుడను వాయసము నివసించుచుండెను. అది ఎన్నికల్పములైనను నశింపకచిరజీవియై, గుణాతీతమై దోషసంసర్గములేక య రిషడ్వర్గమును జయించి, మెలగుచుండెను. సంసారమూలములగు నవికారాదు లాపర్వతము సమీపింపజాలవు. కాకభసుండు డా పర్వతము నాశ్రయించి, కృత త్రేతాద్వాపరకలియుగములందు, గ్రమముగ రావి, జువ్వి, మామిడి, మట్టి, చెట్ల నాశ్రయించి, హరికథలనందఱకు వినుపించుచుండెను. ఆతనికి హరిభజనముదప్ప మఱి యొకపనిలేదు. అచటిహంసలన్నియు నాసరోవరమున స్నానమాచరించి యాతడు చెప్పెడికథల నతిశ్రద్ధాభక్తులతో వినుచుండెను. ఒకనాడు నేనచ్చటి కేగి యావిచిత్రసన్నివేశమును జూచి యమితానందమునొంది, హంసరూపమును దాల్చి కొన్నిదినములట నివసించి, రామచంద్రుని పవిత్రచరిత్రనువిని, మఱల నైలాసమును జేరికొంటిని. ఖగపతికాకభశుండునివలన వినుటకు గారణమును జెప్పెదవినుము. రామచంద్రుని రణకౌశలమునుదలంప సంతసముదయించు

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R. I. 413
Acc. No.

చున్నది. కాని కొన్ని యెడలనేమియు గోచరింపకున్నది. రణమున రామచం
ద్రుడు మేఘనాదునిచే బంధింపబడినంతనే నారదుడు గరుత్మంతునిబంపి బ్రహ్మా
ధమునుండి విడిపించెను. అప్పుడు ఖగపతి యిట్లనుకొనెను. సర్వేశ్వరసమన్వితుడగు
భగవంతుడిట్లవతరించెనుగదా ! ఈతనినామమును స్మరించిన సంసారబంధము
ద్రెళ్లును. ఒకరాక్షసుని మాయలోజిక్కుకొనిన యీతడు సంసారబంధము నెట్లు
భేదించును ? నాకీతనివిషయమేమియు దోపకున్నదని ఖిన్నుడై నీవలెనాతడును
మోహమ్యామానుడై నారదునికడకేగి తనసంశయమును విన్నవింప నాముని
ప్రవరుడు దయకలవాడై ఇట్లనియె. ఖగపతీ ! రామచంద్రుని మాయయు
నాతనిప్రభావమువలె నతిగహనము. ఎంతటిజ్ఞానవంతులయిననాతని మాయను
దెలిసికొనజాలరు. నేననేక పర్యాయము లాతనిమాయకులోనైతిని. నీవులోన
గుటకేమివింత ! కాననీవిపుడు కమలాసనునికడకేగుము. ఆతనివలన నీసంది
యము దొలంగుననిచెప్పి రామచంద్రుని గుణగణముల స్మరింపుచు నాముని
వెడలిపోయెను. పిమ్మట గరుత్మంతుడు బ్రహ్మనుదర్శించి తనసందియమును
విన్నవించెను. విరించిరామప్రతాపమును దలంచి ప్రసన్నుడై, యిట్లనుకొనెను.
భగవన్మాయను దెలియుటకేరికిని శక్యముగాదు. చరాచర ప్రపంచనిర్మాతనగు
నేననేక పర్యాయము లాతనిమాయలో బడిపోయితిని. ఇతడిట్లగుట కాశ్చర్య
మేమున్నదనుకొని యీతనితోనిట్లనియె.

కాకభసుండుడు గరుడ సంభాషణము

ఖగపతీ ! శివునకురామచంద్రుని ప్రభావవిశేషములు బాగుగ దెలియును
కాన నీవింకెవ్వరిని నడుగక యీతనికడకేగుమన నాతడు నాకడకరుదెంచెను.
నేనపుడు గుబేరునిజూడబోవ నుద్యుక్తుడనైయుండ నాఖగపతివచ్చి తన సంశయ
మును జెప్పెను. తోడనే నేనిట్లంటిని. గరుత్మంతా ! నీవడిగినవిషయము
చాలదురవగాహము. మహత్తరమునైనది. సావకాశముగ జెప్పవలయును.
నేనొక తొందరపనిమీద గుబేరునికడకేగుచుంటిని. మఱియు నీవుకొంత
కాలము సజ్జన సహవాసమొనరించి వారివలన భగవత్కథల వినుచుండుము.
సజ్జనసాంగత్యమువలన భగవత్కథాశ్రవణము నద్ధానసభిమతమగుభగవద్భక్తియు
దాన నజ్ఞాననాశము నలవడును. అజ్ఞానమునశించినగాని రామచంద్రుని

యపారమహిమగోచరముకాదు. మేరువునకు త్తరభాగమున నొకనీలగిరికలదు. అందు జ్ఞానవయోవృద్ధుడగు భగవద్భక్తుడొకడు భగవత్కథల జెప్పుచుండ నచటిపక్షులెల్ల నాకథల సావధానముగ వినుచుండును. నీవచటి కేగిభగవత్కథా కర్ణనమొనరించిన నీయజ్ఞానము దొలంగునన నతడు నామాటనుమన్నించి యట కేగెను. రామచంద్రుని యనుగ్రహముచే నాకన్నివిషయములు దెలి యును. కాని గరుత్మంతుని దురభిమానమును దొలగింపనెంచి నేనటకుబొమ్మం టిని. రామచంద్రుని మాయ మిగుల ప్రబలము. దురభిమానులకెంతబోధించి నను వారామాయనుండి తరింపజాలరు. కావుననె నారదుడు, బ్రహ్మయు, నాకడకీతనిబంచిరి. నేను కాకభసుండునికడకంపితిని. ఈతడు భక్తుడు. భగ వంతుని వాహనమగు గరుడుడు. అట్టివాడు భగవన్మాయాముగ్ధుడై బాధపడు చుండెను. మహానుభావులగు శివవిరించులుసయిత మాతని మాయలో బడు చుండ నన్యులమాట చెప్పనేల! యని మునులు మాయాతీతుడగు భగవంతుని భజింతురు. జ్ఞానవయోవృద్ధుడగు నాకాకభసుండునికడకేగనెంచి ఖగపతి యాసుందరపర్వతశిఖరము నధిష్ఠింపగనే యాతని యజ్ఞానమునశించెను. అతడా సరోవరమందు స్నానమాచరించి ప్రశాంతచిత్తుడై రామకథాప్రసంగము జరుగు చున్న యామట్టికడకేగెను. కాకభసుండుడపుడె రామచరితమును జెప్పనారం భించెను. ఖగపతి యచట కేగినతోడనె పక్షులన్నియు కాకభసుండు నానతిని ఆనందకందళితహృదయములై యాతనికాసనమిచ్చి సగౌరవముగ నర్చించి గుశల మడిగెను. పిమ్మట కాకభసుండు డిట్లనియె. ఓపక్షీంద్రా, తమరాకచే మేమెల్ల రము గృతార్థులమైతిమి. మీమహిమనూతిశయమును శంకరుడు పలుమారులు గొనియాడుచుండెను. తామిట్లు దయచేయకతమేమని మృదుమధురముగ బలుక నతడిట్లనియె. భక్తాగ్రగణ్యా! నీయాశ్రమమునుజూచినంతనె నాయజ్ఞా నము పటాపంచలయినది. ఎవనిచరితము శ్రవణమాత్రమున సకలదురితక్షయం కరమై సకలశ్రేయస్సంధాయకమగుచున్నదో! అట్టిరామచంద్రుని పవిత్ర చరిత్రమును నీవలన వినగోరి నీకడకువచ్చితినన నాయమృతోపమ వాక్కుల కానందభరితుడై కథనుజెప్ప నారంభించెను.

తొలుత రామమానస సరోవరమును వర్ణించి, పిమ్మట నారదుని మోహమును, రావణజన్మ వృత్తాంతమును, భగవదవతార విశేషములను,

శ్రీరామజననము, బాల్యచరితము, విశ్వామిత్ర యాగరక్షణము, జానకీపరిణయము, పట్టాభిషేకప్రసంగము, రాజ్యభంశము, నయోధ్యాపరిత్యాగము, లక్ష్మణసంవాదము, గుహసమాగమము, వాల్మీకిదర్శనము, చిత్రకూటనివాసము, దశరథునిమరణము, భరతుని చిత్రకూటాగమనము, పాదుకాసమర్పణము, భరతునినియమము, కాకపరిభవము, అగస్త్యసమాగమము, దండకాప్రవేశము, శబరీమోక్షము, జటాయుసందర్శనము, లక్ష్మణునికిజ్ఞానోపదేశము, శూర్పణఖ యవమానము, ఖరదూషణాది సంహారము, సీతాపహరణము, సుగ్రీవమైత్రి, వాలివధ, సీతాన్వేషణము, సేతుబంధము, వానరరాక్షస సంగ్రామము, కుంభకర్ణమేఘనాదాదిరాక్షసవీరుల మరణము, అహిరావణ నరాంతక చరితము, రావణసంహారము, విభీషణపట్టాభిషేకము, శ్రీరామపట్టాభిషేకము, రామరాజ్యము మున్నగువానిని కాకభశుండుడు గరుడునకు జెప్పువిని యానందపరవశుడై యాతడిట్లనియె. మహాత్మా! నీవలన రామకథనంతను విని పవిత్రుడనైతిని. నాసందియములు తీరినవి. రామచంద్రునందుప్రేమ యగ్గలమగుచున్నది. నాక్షేమమునకే నాకీసందియ మొదవినది. అట్లుకాని నాడు నాకింత సావధానముగ రామకథను వినుటెట్లు పొసగును? రామునిగృపచే నీదర్శనమును, నీయనుగ్రహమువలన సందేహనివృత్తియు నయ్యెను. ఆగరుత్మంతునివాక్కులవిని కాకభసుండుడుప్పొంగుచు, నానందబాష్పములగార్చుచు నిట్లనియె. ఖగపతీ! నీవునాకు బూజ్యుడవు. రామకృపా పాత్రుడవు. నీకుసంశయమెట్లుండును? నాయందలి ప్రేమచేనిట్లువచ్చితివి. రామచంద్రుడు నాకీఘనతను గూర్చదలిచి మీకీయూహామును గల్పించి యుండవలయును. కాని నాడుమీవంటి మేధానిధులు మాదృశులకడ కరుదెంచుటెట్లు? బ్రహ్మాదిదేవతలు, నారదాదిమహర్షులు నాతనిమాయామగ్నులయిన నితరులాతనిమాయలో బడుట కేమివింత? మహామోగులై యాతనితత్వము నెఱుంగక తబ్బిబ్బులగుచున్నారు. ఇక కామాంధులు, తృష్ణావిజితులు, క్రోధదగ్ధులు, రామచంద్రుని దెలియుటెట్లు? ప్రపంచమున బండితులు, తాపసులు, శూరులు, కవులు, గుణవంతులును లోభపరవశులై యున్నారు. ధనమదమున దప్పుదారులు దొక్కనివారెవరు? అధికారదుర్విదగ్ధులు, కాంతాకటాక్షములకు లోబడిన వారు, కామశరహతులును, దోషదూషిత మానసులును, మదమానాక్రాంతు

లును, యూహావనదుర్విలసితములును, మమతాభ్రష్ట యశస్కులు, ఈర్ష్యాకలంకి తులు, శోకపవనవిచాలితులును, చింతాసర్పదష్టులును, వివిధమనోవికారబా ధితులును, ఈషణాత్రయాక్రాంతులు నాతనిమాయనెఱింగి తరించుటకల్ల. శివ విరించులీమాయనుజూచి భయమందుచుందురు.

ఈప్రపంచమున భగవన్మాయామోహితుడు గానివాడొక్కడును లేడు. దంభాహంకారాద్యాయుధముల ధరించి, స్వేచ్ఛగజరించుచున్న పాషండాది పరి వారముతోగూడ నీమాయ నిఖిలప్రపంచమును జయించుచున్నది. ఈమాయను నిర్జించుటకు భగవద్భక్తితప్ప వేఱొండు సాధనములేదు. మాయనుగల్పించు టకు నిర్మూలించుటకు నతడె సమర్థుడు. మాయాతీతుడు, సచ్చిదానంద స్వరూపులు, ఘనశ్యాముడు, బలధాముడు, నజుడు, సర్వాంతర్యామి, అనం తుడు, నపరిచ్ఛిన్నుడు, భావవికారశూన్యుడు, నవాఙ్మానస గోచరుడు, నద్వితీ యుడు, సమదర్శియు, నిర్భయాజేయ సుఖరూపుడు, నిత్యనిర్మోహనిరంజనుడు, రాగద్వేష మోహరహితుడు నగు భగవంతుడు, భక్తహితార్థము రామరూ పమున నుదయించి, ఇట్టి యద్భుతచర్యల నొనరించుచుండెను. మిమ్ములమోహపెట్టుటకు నాగపాశబద్ధుడై, మాయుపకృతినందినట్లు నటించెను. ఎంతటి వారైన నాప్రభునిపరీక్షకు నిలువజాలరు. నటుడనేకవేషములధరించి భావా నుగుణముగ నభినయించునట్లా ప్రభువనేకయవతారములనెత్తి తత్కాలానుగుణ ముగ ప్రవర్తింపుచు దుష్టనిగ్రహమును శిష్టరక్షణమును జేయుచు జగన్నాటక సూత్రధారుడై యుండును. ఓ నాగాంతకా! ఇట్టి భగవంతుడగు రామచంద్రుని విషయాసక్తులగువారు సామాన్యమానవునిగ దలంచెదరు. కామెర్లరోగము గలవానికంతయు బచ్చగ నగపడునుగదా! నౌకారూఢునకు ప్రపంచమం తయు దిరుగుచున్నట్లగపడును. ఇట్లు భ్రాంతులగువారు రాముని రాజపుత్రు డందురుకాని రాముడు పరబ్రహ్మస్వరూపుడు. ఆతనికి మాయకాని తన్మూలక మగు భ్రమకాని లేవు. రాముడు నజ్ఞానియే యను మందప్రజ్ఞు లరిషడ్వర్గము లకులోనై సంసారసాగరమున మునుగుచు దుఃఖములననుభవించుచు బరమార్థ మును గ్రహింపజాలరు. భగవంతుని నిర్గుణరూపముకన్నను సగుణరూపమే దుర్గ్రహము. ఆతని యనంతలీలల దెలియజాలక మహామునులే మోహితు లగుచుందురు. ఖగపతీ! రామునిమహిమను నాకు దెలిసినంతవఱకు జెప్పుచు

న్నాను. విష్ణుభ క్తులగు మిమ్ములజూచినంత నె నాకపరిమి తానందము గలుగుచు న్నది. కాన నొకరహస్యమును జెప్పుచున్నాను.

రామచంద్రుడు భ క్తుల దురభిమానము నెన్నడును సహించడు. జనన మరణ కారణమగు దురభిమానమును దొలగించుట కాతడు జూచుచుండును. రామచంద్రునకు భ క్తులయెడ ప్రీతి యపారము. తల్లి పిల్లవాని వ్రణచికిత్స కెట్లు నిర్దయగ జికిత్స జేయించునో అట్లే భగవంతుడును భ క్తుల మోహమును దొలగించుట కెన్నియో యుపాయములను బన్నుచుండును. ఓ సోదరులారా! తులసీదాసుడనగు నామాటను వినుడు. దీనదయాళుడగు రామచంద్రుని భజించి తరింపుడు. భగవత్స్వరూపుడు కృపాళుడునగు రామచంద్రుడు తల్లి దండ్రులకన్న నెక్కుడుగ గాపాడునని మహాత్ములు జెప్పుచున్నారు. కాన మీ సందియముల వీడి మీ రా రాముని భజింపుడు. ముందు కథను వినుడు.

కాకభశుండుడు రామనితోడి తన చెలిమిని తెల్పుట

నాగాంతకా! నాజడత్వమును, నాయందు రామచంద్రునికి గల యపా రకృపను జెప్పెదను వినుము. నేనప్పుడప్పు డయోధ్యకేగి రామచంద్రుని బాల క్రీడల జూచి వచ్చుచుండెడివాడను. రామచంద్రుని జన్మోత్సవమున కేగి అయిదు సంవత్సరము లచటనేయుంటిని. కోటిమన్మథుల దిరస్కరించెడియాతని దివ్యశోభను జూచి ముగ్ధుడనై మాటిమాటికి దిలకించుచు నేత్రసాఫల్యము నందుచుంటిని. నేనా యయోధ్యలో నొకచిన్న కాకమునై యాతని బాల్యచేష్ట తముల జూచుచు నానందింపుచుంటిని. బాల్యమున రాము డెటకేగిన నేను నటకె బోవుచు నాతని యుచ్ఛిష్టము నానందముతో భుజించుచుండెడివాడను. ఆతని భక్తానందకరమగు చరితము దలంచిన నొడలుప్పొంగుచుండెను. స్వర్ణ మణిమయమగు దశరథ సౌధప్రాంగణమున నానలువురన్నదమ్ములు నాటలాడు కొనుచుండ రాముని జూచుచుండెడి కౌసల్యానందమున కంతులేకుండెను. ఇంద్ర నీల శ్యామలము నతిమృదులమునగు నాతని శరీరము మన్మథుని ధిక్కరించు చుండెను. చక్రమత్స్యధ్వజ రేఖాంకితములగు నాచరణకమలములందందమయిన నూపురరవమును, మణిమేఖలాఘటిత కింకిణీరవములు నతిమనోహరముగ నుండెను. వళిత్రయభరితమగు నుదరము, నిమ్ననాభియు, రత్నాభరణభూషిత

మగు విశాల వక్షస్థలము, దీర్ఘబాహువులు, రత్నాంగుళీయకముల శోభిల్లు నంగుళీయకములు, సింహసంహాననము, కంబుకంఠము, చక్కనిచుబుకము, విశాల భాలము, ముద్దుమోము, అరుణాధరము, తుంగఘోణము, లలితకపోలములు, భవమోచనములగు నిందీర నేత్రములు, వక్రాలకములు, కుటిలకుంతలములు, రవ్యమగు శ్రోత్రద్వంద్వముతో విరాజిల్లు తన మేని ప్రతిబింబమునుగాంచి యానందించుచున్నట్లు నటించుచుండెడి యారామచంద్రుని జూచి విస్మయ మందుచుంటిని. ఆభక్తపరీధీనుడు నాతోననేక ఖేలనముల జేయుచు, నన్ను బట్టనుంకించుచు, నాకు భక్ష్యములజూపి ఆసగొలుపుచు నేనాతని పాదములంట బోవ తానును పారుచుండెడివాడు. నేనును రాముని మాయామోహితుడనగు చుండెడివాడను కాని ఇతరులవలె జనన మరణ ప్రవాహమున మాత్రము బడుటలేదు.

ఖగపతీ! ఇటనొక విషయమును గమనింపవలయును. అఖండ జ్ఞాన స్వరూపుడగు భగవంతుని మాయకు లోబడని జీవుడులేడు. భగవంతుడు స్వతం త్రుడు సర్వజ్ఞుడు. జీవులనేకులు పరతంత్రులు కించిజ్ఞులు నగుచున్నారు. దీని కాతని మాయయె కారణము. భగవత్కృపా విహీను లెన్నటికి నీమాయను దరింపజాలరు. నిర్వాణము నభిలషించువారు రాముని భజింపవలయును. రామభక్తి లేనివారి జ్ఞానము వ్యర్థము. సూర్యునివలన జీకటి నశించునుగాని నక్షత్ర చంద్రాగ్నులవలన నశింపదుగదా! రామచంద్రుడు భక్తుల యజ్ఞాన మును రూపుమాపి దివ్యదృష్టి నొసంగును. ఒకప్పుడు నా యవివేకమున కాతడు నవ్వెను. ఆ కథను వినుము. ఒకనాడు రామచంద్రుడు నన్ను సవిలాసముగబట్ట జూచెను. నేనాతని కంకక ఎగిరిపోయితిని. ఆతడు నావెంట పరుగిడజొచ్చెను. నేనాకసమునకెగిరితిని. ఆతడును నాతో వచ్చుచునేయుండెను. నేనెంతపై కెగసిన నాతడు నాచేరువనెయుండెను. ఆతనిచేయి నాకతిసమీపముననుండెను. నేనట్లు బ్రహ్మలోకమునకుబోయితిని. అతనిచేయినాకు రెండంగుళములదూరమందుండెను. పిమ్మట నేననేకలోకముల కేగితిని. అతడును నన్నట్లె వెంబడించుచుండెను. ఇకనాకే మియుదోపక భయమంది కన్నులమూసికొంటిని. మఱల గన్నుల దెఱచు నంతకు మేమిరువురమయోధ్యలోనుంటిమి. అపుడు రామచంద్రుడు నన్ను జూచి నవ్వసాగెను. అతడు నవ్వుచుండ నేనాతనిముఖద్వారమున నాతనిగర్భ

ములో బ్రవేశించితిని. ఆతని యుదరమునందనేక బ్రహ్మాండములజూచితిని. వానిలో ననేకచిత్రములగు లోకములజూచితిని. వానియం దనేకబ్రహ్మలు, శివులు, సూర్యచంద్ర తారాగణములు, పర్వతములు, నదులు, సముద్రములు వనములుసురాసురయక్షకిన్నర, నాగనరసమూహాములు, చరాచరజీవరాసులు నగపడుచుండెను. అట నేజూచిన విశేషములన్నియు జెప్ప నలవికాకుండెను. బ్రహ్మాండములన్నియు నాకు గోచరమగుచుండెను. సకలబ్రహ్మాండములందును నదులు, పర్వతములు, దిక్కృతులు, సూర్యచంద్రాగ్నులు, చరాచరజీవరాసులు నిండియుండెను. అన్ని బ్రహ్మాండములందును భగవంతు డనేకయవతారముల నెత్తి దుష్టశిక్షణమును శిష్టరక్షణమును జేయుచుండెను. ఇపుడు మనమున్న యీబ్రహ్మాండమునుగూడనటజూచితిని. అందయోధ్యాసరయువులను, దశరథుని యాతనిభార్యలను, రామలక్ష్మణ భరతశత్రుఘ్నులను, వారి బాలక్రీడలను జూచితిని. నేజూచిన బ్రహ్మాండములందెచ్చటను రామచంద్రునివంటి సౌందర్య రాశినిమాత్ర గాననైతిని. ఇట్లారామచంద్రుని కుక్షిలోనున్న బ్రహ్మాండ ములనెల్లజూచి మఱల బైటకువచ్చితిని. అట నెంతేనికాలము గడిచి నట్లగపడెనుకాని నేనాకుక్షిలో బ్రవేశించి యచటి బ్రహ్మాండవిశేషములగాంచి వెలువడుటకు రెండుఘడియల కాలమె యయ్యెను. అట్లు బయటకువచ్చి విస్మితు డనగు నన్నుజూచి రామచంద్రుడు నవ్వుచు నాతో విలాసముగ నాడజొచ్చెను. కాని ఇంత స్వల్పసమయములో నెన్నిబ్రహ్మాండముల జూడగలిగితినని దల బోయుచుండెడి నన్నాతడు శాంతచిత్తునొనరించెనుకాని నామనము కుదుటబడ కుండెను. నేను నిశ్చేతనుడనై లోలోన "మాంత్రాహి" యని బల్కుచుండ నాదయాసాగరుడు నాశిరముపై తన పాణిపల్లవము నిడినంతనె నాయజ్ఞాన మంతయు నశించెను. అపుడిదంతయు విష్ణుమాయయని గ్రహించి యాప్రభుని మహిమకచ్చెరువందుచు నాతని భక్తవాత్సల్యమున కమితానంద మొందుచు స్వామిని తదేకదృష్టితో దిలకించుచు నంజలిఘటించి ఇట్లు స్తుతింప మొదలిడితిని. ఓదీనబంధూ! నీమాయల నెంతటివారును దెలియజాలక విసిగివేసారుచుండ నేనెట్లు దెలియగలను? నన్ను కరుణించి నాభ్రమల నశింపజేయుమన నాకృపానిధి దయగలిగి గంభీరమృదుమధురస్వరమున నిట్లనియె. కాకభశుండా! నీయెడ ప్రసన్నుడనయితిని. కాన నణిమాదిసిద్ధులనో, నవనిధులనో, సకలసుఖనిధాన

మగు మోక్షసామ్రాజ్యమునో, మానిదుర్లభములగు జ్ఞానవైరాగ్యములనో కోరుము. వానిని దప్పక నీకొసంగెదనన నాపలుకులకెంతేని బ్రసన్నుడనై ఇట్లు తలపోయసాగితిని. అయణిమాదిసిద్ధుల నిచ్చెదననెనుగాని నిశ్చలభక్తి నొసంగెదననుటలేదు. లవణములేని వ్యంజనమువలె భక్తిలేని యణిమాదులు గాని మోక్షముగాని నాకురుచింపవు. అనినిశ్చయించి యిట్లంటిని. ప్రభూ! శ్రుతి స్మృతిప్రసిద్ధమగు నీయనన్యభక్తి యోగులకును దుర్లభము. కాన నాకాయ నన్యభక్తిని బ్రసాదించిన గృతార్థుడనయ్యెదనన నాప్రభువు ప్రసన్నుడై కాకభా, నీవు మిక్కిలిచతురుడవు. ధన్యుడవు. సాధారణముగ నిట్టివరమునెవ్వరునుగోరరు. ఘోరతపములనాచరించియు నాయందనన్యభక్తిని పొందజాలరు. నీవట్లుగాక నాయందు దృఢభక్తినికోరితివి. నీవెంతేనిధన్యుడవు. నాకృపచే సద్గుణము లన్నియు నీయందువసించును. నాయెడ సంపూర్ణమగుభక్తి నీకులభించును. భక్తిజ్ఞానవైరాగ్యములు, నతని గూఢయోగపద్ధతులు, సకలపురాణగాథలు నీకలవడును. వీనినన్నిటిని నీవితరులకు బోధింపగలుగుదువు. మాయామూల కములగు భ్రమలుని న్నెన్నడును జేరజాలవు. నేనాద్యంత విరహితుడను, షడ్భావవికారదూరుడననియు దెలిసికొనుము. నాభక్తులసేవింపుము. అట్లయిన నీకునాయందచలభక్తి యలవడును. నాసిద్ధాంతములను వినుము. ఈప్రపంచ మందలి సకలపదార్థములు నాచేనిర్మింపబడినవికాన నేనువానిని బ్రేమింతును. అందుమనుజులందును, వారిలో బ్రాహ్మణులందును, వారిలో వేదాధ్యయన సంపన్నులందును, వారిలో సత్కర్మానుష్టానపరులందును, వారిలో జ్ఞానవిజ్ఞాన సంపన్నులందును, నాకుత్తరోత్తరాధికమగు ప్రేమకలదు. వీరందఱికన్నను నాభక్తులందునాకు ప్రేమమెండు. అనన్యభక్తులమాట చెప్పనేల ? అట్టివారల సర్వభావముల నేనేవహించెద. నాభక్తుల బ్రేమించినట్లన్యుల బ్రేమింపను. నాభక్తుడుకానివా డెంతటివాడైన నాతని సాధారణమనుజునివలె జూతును. ఎంతనీచుడైనను నాభక్తుడయిన నేనాతని మిక్కిలిప్రేమింతును. త్రిశుద్ధిగనన్ను భజించెడివాని భారమంతయు నాదియని నమ్ముము. సృష్టియంతయు నాప్రేమ పాత్రమైయుండ సుశీలసంపన్నుడగు భక్తుని నేనేలప్రేమింపను. తల్లిదండ్రులు గుణశీలసంపన్నుడగు కుమారునెక్కుడుగ బ్రేమించినను ఇతర పుత్రులను మాత్రము ప్రేమింపకుందురా? మఱియొకమాటనువినుము. ఒకని కనేకులగు

బుత్రులుందురు. వారిప్రవృత్తిలో భేదముండును. అందొకడు పండితుడు. ఒకడు తపస్వి. ఒకడు కర్మకుడు. ఒకడు ధనవంతుడు. ఒకడు శూరుడు. ఒకడు ధార్మికుడు. ఒకడు దాత. మఱియొకడు పితృభక్తుడు. వీరలనందఱి దండ్రి సమముగ బ్రేమించుచుండును. వారలనడవడి సరిగనుండనియెడల వారల దండించి మంచిద్రోవనుబెట్ట బ్రయత్నించును. వారు బాగుండిన సంతసించును. పాడయినవిచారించును. తండ్రిబిడ్డలనుధర్మజ్ఞానసంపన్నులజేయ నెంచుచుండును. అట్లే యీసకలప్రపంచమునం దున్న వారందఱు నావారగుటచే నేనందఱను బ్రేమింతును. నాభక్తులను స్త్రీపుంభేదములేక నేనుప్రేమింతును. కానసీవు నిష్కాముడవై నన్ను భజించుము. నన్ను భజించునంతకాలము మృత్యువునిన్ను సమీపింపదని రామచంద్రుడుబలుక నాకింకను నాతని యమృతవాక్కులందు దనివితీరకుండెను. ఖగపతీ! అప్పటినాయానందము వర్ణనాతీతము.

ఇట్లు నాకన్నియుబోధించి రామచంద్రుడు మఱల బొలునివలెనాడుచు నాకొన్ని వానివలె రోదనముజేయ సంతవల్లివచ్చి యాతనినెత్తికొని ముద్దాడుచు నొడియందిడుకొని పాలిచ్చుచు బాటలబొడుచు నాతని లాలించుచుండెను. ఏసుఖమునుగోరి మంగళప్రదుడగు శివుడమంగళవేషధారియై దిరుగుచుండెనో, అట్టిసుఖము నయోధ్యావాసులందఱు రాముని దివ్యమంగళ విగ్రహమునుజూచి యత్రశ్రమముగ ననుభవించుచుండిరి. అట్లు కొన్ని నాళ్ళయోధ్యలో నివసించి, రాముని యాటపాటలు జూచి, యభిమతవరంబులనంది యాబాలరాముని మనమున నిలుపుకొని నాయాశ్రమమునకు వచ్చితిని. నాటినుండి రామచంద్రుని యనుగ్రహముచే నన్నేమాయలు సంటుటలేదు. ఈనాయను భవమును మీకెఱిగించితిని. హరిభజనమున జీవునిక్లేశములు నశించును. రామచంద్రుని యనుగ్రహము లేనినాడాతని మహిమ దెలియదు. అతని మహిమ దెలియనివాడాతనియందు భక్తి ఎట్లు కలుగును? తామరాకునందు నీరంటనట్లు రాముని మహిమ దెలియనివాని కాతనియందు నిశ్చలమగు భక్తికలుగుటకల్ల. గురువులవలనజ్ఞానము. జ్ఞానమువలన వైరాగ్యము సిద్ధించినట్లు, భగవద్భక్తిలేనివానికి సుఖముశూన్యము. ఖగపతీ, స్వాభావిక సంతోషములేనివానికివిశ్రాంతికలుగదు. నీరులేనియెడలనోడ లెట్లునడచును. తృప్తి లేనివానికి గామమునశింపదు. కామాతురునకు సుఖముండదు. రాముభక్తిలేని

వానికి దృష్టికలుగదు. భూమిలేనిదే వృక్షములెట్లుపెఱుగును? రామభక్తుని హృదయమునందితరములగు కోరికలుండవు. సద్విజ్ఞానముచే సమదృష్టియు, ధర్మశ్రద్ధయు నుదయించును. పృథివీసంబంధములేని యెడలగంధముండనట్లు తపములేని యెడల తేజముండదు. జలమునందురసమువలె, సత్సాంగత్యమున శీలమలవడును. చక్షురింద్రియమురూపముననిలిచినట్లు, భక్తివలన మానసముస్థిరపడును. స్పర్శ మువాయువునందువలె, విశ్వాసమునందు గార్యసిద్ధినిలిచియుండును. హరిభజన మునగాని సంసారదుఃఖములు నశింపవు. భగవద్విశ్వాసములేని వానికి భక్తి యలవడదు. భగవదనుగ్రహపాత్రులుగానివారలకు స్వప్నమందయినను విశ్రాంతియు సుఖమునుండజాలవు. కాన సందేహములవీడి, కుతర్కములనావల బెట్టి, కరుణాసింధువగు రఘువీరుని భజింపవలయును.

కాకభుండుడు రామమహిమను దెల్పుట

ఖగేశా! నాకుదెలిసినతీరున శ్రీరాముని చరితమును యాతని మహిమాతిశయమును దెలిపితిని. నేనుమిగుల బుద్ధిమంతుడనుగాను. రామచంద్రుని మహిమయు, గుణములుననంతములు. మునులు వారివారి శక్తినిబట్టివర్ణించిరి. కాని భగవత్కథలనంతము. వేదములువిరించి మున్నగువారును నంతమును గనజాలకున్నారు. ఆకసమునకెగురు పక్షులాకోశమహత్వము నెట్లుదెలియ జాలవో! అట్లే రామచంద్రుని యగాధమహిమనెవ్వరును వర్ణింపజాలరు. అనంతకోటిబ్రహ్మాండ నాయకుడను, అనంతబలసంపన్నుడును శతకోటిసూర్య సంకాశుడును, శతకోటిచంద్రశీతలాహ్లాదకరుడును, కోటిమన్మథసుందరాంగుడును సంసారార్ణవోత్తారకుడు నాతడే. ఆతడగ్నివలెదుర్ధర్షుడు. శమనునివలె దుర్గముడు. వారిధివలెదుస్తరుడు. జలనిధివలెనగాధుడు. తీర్థరాజువలెనతి పవిత్రుడు, మేరుధీరుడు, కామధేనువువలె భక్తాభీష్టప్రదుడు, బృహస్పతికన్ననుచతురుడు. ఆతడె బ్రహ్మవిష్ణుదుద్రరూపములనొంది సృష్టిస్థితిలయములనొనరించుచుండుమ. సకలజగద్భారమునువహించెడి నిరవధికనిరుపమమహిమాన్వితుడు అతనికతడేసాటియని శ్రుతులద్ఘోషించుచున్నవి. ఆతనికినితరులకునుఖద్యోతమార్తాండులకున్నంత యంతరమున్నది. రామచంద్రుని యనంతకల్యాణముల నెవ్వరును దెలియజాలరు. నేనుసత్పురుషులవలన వినినదానిని మీకువినిచితిని.

మమతాహంతలవీడి రామునిభజించెడి వారికి సంశయదుఃఖములుండజాలవు. అనునాకాకభసుండుని పలుకులువిని గరుత్మంతు డపరిమితానందమునంది రెక్క-లవిదల్చుచు నానందబాష్పములగార్చుచు, రాముని మహిమను దనమానస మునందిడికొని వెనుకటి తనయజ్ఞానమునకు దురపిల్లుచు కాకభశుండుని ద్దివస మునిగనెంచి నమస్కరించుచు, తండ్రీ కాకభశుండా ! సద్గురూపదేశము లేనినాడెట్టివారైనను, శంకాసర్పదష్టులై భవజలనిధిని తరింపజాలరు. నీవు కుతర్క-కల్లోలములలో గొట్టుకొనుచు నంతుగానక దురపిల్లుచున్న నన్నుద్ధరించి నాసంశయములబాపి ననొనెకభక్తునిగ జేసితివి. నీవు మోహాంధ కారమున కుష్ణభానుడవు. నాయజ్ఞానమునువాపి నాప్రాణములగాచితివి. నిరుపమరామరహస్యమును నాకెఱింగించి నన్ను ధన్యునొనర్చితివి. ఇట్లు కాక భసుండునినుతించి, ఖగపతి వినయవినమితశిరస్కుడై, యంజలి ఘటించి ప్రభూ! నాయవివేకమున మఱియొక విషయము నడుగుచుంటిని. దయయుంచి శలవీయ వలయును. సర్వజ్ఞులు దత్వవేత్తలు, శీలనిధులు, శిరశ్చిత్తులు, సదాచార నిర తులు, జ్ఞానవైరాగ్యసంపన్నులు, రఘునాథుని ప్రియదాసులునగు తమకీవాయ సరూపమెట్లువచ్చినది ? రామచరిత సుందర సరోవరము నెట్లు దెలిసికొంటిరి? మీకు ప్రళయమునందును నాశములేదని శంకరునివలన వినియుంటిని. స్థావర జంగమాత్మకమగు నీసకల ప్రపంచమును కాలము గ్రసించును. కాలమతి నిష్ఠు రము. సకల బ్రహ్మాండములనొక త్రుటికాలములో నశింపజేయును. అట్టికాలము మిమ్మెందులకు విడిచిపెట్టెను. ఇది మీజ్ఞాన ప్రభావమో ! లేక యోగమహి మయో ! దెలియకున్నది. మఱియు మీయాశ్రమమునకు వచ్చినతోడనే నా హృదయము ప్రసన్నమయినది.అనునాగరుడుని పలుకులకు కాకభసుండు డుప్పొంగుచు దనవృత్తాంతము నిట్లు చెప్పదొడంగెను. ఖగపతీ, మీప్రశ్నము నాకెంతేని సంతసమును గలిగించుచున్నది. మీప్రశ్నమువలన నాకనేక జన్మ లవృత్తాంతము సర్మణకు వచ్చుచున్నది. నాకథను సావధానముగా వినుడు. సకలసత్కర్మానుష్ఠానమునకు, వైరాగ్యమునకు, శమాదిషట్క-సంపత్తికిని ఫలము రఘునాథుని యనుగ్రహమునకు పాత్రమగుటయేగదా ! రఘుపతి యనుగ్రహములేనినాడెట్టి క్షేమమును కలుగదు. ఈతనువునందేనాకు రామ భక్తి యలవడెనుకాన నాకీతనువునం దెక్కడుమక్కువ. దేనివలన స్వార్థము

సిద్ధించునో దానినిప్రేమించుట సహజముగదా! స్వార్థసాధనమగు నీచవస్తువు నయినను ప్రేమించుట దోషముకాదు. రామునిప్రేమించుటకన్న స్వార్థము లేదు. రామభక్తిసాధనముకాని సుందరశరీరమువలన నేమిప్రయోజనము. రామభక్తినొదవించెడి ఏశరీరమయినను సార్థకమేయగును. రామవిముఖుడెంత ఘనుడైనను ప్రశంసాపాత్రుడు కాజాలడు. నాకు మృత్యువు స్వాధీనముగాన నేనందఱవలె నశింపను. శరీరములేనియెడల రామునిభజించుట కవకాశములేదు కాన నేనీశరీరమును విడుచుటలేదు.

కాకభుశుండుని పూర్వజన్మ కథనము

తొల్లి నేనజ్ఞానముచే రామవిముఖుడనై వివిధదుఃఖముల ననుభవించుచు ననేకజన్మముల నెత్తితిని. వానిలో యజ్ఞాదిసత్కర్మల నాచరించితిని. కాని నాకు సంసారము జన్మపరంపరయు దప్పకుండెను. సుఖలేశమైనను లేకుండెను. నాకాజన్మలన్నియు నిప్పుడు జ్ఞప్తికివచ్చుచున్నవి. ఓ విహంగమరాజా! రామ ప్రేమాభివృద్ధికరమును, క్లేశహరము నగు నాప్రథమజన్మ వృత్తాంతమును వినుము. వెనుకటికల్పమున సకలకలుషనిదానమగు కలియుగము వచ్చెను. అందు స్త్రీపురుషు లధర్మనిరతులై వేదమునకు విరుద్ధముగ సంచరించుచుండిరి. అప్పుడయోధ్యాపురిలో నేనొకశూద్రుని యింటజన్మించి, శివారాధనతత్పరుడనై, దురభిమానముచే దేవతాంతరమును నిందించుచు, దంభాహంకారదర్పితుడనై, ఇది రఘుపతిరాజధానియని దెలియక యధేష్టముగ ప్రవర్తించెడివాడను. అప్పుడు కలికాలమహిమచే నందఱును లోభభూయిష్ఠులై యజ్ఞానముచే కుమార్గమున నుసరించి దుష్కృత్యములం దాసక్తులై యుక్తాయుక్త వివేకము లేక పాషండులై తిరుగుచుండిరి.

కాకభుశుండుడు చతుర్యుగధర్మముల దెల్పుట

కలియుగమున వర్ణాశ్రమధర్మములు నశించును. స్త్రీలు పురుషులును ఇంద్రియలోలురై యధర్మమార్గమున జరింతురు. విప్రులు వేదనిందకులగుదురు. రాజు ప్రజలబీడించును. ప్రజలు పాషండులగుదురు. విద్వాంసులు దాంభికులై యసత్యముల నాడుచుందురు. లోకమంతయు పరస్త్రీ

ధనాసక్తమై పరహింసాపరాయణమై యుండును. కొందరు సదాచార విముఖులై వైరాగ్యమును నటించుచు తాపసులవలెనుండి లోకమును వంచించెదరు. పురుషులు స్త్రీలోలురై వారెట్లుబల్కిన నట్లు చేయుచుండెదరు. శూద్రులు బ్రాహ్మణవృత్తులను బ్రాహ్మణులు శూద్రవృత్తుల నవలంబించెదరు. స్త్రీలు పుంశ్చలులై భర్తలవీడి యథేష్టముగ బ్రవర్తింతురు. విధవలు మెండై సువాసినీవేషములతో నుండెదరు. గురువులు ధనాసక్తులై శిష్యులచే నవమానింపబడుచుందురు. స్త్రీపురుషులు శుష్కవేదాంతముల జర్చింతురు. శూద్రులు బ్రాహ్మణుల నవమానించుచు వారిచేదాస్యములచేయించుకొనుచు వారికన్నెల జెఱుపుచుందురు. సన్యాసులు దాంభికులై కాంతాసక్తులై విహరింతురు. పండితులు వేదమునకపార్థముల జెప్పుచు ధనాసక్తిచే వేదము నమ్ముకొనియెదరు. కొందఱు దాంభికులు కపటసన్యాసి వేషధారులై లోకమును వంచించుందురు. శూద్రులు ధర్మమును బోధించుచుందురు. కలియుగమున వర్ణములన్నియు సంకీర్ణములయిపోవును. శూద్రులు పురోహితులగుదురు. సుప్రసిద్ధ వేదమార్గమును వీడిస్వబుద్ధి ననుసరించి కుమార్గముల గల్పించి లోకమును వంచించుచు గురువుల మనియు సన్యాసులమనియు జెప్పుకొనుచు ధనతత్పరులై లోకమును వంచించెడి దాంభికులు మెండుగనుందురు. ఖగేశా! మఱియు గలియుగమున సన్యాసులు ధనికులుగను, గృహస్థులు నిర్ధనులుగనుందురు. కొందఱు భార్యను వెడలగొట్టి కులటలకు గృహాధికారము నొసంగెదరు. మఱికొందరు మందమతులు భార్యా పరతంత్రులై తల్లిదండ్రుల వెడలనడతురు. పాపనిరతుడైన రాజు ధర్మదూరుడై యుక్తాయుక్తముల గమనింపక ప్రజల బీడించుచుండును. కులశీలములు ధనమునుబట్టి యుండును. విప్రులు వేదములను దద్విహితము లగు గర్మలను విడిచి నిందితకృత్యముల నాచరింతురు. విద్వాంసులు దంభప్రధానులై నీచుల నాశ్రయింతురు. పరులదొసగుల నెన్నుదురు కాని గుణముల నగ్గింపరు. ప్రజలు క్షామపీడితులై దుర్మరణముల నందుదురు. కలియుగమున బ్రహ్మాండమంతయు దంభాహంకార పాపభరితమై యుండును. మనుజులు తమఃప్రధానులై సత్కర్మలవీడి దంభమునకై తపోదానాదుల నాచరింతురు. ఈతిబాధలెక్కుడుగ నుండును. సస్యములు క్షీణించును. అబలలందమునకు కేశఖండనమొనరింతురు. మనుజులు క్షుత్పీడితులు దరి

ద్రులు దురాశావ్యాకులచిత్తులు దుఃఖితులునై ఉదరపోషణ నిరతులై యుండెదరు. దురభిమానముచే నకారణ కలహాములవలన బలవన్మరణములు మొండగును. స్త్రీపురుషులు ధర్మదూరులై తాత్కాలిక సుఖము ననుభవించుచు నుచ్ఛిష్టాహారములచే దేహాముల బెంచుచుందురు.

కలియవగుణములకు నిధియైనను నశ్రమంబుగ దరించుటకు దగినసూక్ష్మోపాయములిందుగలవు. కృతత్రేతాద్వాపరములందు, తపోదానమఖములగాని దరింపజాలరు. కలియుగమున భగన్నామ సంకీర్తనమున దరింపవచ్చును. కలియుగమున యజ్ఞతపోయోగములు దుర్ఘటములు. కానరామచంద్రుని భజించి సకలఫలముల నందగలరు. నిర్మలచిత్తులై రామునిభజించినవారు సంసారము నవలీలగ దాటెదురు. కలిలో నామప్రభావమెక్కుడు. భగవన్నామసంకీర్తన మొనరించెడివారిని గలిదోషములంటజాలవు. వారెపుణ్యమూర్తులు. ఈరహస్యమునెఱింగిన వారికి కలికన్న సుఖకరమగునది వేఱొండు లేదు. అట్టివారనాయాసముగ నచిరకాలములో భగవత్సన్నిధినిజేరగలుగుదురు. వారికితపోదానయజ్ఞములతో బనిలేదు. కలియుగమున జేసినస్వల్పసుకృతమే యమితఫలమునొసంగును. సత్యయుగమున నండఱును, ధర్మనిరతులై, సత్యవాదులై, సత్వగుణప్రధానులై తపస్సంపన్నులై యుండెడివారు. త్రేతయందు రజోగుణము ప్రధానమై సత్కర్మల నాచరించుచు సుఖించు చుండెడివారు. ద్వాపరమున సత్వముతగ్గి రజస్తమములు సమప్రధానములై యుండును. కలియందు తమస్సుప్రధానము. రజోగుణముతమము ననుసరించి యుండును. సత్వము నామమాత్రావశిష్టముగనుండును. కాన బుద్ధిమంతులధర్మముల చెంత కఱుగక రామభక్తులై నయెడల వారినీకలికలుషములంటవు. వారు మాయానాటకముల జూడనొల్లరు. వారన్నిటిని విడిచి భగవన్నామ తత్పరులై నిశ్చింతులై యుండెదరు. నేనును గలియుగమున చాలాకాలమయోధ్యలోగడిపి యచటక్షామ విపత్తులకోర్వజాలక అటనుండి యుజ్జయినిని జేరితిని. అటస్తిమితపడి కొంతధనమునార్జించి మహాదేవుని గొలుచుచుంటిని. అటనొక వైదికుడగు విప్రుడితర చింతలువీడి శివార్చన మొనరించుచుండెను. పరమార్థవేదియు సాధువునగు నాతడు శివార్చకుడైనను హరిభక్తులయెడ నాదరభావమును జూపుచుండెను.

కాకభుండుడింకను తనయనుభవముల దెల్పుట

నేనొకనాడా విప్రునిదరికేగి కపటభావముతో నిట్లంటిని. స్వామీ ! నేనొక దీనుడను. నన్నుదమశిష్యునిగ గైకొని నాకుహితోపదేశమొనరింపు డననాతడు నావేషభాషలనమ్మి నాకుగొన్ని హితముల నుపదేశించి పిదపశివ పంచాక్షరీమంత్రమును నాకుపదేశించి పుత్రనిర్విశేషముగ జూచుచుండెను. నేనును శివాలయమున గూరుచుండి జపమొనరించుచుండెడివాడను. కాని నాహృదయము జిరకాలమునుండియు దంభాహంకార పూరితమగుటచే, బలుడనగు నేను విప్రులను హరిభక్తులను ద్వేషించుచు వారితోనప్రస్తుతమగు వితండవాద మొనరించుచుండెడివాడను. ఇట్లు వాదించెడి నన్నుజూచి కృపాళుడగు నాగురువు నాకెన్నియో హితముల నుపదేశించుచుండెను కాని కుటిలుడనగు నాకాయుపదేశములు చెవికెక్కుటలేదు సరిగదా లోలోన నాగురునిసయితము నిందించుచుంటిని. ఒకనాడు గురువు ననాదరమునబిలిచి యిట్లనియె. పుత్రా ! నామాటనువినుము. శివసేవాఫలము నీకుసిద్ధించుటలేదు. శివారాధనము నకుఫలము విష్ణుభక్తి. శివవిధాతలుగూడ ననుదినము విష్ణువును భజింతురు. అట్టి శ్రీహరినిదూరిన నేమిఫలములభించును ? హరివైరులగు నభాగ్యులకు సుఖమెక్కడిది ? ఖగపతీ ! ఇట్లునాగురువు విష్ణువు నభినందించునప్పుడు నాహృదయముమండుచుండెను. నీచుడనగుననన్ని న్ని రోజులుపాలుపోసిపామును పెంచినట్లు నాగురువు పెంచుచుండెను. అహంకారకుత్సితుడనగు నేనుమాత్రము గురుద్రోహచింతనువీడుటలేదు. దయాళువగు నాగురువు మాటిమాటికి నాకుహితమునుపదేశించుచునేయుండెను. కానినీచుడనగు నేనాతని కపకారమునే జింతించుచుండెడివాడను. అనలసంభూతమగు ధూమము ప్రజలనుచీకాకు బెట్టియు మేఘముతోగలిసి వర్షమునొసంగి యాహ్లాదమొనరించును. అట్లే సద్వంశజడవివేకియైనను, సత్సహవాసముచే దనయవివేకమునువీడి ప్రజారంజకుడగును. పరాగమునేలపైనుండి యందఱిపదఘట్టనము ననుభవించుచు వాయువశమునబైకెగసి తనస్వభావమువీడక రాజమకుటమును బ్రజలదృష్టులను దూషించుచునేయుండును. అట్లే కుజనుడు తన యహంకృతినిబాయజాలడు. కావునసత్పురుషులు నీచులజ్ఞానములవలె జూచుచు వారికి దూరమునందురు. ఒకనాడునేను శివాలయమున

శివునిమంత్రమును జపించుచుండ నాగురువట కేగుదెంచెను. కాని నేనాతని గౌర వింపక నమస్కరించుటమానితిని. దయాళువగు నాగురువు నన్నేమియుననలేదు సరిగదా మనసునందైన నేమియుననుకొనుటలేదు. నాయపరాధమును గురువు సహించినను శివుడుసహింపక యశరీరవాణితోనిట్లనియె. ఓరిమూర్ఖా! నీచా! గురుద్రోహీ! సమదర్శియు దయానిధియునగు గురువును నీవవమానించితివి. కానతత్ఫలమును నీవనుభవింపకతప్పదు. నీవింతవఱకు నీతిబాహ్యముగను వేద విరుద్ధముగను సంచరించుచు గురుతిరస్కారమొనరించితివి. గురుద్రోహులు నూఱుకల్పములు నిరయమునందుందురు. పిమ్మట తిర్యగ్యోనులందుజన్మించి పదివేలసంవత్సరములు బాధపడియెదరు. కాననీవజగరమవై, కొండగుహాలం దును చెట్లతొఱ్ఱలందును వసించుచు దుర్గతిననుభవింపుము. కలుషాత్మా! పాపీ! పొమ్మన నేనునిశ్చేష్టుడనై గంపించిపోవుచుంటిని. ఆనాశాపమునకు నాగురువు తొట్రుపాటొందుచు నాయవస్థనుజూచి జాలినొంది శివునిట్లు ప్రార్థింపసాగెను.

శ్లో॥ నమామీశమీశాన నిర్వాణరూపం, విభుంవ్యాపకం బ్రహ్మవేదస్వరూపమ్
అజంనిర్గుణం నిర్వికల్పంనిరీహం, చిదాకాశమాకాశవాసం భజేహమ్॥ 1

నిరాకార మోంకారమూలంతురీయం, నిరీహజ్ఞానగాతీత మీశంగిరీశమ్।
కరాళం మహాకాలకాలం కృపాళుం, గుణాగార సంసారపారం
నతోఽహమ్॥ 2

తుషారాద్రి సంకాశగౌరంగభీరం, మనోభూతకోటి ప్రభాశ్రీ శరీరమ్।
స్ఫురన్మౌళి కల్లోలినీచారుగంగంసద్బాల చంద్రం చారుకంఠేభుజంగం 3

చలత్కుండలం భ్రుభ్రనేత్రం విశాలం, ప్రసన్నాననం నీలకంఠందయాళుమ్।
మృగాధీశ చర్మాంబరం ముండమాలం, ప్రియంశంకరం సర్వనాథం
భజామి॥ 4

ప్రచండం ప్రకృష్టం ప్రగల్భం పరేశం అఖండం అజంభానుకోటి ప్రకాశమ్
త్రిశూలస్య నిర్మూలనంశూలపాణిం భజేహంభవానీ పతింభావగమ్యమ్॥ 5

కలాతీత కళ్యాణ కల్పాంతకారిన్ సదాసజ్జనానంద దాతఃపురారే।
చిదానంద సందోహ మోహాపకారిన్ ప్రసీదప్రసీద ప్రభోమన్మథారే॥ 6

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

న యావత్యుమానాథపాదారవిందం భజన్తేహలోకే పరేవా నరాణామ్।
న యావత్సుఖం శాంతిసంతాపనాశం, ప్రసీద ప్రభో సర్వభూతాధివాసం॥ 7
వజానామి యోగంజపంనైవ పూజాం, నతోహంసదా
సర్వదాశర్వతుభ్యమ్॥

జరాజన్మ దుఃఖౌఘ తాతప్యమానం ప్రభో పాహి మాం త్వాం
నమామీశశంభో॥ 8

మహాదేవుని యీాయష్టకముచే నెవరుభజించినను వారికి మహాదేవుడు బ్రసన్నుడగును. సర్వజ్ఞుడగు శివుడాబ్రాహ్మణుని స్తుతికిబ్రసన్నుడై, విప్రుడా! నీకభిమతమగు వరమునిచ్చెదను. కోరికొనుమన నాగురుడంజలినిబంధించి ప్రభూ! నాకెల్లపుడు మీాపదభక్తిని బ్రసాదింపుడు. మఱియునీదీనుడగు నాశిష్యుడు మీామాయలోబడి దైవపరాఙ్ముఖుడై యుండెను. వానిని కరుణించి శాపముక్తుని గజేసి యనుగ్రహింపుడు. అనునావిప్రునిశాంత స్వభావమునకు మెచ్చి, ఈతడు పరోపకారపారీణుడని దలంచి, ఓబ్రాహ్మణుడా! ఈతడు ఘోరపాతకియగుటచే నట్లుశపించితిని. నీసాధుత్వమున నీతనిగరుణించితిని. శాంతులగు పరోపకార పారీణులు విష్ణుతుల్యులు. కాని నాశాపమువ్యర్థముకాజాలదు గాననీతడు వేయి జన్మములు హీనజాతియందు పుట్టకతప్పదు. అయినను నాయనుగ్రహమువలన జననమరణక్లేశములాతనినంటవు. మఱియు పూర్వజ్ఞానము కలిగియుండును. అనినాతోనిట్లనియెను. ఓరీ! నీవీజన్మమునజ్ఞానహీనుడవై సంచరించితివి. అయిన నయోధ్యలో జన్మించుటచేతను, ననారాధించుట చేతను, నీకుబ్రసన్నుడ నయితిని. నాకుబ్రాణాధికుడగు విష్ణువును నిందించుటచే నీకిట్టిదుర్గతిపట్టినది. ఇకనైన నను దెలిసికొని ప్రవర్తింపుము. ఆయోధ్యలో బుట్టిననారాధించితివి గాన నీకు విష్ణుభక్తినొసంగెదను. ద్విజులసేవించినగాని హరిసంతసింపడు. విప్రనిందచే నీకిట్టిగతిపట్టినది. ఇంద్రునివజ్రము, నాత్రిశూలము, యమునిదండము నొకప్పుడు వమ్మ్రోకావచ్చునుగాని బ్రాహ్మణక్రోధాగ్నికి దగ్ధముకానిదిలేదు. నాయను గ్రహముచేనిటనుండి వివేకివై యీాప్రపంచమున స్వేచ్ఛగసంచరింపుము. నీకు దుర్లభమగునదేదియునుండదు. పొమ్మన నాశివునిపలుకులువిని నాగురువు ననూరడించి నిజనివాసమునకరిగెను.

ఖగపతీ! అవ్వలికథనువినుము. పిమ్మట నేను కాలప్రేరితుడనై వింధ్యాద్రికేగి యటమృతినంది మఱుల సర్పమునై బుట్టి కొలదిదినములకే యనాయాసముగ నాశరీరమునువిడిచితిని. ఈశ్వరానుగ్రహముచే నాకన్ని జన్మములందును జాతిస్మరణముగలిగియు మమతలేకుండెను. దానహరిభక్తిలోపించుటలేదు. శివానుగ్రహముచే నాకీ జననమరణపరంపర దుఃఖావహముగాకుండెను. పూర్వజన్మస్మృతిగలుగుటచే గురుతిరస్కారమునకు మాత్రముచింతిల్లుచుంటిని. ప్రతిజన్మమందును ననాగురుతిరస్కారఖేదము మాత్రము వేధించుచుండెను. ఇట్లనేక జన్మలనెత్తి తుదకొక విప్రునియింటబుట్టితిని. విప్రజన్మముదుర్లభమని వేదములు నుడువుచున్నవి. అట్లుబ్రాహ్మణుడనై బాలురతో నాడునపుడును భగవల్లీలల బాడుచుండెడివాడను. పిమ్మట నాతండ్రినాకు విద్యలగఱపమొదలిడెను. కాని వానిననాటినిదివరలో నేను గ్రహించినవాడనగుటచేతను, హరిభక్తికన్న వేఱొకటినాకు రుచింపకుండుటచేతను, నేనువానినాదరింపనైతిని. ఎంతబుద్ధిహీనుడైనను కామధేనువునువీడి ఖరమునుగాంక్షించునా? నాకై నాతండ్రివిసిగి వేసారెను. ఆంతగొంతకాలమునకు నాతల్లిదండ్రులు కాలధర్మమునందిరి. బంధమువీడినదని నేను హరినిభజించుచు నరణ్యములబడిపోవుచు మునులదర్శించుచు, వారియమృత బోధలనాలకించుచు, శివానుగ్రహముచే స్వేచ్ఛగసంచరించుచు, నీషణత్రయమున జిక్కువడక, రామచంద్రుడెప్పుడవతరించునో, నేనా దివ్యమంగళవిగ్రహుని గన్నులారగాంచునెప్పుడో యనియువ్విళ్ళూరుచుంటిని గానివేఱొండుచింతలేదు. ఒకప్రేతయందయోధ్యలో రఘుకులమున విష్ణువు రాముడనుపేరుతో నుద్భవించునని ఋషులవలనను శివునివలనను వినియుంటిని. ఆసమయమెప్పుడువచ్చునా! యని ఎదురుజూచుచు నాతనినే ధ్యానింపుచుంటిని. పుండరీకాక్షుడగు రామచంద్రుని దర్శనభాగ్యమెపుడు గలుగును! నాజన్మమెపుడు సార్థకమగునని తలపోయుచుంటిని. ఏమునులనయినను సగుణబ్రహ్మమునుగురించియె ప్రశ్నించెడివాడను. నిర్గుణరూపము నామనసునకెక్కుటలేదు. నాగురునియుపదేశానుసారము సర్వభూతమయుడగు భగవంతుని సగుణరూపమునే ధ్యానించుచుంటిని. ప్రతిక్షణమున నాకునూతనభక్తి యుదయించుచుండెను. అట్లు ప్రపంచమునంతను దిరుగుచు మేరుశిఖరమున ఘటచ్ఛాయను సుఖాసీనుడగు లోమశుడను మునిప్రవరుగాంచి దండప్రణామంబాచరించి,

దీనముగ, రక్షింపుము ప్రభూ! యనిబలికితిని. తోడనే యాదవయాళుడు నారా
కకుకారణమునడిగిన సేనాతనిని సగుణబ్రహ్మ తత్వమునుపదేశింపుడని ప్రార్థిం
చితిని. పిమ్మట నాతడు సగుణబ్రహ్మ తత్వమునంతను సావధానముగ బోధించి,
నాశ్రద్ధాసక్తులకుమెచ్చి మఱలనిట్లనియె. ఓద్విజవర్యా! నీవన్నిటికిని దగిన
వాడవు. కాన అసలు తత్వమునే నీకుజెప్పుచుంటిని వినుము. ఆత్మయద్వితీ
యము, నిర్గుణము, సకలజగదంతర్యామి. నామరూపవిహీనము. అఖండానంద
స్వరూపము. కేవలభావనాగమ్యము. ఆత్మనానాత్వ మజ్ఞాన కల్పితము. నిజము
నకు జీవబ్రహ్మలకు భేదములేదు. సముద్రతరంగములవలె, జలసూర్యాదికము
వలె జీవపరభేద మౌపాధికముగాని వాస్తవము కాజాలదు. అని యనేక
దృష్టాంతములతో నిర్గుణబ్రహ్మస్వరూపము నాతడెంతేని యోపికతో బోధిం
చెను. కాని నా కేమియు దెలియుటలేదు. అంతనేనామునివరుని చరణములపై
వ్రాలి స్వామీ, క్షమింపుడు. నాకీనిర్గుణతత్వము బోధపడుటలేదు. కాన
సగుణస్వరూపమునే శలవిండు. రామభక్తి సరోవరమీనమగు నామనసటనుండి
వెలువడజాలకున్నది. కాన రామచంద్రుని దివ్యమంగళవిగ్రహము నొకసారి
కన్నులారగాంచినగాని నాకీనిర్గుణతత్వము బోధపడదు. ఆరామచంద్రుడు
నానేత్రచకోరముల నెన్నడుతనియించునో యని నిరీక్షించుచుంటినని నేనెంత
వేడిన నామునిమాత్రము నిర్గుణతత్వమునే చెప్పుచుండెను. నాకది రుచింపకుం
డెను. ఎంతచందనకాష్ఠమయినను రాపిడిలేనినాడగ్ని యుద్భవిల్లదుకదా! ఇట్లు
నేను సగుణరూపము నడుగుటయు, నాతడు నిర్గుణరూపమునుపదేశించుటయు,
నేనందుకు విముఖుడనగుటయుజూచి యామునికాగ్రహముదయించెను. అంత
నేనిట్లు తలపోయసాగితిని. ఈతనికి ద్వైతబుద్ధిలేనినాడింతకోప మెందులకు?
పరిచ్ఛిన్నుడును కించిజ్ఞుడునగు జీవుడపరిచ్ఛిన్నుడును సర్వజ్ఞుడునగు పరమా
త్మతో నెట్లేకీభవించును? జీవపరులకభేదమేగలిగిన జీవులకీదుఃఖ మెందులకు?
పరశువేది గలవానికి దారిద్ర్యమెట్లబ్బును? అంత నేనాతనితో నిట్లంటిని.
స్వామీ! విప్రద్రోహులకు వంశమెట్లు నిలుచును? పరవనితాసక్తులకు సద్గతి
ఎట్లు లభించును! నీతిలేనివాని రాజ్యమెట్లుండును? హరిస్మరణము లేనిదే
యఘము లెట్లు దొలంగును? హరిభక్తిలేనిజన్మము వ్యర్థము. దానికి సరియగు
నది లేదని వేదములు ఘోషించుచున్నవి. దుర్లభమగు మానవజన్మనెత్తియు,

భగవద్భక్తుడుగాకున్న నంతకన్న నజ్ఞానముకలదా! దయకుసమమగు ధర్మ
మును, క్రోధమునకుసరియగు దురితమునులేవు. కావుననే మహాత్ములు క్రోధ
మును దరికిరానీయరు. అని ఏమేమియోబలుక నాముని నాకింకను నిర్గుణతత్వ
మునే బోధింపసాగెను. నాకాతని యుపదేశము రుచింపకుండెను. అంతనాముని
కృద్ధుడై, మూర్ఖా! నీకునేనెంతచెప్పినను నాయుపదేశమును గ్రహింపకయేమియో
ప్రశ్నింపుచుంటివి. నీవొకకాకివలె నేమియో యఱచుచుంటివి. కాననీవునొక
నీచవాయసమవై జన్మింపుము. పొమ్మని యామునినిర్దయుడై నన్నుశపించెను.
ఖగేశా! నాకాశాపమేమియు దుఃఖమును గలిగించుటలేదు. తోడనే నేనొక
వాయసమునై యామునికి ప్రణమిల్లి సంతోషముతో రామచంద్రుని
స్మరించుచు నెగిరిపోవుచుంటిని. పార్వతీ! రామభక్తులరిషడ్వర్గమును నిర్జించి
ప్రపంచమునంతను రామమయముగ జూచుచుందురు. అట్టివారికి విరోధులెవ
రుందురు? ఓగరుత్మంతా! రామచంద్రుడామునిమానసమును భ్రమింపజేసి నన్ను
పరీక్షించెను కాన నిందాముని యపరాధమేమియును లేదు. పిమ్మట ద్రిశుద్ధిగనే
దనభక్తుడనని గ్రహించి యాముని క్రోధమునువీడి స్వస్థచిత్తుడయ్యెను. పిమ్మట
ముని తన యకృత్యమునకు జింతించి, నాస్వాభావికభక్తివిశ్వాసములకు మెచ్చి
నాయందు ప్రసన్నుడై నాకు దారకమంత్రము నుపదేశించెను. మఱియు బాల
రాము నుపాసించువిధము నంతను స్పష్టముగ దెలిపెను. నాటనుండి నేనాబాల
రాము నుపాసించుచు తుదకాబాలరాముని దర్శించితిని. ఆకథనంతను మీకిది
వఱకే జెప్పియుంటిని. ఆమునియు గొంతకాలము తనయొద్దనే నన్నిడికొని
రామమానస చరిత్రమునంతను విశదముగ బోధించెను. మఱియు నిట్లని
యెను. తండ్రీ! ఈచరిత మతిగోప్యమయినది. నేను దీనిని శివానుగ్రహముచే
బడయగలిగితిని. నీవు నిజమగు రామభక్తుడవు. కాన నీకు దెలిపితిని. నీవును
సరియగు రామభక్తునకే దీనిని దెలుపుము. అని సాదరముగ దన హస్తమును
నాశిరమందిడి నన్నాశీర్వదింప నేనాతని పదములకు ప్రణమిల్లియుండ నిట్ల
నియె. నాయనుగ్రహముచే నీహృదయమునం దచంచలమగు రామభక్తి కలు
గును. నీవారామునకు ప్రియుడవై యుండెదవు. మఱియు సకలగుణసంపన్ను
డవై, నిరభిమానివై, జ్ఞాననిధివై యుండెదవు. ఇంకను నీవు స్వేచ్ఛాధీనశరీరు
డవై, సకలసిద్ధుల బడసెదవు. నీవు నివసించెడి యాశ్రమమునకు యోజనపర్యం

తము, నవిద్యా కాలకర్మదోషము లుండవు. నీకన్ని భగవచ్చరిత్రములు కరత లామలకములువలె నుండును. నీవు సకలవిద్యాపారంగతుడవై, నిత్యనవీన రామ ప్రేమాలంకృతుడవై సకలాభీష్టముల సశ్రమముగ బడయుమని ముని దీవింప నంతలో నశరీరవాణియు నిట్లనియె. ఓమునివర్యా! నీపలుకులు సత్యములు. ఈతడు సర్వవిధముల రామభక్తుడు. నీదీవన లీతనియెడ సత్యము లగుగాక యన నేనును ఆమునియు మిగుల సంతసించితిమి. నాసందేహము లన్నియు దీరి పోయెను. పిమ్మట నామునికి ప్రణమిల్లి యాతని యనుజ్ఞవడిసి నేనీయాశ్రమం బును జేరితిని.

ఖగపతీ! నేనిటకు వచ్చినతరువాత నిరువదిఏడు కల్పములు గతించినవి. నాటనుండియు రామచంద్రుని చరితమును గానముచేయుచు, సాదరముగ వినెడి విహంగములకు వినిపించుచు, ఏసమయమున భగవంతు డెటనవతరించునో దెలి సికొని యటకేగి భగవంతుని కండ్లార సేవించుకొని వచ్చుచుందును. రామావ తారమునం దయోధ్యకేగి యట బాలరాముని దర్శించిన విధమును తమ కిది వఱకే జెప్పియుంటిని. ఆబాలరాముని ధ్యానించుచు భగవదవతారముల దర్శిం చుచు నిట నివసించుచుంటిని. నేనీకాకశరీరమును ధరించుటకు కారణమును జెప్పితిని. రామమహిమ యనంతము. అట్టి రామభక్తి యీశరీరముచే సిద్ధిం చెను కాన నాకీశరీరమునం దెక్కుడు మక్కువ. ఈప్రేమచే రాముని దర్శించి తిని. నాసకల సందేహములు భక్తిచేతనే నశించినవి. మూర్ఖుడను, శాపోప హతుడనునగు నేనీభక్తివలన యోగిదుర్లభమగు పదము నందితిని. రామభక్తి లేని శుష్కవై రాగ్యమువలన నేనియు సిద్ధింపదు. కామధేనువును వీడి గాడిద నెవడు సేవించును? భక్తిలేనివాని కర్మలు శ్రమైకఫలములు. ఓడలేనిదే సాగ రము నెట్లుదాటగలరు? అన విని గరుత్మంతుడు ప్రసన్నుడై, ఓకాకభసుండా! నీయుపదేశమువలన నాశోకమోహము లన్నియు పూర్తిగ నశించినవి. పరమ పవిత్రములగు రాముని గుణముల విని విశ్రాంతి నందితిని. కాని ఒక్క మాట నడిగెదను. వేదములు జ్ఞానముతో సమమగునది లేదనుచున్నవి. లోమశు డెంతజెప్పినను మీరు భక్తిమార్గమును వీడకుండిరి. కాన భక్తిజ్ఞానములకుగల భేదమును నాకు దెలుపుడన కాకభశుండుడు సంతసించుచు నిట్లనియె. ఖగేశా! భక్తిజ్ఞానములకు వాస్తవికమగు భేదము లేదు. ఈరెండును సంసారదుఃఖమును

నశింపజేయుననియె. కాని మునులు వీనికి గొంచెమంతర మున్నదనుచున్నారు. దానిని సావధానముగ వినుము.

జ్ఞాన వైరాగ్య యోగములు పురుషరూపము. భక్తి మాయలు స్త్రీ రూపము గలవి. స్త్రీపురుషులలో బ్రతాపసంపన్నులగు పురుషుల నబలలగు స్త్రీలు స్వాధీనమునం దుంచుకొందురు. స్త్రీలకులోబడని పురుషు డెందును లేడు. విష్ణువు స్త్రీరూపమగు మాయాశక్తిచే పురుషులను, మోహరూపమగు మాయాశక్తిచే స్త్రీలను పరస్పరమును బంధించి యీజగన్నాటకము నాడుచుండును. స్త్రీల మాయలు స్త్రీలకే తెలియును. అందు భక్తి సాధ్వివంటిది. మాయ నర్తకిసమశీల. రామచంద్రుడు భక్తిపరతంత్రుడు. కాన భక్తిచే మాయాస్వరూపము దెలిసికొనవలయును. భక్తికలతావులందు మాయ భయపడి పరుగెత్తును. నిరుపమానము నిరవధికము నగు భక్తికలవారి హృదయప్రాంతములకు మాయజేరజనదు. ఈరహస్యమును దెలిసినవారు సకలసుఖమూలమగు భక్తిని ప్రార్థింతురు. రామచంద్రునితత్వము దురవగాహము. దానినెఱిగిన వారికి మోహముండదు. స్త్రీలను స్త్రీలచేతనే నిర్జింపవలయును గాన భక్తిచేతనే మాయను నిర్జింపవలయును. ఈరహస్యము దెలిసినవారు రామపదకమలములందవిచ్ఛిన్నమగు భక్తికలిగియుందురు. మఱియు భక్తి జ్ఞానముల రహస్యమును వినుడు. సహజసుఖరాశియు నసంగచిద్రూపుడు నీశ్వరాంశ సంభూతుడునగుజీవుడు మాయాపాశబద్ధుడై, సకలసాంసారిక దుఃఖముల ననుభవించుచుండును. ఈమాయాబంధవిముక్తికొఱ కెన్నేనియుపాయములు నిరూపింపబడినవి కాని బంధవిముక్తికై యత్నించుజీవుల కామాయాబంధము మఱింతబిగియుచున్నది. జ్ఞానప్రకాశము లేకుండుటచే నజ్ఞానాంధకారమున దడుముకొనుచున్నారు. మోహపాశబంధనమెట్లువీడునో దెలియక బాధపడుచున్నారు. దైవానుగ్రహమునగాని యీబంధముతొలంగదు. అందుల కుపాయమును వినుడు. సాత్వికశ్రద్ధాధేనువు హరికృపావిశేషమున మన హృదయము నధిష్ఠించును. జపతపోనియమరూపములయినట్టియు సత్కర్మరూపములయినట్టియు పచ్చికబయళ్ళయందా ధేనువు విహరించుచుండును. దానికి మర్యాదయను దూడయు, ప్రేమయను దుగ్ధభరితమగు పొదుగును గలవు. ఆధేనువును నివృత్తిరజ్జువుచే బంధించి, నిర్మలమనఃపాత్రమునందు, భగవద్దాసు

డనెడి గోపాలుడు నిర్మలధర్మదుగ్ధముల బితుకును. ఆపాలనునిష్కామాగ్ని యందుకాచి, సంతోషక్షమారూపములగు వాయువులచే జల్లార్చి, ధైర్యమను మజ్జిగచే దోడుపెట్టిన బ్రశాంతిరూపమగు దధిసిద్ధించును. దానిని విచారమను కవ్వమునకు సూనృతరజ్జువులగట్టి మథించినకొంత కాలమునకా దధినుండి నిర్మల వైరాగ్యనవనీతములభించును. పిమ్మట యోగాగ్నిని శుభాశుభకర్మలను సమిధలచే ప్రజ్వరిల్లజేసి అందీనవనీతమునుగాచిన నందలి మమతాహంకృతిఅను జలమునశించి జ్ఞానఘృతము సిద్ధించును. దానిని చిత్తమను ప్రమిద యందుంచి, ఆప్రమిదను సర్వసమత్వరూపమగు శమ్యాయందుంచవలెను. పిమ్మట జాగ్రత్స్వప్న సుషుప్తి రూపమగు దూదితో నొకవత్తినిజేసి, యాఘృతమునందిడి చిదానందజ్యోతియందు వెలిగించిన నాదీపజ్వాలలచే నరిషడ్వర్గరూపములగు శలభములు భస్మమైపోవును. జీవపరైక్యాను సంధానమాదీపమునకు శిఖాస్థానీయము. దానిచే భవమూలమగు భ్రమనశించును. తోడనే మోహాంధకారము దొలగిపోవును. అపుడు బుద్ధియను గృహిణి హృదయాంగణమున సావధానముగ గూర్చుండి సంసారగ్రంథిని విడదీయును. తోడనే జీవుడు కృతార్థుడై పంజరముక్తమగు చిలుకవలె స్వేచ్ఛగ నుండును. బుద్ధిబంధముల బ్రదెంచుటనుదెలిసి మాయయనేకవిఘ్నముల గోచరించును. మాయ బుద్ధినిభ్రమింపజేయుట కష్టసిద్ధుల బ్రోత్సహించును. వానికిలొంగని యెడల లోభమునంపి దానిచే ననేకకపటములజేయించును. బుద్ధి యాకపటములకు లోబడనియెడల మాయ తనపయ్యెదచే జ్ఞానదీపప్రశమనకుంకించును. బుద్ధి సరియగు స్థితిలోనుండిన మాయకులోబడదు. అజ్ఞానదీపమారకుండునట్లు పురుషుడతిజాగరూకతతో నుండవలయును. ఆదీపముచలింపకుండ నేకాగ్రమనస్కుడై యుండవలయును. అపుడు సిద్ధులుగాని మోహముగాని యాతని దృష్టిలోబడవు. అపుడు బుద్ధినిరుపప్లవమై బ్రశాంతముగనుండును. ఈప్రశాంతికి దేవతలనేక విఘ్నముల గల్పింతురు. ఇంద్రియాధిష్టానదేవతలా యాద్వారములందుండి విషయవాయువులను మెల్లనహృదయగృహమున బ్రవేశింపజేయుదురు. వానివలన జ్ఞానదీపమునశించును. అపుడుబంధములు వీడుట కవకాశములేదు. దేవతలు భోగలాలసులై జ్ఞానవిముఖులై యుందురు. కావున వారిజ్ఞానదీపమునార్పుటకు సందేహింపరు. విషయవాయువులీ జ్ఞానదీపికనార్పిన

మఱలనది వెలుగుటసున్న. కాన జ్ఞానదీపమునకంతరాయము కలుగకుండ జూచుకొనుచుండవలయును. అట్లయిన మోహాంధకారమున కట బ్రవేశముం డదు. జీవుడప్పుడు బ్రహ్మానందమునందును. అట్లుకానియెడల జీవుడు సంసార మును దాటజాలడు. భగవన్మాయ దుస్తరమయినది. కాన జ్ఞానమార్గమునుప దేశించువారును, దానినాచరించువారును అరుదుగనుందురు. దానికివిఘ్నములు మెండు. జ్ఞానమార్గమసిధారావ్రతమువంటిది. ఇట్లన్నివిఘ్నములను దాటిన సుకృతికిగైవల్యము సుగమము. రామచరణములందచ్చపుభక్తి గలిగిననాడీ మార్గమెంతేని సుగమము. ఎన్నియుపాయములబన్నిను భక్తిలేనివానికి ముక్తి మార్గము దుర్గమము. భక్తిలేనివానికానందమునుండదు. కావున భక్తివంటి మోక్షోపాయము వేఱొండులేదని గ్రహించిన నిపుణులు భక్తినెన్నటికి విడువజాలరు. జఠరదీప్తిలేని భోజనమజీర్ణమునకు మూలమయినట్లు భుక్తిలేని మోక్షప్రయత్నమును దుఃఖమున కేకారణమగుచున్నది. కాన భక్తిని విడిచిన వాడెవ్వడునుండజాలడు. యజమానునియమగ్రహపాత్రుడుగాని సేవకునకు సుఖమెట్లుండును? ఓయురగవైరి! రామచంద్రుడుప్రభువు. మనమందఱము దాసులము. ఈసేవ్యసేవకభావమును దెలిసికొని రాముసేవింపుడు. ఆప్రభువు చేతనులజడములుగను జడములచేతనులగను జేయునఘటితఘటనాసామర్థ్యము గలవాడు. రఘురాముసిభజించి జీవులశ్రేయముగదరింతురు. ఇంతవఱకు జ్ఞాన మార్గమునుజెప్పితిని. ఇకభక్తికి మార్గమును వినుడు. రామభక్తిచింతామణి ఎవనిహృదయ గుహాయందుండునో, ఆగుహ దివారాత్రభేదములేక సకలకాల మును బ్రకాశించుచుండును. ఆప్రకాశమునకు తైలము వత్తిమున్నగునవి యవ సరములేదు. లోభపవనములాప్రకాశము నశింపజేయజాలవు. మోహాంధ కారము నశించును. అరిషడ్వర్గపతంగములు రూపుమాయును. ఆమణినిధరిం చినవారికి గరళమమృతమగును. శత్రువులు మిత్రులగుదురు. సర్వదుఃఖములు నశించును. చతురులీ మణికొఱకెంతేని ప్రయత్నింతురు. ఇది రామకృపా పాత్రులు కాని వారికి దుర్లభము. ఇట్టి మహామణిని పొందుటకు మూర్ఖులు యత్నింపరు. తండ్రితాతలచే బ్రవర్తితమైన యీసంసారక్షీరోదకమును ప్రాజ్ఞులువిడినట్లు మూర్ఖులు విడువజాలరు. వేదగిరులందు రామచరితగనులున్నవి. సత్పురుషు లాగనులను బుద్ధియను గునపముచేద్రవ్వి విజ్ఞానశ్రేత్రముచేజూచి

ఆభక్తచింతామణిని గ్రహింతురు. ఖగపతీ! రామభక్తులు రామునికన్న నధికులని నానమ్మకము. ఈసజ్జనమేఘములు రామార్ణవమునుండి భక్తి జలమును గ్రహించి సకలభువనము లందును వర్షించుచుందురు. మఱియు చందనవృక్షము తనసువాసనను వాయుమూలమున నలుదెసలపచరించి మిగిలిన వృక్షములకు దావిని గల్పించును. అట్లే భక్తులు రామభక్తిని యందఱ కుపదేశించి యందఱను రామభక్తులుగ జేయుదురు. కాన రామభక్తి యల వడవలెనన్న సత్సాంగత్య మవసరము. ఖగేశా! బ్రహ్మయను క్షీరోదధిని జ్ఞానమందరమునకు రామచరితయను వాసుకినిగట్టి, సుజనసురులు మథింపగా భక్తియను నమృతము వెలువడును. దాని నపహరించుటకు కామాది యసు రులు సిద్ధముగనుందురు. వైరాగ్యకరవాలముచే వారల దునుమాడిన వారా యమృతకలశము నందగలరు. అని కాకభసుండుడు పలుక గరుడు డమితానం దము నందుచు మఱలనిట్లనియె. ఓ వాయసరాజమా! నన్ను నీదాసునిగ నెన్ని యానా ప్రశ్నములకు సదుత్తరములనొసంగి నన్ను గృతార్థుని జేయుడు. 1. సర్వదేహములందును దుర్లభదేహమెద్ది. 2. అన్నిటిని మించిన దుఃఖమేది? 3. సరోత్కృష్ట సుఖమనన్నెద్ది? 4. సుజనదుర్జన స్వభావములెట్టివి? 5. సరోత్కృష్ట పుణ్యపురుషు లెవరు? 6. మహాపాపులెవరు? 7. మానసికరో గములన నెట్టివి? సర్వజ్ఞులగు మీరా ప్రశ్నముల దీర్పవలయునన కాకభశుండు డమితానందమునం యిట్లనియె. తండ్రీ! నీప్రశ్నములకు సంగ్రహముగ సమా ధానమును వినుడు. 1. మనుష్యశరీరముతో సమానమగు శరీరములేదు. దీనిని సకలజీవులు కోరుచుందురు. ఇది స్వర్గాపవర్గసోపానము. దీనివలన భక్తిజ్ఞా వైరాగ్యములు సిద్ధించును. ఇట్టిశరీరమును పొందియు మందమతులగు మాన వులు విషయాసక్తులై మణులనువీడి గాజులకు నేలుకొనునట్లు భగవద్భ క్తినివీడి విషయాసక్తులగుచున్నారు. 2. ఈ ప్రపంచమున దారిద్ర్యముకన్న దుఃఖము వేఱొండులేదు. 3 సత్పురుష సందర్శనముకన్న నధికమగు సుఖము లేదు. 4. పరోపకారనిరతులగు సత్పురుషులు పరోపకారమున కెట్టికష్టములనై నను సహింతురు. దుష్టులు మరణించియు జనపనారవలె పరులబాధించుచునే యుందురు. వీరు వృశ్చికమువలె స్వార్థములేకున్నను పరాపకారమునే స్వార్థ ముగభావింతురు. సజ్జనోత్పత్తి ఎంతజగదానందకరమో, దుర్జనోత్పత్తిఅంత

జగద్వినాశకరము. 5. అహింసకన్న మిన్నయగు ధర్మములేదు. కాన నహిం సాపరులు సర్వోత్కృష్ట పుణ్యపురుషులు. 6. పరనిందాతుల్యమగు పాపము లేదు. పరనిందాపరులు వేయిజన్మములు భేకములై పుట్టుదురు. ద్విజనిందా పరుడు జిరకాలము నరకమునననుభవించి కాకమైపుట్టును. దేవతానిందాపరులు రౌరవాదినరకముల ననుభవింతురు. సత్పురుష నిందాసక్తులు, జ్ఞానభాను నవ లోకింపజాలక యులూకములై బుట్టెదరు. పరనిందాపరులు గబ్బిలములయ్యె దరు. ఇక మానసికరోగముల వినుము. మోహము సర్వరోగములకుమూ లము. కామక్రోధలోభములు, వాతపిత్తశ్లేష్మములు. వీని యుద్రేకమువలన నుపద్రవశరమగు సన్నిపాతముద్భవించును. విషయవాంఛలె, శూలలు. వీనిని ప్రత్యేకముగజెప్పుట యసాధ్యము. ఈర్ష్యామమతలు చర్మవ్యాధులు. హర్ష విషాదములు, గ్రహరోగములు. అసహనశీలునకు క్షయవ్యాధియు, కుటిల మనస్కునకు, కుష్టువ్యాధియు వచ్చును. అహంకారము, కీళ్ళవాతము. దంభ, కపట, మదములు, త్రివిధవాతములు. తృష్ణజలోదరము. ఈషణత్రయము త్ర్యాహికజ్వరము, అవివేకమత్సరములు ద్వ్యాహికజ్వరము. ఇట్లు చెప్పుటకీ రోగములనేకములు. వీనిలో నేయొక్కరోగమైనను మనుజునిబీడించును. ఈ రోగములన్నియు గలిగినవానియవస్థ చెప్పదరముగాదు. ఖగేశా! ఈ రోగ ములు శమింపవలెనన్న ననంతవ్రత తపోయజ్ఞ దానధర్మాది దివ్యౌషధముల నిత్యము సేవించుచుండవలయును. ఈ జీవులొకప్పుడు హర్షశోకములను, భయ ప్రీతులను, సంయోగవియోగములను, జడరోగముల నందుచుందురు. ఇంట్లీ రోగములను వానికిదగు చికిత్సలను గుర్తించినవారికీ రోగభయముండదు. ఈరోగములకు విషయాశక్తి యపథ్యము. ఈరోగములు మునులనుగూడ బాధించుచుండును. ఇక సామాన్యులమాటజెప్పనేల ? సద్గురుడను వైద్యుడు సదుపదేశౌషధము నిచ్చుచుండ విషయవాసనయను నపథ్యమును జేయనివాని రోగములు బాధింపజాలవు. మతియు రామభక్తియను సంజీవీమూలికను శ్రద్ధాసక్తులను యనుపానముతో గలిపి సేవించినవాని నీరోగములు దూరమునసే విడిచిపెట్టును. ఈ మానసికరోగములు నివారితములై న తోడనే వైరాగ్యబలము చేకూరును. విషయాసక్తిక్షీణించిన సుమతియను జ్వరము సుదీప్తమగును. దాన నజ్ఞానదౌర్బల్యము తొలంగును. ఇట్లు రోగ

ముక్తుడై జ్ఞానజలమున స్నానముగావించినవానికి రామభక్తి నిలుచును. శివ విరించి శుకనారదసనకాదు లెవ్వనికై జీవితముల ధారవోయుచుందురో, అట్టి రామచంద్రుని పదభక్తికన్న మిన్నయగునది లేదని శ్రుతులు ఘోషించుచున్నవి. తాబేటివెన్నున రోమములు పుట్టవచ్చు. కుందేటికొమ్ములుండవచ్చు. మృగతృష్ణలో నీరుండవచ్చు. కాని రామభక్తిలేనివారికి. సుఖముమాత్ర ముండజాలదు. మజియు జలమునుండిఘృతమును, ఇసుకనుండితైలమును దీయ వచ్చునుకాని రామభక్తుడుకానివాడు సంసారమును దాటజాలడు. రామచం ద్రుడు మశకమును మాతంగముగను మాతంగమును మశకముగను జేయగలడు. కావుననే సత్పురుషులు నిస్సందేహముగ నాతనిసేవింతురు. ఖగపతీ! నేను యథార్థమును జెప్పుచుంటిని. రామభక్తులు నిరాటంకముగ ననాయాసముగ సంసారమును దరింతురు. ఈయనుపమచరిత్రను నాబుద్ధికొలది వినుపించితిని. రామునిసేవింపుడు. మూర్ఖుడనగు నన్ను గూడ రాముడనుగ్రహింప, జ్ఞానమూ ర్తులగుతమ్ము ననుగ్రహించుట కేమియు సందియములేదు. నాయందలి దయచే దామిటకువచ్చి పవిత్రమగు రామకథనాచే జెప్పించితిరి. శుకసనకాదు లెల్ల ప్పుడు రామసరోవరమున స్నానమాడుచుండెదరు. సత్సాంగత్యము దుర్లభము. అదియ మోహఫలము నిచ్చును. అధముడనగు నన్ను జగత్ప్రసిద్ధునిగ జేసి తనభక్తుని గావించెను. సత్సాంగత్యము నొనగూర్చి ధన్యునొనర్చెను.

ఈరామసరోవరమతియగాధము. అని రామచంద్రుని బలప్రతాపము వర్ణించుచు, నెవనిమహిమను వేదములుసయితము కొనియాడజాలవో, శివ విరించు లెవనిపదకమలముల నర్చించుచుండెదరో! ఎవనిస్వభావము నవనీత కోమలమో! ఎవడుసమాధిరహితుడో! ఎవడుభక్తుల యఘముల నడం చునో! యవినాశియగు నారామునకు నానమస్కారశతములు. సిద్ధులు, సాధకులు నుదాసీనులు, కవులు, సన్యాసులు, ధర్మనిరతులు, యోగులు, జ్ఞానులు, సూరులు, తాపసులు, నాస్వామినిసేవింపక తరింపజాలరు. ఎవని నామము భవభేషజమై తాపత్రయమును హరించునో! అట్టికృపాళుడు మన యిరువురకనుకూలుడై యుండుగాతమను కాకభుశుండుని వచనములవిని యతనికి రామునియందుండెడి గాఢానురాగమునుజూచి గరుత్మంతుడు వీతశం కుడై ప్రేమతోనిట్లనియె. స్వామీ! రఘువీరభక్తిరసమును వినిపించినన్ను

గృతార్థునిగజేసితిరి. నామాయావిపత్తులన్నియు నశించి రఘుపతి చరణాబ్జము లందు నాతనభక్తి యుద్భవించినది. అజ్ఞానాంబుధిని దాటించుట కోడవంటి తమయనుగ్రహమువలన నాకు సర్వసౌఖ్యములుచేకూరినవి. దీనికిదగిన ప్రత్యుప కారమును జేయజాలనుగాన శిరమువంచి నమస్కరించుచున్నాను. పూర్ణ కాములు రామభక్తులనగు మీవంటిధన్యులెందునులేరు. సత్పురుషులు, నదులు, వృక్షములు, పర్వతములు, ధరణియు బరోపకారమునకే వినియుక్తములగు చున్నవి. సజ్జనహృదయము నవనీతమువలెకఅగిపోవును. సత్పురుష హృదయమెట్టి కష్టమునైనసహించి పరులకష్టములకు ద్రవించును. తమదయచే నాసందేహ ములు నశించినవి. నాజన్మముధన్యమైనది. నన్ను మీదాసునిగ యనుగ్రహింపు డనివేడికొని గరుత్మంతుడు కాకభసుండుని పదములకుమ్రొక్కి రామచంద్రుని ధ్యానించుచు వైకుంఠమునకేగెను.

శివుడు పార్వతికి రామనామ మహిమను బోధించుట

పార్వతీ! సత్సమాగమముతో సరియగునది వేఱొకటి లేదు. భగవ త్కృప లేనినాడు సత్సాంగత్య మలవడదు. నే నతిపవిత్రేతిహాసముల జెప్పితిని. ఇద్దానిని వినినవారికి రామభక్తియు, సంసారబంధవిచ్ఛేదమును గలుగును. భగ వంతుడు సకలపాపముల నశింపజేసి సకలాభీష్టముల జేకూర్చును. సకల సత్క ర్మలయొక్కయు, జ్ఞానవైరాగ్యములయొక్కయు, ఫలము లన్నియు భక్తిలో నిమిడియున్నవి. ఈభక్తి రామకటాక్షైకలభ్యము. రామభక్తి నలవరచుకొ నినవారే గుణనిధులు భువనభూషణులు నగుచున్నారు. ఈ పవిత్ర చరిత్రము గంగవలె దేశమును బవిత్రముగ జేయుచున్నది. దీనిని వినినవారు సద్గతి నందె దరు. రాజు శత్రువుల నిర్జించి సుఖముగ ప్రజల బాలించును. బ్రాహ్మణుడు ధర్మనిరతు డగును. దరిద్రునకు ధనము లభించును. ధనవంతుడు పుణ్యకార్య ముల జేయును. నీతితో పాలించెడివాడేరాజు, ధర్మనిరతుడే విప్రుడు, పుణ్య కార్యముల దలపెట్టునదియే బుద్ధి, సత్సంగులదే ధన్యజీవితము. రామభక్తు లుదయించినదే కులము. వాడే జగత్పూజ్యుడు. పవిత్రుడు. ఈచరిత్రను నేను తొలుత గుప్తముగ నుంచితిని. పిదప నీయోగ్యతను జూచి నీ కుపదేశించితిని. దీనిని దురాగ్రహపూరితులగు మూర్ఖులకు జెప్పరాదు. రామవిముఖులకు దీనిని

నుడువరాదు. విప్రద్రోహుల కీకథను విను నధికారము లేదు. సత్పురుషగురు బ్రాహ్మణుల బ్రేమించెడివారే దీనిని వినుట కర్హులు. నిర్వాణాభిలాషియగు రామభక్తు డీకథాసుధను శ్రవణపుటముల బానము చేయుచుండును. పార్వతీ! ఈకథ కలిపాపముల హరించి మనోవికారముల రూపుమాపును. ఇది భవరోగములకు దివ్యౌషధము. ఈకథయందలి సప్తసోపానములమీదుగ బోయినవారికి రాముని కటాక్షము తప్పక గలుగును. ప్రథమసోపానము నధిష్ఠించినవాడు తుదవఅకును బోక తప్పడు. పవిత్రుడై దీనిని బారాయణ మొనరించినవాని కలభ్యమగునదిలేదు. దీనినిజదివిననువినిసను గోష్పదమునువలె భవాంబుధినిదరిం తురని శివుడుబల్క పార్వతి యిట్లనియె. శంకరా! మీయనుగ్రహముచే గృతార్థనైతిని. నాసందేహములు దీరినవి. కృతార్థనైతిని. రామపదభక్తి నూతనమై యభివృద్ధి నందుచున్నది. నే ధన్యనైతినని పార్వతి బలెక్కను. ఓభరద్వాజా! ఈశివపార్వతుల శుభసంవాదమును వినిన విషాదములు నశించును. సుఖములు గలుగును. భవబంధము లూడిపోవును. భక్తులకు పరమానందము కలుగును. ఈపవిత్ర చరిత్రను నాబుద్ధికొలది చెప్పితిని. కలియుగమున దీనివంటి తరణోపాయము మఱియొకటి లేదు. కలియుగమున యోగ యజ్ఞ తపస్సులకు దావు లేదు. కాన రాముని భజించి, కీర్తించి, స్మరించి, యాతని పుణ్యకథల వినువారలకు పైనజెప్పిన సకలసత్కర్మఫలము నశ్రమముగ సిద్ధించును. రామకథ పాపుల పవిత్రుల జేయును. కాన రామభక్తులకు దుర్లభమయినదిలేదు. కాన మనమా! నీవు పతితపావనుడైన రాముని భజింపుము. దాన నీవు తరింతువు. మఱియు నజామిళ, పింగళ, వాల్మీకి, గజేంద్ర, జటాయువులను రామచంద్రుడు తరింపజేసెను. ఇంకను గోప, యవన, కిరాత, శ్వపచాదిపాపుల నెందఱినో రామనామము తరింపజేసెను. వీరు వారననేల? రామనామమందఱను దప్పక దరింపజేయును. అట్టిరామునికి బ్రణమిల్లుము. ఈకథను వినినవారికి శ్రేయస్సు సుగమము. దీని నైదుసారులుకాని, పదిసారులుకాని, పండ్రెండుసారులుకాని స్మరించిన వారి యజ్ఞానము నశించి ప్రపంచవికారములు తొలంగును. ఆ దీన దయాళువు తన్ను నమ్మినవారికి దప్పక నిర్వాణము నొసంగును. మందుడనై యల్పాల్పభక్తిగల తులసీదాసునే గరుణించి బహువిశ్రాంతిని గలిగించెను. రామచంద్రునివంటి ప్రభువెందును లేడు, లేడు. లేడు. రామచంద్రా! నావంటి

దీనుడును, నీవంటి కృపాళుడు లేడు. ఓరఘువంశశిరోమణీ, నన్నీవిషమ భవ సాగరమునుండి యుద్ధరింపుము. రఘువరా! కామికుడు, భామినిని ప్రేమించు నట్లు నన్ను నీ వనుగ్రహింపుము. ప్రభో.

శ్లో॥ యత్పూర్వం ప్రభుణాకృతం, సుకవినా శ్రీశంభునాదుర్గమమ్
శ్రీమద్రామపదాబ్జ భక్తిమనిశం, ప్రాప్తుంతు రామాయణమ్
మత్వాతద్రఘునాథనామ, నిరతం, స్వాంతస్తమశ్శాంతయే
భాషాబద్ధమిదంచకారతులసీదాస స్తథామానసమ్॥

శ్లో॥ పుణ్యం పాపహరం సదాశివకరం విజ్ఞానభక్తిప్రదం । మాయామోహ
మలాపహం సువిమలం ప్రేమాంబుపూర్ణం శుభమ్
శ్రీమద్రామచరిత్రమానసమిదం భక్త్యావగాహంతియే । తేసంసార ప
తంగ ఘోరకిరణైర్దహ్యంతి నోమానవాః ॥

శ్లో॥ యః పృథ్వీభరవారణాయ దివిజైస్సం ప్రార్థితశ్చిన్మయః
సంజాతః పృథివీతలేరఘుకులే మాయామనుష్యోవ్యయః
నిశ్చక్రం హతరాక్షసః పునరగాద్బ్రహ్మత్వమాద్యాంస్థిరాం
కీర్తిం పాపహరాంవిధాయ జగతాం తం జానకీశం భజే ॥

ఉత్తరకాండము సప్తమసోపానము సమాప్తము.

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

లవకుశ కాండము

నమామీశఘనజ్ఞాన రఘువంశదాసం । సదానందదాతా సువిద్యాప్రకాశమ్
విశదశ్రీలనీలం కృపాళుంనివాసం । చరణాంబుజం నేవితం పాపనాశమ్॥ 1

గతంమోహమారాదిశూలం విశాలం । హరంతాపసంతాపభవశోకజాలం
నమోకాకపాదం సుబుద్ధిం సుశీలం । సదాభక్తవాత్సల్య వాసాద్రినీలమ్॥ 2

ప్రసన్నాననం నీలవదనంసుశ్యామం । నమోపాణిశరణంసురామాభిరామమ్
మాంగ్యోఉమానాధయశనాధనామం। దేభ్యోకృపాసింధుమోరామధామమ్॥ 3

పార్వతీ! కాకభసుండుడుండు పర్వతమునకు మఱల గరుత్మంతుడు వచ్చి ఇట్లనియె. ప్రభూ! తమరు సుజ్ఞాన సంపన్నులు. రామచంద్రుని దాసులు. తమరు సువిద్యాప్రకాశకులై ఎల్లప్పుడు నానందముతో గూర్చుందురు. కృపాసింధువులగు మీపాదముల నర్చించిన సకలపాపములు నశించును. ఈనీల గిరిపై వసించుచు దీనిని దరింపజేసిరి.

రాముడు కాశికి బోవుట

తమ దర్శనముచే మోహకామాది శూలలు నశించును. మిమ్ము దర్శించినతోడనే తాపభవశోకజాలంబులడంగును. ఓ నీలపర్వతవాసా! తాము భక్తవత్సలురు. స్వామీ! మీయనుగ్రహమున నాజన్మము తరించెను. మీపాదముల నెన్నటికిని విడువజాలను. నా మనోరథములీడేరెను. నదుల వలన సముద్రము నిండనట్లు రామచరితవలన నా హృదయమును నిండకున్నది. దయయుంచి యీ నాప్రశ్నమున కుత్తరమునిండు. రామచంద్రుడయోధ్యను పాలించుట, మఖముల నాచరించుట, తుదకు వైకుంఠమున కేగుట, మున్నగు విషయముల వినవలతుననగాకభసుండు డిట్లు చెప్పదొడంగెను. రామానుగ్రహముచే మీకు శోకమోహాములుండవు. మీరు ధన్యులు. నాయందలి ప్రేమచే మీరు నన్నిట్లు ప్రశ్నింపుచుంటిరి. ప్రేమభరితములగు మీపలుల కెంతేని సంతసించుచుంటిని. రఘువంశ తిలకుడైన రామచంద్రుని రహస్యగాధల జెప్పెదను వినుడు. కలిమల విధ్వంసియు నాద్యంతరహితుడు

అద్వితీయుడు నగు రామచంద్రుడు పదివేలసంవత్సరము లయోధ్యను బాలించెను. అట్లు కొంతకాలమయోధ్యను పాలించినపుడు రామచంద్రునకు దీర్థాటము జేయవలెనను తలంపు గలిగి యమాత్యసోదరాదులకు దన తలంపెఱిగించి, వారలతో గూడి గురువగు వశిష్ఠునియొద్దకేగి సవినయముగ దన యభిప్రాయము నాతనికి దెలిపి, గురువర్యా! ఈమకరసంక్రాతినాడు సూర్యగ్రహణము వచ్చుచున్నది. ఆనాటికి మనమందఱము గలిసి కాశికేగవలయునను తలంపుతో తమ యనుజ్ఞను బడయవచ్చితినన నాతడందులకు సమ్మతించెను. పిమ్మట రామచంద్రుడు సకలపదార్థములను సిద్ధము చేయించి వానినన్నిటిని తగు వాహనములందమరింపజేసి చతురంగసేనాసమేతుడై యనుజామాత్య పరివార పరివృతుడై బయలుదేరి మధ్యమధ్యను విశ్రమించుచు గతిపయ ప్రయాణముల గాశినిజేరి యాపురికి నమస్కరించి అటసుఖముగ విశ్రమించెను. పిమ్మట గంగను దర్శించి ప్రణమిల్లి గ్రుంకులిడి, భూసురపండితులను యతులను దగురీతి నర్చించి, ఇంద్రాదులు విస్మయమందునట్లనేక దానములంజేసి, తీర్థశ్రాద్ధాదుల నాచరించి ఆయాత్రను ముగించుకొని మఱల దనపురికి వేంచేసెను.

రాజ్యపాలనము

రామచంద్రుడయోధ్యలో ప్రతిదినము ననేక దానములాచరించుచు నానందోత్సవములతోనుండ నాప్రభునికిగలిగిన ప్రీత్యాదరములకు ప్రజలఖండానందమునొందుచుండిరి. వారందఱు నారామునందు నిశ్చలమగు భక్తికలిగియుండిరి. వారు వేదపురాణములందు భగవన్మాహాత్మ్యమునువిని మననముచేయుచుండిరి. ఇట్లుకొంతకాలము గడిచినపిమ్మట రామచంద్రుడిట్లుతలంచెను. నాకింకను వర్షశతమాయుఃపరిమాణముకలదు. నేనిదివఱకనేక రాక్షసానీకములను దునుమాడితిని. కాన నశ్వమేధమునుజేసినగాని మనశ్శాంతికలుగదు. కావున నామఖమునుజేసి నానిజధామమున కేగెదను. విరించికోరిక ననుసరించి నాకర్తవ్యమును నిర్వహించితిని. ఇక నీయవతారమును జాలింపవలయును. అని తలపోసి యొకనాటిప్రాతఃకాలమున గృత్యములదీర్చి గురువులదరికేగి వారితో గర్తవ్యమును ముచ్చటించి, మఱలవచ్చి రాజ్యపాలన మొనరించుచుండెను.

రామరాజ్యము వర్ణనాతీతము. ఆరాజ్యమున పాపచింతలేక యందఱు రామ చరితమునుబాడుచు సకలైశ్వర్యముల ననుభవించుచుండిరి. గురువుల యాజ్ఞ నతిక్రమించక సత్కర్మల నాచరించుచు, హరినిభజించుచు స్వర్గసౌఖ్యము లనుభవించుచుండిరి. రామచంద్రునిజూచుచు నచటివారెల్ల నానందపరవశులై పోవుచుండిరి. ఆరాజ్యములో మహీతల మఖురహితమై ప్రజలునిరామయులై పరమభక్తులై నిర్భయముగ సంచరించుచుండిరి. తిర్యగ్జంతువులుగూడ సహజ వైరమునుమాని పరస్పరముగలిసి సుఖముగనుండెను. ఆరాజ్యవిశేషము నెవరును వర్ణింపజాలరు. కాటుకకొండలవైచి సముద్రమును మషీపాత్రముగను, కల్పవృక్షశాఖను లేఖినిగను, సప్తద్వీపపరిమితమగు భూమినంతను పత్రముగను జేసి, వాణీవిరించిశేషులు కల్పశతములిఖించినను రామరాజ్యము రామ ప్రభావమును వర్ణింపజాలరు.

రాముడు అకాలమృతుడైన విప్రబాలుని బ్రతికించుట

ఒకనాడు రామచంద్రుడు సానుజుడై కొలువుండ నటకొక ద్విజు డేతెంచి పరుషముగబల్కుచు నిట్లనియె. సగరుడు దిలీపుడు రఘువుమున్నగు నరపాలురీయయోధ్యను బాలించిరి కాని తండ్రియెదుట పుత్రుడు మరణించుట యెన్నడును కనివినియెరుగని విషయము. నేడదినాకు దటస్థించెనని విలపించు నాద్విజునిజూచి యోదార్చుచు దీనికికారణమేమని విచారించుచుండ నశరీర వాణియిట్లనియె. రామా! వింధ్యాచలప్రాంతమునందొక శూద్రుడు దపమాచరిం చుచున్న వాడు. ఈద్విజబాలకుని మరణమున కదికారణమనవిని రామచంద్రుడు తోడనే రథాధిరూఢుడై యచటకుబయలుదేరెను. ఆట్లుపోవుచుండ నటనొక యాశ్రమమగపడెను. ఆయాశ్రమమతిమనోహరమై, భ్రమరాలంకృతపద్మభరిత ములగు కాసారములతోడను, శుకశారికాది నానావిధవిహంగముల తోడను. కిరాతమిథునాలంకృతదరీ భాగములతోడను సహజవైరమునుమాని బ్రశాంత ముగసంచరించెడి మృగములతోడ నలరారుచుండెను. అందుబ్రవేశించి యట దపమాచరించుచున్న యాశూద్రమునినిజూచి, కొంతతడవాలోచించి తుద కాతనినిదునుమాడి యాతని తపమునకుమించిన ఫలమునొసంగినంతనె యిట విప్రబాలకుడు సజీవుడయ్యెను.

రామరాజ్యము

ఇట్లా విప్రబాలకుని జీవితునిజేసి మఱియొకప్పుడు సభలో అనుజామా త్యసామంతసహితుడై కొలువుండ నొకశ్వానమువచ్చి, రామా! రక్షింపుము. నిరపరాధినగుననొక విప్రుడన్యాయముగగొట్టెను. చూడు మీగాయమునన రాముడా శునకమునోదార్చుచు నావిప్రునిబిలిపించి విచారించి యాతనికి దగు శిక్షనాశునకమువలననేవిని యాతనికి వస్త్రాలంకారములచే నలంకరించి గజాధి రూఢునిగావించి, యూరేగించి యొక మఠాధిపత్యమునొసంగెను. ఆవింతశిక్షను జూచి పౌరులాశ్చర్యమందుచు నిట్టిశిక్ష యెండై నగలదా! యనిదలంచుచు, ప్రభూ! ఈబ్రాహ్మణునకిది ఏటిశిక్ష! యన రామచంద్రుడు దరహసితవదనుడై, కారణమును శునకమువలన దెలియుడన నాశునకమిట్లనియె. సభ్యులారా! నేనొకప్పుడు గాశీపట్టణమునందొక విప్రుడనై విశ్వేశ్వరునారాధించుచుంటిని. పిమ్మట నొకనాడు భగవదారాధనమునకు దగుద్రవ్యములసేకరించి యా మహాదేవునర్చించుచుండ నాతనికై దెచ్చిన ఘృతము నాచేతియందంటుకొనెను. నేనును దానినిజూచియుగణింపక నానేయితోగూడిన యాచేతితోనాహారమును దీసికొంటిని. అప్పుడానేయి స్వల్పముగనాహృదయమున బ్రవేశించెను. ఆస్వల్ప మగు దేవద్రవ్యము ననుభవించినందులకు నాకీజన్మమెత్తవలసివచ్చినది. అంత స్వల్పమయినదానికే నాకీజన్మమువచ్చిన నికమఠాధిపతుల గతినిమీరేయూహిం పుడనిబలికి యాశునకము రామునకుబణమిల్లి తనతోవనుబోయెను. అంత సంధ్యాసమయమగుటచే రాముడు కొలువుచాలించి నిజనివాసమునకరిగెను.

సీతాపవాదము

అయోధ్యయందు గూఢచారులు రాత్రులందు పురమున ద్రిమ్మరి ప్రజలాడుకొనుమాటల విని ప్రభువునకు నివేదించు నాచారముకలదు. అట్లు ప్రతిదినము చారులు వచ్చి విశేషముల దెలుప యుక్తాయుక్తముల విచారించి రామచంద్రుడు ప్రజాపాలనమొనరించుచుండెను. అంత నొకనాడొకచారుడు వచ్చి రాముని దర్శించి నమస్కరించి మాటాడజాలక నిలుచుండ జూచి రాముడు ఓయీ! నీకు సందియమేల? నీవు వినినదానిని నిర్భయముగ జెప్పు మన నాతడిట్లకేలకిట్లనియె. ప్రభూ! ఏమి చెప్పుదును. రజకుడొకడు భార్యతో

గలహించి యెవరెంతచెప్పినను వినక, పరగృహమందున్న భార్యనుదెచ్చి యేలు కొనుటచే రాముడు స్త్రీలకు దుర్జయమునకు దావిచ్చెను. కానిమ్ము. నా కీభార్యతో బనిలేదని కఠినముగ బల్కెనన రామచంద్రు డామాటల విని వానిని బంపివేసి యారాత్రియంతయు నేమియోనాలోచించుచు తుద కిట్లు దలంచెను. నేనయోధ్యకువచ్చి యుగప్రమాణమయినది. ఇకగొంతకాలమే యిటనుండవలయును. కాన జనకజను వనమున విడిచి ధర్మమును గాపాడవలయును. అని భావించి సీతనుబిల్చి యిట్లనెను. ప్రేయసీ! మనము వచ్చినపని పూర్తియయినది. కాన నీ ప్రతిబింబము నిటనుంచి నీవు వైకుంఠధామమునకు బొమ్ము. నేను ననతికాలములో నిన్ను గలిసికొందు నన నాజగన్మాత పతి యానతి చొప్పున దన ఛాయ నటనునిచి యాపరమాత్మకు బ్రణమిల్లి గగనమార్గము నేరికిని దెలియకుండ వైకుంఠమునకరిగెను. పిమ్మట ప్రభువు సీతా! గర్భవతివగు నీకేమైన కోరికలున్న జెప్పుమన జానకి యిట్లనియె. నాథా! అరణ్యమునుండి తిరిగివచ్చిన పిమ్మట మఱల మునిపత్నుల జూడలేదు. నాటనుండి మిమ్ముగుటకు సంకోచించుచుంటిని. నేనొకసారి యటకేగి వారల దర్శించి వస్త్రాభరణము లొసంగి వారల దీవనలగొని మఱలివచ్చెదను. పూర్వము వారలచే సత్కరింపబడితినే కాని వారల సత్కరింపజాలనైతిని. ఈ నాముచ్చట దీర్పవలెనన రామచంద్రుడు మందహాసమొనర్చుచు సీతా! యీసీకోర్కెను దీర్పకుందునా! రేపు తప్పక బంపెదనని యారాత్రి గడిపి, వందిమాగధుల స్తోత్రములతో మేలాకించి రామచంద్రుడెద్దియో నాలోచింపుచు నిస్తేజస్కుడై యుండెను. క్రమక్రమముగ దమ్ములచటికి వచ్చి రాముని వీక్షించి యేమియు దెలియక దిగులందుచుండిరి. కారణము దెలియక నమస్కరించి కూరుచున్న తమ్ముల బలుకరింపక ప్రభువూరకుండెను. రాముని గంపితశరీరమును దీనమగు మోమును జూచి కంపితులగుచుండిరి, కాని ఏమియు బలుకజాలకుండిరి. అన్నగారి దీర్ఘనిశ్వాసముల జూచి ఏదియో ప్రమాదము రానున్నదని వణకుచుండిరి. అంత కొంతవడికి రాముడు లక్ష్మణునిజూచి, సోదరా! నిన్ననొకచాకలి, మనము రావణునిచే చెరబెట్టబడిన జానకిని దెచ్చి యిచ్చటిస్త్రీల కవినీతిని గల్పించితిమనెనట. కాన నీవాజానకిని వనమున దిగవిడిచిరమ్మన, శ్రవణవిదారకములగు నామాటలవిని సోదరులు నిశ్చేష్టులై శుష్కించిన మోములతో నీమాట పరిహాసమా!

సత్యమా! యని శంకించుచుండిరి. మఱిల రాము డిట్టిపరిహాసము నెన్నడు బలుకడని దలంచి కన్నీరుగార్చుచు చేతులుజోడించి యెట్టకేలకు మెల్లనన్నిట్లనిరి. ప్రభూ! మీపలుకులు మాహృదయములకు ములుకులై దహించుచున్నవి. సీత జగన్మాతయనియు, దాము జగత్పితరులనియు దెలియనివారెవరు? చాకలి మాత్రమట్లేల బలుకును? రాక్షసులావేషమును వైచికొని యట్లనియుండవలయును. శత్రుశేషముండిన నిట్టిబాధలేగలుగును. అంతమాత్రమునకు గర్భభారాలసయు పరమపతివ్రతయునగు జానకిని వనములకంపవలయునా! సర్వజ్ఞులు సర్వాంతర్యాములునగు దమకు దెలియనిదేమున్నది అని భరతుడన రాము డిట్లనియె. సోదరా! రాఘవులకు ప్రజలను సక్రమముగ బాలించుట కులవ్రతము. మఱియు ధర్మము రాజానుమతము. మనలను జూచిగదా ప్రజలు ప్రవర్తింతురు? ఇందు చాకలి తప్పేమియులేదు. లంకలో జరిగిన వృత్తాంతమును వీరెట్లు దెలియగలరు? కాన మీరు మారాడవలదు. మీరన్యథాప్రవర్తించిన నాప్రాణములు నిలువజాలవు. నా యాజ్ఞనుబాలించి శుభములనందుడు. దైవము ప్రబలము. లక్ష్మణా! రేపు తెల్లవారకముందు జానకిని వనములో దించి రమ్మను రాముని కఠినాజ్ఞను విని లక్ష్మణుడు చేతులుమోడ్చి, ప్రభూ! నామనవి నాలింపుడు. సూర్యవంశము జగత్ప్రసిద్ధము. తాము జగత్పతులు. తమ గుణగణముల వేదములు వర్ణింపజాలకుండెను. దివ్యమంగళవిగ్రహ యగు సీత జగన్మాత. ఆమెను సేవించినను స్మరించినను సకలదురితములు వాయును. అట్టిజానకి నెడబాసి మీరొకక్షణమైనను గడుపజాలరు. తొల్లి రావణుని దునిమి సీతను దెచ్చెదనను తలంపుచే మీరామె వియోగమును సహింపగలిగితిరి. ఇపుడెట్లునిలువగలరన రాముడిట్లనియె. సోదరా! రాజు ధర్మబద్ధుడై ప్రజల రంజింపజేయవలయును. అట్లుకాని నాడు రాజశబ్దము నిరర్థకము. మఱియు మనది భానువంశము. మన పూర్వుల చరిత్రము నీవెఱుంగనిదికాదు. మన తండ్రిగారు ప్రాణముల నెట్లువిడిచిరో తెలియనిదికాదు. మనకు యశఃకాయము ముఖ్యము.

సీత వనమునకు పంపబడుట

నీవామె నెట్లు గొనిపోవుదునా! యని శంకింపబనిలేదు. నిన్న నామె మునిపత్నుల జూడవలెనని నాతో జెప్పినది. నేనందుల కియ్యకొంటిని. కాన నీవామె

ననాయాసముగ దీసికొనిపోవచ్చును. గంగాతీరమునం దొక ముని యాశ్ర మము చెంగట విడిచిరమ్మా. మారాడకు మన లక్ష్మణు డెట్టకేల కియ్యకొని పవిత్రమగు రథమునం దామెకు వలసిన వస్త్రాభరణాదుల నునిచి మఱునాటి ప్రాతఃకాలమున సీతను జేరబోయెను. తోడనే సీత, లక్ష్మణా! వచ్చితివా! మీయన్నకు నాయం దెంతయభిమానమని సంతసించుచు బిరబిర నలంకరించు కొని యారథము నధిష్ఠించెను. అట్లు బయలుదేరి చని గంగను జూచి నమస్క రించి యాగంగను దాటి ఘోరకాంతారమధ్యమున బోవుచు లక్ష్మణునితో నిట్లనియె. సౌమిత్రీ! ఏలకో? నా కుడికన్ను దరుచున్నది. నా కీకాంతారమున బ్రయాణమువలన భయమగుచున్నది. అత్తల మన్ననల వడయుచు సుఖముగ నీయన్న పాదముల సేవింప కిటేలవచ్చితిని? స్త్రీలు బుద్ధిబలము లేనివారను నారోక్తి వమ్మగునా? మఱియు నీప్రాంతమున నాశ్రమ మేదియు గనపడుట లేదు. సింహశార్దూలాది క్రూరమృగములే ఇట గానవచ్చుచున్నవన లక్ష్మణుడు లోన పట్టరాని శోకము ననుభవించుచు నిట్లనియె. తల్లీ! గర్భభారాలసవగు నీవలసితివి. కాన నిట విశ్రమింపుమని రథము నాపి శీతల తరుచ్ఛాయయం దామెకు శయ్యను గల్పించి యామె నిదురించుచుండ దానిట్లు తలపోయ సాగెను. తొల్లి రణరంగమున రావణుని శక్తిచేబడి మూర్ఛితుడనై ఇంద్రజిత్తుని బాణాగ్నికి దగ్ధముగాక బ్రతికియుండుటకు దగినఫలము సిద్ధించినది. ఈయమా యిక నిట డించి జనుటెట్లు? కఠిన రామాజ్ఞను బాలింపకుండుటెట్లు? వెనుక నూయి, ముందు నూయి. ఏమిచేయవలయునో దోపకున్నది. రామాజ్ఞను జెప్పక బోరాదు. చెప్పిన నీమె బ్రతుకుట యసంభవము. అని చింతించి తుద కిట్లు నిశ్చయించెను. నేనొకపత్రమున రామాజ్ఞను వ్రాసి ఈమె చెంగట నిడి యీమె మేల్కాంచకముందు పోయెదను. మఱియొక మార్గము దోచుటలేదని యటనున్న భూర్జపత్రము నొకదాని నందికొని దానిపై రామాజ్ఞను లిఖించి యామెచెంత నిడి, ప్రదక్షిణ మాచరించి తల్లీ! యీద్రోహి కెన్నిజన్మముల కయినను నిష్కృతిలేదని విలపించుచు, భూదేవీ! నీబిడ్డను నీవ గాపాడుము. వనదేవతలారా! మాయమ్మను వీడి పోవుచుంటిని. మీరు కాపాడు డని ప్రార్థించి మెల్లన నడుగులు తడబడ మాటిమాటికి దిరిగి దిరిగి జూచుచు మఱలి పోయెను. అట్లు కొంతదూరము జన దుఃఖపరవశుడగు లక్ష్మణునితో నశరీర

వాణి ఇట్లనియె. లక్ష్మణా! నీవు దిగులందకుము. నీవదిన కేలోపము నుండదు. ఆమె సుఖముగ నిట నుండునన విని విస్మితుడై, దైవ మెంత విచిత్రమైన దని దలంచుచు నయోధ్యకు బోయెను. అంత కొంతవడికి జానకి మేల్గాంచి నలు దిక్కుల బరికించి లక్ష్మణుని రథమును గానక నట బడియున్న పత్రమును జూచి చదివి మూర్ఛనంది మేల్గాంచి రామా! నీవింత కఠినచిత్తుడవని దెలియనైతిని. మూర్ఖులాడుమాటల కిట్లుజేసితివా! నన్ను వీవెఱుంగవా? పురుషుల నమ్మరా దనుమాట నేటికి సత్యమయినది. అని విలపించుచు మఱల నిట్లు దలంచెను. పాపము! నావల్లభు డేమిచేయగలడు? రాజులకు బ్రజారాధనముకన్న మిన్న యగు ధర్మము లేదుగదా! సత్యమును బాలించుటకై నామామ ప్రాణముల బాయలేదా! కాని నే నిట్లొంటరిగ బ్రతుకు బెట్లు? నా కిట దిక్కెవ్వరు? ఈఘోరారణ్యమును యిందలి మృగముల జూచిన బ్రతుకు బెట్లు! తల్లీ! నన్ను నీలో జేర్చికొనుమని ముక్తకంఠముగ విలపించుచుండెను.

వాల్మీకి సీతకు శరణమిడుట

ఆక్రాంతమున జరించెడి వాల్మీకిశిష్యు లాయాక్రందనమును విని తోడనె జని యామెను వాల్మీకికి దెలుప నాతడు తనదివ్యదృష్టిచే నంతయు దెలిసికొని తోడనే జనుదెంచి, యామెతో నిట్లనియె, అమ్మా! నేను నీతండ్రియగు జనకునకు మిత్రుడను. నీభర్త నిన్ను వీడుటకు గారణము నాకు దెలియును. నీవు నీతండ్రికడవలె నాయాశ్రమమున వసింపుము. నీ కిఱువురు శిశువులు గలిగెదరు. నామాటను నమ్మి నావెంట రమ్మన జానకియు నపుడు జేయునదిలేక యాత నితో నాతనియాశ్రమమునకు జనెను. తోడనే మునికాంతల రావించి యామెను వారికి జూపి యామె నేమఱక కాపాడుడు. అట్లయిన మీకు సకల సత్కర్మ ఫల మశ్రమంబున జేకూరునన వార లామె నతిగౌరవప్రతిపత్తులతో వలయు నాహారమిడి కాపాడుచుండిరి. సీతయు నట శుచివ్రతయై ఫలమూలముల నాహా రముగ గొనుచు శ్రీరాముని పదముల ధ్యానించుచు వాల్మీకిమహర్షిచే బోధింప బడు సత్కథల వినుచుండ నచటి పక్షులుసయితము భక్తిజ్ఞానము లుదయించు చుండెను. అట్లు లక్ష్మణు డయోధ్యకేగి జానకిని వనమున దిగవిడిచి వచ్చిన వార్త దెలియగనే యంతఃపురమునందు హాహాకారములు బయలుదేరెను. హత

విధీ! సీతకు మఱల వనవాసమా! ఏమి మాపాపమని అత్తలు మువ్వురును మూర్ఛనంద నారి దుఃఖమును జూచి పౌరులందఱు మిగుల దుఃఖించుచుండిరి. అంతలో దెలివంది యీదారుణవిపత్తు నెట్లు సహింపగలమని రాణులు విలపించుచుండ లక్ష్మణునితో గూడి రాము డటకేతెంచి తల్లుల నోదార్చి జ్ఞానమార్గము నుపదేశింప వారికి మోహము వీడి జ్ఞాన ముదయించెను. అంత వారు రాము నిట్లని స్తుతింప మొదలిడిరి. ప్రభూ! మే మజ్ఞానాంధులమై, నిన్ను బుత్రునిగ భావించి యీసంసారపంక నిమగ్నుల మయితిమి. కృపానిధీ! మాకు నీయచలభక్తిని బ్రసాదింపుమన వారికి రామచంద్రుడు యోగిదుర్లభమయిన దన యచలభక్తిని బ్రసాదించెను. వారట్లు రామచంద్రుని యనుగ్రహమునంది యోగాగ్ని దగ్ధశరీరము గలవారై నిజనాథుని జేరిరి. అంత నా నలుగు రన్న దమ్ములు మనుష్య సాధారణదుఃఖమునంది గురాజ్ఞానుసారముగ వారికౌర్ధ్వ దైహికక్రియల నాచరించిరి. అపుడు రామచంద్రుడు విప్రులకు గోభూతిలహిరణ్యములను, వజ్రమౌక్తికాదిమణులను, గజతురగాదులను దానము లిచ్చిన నావిప్రు లారాము నాశీర్వదించి నిజనివాసములకు జనిరి. ఇట్లు సకలదానముల జేసి వేదవిహితరీతిని దల్లుల కుత్తరక్రియల నిర్వర్తించి రామచంద్రు డనుజసహితుడై సుఖముండి ఒకపు డిట్లు తలంచెను. "ఇంతవఱకు ననేకమఖముల నాచరించితినికాని యశ్వమేధమును జేయుటలేదు. దానిని జేసినగాని మనశ్శాంతి యలవడదు. మఱియు యజ్ఞాశ్వము సంచరించుటచే లోకము బవిత్రమగును. కాన గురువుల యనుమతిని వడిసి యీకార్యమును జేయవలెనని నిశ్చయించి మంచిసమయమున యనుజులతో గూడి గురువులదరి కేగి గురువులకు నమస్కరింప నావశిష్ఠుడు రాముని గుశలమడిగిన స్వామీ! తమ యనుగ్రహమువలన మాకందఱకును గుశలమేయని రామచంద్రుడు మఱల నమస్కరింప నాత డారాముని దీవించెను. పిమ్మట గురుని యానతిచొప్పున నుపవిష్టులగు వారికి వసిష్ఠు డనేకపుణ్యగాథల వినిపింప వారత్యాదరముతో వినుచుండిరి. అంత రాము డంజలిఘటించి గురువుతో నిట్లనియె.

రామాశ్వమేధము

గురువర్యా! తమయాశీఃప్రభావమువలన నాజీవిత మిట్లు గడుచుచున్నది. పూర్వము తమతోమనవి నొనర్చినరీతి నశ్వమేధమునుజేయ సంకల్పించితిని. అని

తన యభిప్రాయమును గురువునకు విన్నవించి, ప్రజల యుత్సాహమును దెలిపిన వశిష్ఠుడు పులకితగాత్రుడై రామా! నీఘనతకు దగిన సంకల్పము గలిగినది. త్వరితముగ నాగ్రతువు ననుష్ఠించి సంపూర్ణకాముడవు కమ్మని భరతుసజూచి, నీవీక్రతువుకు దగిన పదార్థముల సమకూర్పు మన వాఅందఱు నాతనికి నమస్కరించి యానుజ్ఞవడిసి నిజనివాసమునకు జనిరి. అంత భరతుడు మంత్రులరావించి, పురమునంతను నందముగనలంకరించి, వచ్చెడిరాజలోకమునకు దగిన సౌధములను, మునులకు నివాసోచితములగు పర్ణశాలలను సామంతుల కనువగు గుడారములను వలసినన్ని పందిళ్ళను వేయింపుడని సాదరముగ దెలుపవారును సంతోషముతో నాపనులు జేయించుచుండిరి. ఈవార్తను వినిన వారెల్ల రానందించుచుండిరి. ఆపురాలంకరణమును జూచి దేవతలు విస్మితులగుచుండిరి. అంత రామచంద్రుడు గురువుల రావించి, తానిదివఱకొనరించిన సన్నాహమును వారికి విన్నవించి కర్తవ్యము నుపదేశింపగోరిన నావశిష్ఠు డిట్లనియె. రామా! మనమిపుడు దగురీతిని జనకునాహ్వానింపవలయు. మఱియు దగిన ఋత్విక్కులను సమకూర్పవలయును. మునులకును విప్రులకు నాహ్వానములనంపుము. రాజలోకమును బిలువనంపు మనవల్లెయని రామచంద్రుడు నగరమునంతను దిలకించి దానిశోభకచ్చెరువందుచు జనకునకును దక్కినరాజలోకమునకు నాహ్వానములనంపెను. సుగ్రీవాది కపివీరులకును విభీషణాది రాక్షసయోధులకు నాహ్వానములనంపగ్రమక్రమముగ వారయోధ్యకు వచ్చుచుండిరి. వచ్చినవారికెల్ల భరతుడు మున్నగు సోదరులు, సుమంత్రాది మంత్రులును దగునివాసముల గల్పించి గౌరవించుచుండిరి. మునులు తండోపతండములగ వచ్చుచుండిరి. ఇంద్రాదిదేవతలు నష్టదిక్పాలురు, సనకాదిసిద్ధులు నంబరమంతయు నాక్రమించి రాముని యశ్వమేధమును జూడనువిచ్చేయుచుండిరి. భృగ్వంగిరాది మహర్షులు, దేవతలునువచ్చునుండిరి. అయోధ్యనుండి వచ్చినదూతనుజూచి మిథిలాపురవాసులానందించిరి. దూతయు జనకునికిజూప నతడు సానుజుడగు రామునసామయమునడిగి యాతడు దెచ్చినయాహ్వాన పత్రమును జదివించి యపరిమితానందము నంచుచుండెను. ఆశుభవర్తమానమును పురమంతటజూటింప వారందఱు నపరిమితానందపరవశులైరి. పిమ్మట దేవతలు మనుజరూపములదాల్చి యుచితవాహనముల

నధిష్ఠించి యయోధ్యకేతెంచుచు రామునిట్లుస్తుతింపుచుండిరి. ఓకరుణానిధీ! రఘుకులచందనా! దశరథనందనా! పంకజనయనా! విశాలహృదయా! శత కోటిమన్మధరూపా! రావణాంతకా! భువనభూషణా! అనుజసహితుడవై సుస్థిరముగ మాహృదయములవసింపుము. మారీచభంజనా! కరుణామయా! జనమనోరంజనా! ధనుర్బాణతూణీరముల ధరించి, సీతాలక్ష్మణులతోగూడి మాహృదయముల వసింపుము. జ్ఞాననిధివగుఖగపతీ! రామచంద్రునిమహిమ నెవ్వరును వర్ణింపజాలరు. అట జనకుడయోధ్యనుండివచ్చిన దూతను వస్త్రాభరణ ములచే గౌరవించిబంపి, తనపురోహితుడగు శతానందుని కీవర్తమానమునువిని చిననాతడుమిగుల సంతసించి రామాశ్వమేధమును దర్శింపజనవలయును. కాన ప్రయాణమును సిద్ధముచేయింపుమన నామహారాజు అంతిపురమునకుజని రాణి వాసమునకీశుభ వర్తమానము నెఱిగింప వారమితానంద మందుచుండిరి. పుర మంతయు నీయ్వశ్వమేధవార్తనువిని యమితానందము నందుచుండెను. అంత పురమంతయు ప్రయాణోన్ముఖమైయుండ బురద్వారమునందు పదివేలపసుగులు నేడువేలరథంబులు, నగణితములగుగుఱ్ఱములు లెక్కకుమిక్కుటమగు పదాతి యుత చతురంగసైన్యము సిద్ధముచేయబడియుండెను. అప్పటిగజాలంకారములు నశ్వాలంకారములు వర్ణనాతీతములై యుండెను. ఖడ్గయుద్ధప్రవీణులగు శూరులు గొందఅశ్వముల నధిష్ఠించిరి. మఱికొందఱు గజములందుండిరి. అతిరథమహారథు లురథారూఢులైరి. ఇట్లుసర్వసేనాసమేతుడై జనకుడు బయలుదేర భూమిచలించు చుండెను. శేషుని పడగలుక్రుంగుచుండెను. ఇట్లుసపరివారముగను పౌరజనుల తోడను మునిబృందములతోడనుగలిసి మంగళవాద్యములు మిన్నుముట్టుచుండ జనకచక్రవర్తి ప్రయాణమై మూడవనాటి మధ్యాహ్నమున కయోధ్యను జేరికొనెను. జనకునిరాకనువిని రామచంద్రుడాతనికి సరయూతీరనిర్మితమగు విశాలనికేతమునందు విడిదినేర్పాటుచేయించి, సోదరసహితముగ నాతనికెదు రేగి ప్రణమిల్లి యాతనిసమీపమున గూరుచుండెను. అపు డానందపరవశులగు వారు కొంతతడవు మాటాడజాలకుండిరి. పిమ్మట జనకుడుగ్రమముగ వాఱిల సందఅగుశలమడిగి వరమానందభరితుడయ్యెను. రాముడంతభరతునిజూచి నీవును తగుపరివారముతో వీరికి దగునుపచారములజేయుమని నియమించి, పిమ్మట శతానందునిదర్శించి యాతనికినమస్కరించి యాశీస్సులనందెను.

పిమ్మట రామచంద్రుడు వశిష్ఠునిదర్శించి నమస్కరింప నాతడు రామచంద్రుని జూచి, రామా! యజ్ఞమునకువలయు సంభారములనన్నియు సమకూర్చబడినవి కాని పత్ని యేకొఅతయన రాముడొకింత తడవూరకొని యిట్లనియె. గురువర్యా! తమరు నన్నెఱుంగుదురు. నా ఏకపత్నీవ్రత ప్రతిజ్ఞకును మఖమునకును లోప ములేని మార్గము నుపదేశింపుడన నాతడాలోచించి యిట్లనెను. రామా! ఏక పత్నీవ్రతుడవగు నీకిపుడుసీతాప్రతికృతియే శరణ్యమన నట్లెకానిండని స్వర్ణసీతా ప్రతిమనుదయారుచేయించి యజ్ఞవాటికయందుంచనచటివారెల్ల వనవాసమున కంపినసీతనే రాముడీక్రతువునకు మఱలదెప్పించెనని భావింపుచుండిరి. కృపా ళుడు జగదాధారుడుసగు రామచంద్రుడిట్లనేక లీలలజూపుచుండెను. అట్లు స్వర్ణమయమగు నాసనమున సీతాప్రతికృతితోనాసీనుడైన రామచంద్రునిజూచి దేవతలమందానంద మందుచుండిరి. అపరిమితమగు నాజనానీకమునుజూచి వశి ష్ఠుడు బుద్ధిసిద్ధులనాహ్వానించి, ఈమఖనిరీక్షణమునకు వచ్చిన యీమునులను దేవతలను రాజులను, యథార్హముగ నర్చింపవలయునన నవియు రామానుగ్రహ లాలసలై, సకలవస్తుసంపూర్ణములగు భవనముల నసంఖ్యాకములుగ నిర్మింప నావింతకువిరించి యచ్చెరువందుచుండెను. ఆసౌధసౌభాగ్యము వర్ణనాతీతమై యుండెను. దిక్పాలురకును, దేవతలకును, మహర్షులకును, సన్యాసులకును వీరువారననేల! అచటికి విచ్చేసిన త్రిభువనవాసులకందఱకు దగు మర్యాదలను భరతుడు చేయుచుండ వారందఱు రామచంద్రుని భాగ్యమును దమ యదృష్ట మును మెచ్చుకొనుచుండిరి.

శత్రుఘ్న లవణాసుర యుద్ధము

ఈ క్రతువును దిలకించుటకు త్రిభువన వాసులందఱును వచ్చియుండిరి. వచ్చినవారినందఱను రామచంద్రుడు సమ్మానించుచుండెను. సకల కర్మల నాచరింపజేయు ధర్మనిరతులగు ద్విజసాధిక సంఖ్యగల బ్రాహ్మణ బృంద ముతో రామచంద్రుడు మఖమండపము నలంకరించియుండెను. పిమ్మట సర్వ లక్షణ సంపన్నమగు యజ్ఞాశ్వమును దెప్పింపుడని వశిష్ఠుడు బలికినంతనే, లక్ష్మణుడు లేచి గురువునకు నమస్కరించి హయశాలకేగి అంతకుమున్నే సిద్ధముచేయబడి సర్వలక్షణ సంపన్నమై, సర్వాభరణభూషితమగు నుత్తమా

శ్వమును గొనిదెచ్చెను. ఆయశ్వము నల్లని చెవులు, తెల్లని దేహముకలదై సహజమగు శోభావేగములచే సూర్యాశ్వముల దిరస్కరించుచుండెను. దాని యలంకరణ మెంతేని శోభిల్లుచుండెను. సహజసుందరమగు నాయశ్వము రత్నాలంకారభూషితమై జూపులకు మిరిమిట్లు గొలుపుచుండెను. దాని శిర మున రత్నఖచితమగు మమూరపించ్ఛముండెను. మణిభూషణాలంకృతమగు నా యశ్వము తారావిరాజితమగు గగనాంగణమువలె నుండెను. దానిని జూచి దేవతలానందమందుచుండిరి. సుభటులా యశ్వమును దీసికొని వచ్చు చుండ లక్ష్మణుడాయశ్వము వెంట వచ్చుచుండెను.

అంత వశిష్ఠుడు లేచి యజ్ఞాశ్వమును పరీక్షించి, రామచంద్రా! సర్వ లక్షణ సంపన్నమగు నీ యశ్వమును యథావిధిగ నర్చింపుమన నాతని యుప దేశానుసారముగ నాయశ్వము నర్చించి విప్రులకనేకదానముల నిచ్చి, దాని నొసట నొక స్వర్ణపత్రమును గట్టెను. అందిట్లు కలదు. ఇది సప్తలోకైక వీరుడును, దశకంఠ కులాంతకుడునగు శ్రీరాముని యశఃపతాకము. దీని నెవరు బంధించినను వారు దండింపబడుదురు. ఇది రామునియాజ్ఞ. ఇట్లు పట్టబద్ధమగు నాయశ్వమును సుభట పరివారసహితముగ విడిచి రామచంద్రుడా యశ్వము రాకకు నిరీక్షించుచుండ నంతలో భార్గవాదిమునులు రాముని కడకు వచ్చి లవణాసురుని దుర్నయముల జెప్పెదను. రక్షింపుమని వేడికొనిరి. రామ చంద్రుడు వారికభయమిచ్చి శత్రుఘ్నుని రావించి, సోదరా! లవణాసుర పీడితమగు నీ మునిబృందము శరణార్థియై వచ్చినదని మందహాసముతో బల్కుచు విభీషణుని జూచి ఈ లవణాసురు డెవడన నాతడిట్లనియె. ప్రభూ! కుంభీనసి యను పేరుగల సవతిచెలియలొకతె మాకుండెను. దానిని రావణుడు మధు దానవునకిచ్చి వివాహమొనరించెను. ఈ లవణాసురుడు వారి కొమరుడు. ఈతడు శివునుద్దేశించి ఘోరతపమాచరింప నాతపమునకు మెచ్చి శివుడీతని కొక త్రిశూలము నిచ్చి, లవణా! దీనిని ధరించి నీవు పదునాలుగు లోకముల నిర్భయముగ జయింపగలవని దాని ప్రభావమును జెప్పి శివుడంతర్ధానము డయ్యెను. తోడనే వాడు మదోన్మత్తుడై సురాసురాది సకలలోకములపై నశ్రమముగ దీర్ఘయాత్ర జేసి నిర్జించుచుండెను. వాడతిక్రూరుడై సకలలోకము లందు నిర్భయముగ సంచరించుచు నన్యాయముగ సాధుహింసాపరుడై విహ

రించుచున్నాడన విని రామచంద్రుడు శత్రుఘ్నుసతో నిట్లనియె. సోదరా! లవణుని చరితమును వింటివి. నీవు నా యక్షయతూణీరముల ధరించి నిర్భయముగననాయాసముగ వానిని వధించి పిమ్మట నటనున్న దుర్మదుల నందఱ జయించి రమ్మన రామాజ్ఞను శిరమున దాల్చి, చతురంగసేనా సమేతుడై తన యిరువురు పుత్రులతో గూడి విజయోన్ముఖుడై దరలినపుడు రణభేరులు దిక్కులు పిక్కటిల్ల ప్రమోయుచుండెను. మాతంగముల ఘీంకారములతో డను హయముల ప్రహేషితములతోడను సుభటుల వీరాలాపములతోడను భూనభోంతరాళములు నిండ, సేనాపరాగముచే దిక్కులంధకార బంధురము లగుచుండ, విజయోత్సాహభరితుడై పండ్రెండు దినములు ప్రయాణము జేసి శత్రుఘ్నుడు యమునాతీరమునకు జేరుకొనెను. అంతనతడాయమునకు నమస్కరించి, స్నానాదికృత్యముల నాచరించి, విప్రులకనేక దానముల నొసంగి శివు నర్చించి, రామచంద్రుని పదముల హృదయమునం దిడికొని యా యమునను గడిచి త్వరితముగ ప్రయాణముల సాగించుచు నమితోత్సాహముతో జయ భేరుల ప్రమోయించుచు ప్రగముగ లవణాసుతుని పట్టణమును ముట్టడించెను.

అప్పుడుతనకు ప్రతివీరుడు ముల్లోకముల లేడని గర్వితుడై మదోన్మత్తుడగు నా లవణుడా భేరీధ్వనులనువినియు, శత్రుఘ్నుని సేనలగనియు, పట్టరాని కోపముతో పండ్లుగొఱుకుచు సింహనాద మొనర్చుచు యుద్ధాభిలాషియై బయలుదేరెను. అతనివెంట నాఱువేలరాక్షసవీరులు సింహనాదములజేయుచు నానావిధ ప్రకరణములబూని కాటుకకొండలవలె బయలువెడలి, పట్టుడు, కొట్టుడు, కట్టుడు, చంపుడని బొబ్బలిడుచుండ వారిబొబ్బలనువిని శత్రుఘ్నుని సేనలు రణభేరులప్రమోయించుచు శంఖముల బూరించుచు నారాక్షసుల నెదుర్కొనిరి. ఇట్లా రెండుసేనలు డీకొని తమతమప్రభువులకు జయముకలుగుగాక యనిపలుకుచు సింహనాదము లొనర్చుచు దమదమ రణకౌశలమును జూపుచు బోర మొదలిడిరి. అపుడు ధనుర్ధరుల ధ్వనులతోడను, రథికులు రథికులతోడను, గజస్థుడు గజస్థునితోడను, హాతులు హాతులతోడను వివిధగతుల బోరుచుండిరి. యుద్ధభూమి రుధిరకీకసమాంసఖండభరితమై చూపరులకు భయవిస్మయముల గొలుపుచుండెను. అసురమాయచే బడిన రాక్షసులు మఱల యుద్ధము జేయుచుండిరి. శత్రుఘ్నిపుత్రుల యుద్ధనై పుణిని దేవతలాకసమునుండి

విస్మయముతో దిలకించుచుండిరి. తనసైన్యము క్షీణించుటజూచి కేతుమా తంగులను నిఱువురుపుత్రులతో గూడి కదనమునకుజొచ్చెను. లవణనిపుత్రులు శత్రుఘ్ను ని పుత్రులు నొకరినొకరు మించినరణకౌశలమును జూపుచు, బోరా డుచుండిరి. అప్పుడింద్రుడు లవణపుత్రులవలన శత్రుఘ్ను ని పుత్రులకు ప్రమాద మును శంకించుచు బృహస్పతినిజేరి గురువర్యా! యుద్ధమతి విషమముగ నున్నది. శత్రుఘ్ను నిపుత్రులగతి యేమగునో! యన నాదేవగురుడు మందస్మిత మొనర్చుచు నిట్లనియె. జంభారీ! నీకు సందియమవసరము లేదు. రామ తేజోభరితులగు వారి కెవరివలనను భయముండబోదనెను. అంత యూపకేతు సుబాహు లుద్దీపితకోపులై సునిశితబాణముల బ్రయోగింప నాబాణములు, కేతుమాతంగుల దునిమి మఱలయథాస్థానమును జేరెను. ఇట్లు లవణపుత్రుల దునుమాడి సూర్యకులతిలకులగు శత్రుఘ్ను నిపుత్రులు రణరంగమున శోభిల్లు చుండిరి. ఇట్లు తనపుత్రులు నిహతులగుటజూచి లవణాసురు డమితదుఃఖముచే మూర్ఛితుడై కొంతవడికి దెలివంది లేచి తనత్రిశూలమునుబూని, శత్రుఘ్ను నెదుర్కొనెను. అపు డిరువాగుల యోధులు తమతమ యుద్ధకౌశలమునుజూ పుచు బోరాడుచుండగ భుజములు, శిరస్సులు నాకసమున కెగురుచుండెను. అప్పుడటనుండెడి భూతగణము లానందముతో రుధిరప్రవాహమున మజ్జనమా చరించుచు ప్రేవులచే శిరోమాలలగూర్చు నామాలల మెడయందిడుకొని యానందపరవశమున గరతాళములవేయుచు బాడుచుండెను. శంఖభేరీనినాద ములచే నినుమడించిన యుత్సాహముతో యోధులు రణమొనర్చుచుండ బిశా చములు తెగినపుఱ్ఱెలతో భూతపతికి మాలలగూర్చు చుండెను. శాకినులు పుఱ్ఱెలనిండ రుధిరమునుబట్టి త్రాగుచుండెను. ఢాకినులు మేదోమాంసముల భుజించి మిగుల సంతసించుచుండెను.

లవణాసురవధ

లవణాసురుడు తనసేనలు నిహతములగుటకు విచారించి శత్రుఘ్ను ని పరాక్రమమునకచ్చెరువందుచు నదృశ్యుడై తనమాయచే సనకాదిసిద్ధులను, రుద్రులను, వేదాధ్యయనమొనరించు విప్రులను, మునులను, శస్త్రప్రాణులగు దేవతలనునిర్మించెను. అట్లు రణరంగమున దమయెదుటనున్న యా దేవతాసీకమును

జూచి శత్రుఘ్నుని సేనలువెనుదిరిగి ప్రభూ! దేవానీకములు రణభూమినాక్ర మించి మనలనెదుర్చుచున్నవి. ఇప్పుడేమిచేయవలయునన శత్రుఘ్నుడు విస్మితుడై, ఇపుడు దేవతలిటకు రాబనిఏమి? వీరు దేవతలుకారు. ఇదిలవణాసురుని మాయయనిదలంచి, రాక్షసమాయాంతకమగు నస్త్రమునుబయోగింపతోడనే సూర్యునివలన దమముపిడిన ట్లామాయామయ దేవానీకములదృశ్యములయ్యెను. అంత సుబాహువు రెండవయమునివలె లవణాసురునకెదురై, ఓరీ దుర్మాత్మా! ఏదీ నీత్రిశూలము! క్షణకాలమెదుటనిలుపుము. నీతలద్రుంచెదనని గదతో వానినిమోద నారాక్షసుడు మూర్చనందెను. తమప్రభువు నేలబడిపోవుటజూచి శస్త్రాస్త్రపాణులగు గొందఱురాక్షసులు పరుగిడి వచ్చుచుండిరి. అంతలో కైటభుడు దనమిత్రుని పాటుజూచి మూడువేలరాక్షస వీరులతోగూడివచ్చి సుబాహువునకెదుట కటువాక్యములబలుకుచు శరధారలగురియుచుండ సుబాహు వాని నన్నిటిని తనబాణపరంపరలచే దునియలగావించెను. అంత లవణాసురుడు మూర్ఛదేరి లజ్జాక్రోధపూరితమానసుడై శూలమును దాల్చి యూపకేతుని యురమునబొడువ నాతడుతోడనే రామునిస్మరింపుచు మూర్ఛిల్లెను. అంత సుబాహువు తమ్మునిదురవస్థకు చింతిల్లుచు గోపోద్దీపితమానసుడై సునిశితశర ముల లవణాసురుని జిక్కువఱచి తమ్మునిదరికేగి యాతని యురమునగీలితమగు శూలము నూడబెఱుకి రామమంత్రౌషధముచే నాతని శ్రోత్రపుటముల నింపెను. తోడనే యూపకేతువు స్వస్థచిత్తుడై లేచినవ్వుచు ధనుర్బాణములధరించి యన్నకుదోడుగ రణరంగమునబవేశించి మిక్కుటమగు బాణవర్షమును గురి యుచు గైటభునిసేనలదునుమాడి యాతని మూర్ఛితుగావించెను. అట్లు మూర్ఛితుడైన కైటభునిరథమందిడి రణభూమినుండి దొలగించి, మిగిలినసేనల బురికొల్పుచు లవణుడనేక ఘోరాయుధములబూని గర్జింపుచు కదనమారం భించెను. అంతకైటభుడు మూర్ఛదేరి యనుజసహితుడై రణభూమికేగెను.

ఖగనాయకా! వీరితోబోరుటకు కాలుడు సయితము శంకించును. వీరు భయము నెఱుగరు. వీరనేక యుద్ధములందనేక వీరుల దునుముచు బలాయితుల జూచుచు హేలనమొనరింతురు. ఇట్టిరాక్షసవీరులతో దలపడి రాజపుత్రులు వెను దీయక శరవర్షమును గుఱియుచుండ నుభయసేనలయందలి తురంగ ఖురాఘా తోత్పన్నమగు పరాగమువ్యోమాంగణమున వ్యాపించి యకాలసంధ్యనొనరించు

చుండెను. పుత్రుల రణకౌశలమునకు శత్రుఘ్నుడు సంతసింపుచుండెను. దేవతలు విస్మితులగుచుండిరి. అంత సాయంకాలమగుటచేతను లవణునిసైన్యము క్షీణించుటచేతను యుద్ధమునాపి మఱల దెల్లవారినంతనే దమదమ సేనలనాయత్తపఱచుకొని యుద్ధమునకు నడచిరి. అపుడు లవణాసురుడు గర్జించుచు దన శూలమునుగైకొని యనేకయోధులవధించి కృద్ధుడై శత్రుఘ్ననితో దలపడి యాతని నాశూలముతోబొడిచి మూర్ఛితుని గావించియు కసితీరక ఖడ్గమునకై వెదకుచుండనంతను జూచుచున్న సుబాహువాతని యరదమును బూర్ణముగావించి, సారథినొంచి. గర్జించెను. అంతలవణుడు విస్మితుడై కొంత తడవూరకుండి, మఱల ధైర్యము నవలంబించి యుద్ధోన్ముఖుడై వచ్చుచుండ శత్రుఘ్నుడు మూర్ఛదేరి రాక్షసునిబలమున కచ్చెరువందుచు దీనాననులగు దేవతలజూచి రామచంద్రుని యుపదేశానుసారమొక తీవ్రబాణమును సంధించి అందుదారకమంత్రము ననుసంధించి, నేను నిజమగు రామభక్తుడ నేని దీనితో నీరాక్షసుడు మడియుగాతమని విడువ నాబాణమతిభయంకరముగ నా లవణుని కంఠమును ద్రుంచి మగిడి శత్రుఘ్ననిజేరెను. తోడనే దేవతలు జయభేరిని మ్రోయింపుచు గుసుమ వృష్టిని గురియించిరి. అదిజూచికైటభుడు పట్టరాని కోపముతో గర్జించుచు నొక పర్వతశిఖరమునూడబెఱికి వచ్చుచుండ సుబాహువు వానిపై నూఱుబాణముల ప్రయోగించి బాహువుల ఖండించెను. వాడట్లు భుజరహితుండయ్యును నోరుదెరిచి మింగరా నాతనినొక సునిశిత బాణముచే జమునిపోలికనిపెను. కైటభుని మృతికిదేవతలమందానంద మొందుచుండిరి. ఇంద్రుడానందమును బట్టజాలక భూమికివచ్చి శత్రుఘ్ననియతనిపుత్రులగొనియాడి, మీవలన మాభయముతీరినది. మిమ్ములబొగడుటకుగాని ప్రత్యుపకార మొనరించుటకుగాని మాకేమియు దోపకున్నది. మీకు శుభమగు గాతయను వారును దలలవాంచి ఇంద్రునకు నమస్కరింప మఱల నాశీర్వదించి, ఇంద్ర బృహస్పతులు యజ్ఞశాలకువచ్చి లవణ సంహారమును రామచంద్రున కెరిగించిరి.

శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమముననున్న సీతను పుత్రులను జూచుట

అటశత్రుఘ్నుడు లవణుని రాజ్యమును రెండుగ విభజించి, మధురను సుబాహువునకిచ్చి, రెండవవానికి విదిశనిచ్చెను. ఇదియమునా పశ్చిమతీర

మందుండెను. ఇట్లు తనపుత్రులకా రాజ్యములనిచ్చి వారికి దగు హితము నుపదేశించి, వారలనాశీర్వదించి, శత్రుఘ్నుడు రామాజ్ఞానుసారముగ జైత్ర యాత్రకు బయలుదేరెను. అట్లు బయలుదేరి యమునను గడిచి యాయమునకు బ్రణమిల్లిసైన్యముగ వచ్చుచుండనంతవఱకు నితరదేశముల దిరిగి రామచం ద్రుని యజ్ఞాశ్వము నచటికి జనుదెంచెను. తోడనే శత్రుఘ్నుడాయశ్వమునుగని సంతసించుచు రక్షకభటులవలన సర్వవిషయముల విని యికతాను నిర్జింపదగిన రాజులు లేరని నిశ్చయించుకొని యాయశ్వము వెంటజనుచుండెను. అదియు గ్రమముగ దిరిగి తిరిగి వాల్మీకియాశ్రమప్రాంతమున జరించు చుండెను. తొల్లిలక్ష్మణునిచే విడువబడి వాల్మీకి యాశ్రమమునుజేరిన సీతయొక శుభ ముహూర్తమున గుశలవాస్తీర్ణ పవిత్రప్రదేశమునందిఱువుర బుత్రులగనియెను. అంతవాల్మీకివారిరువురకు జాతకర్మాదికృత్యముల నాచరించి వారికుచితమగు నట్లు కుశలవులను నామములనుంచి సకాలములందుపనయనాది సంస్కా-ర ములజేసి విద్యలగఱపుచుండెను. సీతయు నాబిడ్డలజూచుకొనుచు రామచంద్రుని పదములధ్యానించుచు గాలముగడపుచుండెను.

సీతాకుమారులగు లవకుశులు రామయజ్ఞీయాశ్వమును బంధించుట

ఆనా డాబాలకులు తోడి మునిబాలురతో నాడుచుండ నొకమునికుమారుడు పఱుగునవచ్చి, ఓయీ! ఒకవింత మృగము మన యాశ్రమప్రాంతమునకు వచ్చినది, దానిమెడ చాలపొడవుగనున్నది. తోక జాలపెద్దది. రండు చూతమన నాబాలకులందఱు దాని జూడబోయిరి. అప్పుడు గుశలవులు దానిని జూచి, ఓయీ! ఇది యజ్ఞాశ్వము. అశ్వమేధమునందు జెప్పబడిన లక్షణ ములు దీనియందగపడుచున్నవని దానిని సమీపించి, దానిభాలమునందున్న పట్టికను జదివి, కుశుడు గోపోద్దీపితమానసుడై, తమ్ముడా! జూచితివా! ఈతడు సప్తలోకైకవీరుడట! పృథివిగొడ్డుబోయినది కాబోలు! ఇంతపొగరెందులకో! యన, అన్నా! మనమీ గుఱ్ఱమును గట్టుదము. వారిపరాక్రమును జూతమని లవుడన గుశు డంగీకరించెను. తోడనె కుశరజ్జువులచే నాయజ్ఞాశ్వమును బంధించితమ యాశ్రమమువైపునకు మఱలింపసాగిరి. అందొకమునిబాలకు డిదిమీద మనము సమిధల నీయశ్వముపైనిడి దెచ్చికోవచ్చు ననుచుండ నంతలో రక్షకభటు లా

యశ్వమునొద్దకువచ్చి యీబాలకులజూచి నవ్వుకొనుచునిట్లనిరి. బాలులారా! మీకీయశ్వముతో బనియేమి! శస్త్రాస్త్రపాణులగు వీరభటులు వచ్చుచున్నారు. మీరు దీనిని విడిచి మీత్రోవను బొండన, గుశలవులు నవ్వుచు నిట్లనిరి. స్వత స్సిద్ధజృంభకాస్త్రములుగల మాకీశస్త్రపాణులవలన భయమెందులకు! సింహ కిశోరము మత్తమాతంగయూథమునకు దలకునా! మీరు సరియగు వీరుల యిన మమ్ములనోడించి యీయశ్వమును గొనుడు. కాని నాడూరకజనుడు. పృథివి నిర్వీరమనుకొంటిరి కాబోలునన వారి కఠినోక్తుల సహింపక వారలనదల్చి యశ్వమును గొనబోవ, నాకుమారులు నిశితశరధారల గురియించి వారల బారద్రోలిరి. అంత వారు ఖిన్నులై శత్రుఘ్ను నిజేరి యిట్లనిరి.

శత్రుఘ్నుడు కుశలవులతోబోరి మూర్ఛితుడగుట

ప్రభూ! ఇరువురు మునిబాలకులు మనయోధులదఱిమి యశ్వమును గొనిపోవుచున్నారు. కాన తాము త్వరగ దయచేయవలయు నన శత్రుఘ్నుడు కృద్ధుడై సైన్యముతో నటకేగి యీబాలుర జూచి విస్మయమందుచు నిట్లనియె. ఓమునిబాలకులారా! చలమూనక యశ్వమును విడిచి యాగమునకు రండు. అట మారామచంద్రుడు మిమ్ములను బూజించి మీకోరినవన్నియు నొసంగును. అన నాబాలు రిట్లనిరి. స్వామీ! తమ పేరేమి! మీయూరెద్ది! మీరీయశ్వము నెందులకు విడిచితిరి! దీనిభాలమునందింతనిర్భయముగ నీలేఖ నెందులకు గట్టితిరి! అశ్వమున కాలేఖనుదీసివైచి ఇంటికి దయచేయుడన నా మాటకలిగి శత్రుఘ్నుడు దనయోధులతో నిట్లనియె. వీరుమాటలతో బోయెడివారుకారు. కాన శస్త్రాస్త్రముల సంధింపుడన నాబాలురు నవ్వుచు గర తాళములకు సింగపుగొదములు బెదరవనుచు గురుస్మరణ మొనరించి ధనుర్బా ణములధరించి శత్రుఘ్ను ని సారధినొంచివాజులగూల్చి రథమును ఖండించి శత్రుఘ్ను ని శరీరమునంతను బాణములనించి యాతని మూర్ఛితు గావించిరి.

శత్రుఘ్నుడు మూర్ఛనొందుటవిని లక్ష్మణుడు కుశలవుల మీదికి యుద్ధమునకు వచ్చుట

తమ్ము నెదిర్చిన వారి నెల్ల బడగొట్టుచుండ గొందఱు భటులు రామ చంద్రునికడకేగి యచటి వృత్తాంతమును బాలుర శౌర్యమును, శత్రుఘ్ను ని

యోటనియుజెప్ప రామచంద్రుడు లక్ష్మణునిజూచి నీవుసేనాసహితుడవై యట
కేగి యాబాలుర దండించి వారలతోగూడ మనయాగాశ్వములను గొనిరమ్మన
లక్ష్మణుడు రామునకు నమస్కరించి చతురంగ సేనాపరీతుడై జని రణరంగమున
మూర్తీభవించిన వీరరసమువలెనున్న యాబాలుర జూచి విస్మయానందక్రోధ
కందళితుడై తనలో నిట్లుతలపోయసాగెను. వీరియాకృతులు సీతారాములబోలి
యున్నవి. కన్నులు, నుదురు, పలువఱుస, నాసికయు, సీతను బోలియున్నవి.
రూపము, భుజములు, వక్షస్థలము, గాంభీర్యము, కంఠస్వరము అన్నగారి
ననుకరించుచున్నవి. అని యెంచుచు సీతను దాచిడిచిన ప్రదేశమును కాలమును,
వీరివయస్సును భావింపుచు మారఘుకులమున కిట్టిభాగ్యమున్న దాయనియు, దన
కంతటియదృష్టమున్న దాయనియు పలురకముల యూహలచే నేమియు దోచక
యూరకుండి, కొంతవడి కిట్లనియె. బాలకులారా! మీయుత్సాహశౌర్య పరా
క్రమములకు సంతసించితిని. మాతో మీకు వైరమేల? రామచంద్రుని ప్రభా
వము జగద్విదితము. ఆతని యజ్ఞాశ్వమును బంధించుట కేరికిని దరముకాదు.
నాహితమును విని నాతో గలిసిరండు. మన మయోధ్యకుబోయి రామచం
ద్రుని దర్శించి యాతడొనర్చు క్రతువును జూతమన నాబాలురు నవ్వుచు
నిట్లనిరి. ఓ వీరాగ్రేసరా! ఆడుదానిని జంపి, ఖరయుద్ధమున మూడడుగులు
వెనుకకు నడిచి, చెట్టుచాటుననుండి కోతిని జంపిన రాముని పరాక్రమము
ఆడుదాని ముక్కుచెవులుగోసిన యాతని తమ్ముని పరాక్రమమును జగద్విదిత
ములే. మేమూరక యశ్వమునుమాత్రము విడువము. అను నాబాలుర రామో
పాలంభనమునకు మిగులగినిసి, ధనుర్బాణముల సంధింప గుశుడును యుద్ధసన్న
ద్ధుడయ్యెను. ఇట్లువారిఱువురు పరస్పరజయాకాంక్షులై రణకౌశలమును జూపు
చుండ భూనభోంతరాళములు శరవ్యాప్తములై యంధకారము వ్యాపింప
నంతలక్ష్మణుడు కృద్ధుడై గదను బ్రయోగింప నాగదాఘాతముచే గుశుడు
మూర్ఛిల్లెను. అట్లు కుశుడు మూర్ఛిల్లుటగాంచి లవుడు సింహనాద మొనర్చుచు
లక్ష్మణునితో దలపడి తీవ్రబాణములబరప నాశేషావతారము జలింపక బోరు
చుండెను. వారి ఘోరసంగ్రామమునుజూచి సేనలు విస్మయముతోజూచు
చుండెను. అంతలో గుశుడు శత్రుఘ్నుడును మూర్ఛదేరి యుద్ధోన్ముఖులైరి.
అట్లారఘుకుల కమలభాస్కరులు వెనుదీయని పట్టుదలతో బోరుచుండ, నాకస

మునుండి దేవతలుజూచుచు, వీరిపోరు మనపోరులకన్నను మిన్నయై యున్నదని పొగడుచుండిరి. అపుడు కుశుడు కృద్ధుడై జృంభకాస్త్రమును సంధించెను. పుడమి కంపించెను. సాగరములు ఘూర్ణిల్లెను. కులపర్వతములు కదలు చుండెను. అట్లుసంధించిన యాయస్త్రమును బ్రయోగించినతోడనె లక్ష్మణ శత్రుఘ్నులు మఱల గాఢమూర్ఛ నందిరి. సేనలన్నియు నిశ్చేష్టములయ్యెను. అపుడు పరిమితపరిజనములు రామునికడకేగి చేతులుజోడించి సర్వమును సవిస్త రముగ దెలుపుచు, మన సేనలు చాలవఱకు నశించినవి. ఆబాలురిద్దఱును దమ ప్రతిబింబములవలె నున్నారు. పరాక్రమమునను దమ్ము పోలియుండిరి. వారి రణకౌశలమును జూడవలయునేకాని వర్ణింపదరముకాదని విన్నవించిరి.

భరతుడు కుశలవులతో యుద్ధమొనర్చుట

ఆమాటల భరతుడు విని, ప్రభూ! సీతను విడనాడుటచే మన కీదుర్దశ వాటిల్లినది. అట్లుకానినా డిరువురుబాలు రనేకవీరుల నిట్లుభంజించుట యెందేని కలదా? యన రామచంద్రుడిట్లనియె. సోదరా! గతమునకు వగవదగదు. నీవిపుడే వానరసేనను దీసికొనిపోయి వారల నోడించి మనసోదరులను యజ్ఞాశ్వ మును దీసికొనిరమ్ము. అని సుగ్రీవాదులజూచి, ఓవానరయోధులారా! మీరు రావణుని ఘోరసంగ్రామమున నిలిచి పోరి నాకు విజయమునుజేకూర్చిన మేలి బంట్లు. కాన మీరేగి రణమున మూర్ఛితులగు నాసోదరుల తెండన వారందఱు నమితోత్సాహముతో బ్రయాణమైరి. భరతుడును చతురంగసేనల దీసికొని వారలతోగలిసి రణాంగమునకేగెను. అటనున్న రక్తవాహినుల జూచి యోధులు భయమందుచు కదనమునం దీబాలుర గెలుచుట కల్లయని డిల్లపోవు చుండిరి. రణరంగమున రెండవ సూర్యునివలె దేజరిల్లుచున్న యావీరసోదరుల జూచి వానరులు గంపితులగుచుండిరి. అపుడు హనుమంతుడు వారలకడకేగి, అన్నలారా! మిమ్ము గనిన తల్లి ధన్య. మిమ్ముగాంచిన మేము ధన్యులము. సప్తలోకైకవీరుడగు దశకంఠారితో మీకీనిర్మిత్తమైన పోరేల? రండు. మనమందఱముగలిసి యావీరాగ్రేసరు నారాధింతమన పట్టరానికోపముతో నాబాలు రిట్లనిరి. ఓయీ! పృథివినిఃక్షత్రియముగాదు. మీప్రభుని వీరత్వ మునుజూడదలచితిమి. కాన చేతనయిన మమ్ము జయించి మీయశ్వమును

గొనుడు. లేదామీదారినిపొండన వానరులు కృద్ధులై తలకొకవృక్షమును గ్రహించి కుశలవులపై విసరిరి.

లవకుశులు వానరవీరుల నోడించుట

కుశుడా వృక్షముల ఖండించుచుండెను. లవుడు బాణవర్షము గుఱియుచు సేనల బడగొట్టుచుండ నారుధిరప్రవాహమున జూర్ణమయిన రథములు ఖండితములయిన మాతంగాది కళేబరములును గొట్టుకొనిపోవుచుండెను. కొందఱుయోధులు శరనిహతులై నేలబడి పొర్లాడుచుండిరి. మాతంగతురంగములు కట్టులద్రెంచుకొని పలాయితము లగుచుండెను. కొందఱుయోధులు తెంపుచేసి పోరాడుచుండిరి. వానరులు బాణనిహతులై రెక్కలులేని పర్వతములవలె గూలుచుండిరి. రణరంగము రుధిరప్రవాహ భరితమైయుండెను. భూతప్రేత పిశాచములు, కంకగృద్ధ్రములును నచటి మాంసఖండములదినుచు రుధిరమునుద్రాగుచుండెను. భూతగణములు కుశలవుల గొనియాడుచు రుధిరాపగయందు స్నానక్రీడలొనరించుచు మాంసఖండముల దినుచు బెండ్లివారివలె వినోదించుచుండెను. ఆ బాలుర రణకౌశలమును, దమవీరుల వీరశయ్యలనుజూచి, భరతుడు దైవము ప్రతికూలమయ్యెనని తలంచి, శరనిపీడితులగు హనుమజ్జాంబవదంగదాదుల జూచి, మీరు విభీషణునితోగూడి యాబాలుర కడకేగి యాబాలుర బంధించితెండని బలికెను. పార్వతీ! ఆమాటనువిని వారాబాలురకడ కేగిరి. అపుడు గుశుడంగదునితో నిట్లనియె. అంగదా! నీ తండ్రిని జంపించిన పినతండ్రికి నీతల్లినిసమర్పించిన, ఘనుడవు. తండ్రినిజంపిన వానికి సేవకుడవై తిరుగుచుంటివి. నీవెంతటి యోధుడవని ఇటకువచ్చితివి. అన నంగదుడు రోషారుణనయనుడై యొకపర్వతశిఖరము నాకుశునిపై నేయ నాతడాశిఖరమును దనబాణముచే దునియలగావించి దానితోపాటు యంగదుని గర్వపర్వతమునుగూడ ఖండించెను. తోడనే మఱియొకబాణముచే గొట్ట నాయంగదుడు భయముచే నటనుండి దొలగెను. అంతనా బాలురు శరవర్షమునుగురియ నావానరులా శరములకోర్వజాలక, రామచంద్రా! దురభిమానముచే మాసంగతిని మేమెఱుగక మీమాయను దెలిసికొనజాలకుంటిమి. మీయనుగ్రహము లేనినాడు మేమేమియు జేయజాలము. ప్రభూ! యనుచు

భరతుని కొందరువానరులు జేరుకొనుచుండిరి. హనుమంతుడు జాంబవంతుడు సుగ్రీవుడును పర్వతశిఖరములబూని వచ్చుచుండ గుశుడు వారలజూచి నవ్వు చుండెను. లవుడు వీరలకేమిగాని భరతుని జయింపవలెనని జూచుచుండెను. ఆబాలుర రణకౌశలము పరాక్రమమును, శేషశారదలుగూడ వర్ణింపజాల కుండిరి. వారు బలవంతులయిన వానరవీరుల బడగొట్టుచుండ వానరులాశ్చర్య మందుచు భయకంపితు లగుచుండిరి. ఆవానరులలో దెబ్బల దిననివారును మూర్ఛితులు గానివారును లేరైరి. ఇట్లు సేనలన్నియు బడుటజూచి భరతుడు కృద్ధుడై వాడిశరముచే లవుని మూర్ఛితుని గావించెను. అంతగుశుడు గుపి తుడై తీక్ష్ణమగు సాయకముచే భరతుని మూర్ఛితునిగావించెను. అంతగుశుడు గురుస్మరణమొనరించి లవుని స్పృశించినతోనె లవుడు మూర్ఛదేరెను. ఇట్లు గురుకటాక్షకలితులగు నాబాలకులు నిర్భీకముగ రణరంగమున వీరవిహార మొనరించుచుండిరి.

రామకుశలవసమాగమము

ఇచటివార్తల దెలిసికొనుట కయోధ్యనుండి వచ్చిన దూత లారణరంగ మును జూచి విస్మితులై, పడిపోయిన వీరులను, తునియలై రుధిరమున గొట్టి కొనిపోవు రథగజతురంగములను జూచి భయభ్రాంతు లగుచుండిరి. ఆ ఘోర రణభూమిని జూచి భయకంపితమానసులై, యాదూత లటనుండియె మఱలి యయోధ్యకు జని, అచటి వృత్తాంతము నంతను రామచంద్రున కెఱిగింప, రామచంద్రుడు స్వయముగ బయలుదేరి యారణభూమి కేగదలచి యజ్ఞవాటి కను వీడి చతురంగసేనాపరివృతుడై యటకేగి యచటిదృశ్యము నంతను జూచి ఖిన్నుడై మూర్ఛితులై పడియున్న సోదరులను ఇతరవీరవరులను దనకరస్పర్శ ప్రభావమున మేల్గొలిపి వారలకుత్సాహమును గలిగించి, ఓవిభీషణా! ఓవానర వీరులారా! మన సేనను దునుమాడి నాయనుజుల బడగొట్టిన యీ వీరకిశోర ముల మదమడచి రండు. రావణునిసైన్యమును దునుమాడి మేఘనాదుని రూపు మాపిన యోధాగ్రేసరు డొకబాలకునిచే మూర్ఛ నందెను. బలే! ఇంతటి మహావీరు లాబాలకులకు లొంగిపోవుట మిగుల వింతగనున్నదే! యని రామ చంద్రుడు బలుక నావానరవీరులు పర్వతములను వృక్షములను గైకొని యమి

తోత్సాహముతో బయలుదేరిరి. లవుడు బాణమును సంధించుచు నెదురుగ వచ్చుచున్న విభీషణుని జూచి, ఓరి కులాంతకా! ఏమొగము పెట్టుకొని వచ్చు చుంటివి! బితృతుల్యుడగు అన్నను వ్యతిరేకించి శత్రువుల జేరి యజేయుడైన యన్నను జంపించి యాతని సింహాసనము నాక్రమించియున్న నీవింటనుండ కిటు లేలవచ్చితివన నాత డుగ్రుడై గదను విసర, నాగదను, గుశుడు ఖండించి తీవ్ర బాణములచే నాతని నేల బడగొట్టెను. అపుడు జాంబవంతుడు సుగ్రీవునితో నిట్లనియె. కపినాయకా! వీరు బాలుర్రైనను వీరి పరాక్రమ మతిలోకో త్తరము. వీరిని గెలువజాలక రణవిముఖులమై యపకీర్తిపాలగుటకన్న వీరితో పోరి సత్కీర్తి నందుట మంచిదని బ్రోత్సహింప నాసుగ్రీవు డొకతరువును గొని యా బాలుర నెదిరింప లవు డాతని జూచి సుగ్రీవా! వాలికి బెదరి భార్య నాతని కర్పించి మాఱుమూల దాగి పరులచే నాతని జంపించి యాతనిరాజ్యమును భార్యతో గూడ సంపాదించిన మహావీరుడవగు నీవు నాతో బోరవచ్చితివా? యని యొకతీక్ష్ణబాణముచే నాతని నిరువది హస్తముల దూరమునచిమ్మివేసెను. అది చూచి పఱుగున వచ్చిన హనుమంతుని బట్టి యశ్వముకడ బంధించి, నీవిట నుండుమని, వారిరువురు రామచంద్రునికడ కేగిరి. రామచంద్రు డాబాలుర జూచి, యచ్చెరువందుచు వారితో నిట్లనియె. బాలకులారా! ధీర వరులగు మిమ్ముల జూచిన నాకు సంతసమగుచున్నది. మీయూరెద్ది? మీపే రేమి? మీ జననీజనకు లెవ్వరన, వారును రామచంద్రుని జూచి విస్మితులై, ఏమి యాతని గాంభీర్యము! మన తాత యాతనికథనే వ్రాసి ధన్యుడయ్యెనని దలంచుచు నిట్లనిరి. ఓమహారాజా! ఇచటి కనతిదూరమున నున్న మునిపల్లె మాయూరు. జనకు నెఱుగము. కాని జనని మాకు గలదు. మమ్మొక తాత పెంచి మా కుపనయనాది సంస్కారముల గావించి విద్యను గఱపుచుండెను. నాపేరు లవుడు. ఈతనిపేరు కుశుడు. మేమిఱువురము కవలవారము. మాకీ జృంభకాద్యస్త్రములు సహజసిద్ధములన, రాముడును దూరమాలోచించి లోన సంతసింపుచు నిట్లనియె. ఓయీ! మీరీయశ్వము నేలబంధించితిరి? మీకు గావలెనన్న నింతకన్న మిన్నలగు నశ్వముల నిత్తుమే, యన వా రిట్లనిరి. మహారాజా! మాకు గుఱ్ఱములతో నేమిపని? ఈయశ్వము భాలమున గట్టిన లేఖను జూచి మే మిద్దానిని బంధించితిమి. మమ్ము గెలిచికాని యీయశ్వము

వృష్టిని గురియించిరి. అంతరాముని సంకల్పానుసార మమృతవృష్టియు గురియ తోడనే, భరత లక్ష్మణ శత్రుఘ్నులు, సకలసైన్యమును సంతసమునలేచినవి.

సీత పాతాళమున కేగుట

పిమ్మట రామచంద్రుడు లక్ష్మణునిబిలిచి, సోదరా! నీవు సీతకడకేగి యామె నగ్ని ప్రవేశమున కొడబఱచి తోడితెమ్మన నతడును సీతకడకేగి నమస్కరించి కుశలమడిగి తనతప్పును మన్నింపుమనివేడి, యన్నగారి యాదేశ మునుదెలుప, నామె చింతాక్రాంతమానసయై, యూరకుండెను. అంత బాతా ళమునుండి రత్నసింహాసనమే తేర, సీత యాసింహాసనమునగూరుచుండి పాతాళ మున కేగెను. అదృశ్యమునుజూచి లక్ష్మణుడు నిశ్చేష్టు డయ్యెను. ఆతని నేత్ర ములనుండి యశ్రుధారలు ప్రవహించుచుండెను.

అశ్వమేధ పూర్తి

ఈ వార్తను రామచంద్రుడు విని వికలమనస్కుడై విధినిదలపోయుచు, నాయనలారా! రండు. ఇట్లుమీతల్లి ఋణముతీరినదనిపలికి పుత్రులతో నయో ధ్యకువచ్చి, నిర్విఘ్నముగ నశ్వమేధమును బూర్తిగావించి, భూరిదక్షిణలచే ఋత్విక్కులను, గోభూహిరణ్యరత్నాది దానములచే మహీసురులను దృప్తినం దించి, జనకునర్చించి, వశిష్ఠ విశ్వామిత్ర శతానందాదులబూజించి, యజ్ఞము నకు వచ్చిన రాజలోకమును గౌరవించెను. ఇట్లు రామచంద్రునిచే గౌరవింపబడి వచ్చినవారెల్ల రపరిమితానందముతో దమదమ నివాసములకేగిరి. రామచం ద్రుడు ప్రజలనాదరముతో పాలించుచు, సత్కథలచేగాలక్షేపముచేయుచుండెను. పురవాసు లందఱు దంభాహంకారవర్జితులై, భక్తిజ్ఞానవైరాగ్య సంపన్నులై రామచంద్రు నర్చించుచు సుఖముగ గాలక్షేపము జేయుచుండిరి.

రామునియవతారమును జాలించమని బ్రహ్మసందేశమంపుట

ఇట్లుకొంతకాలముగడిచిన పిమ్మట ఒకనాడు బ్రహ్మ నారదునితో నిట్లనియె. నారదా! రామచంద్రుడవతరించి చేయవలసిన పనులన్నిటిని పూర్తి చేసెను. ఇకనాప్రభువు వైకుంఠమునకు వేంచేయవలయును. కాననీవు శమ నునికడకేగి నాకడకాతని రమ్మనిజెప్పుమనదోడన నారదుడీవార్తను శమనున

నెవ్వారును గొనజాల రన నశ్వమిు మారు ముందుగ బాణముల నేయుడన లవుడు సమ్మోహనాస్త్రమును విడిచెను.

రాముడు వాల్మీకి మూలమున కుశలవుల బుత్రులుగ నెరుగుట

అంత భగవంతుడగు రామచంద్రుడా యస్త్రమునకు గట్టుబడినవానివలె మూర్ఛనండెను. అంత నాబాలురు రఘువీరునిదరికేగి ఆయాకారగాంభీర్యముల జూచి నివ్వెరబడుచు జయచిహ్నముగ నాతనిముద్రికను గొని తల్లికడకుబయలు దేరుచు నాహానుమంతునిగూడ దీసికొనిపోయిరి. అట్లు వారు తల్లికడకేగి నమస్కరించి జరిగినవృత్తాంతమునంతయు జెప్పి యీమెకాముద్రికనొసంగ, నామె హర్షశోకవిస్మయములు ముప్పిరిగొన, నేమియుననజాలకనిశ్చేష్టయై, యూరకుండెను. అంత హానుమంతు డామెకు నమస్కరించి, అమ్మా! నేను ధన్యుడను. మఱల నీదర్శనభాగ్యమబ్బినదన నామె గద్గదస్వరముతో నిట్లనియె. హానుమా! పుట్టిననాటినుండియు గష్టములపాలేఅయితిని చూచితివా! నాయవస్థను? ఈ బాలురధూర్తులై మిమ్ములను మీప్రభువునొప్పించిరి. కాని నన్నుజూచి యీచిన్న పాపలమన్నింపుము, నాజీవితేశుడు మూర్ఛనుండి లేచెనో! లేదో! అనివిలపించుచున్న జానకినిసమీపించి వాల్మీకి ఇట్లనియె. అమ్మా! జగన్మాతవగు నీవొక సామాన్యస్త్రీవలె విలపించెదవేల? ఆద్యంతరహితుడగు రామచంద్రుడు లోకవిడంబనార్థ మట్లునటించెను, కాని ఇతరు లాతని మూర్ఛనందించుటయా? అతడు మూర్ఛనందుట యనునదియసంభవము. నేను పోయిచూచివచ్చెదనని యీమెనూరడించి కుశలవులవెంటనిడికొని యుద్ధభూమికేగి యీ రణరంగమును జూచి, బాలురపరాక్రమమునకు విస్మయమందుచు, రథమందుమూర్ఛితుడైన రామచంద్రునిజూచి యాతనికడకేగి, శివునిధ్యానింపుచు, రామచంద్రా! నీబిడ్డలు నీపాదములనర్చించుటకై వచ్చియున్నారు. లే, నాయనా! లెమ్మన రామచంద్రుడు మందహాస సుందరవదనారవిందుడై లేచి, ఎదుటనున్న మునిని గౌగలించుకొనెను. రామచంద్రుని దర్శనమునకు మునియు, మునిదర్శనమునకు రామచంద్రుడు సంతసించుచు బరస్పరముగొనియాడుకొనిరి. పిమ్మట లక్ష్మణుడు సీతనువనములో విడిచినది మొదలుగ జరిగినవృత్తాంతమునంతను, సవిస్తరముగ నెఱింగింప, రామచంద్రు డాపుత్రుల గౌగిలించుకొన నపుడు దేవతలు కుసుమ

కుజెప్ప నాతడు బ్రహ్మకడకేతెంచెను. ఆతనితో వాగీశుడిట్లనెను. ధర్మ రాజా! నీవయోధ్యకేగి రామచంద్రునితో, వైకుంఠమునకువిచ్చేయవలయు ననియు, దమయవతారకృత్యములన్నియు బూర్తియయిననియు, సీతారూప లక్ష్మినీకై నిరీక్షించుచున్నదనియు, నామాటగా జెప్పుమన, శమనుడు ఋషి వేషముధరించి కృష్ణాజినధారియై లక్ష్మణుని సమీపించి, అయ్యా! నేనొక కార్యవశమున రామునిదర్శింపవచ్చితినన యాతనియాగమనమును రామునకు దెలిపి యాతనియానతినామునిని లోన ప్రవేశపెట్టెను. రామచంద్రుడమని కెదురేగి తోడితెచ్చి యుచితాసనమున గూరుచుండబెట్టి పూజించి, మునిరాయా! మీదర్శనమువలన నాజన్మము సఫలమైనది. మీరాకకు గారణమును శలవిండన యముడిట్లనెను.

లక్ష్మణుడు వైకుంఠమునకు వచ్చుట

రఘుకులప్రదీపా! రామచంద్రా! సర్వజ్ఞుడవగు నీకుదెలియనిదేమున్నది. నేనీవేషమున వచ్చిన శమనుడను. మనసంభాషణము నన్యులు వినరాదు. కాననీసమయమునందేరిని లోనికిరానీయకుమన రామచంద్రుడు లక్ష్మణుని బిలిచి, లక్ష్మణా! నీవేగిద్వారముకడనుండుము. ఎవ్వరినైననులోనికి రానీయకుము. నామాటను మీరినవారికి మరణదండనము విధించెదననురామాజ్ఞనుబూని లక్ష్మణుడప్రమత్తుడై ద్వారముకడ నుండెను. అంతనాశమనుడు రామచంద్రునిపదములకెరిగి, ప్రభూ! మీరుచేయవలసినకృత్యములు పూర్తియయినవి. ఇకదామువైకుంఠమునకు విచ్చేయవలయునను సందేశమును విరించి నాద్వారమున బంపెననిజెప్పి, మఱికొన్ని యితిహాసముల జెప్పుచుండెను. ఆసమయమున నేదూర్వాసమహర్షి యటకుజను దేరలక్ష్మణుడెదురేగి నమస్కరించి తోడితెచ్చి, స్వామీ! తమరేమికతమున వచ్చితిరన, లక్ష్మణా! నేను రామదర్శనార్థము వచ్చితిని. ఆతనిదర్శించి వేగమెబోవలయునన, మునిరాయా! మాయన్నగారొక మహనీయునితో సంభాషించుచున్నారు. ఇపుడెవ్వరిని లోనికిరానీయవలదని కఠినముగ నాజ్ఞాపించియున్నారు. కాననొక ముహూర్తకాల మాగుడన నాదూర్వాసుడుగ్రుడై, ఏమీ నాకునడ్డమా? నన్ననివెఱుగవు గాబోలు! నన్నిపుడువిడువనిచో నిన్ను నీరాజునుగూడా

భస్మమొనరింతునన లక్ష్మణుడుభయమందుచు నిట్లనుకొనెను. ఇపుడీతని విడువకున్న సీతడు సర్వనాశనమొనరించును. కాననేనొకడన యసువుల నర్పించి యాపత్తు నుండిరాజ్యమును బ్రజలను గాపాడుట యుక్తమనినిశ్చయించి లక్ష్మణుడన్నదరికేగి ప్రభూ! దుర్వాసమహర్షి తమదర్శనమున్నకై వచ్చి యుండెనన, తమ్ముడా! ఇట్టియపచారమేలజేసితివి? రావలదంటినికదా! ఇంతలోనేలద్వారబడితివి? ఆమునినిదోడితెమ్మన లక్ష్మణుడేగి దుర్వాసునితో నయ్యా! దయచేయుడనిబ్రవేశపెట్టెను. వచ్చుచున్నదుర్వాసునిజూచి రాముడెదురేగి బ్రణమిల్లితోడితెచ్చి పూజించి, మానీంద్రా!. తమరాకకుగతమేమి? శలవిండన నాముని, రామచంద్రా! నేనెన్నిదినములనుండియో నాకలిచేబీడింపబడుచుంటిని. కాన నాకు తున్నివారణ మొనరింపుమన రామచంద్రుడామునికి సంపూర్ణమగుభోజనమును పెట్టించెను. ఆమునియుదృప్తుడై యథేచ్ఛజనియె. అంతరాముడు లక్ష్మణునివిషయమై విచారించుచుండ నీవార్తనువిని భరతాదులు పరిజనులును శోకోద్విగ్నమానసులై రామచంద్రునికడకేతెంచిరి. భరతుడన్న పాదములపై బడి దుఃఖించుచు, ప్రభూ! ఈస్వల్పాపరాధమునకింత కఠిన దండనమువలదు. లక్ష్మణుని మన్నింపుమన, భరతా! విధినిదాటనేరికినిదరముగాదు. అయిననువిచారింతము. నీవేగి గురువులదోడితెమ్మన, భరతుడుజని గురువులకు నమస్కరించి, విషయమునంతను సవిస్తరముగదెలిపి, రథముపైనిడికొని తోడితెచ్చెను. రామచంద్రుడెదురేగి వ్యాకులచిత్తుడై గురువులకు బ్రణమిల్లిజరిగిన దానినంతను వినుపింప, వశిష్ఠుడు యవతారమును జాలించుసమయమాసన్నమయినదని దెలిసికొని తలపంకింపుచు నిట్లనియె. రామచంద్రా! విచారింపకుము. లక్ష్మణునివిసర్జించిన నదియు మరణశిక్షకుతుల్యమగును. దానినీశపథముజెల్లును. లక్ష్మణుడుజీవించునన రాముడు దానికియ్యకొనెను. లక్ష్మణుడీవిషయమునుదెలిసికొని రామునివిడిచి జీవించుటకన్న మరణమే మేలనితలంచి, రాముని పదములకుమ్రొక్కి, సరయూనదికడకేగి యాపవిత్రోదకములస్పృశించి కటిదఘ్నజలములందు నిలిచి రామునిధ్యానించుచు, యోగనిష్ఠుడైయసువులవ్యజంచి, రామునిరాకకెదురు చూచుచు, నాదిశేషరూపుడైన లక్ష్మణుడు వైకుంఠధామమును జేరెను.

రాముని వైకుంఠగమనసన్నాహము

భరతశత్రుఘ్ను లీవార్తను వినినతోడనే దుర్భరదుఃఖము ననుభవించు చుండిరి. రామచంద్రుడు లక్ష్మణుని వియోగఖేదమును సహింపజాలక భరతుని జూచి ఇట్లనియె. భరతా! లక్ష్మణుడు దివికేగెను. ఆతనివీడి బ్రతుకజాలను. నేనాతని ద్వారగగలియవలయును! కాన నీవీరాజ్యమును సుఖముగ బాలింపుము. భరతుడీ కర్ణకఠోరములగు పలుకులు విని మూర్ఛితుడై మఱల దెలిసి రాము నితో నిట్లనియె. ప్రభూ! నిన్ను వీడి నిముషమైనను నేనుండజాలను. నీకన్నను ముందుగనే నాప్రాణములు పోవునను భరతుని మాటలు విని, శత్రుఘ్నుని పరితాపమును జూచియు, వీరు నన్ను వీడి బ్రతుకజాలరని నిశ్చయించి, బిడ్డల రావించి, ఇంతకుముందు, భరత లక్ష్మణ శత్రుఘ్నులు జయించిన రాజ్యములను వారి వారి పుత్రులకిచ్చివేసెను. సింధు తీరమందలి గాంధారదేశమును విభజించి, భరతుని పెద్దకుమారుడైన తక్షునకు దక్షిణను, రెండవకుమారుడైన పుష్కరునకు బుష్కరావతిని యిచ్చెను. లక్ష్మణుని పెద్దకుమారుడైన చిత్ర కేతువునకు పశ్చిమ దిగ్భాగమందున్న మల్లదేశమును, రెండవకుమారుడైన యంగదున కంగదేశము నిచ్చెను. శత్రుఘ్నుని పెద్దకుమారుడైన సుబాహునకు మధురను, రెండవకుమారుడైన యూపకేతువునకు విదిశాపురమును ఇచ్చెను. పిమ్మట దమకుచితమయిన గోసలదేశమును విభజించి అందుత్తర భాగమును లవునకిచ్చి దక్షిణగోసలమును గుశునకిచ్చి యయోధ్యకు గుశుని బట్టాభిషిక్తునిగ జేసి రాజనీతుల జెప్పి, తమ్ముల, నందఱిబ్రజల బ్రేమతో జూడుమని జెప్పెను. అయోధ్యలో నెనిమిదివేలరథములు నేబదివేలగుజ్జములు, పదివేల మత్తమాతంగములు నసంఖ్యాకములయిన పదాతులును గలరు. వీని నన్నిటిని దగు తీరున విభజించి పుత్రులకు బంచి యిచ్చెను. పిమ్మట బ్రాహ్మణుల రావించి, గో, భూ, హిరణ్య, రత్న, వస్త్రాదిదానములంజేసియుం డెను. కాని వారందున దృప్తినందక రామునితో నిట్లనిరి. ప్రభూ! రామచంద్రా, మేము బాల్యమునుండియు మిమ్ముల సేవించుచుంటిమి. మాకీనశ్వరములగు భోగములం దిచ్చలేదు. కాన మాకును సద్గతి నొసంగు డన ప్రభువందుల కంగీకరించెను. ప్రభుని బ్రయాణమును విని సుగ్రీవుడంగదు

నకు రాజ్యమునిచ్చి రామసన్నిధికి వచ్చెను. దేవాంశ సంభూతులగు వానరులందఱును రాముని దర్శింప నేతెంచిరి. అంత రామచంద్రుడు విభీషణుని జూచి, ఓ లంకేశా! నీవు నూఱుకల్పములు లంకారాజ్యమును బాలించి పిమ్మట నన్ను కలియుము. నన్ను స్మరించుచుండుమని ప్రభువు జాంబవతుని జూచి, ఓ ఋక్షనాయకా? నీవిప్పుడు రావలదు. రాబోవు ద్వాపరమున నే నవతరించెదను. అప్పుడు నన్ను నీవు రణమున గుర్తింతువు. అంతవఱకు నుండుము.

రాముడు వైకుంఠమును బ్రవేశించుట

ఇట్లందఱకు నన్ని తెఱఁగుల జెప్పి, తన కుడిఎడమల భరత శత్రుఘ్నులు వచ్చుచుండ, బ్రజలువెనుక జనుదేర నందఱును సరయూతీరమును జేరుకొనిరి. అగ్న్యాది దేవతలు, గాయత్ర్యాది ఛందస్సులు, ఋగాది వేదములును, స్వస్వరూపముల ధరించి వెంట వచ్చుచుండెను. దివ్యాంబరాభరణ భూషితులై దేవతలు, మునులు, మహర్షులు వచ్చుచుండిరి. వీరు వారనేల? అయోధ్యయందున్న ప్రాణివర్గమంతయు నా ప్రభునితో జనుచుండెను. పిమ్మట రామచంద్రుడు హనుమంతుని బిలిచి, తండ్రీ! నీవు చిరంజీవివై, సూర్యచంద్రులున్న కాలమునుండి, నిన్ను సేవించువారల సకల దుఃఖముల నశింపజేయుచు, వారల సకలాభీష్టముల నొడగూర్చుచుండుము. నీసేవకులకు దుర్లభమెద్దియు నుండదు. నేను నీ హృదయమునందెల్లప్పుడు నివసింతునని జెప్పి యాతని శిరమున దన పాణిపల్లవము నుంచెను. అంత శమనుడు బ్రహ్మకడకేగి రామచంద్రుడు వైకుంఠ గమనోన్ముఖుడై వచ్చుచు సరయూతీరమున నిలిచియుండెనన , విరించియు, శివుడును, సనకాది సిద్ధులు, నారదాది బ్రహ్మర్షులు నంతరిక్షము నలంకరింప, దేవతలవిమానములు మిడుతల దండువలె నాకసంబున నెగురుచుండెను. జయజయధ్వానములు దిగంతముల వ్యాపించుచుండెను. అప్పుడు రామానుగ్రహపాత్రులందఱును, సరయూజల సంస్పర్శన మాచరించి, విష్ణుసారూప్యము నంది, తమకై సిద్ధముగనున్న విమానముల నధిష్ఠించి వైకుంఠమున కేగుచుండ, వారలజూచి ఇంద్రాదులు విస్మితులగుచుండిరి. అప్పుడు కుసుమవృష్టి గురియుచుండ, విప్రుల వేద

ఘోషము వ్యాపించుచుండగ, భరతుడత్యాశ్చర్యకరముగ, శ్రీరామునిలో లీనమయ్యెను. తోడనే శత్రుఘ్నుడును సరయూజలముల స్పృశించి, రాము నిలో లీనమయ్యెను. పిమ్మట రామచంద్రుడు, విరించిని సనకాదులను బిలిచి, మీరందఱు నిట నొకమాసము వఱకునుండి ఈ నదియందు గృంకిన వారికి విమానముల నిచ్చి నాదివ్యధామమున కంపుడని వారలకానతిచ్చి, ప్రభువు మేఘమునందు మెఱుపువలె నంతర్ధానమందెను. జయముకుందా! మాధవా! యచ్యుతా! యని నామసంకీర్తన మొనర్చుచుండ నా భగవం తుడు భక్త బృందముతో గూడి వైకుంఠమున కేగెను. లక్ష్మీశేషులట సిద్ధముగనుండిరి. భరద్వాజా! ఈకథను శివుడు పార్వతికి వినిపించెనని కాకభశుండుడు గరుత్మంతునకు జెప్ప నాతడు కాకభశుండునికి నమస్కరించి, రాముని దన హృదయమున నిల్పుకొని, నిజధామమున కేగెను.

రామావతార సమాప్తి

ఈకథను శ్రద్ధాభక్తులతో వినినవారు ఇహమున సకలభోగముల ననుభ వించి, పరమున విష్ణుసాయుజ్యము నందుదురు.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

ఇట్లు గోస్వామి తులసీదాస కృతమును, సకలకలికలుష విధ్వంసకమును,
నవిరళ భక్తియోగ సంపాదకమునగు రామచరిత మానసమున,
రామావతార రూపమగు గుశలవ కాండము

సమాప్తము.

స్వస్తిప్రజాభ్యః శ్రీ శ్రీ శ్రీ

474

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

BCT

AOUA10UB142

BC

సరస్వతీ ముద్రాక్షరశాల
రాజమహేంద్రవరము

ముకుల ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B142
పుస్తకం పేరు	తులసీరామాయణము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	4
వెనుక అట్ట	4
మొత్తం పేజీలు	56
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	C.I, 8(b), 29(b)
లేని పేజీలు	
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	SARANYA
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.

BCI